UNIVERSAL LIBRARY

OU_204000

UNIVERSAL LIBRARY

OUP—730—28-4-81—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T926/L19S Accession No. T. 544

Author

Title

This book should be returned on or before the date last marked below


Checked 1969

సిద్ధార్థచరిత్రము

పీఠిక.

సర్వజగన్మాన్యుఁడైన గౌతమబుద్ధదేవుని చరిత్రము వచనరూపమున రచియించి యాంధ్రమహాజనులకు సమర్పింపవలెనని నాకుఁజిరకాలమనోరథముగలదు. దానికివలయు గ్రంథసాధనసామగ్రి సుకరముగ లభింపనందున మనోరథసిద్ధి తడవయ్యెను. ఎట్టకేలకు నాకోరిక సఫలముచేసినందుకుఁ బరమేశ్వరునకు నేను మిక్కిలి కృతజ్ఞుఁడను. ఈగ్రంథరచనమునందు నా కాంగ్లేయభాషలో రచియింపఁబడినయనేక బుద్ధచరిత్రములు తోడుపడినవి. కాని సకలగ్రంథములసారమని చెప్పఁదగిన మన్మథనాథశాస్త్రిగారిచే రచియింపఁబడిన బుద్ధచరిత్రము మిక్కిలి ప్రశస్తమగుటచే నేను విశేషముగ దానినే యనుసరించితిని. మఱియుఁ దమతమగ్రంథముల మూలమున నాకత్యంతసాహాయ్యము చేసిన రీసుడేవిడ్సు, మన్మథనాథశాస్త్రి, రమేశచంద్రదత్తు మొదలగు బుద్ధచరితాసముద్రపారంగతులకు నేను కృతజ్ఞతాపూర్వకముగ ప్రణామములాచరించుచున్నాఁడ. బుద్ధునకు మొట్టమొదట తల్లిదండ్రులుపెట్టిననామము సిద్ధార్థుఁడగుటచే గ్రంథమునకు నేను సిద్ధార్థచరిత్రమని పేరు పెట్టితిని.

ఇట్లు,

చిలకమర్తి లక్ష్మీనరసింహ

సిద్ధార్థచరిత్రము

ప్రథమాధ్యాయము.

జ్ఞానదారిద్ర్యముచేతను ధనదారిద్ర్యముచేతను ధర్మపరిభ్రష్టులై యధఃపతితులై నిరంతరదుఃఖ మనుభవించుచుండు మానవులఁ జూచి జాలినొంది పాపపంకమునుండి వారిని సముద్ధరించుటకై తమదేహబలమును మనోబలమును సంపదను విజ్ఞానసంపదను విలువగల కాలమును నవసరమైనపట్లఁ బ్రాణమును ధారవోసి లోకోపకారపరాయణులై కృతార్థులైన మహామహులు యుగయుగంబున దేశదేశంబున గలరు. ఈవిషయమున భరతఖండము తక్కిన దేశముల కెంతమాత్రముఁ దీసిపోవునదికాదు. ఈవిషయమున నితరదేశములకన్న మన దేశము మిన్నయని గూడ చెప్పవచ్చును. ఆత్మలాభపరాఙ్ముఖులై పరోపకారాదిధర్మపరతంత్రులై లోకోత్తరచరిత్రులై వెలసిన యనేకపురుషరత్నములకు భరతవర్షము గొప్పగని యయ్యెననుట యతిశయోక్తికాదు. కాని మనపూర్వులు చరిత్రలు జీవితములు వ్రాయుట కాకిపండ్లు లెక్కపెట్టుటవంటి నిరర్థకప్రయోజనమని భావించి చరిత్రరచనమునెడ ననాదరము జూపుటచే నట్టి యుదారశీలుర పవిత్రచరిత్రములు చదువుకొనుభాగ్యము మన కబ్బదయ్యెను. ఆంగ్లేయసాంప్రదాయముల ననుసరించి యీనాఁటి బుద్ధిమంతులు విరచించుచున్న దేశచరిత్రములు జీవచరిత్రములు గొన్నిదక్క మనప్రాచీనులు రచించినచరిత్రలు మనభాషలో లేనే లేవని చెప్పవచ్చును. సంస్కృతమున

సిద్ధార్థచరిత్రము

మన రాజతరంగిణి మొదలగు కొన్ని దేశచరిత్రములు హర్షచరిత్ర
ము విక్రమాంకదేవచరిత్రము మొదలగు కొన్ని జీవచరిత్రములు కల
వు. కాని యవి యథార్థవిషయముల కునికిపట్లు గాక యతిశయోక్తు
లకాలవాలములయి యలంకారములకాటపట్టులై శ్లేషకవిత్వాదులకును
గొనకములై విశ్వసింపరాని విపరీతకథలతోడను వర్ణనలతోడను
నిండియున్నవి. పెక్కేల? అగ్రగణ్యము లుండవలసిన చరిత్రలోప
మునకు సాధారణముగ నద్భుతకథల వాలకములు వచ్చియున్నవి. మన
పూర్వులకు యథార్థచరిత్రరచనాకుతూహలము లేకపోవుటచేతనే
మన వ్యాసవాల్మీకిప్రముఖ మహాకవులయొక్కయుఁ గాళిదాసభవ
భూతిభర్తృహరివిశాఖదత్తాదులయొక్కయుఁ గపిలకణాదవ్యాసపతంజ
లాదిగాఁ గల శాస్త్రకర్తలయొక్కయు బుద్ధదేవ శంకర రామా
నుజాచార్యాది ధర్మసంస్థాపకులయొక్కయుఁ జంద్రగుప్త విక్రమా
దిత్య హర్ష భోజముఖ్యులగు మహీపాలకుల యొక్కయు జరిత్రములు
సందేహాస్పదములై దుర్లభములై యుండవలసివచ్చెను. ఈచరిత్ర
వర్ణ్యము చేతనే గదా జగజ్జేగీయమానయశోవిశారదుఁడై మానవజాతి
యందుత్పన్నమై క్షత్రియవంశమున కలంకారమై భారతవర్షతిలకమై స్వార్థత్యా
గులలో నగ్రగణ్యుఁడై భూతదయాళువులలో మొట్టమొదటివాఁడై
వేదాంతులలో శ్రేష్ఠుఁడై జగదానందమే తనయానందమనియు
జగత్పీడయె తనపీడ యనియు భావించి నిర్హేతుకజాయమానకృపతోఁ
వలసిన పరలోకము నుద్ధరించు తలంపునఁ దాను రాజకుమా
రుఁడయ్యు నైశ్వర్యవంతుఁడయ్యు సింహాసనాధిరోహణకాలము
సమీపించుచున్నవాఁడయ్యు సిరియెల్ల విడిచి జగన్మోహనాకారిణి
యగు భార్యను విడిచి యప్పుడే జన్మించి 'కావుకావు'మని యేడ్చుచు
న్న కుమారుని విడిచి నగరము రోసి నట్టడవి నపేక్షించి స్వర్ణకిరీటము
సడలించి జటాజూటము ధరింప నిశ్చయించి చీనచీనాంబరములకు మాఱు

కాషాయవస్త్రంబుల నాశించి మేడల మిద్దెల వసియించుతలంపు విడిచి కొండలగుహాల వసియింపఁగోరి బంగరు పళ్ళెరముల భుజియించు నిచ్చమాని మంటిమూఁకుడులలోఁ దినుట కిచ్చగించి హంసతూలికాతల్పంబులఁ బవళించుట భారమని వగచి కటికిరానేల సెజ్జలు సుఖప్రదములని భావించి ఖడ్గముధరించుహస్తమున దండము నెలకొల్పి హారంబులకు మాఱుగఁ గంఠమున రుద్రాక్షమాలలు గీలించి యంగరాగంబునకు మాఱుగ బూడిదఁ బూసికొని మలయమారుత స్పర్శమువలన సుఖయించునెమ్మేను పంచాగ్నులగాఁకలకు శుష్కింపఁ జేసి సత్యము గ్రహించి నిజముగ మానవచక్రవర్తియై తనమతము ను ద్వేషించినవారిచేత సయితమీశ్వరావతారముగఁ బరిగణింపఁ బడి కృతకృత్యుఁడైన గౌతమబుద్ధదేవుని పావనచరిత్రము వేయింట నొకని కైనను సరిగఁ దెలియకపోవునంతటి దుర్దశసంప్రాప్త మైనది. మనదేశస్థులలో నాంగ్లేయభాష నభ్యసించినవారు హిందూదేశచరిత్రముఁ జదువునప్పుడు గౌతమబుద్ధుని చరిత్రము వారికి సంగ్రహముగఁ దెలియుచు వచ్చెను. అవి చదువకమునుపు మనవారు బుద్ధదేవుఁడన నెవ్వరో యెఱుంగక బౌద్ధుఁ డనుపేరు పరమనాస్తికునకుఁ బాపకర్మునకు నీచవర్తనునకు నింద్యకర్మునకుఁ బర్యాయపదములుగ వాడుచువచ్చిరి. ఆమహాత్ముని చరిత్ర మాయనమతములోఁ జేరినవాఁడగు నశ్వఘోషుం డనునతఁడు గీర్వాణభాషలో రచించెను. మఱియు బౌద్ధులచేతనె విరచింపఁబడిన కొన్నిగ్రంథములు సంస్కృత సారస్వతమునఁ గలవు. అవి యాంధ్రీకరింపఁబడక పోవుటచే మనదేశంబున నీజ్ఞాననిధియొక్క చరిత్రము వెల్లడి కాకపోయెను. గౌతమబుద్ధుఁడు ప్రపంచమునందు మనమిప్పుడు వినుచున్న మతసంస్కర్త లందఱి కంటె మిక్కిలి ప్రాచీనుఁడు. ఏసుక్రీస్తు పుట్టి యిప్పటికి రమారమి పందొమ్మిదివందల సంవత్సరములైనది. మహమ్మదు జన్మించి యిం

ముమించుగఁ బదమూఁడువందలయేండ్లయినది. శంకరాచార్యుఁడు ప్రభవించిన సంవత్సరము దెలియలేదు. సరిగదా యాతనిం గన్నతలి దండ్రులవలెనే యాతఁ డుదయించిన శతాబ్దముగూడ విద్వాంసులకు వ్యగ్ర మయ్యెను. శంకరుఁడు క్రీస్తుశకము తరువాత నెనిమిదవశతాబ్దమున జన్మించెనని కొందఱు ప్రథమశతాబ్దమున జన్మించెనని కొందఱు హేతువులచే హేతువులు చెప్ప యూహాలచే యూహాలు నన్ని తమతమ వాదంబుల బలపఱచుకొనుచున్నారు. కాని యిదమిత్థమని యిప్పటికి నిశ్చితము కాలేదు. రామానుజ మధ్వాచార్యాదిముఖ్యులును నానక చైతన్య ప్రభృతులును గడుంగడు నవీనులనుట నిర్వివాదాంశము. గౌతమబుద్ధుఁడు జన్మించి యిప్పటికి రమారమి రెండువేల నైదువందల సంవత్సరములకంటె నధికకాలమైనది. ఈయన జన్మసంవత్సరము గూడ సందేహాస్పదముగ నున్నది కాని క్రీస్తుశకమునకు ముం దేడవశతాబ్దముయొక్క కట్టకడపట నతఁడు జన్మించెనని విద్వాంసు లనేకులు సిద్ధాంతీకరించియుండిరి. ఆతని ధ సంవత్సరమే యైనను శంకరునికంటె క్రీస్తుకంటె మహమ్మదుకంటె ప్రాచీనుఁడనుట యెల్లవారు నైకకంఠ్యముగ నొప్పుకొనవలసిన యము. కాలవిషయమున నెల్లమత సంస్కర్తలలో మొట్టమొ వాఁ డగుటయే గాక వైరాగ్యవిషయమునను విజ్ఞానవిషయమునను గూడ మొట్టమొదటివాఁ డని చెప్పుట పక్షపాతము కాదు. విశేషముగ నైశ్వర్యము లేక సంసారయాత్ర నెట్టుటకే గడుపుచున్న సామాన్యమనుష్యుఁడు సయితము లోకోపకారార్థము స్వార్థత్యాగముఁ జేయుమన్నఁ జేయఁడు. తనకు సొత్తేమియు లేకపోయినను సన్యసింపుమన్న సన్యసింపఁడు. ఆలుబిడ్డలఁ బాయుమన్న బాయఁడు. ధర్మము నలుపు మన్న నలుపఁడు. అట్టిచో నైశ్వర్యమునందె పుట్టి భోగములయందె పెరిగి సౌఖ్యములతోడను సల్లాపములతోడను గల

ము గడపి యుద్యానవనములవిహరించి యున్నతసౌధములవసియించి యొండకన్నెఱుఁగక వెన్నెలకు వడదాఁకునట్టి సౌకుమార్యము గలిగి శోకముమాట కీడులయవస్థ నెన్నఁడుఁ దలంపనియొక మహాభోగి సర్వసంగపరిత్యాగియై లోకోద్ధరణమునిమిత్తమై సన్యసించుట ప్రపంచచరిత్రములో మహాశ్చర్యము కాదా? యేసుక్రీస్తు మిక్కిలి పేదవాఁడు. ఒక వడ్రంగి కుమారుఁడు. అతఁడు మనుష్యుఁడే యని మన మెంచితిమా యతఁడు విడిచిన మహైశ్వర్యము గనఁబడదు. చేసినస్వార్థత్యాగము పొడకట్టదు. మహమ్మదుగూడ భాగ్యవంతుఁడు కాఁడు. జీవనము నిమిత్తము సార్థవాహులతోఁ గలిసి విదేశముల కేగి కొంతకాలమాయనగూడ కాయకష్టము పడినవాఁడే. అందుచేత నాతడు గూడ లోకమునిమిత్తము చేసిన స్వార్థత్యాగ మంతగఁగాన్పించదు. శంకరాచార్యుఁడుగూడ పేదబ్రాహ్మణబాలుఁడు. సిరులతో జన్మించినవాఁడు కాఁడు. అట్టి హిందూదేశమున జన్మించిన మతసంస్కర్తలనేకులు పేదలు. కావున నైశ్వర్యవిషయమునఁ జేసిన స్వార్థత్యాగము లేదు. అందుచేత నేసుక్రీస్తు మహమ్మదు శంకర రామానుజప్రముఖులగు మహానుభావులయెడ నాకనాదరణముగాని తిరస్కారభావము గాని యున్నదని పాఠకులు తలంపకుందురుగాక! పరమభక్తులలోఁ బ్రధమగణ్యుఁడగు యేసుక్రీస్తుయొక్క పాదారవిందములకు నేను నమస్కరించెదను. మహనీయుఁడగు మహమ్మదుయొక్క మాన్యచరిత్రమును మనస్సున నిల్పి యాయన కభివాదము సేయుదును. మూర్తీభవించిన బ్రహ్మజ్ఞాన మని చెప్పఁదగిన శంకరభగవానుల యెడల నెంతటిమూర్ఖుఁడును దిరస్కారభావముఁ జూపఁడు. అట్లే పూజనీయులగు రామానుజప్రభృతులయెడ నాకధిక భక్తి గలదు. ఆగర్భశ్రీమంతుఁడై యవ్వారిగ సౌఖ్యంబుల ననుభవించిన పురుషుఁడు నందులో రాజకుమారుఁడు యోగియై మతసం

స్ఫురణముఁ జేయఁ దలఁచి కష్టములపా లగుట నశ్రుతపూర్వ మదృష్టపూర్వ మనియు సామాన్యసంసారులు వైరాగ్యముఁ బూని సన్యసించుట సులభ మనియుఁ జెప్పుట కల్లనవలసివచ్చె. తన నిర్మలబోధామృతరసము గ్రోలలేక యది విష మని భావించి తన దేశస్థులు తన్నొక సిలువమీఁదఁ గొరతవేయునపుడు నయితము వారియెడ ద్వేషభావముఁ జూపక వారట్టి దుష్కార్య మొనర్చుచున్నందుకు వారి యెడ దయఁబూని క్షమింపవలసిన దని పరమేశ్వరు నంతఃకరణ శుద్ధిగ వేఁడుకొన్న కారుణ్యరత్నాకరుని సౌజన్యనిధిని ఏసుక్రీస్తును వందనపురస్సరముగ స్మరియింపనివాఁ డెవ్వఁ డుండును. మతభేదజనిత ద్వేషమున శాత్రవుఁడు తనపై కత్తికి చంపనుంకించి నీకిప్పు డెవ్వఁడు దిక్కని హుంకరించి యడిగినప్పుడు నయితము నాకు సర్వేశ్వరుఁడే దిక్కని నిశ్చలముగ నిర్భయముగఁ ! బలికి యాపగతునకు వెఱపుఁ గొలిపిన పరమభక్తచూడామణిని మహమ్మదును దలఁచి చేతులు జోడించి నమస్కరింపనివాఁ డెవ్వఁ డుండును. అట్లే బ్రహ్మసూత్ర భాష్యకర్తలై వేదాంతరహస్య విజ్ఞాతలై బ్రహ్మజ్ఞానబీజంబులు దేశమందంతట వెదజల్లిన మహనీయులగు శంకరరామానుజాచార్యుల ఫాలభాగమునఁ జేదోయి గీలించి యెవఁడు నమస్కరించి వినుతింపఁడు. అందఱువంద్యులె అందఱు లోకహితైకదీక్షితులే. అందఱు ధర్మసంస్థాపనాపరులే. అయినను బూవులలో సంపెంగవలెను మణులలో వజ్రమువలెను లోహములలో సువర్ణమువలెను గ్రహములలో సూర్యుఁనువలెను మతసంస్కర్తలలో గౌతమబుద్ధుఁడు ప్రథమగణ్యుఁడు. జగదుపకారపరాయణుఁ డైన యీమహాత్ముఁడు బ్రాహ్మణుఁడై యుండవచ్చు నని ! యాతని చరిత్రము చదువకమున్ను చదువరులూహించుట సహజము. కాని యీతఁడు బ్రాహ్మణుఁడు కాఁడు. క్షత్రియుఁడు. దురాచారపీడితులై సంతుష్టియన్న దెన్నఁ డెఱుంగక

ప్రథమాధ్యాయము.

మహీకాంతా వైరితులై జగజ్జనులను హింసించు క్షత్రియులలో నేమి యిటువంటి మహాత్ముఁడు జనించునేమియని యనేకు లక్కజ పడవచ్చును. అట్టి యక్కజంబునకుఁ బనిలేదు. క్షత్రియులలో సాధువు లనేకులు గలరు. బ్రహ్మజ్ఞానసంపన్ను లనేకులు గలరు. భారతఖండము క్షత్రియులవలన నన్నెకెక్కినది. క్షత్రియులవలనఁ బావనమై సర్వవిఖ్యాతమైనది. స్మృతికర్తలలో మొట్టమొదటివాఁడై వర్ణాశ్రమధర్మవిభాగమ్ము చేసినమనువు క్షత్రియుఁడు. వేదములకుం గామాదిరియైనట్లు రాజుల కతఁ డాదిపురుషుఁ డని కాళిదాసు వచించి యున్నాఁడు. అతఁ డొక్కఁడే కాఁడు. ఆగమపురాణేతిహాసంబుల శ్రద్ధతోఁ జూచితిమేని దాని కనేకోదాహరణంబులు గానంబడును. ఎవ్వాని నామధేయము భారతఖండమందలి యసంఖ్యాక కోట్ల ప్రజ జనులు ముముక్షువు లగుటకు ధ్యానించి స్మరించుచు జపియించుచుండురో యెవనినామము నారకాబ్ధిసంతరణంబున సృష్టినొందు మానవులకే గాక సమస్తజంతువులకు మహేశ్వరుండు ప్రసన్నుఁడై తారకమంత్రముగఁ జేసి యుపదేశించునో యెవ్వాని సచ్చరిత్రము వాల్మీకి మహాముని మహాకావ్యముగ రచించి తనజన్మము చరితార్థము జేసికొనె నని మనీషావంతులెల్ల భావించుచున్నారో, యెవ్వాపేరు తమ బిడ్డలకుఁ బెట్టుకొని తమనామములను బలుమారు స్మరణము సేసి తరించుచుంటిమని మనదేశీయులు సంతసించుచున్నారో యెవ్వానిపేర నాసేతుహిమాచలము భరతఖండమునందు గణనాతీతములగు నాలయంబులు నిర్మింపఁబడినవో యెవ్వాని కథలను కావ్యములుగ ప్రబంధములుగ రూపకములుగ యక్షగానములుగ గానములుగ రచియించి కవులు ప్రఖ్యాతులైరో యెవ్వాని నివాసమునఁ బూత సాధుజనంబులు వసియింపరాని దండకారణ్యమునకుఁ జేరుకలిగెనో, యెవ్వఁడు పితృవాక్యపరిపాలకుఁడై యేకపత్నీవ్రతస్థుఁడై

బ్రాహ్మణవత్సలుఁడై ధర్మమార్గ ప్రవర్తకుఁడై మహావీరుఁడై దుష్టని
గ్రహశిష్టపరిపాలనా దీక్షితుఁడై యనేకసహస్రవర్షంబులనుండియార్య
మహాజనులచేత గౌరవింపఁబడు చున్నాఁడో యట్టి దశరథరాముఁడు
క్షత్రియుఁడే కదా! యదుకులోద్భవుఁడు గీతామృతరసము వర్షించిన
కాలమేఘము పాండవపక్షపాతి ధర్మసంస్థాపన పరాయణుఁడు శ్రీ నా
రాయణాంశసంభూతుఁ డని మహర్షుల చేతఁ గొనియాడఁబడి రఘు
రామునితో సమానముగఁ గొన్నియెడల నంతకంటె నధికముగ
గౌరవమ్ములఁ బడయుచున్న వాసుదేవుఁడు క్షత్రియుఁడే కదా?
ఎవ్వనినామంబును స్మరియించిన మాత్రమున సమస్తకలిదోషము
లడఁగు నని మనవారు నమ్ముదురో యట్టినలుండును ఋతుపర్ణుండును
క్షత్రియులే కదా. ఏ రాజచూడామణి తా నఖండ మహీమండల
మేలుచక్రవర్తి యయ్యు సత్యవ్రతానుష్ఠానము నిమిత్తము తన
భార్యను బ్రాహ్మణునకు దాసిగ విక్రయించి తాను కడజాతిమాల
నికమ్ముడు వోయి మహాపత్సమయమునందైన ధర్మము వీడక జగ
దద్భుతంబుగఁ బ్రవర్తించినహరిశ్చంద్రుఁడు క్షత్రియుఁడే కదా.
అనేకవర్షములు నిరుపమానదీక్షతోఁ దప మొనర్చి యాకాశగంగను
మహీమండలమునకుఁ గొని తెచ్చి తనపేరిట నది భాగీరథీ యని
జనులచే వ్యవహరింపఁబడునట్లు చేసిన భగీరథుఁడు క్షత్రియుఁడే కదా,
ఏ రాజర్షిపేర మన దేశము భరతఖండమని భరతవర్షమని వ్యవ
హరింపఁబడుచున్నదో యా భరతుఁడు దుష్యంతభూపాలునకు శకుం
తలాదేవికి జనియించినవాఁ డగుట క్షత్రియుఁడు. అనుదినమ్మును
నిష్ఠాగరిష్ఠులై మనవారు పారాయణము సేయురామాయణము
క్షత్రియుల చరిత్రము. పంచమవేదమై పరఁగుభారతము క్షత్రియుల
చరిత్రము పురాణము లన్నియుఁ బరుసుగ రాజర్షివంశానుచరిత్రాను
చరిత్రములతోనిండి యుండుటంజేసి క్షత్రియచరిత్రములె. బ్రహ్మ

జ్ఞానములలో మేటి యని పేరు వడసిన విదేహరాజు జనకుఁడు క్షత్రియుఁడు. ఏ నారీరత్నములు మన దేశపుటంగనామణులను సంతుష్టిగాఁ గర్వించుచుందుమో, యెవ్వరి పవిత్ర చరిత్రము లగ్నిహోత్రములవలెఁ బాపపుంజముల భస్మపటలము సేయు నని మనవారు విశ్వసింతురో యా మహాపతివ్రత లగుసీత దమయంతి చంద్రమతి లోపాముద్ర సావిత్రి మున్నగు కాంతలందఱు క్షత్రియాంగనలె. బ్రహ్మజ్ఞానసంపాదకు లని యుపనిషత్తులలోఁ జెప్పఁబడిన బ్రహ్మదత్తుఁడు మొదలగువారు క్షత్రియులు. లోకానుగ్రహార్థము సర్వముఁ బరిత్యజించిన గౌతమబుద్ధుఁడు క్షత్రియుఁడు. ఇట్లగుటచేత బ్రాహ్మణులు పూజనీయులుగా రని నా యభిప్రాయము గాదు. వారివలన భరతఖండమునకు మేలు గలుగలేదని నేననుటలేదు. తమ యంతర దీపికల యందు నాలుగు వేదంబులను యుగయుగంబుల దాఁచి యవి నష్టముల పాలఁబడి నశియింపకుండ రక్షించిన మహాత్ములను భిక్షాటనముచేత శిలోంఛవృత్తిచేతఁ దమ మేనులు నిలుపుకొని కోరికలనెల్ల జంపుకొని సర్వకాలము భగవత్ప్రీత్యర్థమై తమ మేనులు ధారవోసిన బ్రాహ్మణులు వందనీయులు కారని వాదించుట కెవ్వరు సాహసింతురు? క్షత్రియులు ప్రాచీనకాలమున బ్రాహ్మణులతోఁ దుల్యులుగ నుండిరనియుఁ గొన్ని యెడల వారికంటె నధికులుగ నుండిరనియు క్షత్రియుల చరిత్రములె మనకుఁ బవిత్రగ్రంథము లయ్యె ననియు వారివలననే దేశము స్థిరప్రతిష్ఠలఁ బడెననియుఁ జెప్పుట సాహసము కాదు. క్షత్రియులు మొట్టమొదటనుండియు బ్రాహ్మణులతో సమానముగఁ బారలౌకికవిషయములను జర్చించుటచేతనె గౌతమబుద్ధునివంటి మహనీయుఁ డా జాతిలో నుద్భవించుట కవకాశము గలిగెను.

ద్వితీయాధ్యాయము.

గోసంరక్షణచరిత్రము సరిగాఁ దెలిసికొనుటకు భారతఖండమునకు స్థిరనివాసులగు నార్యుల జన్మకాలమునాఁటి కెట్లున్నవో తత్పూర్వ మెట్లున్నవో సంగ్రహముగాఁ దెలుపుట యావశ్యము. అందుచేత నార్యజాతియొక్క చరిత్రను గూర్చి కొంత సంక్షిప్తముగ మనము తెలిసికొనవలయును. ఆర్యజాతియొక్క జన్మస్థానమును గూర్చి పలుచర్చలుగలవు. ఎన్నో భిన్నాభిప్రాయములు గలవు. పరస్పర విరుద్ధసిద్ధాంతములు గలవు. ఆర్యులాసియాఖండముయొక్క మధ్యస్థానమునుండి వచ్చిరని కొందఱు సమర్థించిరి. యూరోపుఖండమునుండి వచ్చిరని మఱికొందఱు వ్రాసిరి. సూర్యరశ్మి సోఁకని యుత్తరసముద్రతీరమునుండి యేతెంచిరని మఱికొందఱు లిఖించిరి. ఎక్కడనుండియు రాలేదు. భారతఖండమె వారి నివాసస్థానమని కొందఱు చరిత్రవేత్తలు దలంచిరి. ఆ చర్చలతో మనకుఁ బనిలేదు. ఋగ్వేదరచనాకాలమున నార్యులు సింధునదీతీరమున నుండిరన్నమాట సత్యము. శతద్రు మొదలగు పంచనదులు వారి పొలములయొద్దఁ బ్రవహించుచు వారికి వారిసస్యములకు వారి పశువులకు జీవన మొసంగుచుండెను. ఆకాలమున గోధనమె వారి ప్రధానద్రవ్యము. వారు ప్రకృతి కన్నకొడుకులై పరిశుద్ధములైన వర్చస్సులతోడను దృఢములైనకాయములతోడను నిర్మలములైన యంతఃకరణములతోడను కౌటిల్యమెఱుఁగని మనస్సులతోడను నేల దున్ని పండించుకొని పశువులను మేపి పాలు పిదికికొని ప్రకృతిసౌందర్యము చిత్తము నాకర్షించినపుడు మహానందనిమగ్నులై భూతములను స్తవము జేయుచు హాయిగాఁ గాలక్షేపము చేయుచుండిరి. ఆకాలమున వారిదైవతములు పంచభూతములు.

పట్టపగ లాకాశమున సహస్రకిరణములను దిగంతములయందుఁ బ్రస రింపఁజేసి దేదీప్యమాన ప్రభలతో వెలిగి యంధకారంబును పటా పంచలుగఁ దోలి మాలిన్యమును నశింపఁజేసి నేత్రము లున్న ఫలమున సార్థకము జేసినసూర్యమండలమును జూచినప్పుడును, ప్రాతఃకాలము సూర్యోదయమునకు ముందు వాచామగోచరమైన సౌందర్యముతో ననుభవైకవేద్యమైనశృంగారముతో వెలయుచుండిన యుషస్సును గాంచినప్పుడును, పగ లెండవేఁడిమిచేత నవసినశరీరములకు వెండియు నఖండచైతన్యముగొలుపునట్లు నిశాసమయములయందుఁ జల్లదనము వెదజల్లుచు బ్రహ్మాండమంతయు వెండిబరిణెవలెఁ జేసి జంతుజాలమును సంతోషతరంగములని యెడి నుయ్యెలలో నూఁచఁగలశరత్కాలసంపూర్ణచంద్రమండలమును గనుఁగొన్నప్పుడును, నాకసంబను నీలంపు మేలుపట్టుమీఁద దాఁపడము జేసిన వజ్రములవలె ధగధగలాడుచు మెఱయు ననంతకోటినక్షత్రములు వీక్షించినప్పుడును, శిఖలనియెడి నాలుకలు సాచి దూరమందలి మహారణ్యంబులనైన భస్మపటలము జేయుచు సకలజంతుభయంకరమైన జాజ్వల్యమానాగ్నిహోత్రము నవలోకించునప్పుడును, చండతరమై గ్రీష్మకాలపు టెండ తాఁకున వసివాళ్ళువాఱిన భూతకోటికి వర్షధార లనియెడు గొట్టంబులద్వారంబున మరల జీవనంబు బోయుచున్న కాఱుమబ్బులను దిలకించినప్పుడును, పర్వతంబుల భేదించుకొనియు నడవుల ఛేదించుకొనియు మహోత్తుంగ వృక్షంబులను నిర్మూలించియు వర్ణనాతీతమైనవేగముతోఁ బ్రవహించు మహానదుల దర్శించినపుడును, వారు మహాశ్చర్యాంబునమగ్నులై యగ్నికొక దేవతను వానకొక యధిష్ఠానదేవతను జలమునకొక దేవతను మనంబున భావించుకొని ప్రాణాధారములైనయగ్ని వాయువునకు నింద్రుని వరుణుని బ్రధానదైవతములుగ స్వీకరించి కొలుచుచుండిరి. వారి స్తవములె ఋక్కులు. ఋక్కులతో నిండిన దే

ఋగ్వేదము. ఆ స్తవము చేయునప్పుడు వారి మనస్సులలో గర్భితమైనకవితాగరిమ వారిచే నొకానొకప్పుడు మిక్కిలి హృదయంగమములై యున్నతములైనవాక్కులను బలికించుచుండెడిది. ఉషఃకాలవర్ణము వేదమునందు వర్ణింపఁబడినంత బాగుగ మఱియేగ్రంథమునందు వర్ణింపఁబడలేదని యనేకు లభిప్రాయపడుచున్నారు. ఉషస్సుకన్యకగా నొకచోటను గుఱ్ఱముగానొకచోటను మిక్కిలి చమత్కారముగా వర్ణింపఁబడినది. వర్షమునకధిష్ఠానదేవతగ వారిందుని భావించుకొని తమ పంటలను గోవులను వృద్ధిచేయుమనియు శత్రువులను నాశనము చేయుమనియు వేడికొనినట్లు వేదములలో ననేక స్థలములయందుఁ గలదు. వర్షకాలమున నాకాశమున నానావర్ణములతోఁ గనఁబడు రేఖ యింద్రుని ధనుస్సుగాను మేఘ మింద్రుని వాహనముగాను వారు భావించిరి. ఇట్లు బహువిధములఁ దమగృహములయందు నుపయోగకరములుగానున్నయగ్ని ననేకఋక్కులలోఁ గొనియాడిరి. అవి యగ్నిసూక్తము లనంబడును. ఇట్లయ్యాగున నార్యులు పంచభూతములను, నందు ముఖ్యముగ నింద్రాగ్నివాయుమిత్రావరుణులను సేవించుచు వారిని ప్రీతులం జేయుటకు నానావిధములైనయజ్ఞములారంభించిరి. ఈదేవతలకుఁదోడుగ వేల్పు లనేకులు బయలుదేఱిరి. యజ్ఞములలో హోమములు ప్రధానము లగుటచేత హోమము లగ్నిలో వేల్చవలసినవగుటచేత నార్యుల కగ్ని ముఖ్యదైవతమయ్యెను. ఈయాగములయందుఁ జదువవలసినమంత్రము లనేకములు కల్పితము లయ్యెను. దేవతాస్తవము గానపూర్వకముగఁ జేయుట దివ్యులకు మనుష్యులకుఁ గూడ శ్రవణానందకరమగుటచే సామవేదము గల్పింపఁబడెను. కర్మకాండ మిక్కిలి విస్తారమయ్యెను. రోగభూయిష్ఠము కాని దేశమున నిర్మలవాయువు స్వచ్ఛజలము పరిశుద్ధాహారము లభించుటచే నార్యులు దినదినాభివృద్ధినొంది క్రమక్రమముగ సంఖ్యలోఁ బెరిగిరి. వారి

గినకొలఁది మునుపున్న భూములు చాలక క్రొత్తభూము లాక్రమింప వలసివచ్చెను. ఆభూములలో నంతకుమున్న గాఁపురమున్న యనార్యులు తమ కన్నోన్నతరములనుండి భ్రష్టమగుచున్న దేశ మన్యాక్రాంత మగుట కోర్వఁజాలక యుద్ధసన్నద్ధు లైరి. ఈకలహములు వేదములయం దెన్నిస్థలములనో సూచింపఁబడినవి. ఆయనార్యులతోఁ బోరాడుటకు వీరపురుషులు గావలసివచ్చిరి. నానాఁటికి జ్ఞానాభివృద్ధి యగుటచే వారిపోషణమునిమిత్తము కృషివాణిజ్యగోరక్షణాదులు చేయవలసినవారు గూడ నెక్కువమంది కావలసివచ్చిరి. కేవల మైహికవ్యవహారపరతంత్రులై దేవతలమొగముఁ జూడక యజ్ఞాదులు మానినపక్షమున దేవతల కాగ్రహము గలుగు నను భయమున వేదములు పరంపరగ వల్లించువారు, క్రతువులు మొదలగు కర్మలు చేయించువారు గావలసివచ్చిరి. ఈకారణములచేత నార్యులు ముత్తెగలుగ విభజింపఁబడిరి. వేదాధ్యయనమె ప్రధానవృత్తిగ శ్రౌతకర్మలు నిత్యకృత్యములుగఁ గలవారు బ్రాహ్మణులైరి. లోకకంటకులగు శత్రువులను సంహరించుటకై తమనెత్తురు ధారవోసి పోరాడు వీరులు క్షత్రియులైరి. కృషివాణిజ్యగోరక్షణాదులు జరుపువారు వైశ్యులైరి. క్షత్రియులచేత యుద్ధమున జయింపఁబడి లోఁబడిన యనార్యులు పైమూఁడుతెగలవారికి సేవకులై శూద్రాభిధానులైరి. ఇట్లనుటచే బ్రాహ్మణు లొక్కరే కర్మానుష్ఠాతలైరనియు క్షత్రి వైశ్యులు కర్మబాహ్యులైరనియుఁ దలంపఁగూడదు. క్షత్రియు లనేకులు బహుయాగంబులఁ జేసిరి. వైశ్యులుగూడ నక్కడక్కడఁ గొన్ని యాగములు చేసినట్లున్నను వారిలో నీకర్మకాండ తక్కువైనది. అందుచేత వేదంబులఁ దమపుక్కిటఁ బట్టి కర్మకాండ తమయధీనము జేసికొని నిరంతరవేదఘోషలచేత దిక్కులు ప్రతిధ్వని నెసఁగఁజేయు బ్రాహ్మణులయెడలను ఖడ్గధారణము జేసి యుద్ధప్రాణములను దేశ

ముగ గాపాడుమహావీరులైనక్షత్రియులయెడలను బరమవిధేయులై వైశ్యులు భయభక్తులుగలిగి మెలంగుచుండిరి. ఆర్యజాతివారైనవారే యట్లుండ నాలవజాతిమాట చెప్పనేల? క్షత్రియులలో నెక్కువపలు కుబడి గలిగి పెద్దలై సేనాపతులైనవారు క్రమముగఁ దామువయిం చిన దేశముల కధిపతులై రాజులు మహారాజులు సార్వభౌములు చక్రవర్తులు ననుబిరుదులధరించి నేలయేలఁజొచ్చిరి. బ్రాహ్మణులు గురువులై పురోహితులై ధర్మశాస్త్రకర్తలై మంత్రులై ధర్మాధి కారులై వేదములను కర్మలను దస్మాలమును దేవతలను స్వాధీనము జేసికొని యుండిరి. కొంతకాల మైనతరువాత బ్రాహ్మక్షత్రియులకుఁ బరస్పరమత్సరము గలిగెను. అమూల్యమైన తమశరీరరక్తము ధార వోసి శత్రునాశనము జేసి ప్రజలం గాపాడుచున్నపుడు తమమాటయె ముఖ్యముగఁజెల్లవలయునని వారభిప్రాయపడిరి. జ్ఞానపేటికలై ధర్మ సంస్థాపనపరులై తక్కినవర్ణములకు మనముత్తమగతులు కల్పించు చున్నపుడు మనమాట యేల చెల్లఁగూడదని బ్రాహ్మణు లహంక రించిరి. ఉభయులకు నెన్నోపోరాటములు జరిగినట్లు గూడఁ బురాణ ములవల్లఁ దెలియవచ్చును. కొందఱు క్షత్రియు లస్త్రసన్యాసము జేసి స్వాధ్యాయపరులై కర్మనిరతులైరి. ఇందుకు విశ్వామిత్రుఁడు తార్కాణము. కొందఱుబ్రాహ్మణులు వేదంబునకుఁ దోడు ధను ర్వేదము నధిగమించి వీరకర్మ ముపక్రమించిరి. పరశురామద్రోణా చార్యు లిందు కుదాహరణములు. అనేకసంవత్సరపర్యాప్తములైన బ్రాహ్మణక్షత్రియవైరములకు భార్గవరాముని చరిత్రమే నిదర్శన ము. జ్ఞానధనసంపన్ను లగుటచే మొత్తముమీఁద బ్రాహ్మణులగౌర వము నిలిచెను. క్షత్రియులు వారిని మన్నించిరి. కర్మకాండ క్రమ క్రమముగ మేరమీఱి పెచ్చుపెరిగెనని యిదివఱకె వ్రాసియుంటిమి. బ్రాహ్మణాదివర్ణములు నేఁటికాలముననున్నట్లు దుష్కరనియమ

బద్ధములై లేకపోయినను గొన్ని కట్టుబాటులకు లోఁబడియుండెను. ఆకట్టుబాటులె ధర్మశాస్త్రములు. అవిస్మృతులనఁబడఁజొచ్చెను. స్మృతుల ననుసరించి చేయుకర్మలు స్మార్తకర్మలు, శ్రౌతకర్మలకు స్మార్తకర్మలుతోడై గృహస్థునకు నెండవపని చేయుటకవకాశ మియ్యకపోయెను. అందుచేతఁ గ్రమక్రమమునఁ గర్మలు క్షత్రియులను విడిచి బ్రాహ్మణులపాలఁ బడియెను. విక్రమశాలురగు రాజులుమాత్రము మహీకాంక్షచేతను జిగీషచేతను రాజసూయాశ్వమేధంబుల నప్పుడప్పుడుఁ జేయఁజొచ్చిరి. ఇట్లుగొంతకాలము గడచునప్పటికిఁ గొందఱి మనంబులలో నొకమార్పుపుట్టెను. ఆమార్పు ముఖ్యముగ బ్రహ్మక్షత్రియులలోఁ బొడసూపెను. "నే నెవ్వఁడను. జీవము శరీరముతో సరియా లేక మరణానంతరమునఁ గూడ నేదేని యుత్కృష్టజీవన మున్నదా? ఈసృష్టిస్థితిలయములకు హేతువేదేని గలదా? అట్టి హేతు వేది. దేహముకంటె భిన్నమై శాశ్వతమైనవస్తువేదేనికలదా?" యను సందియంబులు మనంబున సంకురించెను. అంతట జిజ్ఞాసప్రారంభమయ్యెను. కర్మకాండయందు జిజ్ఞాసువులగు మహాత్ములు కొందఱకుఁ గ్రమక్రమముగ నమ్మిక చెడియెను.

ఆయగ్నిష్టోమము లాపశువధము లామంత్రపాఠము లాదీక్ష లాయాచారములు వారిమనంబులకు నచ్చలేదు. శరీరము పెరుఁగుట రుగ్మతలచే విఱుగుట ముదిమిచే శిథిలమగుట సంగవైకల్యాదిబాధచే జన్మప్రభృతి పలువురు బాధలుపడుట దారిద్ర్యపీడచే సంసారయాత్ర చేయఁజాలక గృహస్థు లెన్నెన్నో సిలుగులపాలగుట ప్రత్యహము వారు కన్నులారఁ జూచినప్పుడు దుఃఖపరంపరనుండి శాశ్వతముగా విముక్తి నిచ్చుమార్గము నన్వేషించుటయందే వారిదృష్టి ప్రసరించెను. ఈకర్మకాండ యట్టి విమోచనము గలిగింపఁజాలదని వారికిఁదోఁచెను. తోఁచినతోడనే కర్మలు గట్టిపెట్టి జగదుత్పత్తిస్థితిప్రళయకారణంబు

బను శరీరబంధమోక్షణ సాధనంబులను జిజ్ఞాసజేయుటకై బహుప్రతిబంధకరభూయిష్ఠమ్ములై జనసమ్మర్దముగల పట్టణంబులను పల్లియలను విడిచి నిర్జనమ్ములై నిర్మలమ్ములై యుండునరణ్యంబులకుఁ బోవఁజొచ్చిరి. జ్ఞానాహారము నిమిత్తమై నిరీక్షించుచుఁ బేరాఁకలిఁగొని యున్న వారిగంభీరమనస్సుల కామహారణ్యంబులు గావలసినయాహార మర్పించెను. శరీరధారణమునకు మాత్రము వారు భౌతికాహారము స్వల్పముగ గ్రహించి జ్ఞానభోజనము విశేషముసేయుచుండిరి. ఆకులు కాయలు దుంపలు పండ్లు మొదలగునవి భక్షించి మేనఁ బ్రాణములు నిలుపుకొనుచుండిరి. ఆకారడవులలో వారి కంటికగపడిన ప్రతిపదార్థము వారి మనస్సులలో జ్ఞానసూర్యోదయకారణమయ్యెను. అప్పుడు బ్రహ్మ మనుపదార్థ మొకటి కలదని వారికి బొడగట్టెను. ఆబ్రహ్మపదార్థము మహోన్నతమ్ములై శృంగజిహ్వలచేత గగనమును నాకుచున్న యుత్తుంగపర్వతములయందును విశాలనదీప్రవాహములయందును నానావర్ణదేహములఁ గలిగి శ్రావ్యముగాఁ గూయుపక్షులయందును బక్షుల కాశ్రయమ్ములైనవృక్షములయందును సకలజంతువులయందును భూమియందును నాకాశమందును నగ్నియందును నిండి సర్వవ్యాపకమై సర్వకాలాబాధితమై దేశకాలపరిచ్ఛేదరహితమై యాదిమధ్యాంతరహితమై జగత్కారణమై సజాతీయవిజాతీయ స్వగతభేదశూన్యమై యేకమై యద్వితీయమై సర్వజ్ఞమై సర్వశక్తియుతమై నామరూపశూన్యమై యచ్యుతమై యనంతమై యున్నట్లుకనబడెను. పలుమాటలేల? భూమిలోనున్న ప్రతిపరమాణువు నాకాశముమీఁదనున్న ప్రతినక్షత్రము వృక్షముమీఁదనున్న ప్రతిపర్ణము జలములోనున్నప్రతిబిందువు బ్రహ్మమయమనియు బ్రహ్మముకంటె భిన్నమైన పదార్థమువేఱు లేదనియు వారు నమ్మిరి. నమ్మి యానమ్మికను వచనరూపముగను శ్లోకరూపముగను రచియించి గానముఁ జేసిరి. ఇవి

యరణ్యములలో నుండఁగ వ్రాయఁబడుటచేత నారణ్యకము లని పేరం బరఁగుచున్నవి. వేదముల కొట్టకొనవివి వ్రాయఁబడుటచేత వేదాంత మనునామము గలిగియున్నవి. ఇవేయుపనిషత్తులు. ఈయుపనిషత్తులు బ్రహ్మజ్ఞానపూరితములై యున్నవి. కర్మకాండ మోక్షసాధనము కాదనియు జ్ఞానమె మోక్షసాధనమనియు నీయుపనిషత్తులుబోధించు చున్నవి. తత్త్వవేత్తలై కవులై యీయుపనిషత్తులు వ్రాసినమహా త్ములు బ్రహ్మవాదులను పేరం బరఁగుచుండిరి. ఈవిచారణ మింత తో నిలువలేదు. జిజ్ఞాసువులు బయలు దేఱిరి ఈయుపనిషత్తుల ప్రధా నము గూడ కొందఱికి సంతుష్టి గలిగింపలేదు. అదిగాక యుపనిషత్తు లాదిమములైనవి కొన్నిమాత్రమె యుండఁగా నుపనిషత్తులమీఁద జనులకుగౌరవము కలిగియున్న కారణమున వెఱ్ఱివెఱ్ఱిసిద్ధాంతములు చేయఁదలఁచినవారందఱు దమసిద్ధాంతము లుపనిషన్మార్గమున రచి యించినచో జనసమ్మతము బడయునని నమ్మి తమకు సేవ్యములైన దేవతల నుద్దేశించి తనకిష్టములైన ధర్మమున నెలపికొని యుపనిష త్తులు రచియించి వానిగౌరవమును జెడఁగొట్టిరి.

ఉపనిషద్రచనాంతరమున నూతనసిద్ధాంతము లాఱు బయలు దేఱినవి. అవిషడ్దర్శనము లనఁబడును. అందు మొదటిది పూర్వమీ మాంస. ఇది జైమినిమహాముని రచియించెను. వేదచోదితములైన యజ్ఞాదికర్మలు, నిత్యనైమిత్తికములుఁ దప్పక యనుష్ఠింపవలసిన దనియుఁ గర్మమే బ్రహ్మమనియు నదియె మోక్షసాధన మనియు గర్మముకంటె వేరుపదార్థము లేదనియు నీపూర్వమీమాంసాశాస్త్ర ము చెప్పుచున్నది. రెండవ దుత్తరమీమాంస దీనికె బ్రహ్మమీ మాంస.యని పేరు బ్రహ్మపదార్థ మొకటికలదనియుజగత్తుయొక్క సృష్టిస్థితిలయములు దానివలన నుండియె సంభవించుచున్న వనియు దేహమందుండుజీవాత్మయు బ్రహ్మమగు పరమాత్మయు నొక్కటె

మరియు సరస్సులో సూర్యబింబము బ్రతిఫలించి యాకాశముమీఁది సూర్యబింబమునకు భిన్నముగా నున్నట్లు కనఁబడినను నిజముగా దానికంటె వేఱుగాని యున్నట్లే యుపాధిభేదముచేతఁ బరమాత్మశరీరములయందున్నపుడు నానాత్వముచే వేఱుగఁ గనఁబడినను నిజముగ వేరు కాదనియు జగము మిథ్యయనియు బ్రహ్మమే సత్యమనియు బ్రహ్మముకంటె భిన్నమొండు పదార్థము లేదనియు నీయుత్తరమీమాంసాశాస్త్రము బోధించుచున్నది. ఈశాస్త్రకర్త బాదరాయణుఁడను నామాంతరముగల వేదవ్యాసుఁడు. ఈమూఁడుశాస్త్రములును మాత్రములుసూత్రరూపములుగ నున్నవి. ఈరెండుశాస్త్రములు వేదములుపరమప్రమాణముగ నంగీకరించుచున్నవి. తక్కిన నాలుగుశాస్త్రములు వేదాధారము కలవి కావు.

మూఁడవది సాంఖ్యశాస్త్రము. ఇదిరచియించినవాఁడు కపిలుఁడు సాంఖ్యశాస్త్రము రచియించుటచేతనే కాఁబోలు కపిలుఁడు నారాయణాంశసంభూతుఁడని భాగవతాదిగ్రంథములలో నున్నది. ఇతఁడు నిరీశ్వరవాది. అందుచేత నితనిశాస్త్రము నిరీశ్వరసాంఖ్యమనఁబడును. ఇతనిగ్రంథము పూర్వోదాహృతములైన రెండుశాస్త్రములకంటె భిన్నముగా నున్నది. ఏయేపదార్థములనుండి ప్రపంచమైనదో యితఁడు చెప్పి దుఃఖనివారణమునొంది దేహమోక్షమునొందుటకు సాధనము బోధించుచున్నాఁడు. మహదాదులైన యిరువదినాలుగు తత్త్వములచేఁ బ్రపంచము నిర్మితమైనదని యితనియభిప్రాయము. నాలుగవది యోగశాస్త్రము. ఇది పతంజలిమహాముని రచించెను. ఈశాస్త్రము కూడ సాంఖ్యమను పేరనే వ్యవహరింపఁబడుచున్నది. ఇతఁడీశ్వరుఁడు కలఁడని యొప్పుకొనుటచే నీశాస్త్రము కపిలశాస్త్రమువలె నిరీశ్వరసాంఖ్యముగాక సేశ్వరసాంఖ్యమనఁబడును. చిత్తవృత్తుల నిరోధించి కొన్ని నియమముల ప్రకార మీశ్వరధ్యానముఁ జేసినపక్షమున

దేహికి మోక్షప్రాప్తియగునని యీశాస్త్రము తెలియఁజేయుచున్నది. అయిదవది న్యాయశాస్త్రము. ఈశాస్త్రము గౌతముఁడు రచియించెను. ఇదియు నిరీశ్వరశాస్త్రమె. దీనిలోనుండియె తర్కశాస్త్రము పుట్టినది. ఇతఁడు ప్రపంచమును బదియాఱుభాగములుగ విభాగించి దేహికి మోక్షసిద్ధియగుటకుమార్గములఁ జెప్పియున్నాఁడు. ఆఱవది వైశేషికశాస్త్రము. ఇది కణాదుఁడు రచియించెను. ప్రపంచము పరమాణువులచేత నైనదనియుఁ బరమాణువు చైతన్యముగలిగియుండు ననియు నిదిచెప్పుచున్నది. ఇదియు నాస్తిక శాస్త్రమె. ఆస్తికులైనవారుఁ నాస్తికులైనవారుగూడ మొత్తముమీఁద దేహిదుఃఖపరంపరనుండి విముక్తుఁడగుటకుఁ దమచిరకాలజిజ్ఞాసచేతఁ దాముకనిపెట్టిన సాధనంబుల జగదుపకారార్థము గ్రంథములుగ రచియించి తెలియఁజేసియుండిరి. ఈ శాస్త్రములలో లోకవిరుద్ధమైనది కాని నీతిబాహ్యమైనది కాని యేమియు లేదు. నాస్తికవాదము చేసినను వీరు ధర్మమార్గమును విడువలేదు. జిజ్ఞాస యింతటితో నైన నిలువలేదు. షడ్దర్శనరచనానంతరమున లోకాయతమతము పుట్టినది. ఈమతద్రష్ట చార్వాకుఁడు. ఇతఁడు కర్మకాండను జ్ఞానకాండను గూడ నధిక్షేపించినవాఁడు. ఇతనిమతప్రకారము వేదము లప్రమాణములు. యజ్ఞాదికర్మలు చేయువారు మూర్ఖులు. ఇతఁడు పరమనాస్తికుఁడు. తక్కినశాస్త్రములవారు దేవుఁడు లేఁడన్నను మనజీవాత్మయొక్కటున్నదని యొప్పుకొనిరి. ఇతనిసిద్ధాంతప్రకారము జీవాత్మలేదు. పరమాత్మలేదు. స్వర్గములేదు. నరకము లేదు. సుఖజీవనమె పరమానందము. మరణమే మోక్షము. పశువులనుజంపి యాగములఁజేయువారిని చార్వాకుఁడీక్రిందివిధముగ నధిక్షేపించెను. "యజ్ఞములోఁ జంపఁబడిన పశువునకు స్వర్గప్రాప్తి యగునని మీరు చెప్పుచున్నారుగదా. ఆపశువునకు నిజముగ మోక్షసిద్ధియగునెడ మీ తండ్రినె యీ పశువుగఁజేసి దుర్లభమైన మోక్ష మతనికి

సిద్ధింపఁజేయరాదా? మృతిఁబొందిన దగ్గరి బంధువులకుఁ బరలోకమందు తృప్తి కలుగునట్లు బంధువులకు మీరు శ్రాద్ధముబెట్టి యా శ్రాద్ధాన్నమును వారు భుజింతురని మీరునమ్ముచున్నారు. క్రిందయన్నముబెట్టి మేడమీఁదనున్నవానిని భక్షింపుమన్న భక్షించునా?" ఈచార్వాకమతము వేదములను ధర్మశాస్త్రములను బురాణములను వేదములనాధారముచేసికొనియున్న సకలగ్రంథములను సకలకర్మలను సకలసిద్ధాంతములను నిరసించి యపహాస్యము జేసెను. ఇదిగాక యిట్టిమతములు నూతన సిద్ధాంతములు ననేకములు తలఁజూపెను. ఈమతస్థితిని బట్టి సంఘస్థితిగూడ కొన్నిమార్పులు చెందెను. నాస్తికసిద్ధాంతములు బయలుదేఱినకొలఁది వైదికకర్మకాండ మునుపటికంటె విస్తారమై చూచువారికి నాచరించువారికిగూడ భయంకరమయ్యెను. కర్మకాండ హెచ్చినకొలఁది మూఢవిశ్వాసములు బలమయ్యెను. క్షత్రియ వైశ్య శూద్రులు బ్రాహ్మణాధికారమునకు లోఁబడిరి. బ్రాహ్మణులు కాలానుసారముగఁ గ్రొత్తక్రొత్త స్మృతులు నిర్మించిరి. ఎల్లస్మృతులలో బ్రాహ్మణులు మాననీయులుగ వర్ణింపఁబడిరి. వారు దేవతలకు భూలోకప్రతినిధులైరి. బ్రాహ్మణప్రీతి దేవప్రీతియనియు బ్రాహ్మణ తిరస్కారము దేవతాతిరస్కారమనియు స్పష్టముగ వ్రాయఁబడినది. బ్రహ్మహత్య మహాపాతకములలో నగ్రగణ్యమైనది. "బ్రాహ్మణో నహంతవ్య" యను సిద్ధాంతము బయలుదేఱెను. అనఁగా బ్రాహ్మణుఁడు నరహత్యజేసినను శిరచ్ఛేదము సేయఁదగినమరియేపాతకము జేసినను వానికిమరణదండన విధింపఁగూడదు. బ్రాహ్మణులమాటయె ధర్మశాస్త్రమయ్యెను. వారియధికారము నిరంకుశమయ్యెను. అన్యజాతివాఁడు చేసినపాతకములకు దండములు మెండు. బ్రాహ్మణులుచేసిన పాతకములకు దండములుస్వల్పములు. దండవిధాయకులైన రాజులునయితము బ్రాహ్మణవిధేయులు. వారుగీచినగీటు దాఁటకుండుటచె జనసామా

స్యమువారియధికార భారమున గ్రుంగిపోయి మొఱనాలించువారు లేమి నోరెత్తక యూరకుండవలసినవారైరి. అందుచేత జనసామాన్యమునకు బ్రాహ్మణులయెడలను వైదికమతమునెడలను సంపూర్ణముగ తిరస్కారభావముజనించెను. అది యగ్నిపర్వతగర్భమున మఱుగుచుండిన యదృష్టద్రావకమువలె నడఁగి చిరకాలముండి యుండి యుద్గారసమయమును నిరీక్షించుచుండెను. జనులు నాగరకతాశూన్యులైనపక్షమున నిరంకుశాధికారమునకు లోబడియుందురు, కాని నాగరకత హెచ్చినపిదప జ్ఞానసామర్థ్యము ప్రతిమనుష్యునకు సలవడినపిదప జంతువులవలె నెల్లబాధలుసహించి యూరకుండుట మానవస్వభావవిరుద్ధము. ఆర్యులు నాగరకతయందుఁ గూడ నాకాలపు జాతులనెల్ల మించిరి. వారు పట్టణంబులు నిర్మించుకొనిరి. మేడలు మిద్దెలు గట్టుకొనిరి. సువర్ణముతోడను రత్నములతోడను వింత వింతనగలు చేసికొననేర్చిరి. బహుశాస్త్రములయందుఁ గృషిచేసి విజ్ఞానము సంపాదించిరి. సంఘమునకుఁగావలసినకట్టుబాట్లు నేర్పఱచుకొనిరి. రాష్ట్రములు స్థాపించిరి. రాజధానులునిర్మించిరి. మహాసైన్యసమేతులై రథములెక్కి యేనుఁగులెక్కి గుఱ్ఱములెక్కి యుద్ధములు జేయ నేర్చిరి. ఇట్టిస్థితిలో నున్న వారు కారణాంతరముల చేతఁ గొంతకాలము బ్రాహ్మణుల నిరంకుశాధికారభారమున నడఁగి, నోరులేక యూరకుండినను దగిన సమయమువచ్చినప్పుడు చెలరేగకుందురా? అందుచేతనే గౌతమబుద్ధుఁడు పొడసూపి వేదవిరుద్ధమతమును బోధించినతోడనే వర్ణాశ్రమ భేదశూన్యమై సర్వజనభ్రాతృత్వబోధకమై కర్మకాండ విహీనమైన యాతనిమతమునజనులు గుంపులు గుంపులుగ జేరిరి.

తృతీయాధ్యాయము

హిమాలయపర్వతమునకు దక్షిణమున రోహిణి యనుచిన్న నది ప్రవహించుచుండును. దాని కిరువంకల రెండు తెగలవారు కాపుర ముండిరి. నదికుత్తరమువైపున శాక్యు లుండిరి. వారికి ముఖ్యనగరము కపిలవస్తుపురము. శాక్యులకు నాయకుఁడు శుద్ధోదనుఁడు. రోహిణీ నదికి దక్షిణమున మఱియొక తెగవారు గాఁపుర ముండిరి కోలీపట్ట ణము వారికి ముఖ్యస్థానము. కోలీరాజకుమారికలగు మాయాదేవి యుఁ బ్రజావతియు శాక్యనాయకుఁడగు శుద్ధోదనుని వివాహమాడిరి అయక్కచెల్లెండ్రు సవతులయ్యు మచ్చరంబు లేక యన్యోన్యానురా గము గలిగి మెలఁగు చుండిరి. శుద్ధోదనుఁడు సంతానము లేక తనజ న్మము దుఃఖభాజన మని చింతించెను. ఎట్టకేలకు మాయాదేవి నలు వదియైదుసంవత్సరములయీడు గలదైనప్పుడు సంతానము నిమి త్తము నోము లెన్నో నోచి, వ్రతము లెన్నో సలిపి, నియమము లెన్నో నెఱపి, యేడుదినము లుపవసించి యున్న పిదప నొకనాఁటి రేయి యామె వింతయైన కలఁ గనెను. స్వప్నములో దేవత లామె నూర్ధ్వ లోకంబునకుం గొనిపోయి రఁట. తెల్లనియేనుఁగు గర్భమునం దుఁ బ్రవేశించె నఁట. మాయాదేవి యామహాస్వప్నమును భర్త కెఱిఁగింప నతఁడు స్వప్నశాస్త్రవేత్త లగునైదుగురు బ్రాహ్మణులం బిలిపించి, స్వప్నఫల మెఱిఁగింపు మని కోరెను. ఆకల విని యావిప్రులు మాయాదేవిగర్భమునఁ గుమారుఁ డుద్భవించు ననిన యతఁడు వసుంధ రాచక్రమంతయు నేకచ్ఛత్రముగఁ బరిపాలించు చక్రవర్తియో, లేక నజ్ఞానాంధకార మడంచి, తనజ్ఞానతేజమువలనఁ బ్రపంచ మునుండి పాపములు నిర్మూలము సేయఁజాలు మహాబుద్ధుఁడో యగు

నని చెప్పిరి. సిద్ధార్థునిజన్మవృత్తాంత మంతయు నద్భుతపరంపరలతో నిండి యుండును. పురాణములలో శ్రీమన్నారాయణావతారము వర్ణించునప్పుడును, మఱి యితరపురుషుల యావిర్భావములఁ దెలుపు నప్పుడును వ్యాసాదిమహర్షులు దిక్కులు ప్రసన్నములైనట్లు, వృక్ష లతాదులు నవకిసలయపుష్పఫలసమృద్ధములైనట్లు, నదీనదంబులు నిర్మలజలప్రవాహశోభితములైనట్లు, నిఖిలజగములయందు నిర్వ్యాజ జానందము నెలకొనినట్లు, దివ్యులు సంతోషపరవశులై దుందుభినా దంబుల మ్రోయించి కుసుమ వర్షముఁ గురిసినట్లు, సర్వజనసుఖప్ర దముగా వాయువు వీచినట్లు, బ్రహ్మాదిదేవతలు స్తవములు చేసినట్లు మనము తెలియుచుఁ జదువుచుందుము. ఇందుకు భాగవతమునందలి వామనావతారఘట్టమును శ్రీకృష్ణావిర్భావఘట్టమును ముఖ్యోదాహ రణములు. సిద్ధార్థునిచరిత్రములు వ్రాసినవారిలో ననేకు లాయన భక్తులగుట చేతను, మహాపురుషుఁ డగుటచే మహాద్భుతములైన కథ లెన్నో లోకమున వ్యాపించి యుండుటచేతను, పూర్వకాలమున నట్టియద్భుతముల నెల్ల విశ్వసించుట మనుష్య సామాన్యమునకు సహజ మగుటచేతను, గతానుగతికముగా లోకమున వ్యాపించియు న్న చిత్రకథల నెల్ల సంగ్రహించి, యవియెల్ల నిక్కములనియు సిద్ధా ర్థునిమహిమలనియుఁ జరిత్రకారులు లిఖించిరి. అంతియ కాక మహా త్ముఁడైన తమగురువును లోకాతీతపురుషునిఁగా వర్ణింపక సామా న్యునట్లు వర్ణించినపక్షమున లోకమునందు నతనియెడ గౌరవ ముండ దని వారినమ్మకము. అతనిని సత్ప్రవర్తనముగల సామాన్య మను ష్యునిఁగా వర్ణించినయెడలఁ బురాణేతిహాసములలోఁ జెప్పఁబడిన శ్రీకృష్ణరఘురామాదులకుఁ దమనాయకుఁడు దీసిపోవు ననియు వ్యా సవాల్మీకిప్రముఖులకుఁ గలుగు యశస్సు దమకుఁ గలుగ దనియు, నందుచేత నద్భుతమైనమహిమలుండి తీరవలెననియు వారు నమ్మి

జీవచరిత్రలు వ్రాసిరి. ఇట్లు వ్రాయుటచేతనే సిద్ధార్థుని సత్యచరిత్ర
ము మహావర్ణనాసముద్రమున మునిఁగిపోయినది. అట్టియద్భుతములం గొ
న్నింటిఁ జెప్పకుండుట సముచితము. సిద్ధార్థుఁడు గర్భస్థుఁడు కాఁగానే ముప్పది
రెండు నిమిత్తములు జగంబున వ్యక్తములయ్యెనఁట. పదివేల లోకములు
మహాతేజముతో నిండెను. గ్రుడ్డివాండ్రు చూడఁగలిగిరి. చెవిటివాండ్రు
వినఁగలిగిరి. మూఁగవాండ్రు మాటలాడఁగలిగిరి. వక్రాంగులు
సమదేహులైరి. కుంటివాండ్రు నడువఁగలిగిరి. కారాబద్ధులు విముక్తులైరి.
మహీమండలమంతయు నవనవోన్మేషంబుం దాల్చి విలసిల్లెను. అఖిలభూ
తములు మహాసంతోషభరితములయ్యెను. మహారణ్యములందలి కారుచిచ్చు
లును ఋతి మాఱిపోయెను. మందభాగ్యుల మహాదుఃఖములు మటు
మాయములయ్యెను. అతఁడు మాతృగర్భములో నున్న పదిమాస
ములలో నతని విగ్రహము చూపరులకుఁ గానఁబడియెను. ఆకాల
మున నతఁడు పద్మాసనము వైచికొని కూర్చుండి, తన్నుఁ గొలుచు
నిమిత్తము దివ్యదేహములు ధరించి చుట్టుప్రక్కల సంచరించు దేవ
తలకుఁ దల్లికి నొప్పి కలుగకుండఁ గుడిచేయిఁ జాచి, సాభినయముగా
బోధించుచుండెను. మాసములు నిండినతర్వాత మాయాదేవి ప్రస
వము నిమిత్తము పుట్టినింటికి బయలుదేరెను. జన్మస్థానమగు కోలీ
గ్రామమునకు నత్తవారియూరగు కపిలవస్తుపురమునకును నడుమ
నొకయడవి యుండెను. దానిపేరు లుంబినీవనము. తన ప్రియురాలు
పుట్టినింటికిఁ బోవఁదలంచినప్పుడు శుద్ధోదనుఁడు వలయు ప్రయత్న
ములఁ జేసెను. రెండూళ్ళనడుమ నున్న భూమి నిమ్నోన్నతముగా
నుండుటచే నది నిండుచూలాలగు దనయిల్లాలికిఁ గమనయోగ్య
ముగా నుండదని సమభూమిగాఁ జేయించెను. దారి కిరుప్రక్కలఁ
బచ్చనితోరణములు గట్టించి, యరఁటిచెట్లు నాటించి, కనుపండువౌ
నట్లు అలంకరింపఁ జేసెను. నిర్మలజలపూరితములగు పాత్రములు

మార్గమధ్యమున నొండొంటికి నాతిదూరముగఁ బెట్టించెను. ఆమె కూర్చుండుటకుఁ బ్రత్యేకముగ నొక సువర్ణపీఠముఁ జేయించెను. ఆమె వెనుకఁ దనసంస్థానమందలి ప్రధానపురుషు లందఱుఁ బోవలె నని యాజ్ఞాపించెను. వారిననుసరించి తనరాణులెల్లఁ గలిసిపోవం బనిచెను. ఆమె లంబినీవనమునఁ గొంతద వ్వరిగినఁ బిదప నొక సరోవరమధ్యమునుండి యైదు తామరపువ్వులు గాడ్పునుండి విడి, యదృచ్ఛితముగ నామెపైఁ బడవచ్చెను. మహీరుహశాఖలకు సలంకారములుగ నున్న పక్షులు కంఠము లెత్తి యవ్యక్త మధుర స్వరములతోఁ గూసెను. దేవలోకమున నుండు వృక్షములు కొంతకాలాత్రిమునం దీసి పోసినవై యీ వనభూజములు సమితము బుద్ధుని యవతారజ్ఞానము గలిగి సంతసించుచున్నవో యనునట్లు పుష్పఫలభరితములై, శోభావంతములై, నయనోత్సవకరములై యుండెను. నేత్రసంతర్పణమును మనఃప్రమోదావహమునగు వృక్షసంతానమును జూడఁగనే కొన్ని చెట్లకడకుఁ బోయి, స్పృశియింపవలయునని మాయాదేవికిఁ గుతూహలము జనించెను. జనించినతోడనే యనుచరులామెను వన మధ్యమునకుఁ దోడ్కొని చనిరి.

మాయాదేవి తనచెల్లెలగు ప్రజాపతితోఁ గలిసి రథముమీఁద గూర్చుండి యీ వనమధ్యమునకుం జని, మనోజ్ఞపుష్పములతోడను జక్కని కెంజిగురాకులతోడను నేత్రోత్సవముఁ జేయు నొకవృక్షముం జేతితోఁ జూపి, తన్నదానికడకుఁ గొనిపొమ్మని కోరెను. అనుచరులు వెంటనే యామెకోర్కెఁ దీర్చిరి. రథ మావృక్షము క్రిందికి జనినతోడనే మాయాదేవి లేచి, నిలువంబడి, యెడమచేయిఁ దనచెల్లెలి మెడకుం బెనవైచి, కుడిచేయిఁ జాచి, తక్కినకొమ్మలకన్న నెక్కుడు సొగసు మీఱి హృదయంగమమైన లేఁగొమ్మను బట్టి విరువఁదలఁచెను. అంత నక్కజముగఁ జెట్టున నున్నకొమ్మ లన్నియుఁ దమంతట వంగి, "మమ్ము

గ్రహింపుము. నన్ను గ్రహింపు" మని యామెను వేడుకొను చందమున నామెహస్త మందుకొనుటకు సులభముగా నుండెను. అంతట నారాజపత్ని ముద్దులు మూటగట్టుచున్న యొకకొమ్మ విరిచి, చేతఁబట్టుకొనెను. ఏదో యద్భుతమైన మహాశక్తివల్ల వాయువు లాసమయమున మందమందములుగ వీచి రాణి కాహ్లాదముఁ గలిగించెను. ఆ స్థలముమీఁద నిలువంబడి మాయాదేవి యౌవనసౌందర్యము నెప మెచ్చి చూచుచుండఁగనే యామెకు నొప్పులువచ్చెను. పరిజనులు తక్షణమే మగవాండ్రనెల్ల నావలకుం బోవఁబనిచి, నలుప్రక్కలఁ దెరలు గట్టిరి. కొంతసేపటికి రామె బ్రసవించెను. కుమారుఁడు జనియించెను. అతఁడు మాయాదేవిగర్భమునం బ్రవేశించినప్పు డెన్నివింతలు పుట్టెనని వర్ణింపఁబడియెనో జననమందినప్పుడు గూడ నన్నివింతలు పుట్టినట్లు వ్రాయఁబడియెను. పుట్టినతోడనే యాకుమారుని నలువురు బ్రాహ్మణులు బంగరువలలో వైచి, తల్లి యెదుటఁ బెట్టి. "ఓ దేవి! నీవు మహానందము నొందుము. మహాద్భుతమైన నీ గర్భఫల మిదిగో!" అని ప్రశంసించిరట. ఆ బ్రాహ్మణహస్తములనుండి నలుగురు దేవత లాబాలకుని గ్రహించి యాశీర్వదించి, పిమ్మట సేవకులచేతి కిచ్చిరఁట. పిమ్మట సేవకులు తెల్లని వస్త్రము లాబాలకునికిఁ గప్పిరఁట. గాని సర్వజనంబులు నివ్వెఱపడి చూడ నాబాలకుండు నేలపై నిలువఁబడి, తూర్పుదెస చూచుటయు వేయిలోకంబు లతని దృష్టిపథంబునఁ బడియె నఁట. ఆలోకముల యందు నివసించు దివ్యులు పుష్పవర్షంబులు గురిసి, "మహాపురుషుఁ డవతరించె; అతనికి సమానుఁడు లేఁడు. అతని కధికుఁడు లేఁ"డని యుచ్చైస్స్వరములతోఁ బలికిరఁట. అనంతరము బుద్ధుఁడు తక్కిన మూఁడుదెసలం జూచి, యాకసమువంకఁ జూచి, నేలవంకఁ జూచి, తనకు సమానుఁడగుపురుషు నెందుఁ గానకపోయెను. సకలభూతముల

కన్నఁ దానేయధికుఁడను నాత్మజ్ఞానము గలుగుటచేత నా బాలకుఁ డేడడుగులదూరము గంతువైచి, దుమికి, "ఇదియే నా కడపటి జన్మము. పునర్జన్మము నాకిఁక లేదు. ఎల్లభూతములకంటె నేనధికుఁడ." నని గంభీరస్వరముతోఁ బలికి సుస్థిరముగా నేల్పై నడువ సాగెనఁట. వేయేల! భూమ్యాకాశంబులు వానికి విధేయములయ్యెను. దేవతలు, దేవతానాథులు వానికి గులాములై విధేయులై కైవారములఁ జేసిరి. జగంబునెల్లెడ వ్యక్తములైన మహాద్భుతముం గని యదివఱకనేక సంవత్సరములనుండి హిమాలయ పర్వతంబున తపంబు జేసికొనుచున్న యొక మహర్షి యెవఁడో మహానుభావుఁ డవతరించి యుండవచ్చు నని నిశ్చయించి, యాతఁ డున్నచోటు వెదకి కొనుచు వచ్చివచ్చి కడకుఁ గపిలవస్తుపురంబుఁ జేరెను. శుద్ధోదనుఁడు కుమారుని మహర్షిపాదములపై వైచి దీవనలు బడయఁదలఁచి బాలకు నతని సన్నిధికి రావించెను. బాలుని మహర్షిపాదములపైఁ బడ వైవఁ దలఁచుచుండఁగా బాలునిపాదములు మంతంతటవి బహుజటాజూటములతో నిండిన మహర్షి శిరముపై నిలిచెను. సభాసదు లందఱు మిక్కిలి యక్కజము నొందిరి. మహర్షి యక్కజంపడవలదని వారిని వారించి, "ఈ బాలుఁడు బుద్ధుఁడగు" నని చెప్పి, "అయ్యో! యీతఁడు బుద్ధు డగునందాక నేను జీవింప" నని చింతించెను. ఆతఁడు జనియించిన యైదవనాఁడు నామకరణముఁ జేయించుటకు నిశ్చయించి శుద్ధోదనుఁడు వేదత్రయపారగులైన నూటయెనమండ్రు బ్రాహ్మణోత్తములనురావించి భూరిదక్షిణల సంతర్పణము జేసెను. వారిలో నెనమండ్రు జ్యోతిశ్శాస్త్రమునందు మిక్కిలి ప్రవీణులు ఆ యెనమండ్రుగురలో నేడ్వురు బాలకునిమేన నున్న సర్వశుభలక్షణములఁ బరిశీలించిచూచి రెండువ్రేళ్ళఁ బైకెత్తి, చూపి యిట్లనిరి "ఇతఁడు మహీమండల మంతయు నేకచ్ఛత్రముగాఁ బరిపాలించు మహాచక్ర

వర్తియగు నగు" లేదా! లోకోద్ధారకుఁ డగుబుద్ధుఁడైన నగు" ఎనిమిదవ బ్రాహ్మణుఁ డగు కౌండిన్యుఁడొక్క వ్రేలు మాత్రమే పైకెత్తి "ఈ తఁడు తప్పక బుద్ధుఁడే యగును. ఇతఁడు జగంబునుండి యాజ్ఞానాంధ కారముఁ దొలఁగించి పాపములు రూపుమాపు"నని నిశ్చలముగాఁ బలికెను బ్రాహ్మణులతనికి సిద్ధార్థుఁడని పేరుఁ బెట్టిరి ఇతఁడు గౌత మగోత్రుఁ డగుటచేఁ దఱచుగా గౌతము డనియును వ్యవహరింపఁ బడుచుండును.

సర్వసంగపరిత్యాగము జేసి సన్యస్థుఁడైన పిదప బుద్ధుఁడను పేరుగలిగెను. ఇవిగాక భక్తులు వారివారి భక్తినిఁ బట్టి సర్వజ్ఞుఁడు, సుగతుఁడు, ధర్మరాజు, తథాగతుఁడు, సమంతభద్రుఁడు, భగవా నుఁడు, మారజిత్తు, లోకజిత్తు, జినుఁడు; మొదలగు నామధేయంబుల నిడిరి. శాక్యులలో నగ్రగణ్యుఁ డగుటచే శాక్యసింహాభిదానముఁ గలిగెను. మఱియుఁ దండ్రింబట్టియుఁ దల్లింబట్టియు మఱియుఁ గొన్ని పేళ్ళుగలవు. నామకరణోత్సవమునకు నలుదెసలనుండి యెనుబదివేల మంది చుట్టములు వచ్చిరి. వారంతయు సుందరాంగుఁడైన యా బాలుం జూచి, బ్రాహ్మణులు పలికిన పలుకులు విని యాబాలుఁడు మహాచక్రవర్తియై శాక్యులఖ్యాతి దిగంతముల వెలయింపఁ జేయునని మహానందభరితులైరి. కాని యా మహానంద మంతయు రెండు దినములలో మహాదుఃఖమయ్యెను. బుద్ధునివంటి మహానుభావునిఁ గన్న యాడుఁది తన గర్భమున మఱియొకనిగనఁ గూడ, దనితలంచి యీశ్వరుఁడు దీసికొని పోయెనో యన్నట్లు మాయాదేవి ప్రసవిం చిన యేడవదివమున మృతినొందెను. శుద్ధోదనుఁడు కుమారుని నిమి త్తము దాదులు కావలిసి కోలి, కపిలవస్తు గ్రామములలో నున్న రాజబంధువుల నాఁడువాండ్ర నందఱఁ బరిశీలించి శుభలక్షణములు గలచక్కనిముద్దియల నూఱుగుర నేర్చి బిడ్డను వారికప్పగించెను.

బాలుఁడు రెండుమూఁడు నెలలవాఁడై యుండఁగా నాగళ్ల పండుగ వచ్చెను. అనఁగాఁ బ్రతిసంవత్సరము మొదట నాగళ్లతో నేల దున్నునపు డొక యుత్సవము జరుగును. ఆ యుత్సవసమయమున రాజు ప్రధానపురుషుఁడై యుండును. అప్పుడు రాజు తనకుమారునిఁ గూడ దీసికొని పోయెను. పండుగ సందడిలోఁ బనిజనులు బాలునిమాట మఱచిరి. అయినను బాలుఁడు లోకసామాన్యశిశువువలె రోదనము సేయక పద్మాసనము వైచికొని కూర్చుండి, ధ్యాననిష్ఠలో నుండెను సూర్యగతిచేత నెల్ల చెట్ల నీడలు వేఱొకదెసకుఁ దిరిగి యుండఁగా నితఁడు కూర్చుండి యుండినచెట్టునీడ రెండుజాములకుం దిరుగక యతని మహామహిమచేతఁ బ్రకృతివిరుద్ధముగా నతనికి గొడుగుఁ బట్టినట్లుండెను. ఇసుక పాతరవలె నంతకుం దఱుగని మహాద్భుతము లిట్టివెన్నో కలవు. ప్రాచీనులు కవి విశ్వాసముఁ గలిగించి యుండ వచ్చును గాని యీనాఁటివారి కవి విశ్వాసపాత్రములు కావు.

చతుర్థాధ్యాయము.

తన కుమారుఁడు మహీమండలాఖండలుఁ డగుచక్రవర్తి కావలయునని శుద్ధోదనుఁడు కోరుచుండ, నట్టి లక్షణములు గలపురుషుఁడు సంసారబంధములఁ జిక్కి సంకటములు బడు చుండక, సకల జగజ్జనవంద్యుఁ డగుబుద్ధుఁడగునని దైవజ్ఞులు నిశ్శంకముగాఁ జెప్పిరి. అదివినినతోడనె కుమారునిపై నెంతో యాసఁ బెట్టుకొనియున్న శుద్ధోదనునకునింతింతనరాని విషాదము పొడమెను. అరదంబులతో, ద్విరదంబులతో, హయంబులతో, భటచయంబులతో, గొప్పకోటలతోఁ, బా

పూదోఁటలతోఁ, గాంతాజనముతో, సాటిలేని వైభవ మనుభవించుచు సామంతనృపులు గులాములై జోహారులు సేయుచుఁ దన్నుఁ గొలువ, మూర్ధాభిషిక్తుఁడై, పసిఁడిగద్దె నెక్కి భారతవర్షమంతయు నేకచ్ఛత్రముగ నేలునట్టి దశఁ దొఱంగి ప్రియపుత్త్రుఁ డిల్లువిడిచి, యాలుబిడ్డల విడిచి సన్న్యాసి యయి భిక్షాపాత్రఁ జేతఁ బూని చెట్లనీడల నట్టడవులఁ జరియించు తలంపు మనంబునఁ దూరినయంతనే శుద్ధోదనుని పదవిలో నున్నవానికి మనోవేదన గలుగుట యక్కజము గాదు. సిద్ధుఁడగుటకంటె బుద్ధుఁ డగుటకంటె నందనుఁడు సంసారబద్ధుఁడై చక్రవర్తి యనుపేరఁ బ్రసిద్ధుఁడై యుండవలయునని శుద్ధోదనుని సంకల్పము. ఏకపుత్త్రవిషయమగుటచేత నతని విషాదము నూఱుమడుంగు లయ్యెను.

కుమారుఁడు జననమొందిననాఁట నుండియు నతని విషయమై మనంబుఁ బెంచిన సంకల్పశతము వ్యర్థ మగుననియు సకల సౌఖ్యభాజన మగు తన జన్మము దుఃఖభాజన మగు ననియుఁ దలంచి శుద్ధోదనుఁడు కుమారునకు నిరంతరము సంసారముమీఁదనే తమక ముండునట్లును, వైరాగ్యముమీఁద రోఁత బుట్టునట్లును జేయ సమకట్టి, "ఎట్టిసమయమున నాకుమారుఁడు సర్వసంగ పరిత్యాగి యగు" నని జ్యోతిష్కుల నడిగెను. నలువురను జూచిన పిదప విరాగియై పోవు నని కార్తాంతికులు చెప్పిరి. "ఏనలుగురను జూచి విరాగి యగు" నని మఱల శుద్ధోదనుఁ డడిగెను. అడుగుటయు వారిట్లనిరి. "ఒకవృద్ధునిఁ జూచి, యొకరోగినిఁ జూచి, యొకమృతిని జూచి, యొకసన్న్యాసినిఁ జూచి, పిదప నితఁడు సంసారపరిత్యాగము చేయు" ననిరి. ఆపలుకులు చెవిం బడినతోడనే కుమారుఁడు విరాగి గాకుండఁ జేయుసాధనము తనచేతఁ జిక్కెనని భావించి, శుద్ధోదనుఁ డట్టిపురుషుల నెన్నఁడేని తనకుమారుని సమీపమున రాకుండఁ జేయవలయు ననియుఁ దనకుమారునిచేత నఖిలమహీమండల మేలింపవలె

ననియు సంకల్పించి, కుమారుఁడుండుచోటికి నలుప్రక్కల శ్రద్ధాళువ లగుబంట్లను నిలిపి, వృద్ధులను, రోగులను, సన్యాసులను, శవములను దనకుమారుని సమీపమునకు రానీయ వల దని గట్టిగా శాసించెను చండశాసనుఁ డగునతనియాజ్ఞ శిరమునఁ దాల్చి, బంట్లు జాగరూకత తో మెలఁగుచుండిరి. పుత్రుఁడు నిరంతరభోగపరాయణుఁడై యుండున టుల లోకమందలి దైన్యము వానిమనోవీథిని బ్రవేశింపకుండునటుల మానవుఁ డెన్నిప్రయత్నములు జేయఁగలఁడో యెన్నిగృహములఁ బన్నఁగలఁడో యెన్నితంత్రములు నిర్మింపఁగలఁడో యన్నిప్రయత్నము లఁజేసి, యన్నిగృహములఁ బన్ని, యన్నితంత్రములు నిర్మించి శుద్ధో దనుఁడు కృతకృత్యుఁడు గాఁదలఁచెను. అంతకుముందు సుతునకు నివాసయోగ్యము లగు మూఁడుమేడలఁ గట్టించెను. ఆసౌధములలో మొదటిది తొమ్మిదియంతస్థులు గలది. రెండవది యేడంతస్థుల గలది. మూఁడవదైదంతస్థులు గలది. అంతతో నిలువక యెల్లసమ యములయందుఁ జివురుజొంపములతో సలసుగుత్తులతోఁ బచ్చనియా కులతో స్వాదుఫలములతో వెలయు నానాభూరుహంబులుగల యు ద్యానవనములనిర్మించి కుమారు నందు విహరింపఁ జేయుచుండెను కుమారుఁడు జవ్వనంబుఁ బ్రవేశించినయంతనె కోలీ రాజపుత్రికయు, సఁ దమునకు, జాణతనంబునకుఁ బేరుగాంచినదియు నగుయశోధరను సిద్ధార్థునకు వివాహముఁ జేసెను. నిరుపమానలావణ్యవతి యగుకళత్ర మునకుం దోడుగ నలువదివేలమంది నాటకస్త్రీలను భోగభార్యలుగ బుత్రునకు శుద్ధోదనుఁడు సమకూర్చెను. ఈసంఖ్య యతిశయోక్తియై యుండవచ్చునని నిశ్చయింప వచ్చును. నలువదివేలమంది గాకపోయి నను గొన్నివందలమందినైన భోగభార్యలను శుద్ధోదనుఁడు సమ కూర్చి యుండవచ్చును. ఈయాటకత్తియలు కులాంగనకు సులభసా ధ్యములుగాని హావభావప్రకటనములచేతను విశేషశృంగారచేష్ట

చేతను మనఃపారశ్యముఁ గలిగించు మృదుగానముచేతను జమత్కారసంభాషణలచేతను సీతనిమనము నిరంతరానందమగ్నముగఁ జేసి, వైరాగ్యదేవతను వారియంతఃపురముల సమీపమునకైన రానీయకుందురని శుద్ధోదనుఁడు తలంచి, యీవ్యవస్థఁ జేసియుండవచ్చును. సిద్ధార్థుఁడు దివ్యకాంతలఁబోలు నయ్యంగనలచేతం బరివేష్టింపఁబడి భూలోకస్వర్గసుఖము ననుభవించుచుండెను. శుద్ధోదనుఁడు యశోధరను సిద్ధార్థునకు ధర్మపత్నిగఁ బట్టపుదేవిగఁ జేసి కొడుకుం గోడలి వెండిపీఠముపైఁ గూర్చుండఁ బెట్టి, వారిశిరస్సులపైఁ గిరీటములఁ బెట్టి, పట్టాభిషేకముఁ జేసి, తన రాజ్యమును, సర్వాధికారమును, ధనకనకవస్తువాహనములను వారి కర్పించెను. అనంతర మతఁడు సామంతు లగుదొరలను, రాజబంధువులను రావించి, 'మీకందఱు మీపుత్రికలనుఁ దీసికొనివచ్చి, సిద్ధార్థున కుపభార్యలుగఁ జేయు' మని, శాసించెను.

అసవుడు వారు తమయేలిక యగుశుద్ధోదనున కిట్లనిరి. "అయ్యా! సిద్ధార్థుఁడు చిన్నవాఁడు. కోమలశరీరుఁడు. రాజపుత్రుఁడయ్యు నొక్కశాస్త్రమైన నేర్వలేదు. ఒక్కకళమైన నధిగమింపలేదు. ధనుర్విద్యాసార మేమో యెఱుఁగనెయెఱుఁగఁడు పగతుఁడెవ్వఁడైనఁ దనపై నెత్తివచ్చె నేని యితఁడు వాని నెదుర్కొని యెట్లుపోరాడఁ గలఁడు? మాపుత్రికల నితఁడు మానప్రాణములఁ గాపాడి, రక్షింపఁ జాలఁడు. రాజకుమారలక్షణములయం దొకటియైన లేని యీభోగపరాయణునికి మాకుమారికల నిచ్చి వివాహము జేయఁ జాలము." ఈపలుకులు సిద్ధార్థుఁడు విని, తనయస్త్రశస్త్రవిద్యానైపుణ్యము నెల్లవారికిఁ బ్రదర్శింపఁ దలఁచియావార్తలోకమున నెల్లెడ మనుజులచేఁ జాటింపఁబంచెను. సిద్ధార్థునిసామర్థ్యముఁ గనఁగోరువారందఱు రాజాంతఃపురముకడకు రావలసిన దని భటులు

చాటిరి. ప్రేక్షకుల నిమిత్తము గొప్పపందిరి వేయఁబడెను. నియమిత దినమున వేనవేలు జనులా పందిరిలో గుమిగూడిరి. లక్షయు నలువది వేలమంది చుట్టము లచ్చటఁ జేరిరి. వారు గాక యచ్చటఁ జేరినయితరజనమునకు లెక్కయే లేదు. అప్పుడు సిద్ధార్థుఁడొక విల్లు తెమ్మని యాజ్ఞాపించెను. ఆవిల్లు వేయిమందిజనులు మోసి తెచ్చిరి. ఆమహాధనస్సు సిద్ధార్థుఁడు కుడికాలిబొటనవ్రేలి గోటిమీఁద నిలిపి, కూర్చున్నచోటినుండి లేవకయె తనవ్రేలిగోటితోఁ నావింటినారి నవలీలగా లాగెను. అంతచులకనగ నతఁడు నారిలాగినను ధనుష్టంకారధ్వని బ్రహ్మాండ మంతయు నిండి సహస్రయోజన దూరము వినఁబడెను. జంబూద్వీపవాసులందఱు ప్రళయకాలమేఘగర్జనమువంటి యామహానాదము విని వర్షకాలము గాకపోయినను యిట్లు ఉఱుముటకుఁ గారణ మేమని విచారింపఁ జొచ్చిరి. అట్లు విల్లు గోటమీటి పిదప సిద్ధార్థుఁడు నాలుగరఁటిచెట్లు వరుసగా నాటించి వానిదెస నొకయమ్ము విడిచెను. ఆబాణము నాలుగరఁటిబోదెల దూసికొని యావలకుంబోయెను. పట్టపగ లనంటికంబములు దూసిపోవునట్లు బాణ మేయుటయతనికొక గొప్పకార్యముకాదు. అంధకారబంధుర మగునర్ధరాత్రమందు నయిత మతఁడు గుఱిఁ దప్పకుండఁ దలవెంట్రుక నైన రెండుముక్కలుగ భేదింపఁ గలఁడు. ఇట్లు ధనుర్విద్యాప్రావీణ్యముఁ జూపుటతోఁ దనివి నొందక సిద్ధార్థుఁడు గురువుకడశుశ్రూషఁ జేసి నేర్చుకొనక పోయినను దన కష్టాదశ శిల్పములయందుఁ గల నిరుపమానపాండిత్యమును బ్రకటించి చూపఱకు మహాశ్చర్యముఁ గలిగించెను. మనము మఱల మహిమాసముద్రమునఁ బ్రయాణముఁ జేయుచున్నాము.

విల్లు వేయిమంది మోయుటయు, దానిఁగాలివ్రేలిగోట మోపుటయుఁ, జేతివ్రేలిగోట మీటుటయు, ధ్వని సహస్రయోజన వ్యాప్తి

గుటయు, జంబూద్వీపమందరుటయుఁ గవిచాతుర్యము లని చెప్పవచ్చు ఱుంగకపోదు. గురుశిక్ష లేకయే యతఁడు ధనుర్విద్యాపారంగతుఁ డగుటయు నతిశయోక్తియే. మహాభక్తిసత్పురుషులైన కొందరు చరిత్రకారు లతనికి గురు వున్నాఁడనుట యగౌరవ మని తలఁచి గురువుం స్వైచి, సహజపండితుఁ డనిరి. మఱికొందఱు చరిత్రకారులు సిద్ధార్థునకైదుగురు గురువులుండిరని వ్రాసిరి. సుదంతుఁడను నతఁడు మొదటిగురువని కొందరు వ్రాసిరి. సుదంతుని వెనుక సుబ్బమిత్రుఁడు గురువయ్యెనని మఱికొందఱు వ్రాసిరి. శుద్ధోదనుఁడు సిద్ధార్థుని నుదకధారాపూర్వకముగ సుబ్బమిత్రున కప్పగించె నని యొకానొకరు వ్రాసిరి. ఈయుదకధారకు కర్థ మేమి? "బాలుని సంపూర్ణముగా నీ కప్పగించితిని. నీయిచ్ఛవచ్చినట్లు విద్దెలఁ గఱ్ఱు" మని శుద్ధోదనుఁడు సుబ్బమిత్రునిం గోరెనని గాని యర్థము. మొత్తముమీఁద నతఁడు గురుశుశ్రూషఁ జేసి శిల్పకళలు, ధనుర్వేద రహస్యములు నేర్చియుండవచ్చునని నిశ్శంకముగఁ జెప్పవచ్చును. ఎంత మేధావంతునైన గురుశిక్ష లేక విద్యలు తమంత రావు. అలోకసామాన్య మగు సద్విద్యాకౌశలముఁ జూచి సామంతులు, రాజబంధువులు సిద్ధార్థుఁడు సామాన్యమానవుఁడు కాఁడని తెలిసికొని తమతమకన్యల నతనికిభార్యలుగ నొసంగుట కుత్సుకులై పంపిరి. ఇదియు నతిశయోక్తియై యుండవచ్చును. సిద్ధార్థునకు యశోధర యొక్కతెయే భార్యయని యనేకులు వ్రాసిరి. గోపియనునామెయు నతని యిల్లాలే యని మఱికొందఱు వ్రాసిరి. కాని గోప యను పేరు యశోధర కపరనామమని యనేకుల యభిప్రాయము. మఱియు మనోహరయను భార్యయు మృగయ యనువేఱొకయింతియు సుభద్రశంసన యనునామెయు సిద్ధార్థునిభార్యలని కొందఱువక్కాణించిరి. కాని యివియెల్ల యశోధరకు మారుపేరులని చరిత్రకారులనేకులు నిశ్చయించిరి కావున యశోధర యొక్కతెయే సిద్ధార్థుని ధర్మపత్ని.

పంచమాధ్యాయము.

ఇట్లుకొంతకాలము గడచినతర్వాత సిద్ధార్థుఁడుగౌతముఁడొకనాఁడుద్యానవనమునవిహరింప నభిలాష వొడముటయు సారథిం బిలిచి రథమాయత్తముఁజేయుమని చెప్పెను. అట్లకాకయని యతఁడు నాలుగు గుఱ్ఱంబుల నలంకరించి తెచ్చియరదము సిద్ధముఁజేసెను, సిద్ధార్థుఁడురథమెక్కి, సుందరోద్యానమునకుఁ బయనమైపోయెను. కొంతదవ్వరిగినపిదప కడువృద్ధుఁడొకఁడతని కంటఁబడియెను. ఆముసలివాఁడు దేహమునందెంతమాత్రము దార్ఢ్యము లేమి యడుగుదీసి యడుగువెట్టలేక మిక్కిలి శ్రమపడుచుండెను. అవృద్ధునిఁజూచి సిద్ధార్థుఁడు చలితహృదయుఁడై సారథి నిట్లడిగెను. "ఓ చెన్నా! మిక్కిలి దుర్బలుఁ డగునీతఁ డెవఁడు? ఇతనికి శరీరములో రవంతమాంస మైన లేదు. ఎముకలు, నరములు పైకిఁగనఁబడు చున్నవి! దంతము లూడిపోయినవి. తల నెరసినది. నడుము వంగినది చేతికఱ్ఱ నూఁతఁజేసికొని యడు గడుగునకుఁ దడఁబడుచు నెట్టెటో నడుచుచున్నాఁడు అనవుడుసారథి యగుచెన్నఁ డిట్లుత్తరముఁ జెప్పెను. "అయ్యా! ఇతఁడు వృద్ధుఁడు. ఇతని శరీరము శిథిలమైనది. ఇంద్రియములు వికలములైనవి. ఇతఁడు దుర్బలత్వము నణేపనింజేయ జాలఁడు. ఎండుచెట్లను విహంగమములు విడిచినట్లు బంధుమిత్రులీతని విడుచుటచేత నిప్పు డసహాయుఁడై యున్నవాఁడు." అప్పలుకులువిని సిద్ధార్థుఁడు వైక్లబ్యమునొంది సారథి కిట్లనియె. "చెన్నా! ఇది యీ మందభాగ్యున కొక్కనికేసంభవించినదా లేకమనుష్యసామాన్యమునకంతకు నిట్టివయస్థ సంభవించునా? ఇందుకుఁ గారణమేమి? తద్విషయమై నేను జిజ్ఞాసఁ జేయవలయుఁ గాన సత్వరమ చెప్పుము." అని యడుగుటయు సారథి యిట్లనియె. "అయ్యా! ఇది ప్రకృతిధర్మము.

ప్రతిపురుషుఁడు ప్రతిస్త్రీ చరమావస్థలో నిట్టిదశం బ్రాపించును. మీతల్లిదండ్రులు, మీచుట్టములు, నీవు, నీప్రియురాలగు యశోధర చిరకాలము జీవింతురేని దప్పక నిట్టియవస్థ నొందవలసినదే" ఆమాటలు శ్రవణగోచరము లగుటయు "సీ! జీవనము వ్యర్థ మని రథము మరలుపు" మని సారథి కానతిచ్చి యుద్యానవనసందర్శనము మానుకొని గృహాభిముఖుఁడై పోయెను. కుమారుఁ డుద్యానవనమునకుం బయనమై కడముట్టఁ జనక మార్గమధ్యమునుండి, మరలి, యంతిపురి జేరెనని విని శుద్ధోదనుఁడు తత్కారణమేమి యని యరసి వృద్ధపురుషసందర్శనమున విషాదసంభరితచేతస్కుఁడై కొడుకు గృహాభిముఖుఁడయ్యెనని తెలిసికొని "హా! మీరు నన్ను నాశనముఁ జేయుఁదలఁచుకొన్నారు. ఈక్షణమే నాటకంబులు, నృత్యగానములు సిద్ధముఁ జేయుడు. అంగనాసహవాసము గలిగి వేడుకలం దగిలి యున్నంతసేపు మావాఁడు సంసారత్యాగముఁ జేయఁ" డని పలికెను. అనంతరము కొంతకాలమునకు సిద్ధార్థుఁడు వెండియు నుద్యానవనముఁ జూడ నభిలషించి రథమెక్కి బయలుదేఱెను. అత్తరి నొకరోగి యతనికంటఁబడెను. అతఁడు మార్గమునకుఁ బ్రక్కగా వట్టినేలం బండుకొనియెను. ఉపచారముఁ జేయుటకెవ్వరు దగ్గఱలేరు. అతనిఁ గనుంగొని రాజకుమారుఁడు రథచోదకు నిట్లడిగెను. "సారథీ! ఈతఁ డెవ్వఁడు? శల్యచర్మావశిష్టుఁడై తనమలమూత్రములలోఁ దొరలుచు మిక్కిలి బాధపడుచున్నాఁడు." అనవుడు రథికునకు సారథి యిట్లు బదులుచెప్పెను. "స్వామీ! ఇతఁడు రోగపీడితుఁడై మరణమునకు సిద్ధముగ నున్నాఁడు. ఈరోగము కుదురదు. ఎంతమాత్రమును జీవితాశ లేదు. నేఁడో రేపో యతఁడు మృతి నొందును." ఆవచనంబులు కర్ణగోచరము లగుటయు రాజకుమారుఁడు చింతాక్రాంతమనస్కుండై విన్నవదనుఁడై గిరుక్కున రథము మరలించి యంతఃపురమున కరిగెను. పిమ్మటఁ గొంతకాలమునకు

సిద్ధార్థుఁడొకనాఁడు పూఁదోఁట జూడనభ్యంతరనాయాధుఁడై మరలఁ జనుచుండ నెట్టయెదుటఁ గొందఱుమనుష్యులు శవమును మోసికొని పోవుచుండిరి. అది చూచి సిద్ధార్థుఁడు సారథినిట్లడిగెను. "ఓయీ! ఏమిది? కొందఱుమనుష్యులు మఱియొక మనుష్యుని మంచముమీఁదనైచి యేల మోసికొని పోవుచున్నారు? వెంటఁ జనుమనుష్యులేల వెంట్రుకలు విరియఁబోసికొని దుఃఖపీడితులై రొమ్ము మోఁదుకొని యేడ్చుచున్నారు?" అనవుడు "స్వామీ! మంచముమీఁదనున్న మనుష్యుఁడు మృతినొందినాఁడు. అతఁడికమీఁద నెన్నఁడుఁ దనతలిదండ్రులఁగాని యాలుబిడ్డలఁగాని బంధుమిత్రులఁగాని చూడఁజాలఁడు. అతఁడీప్రపంచమునుండి పోయినాఁడు!" అది విని రాజకుమారుఁడు నిట్టూర్పువిడిచి యిట్లనియె "సీ! వార్ధకదశలోఁ గూలఁద్రోయు నీయౌవనమేల? బహురోగభూయిష్టమగు నీశరీరమేల? భోగపరాయణుఁడైన విద్వాంసునిజన్మము వ్యర్థము వ్యర్థము." అని సత్వరంబుగ నంతఃపురమున కరిగి గొన్నిదినములదనుక నేరిం జూడనొల్లక యెవరితోఁ సంభాషింప నొల్లకయుండెను. తరువాతఁ గొన్నినాళ్ళకు సిద్ధార్థుఁడు వెండియుఁ బ్రమదావనవిలోకనకుతూహలంబు జనియింపఁ దన తేరెక్కి పోయెను. ఆసమయమున నతని కొకసన్యాసి కనఁబడెను. అతనిఁజూచి గౌతముఁడు సూతు నిట్లడిగెను. "సారథీ! ఇతఁడెవ్వఁడు కాషాయవస్త్రములు ధరించినాఁడు. ప్రశాంతభావమున నడచుచున్నాఁడు. కన్నెత్తి చూడఁడు. ఎవ్వరితో మాటలాడఁడు." అడుగుటయు సిద్ధార్థునకుఁ జెన్నఁ డిట్లనియె. "స్వామీ! ఈతఁడు సన్యాసి. బిచ్చమెత్తి బ్రతుకును. అతఁ డింద్రియముల జయించినాఁడు. ప్రపంచసంబంధము వదలినాఁడు ఆతఁడు సర్వసమానుఁడు" ఆమాటల కలరి యారాజనందనుఁ డిట్లనియె. "ఆహా! ఈయాశ్రమము నాకిష్టము విద్వాంసులీయాశ్రమమును గడుంగడుఁ బ్రశంసింతురుగదా? ఇది

మిక్కిలి సుఖప్రదమగు నాశ్రమము" అని సారథిని రథము మరలుపు మని కోరి స్వగృహంబునకుఁ జనియెను. పూర్వోదాహృతపురుష చతుష్టయంబును నిశ్చయముగా సిద్ధార్థుఁడు చూడలేఁడనియుఁ జూచి నాఁడని వ్రాయుట కవికల్పన మనియు లోకానుభవమువలనను నిరంతర తత్వజ్ఞానసవలనను గౌతముఁడు యౌవనంబు బాణవేగతుల్యం బనియు సౌందర్యంబు విద్యుల్లతవలె క్షణభంగురం బనియు శరీరము రోగభూయిష్ఠం బగుట వినశ్వరంబనియు భోగంబు లస్థిరంబులనియు సంసార మాశాప్రివర్ధకం బనియు సంసారసాగర ముత్తరించుటకు ముక్తింబడయుటకుఁ బ్రశాంతమై సంతుష్టికి నిధానంబైన సన్యాసంబే పరమసాధనంబనియుఁ దెలిసికొనెనని కొందఱుపండితు లభిప్రాయపడు చున్నారు. ఈయభిప్రాయమే నిశ్చయమై యుండవచ్చును. లేదా యట్టి పురుషు లతనికిఁ గనఁబడి యుండవచ్చును. ఉద్యానవనములనుఁ జూడఁబోయినపుడెల్ల నతనికట్టి విపరీతదర్శనములు గనఁబడుట యాశ్చర్యకరమేమైనను మనజీవితములో నప్పుడప్పుడు గతిలేనిరోగులను దిక్కుమాలినవృద్ధులను మనము చూచుచుండుటయు మనమనంబుల యందు వైరాగ్యభావములు తోఁచుచుండుటయు ననుభవసిద్ధమే. తఱచుగా నట్టిదీనులను జూచునట్టి మనకే యొక్కొక్కదీనుంజూచి నప్పుడు వైక్లబ్యవైరాగ్యములు కలుగుచుండఁగా నెన్నఁడు నిఱుపేద లను రోగులను శవములనుఁ జూచి యెఱుంగక దైన్యము విని యెఱుంగక దుఃఖము కలనైనఁ గనియెఱుంగక తారామండలమధ్యస్థుఁడగు చంద్రుఁడువలెఁ గాంతాజనపరివేష్టితుఁడై సౌఖ్యంబు లవ్వారిగఁ గాంచినరాజకుమారున కట్టిభయంకరదర్శనములు విషాదము బుట్టించుట యాశ్చర్యముకాదు. ఈకథ సరిగా నిందున్నట్లు జరుగక పోవచ్చును. కాని యట్టిపురుషుల నతఁ డప్పుడప్పుడు చూచి యుండవచ్చు నని భావించుటయు నసంభవముగాదు. కథయొక్క యాథార్థ్య మెట్లు

న్నను మనుష్యప్రకృతి లోకవృత్తమును నిరంతరము పరిశీలించుటచే నతనికి వైరాగ్యోదయ మయ్యెనన్నమాట సత్యము. భోగములు నతఁడు తుదముట్ట ననుభవించుటచేత నవి నిస్సారంబులని యతఁడు తెలిసికొని వానిపై నభిమానము విడిచి యుండవచ్చును.

షష్ఠాధ్యాయము.

ఒకనాఁడు సిద్ధార్థుఁ డుద్యానవనమున కరిగి యచ్చోట కొంతసేపుండి గృహంబునకుం బోన మిక్కిలి శృంగారింపఁబడినయానసంబు నెక్కుటకు సిద్ధముగనుండెను. బ్రాహ్మణులు స్వస్తి చెప్పిరి. గాయకులు తమతమప్రజ్ఞానుసారముగ మధురగానముఁ జేసిరి. తక్కిన వర్ణములవారు మహోత్సాహముతో నతనిచుట్టుం జేరి తమయానందమును వెల్లడించిరి. ఆసమయమున మందిరమున యశోధర కుమారుని గనియెను. వంశపారంపర్యము నిల్పుపౌత్రుఁడు జనియించినందున శుద్ధోదనుఁడు మహానందభరితుఁడై యుద్యానవనమున నున్నకుమారున కాశుభవార్త తెలియఁజేయవలసినదని బంట్ల నంపెను. అప్పుడే సిద్ధార్థుఁడు రథమెక్కఁబోవుచుండెను. శ్రవణానందకరమైన యావార్త వినఁగానే సిద్ధార్థుఁడు సంతోషపూరితమనస్కుఁడగుటకుమారు "ఇది యొకరాహులము (యాటంకము) నూతనబంధ మొకటి ప్రభవించినది" యని యతఁడు నిరుత్సాహముగఁ బలికెను. శుభవార్త దెచ్చిన యాబంట్లు తిరిగి యంతఃపురమున కరిగినపిమ్మట శుద్ధోదనుఁడు వారినిఁ బిలిచి యీవార్తవిని నాకుమారుఁ డేమన్నాఁడని

యడిగెను. సిద్ధార్థుఁడనినోట వెడలినమాటలు వారాయనకు సరిగఁ దెలిపిరి. అవి విని శుద్ధోదనుఁడు "అట్లయిన నామనుమని పేరు రాహులుఁడగు గాక" యని పలికెను. సిద్ధార్థుఁడు రథమెక్కి విచారగ్రస్తుఁడై దీర్ఘాలోచనాపరుండై యంతిపురికి వచ్చెను. కులవిస్తారకుఁడగుమనుమఁడు తమఱేని కుదయించినందుకుఁ బురవాసులు నిరుపమానందము నొందిరి. ఆనందాతిశయమున వారు రథారూఢుఁడై యేగుచున్న సిద్ధార్థుని జయజయధ్వనులుచేసి సన్మానించి తమ యానందమును వెల్లడించిరి. ఆజయజయధ్వనులలో నతనికి శ్రోత్రపర్వమైన యొకమాట వినఁబడెను. సిద్ధార్థునిజ్ఞాతియు నవివాహితయు గుణసంపన్నయు నైన కిసగౌతమి యనునామె రాజకుమారుని జూచుటకుఁ దనసౌధముయొక్క కట్టకడపటియంతస్తు నెక్కెను. ఎక్కి యాయువతి సిద్ధార్థుని శ్రీయు సాటిలేని సౌందర్యమును కన్నులంజూచికొని మిక్కిలి సంతోషించి యానందపారవశ్యమున నీక్రింది గీతము పాడెను.

కం. ఈతనయునిఁ గని పెంచిన
యాతలిదండ్రు లతిధన్యు లవనిజనులలో
నీతని భర్తఁగఁ బడసిన
యాతరళాక్షి యతిధన్య యంగనలందున్.

ఈగీతము విని రాజకుమారుఁడు తనలో నిట్లని తలంచెను. "ఏమీ! కిసగౌతమి యేమన్నది. ఇటువంటి కుమారునిఁ గన్నతల్లి ధన్యురాలా? తండ్రి ధన్యుఁడా? భార్య ధన్యురాలా? ఇదియేకదా యామె పాడినగీతములోని యర్థము. ధన్యులనఁగా సౌఖ్యవంతులు. ఆధన్యత్వ మెట్లుకలుగును? ఆసౌఖ్య మెట్లుకలుగును? చిత్తప్రశాంతి యెట్లు లభించును? ఈగీతముయొక్క పరమార్థము మిక్కిలి మధురమైనాకు ప్రబోధమును గొలుపుచున్న" దని చర్చించి లక్ష

వరహాలు విలువగల హారమును దనమెడలోనుండి తీసి యామెకు కానుకగఁబంపెను. ఆకానుక నందుకొని మిక్కిలి సంతసించి సిద్ధార్థుఁడు నామీఁద వలపునిలిపియుంచెను. లేకున్న నీహార మెందు కంపునని యామె తలంచెను. కాని సిద్ధార్థుఁడామెను మరల చూడలేదు. అనంతరము సిద్ధార్థుఁడంతిపురి కరిగెను. మందిరంబున సుష్ఠు సుఖాసీనుఁడైన పిదప నానావిచిత్రాంబరంబులు గట్టి యథోచితాలంకారములు గైకొని చక్కదనంబున నచ్చరలేమలను మించుమించుబోఁడులు హస్తముల వీణియలు దాల్చి మనోజ్ఞమగు గానముఁ జేసి నృత్యంబులు చేసిరి. కాని సిద్ధార్థునిమనస్సు పరాయత్తమై యుండుటచే నతఁడు మునుపటివలె గానమున కలరక నృత్యంబు నెదమెచ్చక నిద్రవోయెను. నిద్రితుఁడైన యాతనిఁ జూచి యావిలాసవతు లిట్లనుకొనిరి. "ఎవనినిమిత్తము మన మీ నృత్యగానంబులు నెఱపుచుంటిమో యతఁడు నిద్రవోయెను. మనము కూడ నిద్రవోవుదము" అని తమవీణియలు నేలఁబెట్టి పండుకొనిరి. అర్ధరాత్రమున సిద్ధార్థునకు మెలఁకువ రాఁగా నతఁడు మేలుకొని కూర్చుండెను. సుగంధతైలపూరితములైన దీపములు మిక్కిలి ప్రకాశించుచుండెను. ఆదీపముల వెలుఁగున నతఁడు నిద్రించుచున్న యా యంగనలఁ జూచెను. ఆసందర్శన మతని కెంతో నేవయు విరక్తియుఁ గలిగించెను. అతఁడు చూచునప్పటి కాయంగనలు క్రమము లేక గదిలో నిచ్చటచ్చటఁ బడుకొనిరి. వారికొప్పులు విడిపోయెను. తలవెండ్రుకలు చెదరియుండెను. కొందఱి శరీరముల వస్త్రములు తొలఁగెను. కొందఱు నోళ్లు తెఱచిరి. కొందఱు పలువరించిరి. కొందఱు పండ్లుకొఱుకసాగిరి. కొందఱినోట చొంగ కారెను. కొందఱావులించిరి. కొందఱు లోలో నేమో గొణుగుకొనిరి. అంతకుమున్న తఁడు చూచినపు డాయంగనలు సింగారించుకొని లోపంబులఁ గప్పిపుచ్చుకొని బంగారుబొమ్మలట్టుల మెఱుపు

దీఁగలట్లు నయనోత్సవము జేసిరే కాని యీవిధముగ విలక్షణములతో వికృతచేష్టలతో ననహ్యారూపములతో ననుచితవేషములతో నతనికిఁ గనంబడలేదు. అలంకారములు లేని సహజరూపముతో నతఁ డంగనలం జూచుట కదియె మొదటిసారి. మోహపరవశుఁడైన కాలమున నంగనలు సమ్మోహనాస్త్రములట్లు కనంబడుదురు. కాని వారినిజస్వరూపములు చూచినప్పుడు కన్నులు కన్నులే కాని కలువరేకులు కావనియు, శ్రవణంబులు శబ్దగ్రాహకములగు నింద్రియములే కాని చక్కిలంబులు కావనియు, నధరంబులు పెదవులే కాని దొండపండ్లు కావనియు, కురులు తలవెండ్రుకలే కాని గండుతుమ్మెదలు కావనియు, నాసిక యుచ్ఛ్వాసనిశ్వాససాధనమైన యవయవములే కాని సంపెఁగపువ్వు కాదనియు శరీరము తోలుతిత్తియె కాని కనకలత గాదనియుం బరీక్షయగు తత్త్వవేత్తకుం దోఁచ నపోను. ఎంతో మనోహరమైన స్త్రీరూపభవనమతనికంటికిఁ బీనుఁగుపెంటవలె గనఁబడెను. మోహమయమైన యీప్రపంచమునజీవించుటనాలుగుచూరులంటుకొన్నయింటనుండుట యని యతనిమనస్సునకు దట్టెను. ఆయసహ్యదర్శనానంతరమున నతనినోట నప్రయత్నముగ నీక్రిందిమాట వెడలెను. "ఇదియెల్ల నన్ను వేధించుచున్నది. ఇది దుస్సహముగ నున్నది." ఆపలుకులు వెడలినతోడనె యతఁడు దిగ్గున లేచి ద్వారము కడకుఁబోయి యెవఁ డక్కడ యని కేకవైచెను. ప్రక్కగదిలో నిద్రించుచున్న చెన్నఁడు మేలుకాంచి "స్వామీ! నేను చెన్నఁడ"నని బదులుచెప్పెను. అతనికి సిద్ధార్థుఁ డిట్లనియె. "చెన్నా! నేను సంకల్పించిన సర్వసంగపరిత్యాగము నేఁడు చేయుటకు నిశ్చయించితిని. నీవువైచి రేయొకగుఱ్ఱమును దిసికొనిరా." అట్టిప్రయత్నము వలదని చెన్నఁ డతనితోఁ జెప్ప మొదట యత్నించెను. కాని, సిద్ధార్థునినిశ్చయముఁజూచి యాతనితో వాదము సేయుట నిష్ప్రయోజనమని తెలిసికొని తిన్నగా గుఱ్ఱాలసాలకుఁ బోయి తాను గొంపోయిన దీపపు

వెలుఁగున సాలలో నొకమూల నిలిచియున్న కంటక మను హయరత్నముఁ జూచెను. ఈగుఱ్ఱమునకు నేఁ జీనువై వవలయునని నిశ్చయించుకొని దానిపై జీను పఱచి సిద్ధముచేసెను.

సిద్ధార్థుఁడు గృహమును ధర్మపత్నిని నందనుని సకలసౌఖ్యములను విడిచి సర్వసంగపరిత్యాగముఁ జేసి కాననాంతరముల కరుగుటకుఁ గారణ మే మని మనము విచారింపవలెను. వృద్ధపురుషుని, జాడ్యపీడితుని, శవమును, సన్న్యాసినిజూచినంతమాత్రముననె యట్టివైరాగ్యముదయించి యుండునా? అనుదినము, నెందఱున్వృద్ధుల విలోకించుటలేదు? జాడ్యపీడితులఁ జూచుటలేదు? శవముల నవలోకించుటలేదు? సన్న్యాసుల సందర్శించుటలేదు? అందఱకు నట్టిచిత్తవిక్షోభము గలిగినదా? కలుగుటలేదు. అది కానియెడల కిసగౌతమి పాడినగీత మతని మనస్సును విరక్తిమార్గమునకుఁ ద్రిప్పియుండునా? ఆగీత మెందఱు విని యుండలేదు. ఆగీతము విన్నవారికందఱకు వికారము గలిగించెనా? నిద్రితలైన యంగనల వికృతచేష్టారూపములఁ జూచినప్పుడతనిమనస్సు మాలిన్యరహితమై రాగపరాఙ్ముఖమైన దందురా? అదియొక్కటె యంతబలమైనకారణముగాదు. అట్లైన నేది బలతరమైనకారణమై యుండును? అతఁడు ప్రకృతిచేతనే తత్త్వజిజ్ఞాసుఁడై యుండును. అటమీఁద నాకాలమునందు లభ్యములైన శాస్త్రవిద్యలు, కళలు నతఁడు నేర్చియుండును. గౌతమన్యాయసూత్రములు, కాణాదునివైశేషిక సిద్ధాంతములు సిద్ధార్థుఁడు చదివియుండవచ్చును. కపిలుని నిరీశ్వరసాంఖ్యము, పతంజలివిరచిత సేశ్వరసాంఖ్య మనియెడు యోగశాస్త్రము మొదలగు తత్త్వవిచారణగ్రంథములయందు సిద్ధార్థునకుఁ బ్రవేశము గలిగియుండును. సహజముగా జిజ్ఞాసపరాయణమైన మనస్సు సాంసారికదుఃఖవిమోచనార్థమయి విశ్వహితకారులగు మహాత్ములచేత రచియింపఁబడినతత్త్వశాస్త్రసిద్ధాంతములతోఁ గలిగినప్పుడు వానికలయిక

చేత వైరాగ్యబీజములు మొదట సముత్పన్నములు కావచ్చును. ఆబీజములు వృద్ధపురుషాదిసందర్శనమువలనఁ గ్రమక్రమముగఁ బెరుగ వచ్చును. కిసగౌతమీగానము కాంతలవికృతరూపవేషసందర్శనము వెంటనే ఫలముగలిగించుదోహదములై యుండవచ్చును. విరక్తిమార్గమునఁబడినమనస్సునకు దృష్టిగోచరమగుప్రతిపదార్థమునందును శ్రవణగోచరమగు ప్రతిగీతమునందును నేదో యొకవిశేష మున్నట్లు తోఁచుచుండును. మన కొకనిమీఁద ద్వేష మున్నపుడు వాఁడు మంచి యుద్దేశముతోఁ బలికినపలుకులు సయితము ద్వేషమును గ్రక్కుచున్నట్లు మనకు తోఁచవచ్చును. కామమోహితునకుఁ దనప్రేయసిచేసిన పనులెల్ల శృంగారచేష్టలుగానె తోఁచవచ్చును. ప్రపంచ మంతయు నీశ్వరమహిమ యని తలంచువానికిఁ బ్రతిస్వల్పవస్తువునందు నీశ్వర చైతన్యము నీశ్వరకారుణ్యముఁ గానఁబడుచుండును. నాస్తికున కట్టి చైతన్యాదులు కనఁబడవు. అట్లె మొదటి జిజ్ఞాసువై ప్రపంచము యొక్క పౌర్వాపర్యములు విచారించువానికి మొట్టమొదట నది వినశ్వర మని తోఁచును. అది తోఁచిన తరువాత రోగము, వార్ధకము మొదలగునవస్థలకు లోనై మరణమే పరమావధిగాఁగల యీశరీరము శాశ్వతము కాదనియు శరీర మనుభవించుభోగము లన్నియుఁ బరిత్యాజ్యములనియుఁ దప్పక తోఁచును. క్రమక్రమముగ వానిపై నేవ పుట్టును. నాశనము లేక స్థిరమయి శాశ్వతమయియుండు పదార్థమును వెదకుట కిష్టము పుట్టును. మును పెంతో ప్రేమాస్పదులై పంచప్రాణములకంటె నెక్కుడుప్రియములై తోఁచినకళత్రసంతానాదికము తన కాప్తవర్గము కాదనునూహ పుట్టును. వేసఁగి బీరెండచేత మిక్కిలి శుష్కమయి యున్నసమిధలను రవంతయగ్నికణమే ప్రజ్వలింపఁజేయునట్లు చిరజిజ్ఞాసచేఁ బరిపక్వమయినయతని మనస్సునఁ గిసగౌతమీగానము, వెలఁదుల వికృతరూపదర్శనము మున్నగునవి నిమిత్తమాత్ర

ములై మహావైరాగ్యోదయమును గలిగించెను. ఒకకారణముతో మఱియొక కారణముచేరి బలపడి యతనికి వైరాగ్యము వృద్ధిచేసెను. సిద్ధార్థుఁడు బుద్ధుఁడైన తరువాత నీవిషయమును యతఁడొకనాఁడు శిష్యులతో నిట్లు ప్రసంగించెను. "శిష్యులారా! నాకుఁ గావలసినంత ధనముండెను. నేను మహావైభవముతో జీవించుచుంటిని. అప్పుడు నాలో నీతలంపులు తోఁచెను. తనశరీరముగూడ వార్ధకావస్థకు, దౌర్బల్యమునకు లోనైయున్నదని తెలిసియు నొకఁడు ముసలివాని జూచినప్పు డేలభయపడి గోతం జెందవలయునో యాగోత్రకొంతకాల మయినతరువాతఁ దనమీఁదనె పడునను మాట నెఱుఁగఁడా? నాశరీరము వినశ్వర మయినదే. నాకును ముసలితనము రాక మానదు. అట్టియెడ నేను మఱియొక ముసలివానినిఁ జూచి వెఱగొందుట న్యాయమా? నేనీవిధముగ విచారము చేసినకొలఁదిని యౌవనమునకు సహజ మయిన యుల్లాసము నామనమునుండి పోయినది. ఇట్టివిచారము నేను చేయుచున్నపుడు జీవితమునందుండవలసిన చైతన్యము నశించినది."

పూర్వోదాహృతములగు నుపన్యాసమునఁబట్టి సిద్ధార్థునకు వృద్ధపురుషసందర్శనాదికముచే ప్రగాఢవైరాగ్యకారణములు కావనియు యతనిమనస్సుముందే జిజ్ఞాసమహావాయుప్రేరితమయి మితిమీఱినసంక్షోభముఁజెంది యుండెననియు నతని వైరాగ్యము చిరజిజ్ఞాసాఫల్యము కాని తాత్కాలికహేతుప్రేరితము కాదనియు మనము తెలిసికొనవచ్చును. దీనింబట్టి కిసగౌతమీగానము మొదలగునవి లేవని నిరాకరించుట లేదు. అవి శుష్కేంధనమును దరికొల్పు తాత్కాలిక కారణవిస్ఫులింగములని యిదివరకె చెప్పియుంటిమి. ఇల్లువాకిలివిడిచి యాలుబిడ్డలవిడిచి సంసారపరాఙ్ముఖుఁడై సన్యసించినవారిలో సిద్ధార్థుఁడె మొట్టమొదటివాఁడు కాఁడు. సంసారసంబంధమగు గాఢనిద్రనుండి మేల్కాన్న వారదివఱకనేకులు కలరు. జ్ఞానచంద్రికలచేతనజ్ఞానాంధకా

రముఁబటాపంచలుగఁదోలినమహానీయులనేకులు కలరు. ఇందుకుమనపు
రాణములలోననేకోదాహరణములున్నవి. మహారాజకుమారులనేకులు
పిత్రార్జితమయిన రాజ్యమునువిడిచి తపోనిరూఢులై యరణ్యముల
కరిగినట్లు మనపురాణములలో నెన్నోచోట్లఁ జదువుచుందుము. శంత
నునియన్నయైన దేవాపి తండ్రికి జ్యేష్ఠపుత్రుఁడయ్యు రాజ్యకాంత
విడిచి తపోవనంబున కరిగెను. దేవవ్రతుఁడైన భీష్ముఁడు తండ్రియభి
మతముఁ దీర్చుటకుఁ దాను వివాహమును మానుకొని రాజ్యము
విడిచెను. ఇట్టివనేకములు కలవు. అవియెల్ల సిద్ధార్థుఁ డెఱిఁగి యుం
డెను. అందుచేత వైరాగ్యోదయ మగునప్పుడు వివేకులెట్లు నడిచిరో
యట్లే నడువ వలయు నని కృతనిశ్చయుఁడై సంసారశృంఖలాచ్ఛేదన
మునఁ గానిమనోరథసిద్ధిగాదని యతఁడు గృహమునుండి వెడలఁ దలఁ
చెను. భోగములు విడిచి యోగసక్తులై సన్యాసులైనవా రతనికి
ప్రాచీనులలోనె గాక సమకాలికులలోఁ గూడ నుండిరి. ఆయాచార
మె యతఁ డవలంబించెను.

సప్తమాధ్యాయము.

అశ్వముం దోడితెచ్చుటకు సేవకుఁడగుఛన్నుఁడులాయమునకుఁ
బోయి యున్నసమయంబున సిద్ధార్థుఁడు తనయిల్లాలినిఁ గుమారు
నిఁ గట్టకడపటిసారి మనసారఁ జూచికొన వలయునని బుద్ధిపుట్ట యశో
ధర పండుకొన్న గదికడకుఁ బోయి తలుపు నిశ్శబ్దముగఁ దెఱచి
చూచెను. ఆమె పువ్వులపాన్పుపైఁ బండుకొని పిల్లవానిపైఁ జేయి
వైచికొని గాఢముగ నిద్రించుచుండెను. ఒకసారి బాలకు నెత్తుకొని

ముద్దాడవలయునని కోరిక యతనికి జనించెను. కాని పిల్లవానిం దీసికొనుటకై యతనిమీఁద నున్నయామెచేయి తొలఁగింపవలెను. హస్తము తొలఁగింపఁబడెనా యశోధర తప్పక మేల్కొనును. మేల్కొనెనా యామె లేచి బాష్పపూరితనేత్రయై పాదములపైఁ బడి తన్ను విడిచి పోవలదని ప్రార్థించి హృదయము కరగించి యుద్యమము మాన్పింపక పోదు. అందుచేత నతఁడు లోని కరుగక గుమ్మముమీఁద నిలిచి తనసంకల్ప మేమో యెఱుఁగక నిండువిశ్వాసముతో నిర్మల హృదయముతో నిసువుపైఁ జేయి వైచికొని నిదురించు చున్నయిల్లాలిని, దండ్రిని యెఱుఁగక తండ్రియుద్యమ సంకటములన్ని యెఱుఁగక కన్నులైనఁ దెఱవక పొత్తిళ్ళలోఁ బండుకొని యున్న పసిపాపను గట్టకడపటిసారి కన్నులకఱవుఁదీర మనస్సంతుష్టిగఁ జూచి వెనుక కుమారరవి యంతఃపురచతుష్కమునకుఁ బోయెను. పోవునప్పటికిఁ జెన్నుఁడు కంటకమను హయమును పల్యాణంబు వైచి సిద్ధము చేసి తెచ్చెను. తెచ్చుటయు సిద్ధార్థుఁడు కృతార్థుఁడై మనోరథ మెక్కినట్లు యాతురంగము నెక్కి యర్ధరాత్రమున జనమంతయు నిద్రాపరవశమై యున్నపుడు పట్టణమును విడిచి పోయెను. చెన్నుఁడును మాత్రమతనిని విడువక వెంటఁ బోయెను. అనోమానదీతీరమునకుఁ బోవువఱకు నతఁడు మార్గమధ్యమున నెచ్చట నాఁగలేదు. అక్కడ కరిగినతరువాత నతఁడు తనశరీరమందున్న సకలాభరణములును గుఱ్ఱమును జిరకాలమునుండి తన్ను గొలుచుచున్న ప్రియసేవకుఁడగు చెన్నునికిచ్చి పురంబునకుఁ బొమ్మని వానిఁ గానతిచ్చెను. కాని చెన్నుఁడు యజమానునకుఁ దగినసేవకుఁడౌ కనుక సంసారత్యాగముఁ జేసి సిద్ధార్థునకు శుశ్రూష జేయఁ గోరి తనయభిమత మెఱిఁగించెను. సిద్ధార్థుఁడు వానికోరిక మెచ్చి యది సమయము కాదని చెప్పి కాలాంతరమున వానిమనోరథసిద్ధిఁ జేయుట కొడంబడి యప్పుడు తప్పక పురంబున కరుగు మని నొక్కి చెప్పెను.

చెన్నఁడందుకు సమ్మతించెను. చెన్నఁడు ప్రయాణోన్ముఖుఁడైన పుడు సిద్ధార్థుఁడు వానితో నిట్లనియె. "చెన్నా! నీవు పోయి మాతండ్రి శుద్ధోదనునితోడను మాతల్లియైన ప్రజాపతితోడను నాభార్యతోడను బురజనులతోడను నేను సన్యాసినైతి నని చెప్పుము. నావిషయమై విచారింపవలదని పలుకుము."

అప్పలుకులు విని జాలిగుండె గల చెన్నఁడు వెక్కి వెక్కి యేడ్చెను. సిద్ధార్థుఁడు వాని నూరడించి ధైర్యము చెప్పి బుజ్జగించి పట్టణమున కంపెను. చెన్నఁ డేడ్చుచుఁ బోయెను. అనంతర మారాజకుమారుఁడు తనచేతిఖడ్గముతో శిరోజములు ఖండించుకొని దారిం బోవుచున్నయొక పేదవానికి విలువ గలతనయుడుపుల నిచ్చి వాని కడనుండి పేదబట్టలు గ్రహించి యవి దాల్చి సన్యాసియై మగధదేశ రాజధానియైన రాజగృహం బనునగరంబునకుఁ బోవ సాగెను. అప్పటి కతనిమనస్సు ప్రశాంత మయ్యెను. ఆగర్భశ్రీమంతుఁడై నయతనికి వైరాగ్యోదయ మైనతరువాత ప్రత్యేకసన్యాసము స్వీకరించువఱకు గృహము కారాగృహ మయ్యెను. చంద్రశాలలు చెఱసాలలయ్యెను. కాంతాసక్తి నశించి ముక్తికాంతాసక్తి మనంబున నుదయించెను. పూలపాన్పుమీఁద రోఁత వొడమి రాలసెజ్జలపై భ్రాంతి వొడమెను. మనోహరములగు సుందరోద్యానవనములు సింహశార్దూలాదిఘాతుక మృగసంకులము లగుమహావనముల ట్లతనికంటికిఁ బొడకట్టెను. నయనోత్సవము లగు నంగనల మొగములు పిశాచ వదనము లై యతనికేవ గలిగించెను. అంగనలదీర్ఘశిరోజములు పరిశుద్ధమనంబును బంధించునినుపసంకెళ్ళవలె నతనికిఁ దోఁచెను. మెత్తనియాసనంబులమీఁదఁ గూర్చుండినను ముండ్లమీఁదఁ గూర్చుండిన ట్లతనిమనస్సు పరితాపము నొందఁ జొచ్చెను. హృదయాకాశమున దేదీప్యమానప్రభలకోడ జ్ఞానసూర్యోదయ ముదయించినపిమ్మట నట్టి తేజఃపుంజము ముందర

నజ్ఞానాంధకారము నిలువ లేక పంచబాగాళ మయి పరుగులెత్తిన తరువాత, మనం భాశాబంధనములను ద్రెంచినతరువాత, సంసార స్నేహరజ్జువులు తెగినతరువాత హారంబులు భారంబు లగుట కీరంబులు కూపరంబు లగుట సుఖములు పాపసఖము లగుట నగలు పగ లగుట యాశ్చర్యము కాదు. ఎప్పుడు కపిలవస్తునగరంబు విడుతు, నెన్నఁడు రాజ్యపరిత్యాగము సేతు, నెన్నఁడు దారపుత్రుల విడిచి దూరము పోదు, నెన్నఁడీ మేడలుమిద్దెలు విడిచి హాయిగ నట్టడవులఁ జెట్లనీడలఁ దపముచేసికొందు నని యతనికిఁ దలంపులు తోఁచెను కాని పురంబున నుండవలయు నని దారపుత్రులతో సుఖంప వలయు నని రాజ్యమేలవలయు నని తలంపాయనకు జనింపలేదు. ఆయన కప్పుడు వెనుకటిచుట్టములు చుట్టములట్లు తోఁచ లేదు. జటాధరు లైనయోగులు తపోధను లైనమహర్షులు శిరోముండనముఁ జేసికొన్న సన్యాసులు దగ్గరచుట్టములైరి. పర్వతగుహలు ప్రియమందిరము లయ్యెను. కొండ లున్నత సౌధము లయ్యెను. జగద్విజయార్థమయి యాశలు జయించి కోరిక పోయి యింద్రియజయార్థమయి యాశలుజయించు కోరిక బలమయ్యె. బాహ్యశత్రువర్గమును జయించుటకంటె నంతశ్శత్రువర్గమును జయించుట ప్రధానకర్తవ్య మని యతఁడు తెలిసికొనెను. అట్లు తెలిసికొని చిరకాలమనోరథ మయినసన్యాసాశ్రమము నధిగమించి వనంబులు వసతులుగ, మఠంబులు మందిరములుగ, వృక్షచ్ఛాయలు విలాస భవనంబులుగఁ బండ్లు దుంపలుఁ గాయ లాహారములుగ నిర్మలనదీజలంబులు పానీయంబులుగ విశ్వప్రపంచ మిల్లుగ మానవకోటి భ్రాతృవర్గముగఁ బరమతపోధనులు గురువులుగ జీవితశేషంబు నతఁడు గడపఁ దలంచెను. అతఁడప్పుడు హాయిగ నూపిరి పుచ్చుకొనెను. గృహము వెడలివచ్చి సన్యసించినపుడు సిద్ధార్థుఁడు తానే బుద్ధుఁడై జగద్గురువై యుండవలసివచ్చునని యెన్నఁడెఱుంగఁడు. కామక్రోధంబుల

జయించి యింద్రియంబుల నిగ్రహించి తపంబుచేసి మోక్షమార్గము కనుఁగొనవలయు నని యితనియభిప్రాయము. వార్ధకమునకు రోగము నకు వశము కానియవస్థలో నుండవలయు నని యతనియాశయము. సంసారబంధములం దెగ్రెంపి సుఖించు తెరవు గనుఁగొన వలయు నని యతని సంకల్పము.

సిద్ధార్థుని కాలమున మగధ రాజ్యమునకు రాజధాని రాజగృ హం బనునగరము. మగధరాజ్యము పాండవులకాలమునుండియు మిక్కిలి బలిష్ఠ మగునరాజ్యమని మహాభారతమువలన మనము తెలి సికొనవచ్చును. భారతకాలమున బృహద్రథనందనుఁ డగు జరాసం ధుఁడు మగధరాజ్యమును బాలించు చుండెను. అతనికాలమున గిరి వ్రజమనుపురము మగధకు రాజధానియై యుండెను. గిరివ్రజమనఁగాఁ బర్వతములగుంపు. ప్రకృతి కట్టినరాతికోటవలె నున్న పర్వతము లైదు పురముచుట్టు నుండుటం జేసి యూపీఁటికి గిరివ్రజ మనుపేరు కలిగె నని పురాణజ్ఞులు వచియింతురు. గోరథము, ఋషభము, వైహారము, ఋషి గిరి, చైత్యకము, ననునవియ యాయైదుగిరులు. పూర్వపు గిరివ్రజమే సిద్ధార్థునికాలమున రాజగృహం బను పేరం బఱఁగెనని కొందఱియభి ప్రాయము. గిరివ్రజముకాలక్రమమునఁ బాడు పడిన దనియు దానిస మీపమున రాజగృహం బనుపట్టణము నిర్మింపఁబడిన దనియుఁ గొంద ఱియభిప్రాయము. మౌర్యులు మగధరాజ్యము నాక్రమించినప్పుడు రా జధాని రాజగృహమునుండి పాటలీపురమునకు మార్పఁబడియెను. రాజ గృహము నేఁటికను రాజఘర్ నామమున విహారదేశమున విహారపట్టణ మునకు నెనిమిదిక్రోసులదూరమున నున్నది. దీనిచుట్టుపట్ల ననేకక్రోశ ములవఱకుఁ బాడుపడినచోటులు విశేషముగఁ గన్పడు చుండును. వా నింబట్టి పూర్వమిది మహోన్నతదశలో నున్న గొప్పపట్టణ మని యూ హింపవచ్చును. ఫాహియా నను చీనాదేశస్థుఁడు భరతఖండమునకు

వచ్చి చూచినప్పుడు రాజగృహము పాడుపడి జనశూన్యమయి యుండెను. ఇప్పుడు జనసమేత మయిన చిన్న గ్రామముగ నున్నది. హిందువులకు జైనులకు నిది పుణ్యక్షేత్రమయి యున్నది. అందు జైనులనేక దేవాలయములు నిర్మించిరి. మగధదేశ మిటీవల విహారదేశమను పేరం బఱగి యిప్పుడు బీహారను పేర వ్యవహరింపఁబడుచున్నది.

అష్టమాధ్యాయము.

ఆకాలంబున మగధదేశమునకు బింబిసారుఁడను నతఁడు రాజు. సిద్ధార్థుఁడు రాజధాని యగు రాజగృహంబునకుఁ జనియెను. ఆనగరంబున కరుగుటలో నతని యుద్దేశ మచ్చట సుఖజీవనము జేయుటకాదు. ఆనగరోపాంతమున నున్న పంచపర్వతములమీఁద జ్ఞానలతల కాలవాలము లని చెప్పఁదగిన విద్వాంసులు బ్రాహ్మణు లనేకులు నివసించుచుండిరి. వారి నాశ్రయించి జ్ఞానము సంపాదనము జేయు వలయు నని యతఁడు సంకల్పించి వచ్చెను. పురప్రవేశము జేసినతోడనె వందల కొలఁదిజను లతనిచుట్టు మూఁగిరి. బూడిదలోఁ బొలిపినను రత్నము ప్రకాశించుచునే యుండును. అట్లే సన్యాసివేషములో నుండినను సిద్ధార్థునిశరీరమునందు ప్రతిభాగము రాజకళల నీనుచుండెను. అతనిం జూచి జనులు "తప్పక యితఁ డింద్రు" డని యొండొరులతోఁ జెప్పుకొనిరి. "కాదు. కాదు. ఇంద్రుఁడైనయెడల నైరావత మేది. వజ్రాయుధ మేది. ఇతఁడు మహాబ్రహ్మ" యని కొందఱనిరి. ఎవఁడో దివ్యపురుషుఁడు పట్టణమునకు వచ్చి యున్నాఁ డనిభావించి పౌరులావార్త రాజున కెఱింగించిరి. రాజు సిద్ధార్థునిజూడవచ్చి యతని

రూపలేఖవిలాసముల కచ్చెరువడి నీ వెవఁడ వని యడిగెను. సిద్ధార్థుఁడు తనపూర్వాశ్రమవృత్తాంతము నెఱిఁగించుట కిష్టము లేక "యయ్యా! నేనొకభిక్షుకుఁడ" నని బదులు చెప్పెను. "నాయంతిపురమునకురమ్ము కావలసినంతద్రవ్యము నీకిచ్చెద" నని రాజు పలికెను. సమస్తద్రవ్యము వదలివచ్చిన వానికి మరల ద్రవ్య మెందుకు. రాజుకోరిక నిరాకరించి సిద్ధార్థుఁడు రాచనగరమునకుఁ జనక తత్సమీపమందున్న గిరులకరిగి యందున్న బ్రాహ్మణులలో నగ్రగణ్యుఁడైన యలరుండనువానికి శిష్యుఁడై యతఁడు నేర్పఁగలవిద్య యంతయు నేర్చెను. ఆవిద్యయతనికి సంతుష్టి నొసంగనందున నుద్రకుఁడను మఱియొక బ్రాహ్మణునాశ్రయించెను. ఉద్రకుఁడు సిద్ధార్థునకు వేదవేదాంతశాస్త్రములు తక్కినదర్శనములు సమగ్రములుగ నేర్పెను. ఆతత్త్వశాస్త్రములుగూడ సిద్ధార్థునికి సంతుష్టి నొసంగఁజాలనయ్యెను. అప్పుడతఁడు జ్ఞానకాండమునువిడిచి తపఃకాండ ముపక్రమింపఁ దలఁచెను. ఆకాలంబున సంసారవిముఖులైన మహాపురుషు లనేకులు బ్రహ్మచర్యదీక్షాధురీణులై దారపుత్రపరిత్యాగులై పరమతపోనిరూఢులై సింహశార్దూలాదిఘాతుకమృగాకీర్ణంబు లగువనంబులకరిగి తపంబులఁ జేయు చుండిరి. కొందఱు జటాధరులు, కొందఱు శిరోముండనప్రియు లగు సన్యాసులు, కొందఱు కాషాయాంబరధారులు, కొందఱు దిగంబరులు, కొందఱు నిరాహారులు, కొందఱువాయుభక్షకులు, కొందఱు జలభక్షకులు, కొందఱు కందమూలాశనులు, కొందఱు పర్ణాశనులు, కొంద ఱూర్ధ్వబాహులు, కొందఱు పంచాగ్నిమధ్యస్థులు, కొందఱు కంటకశయ్యాగతులు నై ఘోరతపంబు చేయుచుండిరి. అట్టితపోనియమము దానుగూడ వహించి శరీరముశుష్కింపఁ జేసి యింద్రియంబులపొగ రడంచి దివ్యజ్ఞానమును నమానుషశక్తులను బడసి తద్ద్వారమున ముక్తుఁడు గావలయు నని సిద్ధార్థుఁడు సంకల్పించి యు

రువేలుమహావనంబున కరిగెను. ఈవనమిప్పుడు బుద్ధగయకు సమీపమం దున్నది. ఆవనంబున కరిగి యతఁడు భయంకర నియమంబులఁబూని యాఱుసంవత్సరములు ఘోరతపంబు చేసెను. అతనిశరీరము శుష్కిం చెను. రక్తమాంసము లెండిపోయెను. ఆతపము జేయునపు డతని యొద్ద నైదుగురుశిష్యులు చేరిరి. ఆమహాతపము వారికిఁగూడ వెఱపు బుట్టించెను. ఒక్కకబళమాహారముకన్న నెక్కువతినఁగూడ దనుకొని నియమము జేసికొని దేహమునకు బల మిచ్చుపదార్థము లెల్లవర్జించి జలము మొదలగు దుర్బలపదార్థములను భుజించుచుశుష్క దేహుఁడ య్యెను. అందువలన నేనుఁగుబలముగల యతఁడు లేచినిలువఁ బడఁజాల కపోయెను. శరీర మంతయు నల్లబడెను. అతని మేన మున్ను కనఁబడు చువచ్చిన ముప్పదిరెండు కల్యాణలక్షణము లదృశ్యము లయ్యెను. ఎట్టకేల కొకనాఁడు రాత్రి తెల్లవాఱుజామున శరీరదౌర్బల్యముచేత న తఁడుమూర్ఛిల్లెను. అప్పుడతఁడు తపంబువలనను దేహశోషణాదిఘోర కర్మంబులవలనను బ్రయోజనము లేదని తెలిసికొనెను. ఈతపంబులవ లన దనజీవితమున నాఱుసంవత్సరములకాలము వ్యర్థమయ్యె నని. యుమహాతపశ్చరణానంతరమున సయితము తప మారంభింపకముందు దానెట్టిస్థితిలో నుండెనో యట్టిస్థితిలోనే యుండవలసివచ్చె ననియున తఁ డెఱిఁగెను. తపశ్చరణము వలన మోక్షము లేదని యతఁడు భావిం చెను. అతఁ డన్నము లేక చావునకు సిద్ధమైయున్న యాసమయమున నొకపల్లెటూరికాఁపువానికూఁతురు సుజాతయనునది యాతని కన్నము బెట్టి ప్రాణము నిలిపెను. ఆమె చేసినయుపకారము సిద్ధార్థుఁడుజన్మాం తరమువఱకు మఱువ లేదు. మరణసమయమున సయితముసిద్ధార్థుఁ డామెచేసిన యుపకారమును స్మరించి సుజాతపెట్టినయన్నముఁ దిన్నత రువాతఁ దనకుబుద్ధత్వము సంప్రాప్తించినందున నామె పెట్టినయన్న మే యన్నమని కొనియాడెను. కొంచెము దేహదార్ఢ్యము కలిగినత

రువాత సిద్ధార్థుఁడు ఘోరతపంబులు మాని వెనుకటివలె సన్యాసియై కాషాయాంబరములు భిక్షాపాత్రము ధరించెను. శుశ్రూషఁ జేయుచున్న శిష్యు లైదుగురు "సిద్ధార్థుఁడు ధర్మపథభ్రష్టుఁడై చెడిపోయినాఁడు. నాస్తికుఁడైనాఁ"డని చెప్పుకొనుచు నాతనివిడిచిపోయిరి. మనుష్యసహాయము కావలసినదుర్బలస్థితిలో నమ్మినయాప్తు లాయనను విడిచిచనిరి. శిష్యులుపరిత్యజించి పోయిననాఁటియుదయము సిద్ధార్థుఁడు నిరంజననదీతీరమున నతఁడు మెల్లమెల్లఁగా సంచరించుచుండ సుజాతకనఁబడి యతనిఁ దోడ్కొనిపోయిమధ్యాహ్నభోజనముఁ బెట్టెను. అతఁడాకూఁడు నొకమఱ్ఱిచెట్టుక్రిందఁ బెట్టుకొని కూర్చుండి తినెను. నాఁటినుండియావృక్షమునకు జ్ఞానవృక్షమని పేరు కలిగెను. ఏల యన నీవృక్షముక్రిందఁగూర్చుండితత్త్వవిచారము సేయుచుండసిద్ధార్థునకు జ్ఞానోదయ మయ్యెను. నిరంజననది కిప్పుడు ఫల్గునది యని పేరు. ఆవటవృక్షమున్న దేశమునకు బుద్ధగయ యనిపేరు. బుద్ధగయలో నిప్పుడొక వటవృక్ష మున్నది. ఇది బుద్ధదేవాలయమునకుఁ జేరి వెనుక ప్రక్క నొకమంటపము పైభాగమున మొలిచి యున్నది. ఈవృక్షముక్రిందఁ గూర్చుండియే సిద్ధార్థుఁడు బుద్ధుఁడయ్యెనని బౌద్ధులు నమ్ముదురు. రెండువేలయైదువందలసంవత్సరములనాఁటి వృక్షమిప్పటికి నున్నదని నమ్ముట దుర్లభము. వెనుకటివృక్షమంతరించు చుండ మరల దానిప్రక్కను మొలక నాటి మనవారు పెంచుచుండిరని యనేకులూహించుచున్నారు. ఆవృక్షము, తత్పరిసరభూములు, దానిదగ్గఱనున్న దేవాలయము బౌద్ధులకే గాక హిందువులకుఁ గూడ నేఁడు సేవ్యములై పుణ్యక్షేత్రములై యున్నవి.

ఆవృక్షముక్రిందఁ గూర్చుండినప్పుడు సిద్ధార్థునిమనస్సు వెండియు సంక్షుభితమయ్యెను. అతఁడు సంసారపరిత్యాగముఁ జేసి సుప్రసిద్ధులైనపండితుల నాశ్రయించి వేదాంతవిద్య నేర్చెను. ఆవిద్యయు

తనికక్కఱకు రాలేదు. తత్వశాస్త్రంబు లతని నొకదరిఁ జేర్పలేదు. కేవలము విద్యాభ్యాసమువలనఁ బ్రయోజనము లేదని యతఁడు నియతుఁడై యుగ్రతపంబులఁ జేసెను. భయంకరతపమువలన ఫలము లేదని యతఁడు గ్రహించెను. అందువలన దేహము శుష్కించెను. ప్రాణములు కంఠగతము లయ్యెను. ప్రయోజనము లేదని తపశ్చరణము మానెను. శిష్యు లతనిని నాస్తికుఁడని ధర్మభ్రష్టుఁడని నిందలు మోపికూర్చున్న చోటునుండి కదలలేనియవస్థలో విడిచి పోయిరి. అతఁడసహాయుఁడై కర్తవ్యము నిశ్చయింపలేక పరిపరివిధముల విచారింపఁదొడఁగెను. అట్టి యవస్థలో మరల గృహంబునకుఁ జని పిత్రుహస్తంబునుండి రాజ్యంబు స్వీకరించి దేశంబు బరిపాలించుచు సకలోపభోగములననుభవించుచు హాయిగ నుందునా! ఏల యీకష్టము లనుభవింపవలయు నను నాలోచన యతని మనంబునకుఁదట్టెను. ఈతలంపులను దవ్వుగఁ దోలుటకు నాభోగంబుల నుండి మనస్సును మరలించుటకు మనంబున గొప్ప యుద్ధము జరుగ వలసి వచ్చెను. ఈదురాలోచనము లన్నియు మారునివలనఁ గలిగెనని సిద్ధార్థుఁడు నమ్మెను. చరిత్రకారులు నట్లె వ్రాసిరి. మారుఁడనఁగా సామాన్యార్థము మన్మథుఁడు. దుర్బుద్ధులకెల్ల నధిష్ఠానమగు దేవతయని యిక్కడియర్థము. కొందఱి మతమున మారుఁడనఁగా మృత్యుదేవత. మానవుని మనంబునఁగలుగు దుశ్చింతలన్నియు నేదో యొకానొక దేవతవలనఁ గలిగెనను నమ్మకమైన నుండవచ్చును. లేదా తత్కాలమునఁ గలిగిన మనోవికారములను మహాకవులు చాతుర్యాతిశయమున మూర్తిమంతములుగఁ జేసి యాలంకారికముగ వర్ణించియుండవచ్చును. ఏది యెట్లున్నను జరిత్రకారులు వ్రాసిన విషయములుకొన్ని యిందుదాహరింపఁబడు చున్నవి. ఆసమయమున మారుఁడు ప్రత్యక్షమై సిద్ధార్థున కిట్లనియె. "ఓక్షత్రియా! లేలెమ్ము. నీవు

మరణము సన్నిహితమైయున్నది." కాని సిద్ధార్థుని హృదయమునిశ్చలమైయుండెను. పిఱికితన మతనిచెంతకు రాఁజాలకపోయెను. అంతట మారుఁడు వజ్రసమానములయిన తన బాణముల నతనిపైఁ బ్రయోగించెను. కాని సిద్ధార్థుఁడు వానిని లెక్కసేయలేదు. అంతట మారుఁ "డింక నా సైన్యంబుల నెల్లఁ గూర్చుకొని యీతని బలిమిం గెలువవలయు" నని మనంబున నిశ్చయముఁ జేసుకొని తన మూఁకల నెల్లఁ జేర్చియుద్ధమారంభించెను. కొందఱు బల్లెములఁదాల్చిరి. కొందఱు కత్తులు పూనిరి. కొందఱు చెట్లు పెఱికికొనివచ్చిరి. కొందఱు దారుణములైన వజ్రపుగదలు ధరించిరి. ఇట్లు నానాయుధపాణులైవచ్చిన యామారసైనికులలోఁ గొందఱు పందితలలవారు, కొందఱు చేఁపతలలవారు, కొందఱు గాడిదెతలలవారు, కొందఱు గుఱ్ఱపుతలలవారు, కొందఱు సర్పాకారులు, కొందఱువృషభ రూపులు, కొందఱు వ్యాఘ్రమూర్తులు, కొందఱు సింహశిరస్కులు. కొంద ఱనేకశిరస్కులు. తక్కినవారనేక మృగాకారులు. కొందఱికి శిరస్సు లనేకములుండియు నొక్కటే దేహముగలిగి యొక్కటే కన్నుగలిగి మొట్టమొదట కనఁబడి వెంటనే యెన్నెన్నో కన్నులుగలిగి కనఁబడిరి. కొందఱు బక్కపలుచగ నుండిరి. కొందఱు మహోదరులు. కొందఱు దీర్ఘకాయులు. కొందఱికుదరములే లేవు. కొందఱు దీర్ఘపాదులు. కొందఱు మహాజానులు. కొందఱు నాట్యమాడిరి. కొందఱు కీచుమని ధ్వనిచేసిరి. కొందఱు రెండుపాదములు దగ్గఱఁగఁబెట్టి దుమికిరి. కొంద ఱొండొరులను మోఁదుకొనిరి. కొందఱొకచెట్టుమీఁదనుండి యొకచెట్టుమీఁది కుఱికిరి. కొందఱు చెట్ల సందున నెగిరిరి. కొందఱు భూమిని గంపింపఁజేయుచుఁ దప్పటలు చఱచుచు నక్కలవలె నఱచుచు బిగ్గరగ నఱచుచు నానావిధవికృత చేష్టలు చేయుచు నావృక్షముచుట్టుం జేరిరి. కొందఱు సిద్ధార్థుని

మేను ముత్తునియలుగ ఖండింప నెంచిరి. కొంద ఱేకముగ మ్రింగి వైవఁ దలంచిరి. కాని యీభయంకరరూపము వలన నీవికృతచేష్టల వలన సిద్ధార్థుని తలమీఁది వెండ్రుకయైన కదలలేదు. తమయట్టహాసమునకు సిద్ధార్థుఁడించుకేనియుఁ జలింపమిమారునిమూఁకలు మిక్కిలి విషాదము నొందెను. అంతటమారుఁడు సిగ్గుపడి చిన్నవోయి నిజనివాసమునకరిగెను. భగ్నమనోరథులై పరిజనులు వానిననుసరించిరి. సిద్ధార్థుని మనస్సు నిర్మలమై ప్రశాంతమైయుండెను. జగదేకరక్షకుఁడగు సిద్ధార్థునకును మూర్తీభవించిన పాపమని చెప్పఁదగిన మారునకును సంగ్రామము జరుగునప్పుడు మహోత్పాతములైన నిమిత్తములనేకములు పుట్టెను. అనేక నక్షత్రములు భయంకరములై నేలపై రాలెను. ఆకాశము మేఘచ్ఛన్నమయ్యెను. అంధకారము గ్రమ్మెను. భూమి చైతన్యములేనిదయ్యు మహాసముద్రములతోడను పర్వతములతోడను చైతన్యము గలదానివలెఁ బ్రియునికౌఁగిటనుండి బలాత్కారముగ లాగివైవఁబడిన పెండ్లికూఁతురువలె మహావాతమున గంపించు ద్రాక్షలతవలె మిక్కిలి కంపించెను. ఈభూకంపమువలన సముద్రము సంక్షుభితమయ్యెను. నదులు సాగరగాములు కాక జన్మస్థానములపై నెదురు ప్రవహించెను. అనేకవర్షములనుండి పెరిగినవృక్షములతోఁ గలిసి పర్వతశృంగములు ఫెళఫెళ విఱిగి నేలఁ గూలెను. ఝంఝామారుతము వీచెను. గొప్ప తుపానుపుట్టెను. మహాధ్వనియొకటి భయంకరమై పొడమెను. చీఁకటి భానుమండలమును గ్రమ్మెను. తలలులేని భూతములు కోటానకోటులు నభోమండలమావరించెను.

ఈ మార్గసందర్శనమును గూర్చి, సిద్ధార్థుఁడు బుద్ధుఁడైనవెనుక తన శిష్యులతో నొకసారి యిట్లు చెప్పెను. "నిరంజననదీతీరమున నిర్వాణమార్గము నన్వేషించుచు నామనంబు నిరంతరధ్యాననిష్ఠనుండ మారుఁడు నాయెదుటనిలిచి నావిషయమై యెంతో జాలిపడి

యిట్లనియె. "నీవు మిక్కిలి చిక్కితివి. మందభాగ్యుఁడవైతివి. నీకు మరణమాసన్నమై యున్నది. వెయ్యిపాళ్లు నిన్ను మరణము గ్రమింగివైచినది. ఒక్కపాలుమాత్రమే జీవనమున్నది. ఓమానవీయా! ఏదోవిధముగ బ్రతికిన మంచిది! బ్రతికియుంటివా నీవెన్నో మంచి కార్యములు చేయఁగలవు. నీవు నిష్ఠాపరుఁడవై హోమాదికర్మములు నెఱపుదువేని నీకనేకశుభములు గలుగును. ఈ ధ్యానమార్గము నీకెందుకు? ఆమార్గము దుర్గమము దుష్ప్రవేశము." అప్పుడు మారునితో నేనిట్లంటిని. "ఓరీ దుష్టుఁడ! సోమరిపోతుల చెలికాఁడా! నీవిక్కడ కేలవచ్చితివి? పో పో శుభములు నాకేల? నాకు రాఁదగిన శుభములేవో నీవే చెప్పుము. నిర్వాణమార్గము బ్రవేశింపఁగల నను విశ్వాసము నాకుగలదు. శక్తిగలదు. దహనశక్తిగలదు. అట్టిసాధనములు నేను చేయుచుండ సుఖజీవనముఁ జేయుమని నీవు నన్నేల పురికొల్పెదవు? ఈవేఁడిగాడ్పు నదీప్రవాహములనైన శోషింపఁజేయఁగలదు. అట్టిది క్రమక్రమమున నామేననున్న నెత్తురునుమాత్రము శోషింపఁజేయదా? నెత్తుఁరెండిపోవుచుండ పిత్తశ్లేష్మములుగూడ నెండిపోవును. ఇట్టుల రక్తమాంసములు హరింప నామనసు ప్రశాంతమగును. అంతట నాబుద్ధి నాధ్యానము నాశ్రద్ధ సుస్థిరములగును. ఇట్లు పరమార్థముల నిమిత్తము బ్రయత్నించుచున్న నా కింద్రియ సుఖములమీఁద మనస్సు చొరదు. ఇట్టి నే నెంత పరిశుద్ధుఁడనగుదునో చూడుము. భోగము నీమొదటిసేన. అసంతుష్టి నీరెండవదళము. తృష్ణాబుభుక్షలు నీమూఁడవసైన్యము. కామము నాల్గవపృతన. మాంద్యము నీయైదవరథిని. పిఱికితనము నీయాఱవమూఁక. సందేహము నీసప్తమబలము. కాపట్యము మఱియుమఱపు లాభము కీర్తి గౌరవము మఱియు నధర్మమువలన సంపాదింపఁబడిన ప్రసిద్ధి మొదలగునవి నీయష్టమసైన్యము. పరదూషణములనుజేసి యెవ్వఁ డాత్మస్తుతులఁ బ

గితుష్టినొందునో యతఁడు నీకు ప్రియుఁడు. ఇదియెల్ల మలినవర్తనుఁడవగు నీబలగము.

బుద్ధుని శిష్యురాండ్రలో నొకర్తయగు రాధయనున దొకసారి యతని నిట్లడిగెను. "స్వామీ! మారుఁడు మారుఁడని జనులు చెప్పుకొందురు. ఆమారభూత మెక్కడ నుండును?" దానికి బుద్ధుఁడిట్లనియె. "రాధా! శరీరమెక్కడనుండునో యక్కడ మారుఁడుండును. చంపెడువాఁడు మారుఁడు. చచ్చెడువాఁడు మారుఁడు. కాఁబట్టి దేహమే మారుఁడని నమ్ము. రోగము వ్రణము గాయము మాలిన్యము మలినవర్తనము మొదలగునవన్నియు మారరూపములె. ఇదెఱిఁగినవాఁడు మారు నెఱిఁగినవాఁడె."

ఈసంభాషణమును బట్టి మారుఁడని వేఱొకపురుషుఁడు లేఁడనియు బుద్ధదేవుని మనస్సునఁ బుట్టినవికారములే యీరూపమున వర్ణింపఁబడినవనియు మనమూహింపవచ్చును. శరీరశోషణము మొదలైనవి మేలుచేసికొనవలయు నను నాలోచనము మొదట బుట్టి యుండవచ్చును. తన మనోబలముచే వానిని దానే పరిహరించుకొని యుండవచ్చును. ఇదియె యీసంభాషణయొక్క సారము.

నవమాధ్యాయము.

సిద్ధార్థుఁడు మారుని జయించునప్పటికి సూర్యాస్తమయము కాలేదు. పదియవహోర యగునప్పటి కతఁడు బుద్ధుఁడయ్యెను. అనంతములైన బ్రహ్మాండములయందుఁ గలసమస్తచరాచర వస్తువులయొక్కయు స్థితిగతులనెఱుంగుటకుఁ దగినజ్ఞాన మతని కుదయిం

చెను. పండ్రెండవహోర యగునప్పటి కతఁడు బ్రహ్మాండమునయం దున్న సమస్త విషయములను దనదాపుననున్న పదార్థములనఁ జూచునట్లు జూడఁగల దివ్యదృష్టి సంపాదించెను. అనంతరము మానవులకు జన్మాంతరము లేలాగలుగుచున్నవో యాకారణంబులఁ దెలిసికొను జ్ఞానమును నట్టి కారణంబులు మొదటినుండి తుదవఱకుఁ దుదనుండి మొదటివఱకు నరసి శోధింపఁగల జ్ఞానమును నతనికిఁ గలిగెను. మఱియు నా రాత్రి చతురాశ్రమంబుల ఫలంబులు నతనికిఁ బ్రాపించెను. మరు నాఁడరుణోదయ మగునప్పటికి సిద్ధార్థునియందుఁగల సమస్తప్రాపంచిక చింతలు నశించెను. నశించుటయు ననంతకోటిబ్రహ్మాండములలో నున్న సమస్తజంతువులు మున్నెన్నఁడుఁ గని విని యెఱుఁగని పరమ బుద్ధుని సందర్శించి ధన్యతఁ జెందెను. అంతట బుద్ధదేవుని శరీరము నుండి యాఱురంగులుగల కిరణములు బయలుదేఱి యాజంతువులపైఁ బ్రసరించెను. అంతట నా కిరణములు నిమిషమాత్రమైనను నొకచోటనిలువక యొకప్రాణిమీఁదినుండి మఱియొక ప్రాణిమీఁదికిఁ బ్రసరించుచుఁ దమచేతఁ దేజోవంతములైన భూతముల నలరించుచు నొకసారి నీలమేఘమువలెను, వేఱొకసారి కొండ గులాబి వలెను, మఱియొకసారి తెల్లదువ్వలువ వలెను, నింకొకసారి యెఱ్ఱపూవులదండవలెను, మఱియొక తూరి తేజోవంతమగు స్తంభమువలెను, నానావర్ణములు దాల్చుచుఁ జూపఱ కద్భుతమావహిల్లఁ జేసెను. అవి చూచినవారందఱు నహహా యెట్టివర్ణములని ప్రశంసించిరి. అట్లు ప్రశంసించుటచే వారు ధన్యులైరి. ఆ ధన్యత్వముచేత జన్మవిముక్తి వారికిఁ గలిగెను. అతఁడు గర్భస్థుఁడైన కాలమునను జన్మకాలమునను గనఁబడిన ముప్పదిరెండు మహాద్భుతములు నాఁడు మరల కనఁబడెను. అప్పుడు బుద్ధునకు సమర్పింపఁబడిన వెలలేని కానుకలని లక్షనాలుకలైన వర్ణింపఁజాలవు. అప్పుడుకలి

గిన మహాద్భుతములను మరల జెప్పఁజాలము. సిద్ధార్థుఁడు బుద్ధుఁడై నతోడనే యమృతపూర్ణభాండమువలె నుండెను. అతనిమనస్సు ధర్మామృతముతో నిండియుండెను. ఆసమయమున నతఁడానందాతిశయమున నీక్రిందివిధమున బలికెను. "నే నెవనికొఱకు వెదకుచున్నానో యానిర్మాతను జూడకపోయిన పక్షమున ననంత జన్మపరంపరాప్రయాణముల నేను చేయవలసినవాఁడనె. పునర్జన్మములత్యంత బోధకములు. ఆజన్మనిర్మాతను నేను కనుంగొనఁ జూచి యిట్లంటిని. "నానిమిత్తము నీవు వే ఱొక గృహము కల్పింపఁజాలవు. నీదూలములు భగ్నములైనవి. నీవాసములు చెదిరిపోయినవి. ప్రాపంచిక పదార్థములనుండి నామనస్సు విడిచిపోయినది. నేనిప్పుడు నిష్కామస్థితిని బ్రాపించితిని" ఇటులుసిద్ధార్థగౌతముఁడు వటవృక్షచ్ఛాయనుగూర్చుండి సకలకామపరిత్యాగము జేసి జగద్వంద్యుఁడై బుద్ధుఁడయ్యెను. మరణశూన్యమై శోకవివర్జితమై బాధాంతకమై పునర్జన్మరహితమై రోగదూరమై వార్ధక్యాభావమై కామ క్రోధనాశకమైనయవస్థను బొందుటకై యెన్నిమార్గములు కలవో యన్నిమార్గములయందు నతఁడు నడచెను. కాని యతఁడు గమ్యస్థానమును జేరలేదు. ఆనాఁటి విద్వాంసు లందఱు మోక్షోపాయమని చేసి నిర్ణయించి యనుసరించి శిష్యులకు బోధించిరో యామార్గంబుల నతఁడు నడిచి విసికి భగ్నమనోరథుఁడై గమ్యస్థానముఁ జేరలేక మరణావశిష్టుఁడై యెట్టకేల కావృక్షచ్ఛాయఁ జేరి దిన మంతయుఁ బరమధ్యానాంతరంగుఁడై కూర్చుండి మనఃప్రభవములైన యనేక సంకటములకు లోనై యిటుల విచారింపఁ దొడఁగెను. "ఆలుబిడ్డల విడిచి సన్యసించి జపంబులు తపంబులుచేసి మరల గృహాభిముఖుఁడనై పోవలయునా? మరల సంసారినగుదునా? వెండియు భోగపరాయణుఁడను గావలయునా? జన్మపరంపర నుండివిమోచనముఁ గలిగించు మోక్షోపాయము లేదా?" అటుల వి

చారించుచు నతఁడు గాఢసమాధిలోనుండ మెఱుపువలె నతని మనంబున నాకస్మికముగ నఖండజ్ఞానోదయమయ్యెను. నిర్వాణమునకు నిజమైన దారి యతనికిఁ బొడకట్టెను. అతఁడు బుద్ధుఁడయ్యెను. అట్టిపరమావధి నతఁడు ప్రాపించినను నతనికిఁ గష్టము తప్పలేదు. అతని సంకల్పము విఘ్నముఁ జేయుటకు మారుఁ డతనికి మరలఁ గనఁబడెను. నాఁడు తనకుమారునకు జరిగిన సంభాషణమును బుద్ధుఁడు శిష్యులకు నీక్రిందివిధమునఁ జెప్పెను. “అప్పుడు దుష్టాత్ముఁడైన మారుఁడు నాకడకు వచ్చెను. వచ్చి నాప్రక్క నిలువఁబడెను. నిలువంబడి నన్ను జూచి యిట్లనియెను. “ఓమహాపురుషా! ఓసిద్ధసంకల్పా! నిర్వాణముఁ బ్రవేశింపుము. నిర్వాణముఁ బ్రవేశింపుము.” అనవుడు దుష్టాత్ముఁడైన మారునకు నేనిట్లంటిని “ఓరి దుష్టుఁడ నేను నిర్వాణముఁ బ్రవేశింపను. జ్ఞానులును బోధకులు నగుశ్రమణులను నేను శిష్యులుగఁ జేరువఱకు వారు ధర్మమును శ్రద్ధతో నాలకించి నాసిద్ధాంతముల పరిచయము గలిగి యనుభవశాలురై ధర్మమార్గమున నడచుచు సూత్రములయందు సంపూర్ణప్రజ్ఞ గలిగి నామతమును బోధించి వ్యాపింపఁ జేయువఱకు గురుముఖంబునఁ దాను విన్న దంతయు వెలిబుచ్చి లోకసంరక్షణార్థ మెల్లయెడల సంచరించి తమ జ్ఞానముచేత విరుద్ధవాదములను దుర్జనుల వలనఁ గలుగు నాటంకములను దొలఁగించువఱకు నేను నిర్వాణమునఁ బ్రవేశింపను. ఓదుర్మార్గుఁడా! నేను చూపినపవిత్రజీవనము జయమంది జనసమ్మతి వడసి మానవజాతియంతటను వ్యాపించి సిద్ధాచారమై యెల్లరకుఁ దెలియువఱకు నేను నిర్వాణమునఁ బ్రవేశింపను.”

మారునకును బుద్ధునకును జరిగినట్లువర్ణింపఁబడినయీసంభాషణముయొక్క భావ మేమైయుండు నని మనము ప్రశ్న జేసికొని విచారింపవలెను. శిష్యులకు భక్తిపారవశ్యము గలిగినప్పుడు గురువులయం

దు మహామహిమలు పొడగట్టును. అనంతకోటిబ్రహ్మాండములును చరాచరములు మొదలైన వగుపడుటయెల్ల మహిమలలోని భాగము. మారోత్పత్తి గూడ మనోవికారమును కవిచాతుర్యము, నని యిదివఱకే వ్రాయబడినది. ఈమహిమలన్నియును గూడ నట్టివే. మహానుభావుఁడు నిర్వాణముం బ్రవేశింపుమని యొకఁడా పురాణము నొందుమని యుపదేశించినట్టును, దానికిఁ దానియ్యకొనక పోయినట్లును బుద్ధునకు శిష్యులతోఁ జెప్పినాఁడు. దానిసార మిదియై యుండవచ్చును. చిరకాలము నుండి తాను శిక్షించినబుద్ధత్వము తనకు సంప్రాప్తించియుండుటచే సత్కృష్టఫలసిద్ధి యైనది కదా యింక నేమున్నది, పరమసుఖమునొందుటయే లా? లోకభూయిష్ఠమైన యాగతితో మేలేమి? నిర్వాణము మే ప్రశాంత పరసూక్ష్మమును నాలోచన మనసున కెట్టిదో యని యుండవచ్చును. ఆ స్మరణపరాన్నహితమైన శాస్త్రమునకున్నది కష్టమే ప్రోత్సాహించి సుఖమును శముచేయఁ దలంచుకొని యుండవచ్చును. ఈసెడ్డగాలము సంసారసాక్షాత్కారము. అతిలంఘుగు ధర్మానుష్ఠానముచే సత్యమును జూపగలిగియము. మహాత్మ్యము. సంసారముఁ బాశ్చాత్యమైనది అనులఁ గాములు దుంపలుఁ దిని పదిరానిమిలుగులు బడి పార్వతాగ్రమున చిరకాలర్ధి సంపాదించిన మహాధనమ్మునకు ప్రాపంచికులు బడి మ్రగ్గుచున్న లోకమున కుపకరింపకుండఁ దనతోఁ దానే పోవునట్లు యనుచితమను మంచితలంపు పాపకార్యమును జనియుండి యుండవచ్చును. ఆత్మహత్యఁ జేసికొన్న పక్షమునఁ దన వైరాగ్యమునకు దరిదాపు లేదయ్యెల, తా నీలోకమున జనియించుటు, వ్యర్థము గదా యనుకొని యుండవచ్చును. ఇట్లు తోఁచినపిదప నతఁ డాత్మహత్యకు సిద్ధ యుండెనని మన మూహింపవచ్చును.

అనంతరము గాఢసమాధినిష్ఠుఁడైన మాబుద్ధునిమనసుకు మఱియొక యాలోచన ప్రభవించెను. అది యాత్రికులవిధముగ నుండ

ను. "తెలిసికొనుటకుఁ గని పెట్టుటకును దుర్లభమైనగొప్పసత్యమును నే నీదినమునఁ గనిపెట్టితిని. ఇది శాంతిప్రదము, గంభీరము. బుద్ధీంద్రియములకతీతము. విద్వజ్జనగేయము. పరమార్థము. మానవుఁడు భూమిమీఁదనె చరించుచున్నాఁడు. భూగోళమునందె వ్యాపారములు సేయుచున్నాఁడు. భూగోళమునందె సుఖదుఃఖముల ననుభవించుచున్నాఁడు. అట్టివాఁడు భావాతీతమ్ములైన కారణపరంపరలను గార్యకారణసంబంధములను గ్రహింపఁజాలఁడు. ఇంతియెకాదు. అట్టివాఁడు జన్మపరంపరావినాశము ప్రాపంచిక వ్యవహారవిముఖత సర్వకామవినాశము సకలరాగము నిర్వాణప్రవేశము మొదలగు దురవగాహవిషయములను గ్రహింపనేరఁడు. అట్టివారికి నే నీపరమధర్మము బోధించితినా మానవజాతి గ్రహింపకపోవుట సంభవించును. అందువలన నేను పరిశ్రాంతుఁడ నగుదును. నాకనేక బాధలు కలుగును. నే ననేక బాధలుపడి సంపాదించిన యీపరమార్థమును నేను ప్రపంచమునందు వెల్లడి చేయవలయునా? కామక్రోధపరవశుఁడైనవానికి సత్యము కనఁబడక దాఁగి యుండును. అసత్యమునకు లోను మనుష్యున కెన్నఁడు వశముకాదు. అది గంభీరము. మహాద్భుతము. దుస్సాధ్యము. ప్రాపంచిక వ్యవహారములమీఁద మగ్నుఁడైనవాఁడు దానిని గ్రహింపఁజాలఁడు."

ఆయాలోచనలు స్ఫురించినప్పుడు బుద్ధుఁడు తన సిద్ధాంతముల నెవరికి బోధింపక నిర్మలముగ నెప్పటియట్ల యొకచోట ధ్యానము జేసికొనుచుండవలయు నని సంకల్పించెను. ఆసంకల్పమందతఁడు నెఱవేర్చినా చిరపరిశ్రమముచేతఁ గని పెట్టఁబడిన పరమార్థము ప్రపంచమున కప్రాప్యమై గూఢమై సముద్రగర్భగతమైన రత్నమువలె భూగర్భగతమైనసువర్ణమువలె దుర్లభమై యుండునుగదా. అట్టియెడ సురముఖ్యుఁడైన బ్రహ్మ బుద్ధునికడకువచ్చి యాసత్యము లోకమునకు బోధింపుమని యాచించెనఁట. బ్రహ్మ సుమ్మానము నొక్కి చెప్పినసంగ

బుద్ధుఁ డయ్యెఁగొనఁడనెన్య. ఆసత్త బుద్ధునకు జ్ఞాననేత్రములు విచ్చె మంతయు నొక్కసారి పొడఁజూపెను. అప్పు డతనికి స్పష్టముగ బలి శుద్ధాత్మలు మలినాత్మలు సాధుస్వభావులు దుష్టస్వభావు లగపడిరి. అప్పుడు బుద్ధుఁడీక్రిందివిధముగఁ బలికెను "నా కేకో మార్గము లభ వించుచున్నాని నేను కనిపట్టిన సత్య మింతవఱకు లోకమునకుఁ బ్రస రింపలేదు. ఈముక్తిమార్గద్వారము సమస్తజనులకుఁ బ్రవేశింపఁదగిన దై తెఱవఁబడియుండుఁగాక! వినఁగలుగువారు నిందాగలవారు ఈధర్మా ర్థము విని విశ్వసించి తరింత్రు గాక!"

అష్టమాధ్యాయము.

ఇత్తెఱంగున సిద్ధార్థుఁడు బుద్ధుఁడై బహుపవిత్రమును బ్రశస్తమునగు పరమధర్మము లోకమునకు బోధింపవలయు నని సంకల్పించి మొట్టమొదట "నే నీధర్మ మెవరికి బోధింతును. ఎవ్వరు దీనిని సులభముగ గ్రహింపఁ గల" రని తనలో వితర్కించెను. ఆరాడకాలాముఁడు మిక్కిలి తెలివి గలవాఁడు; విద్యావంతుఁడు. గావున నతఁడు తన సిద్ధాంతమును గ్రహింపఁ గలసమర్థుఁ డని భావించి యతఁ డావరమార్గము వానికి బోధింపఁ దలఁచెను. అంతఁ దనునతనికే యారాడకాలాముఁ డిసపీడు గలదు. సిద్ధార్థుఁడు సన్న్యాసము స్వీకరించిన వెనుకనే సన్న్యాసాభ్యాసముఁ జేయుట కతఁడు నాశ్రయించెను. అతఁ డెక్కడ నున్నాఁడని యతఁ డడుగ మృతినొందె నని చెప్పిరి. అనంతర మతనికి మహాపండితుఁ డైనయుద్రక రామపుత్రుని పేరు స్మరణకు వచ్చెను. ఉద్రక రామపుత్రుఁ డనఁగా నుద్రకుఁడే. అతఁడుని యొద్ద విద్య నాలించినసంగ

సిద్ధార్థుఁడు జ్ఞానసంపాదననిమిత్త మితనియందుఁ జేరెను. ఈతఁడును దన సిద్ధాంతము నశ్రమంబునం గ్రహింపఁగలఁడని యతఁడు తలంచెను. కాని యుద్రకుఁడు కూడ కొంతధర్మము నొందె నని తెలిసెను. అనంతరము తనకు మున్ను తాను కఠోర తపంబు సేయుచుండఁ దనకు శిష్యులై శుశ్రూష జేసి తాను తపము చాలించిన పిదప దన్ను విడిచి పోయిన యైదుగురు శిష్యులు జ్ఞప్తికి వచ్చిరి. వారిప్పుడు వారాణసీ నగరమునఁ దపము సేయుచుండిరని విని వారిం గలసికొనుటకు బుద్ధుఁ డక్కడికిఁ బోయెను. మార్గమున. ఉపకుం డను దిగంబరయోగి యొకఁడు నాతనికెదురై యాతని ముఖమున బ్రస్ఫుటమగు సిద్ధార్థుని కాంతిఁ గనుంగొని యిట్లని యడిగెను. "మిత్రుఁడా! నీ నేత్రద్వయము స్వచ్ఛముగా మెఱయుచున్నది. నీముఖము జ్ఞానతేజస్సమన్వితమై యున్నది. ఎవని సిద్ధాంతమును నమ్మి నీవు ప్రపంచమును బరిత్యజించితివి? నీగురు వెవ్వరు? ఎవని ధర్మము నీవవలంబించితివి?" అనవుడు బుద్ధుఁ డిట్లుత్తరము చెప్పెను. "అయ్యా! నే నర్హత్త్వమును బొందితిని. నేను బుద్ధుఁడను. నేను సర్వవిధముల నిష్కళంకుఁడను. నేను సర్వమును బరిత్యజించితిని. కోరికను నాశనము జేసి నేను ముక్తుఁడ నైతిని. స్వయముగా జ్ఞానసంపాదనముఁ జేసికొన్న నేను నాకొకఁడు గురువు కలఁడని యెట్లు చెప్పఁగలను? నాకు గురువు లేఁడు. నాకు సముఁడు లేఁడు. ఈమనుష్యప్రపంచము నందును దేవతాప్రపంచమునందును మత్తుల్యుఁడు లేఁడు. ఈప్రపంచమునందు నేనే పరిశుద్ధుఁడను. నేనే పరమగురువును. నేనే లోకాతీతుఁడైన సంబుద్ధుఁడను. నేను శాంతిని నిర్వాణమును బడసితిని. ధర్మరాజ్యసంస్థాపనముఁ జేయుటకుఁ బుణ్యనగరమైన వారణాశికిఁ బోవుచున్నాఁడను. మాయాంధకారబంధుర మయిన యీప్రపంచమున నమృతత్వ మను మహాభేరిని నేను మ్రోయించెదను." అని బుద్ధుఁడు నహంకారభావము తెలుపు వాక్యములు పలుక "నటయిన నద్వితీయుఁడు

పరమపావనుఁడ వగుజినుఁడవా" యని యుపకుఁ డడిగెను అతనికి మహాత్ముఁడైన బుద్ధుఁ డిట్లు బదులుచెప్పెను. "కోరికల నడంచిన జను లందఱు నావంటివారే. నేను సమస్తపాపముల జయించితిని. కాఁబట్టి జినుఁడను నేనే" 'అట్లా కావచ్చు' నని పలికి యుపకుఁడు తలయూఁచి మఱియొకమార్గమునఁ బోయెను. అనంతరము బుద్ధుఁ డొక చోటనుండి మఱియొక చోటికిఁ బ్రయాణములుచేసి తనకు గమ్యస్థానంబును వేద శాస్త్రనిలయంబును సర్వజనసేవ్యంబును బరమపవిత్రంబును సిద్ధజన నివాసంబును గంగాప్రవాహాభిశోభితంబును నగు గాశీనగరంబుఁ బ్రవేశించెను. ప్రవేశించి మృగదావంబు సొచ్చి యచ్చోటఁ దపోని ష్ఠులైన పూర్వశిష్యపంచకమును జూచెను. వా రతనిని ముందు గా దవ్వులం గని తమలోఁ దా రిట్లనుకొనిరి. "అదిగో! గౌతమశ్ర మణుఁడు వచ్చుచున్నాఁడు. ఇతఁడు తపంబుచాలించి హాయిగ సుఖ ము ననుభవించుచున్నాఁడు. మన మాసనములనుండి లేవవద్దు. అత నికి నమస్కరింపవద్దు. అతనిచేతనుండి శాటికమండలము లందుకొని గౌరవింపవద్దు. కాని మన మిక్కడ వానినిమిత్త మొకయాసనము వైచి యుంచుదము. ఇష్టమయినయెడల నతఁడు దానిమీఁదఁ గూ ర్చుండుఁగాక!" ఇట్లువారు కృతప్రతిజ్ఞులై బుద్ధునియెడ ననాదరణ ముఁ జూపఁదలంచిరి. కాని, తమప్రతిజ్ఞాప్రకారము చేయుట వారి శక్య మయినది కాదు. బుద్ధుఁడు తమ్ము సమీపించిన తోడనే తదీ య తేజఃపరిభావనిర్జితులై యయ్యైవురుఁ బ్రతిన నెఱవేర్చుకొన లేక యప్రయత్నముగ దిగ్గునలేచి యామహాత్మున కెదురుగాఁ జని తోడ్కొనివచ్చిరి. అం దొకఁ డాయనచేతనుండి శాటికమం డలము నందుకొనియెను. ఒకఁ డాసనము వైచెను. ఒకఁడు పాద పీఠ ముంచెను. ఒకఁడు పాదప్రక్షాళనమున కుదక మందిచ్చెను. ఒకఁడు కాళ్ళు తుడుచుకొనుట కంగవస్త్రము సమర్పించెను. బుద్ధుఁ

డు కూర్చుండి పాదప్రక్షాళనము జేసినపిదప 'మిత్రమా! గౌతమా! నీ వెందుండి వచ్చుచున్నా' వని వా రడిగిరి. అడుగుటయు బుద్ధుఁ డిట్లనియె. "ఓ యోగులార! తథాగతుని పేరుపెట్టి పిలువఁ గూడదు. మిత్రుఁ డనఁ గూడదు. తథాగతుఁ డనఁగా నెవ్వఁ డనుకొన్నారు! పరమపావనుఁ డయిన సంబుద్ధుఁడు. నేను చెప్పునది వినుండు. నే నమృతత్వమును బడసితిని. ఆసిద్ధాంతము నేను మీకుఁ గఱపెదను నేను జూపినమార్గమున మీరు నడతురేని సత్యమును మీరే తెలిసికొని సుజ్ఞానమునఁ జూచి సిద్ధిఁబొందఁ గలరు.' అనవుడు నా యోగులు తేరిపారి తథాగతుని వాక్యములందు నమ్మిక లేక యిట్లనిరి. 'మిత్రుఁడా! గౌతముఁడా! నాఁడు నీవు తాల్చిన మహానియమములు వలసిన సరిపడ దుష్కరతపంబులనెల్లను నాచరించిన కఠోరవ్రతంబుల వలనను మనుష్యాతీతములయిన శక్తులను నీవు బడయఁ జాలవైతివి. సంపూర్ణజ్ఞానాంతర దృష్టులవలనఁ గలుగు నత్యుత్కృష్ట దశను పొందజాలవైతివి. అట్టి తపోనియమములు నడిపిన నీకు సిద్ధి గలుగనపుడు నేఁడు దేహంబు చాలించి భోగములు ననుభవించుచు హాయిగఁ దిరుగుచున్నపుడు మనుష్యాతీతశక్తులు నీ కెట్లు కలుగును. జ్ఞానలబ్ధ మగు నత్యుత్కృష్టదశ నీ కెట్లు సంప్రాప్తించును?' ఆప్రశ్నమునకు బుద్ధుఁ డిట్లుత్తరము చెప్పెను. 'తథాగతుఁడు భోగముల ననుభవించుట లేదు. అతఁడు ధర్మసాధనముల విడిచిపెట్ట లేదు. అతఁడు పూర్వకాల జీవనమువంక జన లేదు. ఓ యోగులారా! నే నిదివఱ కెన్నఁడయిన మీతో నిట్లు మాటాడితినా.' 'లేదు. లేదు. నీ వెన్నఁ డిట్లు మాటాడలే' దని వారు బదులు చెప్పిరి. అనవుడు నతఁ డీ క్రిందివిధమున వారి కుపదేశము జేసెను. 'అట్లయిన నో యోగులారా నాచెప్పునది వినుండు. ప్రపంచముఁ బరిత్యజించిన మనుష్యుఁ డనుసరింపఁ దగని యుత్కృష్టపద్ధతులు రెండున్నవి. ఇంద్రియముల నాకర్షించునట్టియు

ముఖ్యముగ భోగానుభవమునకు దారితీయునట్టియుఁ గార్యముల నాచరించుట మొట్టమొదటిది. ఇది పరిత్యాగమునఁ బరిత్యజింపఁ దగినది. ఇట్టివానిచే మానవునకు సంతుష్టి గనుట మిగుల నింద్యము, ననర్థము; నిష్ప్రయోజనము. ప్రాపంచిక విషయములయందుఁ దగు లౌల్యమున్న వానికి మానసికమె యది తెలుపుఁ. తపోనిష్ఠ చేసి ప్రకృతినాత్మ బాధ గలిగించు కార్యములు నాచరించుట కూడదు. ఇదియు దూరముగఁ బరిత్యజింపఁ దగినదే. ఇయ్యవియు ననర్థము నింద్యమె నిష్ప్రయోజనమే. ఈరెంటికి మధ్యమమార్గమైన మార్గమొకటి యున్నది. అది తథాగతుండు సంబుద్ధునకు కనిపించెను. అది జ్ఞానప్రకాశమై కన్నులు తెరపించును. మనస్సునకు శాంతి నొసఁగును. ఉన్నతజ్ఞానమునకు దారితీయును. సంపూర్ణజ్ఞానబుద్ధత్వమునకుఁ గొంపోవును. ఆమధ్యమార్గ మేది యని యడుగవచ్చును. ఆమార్గ మష్టవిధము. సద్విశ్వాసము, సదాలోచనము, సత్సంభాషణము; సద్వర్తనము, సజ్జీవనము, సత్ప్రయత్నము, సన్మనస్కత, సన్మననము. జన్మము దుఃఖకరము. జరత్వము దుఃఖకరము. రోగము దుఃఖకరము. మరణము దుఃఖకరము. అనిష్టపదార్థసంగమము దుఃఖకరము. ఇష్టపదార్థవియోగము దుఃఖకరము, రాగజనితములైన భావము లన్నియు దుఃఖకరములు. దుఃఖానుభవమును గూర్చి చెప్పఁదగిన యథార్థ మిదే. దుఃఖసముత్పత్తిని గూర్చి చెప్పుచున్నాను వినుఁడు. కోరిక నశింపక స్థిరమై యుండుటయె దుఃఖమునకు ముఖ్యకారణము. ఆకోరిక పునర్జన్మహేతువు. అది భోగములపై నాస గొలుపును. ఒకమా రీపని చేసి ఒకమా రాపని జేసి యాకోరిక సంతుష్టిఁ గనుచుండును. ఒకమారు మఱియొక జన్మ మెత్తవలయు ననుతలంపు గలిగించుచుండును. ఒకానొకప్పు డీజన్మమునందె యెట్టిన సిద్ధిఁబొందు మనోరథసిద్ధిఁ బడయు

వలయు ననుసంకల్పము గలిగించు చుండును. దుఃఖము నాశనము జేయుటను గూర్చి చెప్పఁదగిన పరమార్థ మిదిగో వినుండు. తృష్ణను ముందుగా నాశనము జేయవలయును. అనఁగా మనుష్యుఁడు ముందు కోరికను నాశనము జేయవలయును. అది నాశన మైనయెడల నింద్రియసుఖమే నశించును. ఈతృష్ణను దూరముగాఁ దోలవలయును. దానిని బరిత్యజింప వలయును. ఒక్కనిముసమైన దానిని మనస్సులో నిలువనియ్యఁ గూడదు. ఈదుఃఖనాశనమునకుఁ దగినసాధనములం గూర్చి చెప్పఁదగినపరమార్థ మే దన నెనిమిదవిధములైన సన్మార్గములు నడచుటయె. దుఃఖమును గూర్చియు దుఃఖకారణమును గూర్చియు దుఃఖకారణ నాశనమును గూర్చియు దుఃఖకారణనాశనసాధనములం గూర్చియు నెట్టిసిద్ధాంతములును మనకుఁ బ్రాచీనులిచ్చి యుండలేదు. కాని యట్టివానిని గనిపెట్టుటకు నాలో నంతర్నేత్రము బయలు దేఱినది. తదీయ స్వభావజ్ఞానము పొడమినది. తత్కారణ పరిజ్ఞానము సముద్భవిల్లినది. ప్రశాంతమార్గమును గనిపెట్టుటకుఁ దగినయాత్మజ్ఞానము సముత్పన్నమైనది. అంధకారమును బటాపంచలు చేయఁగలజ్ఞానజ్యోతి వెలింగినది. ఆనాల్గువిషయములం గూర్చియు నాజ్ఞానము నాయంతర్దృష్టియు విశదములుగ నెంతకాలము లేవో యంతకాలమును నేను శ్రమణులకును బ్రాహ్మణులకును మనుష్యులకును దేవతలకును దురాప్యమైన యాజ్ఞాన మార్గమునఁ బ్రవేశించితినో లేదో నిశ్చయముగ నెఱుఁగఁ జాలనైతిని. ఆనాల్గువిషయములం గూర్చియు నాజ్ఞానము నాయంతర్దృష్టియు విశదము లెప్పుడైనవో యప్పుడే నేను శ్రమణులకు బ్రాహ్మణులకు మనుష్యులకు దేవతలకు దురాప్యమైన యాజ్ఞాన మార్గమునఁ బ్రవేశించితి నని నిశ్చయముగ నెఱిఁగితిని. ఇప్పుడీజ్ఞానము నీయంతర్దృష్టియు నాలోనుద్భవించినవి. నేనుబడసినముక్తి నిశ్చల

మైనది. ఇదియే నాకడపటి జన్మము. ఇఁకమీఁద నాకుఁ బునర్జన్మము లుండవు" ఈబోధ మాయైదుగురిమనస్సులమీఁద నమృతవర్షమువలెఁ బడెను. అదివఱకు వారెన్నో పుణ్యనదులలో స్నానము జేసిరి. సాంగముగ వేదము నభ్యసించిరి. కర్మానుష్ఠానతత్పరులైరి. ఉగ్రతపములనాచరించిరి. శరీరము శుష్కింపఁ జేసిరి. ఎన్నిచేసినను నిష్కంటకమయిన మార్గము వారికిఁ బొడకట్టలేదు. కుంభవృష్టినంటి యీబోధామృతము కురిసినతోడనె చిరకాలమునుండి వారిమనస్సులఁ బట్టియున్నమాలిన్యము కడిగివైవఁ బడెను. వారి మనోనేత్రములకుఁ జక్కనిదారి పొడగట్టెను. ఆయేవురిలో వయోవృద్ధుఁడైన కౌండిన్యుఁడు మొట్టమొదట నూతనధర్మమున ననుసరించి బుద్ధునిశిష్యుఁడయ్యెను. తక్కిననలువురుఁ గలిసియు వేఱు వేరుగను బిమ్మట నతనితోఁ గొన్నిసారులు వాదములు నెఱపి సందియంబులఁ దొలంచుకొని శిష్యులైరి. అట్టిమహాతపస్సమయమున నతనిం బరిత్యజించి ధర్మభ్రష్టుఁడని యతని నధిక్షేపించి యతనియెడ ననాదరణముఁ జూపవలెనని సంకల్పించినవారె యతని బోధామృతాస్వాదనముఁ జేసి పూర్వ మనుసరించిన మూఢమార్గము విడిచి మంచిదారిం బడి బుద్ధదేవుని ప్రథమశిష్యులైరి.

ఈయేవురితరువాత బుద్ధధర్మమును స్వీకరించినవాఁడు వారణాసీపురవాసియు మహాధనవంతుఁడు వడ్డివ్యాపారమువల్ల జీవించువాఁడు నగునొకవర్తకునికుమారుఁడు. అతనిపేరు యాసుఁడు. అతనికి మూఁడు మహాభవనములు కలవు. అందొకటి శీతకాలముకొఱకు. మఱియొకటి వర్షకాలమునిమిత్తము. వేఱొకటి గ్రీష్మకాలముకొఱకు. ఏమందిర మేకాలమునిమిత్త ముద్దేశింపఁబడినదో యామందిరమున నాకాలమున నతఁడు వసియించుచుండును. ఆమందిరంబులయందు నిరుపమాన సౌందర్యము గల విలాసవతులు తమపాటలచేత నాటలచేత సంపములఁ

చేత నతనిని మెప్పించి సుఖింపఁ జేయుచుండురు. ఒకనాఁడు యాసుఁ డా మందిరంబులలో నొకదానియందుఁ బవ్వళించి నిదురించెను. జవరాండ్రగు నతని ప్రియురాండ్రును మఱి మఱచి నిదురవోయిరి. తొల్లి గౌతమబుద్ధునకుఁ దటస్థించినయవస్థయె నాఁటి రేయి సంపన్నుఁ డైనయావణిక్కుమారునకు సంభవించెను. దైవవశమున యాసున కంగనలకంటిముందు మెలఁకువవచ్చెను. వచ్చుటయు వారివికృతాకారము లతని కంటఁ బడెను. ఒకతె వాయించుచున్న మద్దెల మెడక్రిందఁ బెట్టుకొని పండుకొనియెను. ఒకతె మ్రోయించుచున్న గానయంత్రము బాహుమూలమునఁ బడెను. ఒకతెకొప్పు విడిపోయెను. ఒకదానినోటినుండి లాలాజలము గారెను. వాండ్రింద ఱేమేమో నిద్రాపారవశ్యమున గొణుగుకొనసాగిరి. అప్పటి నాయవస్థఁ జూచిన వారికి బలుపీనుఁగులనడుమ నున్నట్లు తోఁచకపోదు. యాసుం డది చూచినతోడనె హేయమయిన యతనిజీవనము కన్నులఁ గట్టినట్లగపడెను. అగపడుటయు నతఁడు భయశోకాన్వితుఁడై "హా! యెంతదుఃఖ మెంత యపాయ"మని పలికెను. అట్లుపలికి యతఁడు తత్క్షణమె ప్రియాంగనలను మందిరంబులను విడిచి వైరాగ్య ప్రేరితుఁడై బుద్ధదేవ నిలయమయిన మృగదావకాననమున కరిగెను. మహానుభావుఁ డైనశాక్యసింహుఁడు గౌతముఁడు నిర్వాణమార్గముం గనిపెట్టి పతితులను పావనులఁ జేయుచున్నాఁడని యంతకుమున్నె యతఁడు విని యుండుటం జేసి యచ్చోటికిఁ బోయెను. ప్రపంచిక బాధలనుండి మానవుని రక్షింపఁ గలసమర్థుఁడతఁ డొక్కఁడే యని యతనికిఁ దోఁచెను. యాసుఁ డతఁ డున్న తావునకుఁ జని యతనిం గాంచి "హా! యెంతదుఃఖ మెంతయపాయ" మని మరల పలికెను. "ఇక్కడదుఃఖములేదు. ఇక్కడ నపాయములేదు. మిత్రుఁడా! యిటు వచ్చి కూర్చుండుము. నేను నీకు సత్యధర్మ ముపదేశించెదను. రారా." యని బుద్ధుఁడు సాదరముగ నతనికిఁ బ్రత్యుత్తరమిచ్చెను.

అప్పలుకులు శ్రవణగోచరములగుటయు యాసుఁడు మేరమీఱినయానందము నొంది యతనిసామీప్యమునకరిగి కడువినయంబున నమస్కరించి దాపునఁ గూర్చుండెను. అంతట బుద్ధుఁడతనికిఁ బరమార్థము నుపదేశించెను. బిచ్చము పెట్టుటవలనఁ గలుగు ఫలమును ముందుగాఁ జెప్పి, పిమ్మట నతఁడు మానవధర్మములు, నీతి, స్వర్గము, దురాచారములు, గర్వము, పాపము, తృష్ణ మొదలగువానిని గూర్చి యుపన్యసించి యవ్వాలఁ గోర్కెల జయించుటవలనఁ గలుగు లాభముల నుగ్గడించెను. యాసునిమనస్సు ధర్మోపదేశమునకుఁ దగినస్థితిలో నున్న దని తెలిసికొన్నపిదప భగవానుఁడైన బుద్ధుఁడు తనసిద్ధాంతము నుపదేశించెను. అనఁగా దుఃఖము దుఃఖకారణము దుఃఖకారణనాశనము నిర్వాణమార్గసాధనము మొదలగుమార్గములను నుపదేశించెను. ఉపదేశానంతరము నసిద్ధమనస్కుఁడైన యాసుఁడు భిక్షు వయ్యెను. బుద్ధుఁడు బోధించిన నిర్వాణధర్మము సంపూర్తముగ ననుసరించినవారు భిక్షువులనఁబడుదురు. వారు ప్రపంచసంబంధము విడిచిపెట్టవలెను. దారపుత్రలను బంధువులను గృహమును బాసి పోవలెను. ఆయాశ్రమంబునకు సత్ప్రవర్తనము దారిద్ర్యానుభవము ననునవి ముఖ్యలక్షణములు. అతఁడు బిచ్చమెత్తికొని జీవింపవలెను. ఊరు వెలుపలనె గాని జనపదంబుల నుండఁ గూడదు. ఇట్లు నడుచుకొన్నవాఁడు కాలక్రమంబున భిక్షువగును. యాసుఁ డాశ్రమము స్వీకరించినయచిరకాలముననె యాతని తండ్రియుఁ దల్లియు భార్యయు బుద్ధధర్మము నంగీకరించి గృహస్థశిష్యులైరి. యాసుని ముఖ్యమిత్రులలో నలుగురు విమలుఁడు సబాహుఁడు పున్నజియు గవుంపతి ననువారు తమమిత్రునిమార్గము ననుసరించి బుద్ధధర్మము స్వీకరించి భిక్షువులైరి. బుద్ధుఁడు ధర్మబోధ మారంభించిన మూఁడుమాసములలో నేఁబదిమంది శిరోముండనము జేసికొని కాషాయవస్త్రములు ధరించి భిక్షువులైరి. మఱికొన్నినాళ్ళలో నఱువదిమంది యర్హతులైరి. భిక్షువులకె యర్హతు లని పేరు

ఏకాదశాధ్యాయము.

అట్లుచేరినయఱువదిమంది భిక్షుకులతోడ ధర్మాత్ముండైనబుద్ధుఁ డొక్కనాఁడిట్లనియె. "ఓభిక్షుకులారా! దైవికములు మానుషములు నగుసకలబంధములనుండియు నేను విముక్తుఁడ నైతిని. మీరింక వెళ్ళుఁడు. దేవతలయొక్కయు మనుష్యులయొక్కయు మేలుకొఱకు లాభముకొఱకు క్షేమముకొఱకు దేశమంతయుఁ దిరుగుఁడు. ఒకఁడుపోయినదారి నొకఁడు పోవలదు. ఆదియందు మహాత్మమై మధ్యమందు మహాత్మమై యంత్యమందు మహాత్మమై వెలయునట్టియాసిద్ధాంతమును బోధింపుఁడు. కొన్నిసమయముల సూత్రములలో నున్న దున్నట్లు యథాశబ్దముగఁ బోధింపుఁడు. కొన్నిసమయములసారముమాత్రమే బోధింపుఁడు. సంపూర్ణమైన పవిత్రజీవనమే బ్రహ్మజ్ఞానమని సాటింపుఁడు" యీవిధంబున నాజ్ఞప్తులై యామహాప్రభువుయొక్క శిష్యులు మతబోధకులై దేదేశంబుల కరిగిరి. తానును కాశిలో నేయుండెను. బుద్ధుఁడుమాత్రము నుర్వేలవైపునకుం జనెను. శిష్యులు గురువునకు దూరముగా నుండుటచే నొకయిబ్బంది తటస్థించెను. ఈబోధకులు క్రొత్తగ మతములో నెవ్వరినైనఁ గలిపినప్పుఁడు వానికి ధర్మోపదేశము జేసి యాశ్రమ మిచ్చునట్టి యధికారము వారికి లేదు. అట్టియధికారము బుద్ధునకుమాత్రమే యుండెను. అందుచేత బోధకులు క్రొత్తగ మతములోఁ గలిసినవారిని వెంటఁ బెట్టుకొని బుద్ధునివెదకికొనుచుఁ దిరుగవలసివచ్చెను. ఈయిబ్బందిని కనిపెట్టి బుద్ధుఁడుశిష్యులతో నిట్లనియె. "ఓభిక్షుకులారా! యీవిషయమై మీ కధికారమిచ్చుచున్నాను. నేఁడుమొదలుకొని మీరునానాదేశములలో మతస్వీకారము చేసి భిక్షులు కాఁదలఁచినవారికి మీరే "ఉపసంపద" నొసంగుఁడు. ఉపసంపద యనఁగ భిక్షుకులుగాఁ జేర్చుకొనుట. అదియీవిధముగా నొసంగుఁడు.

భిక్షుకుఁడుగాఁ దలఁచు కొన్నవాఁడు ముందుగా శిరోముండనము చేయించుకొనవలె నని చెప్పెఁడు. అనంతరము కాషాయవస్త్రములు ధరింపు మనుఁడు. పై యుత్తరీయ మొకభుజము కప్పునట్లు వైచికొమ్మ నుఁడు. తనయెదుట నున్నభిక్షుకులపాదములకుఁ దనతల సోఁకునట్లు సాష్టాంగనమస్కారముచేయు మనుఁడు. పిమ్మట మోఁకాళ్ళమీఁదఁ గూర్చుండు మనుఁడు.తరువాతహస్తములు మోడ్చి యిట్లుపలుకుమనుఁ డు."నాకు బుద్ధుఁడే శరణము. నాకు ధర్మమే శరణము. నాకు సంఘమే శరణము." ఇది ముమ్మాఱుపలుకుమనుఁడు. ఈయుపదేశము విని భిక్షుకులు నానాభాగములకరిగిరి. బుద్ధుఁడు మగధదేశము వైపున కరిగి క్రమక్రమముగా నుర్వేలఁ జేరెను.

ఆకాలమందు మగధదేశమున ముప్వురు మహాపురుషులుండిరి. అందుఁ బ్రథముఁడు కశ్యపుఁడు. ఉపాతిస్సుఁడు ద్వితీయుఁడు. సరిపుత్రుఁడు తృతీయుఁడు. ఈముప్వురుపురుషులు గొప్పయోగులు, మహాపండితులు, మహోపాధ్యాయులు. ఒక్కొక్కనికి వందలకొలఁది శిష్యులు కలరు. అందుఁ గశ్యపులు ముప్వురుసోదరులు. అందుజ్యేష్ఠుఁడు "ఉరువేలజటిలకశ్యపుఁడు. రెండవయతఁడు నదీకశ్యపుఁడు. మూఁడవయతఁడు గయాకశ్యపుఁడు" ఉర్వేలజటిలకశ్యపుఁడనఁగా నుర్వేల గ్రామమున వసించుచున్నవాఁడు. జడలు గలవాఁడని యర్థము. ఇతఁడుమహాయోగియై జటాధారియై తపముఁ జేసికొనుచుండును. నదీకశ్యపుఁ డనఁగాఁ నదీతీరమందుండువాఁడని యర్థము. గయాకశ్యపుఁ డనఁగా గయలో నున్నవాఁడని యర్థము. బుద్ధుఁడు జటిలకశ్యపునిదగ్గఱకుఁబోయి శీతకాలమంతయు వతసితోఁ గడిపి తననూతనసిద్ధాంతమతనికి బోధించెను. ఆసిద్ధాంతములు మనస్సునకు నచ్చుటచే జటిలకశ్యపుఁడు తనపూర్వధర్మము విడిచి బుద్ధధర్మస్వీకారము చేయఁదలఁచి భిక్షుకాశ్రమ మిప్పింపుమని బుద్ధుని వేఁడెను. అప్పుఁడు బుద్ధుఁడుతన

కిట్లనియె. "ఓకశ్యప! అయిదువందలజటిలులకు నీవు నాయకుఁడ వును బోధకుఁడ వయి పరమగురువవై యున్నావు. కావున ముందుగా నీవు నీశిష్యులకడకుఁబోయి నీవు చేయఁదలఁచినపని వారితోఁ జెప్పి తమ యిష్టము వచ్చినట్లు చేయుమని వారితోఁ జెప్పుము" అనవుఁడు నట్లె యని జటిలకశ్యపుఁడు తనశిష్యులయొద్దకుఁబోయి "అయ్యలారా! నేను శ్రమణగౌతమునియొక్క శిష్యుఁడనై యతనిమతము స్వీకరింపఁదలఁచు కొన్నాను. మీరు మీయిష్టము వచ్చినట్లు జేయవచ్చు." నని పలికెను. అనవుఁడు వారందఱు నేకకంఠ్యముగ నిట్లనిరి. "మీరు గౌతమశ్రమణునియొక్క శిష్యులై మతస్వీకారము చేయఁ దలఁచుకొన్న యెడల మేమును నాయనకు శిష్యులమై మతస్వీకారముఁ జేసెదము." అట్లు పలికి కశ్యపసమేతులై వారందఱు జడలు గడ్డములు మీసములు గొరిగించికొని యగ్నిహోత్రములను దత్సంబంధము లగునుపకరణములను నీటిలోఁ బాఱవైచి ఘనాత్ముఁడైనబుద్ధదేవునిసన్నిధి కరిగి యాతని సందర్శించి "స్వామీ! పరివ్రాజకోపసంపదలను నాశ్రమములను మాకుఁ బ్రసాదింపుఁ" డని వేఁడుకొనిరి. ఆవేడికోలువిని బుద్ధుఁడు "భిక్షులారా ! రండు, రండు. పవిత్రజీవనము సేయుఁడు. అంతట మీకు బాధానాశన మగును." ఇత్తెఱంగునఁ బరమపూజ్యులగు నామహాపురుషు లందఱు బుద్ధధర్మస్వీకారముఁ జేసిరి. అచిరకాలములోనే నదీకశ్యప గయాకశ్యపులును దమతమ శిష్యబృందములతో నగ్రసోదరునిమార్గ మనుసరించిరి. ఈకశ్యపత్రయము తన్ననుసరించుటచే బుద్ధదేవుఁడు వేయిమందికంటె నధికులయిన శిష్యులకు స్వల్పకాలములో నాయకుఁ డయ్యెను. ఈభిక్షుకమండలము దన్నుఁ బరివేష్టించి వెంటరా బుద్ధదేవుఁడు మహావైభవముతో మగధరాజధానియైన రాజగృహంబునకుం జనియెను. ఉపాతిశుఁడు, సరిపుత్త్రుఁడు ననుమహాపండితులు రాజగృహంబునందె వీరిద్దఱు నివసించుచుండిరి.

మతధర్మములందు నిధులు. అధికమేధావంతులు. అసాధారణప్రజ్ఞా దక్షులు. నిరుపమానసామర్థ్యము గలిగియు వారు సంజయుండను మహావిద్వాంసునియొద్ద నప్పటికిని శిష్యులయి స్వతంత్రముగఁ బాఠశాలను స్థాపించి పాఠములఁ జెప్పుట లేదు. అయినను సంజయునిశిష్యులకెల్ల వారే పాఠములు చెప్పుచువచ్చిరి. వీరిగుంపుటచేతనే సంజయుని యొద్ద ననేకశిష్యులున్నారని ప్రతీతి కలిగెను. వీరిశిష్యులే సంజయుని శిష్యులని లోకులు చెప్పుకొనఁజొచ్చిరి. సరిపుత్త్రుఁడొక్కనాఁడు బుద్ధశిష్యులలో నొకఁడగు భిక్షుకునిఁగలిసికొని యిట్లనియె. "అయ్యా! నీదేహచ్ఛాయ స్వచ్ఛమై మెఱయుచున్నది. మిత్రుఁడా! నీవెవ్వరిపేరఁ బ్రపంచమునకుఁ బరాఙ్ముఖుండవైతివి? నీయుపదేష్ట యెవ్వఁడు? నీవెవ్వరిధర్మ మనుసరించినాఁడవు?" అనవుడు నాభిక్షుకుఁ డిట్లనియె. "అయ్యా! శ్రమణగౌతముఁ డని యొకమహాత్ముఁడు కలఁడు. అతఁడు శాక్యముని. నేనతనిపేర నీప్రపంచమునకుఁ బరాఙ్ముఖుండనైతిని. అతఁడే నాగురువు. ఆమహానుభావునిధర్మమే నే నవలంబించినాఁడను." అనవుడు సరిపుత్త్రుఁడు "మీగురువు కని పెట్టి నీకుపదేశించిన యాసిద్ధాంతమేది" యని యడిగెను. అనవుడు నాభిక్షుకుఁ డిట్లనియె. "మిత్రుఁడా! ఆయనకు నేనొక చిన్న శిష్యుఁడను. ఇనడుమనే నే నాశ్రమస్వీకారముఁ జేసితిని. ఈసిద్ధాన్తమును శిక్షను నేను క్రొత్తగా నేర్చుకొనుచున్నాఁడను. కాఁబట్టి యామహాసిద్ధాంతము వివరముగాఁ జెప్పఁజాలను గాని సంగ్రహముగాఁ జెప్పెద వినుము" అనవుడు సరిపుత్త్రుఁడు "మిత్రుఁడా! నీవు సవిస్తరముగాఁ జెప్పినను సరే, సంగ్రహముగాఁ జెప్పినను సరే. ఆసిద్ధాంతసార మేదో చెప్పు" మని యడిగెను. అడుగుటయు నాశ్రమణకుఁ డిట్లనియెను. "కారణమునుండి బయలుదేరు సమస్త కార్యములకు మహాత్ముఁడయినతథాగతుఁడు విమోచనముఁ గనిపెట్టెను. ఇదే పరమసిద్ధాంతము" అది విని

సరిపుత్రుఁడు తనమిత్రుఁడైన యుపాతిశునికడ కరిగి తాను గౌతమశ్రమణకులలో నొకనిం గలసికొనుటయుఁ దనకు నతనికి సంభాషణ జరుగుటయు నెరింగించెను. అనంతరము వారిరువురు గౌతమశ్రమణకునిగొద్దకరిగి యాతని సిద్ధాంతముల నేర్చికొనవలయు నని నిశ్చయించిరి. వారు కాషాయాంబరధారులై బుద్ధశిష్యులు కాఁగానే వారిగురువైన సంజయునియొక్క శిష్యగణమెల్ల వీరిననుసరించి బుద్ధుని శిష్యగణమయ్యెను. సంజయశిష్యులు చేరఁగానె బుద్ధుఁడు వేనవేలు శిష్యులకు గురువై జస్తివనమున నుండెను. వేనవేలు శిష్యులతో నుపాతిశసరిపుత్రులు బుద్ధధర్మము స్వీకరించి రనువార్త వెల్లడియైనతోడనే మగధరాజ్యమునందు, ముఖ్యముగా రాజగృహమునందు గొప్పసంక్షోభముపుట్టెను. సన్యాసులు యోగులు విద్వాంసులైనబ్రాహ్మణులు గృహస్థులు ధనవంతులు దరిద్రులు పెద్దలు పిన్నలు జస్తివనమందున్న బుద్ధుని దర్శనము చేయ నభిలషించిరి.

బుద్ధుని పేరు మగధదేశమం దంతటను మ్రోఁగఁజొచ్చెను. మగధదేశాధీశుఁడైన బింబిసారుఁడే స్వయముగా వచ్చి యాతనిదర్శనముఁజేసెను. మగధేశ్వరుఁడు వేనవేలు బ్రాహ్మణులతోఁ గలిసి సిద్ధార్థునిదర్శనమున కరిగెనఁట. అట్లరిగి వినయపూర్వకముగా నమస్కరించి భక్తితత్పరుఁడై యాతనిప్రక్కను గూర్చుండెను. ఉరువేలకశ్యపుఁడును బుద్ధుఁడును నొక్కనెలవుననే కూర్చుండుటంజేసి బింబిసారునివెంట నరిగినబ్రాహ్మణులు, జటిలకశ్యపుఁడు గౌతమశ్రమణుని శిష్యుఁడయ్యెనా, గౌతమశ్రమణుఁడే జటిలకశ్యపునిశిష్యుఁడయ్యెనా యని సంశయాకులాత్ములయిరి. ఆవిప్రులమనంబులో నట్టి సందియంబు పొడమె నని బుద్ధుఁడు తనమనంబున నెఱింగి జటిలకశ్యపునుద్దేశించి "మహాతపంబులకుఁ బ్రసిద్ధికెక్కిన నీవు నీతపంబుల నగ్నిహోత్రంబుల విసర్జించుటకు నేమికారణ మనియడిగెను. అనవు

డు జటిలకశ్యపుఁ డిట్లు బదులు చెప్పెను. "తపంబులవలన యాగంబుల వలన దృశ్యమాన పదార్థంబును మధురశబ్దంబులు రుచులు మహానందములు యువతీజనంబులు మున్నగునవి మాత్రమే లభించును. కనఁబడుచున్న దంతయు నసత్య మనియు మాలిన్యమనియుఁ దెలిసికొని యాగాదికర్మములు నేను మానితిని." వెండియు బుద్ధుఁడు కశ్యపు నిట్లడిగెను. "దృశ్యమాన పదార్థములయందును, మధురశబ్దములందును నీమనస్సున కానందము గలుగనిపక్షమున, నీమానవప్రపంచమున నీమనస్సున కిప్పు డేది యానందకరముగా నున్నది?" అనవుడు నురువేలకశ్యపుఁ డిట్లుత్తరము చెప్పెను. "ఎద్దానివలన ననంతజన్మవ్యాధులును సంపూర్ణత్వవిఘ్నకారణములును నశించునో యాపవిత్రశాంతమయిన నిర్వాణమార్గము నేను జూచితిని" అని పలికి యంత నిలువక జటిలకశ్యపుఁడు తనయాసనంబునుండి దిగ్గున లేచి యుత్తరీయ మొకభుజమును కప్పున ట్లమర్చుకొని బుద్ధదేవునిపాదములు తనతల సోకునట్లు సాష్టాంగనమస్కార మొనర్చి "నాగురువు నాస్వామియు మహాత్ముఁ డైనతథాగతుఁడే" యని పలికెను. అనంతరము బుద్ధుఁడు ధర్మోపన్యాసము చేసెను. అటమీఁద మగధరాజు శిష్యగణసమేతముగ బుద్ధునిఁ దననగరున కాహ్వానముచేసి వారిని సగౌరవముగఁ దోడ్కొనిపోయి బుద్ధునకును భిక్షువులకును స్వహస్తములతో మృష్టాన్నంబిడెను. బుద్ధుఁడు భోజనముచేసి తనహస్తంబులను భిక్షాపాత్రంబును గడిగికొని శుద్ధుఁడైనపిదప బింబిసారుఁ డతనిప్రక్కనుగూర్చుండి "స్వామీ! బుద్ధులును శిష్యులును నివసించుటకై నా వేణువనోద్యానము సమర్పించుచున్నాఁడ" నని మనవి యొనర్చెను. బుద్ధుఁ డా దానము గ్రహించెను. ఇది జరిగినతరువాత క్రమక్రమముగా జనుల యుత్సాహ మడఁగెను. ఉపాతిశసరిపుత్రులు శిష్యసమేతులై యాశ్రమస్వీకారము జేసినతరువాత మఱియెవ్వరీనూతనధర్మ మనుసరింప

లేదు. మహాత్ముఁడైన యొకానొక మతబోధకుఁడు పొడసూపినతోడనే జనులమనంబులలో మహాతరంగమువలె నింతంత యనరాని యుత్సాహము పొడమును. ఆబోధకుని మతంబు స్వీకరించుటచేతఁ గొందఱకును వానిని సందర్శించుటచేత మఱికొందఱకును వానితో సంభాషణ చేయుటచేత నింకకొందఱకును గ్రిందుకొన్న యుత్సాహముడిందుపడును. బుద్ధదేవునివిషయమునఁగూడ మొట్టమొదట నట్లె యయ్యెను. ఆయుత్సాహము మందగించినకొలఁది బ్రాహ్మణులయెడఁ దొల్లిఁటిగౌరవము క్రమక్రమముగ నశించి దానిస్థానమున ననిష్టము నెలకొనెను. ఈనూతనధర్మము గృహస్థులకున్న సుఖాధారముల నశింపఁ జేసి దేశము జనశూన్యముగఁ జేయునని మగధదేశస్థులగు నాగరజానపదులు శ్రమణకులను జూచినచోటనెల్ల నపహసించుచు నిందించుచు నగౌరవింపఁ జొచ్చిరి. తమయవస్థ యీవిధంబున నున్నదని శ్రమణకులు బుద్ధునితో నప్పుడప్పుడు మొఱలుపెట్టుకొనఁజొచ్చిరి. మాగధుల కింత కోపము వచ్చుటకు ముఖ్యకారణ మొకటి కలదు. గొప్పకుటుంబములయందు జనించి యెంతో యక్కఱకు రావలసినపడుచువాండ్ర నేకులు బుద్ధధర్మ మవలంబించి భిక్షుకు లయిరి. అదివినినతోడనే జనులు సణుగుకొని గొణుగుకొని యేవపడి కోపించి ద్వేషభావమూని యిట్లనఁ జొచ్చిరి. శ్రమణగౌతముఁడు తండ్రుల బిడ్డలఁ గనకుండఁ జేయుచున్నాఁడు. పుణ్యస్త్రీలందఱు వితంతువు లగునట్లు వంశములు నాశనము లగునట్లుగూడ నలుపుచున్నాఁడు. ఇదివఱకే యనేకులను సన్యాసులను జేసి తనశిష్యులుగఁ జేసికొన్నాఁడు. సంజయునిశిష్యులలో రెండువందలయేఁబదిమంది యతనిశిష్యులయినారు. మగధదేశమునందలి సుప్రసిద్ధవంశస్థులగుపడుచువాండ్రతనికడ మతధర్మములనేర్చుకొనుటకై సంసారములు విడిచి పోయిరి."

ఈభిక్షుకులు తమ యిండ్లప్రక్క నడచునప్పుడు పౌరులీక్రిం

దివిధమున వానిని బరిహసింపఁ జొచ్చిరి. "ఈగౌతము ప్రయాసము చేసి యీమహాభిక్షువు చిట్టచివరకు మామగధరాజధాని చేరినాఁడు. కొండమీఁదఁ గూర్చుండినట్టె గూర్చుండి సంజయుని శిష్యుల నందఱిను బరిగ్రహించినాఁడు. ఇంక నెవరిని గొలుపఁ దలఁచుకొన్నాఁడో చూతము." జనాభిప్రాయము తమకు విరుద్ధముగ నున్నదని శిష్యులవలన విని బుద్ధుఁడు శిష్యుల కిట్లు సెలవిచ్చెను. "శిష్యులారా! ఈయుద్రేకము చిరకాల ముండదు. కాని, వారు మిమ్ముఁ బరిహసించినప్పుడు మీ రిట్లుత్తరము చెప్పుఁడు. సర్వజ్ఞులయి మహాధీరులు సత్యమునుపదేశించి మనుష్యులను నూతనమతములలోఁ గలుపుదురు. సత్యబలము చేతనే జనులను దనమతమునఁ గలుపుచున్న బుద్ధునియందు దోషమున్నదని యెవరనఁగలరు? ధర్మకార్య ప్రారంభమున మహానుభావుఁడైన బుద్ధునకుఁ గలిగిన యిబ్బంది యిది యొక్కటి కాదు. సంజయునకు నుపాతిశునకు బుద్ధుఁడు శిష్యకోటిలో నున్నతస్థానమిచ్చెను. అట్లు చేయుట ప్రాఁతశిష్యులకుఁ గొందఱ కసూయ గలిగించెను. అదియెఱిఁగి బుద్ధుఁడు శిష్యులనందఱ నొక్కచోటఁ జేర్చి బౌద్ధుల మోక్షసాధనముం గూర్చి కొంతవడి కుపన్యసించి తుద కీక్రిందిపద్యములోని యర్థము వచ్చు శ్లోకముతోఁ దన యుపన్యాసము ముగించెను.

ఆ- వె. దురితకర్మములకు దూరంబు తొలఁగుట
హృదయశుద్ధి గలిగి యొసఁగుచుంట
సాధుకర్మములను శ్రద్ధతో సలుపుట
బుద్ధమతము సుండి పూజ్యులారా!

ఆకాలమునందే బౌద్ధసంఘములు నిమిత్తము ప్రథమధర్మముల నేర్పఱిచిరి. మిక్కిలి సూక్ష్మమయిన యీధర్మసూత్రములకు ప్రాతిమోక్షము అని పేరుపెట్టిరి. అటులు కూడిన యీసభకు "సేవకసమిపాత" మని పేరువచ్చెను.

ద్వాదశాధ్యాయము.

సిద్ధార్థుఁడు రాజగృహసమీపమున వేలువనమునందు భిక్షుకవ్రాతముతో నివసించుచున్నకాలమున జనకుఁడగు శుద్ధోదనుఁడు కపిలవస్తుపురమున కాయనను రమ్మని వర్తమాన మంపెను. ఆ సందేశముఁ దెచ్చినదూత శుద్ధోదనునిమాటల నీ విధముగా బుద్ధునితోఁ జెప్పెను. "నేను నిన్నుఁ జూడఁగోరుచున్నాఁడను. కాఁబట్టి వచ్చి నన్ను జూచిపొమ్ము. నీవు కనిపెట్టినధర్మముయొక్క లాభము పరులకే గాని నీతండ్రికి నీప్రియబంధువులకుఁ గలుగఁగూడదా ? మేము నిన్ను జూచి యేడుసంవత్సరములైనవి.

వృద్ధుఁడగు జనకునిసందేశము కపిలవస్తుపురమునకుఁ బోవ బుద్ధుని బురికొల్పెను. అతఁడు బయలుదేరునప్పటికి నతనివెంట నంగమగధదేశస్థులగు భిక్షుకులు పదివేలమందియు గపిలవస్తుపురమునుండి వచ్చిన సన్యాసులు పదివేలమందియు నుండిరి. ఈమహాభిక్షుకసైన్యముతో నతఁడు దినమున కెనిమిదిక్రోసులు ప్రయాణము చేసెను. కపిలవస్తుపురంబునకును రాజగృహనగరంబునకును నరువది యామడల దూరము గలదు. ఆదూరమంతయు బుద్ధుఁడు రెండుమాసములలోఁ బయనముఁ జేసెను. బుద్ధునిబసనిమిత్తము శుద్ధోదనుండు కపిలవస్తుపురమునకు సమీపమున నున్న నిగ్రోధవనమును బాగుచేయించి శుద్ధపటిచెను. బుద్ధుఁడు పురసమీపమునకు రాఁగానే నతని నెదుర్కొని సన్మానముచేయుటకు శుద్ధోదనుఁడు పండ్రెండుసంవత్సరములు వయస్సుగల మైదువందలమంది రాజకుమారులను, రాజపుత్రికలను నలంకరించి బారులుగా నిలువంబెట్టెను. ఆబాలురవెనుక హస్తములయందుఁ బుష్పములును సుగంధద్రవ్యములును ధరించిన

పదియాఱువేలమంది పరిజనులతోడను బంధుజనులతోడను శుద్ధోదనుఁడు నిలిచెను. బుద్ధుఁడు నిగ్రోధవనమును జేరి యిరువదివేలమంది భిక్షుకులు పరివేష్టింప నొకగద్దియుపయిఁ గూర్చుండి నిండోలగంబుండెను. మఱునాఁడు రాజబంధువులు పరిజనంబును సిద్ధార్థుఁని రాక కయి పరమానందభరితులయియుండి యతనికన్నము పంపవలెనన్న మాట మరిచిపోయిరి. బుద్ధుఁ డుదయముననె లేచి కాల్యకృత్యముల నిర్వర్తించుకొని స్నానముచేసి కొంతసేపు ధ్యానసమాధినిష్ఠుఁడయ్యెను. అది ముగిసినవెనుక భోజనకాలము సమీపించినందున బుద్ధుఁడు భిక్షాపాత్రము చేతఁబూని యిరువదివేలమంది భిక్షుకులు వెంటరాఁ బట్టణముఁ బ్రవేశించి యింటింటికరిగి భిక్ష మడిగెను. జనకుఁడును రాజును నగు శుద్ధోదనుఁ డావార్తఁ విని యతిత్వరితంబున గుమారుఁడున్నతావున కరిగి యిట్లనియెను.

“కుమారా! ఏల నీవు నన్నిట్లవమానించెదవు. నీవు జంబూద్వీపమునందుఁగల సకలరాజులతోఁ గూడి వచ్చినను సపరివారముగ వారికందఱకు నేను షడ్రసోపేతమగు మృష్టాన్నముఁ బెట్టఁ జాలుదునుగదా. అట్టియెడ నీకును నీయిరువదివేలమంది బిక్షుకులకును గావలసినయన్నము నేను పెట్టలేకపోతినా? ఏల నాకనులముందరనే భిక్షమెత్తెదవు?” అనవుడు “ఇది నావంశాచారము. తప్పు లే” దని బుద్ధుఁ డుత్తరము చెప్పెను. ‘ఎట్టెట్టు! ఇది నీవంశాచారమా? నీవు మహాశమంతుని వంశమున జనించితివి. నీవంశస్థు లెవ్వరు మున్నిట్లు చేసి, యెఱుఁగరు. నీపూర్వులలోఁ గొందఱు తమకు భోజనపదార్థములు కావలసివచ్చినప్పుడు తమకాలితో నేల దన్నుచు వచ్చిరి. అప్పుడు వారికిఁ గావలసినసమస్త పదార్థములు వచ్చిపడుచుండెడి” వని శుద్ధోధనుఁడు బుద్ధునితో ననెను. అప్పలుకులు విని బుద్ధుఁ డిట్లనియె. “అయ్యా! నేను మహాశమంతునివంశముమాట చెప్పుటలేదు.

నావంశాచారమనఁగా బుద్ధులవంశాచారము. బుద్ధులందఱు నావిధముగానే బిచ్చమెత్తి జీవించిరి. భూమియందు దాఁగియుండిన నిక్షేపము తనయునకు లభించినప్పుడా యమూల్యాభరణాదులు లభించినవార్త తండ్రి కెఱింగించి యవి వానికిఁ జూపుట తనయునకు విధి. కాఁబట్టి నేను కనిపెట్టిన ధర్మనిధిని దెఱచి మీకుఁ జూపుచున్నాఁడను. నాధర్మము విన్నవాని కభ్యుదయపరంపరలు గలుగు" నని చెప్పి యతఁడు తనధర్మము తండ్రి కుపదేశించెను. ఆబోధామృతాస్వాదనము జేసి శుద్ధోధనుఁడు శుద్ధాంతఃకరణముతో నూతనధర్మము స్వీకరించెను.

అనంతరము శుద్ధోదనుఁడు బుద్ధుని సందర్శింపఁ దలఁచుకొన్న పక్షమునఁ బోయి చూడవచ్చునని కోడలగు యశోధరకు వర్తమాన మంపెను. "నే నించుకేనియు గౌరవంబునకు భాజనంబనైతి నేని యామహాత్ముఁడే ముందుగ నిందు దయచేసి నన్నుఁజూచి సమాశ్వాసించుఁగాక! అప్పుడె నేనాయనపాదముల సర్శింపఁగల"నని యశోధర ప్రతివర్తమాన మంపెను. శుద్ధోధనుఁ డాసందేశమెఱిఁగింప బుద్ధుఁడు యశోధరను జూడ నామెయుంతిపురమునకుఁ బయనమైపోవుచు దారిలో మగ్గలానుఁడు మొదలగు భిక్షుకులతో నిట్లనియె.

"ఆరాజపుత్రిక కోరికల జయింపలేదు గాని నే నెల్లదుష్కామంబుల జయించితిని. చిరకాలమునుండి నన్నామె జూచి యెఱుఁగదు గావున మిక్కిలి శోకించుచుండును. ఆదుఃఖజలము ప్రవహించుట కెడ మిచ్చినంగాని యామెగుండె పగిలిపోవును. ఆమె నాయడుగులం బట్టుకొని వదలదు. మొత్తముమీఁద నీసమావేశముయొక్క ఫలితమిది. ఈమె తక్కిన రాజపుత్రికలతోఁ గూడ నాధర్మ మవలంబించి సన్యాసిని యగును." బుద్ధుఁడు నిన్నుఁజూడవచ్చుచున్నాఁడని విన్నప్పుడు యశోధర జలపూర్ణమగు భాండమువలె నత్యంతప్రేమ

భరిత యయ్యెను. బుద్ధుని సందర్శింపఁగానె తానొక సామాన్యస్త్రీ యొగాని యామహాత్మునకు భార్య కాదన్నమాటయు, బుద్ధుఁడు తొల్లివలెఁ దనప్రాణనాథుఁడు గాక జగన్నాథుఁ డయ్యెననుమాటయు మఱచి స్త్రీస్వభావసులభమైన దుఃఖమునకుఁ దావలంబయి యాతని యడుగులం బడి తద్దయు శోకించెను. అట్లు కొంతసేపు వగచుచున్నటికి మామగారైన శుద్ధోధనుఁ డచ్చటనున్నాఁ డన్నమాట జ్ఞప్తికి రాఁగా నామె సిగ్గుపడి యాతని పాదములు విడిచి లేచి యొకప్రక్క కొదిగి నిలువంబడెను. మహాబ్రహ్మకైన నంటరాని యాతని పవిత్రపాదములను యశోధర యంటినందుకు శుద్ధోదనుఁడు వగచి క్షమింపు మని బుద్ధుని వేఁడుకొని యిట్లనియె. "పాప మీదుఃఖ మామెప్రేమాతిశయమునఁ బొడముచున్నది. ఇది తాత్కాలికమైనది కాదు. నీ వామెను విడిచిపోయిన యేడుసంవత్సరములనుండియు నామె నీనిమిత్త మిట్లే శోకించుచున్నది. నీవు శిరోముండనముఁ జేయించుకొంటి వని విని యాక్షణమె యామెయు శిరోముండనము చేసికొనెను. నీవు ప్రాఁతగుడ్డలు గట్టితి వని వినినప్పుడు తానును బ్రాఁతగుడ్డలు కట్టెను. నగలను నాణెములను సుగంధద్రవ్యములను బరిత్యజించితి వని విన్నప్పు డామెయు వానిని బరిత్యజించెను. నీవలెనె యామెయు మితాహారిణి యయ్యె. నీవలెనె మట్టిమూఁకుడులో నన్నము దినుచున్నది. నీవలెనే గద్దియలపైఁ గూర్చుండుట మానుకొనినది. కావున నామెను క్షమింపుము" బుద్ధుఁడు తండ్రిపలుకుల కలరి యశోధర నాశీర్వదించి భిక్షుకబృందము విడిచియున్న తావున కరిగెను.

శుద్ధోధనునికి ద్వితీయభార్య యగుమహాప్రజావతిదేవివలన నొకకుమారుఁడు గలఁడు. ఆతని పేరు నందుఁడు. మహాప్రజాపతిదేవి మాయాదేవికి సోదరి యగుటచే బుద్ధునకు సవతితల్లి మాత్రె

మేగాక పినతల్లిగూడ నయ్యెను. అందుచే నందుఁడు బుద్ధునకు సవతి తమ్ముఁడే గాక పినతల్లికొడుకుగూడను. శుద్ధోధనుఁడు నందుని యువ రాజుం జేయ వలయు ననియు నతనికి వివాహము జేయవలయుననియు నతనిని బ్రత్యేకముగా నొక మేడలోఁ బ్రవేశపెట్టవలయు ననియు సంకల్పించి యామూఁడుకార్యముల కొక్కనాఁడె ముహూర్త మేర్ప ఱచెను. బుద్ధుఁడు యశోధరతో మాటలాడి వెళ్ళినదినమే యాసుము హూర్తదినము. ఆసుముహూర్తమునకు శుద్ధోదనుఁడు బుద్ధునిఁగూడ నాహ్వానము చేసినందున కతఁడు తనభిక్షుకసమాజముం గలసి యామహోత్సవమున కరిగెను. అరుగుటలో నమ్మహోత్సవ ముగనుల పండువుగాఁ జూచుటే తన తలంపు గాదు. తన త మ్ముఁడైన నందునిజన్మసంబంధమైన దుఃఖము నుండి విముక్తుని జేయుటయే యాతని ముఖ్యోద్దేశము. బుద్ధుఁడు తన నిమి త్తము సిద్ధము చేయఁబడిన మహాసనముమీఁదఁ గూర్చుండి యీ క్రింది పద్యములో నియర్థము వచ్చు నొకశ్లోకముం జదివెను.

తే. గీ. చెడ్డతలఁపులు నశియింపఁ జేయు చుంట
బ్రహ్మచర్యంబు గొనుట ధర్మములు నాల్గు
నెఱిఁగి నిర్వాణపథమందు దృష్టి నిలిపి
యుంట, యనునివి నరునకు నుత్సవములు.

ఆ శ్లోకము జదువఁగానె నందుఁడు బుద్ధుఁడు చేయునట్టి యుప దేశమునం దాసక్తి గలవాఁడై యాతని సమీపమునకు వచ్చెను. ఆ సమయమున నందుఁడమూల్యములైన వస్త్రాలంకారములు ధరించి యుండినను, నవవధూసమాగమమున కెదురు చూచుచుండినను బుద్ధుఁడు మనంబున నించుకేనియు సంశయింపక తన భిక్షాపాత్ర మాతని చేతిలోఁ బెట్టెను. నందుఁ డాపాత్రమును గ్రహించెను. అనంతరము బుద్ధుఁడు తన పీఠమునుండి లేచి తనబస కరిగెను. సకల

బాంధవగణము న్విడిచి నందుఁ డాతని వెంటఁబడెను. అతఁడు వివాహ మాడఁ దలఁచిన కన్యయగు జనపదకల్యాణి బుద్ధుని వెంటఁ బోవుచున్న యీ రాజకుమారుని గవాక్షమునుండి చూచి మీ రెందుఁ బోవు చున్నారని యడిగెను. అడిగెను గాని నందుఁ డామెకుఁ బ్రత్యుత్తర మీయక రయే తల వంచుకొని పోయెను. సన్న్యాసముఁ జేరినతరు వాత బుద్ధుఁడు నందు నుద్దేశించి "వత్సా! చక్రవర్తి పదవివలనఁ గలుగు గౌరవంబును నీవు సరకు చేయకుము. నావలె సన్న్యాసినివి గమ్మని యుపదేశించెను. నిగ్రోధవనమున కరిగిన కొంత సేపటి వఱకు నందుని యాలోచనలు కేవలవైరాగ్యము మీఁదనే నిలుపక తాను పాణిగ్రహణము సేయఁదలఁచిన ప్రియురాలి మీఁదను రాజ్య వైభవము మీఁదను సంచరింపఁ దొడఁగెను. బుద్ధుఁ డితని మనో వైకల్యములం దెలిసికొని తనబోధామృత ధారలచేత నాతని మనంబు నావరించిన చెడ్డతలంపుల నెల్ల దూరముగాఁ దోలెను. అంతట నందుఁడు మంచితలంపులు గలిగి పరిశుద్ధుఁడై యుండ మెగ్గలానుఁ డతనిని భిక్షుకునిఁ జేసెను.

కపిలవస్తు పురమునకు బుద్ధుఁడు వచ్చిన యేడవనాఁడు యశో ధరకుమారుఁడైన రాహులుని వెల లేనివస్త్రములతోడను మహా భరణములతోడను రాజకుమారుని శీవికిందగినట్లలంకరించి మేడపైఁ గూర్చుండఁ బెట్టుకొని బిచ్చము నిమిత్త మాదారినిఁ బోవుచున్న బుద్ధునిం జూపి యిట్లనియె. "మహాబ్రహ్మవలెఁ గనఁబడుచున్న యీ భిక్షుకుఁడు నీతండ్రి. ఈయనయొక్క నాలుగుధననిక్షేపము లున్నవి. ఈయన వెడలి పోయిన నాఁటనుండియు నాకవికనఁబడ లేదు. తండ్రి యార్జించిన విత్తము ననుభవింపఁ గుమారుఁ డర్హుఁడు గావున నీవా మహానుభావునికడ కరిగి యా నాలుగుధననిక్షేపములను జక్రవర్తుల కుండవలసినతక్కిన ధననిక్షేపములను నీకిమ్మని కోరుము." అనవుడు

రాహులుఁ డిట్లనియె. "అమ్మా! శుద్ధోదన మహారాజు తప్ప మఱియెవ్వరిని నేనెఱుఁగను. ఆయనయే తండ్రియని యనుకొనుచున్నాను. నా తండ్రి వేఱొకఁ డున్నాఁడా?" అనుటయు యశోధర కుమారుని గవాక్షముకడకుఁ దీసికొని పోయి "నాయనా! యాభిక్షుకుఁడె నీ తండ్రి" యని వ్రేలితోఁ జూపెను. వెంటనె రాహులుఁడు బుద్ధుఁ డున్నచోటికిఁ బోయి యాతని మొగమువంక తేఱిపాఱఁ జూచి శంకలేక ప్రేమాస్పదముగా "నాయనా నాయనా" యని పిలిచెను. అత్తరి బుద్ధుఁడు భోజనము చేయుచుండెను. భోజనముచేసి బుద్ధుఁడు తన కన్నము పెట్టినవారిని దీవించి రాహులుని వంక జూడకయె న్యగ్రోధవనమున కరుగఁజొచ్చెను. అతఁడు తనవంక జూడక పోయినను పిన్నఁ బలుకరింపకపోయినను రాహులుఁడు నాయనా నాయనా నాకు నిక్షేపము లిమ్మని యాతని వెనువెంటఁ బడెను. తనవెంట రావద్దని బుద్ధుఁ డాతని నివారింపలేదు. పౌరులు గాని భిక్షుకులు గాని యంతకంటె నివారింప లేదు. ఎట్టకేలకు బుద్ధుఁడు తన బస కరిగి సుజాతునిం జూచి యిట్లనియె. "నా కుమారుఁడు తనకు రావలసిన దాయభాగ మిమ్మని యడుగుచున్నాఁడు. జన్మపరంపరాదుఃఖములు గల దాయమాతనికి నే నియ్యఁదలఁచుకొనలేదు. బుద్ధత్వసంబంధమైన దాయమిచ్చెదను. అది నాశనము లేనిదికదా. సుజాత! ఈబాలకుని శిరస్సు ముండనముచేసి భిక్షుకునిఁ జేయుము" రాహులుఁ డేడుసంవత్సరముల ప్రాయము గలతల్లిచాటు బిడ్డఁడనియైన శంకింపక మేన నున్న యమూల్యవస్త్రాలంకారములం దీసి పాఱవైచి శిరోముండనమునుఁ జేయించి కాషాయవస్త్రములు మీఁదఁ గప్పి దీవించి సన్యాస మిప్పించెను. రాహులుఁడు బాలుఁ డగుటచే నతనిని మొట్టమొదట బుద్ధుఁడు శిష్యుఁడుగా గ్రహించెను. యుక్తవయస్కుఁడైన తరువాత రాహులుఁడు సంపూర్ణభిక్షుకుఁ

డయ్యెను. ఆవార్త విని శుద్ధోదనుఁడు మిక్కిలి శోకించెను. సిద్ధార్థుఁడు విరాగియగుటవలనఁ దనయనంతరము గద్దెనెక్కి రాజ్యముం బరిపాలింపఁ గలకొడుకు పోయెను. నందుఁడు సన్న్యాసి యగుటవలన రెండవ కుమారునియెడఁ గూడ నాశలు పోయెను. నిజవంశాంకూరమై తన యాశలకెల్ల నిలయమైన ముద్దుల మనుమఁడు గూడ సన్న్యాసి యగుటచే నతని మనోరథములెల్ల భగ్నములై పోయెను. అగుటయు శుద్ధోదనుఁడు గాఢవిషాదపరిగ్రస్తమనస్కుఁడై బుద్ధుని కడకరిగి శోకించి యది మొదలుకొని తల్లిదండ్రుల యనుమతి లేక కుమారుని, దనమతమునఁ గలుపుకొనవలదని కోరెను. బుద్ధుఁడా ప్రకారము సేయుదునని మాట యిచ్చెను. అనంతర మతఁడు కపిలవస్తునగరము విడిచి పయనమై పోయెను. పోవుచుఁ గ్రోసులో నతఁ డనోమానదీతీరమున నున్న "అనుపియ" యను గ్రామమునమీపమున నున్నయొక మామిడితోఁటలో బసచేసి కొంతకాల మాగెను. అతఁడు మహావైరాగ్య మవలంబించి యంతఃపురము విడిచి చెన్నునితోఁ గలిసి చాలదూరము పయనముచేసి యేస్థానమునఁ జెన్నుని వెనుకకుఁ బంపివైచెనో యాస్థానమునకు సమీపమందె మామిడితోఁట యుండెను. అచ్చటనుండఁగా నతని జ్ఞాతులుఁ దదితరబంధువులు చాలమంది యతనిమతముఁ గలిసిరి. వారిలో ముఖ్యులు నలువురు. ఆనందుఁడు మొదటివాఁడు. దేవదత్తుఁడు రెండవ వాఁడు. ఉపాలి మూఁడవవాఁడు. అనిరుద్ధుఁడు నాలవవాఁడు. ప్రథముఁడైన యానందుఁడు సిద్ధార్థునకు జ్ఞాతి. అతఁడు బుద్ధుని యందుఁ బరమభక్తి గలిగి మెలంగెను. దేవదత్తుఁడు గూడ నతనికి జ్ఞాతియె గాని కాలక్రమమున నతనికి విరోధియయ్యెను. మూఁడవ వాఁడైన యుపాలి శుద్ధోదనునియంతఃపురమున నుండు మంగలి. అతనికి మొదటినుండియు మతమునం దభినివేశము విశేషముగ నుండుట

చేతను బుద్ధి మంచిదగుటచేతను నతఁడు బుద్ధశిష్యులలోఁ బ్రధానుఁడయ్యెను. నాలవవాఁడైన యనిరుద్ధుఁడు బౌద్ధతత్త్వశాస్త్రమునకుఁ గర్త యయ్యెను.

త్రయోదశాధ్యాయము.

ఆసంవత్సరమున మహాత్ముఁడైన బుద్ధదేవుఁడు మతబోధ చేయుటలోను భిక్షుకశిష్యులను గృహస్థ శిష్యులను జేర్చుకొనుటలోను మానవజాతికి ధర్మములను సాధుభావములను నేర్పుటలోను గడిపి ధర్మసంస్థాపనముఁ జేసెను. ఏసంవత్సర మెక్కడెక్కడ నివసించియెంతెంతపని జేసెనో తెలిసికొనుటకుఁ దగినయాధారములు లేవుగాని కొన్ని బౌద్ధగ్రంథములఁబట్టియతఁడు బుద్ధుఁడయినది మొదలుకొని యిరువది సంవత్సరములవఱకు జరిగిన చరిత్రము సంగ్రహముగాఁ దెలిసికొనుటకు మనకు వీలుగా నున్నది. అందు మొదటిది మూఁడుసంవత్సరముల చరిత్రము వెనుకటి యధ్యాయములలోఁ జెప్పఁబడినది తక్కిన పదియేడేండ్ల చరిత్ర క్రింద వివరింపఁ బడుచున్నది. అతనికి బుద్ధత్వము ప్రాపించిన నాలుగవ సంవత్సరమునం దుగ్రసేనుఁ డను నటునిఁ దనమతంబునం గలిపెను. ఇతఁడు త్రాటిమీఁద మిక్కిలి సుందరముగా నాట్యమాడి జీవనము సేయుచుండువాఁడు. ఇతనిని శిష్యునిఁగా స్వీకరించిన పిదప బుద్ధుఁడు భాగీరథీనదిని దాఁటి వయిశాలీపురమున కరిగి తత్సమీపమున నున్న మహావనమను తోఁపులో నివసించెను. అక్కడ నుండఁగా శాక్యులకును వారి బంధువులకును సరిహద్దులలో నున్న రోహణనదీజలమును గూర్చి వివాదములు వచ్చిన

ట్లతఁడు విని కపిలవస్తుపురమున కరిగి వారికలహము లుడిపి సంధి చేసి మెండియు మహావనంబునకుఁ జని వర్షకాల మచ్చటఁ గడిపెను. ఐదవసంవత్సరమున నతనితండ్రి యగుశుద్ధోదనుఁడు మరణమునకు సిద్ధముగ నున్నాఁడని తెలిసినందున నతఁడు మెండియుఁ గపిలవస్తుపురమునకుఁ జని జనకు నిర్యాణకాలమున సన్నిధినుండెను. శుద్ధోదనుఁ డప్పుడు తొంబదియేడు సంవత్సరముల ప్రాయమువాఁడు. మృతుఁ డయిన జనకుని దేహమునకు యథావిధిగ నగ్నిసంస్కారములు చేయించి చుట్టముల సమాశ్వాసించి బుద్ధుఁడు మరల మహావనంబునకుం జనెను. అతఁ డచ్చట నుండఁగా నతనిసవతితల్లి యయినప్రజాపతీదేవియు భార్యయగు యశోధరయు బంధువు లయిన మఱికొందఱుస్త్రీలును నతని కడకుఁ బోయి తమచేత మతస్వీకారము చేయింపవలసిన దనియు శిష్యురాండ్రుగఁ జేర్చికొనవలసిన దనియు వేఁడుకొనిరి. ఆఁడువాండ్రం జేర్చికొనుట బుద్ధున కెంతమాత్ర మిష్టము లేకపోయినను శిష్యుఁడయిన యానందుఁడు వారిపక్షము వహించి వాదించి పట్టుపట్టుటచే నేదో విధముగ బుద్ధుఁడు సమ్మతించి స్త్రీల కవసరము లైనకొన్ని నియమముల నేర్పఱిచెను. ఈవిషయమై యీక్రిందికథ బౌద్ధగ్రంథములలో నున్నది. శుద్ధోదనుని మరణానంతరమునఁ బ్రజాపతీదేవి బుద్ధునిసందర్శించి 'నాభర్త మరణము నొందెను. ఏకపుత్రుఁ డైననందుఁడు నీశిష్యుఁడయ్యెను. మనుమఁడయిన రాహులుఁడుఁ గూడ నీమార్గమె యనుసరించెను. ఇంక నెవ్వారిం జూచుకొని యిచ్చట నుందును! కావున నన్నును యశోధరను దక్కిన యంతఃపురాంగనలను నీమతమునం జేర్చికొని యుద్ధరింపు' మని వేఁడుకొనెను. అనవుడు 'స్త్రీలను నామతమునఁ జేర్చికొనుట కిష్టము లే' దని బుద్ధుఁ డుత్తరము చెప్పెను. "ఎట్లయినఁ జేర్చికొనవలసిన' దని యామె ముమ్మారు వేఁడెను. బుద్ధుఁడు ము

మ్మారు వారికోరిక నిరాకరించి కపిలవస్తుపురమును విడిచి వైశాలీ పురమునకుం జనెను. అప్పుడు ప్రజాపతిదేవి తక్కినయంగనలం జూచి యిట్లనియె "మనలను దనమతమునం జేర్చుకొమ్మని మనము ముమ్మారు వేడినను బుద్ధుఁడు మనకోర్కె నిరాకరించెను. మన యంతట మనమె యాతనియొద్దకుం బోవుదము. అప్పు డతఁడు తప్పక మనలం జేర్చుకొనును" ఆమెయుపదేశము మిక్కిలి సమంజసముగా నున్నదని యంతఃపురాంగన లెల్ల సంతసించి యిట్లు చేయుదమని యొడంబడి శిరోముండనములు చేసికొని యలంకారములు తీసి వైచి కాషాయాంబరములు ధరించి మంటిమూఁకుండలు భిక్షాపాత్రములుగా హస్తములం ధరించి యంతఃపురము విడిచి బయలుదేరిరి. సూర్యరశ్మి యెట్టిదో యెఱుఁగని యంగనలు కాలినడక యెట్టిదో యెఱుఁగని యంగనలు పట్టపగటిబిరెండలోఁ గాలినడకం బైలుదేరి కపిలవస్తుపురమునుండి వైశాలికిం బోవఁ దొడఁగిరి. కపిలవస్తు పురమునకు వైశాలికి దూర మేబదియామడ. బౌద్ధమతధర్మమందలి యత్యంతాసక్తిచే వారింతదూరముం గాలినడకం బోయిరి. పుష్పసుకుమార లైనశుద్ధాన్తకాంతలు శిలాకంటకావృతము లైన మార్గంబుల నడుచునప్పుడు వారు పడుశ్రమ యింతింత యని యెవరు వర్ణింపఁ గలరు? కాని మతావిష్టులైనవారిని సూర్యతాపముకాల్పదు. చలి వారిం జలియింపఁ జేయనేరదు. వానలచేత వారిశరీరములు తడిసినను మనసులు తడియవు. మతాసక్తి మేను మరపించు నన్న మాట యతిశయోక్తి కాదు. అసూర్యంపశ్య లగునీ రాజాంగనల నింతదవ్వు దోడ్కొనివచ్చినది మతాసక్తికాక మఱి యేది? కడు దవ్వు కాలినడకం బయనము సేయుటచే వారిపాదములు పొక్కు లెక్కెను. పుండ్లుపడెను. ఆనందుఁడు వారిపాదములం జూచినప్పు డతనికన్నుల నీరు బొట బొట గారెను. "మీ రేల యింతశ్రమపడి

వచ్చితిరమ్మా" యని యతఁ డెంతో నొచ్చుకొనెను. "జగద్గురువైన బుద్ధునిమతము స్వీకరింపఁ దలఁచి సన్యాసినుల మైతిమి. కావున నిచ్చటకువచ్చితిమి" అని ప్రజాపతిదేవి యుత్తరము చెప్పెను. ఆనందుఁడు వారి నచ్చటనుంచుమని తాను బుద్ధుని సన్నిధికరిగి ప్రజాపతి యశోధరయు మున్నగునంగనలుభిక్షువేషముతో వచ్చియున్నారని తెలిసివారిని చేర్చుకొనవలసినదని ప్రార్థించెను. "ఆనందా! ఆఁడువాండ్ర నిందుఁ జేర్చికొనన" దని బుద్ధుఁడు బదులు చెప్పెను. ఐనను మానక యానందుఁడును మఱికొందఱు శిష్యులును మిక్కిలిపట్టుపట్టి బుద్ధుని బలవంతము పెట్టుటచే నతఁ డెట్టకేల కొకవిధముగా సంగీకరించెను. నాఁడు మొదలుకొని స్త్రీలకుఁ బ్రత్యేకాశ్రము మేర్పఱుపఁబడెను. భిక్షుణీమండలికెల్ల మొట్టమొదటఁ బ్రజాపతిదేవి యధికారిణియై యుండెను. ఆమె నిర్వాణపదవిఁ బ్రాపించినపిదప బుద్ధునిభార్యయగు యశోధర యామెస్థాన మధిష్ఠించెను. కాని యశోధరయు బుద్ధుని కంటెఁ జాలకాలముముందే నిర్వాణ మొందెను. అనంతరము బుద్ధుఁ డచ్చటనుండి కౌశాంబీనగర సమీపమందున్న మాకులపర్వతమునకుం జనియెను. కౌశాంబీనగర మిప్పుడు లేదు. ప్రయాగకు సమీపమున నిది పూర్వము వత్సరాజగు నుదయనునకు రాజధానిగా నుండెడిది. ఆఱవసంవత్సరపువర్షాకాల మంతయు బుద్ధుఁడుమాకులపర్వత గుహాలలోఁ గడపి వాన లుడిగినపిదప రాజగృహనగరమునకుం జనియెను. అక్కడనున్నకాలములో మగధరాజగు బింబిసారమహారాజు యొక్క ధర్మపత్నియైన క్షేమాదేవి యాతనిమతమును స్వీకరించెను. ఆకాలమునందె యాతనిశిష్యులలో నొకఁడు తనమహామహిమవలన నద్భుతమైన భిక్షాపాత్రము సంపాదించితినని దానిం దెచ్చి చూపెను. మహిమలు చూపుట ప్రజలను మోసపుచ్చుట యని బుద్ధుఁడు మహిమప్రదర్శనము నిషేధించి బుద్ధుఁ డాపాత్రను పగులఁగొట్టిం

చెను. అతఁడు స్రావస్తీపురసమీపమందున్న జేతువనమునం దేడవ సంవత్సరము గడపెను. ఆకాలమునందు మాయలమారియైన చించ యనుసన్యాసినిని బుద్ధునివిరోధులు చేరఁదీసి తన్ను బుద్ధుఁ డుంచుకొన్నాఁ డని యామెచేత నల్లరి చేయించుటకుఁ బ్రయత్నించిరి గాని మెట్టకేలకు దాని మోసము బయలుపడినది. ఈవిషయమై యీక్రిందికథ చెప్పఁబడుచున్నది— గౌతమబుద్ధుఁ డుపదేశించుధర్మములను మిక్కిలి తమకముతో వినుటకుఁ బ్రతిదినము వందలకొలఁది జనులు గుంపులుగూడి యతఁ డెచ్చట నున్న నచ్చటికిఁ బోవుటఁ జూచి యసూయాక్రాంతులై యాతనివిరోధులు కొందఱాజనులతో నిట్లనిరి. "మీ రేమిసేయుచున్నారు? గౌతముఁ డొక్కఁడేనా బుద్ధుఁడు? ప్రపంచమున మఱి బుద్ధులు లేరా? మేము మాత్రము బుద్ధులము కామా? అతఁడు నిర్వాణపథము మీకుఁ బ్రసాదింపఁ గలిగినేని మేముమాత్రము మీ కది యనుగ్రహింపలేమా?" అని వారి మనస్సులు బుద్ధునిమీఁదనుండి మరల్చుటకు వారు బహుప్రయత్నములు చేసిరి గాని యవియెల్ల నిష్ఫలమయ్యెను. అందుచేత వారు మాయోపాయ మేదైనఁ బన్ని జనుల కాతనిమీఁదఁ గల గౌరవముఁ దగ్గింపవలెనని యెంచి నీచమైనపన్నుగడ నొకదానిని బన్నిరి.

ఆకాలమున స్రీవట్ట, మనుగ్రామమున చించ యను నొక సన్యాసిని యుండెను. ఒక్కనాఁడది బుద్ధునిపగతు రగు తీర్థకులయొద్దకుం జని వారి నారాధించెను. ఆయారాధనను స్వీకరించి వా రా మెతో నేమియుం బలుకక మౌనము ధరించియుండిరి. వారిమౌనము జూచి చించ తాను వారి కేదోయపచారము గావించియుండుటం జేసి వారు తనపై నాగ్రహము బూని రని మిక్కిలి భయంపడి ముమ్మారు వారి నారాధించి తాను జేసిన యపరాధ మేమొ తెలియఁ జేయ

వలసినదని వేఁడుకొనెను. అనవుడు నాతీర్థకులు "మాకు నీపై నాగ్రహ మేమియులేదు. మేము బుద్ధుని గొప్పతనమునకు భంగముఁ గలుగఁ జేయుట కుపాయము వెదకుచున్నాము. ఆవిషయమున నీ సహాయము కావలసియున్నది. చేయుదువా?" యని యడిగిరి. ఏవిధముగాఁ జేయవలయునని యామె ప్రశ్నించెను. అవిధంబు మనో సవిస్తరముగా వా రామెకుఁ జెప్పిరి. అదియు నట్లు చేయుటకొడంబడెను. చించ మాఁయూనసముద్రముయొక్క పానముఁజూచినది. సీవట్టి గ్రామమునందలి జను లనేకులు ప్రతిసాయంకాలము గౌతముని ధర్మోపదేశములు వినుట కాయనకడకుఁ బోవుచుండిరి. ఆసమయమునందె నామాయలమారియుఁ గుసుంబవస్త్రములు గట్టి కొప్పునఁ బూలు ముడిచి చందన మలందుకొని పరిమళద్రవ్యములు మేనఁ బూసికొని బుద్ధుఁ డున్న నెలవునకుఁ బయనమయ్యెను. "ఇట్టివేళ నిట్టివేషము వేసికొని నీవెక్కడి కరుగుచున్నా" వని బుద్ధ సందర్శనమున కరుగుచున్న జనులు దాని నడిగిరి. "నాతోలి మీ కేమిపని? మీ దారిని మీరు పొం" డని యది యుత్తరముఁ జెప్పెను. ఆరాత్రి యామె బుద్ధుని నెలవునకు సమీపమున నొకచోట గడిపెను. మఱునాఁడు బుద్ధుని యుపదేశముల నాలకింపవలెనని కొందఱు తెల్లవాఱు జాముననె బయలుదేరి గ్రామమునుండి వచ్చుచుండ నీవగలాఁడి మరల గ్రామమునకుఁ బయనమై పోయెను. 'నీవెక్కడనుండి వచ్చుచున్నా' వని యాజనులు దాని నడిగిరి. 'నేను రాత్రి బుద్ధునిగదిలోఁ బండుకొని వచ్చుచున్నా' నని యది ప్రత్యుత్తర మిచ్చెను. ఇట్లుచేయుటతోఁ దనివినొందక యొకనాఁడు బుద్ధుఁడు శిష్యుల పెక్కండ్రం జేర్చి ధర్మోపన్యాసము జేయుచుండ నాదురాత్మురాలు చెక్కనికట్టెపలక యొకటి గర్భస్థానమున నిముడ్చుకొని నిండుచూలాలై యట్లు నటించి మెల్లవారు వినుచుండ బుద్ధు నుద్దేశించి యిట్లనియె. "నేను నీవలన

నీగర్భమునఁ దాల్చితిని. నేను ప్రసవించుటకుఁ దగినతావు చూపితివి కావు" అని బిగ్గరగాఁ బలికెను. ఆపలుకులు విని యెల్లవారు విస్మితు లగుచుండ నంతలో గాలి వీచెను. ఆగాలికి దానివస్త్ర మెగిరిపోవ దారుఖండము క్రిందఁబడెను. అక్కడఁ జేరిన జనులందఱును బవిత్రాత్ముఁడైన బుద్ధునిపవిత్రతను మలినము చేయుటకును లోకమునం దతని గౌరవము తగ్గించుటకు నీదురాత్మురా లీపనిఁ గడఁగినదని తెలిసి కొని దానిని నిందించి కంఠము పట్టుకొని దాని నావలకు లాగి పొమ్మంగొలిరి.

గౌతముఁడు బుద్ధుఁడైనపిదప, అష్టవర్షములు శింశుపారణ పర్వతములమీఁదఁ గడపెను. తరిగి శ్రావస్తీపురమునకు సమీపమునం దుండెను. మొగ్గలిగారియను వాఁడైన నకులుఁడనువాని తలిదండ్రులను బుద్ధుఁడు శిష్యులనే తనసంఘములోఁ జేర్చుకొనెను. బుద్ధుఁడు చమత్కారములుగల చిన్నకథలు జెప్పియు నుదాహరణములం జెప్పియు మానవుల జ్ఞానవంతులఁ జేసి స్వసంఘములోఁ గలుపుచుండెను. అట్టిచమత్కారప్రసంగ మిచ్చట నొకటి కలదు. కిసగౌతమి యను నొకచిన్నది కలదు. ఆబాలిక యొకమహాసంపన్నుని కుమారునకు మహావైభవముతో వివాహము చేయఁబడెను. ఆమె కొకకుమారుఁడు కలిగెను. వాఁడు మిక్కిలి చక్కనివాఁడు. ఆట లాడుకొనుచున్న యీచిన్నవాఁడు కాలధర్మమునొందెను. కిసగౌతమి మిక్కుటమగు పుత్రస్నేహంబున బాలకుని విడువక భుజముమీఁద వైచికొని తన్నుఁజూచి దుఃఖించుచున్న బంధుమిత్రులగృహములకరిగి 'నాబిడ్డకేదైన మందిచ్చి బ్రతికింపుఁ'డని వేఁడెను. అటు లామె యిల్లిల్లుఁ దిరుగుచు నొకబౌద్ధభిక్షుకునికడకుఁ బోయి యడుగ నతఁ డిట్లనియె "ఇట్టిమందు నాయొద్ద లేదు. కాని యట్టియౌషధ మొకని యొద్ద నున్నది. ఆయన నే నెఱుఁగుదును."

‘అయ్యో! ఆయన నేను చెప్పెద నాయనా’ యని కిసగోతమి ప్రార్థించెను.

‘బుద్ధుఁ డట్టిమందు లిచ్చుఁగలఁడు. ఆయనకడకుఁ బొ’మ్మని ప్రత్యుత్తర మిచ్చెను. ఆమెయు చప్పించుకొని నాయమ్మరాలు బుద్ధుని కడకుం బోయి ‘దేవా! నాబిడ్డకు రోగమాన్పించు నౌషధ మేదైన మీ రెఱుఁగుదురా?’ యని యడిగెను. ‘ఆహా! అట్టిమందు నే నెఱుంగుదు’ నని బుద్ధుఁడు ప్రత్యుత్తర మిచ్చెను. ‘ఏమి సామాగ్రులు కావలెను స్వామీ’ యని కిసగోతమి మరల బుద్ధు నడిగెను. ‘ఆవగింజలు కావలె’ నని బుద్ధుఁడు పలికి నామె చూచి సంతోషముగా వెళ్ళకయి పోవుచుండ బుద్ధుఁ డంతలో నిట్లనియెను. “ఏ యింటిలో మనుజుఁడు గాని, తల్లిదండ్రులు గాని, బిడ్డలు గాని, సేవకులుగాని చచ్చియుండరో యట్టి యింటినుండి నీ వావగింజలు తీసికొని రావలెనుగాని ప్రతిగృహము నుండి తీసికొని రాఁగూడదు.”

మంచిది స్వామీ! అట్లే తెచ్చెద నని యా బాలిక చచ్చినపుత్రుని భుజముమీఁద నెత్తుకొని యింటింటికిఁ బోయి యావగింజ లడిగెను. ‘ఇదిగో! ఆవగింజలు తీసికొ’మ్మని యింటివారు పట్టుకొనివచ్చి యియ్యఁబోఁగా ‘అమ్మా! మీయింట మనుజుఁడుగాని బిడ్డలుగాని తల్లిదండ్రులుగాని చనిపోలేదుగదా’ యని యడుగుచు వచ్చెను. అడుగఁగ యొకరు ‘ఇదేమిటమ్మా! పిచ్చిమాట లాడుచున్నావు. లోకములో బ్రతికియున్నవారే తక్కువమంది. చచ్చిన వారే యెక్కువమంది’ యని పలికిరి. ఒకతె తనయింటఁ దనబిడ్డ మృతినొందెనని చెప్పెను. వేఱొకతె భర్త స్వర్గప్రాప్తి నొందెనని చెప్పెను. ఒండొకతె తల్లిదండ్రులు గతించెనని యెఱింగించెను. సేవకులు జీవము బాసెనని వేఱొక యిల్లాలు పలికెను. ఎవ్వరును మృతినొందని యిల్లొక్కటియైన గ్రామమున లేకపోవుటచే నామె తిరిగి

తిరిగి విసికి వేసారి వితర్కాధీనమనస్కయై యుండ జ్ఞానమంకురించెను. అంకురించుటయు నది వ్యర్థప్రయాసమని యెఱింగి పుత్రికళేబర మడవిలోఁ బాఱవైచి యామె బుద్ధునికడకుఁ బోయి యతని శరణంబు వేఁడెను. ఆవగింజలు దొరకినవా యని యతఁ డామెను బ్రశ్నించెను. "స్వామీ అవి నాకు దొరకలేదు. చచ్చినవారే యెక్కువమందియనియు బ్రతికియున్నవారే తక్కువమంది యనియు జనులు చెప్పుచున్నారు" అప్పుడాయన పదార్థములెల్ల నస్థిరము లని యామెకుపన్యసించెను. ఆయుపన్యాసము విన నామెకు నిర్మలజ్ఞానముదయించెను. అన్నిసందియములు నడుగంటెను. ఆమె బుద్ధమతము స్వీకరించి ధర్మమార్గము ననుసరించెను. అనంతరము బుద్ధుఁడు ప్రయాగకు సమీపమున నున్న కౌశాంబీపురమున కరిగెను.

తొమ్మిదవయేట మొగ్గలియను నతఁడు బుద్ధునిమీఁద ద్వేషభావముఁ బూని వైరము సాధింపఁజొచ్చెను. ఆనందుఁ డనుశిష్యుఁడు మొగ్గలిని మఱియొకచోటికిఁ బొమ్మని బహువిధములఁ జెప్పెనుగాని యతఁ డతనిమాట నిరాకరించెను. శిష్యగణములు రెండు తెగలైరి. బుద్ధుఁడు రెండుతెగలవారిం బిలిచి యైకమత్యము, శాంతము, పరస్పరప్రేమ గలిగి యుండుఁ డని పలుతెఱంగుల హితోపదేశముఁ జేసెను. కాని, యాతని బోధలు నిష్ప్రయోజనము లగుటచే నతఁడు విచారించి శిష్యులను విడిచి పారిలేయక మనుచోటికి నొక్కఁడె బోయెను. అచ్చోట గ్రామవాసులు కట్టించిన యొక కుటీరమున నధివసించి పదివర్షములు గడపెను. మున్ను ద్వేషభావము వహించిన భిక్షుకులు పశ్చాత్తాపమనస్కులై తమకావించిన యపరాధముఁ దెలిసికొని గురు వెందున్నవాఁడో యని యూరూరు వెదకికొనుచు నెట్టకేలకు నాయనం గనుంగొని క్షమియింపుమని వేఁడిరి. గురువు శిష్యుల నత్యంతప్రీతితో నాదరించి తప్పులు క్షమించి యిట్లనియె. "వస్తువుల

సూక్ష్మభావ మెఱుఁగని మూర్ఖులు తమలోఁ దాము కలహింపవచ్చు ను. కాని జ్ఞానముగల మీరిట్లు కలహింపవచ్చునా? మనుష్యుఁడు తాను మంచితలంపులు గలవాఁడైనపక్షమున వివేకము యుక్తాయుక్తవివేకము జ్ఞానము గలమిత్రులతోఁ గలిసి యుండవచ్చును. కాని, యజ్ఞానులతోఁ గలసి మెలసి యుండుటకంటె నేకోరికలులేక సాహసహితుఁడై యేనుఁగువలె నొక్కఁడై యసహాయుఁడై తిరుగుట మంచిది" యని యుపదేశించి పశ్చాత్తాపము నొందినశిష్యులను స్రివస్థిపురమునకుఁ బొమ్మని యానతిచ్చి యాతఁడుమగధదేశమున కరిగెను.

పదునొకండవయేట మగధరాజధానియగు రాజగృహంబునకు సమీపమందున్న నొకపల్లియలో భరద్వాజుం డనుబ్రాహ్మణుని బుద్ధుఁడు కృషీవలుని సామ్యము జెప్పి స్వమతమునం గలిపెను. ఆసామ్యమిది—భరద్వాజుఁడను బ్రాహ్మణుఁడు సంపన్నుఁడు. అతఁడు సేద్యము చేసి పంటపండించును. పొలములోఁ బండినధాన్య మతఁడింటఁ బోయించుకొనుచుండఁగా నొకనాఁడు బుద్ధుఁడు భిక్షాపాత్రముం బూని భిక్ష మిమ్మని యాతనిగుమ్మమునొద్ద నిలిచెను. కొందఱు జనులాయనకు నమస్కరించి భక్తితత్పరులయి యుండిరి. కాని భరద్వాజుఁడు కోపించి "శ్రమణకా! నేను దున్ని విత్తులుచల్లి సేద్యము చేయుదును. కష్టపడి పండించుకొని యన్నము తినుచున్నాను. నీవుఁగూడ నావలెనే దున్ని విత్తులు చల్లి సేద్యము చేసికొనుట మంచిది. అప్పుడు నీకుఁ దినుటకుఁ గావలసినంత యన్నముండు' నని తిరస్కారభావముతోఁ బలికెను.

'బ్రాహ్మణుఁడా! నేనును దున్ని విత్తులు చల్లి సేద్యము చేయుచున్నాను. అట్లు పంటపండించియే నేనును భుజించుచున్నాను.'

"ఏమి! నీవును గర్షకుఁడవేనా ? ఆజాడలేమియుఁ గనఁబడవే ? నీయెద్దు లేవి ? విత్తనము లేవి ? నాగలియేది?" యని భరద్వాజుఁ

కుత్తరమిచ్చెను. అప్పుడు బుద్ధుఁ డిట్లనియె.

"నేను జల్లు విత్తనము భక్తి. సత్కార్యము వర్షము దానిని వృద్ధిఁబొందించి పండించువాఁడ. జ్ఞానవినయములు నాగలి కొఱువంకలు. నామనస్సు దాని నడుపుకట్టి ముఖ్యసాధనము. ధర్మమనియెడు పిడి నేను జేతఁబట్టుకొని నడపించుచుందును. శ్రద్ధ నాయెద్దు. ఈవిధముగా సేద్యముచేయుచు నేను మాయయను కలుపు దీయుచుందును. ఇట్లు సున్నుటవలన నను స్వదుఃఖములు నశించును. నిర్వాణఫలామృతమే యిందుఁ బండుపంట." ఈసాఖ్యమువలన భరద్వాజుని మనఃక్షేత్రమున బుద్ధమతబీజములు చక్కఁగా నాటుకొనెను, నాఁటినుండి యతఁడు తనశిష్యుఁ డయ్యెను. వర్షాకాల మచ్చటఁ గడిపి యతఁడు కోసల దేశంబున కరిగి "సత్తియాశ్రమం" యను పట్టణంబునకుం బోయెను. పండ్రెండవయేట నతఁ డచ్చటనుండి విరంజయనుపురమున కరిగి యాయూర వాసకాలముఁ గడపెను. అనంతర మతఁ డదివఱకెన్నఁడుఁ జేయని దీర్ఘప్రయాణముఁ జేసెను. ఈ ప్రయాణమున నతఁడు మంతలవటికిఁ బోయెను. అచ్చటనుండి యతఁడు కాశీవైశాల పురములమీఁదుగాఁ గోసలదేశముం దాఁటి శ్రావస్తికిఁ బోయెను. తాను బోయిన ప్రతిపట్టణమునందు మతబోధ సేయుచు శిష్యులం జేర్చుకొనుచువచ్చెను. స్వనివాసమునకు మరల వచ్చిన పిదప నతఁడు కుమారుఁడయిన రాహులునకు మహారాహులసూత్ర ముపదేశించెను.

పదమూఁడవయేట నతఁడు చాలియదేశమున కరిగి ప్రావృట్కాల మచ్చట గడిపి వెంటనే శ్రావస్తినగరముఁ జేరెను. పదునాలుగవయేట బుద్ధుఁడు తనకుమారుఁ డయిన రాహులునకు శ్రావస్తిపురమందున్న జేతువనవిహారములో రాహులసూత్రముఁ జెప్పి యతనిని భిక్షుకుని జేసెను. అచ్చటనుండి యతఁడు కపిలవస్తున కరి

గెను. పదియేనవయేఁ డతఁడు కపిలవస్తుపురసమీపమునందలి నిగ్రోధవనమునఁ గడిపి తన జ్ఞాతియగు మహానామునకు ధర్మోపదేశముఁ జేసెను. శుద్ధోదనునిమరణానంతరమున, శాక్యనాయకుఁడగు భద్రుని తరువాత మహానాముఁడు శాక్యాధిపత్యము వహించినవాఁడు. కపిలవస్తుపురమునుండి మరల నతఁడు వేణువనవిహారమున కరిగెను. బిచ్చములు పెట్టుట మొదలగు దానములకంటె, సత్ప్రవర్తనము జితేంద్రియత్వము మొదలగు ధర్మాచరణములు గలిగియుండుట శ్రేష్ఠమని యతఁ డచ్చట నుపన్యాసము చేసెను. పదునాఱవయేట నతఁ డాళవి యనగ్రామమున కరిగి యొకరాక్షసునకు ధర్మోపదేశము చేసి యతనిని స్వమతములోఁ గలిపెను. ఆరాక్షసుఁడు పరిసరదేశంబులఁ గల శిశువుల నెల్ల బట్టి చంపి తినుచుండెడివాఁడట. పదునేడవసంవత్సరపు వర్షాకాల మతఁడు రాజగృహంబునఁ గడిపెను. ఆకాలమున నతఁడు శ్రీమతియను రాజాంతఃపురపరిచారిక యొక్క మృతినొందిన తరుణిమరణముఁగూర్చి యుపన్యాసము చేసెను. వసంతకాలమున నతఁడు శ్రావస్తిపురము మీఁదుగా నాలవిగ్రామమునకుఁ బోయెను. ఎందుఁబోయిన నందు ధర్మబోధ చేయుచునే యుండెనట. ఆలవిలో నొకమనుష్యుఁడు పేరాఁకలిచేత బాధపడుచుండఁగా నతనిం గడుపారఁ గుడిపించంగాని యచ్చట ధర్మబోధ చేయనని చెప్పి, పురవాసు లతనికి మృష్టాన్నముఁ బెట్టి సంతుష్టునిఁ జేసినపిదప ధర్మోపదేశముఁ జేసెను. అష్టాదశాబ్దమున నతఁడు శ్రావస్తిసమీపమున నున్న చాలియగ్రామములో వర్షాకాలము గడపెను. అచ్చట నుండఁగా నొక సాలెవాఁడు పొరపాటునఁ దనకూఁతుఁ జంపి దుఃఖోపహతుఁడు కాఁగా సామవాక్యోపదేశంబుల నతని మనోవైక్లబ్యముఁ దీర్చి బుద్ధుఁ డతని ననుగ్రహించెను. అవ్వల గౌతముఁడు రాజగృహంబునకుఁ జనియెను. పందొమ్మిదవయేట సిద్ధార్థుఁడు [illegible] వేణువనవిహారంబునం జరి

తా నరిగిన యూళ్ళయందెల్ల ధర్మబోధచేయుచు గౌతముఁడు మగధదేశమునకుఁ బోయెను. ఒకనాఁడు వేఁటకాని వలలో నొక జింకచిక్కి తప్పించుకొనుమార్గము లేకయుండ బుద్ధుఁ డావలనుండిదానిని విడిపించి ప్రక్కనున్న యొక చెట్టుమొదటఁ గూర్చుండి సమాధినిష్ఠుఁడయి పరవశుఁడయి యుండెను. తనవలలోఁజిక్కిన మృగము తనకుఁ దక్కకుండ విడిపించి తన కపకారముఁగావించినందుకు మృగయుఁడు కనలి బుద్ధునిఁ జంపఁదలఁచి వింట నంబు దొడిగివయిచెను. కాని యది గుఱితప్పిపోయెను. సమాధినుండిలేచి బుద్ధుఁడు వానిసంరంభముఁదెలిసికొని వానిని సమాదరంబుగాఁ బిలిచి వానికి వానికుటుంబమునకు ధర్మోపదేశముఁ జేసెను. ఆయుపదేశమువలన వారు బుద్ధునిశిష్యు లయిరి. అతఁడచ్చటనుండి శ్రావస్తికిం జనియెను. ఇరువదియవసంవత్సరమున బుద్ధుఁడా శ్రావస్తిపురమందే వర్ష ఋతువు బుచ్చెను. తనభిక్షాపాత్రము మోయునట్టి భిక్షుకులు కొందఱుసారులు తన్ను గౌరవంబు దొరంగి తిరస్కారభావములతోఁ జూచుటం జేసి యానందుఁడను మఱియొక ప్రియశిష్యుని దనకు నిరంతర సహచరుఁడుగా భిక్షాపాత్రవాహకుఁడుగా నియమించెను. అనంతర మతఁడు చాళీయపుర సమీపమున నున్నయొక యరణ్యసమీపమునకుఁబోయి దౌర్జన్యమునకు మిక్కిలి పేరుపడిన యంగుళీమాలుఁ డను నొక చోరుని దన కృపారసంబునం గెలిచి వానిని శ్రమణకునిఁ జేసెను. అంగుళీమాలుని వృత్తాంత మీక్రిందివిధమునఁ జెప్పఁబడినది.

కోసలరాజుపురోహితునకు నొక కుమారుఁడు కలఁడు. అతఁడు బ్రాహ్మణుఁ డయ్యు దైవదుర్విపాకంబున దుష్టజనసాహచర్యంబునం జేసి గొప్ప దొంగయై దారింబోవువారినెల్ల దోఁచుకొని వారివ్రేళ్ళ నఱికి యావ్రేళ్ళు దండగాఁగుచ్చుచుండెను. అందుచేత వాని కంగుళీమాలుఁడనుపేరుకలిగెను. ఆకాలంబున బుద్ధుఁడుజేతువనవిహారంబున

నివసించుచుండెను. అచ్చోటునుండి యతఁడు పయనము [illegible] పోవుచు వచ్చెను. దారిలో నంగుళీమాలుఁడు నసించునరణ్యముండెను. ఆ దారిని మనుష్యులు నలువదిమంది గాని యేఁబదిమంది గాని గుంపుగాఁ గూడి పోవలయునేగాని యొంటిగా నెవ్వఁడును బయనము సేయఁ గూడదని యు గుంపులుగాఁ బో[illegible] [illegible] సనియు సంఘముచేత నా[illegible] [illegible] కు విన్నవించిరి. వా[illegible] [illegible] ను. అంగుళీమాలుఁ [illegible]ఁ జూచెను. [illegible] కలిసికొన వలెనని మిక్కిలివేగముగ నడచెను. [illegible] ఎంత పరుగెత్తినను నాతఁడు బుద్ధుని గలిసికొనలేక పోయె ను. "అయ్యో! నేనెఱుఁగు లెంతఁ బఱుగెత్తువానిం బట్టుకొంటిని. పక్షి వలెఁ బరుగెత్తు గుఱ్ఱముల నెంతఁ [illegible] కొంటిని. ఎన్నో రథ ములఁ గలిసికొంటిని. కాని యీ భిక్షుకుఁ డెవఁడో నాకందకున్నాఁడు. ఇదేమి చిత్రమో" యని మన [illegible] దలపోసి [illegible] యెలుఁ గెత్తి బుద్ధునింబిలిచి నిలువుమని కేకవేసెను. [illegible] బుద్ధుఁడచ్చట నిలిచి తనసమీపమునకు రావలెనని చోరుని నాజ్ఞాపించెను. చోరుఁడు సమీపమునకు రాఁగ వాఁడున్నచోటనే యుండెను. అంతట బుద్ధుఁడు సమస్త జంతువులయెడల దయా[illegible] యుండవలసినదనియు నట్లు న్నయెడల నరకంబునకుఁ బోవక యుండవచ్చుననియు నాలుగైదు గం భీరభాషణంబులతో ధర్మోపన్యాసముఁ జేసెను. అమృతధారల వంటి యతనిమాట లాచోరాగ్రేసరుని మనస్సున కెంతనచ్చెనోగాని వాఁడు వెంటనే బుద్ధునియనుగ్రహము బడసి పశ్చాత్తప్తుఁడై యతనిమత ములోఁ జేర్చుకొమ్మని వేఁడెను. అప్పుడు బుద్ధుఁ డాతనిని భిక్షుకునిం జేసెను. అతఁడు బౌద్ధభిక్షుగణములలోఁ బరమపావనుఁడై, యహింస కుఁడై సుప్రతిష్ఠఁ గాంచెను.

పూర్వోక్తప్రకారంబున గౌతముఁడు బుద్ధుఁ డయినతరువాత నిరువది సంవత్సరములవఱకు జరిగిన వృత్తాంతము సంక్షేపముగా మనకు లభించినది. ఇరువదియొకటవసంవత్సరమునుంచి మరణమువఱకు జరిగిన వృత్తాంతము సరియగుగాఁ జరిత్రకారులకు లభించినది కాదు.

చతుర్థాధ్యాయము.

మిత్రులు.

ఈప్రపంచమునఁ జన్మించిన ప్రతిమహాపురుషునకు మితిలేని మిత్రులు లెక్కలేని విరోధులును గూడ నుందురు. మహాత్ముఁడైన బుద్ధునకుఁ గూడ నట్టి శత్రువులు మిత్రులుండిరి. వేనవేలు స్త్రీలు పురుషు లాయనను గౌరవించి పూజించుచుండిరి. వేనవే లాయనయెడ నసూయఁబూని యపవాదంబులు మోపి నిందించి పలుమాఱులు హానిచేయుటకు యత్నించిరి. ఆయనయం దత్యంతాభిమానముగల మిత్రులలో నిరువురు ముఖ్యులు కలరు. ఆయిద్దఱెవ్వరన శ్రావస్తి నివాసుఁడైన యనత్పిండుఁ డనువైశ్యుఁడు మొదటివాఁడు; వైశాలీ నగరవాసిని యైన వైశాఖయను భాగ్యవంతురాలు రెండవది. శత్రువులలో ముఖ్యుఁడు దేవదత్తుఁడు. ఈతఁడు గౌతమునకు దగ్గఱచుట్టము. మొట్టమొదటఁ బ్రధానశిష్యుఁడు. ఈతనివలె బుద్ధునియెడ గాఢద్వేషము సహించినవాఁ డింకొకఁడు లేఁడు. ఈయధ్యాయములో నాతని మిత్రులను గూర్చియే చెప్పఁబడును.

మగధ రాజధానియగు రాజగృహపురంబున మిక్కిలిసంపన్నుఁడగు నొక వైశ్యుఁడు కలఁడు. శ్రావస్తినివాసుఁడైన యనత్పిండుఁ డా రాజగృహవైశ్యుని కాప్తమిత్రుఁడు. అనత్పిండుఁడు ప్రతిసంవత్సరము

రాజగృహంబునకుం బోయి తన మిత్రుని సందర్శించుచుండెను. రాజగృహవర్తకుఁడు మిత్రుని దోడితెచ్చుటకెన్నఁడు శ్రావస్తీనగరమునకు పోవుచుండును. అనాథపిండదుఁ డొకనాఁ డెప్పటియట్లు రాజగృహంబునకు మిత్రసందర్శనార్థము వచ్చెను. కాని యెప్పటియట్లు మిత్రుఁ డెదురుగావచ్చి పురంబునకు దోడ్కొనిపోలేదు. అనాథుఁడు పురముఁ బ్రవేశించెను గాని యతనికి స్వాగత మిచ్చుట కెవ్వరుం గనఁబడరైరి. అతఁడు మిత్రుని గృహంబునకుం బోయెను. మిత్రుఁ డచ్చటనే యుండెను గాని వెనుకటియట్లు, మిత్రుఁ డతనిని సమాదరించి సంతోషముగాఁ గుశలప్రశ్న మడిగెను. కాని నాఁటిరాత్రి భోజనసమయమున తన మిత్రుఁడైన యనాథపిండదుని కొఱకుఁ బోయి వెనుకటియట్లు సన్మానము చేయకపోవుటకుఁగల కారణ మడిగెను. మఱునాఁడు తనగృహంబునకు భిక్షస్వీకారము సేయుటకు బహుశిష్యగణములతోఁ గలసి బుద్ధుఁడు వచ్చుననియు వారి కాతిథ్యమిచ్చుటకుఁ దగు నేర్పాటులు చేయుచుండుటచేతఁ దన కెంతమాత్రము నవకాశము లేమి వెనుకటియట్లు సన్మానము చేయలేదనియు నది యపరాధముగా భావింపవలదనియుఁ జెలికానిని వేఁడికొనెను.

అనాథపిండదుఁ డది విని బుద్ధుని సందర్శింప నిశ్చయించుకొని తనలో నిట్లనుకొనెను. 'మేము బుద్ధులముఁ బుద్ధులమని చెప్పుకొను నట్టివా రనేకు లీనాఁడు గలరు. అట్టివారిచేత నేను వంచింపఁ బడ వచ్చును. కాఁబట్టి నేను బుద్ధునిఁ జూచెదను. చిన్ననాఁడు నా తలిదండ్రులు నాకు సుదత్తుఁడని పేరు పెట్టిరి. అది నా తలిదండ్రులకు నాకే గాని యన్యులకుఁ దెలియదు. ఈగౌతమబుద్ధుఁడు నా పుట్టినపేరు చెప్పఁ గలిగెనేని నే నాతనియందు విశ్వాస ముంచెదను. మఱునాఁ డుదయమున బుద్ధుఁడే ముందుగా ననాథపిండదునిఁ జూడఁబోయి యతఁడు కంటఁబడినతోడనే సుదత్తా యని గారవమున పలుకరించెను. అతఁడు

తన ప్రథమనామధేయంబును జెప్పనతఁడనే యనత్పింఢుఁడను కాయన యందు గాఢమైనవిశ్వాసము కుదిరెను. కుదురుటయు నాజన్మాంతము బుద్ధప్రసిద్ధగ్రామమున నుండు నని యతఁడు శపథము జేసి తనయింటికి వచ్చి యొకసారి గృహపావనము చేయవలయునని బుద్ధుని వేఁడుకొని మరల శ్రావస్తికిం బోయెను. అట్లే వత్తునని బుద్ధుఁడు పలికి యాతని పంపెను. అనత్పింఢుఁడు శ్రావస్తికిం జని యతఁడనే నగరోపకంఠంబున నున్న మంచియుద్యానవనములలో నొకటి విశేషధనమిచ్చి యాతనియొద్ద కొని యచ్చట నొకవిహారముఁ గట్టించెను. ఆవిహారము చుట్టును శిష్యులకు వాసయోగ్యము లైన గృహము లుండెను. పగటివేళ నుపయోగ్యములగు భవనములు నిశాసమయోపయోగ్యములగు మందిరములుఁ బెక్కులు గలవు. అంతియేగాక తేటనీటికొలంకులు, మంచి పండ్లతోఁటలు, పూఁదోఁటలు, నేత్రోత్సవకరములై యుండెను. దానిచుట్టుకుఁ జుట్టు నాలుగువేలమూళ్ళపొడవును, బదునెనిమిదిమూరలయెత్తునుగల గొప్ప గోడ యుండెను. ఆవిహారనిర్మాణమునకు నెన్నోకోట్ల సువర్ణము లయ్యెనఁట.

అది యట్లు సిద్ధమైనపిదప ననత్పింఢుఁడు బుద్ధుని సవినయముగా నాహ్వానము చేసెను. బుద్ధుఁడు రాజగృహంబునుండి బయలుదేఱి దినమున కెనిమిదికోసుల వంతున నడచి నలువదియైదు దినములలో శ్రావస్తినగరముఁ జేరెను. అతఁడు నగరసమీపమునకు రాఁగానే గొప్పయుత్సవ మతని నెదుర్కొనెను. ఆయుత్సవములో నెన్నో మనుష్యులగుంపు లుండెను. ఒక్కొకగుంపులో నెనిమిదివందల మనుష్యులుండిరి. వారు సమయోచితము లయినపాత్రలుధరించి యమూల్యములగు వస్త్రాలంకారములు ధరించి బుద్ధుని సన్మానించిరి. అందొకగుంపునకు ననత్పింఢునిపుత్రిక లిరువు రగ్రనాయిక లయిరి. అనత్పింఢుఁడు బుద్ధుని విహారంబునకుఁ దోడ్కొనిపోయి యావిహార

మెవ్వరి కర్పణము సేయఁదగు నని యడిగెను. బౌద్ధసంఘమున కియ్యవలసిన దని బుద్ధుఁ డానతిచ్చెను. అతఁ డందుకు సమ్మతించి నలుదెసలనుండి వచ్చుశ్రమణుల యుపయోగము నిమిత్త మది యర్పణము చేయుచున్నానని చెప్పి బుద్ధునిహస్తములలో నతఁడు సువర్ణకలశోదకము ధారపోసెను.

అనత్పిండుఁ డవ్విధమున బౌద్ధసంఘమున కిచ్చినయావిహారమునందు బుద్ధుఁ డనేకసంవత్సరములు వసియించెను. అనత్పిండుఁడు తనయపార ధనసంచయంబులను బౌద్ధమతవ్యాప్తికొఱకు వ్యయము చేసెను. మహాత్ముఁడైన బుద్ధదేవుని మతము ప్రపంచంబున నెంతకాల ముండు నంతకాలముఁ బరమభక్తుఁడైన యనత్పిండుని పేరు గూడ నంతకాలము నుండిపోవును.

అనత్పిండుఁడు తరువాత బుద్ధుని కాప్తమిత్రమును, మతసంరక్షకురాలు వైశాఖ యనునామె. ఆమె మిక్కిలి భాగ్యవంతురాలు. బిడ్డలు, మనుమలు, మునిమనుమలు గలిగి యైశ్వర్యముగలిగి యామె పేరెన్నికఁ గాంచెను. ఎవరింట నే శుభకార్య మయినను నే వైదికతంత్ర మైనను ముందుగా వైశాఖను బిలిచి యామెకు సంతుష్టిగా భోజన మిడినపక్షమునఁ దమకు శుభములు గలుగు నను నమ్మిక యాపురవాసుల కుండుటచే నెల్లవా రామెను బహువిధముల గౌరవించుచుండిరి. శ్రావస్తినగరమునకు వచ్చునట్టి బుద్ధశిష్యులకుఁ గావలసిన పదార్థములన్నియు సమకూడునట్లు గొప్పయేర్పాటులు మొట్టమొదటఁ జేసిన దీవైశాఖయేయని చరిత్రకారులు చెప్పుచున్నారు.

ఒకనాఁడు బుద్ధుఁడు విశాఖయొక్కగృహమున శిష్యగణముతోఁగలిసి విందారగించుచుండఁగా విశాఖ భక్తితత్పరయై యాతని యెట్టయెదుట నిలిచి "దేవా! దేవరవారు నా కెనిమిదివరము లియ్యవలె"నని కోరెను. కోరుటయు బుద్ధుఁడు 'విశాఖా! సిద్ధార్థుఁడు నీవు

కోరినవరములు నెల్ల నీయుచున్నాఁడని తెలుపు'మని యుత్తరము నిచ్చెను. అనప్పుడు విశాఖ 'మహాత్మా! నాకోరికలలో నేదియు ననింద్యమైనకోర్కెలు యుక్తముల నెఱిఁగి యడుగుచున్నా'నని ప్రార్థించుచున్న దాన'ని పలికెను. పిమ్మట బుద్ధుండు 'విశాఖా! నీ కేమివరములు కావలెనో చెప్పు'మని యడిగెను. అప్పుడు విశాఖ యిట్లనియె—"నేను జీవించి యున్నంతకాలము నాబౌద్ధసోదరులకు వర్షకాలమునఁ గావలసిన వస్త్రములు నీయవలె ననియు, నీపట్టణమునకు వచ్చుచుండు క్రొత్త భిక్షుకులకు నన్నము పెట్టవలె ననియు, నీపురము దాటి బోవువారికి బాటసారి భిక్షుకులకు నన్నము పెట్టవలె ననియు, రోగులకు మందు లీయవలె ననియు, రోగుల నుపచారము చేయువారి కన్నము పెట్టవలెననియు, నాయక్క చెల్లెండ్రగు సన్న్యాసినులకుఁ బ్రతిదినముఁ గావలసిన యన్నము పెట్టి స్నానముచేయువేళ వారు ధరియించుటకుఁ దగినవస్త్రము లీయవలె ననియు, నేను కోరుచున్న దానను." అనవుడు గౌతముఁ డామెం జూచి 'యీవరములిమ్మని యడుగుటలో నీయుద్దేశ మే'మని యామెను బ్రశ్నించెను. ఆయనకు విశాఖ యిట్లుత్తరమిచ్చెను.

"విదేశమునుండి యిచ్చటికి వచ్చిన భిక్షుఁడు నగరమందలి వీథులను, సందులను నెఱుఁగక భిక్షాటనమున తిరిగి మిక్కిలి యలసి పోవును. భిక్షుకుఁడు రాఁగానే నేను సమర్పించినయన్నము దినెనేని నేఁడచటి యీపురమందలి వీథులు, సందులు, గొందులు నెమ్మదిగాఁ దెలిసికొని పిమ్మట ననాయాసముగా బిచ్చమునకుఁ దిరుగవచ్చును. దేవా! యిదె నాయుద్దేశము. ఈయుద్దేశముతోనే నేను జీవించి యున్నంతకాలము భిక్షుకులకు నాయోపినకొలఁది యింతయన్నము పెట్టఁ దలఁచికొన్నాను. మఱియు, పయనము సేయునట్టిభిక్షుకుఁడు నిజోదరపోషణార్థము భిక్షమున కెందెందుఁ దిరుగుచుండునేని వెనుకఁ

బడి తన విహారమును గలిసికొనలేకపోవును. ఒకవేళఁ గలిసికొన్నను మిక్కిలి యాలస్యముగాఁ గలిసికొనును. మార్గమున మిక్కిలి యలసి నడువలేక కాళ్ళీడ్చుకొనుచుఁ బోవును. నేను సమర్పించునట్టి యన్నముఁ దిన్నపిమ్మట భిక్షుకుఁడు సంఘారామమునకు వెనుకకఁ బడును. విశ్రమింపఁ దలంచుకొన్నస్థానమున కాలస్యముగాఁ బోవును. కాళ్ళీడ్చుకొనుచు నడచిన సేవించిన సుఖముగా నుండదు. దేవా! ఇంకొకటియు నాయుద్దేశము. ఈయుపాసకులకొఱకు నీవిధి విధియున్నంత వఱకు నీవగవారముగాని బొప్పులుగాని కన్నము పెట్టఁదలఁచుకొన్నాను. మహాత్మా! అనేకులు బౌద్ధసన్న్యాసినులు నగ్నలై కులటలు స్నానముచేయు రేవునందే వారితోఁగలిసి స్నానము చేయుచున్నారు. అరిమానవుల బరిత్రాణము భిక్షుకస్త్రీలను జూచి యాకులటలు పరిహాసము చేసి 'నేఁటిజవ్వన మున్నంత కాలము మీరు వెట్టివెట్టి నియమము తెలిసికొని? యౌవనపు హాయిగా భోగము ననుభవించి ముసలితనము వచ్చిన తరువాత సన్న్యాసినులై పవిత్రజీవనము చేయఁగూడదా? అందువల్ల పాపనులును కుండును మీకుఁ దక్క' నని యనదానమాట లనిరి. కులటలు లట్లు దమ్మును బరిహాసము చేయుటఁ జూచి భిక్షుకీజనము మిక్కిలి యాగ్రహము దాల్చెను. దేవా! ఆఁడుది దిగంబరయై యుండుట మిక్కిలి యసభ్యము, అసహ్యము. అనుచితము, అకృత్యము. కావున నేను ఏర్పరచియున్నంత వఱకు భిక్షుకీజనమునకు స్నానవస్త్రముల నీయఁదలంచుచున్నదానను.'

ఆమె యుద్దేశములు విని భగవానుఁడగు బుద్ధదేవుఁ డిట్లనియె.

'బాగు! విశాఖా! బాగు. నీయుద్దేశము మంచిది. నీవు లోకహితము చేయుటకై వరములను గోరితివి కావున నీ నావరములు నిచ్చితి' నని మెచ్చి యొక గీతమును బాడెను.

పంచదశాధ్యాయము.

బుద్ధుఁడు మిక్కిలి మంచివాఁడై నను నట్టిమహానుభావునకుఁ గూడ శత్రువులు లేకపోలేదు. అట్టి శత్రువులలో దేవదత్తుఁడు ముఖ్యుఁడు. అతఁడు బుద్ధునకు దగ్గఱచుట్టము. బుద్ధుఁ డప్పటికి వృద్ధుఁ డయ్యెను. దేవదత్తుఁడు దురాశాపాశబద్ధుఁడై బౌద్ధసంఘమున కెల్ల దాన యధికారి యై పరిపాలనము సేయఁగోరి బుద్ధునిస్థాన మాక్రమింపఁ దలఁచెను. బుద్ధుఁ డందుకు సమ్మతింపకపోవుటచే దేవదత్తుఁడు మగధరాజకుమారుఁ డయిన యజాతశత్రునితోఁ గలిసి కృతకృత్యుఁడు కాఁదలంచెను. అప్పుడు మగధరాజ్యమును బింబిసారుఁ డనురా జేలుచుండెను. అజాతశత్రుఁడు తండ్రిని రాజ్యభ్రష్టుని జేసి తాను సింహాసన మెక్కఁ దలంచెను. బుద్ధుని పదభ్రష్టుని జేసి యాపద మధిష్ఠింపఁదలఁచిన దేవదత్తుఁడును, బింబిసారుని బదభ్రష్టుని జేసి యాపద మధిష్ఠింపఁదలఁచినయజాతశత్రుఁడును సమాన సంకల్పు లగుటచే మైత్రి త్వరలోఁ గుదిరెను. కాని వారు పన్నినపన్నుగడ లెల్ల నిష్ఫలము లయ్యెను. వారు బుద్ధుని జంపుటకుఁ గూడఁ బ్రయత్నించినట్లు కనఁబడుచున్నది. లోకాతీతము లయిన మహాద్భుత కర్మములవలన బుద్ధుఁడు వారిబాఱిఁ బడకుండఁ దప్పె నని చరిత్రకారులు చెప్పుచున్నారు. అజాతశత్రు దేవదత్తులు బుద్ధుని వధియింపుమని పంపిన నరహంతలు చేయఁదలఁచినపనిలో నెఱవేఱక పరాజయము నొందుటయేగాక భయకంపితులై జ్వరపీడితులయిరి. చంపుటకై వారు బుద్ధుని సమీపమునకు వచ్చినప్పు డాయన వారిని సాదరముగాఁ బిలిచి నెమ్మదిగామాటలాడి ధర్మబోధము సేయ వా రాయన వాక్యామృతమాస్వాదించి సాధువులై యాయనమతములోఁ గలిసిరి. దేవదత్తప్రేరితులయిన దుష్టులు మఱికొందఱు గౌతమునిఁ దెగటార్చుటకై

గొప్పరాయి విసర నది యామహాత్మునకుఁ దగులక యాయన పాద ములపైఁ బడెను. సిద్ధార్థుఁ డొకసందులోనుండి పోవుచుండ శత్రు ప్రేరితులయి కొందఱు దురాచారులు మదపుటేనుఁగు నొకదానినా యన మీఁదికిఁ దోలిరి. అది మహావేగముతో నాతని సన్నిధికిఁ బో యి యాయన పోలికిం బోక నిశ్చేష్టమై మొగ్గవాలి నిలిచి యొ క్క నిముసంబున గిరుక్కున వెనుకకు మరలెను.

ఈవిధముగా జగద్గురువగువాని నాశనము చేయఁదలంచి తనప్రయత్నములఁ గృతకృత్యుఁడు కాలేక దేవదత్తుఁడు మఱియొక తె అంగునఁ దనమనోరథము సాగింపఁ జూచెను. దేవదత్తుఁ డిప్పటికి బౌద్ధుఁడ నని చెప్పుకొనుచుండుటం జేసి యొకనాఁడు బుద్ధుఁడు నివసిం చుచున్న వేలువనమునఁ గలిగి ధర్మములయం దత్యంతాసక్తి గలవాఁ డుంబోలె నటించి యాతఁడు బోధించినధర్మములప్రకారము సరిగా నెల్లవారు నడచుకొనుట లేదనియు నటు లెల్లవారు ధర్మములనుండితొ లఁగకుండఁ గఠినముగా శాసింపవలయునని మొఱఁ బెట్టెను. అతనికోరిక లలో ముఖ్యమైన వివి—

1 భిక్షుకులు పట్టణములసమీపమునందు నివసింపక యూరా మబైట నివసింపవలయును.

2 మనుష్యులు పాఱవైచిన చినుగుగుడ్డలు పీలికలు మొద లయినవి ధరింపవలయునే గాని వస్త్రములు ధరింపఁగూడదు.

3 భిక్షుకు లిల్లిల్లుఁదిరిగి బిక్షమెత్తి యుదరపోషణము చేసికో నవలయునే కాని గృహస్థులిండ్లకుఁ బోయి విందు లారగించుట, విహా రములకుఁ బంపఁబడిన యన్నము దినుట, మాంసభక్షణముఁ గూడదు.

పూర్వోక్తధర్మముల నుదాహరించుటలో దేవదత్తుఁడు బు ద్ధునిగూడ నధిక్షేపించెను. బుద్ధుఁడు శిష్యులయిండ్ల విందు లారగిం చుట, పట్టణసమీపములయందు వసించుట మొదలగునవి కొన్ని ద

యునుండెను. అధిక్షేపణ గర్భములైన యాతనివాక్యముల నాలకించి బుద్ధుఁడు వాని కిట్లనియె. "ధర్మముల నెచ్చటనైన ననుష్ఠింపవచ్చును. గుడ్డపేలికలె కట్టుకొని భిక్షాటనమువల్ల జీవించి యూరుబైటనే వసించి ధర్మము కఠినముగా ననుష్ఠించు మహానుభావు లున్నపక్షమున నా కాటంకము లేదు. సంకోచమే కాని యెల్లవారికి నట్లు చేయ నవసరము లేదు. అదియునుఁ గాక బాలురు, వృద్ధులు, సుకుమారశరీరులు సంతతకఠినముగా ధర్మాచరణము చేయలేరు. ధర్మ మవలంబించినవారు తమతమ దేశములలో నేయే యాహారము తినుట వాడుకయో యాయా యాహారము భుజింపఁదగును. కాని, నారాఁకలి యైనప్పుడు మితభోజనము మాత్రము చేయవలెను. మనుష్యుఁడు చెట్టుమొదటఁగూర్చుండియుఁ బవిత్రుఁడు కావచ్చును. గృహమునందుండియుఁ బవిత్రుఁడు కావచ్చును. గృహస్థుఁడిచ్చిన వస్త్రములు కట్టినను సిద్ధుఁడు కావచ్చును. గుడ్డపేలికలు కట్టినను సిద్ధుఁడు కావచ్చును. మాంసము దిన్నను సాధువై యుండవచ్చును. ఎల్లవారు తినకపోయినను సాధువై యుండవచ్చును. నిర్వాణము బడయుట నాముఖ్యసంకల్పము. ఎల్లరకు నేకవిధమైనకఠిన ధర్మము శాసించుటవలన నిర్వాణమార్గాన్వేషకులు మిక్కిలి కష్టపడుదురు." బుద్ధునిపలుకులువిని దేవదత్తుఁడు భగ్నమనోరథుఁడై యచ్చోటువదలిపోయి యజాతశత్రునిసహాయమువలన నూతనసంఘ మొకటి స్థాపించెను. క్రమక్రమముగా దానిలోఁగూడ బలువురు చేరిరి.

ప్రాచీనచరిత్రకారులు దేవదత్తునిచరమావస్థ నీవిధముగా వర్ణించిరి—

అత్యంతగుణ బుద్ధునిచేఁ దిరస్కరింపఁబడి దేవదత్తుఁడు గయకు సమీపంబుననున్న వనవిహారంబున కరిగెను. అచ్చట నతనిశిష్యులు నలుగురు నతనిం గలిసికొనిరి. క్రమక్రమమున ననేకు లాయనం జేరిరి.

శిష్యగణము కాలక్రమమున నైదువందలయ్యెను. దేవదత్తుని బలగము నానాటికి వృద్ధియగుటఁ జూచి వారినెల్లఁ దనశిష్యులుగాఁ జేసికొనవలసినకాలము వచ్చెనని తలంచుకొని బుద్ధుఁడు తనశిష్యులలో నగ్రగణ్యులగు సరిపుత్రుని, మగ్యలానుని బిలిచి దేవదత్తునివిహారము కడకుఁ బోయి యావచ్ఛక్తిని వినియోగించి యతని శిష్యులెల్ల నతని విడిచివచ్చునట్లుఁ జేయుమని చెప్పిపంపెను. అట్లగుఁగాకయని వారునుయ నమై దేవదత్తునివిహారమునకుఁ బోయిరి. వారలు పోవునప్పటికి నతఁడు శిష్యగణపరివేష్టితుఁడై బుద్ధుఁడు బోధించినట్లు వారికి ధర్మబోధ సేయుచుండెను. ఆయిరువుర నతఁడు చూచి బుద్ధునితో విరోధపడి వారు తన్నుఁ జేరుటకు వచ్చియుందురని భ్రమనొంది లోనికి రమ్మని యానతిచ్చెను. కాని దేవదత్తునిశిష్యులలోఁ బ్రధానుఁ డగు కోకాలికుఁడు వారు లోపలఁ బ్రవేశించుట కిష్టపడక వారు నేదో యుపాయము సేయుటకై వచ్చియుండవచ్చును గావున వారిని రానియ్యవలదని గురువుతోఁ జెప్పెను. కాని యాతనిమాట వినక దేవదత్తుఁడు వారిని రానిచ్చి తన కుడిప్రక్క సరిపుత్రుని, నెడమప్రక్క మగ్యలానుని గూర్చుండఁబెట్టుకొని బుద్ధదేవుఁడు ధర్మబోధ సేయునప్పుడన్యకౌండిన్యుఁడను శిష్యు నేస్థానమందు గూర్చుండఁ బెట్టుకొనునో యాస్థానమునందుఁ గోకలికుని గూర్చుండఁ బెట్టుకొని యెల్లవిధముల బుద్ధు ననుసరింపవలెనని ధర్మోపదేశ మారంభించెను. అట్లు కొంతవఱకు దేవదత్తుఁడు బోధించినపిదప సరిపుత్రుఁడు దేవరవారలనినట్లున్నారు. నేను కొంతసేపు బోధించెద నని చెప్పి యాతని నూరకుండఁబెట్టి తాను బోధనము చేయఁజొచ్చెను. అంతలో దేవదత్తుఁడు నిద్రబోయెను. అతనికి మెలకువ వచ్చునప్పటికి సరిపుత్రులయొక్క బోధమువలన నయిననేమి, మగ్యలానుని ప్రయత్నములవల్ల నయిననేమి దాదాపుగా శిష్యగణ మెల్ల నతనిని విడిచి పోయెను. శూన్యమయిన

తనవిహారము జూచి కోకిలకుఁడు చేసిన హితోపదేశము విననందుకుఁ దద్దయు విచారించి వెంగకెట్టుకొని దేవదత్తుఁడు జబ్బుపడెను. ఆరోగముచేత నతఁడు తొమ్మిదిమాసములు పీడింపఁబడెను.

అనంతర మతఁడు బుద్ధదేవుని సందర్శించి తనకావించిన దుష్కార్యముల సైరించి తనను వెండియు శిష్యుని జేసికొమ్మని ప్రార్థింపఁదలంచెను. బుద్ధుఁడు క్షమింపఁడు. వెళ్లవద్దని శిష్యు లెంత చెప్పినను వినక బుద్ధుఁడు తనయెడల నేనమాత్రము ద్వేషము వహింపలేదని స్పష్టముగాఁ జెప్పి తనమనోనిశ్చయమును మార్చికొనకపోయెను. అతఁడు స్థిరనిశ్చయుఁ డగుటం జేసి శిష్యులు వాని నొకపల్లకిలోఁ గూర్చుండఁబెట్టి యతనివిహారమునకుం గొనిపోయి పల్లకి నొకసరోవరతీరంబునఁ బెట్టి తాము స్నానముచేయుటకై చెఱువులో దిగిరి. ఆదివఱకుఁ గొన్నిదినంబులనుండి మంచముమీఁదనుండి లేవలేకపోయినను దేవదత్తుఁడు బుద్ధుని సత్వరముగాఁ జూడవలె ననునాత్రముచేతఁ బల్లకినుండి క్రిందికిదిగి లేచి నడువఁ బోయెను. అతఁడు నేలపై నడుగు బెట్టఁగానే చుట్టుప్రక్కల నున్నకొండలమీఁద నుండి యగ్నిజ్వాల లెగసి వచ్చి యాతని శరీరమును నాహుతి జేసికొనెనఁట. ఆమంటలు తన్నుఁ గబళించునప్పు డతఁడు దేవదత్తుఁడు "ఓబుద్ధుఁడా! నేను నీయెడల నపచారము చేసినను నాచుట్టరికమునుబట్టియైన నన్నురక్షింపుము రక్షింపు" మని వేఁడుచుఁ బ్రాణము విడచెనఁట. కొండలమీఁదనుండి యగ్నిజ్వాలలు ప్రసరించి వానిని గాల్చుట యతిశయోక్తియై యుండవచ్చును. బుద్ధుని జూడవలె నను మహాత్రముతో నతఁడు దుస్స్థలస్థితిలో నడచి యుండవచ్చును. అందువలన మృతినొంది యుండవచ్చును. బుద్ధునియెడలఁ దాను గావించిన మహాపచారములు జ్ఞప్తికిఁ దెచ్చికొని పశ్చాత్తప్తమనస్కుఁడయి కట్టకడపట బుద్ధునే శరణము వేఁడియుండవచ్చును.

షోడశాధ్యాయము.

సిద్ధార్థుఁడు బుద్ధత్వము పొందిన పిదప నెవిధముగఁ బ్రత్యూహముఁ దనజీవితముఁ గడపెనో తెలిసికొనవలెనని చదువరులలో ననేకులకుఁ గుతూహల ముండవచ్చును. అందుచేత నతని ప్రతిదినచర్య దొరికినంతవఱకు వ్రాయఁబడుచున్నది. బుద్ధుఁడు మత వ్యాప్తిచేయుటకయి దేశాటనము చేయునప్పుడు భక్తితత్పరులగు నుపాసకులు ప్రీతిపూర్వకముగా సమర్పించిన విహారములయందు నివసించుచుండును. ఆవిహారములలో ముఖ్యమైనవి రెండు కలవు. అందు మొదటిది వేలువనవిహారము. ఇది మగధరాజధాని యగు రాజగృహనగర సమీపమం దున్నది. మగధరాజగు బింబిసారుఁడు దీనిని బుద్ధునకు సమర్పించెను. రెండవది శ్రావస్తినగరమందలి జేతువనవిహారము. ఇది భక్తుఁడయిన యనత్పిండుఁడు సమర్పించినది. ఈరెండువిహారములు బుద్ధునకు మిక్కిలి ప్రీతికరములైనవి. ఈవిహారములయందే యతఁడొకానొకప్పు డొంటిగాను మఱియొకప్పుడు శిష్యగణసమేతము గాను నివసించుచుఁ జాలకాలము గడపెను.

బుద్ధునిజీవితకాలము రెండుభాగములుగా విభాగింపఁబడవచ్చును. కొంతకాలము దేశాటనము చేయుట; కొంతకాలము విశ్రాంతి నొందుట. మహీమండలము నంతను తీవ్రాతపములచేఁ గాల్చునట్టి ప్రచండ గ్రీష్మముయొక్క యవసాన దశయందుఁ గ్రొక్రొత్త మబ్బులు నభోవీథి నావరించి ఘణంఘణధ్వానములతో నుఱుము సమయమున దేశములు సంచారయోగ్యములు కావని బుద్ధుఁడు వర్షాకాల మేదో యొక్క విహారమునఁ గడుపఁదలఁచి యచ్చటికరుగుచుండును. ఆవర్షాకాలము తమగురుని సన్నిధానమునఁ గడుపవల

యు ననుకూలములగు శిష్యులు వందలకొలఁది యుండుచున్న విహారమునకుఁ బోవుచుందురు. ఇప్పటివలెఁ గాక పూర్వపువర్ష కాలము మిక్కిలి భయంకరమై యుండెను. ఇప్పటివలెఁ జక్కని బాటలు గాని వడవలు నడుచుటకు కాలువలు గాని లేకపోవుటచే వానకాలమునఁ బరిమాణములు దుస్సాధ్యములు. వానలుకూడ నిప్పటివలెఁ గాక సంతతధారగాఁ గురియుచుండును. అందుచే భిక్షుకులు సన్యాసులు మొదలగువారు వానకాలపునాలుగునెలలు చాతుర్మాస్యలను పేరుపెట్టి యేదోయొక నెలవునఁ గడుపుదురు. ఆసాంప్రదాయమునుబట్టియే నేఁడు సైతము సన్యాసులు చాతుర్మాస్యదినములలో నొకచోటినుండి మఱియొకచోటికిఁ గదలఁగూడదని నాలుగుమాసములు నొక్కగ్రామమునందే పుచ్చుచుందురు. ఈనియమముయొక్క యుద్దేశము మిక్కిలి మంచిది. సన్యాసులకు నివసించుటకు గృహములు గాని వస్త్రములు తడిసినప్పుడు కట్టుకొనుటకు మాఱుబట్టలు గాని వర్షమునుండి కాపాడుటకు గొడుగులుగాని లేకపోవుటచే వర్షకాలదినములు వారికి ముఖ్యముగా సంచారయోగ్యదినములు కావు. ఇది చక్కఁగాఁ బర్యాలోచనము చేసి బుద్ధుఁ డీనియమ మేర్పఱచి యుండవచ్చును. అదే మనధర్మశాస్త్రకర్తలుకూడ నవలంబించియుందురు. బౌద్ధసంఘము నిమిత్త మేర్పడినవిహారములలో వానకాలమున బుద్ధదేవునిచుట్టుఁ జేరిన శిష్యగణములకును గురువునకును నానాలుగు నెల లాతిథ్యమిచ్చుట గొప్పగౌరవమనియు నది యదృష్టవంతులకే గాని లభింపదనియు భావించి మహైశ్వర్యవంతులును మహారాజాధిరాజులును, బుద్ధుఁడు మా కతిథి కావలె మాకతిథి కావలె నని పంతమాడుకొని తద్గౌరవము నిమిత్తమై బహుప్రయత్నములు సేయుచు వచ్చిరి.

పరివ్రాట్కాలము ముగిసినతోడనే మరల సంచార మారం

భమగును. బుద్ధుఁ డొకగ్రామమునుండి మఱియొకగ్రామమునకు నొక పట్టణమునుండి మఱియొక పట్టణమునకు బహుశిష్యగణములు సేవించుచుండఁ బయనము చేయుచుండును. ఆయన తఱుచుగా సంచరించిన దేశ మార్యావర్త మందలి తూర్పుభాగ మని చెప్పవచ్చును. తూర్పుభాగ మనఁగాఁ గాశీ కోసల మగధ దేశములు. ఈ దేశములు నేఁటికాలమున నయోధ్య బిహారు దేశము లని వ్యవహరింపఁబడుచున్నవి. గ్రామనగరములలో బుద్ధుని శిష్యులను సంపన్నులగు గృహస్థులు తఱుచుగా విందునకుఁ బిలుచు చుందురు. ఎవరి యింటను వచ్చి తన్ను భోజనమునకాహ్వానము చేసినప్పుడు బుద్ధుఁడు వారికుత్తరము చెప్పక మౌనము ధరించి వారి యాహ్వాన మంగీకరించి తన కావిరిలువుటంగిఁ దాల్చుకొని భిక్షాపాత్రము చేతఁబూని వారి యింటి కరుగుచుండును. భోజనానంతరమున గృహయజమానుని విందునకు వచ్చిన బంధుమిత్రులకు నొకానొకప్పుడు ముక్తిమార్గ బోధకములు, నీతిపరికర్మకములు నగు ధర్మముల నుపదేశించుచుండును. తన్నెవరు భోజనమునకుఁ బిలువనప్పుడు తాను చేసిననియమముల ప్రకారము భిక్షాపాత్రము చేతఁబూని బిచ్చమునిమిత్తము గ్రామమంతయుం దిరుగును. అట్లు తిరుగుటలోఁ బ్రతిగృహంబునకుంబోయి భిక్షాపాత్రము చేతఁబట్టుకొని యింటివారొక్క కబళమన్నముఁ దెచ్చి వేయువఱకు మౌనము ధరించి గుమ్మము ముందఱ నిలుచును. భోజనమైన తరువాత నతఁడు సాధారణముగా విహారములో నొకగదిలోఁగాని మఱిచెట్టునీడను గాని కూరుచుండి కొంతసేపు ధ్యాననిష్ఠుఁడై యుండును.

బుద్ధదేవుఁడు నిర్వాణపథము బ్రాపించువఱకు నీవిధముగానే ప్రతిసంవత్సరముఁ గడుపుచుండును.

బుద్ధుఁడు గ్రంథములేవియు వ్రాయలేదు. మతబోధయైనను

వాగ్రూపకముగాఁ జేసెనేగాని లిఖితరూపకముగాఁ జేయలేదు. మతబోధ జేయునప్పు డాయన సంస్కృతభాష నుపయోగింపక తాను సంచరించుచున్న దేశములలో నేభాష వ్యవహారములో నుండునో యాభాషలోనే ధర్మములు బోధించుచుండును. మన మతగ్రంథము లయిన వేదములు, వేదాంగములు, స్మృతులు, సూత్రములు మొదలగు శాస్త్రములు, పురాణములు, గీర్వాణభాషలోనే యున్నవి. అవి పండితగ్రాహ్యములే గాని పామరగ్రాహ్యములు కావు. వాని నభ్యసింపఁ దలఁచువారికి వారి కుపాధ్యాయులు గీర్వాణభాషలోనే వానిని నుపదేశించుట యాచారమై యుండెను. దేశభాషలో సర్వజనసులభమైన శైలిలో మతధర్మములు మనపూర్వీకు లెన్నఁడుఁ జేయలేదు. మన దేశములో మతబోధకులే లేరు. దేశభాషలో జేయువారు మొదలేలేరు. మొట్టమొదట దేశభాషలో జనసామాన్యమునకుఁ దెలియునట్లు మతము బోధించిన మహానుభావుఁడు మతబోధకుల నేర్పఱచి నానాభాగముల కంపిన మహాశయుఁడు ప్రపంచమున బుద్ధదేవుఁడే యని చెప్పుట యతిశయోక్తి కాదు. బుద్ధదేవుని తరువాత నాసియాఖండమున గొప్ప మతబోధకుఁ డని చెప్పఁ దగిన జీసస క్రీస్తు మతబోధకులను నియమించి పంపెను గాని యతఁడును గౌతమునిమార్గ మనుసరించె నని చెప్పుట సత్యమునకు గౌరవమునకు దూరము కాదు. ఏలయన జీసను పుట్టినప్పటికే పాలస్టైన్ దేశమునందును దాని పరిసరంబులనుండు దేశములందును బౌద్ధమతము వ్యాపించి యుండెను. బుద్ధమతబోధకు లచ్చటచ్చట నుండిరి. జనుల మాతృభాషలో ధర్మములు బోధింపఁబడినపక్షమున నవి జనులకు సులభగ్రాహ్యములయి మనంబున నాటి వారి మనస్సులను ధర్మపరాయణములుగఁ జేయునను గొప్పరహస్యమును మొట్టమొదటఁ గనిపెట్టినచతురమతి గౌతమబుద్ధదేవుఁడే. బుద్ధుఁడు తఱుచుగా నుపయోగించినభాష పాలీ

భాష. ఇది యీాయన మాతృభాషయై యుండవచ్చును. లేకయీాయన సంచరించిన కాశీ కోసల మగధాది దేశములందు కాలమున వ్యవహరింపఁబడిన భాషయైనఁ గావచ్చును. ఈయననోటనుండి వెడలిన సమస్తధర్మోపదేశములను శిష్యులు జ్ఞాపకము నుంచుకొని పాలీభాషలో వ్రాసిరూ దినందునను నతఁడు సంచరించిన దేశములలో పాలీభాష వ్యవహరింపఁబడిన దని మన మూహింపవచ్చును. ఆమహాత్ముఁడు కావించిన బోధనలలోఁ గొన్ని పాలీగ్రంథములలోఁ గనఁబడుచున్నవి. అందొక టీక్రింద నుదహరింపఁబడుచున్నది.

"ఓ శిష్యులారా! ప్రతివస్తువు దగ్ధమగుచున్నది. దగ్ధమగుచున్న వస్తువేది? కన్ను దగ్ధమగుచున్నది. ఆకంటిచేఁ జూడఁబడు వస్తువు దగ్ధమగుచున్నది. దృశ్యమాన పదార్థజ్ఞానము దగ్ధమగుచున్నది. దృశ్యమానపదార్థసంబంధము కూడ దగ్ధమగుచున్నది. దృశ్యమానపదార్థసంబంధమువలనఁ గలుగు మనోవికారము సంతోషముగాని, బాధగాని, సంతోషముగాకపోసి, బాధగాకపోసి, యెదియైనను సరె యదికూడ దగ్ధమగుచున్నది. అది యేమగ్నిచేత దగ్ధమగుచున్నది? కామాగ్నిచేత, క్రోధాగ్నిచేత, మోహాగ్నిచేత పరివులుకొనుచున్నది. అంతియేగాదు. అది జన్మముచేత ముదిమిచేత మరణముచేత బాధచేత రోదనముచేత దుఃఖముచేత విచారముచేత నిరాశచేత నది రవులుకొని మండుచున్నది. అలాగుననే మనచెవి కూడ దగ్ధమవుచున్నది. శ్రావ్యమానవస్తు దగ్ధమగుచున్నది. శ్రావ్యపదార్థజ్ఞానము కూడ దగ్ధమగుచున్నది. శ్రావ్యపదార్థసంబంధముకూడ దగ్ధమగుచున్నది. శ్రావ్యపదార్థసంబంధమువలన గల్గుమనోవికారము సంతోషముగాని బాధగాని సంతోషముగాకపోసి బాధగాకపోసి యేదియైననుసరే యదికూడ దగ్ధమగుచున్నది. అది యేమగ్నిచేతదగ్ధమగుచున్నది. కామాగ్నిచేత, క్రోధాగ్నిచేత, మోహాగ్ని

చేత, నిది రవులుకొనుచున్నది. అంతియేగాదు. అది జన్మముచేత, ముదిమిచేత, మరణముచేత, బాధచేత రోదనముచేత దుఃఖముచేత విచారముచేత నిరాశచేత నది రవులుకొని మండుచున్నది."

ఆయన మతము లోఁ జేరుటకుఁ గాని యాయన సిద్ధాంతము లేవో తెలిసికొనుటకుఁగాని యెవ్వఁడయిన వచ్చి యాయన దర్శనము చేసినప్పుడు బుద్ధుఁడు వానిం బిలిచి లోకవ్యవహారమందు దయా ధర్మములుగలిగి ఋజుమార్గమునఁ బ్రవర్తింపుమని వానినిముందుగ హెచ్చరించుచుండును. ఇహమునందు మంచినడవడికగలిగి ప్రవర్తించు వానికిఁ బరమునందు నక్షయమగుసౌఖ్యము గలదని యాయన నొక్కి చెప్పుచుండును. తరువాతను వానిమనస్సున నాఁటి కొంతపనిచేసిన వని తోఁచినప్పు డాయన వానిమనస్సు పక్వమైనదని తెలిసికొని బుద్ధులసిద్ధాంతమైన జన్మపరంపరామోక్షమునుగూర్చి యుపన్యసించు చుండును. ఇది యాయన బోధలో రెండవపద్ధతి. ఇదికాక సంభాష ణములవల్లను, ప్రశ్నోత్తరములవల్లను గూడ నతఁడు నిజసిద్ధాంతము ల బోధించుచుండును. ఇది మూఁడవపద్ధతి. అందు కీక్రిందిదొక యుదాహరణము.

"ఒకనాఁడు బుద్ధుఁడు భిక్షాటనము సేయుచుఁ దనకుఁ బ్రియ శిష్యుఁడును బరమభక్తుఁడైనయనత్పిండుని గృహమునకు వచ్చెను. అక్కడ నతనికి నొకవిధమైన కయ్యము, బిగ్గరగా మాటలాడుట మొదలైనవి వినఁబడఁగ నతఁడు గృహయజమానునిఁజూచి "యేమి! నీ యింట రోదనధ్వని వినఁబడుచున్నది. బెస్తవాండ్రు బుట్టలో నుండి చేఁపలు దొంగిలింపఁబడినప్పుడు పొడమునంతకలకలము పొడము చున్నది" యని యడిగెను. అనవుడు బుద్ధునితో గృహస్థుఁ డిట్లనియె "స్వామీ! భాగ్యవంతుఁడైన గృహస్థునికోడ లిక్కడికి వచ్చినది. ఆమె మగనిమాట మన్నింపదు. అత్తమామల కడకున నేయదు.

అంతియె కాదు. బుద్ధుని మొదలుగూడ విస్మయముం జూపనొల్లను." అప్పుడు కులువిని బుద్ధుం డాబాలికం బిలిచి "భిక్షూ! సుజాతా! యిటురా" యని పిలిచెను. చిత్తము స్వామీ! యని యామె దగ్గరకుం బోయెను. పోవుటయు నామె కిట్లు చెప్పెను. సుజాతా! మానవుని కేడుగురు యిల్లాండ్రుందురు. ఆయేడుగురు నెట్టివారో వినుము. ఒకతె హంతకురాలువంటిది. రెండవది దొంగవంటిది. మూడవది యజమానికత్తె వంటిది. నాల్గవది తల్లివంటిది. ఐదవది తోబుట్టువువంటిది. ఆరవది మిత్రమువంటిది ఏడవది దాసివంటిది.

సుజాతా! మగవానికుండునట్టి యేడుగురు భార్యల రీతు లివి. నీ వీరిలో నే తెగలోఁ జేరుదువు? అని యడుగుచు సుజాత బుద్ధుని సాన్నిధ్య విశేషముచేతనో సహోదార్యముచేతనో యుపదేశముచేతనో తొంటి మొండితనము విడచి వినయభావమున నిట్లు విన్నవించెను.

"స్వామీ! దేవరవారు సంగ్రహముగా సెలవిచ్చిన విషయములు నాకు బోధపడలేదు. కావున దేవరవారు సంగ్రహముగాఁ జెప్పిన విషయములే నాయందనుగ్రహించి నాకు సవిస్తరముగాఁ దెలియునట్లు జెప్పవలె" నని వేడుచున్నాను.

అనుటయు బుద్ధుం డామెయందు దయగలిగి యామె కేడు తెఁగుల యిల్లాండ్రను వర్ణించి చెప్పి యామెను వారిలో నీ వేతెగదానవని మరల నడిగెను. అప్పుడు సుజాత "దేవా! యీ దినము మొదలుకొని నేను నా భర్తకు దాసివంటిదాన" నని చెప్పెను.

పూర్వోదాహృతము లయిన సూత్రవిధములం గాక యుపమానములవల్లఁగూడ బుద్ధుఁడు తనధర్మములు బోధించుచుండెను. ఈ క్రింది యుదాహరణము దానిని వ్యక్తపఱచును.—

"శిష్యులారా! ఒక కొండక్రింద నడవిలో నీటితో నిండినపల్లపునేల యున్నది. దానిసమీపమున గొప్ప లేళ్ళమంద గలదు. ఈ లేళ్ల

అపకారముం జేయుతలంపుతో నొక దుష్టుండు క్షేమమయి మనోహరమయి సుగమ మయిన మార్గమును మూసివైచి బురద గలిగి దుర్గమమై గోతులతో నిండినతప్పుదారి వాటినిమిత్తమై యేర్పాటు చేయును. అది మొదలుకొని యీ పెద్దమంద హానిజెంది క్రమక్రమముగా నశించును గదా! అట్లుండ నొక సజ్జనుండు వచ్చి లేళ్ళకు క్షేమకరమయి యభివృద్ధికరమయిన యేర్పాటులు చేయందలంచి క్షేమకరమయి మనోజ్ఞమైయున్న మంచిమార్గమును దెఱచి తప్పుదారిం గప్పిపుచ్చి బురదనేల గనంబడకుండం జేసినపక్షమున లేళ్ళమంద వృద్ధిజెంది సుఖించును గదా! నా చెప్పం దలంచిన విషయమంతయు యర్థము మీకుం గథారూపమునం జెప్పితిని. ఇదిగో దానిపరమార్థము వ్యక్తము చేయుచున్నాను. వినుండు! నీటితో నిండినపల్లపునేల భోగము. లేళ్లమందయనంగా మానవకోటి. హానిచేసి దుఃఖనాశనములను గలుగంజేయుమనుష్యుండు మహాదురాత్ముండైనమారుండు. తప్పుదారి యనంగా నెనిమిది తెఱంగులనున్న చెడుత్రోవ. ఆ యెనిమిది తెఱగులెవ్వి యననివి.— 1 పాపమార్గము, 2 పాపనిశ్చయము, 3 పాపసంభాషణము, 4 పాపకార్యము, 5 పాపజీవనము, 6 పాపప్రయత్నము, 7 పాపాలోచనము. 8 పాపస్వభావము. ఆపాడుదారిభోగము, కామము. అజ్ఞానమె యీ బురదనేల.

సప్తదశాధ్యాయము.

బుద్ధుం డెనుబదియేండ్లవాం డైనప్పు డనంగా నతండు నూతనమతస్థాపనముం జేసిన నలుబదియైదవయేట శ్రావస్తినగరమునుండి రాజగృహంబునకు వచ్చి గృధ్రశిఖర మనుకొండమీంద బసచేసెను.

అక్కడ నున్నకాలముననే యామహాత్ముఁడు ఋజుమార్గ వర్తనముఁ గూర్చియు ధ్యాననిష్ఠంగూర్చియు, బుద్ధింగూర్చియు భిక్షువులతోఁ జర్చించి కొన్నియుపన్యాసముల నిచ్చెను. అట్లు కొంతకాల మచ్చట నుండి యాతఁడు తనప్రియశిష్యుఁ డయిన యానందుని బిలిచి "ఆనందా! మన మిప్పు డంబలీతిహగ్రామమునకుఁ బోవుదము. ర"మ్మని పిలిచెను. ఆనందుఁడు తక్కిన శిష్యులు వెంటరా నతఁ డచ్చటనుండి నలందపురమునకుఁ జని యొక మామిడితోఁటలో బస చేసెను. అనంతరము సిద్ధార్థుఁ డచ్చటనుండి పాటలీగ్రామమునకుఁ బోయెను. తరువాత నిదియే పాటలీపుత్రమని పిలువఁబడి చంద్రగుప్తాశోకప్రముఖ మౌర్యరాజులకును సుంగకాన్వాంధ్ర వంశపు రాజులకును రాజధానియై లోకప్రఖ్యాతి గాంచెను. కాని బుద్ధుని కాలమున నది యొక చిన్నగ్రామము. అందుకే యది పాటలీగ్రామ మనుపేర వ్యవహరింపఁబడెను. పాటలీగ్రామ సమీపమునకు జగద్గురుఁడు వచ్చె నని వినినతోడనే శిష్యులు సంతోషభరితస్వాంతులయి యాతఁడు విడిసిన నెలవునకుం జని, భయభక్తులతో నతని చుట్టు గూర్చుండి తమ గ్రామమునకు వచ్చి యచ్చట నున్న సత్రమున బస చేయుమని వేఁడిరి. బుద్ధుఁ డందు కొడంబడెను ఆతఁడు సత్రమునకుఁ బోవుచుండ శిష్యులతనికి నమస్కరించి కుడిప్రక్క నాయనకును త్రోవ నిచ్చి యెడమప్రక్కను దారు జనిరి. ఆ సత్రము సమస్త విధములచేత జగద్గురువునకు వాసయోగ్యముగా నుండునట్లు జేయుటకై యాసనములువైచి కుండలో నీళ్ళుపెట్టి దీపమిచ్చి శక్యమైనన్ని సౌకర్యములు వారేనఁ గూర్చిరి. అన్నియు సిద్ధమయినవెనుక వా రాయన సమీపమునకుఁ బోయి నమస్కరించి "దేవా! సర్వము సిద్ధమయినది. మీరు చేయఁదలఁచినకార్యము చేయుటయే కొఱత" యని విన్నవించిరి. విన్నవించుటయు నతఁడు తనకాషాయ వస్త్రములు

ధరించి భిక్షాపాత్రము కేలం బూని భిక్షుగణము తన్ననుసరించి రాసత్రముఁ బ్రవేశించి పాదప్రక్షాళనము జేసి పశ్చిమచావడిలోనికిం జని మధ్య స్తంభమునకుఁ జేరఁబడి తూర్పు మొగముగాఁ గూర్చుండి పాటలీగ్రామశిష్యుల నుద్దేశించి యీ క్రిందివిధముగ నుపదేశించెను.

"ధర్మశూన్యతచేత దోషి యైదువిధము లయినకష్టములఁ బొందుచున్నాఁడు. మొట్టమొదట దోషి ధర్మరహితుఁడై సోమరిపోతై దరిద్రుఁడగును. తరువాత నతని యపఖ్యాతి లోకమున మిక్కిలివెల్లడియగును. పిమ్మట నతఁడు బ్రాహ్మణులయొద్దకుఁ గాని ప్రభువుల యొద్దకుఁ గాని గృహస్థులయొద్దకుఁ గాని శ్రమణులయొద్దకుఁ గాని వాఁడెవరియొద్దకుఁ బోయినను, నే సంఘమునఁ బ్రవేశించినను, మిక్కిలి తొట్రుపడి భయముతోఁ బోవును. అతఁడు చనిపోవునప్పుడు మిక్కిలి మనోవ్యథతో మృతిఁ బొందును. ఇది నాల్గవది. కడపట నతఁడు మరణానంతరము మోక్షము నందలేక పాపశేషము ననుభవించుటకేదో యొకపాపజన్మమెత్తి నానావస్థలపాలగుచుండును. ఓగృహస్థులారా! పాపాత్ములనుభవించునట్టి యైదువిధముల నష్టమిది.

ఓగృహస్థులారా! ధర్మపరాయణుఁ డైదువిధములయినలాభములొందును. ధర్మతత్పరుఁడగుటచే కాయకష్టపడి భాగ్యవంతుఁడగును. తరువాత నతని విషయమై సత్కీర్తి లోకమున వ్యాపించును. పిమ్మట నతఁడు బ్రాహ్మణుల కడకుఁగాని, ప్రభువులయొద్దకుఁగాని, గృహస్థులకడకుఁగాని, శ్రమణులయొద్దకుఁగాని, యెక్కడకుఁ బోయినను నేసంఘమునఁ బ్రవేశించినను, గావలసినంత మనోధైర్యముతోను నాత్మవిశ్వాసముతోను బోవును. మనోవ్యథలేక మృతినొందును. మరణానంతరమున స్వర్గమున మంచిదశలో జన్మించును. ఓగృహస్థులారా! యివియే ధర్మనిరతుని పంచవిధలాభములు."

ఇట్లు సిద్ధార్థుఁడు శిష్యులకు నీతినేర్పి యానందభరితస్వాంతు

లఁ జేసి సత్కార్యములకుఁ బురికొల్పి యజ్ఞానవిసర్జనుండి ప్రబోధించునప్పటికి రాత్రిచాలఁ బ్రొద్దయ్యెను. అప్పు డాయన వారి నుద్దేశించి “గృహస్థులారా! రాత్రిమిక్కిలి యతిక్రమించినది. ఇఁక మీపనుల మీఁద మీరు పొండని యానతిచ్చెను.

బుద్ధుఁడు ప్రాతఃకాలమునందే లేచి పాటలీగ్రామమునఁ గట్టఁ బడుచున్న యొకకోటను జూచి “ఆనందా! పాటలీగ్రామమునఁ గోట కట్టుచున్నవా రెవ్వ”రని యడిగెను.

“దేవా! మగధరాజమంత్రులగు సునీథుఁడును, వైశాఖుఁడును, రాజ్యశత్రులగు వజ్జులను రాష్ట్రములోనికి రాకుండఁ జేయుటకై యీకోట కట్టుచున్నా”రని యానందుఁ డుత్తరము చెప్పెను.

అనవుఁడు బుద్ధుఁ డిట్లనియెను. “ఈపాటలీగ్రామము మిక్కిలి ప్రసిద్ధమైననగరమై సమస్తవ్యవహారస్థలములకు నిలయమై, సమస్తవస్తువుల క్రయవిక్రయములకు స్థానమై, ముఖ్యనగర మగును. కాని, యీనగరమున కగ్నిపీడ, జలపీడ, యంతఃకలహపీడ యనునట్టి మూఁడాపదలు వచ్చును.”

నాఁడు బుద్ధదేవుని నోట వెడలిన యామాట లాపట్టణవిషయమున నక్షరాల జరిగెను. బుద్ధదేవుఁడు పాటలీగ్రామమునకు వచ్చినాఁ డని విని యాయిరువురు మగధరాజమంత్రు లాయనను సందర్శించి నమస్కరించి “మహాత్ముఁడగు నీ బుద్ధదేవుఁడు శిష్యగణసమేతముగా వచ్చి మాగృహమున భిక్ష సేయవలెనని వేఁడుచున్నా” మనికోరిరి. ఎవ రయినఁ దన్ను భిక్షకుఁ బిలిచినప్పుడు మౌనముతో దాని నంగీకరించుటయే బుద్ధుని యాచారము గావున నతఁ డప్పలుకులు విని యూరకుండి వారి యింటికిఁ జని యచ్చట భిక్ష సేసి యాగ్రామము విడిచిపోయెను. పోవునప్పుడు మంత్రులు కొంతదూర మాయనను సాగనంపి యిట్లనిరి. “గౌతమశ్రమణుఁడు పోయిన ద్వారము గౌతమ

ద్వారమనియు, నతఁడు నదిదాఁటిన రేవు గౌతమతీర్థమనియు, నిఁక ముందు వ్యవహరింపఁబడుఁగాక!"

గౌతముఁడు గంగానది దాఁటి శిష్యులతోఁగూడి "కోటి" గ్రామమునకుఁ బోయెను. భాగీరథీనది నుత్తరించుటలో నొకమహాద్భుతము గౌతమునిచేతఁ గావింపఁబడె నని బౌద్ధపురాణకథలలో నున్నది. అది విశ్వాసపాత్రము గాకున్నను చిత్రముగా నుండుటచే నీ క్రిందఁ జేర్పఁబడు చున్నది.

గంగానది దాఁటుటకు బుద్ధదేవుఁడు పోవునప్పటి కానది పొంగి నిండి వఱదలో నుండెను. అద్దరికిఁ బోవుటకు శిష్యులు తగినసాధనముల వెదకికొనఁజొచ్చిరి. కొందఱు నావలకయి యత్నించిరి. కొందఱు దూలములకయి ప్రయత్నించిరి. కొందఱు తెప్పలు సంపాదింపఁజూచిరి. అప్పుఁడు బుద్ధదేవుఁడు దృఢశరీరుఁడు చేయిచాపి మరలముడిచికొనుట కెంతసేపుపట్టు నంతలో నిద్దరినుండి యద్దరికి నొక్కనిమిసములోఁబోయి యవ్వలిగట్టున శిష్యగణసమన్వితుఁడై నిలిచెనఁట!

తర్వాత నతఁడు నదికగ్రామమునకుఁ బోయి యచ్చటఁ గొంత కాలముండెను. అనంతర మతఁడు వేసాలిపురమున కరిగి "యంబపల్లి" యను నొక వేశ్యాంగనయొక్క మామిడితోఁటలో విడిసెను. బుద్ధదేవుఁడు వేసాలిపురమునకు విచ్చేసెననియు, నందుఁదనమామిడితోఁటలో విడిసెననియు, నంబపల్లి విని, బండి నడుచుటకు వీలైనంత దూరము బండిమీఁదఁబోయి యచ్చటదిగి యామహాత్ముని సన్నిధికిఁ గాలినడక నేపోయి పాదాభివందన మాచరించి సవినయంబుగ నుపాసీనయై యుండ సిద్ధార్థుఁడు పరమార్థంబుల నుపదేశించి దానిని సంతోషపెట్టెను. "దేవా! భిక్షుకభ్రాతృవర్గముతోఁగూడ దేవరవారు నాయింటభిక్షచేసి నన్ను గౌరవింతురుగాక" యని యామె వేఁడికొనెను. మౌనముచేతనే బుద్ధుఁడు భిక్ష నంగీకరించెను.

వేసాలిపురమందున్న ధనవంతులు ప్రభువులు సౌగతుండు తమ పురమునకు వచ్చెనని విని యతండున్న సహకారావనమునకుం బోయి తమ గృహములకు గమ్మని యాహ్వానము చేయుచుండిరి. కాని యంబపల్లి యాగౌరవమును సంపాదించి సిద్ధార్థుండాయొక్క నని వారికిం దోవలోనె తెలియుటం జేసి వారు మనమున నిరాశతోం గోపింపక యంబపల్లియొద్దకేపోయి "యంబపల్లీ! యీరాత్రిభిక్షను మాకు విడిచిపెట్టుము. నీకు లక్షనాణెము లిచ్చెద" మని ప్రార్థించిరి. అంతట నంబపల్లి యిట్లనియె—'అయ్యా! లక్షనాణెములు గాదు. వేసాలిరాజ్య మంతయు నా కిచ్చినను నే నీభిక్షను విడువను.'

అప్పలువురు కులటకి యాసంపన్నులు గనినందున వారు బుద్ధుని యొద్దకే పోవుద మని నిశ్చయించి యాతనిసన్నిధికింజని పాదములకు నమస్కరించి, 'స్వామీ! దేవరవారు శిష్యులతోం గలిసి మాయింట భిక్షం జేయవలయు' నని వేడిరి. 'నే నంబపల్లియింట భిక్ష సేయుద నని మాట యిచ్చితి' నని బుద్ధుండు ప్రత్యుత్తర మిచ్చి వారి కోరిక నిరాకరింప విషాదపూరితమనస్కులై వారు మరలిపోయిరి.

మఱునాం డుదయమున నతండు కావివలువలు గట్టి భిక్షాపాత్రి హస్తమునం దాల్చి సశిష్యుండై యంబపల్లి నెలవునకుం బోయి తన నిమిత్తము నిర్దిష్టమైన యాసనమునం గూర్చుండెను. అంబపల్లియు రొట్టెలు, మధురపదార్థములు మున్నగుపలువంటకములు వడ్డించి సమస్తోపచారములు చేసి వారు వలదు వలదనుచుండంగ బలవంతపెట్టి మఱిమఱి వడ్డించెను.

సిద్ధార్థుండు భోజనము చేసినతరువాత నంబపల్లి చిన్నపీటవైచికొని బుద్ధుని సమీపమునం గూర్చుండి 'స్వామీ! యీనాగృహము భిక్షుకులయుపయోగము నిమిత్త మిచ్చివేసితిని పరిగ్రహింపుం' డని వేడుకొనెను. బుద్ధుం డాగృహముం బరిగ్రహించెను.

ఆయన వేసాలిలో నుండఁగానె వర్షకాల మారంభమయ్యెను. అప్పు డాయన నిజానుచరుల కిట్లనియె. 'ఓభిక్షుకులారా! ఈవాన కాలము నేను వేలువనమందుఁ గడపెదను. మీరును వేసలిచుట్టుపరిక్కుల మీకనుకూలములైన మిత్రగృహములలోను బరిచితగృహములలోను వసియించి కాలము పుచ్చెదరా?'

'చిత్త మట్లాగే యగుఁగాక' యని భిక్షుకు లుత్తర మిచ్చి వారి వారి కనుకూలములగు తావుల నివసింపఁబోయిరి.

అనుచరు లీ తెఱంగున వేసాలీపరిసరగ్రామముల వసింపఁబోయినపిదప గౌతముఁడు ప్రియశిష్యుఁడైన యానందునిఁ దోడ్కొని వానసావి నాలుగునెలలు గడపుటకు వేలువనమున కరిగెను. ఇదియే యతనికట్టకడపటి ప్రయాణము.

అష్టాదశాధ్యాయము.

ఆసంవత్సర వర్షకాలమున బుద్ధదేవుఁడు తన యాప్తబాంధవుఁడును, బ్రియశిష్యుఁడునైన యానందునిఁగూడి వేలువనమందున్నప్పు డాయనకు జబ్బు చేసెను. ఇదియే యాయన జబ్బుపడుటకు మొదలు. ఆయనశరీరస్థితి యంతకంతకుఁ జెడిపోయెను. చూచువారలకామహాత్ముని చరమదశ సమీపించినట్లు కనఁబడెను. అప్పుడాయన తనలో నిట్లు తలంచెను. "కట్టకడపటిసారి నాశిష్యుల కుపదేశము జేయక నే నీలోకము విడుచుట ధర్మముకాదు. అందుచేత నేను గాఢమైన మనోబలముచేత నీరోగమును జయింపవలెను." అని నిశ్చయించుకొని నాఁటిమొదలుకొని క్రమక్రమముగ రోగవివర్జితుఁడు కాఁజొచ్చెను. సంపూర్ణారోగ్యము వచ్చినతరువాత నతఁ

డను విహారమునుండి యీవలకువచ్చి యానందుఁడు తన నిమిత్తము పఱచిన యాసనముమీఁదఁ గూర్చుండెను. అచ్చట ననేకులు చేరిరి. కాని, ముందుగా వారెవ్వరుం బలుకలేదు. అప్పు డానందుఁడిట్లని యె "ప్రభువా! దేవరవారు సంపూర్ణమైన యారోగ్యవంతులై యుండఁగా నీకన్నులతోనే చూచితిని. దేవరవారు రోగపీడితులగుట యు నీకన్నులతోనే చూచితిని. ఈ మహానుభావుని రోగముఁ జూచి బెంగచేత నాశరీరము తీఁగవలె దుర్బలమైనను నాకాశ మంతయు నాకన్నుల కంధకార బంధురమైనను, నా తెలివి తేటలు మందగించి నను నీమహాత్ముఁడు ధర్మమునుగూర్చి కిట్టికి పంట దేహత్యాగము చేయఁడని నామనంబున నొకనమ్మకము గలిగెను. ఆనమ్మకముతో నాకుఁ గొంత ధైర్యము కలిగెను.'

అట్లానందుఁడు పలుకుటయు సుగతుఁ డిట్లనియె. ఆనం దుఁడా! శిష్యగణము నాయొద్దనుండి యేమి యపేక్షించుచున్నారు? బహిరంగమనియు, నంతరంగమనియు, భేదములు చేయక నేనెల్ల ప్పుడు సత్యముపదేశించితిని. గుప్పిడిబిగఁబట్టి పిసినారి సత్యము కొంత చెప్పి తథాగతుఁడు కొంత గోప్యముగ దాఁచువాఁడు కాఁడు. మతస్థుల కందఱకు నేనే నాయకుఁడను. మతమునకు నేనే యాధారము నని తలం చువాఁ డొకఁడున్నపక్షమున నోయానందా! నిశ్చయముగా నతఁడే మతస్థుల కవసరములేని యుపదేశములు చేయఁదగినవాఁడు. ఆనం దా! మతస్థుల కందఱకు నేనే నాయకుఁడని, నేనే మతమున కాధార మని బుద్ధుఁ డెన్నఁడుఁ దలంచుచుండుటలేదు. అట్టిస్థితిలో మతము యొక్క భవిష్యద్వర్తనమును గుఱించి యతఁడే యుపదేశము లేలచే యవలెను. ఆనందా! నేనుగూడ వృద్ధుఁడనైతిని. బహువర్షములు గడిచి నవి. నాప్రయాణము సమాప్తమగుచున్నది. నాయాయుఃప్రమాణము చెల్లిపోయినది. ఎనుబదిసంవత్సరములు నాకు నిండుచున్నవి. మిక్కిలి

పాతఁబడిన బండి యెంతో జాగ్రత్తతోఁ గొంతదూరము మాత్రము నడుపఁబడుచున్నట్లే బుద్ధుని దేహముగూడ మిక్కిలి జాగ్రత్తతోఁ గాపాడఁబడిన యెడలఁ గొంతకాలము నెట్టుకొని రాఁగలదు. కాఁబట్టి యో యానందా! మీరు మీకే దీపములుగా నుండవలెను. మీకు మీరే శరణముగా నుండవలెను. సత్యము నే దీపమట్లు మనోధారణము చేసికొని యుండుఁడు; సత్యమే శరణమని నమ్ముకొని యుండుఁడు. మీకంటె నన్యులు మీకు శరణమగుదురని యెన్నఁడు నమ్ముకొని యుండకుఁడు. ఓ యానందా! మనుష్యుఁడు తనకు తానే యుపశరణము కాఁడా? మఱెవ్వరైనను నుపశరణమగుదురా? తనకంటె నితరమైన శరణము నంగీకరింపక పోవుటయే నిజమగు శరణమగుట. సత్యమునే నమ్ముము తప్పక దానినే నమ్ముము.

ఈ మాటలు చెప్పిన తరువాత బుద్ధదేవుఁడు వేసాలిలోఁ గొన్ని దినములుండి పావాపురమునకుఁ బోయి యక్కడనున్న చైత్యకములకుఁ బోయి యుద్యానము లెక్కడ వసించుచుండెను. చైత్యక మనఁగా బౌద్ధభిక్షువులు వసించుమఠము. వేసాలినగరసమీపమున నిట్టివనేకములుండెను. వేసాలి నగరము కడు సుప్రసిద్ధమైనగరమని గౌతముఁడే యానందునితోఁ జెప్పెను. ఒకనాఁడు తనప్రియశిష్యుఁడగు నానందునిఁ బిలిచి "ఈమఠమునందున్న భిక్షుకులనందఱ నిచ్చటఁ జేర్పు" మని సిద్ధార్థుఁ డానతిచ్చెను. ఆనందుఁడు వెంటనే వారినందఱ రావించెను. రావించుటయు సిద్ధార్థుఁడు వారికి మహోపన్యాసోపదేశముఁ జేసెను. ఇదియే యాతఁడు చేసినకట్టకడపటి ధర్మోపదేశము. ఆయుపదేశ మీక్రిందివిధముగ నున్నది. "సోదరులారా! నేను కనిపెట్టిన సత్యము మీకుపదేశించితిని. ఆసత్యధర్మములను మీరు చక్కఁగా గ్రహించి వశపఱచుకొని వాని నాచరించి, మననముచేసి, యీపరిశుద్ధమతము శాశ్వతమై, దేవతలయొక్కయు మనుష్యులయొక్కయు

క్షేమసౌఖ్యములకుఁ గారణభూతమైయుండునట్లు నీవు నెల్లెడ వ్యాపింపఁజేయుఁడు. నేను మీ కుపదేశించిన సత్యము లెవ్వి? అవివిగో— చతుర్విధమైన మననము, పాపములతోఁ జతుర్విధ మైనయుద్ధము, ఋద్ధిత్వమునకుఁ జతుర్విధపథము, పంచవిధ మైనసేంద్రియబలము, పంచవిధ మైనయాత్మజ్ఞానము, సప్తవిధమైనజ్ఞానము, అష్టవిధ మైనసన్మార్గము."

ఓ సోదరులారా! యిది స్మరింపుఁడు. ద్వంద్వపదార్థము లన్నియు శీర్ణములగును. కావున శ్రద్ధతో మీమోక్షమునిమిత్తము మీరే ప్రయత్నము సేయుఁడు. తథాగతుని కింక కాలములో నే నిర్వాణము కలుగును. నేఁడు మొదలుకొని మూఁడు మాసములుగతించినంత తథాగతుఁడు మృతినొందును.

అనంతర మతఁడు వారి నందఱిం బంపి వైసాలి విడచి యానందుఁడును మిక్కిలి భక్తులగు మఱికొందఱు శిష్యులును వెంబడింప "పావా" యనునూరికిఁ బోయెను. ఆయూరికిఁ బోఁగానె చందుఁడను కమ్మరివాఁడొకఁ డాయనను గలిసికొని "స్వామీ! నేఁడు నాయింటబిక్షచేసి నన్ను గౌరవింపవలయు" నని ప్రార్థించెను. అందు కాయన సమ్మతించెను. చందుఁడు తనయతిథినిమిత్తము మధురాహారములు, రొట్టెలు, నడవి పందులమాంసము, వండించెను. బుద్ధుఁడు చందుని బిలిచి "యడవిపందిమాంసము నాకుఁ బెట్టి మధురాహారములు రొట్టెలు భిక్షుకులకి" మ్మని యానతిచ్చెను. అతఁడట్లుచేసెను. భిక్షానంతరమున బుద్ధుఁడు పావాగ్రామమును విడచి కాశీనగరమున కరిగెను. కాని దారిలో నతనికి దారుణ మగునరక్తగ్రహణిరోగము వచ్చెను. దానివలన నాయన మిక్కిలి బాధపడఁజొచ్చెను. కాని, యామహాత్ముఁ డాబాధ మిక్కిలిదుస్సహమయినను దానిని మనోవైకల్యముఁ జెందకుండ మిక్కిలి యోరిమితో మిక్కిలిధైర్యముతో ననుభవించెను.

ఆహాహా! ఎంతటి ప్రతిభాశాలురైనను నెంతటిభగసదుపకార పరాయణులైనను నెంతటిధైర్యశాలు రయినను మానవులు రోగపతితులైనప్పుడు దైహికబాధల ననుభవింపక తప్పదుకదా! బుద్ధదేవుని స్థితి క్రమక్రమముగాఁ జెడిపోయెను. నానాఁటికి రోగమతిశయించెను. శరీరబలము క్షీణించెను. అట్టి దుర్బలస్థితిలోనే పయనముఁ జేయుచు సిద్ధార్థుఁడు మార్గమునుండి తొలఁగి యొకవృక్షచ్ఛాయకుఁ జని, యానందునిఁ బిలిచి "యానందా! నా కావిబట్ట లిక్కడఁ బఱపుము నేనుమిక్కిలి యలసియున్నాను. కొంచెము సేపు విశ్రమించెద" నని చెప్పెను. ఆనందుఁడట్లు చేసినపిదప నతఁ డానందుని వెండియుఁ బిలిచి "ఆనందా! దాహమై నో రెండుకొని పోవుచున్నది. కొంచెము నీరిమ్ము త్రాగెద"నని యడిగెను. అనిన త్రావి కొంత సేద దేఱి తానే స్వయముగా లేచి సమీపమున నున్న కుకుస్థానదికి మెల్లగఁ బోయి స్నానముచేసి వెండియు జలము త్రావెను. కుకుస్థానది యనఁగా బర్వానది. ఇది కాశీనగరమున కెనిమిది మైళ్ళ దూరమున చోటాగండకినదిలోఁ బడుచున్నది. ఈస్నానపానములవలన సేద దేఱి కొంతబలము కలిగి బైలుదేరి కుషీనగరపరిసరములనున్న యొకతోఁటలో బసచేసెను. ఆవనమునఁ జేరి యతఁడు "ఓయానందా! నేను మిక్కిలి పరిశ్రాంతుఁడ నైతిని. రెండు కవలచెట్లనడుమ నుత్తరపుతలగడగ నాకుఁ బక్క వేయుము. నేను పండుకొనియెద" నని యానందునితో ననియెను. ఆవిధమున నానందుఁడు సెజ్జ సమర్చుటయు సిద్ధార్థుఁడు ప్రశాంతమనస్కుఁడై నిశ్చలభావముతోఁ గుడిప్రక్కకొత్తిగిలి కాలి మీఁదఁ గాలువైచుకొని పండుకొని యానందునితో నిట్లనియె. "ఇది పువ్వులకాలము కాకపోయినను కవలచెట్లు పుష్పములతో నిండియున్నవి. అవినామీఁద రాలుచున్నవి. తథాగతునకీగౌరవముగాక మఱియొక గౌరవము మఱియొక ప్రతిష్ఠ మఱియొక సపర్య మఱియొక పూజ కలదు.

ఓయానందా! భిక్షుకుఁడుగాని, భిక్షుకి గాని, యనుచరుఁడు గాని, గృహస్థుఁడు గాని, సన్యాసి గాని, యెవరైనను సరే చిన్నవిషయమునందును పెద్దవిషయమునందును సత్యమువచించుచు ధర్మప్రకారము నడుచుకొనుచు, ధర్మలేశమునైనను మీఱక గమనించుచు జీవితకాలము గడపుదురో వారు నాకు నిజమైన గౌరవము గావించినవారు. సపర్యలు సల్పినవారు. సమారాధనలు చేసినవారు నగుదురు."

రాత్రి గతించుకొలందిని తథాగతునివద్ద నిర్వాణకాలము సమీపించిన దని శిష్యులకు స్పష్టముగాఁ బొడకట్టెను. చేయునదిలేక వారు ధైర్యముఁ గోల్పోయి గురువు నెడబాసి స్థానమునకుఁ గొంచెము దూరముగ నరిగి విలపింపఁదొడఁగిరి. ఆయన సన్నిధి నప్పటికి ఆనందుఁడు, అనిరుద్ధుఁడు, సారిపుత్రుఁడు మున్నగువారు సన్నిధి నుండిరి. కశ్యపుఁడు వచ్చెనుగాని వచ్చునప్పటికే గురువు నిర్వాణ మొందెను.

ఏకోనవింశత్యధ్యాయము.

మహానుభావుఁ డగు గౌతముఁడు జీవితాంతమున మరణోన్ముఖుఁడై యున్న సమయమున బ్రియశిష్యుఁ డగు నానందుఁ డిట్లనియె:—

"స్వామీ! కల్పాంతము వఱకు నీవు జీవించుట కనుగ్రహింపుము. మానవుల క్షేమసౌఖ్యముల నిమిత్తము ప్రపంచమునందు జాలిదలంచి దివ్యులయొక్కయు, మనుజులయొక్కయు సేమముకొఱకు, లాభము కొఱకు సంతోషముకొఱకు, కల్పాంతము దాఁక బ్రతుకుము. ప్రభూ! బ్రతుకుము."

శిశువునోటనుండి వెడలవలసిన మాటలు నుడువుచున్న యానందుని జూచి జగద్గురుఁడు చిఱునవ్వు నవ్వెను. అప్పు డానందుఁడు వెండియు నిట్లనియె—"భగవానుఁడా! యీయట్టడవిలో నీవు పంచత్వము

నొందఁగూడదు. ప్రభూ! రాజగృహము, వారణాసి, సాకేతము, శ్రావస్తి, చంపాపురము మొదలగుమహానగరము లనేకములు కలవు. దేవరవా రచ్చట సిద్ధిపొందునట్లు ప్రసాదింపుఁడు. ఆనగరములలో నెందైన సిద్ధిపొందినపక్షమున మీకళేబరమునకుఁ దగినగౌరవముజరుగును. ఏలయన నచ్చట తథాగతునిసిద్ధాంతములయందు విశ్వాసము గల భాగ్యవంతు లనేకులు గలరు" అనవుడు నమ్మహాత్ముఁడు మరల మందహాసము చేసెను. అదిచూచి యానందుఁడు "దేవా! మీరు మృతినొందినపిదప మీశరీర మేమి చేయుమని యానతిచ్చెదరు?" అనియడిగెను. అతనికి గౌతముఁ డిట్లనియె. "ఆనందుఁడా! తథాగతునికళేబరమును గౌరవించుటను గూర్చి నీవుశ్రమపడవలదు. నీస్వవిషయమున నీవు గట్టిపూనిక గలిగియుండు మని నిన్ను వేఁడుకొనుచున్నాను. నీమేలుకొఱకు నీవుపాటుపడుము నీవు జాగ్రత్తగా నుండుము."

తథాగతునియందు విశ్వాసము గలభాగ్యవంతులలో బుద్ధిమంతులనేకులున్నారు. వారు థాతగతునికళేబరమునకుఁ దగినగౌరవము జేయుకపోరు" అని పలికి కొంతసే పూరకుండి యతఁడు మరల నానందునితో నిట్లనియె. "నేను మృతినొందుచున్నాను. చందుఁడు పెట్టిన యాహారము నేను తినినందున వానికి ముందుజన్మమున గొప్ప యదృష్టము తప్పక కలుగు నని నేనుపోయినతరువాత వానితోఁ జెప్పుము. నానోటనే యీమాటలు నీవువిన్నట్లు వానితో నొక్కిచెప్పుము. అన్నిదానములలో మిక్కిలి యుత్కృష్టములైనవి రెండు గలవు. అందు మొదటిది నాకు బుద్ధత్వముప్రాపింపకమునుపు సుజాత చేసిన యన్నదానము. నే నీలోకమును విడిచి వెళ్ళిపోవుటకు ముందు చందుఁడు చేసిన యీ యన్నదానము రెండవది. ఆనందా! చందునియొద్ద కెవ్వరైనఁ బోయి "చందా! ఇది నీకుఁ గీడు. ఇది నీకు గొప్పనష్టము. నీచేతియన్నముఁ దినఁగానే తథాగతుఁడు మృతినొందె" నని వాని

కెవ్వరైన వెఱపు గొలిపి విచారము గలిగింపవచ్చును. కావున నట్టి వెఱపు వానిమనంబునుండి మాన్పి "చంచా! ఇది నీకు మేలు. ఇది నీకు లాభము. ఏమన తథాగతుఁడు నీచేతియన్నముఁ దిని పరమసిద్ధి వడసె" నని చెప్పవలెను.

పరమభక్తుఁడైనయానందుఁ డప్పలుకులు విని మనోధైర్యము చిక్కఁబట్టలేక దుఃఖాక్రాంతుఁడైన జగద్గురుసిసన్నిధిని విలపింపఁగూడదని యేడ్చుట కావలికిఁ బోయెను. అతఁడు తనప్రక్కను లేకపోవుటఁగనిపెట్టి సోదరులారా! ఆనందుఁ డేఁడి యని యామహాత్ముఁ డడిగెను. "దేవా! పూజ్యుఁడైనయానందుఁ డవ్వలి కరిగి విలపించుచున్నాఁ" డని వారుత్తరము చెప్పిరి. "సోదరులారా! పోయి నాకడకు వానిం బిలిచికొని రం" డని యతఁ డానతిచ్చెను. ఆనందుఁడు వచ్చి వానిప్రక్కఁ గూర్చుండెను. అప్పుడు తథాగతుఁడు మెల్లగా నిట్లు ధైర్యము చెప్పెను. "ఆనందా లేనిపోనిశ్రమ పడకుము. విలపింపకుము. మనకు మిక్కిలిసమీపములై ప్రియములైన పదార్థముల స్వభావమే యిట్టిదనియు వీనినివిడిచి వానినుండి వేఱుపడి మనము పోవలయు ననియు నే నిదివఱకే పలుమాఱులు చెప్పియుండ లేదా? ఏదియు శాశ్వతమై యుండఁజాలదు. అటువంటిస్థితి యసాధ్యము. ఆనందా! నీవు చిరకాలమునుండి నాయందు దయగలిగి మిక్కిలిమంచి వాఁడవై యెడతెగక యింతంత యనరాని యుపచారపరంపరఁ జేసి నాకుఁ బరమాప్తుఁడవయి యుంటివి. ఆనందా! నీవుమంచిపని చేసితివి. నీప్రయత్నము లంతఃకరణశుద్ధిగఁ జేయుము. నీవును మహాపాపమునుండియు భోగపరాయణత్వమునుండియు నహంభావమునుండియు మాయనుండియు నజ్ఞానమునుండియు స్వల్పకాలములో విముక్తుఁడ వయ్యెదవు."

రాత్రి కడచుకొలఁది బుద్ధుఁడు క్రమక్రమముగ క్షీణింపఁజొ

చ్చెను. ఆసమయమున నత్త్రావున నొకబ్రాహ్మణుఁడు వచ్చెను. అతఁడు కుశీనగరనివాసుఁడు. వేదాంతశాస్త్రవేత్త. అతనిపేరు సుభద్రుఁడు. అతఁ డానందునిఁ గలిసికొనియిట్లనియె. "గౌతమశ్రమణుఁడీరాత్రి దేహయాత్ర ముగించు నని వింటిని. ఇప్పుడు నామనస్సులో నొక గొప్పశంక బొడమినది. ఈసందేహము నివారించుటకు గౌతమశ్రమణుఁడు తగినవాఁడని నాకుఁ దోఁచినది. కావున నో యానందా! గౌతమ శ్రమణుని నేను చూచెద. చూడనిమ్ము." అనవు డానందుఁడు "మిత్రుఁడా సుభద్రుఁడా తథాగతు నిప్పుడు పీడింపకుము. అతఁడు మిక్కిలి పథశ్రాంతుఁడై యున్నాఁ" డని యుత్తరము చెప్పెను. కాని సుభద్రుఁడు వానిని మఱిమఱి యడిగి బాధింపఁజొచ్చెను. వారి సంభాషణము బుద్ధునిచెవిని బడఁగా నతఁ డానందుని బిలిచి "యోయీ! సుభద్రు నడ్డగింపకుము. వానిని నాకడకు రానిమ్ము. అతఁడు నన్నేమి యడిగినను జిజ్ఞాసువై యడుగును కాని నన్నుపీడింపవలె నని యడుగఁడని పలికెను. అంతట నాబ్రాహ్మణుఁడు సిద్ధార్థునిప్రక్క గూరుచుండి, అనేకశాఖలకు ప్రధానపురుషులుగ నుండి పరమతపశ్శాలు రయినబ్రాహ్మణులు పురాణకశ్యపుఁడు, మఖాలి, అజితుఁడు, కాత్యాయనుఁడు, సంగయుఁడు, వేలాతికుఁడు, నిగ్రతుఁడు మొదలగువారు లోకమున వెల్లడించినట్లు పదార్థతత్త్వములను గ్రహించిరా లేదా. లేకయందుఁగొందఱు తెలిసికొని కొందఱు తెలిసికొనలేక పోయిరా" యని యడిగెను. అడుగుటయు వానికి బుద్ధుఁడిట్లనియె. "సుభద్రా! ఆబ్రాహ్మణులు తమతమవిజ్ఞానము కొలఁదిగ తత్త్వము గ్రహించిరాలేదా యన్నసందేహ మటుండనిమ్ము. అట్టివిషయములు చర్చించుటకిది సమయము కాదు. నేను నీకు సత్యము నేర్పెదను. సావధానుఁడవై వినుము" అని గౌతముఁడు నీతిమార్గమును విడిచి పెట్టిన మతసిద్ధాంతముల ననుసరించినవారికి మోక్షములభింప దనియు

పవిత్రజీవనముతో నారంభమై భూతదయతో నంత మగునష్టవిధపావన మార్గముల ననుసరించినవారికె మోక్షము గలుగు ననియు బోధించెను. బోధించుటయు సుభద్రుఁడు జ్ఞానరసాస్వాదనము జేసి పరమానందభరితుఁడై "యహాహా! మేలు. మేలు. మీముఖమునుండి వెలువడిన మాటలు మిక్కిలి ప్రశస్తములు. దేవరవారు నన్ను శిష్యుఁడుగ గ్రహింపవలయును. మేనఁ బ్రాణము లుండునంతవఱకు నేఁడు మొదలుకొని పరమవిశ్వాసము గలిగియుందు"నని యతఁడు వినయముతోఁ బలికెను. అతనిపలుకులు విని బుద్ధుఁ డిట్లనియె. "సుభద్రా! పూర్వమొకసిద్ధాంతమునం దుండి యీ నవీనసిద్ధాంతములో నుత్తమస్థానమును గాని యధమస్థానమును గాని ప్రవేశింపఁ దలఁచువాఁడు ముందుగా నాలుగుమాసములు శుశ్రూషఁ జేయవలయును." అట్లయిన నేను నాలుగుఁమాసములు శుశ్రూషచేయుదు"నని సుభద్రుఁ డొడంబడెను.

అప్పుడు గౌతముఁ డానందుని బిలిచి "ఆనందా! ఈతనిని మనమతమున జేర్చుకొను" మని యానతిచ్చెను. అప్పుడానందుఁడు వానినొక్కకడకుఁ గొంపోయి స్నానము జేయించి సమస్తవస్తువులు వినశ్వరము లని యొకానొకమంత్రము పునశ్చరణ సేయించి వానిశిరస్సు గడ్డము ముండనము చేయించి కాషాయవస్త్రములు గట్టించి బుద్ధుఁడు ధర్మము సంఘము శరణము లని శరణత్రయము వానిచేతఁ జదివించి బుద్ధునియొద్దకుఁ గొనిపోయెను. అంతట బుద్ధుఁడు వానిను త్తమపదస్థుఁడగుశిష్యుఁడుగ నంగీకరించి ధ్యానము సేయుట కొకవిషయము నుపదేశించెను. ఆమహానుభావుఁ డొనర్చిన కట్టకడపటికార్యమిదె.

వింశత్యధ్యాయము.

ఆరాత్రి నాలవజాము సమీపించినప్పుడు బుద్ధదేవుఁడు పూజ్యుఁడైన యానందుని బిల్చి యిట్లు పలికెను. "ఆనందా! మన గురూపదేశ మస్తమించినది. మన కింక గురువులేఁ డని మీలోఁ గొందఱ కధైర్యము తోఁచవచ్చును. కాని మీరా విధముగఁ దలఁపఁగూడదు. నేను సంస్థాపించిన సత్యము నేను మతమునిమిత్తమై యేర్పఱచిన సూత్రములు, నేను బోయినతరువాత మీకు గురువులై యుండుఁగాక' యని పలికి కొండొకతడ వూరకుండి యామహాత్ముఁడు మరల నిట్లనియె. "ఆనందా! నామరణానంతరమున స్వల్పధర్మములలో మార్పు గావలసియున్న పక్షమున నట్టివి మార్చుకొనవచ్చును." అని యానందునితోఁ బలికి పిమ్మట భిక్షుకుల నుద్దేశించి యిట్లనియె:—
"బుద్ధుని గురించి గాని, సత్యమునుగూర్చి గాని, ధర్మ పథమును గూర్చిగాని, యెవరిమనస్సులోనయిన సందేహములు, తప్పభిప్రాయములు నుండవచ్చును. అట్టివి మనంబున దాఁచుకొనక స్వేచ్ఛగాఁ దెలియపఱచి యడుగుఁడు. తథాగతుఁడు మన యెట్టయెదుట నున్నప్పుడు మనసందేహము లాయన నడిగి తీర్చుకొనమైతి మని విచారించుచు మిమ్ము మీరు దూషించుకొన వద్దు."

ఆమహాత్ముఁ డావిధమునఁ బల్కుచున్నప్పుడు భిక్షుకులందఱూరకుండిరి. బుద్ధుఁడు సందేహము లడిగి నివారించుకొనవలసినదని మఱి రెండుసారులు వారిని నొక్కి యడిగెను. మువ్మారడిగినను మూఁకలట్లు వారు ప్రత్యుత్తర మియ్యరైరి. అంతట నతఁడు భిక్షుకుల నుద్దేశించి యిత్తెఱఁగున భాషించెను—"సోదరులారా! గురువునెడల మీకుఁ గలభక్తివిశేషంబుచేత మీరు సందియముల నడుగకపోయి

యుండవచ్చును. కలిగినసందియములు మీ రొండొరులతోఁ జెప్పి కొనుఁడు."

ఆయన యట్లు పలికినను భిక్షుకులు నోరు తెఱచి యడుగరైరి. అప్పు డానందుఁడు తథాగతున కిట్లనియె—"దేవా! బుద్ధుని గూర్చి గాని, సత్యమును గూర్చిగాని, ధర్మపథమును గూర్చిగాని, యీమహాసభలో నెవరిమనస్సునను సందియములుగాని, తప్పభిప్రాయములుగాని, లే వని నేను నిశ్చయముగాఁ జెప్పఁగలను."

"ఆనందా! నీవు సంపూర్ణవిశ్వాసముతోఁ బల్కితి" వని బుద్ధుఁ డానందునితోఁ జెప్పి కొంతసే పూరకుండి సెజ్జనుండి సగము లేచి యిట్లనియె:—"సోదరులారా! చూడుఁడు! ద్వంద్వపదార్థము లన్నిఁటికి నాశనము స్వభావము. కావున శ్రద్ధతో మీమోక్షముల మీరే సాధించుకొనుఁడు" ఇవియే బుద్ధదేవుని కట్టకడపటి వాక్యములు.

అంతట నమ్మహానుభావుఁడు గాఢమైనధ్యాననిష్ఠలోఁ బ్రవేశించెను. పిమ్మట నాయన క్రమక్రమముగా నైహికసంబంధమైన జ్ఞానము మొదలైనవానిని విడిచి చిత్తము నిర్వికల్పసమాధిలోఁ జేర్చెను. అది చూచి యానందుఁ డనిరుద్ధునితో "భగవానుఁడు బుద్ధుఁడు సిద్ధిపొందినాఁ" డనెను. "అయ్యో! అన్నా! కాదు కాదు. బుద్ధుఁడు సిద్ధిపొందలేదు. సుఖదుఃఖానుభవములకు, నాలోచనలకు నతీతమైన నిర్వికల్పసమాధిలో నీమహాత్ముఁడు ప్రవేశించినాఁ" డని యనిరుద్ధుఁ డుత్తరము చెప్పెను. అనంతరము బుద్ధదేవుఁ డాస్థితిలోఁ గొంతసే పుండి దేహత్యాగము చేసెను.

ఆయన పోవునప్పుడు భూమి కంపించె ననియు, భైరవారావముతో మేఘములు గర్జించె ననియు, బహ్మయు, మహేంద్రుఁడును నేవో కొన్నిశ్లోకములు పాడిరనియు, శిష్యులు రచించినగ్రంథములో నున్నది. ఈవార్తలు గురుభక్తిప్రేరితములు గాని సత్యమునకు

సమీపములు గావు. మహానుభావులు మృతి నొందునప్పుడు భూకంపములు గలుగవు. మందమతులు మృతినొందినప్పుడును భూకంపములు కలుగవు. ప్రపంచ మెప్పటివలెనె యుండును. సామాన్యమనుష్యులవలె జన్మించిరనిగాని మృతినొందిరనిగాని చెప్పినపక్షమునఁ దమ గురువులయెడ లోకులకు గౌరవముండ దని శిష్యులు మహాద్భుతములను గల్పించుచుందురు.

ఆయన మృతినొందినతోడనే సంపూర్ణవైరాగ్యము లేనికొందఱుశిష్యులు "అయ్యో! గురువు మిక్కిలి త్వరలోఁ బోయెను. జీవితము విడచి మహాత్ముఁ డతిత్వరలోఁ జనియెను." అని తలమోఁదుకొనుచు, నేలఁ బడి దొరలియు వాపిడచి దుఃఖించిరి. కాని జ్ఞానవంతులు విరాగులు నైనశిష్యులు సమస్తపదార్థములు వినశ్వరములనుమాట జ్ఞప్తికిఁ దెచ్చుకొని ధైర్యము చిక్కఁబట్టి దుఃఖము శాంతముతో సహించిరి.

అప్పు డనిరుద్ధుఁ డానందునిం జూచి "అయ్యా! నీవు కుశీనగరమునకుఁ బోయి మహాత్ముఁ డైనబుద్ధుఁడు మృతి నొందెనని చెప్పి రమ్మని పలికెను. అనవు డానందుఁ డాపురమునకుం బోయి యచ్చటనివాసులైనమల్లులతో సిద్ధార్థుని మరణవార్త చెప్పి "ఇప్పుడేమి చేయవలెనో యది చేయుఁడు" అని పలికెను. ఆమాట వినఁగానే కుశీనగరవాసులైన మల్లులందఱుఁదమభార్యలతోడను బిడ్డలతోడను జుట్టములతోడను మిత్రులతోడను "అయ్యో! జ్యోతి యెంతత్వరలో నారిపోయెను. మహాత్ముఁ డెంతత్వరలో నస్తమించె" నని యెంతో దుఃఖించి తమ సేవకులం బిలిచి సుగంధద్రవ్యములు పుష్పహారములు వీణామృదంగాది వాద్యములు సమయోచితములైనవస్తువులు, సిద్ధము చేయుమని యాజ్ఞాపించి సిద్ధార్థునికళేబర మున్నసాలవనమునకుం జని యాదిన మంతయు నృత్యముతోను గానముతోను గడపి పుష్పహారరచన

ముతోడను, చందనాదిసుగంధవస్తువులు సిద్ధముచేయుటతోడను దమ వస్త్రములతో వితానములు గల్పించుటతోడను వితానములకుఁ బూల దండలు గ్రుచ్చుటతోడను మఱియు నితరము లైనయలంకారములం జేయుటతోడను గడపిరి. అనంతరము బుద్ధునిశరీరము మిక్కిలి గౌరవముతో మిక్కిలిభక్తితో వారు దహనముచేసిరి. దహనానంతరమున కుశీనగరవాసు లగుమల్లులందఱు బుద్ధుని దగ్ధచితి చుట్టుఁ జేరి నృత్యముచేసి పాటలు పాడి దానిచుట్టు బాణములకోట గట్టి యామహాత్ముని యెముకలు పరులు హరింపకుండ నేడుదినములు జాగ్రత్తపెట్టిరి.

ఆసమయమున మగధరాజగు నజాతశత్రుఁడు మల్లజాతి కీక్రింది సందేశ మంపెను. "సిద్ధార్థుఁడు క్షత్రియుఁడు. నేనును క్షత్రియుఁడనే. అందుచేత నామహానుభావుని యస్థికలలో నొకకొన్ని నాయొద్ద నుంచుకొనుట కర్హుఁడనే. ఆమహాత్ముని యస్థికలమీఁద నేనొక స్తూపముగట్టి యచ్చట నేఁట నుత్సవములు జేయించెదను."

వేసాలినివాసులును మల్లల కట్టిరాయబారమునే పంపిరి. కపిలవస్తునివాసు లగు శాక్యులును నట్టికోరికలే కోరిరి. ఈవిధంబుననే చుట్టుప్రక్కల నుండు దేశములవా రందఱు మల్లలయొద్దకు దూతల నంపిరి కాని మల్లులు వారలతో నిట్లనిరి. "మహాత్ముఁడగున సిద్ధార్థుఁడు మా పురసమీపమున మృతినొందెను. కాఁబట్టి యాయనయస్థికలు మొదలైనవి మే మెవ్వరికిని నిచ్చువారము కాము. అట్లు పల్కుటయు ద్రోణుఁ డనుబ్రాహ్మణుఁ డొకఁడు వారికిట్లనియె:—"ఆర్యులారా! నాదొక్క చిన్నమనవి గలదు వినుఁడు. శాంత ముండవలయు నని బుద్ధుఁడు మన కుపదేశించుచు వచ్చెను. భూతకోటిలో నెల్ల నుత్తమోత్తముఁ డైన బుద్ధదేవుని యస్థికలం గూర్చి మనము కలహమాడుకొని యుద్ధముచేసి యొండొరులకాయములు గాయములు గావించుట యనర్హమైనపని. కావున మన మందఱ మాయస్థికల నెని

మిది భాగములు జేసి యైకమత్యము గలిగి యుందము. మానవ జాతి బుద్ధునియందే పరమ విశ్వాసము నిల్పునట్లు జగన్మండలమునఁ బ్రతిభాగమున స్తూపములు లేచుఁ గాత!" అనవుడు మల్ల లాబ్రాహ్మణునితో నిట్లనిరి:—"ఓబ్రాహ్మణుఁడా! అట్లయిన నామహాత్ముని యస్థికలను నిష్పక్షపాతముగా నీవే యెనిమిది భాగములుగ విభజింపుము" అనవుడు ద్రోణుఁ డాయస్థికల నెనిమిదిభాగములుగ భాగించియొక్కొక్క రాయభారున కొక్కొక్కభాగ మిచ్చి చిట్టచివర "అయ్యా! యీపాత్ర నేను తీసి కొని పోయి దానిపై నొకస్తూపము నిర్మించి యుత్సవములు గావించెదను." అని పల్కుటయు వారాపాత్ర నతని కిచ్చిరి. ఇట్లెనిమిదిభాగములు పంచినపిదప పిప్పలివనవాసులైనమౌర్యులు తమ కాయస్థికలలో నొకభాగమిమ్మని వర్తమానమంపిరి. వారి కిచ్చుట కస్థికలలో నేమియు మిగులనందునఁ జితిలోనున్న బూడిద నంతయు వారికిచ్చిరి.

అట్లు భాగములు గొన్న యెనమండ్రుగురుఁ దమతమవంతు వచ్చిన యస్థికలు మున్నగువానిమీఁద స్తూపములు నిర్మించిరి. ఈవిధముగా నస్థికల కెన్మిది స్తూపములును పాత్రమున కొకస్థూపమును భస్మమున కొకస్తూపమును మొత్తముమీఁదఁ బదిస్తూపములు బయలు దేరెను.

బుద్ధునిమరణానంతరమునఁ గొన్నియేండ్లకు నాతని యస్థికలు సంగ్రహించి స్తూపములు నిర్మించినవారికి వైరములు పొడమెను. ఆవైరములవలన మహాయుద్ధములు బయలుదేరెను. ఆయుద్ధములలో, నా ద్రోహులలో నెంతో కష్టపడిన శిష్యులు కట్టిన మహాస్తూపములు నాశన మగుననియు నందువలన బుద్ధునియస్థికలు నామావశిష్టము లగు ననియు శిష్యులకే గొప్పభయము కలిగెను. అప్పుడు మహాత్ముఁడయిన కశ్యపుఁడు స్తూపములు గలవారియొద్దకుఁబోయి బుద్ధుని

యస్థికలు తనచేతి కిమ్మని ప్రార్థించెను. ఆకశ్యపునియం దొ విశ్వాసముండుటచేవారందఱాతనికోరికె నిరాకరింపక తాము కొ మేనియు దాఁచుకొనక నాయస్థికలనెల్ల వారతనిచేతి కిచ్చిరి. అతఁడు వానినిగ్రహించిగయాక్షేత్రసమీపమున నొకమహారణ్యములో గొప్ప గొప్పద్రవ్యవ్యయం బొకయాలయము నిర్మించి బుద్ధునియస్థికల నొక బంగారుపాత్రలోఁ బెట్టి యది యొకయిత్తడిపాత్రలోఁ బెట్టి యాయాలయములో దానినిక్షేపించి యాగొయ్యి యంతయు మట్టితోఁ బూడ్చి యొకబంగారు రేకుమీఁద నీక్రిందివిధముగ వ్రాసి యాగే కచ్చుటఁ బడవైచిరఁట.

"మగధరాజులలో నొకఁడైన యశోకుఁడు పవిత్రుఁడైనబుద్ధుని యస్థికలను లోకమంతట విరజిమ్మి వానిమీఁద స్తూపములు నిర్మించును."

అశోకుఁడు బౌద్ధమతావలంబకుఁడై దానిని లోకమంతట వ్యాపింపఁ జేసిన కాలమున దశలక్షస్తూపములను నిర్మింపఁ దలంచెను. కాని యాస్తూపముల యడుగున నిక్షేపించుటకు బుద్ధునియస్థికలు వానికి దొరుకవయ్యెను. అతఁ డనేకస్థలములు వెదకించెను. కాని యవి యెందును లభింపలేదు. ఎట్టకేలకు వృద్ధుఁ డయినయొక భిక్షు విట్లుచెప్పెను:—"నేను పిన్నవాఁడ నయినప్పుడు నాగురువు నన్ను నట్టడవిలో నొకానొకప్రదేశమునకుఁ దీసికొని పోయి వత్సా! యీస్థలము మఱువకుము" అని చెప్పి యాస్థానమునకుఁ దలవంచి నమస్కరింపు మనియె. బుద్ధునియస్థికలాపవిత్ర స్థానమునం దున్నవని నే నూహించెద." అప్పలుకులు విని యశోకుఁడు తత్క్షణమే యాస్థానమునకుఁ బోయి యాయడవియెల్ల ద్రవ్వి భూగర్భితమైనపుణ్యాలయమును గనిపెట్టి యయ్యస్థికలం గొనిపోయెను. కొనిపోయి మృతి నొందకముందే యనేక స్తూపముల నతఁడు నిర్మించెను. ఆస్థలములన్నియు నిప్పుడు బౌద్ధులకు గొప్ప పుణ్యక్షేత్రములు.

సంపూర్ణము.

నానకుచరిత్రము

పీఠిక.

హిందూస్థానమున వాయువ్యదిగ్భాగమందు పూర్వము నుండియు సుప్రసిద్ధమగు పాంచాల మను దేశము గలదు. అది ప్రస్తుతము పంజాబు దేశమను పేర వ్యవహరింపఁబడుచున్నది. ఆదేశమునందు లాహోరు ముఖ్యపట్టణము. ఆనగరమునకు సమీపమున "టాల్వాండి" యను పల్లెయొకటి కలదు. నానకు "టాల్వాండి" గ్రామమునందు క్రీ॥ శ॥ 1438 వ సంవత్సరమున జన్మించెను. నానకుసీకుమతమున స్థాపించినమహాత్ముఁడు. జనులు సనాతనము లగు నుత్తమధర్మములు విడచి దురాచారములే సదాచారములుగ భావించి భ్రష్టులగుచుండ జూచి జాలినొంది కేవల లోకోపకారపరాయణుఁడై నానకు పరమార్థ మెఱుఁగక గతానుగతికముగ నధోగతిపాలగుచుండిన తోడిజనుల నుద్ధరించుటకు మంచిదారిం జూపిన మహానుభావుఁ డగుటచే నానకచరిత్రము నెల్లవారుఁ జదువదగినదని వ్రాయఁబూనితిని.

ఇట్లు,

గ్రంథకర్త

ప్రథమాధ్యాయము.

నానకు క్షత్రియ వంశస్థుఁడు. తండ్రిపేరు కాళుఁడు. తల్లిపేరు త్రిప్తాదేవి. కాళుఁడు టాలువెండి గ్రామమునకు మునసబగుటచేత మిక్కిలి పలుకుబడి గలిగి లోకవ్యవహారవేదియై మితవ్యయముచేత ధనము కూడబెట్టి వడ్డివ్యాపారము చేయుచు గౌరవముగఁ గాలక్షేపము చేయుచుండెను. కాని వానినోరు మంచిదికాదు. హృదయము కఠినము. జనులతోఁ గలసిమెలసి యుండుట కిష్టములేనివాఁడు. ఆశ గలవాఁడు. అందుచేత గ్రామవాసులు వానికిఁజంకి పైకి వానియెడ మిత్రభావముఁ జూపినను మనసులలో వానిని ద్వేషించిరి. వానిభార్య త్రిప్తాదేవి గుణములలో మగనిం బోలక భిన్నశీలము గలదై నోటిమంచితనము సాధుస్వభావము గలిగి గ్రామవాసులచే గౌరవింపఁబడుచు వచ్చెను. మగఁడు ధూర్తవర్తనుఁడై చీటికిమాటికి మహాకోపపరవశుఁడై తన్ను సిలుగులఁ బెట్టుచువచ్చినను, త్రిప్తాదేవి యోరిమిఁగలిగి మగనిమాట జవదాటక వానియెడ గడుభక్తిగలిగి యుండెను. తండ్రియొక్క మనోదార్ఢ్యము తల్లియొక్క సాధుశీలము గ్రహించి యాదంపతులకే నానకు జన్మించెను.

ఆతని జన్మదినము నిర్ణయించుటకుఁ దగిన యాధారములు కానరావు. కొందఱు వాని పుట్టినదినము కార్తికశుద్ధ పూర్ణిమ యనుచున్నారు. మఱికొందఱు వైశాఖశుద్ధతదియ యనుచున్నారు. కార్తికశుద్ధపూర్ణిమనాఁడు నానకు జ్ఞాపకార్థము టాలువెండి గ్రామములోఁ బ్రతిసంవత్సరము తీర్థముజరుగుచుండుటచే వానిజన్మదినము కార్తికపూర్ణిమయే కాని వైశాఖశుద్ధతదియ కాదని నిశ్చయింపవలసియున్నది. ఆరాత్రి నిశీథసమయమున స్వధర్మభ్రష్టులగు హిందువులను మంచిదారినిం ద్రిప్పఁదలంచిన యామహాత్ముఁ డవతరించెను.

మనదేశమున గొప్పవారి పుట్టుకలు సామాన్యమనుష్యుల జన్మములకంటె విలక్షణముగ వర్ణింపఁబడుచుండును. రామ, కృష్ణాదిమహాత్ములు జన్మించినప్పుడు మహాద్భుతము లనేకములు జరిగినట్లు మనవారు పురాణములలో వర్ణించి యుండుటచే నిటీవలివారును మహాపురుషుల జన్మకాలమునందు వింతలు పొడకట్టినట్లు వ్రాయఁదొడంగిరి. నానకుచరిత్రము వ్రాసినవారుఁ గూడ నీవృద్ధాచారము నతిక్రమింపక వానిజన్మము లోకసామాన్యముగ వ్రాసిరి. నానకు పుట్టినతోడనే సగము నవ్వుచు సగము మాటలాడుచున్న మనుష్యునికంఠధ్వని గలుగున ట్లేడ్చెనని మంత్రసాని చెప్పెనఁట. అందలి సత్యమేమనఁగా నానకు తన తండ్రిపుట్టినట్లుఁ దాతపుట్టినట్లుఁ దక్కినమానవులందఱుం బుట్టినట్లు బుట్టియుండును. అందఱుశిశువు లేడ్చినట్లే యేడ్చియుండును. కాని యతని చరిత్రము వ్రాసినవారు వాని గొప్పతన మంతయుఁ జూచిన పిదప నతఁడు కాలమునలో కైకపూజ్యుఁడైన పిదప వ్రాసియుందురు. కావున నంతటి మహానుభావుఁడు తక్కిన పామరమానవులవలెఁ బుట్టియుండఁడని నమ్మి మూర్ఖజనములు చెప్పుకొను మహాద్భుతములు కొన్ని వాని యనతాకఘట్టములయందుఁ జేర్చియుందురు. అట్లే కాకున్న ప్రకృతిధర్మములు భేదమునందవలసియుండు. అద్భుతములు మహిమలు మొదలగునవి మూర్ఖుల మనస్సులలో నుద్భవించునుగాని నిజముగ జరుగవు.

ఒకనిపుట్టుకలో ఘనతయుండదు. ఒకనిపుట్టుకలో నైచ్యముండదు. ఎవఁడును జన్మించినతోడనే మాటలాడఁడు. తరువాత నెంత గొప్పవాఁడైనను మనుష్యుఁడు పుట్టినప్పు డందఱివలెనె యాఁకలి దప్పిక నిద్ర మొదలగు లక్షణములు గలిగి యుండును. ఇట్లనుటచేతఁ గొందఱు మనుష్యులయం దద్భుతశక్తి లేదని నేననుట లేదు. మనుష్యునిబుద్ధి వికసించినపిదప వాని విద్యంబట్టియు జ్ఞానముంబట్టి

యుఁ నొక్కొక్కని కసాధారణ ప్రజ్ఞ గలుగుచుండును. ఒక్కొక్కని కి విస్తారము విద్యలేకపోయినను దైవభక్తి భూతదయ జితేంద్రియత్వము బాల్యమునం దంకురించి నానాఁట నభివృద్ధి జెందును. ఇట్టి సత్పురుషులే పరోపకారపరాయణులై జీవితమంతయుఁ బరమార్థమునకు ధారపోయుదురు. ఈవానకు పుట్టినప్పు డద్భుతములతోఁ బుట్టకున్నను యుక్తవయస్కుఁడైన పిదప భక్తాగ్రగణ్యుఁడయ్యె.

హిందువులలోఁ బుత్త్రసంతానము గలుగుట పరమానంద హేతువు. అదివఱకు పుత్రసంతానము లేనిపురుషునకుఁ గుమారుఁడు గలిగినప్పు డాకుటుంబమునకుఁ గలుగు మోదము నానందము నెవఁడు వర్ణింపఁగలఁడు! పున్నమినాఁటి రాత్రిఁ బుత్త్రుఁడు కలుగుటయు మఱునాఁ డుదయమునఁ గాళునిగృహము మహానందనిలయమై యుండెను. కాళున కదివఱకొక కూఁతురుండెను. ఎంద ఱాఁడుబిడ్డ లున్నను హిందువులలో మగబిడ్డలులేని మనుష్యుఁడు కేవలము మందభాగ్యుఁడుగ నెంచఁబడుటచేఁ గాళుఁడు పుత్రోత్పత్తియైనతోడనే తాను ధన్యుఁడనయితినని తలంచి సంతోషపరవశుఁడై తత్క్షణము పురోహితుం బిలిపించి బాలుని భవిష్యద్దశను గూర్చి మున్నె యెఱుంగవలయునని జాతకము వ్రాయుమని కోరెను. ఇట్లు పురోహితుం బిలిపించి జాతకము వ్రాయుమనుటలోఁ గుమారుని జాతక మఖండైశ్వర్యవంతముగ నుండునని యె తండ్రి యభిప్రాయము. జ్యోతిష్కుఁడును బరేంగితజ్ఞానము కలవాఁడు కావునఁ దండ్రి యనుకొన్నట్లు కుమారుఁ డఖండైశ్వర్యవంతుఁ డగునని యు గ్రహములన్నియు నుచ్చస్థానమున నున్నవనియుఁ జెప్పి యంతతోఁ బోక బాలునకు స్వేచ్ఛాత్రాధిపత్యముగూడ గలుగునని వక్కాణించి తదనుకూలముగ జాతకము వ్రాయఁ దండ్రి యదిచూచి మేరమీరిన సంతోషమునందెను. పురోహితుఁడు జాతకమునందుఁ బూర్వోదాహృతములగు విషయము

లకుఁ దోడుగ నానకు గొప్ప యవతారపురుషుఁ డనియు వానింబో లినవారు మున్నెవ్వరు లేరనియు వానిని హిందువులు మహమ్మదీ యులు సమానముగ గౌరవింతురనియుఁ బంచభూతములు వానికి లోఁబడి యుండుననియుఁ నతఁడు పరమేశ్వరారాధనమునందు నిర తుఁడై యుండుననియుఁగూడ వ్రాసెనఁట. ఈవిషయములు పురో హితుఁడు మొట్టమొదట జాతకమునందు వ్రాయుట యబద్ధము. నానకు మతసంస్కర్తయై లోకఖ్యాతుఁడైన పిదప వానిభక్తులు మొదలగువారు కల్పించుట నిజము. జాతకము లెట్టివో జాతకములు వ్రాయు జ్యోతిష్కులెట్టివారో వారిమాట లెంతవఱకుఁ బ్రమాణము లో మనదేశస్థులు చక్కగా నెఱుఁగుదురు. కావున నిచ్చట విస్తరిం చి వ్రాయనక్కరలేదు.

కాళుఁడు పురిటిదినములు గతించిన వెనుకఁ గుమారునకు జాతకర్మములు చేసి నానకని నామకరణము చేసెను. కాళుఁడు ప్రథమసంతానమైన యాఁడుబిడ్డకు నదివఱకే నానకియని పేరుపెట్టు టచే నామెపేరే కొడుకునకుఁగూడ బెట్టఁదలఁచి యట్లుచేసెను. నానకు దృఢశరీరుఁడై దినదినప్రవర్ధమానుఁ డయ్యెను. ఈతని శైశవమును గూర్చి చరిత్రకారు లెవ్వరును దగినట్లు వ్రాయలేనందున వానిచిన్న నాఁటి లక్షణము లిట్టివని నిర్ణయింప మనశక్యముగాదు. అతఁడు బా ల్యమునఁ దోడిబ లురదోడను బాలకులతోడను గలసిమెలసి యాట పాటలలో మెలంగక తరుచుగ నితరులతో మాడలాడ నొల్లకయుం డువాఁడని కొందఱు వ్రాసిరి.

ఏడవసంవత్సరమందుఁ దండ్రి వాని కక్షరాభ్యాసము చేసి గురువునకు బహుమానములిచ్చి విద్యాభ్యాసము చేయింపుమని కొడు కు నప్పగించెను. హిందీభాషను వ్రాయుట చదువుట వర్తకుల కుప యోగించు లెక్కలువేయుట మాత్రమే యాగ్రామ పాఠశాలలోఁ

జెప్పునట్టి విద్యలు. బడిపంతులు వాని కక్షరాభ్యాసముం జేసి తన చెప్పఁగల విద్యలు గరపుటకు బాలకుని బడికిం దోడ్కొనిపోయెను. నానకు బడికిఁబోయి మొదటినాఁడు నెమ్మదిగ నుండెను; కాని రెండవనాఁ డతఁడు చదువుకొనక యూరక కూర్చుండ గురువు వానిం గసిరి బెదరించెను. బెదరించుటయు శిష్యుఁడు గురువుపైఁ దిరుగఁబడి గురువును ధిక్కరించి నాకుఁజెప్పుటకు నీకేమి చదువు వచ్చునని వాని నడిగెనఁట. శిష్యుని ప్రశ్నమువిని గురువు తెల్లబోయి తాను సకలశాస్త్రములు నేర్చినట్లు ప్రత్యుత్తరమిచ్చెను. ఆమాటలువిని నానకు లౌకికవిద్య నిరుపయోగకర మగుటయేగాక హానికర మనియు దాని నభ్యసించినవారు సంసారపాశములం దగుల్కొని యెన్నటికిం బయల్పడఁజాలరనియు మనుష్యులు శ్రద్ధతో నేర్చుకొనవలసిన విద్య వేఱొకటి యున్నదనియు సత్యమును గ్రహించుట భగవంతునియెడ భక్తి గలిగియుండుట భగవన్నామము కీర్తనముసేయుట మొదలగునవియే నిజమైనవిద్యలనియు నవియే యుభయలోకతారకము లనియు గురువునకు బదులు చెప్పెనఁట. అప్పలుకులు పలికి యంతట నూరకుండక నానకు భక్తితత్త్వముం దెలుపు శ్లోకము నొకదానిని జదివెనఁట. ఆ శ్లోకార్థమిది.

“నీలోకానురాగము సిరా జేసి, నీబుద్ధిఫలకము కాగితము జేసి నీమనస్సు వ్రాతగాఁడుగఁ జేసి పరమేశ్వరుని గూర్చి వ్రాయుము. వ్రాసి వానియందు దృష్టినిలుపుము. ఏమివ్రాయవలయునని తలంచుచున్నాడవు. భగవన్నామము వ్రాయుము. భగవత్కీర్తనలు వ్రాయుము. భగవంతుఁ డాద్యంతశూన్యుఁడన్న మాట వ్రాయుము. మిత్రుఁడా! ఇట్టి వ్రాత నేర్చుకొంటివేని దేవుని యెదుటకు నీవుబోయి యీలోకమున నీవు నడచిన నడతకు సరిగ లెక్క చెప్పవలసివచ్చినప్పుడు తప్పక యీవ్రాత నీపక్షము బూని కళంకరహితమై నిన్ను

రక్షించును

ఏడుపదుల యేండ్ల వయసుగల వృద్ధుని నోటనుండి వెడలవల సిన యాభక్తిరస ప్రధాన వచనములు విని గురువు వాని యసాధారణశక్తి కచ్చెరువడి తన మనంబున నప్పుడప్పుడు పొడమి తనకు దుస్సాధ్యములయిన వేదాంతవిషయిక సందేహములఁదీర్చుకొనుటకది యే సమయమని యాబాలు ననేక ప్రశ్నము లడిగెనఁట. అడిగిన తోడనే నానకు వాని కన్నిఁటి కవలీలగఁ దగునుత్తరము లిచ్చెనఁట. ఆయుత్తరములు సహేతుకములుగ నున్నట్లు తోఁచుటయు గురువు బాలుఁడని యెంచక భయభక్తులు మెఱయ శిష్యుని పాదములకు నమస్కరించి యతఁడు సామాన్యుఁడు గాఁడనియు నవతారపురుషుఁ డని యుశ్లాఘించెనఁట. ప్రపంచమందు మహాద్భుతమగు బుద్ధివికాసము గల బాలురు లేరని చెప్పఁ జాలము గాని యేడేండ్ల యీడు గల బాలకుఁ డట్టి పరమార్థబోధకములగు పలుకులు పలికెననుట విశ్వసనీయము కాదు.

అతఁడు పుట్టిపెరిఁగిన కుటుంబము నిరంతరము వేదాంత చర్చలలోఁ గృషిచేయుచుండిన పక్షమున బాలకున కాసంబంధములైన మాటలు కొన్ని పట్టుపడి యుండు నని మన మూహింపవచ్చును. అట్టిదేదియు నిచ్చట గానరాదు. లేక సహజముగ మహాబుద్ధిమంతుండగు బాలుఁడు గొప్పవిద్వాంసులయు విరాగులయు సహవాసము జేయుచుండిన పక్షమున నీవిధములగు పలుకులు కాకపోయినను జ్ఞానగర్భితములగు కొన్ని పలుకులు పలికినాఁడని మనము నమ్మవచ్చును. అది యేదియు నానకు విషయమునఁ గానరాదు. తల్లిదండ్రులకు వేదాంత కృషి లేదు. విరాగులతో సహవాసమున్నట్లు గనఁబడదు. మంచివిద్యావ్యాసంగ మదివఱకే యుండవచ్చుననుకొన్న బడికిఁబోయిన మఱునాఁడే యీచిత్రకథ జరిగెనని చెప్పుచున్నారు. కావున

నేవిధమునఁ జూచినను మన మా కథ నమ్మఁదగినదిగ లేదు. దాని యాథార్థ్య మేమైయుండునన నానకు నోటనుండి యాపలుకులు బయికి పోయిన మఱునాఁడే రాకపోయినను యుక్తవయస్కుఁడై జ్ఞానవంతుఁడై మతసంస్కర్తయైన పిదప వానినోటనుండి యావాగ్రత్నములు వెడలియుండవచ్చును. చరిత్రకారులు వానికిమహిమ లారోపింపఁ దలఁచి పెద్దనాఁటి మాటలు పిన్ననాఁటికి మార్చి యుండవచ్చును.

అది యటుండ నీ సంభాషణములు జరిగిన పిదప నానకు మఱి యెన్నఁడు బడికి బోయియుండలేదనియు వాని చదువు రెన్నాళ్ళలో ముగిసెననియు చరిత్రకారులు చెప్పుచున్నారు. ఇదియును వాని శిష్యులు వానియందలి భక్తివిశేషముచేతఁ దక్కిన ప్రాకృత పురుషులవలె నతఁడు చిరకాలము విద్యనేర్చుకొనలేదని లోకమునకుఁ జెప్పఁ దలఁచి యట్లు వ్రాసియుందురేగాని యది నిజము కాదు. ఏలయన నెట్టి కుశాగ్రబుద్ధికైనఁ జదువుకొనకయే విద్యరాదు. అభ్యాసించునప్పుడు విద్య సూక్ష్మముగ గ్రహించునట్టి మనీషయుండిన నుండవచ్చును. చదువక పండితుఁడైనవాఁ డెవ్వఁడును లేఁడు. మఱియు నానకు హిందీభాషం జక్కఁగఁ జదువను వ్రాయను నేర్చినట్లును లెక్కల వ్రాయుటలోఁ బ్రౌఢుఁడైనట్లుఁ గొంతకాల ముద్యోగములు చేసినట్లును మనకుఁ బెక్కుదృష్టాంతములు గలవు. అక్షరాభ్యాసమైన మఱునాఁడే చదువుముగించిన కుఱ్ఱవానికంతటి ప్రజ్ఞగలుగుట యసంభవము గావున నతని చదువు రెన్నాళ్ళ చదువుగాక రెండేండ్ల చదువో, అంతకంటెఁ గొంచెము తక్కువకాలపు చదువో యైయుండవచ్చునని మన మూహింపవలసియుండును. ఎట్లయిన నానకు విద్యావిషయమున విస్తారము శ్రద్ధ జూపినట్లు గానఁబడదు. కుమారునకుఁ జదువుమీఁద నెక్కుడు తమకము లేదనియో నేర్చినవిద్య సగౌరవముగ దేహయాత్ర గడపుటకుఁ జాలుననియో యెందుచేతనో తండ్రి

యచిరకాలముననే కొడుకుం జదువమానిపించెను. అట్లు పాఠశాల విడుచునప్పటికినానకు తొమ్మిదియేండ్ల ప్రాయమువాఁడు.

చదువు మానిపించిన వెంటనే కాళుఁడు కుమారు నేదైన వ్యాపారమునం బ్రవేశపెట్టవలయునని నిశ్చయించుకొనెను. అది మొదలు తండ్రికిఁ గొడుకునకు నెడతెగని వైరుధ్యమే సంభవించెను. నానకు ప్రత్యక్షముగఁ దండ్రి చెప్పిన పని జేయ నిష్టము లేనట్లుఁ గనఁబడకపోయినను దన కైహిక వ్యాపారములయం దెంతమాత్రి మిష్టము లేదని చేష్టలచేతఁ జెప్పకయే చెప్పుచు వచ్చెను. విద్యాభ్యాసము ముగిసినతోడనే కాళుఁడు కుమారునిఁ బనిలో మప్పఁదలఁచి వాని బసులకాపరితనమున నియోగించెను. నియోగించుటయు నానకు వల్లెయని యాపని జేయ సమ్మతించెను. కాని యల్పకాలములోనే తన కుమారుఁడు పసుల కాఁచుటకుఁ బనికిరాఁడని కాళుఁడు గ్రహించెను. ఏలయన నానకు పరమదయాళువగుటచే నోరులేని జంతువులను బలవంతముగ నిర్బంధించి యొక్కచో నిల్చుట కూడదని తలంచి పసుల నదలింపక యవి యిచ్చవచ్చిన తెఱంగున విహరించుచుండఁ జూచుచు నూరకుండును. లేఁగదూడ తల్లిపాలు కుడువఁదలఁచెనా దాని తల్లిపాలదియే కుడువఁగూడదని తత్క్షణము యాదూడను పాలుగుడువనిచ్చును. ఆకుమడియైనను సరియే పండిన చేనైనను సరియే యావు మేయఁదలఁచెనా, పాపమది యిచ్చవచ్చినట్లెల్ల కసవు తినఁగూడదని తత్క్షణమే దానిని మేయ విడుచును.

పరమేశ్వరుఁడు మనుష్యుల నదితర జంతువులను సమానముగ సృష్టించినను మనుష్యుఁడు లేనిపోని యధికారములఁబూని యతిక్రూరుఁడై నోరులేని యీజంతువులను దన యిచ్చవచ్చిన తెఱంగున బాధలు పెట్టి మంచిపదార్థములెల్లఁ దానే యనుభవించుచు నెల్ల సౌఖ్యములఁ దానే పొందుచు నుండుట యేటిన్యాయమనియు మను

ష్యులలోఁ దల్లులు పాలిచ్చి తమ బిడ్డలఁ బోషించి యెంతో గారామునం బెంచుకొనుచుండఁ బశువు తమ యిచ్ఛవచ్చినప్పుడు తమ పొదుగుపాలను తమదూడల కిచ్చుకొనుటకేల స్వాతంత్ర్యముండఁగూడదనియు మనసున సందేహములు పుట్టి వానిని బాధింపఁదొడఁగెను. ఏసందేహములు దోఁచిననేమి ఏయాలోచనలు తట్టిననేమి మొత్తముమీఁద కొడుకుచేసినపనులు తండ్రికిఁ గిట్టవయ్యె. నానకుపసులకాపరియైయున్న కాలమున రెండు చిత్రకథలు జరిగినవఁట. నానకు పేరెత్తినవారందఱు దామునమ్మిన నమ్మకున్న నీయద్భుతకథలు రెండు చెప్పుకొనకమానరు. అందు మొదటికథ యిది. నానకు మండు వేసఁగి నొకనాఁడుపగలు రెండుజాములవేళ నీచెవిగాను పాచెవికిగొట్టుచున్నప్పుడూరబైటఁ బసుల కాచుచుండి కునికిపాట్లు రాఁగా నిద్దురనాపఁజాలక యొకచెట్టుక్రిందఁ బండుకొనియెనఁట. సూర్యుఁడు పశ్చిమమునకుఁ బోవుచున్నకొలఁది చెట్లనీడలు మునుపున్న తావుననుండకమాఱుచుండుట సహజముకదా! ప్రకృతిధర్మ మట్లున్నను నాఁడది యేమిచిత్రమో కాని నానకు. పండుకొన్న చెట్టునీడ సూర్యగతింబట్టి మార్పు జెందకయున్నతావునేయుండి యాబాలున కెండతగులకుండఁ గాపాడుచుండెనఁట.

రెండవకథ యీవిధముగనున్నది. గ్రీష్మకాలమున మఱియొక దినమున నతఁడు పసులగాఁచుచు నిద్రాభరము నాపలేక మట్టమధ్యాహ్నము మఱియొకతావున నెండలోఁ బండుకొని గాఢనిద్ర జెందెనఁట. అప్పుడొక నల్లత్రాఁచు తనపడగ బాలునితలమీఁద విప్పి వాని కెండసోఁకకుండ సంరక్షణము చేయుచుండెనఁట. ఆ సమయముననే టాలువెండి గ్రామనివాసి రాయబులారు గుఱ్ఱమెక్కి యెటనుండియో స్వగ్రామమునకుఁ బోవుచు నానకు పండుకొనియున్న స్థలము సమీపమునుండి చనుచు నా మహా

ద్భుతమును జూచి విస్మితుఁడై చెప్పవాల్పక బాలుని వానింగాచు సర్పమును జూచుచు గుఱ్ఱమునాపెను. కొంతదవ్వుననున్న పరిజనులంతలో వానింగలుసుకొనుటయు రాయబులారు వానింజూచి "యీబాలుఁడు మృతినొందెనా" యని యడిగెను. మృతినొందలేదని వారు ప్రత్యుత్తరము చెప్పుటయు రాయబులారు కడునచ్చెరువడి పాము వెడలఁగొట్టుమని వారి కానతీయ వారుమిక్కిలి మెలకువతో బాలునకపాయము గలుగకుండ సర్పమును బెదిరించి యవ్వలకుఁదోలి బాలునిడాసి యతఁడు తామెఱిఁగినవాఁడేయగుట వానిం దమ యజమానునకుఁదెల్పిరి. రాయబులారు వెంటనే గుఱ్ఱముదిగి బాలుని ముద్దుపెట్టుకొని యతఁడెవ్వఁడో యవతారపురుషుఁడని సమ్మిగ్రామమునకుఁ బోయి తనచూచినదంతయుఁ బూసగ్రుచ్చినట్లు కాళునితోఁజెప్పి బాలకుఁడు సామాన్యమనుష్యుఁడు గాఁడు కావున వానియెడల నెక్కుడు దయజూపుమని బ్రతిమాలి యింటికిఁబోయెను. ఇట్లు రెండుమూఁడుసంవత్సరములు కాళుఁడు కుమారుని గోపాలకవృత్తియందు నిలిపి దానికతఁడు తగఁడని గ్రహించి కొడుకు చాకచక్యమునుజూపి పాటుపడఁదగినదియుఁ బడిన పాటునకు లాభము గలిగించునదియు నగు వృత్తిం బ్రవేశపెట్టఁదలఁచి యొకపొలము వానికిచ్చి యందు వ్యవసాయముచేయుమని వానిని నియోగించెను. అదనునందే పొలముదున్నుట విత్తనములనాటుట మున్నగుపనులు జరిగెను. పక్షిదొంగల బారినుండియు, పందులు మొదలగు జంతువులబారినుండియుఁ జేను కాపాడుట నానకు పనియైయుండెను.

అతఁడును దనపొలమున వ్యర్థముగఁ గూర్చుండక పలుమాఱిట్టటుఁదిరుగుచుఁ గేకలువేయుచుఁ జప్పటులఁజఱచుచుఁ జేనుకాచుచున్నట్లు యగుపడెను. కాని యొకనాఁడైన నతఁడు చేతులార వడిసేలత్రిప్పి యెఱుఁగఁడు. మీఁదుమిక్కిలి ప్రక్కపొలములయందలి కాఁపులపక్షు

వులు తన చేలఁ బడినప్పుడు వానిం బాఱఁదోలుట తనకెంతో కష్టముగ నుండెను. ఒక్కొక్కనాఁడతఁడు దయారసముచేత నొడలు మఱచి మృగములు పక్షులు యథేచ్ఛముగఁ బండినచేను మేయుచుండఁ గన్నులప్పగించి చూచుచు నూరకుండువాఁడు. కాళుని మనస్సెప్పుడును గుమారుని దెసయనుమానాస్పదమైయుండుటచే నొకనాఁడతఁడు పొలమునకుఁ బోయి చేను దెసఁ జూచి యది పాడుగానుండుట గ్రహించి మితిమీఱిన కోపమునంది యాబాలకుని మిక్కిలి దూఱనాడి దానం దనివినొందక నింటికిఁబోయి తనయుండు మహైశ్వర్యవంతుఁ డగునని జాతకము వ్రాసిన పురోహితుని మీఁదఁబడి వాని నెంతయు నిందించెను.

ఆపురోహితుఁడును శాంతముదాల్చి కాళుని కోపకారణమెఱిఁగి తనపలుకు లసత్యములు కావనియు నానకు సర్వలోకపూజ్యుఁడగుననియు లక్షలకొలఁది జనులకతఁడు మహోపకారము చేయఁగలవాఁడగుననియు రాజాధిరాజులైన వాని గీచినగీఁటు దాటక వినయమున మెలంగుదురనియు జెప్పి వానిననునయించి పంపెనట. నానకుయొక్క చరిత్రకారులు జ్యోతిశ్శాస్త్రమునందు నమ్మికగలవారగుటచేఁ బైపలుకులు పురోహితుఁడు చెప్పినను జెప్పకున్నను వానినోటఁ బెట్టియుందురు. ఇక్కడికి నానకు పసులకాపరితనమునకే గాక వ్యవసాయము చేయుటకుఁగూడ దగనివాఁడని తండ్రి విస్పష్టముగ గ్రహించి వాని నేవృత్తియందుఁ బ్రవేశపెట్టి బాగుచేయఁదగునోయని కొంత కాలము విచారించి యేపనియందు నియోగింపకుండ నూరకయే కొన్ని సంవత్సరము లుంచినపక్షమున బాలుండు బాగుపడవచ్చునని వాని నైదుసంవత్సరములవఱకు యథేచ్ఛముగ సంచరింపుమని చెప్పెను.

ద్వితీయాధ్యాయము.

విద్యాబుద్ధులు నేర్చుకొనవలసిన కాలమున జనకుఁడు కుమారుని మనసువచ్చినట్లుఁ దిరుగుమని చెప్పుట యసంభవమేయైనను గాళుఁడు పుత్త్రుని వర్తనముచేత విసిగి యట్లు చేసెనేగాని బిడ్డను బాగుచేయవలయునన తలంపులేక కాదు. కాళుఁడు పండ్రెండవ యేఁట నానకును స్వేచ్ఛావిహారమునకై విడిచి దృఢమనోబలము గలవాఁడగుటచేత నైదేండ్లలోపున మరలనెన్నఁడు వానిపుణ్యవృద్ధి విషయమైన వానితో ముచ్చటింపకయె దేండ్లు గడచినపిదప ననఁగా నానకునకుఁబదునేడేండ్లు వయస్సు వచ్చినపుడు బుద్ధిగలమైన మరలినదేమో చూడవలయునని కొడుకునొకసారి పిలిచి తాను మరణము నొందకమునుపే నేదైననొక మంచివృత్తి నేర్చుకొనుట మంచిదనియుఁ దనమరణానంతరమున మొగమైనఁ జూచువారుండరనియు వ్యవహారము నేర్చుకొనవలసిన యదను దాటినచో మరల గూడిరాదనియు నయమున భయమునఁ జెప్పి కొడుకును బుజ్జగించెను.

చిన్నతనమునుండియుఁ గాళుఁడు వ్యవహారమేచేయుటచే నదియే యుత్తమమైన వృత్తియనియు నదిలేనిచోఁ గొడుకు బ్రతుకలేఁడనియుఁ గాళుని యభిప్రాయము గావున నతఁడంత నొక్కిచెప్పెను. కొడుకు తండ్రిపలుకులు తలవంచుకొని విని మిక్కిలి వినయముతో వెనుక చేసినదంతయు క్షమింపవలయునని యడిగి చేయుమన్న వ్యాపారము తప్పక చేయునట్లొడంబడెను. కుమారునియందేదో మంచిమార్పు కలిగినదని తండ్రి సంతసించి యాపదునుచెడకుండ వానిందగినపనిలో నియోగింపవలయునని వానిచేతి కిరువదిరూపాయలిచ్చి చుట్టుపక్క పల్లియలకుంబోయి సరకులుకొని తీసికొనిరమ్మనియు లాభమున కమ్ముమనియుఁ జెప్పి యాచిన్నవ్యాపారములో జాగ్రత్తగా నడచుకొని

ధనము మంచివినియోగము చేసినపక్షమున ముందుముందు వాణిజ్యము నిమిత్త మెక్కువధనమిచ్చెదనని వాగ్దానముచేసి గూఢ ప్రశ్నను. అప్పలుకులు విని నాసకు "ఈధనము మంచివినియోగము చేసెదన" నని నుడివిబయలుదేరిపోయెను. తాను కొంచెముసంసారిగాన శ్వాసములేనివాఁడై యున్నను ముచ్చటించిన బలుఁడను నొక కాఁపు వానిని జతయిచ్చి తనకువచ్చిన సొమ్ము సాగుచేయుచుండఁ జూడు మని వానితో నొక్కిచెప్పి సొమ్మును మూటగట్టి యిచ్చి బలుని బొద్దుకొంగున గట్టిగ ముడివైచికొనుమనెను. కాని తెరువుగాక తన్నుడించినను దైవనిర్ణయము వేఱుగనుండెను. నాసకు తండ్రి పెట్టిన సొమ్ము గ్రక్కొని బయలుదేరినదిమొదలు "ఈధనము మంచివినియోగము చేసెదను" నన్న మాటలకు తండ్రికిఁ దోఁచిన యర్థమునకంటె భిన్నార్థము తోఁచ నారంభించెను. ఇంతకుఁ గారణము తండ్రి యభిప్రాయము తెలియకపోవుట కాదు. బయలుదేరినతోడనే వానికున్న సత్కార్యములమీఁదికిఁ బోయి శరీరమును బరవశముచేయు నశించు ధనమంతయు దానముచేసినను సరే యతఁడిచ్చినసొమ్ముతో వ్యాపారము సల్పి మొదలును సరకులు కొని మాఱు బేరమున కమ్ముటకంటె నాధనము భగవద్విషయమున వినియోగించుట యుక్తమని భావించెను.

తండ్రిచెప్పినవిధమునఁ జేయనొడఁబడక మనసు వానియాజ్ఞకు విరుద్ధముగా వర్తించుట మంచిదికాదని నాసకు కొంతసేపు విచారించెను. కాని వానిహృదయ మెన్నివిధముల మరల్చినను మరలదయ్యె. అతఁడట్లు ధర్మకార్యాసక్తమనస్కుఁడై చనుచుండ మధ్యమార్గమున నొక సన్యాసులగుంపు వానికగపడెను. ఆవిరాగు లనేకులు కొన్ని దినములనుండి యాహారములేక మలమలమాడుచుండిరని విని నాసకు మిక్కిలిజాలినొంది బలునియొద్దనుండి బలవంతముగా సొమ్మపుచ్చుకొని యాగుంపుపెద్దచేతికిచ్చెను. ఆవృద్ధసన్యాసియుఁ దన కాసొమ్మక్కఱ

లేదనియుఁ దినుటకుఁ బదార్థము లుపయోగించును గాని సూకలుప యోగింపవనియుఁ జెప్పి యాదానమును నిరాకరింపఁ బరమదయాళు వగు నానకు పరుగుపరుగున దాపుననున్న పల్లెకుఁబోయి గోధుమపిండి చక్కెర పప్పుమొదలగు సరకులఁ గొని తెచ్చి వానికి సమర్పించెను. సన్యాసులు వానిఁబరిగ్రహించి విందారగించిరి. నానకు వృద్ధసన్యాసి తోఁ జాలసేపు వేదాంతచర్చఁ జేసి వారచ్చోటు విడిచినపిదప మెల్ల మెల్లన నింటికి బయలుదేరెను. కాని వానియడుగులు మునుపటి యట్లు సాగవయ్యె. తనతండ్రి యెట్టివాఁడో తనకు ముందుఁ దలఁచిన యాపదయెట్టిదో యెఱుంగుటచే నతఁడు బెంగగాని దారిలో నడుచు నడుచు "అయ్యో! నేనేలపరవశుఁడనై పోతినోయి" యని బలునితోఁ పలుక, బాలుఁడును "వద్దని నేను మొత్తుకొనలేదటోయి. నీవు వినలేదు కాని" యని మాటలు చెప్పుచు వచ్చెను.

అట్లుమాటలాడుచు నిరువురు గ్రామసమీపమునకుఁ జేరి నానకు తండ్రికి జడిసి యింటికిఁబోవక యూరిబయట చెట్లలో దాఁగికొనెను. బాలుఁడు స్వగృహమునకుఁ బోయెను. కాలుఁడు రావలసినవేళకుఁ గుమారుఁడు రాలేదని వగచుచు బలుఁడు వచ్చినట్లువిని విసవిస వానియింటికిఁబోయి యాత్రముతోఁ దనకుమారునివార్త యడుగ వాఁడు జరిగినవృత్తాంతమంతయుఁ బూసగ్రుచ్చినట్లు జెప్పెను. అదివిని కాలుఁడు రౌద్రాకారముంబూని ధనముపోయినందుకు నేరమంతయు వానిమీఁద మోపెను. బలుఁడు జంకకఁ "నే వద్దని నుడివిన నీకొడుకే పాడుచేసె" నని బింకముతోఁ బ్రత్యుత్తరము జెప్పఁ గొడుకుజూపుమని జెబ్బపట్టుకొని వానిని లాగికొనిపోయి చెట్ల చాటుననుండి కొడుకుఁ నీవలకీడ్చి తిట్లవాన వానిమీదఁ జిత్తజల్లుగఁ గురిపించెను. తండ్రియెన్నివిధముల దూషించినను నానకు తలవంచుకొని ప్రత్యుత్తరముఁ జెప్పక యూరకుండెను. కుమారుఁడు పుట్టినదిమొద

లు వానినెన్నివిధములనో బాధచేసి తనపుత్త్రునియందుఁ బ్రవేశపెట్టి ధనమార్జింపఁ జేయుచుండెనని యూటలూరి కాలుఁడు పుత్త్రుని పరిమోజకత్వముఁ గాంచి నిర్వాహ్యంతే యూహలన్నియు నటుండంట వాఁ డెందుకుఁ బనికిరాఁడని చెప్పినను నేదే బ్రతికెనను నరే వానిజోలికిఁ బో గూడదని నిశ్చయించుకొనియె.

తండ్రికోపము వడగండ్లవానవలె మొట్టమొదట విజృంభిం చనే గాని తరువాత నంతమిక్కుటముగా నుండఁజాలదు గనుక నాయన గ్రహించి యాదివము మొదలుకొని తండ్రియానుమతిఁగనే సాధువుల తో సన్యాసులతో సహవాసముచేసి యుంటుంగానుచ్చుచ్చు. వారిద్దరొక యింటనున్నను దండ్రికొడుకులా యుండక యుండెవారు నట్టుగాని వారి వలె నుండిరి. కాలునకుఁ గుమారునివలనఁ గలిగిన కష్టదారిద్ర్యములను నాయనకునకుఁ గలిగినయపకీర్తియు నిరుగుపొరుగువారు చెప్పింపని విచారిం చిరి. రాయబహాదరు మహానారాయణయముఁ గాయనిఁదనయింటికి గా వించి నాయనకెడ నతఁడు చూపినకారుణ్యమునకుఁ దనకు చాలవిచార ముగా నున్నదనియు వానిం బాధపెట్టవచ్చిన తానొకసారి వెలకు కొం సను ధనమాత్రమైన లక్ష్యము సేయకపోవుట యనుచితమనియుఁ గలి గిన నష్టముఁ దానిచ్చుకొనఁ గోరుచున్నవాఁడనియుఁ జెప్పి యిరువది రూకలు దెచ్చి కాలునిచేతిలోఁ బెట్టెను. కాలుఁడు మిక్కిలి సిగ్గుపడి తన కాసొమ్మక్కఱ లేదని చాలసేపు నిరాకరించెను గాని వానిప్రార్థన మీఁద నెట్టకేలకు స్వీకరించెను. కుమారుఁడు పాపముచేసినసొమ్ము కా లుఁడు రాయబహాదరునొద్ద పుచ్చుకొన్నాఁడనువిని లోకులు కాకులు పొడిచినట్లు పొడిచి యాత్మగౌరవముఁ జంపుకొని ధనమే ప్రధానముగా నెంచుకొన్నందుకు వానిని మిక్కిలి నిందించిరి. ఆనిందలుపడలేక కా లుఁడు సొమ్ముతీసికొనిపోయి మరల రాయబహాదురునకీయఁబోవ నతఁ డు పుచ్చుకొనక వానియొద్దనే యుంచుమని బ్రతిమాలి వెండియు నిట్ల

నియె. "నీకుమారుఁడు నీయింట బొత్తుగా సుఖపడుటలేదు. వానిని వేరొకచోట నునిచి యుంచవలయునని నేఁడలఁచుచున్నాను. నేను తురకనైపోతినిగాని లేనిచో వానిని మాయింటనే పరమానందముతో నుంచుకొందునుగదా! జాతిమతభేదములచేత నట్టిప్రాప్తి నాకు లేదు" అని వానితోఁ బలికి యతఁడు మొదలు రాయబులారు నానకునందు మిక్కిలి భక్తిప్రేమలు గలవాఁడై వానికి సుఖమిచ్చు బని నేర్పఱుపవలయునని దలపోయుచుండెను.

అప్పుడు నోకినాఁడను సుల్తానుపురివాసియగు జయరాముఁడను క్షత్రియుఁడొకఁడు పంజాబుదేశపరిపాలకుఁడగు దౌలతుఖానులోడీ పనుపునఁ బంటలయొక్క పన్ను వేసికొనుటకై తాల్వండీ గ్రామమునకుం బోయెను. అతని కప్పటికి వివాహము కాలేదు. ఆ రాజకుమారుఁడొక్కనాఁడు కాలునిపుత్త్రియగు నానకునిఁజూచి యామె చక్కఁదనము నచ్చుటయు నాకిమ్మనియు దనకమ్మని తండ్రినడిగెను. అతనికోరిక ననుగ్రహముగ రాయబులారుగూడ జయరాముని సద్గుణముల నగ్గడించఁగా కాలుఁడు సంబంధము మనకు కుదిరింది ముందుగ ప్రధానముచేసి యల్పకాలములోనే కుమార్తెను జయరామునకిచ్చి వివాహముచేసెను. వివాహానంతరమునఁ బెండ్లికూఁతురు పెండ్లికుమారునితో గృహప్రవేశమునకుఁబోవఁ గాలుఁడు నానకుని వానివెంట సుల్తానుపురమునకంపెను. నానకు తండ్రిమాట జవదాటక నచ్చటికిఁ దిన్నగాఁబోయి చెలియలను సుఖముగఁ జూచుచుండెను. మఱునాటిసంవత్సరము వైశాఖమాసమున జయరాముఁడు పెండ్లివారియింటికి రాఁగా రాయబులారు వానిఁబిలిచి నానకునకు బొత్తుగా సుఖములేదనియుఁ దండ్రిమిక్కిలి కఠినుఁడగుటచేత స్వగృహమున నున్నంతకాలము కష్టమే ప్రాప్తించుననియుఁ దోఁబుట్టువు దగ్గఱనున్న పక్షమున నతనికి సుఖము కలుగుననియుఁ జెప్పెను. జయరాముఁడందుకు సమ్మతించి వానిని వెంటఁగొనిపోవుదు

ననిప్రత్యుత్తరమీయ రాయబులారు "తొందరపడవద్దు ఇదిసమయము గాదు. సమయమువచ్చినప్పుడు నేనే చెప్పెద" ననియప్పటికి నివారించెను. అనంతరము జయరాముఁడు భార్యాసమేతుఁడై స్వగ్రామమునకుఁ బోయెను. పిమ్మట కొన్నిమాసములు గడచిన నొకనాఁ డుదయమున స్నానముచేసి చెంబుచేతఁబట్టుకొని యింటికిఁబోవుచుండ దారిలో నొకసాధువు కనఁబడెను. కనఁబడినతోడనే యతఁడు వానికడకుఁ బోయి చాలసేపు వానితో వేదాంతచర్చచేసి చెంబును వ్రేలనున్న యుంగరమును వానికిచ్చి గృహమునకుఁబోయెను. కాళుఁడు వానిని జూడఁగానే యీవస్తువు లేవి యని యడిగెను. నానకు వానిమాటలు కేమియుత్తరమును జెప్పక తలవంచి నిలిచియుండెను. అప్పుడు కాళుఁడు దుర్భరకోపావేశమున వానిం బలుతెఱంగులఁ దిట్టి యిట్లనియె. "నీవు నాకెందుకుఁ బనికిరావు. నాగృహము తక్షణమువిడిచి నీ యిచ్చ వచ్చినకడకుఁబోయి యన్నము సంపాదించుకొని బ్రతుకుము నేను నీవిషయమున నన్నియాసలు విడుచుకొన్నాను."

అహహా! కాళుఁడు బిట్టలుకతో నేబాలునిఁ బరమమూర్ఖునిగా భావించి నిందించెనో, యాబాలుని లోకులు సర్వజ్ఞునిగ భావింతురని యించుకేనియు నెఱుంగఁడుకదా! అతఁ డెవ్వని దనగృహమం దుండనీయక వెడలనడపెనో యాబాలుని ముందుముందు రాజాధిరాజులు సింహాసనంబులు దిగివచ్చి ప్రణతులై నిజాంతఃపురమునకు రమ్మని ప్రార్థింతురని స్వప్నమందైన నెఱుఁగఁడుకదా! అట్లుఁగాక యింటనుండి కాళుఁడు కొడుకును దోలుటయేలోకమునకు మేలయ్యె. రాయబులారు నానకును దండ్రి యింటనుండి లేచిపోవుట విని కాళుని బిలిచి "నీకు నీకొడుకునకు నింకపడదు. పడనప్పుడు మీయిరువురుఁ బగవారివలె నొండొరుల విడువఁదగదు. కావున నానకను మంచి మాటలుచెప్పి జయరామునికడకుఁ బంపుము. నీకోరికప్రకారము నీ

యింట నుండకపోవుటయు నేలున్నపక్షమున బాగుపడుటయు సంభవింపదనని హితోపదేశము చేసెను. కాళుఁడా యుపదేశము విని యదివెన్నఁగానున్నదని కనిపెట్టి కొడుకుమీఁద నెంతకోపము వచ్చినను గడుపుతీఁపిచేత సంబంధము బొత్తుగా వదలుకొనుట కిష్టములేక జయరాముని యొద్ద నున్నపక్షమున నెప్పటికైన నానకు బుద్ధి తెచ్చుకొని బాగుపడి తనదగ్గఱ వచ్చుటకవకాశముండుననితలంచి యప్ప బావయొద్దకుఁ బొమ్మని పుత్రున కానతిచ్చెను. రాయబులారు నానకును మిక్కిలి గౌరవింపవలసినదనియు వానికిఁ జూపిన యాదరము తనకుఁ జూపిన యాదరముగ నెంచుకొందుననియు జయరామునకొక జాబువ్రాసి నానకుచేతి కిచ్చెను. అది పుచ్చుకొని నానకు విషాదపూరిత మనస్కుఁడై సుల్తానుపురమునకుఁ బోయెను. ఎంతవారికైనఁ దలిదండ్రులను, జన్మస్థానమును విడుచుట కష్టముగదా? జయరాముండు లోకముతోడి పాటువాఁడు కాఁడు గావున వాని కవిష్టమగుజా బవసరమేలేదు. జయరామునికంటెను వానిభార్య నానకి సద్గుణములదాంతి యగుటచేతను నామె కున్నంత సోదరప్రేమ సాధారణము । లోకమునందెవరికి నుండకపోవుటచేతను నానకుఁ డిలువెడలిన తోడనే సుఖపడుకాలము వచ్చినదని మనము నమ్మవచ్చును. బలుఁడను కాఁపుకుఱ్ఱవాఁడు మొదటినుండియు నానకు బరమభక్తుఁడు అందుచేత వాఁ డయాచితముగఁ దలిదండ్రులను గృహమును విడిచి నానకువెంటఁ బోయెను. పోయి యొక్కనాఁడైన సుఖింపక గురువుతో గలిసి యెన్నోయిడుమలఁ బడెను.

ఇల్లువిడిచి మైదుదినములు పయనముచేసి నానకు సుల్తానుపురము చేరెను. అక్కయు బావయు గనుఁబరమానందమునొంది వానిని మిక్కిలి గౌరవించిరి. జయరాముఁడు మఱుఁదిఁజూచి నీవుయిచ్చవచ్చినట్లు భగవధ్ధ్యానముచేసికొనుచుఁ. గూర్చుండవచ్చు నీజోలి

కెవ్వరు రారని స్పష్టముగఁ జెప్పెను. అంతటి యాదరముఁ జూపినం దుకుఁ దనయప్ప భావకుఁ గృతజ్ఞుఁడై వందనములుచేసి "చిరకాలము మీకు నేనుభారముగానుండ" నని తనయాత్మగౌరవము వెల్లడియగు నట్లు బలికెను. తన యునికి భావకు భారముగానుండునని తలంచి నాన కావిషయముగాఁ బలుకలేదు. పడిపల్లెలింటికిఁ బోవుచున్న స్నేహితుని యింటికిఁ బోవుట మంచిదను సామెతనుబట్టి పాటుపడక సోమరియై యక్క సొమ్మున్నదని యాత్మగౌరవముం జంపుకొనుటయనార్యకృత్య మని యెఱింగి యాతఁడిట్లుపలికెను. ఆయూరఁ జేరినదిమొదలు నాన కేదో యుద్యోగము సంపాదించుకొని సొంతపాటువలనఁ బొట్ట పోసుకొని తన సేవకుఁడగు బాలుని బోషింపవలయునని నిశ్చయించు కొనెను. నానకు పనిలోఁ బ్రవేశించుట విజయరామున కంతగానిష్ట ము లేకపోయినను దోఁబుట్టువు సొమ్మునిచ్చుట నానకున కిష్టములేదని గ్రహించి యట్టియాత్మగౌరవముండుట మంచిదేయని భావించుట చేతను నానకున కెదురాడుట కిష్టము లేకపోవుటచేతను మఱేదియిష్ట ప్రకారము పోవఁదలఁచి యతఁడు పనికొఱకుఁ బ్రయత్నించెను. అప్పుడే దౌలత్ఖానులోడీ స్థాపించిన ధాన్యపుఁగొట్టుమీద గుమా స్తా కావలసివచ్చెను.

ఆపనిలోఁ బ్రవేశించుటకు నానకు సమ్మతించెను. అంతకు మునుపు నానకు మంచకొడిగఁ గూర్చుండి యెవ్వరితో మాటలాడక నెల్లప్పుడు పరధ్యానముగ నుండుచువచ్చినందున నుద్యోగములోఁ బ్రవేశించినతోడనే కొంతమాంద్యము వదలుననియుఁ గొడుకు వ్యా పారములోఁ బ్రవేశించినాఁడని విని కాలుఁడు పరమానందమొంది తనయెడం గృతజ్ఞుఁడగుననియుఁ దలంచి జయరామునకు మరఁది సంకల్పమును గొనియాడి యావార్త భార్యకెఱిఁగించెను. నానకి తమ్ముని వార్త పతిముఖమున విని బాలుఁడంత యాకస్మికముగ

నెట్లుమాటిపోవునని విచారించి సోదరీగృహమునుండి కాలముబుచ్చుట కిష్టములేక సోదరుఁడట్లు తలంచెనేగాని స్థిరబుద్ధిగలిగి యామాటకు నిలువంబడియుండఁడని భర్తతోఁజెప్పి యంతట నిలువక తమ్ముని బిలిచి "నాకు నీవుభారముగా నుండవు. నాకుఁ గావలసిన పదార్థము లన్నియు నున్నవిగావున నానిమిత్తము నీవీపనిలోఁ బ్రవేశింప నక్కఱలే"దని స్పష్టముగఁ జెప్పెను. ఎంత చెప్పినను నానకు తన యుద్యమమును విడువనందున నానకి వానియుద్యమమున కొప్పుకొనియె. పిమ్మట సతీపతులిరువురుఁ జేరి గుదికట్టవంటి సంసారబంధమును నానకు మెడకు తగిలించినచోఁ నతఁడత్యాసక్తుఁడుగాక యుండునని నానికచిరకాలమున వివాహముచేయ నిశ్చయించిరి. కొడుకుద్యోగములోఁ జేరినవార్త కాలుఁడు విని వర్ణనాతీతమైన యానందము నొంది కొడుకింక బాగుపడి తీరునవియు ముందెంతవాఁడో యగునని యు నాట లూరఁబొచ్చెను.

నానకు విక్రమార్క శకము 1544 వ సం॥రము మాఘశుద్ధాష్టమినాఁడు సుల్తానుపురముఁ జేరి కొన్ని దినములలోనే యుద్యోగమునఁ బ్రవేశించెను. గోలతుఖానలోడీ క్రొత్తగుమాస్తాచేతికి ధాన్యపుకొట్టు స్థాపించునిమిత్తము మొదట వేయిరూపాయలిచ్చెను. నానకుయొక్క పూర్వచరిత్ర మెఱిఁగినవారు వాని స్వభావమున కంత విరుద్ధమైనపనిలో నెట్లుప్రవేశింపఁగలిగెనో యని యచ్చెరువడఁ జొచ్చిరి. మాయామర్మము లెఱుఁగని బలుఁడును నానకు లౌకిక వ్యవహారములందుఁ బ్రవేశించుచున్నవాఁడు గావునఁ దన సాయమంతటినుండి యక్కఱలేదనుకొని స్వగ్రామమునకుఁ బోవుటకుఁ దనకు సెలవిమ్మని నానకునడిగెను. నానకు వాని వెంగలితనమునకుఁ జిఱునవ్వు నవ్వి యిట్లనియె. "ఓయీ! మోసపోకుము. నే నెట్లు కాఁదలఁచినవాఁడనో యట్లయితీరుదును. దానికి నాకు నడుమ నేదియు

వద్దను రాఁజాలను. ప్రస్తుతము కాలక్షేపమునిమిత్తము కొన్నినాళ్ళు పనిఁ జేయఁబూనితినే కాని యిది నాపరమార్థము కాదు. సమయము వచ్చినప్పుడు మనమిద్దఱముఁ గలిసియే పోవుదము. కావున నీవు నా యొద్దనే యుండుము." అప్పలుకులు వినినతోడనే బలుని సందియములు తొలంగెను. తొలంగకపోయినను నానకుమీఁద వానికి మిక్కుటమగు ప్రేమ యుండుటచేత నతని కోరికప్రకారము వాఁ డచ్చట నుండవలసినవాఁడే.

నానకు వ్యాపారము రెండు నెలలు చేయుచున్నప్పటికిఁ గుమారుని నొక్కసారి యుద్యోగము చేయుచుండఁ జూడవలయునని యుబలాటపడి కాళుఁడు స్వగ్రామమును ముఖ్యస్థుమీఁద నుంచిన నష్టమేమి యుండదోఁచక సుల్తానుపురమునకుఁ బోయెను. పోయి కొట్టుమీఁద నెదురుగాఁ గూర్చుండి వ్యాపారము సేయుచున్న కొడుకుం జూచి పట్టఁజాలని సంతోషమొంది వ్యవహారమెట్లు జరుగుచున్నదో తెలియఁగోరి కొడుకువ్రాసిన లెక్కలు పరీక్షించెను. పరీక్షింపఁగా వచ్చినలాభములోనొక గవ్వయైన నిలువయున్నట్లు వానికిఁ గనఁబడలేదు. అయినను గాళుఁడు కొడుకు నేమియు ననక కాలక్రమమున నవియు జక్కఁబడునని తలంచి ప్రస్తుతము కొడుకు కొట్టుమీఁదకు వేళకు వచ్చి వ్యాపారముచేసి వేళ కింటికిఁ బోవుచున్నాఁ డదియే చాలు నని సంతోషించెను.

నానకీ జయరాములు నానకునకు వివాహము జేయఁ గృతనిశ్చయులైన ట్లిదివఱకే చెప్పియున్నారముకదా? జయరాముం డాసంకల్పము నెఱవేఱువఱకు సరిగఁ గుడువక నిద్రింపక చుట్టుప్రక్కల గ్రామములకుఁ దడిమన్ను పొడిమన్నగునట్లు దిరిగి ప్రయత్నించెను. అట్లు ప్రయత్నించుచుండ నొకగ్రామమున మూళుఁడను నొకక్షత్రియునియొద్దసంప్రాప్తయౌవనయైవివాహయోగ్యయగుకన్య యొక తె

యున్నదని వానికిం దెలిపెను. అల్లుఁడామాట మామకు నెఱిగింపఁ గాళుఁడు మూళునితో వియ్యమందుట కియ్యకొని ప్రధానము చేసి కొని రమ్మని జయరామునితోఁ జెప్పెను. ప్రధానము యథావిధిగా జరిగెను. వివాహ సుముహూర్తము నిశ్చయింపఁబడెను. కాళుఁడు పెండ్లి పనులను జేయింప స్వగ్రామమునకుఁ బోయెను. ప్రధానమైన యొక మాసమునకు జయరాముని యొద్దకుఁ గొందఱుపోయి నానకు ధాన్యపు కొట్టు సంబంధమగు లాభమును మూలధనమును సాధువులకు సన్న్యాసులకు నిచ్చివచ్చినట్లు దోఁచిపెట్టి పాడుచేయుచున్నాఁడనియు దానివలన బావమఱఁదులకిద్దఱకు నపాయము వాటిల్లుననియుఁ జెప్పిరి. ఆమాటలు విని జయరాముఁడు తన ప్రాణముమీఁదికి వచ్చునని భయపడి కర్తవ్యమేమని భార్యనడుగ నామెయుగని తెలివిగల భీతిల్లక తనతమ్ముఁడు లోకవ్యవహార మెఱుఁగనివాఁడు కాఁడనియు నతఁడెంతధర్మాత్ముఁడైనను నీతిసంపన్నుఁడగుటచే నితరులధనము చేతికివచ్చినట్లు వమ్ముచేయఁడనియు దృఢముగఁ జెప్పి వాని వెఱపుఁ దీర్చుటకుఁ దమ్ముని బిలువనంపి క్షేమమడిగి యిష్టాగోష్ఠి కొంతసేపు నడపెను. అదియే మంచిసమయమని జయరాముఁడు వినయముతోడను శాంతముతోడను మఱిదిం బలుకరించి యంగడివ్యవహార మేరీతిం జరుగుచున్నది. లాభనష్టము లెట్లున్నవని యడిగెను. నానకు బావనోటనుండి యప్పలుకులు వెడలినలోడనే కంఠస్వరమునుబట్టియు ముఖలక్షణమునుబట్టియు వానికిఁ దనమీఁద నేదో యనుమానము కలిగినదని గ్రహించి తన్నొకరనుమానించుట కిష్టపడక తననిరపరాధత్వమును వెల్లడిచేసికొనఁదలఁచి తక్షణము లెక్కలు పరీక్షసేయుమని బావను గోరెను. నానకియు వానిమాటనే యనుసరించుటచే జయరాముఁడు వాని లెక్కలు శోధించెను. ఏమిచెప్పఁగును! లెక్కలుచూడఁగాఁ బెట్టుబడిసొమ్ము దౌలతుఖానుగారి లాభము నిలువయుండుటయే గాక

నానకునకు మూఁడువందల యిరువది రూపాయలు లాభమాసియుండెను. అది చూచి యక్కయు బావయు మిక్కిలి యానందము నొందిరి. కాని తనమరిదియుఁ దన న్యాయబుద్ధియుఁ బాటింపక నిష్కారణముగ వారు తనమీఁద ననుమానము నొందినందులకు నానకు మిక్కిలి నొచ్చుకొని మనఃఖేదమునొంది వ్యాపారము మాని పోవలయునని తలంచెను. కాని సోదరీభావుకులు చాలబలవంతము చేయుటచేతను వారిమాట గౌరవింపవలయునని బలుఁడు ప్రార్థించుటచేతను నిలువవలసి వచ్చెను. దౌలతుఖాను వానిసత్యసంధతకు మెచ్చి పెట్టుబడినిమిత్తము రెండువేలరూపాయల నిచ్చెను. కొట్టు క్రమముగ వృద్ధిపొందెను. నెలనెలకు రాఁబడి హెచ్చెను. ఈవృద్ధికి నానకు మిక్కిలి సంతోషింపఁ జొచ్చెను. కాని యాసంతోషము ఘనలాభమువచ్చుచున్నదని కాదు. మఱేమనిన సత్పురుషులకు సాధువులకు సన్యాసులకు దీనులకు దైవభక్తులకు సహాయముచేసి తనజన్మముసఫలము చేసికొనవచ్చునని యతఁడాయుద్యోగమునం దంతకాలముండెను. నానకుయొక్క యాత్మ జలమందుండియు జలసంపర్కము లేని తామరపూవువంటిది గదా!

తృతీయాధ్యాయము.

నానకునకు నానాఁటికి వ్యవహారములో లాభమధికముగ వచ్చెను. వచ్చినలాభ మంతయు సతతము మునుపటికంటె నెక్కుడుగ దైవభక్తులకు దీనులకు దానము చేయఁదొడగెను. అందుచేత గ్రామములోని జనులందఱు వానివర్తనముంగూర్చి తమలోఁ దాము చెప్పుకొన నారంభించిరి. కొందఱతని యౌదార్యమును మెచ్చుకొనిరి.

పత్రికలలో జరిగిన వివాహములకు విపరీతార్థములను గల్పించి నిం దింపసాగిరి. లోకులు పరమార్థము నరయక వినినదంతయు నమ్మ వారగుటచే నానకు యజమానునిధనమంతయు యథేచ్ఛముగ వ మ్మివేయుచున్నాఁ డని యభిప్రాయపడిరి. యజమానునిధనమే యి చ్చవచ్చినట్లు వ్యయము సేయుచుపోయిన పక్షమున నిద్దఱు మనుష్యుల కుఁ గావలసిన కర్చులే గాక సన్యాసులకు బిచ్చగాండ్రకు దోఁచి పె ట్టుటకు వీనికెక్కడనుండి సొమ్మువచ్చెనని లోకులు పలుకఁ జొచ్చిరి అవివేకములగు లోకులు నిశ్చయముగా దురభిప్రాయ పడిరి. ఏలయన నానకునకు వాని శిష్యులకును బాలుపకుఁ గావలసినభోజనపదార్థముల నిమిత్తమునకు వ్యయములు మిక్కిలి స్వల్పము. నానకు వేదాంతియగుటచే కేవలము మునగపోవలెనే పరిశ్రాన కార్యములుగఁ జేసికొనక యేదితినిన ను దినము వెళ్ళిపోవునని సామాన్యులు భక్షించు వస్తువులనే యుప యోగించుచును వచ్చెను. గంగ యన్నమంతో వానికిఁ బంచభక్ష్యపర మాన్నములు సరితూ. మధురాహారములు గ్రహించి తన పొట్టనింపి కొండలు పంపుటకు లేక సొమ్మునిర్ధనముగా వాడుకొని మిగిలినసొమ్మ సద్వినియోగమును జేయుట యుహాపరిసాధన మని యతండు నమ్మి జాగ్రత్తతో నుండెను. అట్టిమహానుభావులు తిండిపోతులుగా నుండరు గదా. అతఁడు చేయుదానములు మెరమెచ్చుల దానములుగాక య పాత్రదానములుగాక పేదలకు భగవద్భక్తులకు నీయఁబడిన సత్పా త్రదానములయ్యెను. గ్రామవాసులలో ననేకులు నానకుచేయు వ్య యములఁగూర్చి యత్యద్భుతముగాఁ జెప్పుకొనుచుండుట విని జయ రాముఁడు లోకులమాటలే నిశ్చయములైనపక్షమున నవాబు నానకు ను దండించుటయేగాక తనకుఁగూడ మహాపకారముచేయునని భయ పడి మఱఁది నడుగుట కిష్టములేక సందేహించుచుండెను. నానకు ను లోకులగోల విని బావమనస్సు సంశయాకలితమైనదని తెలిసికొ

నితనచరిత్రము నిర్దుష్టమని వెల్లడి సేయుటకును, నిందారోపకులకు బుద్ధిచెప్పుటకును, బావనుబిలిచి మునుపటియట్లె తనలెక్కలంబరీక్షిం పుమని కోరెను. జయరాముఁడు తనమనస్సులో ననుమానముగా నున్నట్లు నానకునకుఁ దెలియుట కిష్టములేనివాఁడగు యంగడిలో నేదోషమున్నదని మాత్రము మనస్సులో నభిప్రాయపడి లెక్కలు పరీక్షించుమని కోరినమాత్రముననే యందుకొయ్యకొని నానకును నవాబునొద్దకుఁ దీసుకొనిపోయి యాతని దర్శనముచేసి లెక్కలుపరీక్షిం పుమని కోరెను. నవాబు వానిమాటలువిని నానకును దనయెదుటికిఁ బిలిచి పేరేమనియడిగి పేరు తెలిసికొన్నపిదప జయరామునివంక దిరిగి వీనికి వివాహమయినదాయని యడిగెను. వివాహము కాలేదని జయరాముఁడు ప్రత్యుత్తరముఁజెప్ప విని నవాబు "అదిగో! అదేకారణము. వివాహము కాకపోవుటచేతనే యతఁడు మాసొమ్మిట్లు పాడుచేయుచున్నాఁడు. నీవు నాస్వభావ మెఱుఁగుదువుగదా. లెక్కలుసరిగానుండనిపక్షమున మీగతి యేమగునో చూచుకొనం" డని కఠినోక్తులు పలికెను. నానకు వానికఠోరభాషణము లాలకించి యించుకేని వెఱపునొందక "లెక్కలు చూపినపిదప మీయిష్టము వచ్చినట్లు చేయవచ్చును లెం" డని నిర్లక్ష్యముగ బదులుచెప్పెను. తనయంత వానియెదుట నానకు నిర్భయముగా నిర్లక్ష్యముగా నిశ్చలముగా నట్లుప్రత్యుత్తరము చెప్పుటచేత నవాబునకు మితిమీరిన కోపము వచ్చెను. ఆకోపము పైకి స్ఫుటము గాకముందే జయరాముఁడు వానిముఖలక్షణములు గనిపెట్టి మిక్కిలి వినయముగా జేతులుజోడించి నానకు గొప్పవారి దర్శనము లెన్నఁడుఁ జేయని పల్లెటూరువాఁ డగుటచేత మర్యాదలు తెలియక యట్లు వచించెనే కాని యనుమానింపఁ దలంచుకొన లేదనియుఁ దనయం దేదోషమును లేదని నమ్మి యంత విస్పష్టముగాఁ బలుక సాహసించెననియుఁ బ్రి

థమదోష మగుటచే క్షమియింపఁ దగు" ననియుఁ బలుతెఱంగులఁ బ్రార్థించెను.

ఆవేఁడికోలు విని దయాళువగు నవాబు తనకోటలో నున్న యదురావను మంచి లెక్కగానిని పిలిపించి యంగడిలెక్కలు శోధింపుమని యానతిచ్చెను. యదురావు మిక్కిలి జాగరూకతతో నైదు దినములు లెక్కలు పరీక్షించెను. నవాబుపెట్టిన పెట్టుబడియు, దాని మీఁదవానికి రావలసిన లాభమునుగాక 321 రూపాయలు కొట్టులో నిలువయున్నట్టు పరీక్షవలనఁ దేలెను. నానకు తననిమిత్తము దాన ధర్మముల నిమిత్తము వ్యయముచేయఁగా నతనివంతు మిగిలినసొమ్మది. అదిచూచి జయరాముఁడు ప్రాణప్రాణములు దక్కెననుచు మిక్కిలి సంతోషించి మఱునాఁడు నవాబు దర్శనమునకుఁ బోయెను. అదివఱకే యదురావువలన లెక్కలపరీక్షనుగూర్చి నవాబు వినియున్నందున జయరామునిఁజూచి యతఁడు "నీవు బందిపిూఁద నీవిధముగ వాడుకలు కలుగుటకుఁ గారణ మే" మని యడిగెను. అప్పుడు జయరాముఁ డిట్లనియె. "లోకములో నెంత మంచివారి కయినను శత్రువులుండక మానరు కదా? అట్లు మానానకుమీఁద గూడ గిట్టనివారు కొందఱున్నారు. ఇదియంతయు నామహాత్ముల సృష్టియేకాని మావానిలోప మేమియులేదు." పరీక్షానంతరమున నవాబు నానకు మీఁద నెక్కువ విశ్వాసముఁ గలవాఁడై మునుపిచ్చిన సొమ్మునకుఁ దోడుగఁ బెట్టుబడికిఁక్రింద మఱి మూఁడువేలరూపాయలనిచ్చి వ్యాపారము నెక్కుడుగ సాగింపుమని చెప్పెను. నానకు నిర్దోషియని తెలిసినప్పుడు జయరాముఁడు వానిభార్యయు నొందిన యానంద మింతింతయని వర్ణింప నలవికాదు. ఆపరీక్షవలన నవాబునకు నానకు మీఁద నమ్మిక హెచ్చుటయేగాక జయరామునిమీఁదఁ గూడ నధిక గౌరవము గలిగెను. కుటుంబమువిడిచిన కొడుకొట్టఁ చనుకొ

న్నది పూలదండ యయినట్లు భానమఱఁదుల నిద్దరిపయి నలిగి వారిం జెరుపఁ దలఁచిన నవాబు పరమాప్తుఁ డగుటచే నానకుమీఁద నిందలు మోపిన శత్రువులు సిగ్గుపడి నోళ్లు మూసికొనవలసినవారైరి. నానకుమేలునే గోరునట్టి బరమమిత్రులు సంతోషపరవశులైరి. తన కుమారుఁడు బుద్ధిహీనుఁ డనియుఁ గులగౌరవము నిల్పలేఁడనియుఁ గొఱమాలినవాఁడనియుఁ దలంచి వానిఁ గంటకించి వెడలనడచిన కాళుఁడు పుత్రుని మితవ్యయము నిర్లోభిత్వము నవాబునకు వానిపై దయ గలుగుట మొదలగువార్తలు విన్నప్పుడు పొందిన సంతోష మనుభవైకవేద్యమేగాని వర్ణనాసాధ్యము. మొదటినుండియు నానకు మహాత్ముఁడగునని నమ్ముచుండి రాయబులారు దానిని విని యెంతో సంతోషించెను.

ఒకనాఁడు సాయంకాలము జయరాముఁడు భార్యయు నానకునుగూర్చి మాటలాడుకొనుచుండఁగ నతఁడే వచ్చి వ్యాపారములో తనవంతువచ్చిన లాభమంతయుఁ దెచ్చి దాఁచుఁడని వారిచేతి కిచ్చెను. అక్కడకుఁ దమ్మునిమీఁద నపవాద మెన్నఁడును లేకపోయినను లోకులుచేసిన నిరాపనిందల కామె మనఃఖేదమునొంది పరీక్షానంతరమున నిష్కళంకుఁడై వచ్చిన సోదరుని బహువిధములఁ గారవించెను.

నానకు గుణవంతుఁడై ధనసంపాదకుఁ డగుటచేత స్వకుటుంబ భారము వహింపఁగలఁడు గావున వానికి వివాహము శీఘ్రముగఁ జేయుట యుచితమని సోదరీ భావుకలు తొందరపడిరి. అటయునుఁ గాక సంసారబంధమునందు వానిని బిగియబెట్టినచో నతఁడందే తవుల్కొని యన్యవిషయమునుండి మనస్సు మరల్చి బాగుపడునని వారెంచిరి. యీవఱకే వానికొక సంబంధము కుదిర్చిరని మన మెఱుఁగుదుముగదా! జయరాముఁడు నానకునకుఁ బిల్లనీయఁదలఁచిన మూ

ఘునిని పేర ముహూర్తః నిశ్చయము సేయుమని జవాబులువ్రాసెను గాని మూళుఁడు వివాహమునకుఁ గావలసిన సంబారములు తనకు సమకూడలేదని కొంతయాలస్యముఁజేసి యెట్టకేలకు భాద్రపదబహుళ సప్తమిదినమున సుముహూర్తము నిశ్చయించి వివాహమునకుం దరలి రమ్మని వ్రాసెను. కాలుఁడు సకుటుంబ పరివారముగా సుల్తానుపురమునకుఁ బోయి యటనుండి పెండ్లికొడుకును జయరాముఁడు మొదలగు చుట్టములను దోడుకొని తరలి పోయెను. వియ్యంకుఁడు వియ్యాలవారిని దనస్థితికిఁ దగినట్లు గౌరవించెను. వివాహమహోత్సవము మూఁడుదినములు జరిగెను. నాలవనాఁడు కాలుఁడు పెండ్లికూఁతురును వెంటఁ బెట్టుకొని సపరివారముగ బయలుదేరి సుఖముగ సుల్తానుపురముఁ జేరెను.

పెండ్లికూఁతురుపేరు సల్లఖి. అత్తవా రెందుచేతనో తల్లిదండ్రులు పెట్టినపేరం బిలువక చూనియని యామెను బిలుచుచువచ్చిరి. సుల్తానుపురమునకు వచ్చినపిదపఁ గాలుఁడు కొడుకునుం గోడలి స్వగ్రామమునకుఁ దోడ్కొని పోవఁదలఁచెను. తల్వొండి గ్రామమునకుఁ బోవుటకు నానకున కిష్టములేదు. ఆకారణముచేత జయరాముఁడు, నానకియుఁ దాని కంగీకరింపరైరి. కాని కొందఱుపెద్దలు నానకుయొక్క తల్లివివాహమునకు రానందున కొడుకుంగోడలు కాఁపురము చేయుచుండ నామె కన్నులు చల్లగ చూడఁగోరుననియు నొక్కనెలయైన నామెకడనుండుట యుచితమనియు నుపదేశించిరి. ఆయుపదేశముంబట్టియుఁ దల్లిమీఁదఁగలగౌరవముంబట్టియు నానకుస్వగ్రామమునకుఁబోవ నిష్టపడి భార్యాసమేతుఁడై తండ్రితోఁగూడ జనియెను. అతఁడు వచ్చువఱకు నంగడిపని బలుఁడు చూచుటకొప్పుకొనెను. వివాహదీక్షితుఁడై కళ్యాణవేషముతోనున్న కుమారుఁడు ధర్మపత్నిసమేతుఁడై తల్లిపాదములకు నమస్కరింప త్రిప్తాదేవి కొడుకుం

గోడలిఁ గౌఁగిలించుకొని యానందబాష్పము లనియెడి ముత్యాలసేన
లు వారిపైఁ జల్లెను. నానకు రాక విని చుట్టములు నెచ్చెలులు పరిచి
తులు వానిం జూడవచ్చి యతఁడు మంచివృత్తిలోఁ బ్రవేశించినం
దుకు ధనముసంపాదించుచున్నందుకు జాల సంతసించి కొనియాడిరి.
కొడుకక్కడనున్న నెల దినములలోఁ దండ్రి సహజముగఁ గలిగినఁ
డయ్యామర లనేమి సాహసము పుట్టునో యను భయమున నేమియు
ననక నడుమనడుమ నెవరితోనో యన్నట్లు "ధనము సంపాదించుట
మంచిది. ధనము లేనివారి నెవరుఁ జూడరు. దుస్సాహసములు
చేయఁ గూడ" దనుచు నెమ్మదిగఁ గాలము వెళ్ళబుచ్చెను. ఆమా
సము ముగిసినపిదప నానకు భార్యాసమేతుఁడై సుల్తానపురమునకుఁ
బోయి యెప్పటియట్ల తన పనిలోఁ బ్రవేశించెను. పుట్టినింటివారు
చూనీదేవిని మరల స్వల్పకాలములోనే పంపుదుమని చెప్పి తీసికొని
పోయిరి.

చతుర్థాధ్యాయము.

ఇరువదియేండ్లయిన నిండకముందే నానకు గృహస్థుఁడయి
సంసారభారము వహించెను. కాని యీ పెండ్లి వానిజీవనము సుఖా
స్పదముగఁ జేయుటకు మారు దుఃఖభాజనముగఁ జేసెను. చూనీదేవి
కోపశీల, గర్వసమేత. ఒరులపై నధికారము చేయనిచ్చకలది. ఆమె
జనకుండగు మూలుఁడు కాలుని యబ్బ. వాక్పారుష్యమునందు
ధనాశయందు మనఃకాఠిన్యమునందు వియ్యంకు లొండొరులకుఁ దీసి
పోరు. చూనీదేవితల్లి నానకుతల్లివంటిది గాక భర్తగుణములను
వన్నెవెట్టుచు ననుకూలదాంపత్యమని లోకులు చెప్పుకొనునట్లు
నడచెను.

అట్టి జననీజనకుల కుద్భవించినందున చూనీ దేవి తల్లిచాలు బిడ్డయుఁ దండ్రిచాలు బిడ్డయు నయ్యెను. తల్లిదండ్రుల గుణములు ప్రతిబింబములట్లు బిడ్డలయందు గానబడుచుండును గదా! తల్లి మంచిది కానప్పుడు తండ్రి మంచివాఁడగుట యో తండ్రి యోగ్యుఁడు గానప్పుడు తల్లి యోగ్యురాలగుట యో తటస్థించునేని బిడలొక వేళ సుగుణవంతులు గావచ్చును. భార్యాభర్తలిద్దఱు దుస్స్వభావులయినప్పుడు బిడ్డలు సాధుశీలురగుట యరిది. అయోగ్యులగు జననీజనకులకుద్భవించినను బిడ్డలు జన్మించినది మొదలు సజ్జనులచేఁ బెంపఁబడుదురేని వారికి సద్గుణములలవడవచ్చును. అట్లుగాక యవివేకులగు మాతాపితలకుఁ బుట్టి వారికడనే పెరిఁగిన బిడ్డలమాట వేఱే చెప్పవలయునా! చూనీ దేవి గయ్యాళితనమునఁ దల్లిదండ్రులను బోలినదంతేగాఁ బ్రతిదినము మగఁడు గృహమునకు వచ్చినప్పుడు పిల్లి మీఁదఁ బెట్టి యెలుక మీఁద బెట్టి సణుగుచు నదిలే దదిలేదని కేకలు వేయుచుండును. అంతియేగాక గృహకృత్యములకుఁ గావలసిన సంబారములు సరిగ సమకూర్చుట లేదనియు సంపాదించిన ధనమంతయు బైరాగులకు బావాజీలకుఁ బెట్టి సంసారము గుల్ల చేయుచున్నవాఁడనియు, నుదయాస్తమయములు మగనిని సాధించుచుండును. సంపాదించినధనములోఁ దల్లిగవ్వయైన వెచ్చబెట్టక తనయిచ్చవచ్చినట్లు వ్యయముచేయుటకుఁ దనయధీనము జేయుమని పోరుచుండును. తానెంత పోరుపెట్టినను భర్త తనమాట రవ్వంతయు లక్ష్యము సేయనందున నామె తనపంతము నెగ్గించుకొనుటకుఁ బలుమాఱు తల్లిదండ్రులకుఁ దనకష్టములఁ దీర్చరమ్మని వర్తమాన మంపుచుండెను. పంపుటయే తడవుగ వానియత్తమామ లిరువురు కూఁతురు మిక్కిలికష్టపడుచున్న దనుకొని యల్లునియింటికి వచ్చి తమకూఁతు రష్టకష్టములు బడుచున్నదని కళ్లుబొల్లి గొప్పలేడ్చి "యెన్నఁడు బుద్ధి తెచ్చుకొని బాగుపడుదువు నాయనా?" యని యల్లునిమీఁదఁబడి రక్కసులవలె

వానిని బాధించుచు వచ్చిరి. సహజముగ శాంతశీలుఁడయి వాక్పా రుష్యమన్న మిక్కిలి యసహ్యపడుచు నిరంతరము మనశ్శాంతినే గోరు నానకు, ఆలిపోరునకుఁ దోడుగ నత్తమామలపోరుగూడ సంభవించుటచే మనస్థిమితము లేనివాఁడయి చాల దుఃఖపడుచు వచ్చెను. ఒకప్పు డత్తమామలపోరుఁ బడలేక మామయింట నన్నవస్త్రముల లోపము లేదాయని యడుగుచుండెను. అందుకాతని యత్తమామలు మిక్కిలి కినిసి "అన్నవస్త్రములున్న చాలునా, మఱేమియు నక్కఱ లేదా? నగలుండవలె నాణెములుండవలె. సంసారము చేయుచున్నప్పు డెన్నో యుండవలెను. కాలువచ్చినఁ జెయివచ్చిన నింటఁగూర్చుండి సుఖముగఁ దినుటకుఁ గొంతసొమ్ము నిలువయుండనక్కఱలేదా? నీసొమ్ము దినుచున్న గోసాయిలు సన్యాసులు నీకాపత్సమయమున నక్కఱకు వత్తురని తలంచుచున్నాఁడవు కాఁబోలు! పోనీ మఱియు నెట్లుఁగాని మాపిల్ల యట్టి యాపత్సమయము వచ్చినచో నిరాధారముగ గంగలోఁ దిగవలయును" అని స్పష్టముగఁ బలుకుచు వచ్చిరి. కర్ణకఠోరములగు నప్పలుకులు వినినప్పుడు నానకుమనస్సు మిక్కిలి ఖేదము నొందు "మామయూరికి మాయత్తవారియూరికి, నిప్పుడున్న దూరముకంటెను, బదరీకేదారముండిన మాకుగుడును గదా. దూరముండినపక్షమున వీరు తఱచుగ వచ్చి నన్ను బాధింపకుందురుగదా" యని తలంచుచుండును. అల్లునియూరికి మామయూరికి దూరముండుట మంచిదని యెఱిఁగియే కాఁబోలు శాస్త్రకారకులు సయితము "గృహస్థులు పూర్వోత్తర దూరపు దేశములనుండు వచ్చువారి కియ్యవలయును" అని శాసించిరి. నానకునకు గృహము సుఖప్రదమగుటకుమాఱు దుఃఖభాజనమయి నందున నతఁ డింటనుండినప్పుడు ముండ్లకంపమీఁద నుండినట్లుండి మెదుకులు నోటవేసుకొని యావలకుఁ బోవుచుండును. సోదరీగృహమునకుఁ బోవఁదలఁచిన వానియత్త యామయింటికిఁగూడ బోయి

యల్లునిమీఁద విధివిరామము లేక నేరములు చెప్పుచువచ్చెను. నానకి నాధుశీల యగుటచేఁ దనసోదరుఁడు యోగ్యుఁడని యామె యెఱింగియుండియు నాగయ్యాళిగంపనోటికి వెఱచి యేమియు ననక యూరకుండును.

వేయిమంది పసుచుపడఁతులైనను నానకి యత్తగారి యెదుట నిలువలేరు. అట్టియామె యెదుట పరమసాధ్వియగు నానకి నిలిచి యేమిప్రతిఘటింపఁగలదు! స్వగృహమునందుఁగాని సోదరీగృహమునందుఁగాని యించుకేనియు మనశ్శాంతినొందుటకు వీలులేక నానకు దుఃఖమే యిల్లుచేసికొని దినమునందెనిమిదిజాములలోఁ జాలభాగ మక్కడనే గడుపుచు వచ్చెను. అతనికి బలుఁడు సహాయుఁడు; బలునకతఁడు సహాయుఁడు. ఆతఁ డొంటిగఁ గూర్చున్నప్పుడు మనసులో ననేకాలోచన లొకదాని వెంబడి నొకటి తోఁచుచుండును. భార్య దుఃఖహేతువు. సంసారము దుఃఖహేతు వని పెద్దలు చెప్పుమాటలు వానికి జ్ఞప్తికి రాఁగా నతఁడు మాటిమాటికి మెడకు గుదికట్టయ్యెఁ సంకిలియు నగు నీవివాహమేల చేసికొంటి నని విచారించుచు దృఢమైన యీబంధమును తెంపుటకు సమయమును నిరీక్షించుచుండెను. అట్లు నిరీక్షించుచుండగానే యనేక సంవత్సరములు గడచెను. అతని కప్పటికి ముప్పది మూఁడవయేఁడు. వివాహమై పదునాలు సంవత్సరములాయెను. అతని కిద్దఱు కుమారులు జన్మించిరి. అతని ముప్పది రెండవయేఁట మొదటికుమారుఁడు పుట్టెను. ఆకుమారుని పేరు శ్రీచంద్రుఁడు. మఱి నాలుగేండ్లకనఁగా ముప్పదియాఱవయేఁట రెండవ కుమారుఁ డుదయించెను. అతని పేరు లక్ష్మీదాసు. అట్టియవస్థలలో నానకుజీవితమందు గొప్పమార్పొకటి జరిగెను. ఆమార్పు వానిని సంపూర్ణముగ మార్చివేసెను. భార్యాబంధమే త్యజింపనలవిగానిది. అట్టియెడ సంతానముచేత మఱింత దృఢమైన యీబంధమును నానకు

తృణప్రాయముగ ఛేదింపఁగలఁడని లోకులెవ్వరుఁ దలంపలేదు. వాని శత్రులు, మిత్రులుగూడ నానకు సంసారబంధమునం దగులుకొన్నాఁడు. వానిబ్రహ్మవిద్యయంతయు నటుగంటినదని బహిరంగముగ ననుకొనుచుండిరి. అట్టి సమయమున నానకు సర్వసంగపరిత్యాగి యై యెల్లవారల నద్భుత మొందఁజేసెను. రెండవకుమారుఁడు పుట్టినయాఱుమాసములకు నానకొకనాఁ డొకచోట నొంటిగఁ గూర్చుండి దీర్ఘాలోచనము చేయుచుండ వానికడకొక పకీరు వచ్చెను. ఇరువురు గొంతసేపు భగవద్విషయికమైన చర్చచేసిరి. ఆసంభాషణము ముగిసినవెనుక పకీరు నానకుతో నిట్లనియెనఁట. "నానకూ! నీవు చేయుచున్న పనియేమి? నీజీవితముయొక్క పరమార్థమిదియేనా? నీవు చేయవలసిన యుత్కృష్టకార్యమునకు నీవిప్పుడు గడుపుచున్న దేహయాత్ర యనుకూలమై యున్నదో లేదో చూచుకొనుచున్నావా?" ఆపలుకులు నానకుమనస్సుమీఁద నెంతో పని జేసి వానిని విరక్తిమార్గమునకుం ద్రిప్పెను. త్రిప్పుటయు నతఁడు పకీరుతో నిట్లనియెనఁట. "భగవంతుఁ డంతయు సరిగా వచ్చునట్లు నడపించును" ఆపలుకులు పలుకునప్పుడు నానకు మనసార నేదోచేయుటకుఁ గృతనిశ్చయుఁడైనట్లు కనఁబడెను. అదిగ్రహించి పకీరు సంతసించి తన దారింబోయెను.

అపకీరుతోఁ బ్రసంగముజరిగిన యెనిమిదిమాసముల కొకనాఁడు తెల్లవాఱుజామున నానకు దాపుననున్న యేటి కెప్పటియట్ల స్నానమునకుఁబోయి తిరిగి గృహమునకురాక యదృశ్యుఁ డయ్యెను. అతని యదృశ్యత యాలుబిడ్డలకు సోదరీ భావుకలకు జాల భయము గలిగింప వారు వానినిమిత్తము గ్రామము పొలిమేరలు వెదకించిరి. కాని యతండెందుం గానఁబడఁడయ్యె. ఆయనను గనిపెట్టి వానికి గిట్టనివారు నానకు నవాబుసొమ్ము హరించి యాపదవచ్చునను భయ

మున నెక్కడికో పాఱిపోయెననియు గుఱ్ఱపువాఁడగుటచేత నట్లు చేసెననియు నపవాదములు వేయఁజొచ్చిరి. ఇట్లు పగవారు చెప్పుకొనుచుండ నేమికారణముననో మరల నానకు మూఁడవనాఁడు స్వగ్రామమునకుఁ బోయెను. అతనిం జూచి నిరాపనిందలు మోఁపిన కుత్సితస్వభావులు తమపలుకులు కల్లలయ్యెనని తలవంచుకొనిరి. నానకు చిన్న గోచిమాత్రము పెట్టుకొని దిగంబరుఁడట్లు యుండెను. స్వగృహమునకుఁ గాని సోదరీగృహంబునకుఁ గాని యతఁడు పోవక యూరక నిందందుఁ దిరుగఁజొచ్చె. గ్రామవాసులు వానియవస్థఁ గనుఁగొని "వానికి మతి లేదు. పిచ్చియెత్తెను" అని కొందఱు దయ్యమేదో పట్టి యట్లు వేధించుచున్నదని కొందఱు బలుకఁజొచ్చిరి. నానకు మహాత్ముఁగ సద్భక్తుఁడయ్యెనని విని నవాబు వానికిఁ బూటకుఁడగు జయరామునిం బిలుపించి లెక్కలు పరీక్ష సేయింపుమని యాజ్ఞాపించెను. జయరాముఁడు నానకును గూడ వెంటఁబెట్టుకొని నవాబునొద్దకుఁ బోయెను లెక్కలు మూఁడుసార్లు పరీక్షింపఁబడెను. కాని కడచిన రెండుసార్లవలెనే నానకు నిర్దోషియని తేలుటయేగాక యతని వంతు రు 760లు రావలసి యుండెను. పరీక్షానంతరము నవాబు నానకున్యాయబుద్ధికి సంతోషించి మరల దనకడ నుండుమని యడిగెను. నానకు తనకుద్యోగ మక్కఱలేదని తనకు రావలసిన ధనము పేదలకుఁ బంచి పెట్టుమని చెప్పెను.

నానకు చాలకాలము గృహస్థుఁడై భార్యతోఁ గాఁపురము చేసి సంతానముంబడసి సంసారబంధములు మఱింత బిగిసినవెనుక వయసు కొంత ముదిరిన పిదప విరాగియై యాలుబిడ్డల విడచి నిస్పృహుఁడై భగవద్ధ్యాన పరాయణుఁడగుట జాలమంది కాశ్చర్యము గలిగించును. కాని యిందాశ్చర్య పడవలసిన దేమియులేదు. ఏలయన నానకుయొక్క గృహస్థాశ్రమము వాని నుత్తమగతి నొందించు

శ్ర

భగ

చేత

శౌచ

ను.

వారి

వెడలఁ

తమగు స

డును. నా

యా తను

చిత్తము నిష్క

పాదించినప్పుడు భ

ముచేయుచువచ్చెను.

నైయుండునుగదా! పూ

మందున్నపుడె మోహపాశబ

ముగలవాఁడనియుఁ, బ్రమ

మనము గ్రహింపవచ్చును. అట్టి

చినతోడనే యతఁడు సంసారము

మూఢుఁడు తనయుల్లుఁడు విరాగిగను

విషాదమంది పెనుగడఁచిన వాని చందమునఁ దూలుచు

య్యెను. తెలివివచ్చినపిదప నతఁడు మహాకుపితుఁడై యల్లుఁడు దార

పుత్రులను నిరాధారులఁ జేసి సన్యసించుట దుష్కార్యమనియు సం

సారనాశహేతువనియు నభిప్రాయపడి యల్లుఁడుద్యోగము సేయున

ు మను

ొతనమాట

నానకుబుద్ధి

యాయనను

లు దేరి పోయి

చున్న నానకు

ంచుట యనుచితమ

ని వానిమనస్సు నిశ్చ

చ్చినదారినే స్వగ్రామమున

కటింగించెను. అల్లుఁడు మరల

గ్రహించి మూర్ఖుఁడు నానకునకు

న యేఁడువందల యరువది రూపా

చ రక్షింపవలయునని నబాబునకు

బు నానకు దారపుత్రుల నిరాధారస్థితికి

ందియు నానకుచేత పేదలనిమిత్తము దానమీయఁ

బడినధనము వాని సమ్మతిలేక యాలుబిడ్డల కిచ్చుటయధర్మ

మని భయపడి మూర్ఖుఁడు కోరినప్రకారము చేయుట కిష్టపడఁడ

య్యె. అయినను నానకునకు మతిలేదని లోకులు చెప్పుకొనుట చేతను

మతిలేనివాఁడు చేసిన దానధర్మములు పరిగ్రహింపఁ దగినవి కావని తెలియుటచేతను నవాబు వానివంతుధనము దానముచేయక యాలుబిడ్డల కీయఁ బ్రయత్నించెను. నానకు నిరంతరము గోరీలదొడ్డిలో గూర్చుండి జపము సేయుచుండుటచే వాని కేదేని యొక దయ్యముపట్టియుండవచ్చునని కొందఱు చెప్పిరి. తురకలకును దయ్యము లున్నవని నమ్మకకలదు గావున నవాబు తన మతగురువు నొక్కనిం బిలిచి మంత్రములు చదివి యా దయ్యమును వదలించుమని వానితోఁ జెప్పి నానకునప్పగించెను. ఆగురువు నానకుకడకుంబోయి తనమంత్రము లన్నియుఁ జదివెను. ఎన్నిమంత్రములు జదివిన నతఁడెప్పటి యట్లే యుండెను. తురక గురువు నానకుతో నించుక సేపు సంభాషించి వానికి దయ్యము పట్టలేదనియు మతి లేకపోలేదనియు గ్రహించి యామాట నవాబున కెఱిఁగించెను. పేదలకుఁ బంచిపెట్టవలసిన సొమ్ము మఱి యొకలాగున వినియోగించుట మహాపాపమని మహమ్మదీయ ధర్మశాస్త్రములలో నుండుటచే నవాబు పాపభీతినొంది యాధన మేవిధంబున వినియోగింప నగునని జయరామునిం బిలిపించి యాలోచన మడిగెను. జయరాముఁడొకటి చెప్పిన నెటువచ్చునో యని యే యాలోచన ముం జెప్పవెఱచెను. ఏలయన నానకుయొక్క యాలుబిడ్డలయవస్థఁ జూడ ధనము వారికప్పగించుటయే న్యాయమని తోఁచును. నానకు మతిలేనివాఁడు కాఁడని తెలిసినప్పుడు వాఁడు చెప్పిన చొప్పున వానిసొమ్ము దానముచేయకపోవుట యనుచితమని తోఁచును.

ఈ రెండు ధర్మసందేహములు జయరాముని బాధించినందున నతఁడు నానకునే పిలుపించి కర్తవ్యమునుగూర్చి యడుగుమని నవాబునకు విన్నవించెను. నవాబు వానిచెప్పినచొప్పున నానకును రమ్మని వర్తమాన మంపెను. నానకువానియాజ్ఞ నిరాకరించి రానందున నవాబు వానిని బలవంతముగ దనసన్నిధికి రావించి తనయాజ్ఞప్రకార

ము రాకుండుటకుఁ గారణమేమని కోపముతో నడిగెను. నానకు వాని కిట్లనియె. "నేను మీసేవచేయునప్పుడు మీయాజ్ఞమన్నించి యిప్పుడు భగవంతునిసేవ చేయుటచే భగవంతునియాజ్ఞనే మన్నించెద. అప్పలుకులు విని నవాబు "నీవు భగవద్భక్తుండ వయితివేని నేనును భగవద్భక్తుఁడనే. నేఁడు శుక్రవారము మసీదునకుఁబోయి మనమిద్దఱము నమాజు చేయుదము రమ్మ" ని పలికెను. భగవంతుఁడు సర్వవ్యాపకుఁడను నమ్మిక హృదయమున నుండుటచే నానకు మసీదునకుఁ బోవసమ్మతించె. సమ్మతించుటయు నవాబు కొలువులోనున్న గొప్పసరదారులను స్వమతగురువులను నానకును వెంటఁబెట్టుకొని వైభవముతో మసీదునకుఁ బోయి ప్రార్థనల నారంభించెను. తురకలందఱు దమయాచారప్రకారము ప్రార్థనసమయమున మోఁకాళ్ళమీఁదఁబడియుండనానకు మాత్ర మట్లుచేయక కాలువంచక నిలిచియుండెను. ప్రార్థనలు ముగిసినపిదప నవాబు నిలిచియున్న నానకునఁజూచి "ఓయి! నీవునాతోఁగలిసి ప్రార్థించుటకు వచ్చితివా? లేక నిలిచియుండుటకు వచ్చితివా?" యని యడిగెను. నవాబు ప్రశ్నమునకు నానకీ క్రిందియుత్తరముఁ జెప్పెను. "ప్రార్థనసమయమున మీరు గాంధారదేశమున గుఱ్ఱములను బేరము చేయుచుండిరి. అందుచేత నేను మీతోఁ గలసి యెట్లుప్రార్థన సేయఁగలను." అనవుఁడు నవాబుప్రక్కనున్న ఖాజీ నానకుతో నిట్లనియె. "నీవు నవాబుగారితోఁ గలిసిప్రార్థనముఁ జేయలేనిపక్షమున నాతోఁ గలసి యేల ప్రార్థింపవైతివి" అప్పలుకులకు నానకీవిధమునబదులుచెప్పెను. 'మీతక్కువ యేమున్న. దిమీగుఱ్ఱపుపిల్ల మీదొడ్డిలోనున్న బోదెలోఁ బడునేమోయను భయమున మీమనసు ప్రార్థనసమయమున మీగుఱ్ఱపుపిల్లవెనుకనే యుండెను. నేనుమీతోఁగలిసిన మాత్రమెట్లు ప్రార్థింపఁగలను.'

అతని పలుకులు విని నవాబు వానిగురువు విస్మయము నొం

దియెుుండ్రోరుల మొగంబులు చూచుకొని యెట్టకేలకుఁ దమమనస్సు లోనయమున నిజముగా మసీదులో లేవనిచెప్పుకొనిరఁట. అన్యు ల మనోగతములగు నాలోచనలను విజ్ఞానవంతులు సులభముగ నె ఱుంగఁ గలరని ప్రకృతి శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఇది నిజమో యతిశయోక్తియో మనము చెప్పఁజాలము. అనంతరము నవాబు నా నకును బిలిపించిన కార్యము మఱవక ధనమెల్లు వ్యయము సేయువల యునని వానినడిగెను. ఎన్నివిధములఁ దరచి తరచి యడిగినను నా నకుమొట్టమొదట దావన్నట్లు ధర్మమే చేయుమని నొక్కిచెప్పెను. నవాబు నానకు నడిగెడు కార్యములేదని తెలిసికొని వానిం బంపివేసి యాధనము సగము నానకు మనోరథ ప్రకారము పేదలకుఁ బంచిపెట్టి సగ మాలుబిడ్డల కిచ్చెను.

ఈనాఁటి హిందువులకు వలెనే యానాఁటి హిందువులకుఁగూడ జాతి మతవర్ణసంబంధములైన పట్టుదలలు మిక్కుటముగనుండెను. మన దేశము నిప్పుడు క్రైస్తవులు పరిపాలించుచున్నట్లె యప్పుడు మ హమ్మదీయులు పరిపాలించుచుండిరి. ప్రభువులు మహమ్మదీయ మ తస్థులయినను దేశస్థులు హిందూమతమునే యవలంబించి విడువక య భిమానముగలవారై యుండిరి. తురకలుహిందువులు పలుమాఱుత్సవ సమయములఁగలియుచువచ్చిరిగాని కలిసి తినుట వియ్యమందుటమొదల గు వానిలో మాత్రము హిందువులు గలియరైరి. హిందువుఁడు మ సీదునకుఁబోయి తురకలం గలసి నమాజు చేయుట స్వమత మర్యా దం దాటుటగా నానాఁటివారు భావించుచువచ్చిరి. అట్టివాని నానా టివారు వెలివేసిరేగాని వర్ణములో నుంచరైరి. నానకు మహమ్మ దీయులతోఁ గలిసి మసీదులోఁ బ్రార్థనజేసి స్వమతమర్యాద నతిక్ర మించెను. నావాబుఖాజీ వాని వెంటఁబెట్టుకొని పోవుటంజేసి నానకు స్వభావమెఱుఁగనివారందఱు దప్పక యతఁడు నవాబు ప్రేరణంబు

నఁ దురకలలోఁ గలసెననియే చెప్పుకొనిరి. జయరాముఁ డామాట విన్నప్పుడు చాలతొందరపడి యతిత్వరితమున నింటికిఁ బోయి యావార్త భార్యకెఱిఁగించెను. ఆమె తన సహజధైర్యమునుజూపి భర్త చెప్పినమాట సరిగా నమ్మలేదు. జయరాముఁడు తనమాట భార్యసరిగా నమ్మకపోవుటచే నిజస్థితి గనుగొని రమ్మని నాథుఁడను బ్రాహ్మణుని నానకుదగ్గఱకంపెను. ఆబ్రాహ్మణుఁడు తక్షణమే బోయి యథార్థస్థితిఁ దెలుసుకొని నానకు తురకలలోఁ గలిసినమాట యబద్ధమనియు నానకు నవాబుమాటకులోబడియట్టిపని జేయువాఁడు కాఁడనియుఁ జెప్పెను. అదివిని జయరాముఁడు భార్యయు మిక్కిలి సంతసించిరి.

నానకు విరాగులలోఁ గలిసినవార్త కాళునకుఁ జాలకాలమునకుఁగాని తెలియదయ్యె. తాల్వండి గ్రామమునకు సుల్తానుపురమునకుఁ గొన్నివందలమైళ్ళ దూరమున్నందున నాదినములలో వర్తమానము దెలియుట చాలకష్టముగ నుండెను. పూర్వము పొరుగూరి వార్తలు దెలియవలెనన్న గృహస్థుఁడు పురోహితునో యింటిమంగలినో యింటిపాటకునో లేక బత్తెమిచ్చి ప్రత్యేకముగా నొకమనిషినో పంపవలయును. కుమారునివార్త కాళున కెట్లో తెలిసెను. ఆవార్త వినఁగానే కాళుని ప్రాణములు నిలువునంబోయెననిచెప్పవచ్చును. త్రిప్తాదేవిదుఃఖ మింతింతయని వర్ణింప నలవిగాదు ఆమెభర్త తన దుఃఖముఁ గోపావేశముచేత నడుమనడుమ మఱచుచువచ్చె. త్రిప్తాదేవి శాంతమున భూదేవియే. కోపమెట్టిదో యెఱుఁగనిదిగావున నామె దుఃఖమున కూరటయే లేకపోయెను. అయినను కుమారునిస్థితి యున్నదున్నట్లు తెలిసికొని రమ్మని కాళుఁడు మర్దనుఁడను గాయకుని సుల్తానుపురమున కంపెను. మార్గమున మర్దనున కెదురుపడిన మొదటిపురుషుఁడే యావార్త నిజమని బలికెను.

అప్పటికిని మర్దనునిమనసు సందేహపరవశము గుటచే సుల్తానుపురము నకు వచ్చినతోడనే జయరాముఁడు వానిసందేహమును దీర్చెను. అదూత యంతతోఁ దనివి నొందక నానకును స్వయముగాఁ జూడ వలయునని కోరి గోరిలదొడ్డికిఁబోయి యాతనిం గాంచి మరల గృహ స్థాశ్రమస్వీకారముఁ జేయుమనివానికెన్నెన్నో యుపదేశములఁ జేసెను. ఈతఁడు తాల్వోండినుంచి వచ్చునప్పుడు తనవాక్చమత్కృతిచేత నాన కుమనసు గరగించి గృహస్థుంజేయఁ గలిగినట్లు కాళునితోఁ బ్రిజ్ఞలు పలికివచ్చె. అందుచేత నతఁడు తన యావచ్ఛక్తి వినియోగించి నాన కుం ద్రిప్పఁజొచ్చెను. అయ్యెరువుర కలయికచేత నానకు గృహస్థాశ్ర మము స్వీకరించలేదు గాని నానకు చేసిన వేదాంతబోధముచేత మర్ద నుఁడు సంసారముమీఁద విరక్తుఁడై తాల్వోండికిఁబోయి కాలునకుఁ గుమారునియవస్థయైనం జెప్ప దలంపక నానకునకు శిష్యుఁడయ్యెను. ఊరక శిష్యుఁడైయుండక నానకుకంఠములోఁ బ్రాణ ముండినంత కాలము పరమభక్తుఁడై తోడునీడయట్లు వానిని సేవించెను.

లోకము నుద్ధరింపఁదలఁచిన మహాత్ము లొక్కచోట నెప్పుడు నుండరు. తాము బుట్టిపెరిగినచోటులను వ్యవహారములు చేసినచోటు ల మొదలే యుండరు. తమకు భగవంతుఁ డిచ్చిన జ్ఞానము లోక మంతట వెల్లడిచేయుటయే వారి ముఖ్యోద్దేశము గావున మహాత్ము లు నిరంతరము దేశాటనము చేయుచుందురు. నానకుగూడ జగదుప కారపారీణుఁ డగుటచే మర్దనుఁడు తన శిష్యుఁడైన కొన్ని నాళ్ళకు సుల్తానుపురమువిడిచి మఱియొకతావునకుఁ బోవఁదలఁచెను. మర్దనుఁడు మంచిపాటకుఁడగుటచే నిరంతరము భగవన్నామ కీర్తనము గాన రూపమున వానినోటినుండి వినవచ్చునని నానకు తాంబురా కావల యునని కోరి యదికొనుటకైనఁ దనయొద్ద ధనముఁ లేనందున దానికి వలయు ధనమిమ్మని సోదరికడకు వర్తమాన మంపెను. తమ్ముఁడట్టి

కోరిక కోరుటయే చాలునని నానకి దేవి తక్షణమే వానికిఁ గావలసిన ధనమిచ్చి సోదరు నొకసారి జూడఁగోరి యెట్లైన వచ్చిచూచి పొమ్మని ప్రార్థనపూర్వకముగా వర్తమానమంపెను. నానకు తన యక్క మాట త్రోసివేయలేక యామె దర్శనమునకుఁ బోయెను. నానకి తమ్ముని మిక్కిలి గౌరవించి భోజనముపెట్టి చాల సేపు వాని తో సంభాషించెను. అక్కడ నుండఁగానే నానకు పూర్వపుచెలికాఁడగు బలుని జూడఁగోరెను. నానకి వెంటనే వానిని రావింప నతఁడు వానిం జూచి నీ వేట్లున్నావని యడిగెను. బలుఁడప్పలుకులు విని యజమానుఁడు తన్ను విడిచిపోయినది మొదలు తన కేమియు దోఁచక పిచ్చియెత్తినట్లున్నదనియు సెలవయ్యేనని తాల్వోండికి బోయి వ్యవహారమునం జక్కఁ బెట్టుకొని మున్ను చేయఁదలంచిన పనిఁ జేయ వచ్చుననియు బదులు చెప్పి నానకుచేసినపని చాల మంచిదని పొగడి యతండు త్రొక్కినత్రోవ తప్పన్న వారిని నిరసించి తనకు నానకునందుఁ బరమభక్తి గలిగింపుమని భగవంతుని బ్రార్థించెను. నానకు వాని భక్తికిమెచ్చి తాల్వోండికిఁ బోవుటకు వానికి ననుజ్ఞనిచ్చెను.

అనంతరము నానకు సోదరియొద్ద సెలవుపుచ్చుకొని నిజనివాసమగు గోరిలదొడ్డికిఁ బోయెను. మర్దనుఁడు తాంబూరా గొనుటకు బజారున కరిగెను. బజారులో నెక్కడ వెదకిన నొక్క తాంబురా యైనం దొరకలేదు. దొరకకపోవుట యటుండఁగా వానియుద్దేశమెఱిఁగిన పదుచువాండ్రందఱు వానిని జూచి యెగతాళి సేసిరి. మర్దనుఁడు బజారంతయుఁ దిరిగి తిరిగి విసికి వేసారి నానకుకడకుఁబోయి తాంబురా దొరకకపోవుటయుఁ దన్నెల్లవారుఁ బరిహసించుటయు లోనగు వృత్తాంతమెఱింగించెను. నానకు వానిపలుకులు విని యిట్లని యూరడించె. "ప్రపంచమంతయు నజ్ఞానాంధకారమున మునిఁగి యున్నది. ఇప్పుడు లోకము మనల నిరసించినను ముందుముందు పశ్చాత్తాప

ముతోడను వినయముతోడను మనమాటల నాకర్ణించును." ఈశ్వరునియందు గాటముగ మనస్సు నిలిపిన పరమభాగవతోత్తముని మనోధైర్యమెట్లుండునో చూచితిరా? లోకము తనమాట నిరాకరింపక వినయముతో వినుమని వానియంతరార్థ విస్పష్టముగ వానికి జెప్పెను. భగవద్భక్తులకు, సామాన్యమనుష్యులకుఁగల ముఖ్యభేద మిదియే. అనంతరము నానకు కొంచెము యోచించి సుల్తానుపురమునకు సమీపమందున్న యొక గ్రామములో నొకవర్తకుఁడు పెహలురాయనువాఁడు తాంబురాలు చక్కఁగాఁ జేయఁగలఁడనియు వానికడకు బోయిన దొరకుననియుఁ జెప్పి మర్దను నంపెను. మర్దనుఁడు బయలుదేరి నానాస్థలములు దిరిగి యీమనుష్యుని నెలవుగానక మూఁడు దినములు తిరిగి తిరిగి మిక్కిలి డస్సి యొకచెట్టుక్రిందఁ గూర్చుండ వానియొద్దకే పెహలురూ వచ్చి యొకతాంబురా యిచ్చెనఁట. మర్దనుఁడు దాని వెల యీయఁబోవ దాని నతఁడు పరిగ్రహింపక నానకుదర్శనము చేయింపుమని ప్రార్థించెను. మర్దనుఁడును వానిందోడ్కొని నానకునకుఁ జూపి తదభీష్టముం దీర్చెను.

మర్దనుఁడు గానవిద్యలో నానాటివారి నందఱిని మించెనని చెప్పుదురు. తాంబురా దెచ్చి శ్రుతివేసి యతఁడు "తుహీనిరాకార్ తుహీనిరాకార్ నానక్ బందా తేరా" యను పల్లవిగల కృతిపాడెను. పాడినతోడనే నానకు భక్తిరసపరవశుఁడై యొడలెఱుంగక పడియెను. మర్దనునకు గానమునం దధికప్రజ్ఞ మొదటలేదనియు నానకు వరప్రసాదమునకునిముసమున నట్టిప్రజ్ఞ వానికిఁ గలిగినదనియుఁ గొంద ఱనుచున్నారు. కొందఱు మర్దనునకు సహజముగా గానమునం దధికప్రజ్ఞగలదని చెప్పుదురు. నానకు మైమఱచిపడుట మర్దనునియొక్క గానప్రభావముచేతఁగాక వానిహృదయమున నున్న భక్తిరసముచేతనే యని కొందఱు పలుకుదురు. ఈమాటయే కొంతవఱకు నిజమని తోఁచుచున్నది

భక్తిరసములేని శుష్కహృదయుఁడు రాళ్ళఁ గరగించు పాటలు విని
తను పరవశుఁడై మూర్ఛిల్లునా? సహజముగా హృదయము భక్తి
పూరితమైనప్పుడు స్వల్పగానము సహితముఁ వాని కుత్సాహము గలి
గించును. అంతేకాని తాంబురాళ్లయ్యలు నోటిపాటలు భక్తిలేని
వానికి భక్తి సృష్టింపలేవు.

నానకు రెండుదినములు మూర్ఛావస్థలోనుండి మూఁడవనాఁడు
కన్నుదెఱచి చూచెను. గురువునకు మెలకువవచ్చినతోడనే మర్దనుండు
స్వగ్రామమునకుఁ బోవుటకు సెలవిమ్మని యడిగెను. నానకు కారణ
ముం దెలియఁగోర మర్దనుఁ డిట్లనియె. "మీరు మూర్ఛపోయి రెం
డేసిదినము లీప్రకారముగా నున్నపక్షమున నాపని యేమికావలయును?
ఆఁకలిచేత దాహముచేత నేను చచ్చిపోనా! కావున నన్నుబోనిండు"
శిష్యుని బేలమాటలు విని గురు విట్లనియె. "నీయిష్టము వచ్చినట్లు
చేయవచ్చును. నీవు స్వగ్రామమునకుఁ బోయి సుఖించినను సంతోష
మే. నన్నుఁ గనిపెట్టుకొనియున్నను సంతోషమే. ఉండఁదలఁతువేని
యాఁకలిచేత డప్పికచేత బాధపడవలసియుండును. నానకుతోనున్నవారికి
నానకుతోపాటు కష్టములేగాని సుఖములు లభింపవు" మర్దనుఁడా పలు
లుకువిని యేమియుం బదులుచెప్పక యెటుచేయుటకుం దోఁచక సందిగ్ధ
మనస్కుఁడై యుండెను. అంతలో మర్దనుఁడు తనతమ్ముని విడిచి
పోవఁదలంచుకొన్నాఁడని విని నానకి విచారమొంది మర్దనుని బిలిపించి
పోవఁదలఁచినకారణమడిగి తమ్ముని విడిచిపోవలదనియు సుల్తానుపురము
లో నున్నంతకాలము తనయింటనే రెండుపూటలు భుజియింపవలసిన
దనియు సోదరుఁడాయూరు విడిచిపోవునప్పుడు వాని వెంటఁ బోవలసిన
దనియు నీప్రయాణమున కగు కర్చులన్నియుఁ దానే యిచ్చుకొనఁ
బూనుననియుఁ జెప్పి యప్పుడే రెండుబట్టలు నిరువదిరూపాయలు
వాని కిచ్చెను. అవిపుచ్చుకొని మర్దనుఁడు వారు చెప్పినట్లే చేయుటకు

వాగ్దానముచేసి మరల నానకుకడకుం బోయెను. మర్దనుఁడు కనబడక పోవుటచే నతఁడు స్వగ్రామమునకే బోయి యుండవచ్చునని నానకు తలంచి వానిం జూచినతోడనే మరల నేలవచ్చితివని యడిగెను. మర్దనుఁడు నానకీదేవి తన్నుఁ బిలిపించి చెప్పినమాటలన్నియు వానికి తెలియఁ జేసెను. మర్దనుఁడు తనసోదరియొద్దనుండి వస్త్రములుగ్రహింపవచ్చునే కాని ధనము స్వీకరించుట యనుచితమని తలంచి నానకు వానివద్దనున్న ధనముఁదీసికొని సోదరియొద్దకుఁబోయియామెధనమామె కిచ్చెను. ఆమె దానిని బుచ్చుకొనుట కిష్టములేనిదయ్యుఁ దమ్ముఁడేమనుకొనునోయను భయమున మరల గ్రహింప గృహస్థాశ్రమము స్వీకరించి తల్లిదండ్రులకు నాలుబిడ్డలకుఁ దనకు బావకు నత్తవారికి నెప్పటియట్లు నేత్రానందము గలుగఁజేయఁదగునని వానిని బ్రార్థించెను. ఎన్ని చెప్పినను నానకు తనత్రోవ విడువకుండుట నానకీదేవి తమ్మునిం జూచి “నాకు నిన్నుఁ జూడవలయునని బుద్ధి పుట్టినప్పుడు నేను నీకు వర్తమాన మంపెదను. నీవు తత్క్షణమువచ్చి నన్నుఁజూచి పోవలయు”నని కోరెను. నానకు సోదరికోరికను దప్పక తీర్చుట కొడంబడెను.

షష్ఠమాధ్యాయము.

అనంతరము నానకు కొంతకాలమచ్చటనుండి సోదరియొద్ద బావకడ సెలవుగైకొని లాహోరు మండలముసందలి యమ్నాబాదు పట్టణమునకుఁ బయనమైపోయెను. సుల్తానుపురమును విడిచిన యాగడియమొదలుకొని యీకథానాయకుఁడు గురు నానకు నామముతో వ్యవహరింపఁబడుచు వచ్చె. ఏలయన నాదినము ప్రారంభ

ముగా నతఁడు తనకాలమున సంఘమునందుఁ బ్రబలియుండిన దురాచారమును వెలిపుచ్చి ఖండించుటకును బ్రజల మనస్సులనుండి మూఢవిశ్వాసములను దొలఁగించుటకును సత్యమని తానునమ్మిన మతము స్వేచ్ఛగా లోకులకు బోధించుటకును సంకల్పించెను. ఏమనుష్యుఁడు తనబోధనలవలన మానవకోటికి నీతి, యాత్మజ్ఞానము, మనోవికాసము గలిగించునో యతఁడే గురుశబ్దమున కర్హుఁడు. నానకు తనకుఁ గలిగిన యాత్మజ్ఞానమును దోడిమానవులకు నెఱింగించుటకే గాక దైవగ్రంథములకు విరుద్ధములైన దురాచారములను సంఘమునుండి దూరముగఁ దొలఁగుటకు నిర్మూలించుటకు సమర్థుఁడౌఁ గావున నీతఁడు గురుబిరుదము నందుటకుఁ దగినవాఁడు. అందుచేత నాశబ్దమతనియందు సార్థకమయ్యెను.

సుల్తానుపురమునుండి యమ్నాబాదునకుఁ బోవుట కేడుదినములుపట్టెను. ఆపట్టణమునకు నానకు వచ్చుటకుఁ గారణమేమన నచ్చట దైవభక్తుఁడు సత్ప్రవర్తకుఁడు నగు వడ్లవాఁ డొకఁడుండెను. ఆతని జూచుటయే యాగురుని యభిప్రాయము. ఆవడ్రంగి పేరు లల్లో. నానకు తత్పురముఁ బ్రవేశించి సరిగ నావడ్రంగియింటికిఁబోయెను. లల్లో నానకు మహాత్ముఁడని వినియుండెఁగాని యాతని దర్శన మదివఱ కెన్నఁడుఁ జేసియుండలేదు. తనగృహమునకు ననాహూతుఁడై యరుదెంచిన పురుషుఁడు నానకే యని తెలిసికొని యావడ్రంగి మహానందభరితుఁడై వానినెంతయు గౌరవించెను. అతఁ డక్కడ గొన్నినాళ్ళుండి తనమతము బోధింప నారంభింప నాపురజనులకు వానిమీఁద ననిష్టము పొడమెను. అనిష్టమే కాదు. కేవలము ద్వేషమే కలిగెను. అట్లు కలుగుట యాశ్చర్యముకాదు. ఏలయన నేమనుష్యుఁడైన మతవిషయమునఁగాని సంఘవిషయమునఁగాని జ్యోతిషాది శాస్త్రములఁగాని క్రొత్తసిద్ధాంతము బోధించినప్పుడును సిద్ధాంతము

పాత్రమైనను నూతనముగా నా చరణములకుఁ వచ్చినప్పుడును లోకులు కాకులవలె వానిం బొడిచి తలయెత్తుకొననీయక నిందించి బహిష్కరించి దండించి చేతనైనచో నిష్కారణముగఁ జంపివేయుదురు. ప్రపంచముయొక్క పూర్వచరిత్రం జదివినవారి కంతయును నిది విదితమే. లోకులు క్రొత్తసిద్ధాంతములలోనున్న మంచి భాగముల నెరియరు. దానివలన మానవకోటికిఁగల్గు లాభనష్టములను విచారింపరు. మునుపటి యాచారములకు విరుద్ధముగ బోధించినవాఁడు నీతిమంతుఁడైనను నరే విద్యాసంపన్నుఁడైనను నరే జ్ఞానరాశియైనను నరే లెక్కసేయక వానినెల్ల నిందింపఁ బెట్టుదురు. ఈ యంశము యాథార్థ్యము స్థిరపఱచుటకు నుదాహరణములు వేనవేలున్నవి. ఎందఱో పరమపవిత్రులు మలినచరిత్రులచేత సంహరింపఁబడిరి. ఎందఱో విజ్ఞానవంతులు పరమమూర్ఖులచేత బాధింపఁబడిరి. ఎందఱో శాస్త్రకారులు నిరక్షరకుక్షులచేత నిందింపఁబడిరి. అద్వైతమతస్థాపకుండగు శ్రీశంకరాచార్యుఁడు మతదూర బ్రాహ్మణులచేత నెన్నియిడుములఁ బడెనో మనము వినియుండలేదా? ఆయన తల్లి మృతినొందినప్పుడు కులబ్రాహ్మణులు శవదహనమునకు సాహాయ్యముచేయక నిన్నకుండ శంకరుఁడు గొడ్డలితో మాతృదేహమును ఖండఖండములుగాఁ జేసి మోసికొనిపోవుటకు వీలులేక తన దొడ్డిలోనే యగ్నిసంస్కారము చేసెనఁట. విశిష్టాద్వైతమతస్థాపకుండగు రామానుజాచార్యుని చోళరాజు దేశమునుండి తఱిమెనఁట. రామానుజుఁడా రాజు చనిపోవువఱకు ననఁగాఁ బండ్రెండు సంవత్సరములు తనమతము స్వదేశమున బోధింప వీలులేక విదేశములఁ గాలక్షేపము చేసెను. ఏసుక్రీస్తు

వంటి నీతివంతుని బరమభక్తుని సుగుణవంతుని వానిదేశీయు లగు యూదులు నిర్హేతుకముగాఁ గొరత వేయింపలేదే. మతము మాట యటుండనిండు. ప్రకృతిశాస్త్రములలోఁ గ్రొత్తసంగతులు కనిపెట్టిన వారికిఁగూడ నిట్టియవస్థలే సంభవించినవికదా. "సూర్యుఁడు భూమిచుట్టుఁ దిరుగుటలేదు. భూమియే సూర్యునిచుట్టుఁ దిరుగుచున్న" దని కష్టపడి కనిపెట్టి యాసత్యము లోకమునకు వెల్లడించినందుకే గదా బ్రూనోయను పశ్చిమఖండవాసుని వాని మతస్థులగు క్రైస్తవులు బ్రతికియుండఁగా వానిని నిప్పులలోఁ బడవైచి చంపిరి. క్రొత్తదానిని లోకులు మొట్టమొదట నేవగించుట సహజము.

నానకు క్రొత్తసిద్ధాంతమేమియుఁ జెప్పకపోయినను వానిమతము పవిత్రమైన యార్యమతమైనను నాఁటి దేశస్థుల యాచారములకు విరుద్ధముగ నుండుటచే వానిని బ్రజలు ద్వేషించిరి. నానకు పరమశాంతుఁడైనను దత్పురజనులు వాని నెగతాళిచేసి చప్పటులఁ జఱిచి యవమానించిరి. నానకునకు మర్దనునకుఁగూడ నక్కడనుండుట కిష్టములేకపోయెను. గురుశిష్యులు తమతలంపు వడ్రింగి కెఱేఁగించిరి. అంత త్వరితముగ నేఁ బోవలసివచ్చెనని వడ్రింగి వారినడుగ నానకు తనయునికి పురజనులకు బాధకరముగా నున్నందున వారికి మనోవ్యధ కలిగించుట కిష్టములేక తాను పోవలసివచ్చెనని ప్రత్యుత్తరమిచ్చి యీక్రింది విధమునఁ బలికెనఁట. "నే నూరకుంటినా నన్ను జ్ఞానములేని మొద్దందురు. మాటాడితినా పేలుచున్నాఁ డందురు. కూర్చుంటినా యెవనికొఱకో యేడ్చినట్లే యున్నాఁడందురు. లేచిపోతినా నెత్తినిగుడ్డవేసికొని పోయినాఁ డందురు. వినయము జూపితినా భయపడి లోఁబడినాఁడందురు. ఈజనుల నెట్లు మెప్పింపవలయునో నేనెఱుఁగను. భగవంతుఁడే నన్నిహపరముల రక్షించుఁగాక!" "లోకో భిన్నరుచిః"యను సామెతనుబట్టి మనుష్యుల మనస్సులు పరి

పరివిధములుగ నుండును. ఒకనికి మిక్కిలి బాగున్నది మఱియొకని కెంతో యోగ్యముగాఁ గానఁబడును. అందఱ మెప్పించుట మనుష్యమాత్రున కెవ్వనికిం దరముగాదు. కావున లోకోపకారపారీణుఁడగు మనుష్యుఁడు తనకు సత్యమని తోఁచినదానిని లోకులు నిందలు కుడుగక స్తోత్రముల కుబ్బక ధైర్యముఖముఁజూచి నిర్భయముగఁజాటును. గురునానకు తనయూరు విడచిపోవుట కిష్టపడకున్నను ఎల్లో మాంసమాదిసములు తనయింట నుండుమని వానిని బ్రార్థించెను. అతఁడు మిక్కిలి వినయముతో వేఁడుకొనుటచేతను మిక్కిలి భక్తిగలవాఁడగుటచేతను నానకు వానికోరిక నెరవేర్ప నియ్యకొనెను. మరదానుఁడు పురజనులుపెట్టు బాధలు పడలేకను క్రొత్తయూరులో మునుపటియట్లు ప్రొద్దుపోవక పోవుటచేతను స్వగ్రామము పోవఁదలఁచి యజమానుని సెలవడిగెను. తనకాతిథ్యమిచ్చిన గృహస్థుఁడు సామాన్యస్థితికలవాఁడైనందున నిరువుర కన్నమిడుట వానికి భారముగా నుండునేమో యనియుఁ బోవఁదలఁచిన వాని నాపఁగూడదనియు నానకు మర్దనుని పోక కనుమతించి నెల దినములలో ననఁగాఁ దానాపురము విడువక ముందే రమ్మని చెప్పిపంపెను.

గురునానకు తత్పురమున నున్నప్పుడు సంపన్నుఁడు పలుకుఁబడి కలవాఁడు కులమున క్షత్రియుఁడు నగు మాలికుభాగో యనునతఁడు బ్రాహ్మణులకు సంతర్పణముఁ జేసినాఁడు. నానకునుగూడ విందునకుఁ బిలచెను. ఏమి కారణముచేతనో నానకు విందునకుఁ బోవలేదు. ఆసంపన్నుఁడది యవమానముగా గ్రహించి నానకు దర్శనమునకుఁబోయి విందునకు రాకపోవుటచేఁ దనకుఁగలిగిన యవమానమును మనస్తాపమును బిట్టు జెప్పుకొనెను. అదివిని నానకు భాగోను జూచి యంతటి స్వల్పవిషయమున కంతగా విచారింపవలసిన యావశ్యకత లేదని చెప్పి వెనుక విందారగింపనందుకు దోషపరిహారార్థ

ముగా నప్పు డందఱిచ్చు వస్తువులఁ దినుటకు వాగ్దానముచేసి భక్ష్యములఁ దెమ్మని యడిగెను. భాగో సంతుష్టహృదయుఁడై తత్క్షణము కొన్నిభక్ష్యములఁ దెమ్మని సేవకున కాజ్ఞాపించెను. తోడనే మిగుల రుచ్యములగు పదార్థములు పళ్ళెరములతో వచ్చెను. అవి ముట్టక మునుపే నానకుపక్కను నిలిచియున్న పేదవడ్రంగిని జూచి మీయింటిపదార్థములఁ గూడ తీసుకొనిరమ్మని యాజ్ఞాపించెను. అనవుడు లల్లో మహాప్రసాదమని తనయింటనున్న నిస్సారపదార్థములం గొన్నిఁటిని దెచ్చి గురు సమ్ముఖమున బెట్టె. పెట్టుటయు గురువు రెండుపళ్ళెరములనుండి రెండువస్తువులు చెఱియొక చేతం గ్రహించి వ్రేళ్ళతో నొక్కెనఁట. నొక్కినతోడనే భాగో తెచ్చిన పదార్థములనుండి నెత్తురుబొట్లు పడెనఁట. లల్లో సమర్పించిన పదార్థములనుండి తెల్లని పాలు గారెనఁట. అట్లు కారుట యసంభవమగుటచే నీకథ విశ్వాసపాత్రముగాదు. కాకున్నను లోకుల కీకట్టుకథ కొంత నీతిని బోధింపకపోదు. ఇందు మనము నేర్చికొనవలసిన నీతి యిది. సంపన్నులు వెండిగిన్నెలతోడను బసిఁడిపళ్ళెరములతోడను దెచ్చియిచ్చు పంచభక్ష్యపరమాన్నంబులు వారి కష్టార్జితంబులు కావనియు, పొట్ట గడువక దినమెల్లఁ జమటయూర్చి పాటుపడు నిరుపేద లనేకుల బాధించి బలాత్కారముగాను మోసపుచ్చియు సంపన్నులు ధనము గ్రహించి విందుల నాహూరగించి యొరులకు మెప్పునకై పెట్టుదురనియు, పాలుమాలక యొరుల వంచింపక మేను దాఁచుకొనక పాటుపడి దారపుత్రుల నెట్టెటో బోషించుచు గౌరవముగఁ గాలక్షేపము సేయువాని గంజియన్నమే భాగ్యవంతుల పాయసాన్నములకంటె భక్ష్యములకంటె మహాత్ము లెక్కువ యాదరముతో నెక్కువరుచితో భుజింతురనియు మన మెఱుంగవలయు.

భాగో తెచ్చిన పదార్థములనుండి నానకు నెత్తురు పిండిన

మాట నిస్సంశయముగా నతిశయోక్తియై యుండును గాని వాని
తెచ్చిన యాహారమును దిన్నగ మెసవక వడ్డించి యిడినకూడు
నెక్కువ యాదరించి సమగ్రముగ భక్షించియుండుననుట సత్యమని
మనమూహింపవచ్చును. ఇంతియగాక గసుసుసిన మెఱుంగని వెంగ
లిజనులను దోఁచికొను భాగ్యవంతులగువారి యన్నములకంటె నీతిమం
తులగు నిరుపేదల కూడు శ్లాఘ్యము గ్రాహ్యమునని నానకు మొగ
మోటములేక వానితోఁ జెప్పియుండిన నుండవచ్చునని కూడ మన
మూహింపవచ్చును. ఆయూరణము నాధారము జేసికొని బుద్ధిమం
తులీకథను గల్పించి యుందురు. భాగ్యవంతుఁడై యెల్లవారలకు
గౌరవనీయుఁడైయున్న భాగోకు నిరుపేదయుఁ దక్కువ వర్ణము వాఁడు
నందు వడ్రంగియునగు లల్లో యెదుట జరిగిన యవమానమును నతఁడు
సాధారణముగ మఱచిపోఁదగినదిగాఁ గానఁబడదయ్యె. ఆక్రోధమునతఁడు
మనసులో నుంచుకొని నానకున కైన నపకారము జేయుటకు
సమయము నిరీక్షించు చుండెను. రంధ్రాన్వేషణము చేయువారికి
సమయములు చిక్కకపోవునా? శీఘ్రకాలములోనే యతని కొక
యదను దొరకెను. ఎమ్నాబాదు జిల్లాదారు (గవర్నరు) గానుండిన
శేఖ్ఖానున కొక్కఁడే పుత్రుఁడుండెను. అతఁడా దినములలో గొప్ప
జాడ్యముచేఁ బీడితుఁడైయుండెను. శేఖ్ఖాను గొప్పవాఁ డగుటచే నతఁడు
తన యధికారమునకు లోఁబడిన దేశములోనున్న గొప్పవైద్యులఁ
నందఱఁ బిలిపించి కుమారునకు జికిత్సలఁ జేయించెను. కాని యవి
యన్నియు నిష్ఫలములయ్యెను. భాగో శేఖ్ఖానున కాప్తుఁడగుటచే
ఖాను తనకుమారుని దేహస్థితి నాతనితోఁ జెప్పుకొని శీఘ్రముగనేదో
చికిత్స జేయనిపక్షమునఁ బుత్రుఁడు తనకు దక్కఁడని బిట్టు విచారిం
చెను. భాగో వానివిలాపము విని మేటివైద్యుల చికిత్సలు నిష్ఫల
ములైనందున నటమీఁదఁ జికిత్సలఁ జేయింపక భగవద్భక్తుఁడై పరమ

పవిత్రుఁడై మహిమలుచేయఁగల యోగినెవ్వనినైన బిలిపించి మంత్రి బలముచే రోగములు శరీరమునుండి నిర్మూలము జేయుట కర్తవ్యమని వాని కుపదేశించెను. ఆయాలోచనము మిక్కిలి బాగున్నదని ఖాను మెచ్చుకొని నిజముగా వాక్సిద్ధిగలవాఁడు మహిమగలవాఁడు నగు యోగిదొరకుట సులభసాధ్యము కాదని పలికెను. అనవుఁడు నగర మందున్న బైరాగుల సన్యాసుల యోగుల నందఱఁ బట్టి తెప్పించిన పక్షమున నందులో నెవ్వఁడైన నొక్క మహాత్ముఁ డుండకపోఁడని భాగో ప్రత్యుత్తరమిచ్చెను. ఆయుపదేశము లెస్సగానున్నదని మెచ్చి ఖాను కానఁబడినవిరాగుల నెల్ల బట్టుకొమ్మని సేవకులకానతిచ్చెను. అట్లు పట్టుబడిన వారిలో గురునానకుకూడ నొకఁడై యుండెను. రాజభటులు గురునానకును నిష్కారణముగఁ బట్టుకొని తీసికొనిపోవు చున్నందుకు లల్లో చాల విచారించెను. గురునానకు తనకు శిష్యుం డగు పేదవడ్రంగి నూరడించి తనయాత్మ బంధములో లేనంతకాలము శరీరముబంధింపఁ బడినను బాధల నొందినను దనకు జిజ్ఞాస లేదని పలికి వానికి ధైర్యము చెప్పెను.

మానవుఁడు తలంచున దొకటియు దైవము నిర్ణయించున దొకటియు నగుచుండును గదా. శేఖాను తనయధికారబలమున భాగో చెప్పిన యాలోచనమునను సరించి పట్టణమునంగల విరాగులనెల్ల బలవంతముగఁ బట్టి తెప్పించెనేకాని తమయభిప్రాయము వారికి సరిగ నెఱిఁగింపకమున్నె కుమారుని శరీరస్థితి వారికి దెలుపకమున్నె యంతలో మొగలాయీలు మహాసేనాసమేతులై జయాభిలాషులై వచ్చుచుండిరనియు వెంటనే తమకు లోఁబడనిపట్టణంబుల భస్మపటలము చేయుచు మనుష్యుల మ్రింగించుచుండిరనియు గుండెలవియు వార్తలు తెలిసెను. లోఁబ డని పట్టణములు భస్మపటలము లగుచున్న వనుటచేత లోఁబడిన

యూళ్లు నిరపాయములై యున్నవని తలంపవలసినపని లేదు. సీతిపా లిన యూదంటములోని సైనికులు లోఁబడిన యూరోప్యసైన్యము దోఁచుకొని స్త్రీలఁ జెఱబట్టి యథేచ్ఛముగా మెలఁగుచు వచ్చిరి. ఎట్లయినను వారి యధికార మొప్పుకొన్నగ్రామము, ఒప్పుకొనని గ్రామములకంటె నించుక సుఖతరములుగ నుండెనని చెప్పవచ్చును. ఆపాపిష్ఠులు నివిశేషముగాను వానిచుట్టములు మిత్రులు తక్కిన పట్టణములనుగా భావింపించిన దురవస్థగాని తమ పట్టణమునకుఁ గూడ తప్పక వచ్చునని మహాపదకు సంసిద్ధులై యుండిరి. అనుకొన్నంతపని జరిగె. జేబరుకొక్క మొగలాయి సైనికులు కొందరు కొంపములలోనే యున్నూరు బ్రాహ్మణులతో యనాగరకులు కొల్లకాలును సైనికులు చేయఁదగిన దుండగములన్నియుఁ జేసిరి. ఒక్కగృహముకాదు. ఒక్కస్త్రీ మానహానిగాదు. అప్పుడు జరిగిన దౌర్జన్యములను గురించెను స్వయముగఁ జూచి యుండుటచేత నతఁడు స్వభాషలో నాపురజనుల దురవస్థఁ గొన్నిపద్యములలో వర్ణించెను. ఆపద్యముల తాత్పర్య మీక్రిందఁ బొందుపరచెద. ఈవాక్యములలో నతఁడంతఃపురస్త్రీల దురవస్థనే మిక్కిలివర్ణించి యున్నాఁడు.

“అహా? యీస్త్రీలు మున్ను పువ్వులతో సుగంధతైలములతో నగలతో వారిశిరసుల నలంకరించుకొని యుండిరికదా! ఆ యువతులిప్పుడు శిరస్సులు ముండనముచేయించుకొని నోట మట్టిఁగొట్టుకొని పోవుచున్నారుగదా! తొల్లి యీ యంగనలు సుందరమందిరములు వసియించుచుండిరిగదా! నేఁడు వారిజయించిన వారియెదుట నిలువనైనఁ దగరట. వందనము సర్వేశ్వరా! వందనము. నీసంకల్ప మెవ్వఁ డెఱుంగఁడు గదా! నీవేమి చేయఁదలంచెదవో నీవ యెఱుంగుదువు. ఈ పడంతులు వివాహకాలమున భర్తలపార్శ్వముల నెంతెంత శోభిల్లుచుండిరో గదా! వివాహసంతోషమున నీ వెలఁదులు

పిల్లకులెక్క భర్తృగృహములకుఁ బోయినప్పు డెంతెంత వైభవము తో నుత్సవములు జరిగెనో కదా ! చేతుల కంకణాలు ధగధగమె అయ సీగ్రొత్తపెండ్లికూఁతు లత్తవారి గుమ్మములముందు నిలిచి నప్పుడు ముసలిముత్తయిదువులు పీడాపరిహారర్థ మెన్ని సారులు దృష్టి తీసిరో కదా ! వారి నోట మాట వచ్చినా లెక్కలేని ధనము వారియధీనమయ్యెనుగదా ! హంసతూలికాతల్పముల మీఁద హాయి గాఁ బన్నుండుటయెగాని పనిచేసి యెఱుంగరుగదా. కావలసిన సమ స్తమధురఫలములు వారికవలీలగఁ జేకురు చుండెడివి. ఆ యువిదలు శరీరములమీఁద ధరించిన చీనిచీనాంబరములు మణిభూషణములు వెలలేనివిగదా ! కటకటా ఇప్పుడు వారిచక్కఁదనమె వారికి శత్రు వయ్యెను. వారివిభవమె విరోధియయ్యెను. దురాత్ములగు యధికా రుల యాజ్ఞాప్రకారము సైనికు లాస్త్రీలం జెఱబెట్టిరి. దైవము తనకి చ్చవచ్చినవారి నున్నతపదవికిం దెచ్చి కాఁపాడును. మనుష్యుఁడుతెగు సమయమున భగవంతుని దలంచుకొన్నయెడల వారికపాయము లేల వాటిల్లును ? శత్రువులు దండువిడియకముందు ప్రభువులు భోగపరా యణులై దైవమును మఱచి నిశ్చింతతోనుందురు. ఇప్పుడేమివిచారిం చిన నేమిఫలము ? బేబరుశాసనము చెల్లుచున్నది. సుకుమారవతుల గు సుందరాంగులు సయితము పట్టెడన్నమునకు మొగము వాచియుం డిరి. మసీదులలో నమాజుచేయవలసిన యవసరము దేవాలయముల లోఁ బూజలుచేయవలసిన యవసరము లేకపోయినది. హిందూసుం దరులు మనసార మొగమునఁ గుంకుమబొట్టు బెట్టుకొనుటకైన వీలు లేని కాలము వచ్చినది. ! మునుపు వీరెవ్వరు రాముని పేరైన స్మరించి యెఱుఁగరు. ఇప్పుడు స్మరింపఁదలఁచినను శత్రువులు స్మరియింప నియ్యరు. కొందఱు చెల్లాచెదరైన తమ కుటుంబములసేమము నర యుచున్నారు. కొందఱు చుట్టపక్కముల కుశలవార్తల నడుగుచు

న్నారు. కొందఱు తమ దుష్కర్మములఫల మనుభవింపఁ గూర్చుం డినట్లు నేలఁగూర్చుండి యేడ్చుచున్నారు. భగవంతుఁ డేమిచేయ నిశ్చయించునో యదియే సంభవించును. మనుష్యుఁడు చిన్న "పురుగు"

అట్లు ప్రజల యవస్థనుగూర్చి కొన్నిపద్యములు చెప్పి నానకు పట్టణపరిపాలకుఁడగు శేఖ్‌ఖానుని దుర్గతిని వర్ణించుచు మఱికొన్ని పద్యములు రచించె. ప్రతిపద్యాంతమందు భగవంతుని మార్గము మనుష్యబుద్ధికి దుర్గమములనియు నతని శాసనము లవిలంఘనీయము లనియు నానకు నొక్కి చెప్పుచు వచ్చెను. ఆపద్యముల తాత్పర్య మీక్రింద వ్రాయుచున్నాఁడ. "ఒక కాలమందు శేఖ్‌ఖాను వాని యంతఃపురాంగనలు ననుభవించిన భోగ మింతింతయని చెప్పరాదు కదా! సేవకులు వారికనుసన్నలమెలంగి వారినోటి మాట జాఱినమాత్రమున నూడిగములు చేయుచువచ్చిరిగదా! కోరికలు కోరుటమె తడవుగా నవి సఫలము లయ్యెనుగదా! అహోరాత్రము లెడ తెగని పండుగలై మహోత్సవములతో నిండియుండెనుగదా! ఆనందసముద్రమునఁ దేలుట సౌఖ్యముల నవ్వారిగా ననుభవించుట సేవకుల కాజ్ఞాపించుట యాటలాడుట యలంకారములఁ జేసికొనుట మున్నగుపనులకంటె నన్యమెఱుంగరుకదా! అవును. శేఖ్‌ఖాను వానివంటి యితర మనుష్యులు నిశ్చయముగా నట్లు గడపిన దినములు కొన్ని యుండెను. అదృష్టము కలిసివచ్చినంతకాలము వారికట్లు జరిగెను. కటకటా వారిప్పు డెట్లున్నారు. శత్రుసైనికు లున్నసొమ్మెల్ల దోచుకొనిరి. ఈ యాయవమాన మనక యెల్లయవమానములు వారివంతయ్యె. వెనుక ననుభవించిన మహాభోగములకన్నిఁటికి బ్రాయశ్చిత్తమో యన్నట్లు కొందఱు మహాభారముగ నున్న సంకెళ్ళతోఁ గాళ్ళుకదపలేక నేఁడో రేపో గతించిన తమచెలికాండ్రఁ గలిసికొనుటకు సంసిద్ధులై చెఱసాలలో నుండుచున్నారు. భగవంతుఁడు న్యాయశీలుఁడు సర్వోన్నతుఁ

ము. అతనిశాసన ముల్లంఘించినవారు తప్పక నశింతురు. ఈనాఁటి ప్రభువులగు పఠానులు వానియాజ్ఞ దాఁటలేదా? దానిఫల మనుభవించుట లేదా? ఘాతుకులగు మొగలాయీసైనికులకుఁ బౌరుషహీనులగు పఠానుప్రభువులకు జరిగిన యాయుద్ధములో నిర్హేతుకరముగా జచ్చిన వేనవేలు పురుషులు స్త్రీలు బిడ్డలు మొదలగువారి పక్షముఁ బూనుట కెవ్వరు లేకపోయిరి."

షష్ఠాధ్యాయము.

మర్దనుఁడు గురుఁడుపుట్టిన తాల్వండీగ్రామమునకుఁ బోయెను. ఆగ్రామవాసులు వానిరాకకు సంతసించి నానకునుఁగూర్చి మిక్కిలి యాతురముతో నెన్నోప్రశ్న లడుగఁజొచ్చిరి. మర్దనునకంటె ముందు పదున్నై మాసముల క్రిందట బాలుఁడు తాల్వండికిఁబోయెను. నానకుతండ్రి యంతవఱకే నానకుమారుఁడు సన్యాసులలోఁ గలిసిపోయినాఁడని విని యీమాట నిజమో యబద్ధమో కనుగొనుటకుఁ బంపని కడకుఁబోయెను. ఇది యథార్థమే యని బాలుఁడు పలుకుటయు భగ్నమనోరథుఁ డగుకాళుఁడు కాళునికంటె నెక్కుడుగ త్రిప్తాదేవియు మితిలేని వగపునొందిరి. కాళుఁడు పుత్రస్నేహము కతమున మనశ్శాంతిఁగోల్పోయి సిగ్గుపాటుఁడగు నాకొంపకొడుకును జూచిన చోటనెల్లఁ దిట్టుచుఁ దనకుమారుని పాలిఁటి దుష్టగ్రహ మనియుఁ దన కొంపదీసినవాఁ డనియు దూషింపఁజొచ్చెను. కాళుఁడు, పుత్రుని దెస నాసవిడిచియు మరల నతఁడు సంసారమును స్వీకరింపఁడని మనంబున నెఱింగియు నెవరిప్రోత్సాహముచేతనైన బాలుఁడు విడిచిపోయినపిదప బుద్ధిమంతుఁడై సంసారమును వెండియుఁ బ్రవేశించియుండఁగూడదా

యని కొంత లేనిపోని యూసప్పెట్టుకొని మర్దనుఁడు గ్రామమునకు రాఁగానే బలునికంటె వాఁడు బుద్ధిమంతుఁడనిభావించి వాఁడు సుతునివిషయమున నేదైన మేలువార్త చెప్పునేమోయని భ్రమపడి వానినిం గలిసికొని నానకు వైరాగ్యమునుగూర్చి యనేకప్రశ్నలడిగెను. తనయునిఁగూర్చి కాళుఁడు విన్నదంతయు యదార్థమని మర్దనుఁడు ప్రత్యుత్తరము చెప్పెను. అది విన్నతోడనే కాళునియొడలు జల్లుమనెను. మొగము తెల్లబారెను. మర్దనుఁడు కాళునిమాటలకు బదులు చెప్పునపుడు నిర్భయముగను జ్ఞానగర్భితముగను మాటలాడెను. మొదట కాళుఁడే తనయునివార్త యరసినప్పుటకు మర్దనునిబుత్తెంచెనని చదువరు లెఱుంగుదురుగదా! మర్దనుఁడు తన యుదరపోషణార్థము గానవిద్య నేర్చుకొన్న వాడయ్యు గురునానకుతోఁ గొన్నినాళ్ళు సహవాసముచేయు నప్పటికి వానికి స్వలాభపరాయణత్వ మైహిక విషయాసక్తి దవ్వులయ్యెను. పారమార్థికచింత ప్రబలెను. తనవలెనే పుత్రుఁడు సంసారతంత్రములో దగుల్కొనునట్లు చేయవలయునని ప్రయత్నించుచున్న కాళునిచేష్టలయందతనికేవ గలిగెను. దయాళువు లోకబాంధవుఁడ నగుభగవంతుఁ డొకఁడున్న వాఁడనియు వాని సేవయే మానవునకుఁ బ్రథమకృత్యమనియు నతఁడు తెలిసికొనెను. తెలిసికొని తన్నుఁ బంపిన యజమానికంటె మర్దనుఁడుజ్ఞానియయ్యె. నానకుయొక్క నిశ్చలభక్తిని శాంతమును మనోధైర్యమును భూతదయను జూచినవారందఱుదివఱకెంత భక్తిహీనులైనను తప్పకభక్తితత్పరులగుదురు. అందుచేతనే మర్దనుడు స్వలాభాన్వేషిగాక నానకునకు శిష్యుఁడయ్యెను. పుత్రుడు చెడిపోయినాడని దుఃఖితుఁడైన కాళుని మర్దనుఁ డూరడించి గుణరత్నాకరుఁడగు సత్కుమారుఁడు గర్భమున జనించినందునఁ దన్నుధన్యుడుగా భావించుకొనక విచారించుట యవివేకమని యు వానికుమారుఁడు లోకసామాన్యుఁడు కాఁడనియు శ్రీకృష్ణుని

యనతారమనియు సూర్యచంద్రులయంశమునఁ బుట్టెననియు మఱియుఁ బెక్కుభంగులఁ దనభక్తికొలఁదిచెప్పి వానివీడ్కొని మొదటినుండియు నానకుయందు మంచియభిప్రాయము గలిగియుండిన రాయబులారు కడకుఁబోయి నానకు వృత్తాంత మంతయు వానికెఱింగించెను. రాయబులారు నానకు వృత్తాంతమును గాళుఁడువిన్నట్లు వినకమున్న తాననుకొన్న దానికి నాఁడువిన్నదానికి సరిపోయెనని చాలసంతసించి తాల్వెండీగ్రామమునకు గురునానకు నొకసారి బంపుమని మర్దనుని వేఁడుకొని తనమాటలుగా వానికి విన్నవింపుమని కొన్ని పలుకులు చెప్పి పుచ్చెను. మర్దనుఁడు తనవెంటనొకసారి బాలుని దోడ్కొని పయనమై యమ్నాబాదునకుఁ బోయెను.

పోయి నానకును గాంచి యతఁడు రాయబులారుమాటలుగా నిట్లని విన్నవించెను. "నేను చాలకాలమునుండి మహాత్ములగు మిమ్ముఁ జూడఁగోరుచుంటిని. కాని వార్ధకము, దేహదౌర్బల్యము నారాక కాటంకము గలిగించినవి. పయన మేనుదినములు పట్టుటచేతను బాధలు మిక్కిలి పడవలసివచ్చుటచేతను రాఁజాలనైతిని. కావున నా యెముకలు గోతిలోబడకమున్నె మీరే తాల్వెండిగ్రామము మొక్కసారి వచ్చి నాకు దర్శనమిచ్చి నన్ను ధన్యునిఁ జేయవలయునని కోరుచున్నాను." ఆ సందేశము మిక్కిలి జాలిగొలుపునదై యుండుటచేతను దనమీఁద మొదటినుండియు నభిమానముగలిగి తనకెన్నో యుపకారములు చేసిన రాయబులారునొద్దనుండి యీ సందేశము వచ్చుటచేతను నానకు దానిని జులకనగాఁ జూడలేకపోయెను. అందుచేత బాలుఁడు, మర్దనుఁడు చేరిన దినముననే నానకు లల్లోయొద్ద సెలవు పుచ్చుకొని యమ్నాబాదు విడచి తాల్వెండికిఁ బోవఁదలఁచెను.

తలఁచెనుగాని పయనము గావలసి వచ్చినప్పుడు వానిమనస్సు మిక్కిలి సందేహించెను. రాయబులారుమీఁది విశ్వాసముచేత నను

గ్రహముచేత స్వగ్రామదర్శనము వాని క్షేమమైనను వాని మనస్సునకు మిగుల బాధను కలిగించునట్టిదియు మనోధైర్యమును సంపూర్ణముగా శోధింపఁ గలిగించునట్టిదియు నగు స్థితిగతు లక్కడ నున్నట్లు వానికిఁ బొడగట్టెను. ఎవ్వనిఁగూర్చి గురునానక నిప్పటికిని భయపడు చుండెనో యా కాళుఁ డక్కడ నుండెను దయామయ స్వరూపిణియు గన్నతల్లియునగు త్రిప్తాదేవియు నక్కడనే యుండెను. క్రోధోద్దీపితుఁడగు తండ్రికఠోరభాషణములు నతఁడొకవేళ సైరించి సరకు సేయక మనోధైర్యమును జిక్కఁబట్టినఁ బట్టుఁగాక! మూర్తీభవించిన కృపారసమో యన్నట్లు మృదువులగు మాటలతో, జాలిగొల్పు చూపులతో, బాష్పపూరితములైన కన్నులతో నతనికిఁ జేరి మీఁద జెయ్యివైచి తల్లి బ్రతిమాలుకొన్నప్పు డెంతనిశ్చలహృదయముగల కొడుకైన బేలవడి లోబడకుండునా? సహజముగ మాతృభక్తి యతిశయముగా నున్న నానకువంటి గుణవంతుఁడు తల్లిమాటలఁ గెదురాడఁగలఁడా? మాటకు మాట యుక్తికి యుక్తి చెప్పి యతఁడు తొక్కినమార్గము సరికాదని సహేతుకముగా నెవ్వరైన వాదించినచో వారి నతఁడు వాదమున నోడింపఁగలఁడు. అట్లు చర్చలుపెంపక వాదములు సలుపక కన్నీళ్లనే యుక్తులుచేసికొని దయనీయములగు మాటలనే యాయుధములుగ జేసికొని కొడుకులం గెలిచి వారిమనస్సులం ద్రిప్పఁదలఁచు తల్లులముందఱ పుత్రులు నీమములు నిలుచుట యరిది. ఇందుచేతనే పూర్వకాలమునందు గౌతమబుద్ధుఁడు మొదలగు మహాత్ములందఱు సన్న్యసించి యా యాశ్రమమునందు జాలకాలము స్థిరపడినపిదప తల్లిదండ్రులు మొదలగు చుట్టములం జూడఁబోయిరి. అవి యన్నియు నానకు చక్కఁగా నెఱిఁగినవాఁడు గావున తాల్వొండికిఁ బోవుదునా మానుదునా యని మొదట నించుక సంశయించియు జననీ జనకుల బ్రార్థనలకు మనోవైకల్యము నొందక స్థిరముగా నిలిచినప్పుడే తన వైరా

గ్యము వైరాగ్యముగుననియు గానిచో నది వ్యర్థమనియు భావించి తప్పక యా యూరికిఁ బోయి తన మనోధైర్యమును బరీక్షించుకొనఁ దలఁచెను. అట్లు కృతనిశ్చయుఁడై యిరువురు శిష్యులచేత ననుగమ్యమానుఁడై నానకు తాల్వొండికిఁబోయి గ్రామముఁ బ్రవేశింపక యూరు బైటఁ జెఱువుదగ్గఱ బసచేసెను.

అతని రాక గ్రామములో దెలిసినతోడనే గ్రామవాసులు స్త్రీలు పురుషులు బాలురు వృద్ధులుఁ దమతమ పనులుకట్టి తమ గ్రామవాసియైన యా మహాయోగి దర్శనము చేయ తీర్థప్రజవలె వచ్చిరి. నానకు మనసులో తలంచినట్లు తండ్రియగు కాళుఁడు, తల్లి త్రిప్తాదేవి, పినతండ్రులలో నొకఁడు వానికడకు వచ్చిరి. అప్పుడు నానకు సన్యాసివేషముతో నుండెను. కాషాయవర్ణము గల రెండు గజములగుడ్డ తలకుఁ జుట్టుకొని యట్టిదే మఱియొకటి మొలకుఁ జుట్టుకొని మఱియొక చిన్నగుడ్డ చేతఁబూని యతఁడు కూర్చుండెను. ఊరుబైటఁ జెట్టుక్రింద నట్టిదీనవేషముతోఁ గూర్చుండిన యా కుమారునిఁ జూడఁ దల్లిదండ్రుల మనస్సెట్లు పరితపించెనో చదువరులే యూహించుకొన వచ్చును. కాళుఁడు కుమారునినీచస్థితిఁ జూచిన తోడనే మనోవైకల్యము నొంది కోపపరవశుఁడై నానకును దూషించుటకుఁ బ్రయత్నించెనుగాని శాంత స్వభావుఁడగు వాని తమ్ముఁడక్కడనే యున్నందున మనస్సు స్వాధీనములో నుంచుకొమ్మని సోదరునకు హితోపదేశముచేసి వాని సంరంభమును మాన్పెను. అనంతరము దండ్రి కుమారునితోఁ సంభాషింపఁ దలఁప నానకు పినతండ్రి లోకవృత్త మెఱిఁగినవాఁడయినందునఁ గాళుఁడుమాటలాడ మొదలుపెట్టు నేని వాని వాక్పారుష్యమువలనఁ దండ్రికొడుకుల కదివఱకే గలిగిన వియోగము మఱింత యధికమగునని వానిని మాటలాడ నీయక తానే ముందు ప్రసంగమునకు దొరకొనెను.

అన్నకొడుకును బినతండ్రి పలుకరించి ముందుగా స్వగృహమునకు రమ్మని నానకును బిలిచెను. నానక వానికిట్లు ప్రత్యుత్తర మిచ్చెను: "అయ్యా! నాయిల్లు వేఱుగనున్నది. మీయిల్లునాయిల్లు గాదు. అన్ని యిండ్లతో సంబంధము వదలుకొంటిని." కొడుకిచ్చిన యీ యుత్తరము చెవిని బడినతోడనే త్రిప్తాదేవి, పుత్రస్నేహ మనురాలోచనలను జయింప మనసు పట్టలేక వాలి గోడ్చుచుఁ గుమారుని పాదములపైఁ బడెను. మాతృవిధేయుఁడగు నాగురువు తల్లిని పనును భక్తితో బాదములపైనుండి లేవనెత్తి వినయమున నిట్లనియె. "అమ్మా! నీవు యేనాకుఁ దల్లి. సంతుష్టియే నా తండ్రి. మనోజయకారణ మగు సత్యమే నా పినతండ్రి."

ఆ యుత్తరము మిక్కిలి ప్రశంసనీయ మైనదిగదా? గురు నానకు తన యెట్టయెదుట నున్న బంధువులు బంధువులుగారని విస్పష్టముగఁ జెప్పి దీనబంధువుఁడగు భగవంతుఁడే తనబంధువుఁ డనియు వాని సన్నిధానమునకుఁ గొనిపోవఁదగిన సత్యాది సద్గుణములే తన మిత్రములనియుఁ దెలియఁజేసెను. అప్పు డాతని పలుకులు వినినవా రందఱు వాని నిశ్చలభావమునకు సంతసించి యతఁడు గృహస్థాశ్రమమును సంపూర్ణముగ విడిచినాఁడనియు జితేంద్రియుఁడై యాశల జయించి సంసార సంబంధముఁ ద్రెంచినాఁడనియు వాని చరిత్రము ముందుముందు సుజనవందితమై యుండుననియు నమ్మిరి. కష్టతరమైన మాతా పితృ సందర్శన మీవిఘ్నమును బరిణమించినందుకు తనకు మనో ధైర్యము వీడకుండఁ దాను బయటఁబడినందుకు నానకు మిక్కిలి సంతసించెను.

"మాతృదేవోభవ, పితృదేవోభవ" యని వేదములు పలుకుచున్నవిగదా. సమస్త మతములు తలిదండ్రులసేవ యుత్తమోత్తమ మని యంగీకరించుచున్నవిగదా! అట్టియెడ తలిదండ్రులకు విధే

యుండైన నానకు తన యకాల సన్యాసమువల్ల వారికిరువురకు నధిక మనోవేదన నేల గలిగింపవలయు? తల్లిదండ్రుల దుఃఖపెట్టిన యతఁడు గురువగునా యని కొంద అడుగవచ్చును. స్వలాభము నెంచుకొని తల్లిదండ్రులను విడుచువాఁడు దూష్యుఁడగును గాని లోకాను గ్రహార్థము గృహమును దారపుత్రులను మాతాపితలను స్వలాభమును స్వసౌఖ్యమును బరిత్యజించి యేకాకియై సుజనులు చుట్టములుగ జ్ఞానులు సహకారులుగ శిష్యులు బిడ్డలుగ లోకమే యిల్లుగ భగవంతుఁడు తండ్రిగ భావించి పాపుల నుద్ధరింపఁ బాటుపడి మేనులు ధారవోయునట్టి మహాత్ములు తలిదండ్రులకు మనోవేదన గలిగించినంత మాత్రమున దూష్యులుగారు. ఈ తండ్రి దుఃఖించినను బైనున్న యా తండ్రి వాని గుణములకు సంతసించును. ఈ పుత్రులు తగు జీవనాధారము లేక స్వల్పకాల మిడుములు బడినను శిష్యపుత్రులు వేన వేలు సద్గతులు గలిగి సుఖింతురు. బుద్ధదేవుఁడు తలిదండ్రులమాట సరకు సేయక సన్యసించె. శంకరాచార్యుఁడు తల్లికనిష్టమైనను వివాహపూర్వమందె నాలవయాశ్రమము స్వీకరించెను. రామానుజాచార్యుఁడు కాఁపురమునకు వచ్చిన భార్యను విడనాడి భగవత్సేవకై త్రిదండ సన్యాసియయ్యెను. బసవేశ్వరుఁ డుపనయనమే చేసికొనననని గురులమాట ధిక్కరించెను. పురాణములలో నిట్టియుదాహరణము లనేకములుగలవు. శుకుఁడు బాల్యముననే సన్యసించి తండ్రియగు వేదవ్యాసునకు మిక్కిలి మనఃఖేదము గావించెను. ప్రపంచారంభము నుండియు లోకోపకారులై మహాత్ములు గురువచనంబుల నతిక్రమించియే లోకబంధువులైరి. మాతాపితల శాసనము లతిక్రమింపఁగూడదనిన నాగు గృహమునందుండిన మానవలోకము గతియేమి కావలసి యుండును?

అట్లు నానకు తల్లియొక్కయుఁ బినతండ్రియొక్కయు

మాటల నిరాకరింప బిన తండ్రి కాలునితో నాలోచించి రాయబులారుమాటమీఁదఁ దమకు మానసమునకు గొంచెము గలదని యెఱింగి యతనిచేత బుద్ధి చెప్పించుకొనవచ్చుననుకొని వానియింట బసచేయుమని నానకును వేఁడుకొనెను. నానకు రాయబులారు నిమిత్తమే యక్కడికి వచ్చినందున వానియింటికిఁ బోవుటకే మాటంతముఁ జెప్పక కదలిపోయెను. పోయి యామహాత్ముఁడు వార్ధకముచేతఁ గదల లేకయున్న రాయబులారునుగాంచి వానిపాదములను దనహస్తములతో స్పృశించెను. ఆశతవృద్ధుఁ డీరీతిగను తన పాదములను బవిత్రుఁడగు గురువు స్పృశించినందుకు నొచ్చుకొని లేవలేక కూర్చుండియే యతనిశిరస్సు మహనీయుఁడగు నానకుని పాదములపై నుంచెను. గురువు వృద్ధుని శిరస్సు సగౌరవముగా నెత్తి సమాశ్వసించెను. ప్రియభాషణంబులతో నిరువురుఁ గొంతసేపు గడపిన పిదప నానకుబంధువులు వంటబ్రాహ్మణుని నొక్కనిఁ గుదిర్చి నానకునిమిత్తము వంట జేయించిరి. కాళుఁడుఁ దృప్తాదేవి యాదిన మంతయు రాయబులారు గృహమందే పడియుండిరి. వారు తనయింటియొద్ద భృత్యులవలె నేలపడియుండిరో యాకారణము రాయబులారు చక్కగా నెఱిఁగి తానె ముందుగ నామాట కదపక వారినోటనుండియే వారికోరికలు జెప్పింప దలఁచి ప్రసంగింపఁ జొచ్చెను. ఆతఁడు సంభాషణమారంభించి నాలుగు పలుకులు పలికినంతోడనే తృప్తాదేవి కన్నుల నీరుపెట్టుకొని తద్దయు దుఃఖితయై రాయబులారు హృదయము కరగి పోవునట్లు వగచుచు వానినిట్లు ప్రార్థించెను. "ఈకష్టకాలమందు మీరుతప్ప మాకు సాయము చేసి మమ్ముఁ దేల్చువారెవరు లేరు. నాయనా! నీ వాక్ఛక్తి వినియోగించి నాబిడ్డతో నెట్లు చెప్పవలయునో యట్లు చెప్పి వాఁడీయూరు నుండి పోకుండునట్లుచేసి పుత్రభిక్షము పెట్టుము. నీకెంతో బుణ్యముండును." రాయబులారు తృప్తాదేవి మాటలచేతఁ బరవశుఁడై నానకునుజూ

చి నీతల్లియభీష్టమెట్లయిన నెరవేర్పఁగలవాయని యడిగెను. అడిగియం తట నూరకుండక రాయబులారు వెండియు నిట్లనియె. "నాకువిస్తారము సేద్యము జేయఁదగిన భూమిగలదు. అందుకొంత నీకుచితముగ నిచ్చెద. నీవు శిస్తునీయ నక్కఱలేదు. కావలసిన పాలేళ్ళను బంపెదను. నీవేమియు శ్రమపడనక్కఱలేదు. అది సేద్యము చేయించుచు నిచ్చట నుండఁగలవా."

అతనిమాటలకు గురువిట్లు బదులుచెప్పెను. "అయ్యా! భగవన్నామ స్మరణమే విత్తనముగుఁగాక! సంతుష్టియే నాగలియగుఁగాక! వినయమే కలుపుతీత యగుఁగాక! ఇట్లుకృషి చేసిన నీభక్తివిశేషముచేతను దైవానుగ్రహముచేతను మంచిపంట పండఁగలదు. నీయిల్లు నిత్యకళ్యాణసదనమై వర్ధిల్లఁగలదు" అప్పలుకులువిని దాపుననున్న పినతండ్రి నానకుతో మెల్లగనిట్లనియె. "నీవు వ్యవసాయము వంటికష్టపు బని జేయలేని యెడల మంచియంగడి నొకదానిం బెట్టి సుఖముగఁగూర్చుండి పనిచేయుచుండుము." అనవుడు గురువు పినతండ్రికిట్లనియె. "ఇఁకనాలస్యము చేయక నీజీవితకాలమునే యంగడిచేసికొనుము. భగవన్నామమె యీయంగడిలో నమ్మెడు సరకుగా నేర్పఱచుకొనుము. ధ్యానమె యీసరకును సంపాదించుసాధనముగా నుంచుకొనుము. ఈశ్వరనామవ్యాపారము చేయువర్తకులతోనే బేరసారములఁ జేయుచుఁ గాలము గడపుము. ఇంతకన్న వేఱు వర్తకము చేయకుము" అట్లు పలికిన కొడుకుమాటలు విని పినతండ్రి వెండియు నిట్లనియె. "నీకంగడి పెట్టుట కిష్టములేని పక్షమున విదేశములు జూడ నభిలాషగలిగినపక్షమున గుఱ్ఱములవర్తకము జేయుము. అదికారణముగానీవెన్నోఁదూరపుపట్టణములఁ జూడఁగలవు" నానకు దాని కిట్లు బదులుచెప్పెను. "నీవు శాస్త్రములను వినెడు వ్యాపారమునుండి సత్యమను గుఱ్ఱములను దూరదేశములకు దీసికొనిపోయి యమ్ముము. నీదారిబత్తె

ముగ సత్కార్యములు సౌజన్యత గానిపొమ్ము. ఆవ్యాపారమువల్ల నీ కుఁగలుగు లాభమేమన నీవత్రయలోకమున కతీగి నిరాకారుఁడగు నీశ్వరు సాన్నిధ్యమును జేరి మోక్షసుఖము ననుభవింపఁగలవు" జ్ఞానియగు కుమారుఁ డన్నివిధముల నిహలోక వ్యాపారమురోసి బ్రహ్మజ్ఞానబోధకములగు పలుకులు పలుకుచుండఁ బినతండ్రి వానినెంతమాత్రము గ్రహింపలేక సిగ్గులేక మరలనిట్లనియె. "పోనీ! నీకుగుఱ్ఱపువర్తకమిష్టములేదేని సర్కారువారియొద్ద నుద్యోగములోఁ జేరుము.' ఈమాటకు గురువునోటినుండి యీక్రిందియుత్తరము వచ్చెను. "నీవు మనసార భగవంతుఁడను సర్కారును గొలువుము. నీయాత్మ భగవన్నామము మీఁది భక్తిని వృద్ధి పొందించునట్లు నడుచుకొనుము. నీ యధికారమంతయు దోషములమీఁదఁ జూపి దానిని నశింపఁజేయుము. అట్లుచేయుదువేని నీవుసిద్ధుఁడవగుదువు."

నానకునకుఁ బినతండ్రికి జరిగిన సంభాషణము విని రాయబులారు నానకుయొక్క మనస్సునకు నిష్టముగానుండునట్టి పని వానిచుట్టములు చెప్పలేదనుకొని తాను చేయబోవునుపదేశము తప్పక యంగీకరింపఁబడునని నమ్మి గురువుతో నీవిధమున బలికెను. "బీదవాండ్రకునీ వొకసత్రము వేయుము. దానిపోషణకుఁ గావలసిన ధాన్యమంతయు బండఁదగిన మంచిభూమి మూఁడు నూతులుగలది నేను నీకిచ్చెదను. నీ వుశిస్తురూపకముగా నాకేమియునీయనక్కఱలేదు." ఇదిసత్కార్యమగుటచే సాధారణముగ నానకు మెత్తబడి దానికొప్పుకొనవలసినదే. కాని యాతని మనోనిశ్చయము దృఢమైనదగుటచే నతఁడు పౌర్వాపర్యములు విచారించి దానికి సమ్మతింపలేదు. ఇదియే గాదు.ఎవ్వరెంతెంత మంచి యుపదేశములఁ జేసినను నానకుమనస్సున కవి యెక్కవయ్యె. అట్లుకొన్నిదినములు తాల్వొండిలోనుండి నానకు మెట్టకేల కాయూరువిడిచి పోఁదలఁచెను.ఏలయన నతఁడచ్చట నున్నందువలనఁ

పారమార్థికచింతగల కొంతమందికే జ్ఞానోపదేశపూర్వకమగు నుపదేశము జరుగుచుండెనుగాని విశేషజనులకు వినోదముదీరుటతప్ప నెక్కువయుపయోగము లేకపోయెను. గ్రామమువిడిచి పోఁదలఁచినప్పుడువానిని మిత్రులుఁ జుట్టములుఁ దలిదండ్రులుఁ జుట్టుకొనిరి. తల్లిదండ్రులు సన్న్యాసాశ్రమమును విడువుమని చాలబ్రతిమాలిరి. రాయబులారు సయితము తలిదండ్రుల పక్షముఁబూని వ్యాపారమేమియుం జేయనక్కఱలేదనియు నూరక స్వగ్రామమున నుండినఁజాలుఁ గావున దానికైన నియ్యకొనఁదగుననియు నానకును వేఁడుకొనెను. అందులకు నానకు తద్విషయమునఁ దనయిష్టము చెల్లదనియుఁ దనయిష్టమే చెల్లినపక్షమున జననీజనకులను తుష్టించుటకంటె మఱియొక కార్యము తనకు లేదనియుఁ దనయిష్టముకంటె నతీతమైన పరమాత్మునియిష్టమెట్లో యట్లు జరుగవలసినదనియు బదులుచెప్పెను.

అట్లు చెప్పి బలమర్దనులు వెంబడింప గురువు ప్రయాణోన్ముఖుఁడైయున్నపుడు రాయబులారు వానిసమీపమునకుఁ బోయితనకొక ధర్మకార్యము జేయు నిష్టముగలదనియు నెయ్యది యుత్తమోత్తమ కార్యమగునో గురువునోటనుండి వినవేడుక గలదనియుఁ జెప్పెను. పరోపకారము చేయఁదలఁచిన సత్పురుషునకు నిరుత్సాహము జేయుట భావ్యముగాదని గురువు వాని మంచితలంపునకు సంతసించి తాల్వండి గ్రామములో మంచిచెఱువు లేనందున మంచినీళ్ళతటాకమొకటి త్రవ్వింపనగునని వానికుపదేశము చేసెను. నానకు స్వగ్రామములోనున్నపుడచట చెఱువులేనందుకు మిగులవిచారించుచువచ్చెను. గ్రామస్థులు దానివలనఁ జాల నిడుమలు బడుచువచ్చిరి. రాయబులారుగురువు నిర్ణయించిన ధర్మకార్యము సర్వజనోపయోగమైనదని శ్లాఘించి తగినతావు వెదకి చెఱువు త్వరలోఁ ద్రవ్వించి దానికి గురునానకు పేరుపెట్టెను.

సప్తమాధ్యాయము.

ఇంతవఱకు నానకు దేశాటనమని చెప్పఁదగిన సంచారము చేయలేదు. అతఁడు తిరిగినయూళ్ళు రెండుమూఁడుమాత్రమే గలవు. అందు మొదటిది సుల్తానుపురము. రెండవది యమ్నాబాదుగ్రామము. ఈయూళ్ళకుఁ బోవునపుఁడు మార్గవశమున నతఁ డొకటి రెండుగ్రామములు చూచియుండవచ్చును. అతనిశరీరము వాని మన స్సువలెనే స్వేచ్ఛావిహారమం దాసక్తి గలదగుటఁ జేసి యతనికి దేశా టనమునందు మిక్కిలి యిష్టముండెను.

బంధుమర్దనులు వెంబడింప నట్లు తాల్వెండి గ్రామము విడిచి నానకుముందుగా యమ్నాబాదునకుఁ బోయెను. అచ్చట పూర్వ శిష్యుఁడగు లల్లో వాని నాదరించి పదునైదు దినములు తనయింట నుంచుకొనెను. అటనుండి గురువు తత్సమీపమందున్న మఱియొక తావునకుఁబోయెను. ఆస్థలమున కిప్పుడు నానకుమత మనిపేరు. ఆ కాలమం దచ్చట గాఢనియమములతో యోగాభ్యాసము జేయునట్టి సిద్ధులనేకులుండిరి. గురునానకు శిష్యసమేతుఁడై యాస్థలమునకుఁబో యి సిద్ధాశ్రమమున కెదురుగా నొకనారింజచెట్టుక్రిందఁ గూర్చుండె. ఆకిచ్చిలిచె ట్టదివఱకు చాలకాలమునుండి శోషించి మోడుగానుండె నఁట. గురువు దానిక్రింద నాసీనుఁడైనతోడనే యావృక్షము పచ్చ నియాకులు లేతచిగుళ్ళుగలిగి దర్శనీయమయ్యెనఁట. ఈవింత దూర మునుండి సిద్ధులు గనిపెట్టిరఁట. వారు తమకంటె నెక్కుడయోగు లు లేరని కడుగర్వితులై యుండువారఁట. తమకంటె నెక్కుడమహి మలు గల మహాత్ములు వచ్చెనని తెలిసికొని యాసిద్ధులు నానకు చుట్టుం జేరిరి. జోగులు పదిమంది జేరినప్పుడు వేదాంతచర్చ తప్ప మఱియొకవిషయ మేది చర్చింపఁబడును? ఆసిద్ధులు తమకు దుస్సా

ధ్యములగు వేదాంతవిషయక ప్రశ్నముల నెన్నో గురువు నడిగిరి. గురువు దేనిలోను వారికిం దీసిపోవఁ డయ్యె. సిద్ధులడిగిన ప్రశ్నల కన్నిఁటికి గురువవలీలగ మనస్సునకుఁ దక్షిణమే నాటునట్లుగ ననుభవ సిద్ధమగునట్లుగాఁ బ్రత్యుత్తరములు చెప్పి యందఱను సంతుష్టులఁ జేసెను. అంతట నాసిద్ధులు నానకు, తమకంటె నెక్కువసిద్ధుఁడని గ్రహించి వానిం గొనియాడి తమమఠమునఁ జేరుమని ప్రార్థించిరి. నానకు దానికి సమ్మతింపక మనుష్యున కాత్మశుద్ధి సత్ప్రవర్తనము మొదలగునవి యుండవలయును. కాని పై వేషములవలన లాభము లేదనియు వేషధారణములోఁ బనిలేక యంతఃకరణశుద్ధికై పాటుపడవలయుననియు దానేమతమునందు నే తెగయందుఁ జేరుట లేదనియుఁ జెప్పెను. అట్లుపలికి నానకు వారి కాసమయమున గొన్నినీతి వాక్యముల నుపదేశించెనఁట. అవి భాషాంతరమునం దుండుటచే వాని తాత్పర్య మిాక్రిందఁబొందుపఱచుచున్నాఁడ. "కాషాయాంబరము, దండము ధరించుటలోను మేనెల్ల బూడిద పూసికొనుటలోను యోగము లేదు. శిరస్సు ముండనము చేయించుకొనుటలోను శంఖము లూదుటలోను యోగము లేదు. లౌకికాకర్షణములచేతఁ జుట్టబడియు మనుష్యుఁ డాయాకర్షణములకు లోబడక వాని కతీతుఁడై యుండుటలో నిజమైన యోగమున్నది. వట్టి మాటలవల్ల నిజమైన యోగము రాదు. ఈశ్వరుని సర్వవ్యాపకత్వ మెవ్వఁడు తెలిసికొనునో యతఁడే యోగి. యోగము మనస్సులోనే కాని దానికివెలుపల లేదు. యోగము గోరీదిబ్బలలో లేదు. యోగము శ్మశానములలో లేదు. ఈశ్వరైక్యము జెందుచున్నామని దొంగమూర్ఛలు బడుటలో లేదు. నానాదేశములకరిగి తీర్థములందు మునుఁగుటలో లేదు. లౌకికాకర్షణములకు లోఁబడక వాని కతీతుఁడయి యుండుటలోనే యోగము కలదు. మన యాదిగురువగు పరమేశ్వరుని దెలిసికొం

టిమూ సర్వసంశయములు నివారణములగు. అంతట ముక్తి కరతలామలకమగును. భగవద్విషయమును దెలిసికొనఁగోరువాఁడునుండుగా మనశ్శాంతి సంపాదింపవలయును. మనస్సు తన యిష్టమువచ్చినట్లు దిరుగుటమాని నిశ్చలమైనప్పుడు పరంజ్యోతి తనలోనే వెలుఁగుచుండును. తనలో నీశ్వర తేజము ప్రకాశించుచున్నట్లు తెలిసికొనుటయే యోగము."

అనంతరము నానకు సిద్ధమఠమువిడిచి గంగానది ప్రవహించెడు భూములలో సంచారము చేయఁదలఁచి పయనమయ్యెను. ఈయాత్రాచరిత్రలు సత్యమునకు దూరములై యద్భుతములతో మహిమలతో నిండిన కల్పనాకథలై యున్నవి. నిజమైన చరిత్రము నిమిత్తము నానకునుగూర్చి వ్రాయఁబడిన ప్రాచీనగ్రంథములను మనమెంతవెదకినను నూటికొకచోట నెక్కడనో యొక సత్యమైన వృత్తాంతముండును గాని తక్కినదంతయు బృహత్కథలోనున్న కథలకన్న నెక్కుడు చిత్రకల్పనలతో నిండియుండును.

ఆచరిత్ర లట్లుండుటకు మూఁడు ముఖ్యకారణములు గలవు. అందు మొదటిది. ఆచరిత్రలు వ్రాసినవారు భూగోళశాస్త్రమేమో యెఱుఁగరు. వారు జన్మమధ్యమున స్వదేశమగు పంజాబు నప్పుడప్పుడు చూచియుందురు. కాని గంగానది ప్రవహించెడి దేశములనుగాని యచ్చట నివసించు జనులనుగాని వారెన్నఁడు జూచియెఱుఁగరు. ఏస్థలములఁజూడక స్థిమితముగా నిండ్లయొద్దగూర్చుండివిన్నకథల నాధారములు చేసికొని చరిత్రలు వ్రాయు గ్రంథకర్త లంతకంటె నెక్కువగ నేమివ్రాయఁగలరు? రెండవకారణ మిది. ఆచరిత్రలీయాత్రలు జరిగిన ముప్పదియేండ్ల తరువాత వ్రాయఁబడినవి. ఆవ్రాతలు గూడ నానకుయొక్క ప్రియభక్తుఁడగు బలుఁడే చెప్పి వ్రాయించుటచేత బయలుదేరినవి. బలుఁడు గురువుతోఁగూడ దిరిగినను విద్యాగంధ

శూన్యుఁ డగుటచేతను మూఢవిశ్వాసముగలవాఁ డగుటచేతను గ్రం థకర్తలకు గురువుమృత్తాంతమును చెప్పినప్పుడు నిజమగు వృత్తాంతములను సరిగఁ జెప్పలేక తన పిచ్చినమ్మకముల నందుఁ జొనుపుచుఁ జాలకాలము గడచిన పిదప చెప్పుటచే సరిగా జ్ఞాపకములేక తన మందమతికి స్ఫురించిన వన్నియుం దెలుపుచు గురుచరిత్రమందలి యీ భాగమును సంశయాస్పదముగఁ జేసెను. మూఁడవకారణ మిది. గురుచరిత్రము వ్రాయునప్పటికి గురువుమృతుఁడయ్యెను. అతనికీర్తి యార్యావర్తమం దంతట వ్యాపించె. ఎన్నో మహిమలు వాని కారోపింపఁబడెను. ఎన్నో యద్భుతములు వానింగూర్చి చెప్పఁబడెను. చరిత్రకారులు వానిమహిమలు వినినవారే గావున తాము వినినవి చుట్టుపక్కలజనులు చెప్పుకొనునవి యగు నలోకసామాన్య చర్యలతోఁ బుస్తకముల నింపిరి. ఆగ్రంథములలోనున్న విశ్వాస పాత్రములుకాని యంశములు విడిచి వాని యాత్రలు కొన్ని వర్ణింతము.

ఆతండు గంగాతీరమునం బయనము సేసి వంగదేశమునకు వచ్చెను. అచ్చటఁగొంతకాలముండి పిదప నతఁ డాసామునకుఁబోయి యచ్చట ననేకమాసములుండెను. ఈపయనములతో మర్దనుఁడు మిక్కిలిడస్సి తన గురువువలె భక్తితత్పరుఁడై మార్గాయాసము మఱచుటకుఁగానిజలునివలె వైరాగ్యముగలిగిశ్రమకోర్చుటకుగానిసమర్థుఁడు గాకపోయెను. అస్సాము దేశమున సంచరించుచుండ నానకు షేకుఫరీదను మహమ్మదీయ యోగియొక్క వంశస్థుఁడైన యొక తురకను గలుసుకొనెను. వారిరువురుఁ గొన్నినాళ్లు గలిసియుండి భగవద్విషయము లనేకములు చర్చించిరి. వారెడబాయునప్పుడు మతద్వేషములు లేక యొండొరులం గౌఁగిలించుకొని విషాదముతో వేఱైరి. ఆసామునుండి గురు వోఢ్రదేశమునకుఁ బోయి జగన్నాథ క్షేత్రము

ను దర్శించి యచటి యాలయమునం దర్చకులు పండాబ్రాహ్మ ణులు నిత్యకృత్యములలోఁ జేయు నకార్యములంజూచి నొచ్చుకొనెను.

జగన్నాథక్షేత్రమునుండి నానకు దక్షిణదేశమునకుఁబోయి యందనేక దివ్యస్థలముల సందర్శించి యక్కడనుండి సింహళద్వీపమునకుం జనెను. ఈగురువు వెళ్ళునప్పటికి సింహళద్వీపమును శివనాథుఁడనురాజు పాలించుచుండెను. తనదేశమునకు ముగ్గురు క్రొత్త మనుష్యులు వచ్చిరనియు నందు సామాన్యసన్యాసులకుఁబోలని యొకవిరాగి గురువై యుండెననియు శివనాథరాజు విని వానిఁ జూడఁ గోరెను. కోరి యాతనిం జూడఁబోవుటకు ముందు వానిప్రజ్ఞ యెట్టిదియో జగద్వంచనము సేయవచ్చిన మాయయోగియో నిజమైన సన్యాసియో వానిమనోనిశ్చలత యెట్టిదో కనుఁగొనియనంతరమువాని దర్శనమునకుఁ బోవలయునని రాజునిశ్చయించుకొనిపంచభక్ష్యపరమాన్నములతోనిండిన యన్నముల, విలువగల చీనిచీనాంబరములను సొగసుకత్తియలగు పడుచుకన్నియలను యోగికిఁ గానుకగాఁ బంపెను. గురునానకు మొదటి రెండువస్తువులఁ జేతితోముట్టక కన్నియలం గన్నెత్తిచూడక నిరాకరించుటయు నవి తోడ్కొనిపోయినవారు వచ్చినదారినే భగ్నమనోరథులై పోయిరి. తనకావించిన పరీక్ష గురునందలి గౌరవముఁబెంప రాజు స్వయముగ నానకును సందర్శింపవచ్చి యంతటి మహాత్ముని రాకచేతఁ దనరాజ్యము ధన్యమైనదనికొనియాడెను. ఆమహారాజుచేసిన యాదరణమునకు సంతుష్టుఁడై కాఁబోలు నానకు సింహళద్వీపమున రెండుసంవత్సరముల యైదుమాసము లుండెను. ఆ దీవివెడలి లాతిభూములకు నానకు పయనమైనప్పుడు మర్దనుఁడు నిరంతరప్రయాణములచేత విసికి గురువునువిడిచి యథేచ్ఛం జనియెను. అట్లు మర్దనుఁడు గురువును బాసిపోయినను గొంతకాలము వాని నెడఁ బాసియుండునప్పటికి వానికేమియుం దోఁచక పిచ్చియెత్తినట్లుండు

టచే గురువు పలుకకపోయెనను దనంతటఁ దానువచ్చి నానకును గలిసికొనెను.

అనంతరము గురునానకు లోకానుభవజ్ఞానము సంపాదింప భరతఖండమునకుఁ జుట్టుపట్లనున్న యనేక మ్లేచ్ఛదేశములకుఁ బయనము చేసెను. ఆయన సూచినట్లు జెప్పఁబడిన దేశములలో నొక్కదాని పేరైనను నీనాటిభూగోళశాస్త్రజ్ఞు లెఱుంగరు. ఆదేశముల కాకాలమున నట్టి పేళ్లుండెనో లేక చరిత్రకారులు జగమున లేని దేశములనూహించి గ్రంథములలో వ్రాసిరో మనము చెప్పఁజాలము. మనము నిశ్చయముగా నొక్క విషయమును మాత్రము చెప్పఁగలము. ఇస్లాము మతస్థాపకుఁడగు మహమ్మదువారి జన్మస్థలమైన యరేబియాదేశమునకు గురునానకు పోవుట నిర్వివాదాంశము. ఆదేశమునకు సముద్రయానము చేసెనో మెట్టదారినిఁ బోయెనో చెప్పఁజాలము కాని త్రోవలోఁ బారసీకపుదేశపు రేవుపట్టణమగు బుషాహరునగరము నాయన జూచెను. మార్గవశమున నతఁడేయూరికిఁబోయిన నాయూర బ్రహ్మజ్ఞానము నందాసక్తిగల మనుష్యులం జేర్చి వారికుపదేశముఁ జేసి జ్ఞానబీజముల నచ్చట నాటి యవి పెరిగి ఫలించునని తోఁచినచోట్లఁ జిన్న సంఘము లేర్పఱచి ప్రతిసమితి నొక్క పెద్దనేర్పఱచి వానికి భాయియను పేరుపెట్టి యతని యాజ్ఞకు వారు బద్ధులై యుండునట్లు శాసించి యటుపిమ్మటఁ బోవుచువచ్చెను. హిందూదేశమునకుఁ బడమటనున్న దేశములలో నేఁటికిని ధర్మశాలలుండుట కాద్యకారణ మీతఁడే. అట్లుసమాజములు స్థాపించుటలో గురునానకుయొక్క తలంపు క్రొత్తమతము స్థాపింపవలయుననికాదు. మిక్కిలి పురాతనమైన యార్యుల యుపనిషన్మతమును జగమునకుఁ జాటుటయే యాయన ముఖ్యసంకల్పము. తనచేత నుపదేశింపఁబడిన జ్ఞానవాక్యములయందు నమ్మికగల జనులు నిర్భయముగఁ దమధర్మము ననుష్ఠించి యితరులకు మార్గప్రవర్తకులై యుండవలయునని యాయన యెల్లచోటుల నొక్కి చెప్పుచువచ్చె.

అరేబియాప్రయాణములలో నానకు, వానిశిష్యులు నిర్బాధకముగ నన్నిప్రదేశములుం జూచుటకుఁ దురకవేషములు వేసికొనిరి. నానకు సహజముగఁ గలహముల కిష్టపడని పరమసాధువాటచే జగడములు రాకుండనుండుటకట్లు వేషము మార్చెనేకాని భయముచేతనెంత మాత్రముకాదు. ఏలయన నానకు మహమ్మదువారి జన్మప్రదేశమగు మెక్కాపట్టణమునకుఁబోయి,పుణ్యభూములు చూడఁదలంచియు మహమ్మదీయులకు విరుద్ధములగునాచారములనే గొన్నిఁటిని నెఱపుచువచ్చెను. మెక్కాలో మహమ్మదీయుల కొక్కయాలయముగలదు. కాబా యని దానికిం బేరు. ఆయూరికిఁ బోయిన మహమ్మదీయుఁ డెవ్వఁడు దన కాళ్లు కాబాయున్నవైపునకుఁజాపి పగలుకాని రాత్రికాని శయనింపఁడు. పండుకొన్నప్పుడు తలయే కాబావైపున నుండవలయు. నానకు తఱచు రాత్రులు పండుకొనునప్పుడు తనకాళ్లు కాబావైపునకుఁ జూపుచువచ్చె. తురకలకు భయపడినవాఁడట్లు చేయునా? ఆగుడి యధికారి యొకనాఁడు శాస్త్రవిరుద్ధముగా శయనించిన నానకునుజూచి దైవగృహమువైపు కాళ్ళుచాపుట యనాచారమని కఠినస్వరముతో మందలించెను. ఆతనికి గురు విట్లు ప్రత్యుత్తరమిచ్చె. "దేవునిగృహమేప్రక్కను మాత్రమేయుండి యేప్రక్కను లేదో నాకు దెలియదు. నీ వెఱుఁగుదువేని నాకాళ్ళు చేతఁబట్టుకొని దేవునిమందిరములేని ప్రక్కకు వాటినిద్రిప్పుము." ఆలయాధికారి వాని పలుకులు విని మతము నైనను లెక్కసేయక నోట పరిహాసములుసేయు మొండివాఁడై యుండవచ్చునని భావించి వాదము ముదరనీయక యంతతో సరిపెట్టెను. మెక్కావెళ్ళిన మహమ్మదీయులు మహమ్మదువారు పరమపదము వేంచేసిన స్థానమగు మెదీనాకువెళ్ళి యాయనసమాధిఁ జూడకపోరు. నానకు మెక్కాలోఁజూడవలసిన వైచిత్ర్యములన్నెల్లఁజూచి సంతుష్టుఁడై మెదీనాకుఁగూడ బోవఁదలంచుచుండ మర్దనుఁడు తనగురువు మెదీ

నాకు జనఁడనుకొని యక్కడకుఁబోకతప్పదని పట్టుపట్టెను. అదివఱకే వెళ్ళఁదలఁచిన గురువు శిష్యుని ప్రోద్బలముచేత వెంటనే బయలుదేరి పంద్రెండుదినములు పయనముచేసి మెదీనాపట్టణముఁజేరి మహమ్మదు సమాధింజూచి కొన్నిదినములచ్చట నుండెను. ఆదినములలో నతఁడు మెక్కాలోవలెనే యిక్కడను సమాధివైపు కాళ్ళుచాఁచి శయనించుచు వచ్చెను. మెక్కాలోనున్న యాయజమానునికంటె మెదీనాలోనున్న సమాధియజమానుఁడు చండతరుఁడు, దురహంకారుఁడు. ఇందక్కజమేమున్నది! దేవుని దూషించినప్పుడు సయితము నోరెత్తక గురువుల పేరెత్తినతోడనే రాక్షసులవలె మీఁదఁబడి మనుష్యులను దూషించి వీలగునేనిఁ జేయిచేసికొను పరమభాగవతులు ప్రతిమతమున వేనవేలు గలరు. మెక్కామెదీనాపట్టణములకుఁబోయి యాపుణ్యభూములఁజూచిన పిదప మహమ్మదువారినిఁగూర్చి నానకున కెట్టియభిప్రాయముకలిగెనో శిష్యుఁడగుబలునియీక్రిందివాక్యములవలన స్పష్టమగును. ఈమాటలు బలునినోటనుండివచ్చినను గురునియభిప్రాయములేయగుట నిజము.

మహమ్మదువారినిగూర్చి గురునియభిప్రాయములను బలుఁడీ క్రిందివిధమునఁ దెలిపెను. "మహమ్మదువారిస్వభావమున మహాత్ములకుండవలసినంతశాంతము కానఁబడక కోపపాలెయెక్కువ గానఁబడుచున్నది. పునర్జన్మరాహిత్యమగునంతటి వైరాగ్యముగూడ నాయనయొద్ద నున్నట్లు గానఁబడదు. స్వలాభపరాయణత యక్కడక్కడఁ గానఁబడుచున్నది. ఆయన పరిశుద్ధుఁడు నిష్కళంకచరిత్రుఁడు ననుటకెంతమాత్రము సందియము లేదుగాని సంపూర్ణమైన పవిత్రత సంపాదించుటకు జన్మపరంపరనుండి విమోచనమొందుటకు నీమహాత్ముఁడు మరలజన్మము నొందవలయు. ఆజన్మము హిందూస్థానమున నొక శూద్రునియింటఁ గావలయు. ఆయన జీవన్ముక్తుఁడై యొకానొకకాలమునఁ బరలోకారోహణముచేసి యీశ్వరసందర్శనముచేసెననిచెప్పెడి

మాటలు కేవలముకల్పితములు. ఏలయన నీప్రపంచమున సృష్టింపఁబడినజంతువులె నేత్రగోచరము లగునుగాని సృష్టింపఁబడనివి కంటికగపడవు. భగవంతుఁడు సృష్టిపదార్థములలోనివాఁడు కాఁడు. కావున నతఁడు మానవదృగ్గోచరుఁడగుట యసంభవము. కానిజీవాత్మచర్మోపాధిని బాసి పరిశుద్ధావస్థఁ జెందినప్పుడు పరమేశ్వరసాన్నిధ్యముఁ బడయుటకుఁ బాత్రమగును. పవిత్రమైన ఖురానుగ్రంథముభగవద్వాక్యము కాదు. కారణ మేమన, భగవంతున కొకభాష లేదు.

అట్లుకొన్ని దివసములు మదీనానగరమునుండి యచ్చటివిశేషములు దర్శించుచుండఁ బ్రియసోదరింజూడ నతనికి బుద్ధిపుట్టెను. ఈ చెలియలిమీఁద నాయనకు మొదటినుండియు నింతింత యనరానిప్రేముడి యుండెను. ఏలయన నీతోఁబుట్టువే చిన్ననాఁ డతని కెన్నిసారులో శరణం బిచ్చెను. తండ్రి కినుకఁజెంది యతనిపైఁ బిట్టలుక పూని నప్పుడు కాపాడెను. తనసోదరుఁడు మిక్కిలినీతిమంతుఁడనియు సత్యప్రియుఁడనియు నెక్కడెక్కడ యనక యవకాశము వచ్చినచోటనెల్ల వాదించుచు వచ్చెను. లౌకికవ్యవహారవిముఖుఁడై పరమేశ్వరధ్యానపరాయణుఁడై సోదరుఁడు మందమతియై యున్నపుడు తనభర్తయు సయితము పిచ్చివాఁ డని యెగతాళి సేయుచుండ నామె యతఁడు పరమభాగవతోత్తముఁ డని కనిపెట్టి గౌరవించెను. ఆకోరిక పొడమినతోడనే గురువు శిష్యసమేతుఁడై మదీనానగరమును విడిచి కొన్నిమాసములు నిరంతరప్రయాణములు గావించి పారసీకగాంధారాదిదేశము లతిక్రమించి పాంచాలదేశము ప్రవేశించి యెట్టకేలకు సుల్తానుపురముఁజొచ్చి చెలియలిగృహము జేరెను. అన్నయుం జెలియలు పరస్పరసందర్శనజనితానందమునఁ బరవశత్వము నొంది గాఢాలింగనము జేసికొనిరి. కొంతకాల మతఁడు సోదరీగృహంబున వసియించి పుణ్యభూములలో నగ్రగణ్యమైన

హిమాలయపర్వతముఁ జూడఁదలంచెను. తలపుపుట్టఁగానె యతఁడు బయలు దేఱెను.

హిమాలయము హిందూస్థానమునకు ఉత్తరమున భగవంతుఁడు నిర్మించినస్ఫటికపుగోడయో యనునట్లు భారతఖండలక్ష్మిశిరోభాగం బునఁ దాల్చినవజ్రంపుమకుటమో యనునట్లు విరాజిల్లుచుండును. ఇది యనేకపుణ్యక్షేత్రములకు నిలయము. నరనారాయణులకు నివాసమైన బదరికాశ్రమ మిందేయున్నది. సిద్ధసాధ్యగంధర్వఖేచరాదుల కిది విహారస్థాన మనియు నుమామహేశ్వరుల కనికిప ట్టనియు బ్రహ్మాదిసురగణంబునకు సిద్ధమునివర్గమునకు నీమహీధరకూటములు యజ్ఞవాటము లనియుఁ గుమారస్వామికి జన్మభూమి యనియు భగీరథప్రయత్నమున నాకాశంబుననుండి మహీతలంబునకు దిగిన గంగాదేవికి వసతిస్థలం బనియు నెల్లయోషధులకునిలయం బనియుఁ బురాణములలో వర్ణింపఁబడినది. మఱియుఁ బరమభాగవతోత్తము లగు మహామహులు పరమతస్థులు తమ్ము బాధించినప్పుడు నిలువ నీడలేక తలదాఁచుకొనుటకుఁ జోటులేక యెట్టకేలకు దుర్గమమగు నీపర్వతరాజము శరణువేఁడి గుహాంతరములు నివాసములుగఁ జేసికొని సుఖించుచు వచ్చిరి. ఇట్టియీ మహాశైలముయొక్క నపారమహిమము పురాణములవలననే గాక చూచినతెలిసినవారివలనఁగూడ విని దేశాటన పరాయణుఁ డగునానకు శ్రవణంబుల వినినదంతయు నేత్రంబులతోఁ జూచి యానందింపఁ దలఁచుట యాశ్చర్యముకాదు.

అతఁ డాపర్వతమున కరిగి యొకక్షేత్రమునుండి యొకక్షేత్రమున కరుగుచుఁ గంటి కగపడినబ్రహ్మవాదులతోడ వేదాంతచర్చలు సేయుచుఁ దనప్రభావమెఱుఁగక తన్ను నిందించినవారిచేత నానావమానంబులం బడుచు భూషణంబులకు సంతసింపక దూషణంబులకు దురపిల్లక తనపనిచేసుకొనుచుండెను. మొట్టమొదట నతని యాస్తిక

భావము కర్మకాండనిరసనము మొదలగు యామతస్థులు వానిని దమ తమమతంబులం జేసి మనిపిలిచి యతఁ డందు జేసిన యామతముల ఖండింప వారతనియెడల గౌరవము జూపకపోయిరి. కాని కాలక్రమమున నతని విశేషవిషయంబును సాటిలేని పవిత్రగుణమును పాపములేని భక్తియు సూనృతవ్రతాసక్తియు నిస్వార్థపరత్వమును నతఁ డసాధారణపురుషుఁ డనియు సర్వవిధముల నారాధనీయుఁ డనియుఁ దెలిసికొని యున్నారు గౌరవము గావించిరి. తొలుత వార్లు నతనిని విశ్వసింపక యవమానములోఁ జూచినవారు వానిసద్గుణసంపద యాలస్యముగఁ గనిపెట్టి యతఁడు తమ్ము విడిచిపోవునప్పుడు మఱి కొంతకాల మతనిసహవాససౌఖ్యము గలుగకపోయెనుగదా యనివిచారించిరి. హిమాలయమునఁ దిరుగుకాలమునను శిష్యుఁడగుమన్నన పరిస్థితి చెడెను. నానకుయొక్క శరీరము శీతోష్ణములకు జంకునది కాదు. రెండవశిష్యుఁ డగుబలుని శరీరము నంతగా గాసి జెందలేదు. కాని మితిమీఱినయాచలియు నెడతెంపు లేనియావానలు నెల్లప్పుడు నుంచుమీఁదిపయనములు సరిగ నాహారము లభింపమియుఁ బ్రయాణకష్టములు మొదలగునవి సుకుమారుఁడైన యాగాయకుని యారోగ్యమునకు భంగము గలిగించెను. నానాటి కతనిస్థితి బాగుపడుటకు మారు క్షీణించుటం జేసి గురువు యాత్రకట్టిపెట్టి పంజాబు దేశమునకుఁ బోవ నిశ్చయించెను. కాని యామండలముచేరుటకైన నవకాశము లేకయే మర్దనునిస్థితి పూర్తిగఁ జెడిపోయెను. కొన్నిదినములుమాత్రమే యతఁడు జీవింపఁగలుగునని గురువునకుఁ దోఁచెను. అందుచేత వంరతనిని దీర్ఘప్రయాణము సేయింపక దాపుననున్న యొకపల్లెకుఁ గొనికొనిపోయి చేతనైనచికిత్స చేయించి స్వహస్తములతోఁ జేయఁదగినసంతయుపచారము జేసెను. బలుఁడును దనచెలికానికి శక్యమైనపరిచర్య గావించెను. ఆయుశ్శేషము లేనప్పుడు వైద్యములు నుపచార

ములు నివృత్తియోజనములుగదా. మర్దనుఁ డిట్టికేలకు మృతినొం దెను. మర్దనుఁడు తనమరణానంతరమునఁ దనదేహము దగ్ధముసేయ వలసినదే కాని ఖననము చేయఁగూడదని గురువుతో మనవిజేసికొనె ను. శిష్యుని యిచ్ఛాప్రకారమె గురువు కళేబరమును ఖననమునే యక నగ్నిపాలు చేయుటకే కృతనిశ్చయుఁడై తద్విషయప్రయత్న ములు చేసెను. ఆముష్మర కష్టుడుగలసాత్వు మూడుశాఖలలు. ఆశా ఖీత్రియమును నానకు శిష్యునికళేబరముఁ జుట్టఁబెట్టి స్వహస్తనిర్మిత మైన చితిమీఁద శవమును బండుకుం దానును బెట్టెను. అగ్నిసంస్కా రము బలునిచేతఁ జేయింపక శిష్యవత్సలుఁడాకట్టకడపటికర్మముగూ డఁ దనచేతులతోనే చేసెను. శిష్యునకుఁ జుట్టము లెవ్వరులేమి యతని యుత్తరక్రియలు చేయుట ధర్మమని గురువు స్వయముగానె పార లౌకికక్రియలు చేసెను. నిజమైనప్రేమ యెక్కువతక్కువస్థితులుగాని వర్ణభేదముగాని పాటింపనీయదుగదా. "ఉదారచిత్తానాం వసుధయే వకుటుంబః" యనునట్లు మహానుభావులకు లోకమే కుటుంబము. మర్దనుఁడు గురువుతోఁ జిరసహవాసము జేయుటంజేసి మాధ్యము బాసి జ్ఞాన మించుకయైన సంపాదించెనాయని కొందఱు సంశయము పడవచ్చును. అట్లు సందియముపడుటకు వలనుపడదు. ఏలయన మం చిపూలు గ్రుచ్చినదారముసైతము సువాసన గలిగియుండును. అట్టి బ్రహ్మజ్ఞానసంపన్నుఁడైననానకువంటి మహానుభావునితోఁ జిరకాల ము కలసిమెలసియుండి యతఁడు సేయు వేదాంతచర్చలు పలుమా ఱు వినివిని యున్నమర్దనునకు జ్ఞానమంటదనుట యసంభవము. మొ ట్టమొదట మర్దనుఁడు నానకునొద్ద శిష్యుఁడైనప్పుడు వాఁడు తనజాతి యందు మిక్కుటమైన యభిమానము గలిగి యాశాపాశబద్ధుఁడై స్వలాభపరాయణుఁడై నల్లవారి నెగతాళిసేయుస్వభావము గలవాఁ డై చీటికిమాటికి సణుగుకొనుచు లోకవ్యవహారములయందె యాస

క్తి గలిగియుండెను. కాని కాలము గడచినకొలఁది గురువుయొక్క సదాచారసంపత్తి యీశ్వరభక్తి లోకోద్ధరణాసక్తి కన్నులారఁ జూచినకొలఁది నతనిధనకాంక్ష స్వలాభపరాయణత మొదలగు సామాన్యమానవలక్షణము లడుగంటెను. భక్తిజ్ఞానవైరాగ్యములు వాని స్థానము నాక్రమించెను. అవి హృదయమున నెలకొనుటయు నతఁడు నిరర్థకసంభాషణములతోఁ గాలక్షేపము సేయక సణుగులుగొణుగులు మాని పరాక్షేపణలు కట్టిపెట్టి జ్ఞానమార్గమును బడి బ్రహ్మనిష్ఠాసపరాయణుఁ డయ్యెను. ఆతనియందుఁ గలిగినమార్పులు గని పెట్టి సంతసించి యజ్ఞానకవచమును విడిచి జ్ఞానకవచమును దొడిగికొని తన శిష్యుఁడు దేహయాత్ర చాలించినందుకు సంతసించెను.

మర్దానునిమరణము నానకుయొక్క సంకల్పమునకు మార్పుకలిగించెను. పంజాబుదేశమునకుఁ బోవలయునని యంతకుమును దతఁ డాలోచించెను. కాని ప్రియశిష్యుఁడైనబలుఁడు సేతుబంధరామేశ్వరయాత్ర చేయవలయునని కుతూహలపడినందున నతనిమనోరథసిద్ధి గావించుటకై యతఁడు దక్షిణాపథంబున కరుగ సంకల్పించెను. ఈ ప్రయాణమున నానకున కనేకులతో వేదాంతచర్చలు జరిగెను. ఆ చర్చలు వివాదహేతువులు గాక యతనికి సంతోషప్రదములై రెండవపక్షమువారికి జ్ఞానసంధాయకములై యుండెను. రామేశ్వరయాత్ర నుండి యతఁడు తిరిగివచ్చి కొందఱు సాధువులు గురుదాసుపురము జిల్లాలో నున్న బాటలె యనుపుణ్యక్షేత్రమునకుఁ బోవుచున్నారని విని యాసాధువులసహవాసము చేయుటకును తన జన్మభూమి నింకొకసారి సందర్శించుటకును నిశ్చయించి వారితోఁ గలిసి యచ్చోటి కరిగెను. బాటలేగ్రామవాసులకును నచ్చటచేరిన తీర్థవాసులకును సనాతనసిద్ధాంతములకు వ్యతిరేకమైన మతబోధ చేయుచున్న నానకుయొక్క రాక యసహ్యమయ్యెను. ఆ మహాత్మునియెడల వారెం

తద్వేషభావము బూనిరో యెంతకఠినముగ దూషించిరో యెంతయ వమానపఱచిరో మనకు చెప్పఁజాలముకాని యెందఱెందఱుసాధువులు తనతో వితండవాదములు చేసి వెఱపించినను వెఱవనిధీరుఁడు పలు పల్లియలయందుఁ బట్టణములయందు వసియించు పూర్వాచారపరాయణుల కోపానలజ్వాలలకాహుతి బడసినిశ్చలుఁడు వేనవేలుజనులు వచ్చి ప్రశ్నలవర్షము గురిపించి వాదించి యోడిపోయి తుదకు నిందించినను మనోధైర్యము విడువనిమహాశాంతుఁడు జాటలేగ్రామము విడిచి వెడలనున్నవాఁడయ్యెను. "అతిపరిచయా దవజ్ఞః" యన్నట్లు పిన్ననాటనుండియుఁ దన్ను దనకుటుంబమును గృహపరిస్థితులను దనబాల్యవిశేషములను నెఱిగిన కాకులవంటి లోకుల సమమునున్న పుఁడు శాంతాంతఃకరణుఁడగు పరమతపోధనుఁడైననువారి వెక్కిరింపు లగ్గలమైనతఱిఁదనశాంతము నిక్కబట్టజాలఁడు.

పంజాబుదేశము విడువకమున్న మృతినొందిన మర్దనుని స్థానమందుఁ దనకుమఱియొక శిష్యుఁడు సంప్రాప్తించునేమోయని వెదుకబోచ్చెను. ప్రియశిష్యుఁడైనమర్దనున కొక్కకుమారుఁ డుండెనని యతని కప్పుడు జ్ఞప్తికి వచ్చెను. ఆబాలకుని పేరు సజ్జదుఁడు. ఆకుమారు నెట్లయిన శిష్యుఁడుగఁ బరిగ్రహించుటకు గురువును బలుఁడును కృతనిశ్చయులై తమరాక గ్రామవాసుల కెవ్వరికిం దెలియకుండునట్లు రాత్రి ప్రొద్దుపోయిన తరువాత తాల్వొండిగ్రామమునకువెల్లిరి. గురు వొకమామిడిమూలను గూర్చుండి సజ్జదునికడకు బలునిఁ బంపెను. అతఁడతిరహస్యముగఁ బోయి గురుసందేశ మెఱిఁగించినతోడనే సజ్జదుఁ డెంతకాలమునుండియో ప్రయాణ మగుచున్నవాఁడ పోలె గడియమాలస్యమైనఁ జేయక వెంటనేమూటముల్లె గట్టుకొనివానితో బయలుదేరెను. అతనిఁజూచి నానకు వానితండ్రియొక్క మరణ వార్తను దెలిపెను. నానకు యొక్క తల్లియుఁ దండ్రియు గతించినా

రిం. సజ్జదుఁ డెఱింగించెను. గురువుయొక్క పినతండ్రి మాత్రము బ్రతికి యుండె ననియు నిష్టమైనచో నతనిని జూడవచ్చు ననియు సజ్జదుఁడు విన్నవింప గతంనాస్థి మృతినొందిన వారికొఱకు విచారించిన గార్యము లేదు. జీవించియున్నవారిని జూడనక్కఱలే దని నానకు తన జన్మస్థానమున నొక్క రాత్రియైన సంపూర్ణముగఁ గడుపక శిష్యసమేతుఁడై వెడలెను.

ఈసారి గాంధార నగరమున కరుగవలయునని వారి సంకల్పము. గాంధారపురమున వసియించుచు సుప్రసిద్ధులైన బాబావలీ యను మహానుభావుని సందర్శింపవలయు నని యతఁడు బయలుదేఱెను. ఈదారి పలుమారు అతనికాలిక్రింద నలిగినదే యగుటచేత గ్రామములు పురములు బరిచితములు. ఆముప్పురును ముల్తాను మండలములోని తలంబాపట్టణము విడిచిన తరువాత గురువు బలునితోఁగూడి మెల్ల మెల్లగా వెనుకబోవుటకేర్పఱచుకొని ముందరియూరికి సజ్జదుని ముందుగాఁ బంపెను. సజ్జదుఁడు కొంత దూరము పోవునప్పటికి వాని కొకయూరు కనఁబడెను. అచ్చట హిందువులదేవాలయము మహమ్మదీయుల మసీదు నొక్క స్థలమందే యొకదానికొకటి చేరియుండెను. ఆమతాధిపతి జనపనార పీచువలె మిక్కిలి తెల్లనై నాభీవివరపర్యంతము వ్యాపించిన గడ్డము గలిగి వృద్ధుఁ డని తెలియఁజేయుటకు మొగముమీఁద ముడుతలుగలిగి చూచినవారికి గౌరవభాజన మని తోచుచుండును. సజ్జదుఁడు గంభీరుఁడైన యాతని యాకారము చూచి భక్తితత్పరుఁడై యతని కభివాదము చేసి యతనితోఁ బ్రసంగించెను. ఆవృద్ధుఁడు కొంత సంభాషణము జరిగిన పిమ్మట వానిని భోజనశాలకుఁ దీసికొనిపోయి మధురాహారములతో విందు సేయుమని సేవకుల కానతిచ్చెను. సేవకులును కడుపారవానికి మెక్కబెట్టు వారుపోలె సత్యాదరమున వానిని లోనికిఁ దీసి

కొనిపోయి యోగిరము పెట్టుటకు మాఱు వాని కట్టినపుట్టము లోలు చుకొని తిండిపెట్టక కాలు సేతులు గట్టి మూరుమూల గదిలోఁ బడ వైచిరి. ఇదిజరిగిన కొంతసేపటికి గురుఁడు బలుసమేతుఁ డై యచ్చోటికిఁ బోయి సజ్జనుని గానక యావృద్ధుని బిలిచి తనశిష్యుని శరీరాదులు వర్ణించి యానవాలు చెప్పి యట్టిలక్షణములు గల పడుచువాఁడు మీ కగుపడినాఁడా యని యడిగెను. అట్టికుఱ్ఱవాని మొగమైనఁ జూడలేదని యాయోగి భృత్యుఁడు బొంకపలుక వాని మాయమాటలు దొంగ చూపులు గురువున కనుమానము గలిగిం చెను. తోడనే బలుఁడును దానును సజ్జనునికొఱకు పలుతావులు వెదకిరి. ఎట్టకేల కన్నము లేక మిక్కిలి ఖిన్నుఁడై యొకమూలబద్ధుఁ డై యున్న సజ్జనుని వారు కనుఁగొని వానికట్లు విప్పి విముక్తుం జేసి యావృద్ధుం బిలిచి నిరపరాధు లగు బాటసారుల నావిధముగ నిష్కా రణముగ దోఁచుకొని చెఱబెట్టవలసిన యవసరమేమివచ్చె నని మిక్కిలి కఠినముగ నడిగిరి. అడుగుటతోఁ దనివినొందక గురువు కపట యోగింజూచి సాధుబాధ పరమపాతకమనియు నది కావించిన దురా చరణము లిహలోకమునకుఁ జెడుటయే గాక పరలోకమునకుఁగూడ జెడి దుర్గతులపాలగుదురని ధర్మోపదేశము చేసెను. అతితీక్ష్ణమైన యాయుపదేశముయొక్క వేఁడిమిచేతనమ్మదుసలిదొంగయొక్క రాతి గుండెయు గరిగి నీరై పోవ నతఁడు పశ్చాత్తప్తుఁడై దుఃఖపరవశుఁ డై తనకావించిన దోసమొప్పుకొని తప్పు సైరింపుమని వేఁడుకొనెను. అపురుషత్రియ మాస్థానము విడిచి కొంతదవ్వరుగునప్పటికి మర్దనుని సమాధి యున్న యూ రగుపడెను. ఆసమాధి దృష్టిపథమునం బడిన తోడనే భస్మరూపుఁ డైన తనతండ్రి యాసమాధిలో నున్నాఁడని విని సజ్జనుఁడు పితృభక్తి తరంగితాంతరంగుఁడై యాస్థానము విడిచి రాఁ జాల నని గురువుతోఁ జెప్పి యచ్చటనె జీవితశేషముఁ గడుప

నిశ్చయించుకొనెను. సజ్జనుఁడు తన్ను విడుచుటచేత గాని తన చెవుల కింక వినఁబడదని గురువు వానిని విడువలేక విడువలేక విడిచెను. శుభము సంప్రాప్తించినప్పుడు మేర మీఱిన యానందమును కష్టము సంప్రాప్తించినప్పు డపారమైన దుఃఖమును బొందుట ధీగలక్షణము గా దని శ్రీకృష్ణుఁడు భగవద్గీతలలోఁ జెప్పిననీతి స్మరించుకొని యతఁడు సజ్జనునివియోగముకొఱకు విచారము నొందలేదు. అట్లు సజ్జనుని పిత్రుసమానాధికడనెంతొవిపిబలో శిష్యుఁడై నానకుఁబహుదినంబులుప్రయాణములుచేసిగాంధార దేశమునకు హిందూదేశమునకు నడుమనున్నకొండలలో ప్రసిద్ధమైనబోలానుకనుమదాటి కడుశ్రమపడి యెట్టకేలకు గాంధారము చేరెను. బాబావలీ వానిని మిక్కిలిప్రేమతో నాదరించెను. నానకు జ్ఞానసముద్రుఁడైన బాబావలీయొక్క సహవాస సౌఖ్యము కతిపయదినము లనుభవించి మునుపటికన్న జ్ఞానసంపన్నుఁడై యచ్చోటు విడచి స్వదేశాభిమానుఁ డయ్యెను. మార్గమధ్యమున మానవంపిండను క్షత్రియుఁ డాయన కగపడెను. ఈరాచవానికి మతాసక్తి మెండు. ఎవ్వరైన దనకు సన్మతోపదేశము చేసి మంచి దారి చూపువారు దొరకుదురా యని తగినగురువు నిమిత్తము మతఁ డెదురుచూచు చుండెను. మంచినీరు త్రాగఁబూను వారికి మహాసరోవర మగపడినట్లు నిరుపేదకు పెన్నిధి లభించినట్లు నానకువంటి జ్ఞానరత్నాకరుఁ డాజ్ఞానదరిద్రునకు దొరికినతోడనే యతఁడు తనయదృష్టముచేత లభించెనని సంతసించి యనేకదినములు శుశ్రూష జేసి బహు సంవత్సరములనుండి దేనికై యన్వేషించుచుండెనో యాబ్రహ్మజ్ఞానఫలమును దనివోంద ననుభవించెను.

తిరిగి పయనము చేయునపుడు నానకు బాలనాథపర్వతము నొద్దఁ జుట్టుప్రక్కల నెక్కడ నూరుపల్లెలు లేని నట్టడవిలో నొక చెట్టుక్రింద శిష్యద్వితీయుఁడై దారి తెన్ను గానక మొసగుట కాఁకాఁగ

ములేక బడలి కూర్చుండెను. ఆకొండదాపున జోగులమఠ మొకటి గలదు. ఆజోగుల కొడయఁడైన యోగి పరమదయాళువు, పరోపకారపరాయణుఁడు. అతని యాజ్ఞాప్రకార మాజోగులు ప్రత్యహము సాయంసమయమున చిన్నచిన్నజట్లుగాఁ జేరి దారితప్పి పోవుబాటసారులను గలిసికొని వారిని దమమఠమునకుఁ దోడ్కొనివచ్చి సత్కరించుచుందురు. ఆగుంపులలో నొక్కటి వృక్షచ్ఛాయంగూర్చుండిన నానకుం గనుంగొని తమమఠమునకువచ్చి యతిథి గావలసినదని వానిని గోరెను. ఆతరుచ్ఛాయయె తన కారాత్రి నివాసయోగ్యమగు నెలవగుననియు దానదివిడిచి రాననియు నతఁ డుత్తరము చెప్పెను. వారతని యుత్తరము మఠాధిపతి కెఱిఁగింప నతఁడు కదలి పోయి స్వయముగ నతని నాహ్వానముజేసెను. అతని కోరికనిరాకరించుట మోటతనమనితలంచి గురువుతనయనుచరుని గలిసిమఠమునకరిగి యతిథియై వారిచ్చుసత్కారములనందిసంతుష్టుడయ్యెను. అతఁడామఠముననొకటిరెండుదినములుండిమరలబయలుదేరి తెంపులేనిపయనములు చేసితనమామగారైనమూళుఁడునసియించుగ్రామముచేరెను. అప్పటికతఁడు పదియారు సంవత్సరములనుండి ప్రయాణము చేయుచుండెను. ఆ గ్రామమునకు నానకు వచ్చినాఁడని వినినతోడనే ముదిమిచే నవయవపటుత్వము దప్పిన మూళుఁడు కన్నులార నల్లునొక్కసారిగని యతని నింటికిఁ దోడ్కొనిరావలయునని శ్రమపడి యతఁడున్నధర్మశాలకుఁ బోయి సబహుమానముగ నతనిని తనయింటికి రమ్మని వేఁడుకొనెను. గురువు బహుమానముల స్వీకరింపక యతని గృహమునకుఁ బోవుటకు సమ్మతింపక హరినామస్మరణమే తన కాప్తబంధువనియు ధర్మశాలలే తనగృహములనియుఁ జెప్పి యతనిం బంపెను.

మామగారి గ్రామమైన పఖోకరంధవాలో నానకు రెండు మాసములు లుండెను. ఆకాలములో నజ్ఞానతమః పటలముచేత నా

వృత్తులైన యనేకమనస్సులయందు జ్ఞానదీపమును వెలిగించి వారి ని నీశ్వరభక్తులుగఁ జేసెను. అంతకంత కతనిశిష్యు పరిసరస్థానము లయందు వ్యాపించుట జేసి జ్ఞానసంపాదనము నిమిత్తము జనులు పెక్కండ్రతని సన్నిధికి రాఁబోవఁగిరి. పూనవ్వయ మాగ్రామమునకు సన్నతరువాత ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునందు గొప్పతీర్థము కలుగునని తెలిసినందున నాపరు బంధువులతోఁ యచ్చటికరిగెను. ఈస్థల త్తణేసరామండలి మహాపుణ్యక్షేత్రములలోఁ గురుక్షేత్ర మొకటి. ఈక్షేత్రమందే భగవాన్డగు శ్రీకృష్ణుఁడు తన మేనమామ కుఁజెలియగు మగఁడును గాండీవధారుఁడునగు నర్జునునకు రథసారథ్యము పార్థసారథినామధేయంబునఁబ్రసిద్ధుఁడై కురుపాండవసైన్యద్వయము సమరరంగంబున నిలువఁబెట్టి యుపనిషదాకారమైనభగవద్గీతాశాస్త్రము మాధవుం డాయన కుపదేశించెను. ఈక్షేత్రమునందే కురుపాండవ రాజకుమారులు రాజ్యసామ్రాజ్యము నిమిత్తము పద్దెనిమిదినముల ఘోరంబున మహాసంగ్రామము గావించి నిహతులైరి. ఈక్షేత్రమునందే యాకాలపురాజనందనులందఱు కౌరవపాండవులలో నేదో యొకపక్షము బూని మహానామసంగ్రామమునను నిహతులై కథావశేషులైరి. మహాభారతసంగ్రామము జరిగి నేటికిని యిప్పటికి నాలుగువేల సంవత్సరములైనను ననేక రాజర్షులిచ్చట వనవిహారులై పిక స్వర్గము జూరగొనుటచే నాటఁగోలె నీభువనపావనమై పుణ్యక్షేత్రమై పుణ్యాత్ములకెల్ల సేవ్యమై పురాణచరిత్రాభిరాములకుఁ గొండక భిగమ్యమై విరాజిల్లుచున్నది. ఈకారణముచేతనే నాగ్రామములు నేటితోయి యుండెను. ఆసంవత్సరము సమ్మేళనము మిక్కిలి గొప్పది. అన్నివర్ణములవారు నన్నిమతములవారు నచ్చట సమావేశమైరి. కాని కాలక్షేపము నిమిత్తము వేడుకనిమిత్తము వేళాకోళము నిమిత్తము విహారము నిమిత్తము వచ్చినవారే కాని

ర్థవాసులలో ననేకులు నిజమైన భక్తితోడను శ్రద్ధతోడను బరమార్థముతోడను వచ్చినవారు లేరు. హోమములు గావించువారు స్వాధ్యాయము చెప్పువారు భజనలు చేయువారు, స్నానములు సలుపువారు, జపములు చేయువారు తపోనిష్ఠులైన వారు ధర్మోపదేశములు చేయువారు వేనవేలు గనఁబడిరి. విగ్రహారాధనము విరివిగా జరిగెను. నిష్కళంకమైనభక్తి నిజమైనవైరాగ్యము సత్పాత్రదానము సాధుసేవ బ్రహ్మజ్ఞానము మొదలగునవచ్చట మృగ్యములయ్యెను. నానకువంటి వేదాంతి కవియన్నియు ననహ్యములైతోచెను. ఆజపములు తపములు దానములు ధర్మములు బ్రహ్మజ్ఞాననిష్ఠుఁడైన యామహాత్మునకుఁదలనొప్పి కలిగించెను. పారమార్థికులు గాక గతానుగతికులైనమూఢలోకులకుబుద్ధి చెప్పవలయునని తలంచిబలుని బిలిచియచ్చటచెఱువులోనుండినొకచేపందెమ్మని యతఁడు తెచ్చిన యామత్స్యమునుదానకలోఁబెట్టివండింపఁదొడఁగెను. అదిచూడఁగానే తీర్థవాసులకు నతితీక్ష్ణమైన కోపము వచ్చెను. అటువంటి పావన క్షేత్రమునఁ బరమపావన చరిత్రులగు తీర్థవాసులు లక్షోపలక్షలు చూచుచుండగ నట్టివంటిపుణ్యదినమున యోగి యన్నపేరు పెట్టుకొన్నవాఁడు జీవహింస చేసి కడుపునింపుకొనుటకన్న కష్టకార్యము మఱియొకటిలేదని యచ్చటఁ జేరినవారందఱుఁ దలంచి కోపగించిరి. కొందఱు తమనాలుకలను యథేచ్ఛముగ నుపయోగించి వానిని నోటికి వచ్చినట్లు బండబూతులు తిట్టిరి. అట్టి దురాత్ముని బ్రతుకనియ్యఁ గూడదని దుడ్డుకఱ్ఱలు చేతఁబట్టుకొని చంపవచ్చిరి. వానికా సమయమున నోడలే తెలియలేదు. పొంగి పొరలివచ్చుచున్న మహాసముద్రమువలె జనసమూహము తన్ను నిర్మూలనము చేయుటకు దుడ్డుకఱ్ఱలతో వచ్చి మీఁదపడుచున్నను నతఁడు మహాపర్వతమువలెఁ జలింపక నిర్భయముగ వారిముందర నిలిచి మీఁదు వాగ్వాదముచేసి

నన్ను గెలువదలంచిరా లేక దండప్రయోగముచేతనే నిర్బంధించిరా యని యడిగెను. వర్షకాల మేఘము లుఱిమినట్లు చండస్వరమున [illegible] ము లెత్తి వారిట్లనిరి. వాగ్వాదముచేసి నీతప్పు నీవు తెలిసికొని యిక ముం దట్టిపని నెన్నడు సేయనని నీవు ప్రమాణము చేసిన పక్షమున నిన్ను విడిచెదము. లేదా యీవేషమును నీవు కోసిన [illegible] నిన్నుముక్క లుముక్కలుగాఁ గోసెదమని వారుత్తరమిచ్చిరి. అప్పుడు నానకు వారి కిట్లనియెను. "మనుష్యుఁడు ప్రారబ్ధమును బట్టి పుట్టును. ప్రారబ్ధము తోనే పెరుగుచున్నాఁడు. కావున ప్రారబ్ధమునందు సంతోషింపను [illegible] డవలసిన యవసరములేదు." [illegible] షభక్తులు వానిమాటకుఁ దగినప్రత్యుత్తరము చెప్పలేక [illegible] సంపన్నుఁడైన మహాయోగి, అతని [illegible] చల్లచల్లగ జారిరి. నానకు గురువుయొక్క ప్రతిష్ఠ దేశమంతటను ముఖ్యముగఁ బంజాబుదేశమునను క్రమక్రమముగ వ్యాపించెను. అతఁడొకమతమును మెచ్చలేదు. ఒకమతమును ఖండింపలేదు. ఏమతము నందైనను దోషములున్నపక్షమున నాదోషములను నతఁడు విమర్శించి ఖండించుచు వచ్చెను. దీనిఫలిత మేమనఁగాఁ బ్రతిమనుష్యులు నతనిం గూర్చిన కథలువినుచు నతని గుణగణములు భక్తశ్రేష్ఠులు చెప్పుకొనుచువచ్చిరి. అంతకంతకతని యశస్సు ఢిల్లీచక్రవర్తియొక్క కొలువుకూటమువఱకు వ్యాపించెను. ఆకులమున భోగపరాయణుఁడైన యిబ్రహీములోడీ ఢిల్లీచక్రవర్తియై యుండెను. ఆఢిల్లీచక్రవర్తి కితనిగోడవ లక్ష్యములేదు కాని యాతని యాస్థానమునందు స్వమతాభిమానియు నానకు సిద్ధాంతములయందు ద్వేషము గలవాఁడు నగు ముత్సద్దీయను మహమ్మదీయుఁడొకఁడు చక్రవర్తికి నానకుమీఁద నమితద్వేషము కలుగునట్లు చెవిచెంతఁజేరి కొండెము లెన్నెన్నియో చెప్పి యతనిమనస్సు పాడుచేసెను. ఆమహమ్మదీయుఁడు చక్రవర్తి

తో సీ తెలుంగున జెప్పెను. ఈనానకు మహమ్మదీయమతమునకేగాక హిందూమతమునకుఁగూడ ద్రోహవిగ్రహారాధనము సేయఁగూడద నియువర్ణభేదముదూష్యమనియునితఁడుహిందువుల నధిక్షేపించును.గో వధముపాతకమనియుమహమ్మదువారు జగద్గురువుకారనియు మనల నధిక్షేపించును. కావుననితఁడుభయమతస్థులకు విరోధియే కావుననర్వ విధముల దండ్యుఁడు" అపలుకులు చక్రవర్తికి నచ్చెను. ముత్సద్దికి గాని చక్రవర్తికిగాని హిందూమతము మీఁద నిజమైన యభిమాన మున్నదని మనము నమ్మఁగూడదు. మహమ్మదీయమతము నధిక్షే పించుటచేతనే ముత్సద్దికి నానకుపైఁబట్టరాని యాగ్రహము వచ్చెను. తనమతమును దూషించినందుకు నానకును దండించినచో హిందు వులకు గష్టముగనుండునని ముత్సద్ది హిందూమతముమీఁద నత్యం తాభిమాన మున్నట్లభినయించి చక్రవర్తి కాపరమసాధువుమీఁద పారములేని కోపము దెప్పించెను. ఆకోపావేశమునఁ జక్రవర్తి నాన కును జెఱసాలలోఁ బెట్టించెను. మహాపురుషులకుగృహములు, కారా గృహములు నొక్కవిధముగానే యుండుననుమాట భోగపరాయణుఁ డైన చక్రవర్తి యెఱుఁగఁడు. జీవన్ముక్తులగు మహాత్ములు కారా బద్ధులయ్యు చెఱసాలలో సంపూర్ణ స్వాతంత్ర్యముగలవారియట్ల సంతోష భరితులై యుందురు. అజ్ఞానులు యథేచ్ఛముగ విహరింప స్వాతంత్ర్యము గలిగియు సంసారబద్ధులై కారాబద్ధులకంటె నధిక దుఃఖము ననుభవించు చుందురు. చక్రవర్తి గురువుయొక్క శరీర మునే నాలుగుగోడల నడుమబంధించెను. కాని యతనియాత్మను బాధింపఁజాలఁడు. శరీరము చెఱనుండి గదలలేకపోయినను విశృంఖల మైన యాత్మ రోదసీకుహరమంతయు స్వేచ్ఛగా విహరించి పరమే శ్వరుని పాదములవఱకుఁ బయనము సేయును. ఆచెఱసాలలో నున్న ఖైదులు ప్రతిదినము తిరగళ్ళతోఁ గొంతపిండి విసరవలయుననినియమ

ముండెను. కారాబద్ధు లాపని బహుకష్టమును జేయవలసి వచ్చెను. నానకు స్వధర్మముచేయుటయం దత్యంతాసక్తి గలవాఁడు కావున దక్కినవాండ్రవలె రేలు పెందలకడ నిదురవోవక విసరవలసినపిండి యంతయు విసిరి శయనించుచు వచ్చెను. అది యెఱుఁగక తోడిఖైదీలు నానకుయొక్క శిష్యులు నానకునకు మహామహిమలు గల్పించి నానకు స్వహస్తముతో విసరనక్కఱలేకుండ నతని ప్రభావముచేత వాటంతటవే తిరుగళ్ళు తిరిగెననియుభగవంతుఁడేవచ్చి విసరెననియుఁ జెప్పుకొనఁజొచ్చిరి.మూఢవిశ్వాసముగలయానాఁడుజనులందఱునామాటలునమ్మిరి. దైవానుగ్రహమువలన నానకు చిరకాలముచెఱలోనుండలేదు. మొగలాయి వంశస్థుఁ డగుబేబరు కట్టకడపటిసారి హిందూదేశముపై దండు వెడలి పానిపట్టుయొద్ద యిబ్రహీము లోడీని గెలిచి యతనిం జంపి ఢిల్లీసింహాసన మెక్కెను. అతఁడు గద్దెయెక్కిన యెనిమిదవనాఁడు మహానుభావుఁడైన యోగి యొకఁడు పూర్వచక్రవర్తిచేత నిర్హేతుకముగ జెఱబెట్టబడెనని విని తత్క్షణమే యతనినివదలిపెట్టవలసినదనియు మిక్కిలిగౌరవముతోఁ దనసన్నిధికిఁదోడ్కొని రావలసినదనియు నానతిచ్చెను. అతని యాజ్ఞాప్రకారము బందెకాఁడు వానిని జక్రవర్తి సన్నిధికిఁ దోడ్కొనిపోయెను. చక్రవర్తి యతనితో భగవద్విషయమై సంభాషించి యతఁడిచ్చిన యుత్తరములకు సంప్రీతుఁడై, ప్రీతుఁడై వీడుకొలిపెను. ఏడు తరముల వఱకు బేబరుసంతతివారు హిందూస్థానము పరిపాలింతురని యాసమయమున బేబరుతో నానకు చెప్పెనని కొందఱు చరిత్రకారులు వ్రాసిరి. అట్లుమొగలాయి చక్రవర్తిని వీడ్కొని నానకు మరలదేశాటనమారంభించి కాశ్మీరదేశమునకుఁ బోయియచ్చట దనసిద్ధాంతములను బోధించి ప్రసిద్ధుఁడైనయొక బ్రాహ్మణుని దనమతమునం గలుపుకొనియె. నాటంగోలె బెక్కండ్రు నాతనిమతమును స్వీకరించి

శిష్యులైరి. కాశ్మీరమునుండి యతఁడు లాహోరుపురమునకువచ్చెను. ఆపురవాసియు మిక్కిలి పలుకుబడి గలవాఁడు గొప్పవాఁడునగు నొక తురక యమీరుగూడ నతని శిష్యుఁ డయ్యెను.

అనంతరము నతఁడు మామగారి యూరికి వచ్చెను. ఒకనాఁ డతఁ డాగ్రామమున నొకచెట్టుక్రిందఁ గూర్చుండ జాటుజాతివాఁడై న యొకబాలుఁడు పశువులం దోలుకొనుచు నాదారిం బోయెను. వానిపేరు బూరా. అతనిముఖమై ఖరింబట్టి సద్గురూపదేశము గలిగి సత్పురుషునిచేత శిక్షితుఁ డైనపక్షమున నాబాలకుండు మహాపురుషుఁడు కాఁ గలఁడని గురువు తెలిసికొని వానిం దనకడకు రమ్మని చేసన్న జేసెను. ఆబాలుఁడు తక్షణమె యాతనిసన్నిధికిం బోయి యేలపిలిచితిరని యడిగెను. పనియేమిలేదు. ఊరక పిలిచితినని గురువుత్తరముచెప్పెను. లోకఖ్యాతకీర్తియైన మహానుభావుఁడు తనవంటి యర్భకుని నిర్హేతుకముగఁ బిలువఁ డని యబ్బాలుఁడు తలంచి మఱునాఁ డొక చెంబునిండ నేయి బోసికొని యతని దర్శనమునకుఁ బోయి తన తెచ్చిన కానుక గ్రహింపుమని ప్రార్థించెను. నీతలిదండ్రులతోఁ జెప్పి యిది తెచ్చితివా వారిమెఱుకలేక తెచ్చితివాయని నానకు డింభకు నడిగి మాతాపితలకుఁ దెలియకుండఁ దెచ్చితినని యతఁడుత్తరము చెప్ప గృహాయజమానులకుఁ దెలియకుండ దొంగతనముగఁదెచ్చిన వస్తువు పుచ్చుకోనని బాలకుఁ డెంత బతిమాలినను దానిని గ్రహింపక పంపివైచెను. అనంతర మాబాలకుఁడు ప్రతిదినము గురుసందర్శనము జేసి క్రొత్తవిషయములు నేర్చుకొనుచుఁ గొంతకాలమున కాతనికి శిష్యుఁడై పంజాబుదేశమందు మిక్కిలి పేరుగాంచిన సన్యాసి యయ్యెను. ఈవిధముగ హిందువులు మహమ్మదీయులుగూడ నతని శిష్యులుగ వచ్చిరి.

మామగారియూర నాలుగుసంవత్సరములుండి మామగారి

మరణానంతరమున నతఁడు గ్రామము విడిచిపెట్టెను. అప్పటి కతని కరువది సంవత్సరములు నిండెను. మునుపటి వలె దీర్ఘప్రయాణములు చేయుట కోపిక లేకపోయెను. అందుచేత స్వస్థలము విడిచి దేశాంతరముల కరుగఁగూడ దని యతఁడు నిశ్చయించుకొనెను.

చరమావస్థ.

నానకు షష్టిపూర్తి చేసినందున మునుపటివలె సాధువులయొక్కయు సన్యాసులయొక్కయు ఫకీర్లయొక్కయు సహవాసము చేసి వేదాంతగోష్ఠిలోఁ గాలము బుచ్చుట కవకాశము లేకపోయెను. ఏదోయొకచోట స్థిరముగానుండి పశ్చిమవయస్సు గడుపవలయునని నిశ్చయించి యేగ్రామము తనకనుకూలముగా నుండునో యని యతఁడు విచారింపఁ దొడఁగెను. అట్లొకస్థానమేర్పఱచుకొనకమునుపు జన్మభూమియగు తాల్వొండి కరిగి పితృవంశస్థులలో హతశేషుల నొకసారి చూడవలయునని కోరిక గలిగినందున నతఁడచ్చట కరిగెను. అతని పినతండ్రి యగులుల్లామాత్ర మప్పటికి జీవించియుండెను. నానకు పినతండ్రియింటఁ బదునైదు దినములుండెను. యావజ్జీవ మచ్చటనే యుండవలసిన దని పినతండ్రి నానకు ననేకవిధముల బ్రతిమాలెను. కాని యతఁడు దానికి సమ్మతింపలేదు. నానకు తన్ను విడిచిపోవునప్పుడు పినతండ్రి గుఱ్ఱమొకదానిని తెచ్చి సుకరముగఁ బ్రయాణము సేయుటకు వీలుగ నుండును గనుక దానినైనఁ బరిగ్రహింపవలసినదని పలువిధముల వేడుకొనెను. అదియు బరిగ్రహింపక నానకు వానికిట్లనియె. నేను భగవంతుని కొలువు చేయుచున్నాను. ఇప్పుడు నామనస్సులో నేవిధమైన సంతాపము గాని బెంగ గాని భయము గాని సందేహము గాని లేదు. ఇది పెట్టుబడి లేనివ్యాపారము కాని లాభము విశేషముగ వచ్చుచున్నది. ఇదియిమ్మని, అది యిమ్మని యడుగువారు లేరు. ఎంతయదృష్టవంతులకొ గాని యిటువంటి బేరము

తగులునా. అట్లు చెప్పి పినతండ్రిని వీడ్కొని చిరకాలమునుండి తన్ను సేవించుచున్న బలుని తన శుశ్రూషాబాధమునుండి విడిపించి యథేచ్ఛముగ విహరింపవలసిన దని యానతిచ్చి బియాసునదీతీరమున మిక్కిలిమనోహరమైనదియొక స్థానము తనకునిలయముగ నేర్పఱచుకొని యాస్థానమునకు విశ్వకర్తయగుపరమేశ్వరునిపేరు పెట్టఁదలంచి కర్తారపురమని నామమిడెను. ఇచ్చట సాధువులు యోగులు పెక్కండ్రు చేరి యతనిని సేవించి యతని సహవాససౌఖ్య మనుభవించిరి. అతనిభార్య యగుచూనీదేవియు నానకుయొక్క కొడుకులుఁ గూడ నచ్చోటనే జేరిరి. ఆబిడ్డలువచ్చిరని యతని కానందములేదు. విచారములేదు. సన్యాసులకు తమమనస్సె సమస్తానందములు గలుగ జేయును. గానిబాహ్యవస్తువులు సంతోష మొసంగఁజాలవు. అతఁడీవిధముగ నొకచోట స్థిరముగ నుండుటవలన గొప్ప ప్రయోజనము గలిగెను. ఆమహాత్ముఁ డదివఱకు బోధించిన బోధనములవలనను గానముచేసిన గీతములవలనను చేసిన వాదముల వల్లను నతని యభిప్రాయములు దెలియుచుండినను నవి యొకవరుసలేక చెదిరి విడివిడిగా నుండుటచేత నెల్లవారికి సులభముగ లభింపకుండెను. పూర్వోత్తర సందర్భములు చక్కఁగా గమనించి యవి యొకచోఁ జేర్చివ్రాసి లోకుల కుపయోగముగ నుండునట్లు చేయవలసిన భారము తనపై నుండెను. ఒకచో స్థిరముగ నుండుటవలనఁగలుగు ముఖ్యప్రయోజన మిదియె. అకర్తారపురమునుండి నానకు తనపని నెఱవేర్చుచుండఁ లెహానఁడను నొకక్షత్రియుఁడు విష్ణుదేవి యనుక్షేత్రమునకు యాత్ర పోవుచు నీగ్రామమునకుఁబోయి యచ్చోట మహానుభావుఁ డొకఁడున్నాఁడనివిని యాతని సందర్శించెను. ఆక్షత్రియుఁడు కర్తారపురమున నొక్కదినము మాత్రమె యుండఁదలఁచెను. కాని నానకుయొక్క బోధామృతపానముచేత నతఁడు పరవశుఁడై యచ్చోటు విడువఁజాలక

నిరంతర శుశ్రూషలచేతను పరమార్థగ్రహణముచేతను వినయవివేక సంపత్తిచేతను సత్ప్రవర్తనముచేతను గురువుయొక్క యనుగ్రహము బడసెను. గురుశిష్యులకుఁ గలపరిచయము స్వల్పకాలమునుండియే యైనను నారాచవానిభక్తిజ్ఞానవైరాగ్యములు గురువుమనస్సును సంపూర్ణముగఁ గరగించి యతనియందు పుత్రవాత్సల్యము గలిగెను.

తనయనంతరమున దాను బోధించిన మతము లోకమునకు బోధించుటకుఁ దగినవాఁడా రాచవాఁడే యని నానకు వానినే పీఠాధిపతి జేసెను. ఈకార్యము చూనీదేవికి మిక్కిలి కష్టముగ నుండెను. పీఠాధిపత్యము కుటుంబమునకు గౌరవము విశేషముగఁ గలిగించుటయేగాక కట్నములు కానుకలు మొదలగువానిరూపమున ధనలాభము గూడ గలిగించును. కావున నట్టిమహాపదవి తనకొడుకులకు రాక పరాధీనమగుటచే నాయిల్లాలు మిక్కిలివగచి యది తనపుత్రులయందెనిలుపుమని యతనిం బ్రార్థించెను. కానిమతబోధకుఁడైన పీఠాధిపతి కుండవలసిన లక్షణములేవియుఁ దనకుమారులయందు బొడకట్టక క్షత్రియునియందె పొడగట్టుటచేత నతఁడు లోకోపకారార్థము పుత్రస్నేహ మోహములకు దొఱఁగి మతవ్యాప్తియె ప్రధానముగఁ జేసికొని యిల్లాలిమొఱలు పెడచెవిని బెట్టి రాచవానినె పీఠమునఁ బ్రతిష్ఠించి యతని కంగదుఁడనునామమిచ్చెను. చూనీదేవి నెట్టయిన తనకావించిన యేర్పాటున కొడంబఱుపఁదలఁచి నానకు తనకుమారులను రాచవానిని బలుసారులు భార్యయెట్టయెదుట బహువిధముల శోధించెను. ఆశోధనలలో క్షత్రియుఁడె సర్వవిధముల శ్రేష్ఠుఁడని చూనీదేవికిఁ గూడ దోఁచుటం జేసి సత్యమొప్పుకొనక తప్పదుగావున మనసులో నిష్టము లేకపోయినను నామె రాచవానినె బ్రతిష్ఠింపఁ దగునని నోటితో ననెను.

ఆమహోపదేశప్రతిష్ఠుఁడగు తన శిష్యుఁడు మత్సరగ్రస్తులైన జ

నులచేత బీడింపఁబడకుండ నతని స్వగ్రామమునకే పోయి యుండవలసినదని శాసించెను. తాను వచ్చినపని సమాప్తమైనందున నానకు దేహత్యాగము చేయవలసినకాలము సమీపించు చున్నదని గ్రహించి యందుకు సన్నద్ధుఁడయ్యెను. మరణము సమీపించుచున్నదని యాతఁడు తెలిసికొని యొకనాఁడతఁడు 'రేపు రాత్రిలోపుగ నేను లోకాంతరమున కేగుదు'నని చెప్పెనఁట. అతనిబసకు సమీపముననొక మఱ్ఱిచెట్టుగలదు. ఆవృక్ష మతనికి మిక్కిలి ప్రియము. అతఁడుపలుమాఱు దానినీడను వసియించి సుఖించెను. ఆదినమునఁగూడ నతఁ డాచెట్టుక్రిందనే తన సెజ్జ పఱపించుకొని పండుకొనియెను. ఆమహాత్మునకు గాలము సమీపించినదని విని హిందువులు మహమ్మదీయులు గూడ గడసారి యాతనిదర్శనము జేయఁగోరి గుంపులు గుంపులుగఁ బోయి చూచి ధన్యులైరి. మరణమునిమిత్తము ప్రత్యేకముగ నతఁడు గట్టించుకొన్న యింటిలోనికిఁ దన్ను తీసుకొనిపొమ్మని సాయంకాలమతఁడుకోరెను. ఆగృహమున స్వబంధువులయొక్కయు శిష్యగణముయొక్కయు సన్నిధి నతఁడు 1526 వ సంవత్సరమున నాశ్వయుజ శుద్ధదశమినాఁడుజాము రాత్రియుండఁగఁబరమపదమునొందెను. చూనీదేవియు గొడుకులు పీఠాధిపత్యము తమకుటుంబములో నుంచవలసినదని కట్టకడపటి దినమున నయితము గురుని యడుల పైఁబడి వేఁడుకొనిరి. కాని యతఁడు నిశ్చయుఁడై వారివేడికోలుత్రోసిపుచ్చెను. గురుకళేబరమునకు దహనసంస్కారము చేయతలఁచి హిందువులాశవమును రుద్రభూములకడకుఁ గొనిపోయిరి. అదివిని యెంతయు మహమ్మదీయులు నానకు తమ మతమే బోధించె ననియుఁ దమవాఁడేయనియు శవముతమయధీనమే కావలసినదనియు వాదించి శవమును ఖననము చేయుటకై తెమ్మనిరి. హిందువులందుకు సమ్మతింపకపోగా రెండు తెగలకు భయంకరమైన కలహము వచ్చుటకు సిద్ధమయ్యెను. ఉభయులు

కత్తులుదూసిరి. అప్పుడొకజ్ఞాని యాగుంపులోనుండి వచ్చి నానకువంటి మహాత్ములు తమకళేబరములోనుగూడ విడిచిపోవరు సుండీ యని పలికెను. ఆమాట విని హిందువులు మహమ్మదీయులు గూడకళేబరమును మున్నుబెట్టిన నెలవునకు బోయిచూడ నచ్చటశవము లేకపోయెను. ఎల్లవారు విస్మితులైరి. ఆయన కప్పుకొన్న నుప్పటిమాత్రము లభించుటంజేసి యదిహిందువులు మహమ్మదీయులు రెండుతునకలు చేసి చెఱియొక తునక పుచ్చుకొనిరి. హిందువులాతునకను దహనము చేసిరి. తురకలు నేలఁబూడ్చిపెట్టిరి. ఈవిధముగ మహానుభావుడైననానకు పేదకుటుంబమునపుట్టితనవిజ్ఞానసంపత్తిచేత జగద్గురువై మతకర్తయై డెబ్బదియేండ్లు జీవించి జీవితకాలములో నొక్కనిమిషమైనను వ్యర్థముచేయక జ్ఞానసంపాదనమునందే వినియోగించిసంసారశృంఖలముల నాశముగ ఛేదింపివైచి యెవ్వరికొలువు సేయక దేవదేవునికొలువే చేసిచరితార్థుడై యాతని సాన్నిధ్యముఁ బడసెను.

నానకు స్థాపించిన మతముపేరు సీకుమతము. తన్మతస్థులు సీకులు అని వ్యవహరింపఁ బడుచున్నారు. వీరు పంజాబుదేశమున విశేషముగ నున్నారు. నానకు యొక్క మతము చైతన్యవైష్ణవమతమువలె, బసవేశ్వరుని జంగమ మతమువలె వర్ణభేదశూన్యమై భక్తిరసప్రధానమైయుండును. విగ్రహారాధనము చేయ గూడదని నానకు బోధించెను. వేదమునందితనికి గౌరవము కలదు కాని యిదియే పరమప్రమాణమని యతఁ డొప్పుకొనలేదు. జీవహింసాస్పదములైన క్రతువులు మొదలగు కర్మలుపనికిరాదని యతఁడుగర్హించెను. ఈశ్వరుఁడొక్కఁడే యనియు నతఁడుసర్వశక్తుఁడనియు సృష్టిస్థితిలయకారణుఁడనియు, భక్తిచేతనే యతఁడు సాధ్యుఁ డగుననియు నితని యాశయము. శంకరరామానుజమధ్వాచార్యులవలె నితఁడు విద్వాంసుఁడు గాఁడు. జీవాత్మపరమాత్మభేదములు విచారించియితఁడుతత్త్వ

నిర్ణయములు చేయలేదు. భక్తిజ్ఞానవైరాగ్యములవలన మానవుఁడు పాపబంధములు విడిచి యీశ్వరసాన్నిధ్యము నొందునని యతఁడు బోధించెను. సీకులమతగ్రంథముపేరు ఆదిగ్రంథము. దీనికే గ్రంథసాహేబులని పేరు. దీనిలో నానకుయొక్కయు నతని యనంతరమున మతరక్షకులైన గురువులయొక్కయు సిద్ధాంతము లున్నవి. ఇతఁడు తులసీదాసు కబీరుదాసు మొదలగువారియట్లే పరమభాగవతోత్తముఁడు. ఈమతము పదియవ గురువగు గురుగోవిందుని కాలమున మహోన్నతమైన స్థితికి వచ్చెను.

సమాప్తము.

గురుగోవిందచరిత్రము

సీకుమతమునకు స్థాపకుఁడైన నానకు తన్మతమునకు ప్రథమ గురువు. ఈమతమునకు గురువులు పదిమందిగలరు. వారిలో గురుగోవిందుఁడు కడపటి గురువు. మొదటిగురువునకుఁ బదియవగురువునకు నడుమనుండిన గురువుల చరిత్రములఁ దెలియకపోయినచో గురుగోవిందుని చరిత్రము సమగ్రముగాఁ దెలియుటకు వీలులేదు. కావున వారిచరిత్రములనుగూడ సంగ్రహముగా నిందుఁబొందుపఱిచెదము.

రెండవగురువు—అంగదుఁడు.

ఈయంగదుని పూర్వవృత్తాంతము చిత్రమైనది. ఈతఁడు క్షత్రియుఁడు. పూర్వాశ్రమమం దితని పేరు లెహానా. అతఁ డొక నాఁడు తీర్థయాత్రపరుఁడై పోవుచుండ నప్పుడు కర్తరపురమందు గురునానకు వసియించుచున్నాఁ డనియు నతఁడు మహాత్ముఁ డనియు వానికిం దెలిసెను. తెలియుటయు నతఁడు ముందుగ నానకు దర్శనముఁ జేయఁదలఁచి కర్తారపురమునకుఁ బోయెను. పోయి యమ్మహాపురుని మతవిషయకోపన్యాసములు విని లెహానా పరవశుఁడై నానకునకుఁ బరమభక్తుఁడై తాను పోవఁదలఁచిన స్థానము, స్వస్థానము, స్వగృహము మఱచి వాని పాదసేవ జేయుచు నచ్చటనే యుండెను. గురునానకు శిష్యుని చిత్తనైర్మల్యము, భక్తి, విశ్వాసము, వినయము

ము, యోగ్యత మొదలగు సద్గుణములకుం గడుంబ్రియుండై తన కుమారులయందలి పక్షపాతము విడిచి తనయనంతరము లెహానా సీకు మతాచార్యుండై పీఠ మధిష్ఠింప వలయునని యాజ్ఞాపించెను. నానకు భార్యయగు చూనీదేవియుం గుమారులు దాని కొడంబడరైరి. చూనీదేవి పుత్రులలో నొకనికా పీఠాధిపత్యము నీయవలయునని పలుమారులు భర్తను బ్రార్థించెను. లెహానాయొక్క సుగుణసంపద తన యిల్లాలికిం జూపి తనయేర్పాటు నామెచేతంగూడ నొప్పింపవలయునని నానకు తనకుమారులను, లెహానాను భార్యయెదుటం బరీక్షించుచు లెహానాయొక్క బుద్ధికుశలతను జూపుచువచ్చెను. చూనీదేవియు లెహానా మిక్కలి బుద్ధికుశలుండని యొప్పుకొనియెను. కాని తన కొడుకులకాపదవి రాలేదని మనసులో విచారించుచు వచ్చెను. నానకు పరమపదమొందెడు దినమునం గూడ దారపుత్రులు తమ వంశమునందె పీఠాధిపత్యము నిలుపుమని బహువిధములం బ్రార్థించిరి. కాని గురువు వారి ప్రార్థనను జెడచెవినిం బెట్టెను. గొత్త్రవానికిం బీఠాధిపత్య మర్పించినందుకు తన యాలుబిడ్డల పోరధికమగుటంజేసి యతండు లెహానాకుం గొన్నిబాధలు కలుగునని తలంచి తన కతండు దూరముగానుండుట మంచిదని భావించి లెహానాను వాని స్వగ్రామమునకే బంపెను. లెహానా యచ్చటనేయుండి గురుమరణానంతరమున నంగదుండను బిరుదువహించి సీకుల రెండవగురు వయ్యెను. అంగదుండు తన గురువుచెప్పిన మార్గమునే యనుసరించెను. సీక్కుల వేదమగు నాదిగ్రంధమున నంగదుండు రచించిన భాగములు స్వల్పముగం గలవు. అవి యేకేశ్వరారాధనముం దెలుపుచు మనోహరములుగానుండును. అమృతసరము మండలములో నున్న ఖాదూరు గ్రామమతండు నివాసముగ నేర్పరచుకొని రేయుంబవళ్ళు భగవత్ప్రార్థనము ధ్యానముం జేయుటలోనే కాలము బుచ్చుచుం దన్నుసేవింపవ

చ్చినవారికి పరిశుద్ధమైన యీ సిక్కమతముం దెలుపుచు యెల్లర గౌర వమునకుఁ బాత్రుఁడయ్యెను. అతఁడు గొప్పదాత. వానిగృహ మ న్నాతురులకు సత్రమై యుండెను. అతని మృదుభాషలను కఠినసీమము లను దానశీలమును లోకులందఱు వేనోళ్ళఁ బొగడుచువచ్చిరి. అతఁ డు మన గురుస్వామివలెనే తేతి పిండివంటలు మొదలగునవి భక్షిం పక కొయ్యరొట్టెమాత్రమే తిని దేహపోషణముఁ జేసికొనుచువచ్చె ను. గురునానకు విధముననే యంగద గురువుగూడ తనశిష్యులలో నొకనినే యనంతరగురువుగాఁ జేసెను. ఆయన కొడుకులగు వాసుఁ డు, దత్తుఁడు మహాచార్య పదమునకుఁ దగిన యోగ్యతలు లేనివా రైనందున యతఁడు శిష్యునే యోగ్యుఁడుగ వలసివచ్చెను. కుమారులుండి యీమహాపదము కాంక్షించుచున్నపుడు వారి కాపదవి నొసఁగక యర్హుఁడైన వానినే తత్పదవినుంచిన నానకుయొక్కయు ,నంగదుని యొక్కయు మనోధైర్యము నిష్పక్షపాతబుద్ధి మిక్కిలి శ్లాఘనీయ ములుగదా!. సీకుల మతగ్రంథములు వ్రాయఁబడిన గురుముఖీ లిపి నీయంగదుఁడే కనిపెట్టెనఁట. ఈలిపి ప్రస్తుతము సంస్కృతభాష వ్రాయఁబడుచున్న నాగరలిపినిఁ బోలియుండును. గురువు జీవించి యుండగనే యంగదుఁడు దానిని నిర్మించెనని కొందఱును వానిపరో క్షమున నిర్మించెనని కొందఱును జెప్పుదురు. ఈయంగదుఁడు 2 సం వత్సరముల కొన్నిమాసములు మతగురువై క్రీ॥ శ॥ 1552 సంవత్సర మునఁ గాలధర్మమొందెను. అతఁడు మరణపూర్వ మనేక సంవత్సర ములనుండి కాళ్ళమంటలబాధ పడుచు తుదకారోగముబారిఁబడియె.

మూఁడవగురువు—అమరదాసు.

అంగదగురుని యనంతరమునఁ బీఠాధిపత్యమును వహించిన యమరదాసు క్షత్రియుఁడు. నానకుయొక్క మతబోధలు చెవినిఁబడు

నప్పటికి వాని కఱువదియేండ్లు నిండెను. అతఁడు గురుపీఠమునధిష్ఠిం చుట క్రిందివిధముగా సంభవించెను. సిక్కు గురువులందఱు సన్యాసులుగాక గృహస్థులయినందున నంగదుని యింటి యాఁడుపడుచొక్కతె యమరదాసు కుటుంబములోని బాలకునకుఁ బాణిగ్రహణము చేయఁబడెను. అమరదాసు క్రొత్తచుట్టమగు నంగదుఁడు పరిశుద్ధజీవనముఁ గలవాఁడనియు మహాభక్తుఁడనియు విని వానిదర్శనము చేయఁబోయెను. అంగదుఁడు చుట్టమును గౌరవించి వానికింగొన్ని కానుకలిచ్చెను. అమరదాసు తాను బాంధవ్యభావమున రాలేదనియు శిష్యభావమున వచ్చెననియుఁ జెప్పి కానుకల గ్రహింపఁడయ్యె. అదివిని యంగదుఁడు శిష్యభావమున వచ్చినపక్షమున బాంధవ్యము మాట తలపెట్టక వెంటనే శుశ్రూష జేయనారంభించు టుచితమని పల్కెను. అమరదాసు సంతసించి తత్క్షణమే వానిశిష్యుఁడై నాఁడు మొదలు పరమభక్తుఁడై యుండెను. ముసలివాఁడయ్యు నతఁడు మిక్కిలి విధేయుఁడై గురువుఁగొల్చెను. అతనిభక్తి యింతింతని వర్ణింపనలవికానిది. ఎంత నీచసేవనైన నతఁడు మనసున లేశమైన సందేహమందక గురునకుం జేయుచుండును. గురునకుఁ బాదములలో మంటరోగముగలదని యీవఱకే చెప్పియుంటిమి. ఆతని పాదములపైఁ జల్లని నీరుపోసి కడిగి వానిప్రాణము సుఖపెట్టుటకై యమరదాసు తామువసించు ఖాదూరునకు మూఁడు క్రోసుల దూరముననున్న బియాసునదికిఁబోయి కుండెడునీరు మూపునఁబెట్టి మోసికొని ప్రతిదినము నడచి వచ్చుచుండును. ఈపని నతఁడు స్వయముగాఁ జేయ నిచ్చగించెనేకాని గురు వాతని నందునియోగింపలేదు. ఒకనాఁడు రాత్రి చీఁకటిలో నదినుండి వచ్చుచుండ గురునిబసపొరుగున నున్న సాలెవాని యింటియెదుట నమరదాసు కాలుజారి గుభాలునఁ బడియెను. కుండపగిలెను. వానికి దెబ్బతగిలెను. సాలెవాఁడు చప్పుడువిని తలుప

రిపడి యదియేమో కనుగొని రమ్మని భార్యతోఁ జెప్పెను. అమర దాసు ప్రత్యహముఁబకు శ్రీను యెటేఁగినదే కావున వాని యిల్లాలు జరిగిన వృత్తాంతముఁజూచి భర్త కిట్లనియె. "ఈపని యిల్లువాకిలి లేని నిర్భాగ్యుఁ డమరదాసు చేసినది." ఈమాటలు పక్కయింట నున్న యంగదుని చెవులం బడుటయు నతఁడు సత్వరము శిష్యునికడ కుంబోయి ప్రేమాతిశయమున వానిం గౌఁగలించి లోకులు యుక్తాసో క్తులకు మనోవేదన మందకుము. నేను నీపోషకుఁడను. నాకుఁగల భాగ్యమంతయు నీదే యని పలికి యోదార్చెను. ఈపలుకులంబట్టి గురువునకు వృద్ధశిష్యునిమీఁద నెంత వాత్సల్యముగలదో తేటపడు ను. ఇదిజరిగిన కొన్నినాళ్ళకే యమరదాసు భవిష్యద్గురువుగా నంగ దునిచే నియుక్తుఁ డయ్యెను.

అంగదుని మరణానంతర మమరదాసు గురువై యాపదవి కతఁడర్హుఁడే యని యెల్లరచేఁ బొగడఁబడియె. అతఁడు సీకుమత సిద్ధాంతములను జనుల మనసున కెక్కునట్లు బోధించి చాలమందిని తనమతమునం గలుపుకొనెను. అనేకమహారాజులు జమీందారులు భక్తితత్పరులై వాని బోధనల విని పూర్వమాహాత్మ్యమునువిడచి వాని శిష్యులై బాగుపడిరి. నానకు కుమారులలో నొకఁడగు శ్రీచందుఁ డు క్రొత్తగా దాసులపేరఁ గొందఱ శిష్యులం జేరఁదీసి వారినొక తెగగాఁ నేర్పఱచెను. స్థాపకుఁడు గురునానకు పుత్రుఁడగుటచే లో కులామతముఁగూడ నానకు కల్పించినదే యని భ్రమించుచువచ్చిరి. ఆభ్రమ నివారింపఁదలఁచి యమరదాసు నానకుయొక్క సీకుమత స్థులను వానిపుత్రునియు దాసులనుండి వేరుపఱచెను. ఈపని యం గదగురువే చేయవలసినది. కాని యతఁడు నానకుమీఁదం గల గౌర వాతిశయమున వాని పుత్రుని మనసు నొప్పించుట కిష్టములేక యూరకుండెను. అందువలన నమ్మహాకార్య మమరదాసు పాలం బడియె.

అమరదాసునకొక కొడుకు, నొక కూఁతురుఁ గలదు. కొడుకు పేరు మోహనుఁడు, కూఁతురుపేరు భాని. కొడుకు పీఠాధిపత్యమున కనర్హుఁడని యమరదాసు తన యల్లుఁడు రామదాసున కాపదవి నిచ్చెను. అమరదాసు కూఁతును రామదాసున కిచ్చి వివాహముచేయుటనుగూర్చి లోకులీకథను చెప్పుకొనుచున్నారు. అమరదాసు కూఁతురుమీఁద నధికానురాగముఁ గలిగి యామెకుఁ దగినవరునిఁగూర్చ బహుప్రయత్నములు చేసెను. ఒకనాఁ డతఁడు తనమనోరథమును దనయొద్ద పనిచేయుచుండిన యొకబ్రాహ్మణున కెఱింగించి మంచివరుని వెదుక నాజ్ఞాపించెను. ఆవిప్రుఁడు కొన్ని తావులకరిగి పెండ్లికొడుకుల ననేకులంజూచి యమరదాసు కడకుఁబోయి యన్నివిధముల భానికిం దగిన వరుఁడు లభించెనని విన్నవించెను. పెండ్లికొడు కెంతపొడవుండునని గురువు బ్రాహ్మణు నడుగుటయు నతఁడు చుట్టుప్రక్కల గుంపుఁ గూడియున్న జనులనందఱఁ బరికించిచూచి యందొకబాలునిఁజూపి "పెండ్లికొడుకు సరిగా వీనియంత పొడవుండు" నని పలికెను. అదివిని గురువు లావణ్యమును గ్రక్కుచున్న యాబాలుని మొగము వంక తప్పకచూచి వానిం బలుకరించి "నీపేరేమి? వంశమెద్ది? వృత్తియేమి" యని యడిగెను. ఆబాలుఁడు తనపేరు రామదాసనియు తాను క్షత్రియుఁడననియు గండ్వాలు గ్రామవాసిననియు గౌరవముగా జీవనము జరుగుచుండెననియు గురువునకుఁ బదులుచెప్పెను. అమరదాసు వానివృత్తాంతము విని ముదితహృదయుఁడై బ్రాహ్మణుఁడు తీసుకొని రాఁదలఁచిన పెండ్లికొడుకును విడిచి యెట్టయెదుటనున్న బాలుఁడగు రామదాసు రూపరేఖావిలాసంబులంబట్టియు వంశముబట్టియుఁ దనకూఁతునకుఁ దగువరుండని దలంచి వానికామెనిచ్చి వివాహము చేసెను.

అమరదాసు మతబోధ చేయునపుడు సర్వదా సంఘమునందలి

దురాచారములను వెలిపుచ్చి ఖండించుచుండెను. సహగమనము ఘోరకృత్యమని యతఁడు తలఁచుచుఁ గర్హించుచువచ్చెను. ఢిల్లీచక్రవర్తియగు నక్బరు వానిమీఁద నిష్టముగలవాఁడై పలుమారు రావించి భూషించెను. అట్లు జగద్విఖ్యాతముగ నిరువదిరెండు సంవత్సరముల యైదుమాసముల పదునొకండుగోజులు సిక్కాధిపత్యము వహించి క్రీస్తుశకము 1575 వ సంవత్సరమున గండ్వాలగ్రామమున సిద్ధి పొందెను. అతని శరీరము దహనముచేసి శిష్యులాస్థలమున నొకగొప్ప గోరీని గట్టిరి. ఇప్పటికిని బ్రతిసంవత్సరము సిక్కులాస్థలమునకు యాత్ర చేయుదురు.

నాల్గవగురువు—రామదాసు.

రామదాసు తన మామగారియాశల వ్యర్థపుచ్చలేదు. సిక్కాధిపతి యగు గురువులయొద్ద నుండవలసిన సకలలక్షణములు వానియందుఁ గలవు. అమరదాసుపై భానీదేవి కెంతభక్తియుండెనో రామదాసున కంతియ భక్తిగలదు. రామదాసునకు లోకోపకారపరాయణతయై వభక్తియాత్మశుద్ధి వానికీర్తి నలుదెసల సలముకొనఁ జేసెను. అందువలన వాని చుట్టు ననేకులుచేరి కొలిచి శిష్యులయిరి. అక్బరు చక్రవర్తి వానికీర్తివిని యొకసారి చూడఁగోరి వానిని రావించెను. చక్రవర్తి విజ్ఞానసంపన్నుఁడగుటచేతను, సర్వమతాదరము గలవాఁడగుటచేతను రామదాసు ప్రసంగములకుఁ జాల ముదితహృదయుఁడై వానికిఁ గొంతభూమి బహుమానముగ నిచ్చెను. ఆనేల గుండ్రముగ నుండినందున లోకులు దానిని రామదాసుచక్రమందురు. ఈ భూమిలో రామదాసుకొలను నొకదానిని త్రవ్వించి యమృతసరమని దానికిం బేరుపెట్టెను. ఆసరస్సు చుట్టు నొకపట్టణముతరువాత

బయలు దేరును. దానికి నమృతసరమని పేరువచ్చెను. ఈగురువు స్వగ్రామమగు గాండ్వాలులోను, స్వనిర్మితమగు నమృతసరము లోనుగూడ నివసించుచు వచ్చెను. చక్రవర్తియగు నక్బరు కాశ్మీరమునుండి ఢిల్లీకిఁబోవుచు దారిలో గాండ్వాలువద్ద నొకనాఁడువిడిసి, రామదాసుతోఁ బ్రసంగింప నిచ్ఛగించి వానిని రావించెను. గురువు వచ్చుటయుఁ జక్రవర్తి వానిని మిక్కిలి గౌరవించి వాని కావించిన వేదాంతచర్చల కలరి యేదేనొక కోరిక గోరుమనెను. రామదాసు తన కేకోరికలు లేవని లోకులపక్షమునఁ దానొకవరము చక్రవర్తి నడుగఁ దలఁపుగలఁడని విన్నవించెను. చక్రవర్తి యావరము తప్పక నొసంగుదునట్లు వాగ్దానము చేయుటయు గురు విట్లనియె. "దేవరవారు లాహోరుపురమున నున్న కాలమున సరకు విశేషముగ విక్రయమగు చుండినందున ధాన్యాదులకు మంచిధరలుండెను. ఇప్పుడు దర్బారు లాహోరువిడిచినందున ధర మందమగును. దానివలన బంటకాఁపులు చెడుదురు. కావున నీసంవత్సరము సిస్తువసూలు చేయవలదని వేఁడుకొనుచున్నాను. చక్రవర్తి వానియుపదేశ మంగీకరించి దీనబంధువగు నాగురుని వచనప్రకార మాయేఁడు కాఁపులవద్ద సిస్తుగైకొనఁగూడదని యానతిచ్చి, పలు కానుకలిచ్చి గురువును వీడ్కొనెను. అట్లు రామదాసు సిక్కుమతము లోకమున వ్యాపింపఁజేయుచు నేడు సంవత్సరములు పీఠాధిపత్యము నహించి క్రీస్తుశకము 1582 వ సంవత్సరమునఁ బరమపదమొందెను. ఆతని గోలీ బీయాసునది యొడ్డున నున్నది.

అయిదవగురువు—అర్జునుఁడు.

రామదాసుతరువాత పీఠ మెక్కిన గురువులందఱు రామదాసు సంతతివారే. ఈపీఠాధిపత్యము రామదాసు సంతతియందే నిలుచు

టకు నీక్రింది కారణము ముఖ్యమయినదని లోకమున వాడుక కలదు. ఒకనాఁ డమరదాసు స్నానముచేయుటకు నాలుగుకోళ్ళ పీటమీఁద నెప్పటియట్ల కూర్చుండ దానికోడొకటి కుంటఁబొచ్చెను. అది కని పెట్టి గురువు తన కుపచారముచేయుటకు స్నానవేళ తనయొద్ద నిలిచి యున్న పుత్రికం బిలిచి కోడుక్రింద నేదైన నెత్తుబెట్టుమని చెప్పెను. భాని రాయినెత్తు పెట్టవలయునని దానికొఱకు వెదకి యెచ్చట దొర కమిఁ దనహస్తమే కుంటుకోడుక్రిందఁబెట్టెను. అమరదాసది గనిపెట్ట కయే కూఁతురు రాయినెత్తుపెట్టినదనుకొని స్నానముచేసి చూచున ప్పటికి పుత్రికహస్తమునుంచి నెత్తురు దొరఁగుచుండెను. కారణ మూహించి గురువు కాటికిగాళ్లు చాచుకొనియున్న ముసలివాని నిమి త్తమట్టిసాహసము చేయవచ్చునా యని కూఁతును మందలించి యసా ధారణమగు నామె యుపచారమునకు మెచ్చి వరమడుగుమని యామె ను బలవంతము చేసెను. బాలికయు “పితృవిషయమున నేను జేయవ లసిన పూజయే చేసితినిగాని యతిశయమేమియులేదు. మీరు సన్ను గడుపునఁ గనుటచేతనేగాక యనేకవిధంబుల మీరు నాకుగురువులరు గదా” యని వినయగర్భితముగ బలికి వరమడుగఁ బలవంతము చేసినం దున జనకున కిట్లనియె. “నాకు వరప్రదానముఁ జేయఁదలఁతురేని పీ ఠాధిపత్యము నాసంతతిలో నుండున ట్లనుగ్రహింపవలయు” అదివిని యమరదాసట్లె యగుఁగాక యని వరమిచ్చెను. నాఁటఁగోలె గురుగో విందునివఱకుఁ బీఠాధిపత్యము భానీసంతతియందె యుండెను.

రామదాసునకు భానీవలన మహాదేవుండు, పృథివిచందుఁడు, నర్జునుఁడు ననుముగ్గురు కొడుకులు కలిగిరి. పెద్దవాడు బైరాగులలో గలిసెను. రెండవవాఁడు లౌకికవ్యవహారతత్పరుఁడగుటచే దండ్రి, మూడవపుత్రుఁడగు నర్జునునకు బీఠమిచ్చెను. అందువలనపృథివిచందున కర్జునునిమీఁద నీర్ష్యపొడముటయు, నతఁడు మతబోధ జేసికొననీయక

బ్రతుకనీయక తమ్మునను బాధింపఁబూని తురకలతో మైత్రి జేసి వారిని వానిమీఁద కెసకొల్పఁజొచ్చెను. గురువగునర్జునుఁడు శాంతముదాల్చి సోదరునివలన గలిగిన కష్టముల సరకు సేయకుండెను. అంతియకాక పృథివిచందుండు కపటోపాయములచేత గురువునకు వచ్చు కానుకలు, మాన్యముల మీఁద వచ్చు సిస్తులను దానె స్వీకరించి యనుభవింపఁ జొచ్చె. గురువుకన్న దానెయెక్కుడవాఁడగుయిట్లునీకుమతస్థుల నమ్మింపఁదలఁచి పృథివిచందుఁడాడంబరముగా నొక్క పెద్దమందిరము కట్టింపఁబూని ధనమార్జింపసాగెను. కాని యామందిరము ముగియక, ధననష్టహేతువయ్యెను. సోదరుఁడు చేసిన యీప్రయత్నములచేత గురువుకూడ నిర్ధనుఁడయి మిగుల నిబ్బంది పడవలసి వచ్చెను. అయినను గాలక్రమమున స్థితిగతులించుక బాగుపడియెను. శిష్యులు పృథివిచందుఁడు దురాశాపాతకుఁడని తెలిసికొని కానుకలు వానికీయక స్వయముగ గురువుకడకుఁబోయి సమర్పింపఁజొచ్చిరి. అందుచేత నర్జునునకు ధనలాభ మధికమయ్యెను. ఆయనకు గాంధారము, పిషావరు మొదలగు దూరప్రదేశములయందు సైతము శిష్యులు బయలుదేరి విశేషముగ ముడుపుల నంపఁజొచ్చిరి. ఇట్లు బహుధనప్రాప్తి యగుటచే నర్జునుఁడు రాజయోగంబున మెఱయుచుండె. పృథివిచందుఁడును సోదరునితో సఖ్యము సంపాదించెను కాని యానెయ్య మల్పకాలమే యుండెను. అర్జునుని కంత వఱకు సంతానము లేమి యతఁడు పృథివిచందుని కుమారులలో నొకని దగ్గఱదీసెను. కాఁబట్టి పీఠాధిపత్యము తనవంశముననే యుండునని పృథివిచందు డువ్విళులూరుచుండె. అట్టుండ నాశాపిశాచగ్రస్థుఁ డయిన పృథివిచందునకు బుద్ధిచెప్పుటకో యన దైవ మర్జునుని సంతానవంతుని జేసెను. గురువునకు సుందరుఁడగు కుమారుఁడు కలిగెను. ఆబాలుఁడు నానాట నభివృద్ధిజెంది జ్ఞానసంపదచేత, సద్గుణసంపదచేత బృథివిచందుని పుత్రునికన్న మిన్నయై పీఠా

ధిపత్యమున కర్తయై యుండెను. పృథిచందునకుఁ గడుపుమంట తోఁటి కన్న హెచ్చెను. ఎట్టకేలకతఁడు పిత్రార్జితములగు భూములు, ధనములు సోదరునకిచ్చి పీడానివృత్తి చేసికొనెను.

జ్ఞాతి శత్రుత్వము వదలించుకొనియతఁడు సుఖంబున నుండఁ దలప సోదరునికంటె నెక్కుడు బలవంతుఁడు వాని కంటె నెక్కువ హానిచేయగలవాఁడునగు చందూషా గురువునకు శత్రుఁ డయ్యెను. చందుషా లాహోరునగరములో ఢిల్లీచక్రవర్తియొక్క మంత్రియై యుండెను. గురువునకు వానికిఁగల వైరకారణమిది. చందూషాకు మిక్కిలి చక్కని కూఁతు రుండెను. ఆమెకుఁదగు వరుని దెచ్చి వివాహముసేయ నతఁడు సంకల్పించి యల్లునికొఱకు వెదకుచుండ నర్జుని కుమారుఁడగు హరిగోవిందుఁడు సకలలక్షణ సంపన్నుఁడని యర్హవరుఁడని వానికిం జెలిసెను తెలియుటయు నాతఁడు వాని సంబంధమున కంగీకరింపక బాలుఁడులక్షణసంపన్నుఁడైననేమి అర్జునుడు పకీరుఁడా ? నేను వానితో వియ్యమొంది నీఁచపడుదునా? నేనొక మేడమీఁదిపై యంతస్థువంటివాఁడను. అర్జునుఁడు దానియడుగుననుండు మురికినీళ్ళ కాలువవంటివాఁడు గాదా" యని సమీపవర్తులతో బలికెను. అనంతరము కొన్నాళ్ళకు తన పుత్రికకు మంచినరుఁడు లభింపమి చందుషా హరిగోవిందుఁడే యనుకూలవరుఁడని వానికిఁగూఁతునీయదలచి ప్రధానముచేసికొనుట కర్జునునియొద్దకు వెలలేని కట్నములు కానుకలు పంపెను. చందుషా యంతకమున్ను పలికిన పలుకులు గురువునకొక్క పరిచారకుఁడు విన్నవించినందున గురువు కోపభూయిష్ఠుఁడై తన కుమారుఁడు చందూషాపుత్రికను బాణిగ్రహణము చేసికొనుటకు దగడని కానుకలం ద్రిప్పివేసి వెండియునిట్లనియె. "చందూషా చాల గొప్పవాఁడు నేను పకీరును. నాతో వియ్యమందుట కతనికి మతిపోయినదా యేమి."

అని సంబంధము నిరాకరించుటయు నావార్తలు విని చందూషా స్వయముగఁ బోయి గురునిదర్శనము జేసి బాంధవ్యమున కంగీకరింపుమని బహువిధముల వానిం బ్రార్థించెను. ఎన్నివిధముల ప్రార్థించినను గురువుతన మనోనిశ్చయమును ద్రిప్పుకొనక వానిం గసరికొట్టెను. చందూషా మహాకోపోద్దీపితుడై గురునిపై మనమున నక్కసుబూని వానికే దేని నపకారము జేయు సమయము వెదకుచుండి జహాంగీరు చక్రవర్తినద్దకుబోయి సీకు గురువు దేశములో నుండుట రాజ్యమునకు నష్టకరమని వానికి నచ్చచెప్పెను. చక్రవర్తి వానికొండెములు విని యర్జునుని దనయెదుటికి రావించి వానివలన రాష్ట్రమునకు భంగము లేదని గ్రహించి విడిచిపుచ్చదలంచుటయు చందూషా వానిని విడువగూడదని పట్టుబట్టి యర్జునుని దనస్వాధీనము చేసికొని తన యిచ్చవచ్చినట్లు వానిం జేయుటకు పాదుషా సెలవు గైకొనెను. పాదుషాయట్లు సెలవిచ్చుటయుఁ జందూషా యర్జునుని బ్రతికియుండగఁ దగులపెట్టింపవలయునని నిశ్చయించుకొనెను. గురువగు నర్జునుఁడు తనకు రాదలచిన ఘోరమరణము విని చెక్కుచెదరక భయపడక క్షమింపుమని చందూషాను ప్రార్థింపక సర్వసిద్ధుడై తగుల బెట్టకమునుపు నదిలో స్నానముచేయనిమ్మని వానికి వర్తమాన మంపెను.

చందూషా యర్జునుని కడపటి కోరికఁదీర్పఁదలఁచి రావినదిలో స్నానార్థము వాని నరుగనిచ్చెను. గురువు నదిలోమునిఁగియదృశ్యుఁడయ్యెను. ఇదిక్రీ॥ శ॥ 1607 సంవత్సరమున జరిగెను. గురువు దారుణమైన యగ్నిమరణముకంటె జల మరణమెక్కువ సహ్యముగ నుండునని తలంచి లోఁతునీట దిగి చచ్చియుండును. అనంతరము శిష్యులు వెదకి గురుని శవముం గనుఁగొని తెచ్చి దహనముచేసిరి. లాహోరు కోటయొద్ద సుందరమైన సమాధియొకటి శిష్యులచేనిర్మింపబడి యిప్పుడొక పుణ్యక్షేత్రమయి యున్నది. ఈయర్జునుఁడే సిక్కుల వేదమని

చెప్పఁదగిన యాదిగ్రంథమును బ్రస్తుతమున్న విధముగా బయటికిఁ దెచ్చెను. ఈ గ్రంధ మీయన రచియింపలేదు. నానకు మొదలగు పూర్వగురువులు రచియించిన గ్రంథములను సంస్కరించి తాను కొన్ని భాగముల రచియించి యందుఁ జేర్చి దాని కాదిగ్రంథమని పేరుపెట్టెను. ఈ గ్రంథ రచన మిక్కిలి యుత్కృష్టము. శ్లాఘనీయము. ఏలయన సీకుమతమున కాధారమయిన ప్రధానగ్రంథ మేదియు లేక పోవుట యొక గొప్ప వెలితిగనుండెను. మఱియు నాలు గక్షరములు కూర్చ జాలిన జ్ఞానలవదుర్విదగ్ధులు కొందఱ అరివకే బయలువెడలి యర్థములేని పిచ్చిగీతములఁ గొన్నిఁటిఁ వ్రాసి వాని కర్తృత్వము నానకున కారోపించి లోకమున నవి వ్యాప్తముఁ జేయుచుం డిరి. అందుచేత నిజముగా గురువులు రచించిన భాగము లేవో తదితరులు వ్రాసిన భాగములేవో నిరూపించుట యప్పటికే కష్టసాధ్యముగ నుండెను. అదికారణముగా శిష్యులు గురువగు నర్జునుని సన్నిధికింబోయి వానితో నిట్లు మనవి యొనర్చిరి. "స్వామీ! గురునానకు రచియించిన గీతములు వినినప్పుడు మనస్సు ప్రశాంతమై భక్తి తత్పరమగును. ఇతర సాధువులనేకులు చాల పద్యములను స్వయముగ వ్రాసి వానికి నానకు పేరుఁ జేర్చిరి. ఆ పద్యములం జదువువారి హృదయముల భక్తి జనియింపమ నలేకదా మీఁదుమిక్కిలి గర్వము కూడనంకురించును కావున భక్తుల కవిత్వ భేదములఁ దెలిసికొనుటకు నానకుపద్యముల కైవైన నానవాళ్ళు వేయుట సముచితము." అర్జునుఁడు వారి విజ్ఞాపన మాలకించి యట్టికార్య మావశ్యకమని తలంచి యా గ్రంథమును గూర్చ నారంభించెను. ఈ గ్రంథము గూర్చుటలో నర్జునునకు భాయి గురుదాసుభల్లుఁ డనుకవితా ప్రౌఢిమగల సీకు మతస్థుఁ డొకఁడుచాల సాయముఁ జేసెను. ఆదిగ్రంథమునందు మొదటి యైదుగురు గురువుల భాషితములుఁ జేర్పఁబడియుండి యొకరి కవిత్వము

మఱియొకరి కవిత్వమని జనులు భ్రమింపకుండునట్లు చక్కఁగా నొనర్పఁ బడెను. అర్జునుఁడు నానకు రచియించిన పద్యములు మహాల్లపలుని పద్యములని ప్రత్యేకముగా గురుతులు పెట్టి వ్రాసెను. మహాల్లపలుఁడనఁగా ప్రథమగురువని యర్థము. అర్జునుఁడు, కబీరు మొదలగు నీశ్వర భక్తులచే రచియింపఁబడిన భక్తిరస ప్రధానములగు గీతములఁ గొన్నిటి నాది గ్రంథమునందుఁ జేర్చి యట్టివానికిఁ గృతికర్తల నామములు గురుతులుగా నిడెను. అనేక సంవత్సరములు పాటుపడి యర్జునుఁడు గ్రంథమును ముగించిన పిదప సిక్కుల రావించి యిట్లుపదేశముఁ జేసెను. "సోదరులారా! ఈ యాదిగ్రంథమునం దేదిగలదో యది యంతయు మీ కాదరణీయము. ఇందు లేనిది గురునానకు చేసినాఁడని నమ్మిక గలవారు మీకు దృఢముగాఁ జెప్పినను మీ కగ్రాహ్యమే యగును" ఆదిగ్రంథ నిర్మాణమే యర్జునుని జీవితమునందుఁ బ్రధానమయినది. ఆతఁడు కావించిన తదితర లోకోపకారములలో ముఖ్యముగాఁ జెప్పఁదగినవి తరంతమను గ్రామమునఁ ద్రవ్వించిన కోనేరొకటి. రెండవది యమృతసరమందుఁ ద్రవ్వించిన చెఱువు. తరంతర గ్రామ మమృతసరమున కేడుమైళ్ళదూరమున నున్నది. అర్జునుఁ డమృతసరమే తనకుఁ గాఁపురముగఁ జేసికొని యందు హరిమందిరమను పేరఁ జక్కని భవనమొకటి కట్టించెను. అతనికి నివాసస్థానమైనదాదిగ నమృతసరము తొంటియట్లు గుడిసెలతో నిండియుండక క్రమక్రమంబున మేడలకు మిద్దెలకు నిలయమై సిరులకు నెలవై యమృతసరనామము సార్థకముఁ జేసికొనెను.

ఈగురువునుగూర్చి చిన్న చిత్రకథ యొకటి కలదు. ఆకథఁ జదివినవారికి సిక్కుమతాచార్యులు పూజ్యులైన పురుషులయెడ నెంత వినయసంపత్తిఁ గలిగి మెలఁగుచుండిరో సులభముగఁ దెలియఁగలదు. ఈగురువు పీఠాధిపత్యముఁ జేయు కాలమున నానకుయొక్క కుమారు

లలో నొకఁడగు శ్రీచంద్రుఁడు బ్రతికియుండెను. అర్జునుఁడు గురుపుత్రుని దర్శనమునకుఁ బోయి కాంచి వానియెడ మిక్కిలి ప్రపత్తి నెఱపి గౌరవించెను. ప్రసంగవశమున శ్రీచంద్రుఁ డర్జునునితో నీగడ్డ మింతపొడుగుగాఁ బెంచితి వేమనెను. అనవుఁ డర్జునుఁడు నీపాదరక్షల మీఁది దుమ్ముఁ దుడుచుటకుఁ బెంచితి నని ప్రత్యుత్తరమిచ్చెను. వినయగర్భితమయిన యామేలిపలుకు విని కడునక్కజపడి శ్రీచంద్రుఁ డిట్లనియె. "ఈవినయ సౌజన్యములే నీకును నీపూర్వాచార్యులకును నానకుయొక్క పీఠము నిప్పించినవి. మాగర్వమే మమ్మాపదవికి దూరముచేసెను."

ఆఱవగురువు—హరిగోవిందుఁడు.

అర్జునుని యనంతరము వాని పుత్రుఁడగు హరిగోవిందుఁడు గురువయ్యెను. పీఠ మెక్కునప్పటికి హరిగోవిందుఁడు పదునొకండేండ్ల ప్రాయము కలవాఁడు. అతిక్రూరమయిన పితృమరణమునకు నతఁడు తద్దయు శోకించి తత్కారణుఁడయిన చందూషాయెడలఁ బగఁబూని తగు సమయము వచ్చినపుడు కసిఁదీర్చుకొనుటకుఁ గృతనిశ్చయుఁ డయ్యెను. ఆతని పినతండ్రియగు పృథివిచంద్రుఁడు తాను గురువు కావలయునని మఱియొకసారి ప్రయత్నించెను; కాని సిక్కులందఱుఁ గట్టుకట్టి యైకకంఠ్యముగ వాని యాధిపత్యము వలదని నిరాకరించుటచే వానియత్నములు వ్యర్థములయ్యెను. అయినను బృథివిచంద్రుఁడు తన పట్టినపట్టు విడువక చలపాదితనమూని తన యన్నను బీడించినట్లె యన్నకుమారునిఁ గూడ నానాబాధలఁ బెట్టఁదలఁచెను.

హరిగోవిందుఁడు తండ్రివలె మెత్తనివాఁడు గాక దేహబలము మనోబలముఁ గలవాఁడు కావున నేవెఱపులేక పీఠాధిపత్య

మును కష్టపెట్ట సంకల్పించిన వారితో సంధి జేసికొనక తుదవఱకుఁ బోరఁదలఁచెను. ఆతని యందు మతాచార్యుని యం దుండవలసిన పవిత్ర ప్రజ్వలితభక్తి ప్రభృతులు మొదలగు లక్షణములకుఁ గొఱఁతగ నూతనజన చిహ్నములైన బలసాహసము లుండుటచేత హరిగోవిందుఁడు స్వమతమును బోధనాధికముచేత వృద్ధిఁ జేయుట యును గాక నానకునియొక్క మతవ్యాప్తికి దేశకాలవిపర్యయములచేతఁ గావలసిన శౌర్యగుణములను సీక్కులకుపదేశించి తన్నుఁ జూచి వారు నేర్చుకొనుటకనువునై సర్వదా పగవారితో మొనలుదీర్చి పెనఁగొనుచు నిరంతర విహారములు సేయఁజొచ్చెను. వయసు ముదిరిన కొలఁది హరిగోవిందుఁడు మంచిగుఱ్ఱపురౌతయి బల్లెమును బట్టుటలోను ఖడ్గమును త్రిప్పుటలోను సాటిలేని నేర్పరియై యుద్ధములలో మొనలుదీర్చుటలో నూతనోపాయములం బన్నుటలోఁ బ్రౌఢుఁడయి కడు వేఁట తమకముఁ గలిగి యనుచరులకు హృదయానందము గలుగఁ జేయుచుండెను. వేఁటయందు వానికెంత తమకమో కాని యతఁడు స్వహస్తములతోఁ జంపిన జంతువుల మాంసమును దినునప్పుడు మహానందభరితుఁడై యుండువాఁడఁట. అట్టి తేజశ్శాలి యనుచరుల హృదయములలో శౌర్యాగ్ని పాదుకొని ప్రజ్వరిల్లుట యొక యాశ్చర్యములోనిది కాదుగదా. హరిగోవిందుని శిష్యులగు సీక్కులు మొదటనుండియు మతమే ప్రధానముగాఁ జూచుకొను భక్తులయ్యు గురువుమార్గము ననుసరించి క్రమక్రమముగ వీరరస పూరితులై రణరక్తులై మెలఁగఁ జొచ్చిరి.

జహంగీరు చక్రవర్తికి గురువునందు మిక్కిలి గౌరవము జనించెను. ఊరక గౌరవము కలుగుటయె కాదు. ఆచక్రవర్తి హరిగోవిందునకు వశవర్తియై మెలఁగెను. అట్లు మెలఁగుటచేతనే గురువు తండ్రిని బలవన్మరణము పాలుచేసిన చందుషా యల్పకాలములోనే చక్రవర్తి

యాగ్రహమునకుఁ బాత్రుఁడై యాతని రక్షణము లేనివాఁడై దిక్కు మాలినవాఁడయ్యెను. అనఁగా హరిగోవిందుఁడు చందూషాను దనఁగుచ్చవచ్చిన తెలుంగునఁ జేయుటకు నీలు కలిగెను. అంతట కొద్దికాలమునకె దురాత్ముఁడగు చందూషాగృహముఁ దోఁచుకొనఁబడెను. అతఁడు నీచమైన మరణము నొందెను.

జహంగీరు కాశ్మీరమునకుఁ బోవుచు దనవెంట నీ సీకుగురువును దోడ్కొని పోయెను. హరిగోవిందుఁడు స్వతంత్రుఁడు నిర్భయ చేతస్కుఁడు నైనందున జక్రవర్తితో నప్పుడు సయిసము నదురుఁ బెదురు లేక మాటలాడుచు వచ్చెను. ఆమొగలాయి దర్బారులో నున్నపుడు వానికి మహమ్మదీయ మతగురువులతో సీక్కు మహమ్మదీయ మతముల మంచిచెడ్డలుగూర్చి వాదములు సంభవించుటయు నతఁడు చక్రవర్తిని సరకుసేయక తురకగురువులకు జంకక తనయభిప్రాయమును నిర్భయముగఁ జెప్పుచువచ్చెను. అందుచేత జహంగీరునకు వానిమీఁద నాగ్రహము బొడమెను. అదియునుం గాక యీగురువు తనకు ముడుపుల కానుకల రూపమున వచ్చు ధనమున కెవ్వరడిగిన లెక్క సెప్పక యథేచ్ఛముగా వ్యయము సేయుచుండును. వేఁటయందలి తమకము నానాటికి వానికి హెచ్చఁజొచ్చెనే కాని డిందుపడదయ్యె. మతాభిప్రాయభేదములచేతఁ గలిగినకోపమున కీరెండు కారణములు నెపములు కాఁగా జహంగీరు గురుగోవిందునిఁ జెఱసాలలో బంధింపవలసినదనియు రెండులక్షల రూపాయలు ధనదండన మెప్పుడిచ్చు నప్పుడు విడుదలకావలసినదనియు నానతిచ్చెను. అంత మొత్తము లేనందున హరిగోవిందుఁడు గ్వాలియరు కోటలో బద్ధుఁడయ్యెను. ఈకోటలోగురువు పండ్రెండు సంవత్సరములు బందెయై యనేకకష్టములనుభవించెనని చెప్పుదురు. కడుపునిండనన్నము లేదు. పండుకొనుటకు పానుపులేదు. మాటలాడుటకు మనుష్యుఁడు లేఁ

ను. ఎంత పీడగలిగినను గురువు తొల్లిటియట్లె, పూనిక స్వతంత్ర భావము విడువక యుండెను. చక్రవర్తి దేహము మాత్రమె గ్వాలియరుకోటలో బంధించి శిష్యులగు సీకులకు వానిని గానఁబడకుండఁ జేయఁగలిగెనే కాని వారికి మహాగురువు నెడగల తీవ్రమయిన భక్తిని గౌరవమును లేశమైనను హూపుమాప జాలఁడయ్యె. గురువు కారాగృహ బద్ధుఁడయ్యెనను వార్త చెవిసోఁకుటతోడనే దేశమందలి నానాభాగముల నుండి సీకులు గ్వాలియరునకుఁ బోయిరి. పోయి నయనానందకరముగాఁ దమగురుమూర్తిం జూడ లేకపోయినను వారువాని యున్నకోటకు దూరమునుండి సాష్టాంగ నమస్కారములఁ జేసి వానిపాదముల మనంబుల ధ్యానించి వానివిమోచనమున కనేకవిధముల భగవంతునిఁ బ్రార్థించి స్వదేశముల కరుగుచు వచ్చిరి. ఎట్టకేలకు జహంగీరున కేమితోఁచినదో తెలియదు. కాని యతఁడు సీకు గురువును బంధవిముక్తునిఁ జేసెను. ఆకాలమున రాజ్యవ్యవహారములు సరిగానుండనందున పాదుషా సీక్కులకు నుపకారముఁ జేసిన పక్షమున వారుశత్రువులలోఁ గలియక తనపక్షమున నుందురని నమ్మి వారి గురువును విడిచి వారి చిరాభిలాషముఁదీర్చెను. ఆదినములలో మొగలాయిసేనల కధిపతియైన యుసాఫుఖాను మొదలగు నవ్వాబులు కొందఱు చక్రవర్తి కహితులయి వానిపై ద్వేషమెత్తఁ జూచుచుండిరి. ఇవిమనంబున బెట్టుకొనియే చక్రవర్తి యీఘనకార్యము జేసెను. విముక్తుఁడై గురువు మాళవదేశమున కరిగి తన పూర్వవ్యాపారములె చేయనారంభించెను. ఈయారంభములోఁ గొంద ఱను చరులే బలంగముగా గల యీమతగురువు మహాసముద్ర తరంగములవలె తరుగని సేనలుగల ఢిల్లీశ్వరునితోఁ బోరవలసివచ్చెను.

ఇంతలో జహంగీరుమృతినొందుటయు షాజహాను సింహాసనమెక్కుటయు సంభవించెను. షాజహానునిపెద్దకొడుకగు దారా పంజాబుదేశ

మునకుపరి పాలకుఁడుగ నియమింపబడెను. అప్పుడుహరిగోవిందునిశిష్యుడొకఁడు తురుష్కస్థానమునుండి తనగురువునకుసమర్పింప నుత్తమజాతి గుఱ్ఱములను గొన్నిఁటిఁదెచ్చెను. కాని యవి గమ్యస్థానమునకుఁ జేరక మునుపే చక్రవర్తిగారికిఁ గావలసి యుండెనను నెపమున మార్గమధ్యమున మహమ్మదీయ సేవకులచే నపహరింపఁబడెను. గురువు దుస్సహమైన యీపరాభవమును భరింపఁజాలక తీవ్రపడి దానికిఁ దగుప్రతీకారముం జేయఁదగిన యదను వెదకఁజొచ్చె. గురకలచేతఁ బట్టువడిన గుఱ్ఱములలో నొకటి లాహోరు న్యాయాధిపతియైన ఖాజీకి సమర్పింపఁబడెను. మహమ్మదీయ ప్రభుత్వములో ఖాజీలే మనకు జడ్జీలుగా నుండిరి. ఆగుఱ్ఱము కుంటిదై యుండెను. గురువు విశేషధన మిచ్చి దానింగొనఁ బ్రయత్నించెను. బేరము ముగిసినపిదప గురువు వెల యిచ్చి దానినిఁ గైకొనఁడయ్యె. అప్పుడు సిక్కుగురువు తన్నేగతాళి సేయుటకై కుంటిగుఱ్ఱము నిమిత్త మంతధనము నిచ్చునట్లు బేరమాడెనని ఖాజీ తెలిసికొని వానియెడ నలుక వహించెను. ఈయలుక మఱియొక కారణముచే ద్విగుణీకృత మయ్యెను. ఖాజీ కుమార్తెయగు కవెలాన్‌బీబీ హరిగోవిందుని మోహించెను. అది తండ్రి యెఱిఁగి నివారింపఁ బ్రయత్నింప నామె హరిగోవిందుని శరణువేఁడెను. ఖాజీ మహాకుపితుఁడై తన పరాభవము దీర్పుమని చక్రవర్తిని వేఁడుకొనెను. ఆయన యేడువేల సైనికులను హరిగోవిందుని బట్టుకొను నిమిత్త మంపెను. ఆసైన్యముయొక్క రాక విని గురువు తన సిక్కు మూఁకలఁ గలియఁగట్టుకొని యెట్లెటో నైదువేలమందిని చేర్చి మొగలాయిసేనతో యుద్ధసన్నద్ధుఁ డయ్యెను. అమృతసరమునొద్ద నుభయసేనలకు సంకులసమర మయ్యెను. అతిసాహసులగు సిక్కుల పరాక్రమము ముందర మహమ్మదీయుల ధైర్యస్థైర్యములు ఝంఝామారుతము ముందరి మేఘముల ట్లయ్యెను. పరాజితులైన మొగలాయి

సైనికులు లాహోరునకుఁ బాఱిపోయిరి. విజయులైన సిక్కులు వారిని వెన్నంటి తరిమితరిమి యనేకుల దుత్తునియలుగా ఖండించిరి. కలహహేతువైన కవలాన్‌బీబీ హరిగోవిందుకడనే మరణానంతరము వఱకు నుండెను. ఆమె నతఁడు వివాహమయ్యెనని తోఁచెడిని- అందుచేతనే గాఁబోలతఁడు ప్రియురాలిపేర కవలాన్ సరస్సను నొకకోనేరు నమృతసరపట్టణమునఁ ద్రవ్వించెను.ఇదియైన కొన్నిదినములకే హరిగోవిందుని శిష్యుఁడొకఁడు చాలకాలము దేశదిమ్మరియై తిరుగుచు మున్న చక్రవర్తి తన గురువు గుఱ్ఱములనుహరించినందుకుఁ బ్రతీకారముగా మగలఁ జక్రవర్తి గుఱ్ఱముల రెంటి నపహరించి తెచ్చెను. దైవవశమున నీరెండుగుఱ్ఱములు దొల్లిగురువు నిమిత్తము తురుష్కస్థానము నుండి శిష్యుఁడొకఁడు తెచ్చిన హయములలోనివే యయ్యెను.

ఈవార్త వినినతోఁడనే మొగలాయి దర్బారు కోపాగ్నిచే ప్రజ్వరిల్లెను. వెంటనే యిరువురు తురకసేనాపతులు మహాసేనాసమేతులై గురువునకు బుద్ధిచెప్పుటకు వచ్చిరి. అది యెఱింగి హరిగోవిందుఁడు సమరసన్నాహముఁ జేసెను. రెండుమొనలకు సందడికయ్యమయ్యె. మరల మొగలాయీలకుఁ బరాజయము సీకులకు జయముఁ గలిగెను. తురకసేనలు సీకులకు వెన్నిచ్చి ప్రాణభీతి లాహోరునకుఁ బరుగెత్తెను. సేనానులిరువురు సీకులచే రణనిహతులైరి. అనంతరము గురువు తనపేర నిర్మింపఁబడిన హరిగోవిందు పురమునకుఁ జనియె. అక్కడ చందూపా బంధువుఁడొకఁడు గురువును గడతేర్పఁ బ్రయత్నించెను. ఈ ప్రయత్నములో నతఁడె యమపురమున కతిథి యయ్యెను.

అనంతరము హరిగోవిందుఁడు కొంతకాల మిక్కడ నక్కడఁ దిరిగి యమృతసరమునకుఁ బోయెను. వెంటనే వానికిఁ బగతురతోఁ

బోరాటము సిద్ధమయ్యెను. ఈగురుని యనుచరులలో ముఖ్యుఁడు పైండాఖానను నొక పఠానుతురక. వానితల్లి చిన్నప్పుడు గురువును బాలిచ్చి పెంచెను. అది కారణముగా గురువు వానిని నమ్మిన బంటుగా నేలుకొని తద్దయు నాదరించె. పఠానుఁడు నట్టి గురువునెడఁ బ్రియభృత్యుఁడై వానికనుసన్నల మెలఁగుచుండెను. అటులుండ నొక్కనాఁడు హరిగోవిందుని పెద్దకుమారుని పెంపుడుడేగ పఠానుని యింట వ్రాలఁ నతఁడు దానింబట్టి దాఁచె. గురుపుత్త్రుఁడు వానికడకుఁబోయి దాని నిమ్మని యడిగెను. అక్కఱకుమాలిన యొకట డేగ తనకడలేనే లేదని నొక్కిపలికి యెట్టకేలకు తనకడ నుండెనని యుఁ దానినిచ్చుటలేదనియు గరువముతోఁ బలికెను. హరిగోవిందుఁడు తురకను దౌర్జన్యమునకు దండింపవలయునని సంకల్పించెను. కానియీ తలంపు నెరవేరకమున్నె పఠానుఁడు ఢిల్లీకిఁబోయి చక్రవర్తితోఁ దనపరాభవము విన్నవించుకొని కొంతసేన నిచ్చిన గురువునుం బట్టి తెచ్చునట్లుఁ బ్రతినఁజేసెను. చక్రవర్తి వానికోరికను దీర్చి కొంత సేన నిచ్చె. హరిగోవిందుఁ డాసేన నెదుర్కొనెను. ఆదళంబులకు పోరు ఘోరంబుగ జరిగెను. ఎప్పటియట్ల విజయలక్ష్మి హరిగోవిందుని యధీనమయ్యెను. నాఁడు తురక లనేకులు గురుని ఖడ్గమునకెఱయైరి. అందు పైండాఖాను ముఖ్యుఁడు. ఈయుద్ధమున శత్రుసైనికుఁ డొకఁడు భయంకరముగఁ గత్తిఁదూసి గురునిమీఁదఁ బడియె. గురు వా వేటుం దప్పించుకొని నవ్వుచు ఖడ్గమెత్తి యోరీ! దెబ్బకొట్టుట యట్లు గాదు. ఇదిగో నిట్లుసుమీ యని యొక్కవేటున వానిని రెండుతునియలుజేసి తన పాదములముందరఁ బడవేసెను. ఈగురుని చరిత్రమును వ్రాసినవారిలో నొకఁ డీసందర్భమున హరిగోవిందుఁడు కోపావేశమున శత్రువును జంపలేదనియు శిష్యుల కన్నివిద్యలు నేర్పుటయే గురుధర్మమగుటచే గురువైన యాతఁడు

ఖడ్గకౌశలక్రమమును శిష్యులకు నేర్పుటకే యట్లు చేసెననియు వ్రాసెను. క్రొత్తగాఁ గలిగిన యీ జయమునకు గురువు సంతసింపక చక్రవర్తి వలన మఱిమఱి యుపద్రవముల కది హేతువగునని గని పెట్టి యీ దారుణకర్మముల నేవగించి ప్రశాంతచిత్తుఁడై చరమావస్థ నిర్మల ప్రదేశమున భగవత్కైంకర్యమునందు వేదాంతగోష్ఠియందుఁ గడుపఁదలఁచి కొంతకాల మొక గ్రామమున నుండి యచ్చోటువాసి పర్వతప్రాంతముల కరిగెను. అచ్చట శతధ్రువు నదికిం దూర్పుతట్టునను కీర్తిపురము దనకుఁ గాపురముఁ జేసికొనియెను. ఆయూరనే హరిగోవిందుఁడు జీవితాంతమువఱకుఁ గాఁపురముండి సిక్కుమతము వ్యాపింపఁ జేసి నలువది యెనిమిది యేండ్ల ప్రాయమున క్రీ॥ శ॥ 639 వ సం॥న సిద్ధిపొందెను.

అతనిఁ గొందఱు వేదాంతియందురు. కొందఱువానిని బహుదేవతాభక్తుఁ డందురు. ఎవ్వరే మనుకొన్న నతఁడు సిక్కుమతమందు దృఢమైన విశ్వాసముఁ గలవాఁడనియుఁ దన జీవితము దానికే ధారవోసెననియుఁ జెప్పవచ్చును. హరిగోవిందున కైదుగురు కుమారులుండిరి. వారి నామధేయము లివి. 1 గురుదత్తుఁడు, 2 తేజబహాదూరు, 3 సూరతసింగు, 4 అనిరుద్ధుఁడు, 5 ఉత్తురావు, పెద్దకొడుకు హరిగోవిందుఁ డుండఁగానే కాలధర్మమునొందెను. ఆతనికొక్క కొడుకు కలఁడు. వానిపేరు హరరావు. తండ్రిలేని బిడ్డయగుటచేత హరిగోవిందుఁడు వాని నెక్కువ గారాబముతోఁ బెంచి వానికే యనంతరమునఁ బీఠమిచ్చెను.

ఏడవగురువు — హరరావు.

గురుహరరావు శాంతస్వభావుఁడు. నిరంతర మీశ్వరధ్యానతత్పరుఁడు. ఎల్లవారితో మైత్రియే పాటించెను గాని కలహమున

కిష్టపడఁడు. తన జీవితకాలములో నొక్కసారిమాత్రమే యతఁడు లౌకికవ్యవహారములఁ బ్రవేశించెను. ఢిల్లీసింహాసనము కొఱకు షా జహానుని పెద్దకొడుకు ధర్మస్వరూపుఁడునగు డారా మీఁదికి దుష్టశీలుఁడగు నౌరంగజేబు దండెత్తినప్పుడు హరరావు డారాకు సహాయముఁ జేసెను. యుద్ధములో డారా యోడిపోయిన పిదప నౌరంగజేబు రాజ్యప్రతిష్ఠితుఁడయి హరరావును బెదరించి వాని పెద్దకుమారుండగు రామారావును తనయొద్ద జామీనుగా నుంచవలసినదని యాజ్ఞాపించెను. చక్రవర్తి నెదిరించుటకుఁ దగిన మనోధైర్యము గాని, ధనముగాని, సైన్యముగాని లేనందున హరరావువిధి లేక తన జ్యేష్ఠపుత్రుని ఢిల్లీదర్బారునకుఁ బంపెను. రామారావు దర్బారునకుఁ బోయినప్పుడు చక్రవర్తి వానిమాటలపొందికకు సౌజన్యతకుఁ జాల సంతసించి యాగ్రహమువిడిచి హరరావు మతగురువే కాని యుద్ధప్రియుఁడైన వీరుఁడు కాఁడని నమ్మి యాకుమారునకు విలువగల వస్త్రాలంకారములు బహుమానముచేసి తగినపీఠమిచ్చి దర్బారులో నిలిపి గౌరవించెను. హరరావు క్రీ॥ శ॥ 1863 సంవత్సరమునఁ గీర్తిపురమందుఁ గాలధర్మమొందెను. అతఁడు మృతినొందకమునుపే తనకనిష్ఠపుత్రుని హరి కృష్ణునిఁ (హరికిసన్) పీఠాధిపత్యమున నియమించెను.

ఎనిమిదవగురువు—హరికృష్ణుఁడు.

తండ్రిపోవునప్పటికి జ్యేష్ఠపుత్రుఁడగు రామారావు ఢిల్లీలోనే యుండెను. జ్యేష్ఠుని దన్నువిడిచి కనిష్ఠునకు గురుపదవి తండ్రియిచ్చినందుకు రామారావు మిక్కిలి కినిసి తనకుజరిగిన యన్యాయమును జక్రవర్తితో మొఱబెట్టుకొననతఁడువానియందనుగ్రహముకలవాఁడై తత్క్షణము తనదర్బారునకు రావలసినదని గురుపగు హరికృష్ణున కా

జ్ఞాపించెను. గురుపదము నందుట ప్రాపించక భోగము లనుభవించుటకు, నధికారములు చేయుటకు ననుకొని, యది తనకు లభింపలేదని విచారించి దానివిషయమై విశ్వప్రయత్నము చేయుటచేతనే రామారావట్టి పదవి కనర్హుఁడని చెప్పవచ్చును. అతని కాపదవి నీయక చిన్నకొడుకున కిచ్చుటలోఁ దండ్రి న్యాయముగా నడచు కొనెననిమే మను మూహింపవలయును. హరికృష్ణుఁడు గది యెక్కునప్పటి కేడేండ్ల ప్రాయమువాఁడయినను వాని మొగము కళకళలాడుచు జ్ఞాన తేజస్సుతో నిండియుండెను. ఆతఁడువచ్చి యెదుట నిలువ నౌరంగజేబు చక్రవర్తి వానిముద్దు మొగమును జూచి, ముద్దులుమూటగట్టు మాటలను విని, వాని యందు పక్షముగలవాఁడయ్యెను. ఈపక్షపాతమునకుఁ దోడుగా హరికృష్ణుని తెలివిగూడ వానికి గొప్పసాయముఁ జేసెను. ఈతఁడు బాలుఁడగుటచేఁ జక్రవర్తి వానినొకసారి యంతఃపురమునకు బిలిపించియంతఃపురస్త్రీల నందఱఁ జూపి తనపట్టపుదేవి యెవ్వరో చూపుమని యడిగెను. హరికృష్ణుఁ డదివఱకెన్నఁడు జూడకపోయినను జక్రవర్తిభార్యను దప్పక చూపెను. తన యంతిపురమైన నెన్నఁడు చూడని యాబాలుఁడు బుద్ధిసంపదచేఁ బట్టపుదేవిని నిరూపించినందు కాశ్చర్యమునొంది చక్రవర్తి యతఁడే పీఠాధిపత్యమునకుఁ దగినవాఁడని శాసించెను. ఇట్లు చేయుటకుఁ గారణాంతరముఁగూడ కలదు. ఏదియన హరికృష్ణుని తల్లివలె రామరావుతల్లి సత్కులసంజాతకాదు. ఢిల్లీశ్వరున కనుగ్రహము గల్గినను జగదీశ్వరునకు వానిమీఁద ననుగ్రహము లేకపోయెను. ఆకాలములో ఢిల్లీనగరములోఁ బ్రబలియుండిన మశూచికవ్యాధి యాబాలగురువున కగపడి యచిరకాలమున వానిఁ దన పొట్టఁబెట్టుకొనియె. ఆతని శరీరము ఢిల్లీలో నేయమునాతీరమున దహనము చేయఁబడెను. ఆచోట నిపుడొక చిన్నసమాధి యున్నది. చనిపోవునప్పటికి హరికృష్ణుఁడు తొమ్మిదిసంవత్సరముల వాఁడు.

తొమ్మిదవగురువు—తేజబహాదూరు.

ఈయన సీకుల యాఱవగురువగు హరిగోవిందుని రెండవకుమారుఁడు. ఈతఁడు బుకాలాయను గ్రామమున వాసము సేయుచుండెను. ఎనిమిదవగురువగు హరిక్రిష్ణుఁడు మృతినొందునప్పుడు తదనంతరగురు వెవ్వఁడని యడుగఁగా నాబాలుఁడు "బాబాబుకాలా"యనిపల్కెనఁట బుకాలాగ్రామమందు కాఁపురముండు జనులందఱు సీకులే. బాలగురువుయొక్క కడపటిపలుకులు తెలిసినతోడనే యాగ్రామమందున్న ప్రతిసీకుమతస్థుఁడు గురుపీఠముఁ దనకే హరిక్రిష్ణుఁ డీయ నుద్దేశించినాఁడని చెప్పి తక్కినవారితో వివాదపడఁజొచ్చెను. గ్రామమంతటఁ గలవరము బయలుదేఱెను. తేజబహాదూ రప్పటికే చాల వయసుగడచినవాఁ డయినందునను, మొదటినుండియు నతఁడు లౌకికవ్యాపారములయందు విశేషముగా మనసు నిలుపక యీశ్వరభక్తితత్పరుఁడయినందునను దక్కినసీకులవలెఁ దాను పీఠ మాక్రమించుకొనుటకు ప్రయత్నములు సేయక నిర్మల మనస్కుఁడై యుండెను. మతమునకు గురు వేర్పడలేదని నానాభాగములనుండు సీక్కులు విచారింపఁజొచ్చిరి. అప్పుడు ఢిల్లిలోఁ గాఁపురముండెడు మఖానుషాయను సీకుఁ డొకఁడు వివాదముఁ బరిష్కరింపఁదలఁచి యెవరు గురువగుదురో వారి కిచ్చుటకు విలువగల కానుకలను దీసికొని బయలువెడలి బుకాలాగ్రామమునకుఁ బోయెను. అక్కడ సీకులందఱు వానిచుట్టుం జేరిరి. "పీఠాధిపత్యము నాకు రావలయు నాకు రావలయు. బాబా బుకాలా యనఁగా నేనే. నేనే" యని ప్రతిమనుష్యుఁడు తనమాటనే చెప్పుకొనసాగెను. ఆవివాదముల కంతము లేకపోవుటచే మఖానుషా "వెనుకటి గురువు కడపటి పలుకులు సరిగాఁజెప్పఁడు. అవి విని నేను పరిష్కరించెద"నని పలికి యాపలుకు లప్పుడు సన్నిధానవర్తులగు మనుష్యులవలన

విని యిట్లనియె. "వెనుకటి గురువుమాటల కర్థము మీకు తెలియలేదా? బాబా బుకాలా యనఁగాఁ దన పినతాతయగు తేజబహదూరుఁడని వెనుకటిగురువుగారి యర్థము. కాఁబట్టి యతఁడే మనకు గురువు" అని వెంటనే తేజబహదూరునికడకుఁ బోయి మఖానుషా "నీవ మా గురువు" వని వానితోఁ జెప్పి తాను తెచ్చిన వెలలేని కానుకల వానికి సమర్పించెను. అతఁడా కానుకలను గ్రహింపక పీఠాధిపత్యము తన కక్కరలేదనియెను. కాని మఖానుషా తనపట్టువదలక యాతని నెట్టకేలకొడంబరచెను. అనంతరము పట్టాభిషేకమహోత్సవము మహావైభవముతో జరిగెను. దేశమందలి సిక్కులందఱు వానిని గురువుగా నంగీకరించి కానుక లంపిరి. పూర్వగురువునకుఁ బరమశత్రుఁడైన రామారా యప్పటికి ఢిల్లిలో నేయుండి తేజబహదూరు పీఠ మెక్కుట విని మహాదుఃఖము నొంది ధీరమాలుఁడను మిత్రుని సాయముబడసి తేజబహదూరునిమీఁద నక్కసుఁ బూనెను. అట్లుండి యొకసారి యాతఁడు మిత్రసహితముగా నొక చిన్న సేనం గూర్చుకొని తేజబహదూరుని గృహము దోఁచుకొనఁబోయెను. కయ్యముఁ జేయుట కిష్టము సామర్థ్యముఁగూడ లేనందున గురువగు తేజబహదూరు తనయూరు విడిచి యమృతసరముఁ బాఱిపోయెను. పూర్వసిక్కులచేత స్థాపింపఁబడిన దేవాలయ మొకటి యక్కడకలదు. ఆకోవెల యధికారులు సహితము దేజబహదూరునిపై నిష్టములేనివారై వానిని గుడిప్రవేశింపనీయరయిరి. అంతలో మఖానుషా మరల గురుదర్శనార్థము వచ్చినందున గురువు వానింజూచి యీర్ష్యచేఁ గొందఱుసిక్కులు తన్ను బాధించి దోఁచుకొని ప్రాణములఁదీయ నుద్యుక్తులై యుండిరనియు నందుచేఁ దనకు స్వదేశము విడిచికొంతకాలము దేశాటనము జేయఁదలంపు కలిగినదనియు నాతనితోఁ జెప్ప నాతఁడును మంచిదని కొంతపరివారమును వెంటఁబెట్టుకొని గురువుందీసికొని ఢిల్లీనగరమునకుఁబోయెను.

అక్కడ రామారావు చక్రవర్తియగు నౌరంగజేబు ననుగ్ర హంబునకుఁ బాత్రుఁడై యుండి గురువుమీఁద నేవో కొండెములు చెప్పి యాతని మనసు విరిచెను. అంతట చక్రవర్తి తేజబహదూరు తన సన్నిధికి రావలసినదని యుత్తరువువ్రాసి పంపసిద్ధముగ నుండఁ గొందఱు కొలువుకాండ్రది యెఱింగి "నీకు గురువు మతబోధకుఁడే కాని లౌక్యుఁడు కాఁడు. నిరపరాధి" యని విన్నవించి యప్పటి కాపదఁ దొలఁగించిరి. ఈయాపద గనువంబెట్టిన మహాత్ముఁడు రాజపుత్ర శిఖామణియగు జయపురమహారాజు. ఆమహారాజు తదనసరమున నాసాము దేశమునకు సేనానాయకుఁడై చక్రవర్తిపనిమీఁదఁ బోవుచు నీకు గురువుఁ దనవెంట రమ్మని పిలిచెను. తేజబహదూరు తనకుటుంబమును బాటలీపురమున విడిచి యామహారాజుతోఁ జని కొంతకాల మాసాము దేశమున గొంతకాలము బంగాళమునుదిరిగి క్రీ. శ. 1667 వ సంవత్సర ప్రాంతమున, మరల స్వదేశమున కరిగెను. పాటలీపురమున నున్నపుడే తేజబహదూరు భార్య గురుగోవిందను కొడుకుం గనియెను. అక్కడ నుండఁగా వెండియు రామారావు ప్రేరణమున నౌరంగజేబు తన్ను హాజరు కమ్మని యుత్తరువు పంపినట్లు విని తేజబహదూరు స్వగ్రామము విడిచి సట్లెజ (శతద్రువు) నదీ తీరమందు నొక చిన్నగ్రామము నైదువందలరూపాయల వెలకుఁగొని యందుఁ గాపురముండెను. అతఁడా గ్రామమునకు ముఖోదేవి యని పేరు పెట్టెనుగాని యిటీవల దాని కానందపురమను నామము కల్గెను.

ఆయూరఁ గాఁపురమున్నది మొదలు తేజబహదూరు తన పూర్వశాంతపద్ధతిని విడిచి, తండ్రియగు హరిగోవిందునివలెనే "ఇదం బ్రాహ్మ్య మిదంక్షాత్ర" మను మాటనిజముగా బ్రహ్మజ్ఞాన సంపత్తికిఁ దోడు పౌరుషముఁ జూపఁ జొచ్చెను. ప్రాంత పగతుఁడగు రామారావు కత్తమునను, మాటిమాటికి వేధించు మహ

మ్మదీయుల కతమునను గురువు సహజశాంతమును విడువవలసివచ్చె. అటులుండ రామారాయప్రేరితుండై చక్రవర్తి మరలం దన సమ్ముఖమునకు రావలసినదని యాతని కుత్తరువు పంపెను. గురువు వెళ్ళుటకు వీలులేదు. వెళ్ళకుండుటకు వీలులేదు కదా! వెళ్ళినచో సహజముగా సీకుమతముపై నతి ద్వేషముకలిగి నిరంతరము రామారావు చెప్పుకొండెముల నాలకించుటం జేసి యతిక్రోధముం బూనియున్న చక్రవర్తి తన్నుంబ్రతుకనీయండని యాతండు స్పష్టముగ నెఱుంగును. వెళ్ళకున్నచోఁ దాలుదాల్తనే చంపించునని యంతకుమున్నె యెఱుంగును. కాబట్టి యాతండు భయపడుట బ్రతిమాలుకొనుట యనుచితములనుకొని శిష్యులం జేరంబిలిచి "మనలో కొందఱు ప్రాణత్యాగములు చేసినంగాని యీ చక్రవర్తి దారుణ పరిపాలనము తుదముట్ట" దని వీరరసావిష్టుండై పలికెను. అప్పలుకులు విని దాపుననున్న పుత్త్రుండు గోవిందసింగు తండ్రి కిట్లనియె. "దేవా! అంతటి సత్కార్యమునకు దేవరవారి ప్రాణత్యాగమే వినియోగించునుగాని తదన్యుల ప్రాణపరిత్యాగము కార్యకారియగునా" అప్పలుకులు విని తేజబహదూరు తత్క్షణమే బయలుదేఱి సపరివారంబుగ ఢిల్లీకిం జని క్రీ॥శ॥ 1680 వ సంవత్సరమున స్వమత సంరక్షణార్థము మహమ్మదీయ చక్రవర్తి క్రోధానలంబునకుం దనశరీర మాహుతిగాం జేసెను. గురువు దారుణమరణము నొందినను స్వల్పకాలమునందే యీ మహాత్ముని శరీరత్యాగము ఫలించినదో యనునట్లు మొగలాయి చక్రవర్తుల దుష్పరిపాలన మడుగంటెను.

పదియవగురువు.

గురుగోవిందుడు—బాల్యము.

తేజబహదూరు రాజపుత్రులతోఁగలిసి యాసాము దేశములోఁ దిరుగు నాపదలోనున్నను దనకర్తవ్యకృత్యముల మఱవక జనుల మానస

క్షేత్రములు సారవంతములై యున్నవని తోంచినచోట్లం దన మత బీజముల నాటుచుం గృషిచేయుచుండ నాతనిభార్యయగు 'గుజరీదేవి' గోవిందసింగను పుత్రునింగనియె. ఈ కుమారసింహమె పంజాబుదేశ మున మత, సాంఘిక, రాజకీయ విషయములందు వెయికటిసితిని దల క్రిందుచేసి సిక్కుమతసౌధము మహమ్మదీయుల మహాద్వేషవాయువు లచేం బడకుండ నిలిపిన శిలాస్తంభములలో నొకండగుచున్నాండు. స్వ సౌఖ్య పరిత్యాగము, కావలసివచ్చినయెడల ప్రాణత్యాగము జేసి ధర్మమార్గముల విడువని మహాపురుషులు దేశమును విపత్సముద్రము నుండి యుద్ధరింపంగలరని యీ మహాత్ముని చరిత్రము చదివిన వా రందఱకుం దేటతెల్లమగును.

గురుగోవిందుండు క్రీ॥శ॥1661 సంవత్సరమున నొకశనివారము రాత్రి నాలుగవజామున జన్మించెను. ఆసామునకుం బోధపప్పాసు తేజబహదూరు నింపుచూలాలగు భార్యను పాటలీపుత్రమున విడిచి తనకుం గుమారుం డుదయించెనా పక్షమున నాతనికి గోవిందుండని నామకరణముం జేయవలయునని యానతిచ్చెను. నానకు జనన కాల మున కానంబడినట్లె గోవిందుని జన్మసమయమునందుం గూడ ననేక మహాద్భుతములు పొడగట్టెనంట. ఆయనచరిత్రములు వ్రాసినభక్తు లామహాద్భుతములను పరమాణువును బ్రహ్మాండముగం జేసి వానిని నమ్మి విశేషముగా వర్ణించియుండిరి. కాని మనమాకథలను నమ్మ నక్కఱలేదు. నమ్మకపోయినను గోవిందసింగు చరిత్రము నందు మాత్రము గానంబడునవలోకసామాన్యములునన్యసాధ్యములునగు మహాకార్యములను జూచి నవనాగరికులమయిన మనముకూడ లోలో నాశ్చర్యము నందకపోము. తలిదండ్రులు దృఢశరీరులగుటచే నాతం డారోగ్యముగల దృఢకాయముం గలిగి పుట్టి యేపుగాం బెరింగెను. తల్లిపాలు విడిచి తోడిబిడ్డలతో నాడుకొన నేర్చినది మొదలు గోవిం

డుఁడు తన వంశమునకు ననురూపములగు తెలివితేఁటలను సుగుణ సంపదను వ్యక్తముచేయ సాగెను. ఆడుకొనునప్పుడే యతఁడు తన సహకారులను రెండుకక్షులుగాఁ దీర్చి పురికొల్పి యొకనితో నొకరిఁ బోరాడించుచుండును. ఈ కృత్రిమ యుద్ధములలోఁ దఱచుగాఁ బోరాటములు తీవ్రముగానె జరుగుచు వచ్చినను గోవిందుఁడే యెల్ల పుడు విజయము నందుచువచ్చె. ఒకప్పు డతఁడు విల్లు బాణములు తుపాకులు లేకపోయినను స్వయముగా నట్టివిచేసికొని తోడి బాల కుల వెంటఁబెట్టుకొని వారి కాయూయుధములిచ్చి యడవికిఁజని వేఁట సేయును. గోవిందుఁడు తఱచుగా నుపయోగించునది వడిసేల. అతఁడు చేతికొలఁది దానిందిప్పి రాయి విడిచెనా యాదెబ్బ తగిలి యొకటిరెండు పక్షులు నేల రాలవలసినదే. వేరొకప్పుడు గోవిందుఁడు ధర్మాధిపతిగఁ గూర్చుండి బాలకుల వివాదములఁ బరిష్కరించి తప్పులు చేసినవారికి దండనలు విధించి మెప్పులుగన్న వారికి బహు మానము లిచ్చుచుండును. బాల్యచాపలముచేత నాతఁడు కావించిన యా సాహసకృత్యము లప్పుడప్పుడు దుండగములగుచు వచ్చినందున యిరుగుపొరుగు వారికి బాధలు కలుగుచువచ్చెను. అతని వడిసేల దెబ్బ నెత్తినిఁబెట్టి తెచ్చుకొను నీటి కడవలకు తగులుటయు నవిపగిలి పోవుటయు సంభవించుచు వచ్చినందునఁ బొరుగువారు గోవిందుని తల్లికడకుఁబోయి జగడములాడుచువచ్చిరి. గుజరీదేవి కుమారునిఁ గఠినముగా మందలించి వారిం బ్రతిమాలుకొని పంపుచుండును. గోవిం దుఁడు భీతియనుమాట నెఱుఁగని ధైర్యశాలి. అతని ధైర్యమెట్టిదో తెలుపుటకొక చిన్నకథగలదు. అతఁడొకనాఁడు సంగడికాండ్రం గలిసి యాడుకొనుచుండ నక్కడికిఁ బాటలీపురమేలు ప్రభువువచ్చెను. ఆ ప్రభువు సేవకులు మునుముందు పరుగుపరుగునవచ్చి బాలకులతో నిట్లనిరి. "ప్రభువుగారు వచ్చుచున్నారు. అందఱు సలాములు

సేయుఁడు." అప్పలుకులువిని గోవిందుఁడు "వద్దువద్దు. వెక్కిరించుఁడు వెక్కిరించుఁ"డని యానతిచ్చెను. యుక్తాయుక్తమెఱుఁగని బాలకు లందఱు తత్క్షణమే వానియాజ్ఞాప్రకారము జేసిరి. ఆ ప్రభువు తన యెడలనంత బండతనముజూపిన యీ బుడుతల నేమి సేయనగునని యోచించుండగనే నిమేషకాలములో వారందఱు నానాభాగముల కుం బరుగెత్తిరి. చిన్నపిల్ల లేకాలమందైనఁ జిన్నపిల్ల లేకదా. ఔచిత్యము వయసు వచ్చినకొలఁది హెచ్చును. ఎవని గుణాగుణంబులను కాని బాల్యక్రీడలంబట్టి మనము నిర్ణయింపరాదు. విద్యాబుద్ధు లబ్బినపిదప మనుష్యుని నడత యిట్టిదని నిర్ణయింపనగును.

వివాహము.

గోవిందసింగున కేఁడవయేఁటనే వివాహమయ్యెను. ఈ వివాహమునకు తేజబహదూరు తనరాఁబడికి మించిన సొమ్ము వ్యయముచేసి యతివైభవము జరిపెను. గోవిందుని మామ క్షత్రియుఁడు. ఆయన పేరు హరజీమల్లుఁడు పెండ్లికూఁతురుపేరు జీతు. వివాహము వేదమంత్రపఠన పూర్వకముగా బ్రాహ్మణులచేతనే చేయింపఁబడెను. ఇది యతిబాల్యవివాహము. పెండ్లికుమారునకే యేఁడేండ్ల వయస్సున్నపుడు పెండ్లికుమార్తె నాలుగేండ్లదో, యైదేండ్లదో యయి యుండునుగదా. అందుచేత నీవివాహము బొమ్మలపెండ్లియని భావింపనగును కాని నిజమయిన పెండ్లిగా భావింపఁగూడదు. అనేక విషయములలో సంస్తవనీయములగు మార్పులు చేసిన సీకుగురువులు బాల్యవివాహదురాచారము నేల యడుగంట ద్రొక్కలేదో తెలియకున్నది. ఈ దురాచార పిశాచమిప్పటికి మనదేశమున స్థిరముగ నిలిచియుండి దేశమునకు మితిమీఱిన నష్టమును జేయుచున్నది. ఇది యడుగంటినఁ

గాని దేశము మంచిస్థితిలోనికి రానేరదు. గోవిందసింగు కాలక్రమమున మఱి యిద్దఱు కాంతలఁ బెండ్లియాడెను. అందొకర్తుక పేరు సుందరీదేవి. రెండవయామె పేరు దేవీజీ. ఈ యాచారము పూర్వకాలమున విశేషముగాను, నేటికాలమున విరళముగాను గానఁబడుచున్నది. ఉత్తరదేశమున నీయాచారము ప్రబలముగా నుండెను. సంపన్నులగువారు మహోన్నతులయి తఱచుగా ననేక భార్యలఁ బరిగ్రహించుచు వచ్చిరి. బంగాళా దేశమున నీదురాచారము మొన్నటివఱకు—మొన్నటివఱకననేల కొన్ని తావుల నేటివఱకుఁ జరుగుచున్నది. నాగరికులైన పురుషులందఱును దీని గర్హింపవలసినదే. గోవిందుఁడు తననాఁటి యాచారమునుబట్టి యది దోషము కాదని యట్లాచరించి యుండవచ్చును.

విద్యాభ్యాసము.

తేజబహదూరు తనకుమారుని విద్యాభ్యాసమును గురించి హెచ్చు శ్రద్ధచేసెను. గోవిందుఁడు కుశాగ్రబుద్ధియై యద్భుతమగు జ్ఞాపకశక్తి కలవాఁడయ్యెను. అది కనిపెట్టి తండ్రి యాకాలమున నేర్పఁదగిన విద్యయంతయుఁ గొడుకునకు నేర్పింపవలయునని సంకల్పించెను. ఆ కాలములో సిక్కుమతాచార్యుఁడు కావలసిన పురుషుఁడు మంచి పాండిత్యము, బాహుబలముఁగలవాఁడు కాక తప్పదు. ఏలయన నొకప్రక్క సిక్కుమతద్వేషులయిన మహమ్మదీయుల దుండగములు నానాఁటికిఁ బ్రబలుచుండెను. ఒకప్రక్క నెన్నటికిని నారక జ్ఞాతివైరమహాగ్ని రవులుచుండెను. తేజబహదూరుని మహోన్నతపదవి రామారావునకు, రామారావు పినతండ్రియగు ధీరమాలునకు ను హృదయవ్రణమయి యుండుటం జేసి వారిరువురు తేజబహదూరు

ననంతరమందు వానిక్రొడుకును నెమ్మదిగా బీర మెక్కనీయరను సిద్ధాంతమే. అందుచేతదే తేజబహదూరు కుమారున కాత్మసంరక్షణ సాధకములయిన శస్త్రవిద్యలను, మతాచార్యత్వమునకుఁ గావలసిన దేశభాషాగీర్వాణ భాషలను నేర్పించుటతోఁ దనివినొందక తనమీఁద విరోధులు చెప్పెడు కొండెములకుఁ, బన్నెఁడు కుతంత్రములకు స్వయముగఁబోయి చక్రవర్తులతో మాట్లాడి ప్రతిక్రియలు నెఱపుటకు వీలుగా నుండునని రాజభాషలగు నరబ్బి పారసీలను గూడ నాతనికిఁ జెప్పించెను. గోవిందునియందు గ్రహణశక్తి ధారణశక్తి యద్భుతముగా నుండినందున నతఁ డచిరకాలములోనే యా రెండుభాషలలోఁ బండితుఁడయి కవిత్వముఁ జెప్పఁజొచ్చెను. ఆతఁడు కాలాంతరమందు చక్రవర్తియగు నౌరంగజేబునకుఁ బద్యరూపకముగ వ్రాసిన పారసీ జాబులంబట్టిచూడ నతనికిఁ గవిత్వ మెంత వశవర్తియై యుండెనో తేటపడును. గోవిందుఁడు పదునెనిమిదేండ్ల ప్రాయమువాఁడయినప్పుడు పితృమరణమహాపద సంభవించినందున నతఁడు విద్యాభ్యాసము ముగించి పీఠాధిపత్యమును వహింప వలసిన వాఁడయ్యెను.

పితృమరణము.

గురుగోవిందుని పితృమరణము మిగుల దారుణమైనది. ఆపదలుఁగూడ నొకప్పుడు ప్రయోజనకారులగునని పెద్దలు చెప్పు మాట యీతని చరిత్రమువలనఁ గొంతవఱకు సత్యమని తోఁచుచున్నది. ఏలయన తేజబహదూరు దుర్మరణము సీకులకు రోసముఁ దలకెక్కించి వారిం బౌరుషవంతులఁ జేసి సీకుమతము నిల్చుటకుఁ గారణమై మహమ్మదీయ రాజ్యవిధ్వంసమునకుఁ బ్రధానహేతువులలో నొకటియయ్యెను.

అప్పటిఢిల్లీచక్రవర్తియగు నౌరంగజేబు తనబిడ్డలం దక్క దక్కిన కుటుంబమంతయు నిర్మూలముచేసి గద్దెయెక్కి తానుచేసిన పాపములకు భగవత్ప్రీత్యర్థమయిన ప్రాయశ్చిత్తమో యనునట్లు గాటమయిన స్వమతాసక్తి కలిగి హిందువులమీఁద హిందూమతము మీఁద నిష్టములేనివాఁడై సాధారణముగ గొప్పయుద్యోగములన్నియు మహమ్మదీయులకే యిచ్చుచు హిందువులకు మనోవ్యథ కలుగునట్లుఁ బ్రవర్తింపఁ దొడఁగెను. అందుచేత పూర్వచక్రవర్తులగు నక్బరు, జహంగీరు, షాజహానులమీఁద నున్నంతభక్తి విశ్వాసములు హిందువుల కౌరంగజేబుమీఁద నుండనయ్యె. స్వమతావేశము ప్రబలమగుటచే నీచక్రవర్తి క్రీ॥ శ॥ 1680 సంవత్సరమునఁ దన యధికారము మహోన్నతదశలో నున్నపుడు కాశ్మీరదేశబ్రాహ్మణులను మహమ్మదీయ మతములోఁ గలియవలసినదని బలవంతపెట్టెను. ఆబ్రాహ్మణులు సిక్కు గురువగు తేజబహదూరు కలిసినపక్షమునఁ దాముఁగూడ గలియుట కొడంబడిరి. ఆవిప్రు లిట్లనుటకుఁ దగినంత కారణము కనఁబడదు. ఏలయన తేజబహదూరు బ్రాహ్మణులకు గురువు కాఁడు మీఁదుమిక్కిలి బ్రాహ్మణుల మతాచారములకు విరుద్ధములైన కొన్ని విషయములను నానకు మొదలుకొని సిక్కుగురువు లుపదేశించుటం జేసి బ్రాహ్మణులకు వారొక విధముగా ననిష్టులైయుండిరి. చక్కగా విచారింపగా బ్రాహ్మణు లాతెఱంగునఁ బలుకుట కొక్క కారణము కలదు. తేజబహదూరు తురకయగుట కొడంబడఁడని వారెఱుంగుదురు. అతని తరువాత తాము మ్లేచ్ఛమత స్వీకారముఁ జేయ నొడంబడిరి; కావున నది యెన్నఁడు జరుగదని వారికినమ్మకము గలదు. విశేషించి తురకలకు, సిక్కులకు మహాయుద్ధములు జరిగిన జరుగవచ్చును. ఆపోరాటముల సందడిలో నౌరంగజేబు బ్రాహ్మణుల మాట మరచిపోవచ్చును. అదియునుంగాక యుద్ధములో సిక్కులచేతఁ

దురకలు నశించినను దురకలచేత సిక్కులు నశించినను వారుభయులుఁ గొంచెము హెచ్చుతగ్గుగాఁ దమమతమునకు విరుద్ధవర్తనులే యగుట చేత నెట్లైనను బ్రాహ్మణులకు సంతోషమే. ఈకపటభావము లోన నిలుపుకొని బ్రాహ్మణులా తెజఁగునఁ జక్రవర్తితోఁ జెప్పియుండిరు. చక్రవర్తియు వారిమాటలు సత్యములుగావగచి తక్షణము ఢిల్లీకిరమ్మని తేజబహదూరున కుత్తరువంపెను. అంతలోఁగొందఱు కాశ్మీరబ్రాహ్మణులు తేజబహదూరు దర్శనముఁజేసి తమయాపద నివారణ సేయుమని ప్రార్థించిరి. అప్పుడు తేజబహదూరు విపన్ని వారణార్థము ప్రాణత్యాగ మావశ్యకమన్నట్లు, కుమారుఁడగు గోవిందుఁడప్పుడు సన్నిధినుండి ప్రాణపరిత్యాగము సేయుమని తండ్రిం బురికొల్పినట్లు వెనుక వ్రాసియుంటిని.

రోస మెక్కించునట్టి కొడుకుపలుకులువిని గురువు "భగవత్సంకల్పము జరుగుఁగాక" యని ఢిల్లీలోఁ దనకు విరోధులు ప్రబలులై యుండుటచేతఁ దననాశన మనివార్యమని యెఱింగి గోవిందును గురుపదమున నియోగించి ప్రయాణోన్ముఖుఁడై కుమారు నుద్దేశించి యిట్లనియె. "నేను భగవంతుని సంకల్పము నెరవేర్పఁదలఁచి ధర్మమునిమిత్తము నాప్రాణముల విడువ నుద్యుక్తుఁడనై ఢిల్లీకిఁ బోవుచున్నాను. మరణానంతరము నాశరీరమున కవమానము గలుగకుండ నీవు దానికి యథావిధిగ నగ్నిసంస్కారముఁ జేసి నన్నుఁ జంపువారి మీఁద తప్పక పగఁదీర్చుకొందువేని నాయాత్మ సంతుష్టిఁజెందు. హిందూమతముయొక్క పక్షము నవలంబించెడు భారముఁగూడ నీకే విడుచుచున్నాను. నీప్రాణములుపోయినను సరే, మతధర్మము మాత్ర మెన్నఁడు విడువవద్దు." చైతన్యములేని పదార్థములకైన శౌర్యమును గొలుపు నావీరాలాపముల విని గురుగోవిందుఁడు తండ్రి పలుకుల కిట్లని ప్రత్యుత్తర మిచ్చెను.

"ఏయాపద వచ్చిన రానిండు. ఏమైనఁ గానిండు. నేను మీ యాజ్ఞాప్రకారము స్వదేశమునిమిత్తము స్వమతము నిమిత్తము నా రక్తము ధారవోయవలసినచ్చినను మది నేసందేహములేక నట్లు చేయుదు" కొడుకటు ప్రతిజ్ఞఁ జేసినతోడనే తేజబహదూరు సంతుష్టహృదయుఁడై ఢిల్లీకిఁ బోయెను. ఔరంగజేబు గురువును గౌరవించిన ట్లభినయించి మహమ్మదీయమతము నవలంబింపవలసినదని కోరెను. తేజబహదూరు నిర్భయముగా వానికోరిక నిరాకరించెను. అనంతరము చక్రవర్తి యాతని మెత్తనిపలుకులతో లాలించి కొంతసేపు గొప్పబహుమానము నిచ్చునట్లు వాగ్దానముచేసి కొంతసేపు స్వమత స్వీకారముఁ జేయుమని యడిగెను. కాని గురు వెంతమాత్రము లొంగనందున నౌరంగజేబు కాఠిన్యము వహించి "నీవు మహమ్మదీయమతమును స్వీకరించినను సరే లేక నీమతమే సర్వోత్తమమైన పక్షమున నీవాదము బలపఱచుట కేవిధమైన మహాద్భుతములు చేసినను సరే ఈరెంటిలో నేదోయొకటి చేయవేని మరణమునకు సిద్ధముకమ్మని పలికెను. గురువు చక్రవర్తితో వాదముచేసి యాతని మనోనిశ్చితము మార్పఁ దలఁచెను కానియది వ్యర్థమయ్యె. ఔరంగజేబు తేజబహదూరునకుఁ బదునైదుదినములు గడువిచ్చి యాగడువులోపల నేదోయొక పనిఁ జేయవలయునని చెప్పి యాదినములలోనైన నాతని స్వేచ్ఛగా నుండనీయక చెరలోఁ బెట్టించెను. ఆయన చెఱకు మిక్కిలి సంతోషముతో దైవముమీఁద భారమువేసి వెళ్ళి యాగడువుకాలమంతయు నీశ్వరధ్యాన సంకీర్తనములతో గడపెను. పదునయిదు దినములు ముగిసినతోడనే చక్రవర్తి యాతనిఁ దన సన్నిధికిఁ బిలపించి మహమ్మదీయమత మంగీకరింతువా, యద్భుతమేదేనిఁ జేయుదువా,యని యడుగనాతఁడేదియుం జేయననియె. అదివిని చక్రవర్తి తన క్రోధము ప్రశాంతిఁ జెంద చిరకాలమునుండి తేజబహ

దూను నాశనమునకై యెడతెగక పాటుపడుచున్న రామారావు కన్నులు చల్లబడ నీకు మతస్థులు శోకసముద్రమున మునుగ నావ హాత్మునకు మరణదండన విధించెను. చక్రవర్తియాజ్ఞ నెరవేర్చుటకు ఖడ్గము చేతబట్టుకొని హంతకుఁడు వచ్చినప్పుడు తేజబహద్దూరువారి సంకల్పమెరిఁగి తలయొగ్గి భగవత్పాదారవిందముల మనస్సుననిలిపి తన్మయుఁడై క్షణములో నాన్నృశంసకునికత్తి వేటునఁ దనసృష్టికర్త సాన్నిధ్యమును జెందెను. ఈమహాత్మునకు మరణమెంతతృణప్రాయ మో కదా! దేశాభిమానులకు మతాభిమానులకు నీతిమంతులకు మరణము జనసామాన్యమునకుంబలె దుఃఖావహముగాక సౌఖ్యావ హము. గృహము, కారాగృహము, గూడ వారికి సమానమే. వారు మృతి నొందియు జీవించినవారే.

ఇద్దరు మహాభక్తులు.

తండ్రి శిరచ్ఛేదమగునప్పటికి గురుగోవిందుఁడు ఢిల్లీకి దుకోశ్రు సుల దూరమున నొకయడవిలో విడిసియుండెనందున నీఘోరవార్త జరిగిన కొలఁదిసేపటికే కొందరు భక్తులవలన నాయనకు తెలిసెను. దారుణమయిన యాపితృమరణము గురుగోవిందును దుఃఖపూరితునిం జేసెను. అయిన నది దుఃఖమునకు నుదాసీనతకు సమయము కాదు గదా! తేజబహదూరు, మరణానంతరము తన శరీరమును తుర కల యధీనమునుండి తెచ్చి దానికి యథావిధిగా నగ్నిసంస్కారముఁ జేయవలసినదని కుమారుని కాజ్ఞాపించినందున నాయాజ్ఞ వెంటనేజరు గవలసియుండెను. కాని యామన కళేబరము సంపాదించుట దుస్సా ధ్యము. చక్రవర్తి యాగ్రహము తేజబహదూరు చచ్చినను దీర లేదు. కావున నాయన శరీరమును నీకుల కియ్యకూడదనియు జచ్చి

నచోటనే యుడికళ్ళి పోవలయుననియు నాప్రభువు శాసించెను. ఏల యన హిందూమతమునుబట్టి చూడఁగా నాతఁడు వర్ణభ్రష్టుఁడు కావున నగ్ని సంస్కారమునకుఁ దగఁడట. మహమ్మదీయమతమును బట్టిచూడఁగా నతఁడందు విశ్వాసములేనివాఁడు కావున పూడ్చిపెట్ట బడుట కనర్హుఁడట. కావున మొదట నెక్కడ తలనఱకఁబడెనో యచ్చ టనే యాకళేబరము పడియుండెను. దరికెవ్వరు రాకుండ చెరసాలతలు పులు మూయఁబడెను. కావలివాండ్రు పరుల నెవ్వరిని రానియ్యక వేయికన్నులఁ గాచుచుండిరి. కొంతమందిని కూడఁగట్టుకొని కావలి వాండ్రతోఁ బోరి చెరసాల తలుపుల బలిమిఁ దెఱచి కళేబరముం దెచ్చు ట యసాధ్యము. అందుచేత నేగడబిడయు లేకుండ రహస్యముగ గురుకళేబరము నవ్వలకు దాటించుట కర్తవ్యమని గురుగోవిందుఁడు, దక్కిన సిక్కులుఁ దలంచిరి. అట్టికార్యము సాధించువారెవ్వరని గోవిం దుఁడు తలపోయుచుండ తండ్రి కొడుకులు రంగిరీతవంశస్థులునగు నిద్దరు సిక్కులు గురుసన్నిధికిఁ బోయి పవిత్రమైన యమ్మహాకార్యము సాధించు భారము దమపయిఁ బెట్టుమని వినయమున నతనిం బ్రార్థిం చిరి. అది విని గోవిందుఁడొక్క నిముస మాలోచించి "సరే! పోయిరండు మీకార్యమున కీశ్వరుఁడు దోడు పడుఁగాక" యని పలికెను. ఈమ హోపకారము తమకుం జేసినందుకు రంగిరీతులు కృతజ్ఞులై మహా భక్తితో గురువునకు నమస్కరించి యాశీర్వచనముల వడసిపోయిరి. ఏవిధముగా నాకళేబరమును నీవలకు తీసికొని రావలయునో యావిధ ము నించుకయు వారువిచారింపలేదు. ఇది సత్కార్యముగదా యీ శ్వరుఁడీపనికిదోడుపడక పోవునా యనుధైర్యముననే వారు బయలు దేరిరి. బయలుదేరి సగముదూరము వచ్చునప్పటికి వారికి గుఱ్ఱపు బండిదోలు మనుష్యుఁడొకఁడగపడెను. అతనితో నించుక మాటలాడు నప్పటికి నతఁడు పంజాబుదేశస్థుఁడనియు ఢిల్లీలో నొకగొప్పయుద్యో

గస్థునకు బండిదోలువాఁడనియు విశేషించి సీకు గురువుల సిద్ధాంతములయందుగాఢమయిన నమ్మికగలవాఁడనియు గురుకార్యము నేబాములై నంబడి సాధింప నిచ్ఛగలవాఁడనియుఁ దెలిపెను. అంతట రంగిరీతులు తమ మనోరథమును వానికెరింగించిరి. ఎరింగించుటయు నతఁడు పరమానందభరితుఁడై గురువు కళేబరము పడియున్న చోటునకుఁ బోవుటకుఁ గావలసిన న్ని యుపాయములు గుట్టులు చెప్పుటయేగాక కళేబరమీవలకు వచ్చినతోడనే దానిం దనబండిమీఁద బెట్టుకొని యెవ్వరికనుమానముఁ జనింపకుండ వారు కోరినపరదేశమునకుదీసికొని పోవుటకుదోడ్పడునట్లువాగ్దానము జేసెను. రంగిరీతులాతనిపలుకులువిని మహానందభరితులయిరి. ఏలయన గురుకళేబరము తీసుకొనిపోవుట కట్టి శకటముదొరకుట మిక్కిలి యదృష్టము. ఏమన నతఁడు సిక్కుల భక్తుఁడు. అతఁడు బండిదోలు నేని నెవ్వరికి ననుమానము పుట్టదు. పట్టణమందలి తలారులు వానికిం బరిచితులు. అర్ధరాత్రిమందు నపరరాత్రమందు నతఁడు తనయజమానునకు బండిదోలగా వారు చాల సారులు చూచినవారు కావున నేవేళ బండితోలినను దాసిని శోధింపరు. మరియుఁ బట్టణమందలి సందులు గొందులు మారుమూలలు నెరిఁగిన వాఁడగుటచే నతఁడు నిరపాయములగు మార్గముల బండి తోలుకొనిపోయి గమ్యస్థానమును జేర్పగలఁడు. ఇట్టియాసల నెన్నో మనంబునం బెట్టుకొని యయ్యిరువురు వానితో మాటలాడుచుఁ బట్టణము జేరిరి. రంగిరీతులెట్టెటో కష్టపడి గురు కళేబరమును దెచ్చునట్లును దానిం దెచ్చువరకు బండివాఁడు చెరసాలకు సమీపమున నొక సందులోబండి కట్టుకొని సిద్ధముగా నుండునట్లును కళేబరము బండిలో బడినతోడనే ముువ్వురు బయలుదేరి పోవునట్లును వారేర్పాటుఁ జేసికొనిరి. ఆయేర్పాటును బట్టి బండివాఁడు తానెక్కడ బండినిలిపి కనిపెట్టుకొనియుండదలఁచెనో యాస్థానమును గురుకళేబరమున్న చెరువు

ను వారికి జూపెను. ఢిల్లీపట్టణము చూడతగిన మహానగరమైన మన రంగిరీతుల మనస్సులు పురసౌందర్యముమీదికిం బోకయే గోడదాటిన బాగుండు, నితరులు కనుమానముం జనింపకుండ నేమూలనుండియెక్క వలయు నేప్రక్కనుండి కళేబరము దింపుటకు వీలగుననుయోజనలతో నిండియుండెను. అట్లు తలంచుచు రెండుజాముల రాత్రి కడచువఱకు వారు చెఱసాల కెదురుగా నొకమూల నక్కియుండిరి. అంతటం జంద్రాస్తమయమయ్యెను. అగుటయు వారు చెఱసాల వెనుకప్రక్క నుండి మెల్లంగ గోడమీఁదికెగఁబ్రాకంబోచ్చిరి. పదుచువాఁ డగుటచే గొడుకు గోడ ననాయాసముగ నెక్కెను. వృద్ధుండు కావున తండ్రిదిగజారెను. కుమారుం డంతట లోపలనుఱికి యొక దిడ్డిగుమ్మము తలుపు తెఱవ జనకుఁడుంగూడ లోపల ప్రవేశించెను. అంత నయ్యిరువురు, బండివాఁడు తమకిచ్చిన చిన్న దీపపు వెలుతురున బలుతావులు వెదకి యెట్టకే లకు గురుకళేబరమును గనిపెట్టిరి. దుర్వాసనతోంగూడి ధూళిధూసరితమైన యాకళేబరమును జూచి రంగిరీతులు పట్టరాని దుఃఖమునం బరవశులై కొంతసేపు వగచి గురుపాదములకు నమస్కరించి కన్నుల నద్దుకొని దీవన లిమ్మని యాయనయాత్మను బ్రార్థించి కావలివాండ్రు మేలుకొన్న పక్షమునను నడి యేమయిన నయినను దమకార్యము భగ్నమగునని సత్వరమే పనికిం దొరఁకొనిరి. ఆకళేబర మెత్తుబోవ వారిమనసున నొక్క తలంపు బాతెను. ఆశరీరము నెత్తుకొని పోవుటలోఁ గష్టములేదు. కాని కావలివాండ్రు మేలుకొన్న వెనుక కళేబరము లేకపోవుటచే ననుమానపడరా? పడి నలుదెసలకు బంట్లంబంపరా? బంటి రాజభటులు కందికపోయినను వారు గురుకళేబర మెక్కడనున్నదో శోధించి తెలుసుకొని పూర్తిగ తగులబడక ముందెదానిం బట్టుకొని రెట్టించిన కోపముచేత జరపవలసిన యవమానమును జరపరా? ఒకవేళ నట్టియిబ్బంది తటస్థింపక నిరాటంకముగా నగ్నిసం

స్కారమైనను, ఔరంగజేబు సిక్కులే యీసాహసకార్యమును జేసిరని తెలిసికొనకపోవునా? తెలిసికొని గురుభక్తులను, కుమారుని నానా హింసల పాలుసేయకపోవునా? అనుతలంపులు మనస్సులందు మల్లడి గొన నయ్యిరువురుఁ జక్రవర్తి కెంతమాత్రము ననుమానము పొడమ కుండునట్లు సిక్కులకు నిరపాయమగునట్లుఁ గళేబరముఁ గొనిపోవుట యుచితమని నిశ్చయించిరి. దానికొక్కటే యుపాయముగలదు. అది యేదన గురుకళేబరమును దీసి దానిస్థానమున శవము నక్కడబెట్టుట యేయని వారనుకొనిరి. అనుకొనుటయే తడవుగఁ గుమారుఁడు భక్తి తత్పరుఁడై మొగమంతయు నుత్సాహమున జేవురింప "నన్ను జంపి యిక్కడ పడవేయు" మని తండ్రితోఁ బలికి తలయొగ్గెను. ఒగ్గిన తోడనే కొడుకు తల త్రెవ్వనేయక తండ్రి యాతని శిరస్సుపై హస్తమువేసి యాశీర్వదించి "బిడ్డా నీవు కావు. గురువు ననుసరింపఁదగిన వాఁడను నేనుఁ నిలు నిలు" మని వారించి తనశిరస్సు ఖండింపుమని కొడుకు నెన్నోవిధముల బ్రతిమాలెను. కుమారుఁ డాపనిఁ జేయుట కొప్పుకొనఁడయ్యె. అందుచేత గురుకార్యార్థము మృతినొందు గౌరవము సంపాదించు విషయమునఁ దండ్రికొడుకుల కప్పుడు వివాదము కలిగెను. పుత్రస్నేహమున దండ్రికొడుకుం జంపనొల్లఁడు. పితృభక్తిచేఁ గొడుకు తండ్రిం జంపనొల్లఁడు. ఇరువుర హృదయముల గురుభక్తి యతిశయముగ నెలకొని యుండుటచే "నేనుబోవుట మంచిది. నేనుబోవుటమంచి" దనితగవులాడిరి. కొంతతడవట్లువాదమైనపిదపతండ్రియిట్లనియె. "నీవునాకంటెబలముగలవాఁడవు. నేనుబోయినను నీవీకార్యము నెక్కువసులభముగాఁ జేయగలవు. మఱియు నేనుగురువుతోసమాన వయస్కుఁడను. నాకళేబర మిక్కడపడియుండెనా యది గురువుదేయని భ్రమపడి యనుమానపడరు. ముసలిశరీరమునకు బదులుముసలిశరీరమే యుండవలయునుగాని పడుచుశరీరముండుట యను

మానమునకు హేతువు" అనవుడు తండ్రియుక్తులు, ముఖ్యముగా నందలి చివరపలుకులు కార్యసాధనమే ప్రధానముగాఁగల కుమారునకు నచ్చెను. నచ్చుటయు నతఁడేమియుఁ బలుకక యూరకుండెను. అంతటవృద్ధుఁడు నలుదిక్కులను తనతల నొగ్గెను. కుమారుఁడు చేయునదితోఁచక వెఱ్ఱి వెఱ్ఱిగాఁ జూడసాగెను. తండ్రి శిరస్సుఖండించుటకు వానిచేతు లాడవయ్యె. కుమారునిమనస్సు కరఁగిపోవుట తెలిసికొని వృద్ధుఁడు భగవంతునిఁ బ్రార్థించి ఖడ్గముచేతఁ బూని యొక్కపెట్టునతన తలఁదానే నఱుకుకొనెను. ఆదెబ్బతోఁ దల తెగి నేలఁబడెను. అంతటఁ గుమారుఁడు తండ్రినిమిత్తము కన్నీరువిడిచి పితృపాదములకుఁ బ్రణామముఁ జేసి ముద్దుపెట్టుకొని గురుకళేబరము నెత్తుకొని యాయమూల్యపదార్థమును బండిలోఁ బడవేసెను. అనంతరము పట్టణము దాటువఱకు బండిమెల్ల మెల్లగ నడచి యవ్వల వేగముగఁ బోయి గమ్యస్థానమునుఁ జేరెను. కావలివాండ్రు కాని చక్రవర్తి కాని యెన్నటికా రహస్యమును దెలిసికొనఁజాలరైరి. ఆహాహా! వృద్ధరంగిరేతుని యొక్కయుఁ బడుచురంగిరేతుని యొక్కయు భక్తి, కార్యనిర్వహణశక్తి ప్రాణములయందలి నిరపేక్ష తనకుండవలయునని యేమనుష్యుఁడు కోరఁడు.

మనోనిర్ధారణ.

జనకుని ధైర్యము, కార్యశూరత బాలుఁడగు గురుగోవిందుని మెత్తని మనసుమీఁద నాఁటుకొని యాతని కధికోత్సాహముఁ గలిగించెను. ఆయుత్సాహమునందు గురుగోవిందుఁ డిట్లు పలికెనఁట. "ఇవ్విధంబున ధర్మసంరక్షణార్థ మాత్మబలి యిచ్చిన మహాత్ముఁడు, ప్రాణమిచ్చి, యిచ్చినందుకు విచారింపఁడు. మతమునిమిత్తము ప్రాణత్యాగముఁ జేసిన మహాయోగి, శిరస్సును బాసెనే కాని తనమ

నో నిశ్చయము వ్రాయలేదు. తేజబహదూరు స్వమత రక్షణార్థము ప్రాణములు విడువ ఢిల్లీకి బయలుదేఱినది మొదలు గురుగోవిందుఁ డుభయవిష్యత్కాలమునఁ దాను చేయవలసిన కార్య మేదోయది చక్కగాను గ్రహించియుండెను. ఆకార్యమేమనఁ జిరకాలము నుండి యన్యమతస్థులచేత నణఁగద్రొక్కఁబడియున్న హిందువుల నుద్ధరించి తన్మతమునుగాపాడి వారికి జరుగు పరాభవంబులకుఁ దగిన ప్రతీకారముల వీలగునప్పుడెల్లఁ జేయుట, పితృపరాభవమునిమిత్తము మహమ్మదీయుల మీఁద పగతీర్చుకొనుట యాయన ముఖ్యోద్దేశమైనను గురుగోవిందుఁడు కేవలము తనపంతమే నెగ్గించుకొనుటకు చూడక యార్యమతమునిమిత్తము హిందూజాతినిమిత్తముఁ దన నెత్తురు ధారవోయదలంచెను. కాని మహమ్మదీయుల యధికారము దేశమునందు సర్వవ్యాప్తమై దుర్నిరీక్ష్యమై యుండుటచే నది యసాధ్యమని యతఁడెఱుంగును. తురకసేనలు తెలుపలేని సముద్రతరంగములనియు నతఁడెఱుంగును. హిందూరాజులు లేశమైన సిగ్గుఁగాని, యాత్మగౌరవముగాని లేక తమ మతాచారములకు విరుద్ధపద్ధతుల నవలంబించి విదేశీయులగు మ్లేచ్ఛులకే సాయమొసఁగుచుండిరనియు నతఁడెఱుంగును. సామాన్యులగు హిందూజనులు మతముకొఱకుగాని మతసంస్కర్తయగు తనకొఱకుఁగాని యించుకయు విచారింపరనియు వారికే గొడవలక్కఱ లేదనియు నెఱుఁగును. అంత ఢిల్లీశ్వరునితోఁ బగసాధింపఁదలంచిన తాను మొగలాయి రాజ్యమందున్న చిన్న జమీందారునైన నెదరించుపాటిధనముగాని బలముగాని లేని బాలుఁడనుమాట మఱియుఁ బాగుగ నెఱుంగును. ఇవియే కావు. మఱియు ననేక విషయముల నతఁడు బాగుగ నెఱుంగును. ఎఱిఁగియు నొకపాచికవేసి చూడవలయునని సంకల్పించెను. రాజకీయవ్యవహారములలోఁగాని సాంఘికసంస్కరణములలోఁగాని మతవిషయికములగు మార్పులలోఁగాని చొరబడి పోరాడఁదలఁచునతఁడు దానికిం దగు

ప్రయత్నముల ముందుచేసి స్వబలపరబలంబుల గణియించి నేర్పుతో మెలఁగవలయుకాని తొందఱపడగూడదుగదా! అట్లుచేయు నతఁడుతన కుగల బుద్ధియు బలంబును నొక్కచోఁ జేర్చి పోరుగడపినచో గృత కృత్యుండగును. ఈసాధకబాధకములను స్తిమితముగ విచారించి తన యాలోచనలను జక్కఁగా బొదుగుటకు గురుగోవిందుఁడు మఖోవాలను నామాంతరముగల యానందపురమున వసియింపఁబోయెను. అప్పటి కాయనను సీకులందఱు తేజబహదూరుని వారసునిగా దమకుం బరమగురువుగా నంగీకరించిరి. అంగీకరించినను గురువునకు దేశమందుండవలసినంత పలుకుబడియు బలమును నుండవయ్యె. యుద్ధములలో యోధులకుఁ బ్రతియోధు లుండవలయు. అట్టియోధులను సంపాదించుటకు గొండలనడుమ నున్న యానందపురమున నివసించుట గురువునకుఁ బ్రయోజనకారియే యయ్యెను. ఏలయన నచటనుండగా శూరులనేకులు కాలక్రమమున నాయనచుట్టుం జేరిరి. అందుచేత క్రమక్రమంబున దనపక్షము బలపడుననియుఁ గార్యసాధక మగుననియు నతఁడాశపడఁజొచ్చెను. ప్రపంచముతో విశేషసంబంధము లేని మాఱుమూల కొండలలో నతఁడున్నను గురుగోవిందుని యానాఁటి జీవిత మాయనకు విసువు పుట్టింపలేదు. ఏమన గురుగోవిందుఁడు నిరంతర మొక్కయీశ్వరధ్యానముతోనే కాలక్షేపము సేయలేదు. శిష్యులకు సేవలము మతబోధయే సేయుచు ప్రొద్దుగడపలేదు. ఎల్లప్పుడ నుచరులనే సంపాదించుటకు బ్రయత్నములు చేయలేదు. ఇందేపని ప్రత్యేకముగా నొనర్చినను విసువుపుట్టించునని యతఁడామూఁడుపనులంగూడ నప్పుడప్పుడు సేయుచు వచ్చెను. ధ్యానము వలసినప్పుఁడు ధ్యానము చేసికొనును. తనదేశస్థుల పునర్జీవనము సేయుమార్గంబులనె డనెడఁ దలపోయుచుండును. భక్తితో వినదలంచుశిష్యులకు నానకు యొక్క మతసిద్ధాంతములను విగ్రహారాధనముం దిరస్కరించి పర

మీశ్వరారాధనమును స్థిరపఱచు తన సిద్ధాంతములు నెఱవేఱఁబోవుచుండు చుండెను. కత్తిఁగట్టి మహమ్మదీయులతోఁ బోరనోపిన వీరు లగు పహిలవానులను స్వసైన్యమునఁ జేర్చుచుండెను. ఇన్నిటిని జరుపుచు గురు గోవిందుఁడు [illegible] వేఁటలోఁ గొంత ప్రొద్దుపుచ్చుచు వినోదించుచు నుండెను. [illegible] జేయు టలో నతఁడా కాలమందు సమానుఁడు. ఆతనియొద్ద [illegible] శ్రేష్ఠజాతి గుఱ్ఱము లనేకము లుండెడివి. వేఁటసేయునపుడు పులులు సింగములు మొదలగు ఘోరసత్త్వములతో [illegible] పోరాడి యెట్టకే లకు వానిం జంపుచు వచ్చెను. ఇన్ని [illegible] కృత్య ములం దగిలియున్నను గురుగోవిందుఁడు విద్యాభ్యాసమును మానలే దు. మహమ్మదీయ మతగ్రంథములు వ్రాయఁబడిన అరబ్బీ, పారసీ భా షల నేర్చికొని యాతఁ డంతటఁ దనివినొందక [illegible] జ్ఞాననిక్షేప ములున్న సంస్కృతభాషను గూడ నభ్యసించెను. [illegible] యనకు రామాయణము, మహాభారతము మొదలగు గీర్వాణగ్రంథ ములఁ జదివి వినిపించుటకుఁ గొప్పపండితులు [illegible] కడనుండిరి.

ప్రథమ ప్రయత్నము.

గురుగోవిందుఁడు కొండలనడుమ నొక పల్లెయందుఁ గూర్చుండి దేశస్థితినిఁ బరికించుచుఁ దనబలంబు నభివృద్ధిఁ జేసికొనుచు నుండఁగా ముందుముందు చేయవలసిన గొప్పయుద్ధములకు నభ్యాసముపోలె నా కస్మికముగాఁ బ్రథమ ప్రయత్నము సేయవలసి వచ్చెను. అది యీవి ధమున సంభవించెను. ఆసాము దేశపు రాజు, తేజబహాదూరుని ప్రి యశిష్యుఁడునగు రత్నరాయుఁడను నతఁడు గురుగోవిందుని దర్శ

నను సేయఁ దలఁచి వెలలేని యనేక బహుమానములం దీసికొని పంజాబునకుఁ బోయెను. గురునిమిత్త మతఁడు తెచ్చిన కానుకలలోఁ దెల్లయేనుఁగొకటి, యరబ్బీ గుఱ్ఱమొకటి, తెల్లడేగయొకటి, ఖడ్గ మొకటి, బంగరు స్తంభములుకల గుడారమొకటి యుండెను. చుట్టుప్రక్కలనున్న జమీందారు లీయపూర్వపు గానుకలం జూచి ముచ్చటపడి యవియెట్లయినఁ దాము హరియింపవలయునని తలంచిరి. విలాసపుర ప్రభువగు భీమచంద్రుఁడు తెల్లయేనుఁగును, గుడారమును జేకొనఁదలఁచె. హిందూరు ప్రభువగు హరిచంద్రుఁడు డేగ, ఖడ్గము, గుఱ్ఱముఁ దనకుఁ గావలయునని మనసుపడియె. హరిచంద్రుఁడు తాను కోరిన పదార్థముల స్వీకరించుట కెంతో తొందరపడి, వస్తువులు తెచ్చిన రత్నరాయలను గాని,వస్తువులయజమానుఁడగుగురుగోవిందునిగాని యడుగక యూరక కత్తి నాదియని చేతఁ బట్టుకొనెను. సూక్ష్మబుద్ధిగల గురుగోవిందుఁడు వారి యుద్దేశముఁ గని పట్టి తగినట్లు వారికి బుద్ధిచెప్ప సంకల్పించెను. అందుచేత హరిచంద్రుఁడు ఖడ్గముఁ జేకొనఁగానే యతఁడు పరిహాసగర్భితమైన చిఱునవ్వు నవ్వి యాతని కిట్లనియె. “అవి నాశిష్యుఁడు తెచ్చిన వస్తువులు కావున నావి. అవి మీకుఁ గావలసిన మీరు పుచ్చుకొనవచ్చును. కాని నేజెప్పిన నిబంధనలు కొడఁబడవలయును. ఆ నిబంధన లివి. “మొట్టమొదట నేను ఖడ్గము నడుమునకుఁ గట్టుకొని, డేగను జేతఁ బట్టుకొని తెల్లయేనుఁగుమీఁద నంబారీలోఁ గూర్చుండి, యరబ్బీ గుఱ్ఱ మెదుట నడువ నూరేగవలయును. ఊరేగింపు ముగిసిన వెనుక గుడారములోఁ గొలువుండెదను.” అప్పలుకులు విని, గురువనుకొన్నట్లే జమీందారులు కోపోద్దీపితులయిరి. అయిన నాతఁడు తమ యెదుటఁజూపిన ధైర్యస్థైర్యముల కచ్చెరువొంది, కోపము పట్టరానిదగుటచే నెట్టయెదుట నాతనిఁ దిట్ట నారంభించిరి. ఆతిట్లను సరకు

నేయక గురువు నిశ్చలుండై యుండి వినుచు 'నేను చెప్పిన సంగతులు వినినారుకదా. నేనుపయోగించినపిదప మీరావస్త్రములు నుపయోగించుకొనవచ్చు' నని మరల బల్కెను. ఈపలుకులు వారిని శాంతింపఁ జేయుటకు మాఱు, కోపాగ్నిం బ్రజ్వలింపఁజేయు సమిధలయ్యెను. అందుచే నాజమీందారులు తమ యనుచరులతోఁ గూడి ఖడ్గములెత్తి గురువుపైఁ బడనుగ్యమించిరి. కాని రెండు మూడడుగులైన వేయకమునుపే యదివఱకె కొంతో కష్టముమీఁద నోపికపట్టియున్న సీకులు తత్క్షణమే యాయుధపాణులయి 'గురువునకు జయము, గురువునకు జయ' మని కేకలు వేయుచు కసిఁదీర్చుకొనుటకు గురువుఁ బరాభవించిన కొండరాజులపైఁ గవిసిరి. అంతట గొప్ప కళవళము పుట్టెను. ఉభయపక్షములవారి కంఠస్వనములు నింగిముట్టెను. కొండ దొరల ప్రాణములు మిక్కిలి యపాయములో నుండెను. కాని, కార్యము పాకము తప్పనిచ్చుట యిష్టములేనందున గురువు తన యనుచరుల నొక్కమాటతో నివారించెను. గురువుయాన శిరసా వహించి సీకులు ఝళిపించినకత్తులు మరల నొఱలలోఁ బెట్టిరి. అంతట సద్దడఁగెను. జమీందారులు బుద్ధితెచ్చుకొని యచ్చోటువాసి పోయిరి. కాని, పోవునప్పుడు కడుపుమంట తీఱక గురువును నోటికివచ్చినట్లు తిట్టి, బెదరించిరి. సీకు లాతిట్లను, వెఱపింపులను వడ్డీతో నప్పచెప్పిరి.

జమీందారు లచ్చోటువాసి చన్నపిదప గురుగోవిందుఁడు తన యనుచరుల కిట్లనియె. "మీకు నాయెడలఁ గలపక్షపాతమునకుఁ బదులు నన్నవమానింప సంకల్పించినపుడు మాగౌరవముఁ గాపాడుటలో మీకుఁగల పూనికకు నాకు మిక్కిలి సంతోషముగా నున్నది. మీవిశ్వాస మింతింతయని నేను పొగడఁజాలను. అయినను నేను మీ క్షేమముఁ గోరువాఁడను. మతగురువు నగుటచేత జమీందారుల యెడల మీరు నోటరానిచ్చిన దుర్భాషలను విని నేనెంతమాత్రము

సంతోషింపలేను. ఇది నాకు బొత్తిగ నిష్టములేదు. ఇక ముందైన మీరు పరుషవాక్యము లాడకుండ జాగ్రత్తగ సంభాషింతురని కోరుచున్నాను."

మఱునాఁడు జమీందారులు తమకు జరిగిన పరాభవము మఱవలేక క్రోధాగ్నిచే నుడుకుచున్న మనసులతో నానందపురము విడిచిపోయిరి. పలుమాటలేల? గురుగోవిందుని, తదనుచరులగు సిక్కులను నిర్మూలము చేసినఁగాని తమకు సంతుష్టి యుండదని యట్లు చేయుటకు శీఘ్రముగఁ బ్రయత్నముచేసెను. నిర్నిమిత్తముగా నిట్టి కలహము సంభవించినందుకు గురువుగాని యా మన్నెదొరలుగాని యించుకేనియు విచారింపలేదనుట నిస్సందేహవిషయము. జమీందారు లెంతధనవంతులై యెంతబలముకలవారైనను దాను వారి కించుకేనియు నొగ్గిపోవుట లేదని యాదొరలకు స్పష్టముగాఁ దెలియఁజేయ గురుగోవిందుఁడు సంకల్పించెను. ఇంక జమీందారులో గురుగోవిందుఁడు తండ్రియంతటి శాంతస్వభావముఁ గలవాఁడు కాఁడనియు గర్వము పొగరు గలవాఁడనియుఁ దలంచి మొదటినుండియు నాతనియెడ ద్వేషమునే పూని యీసమయమున నాతని పూర్ణముగా నడఁగఁద్రొక్కవలయునని సంకల్పించిరి. అన్నిటికంటె గురువుమీఁద జమీందారుల కొకవిషయమున నెక్కువకోపము చిరకాలమునుండి యుండెను. గురుగోవిందుఁ డెక్కడికైన బయలుదేఱునప్పుడు రాజసముతో గుఱ్ఱముమీఁద నెక్కి చుట్టుప్రక్కల కొండలు ప్రతిధ్వనులు చేయునట్లు తనభేరి ముందు వేయించుచుఁ దనరాకఁ దెలియఁజేయుచుండును. జమీందారుల మతమున నీభేరీలు వేయించుకొనుట రాజచిహ్నముకాని గురువున కనుచితము. అందుచేత వారు గురుగోవిందుఁడు రాజలాంఛనమును స్వీకరించుటలోఁ దన తలకు మిగిలినపని ప్రారంభించినాఁడనియు నతఁ డాచిహ్నములఁ దా

ల్పుట రాజుల నవమానించుటనియు మొదటనుండియు భావించి చిరకాలమునుండి యాతనిమీఁద కసూపులలో సక్కుస్సుఁబూని గర్వభంజనము చేయుట కదనునిమిత్త మెదురుచూచుచుండిరి. అంతలో నీయదను వచ్చినందున వారు పరమానందభరితులై యది దాటిపోకుండఁ గసిఁ దీర్చుకొనఁదలఁచిరి. భీమచందుఁడు తన రాజధానిఁ జేరిన తోడనే చేసిన మొట్టమొదటి పని యేమనఁగా నానందపురము విడిచి తత్క్షణము వెళ్ళవలసినదనియు నట్లు విడవకుండిన దన కాగ్రహము కలుఁగుననియు గురువున కొకజాబు వ్రాసిపంపెను. ఆజాబుచూచి గోవిందుఁడు చిఱునవ్వునవ్వి దానికి ఖడ్గము కొనే ప్రత్యుత్తరమీయఁ దలంచెను. కాని మాటలతో నీయఁదలఁపఁడయ్యె. అనంతరము భీమచందుఁడు యుద్ధసన్నద్ధుఁడయ్యెను. కాని యుభయసైన్యములు రణరంగముఁ జేరకమునుపు నాహను దేశపురాజగు మేదినీప్రకాశుఁడు గురువుం గలిసికొని యానందపురమువిడిచి తనరాజ్యమునకు వచ్చి యచ్చట కొఁపుర ముండుమని గురువుం బ్రార్థించెను. యుద్ధమువలన నష్టములు గలుఁగునను భయముననో యారాజు ప్రార్థనము నిరాకరింప నిష్టములేకనో గురుగోవిందుఁ డందుకు సమ్మతించెను. గురుగోవిందుఁడు భీమచందునితోఁ బోరాడుట కసమర్థుఁడై యుండుటం జేసి యట్లొనర్చి యుండవచ్చునని మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసిరి. మహమ్మదీయులు గురుగోవిందునియెడ నెల్లప్పుడు ద్వేషభావమునే జూపువారు కావున వారిమాటలయం దెంతయాదర ముంచవలయునో చదువరులే యెఱుంగుదురు. మేదినీప్రకాశుఁడు తన శివికి గురుశివికిఁ దగునట్లు గురువును సమ్మానించెను. ఆరాజు తనయెడఁజూపిన భక్తికి సంతసించి యాతని కవసరమైనప్పుడు డేఁబదివేల రణశూరులను దాను బంపునట్లు గురుగోవిందుఁడు వానికి వాగ్దానము జేసెను. నాహనరాజు దేశములో నున్నపుడు గోవిందుఁడు తాను స్వయముగ శంకు

స్థాపనఁజేసి యొకగ్రామము కట్టించి పౌంతఁుని దానికి పేరుపెట్టె ను. ఇది 1741 వ సంవత్సరమున కార్తికమాసమునఁ జరిగెను. ఈ సమయమ భీమచంద్రుని కుమారుని వివాహముహూర్తము సమీపించెను. భీమచంద్రుఁడు కుమారరాజుతోడను చుట్టములతోడను విశేష పరివారముతోడను వివాహము నిమిత్తము కాశ్మీర రాజధాని యగు శ్రీనగరమునకుఁ దరలిపోయెను. ఆకాలమున శ్రీనగరము నకుఁ బ్రభువు ఫతేషా. ఈయన కుమార్తెయే భీమచంద్రుని కుమారున కీయఁదలంచిన బాలిక. ఫతేషాకు గురుగోవిందునకుఁ బూర్వపరిచయము ముండుటచే గోవిందుఁడు వివాహకాలమునఁ బెండ్లికూఁతున కీయవలసినదని కొన్ని బహుమానములను నందచంద్రునిచేతఁ బంపెను. ఫతేషా యాబహుమానములను నిరాకరించి తిరుగఁగొట్టెను. ఫతేషాచేత భీమచంద్రుఁ డట్లు చేయించియుండును గాని స్వయముగా నతఁడట్లు చేయఁడని యూహించి గురువప్పటికూరుకుండి కార్యగతులు ముందుముం దెట్లగునో కనిపెట్టుచుండెను.

ఈ వివాహమైన తరువాత భీమచంద్రుఁడు బహురాజుల సహాయముఁ బడసి ప్రబలుఁడయ్యెను. శ్రీనగరప్రభువగు ఫతేషాయు గొటోచియాప్రభువగు గురురాజ కృపాళచంద్రుఁడు జస్వోలియా ప్రభువగు కేసరిచంద్రుఁడు రాజా సుబ్బియాలుఁడు రాజాపృథివిచంద్రుఁడు మున్నగు నృపాలురు భీమచంద్రుని పక్షము వహించిరి. మొట్టమొదట గురువునకుఁ గొన్ని చిన్న చిక్కులు కలిగించి భీమచంద్రుఁడు కొత్తమిత్రుల సేనం గూర్చుకొని 1742 వ సంవత్సర వైశాఖమాసమున గురువు మీఁద నెత్తిపోయెను. గురుగోవిందుఁడు వారినెదుర్కొన సన్నద్ధుఁడయ్యెను. యుద్ధమారంభించుటకు సిద్ధముగనుండఁగ నదివఱకుఁ గొంతకాలమునుండి మఠమునఁజేరి హాయిగఁ బంచభక్ష్య పరమాన్నంబుల నారగించుచు గురువునకుఁ

దమ ప్రాణములైన ధారవోయుట్లు ప్రతిజ్ఞలు చేసిన యైదువందల మంది సన్యాసులు శత్రుసైన్యముం జూడఁగానే పిక్కబలమే శరణముగ క్షణములో నదృశ్యులైరి. పిఱికి కండలుగల యీ తిండిపోతులు తన్ను విడిచినంతమాత్రమున గురువు విచారింపలేదు. కాని యాతనికి విచారముఁ గలుగఁజేయు సంగతి యొకటి జరిగెను. అంతకు మున్ను గురువు నాశ్రయించి జీతములు తినుచుండిన పఠాను జాతి తురకలు గురువు కడకుఁబోయి సిగ్గు రవంతయు లేక "మేము కొలువు చాలించుకొనఁ దలఁచితిమి. మాకు రావలసిన జీతములిచ్చి మమ్ము పంపివేయుఁ" డని యతికఠినమైన యాసనముయమున నడిగిరి. ప్రాణము మీఁదికి వచ్చిన యదనునందు మిక్కిలి కృతజ్ఞులై యుండవలసిన మహమ్మదీయులు కృతఘ్నులైనందుకు గురువు మిక్కిలి మనఃక్షోభము నొందెను. ఈతురక లీయనకడ కెట్లీ పరిస్థితిలో వచ్చిరో చూతము. కొండొక కారణమున నీపఠానులు ఔరంగజేబు చక్రవర్తి యాగ్రహమునకుఁ బాత్రులై పుడమిఁ గాలు నిలువ నీడలేక యొక యూరినుండి యొకయూరికిఁ దిరుగుచు నెక్కడఁ దలఁ దాఁచుకొనుటకు నెలవులేక నానాకష్టములం బడుచుండ గురువు వారి దురవస్థంజూచి జాలినొంది చక్రవర్తి విరోధులకు దాను శరణమిచ్చుట యపాయమని యెనవెఱుదియక వారిం దనకొలువులో నిలుపుకొని యాదరించెను. ఆదురాత్ములా యుపకారమెల్ల మఱచి మోసముచేయఁ దలంచినప్పుడు గురుగోవిందుఁడు వారికి వెనుక దానుచేసిన మహోపకారమును దలపించి యట్టిఘాతుక కార్యమును జేయుటకు మనసెట్లులొప్పెనని యడిగి యాసమయమున వారు విశ్వాసవంతులై నిలిచిన పక్షమున మునుపటికంటె నెక్కువజీతములు నెక్కువ బహుమానములు నిచ్చునట్లు వాగ్దానముఁ జేసి నిలిచియున్న పక్షమున వారికే యెక్కువలాభములు కలుగునని యుపదేశముచేసెను. ఆయుపదేశము లన్నిఁటిని

వారు పెడచెవిం బెట్టినందున సీకుగురువు జీతములిచ్చి వేసివారిం బంపెను. ఈ స్థితిలో ననేక రాజసైన్యములు బాసట జేసికొని వచ్చినభీమచందుని యెదుట నిలిచి పోరుటకు గొంతమంచి సైన్యమున్నను గురువు సమర్థుండని చెప్పుటకు వీలులేదు. అయినను గురువు నట్టి సమయములు జంకువాడు కాడుగదా.

పటానులు సైన్యము విడిచి పోవుటవలనం దక్కిన సైనికులుకూడ దుర్నీతిపరులై వారిమార్గముననే యనుసరింతురేమోయను భయమున గురుగోవిందుండు మిగిలినసైనికుల కుత్సాహముం గలుగంజేయందలంచి సమయజ్ఞులై పారిపోయిన పటానులు నమ్మందగని పరమపాతకులనియు వారుపోవుటయే లాభకరమనియు వారు పోకయుండినను మంచి యుద్ధసమయమున నింతకంటె నెక్కువనష్టము కలిగించి పోయెదువారే యనియుం జాలసేపు నొక్కిచెప్పి భగవంతుని మీందనే భారమువేసిన పక్షమున సమస్తము శుభపరిణామమగును. గావునన్నట్లు చేయువలయునని యుపదేశించెను. యుద్ధము మఱునాండుజరుగ వలసియుండెను. అందుచేత ప్రతిసైనికుండు తన కీర్తివంచన లేకుండ గురుపక్షమున నిలిచి పోరవలయునని కృతనిశ్చయుం డయ్యెను. గురువుచేసిన యీయుపన్యాసముతోనే సైనికుల మనస్సులెల్ల వీరావేశము కలిగియుండ నంతలో సయ్యదు బుద్ధూషాయను నొకతురక వారిమనస్సులను మరి పదిరెట్లు వీరరస భూయిష్ఠములుగంజేసెను. పారిపోయిన పటానులు నానావస్థలం బడుచుండం జూచి యీబుద్ధూషాయను నతండు జాలినొంది వారిని గురుగోవిందు కొలువులోం బ్రవేశపెట్టెను. తానుప్రవేశపెట్టిన మనుష్యులు కృతఘ్నులైనందున నతండు మిక్కిలి విచారించి తనబలగముతో గురువుకడకుంబోయి యాయనపక్షము పోరుట కంగీకరించెను. పారిపోయిన పటానులలో నైదుగురు మనసుమార్చుకొని మరల గురుపక్షముంజేరందలంచిరి. కాని సీకులు వారివెన్నంటి తరిమి వధించిరి.

గురువనుకొన్నట్లె మఱునాఁ డుదయమున యమునానదికి, గిరియను నేఱువరకు, నడుమనున్న బయలుమీఁద నుభయసైన్యములు యుద్ధము నిమిత్తము గలుసుకొనెను. ఈయుద్ధ మేఁడుదినములు లెడతెఱపిలేక జరిగెను. రెండుపక్కల సైనికులు మహాశౌర్యముతోఁ బోరాడిరి. భీమచంద్రుని సైన్య మనేకసంఖ్యఁగలది. సైనికులు చక్కనిశిక్షఁగలవారగుటచే నెంతో నేర్పున యుద్ధము చేయఁగలిగిరి. గురుగోవిందుని సేనలోనున్న యోధులు మంచిశిక్షలేనివారై దేవుఁడొక్కఁడేయని యాతని పాదపద్మములనే నమ్మకొని దైవసహాయముఁ దమగా గురువు నుద్భావించి యాతనిమాటలచేత నుత్సాహముఁ గలిగి పోరుచుండిన వారైరి. గురుగోవిందుఁడు స్వయముగ రణరంగమునకు వచ్చి యుద్ధమును వేయికన్నులం గనిపెట్టుచు సైన్యములకు వలయు నుత్తరువులిచ్చుచు స్వయముగ బోరుచు యోధులం బురికొల్పుచు శతావధానము చేసినట్లు విహరించెను. గురువుజూపిన మహాశౌర్యము ధైర్యము సైనికుల మనంబులమీఁదఁ బనిచేసెను. కాని వ్యర్థముగఁ బోలేదు. హిందూరు ప్రభువగు హరిచంద్రుఁడు గురువింటాఁకి యాముంగుజ్జమున నొప్పగాయము తగులునట్లుగొట్టి గురువుమీఁది కురికెను. కాని సంకల్పించిన పని నెరవేరకమునుపే గురువు వింటినుండి వెడలిన యొకతీవ్రబాణముచేత నిహతుఁడై హరిచందుఁడు నేలంగూలెను. తమనాయకులలో నొక్కఁడు నేలపాలగుటఁజూచి శత్రుసైనికులు భయభ్రాంతులై మృతినొందినవారిని గాయములు తగిలినవారిని వెనుకవిడిచి ముందుదృష్టియే కాని వెనుకదృష్టిలేక పారిపోయిరి. శత్రుసేనలో నున్న తక్కిన నాయకులు సహజభీరులయ్యుఁ జేయునదిలేక పలాయనమునే శరణము జేసికొనిరి. తక్కువసేనతో గెలిచిన యీగెలుపు గురువును బరమానందభరితునిఁ జేయుటయే గాక యాతని కెంతో పేరు తెచ్చి యాతనిపక్షముఁ బ్రబలమగునట్లు జేసెను. ఈవిజయము భగవదను

గ్రహమువలన గలిగెనని గురుగోవిందుఁడు తనగ్రామమగు పౌంతకుం బోయి,యీశ్వరప్రార్థనలఁజేసి తనకు నమ్మినబంటై తనపక్షముంబోరి రణమున నొక్కమాయనిం గోల్పోయిన సయ్యదు బుద్ధూషాను మిగుల గౌరవించి వానికొకపట్టా వ్రాసియిచ్చి తనతలపాగలో నగ ముచించి వానికి బహుమానముగ నిచ్చెను. అతఁడుచేసిన యుపకార మును గురు వాతనికిఁజేసిన సన్మానమును మనసులోనుంచుకొని సిక్కు లు నేఁడున్నైతము బుద్ధూషా కుటుంబమును మిక్కిలి గౌరవముతోఁ జూచుచున్నారు.

అనంతరము గురుగోవిందుఁడు పౌంతగ్రామమునుండి యానం దపురమునకుఁబోయి తనవియ్యముసాగించి వైభవముతో మరలఁ దం డ్రిపీఠము నధిష్ఠించెను. అధిష్ఠించి యూరకుండక పురజనేవేళ కేయు పద్రవము మూఁడినను నష్టము చిక్కువడకుండ ముందుకాపుదల నిమిత్త మానందపురమునకు రక్షకసేనను బలపఱచెను. ఆపట్టణముచుట్టు నా లుగుకోటలు కట్టెను. అందు మొదటిదానిపేరు ఘురు. రెండవది పతే ఘురు. మూఁడవది లోహఘురు. నాలవది బోఘురు. ఈనాలుగు కో టలలో సతేఁ జాయుధములను నిలువచేసెను.

ద్వితీయప్రయత్నము.

ఈకొండరాజులతో యుద్ధమైన కొన్నిమాసములకే గురువు తనకత్తి నొరలోనుండి తీయవలసివచ్చెను. ఈసారి యాతఁడు కత్తిగ ట్టుట కొండరాజులను శిక్షించుటకుఁగాక వారిని రక్షించుట కయ్యె ను. సర్ హిందూపరగణాసుబేదారు భీమచంద్రుఁడు మొదలగు మన్నె దొరలు సర్కారుఖజానాకు బంపవలసిన కప్పముసరిగాఁ బంపలేదను వంకఁబెట్టి వారిమీఁదఁ గుపితుఁడై వారిని దండించుటకొరక గొప్పసై

సైన్యముం బంపెను. కప్పము సరిగాఁ గట్టలేదనుట కొంతవఱకు నిజమే. నిజమైనను కొండరాజులు బాకీయున్న కప్పమును బంపక ప్రాణములుపోయినను సరే చిట్టచివఱకు శత్రుసైన్యము నెదిరింపవలయునే కాని కప్పము చెల్లింపకూడదని కృతనిశ్చయులైరి. అందుచేత సర్హిందు సుబేదారు సైన్యముం దీసికొని వారిమీఁదికెత్తిపోయెను. శత్రుసైన్యము సమీపింపగానే కొండరాజుల ధైర్యము డీలుపడ భయకంపితులై గురువు నాశ్రయింపఁదలఁచి వెనుకటి మనస్పర్ధలు మఱవవలసినదనియుఁ దమకెల్ల సామాన్యశత్రుఁడగు మహమ్మదీయుని బారదోలుటకు సాయపడవలసినదనియుఁ బ్రార్థనపూర్వకముగ నాయనకు వ్రాయబంపిరి. గురుగోవిందుఁడు దేశోపకారము నిమిత్తము తన పరాభవములన్నియు మఱచెడు స్వభావముగలవాఁడగుటచే కొండరాజుల సందేశమును గౌరవముగ నాలకించి తన సేనానాయకులగు మోహరీచందు దయారాములకు నైదువందల సైనికుల నప్పగించి యారాజులకుం దోడ్పడఁబంపెను. కొండరాజుల యదృష్టము పండుటచే గురుసహాయమున మహమ్మదీయసైన్యము పరాజయమొందెను. కాని యింతమాత్రపరాజయముతో మహమ్మదీయసేన యడఁగి యూరకుండునది కాదు.

ఈయుద్ధమైన స్వల్పకాలమునకే యనఁగా శాలివాహనశకము 1745 సంవత్సరమున లాహోరు సుబేదారు కొండరాజులను దండించుటకొక సైన్యమును గురుగోవిందునకు బుద్ధిచెప్పఁదలఁచి మఱియొక సైన్యమును బంపెను. దైవనిర్ణయమున నీసారికూడఁ బరాజయము తప్పకలదే యయ్యెను. అది వర్షాకాలమగుటచే మ్లేచ్ఛసేన పొంగియుండిన నదులం దాటలేక సరిగా బయనములు సలుపలేక చెడిపోయెను. మహమ్మదీయ సేనానాయకుఁడగు రుస్తుంఖాను పరాభవముచే నిరుత్సాహించిన రోషమున వర్షాకాలము గడచినతోడనే మరల

సేనఁగూర్చుకొని పర్వతరాజులపైఁ బడెను. గురువు భాయిసంగీతుఁ డను నొకశిష్యునకు మూఁడువందలసిక్కుల నప్పగించి వారికి సాయ మంపెను. పాపము పిహవశమున జయలక్ష్మి యీసారికూడ హిందువుల పక్షముననే యుండెను.

మహమ్మదీయసైనికులు నొకదానివెంట నొకటిగ జరుగుచున్న గొప్పపరాభవములు వాటిల్లుటను చక్రవర్తియైన నౌరంగజేబు మండిపడి కొండరాజులకు నాయకుఁడగు గురుగోవిందునకు గట్టిగాబుద్ధిఁ జెప్పవలయునని సంకల్పించి గొప్పసైన్యమిచ్చి తనకుమారుఁడగు మువజ్జముఁడను వారిమీఁదికిఁ బంపెను. ఈ రాజకుమారుఁడు కొండలలోనికి దాను స్వయముగ నెళ్ళవలసిన యావశ్యకత లేదనుకొని తనసేనానాయకుఁడగు మీర్జాబేగును బుత్తెంచెను. అతఁడు లెక్కకు మీఱిన సైనికులను, సామానులు మోయుజంతువులను దీసికొని కొండలలోనికి జొరబడి నాశనముఁ జేయ నారంభించెను. కొండరాజులు దుర్బలసైన్యములతో వాని నెదుర్కొనిరి. కాని వారి ప్రయత్నములు నిష్ఫలములగుటచే నేమియుం జేయలేక శత్రువుఁడు తనమనసార దోఁచుకొని నాశనముఁ జేయుటకుఁ దమపట్టణములు పల్లెలు విడిచి పాఱిపోయిరి. గురుగోవిందుఁడు సయితము తనయానందపురమును శత్రువుల కప్పగించి దూరపుటడవులకుం బారిపోయెను మీర్జాబేగుయొక్క సైన్యము దుర్జయమగుట దానియెదుట గొండరాజులయొక్కయుఁ దనయొక్కయు సైన్యము నిలువఁజాలదని గ్రహించి యత్యాపత్సమయమున శత్రువుచే నిర్మూలింపఁబడుటకంటెఁ గొంతకాల మెందేని యొదిగి యుండి యదను వచ్చినప్పుడు విక్రమించుట మంచిదని గోవిందుఁ డాలోచనఁ జేసెను.

గురుగోవిందుఁడట్లు లానందపురము విడచి శత్రుభీతిచే వనాంతరంబుల నివసించు కాలమున నొక చిత్రకథ జరిగెను. అది మనము

నమ్మదగినది కాకపోయినను గురునిచారిత్రకారులందఱుం దచ్చరిత్రములందు వ్రాసిరి. కావున మనముగూడ దాని నిట తెలిసికొనుట యవశ్యమని యావృత్తాంతము వ్రాయ దొరకొన్నారము. గురునొకనాఁడు పురాణములయందు నితిహాసములయందు మహాప్రాజ్ఞుఁడైన యొక బ్రాహ్మణునితోఁ బ్రసంగించుచు సందర్భవశమున "నయ్యా! అర్జునునకంతబలమెట్లు కలిగె"ననియడిగెను. ఆప్రశ్నకు బ్రాహ్మణుఁడిట్లని యుత్తరమిచ్చెను. "మీవంశకర్తయైన యర్జునుఁడు దేవీ ప్రసాదములు వడసి మహాతేజశ్శాలి యయ్యెను. శత్రువర్గమును నిశ్శేషముగ నిర్మూలించుటకుఁ బాయనివలెనే దేవతాప్రసాదమును బడయవలయు. ఇందుకు మీరొకయజ్ఞముఁ జేయవలయును. అప్పుడు పఠింపఁ బడునట్టియాగమ మంత్రముల ప్రభావమున హోమకుండములో నగ్నిమధ్యమునుండి యొకమహాదేవి ప్రత్యక్షమై మీకు వరంబులిచ్చును. దానంజేసి సీకులు దుర్నిరీక్ష్య ప్రతాపులై శత్రువులం బారదోలుదురు." ఈయుపదేశము గురువునకు నచ్చుటయు నతఁడు సత్వరమే యా యాగము జేయింపుమని యడిగెను. కాని యాగమంత్రకోవిదులగు బ్రాహ్మణోత్తములు చాలమంది కావలయును. అట్టివారు కాశ్మీరమునందు లేరు. యాగము నిర్విఘ్నముగఁ బ్రశాంతముగఁ దుదముట్టింపఁ దలఁచిన పక్షమునఁ బ్రయోగపద్ధతుల యందుఁ గుశలురగు బ్రాహ్మణోత్తములు కావలసి యుందు రనియు నట్టివారు కాశీకానగరమందే కాని తదితర స్థలముల లభింపరనియుఁ బరమపావనమగు నాదివ్యక్షేత్రమున కెవ్వరినేని దగు బ్రాహ్మణులఁ బంపి వారిని రప్పింపవలయుననియు, గురుని సన్నిధినున్న బ్రాహ్మణులు పలికిరి. అప్పలుకులువిని గురుగోవిందుఁడు మంచి బ్రాహ్మణు నొక్కని వారణాసికిం బంప, నతఁడు వెదకివెదకి శ్రోత్రియులగు భూసురులను దోడ్కొని గురుని సన్నిధికిం బోయెను.

కాశీదాసు, కేశవదాసు, విశ్వంభరదాసు, ననుమువ్వురు బ్రాహ్మణులు గురునిసముఖమునకుఁబోయి యాగము చేయింపఁగలమని పలికిరి. యాగభారమంతయు వారిపై వైచి గురువు తగుప్రయత్నముఁ జేయించి యజ్ఞదీక్షితుఁడయ్యెను. యాగము జరిగెను. హోమకుండమందలి మంటలలోనుండి యొక ఖడ్గము పైకెగిరి పడెనట. దానిఁ జూచి గురువు దాని భావమేమని బ్రాహ్మణుల నడిగెనఁట. అందుకు బ్రాహ్మణులిట్లనిరఁట. "ఇది మంచిశకునము. మీరు తొందరపడవద్దు దేవిగూడ మీకు ప్రత్యక్షము కావలయునన్న మీరు నిశ్శంకముగా మీ శిరస్సుఁగోసి హోమము చేయవలయును" అనవుడు గురుగోవిందుఁడు "నేను చేయవలసినపని విస్తారముగ నున్నది. నేను శిరస్సుఁగోసి యియ్యఁజాలనని యుత్తరమిచ్చెనఁట. అందుకు బ్రాహ్మణులు మీకుమారులలో నొక్కని శిరస్సిచ్చినఁ జాలునని బదులుచెప్పిరఁట. అంతట గురువు తనకుమారులఁ బిలువనంప గోవిందునితల్లి ప్రపంచమంతయుఁ దలక్రిందైనను నేను తన సుతులలో నొక్కని నైననిచ్చుటలేదని నిర్భయముగఁ బ్రత్యుత్తరమిచ్చెను. ఆహాహా! ఆశ యెంత పనిఁ జేయించును. గురుగోవిందుని యంతవాఁడు కూడ దేవిసాక్షాత్కారమును శత్రునాశనమునని బ్రాహ్మణులనాశపెట్టినమాత్రమున వారి వలలోఁబడి కుమారునిం జంపఁజూచెఁగదా? ఈమాట నిజమేయైనపక్షమున నీయనకంటె నాఁడుదియైన నీయనతల్లియే యెక్కువ వివేకముతోఁ బనిచేసెనని చెప్పవచ్చును. అప్పుడు చేయునదేమియు లేక గోవిందుఁడు యాగవిధాయకులగు బ్రాహ్మణులం జూచి "వీరే నాప్రియశిష్యులగు సిక్కులిరువది నలుగురు తమశిరస్సుల నర్పింప సిద్ధముగనున్నారు. ఇందెవ్వనితలయైనఁ బనికివచ్చునా" యని పలికెను. బ్రాహ్మణులు దీనికొక విధముగ నిష్టపడిరి. అంతట నొక సిక్కునిశిరస్సు కొబ్బరి పుచ్చెవలె నఱకఁబడెను. హోమము యథావిధిగ జరిగెను.

ఈకథనే కొందఱు చరిత్రకారు లీలాగునఁ జెప్పుచున్నారు. గురుగోవిందుఁడు దేవిబలినిమిత్తము తనకొడుకులలో నొకని నంపుమని తన తల్లికి వర్తమాన మంపెనఁట. "ఆమె నాకొడుకు నిచ్చువాఁడు. వానినిచ్చుచేతలఁ గొడుకు నామనుమలఁ జంపఁగోరుదునా" యని తన నలువురిమనుమలను దీసికొనిపోయి మొఘల్ వాలుకోటలో దాఁగుకొనియెనఁట. అదివిని గోవిందుఁడు శిష్యులలో నొక్కనిఁ బంపనిపక్షమున మునమ్మ యెదుట చిన్నబిడ్డల నలువురను జంపివేయుమని వర్తమాన మంపెను. ఆయవ్వ యప్పటికిని బిడ్డల నప్పగింపనందున గురుగోవిందుఁడు చేయునదిలేక తన యనుచరులం బురికొల్పెను. ఎంత పురికొల్పినను మరణమున కొప్పుకొనువాఁడు సాధారణముగ నుండఁడు కావున కొంతకాలమువఱకెవ్వరును సాహసించిరాలేదు. అప్పుడు గురువు కోపించి యనేకులను దిట్టెను. పిమ్మట నిరువదినలువురు సిక్కులు సిద్ధమైరి. అందొక్కని శిరస్సు దేవికర్పింపఁబడెను. అట్లు యాగము ముగించి గురువు బ్రాహ్మణులకు భూరిదక్షిణలిచ్చి పంపెను. ఈకథనమ్మువారు గురుగోవిందుఁడు సంపూర్ణముగఁ గాకపోయినను గొంతవఱకైనఁ దనమనోరథసిద్ధిని బొందెనని యూహింపవచ్చును. ఈయాగమునుగూర్చి యింకను మఱికొన్ని కథలుగలవు. అందొకటి యిక్రింద జెప్పఁబడును. ఈయాగము బహుదినములు జరిగినపిదపఁగూడ దేవిప్రత్యక్షము కానందున గురుగోవిందుఁడు బ్రాహ్మణులం బిలిచి "యేల దేవి కానఁబడలే" దని యడిగెను. పరమపవిత్రుఁడగు మనుష్యుఁడొకఁడు తనశిరస్సు బలియిచ్చినఁగాని దేవి సాక్షాత్కరింపదని బ్రాహ్మణు లుత్తరమిచ్చిరి. అదివిని గురుండిట్లు బదులుచెప్పెను. "అట్లయిన మీలోనొకరు శిరస్సు బలియుండు. మీకన్నఁ బరమపవిత్రులగు మనుష్యు లెవరున్నారు!" ఈపలుకులు బ్రాహ్మణులకుఁ గర్ణకఠోరముగ నున్నందున వారందు కియ్యకొనక

క్రమక్రమముగా నొక్కరొక్కరుగ జారిరి. అందుచేత యజ్ఞము సమాప్తమొందలేదట.

దేవి గురుగోవిందునకు స్వప్నమున సాక్షాత్కరించి కొంతబలము ప్రసాదించె నని మూడవకథ. బ్రాహ్మణులు తిరిగి రానందున గురుగోవిందుఁడు కోపించి యజ్ఞమునిమిత్తము తెప్పించిన సంబారములన్నియు హోమకుండమునఁ బడవైచెననియు నందువలన జగద్భయంకరముగ బెనుమంటలు బయలుఁదేరె ననియు బరిసరగ్రామవాసు లాజ్వాలలు చూచి దేవి జాజ్వలమానరూపము ధరించి గురువునకు బ్రత్యక్షమైనట్లు తలంచి రనియు నాల్గవకథ. గురుగోవిందుఁడు భగవంతుఁ డొక్కఁడేయనియు నతఁడే సృష్టిస్థితిలయ కారణభూతుఁడనియు దృఢవిశ్వాసము గలిగినయాస్తికుఁడయ్యుఁ గొన్ని కామ్యములనొసంగునట్టిక్షుద్రదేవత లున్నవనియు మంత్రాంతర సాధనాంతరములచే వాని నారాధించినపక్షమున నవి యభీష్టముల దీర్పగలవనియు నతఁడు నమ్మెను. భగవంతుఁ డొక్కఁడే యనియు నతని కంటె నితరదైవతములు లేవనియు విశ్వసించునట్టి మహానుభావులకు గూడ నిట్టిపిచ్చినమ్మకములు గలవని ప్రపంచచరిత్రలు చదివినవారి కందఱకుఁ దెలియును. ఏకేశ్వరారాధనతత్పరుఁడైన యేసుక్రీస్తుదయ్యము లున్నవని నమ్మెను. మహమ్మదువారికిగూడ నిట్టినమ్మకము గలదు. భగవంతుఁడే లేఁడని బోధించి బుద్ధదేవుఁడుసయితము మారుఁడు, ప్రజావతి; మహేంద్రుఁడు మొదలగుదేవతలున్నారనినమ్మి శిష్యులకు బోధించెను. మనదేశమందున్న మహమ్మదీయ క్రైస్తవులలో గొందఱు తాము వర్ణభేదము లేనిమతములలోఁ జేరినవారయ్యు స్వమతములకు విరుద్ధముగ వర్ణభేదము పాటించుచు గ్రామదేవత మొదలగువాని నారాధించుచుండ మనమెఱిగినవిషయమె. ఆపద వచ్చినప్పుడు తన్నివారణార్థమొ భయముచేతనొ మహాస్త్రీకులు

గూడ క్షుద్రదేవతారాధనతత్పరులగుదురు. ప్రథమగురువైననానకు కట్టినమ్మికలు లేవు. గురుగోవిందున కెందుచేతనో యిట్టినమ్మికల కలిగెను. గురుగోవిందున కిట్టివానియందు విశ్వాసములేదు. కా యతనికి మహమ్మదీయులతో వైరము సంభవించుటచేతను శత్రు విజయమునిమిత్తము సేనలు కావలసివచ్చుటచేత హిందువులు సై కులుగ జేరవలసివచ్చుటచేతను హిందువులను సంతోషపెట్టి వారి విశేషముగ సైన్యములో జేర్చుకొని వారిసాయమున బగతుర సాధి పవలె నని గురుగోవిందుడు క్షుద్రదేవతారాధన మారంభించెనని కొందఱు చెప్పుచున్నారు. రాజనీతికోవిదులు కాలానుసారముగ లేని నమ్మికలు తెచ్చిపెట్టుకొని పనిచేయవలసియుండును. కావున నాకాల మున మతవ్యాప్తికి నాత్మసంరక్షణమునకు రాజనీతియు శస్త్రప్రయో గము గావలసివచ్చినందున గురుగోవిందుడు యజ్ఞము చేసియుండ వచ్చును. నానకు కాలమున మత మింతప్రబలము కాలేదు. కావున శత్రువులు లేకపోయిరి. శత్రువులు లేనప్పుడు కత్తిదూయుట రాజనీతి ప్రయోగించుట యనవసరములు గదా. పదియవగురునినాటికి సిక్కుమ తము ప్రబలమై యనేకులకు కన్నెఱ్ఱ గావించెను. అందుచేత గురుగో విందునకు కొన్నిక్రొత్తపుంతలు త్రొక్కవలసివచ్చెను.

బలి.

యజ్ఞమువలన గురుగోవిందున కేమియులాభము గలుగలేదు. యజ్ఞానంతరమునం గొన్నివందలమంది యతనిచుట్టుం జేరిరి. గాని పోరాడవలసినపగతురు వేనవే లున్నప్పుడు కొన్నివందలమంది యేమి చేయగలరు. పని చేసినను చేయకపోయినను వారి వేషభాషలు వారి

యూచారవ్యవహారములు గురువునకు వారియందు బ్రీతి గలి గింపలేదు. గురుగోవిందునకు దేవి సాక్షాత్కరించి వరము లిచ్చెననునమ్మికతో వారు తన సైన్యమున జేరిరి. కావున వారు మూఢ విశ్వాసము లుగల మూర్ఖులు. విశేషించి విగ్రహా రాధకులు. గురుగోవిందుడు దేకేశ్వరా రాధనపరుడు. మూఢవిశ్వాస ములు లేనివాడు. విశ్వాసముల కేమిగాని క్రొత్తగా జేరినవీరు మహా బలసంపన్నులైనవీరులే మో చూతము మన్న విక్రమము గూడ వారికడ నెఱసున్నయయ్యెను. కొండలలోని వసించునట్టి వా రియొక్క దేహస్థితి సంపూర్ణారోగ్యము గలది కాకపోయెను. వారు తినునట్టియాహారము బలవృద్ధిచేయునది కాదు. క్రీడలుగాని వ్యాయా మములుగాని వారెఱుగరు. వారు శూరులవంశములనుండి వచ్చినవా రు కాకపోవుటచే మంచిసాంప్రదాయములు లేవు. ఎట్లయిననేమి అతనిని సేవింపవచ్చినజాతులు మతవిషయమునను దేహబలవిషయమునగూడ బనికిరానివారైరి. అందుచేతనాతడు సంస్థాపించిన యేకేశ్వరమతము నందు విశ్వాసము గలిగినట్టియు ధనయాశతప్ప నితరులయాశకు లో బడనట్టియు గట్టిచేతయు లావునుగలిగి నిండుమగంటిమి గలిగి రణరంగ మున వెనుకంజ యిడక పోరాడునట్టియు మహావీరులను జేర్పవలెనని యతడు సంకల్పించెను. ఇట్టివీరులు వర్ణభేదముచేతను జాతిభేదము చేతను కులభేదముచేతను మతభేదముచేతను చిక్కులిచెడిపోయి యున్న హిందూమతమునుండి దొరకుట దుర్లభమని గురువు తలంచెను. జాతి మతభేదములుగలవారు చేరునప్పుడు మహావినయము గలిగియు లేని పోనిపట్టింపులు పట్టుకొని మనస్సుల వైరములు పెంచుకొని సమయ మువచ్చినప్పుడు కార్యభంగము చేయుదురని గురువునకు దోచెను. కావున వర్ణభేదములు లేకుండ తనయొద్ద జేరినతరువాత నొక్కటే వర్ణముగ నుండదలచిన వారినే యతడు జేర్చుకోదలంచెను. ఒక్క

వర్ణమువారినే జేర్చుకొన్నపక్షమున వర్ణభేదము పోవ దని యతఁ డెంచుఁగును. అందుచేత నీవర్ణమావర్ణ మనక సకల వర్ణములలోని హిందువులను జేర్చుకొని యతఁ డొక్కవర్ణము చేయఁ దలఁచెను. అతఁడు గుణమే ప్రధానము చేసికొనెను మంత్రాంగము దేవతాంతర సాధనాంతరములు లేక దేవుఁ డొక్కఁడే యని నమ్మినవాఁడు. దృఢమైన బాహువులుగలవాఁడు. గురువునెడలవిశ్వాసముగలవాఁడు. శౌర్యముగల వాఁడుమాత్రమే దానికర్హుఁడు. అతఁడే జాతివాఁడైననుక్షత్రియుఁడగును అగనిశిష్యుఁడైనతరువాత బ్రాహ్మణుఁడే క్షత్రియుఁడగును. శూద్రుఁడే క్షత్రియుఁ డగును. ఈవిధముగ సమత్వబుద్ధి చేయఁ దలఁచి 1751వ సం॥రము వైశాఖమాసమున నతఁడు దేశమందున్న సిక్కులనందఱ రావించి యొకమహాసభ చేసెను. గురుని యాజ్ఞప్రకారము నానాభాగముల నుండి సిక్కులనేకులు వచ్చిరి. ఆ సభ యొకగొప్పబయలుమీఁద జరిగెను. ఆబయలుమీఁద నొకగుడ్డలగుడారము వేయఁబడెను. గుడారముయొక్క ద్వారములకు దట్టమునైన తెర లమరఁగా గట్టబడెను. లోపల నేమిజరుగుచున్నదో పైకి దెలియకుండ యాపనిచేయవలెనని యతఁడు చేసెను. సభాప్రారంభసమయమున గురు గోవిందుఁడు దారుణఖడ్గపాణియై యతిభయంకరరూపముదాల్చి గుడారమువెడలి వచ్చెను. వచ్చి విస్మితులై దన్ను జూచుచున్న సభాసదులఁజూచి యిట్లనియె. "అమృతస్వరూపుఁడగుపరమేశ్వరుఁడు హిందూధర్మముయొక్కయు హిందూజాతియొక్కయు నిరంతరాభివృద్ధినిమిత్తము క్షేమము నిమిత్తము నాభక్తులైనసిక్కులలో నొకనిశిరస్సు బలి యొసంగవలసినదని యాజ్ఞాపించియున్నాఁడు. అది ముందురాఁగల దేశాభిమానులను బురికొల్పునట్టి, దేశక్షేమకరులహృదయములందు ధైర్యోత్సాహములు కలిగించియు వాడిపోయినశౌర్యాగ్ని వెండియుగవులుకొన జేయవలయు ఈ మహాకార్యముకొఱకు జంకుగొంకు లేక ముందువెనుకలు విచారిం

పక సవశిరస్సునర్పింపఁ గలవారు డెవఁడైన నీసభలో నున్నాఁ డా!" పిట్టపిడుగులవంటి యిప్పలుకులు వినఁబడినతోడనే మొట్టమొదట సభ యెల్ల నిశ్శబ్దమయ్యెను. కొంతకాలమునకు "మహాత్మా' నేనున్నాను." అని యొకమూలనుండి యొకధ్వని వినఁబడెను. లాహోరునుండి వచ్చినయొకసిక్కుక్షత్రియుఁడు సభనుండిలేచి చేతులు జోడించి గురుని సన్నిధికిఁ బోయి "దేవా నాయాత్మయు నాశరీరము నీయధీనము జేసితిని. ఇవినీ యిచ్ఛవచ్చినరీతిగను జేసికొనుము" అని చెక్కుచెదరక నిలువంబడెను. గురుగారతనిచేయి బట్టుకొని విసవిస గుడారములోని కీడ్చుకొనిపోయెను. కొంతసేపటికి ఘుమ్మనుచప్పుడనే కత్తిదెబ్బ సభాసదులకు వినఁబడెను. గుడారముననుండి యెఱ్ఱని రక్తము స్రవించెను. సభలో హాహాకారము చెలఁగెను. దయాసింగుజన్మము కృతార్థమైన దని యక్కడివా రందఱుఁ దలఁచిరి. అంతట గురుగారు రక్తసిక్తమైనఖడ్గముతో మేనెల్ల చిందిననెత్తురుబొట్టులతో గుడారము వెడలివచ్చి "దయాసింగు ధన్యుఁ డయ్యెను. మఱియొకఁడు కావలయును. ఈసభలో నిప్పటికి వచ్చువాఁడు మఱియొకఁడుకలఁడా" యని యడిగెను. హస్తినాపురవాసి యైన ధర్మసింగు లేచి గురుని యాజ్ఞకు బద్ధుఁడయ్యెను. అతఁడుకూడ గుడారమునకు దీసికొని పోఁబడెను. మొదటివానికట్లె జరుగవలసినపని వీనికిం జరిగెను. కాని బలి సమాప్తము కాలేదు. మఱిమూఁడు తలలు కావలసియుండెను. మఱియొకఁడు కావలెను. మఱియొకఁడు కావలెనని గురుగారు పలుకఁగా నిర్భయముగ నొక్కొక్కఁడు వచ్చెను. కుమ్మరి హిమ్మత్సింగు చాకలిమొహకంసింగు మంగలిసాహిబుసింగు గురుని యాపతికి విధేయులై గుడారములోనికిఁ బోయిరి. ఆ యేవురిగతిఁ దలంచినప్పు డాసభాసదుల మనస్సు లేరీతిగనుండెనో యెవరువర్ణింపగలరు. పలువురు పలువిధంబులుఁ దలఁచిరి. మనమే కార్యము గావించినను భళీ యనువారు కొందఱు సీయనువారు కొందరు నుండకపోరు. గురు

ప్పుడెవ్వ రొండెఱుకొవలె నని పిలిచినపక్షమున నిశ్శంకముగ బోయి కృతకృత్యులుఁ గాదలచినవారు మఱికొంద ఱుండిరి. దేవబలినిమిత్తము తమప్రాణముల దృణప్రాయముగ నర్పించిన యమ్మహావీరులకళేబరములు చూడవలయునని సభాసదులు కోరిరి. అట్టికోరిక నిరాకరించుట ధర్మముగా దని గురువు గుడారపుందెరల నెత్తించెను. అప్పుడు సభాస్థానులయాశ్చర్య మేమనవచ్చును. పరలోకమున ప్రాతకాపులై యున్నవారనుకొన్నయయ్యేవురువీరులు చెక్కుచెదరక యుక్కు కంభములవలె యీసభాస్థానులయెట్టయెదుట నిలువంబడిరి. మిక్కిలి యక్కజంపడుచున్న యమ్మహాజనులతో గోవిందుఁ డిట్లనియెను. ఇటువంటి మహాత్ములకు బరమపద మెవ్వాటును సులభమే కాని వీరికీలోకముననే ప్రస్తుత మెక్కుడుపని గలదు. మహాయశస్కులై వీరు తమ సృష్టికర్తకడకు బోవకమున్నిక్కడ నున్నపని సంపూర్తిగ జేయువలయును. అందుచేత వీరిని సంహరింపలేదు. వారిం దెగవేయకపోయిన యెడల నంతక్రోన్నత్తు రెచటనుండివచ్చె, నని సభ్యులకు గలిగెడునను మానము దొలఁగింపఁ దనఖడ్గమున కెరయై తెగిపడినయైదు మేఁకలఁ దెప్పించి వారికి చూపి యనుమానము నడంచెను. మనసీకుమతస్థులలో నెవ్వరెవ్వరికడ నెంతెంతసామర్థ్య మున్నదో బహిరంగమున సభామధ్యమున నరయుటకై నే నీసభ గావించితిని. కొందఱ సామర్థ్యము గనుఁగొంటిని. మనమతమును తగిన మహోన్నతస్థితిలోనికిఁ దీసికొనిపోవుటకును నీనాటి యద్భుతచర్య చిరస్థాయిగ నుండునట్లు చేయుటకును మనము గొప్పసన్నాహము చేయవలయు* నని గురువు విరమించెను. అనంతరము గురువు సభ చాలించి తన నివాసమున కరిగెను. సభాసదు లందఱు నతనివెంట కొప్పురునకు జనిరి.

సన్నాహము.

కాష్ఠాగానరకు జనసమూహము గురు వాక్యప్రకారము చేసెను. అతఁడు మహాయోధవేషము దాల్చి యాయుధపాణియై యున్న తాసనమున నిజపరివారపరివేష్టితుఁడై కూర్చుండెను. మృత్యుముఖమునుండి తప్పించుకొనిన యేవురుసిక్కులు గురునివేశంబున యోధవేషములతో నాతనికట్టుకొనుట కనంబడిరి. అట్లు కూర్చుండి యతఁడు కంఠ మెత్తి గంభీరస్వరముతో సమ్మహాసభయొక్క ముఖ్యోద్దేశము లను స్పష్టముగ జెప్పెను. సిక్కుమతముయొక్క సంరక్షణనిమిత్తమును సిక్కుమతము హిందూమతములో నొకభాగమే గనుక హిందూమత సంరక్షణము నిమిత్తమును, నాటనుండి సిక్కులు తమకు సంభవించు నట్టి మనస్సంకటములను దేహపీడలను నిశ్చయముగ ననుభవింపవలసి నదనియు నెనుకటి తొమ్మండ్రు గురుపుంగవులు చేసిన బోధామృతము యొక్క సారమె తా నుపదేశించుటం జేసి పదియవగురువైన తనయాజ్ఞను సిక్కులెవ్వరు నుల్లంఘింపఁ గూడదనియు నట్లుచేయువా రెందఱుందురో కనుఁగొనుటకె యమ్మహాసభ కూర్పఁబడినదనియు నితఁడు చెప్పెను. ఈకార్యము కొనసాగుటకును సన్నాహము సాంగముగ నెఱవేరుటకును పవిత్రమైనయొకానొకకర్మవలన వారందఱు పునీతులు గావలయు ననియు వారు పునీతులైనపిదప మహాయోధు లగుదురనియు నతఁడు సెలవిచ్చెను. అట్లు చెప్పి యాపవిత్రకర్మమేదో వెంటనే తెలియఁజేయఁదలఁచి యినుపపాత్రయొకటి తెప్పించి బెల్లము తెల్లపంచదార మెత్తపంచదార పటికిబెల్లము తేనెగూడ తెప్పించి యాయినుపపాత్రములో మంత్రపూతమైన జలము పోయించి యందీమధురపదార్థము లైదును బడవైచి గుడశర్కరలు కరగి పానకమగుదాఁక నూరకుండి యాదిమగురు వైననానకు రచియించిన గ్రం

థమునుండి కొంతభాగము చదివి తనఖడ్గ మాపానకమున ముంచి యాపానకమున కమృత మనిపెట్టి నాలుగుచుక్కలు తననాల్కమీదను మఱికొన్నిచుక్కలు కన్నుగవమీఁదను తలమీఁదను వైచి కొని యాయేవురుసిక్కులను డగ్గఱు మని చెప్పి యొక్కొక్కఁడు పుడిసెడమృతము ద్రాగవలసిన దని యానతిచ్చెను. అట్లు వారు త్రాగిన పిదప వారిచేత గురుజీకిఫతే యనుమాట లనిపించెను. గురువునకు జయముగలుగుగాక యని యామాటల యర్థము. ఈకర్మపేరు పహూలు. ఈసన్నాహము పేరు ఖాల్సా. ఖాల్సాయనఁగా క్రొత్త మతము. అనగా గురుగోవిందుఁడు నూతనముగ నేర్పఱచినమతదీక్ష. అటుమీఁద సిక్కులకందఱకుఁ దమతమనామధేయములతుదను సింగు అనుశబ్దముండవలయు నని యతఁడు శాసించెను. ఈశాసనముబట్టి మున్నుగురుగోవిందరాయ లనుతనపేరు గురుగోవిందసింగనిమార్చెను ఈఖాల్సాయొక్క సిద్ధాంతము లివి.

1 ఖాల్సామతములోఁ జేర్చుకొనునప్పుడు చేయవలసినకర్మ నాఁడు గురుగోవిందుఁడు దయాసింగు మొదలైన యేవురను జేర్చుకొనునప్పుడు చేసినకర్మమే. అనఁగా క్రొత్తగా నెవ్వరైన నీమతమున జేరునప్పు డాకర్మజేసి చేరవలెను.

2 ఈవిధముగ జేరినప్రతివాఁడు సింగనుపేరు ధరింపవలెను.

3 అయిదుగురుసింగు లెచ్చటనుందురో యచ్చట ఖాల్సామతము సంపూర్ణముగ నున్నట్లు భావించవలెను. ఆసింగు లేవురు నేవర్ణములవారైన నై యుండవచ్చును.

4 ప్రతిసింగు జుట్టు పొడుగుగా పెంచుకొనవలెను. ఎల్లప్పుడాయుధ మేదోయొకటి ధరించియుండవలెను. పొట్టిలాగులు తొడుగుకొనవలెను. ఒకయినుపకడియము దువ్వెనయు సర్వదా తనదగ్గర నుంచుకొనవలెను.

5 ఖాల్సామతస్థులలో వర్ణభేద ముండఁగూడదు. అందఱేక వర్ణమువారై యుండవలెను. ఒకరికన్న నొక రెక్కువతక్కువ యనుభేదము లుండక నందఱు సమానస్థితిలో నుండవలెను.

6 ఖాల్సామతస్థుఁడు ప్రతివాఁడు వృత్తినాశకుఁడు కులనాశకుఁడు ధర్మనాశకుఁడు కర్మనాశకుఁడు నై యుండవలెను. అనఁగా నిది గొప్పవృత్తి యిది నీచవృత్తి యనక యన్నివృత్తులు సమానములని పాటింపవలయును. వాఁడు గొప్పకులమువాఁ డని వీఁడు నీచకులమువాఁడని భేద మెన్నకుండ నందఱను సమానముగఁ జూడవలయును. కులధర్మములు పిచ్చిపిచ్చి కర్మలు మానవలయును.

7 ప్రతిఖాల్సామతస్థుఁడు నాయుధములయందు మిక్కిలిప్రీతియు గౌరవము గలిగి యుద్ధము పండుగగఁ దలంపవలయును. ఎవ్వఁడు యుద్ధములో శత్రువును జయించునో తానోడిపోయినను నిరుత్సాహుఁడు గాకయుండునో యతఁ డీలోకమునఁ బరలోకమునఁగూడఁ మహోన్నతుఁ డగును.

8 ప్రతిసింగు నిష్కళంకమైన నడత గలిగి యుండవలెను.

9 ప్రతిసింగు చాలా మతవిశ్వాసమే మోక్షసాధనమని నమ్మవలెను.

10 ప్రతిఖాల్సామతస్థుఁడు జననమరణ రహితుఁడై యవాఙ్మానసగోచరుఁడై సత్యస్వరూపుఁడైన పరమేశ్వరుచే మానసికముగ నారాధింపవలయును గాని బ్రతికియుండిన జంతువును గాని చచ్చిన జంతువునుగాని విగ్రహములనుగాని పూజింపఁగూడదు.

11 ఈమతస్థులందఱు గురునానకును నతని యనంతరమున వచ్చిన తక్కినగురువులను మిక్కిలి గౌరవింపవలెను. వారి సిద్ధాంతములు గల యాదిగ్రంథము పరమప్రమాణముగ నెంచుకొనవలెను.

12 హిందువు లాచరించుకర్మలు సిక్కు లాచరింపఁగూడదు. కాని వారి పుణ్యక్షేత్రములు తీర్థములు వారి సిద్ధాంతములు మొదలగువానిలో సిక్కులు తమకుఁగూడ భాగమున్నదని తెలిసికొని వానిని గౌరవించవలెను. హిందువులయొక్కయు హిందువుల ధర్మములయొక్కయు సంరక్షణము నిమిత్తమై సింగులు తమ యర్థప్రాణముల నిచ్చి పోరాడుట విధి యని గ్రహింపవలెను.

13 తురుష్కులను నిర్మూలముచేయుట ప్రతి సింగునకును నుత్కృష్టమైన ధర్మవిధి.

14 సిక్కులు పొగాకు సేవనము నుపయోగింపఁగూడదు.

15 ఖాల్సామతమునందు సర్వనిర్గుణస్వరూపుఁడైన భగవంతుఁడెల్లపుడు నిలిచియుండునని గ్రహింపవలెను.

16 ప్రతి ఖాల్సామతస్థుఁడు తనకు వీలగునప్పు డమృతసరః పట్టణమునకుఁ బోయి యచ్చటి సరోవరమునందలి పుణ్యజలంబుల స్నానమాడు చుండవలెను.

17 సిక్కు లొండొరులం గలిసికొన్నపుడు "వాహిగురూకా ఖాల్సాను గురుజీకి ఫతే" యని సలాములు చేసికొనవలెను. మఱియొక విధమైన మర్యాద వారు చేసికొనఁగూడదు.

నాఁడు సభలో నుండిన సిక్కు లందఱు గురుగోవిందప్రోక్తము లైన ధర్మములన్నియుఁ బ్రమాణములని నమ్మి వానిప్రకారము నడఁచుకొనునట్లు శపథము చేసిరి. సింగుశబ్దమునకు సింహమనర్థము. సింహమని పేరుపెట్టుకొని రణమున మేఁకవలె బారిపోవుట కెవ్వనికి మనసొప్పదని యతఁడు ప్రతివాని కానామ మిచ్చెను. కత్తి పానకమున ముంచుటవలన నిజముగ శౌర్యము ప్రతివాని హృదయమున నెలకొనదు. కాని హిందూదేశమున నట్టి సనాతనాచార మొకటి పూర్వకాలమునుండియుఁ గలదు. పూర్వము రాజపుత్రులలోను బెలూచి

స్థానవాసులైన హిందువులలోను మగశిశువుగలిగినతోడనే గిన్నెలో నీళ్ళుపోసి కత్తికొన యందు ముంచి యానీటిచుక్కలు రెండు శిశువు నోటఁ బోసెడి యాచారమొకటి యుండెను. సీకు లాయాచారము భయభక్తులతోఁ జేయుటకై గోవిందుఁడు దానిని మతసిద్ధాంతముగ మార్చెను. ఎల్లప్పుడాయుధములు ధరించవలసినదని చెప్పుటవలన సీకు లటుమీఁదనెల్లప్పుడుయుద్ధమునకుసిద్ధముగనుండవలసినదనియతని యభిప్రాయము. అట్లు వారిని వీరులుగ జేయకపోయిన పక్షమున మహమ్మదీయుల బాఁజిబడి సీకుమతము నశించునని భయపడి యట్లు చేసెను,

వెలియైనవారు.

సర్వవర్ణములవారు నెల్ల తెగలవారు సీకుమతమునఁ జేరవచ్చు ననుటచేత గురుగోవిందుఁడు గుణదోషములు విచారింపక యందఱఁ దనమతమున గలుపుకొనియెనని మనము తలంపరాదు. ఏలయన నతఁడు కొన్ని తెగలవారిని స్వమతంబునం జేర్చికొనక వెలివాం డ్రుగ జేసెను. అందు మొదటివారు ధర్మశాలా పరిపాలకులు. అనగా సీకుదేవాలయములయొక్కయు ధర్మసత్రముల యొక్కయు ధర్మకర్తలు. సీకులు విగ్రహారాధనము సేయకపోయినను మహమ్మదీయులకు మసీదులు, క్రైస్తవులకు చర్చిలు నుండినట్లే వీరికిగూడ కొన్ని పావనస్థానములు గలవు. అవేధర్మశాలలనియు దేవాలయము లనియు జెప్పఁబడును. ఈ ధర్మశాలాధికారులు సోమరులు, భోగ పరాయణులు, దుర్బలులు. అది కారణముగ వారు యుద్ధమున కనర్హులు. రెండియు గురుగోవిందుని తండ్రియగు తేజబహుదూరు శత్రు పీడితుఁడై యమృతసరమందున్న "దర్బారుసాహేబు" అను పేరు

గల బంగారుగుడికి బోయి దానిలో దాను తలదాచుకోవలెనని ప్రయత్నింప నాయాలయ పరిపాలకులు స్వమతాచార్యుఁడను నభిమానమైన లేక లోపల నడుగు పెట్టనీయరైరి. అప్పు డాయన స్థలాంతరమున కరిగి బహుకష్టముమీఁదఁ బ్రాణరక్షణము చేసికొనియెను. ఈ రెండు కారణములచేత ధర్మశాలా పరిపాలకులు స్వలాభపరాయణులై మతాభిమానశూన్యులై స్వార్థత్యాగవిముఖులై నెందుకుం బనికిరాక యుండిరని యెంచి యతఁడు వారి శిష్యులుగఁ బరిగ్రహించుట కంగీకరింపలేదు. ధరమల్లు రామరాయలుయొక్క యనుచరులు బహిష్కృతులలో రెండవవారు. ఆయిరువురు తేజబహదూరుతో చిరకాలము వైరముగలిగి యతనిని, కుమారుని కూడ ద్వేషించి వారికి బలుసంకటములు గలిగించిరి. కలిగించుటయే గాక నిరంతరము సిక్కుమతమునకు శత్రువులై దానిని నాశనము చేయ దలఁచినవారి నాశ్రయించి వారి యనుగ్రహమునకుఁ బాత్రములై యుండుటం జేసి వారు మత స్వీకారమున కనర్హులని యతఁడు భావించెను. గురు వీబహిష్కారము ద్వేషముచేతఁ జేసెనని మన మనఁ గూడదు. ఇందు ద్వేష మేమియు లేదు. ప్రక్కలో బల్లెములట్లుండి పలుసిలుగులు పెట్టుచున్న పగవాండ్రను జేరదీసినయెడల వారు పంఘములో నంతఃకలహములు గల్పించి మొదటికే మోసము దెత్తు[రని] గోవిందుఁడు దూర మాలోచించి యాపని జేసెను. వణిజులు [బ]హిష్కరింపఁబడిన వారిలో మూఁడవవారు సాధారణముగ [లో]కపు మనుష్యులు గాని యాలోకము మనుష్యులు కారు. [ఏ]దో వ్యాపారము చేసికొని ధనమార్జించుటయే పురుషార్థమని వారు [భా]వించుటచేతనో వారు పిఱికివాండ్రని లోకులు చెప్పుకొనుటచేతనో [వ]ణిజులు మతస్వీకారమునకుఁ బనికి రారని యతఁడు శాసించెను. [కా]ని యతఁడు పొరబాటు పడెనని మనమూహింపవలెను. ఏలనన

ముఖ్యాంశ పవిత్రతములనుండి యేవృత్తి కలవారునైనను యావృత్తి యందు మిక్కిలి నేర్పరి యగును. క్షత్రియుఁడు పితృపితామహుల నాటంగోలె నిప్పట్టి పోరాటమునకు కలవాటుపడుటం జేసి యతఁడు పోటు మానిసియయ్యె. వ్యాపారమున కలవాటుపడుటం జేసి వణిజుఁడు రణపరాఙ్ముఖుఁడయ్యె. అంతియకాని జన్మముచేతనే పిరికికండవారు పోటు మానిసులు కారు. ఎట్లనుగనేమి. గురువు వారిని జేపట్టలేదు. జైనులు వెలివాండ్రలో నగ్గనవారు. వారును వణిజులట్లె వాణిజ్య పరాయణులు. అదియుంగాక వారికి నెక్కుడుభూతదయ గలదు. మంచము నల్లులుపట్టి పుచ్చిపోయినను వారొక్కనల్లినైనఁ జంపరు. తలనిండ పేలు కొల్లకొల్లలుగా బడుచున్నను పేలుచచ్చునను భయమున తల దువ్వు కొనరు. ఈఁగలు ముసురలైన వాని కాహారము దొరకదని జాలిపడి మేనంబుట్టిన పుండ్లు కుదుర్చుకొనరు. పగోగలు పీకుచున్నను, రాత్రి నల్లులు కుట్టుచున్నను తమ మేని నెత్తురు ధారపోసి యా జంతువులను పోషించి పుణ్య మార్జించుచున్నామని తలంతురేకాని తమ కార్యము జనవిరుద్ధమని వారు తలంపరు. అట్టిబాధలు తాము పడలేనప్పుడు పేదచుట్టములం బిలిపించి వారు కోరిన రొక్కమిచ్చి యా నల్లుల మంచముమీఁద వారిం బండుకొనఁబెట్టి నల్లులపోటులు బడలేక నడిరేయి వారు మంచముకుక్కి విడిచి పారిపోవుదురని శంకించి వారి కాలు చేతులు గట్టిగా మంచములకు గట్టి తాము చేయుచున్న భూతతృప్తి కానందించుచుందురు. మనుష్యుని బాధించి మత్కుణములం బోషించుట కాకున్నను గొట్టి గిన్నెలకుపైచుట యనుమాట వారెఱుఁగుదురు ఇట్టి మూఢవిశ్వాసములకు దాసులైన జనులను శిష్యులం జేసికొన్న యెడల వారు నెత్తురు జూడఁగానే మొగము దిరిగిపడి తాము పారి పోవుటయేకాక పిరికితనముమాత్రలు తోడివారికందఱకు పైచి కొంప ముంపవచ్చునని భయపడి గోవిందసింగు వారి బహిష్కృతులం జేసెను.

ఇట్టివారినే యాతఁడు తన సంఘమునకు వెలివాండ్రుగఁ జేసెను. ఇది యౌచిత్యము పాటించి చేసినపని గాని విమర్శింపక వేగిరపడి చేసిన కార్యము కాదు.

కొండదొరలతోఁ గలహము.

గురుగోవిందుని నూతన మతము పొరుగున నున్న కొండ రాజుల కాగ్రహము గలిగించెను. హిందూమత సంరక్షణార్థమును సిక్కుమతరక్షణమునకును నతఁడు కంకణము గట్టుకొని యంతవఱకు నిర్జీవములైన మనుష్యుల హృదయములలో జీవము పోసి యుత్సాహము కల్పించి వారిని సత్కార్యములకుఁ బురికొల్పుచుండ దాని ప్రభావము వారు గ్రహింపలేక గురుగోవిందుఁడు తాను జగదేక గురుఁడై ప్రతిష్ఠ సంపాదింపవలెనని స్వలాభపరాయణుఁడై యట్లు చేసెననియుఁ బైకి హిందూమతసంరక్షణమని చెప్పుచున్నాఁడే కాని నిజముగా వర్ణ సాంకర్యము చేసి హిందూమతము పాడుచేయ నంత రంగమునఁ దలఁ పెట్టినాఁ డనియు నూతనముగ నతఁడు కనిపెట్టినపంచామృతపాన సిద్ధాంతము పాపహేతు వనియు నతని సాహచర్యము కూడ దనియు తలంచి దూషించి యతనితో గిల్లికయ్యము బెట్టుకొనఁ జూచుచుండిరి. తనకట్టిదురుద్దేశము లేదని యతఁ డెన్నిసారులు నొక్కి చెప్పినను వా రాతని మాటలు పెడచెవిని బెట్టి యతని మాటలు కల్ల లనియుఁ దనక్రొత్తసైనికులచేత ముందుగా నిరుగు పొరుగుననున్న దమ్ము నిర్మూలనము చేయించు ననియు నీచవర్ణములలోనుండి వచ్చి కృత్రిమ క్షత్రియులుగాఁ జేయబడిన యా సంకర సైనికులు పురాతన రాజ వంశములు నిర్మూలించుటకు వెనుదీయ రనియుఁ దమ్ముఁ గుంకటివేళ్ళతో నిర్మూలించి గొప్పరాజ్యము స్థాపిం

చుట కీ పన్నుగడ పన్నినని యు వారుసిద్ధాంతీకరించిరి. కావున గురుగోవిందుని సంకల్పము పండకమున్న మొగ్గగా నున్నపుడె తుంచి వైచుట సముచితం బని యా కొండరాజులె ముందు నెయ్యమును భేదించి కయ్యమారంభించిరి. దేశాభిమాన పరాయణుం డైన గురుగోవిందుండు తన సైన్యమును ద్రవ్యమును హిందూ సంఘము లకు విరోధు లైనవారియెడ వినియోగించుటకె నిశ్చయించుకొనెను. గాని స్వప్నమునం దైన స్వదేశస్థులతోం బోరాడవలసివచ్చునని తలంప లేదు. అట్టిపోరాట మెంతమాత్ర మతని కిష్ట ములేదు. కాని యతం డెవ్వరిసఖ్యము గోరెనో వారికి వాని దేశాభిమానములో నూరో వం తైన లేదు. వార హృదయము లసూయకు నాగ్రహమునకుం దావలము లయ్యెను. కాని దేశోద్ధరణహేతువు లై యుదారభావము లకు నెలవులు కాకపోయెను. తనతో మైత్రి పాటింపవలసిన దనియుం దన మతమునం జేరవలసిన దనియు నతండు వారికి సందేశ మంప నది పరాభవముగం దలంచిరి. అందువలన గురుగోవిందుండు పరులను నమ్ముకొనుట నిష్ప్రయోజన మనియు స్వసైన్యమునె నమ్ముకొని తనపై నెత్తివచ్చినవారి నెదుర్కొనవలసి యుండు ననియు నెంచి తానును సమరసన్నాహముం జేసెను. ఆనందపురము విడువవలసిన దనియుం దమ చుట్టుపట్ల నెచ్చట నుండక విదేశములకుం బోవలసిన దనియు గోవిందుం డాదేశమున నుండు టవలన దమకు గలిగిననష్టమునకుం బ్రతిఫలముగ గొంతద్రవ్యము దమకీయవలసిన దనియుం గొండదొరలు సందేశమంపిరి. ఆనందపురముతనసొంత మనియు నప్పడుకట్టినస్థలము తనధనముతోనే నిలిచె ననియు నంతియగాక విశేషద్రవ్యము వ్యయముచేసి కోటలు గృహములు కట్టింపంబడె ననియు నందుచేత నది విడుచుటకు వీలులేదని యు నతండు మరల రాయబార మంపెను. ఒకనాండు గురుగోవిందుం

డు స్వల్పపరివారముతో వేఁట కరిగియుండ నతనిగెల్చుట కదియె మంచిసమయ మని యాలంచందుఁ డనునొకరాజును బలియుఁ డనుమఱియొకరాజునుగలిసి కుట్రపన్ని యెక్కువపరివారముతో నతనిమీఁద దుమికిరి. కాని గోవిందునిసైనికులు స్వల్పసంఖ్యాకులయ్యు మిక్కిలి శౌర్యముతోఁ బోరాడిరి. కొండరాజులు తలఁచిన దొక్కటి దైవము చేసిన దొక్కటియయ్యెను. గోవిందునియల్పపరివారముచేఁ గొండదొరలయధికపరివారము పరాజయమునొందెను. విశేషించి బలియుఁడనునతఁడు కొండఱనుచరులతో నాకయ్యమున ప్రాణములు విడిచెను. ఈపరాభవాగ్ని హృదయమును గాల్చుటచే హతశేషులైనమన్నెదొరలు తక్కినకొండరాజులఁ గలియఁగట్టుకొని సర్హిందూదేశపరిపాలకుఁడైనతురకతో నెయ్యముఁ గావించి యాతనిసహాయముం గూడఁబడసి రెండవసారిగురుగోవిందునిమీఁదికిఁబోయిరి. ఈసారికూడజయము గురునిదే యయ్యెను. తురకలు కాందిసీకులై సిక్కులముందర నిలువలేక పలాయితులైరి. ఈకయ్యమున గోవిందుని జ్యేష్ఠపుత్రుఁడైన యజతసింగు మేటిమగంటిమి జూపి యెల్లరకాశ్చర్యము గలిగించెను. శత్రుపక్షమున వచ్చినవారిలో నొకఁడగురాజాకేసరసింగు రణనిహతుఁ డయ్యెను. తక్కువజాతులను దనమతంబున గలుపుకొనుటచే గోవిందునకు గలిగినయమితలాభ మీరణమునం గనబడెను. తక్కువజాతివాఁడైనవిచితారుసింగు గురువుచేత క్షత్రియుఁడుఁగ జేయఁబడి గౌరవముగాంచియుండి యానాటిపోరాటములో మిక్కిలివన్నెకెక్కెను. ఆనందపురముకోటతలుపులు భేదించుటకయి పగతురు మదపుటేనుఁగునొకదానిం బంపిరి. అది దుర్నిరీక్ష్యతేజముతో నేల యదురునట్లుకవాటపాటనమునకై యరుదెంచుచుండ విచితారసింగునకు గురువు కనుసన్న జేసెను. తోడనే యాసింగు సింగమువలెమత్తేభముమీఁదఁబడి తనఖడ్గముతో దానియొడలెల్ల గాయములు చేసెను. ఆకైదువు

పోటులు త్రిప్పలేక యాదంతావళము వెనుకకు మరలిస్వసైన్యముమీఁదఁ బడి నాశనముఁ జేసెను. ఈవిజయ మైనతరువాత గురువానంద పురము విడచికొండలమీఁద నున్నకీర్తిపురముఁ జేరెను. కీర్తిపురము జేరి కీర్తిమంతుఁడై యున్న యాగోవిందుని జూచిపరాజయంబున నప కీర్తిమంతులైన కొండరాజులును మహమ్మదీయులునుమిక్కిలి యసూయచేఁ బీడితులై యుభయులుఁ దనసైన్యములం గూర్చుకొని మూఁడవసారి గురువు మీఁదికి దండువెడలిరి. సిక్కులు దుర్వారవిక్రమముతో బోరినను జయముమాత్రి మీసారి శత్రువులకె దక్కెను. గోవిందుఁడు పరాజయముఁ నొంది యానందపురికి పాఱిపోయెను. ఆపురమును శత్రువులు ముట్టడించినందున నతఁడు హతశేషులైనపరివారముతో వారిబారిపడి నాశనముఁ బొందకుండ వారికన్ను బ్రామి మిక్కిలినేర్పుతో సాహిబ్ పరగణాకు బారిపోయెను. ఇట్లతఁడుపరాజయముఁ బొందుటకు రెండుమూఁడుకారణములు కలవు. అతనిబంటులలో గొందఱు పగతులయొక్క లంచములు తిని వారిలో జేరిరి. కొందరు ద్రోహులై మంచిసమయమున వారినివిడిచి పాఱిపోయిరి. శత్రుసేన వానిసేనకంటె నధికముగ నుండెను. ఆయుద్ధసంబంధమున నొకచిన్న కథ చెప్పవలసియున్నది. పిషావరుపురవాసి యైనజోగిసింగనునతఁడు నెఱజవ్వనంబున నున్నదండిమగఁడు యుద్ధమానన్నమగునప్పటికి వానికి వివాహము సమీపించెను. అందుకు రమ్మని తలిదండ్రులు జాబువ్రాసిరి. అతఁడాజాబు గురువునకు జూపినాకిప్పు డేమియాజ్ఞ యనియడిగెను. వివాహదీక్షితుఁడవై యాకార్యము ముగిసినవెంటనేయిక్కడకు రమ్మనిగురువానతిచ్చెను. ఆయాన శిరసావహించి యతఁడు నిజవాసమున కరిగి వివాహదీక్ష ముగిసినతోడనె దలిదండ్రులు చుట్టములు వెళ్ళవలదని బతిమాలు చున్నను, వారిమాటలు వినక పసుపుబట్టలతోడనె గురువునొద్దకుఁ బోయెను. సమయభంగులై మహాద్రోహు

లై గురువును మంచిసమయమున విడిచినవారును గలరు. ఈవిధముగ ధర్మబద్ధులై స్వార్థత్యాగముఁ జేసినవారును గలరు.

గోవిందునివిజయము.

ఆపరాజయ మైనవెనుక ననంతరకర్తవ్యమే మనిగోవిందుఁడు దీర్ఘవిచారము జేసి మరల దగినసైన్యమును గూర్చుకొని స్వమతము నకు దేశమునకు శత్రువులైనవారిని భంగపెట్టి హృదయశల్యము మాన్పికోవలె నని నిశ్చయించుకొనెను. సోనారిరాజునొద్ద కొన్నిదినము లుండి యచ్చోటు నాసిమజీముప్పలు రాజులకెదుటఁ బోయి కిరీటయు ద్ధసంబు లచ్చటనుండి తరువాత మంచిసంస్థానాధిపతి యైనదోహార సేనుఁడాహ్వానము సేయ నతని దేశమున కరిగి యతనియాదరమున వసి యచ్చట నొకకోట గట్టుకొని యుండుచుండెను. అతఁడాకోటలో నుండఁగా కొండజాతులు వాని నిమిత్తము కొన్నికానుకలం బట్టుకొని పోవుచుండిరి. కాలోర్మటసంస్థానాధిపతి యది యెఱిఁగి తనబంట్లం బంపి యాకానుకలు దోచుకొని పోయెను. సేవకులావార్త గోవిందునకు విన్నవింప నతఁడు మిక్కిలియలిగి యారాజును దండింపుమనికుమారుఁడైన యజితసింహుని గొంత సైన్య మిచ్చిపంపెను. కాలోర్మట రాజును యుద్ధసన్నద్ధుఁడై తనమిత్రుఁడైనజ్వాలాముఖమహంతును బిలిచెను. జ్వాలాముఖమహంతు పూర్వాచారపరాయణుఁడు. నూతనమతస్థాపకుఁడైన గోవిందునిమీఁద నతని కమితాగ్రహముగలిగెను. గోవిందుఁడు నాస్తికుఁడనియు నతఁడు వధ్యుఁడనియు గోవిందుఁడు తలంచి పగదీర్చుకొనుట కెదురు చూచుచుండెను. అంతలో మిత్రుఁడను కాలోర్మటరాజుపిలిచినందున నైదువందల సైనికులతో నతఁడువానిని జేరెను. స్వసైన్యమునకంటె శత్రుసైన్య మధిక

ముగి యున్న దని విని గోవిందుఁడు కుమారునకు సాయముఁ జేయుటకుం బది సహస్రముగ సైన్యముతో కరిగెను. యుద్ధము భయంకరముగ జరిగెను. కాల్మోటరాజు మహాంతు పరాజయము నొందెను. మహాంతు వారు కట్క గ్రామము కొల్లబెట్టబడెను. తన బుద్ధిహీనతకు మహాంతు పశ్చాత్తాపము నొందెను. కాని ప్రయోజనము లేకపోయెను. ఈవిధముగ కలిగినపిదప గోవిందుఁడు పూర్వ వాసస్థానమగు ఆనందపురమునకుఁ బోయెను. అప్పటి కాకోట దుర్గములలో నుండెను. కూలిన గోడలు పాడుబడ్డ యిండ్లు మున్నగు నవి బాగు చేయుటకై గోవిందుఁడు విశేషద్రవ్యము వ్యయము చేయవలసి వచ్చెను. అంతట మరమ్మతుచేసి ప్రవేశించి తన నలుగురు కొడుకులకు వివాహములు చేయించి స్వసుఖమునం గాలముపుచ్చుకొనెను. అప్పుడు కురుక్షేత్రమున గొప్పతీర్థము జరుగఁబోవుచున్నదని యతఁడు విని యచ్చటికిఁ బోవఁదలఁచెను. హిందూదేశముయొక్క నానాభాగములనుండి ముఖ్యముగ వేనవేలు జనులు చేయునట్టి తీర్థములకుఁ బోయి యచ్చట స్వమతప్రచారము చేయవలయు నని యతనిసంకల్పము. తనసంకల్పసిద్ధి నతఁడు కురుక్షేత్రమున కరిగెను. అందు పూజ్యులగు బ్రాహ్మణశ్రేష్ఠులకు భూరిసంభావనలిచ్చి వారిమెప్పువడసి పిమ్మట స్వమతమును బోధించెను. అతఁడెందరిని దనమతములోఁ గలుపుకొనెనో తెలియదు. పిదప యతఁడు కురుక్షేత్రమును విడిచి స్వస్థానమున కరిగి తనవ్యవహారములు చక్కఁజేసికొనఁ జొచ్చెను.

కొండరాజు లప్పుడైనను తమ దుండగమును మానలేదు. తాము మున్ను గెలిచిన గెలుపులు తమకు కొంతమాత్రమును బ్రయోజనకారులు గాకపోయె ననియు గురుగోవిందుఁడు మున్ను పరాజితుఁడైనను వానికి దేశమునఁగల పలుకుబడి గౌరవము తగ్గలేదు; గావున వాని నెట్లైన నాశముఁ జేయవలయుననియుఁ గృతనిశ్చయులైరి.

కాని మనోరథసిద్ధికిఁ దగినబలము కాని ద్రవ్యముకాని వానికడ లేకపోయినందున హిందూమతమునకును వాని సంతతికిని గూడ శత్రువైన యౌరంగజేబు పాదుషా నాశ్రయింపఁ దలఁచి తమకు సహాయముఁ జేయుమని వేఁడుచు నాతనికడ కొకరాయబారి నంపిరి. ఆదూత చక్రవర్తిసన్నిధి కరిగి గురుగోవిందునిమీఁద నెన్నో నేరస్థాపనలు చేసి యెన్నోకథలు గల్పించి [illegible] దయ్యెను. అందు ముఖ్యమైన వివి. "గురుగోవిందుఁడు దొంగమతము గల్పించి మూర్ఖులను మందబుద్ధులను దానిలోఁ జేర్చికొని దేశపరిపాలకులమీఁద వారికి ద్వేషము గలిగించుచున్నాఁడు. అతనిబలము క్రమక్రమముగ వృద్ధియగుట జేసి ముందుముందు మొగలాయిరాజ్యమునకే భంగము కలుగవచ్చును. అతనిగర్వోన్మత్తత యెంతవఱకు వెళ్లినదనఁగా "నేనే హిందూస్థాన మంతకు బాదుషాను. నాకన్న బాదుషాలు లేరు. ఇప్పటిఢిల్లీచక్రవర్తి పనికిమాలినవాఁడు. వానిని నేనుగాడ బెరికెద" నని కారు లఱచుచున్నాఁడు. మహమ్మదీయ మతము హిందూదేశములో నుండి కొంకటివేళ్లతో పెల్లగించివైతు నని యతఁడు ప్రతిదినము డప్పులుపెట్టి చాటించుచున్నాఁడు.

అని చెప్పి చక్రవర్తిం బురికొల్పి యాగ్రహము పుట్టించి కొండరాజులకు సహాయముగ గొంతసైన్యము పంపు మనియు దొంగలదారి యగుగురుగోవిందుని నాశనము జేయవలసిన దనియు వేఁడుకొనెను. చక్రవర్తి యావేశికోలు మన్నించి యచిరకాలములోనె కొండరాజులకు సహాయముగ గురుగోవిందుని దండించుటకై కొంతసైన్యమును బంప వాగ్దానముచేసెను. ఆరాయబారి యరిగినకొలఁదికాలమునకె గురుగోవిందుని బట్టుకొని బ్రతికియుండఁగా ఢిల్లీకి బంపవలసినదని యౌరంగజేబు చక్రవర్తి సర్హిందుపరగణాసుబేదారైన బయ్యజీతసింగు పేర వ్రాసెను. ఒకవేళ సైన్యము చాలకున్న ఢిల్లీనుండి పదివేల

సేననిచ్చి యమీరుఖానును బంపుచున్నట్లుకూడ నాలేఖలో వ్రాసి యాప్రకార మతనిని పంపెను. చక్రవర్తిసైన్యము కొండరాజులసేనం గూడి యానందపురము ముట్టడించెను.

శత్రుసేన మిక్కిలిగొప్పదిగా నుండుటచే గోవిందుఁడు వారి నెదుర్కొనక మంచియదను చిక్కువఱకు తనకోటలోనెయుండి వల యునప్పుడు పగతురపైఁ బడి పారుపవచ్చునని తలంచి లోపలనె యుండెను. అనేకదినములు పగతురు కోటముట్టడించిరి. కాని కోటం బట్టుకొనలేకపోయిరి. గోవిందుని సైనికులుగూడ పలువురు నిహతులైరి. అట్టివనాఁడు మంచి యదను గలిగినందున కోటలోనుండి యతఁడు సేనాసమేతుఁడై బయలుదేఱి మొగలాయీసైన్యమును ఖటాపంచలుచేసెను. పేరువడిన యిద్దఱుతురకదళవాయీలు గురుని కత్తికి నేలఁగూలిరి. తురకసేనాపతియైన యజమీరుఖందునకు గొప్ప గాయము తగిలెను. తురకలు తిరిగి చూడక పాఱిపోయిరి. సీకులు వారిని దరిమితరిమి కొట్టిరి.

గోవిందునిపరాజయము.

తనసైన్యము గురుగోవిందునిచేత పరాజయము నొందెనని విని చక్రవర్తి మేరమీఱినకోపము జెంది యెట్లయిన గురుగోవిందుని సంపూర్ణముగ నాశనము చేయవలయునని నిశ్చయించుకొని మహా సైన్యసమేతులై గురుగోవిందుని మీఁదికి దాడి వెడలవలసిన దని కాశ్మీరపరిపాలకుని లాహూరుపరిపాలకుని నియోగించెను. అట్లు నియోగించుటలో గోవిందసింగును వాని యాలుబిడ్డలను వాని యను చరులను నిర్మూలింపవలసినదని యాజ్ఞాపించెను. ఆపరిపాలకు లిద్దఱు సర్ హిందూపరి పాలకునిగూడ గలిసికొని కొండరాజులుం గూర్చు

కొని మహాసేనాసమేతులై యానందపురము ముట్టడించిరి. గోవిందుఁడు తనసైన్యమును ముందు నాలుగుభాగములుగ విభజించి నలుదెసలం బెట్టఁదలఁచెను. కాని మొగలాయిసేన మహాసముద్రమువలె మేరమీఱియుండుటచే తనదళమొక్కచోటనేయుండుట సముచితమని దానినానందపురముననే నిలిపెను. మొట్టమొదటినాఁడు తురకలు మిక్కిలి విజృంభించిరి. ఆవిజృంభణ మాపుటకై గురుగోవిందుఁడు తన జ్యేష్ఠపుత్రుఁడగు నజితసింగును గూడుకొని శత్రువులను నతిఘోరముగ దాఁకెను. మొగలాయిసైనికులు మహోగ్రమూర్తులగు నారెండు సింగంబులయెదుట నిలువలేక చెల్లాచెదరై పఱువెత్తిరి. మొదటినాఁడు పరాభవముజరుగుటచే మొగలాయీలు రెండవనాఁడు తమశిరంగుల బాగుపెట్టి కోటం దాఁకిరి. పట్టపగలు వారిం దాకుటకవకాశములేనందున గోవిందుఁడు నిశాసమయమున మహమ్మదీయసైన్యములు నిద్రాముద్రితములైనకాలమున తన యల్పసైన్యముతో కోట వెడలి ప్రమత్తులైయున్న పగతురపైఁబడి పలాయితులఁ జేసెను. అంతటమహమ్మదీయసైనికులు తమకు సాయముగ ఢిల్లినుండి మరలబలంబులు వచ్చువఱకు కలహ మాపివైచిరి. 1761 వ సం॥ రము చైత్రమాసమున మహమ్మదీయసైన్యమునకు మరల సహాయముగ గొంత సేన వచ్చుటంజేసి వారు మునుపటికన్న దిట్టముగ నానందపురము కోట ముట్టడించిరి. గోవిందునిసేన క్రమక్రమముగ క్షీణించెను. భోజనసామగ్రులు సన్నగిల్లిపోయెను. సరుకులుపైనుండి వచ్చుట కవకాశములేదు. గోవిందుఁడు నమ్మిన బంటులందఱుఁ దమకింక జయము చేకూరదని దిగులుజెంది కూలబడి యటమీఁద నెంతమాత్రము జాగుసేయక శత్రువులపైఁ బడి వారిని నాశనము చేయువఱకు తాము నాశనమగునఱకు పోరుదుమని గురువుతో జెప్పిరి. సాహసించుట స్వనాశహేతువనియు దగుకాలము వచ్చువఱకు నిరీక్షించుట మంచిదని

యు గురువు బహువిధముల నుపదేశించెను. కాని వారామాటలు పెడచెవిం బెట్టిరి. గురువు వారిమొండితనముజూచి విసిగి యెవరియిష్ట మువచ్చునట్లు వారు చేయవచ్చును. కాని నన్ను విడిచినవాఁడు నామతము విడిచినవాఁడే యగునని కఠినముగ బలికెను. ఆపలుకులు విని సీకులలో ననేకులు భయము, భక్తి, రోషముఁ దమ్ము బురికొల్ప మేములయందుఁ బ్రాణము లున్నంతకాలము పిఱికికండలు గల కొందఱు మేము సీకులముగాము పారిపోవుచున్నామని యాయనను విడిచి పోయిరి. ఆయల్పసైన్యముతోడనే గురువు కోట సంరక్షించుకొనుచు దగుకాలముకొఱకు నిరీక్షించుచుండెను. కోట నేలఁ గూలక పోవుటయు గోవిందుఁడు కోట వెడలి యెంతకాలమునకు సీవలకు రాకపోవుటయు గొండరాజులకు విసుఁగు పుట్టించెను. అందుచేత వారు గురుగోవిందున కొకబ్రాహ్మణునిచేత నిట్లు సందేశ మంపిరి. "మీరు కోటవిడిచి మీయిచ్చవచ్చిన తావునకు బోయిన పక్షమున మీకుటుంబమునకు మీకు హానిసేయకుండ మేము వదలెదము. ఇట్లు చేయకపోయినపక్షమున మేము గోహత్య చేసినట్లే." ఆసందేశార్థములు సత్యములని నిష్కపటిమైన గురుగోవిందుఁడునమ్మి తనకుటుంబమును వెంటబెట్టుకొని కోట వెడలెను. అతఁడు కోట వెడలగానే హిందువులు మహమ్మదీయులుగూడ తాముచేసిన బాసలుదప్పి యూరెల్ల గొల్లపెట్టి కోట గూలందోసి తమమాట నమ్మి శిశువులతోను స్త్రీలతోడను వృద్ధులతోడను బోవుచున్న గోవిందుని వెంబడించిరి. అతఁడు వారికందక నిరంతర ప్రయాణములు చేసి కొంతదవ్వరిగెను. కాని యక్కడ సర్సానది యడ్డువచ్చెను. ఆనది నిండువఱదమీఁద నుండుటంజేసి సేన దాటుటకు వీలులేకపోయెను. శత్రువులు సమీపించిరి. అప్పుడు గోవిందుని చిన్నబిడ్డలను భార్యలను దక్కినయంతఃపురాంగనలను నెట్టులో గుఱ్ఱములమీఁదను నేనుఁగులమీఁదను నెక్కించి

యావలకు దాటించిరి. అప్పుడు సింగులకును మొగలాయిసైనికుల కును సందడికయ్యము జరిగెను. సింగులందఱు దాదాపుగ నశించిరి. అప్పుడు గురుగోవిందుఁడు హతశేషులైన స్వల్పసైనికులతో వెన్నిచ్చిపరుగెత్తి చంకర్ కోటఁజేరెను. ఆకోట చేరునప్పటి కతనివెంటఁ దనకుమారులుగాక నలువదిమంది సైనికులు మాత్రమే యుండిరి. గురుగోవిందు నెట్లయినఁ బట్టుకొని ప్రాణములతో ఢిల్లీచక్రవర్తి కడకుఁ బంపి యతనిచేతఁ జిత్రవధ చేయింపవలెనని కొండరాజులు సంకల్పించి మరల మాయోపాయముపన్ని కోట వెడలించి యతని నావలకు దీసికొని రావలయునని నిశ్చయించి యిట్లు సందేశమంపిరి. "మీరాకోట విడిచి మావెంట మీరాజ్యమునకు మరల వత్తురేని మీకేయపాయము లేకుండఁ దీసికొనపోవుదుము." ఆరాయబారము దెచ్చినయతఁడు తాను మొగలాయీల దూతనని గర్వించి తనయంతర మెఱుఁగక యహంభావమూన సందేశము మిక్కిలి కఠినోక్తులతో జరిగించి గురువునెడల దుర్వినయము బ్రకటించెను. గోవిందుని జ్యేష్ఠతనూజున కాదుర్వర్తనము దుస్సహమగుటయు నతఁడని బాల్యకోపప్రేరితుఁడై ఖడ్గమెత్తి యాసందేశము దెచ్చినరాయబారితల నొక్కయేటున దెగవేసెను. తెగవేసి కొండరాజులకు బరాభవము గలుగునట్టి మాటలతో నతఁడు మరల సందేశ మంపెను. తమ రాయబారి నిహతుండగుటయు దుస్సహమైన సందేశము మరల వచ్చుటయు విని శత్రువులు గురుగోవిందుని నాశనమునందు గృతనిశ్చయులై కోట ముట్టడించిరి. సింగులు సింగములట్లు పోరాడిరి. కాని వేనవేలు కరకుతురకలమీఁద నలువదిమంది యేమిచేయగలరు? సాయంకాల మగునప్పటికి ముప్పదియెనమండ్రుగురు సింగులు నేలపాలైరి. అందులో నతని పెద్దకొడుకు లిద్దఱు నుండిరి. జ్యేష్ఠతనూజుఁడగు నజితసింగు-నిహతుఁడు కాఁగానె రెండవకుమారుఁడగు

జూజహారసింగు పదునైదేండ్ల ప్రాయమువాఁడు పగతురపై దుముక
బోవుచు త్రాగుటకు గొంచెము మంచినీరిమ్మని యడిగెను. శూర
శిఖామణియైన యాకొడుకుంజూచి గురుగోవిందుఁ డిట్లనియె. "నీవు
త్రాగవలసిన దీనీరుగాదు. ఇంతకంటె నుత్కృష్టమైనజలము మృత్యు
దేవతయిచ్చు పానకము త్రాగుము. పొ"మ్మని పంచుటయు నాబాల
వరుఁడు పగతురం దాఁకి వీరశైవమునలంకరించెను. శౌర్యభూషణములు
ను వంశాలంకారులునైన కుమారసింహము లిద్దఱొక్కనాఁడు తన
కన్నులముందట గతించినప్పటి దుఃఖము సామాన్యమానవులు భరిం
పగలరా. గురుగోవిందుఁడు హిమవత్పర్వతమువంటి ధైర్యసారము
గలవాఁడగుటచేతను జననమరణములతత్త్వ మెఱిఁగినవాఁ డగుటచేతను
శుభాశుభములపర్యాయములు దైవమే కలుగఁ జేయుచుండుననువిశ్వా
సము గలవాఁడగుటచేతను దుర్భరమైన యీపుత్త్రశోకమును పరమ
శాంతముతో సహించెను. కుమారద్వయ మరణానంతరమున మిగిలిన
నలువురు మువ్వురతో నటమీఁద గర్తవ్యమేమని యాలోచింపఁ జగ
ద్వంచకులైన పగతురను వంచనచేతనే నిర్జించుట రాజనీతియనియు,
నాపద్రక్షణమనియు జెప్పిరి. అదే కట్టకడపటి యుపాయమని యట్లుచే
యుటకు గురువొడంబడెను. చీఁకటిపడినతరువాత గోవిందుఁడు పాఱి
పోవుచున్నాఁడు పాఱిపోవుచున్నాఁ డని కోటయొక్క యొకద్వార
ముకడ శబ్దము వినఁబడెను. వెంటనే గుఱ్ఱములనెక్కి మొగలాయీ
సైనికులు వానిం బట్టుకొన నరిగిరి. కాని యెంతదూర మరిగిన సింగు
లదౌర కనబడలేదు. అది యరణ్యమార్గమగుటచేతను గాలిచీఁకటులు
క్రమ్ముటచేతను తురకలుముందునకు సాగిపోవలేక వెనుకకు మరలిరి.
గోవిందుఁడు పాఱిపోయినదొకవైపు, వెఱ్ఱితురకలు వెదకిన దొకవైపు.
గోవిందుని బంట్లు తురకలం దప్పుదారిని బెట్టదలఁచి యతని నొక
ద్వారమునుండి బంపి మఱియొకద్వారము దీసికొని యతఁడు పాఱి

పోవుచున్నాఁడని కేకలు వైచిరి. ఎట్టకేలకు మహమ్మదీయులు తమ తప్పుం దెలిసికొని గురువు చనుదారిని వెంబడించిరి. కాని యంధా లోపున గడువవ్వారగుటం జేసి వారిప్రయత్నములు వ్యర్థము లయ్యెను. అట్లు గురువు నలుగురైదుగురు పరాక్రమవంతులగు సత్పురుషుల గలసి కన్ను కన్నుగనబడని చిమ్మచీఁకటిలో దైవము మీఁదనే భారమువైచిపోయి తెల్లవారువప్పటికి శత్రువులకు దుస్సాధ్యమైన స్థానము జేరెను. కాని మార్గాయాసమునను నిద్రాభావమునను బుత్రశోకమునను నతఁడు కడు డస్సిపోయెను. పలుగురాలు గుచ్చుకొనియు ముండ్లు దిగియు కాళ్ళు నెత్తురువఱద లయ్యెను. ముండ్లదాఁకి మొకలెల్ల గీచికొని పోయి గాయములకు నిలయము లయ్యెను. కాని శరీరాయాసము నతఁడు సరకు సేయలేదు. ఆదుస్స్థలమున దెల్లవారినతోడనే తన్నెవ్వరైన గుర్తించి యరులకు కప్పగింతు రేమో యని యతనికి భయము తోఁచెను. భయము తోఁచినట్లుగానె గుజారు జాతివారైన యిరువురుతుచ్ఛు లాయనం జూచి యిదుగో గోవిందుఁడిదుగో గోవిందుడని యరచిరి. అదివిని యామహానీయుఁడు మనోధైర్యము చిక్కఁబట్టి మెల్లగా వారికడకుఁబోయి యూరకుండుఁడని బతిమాలి కొన్ని బంగారునాణెములు తీసి వారి కియ్యఁబోయెను. అవివారు గ్రహింపక గట్టిగా నరవఁజొచ్చిరి. వారి కేకలు వారిమిత్రులకువినఁబడక మున్నె గోవిందు డొరలోనుండిఖడ్గమూడిపెరికి వారియిరువురశిరస్సులుఁ జెరియొకవేటున నేలంగూల్చెను. అనంతరమతఁడు నిజానుచరులతో నిక్కలినాచాటుచోటునకుం జని కటికి రాలుతలగడగఁ జేసికొని నేలంబండుకొని తనయవస్థంగూర్చి విచారించుచుండగా నన్నము నీరులేక మిక్కిలి యాయాసపడినందున నతనికి గాఢనిద్ర పట్టెను. మరల రాత్రివఱకు నతనికి మెలఁకువ రాలేదు. నిద్ర సుఖమెఱుఁగ దన్నమాట నిక్కముగదా.

మాళవ దేశప్రవేశము.

ఆయడవిలో గురుగోవిందుఁడు తెల్లవారుజాముపఱకునుండి యప్పు డు బయలుదేఱి తెల్లవారునప్పటికి మచ్చివారను నొకగ్రామముఁ జే రియొకతోట జొచ్చి యందొకమూల దాగికొనెను. ఆవనయజమాను లగు మహమ్మదీయసోదరులిరువురు తోటలో నిట్టటుఁదిరుగు చుండ గోవిందుఁడు వారికంటఁబడెను. వారొండొరుల నానవాలు బట్టిరి. నిజ మతద్వేషులైనసకరకుతురకలం జూడగానె తప్పకవారు పట్టుకొనిపగతుర కప్పగింతురని గోవిందుఁడు సందేహించెను. కానియాతురకలు పూర్వ పరిచితు లగుటచేత నట్లుచేయఁ దలచుకొనలేదు. ఆతురకలు గుఱ్ఱా లవర్తకులు. ఎన్నోసారులు గోవిందునకు గుఱ్ఱము లమ్మినవారు. అం దుచేత స్వమతద్వేషి యైనను వారాయనను బట్టి యప్పగించుట యధ ర్మమని తలఁచి యభయమిచ్చి యాతిథ్యమిచ్చి విశ్వాసము గలమను ష్యులను సాయమిచ్చి భల్లాలపురము పంపించిరి. చమకారకోటనుండి గురువు తప్పించుకొని పోయినప్పుడు వానితోఁ గూడ నకతమదారిం దా ముపోయి తురకవేసములు వైచుకొని తిరుగుచుండిన సీకులు భల్లాల పురమున గోవిందుంగలిసికొనిరి గులాబుసింగను నొకసీకుఁడు మొట్టమొ దట గురువును తనగృహమునకు రమ్మని యాహ్వానముఁ జేసి యధి కారుల కావిషయము దెలిసినయెడ తనతలమీఁదికి వచ్చునని భయ పడి తనయింటికి రావలదనిచెప్పి గోవిందునకు సహాధ్యాయియు భల్లా లపురపు ఖాజీయునైన మీరుమహమ్మదను నాతనిగృహమునకుబం పెను. అతఁడు తనపూర్వ సహపాఠిని మిక్కిలియాదరించి ప్రియభా షణంబుల సంతుష్టుం జేసి భోజన మిడెను. గోవిందుఁడు మహమ్మ దీయులచేతివంటకము తినగూడ దని పూర్వము నియమముగలవాఁ డయ్యుఁ దనమిత్రుఁడు స్నేహభావమున నిడినయన్నము గడుపారఁ

దిని నాటంగోలె నాపత్సమయమున సీకులు తురకలచేతికూఁడు తిన వచ్చునని శాసించెను. గురుగోవిందుఁడు శత్రుసైన్యముబారిఁబడ కుండ రక్షించు టెట్లని ఖాజీమున్నగు మిత్రులు వితర్కించి గోవిం దుఁడు తురకఫకీరువేసము వేసికొనునట్లు నిర్ణయించిరి. అతనిశిష్యు లుగూడ తురకవేసములు వేసికొని గురువును సవారిలో గూర్చుం డబెట్టి యతఁడెవ్వరని దారిలో నెవ్వరైన నడిగినపక్షమున ఖాజీయని చెప్పుచు మెల్లమెల్లగా మాళవదేశము ప్రవేశింపవలసినదని వారంద ఱుపదేశించిరి. గురువు తురకగురువువలె నవిషరాయిలు నీలియంగీలు తొడిగికొని పల్లకిలో గూర్చుండెను. శిష్యులె యాపల్లకి మోసిరి. అం దుచేతనెవ్వరి కేవిధమైన యనుమానము గలుగలేదు. ఆకారణమున నతఁడు సురక్షితముగ మాళవదేశముఁ జేఁ గంఘురాల యనుగ్రా మము బ్రవేశించెను. తురక వేసములు దీయకయె యతఁడచ్చట నాయుధములు విడిచి యాయూరు విడిచి హీరగ్రామమునకుఁ బోయి కృపాళదాసు మహంతుయొక్క గృహమున విడిసియుండఁ దలఁచెను. కాని యామహంతు పరమభీరు వగుటచే రాజద్వేషి యైన గురుగోవిందునిఁ దన యింట నిలుపుకొన్న పక్షమున రాజాగ్రహమునకుఁ దాను పాత్రుఁడు గావచ్చునని చకితస్వాంతుఁడై గురువున కాతిథ్య మీయజాలకపోయెను. అనంతర మతఁడాయూరు విడిచి రేయికోట యనుమఱియొకజనపము జేరి జమీందారుఁడైన కమహమ్మదీయున కతిథి యయ్యెను. ఆమహమ్మదీయుఁడు మిక్కిలి ప్రసన్నుఁడై గురువును సగౌరవముగ గొన్నిదినములు తనయింట నుంచుకొని యామంత్రణము చేసెను. వారనేకగ్రామములు గడచి గడచి మెట్టకేలకు దన యనుగ్రామము జేరిరి. ఆగ్రామమున గొన్ని దివసంబులుండి గొంతమనస్థిమితము గలుగుటయుఁ దనవ్యవహారము జూచుకొని కొందఱుసైనికులం గూర్చుకొని యాయూరు విడిచి

కోట్కపూరా యనుగ్రామము జేరెను. ఆయూరిప్రభువు గోవిందుని మిక్కిలి యాదరించి కొన్నియాయుధములను గుఱ్ఱములను నిచ్చి కొంతద్రవ్యమిచ్చి తనభక్తిం బ్రకటించెను. కాని చిరకాలము తన గ్రామమునం దుండవలసినయెడ దనసైనికులను సాయమిచ్చుట దనకిష్టము లేదనియు జెప్పె యాజమీందారు గురువు దనయూరనుండి సాగనంపెను. ఆజమీందారునివచనములు గురువునకు గొంతయసంతుష్టినాశాభంగము గలిగించెను. అతఁడు విధిలేక యాయూరువిడిచి దాల్వాసనుగ్రామముజేరి యచ్చట శోధికల్వా లనుసజ్జనుని సాంగత్యము జేసెను. అతఁడు మిక్కిలిపలుకుబడి గలవాఁడు. అతఁడు గురువంశజులకు దాల్వాసనిలిబిడ్డలు విసర్జింపవలసిన దని కోర గోవిందుఁడు సమ్మతించి యాబిడ్డలు పరశురామప్రీతి గావించెను.

తొల్లి యానందపురముసుతురకలుముట్టడించినప్పుడుకొందఱు సిక్కులు గురువుమాటలు కెదురాడి మేము సిక్కులమే కా మని వ్రాసి యిచ్చి లేచిపోయిరి గదా అట్లు వారు గురుద్రోహము జేసి పోయి నపిదప వారిని జుట్టములు కాకులు పొడిచినట్లు పొడిచి తిట్టి చీవాట్లు పెట్టి మరల గురుసేవ జేసి దోసము బాపికొనవలసిన దని నిర్బంధించిరి. అందుచేత వారు పశ్చాత్తప్తులై తాము మున్నుగావించినమహాదోషమునకు ప్రాయశ్చిత్తము గురుచరణసేవయె యని నమ్మి యతఁడున్నచోటు వెదకికొనుచు వచ్చి కొలువులో వెండియుం జేర్చుకొమ్మని పాదములంబడి ప్రార్థించిరి. వారిదీనాలాపములు హృదయమును గరఁగింప గురువు వారికోరిక నిరాకరింప లేక వారిని స్వసైన్యమునఁ జేర్చుకొనెను.

గోవిందుఁడు స్వదేశము విడిచి విదేశములపాలై పోయినను మొగలాయిసైన్యము లాయనను విడువఁదలఁచుకొనలేదు. గోవిందుఁడు మాళవదేశమున నున్నాఁ డని తెలిసికొని సర్ హిందూదేశపరిపాల

కుఁడైన వజీరుఖాను గొప్పసైన్యము వెంటబెట్టుకొని మాళవదేశము జొచ్చెను. సమరప్రీతి గలిగి శత్రువులు వచ్చుచున్నపుడు వారికి సమరభిక్ష పెట్టకపోవుట యధర్మమని గోవిందుఁడు తనస్వల్పసైన్యముతోనె వానినెదిరించి కాలోచితమైనసన్నాహముఁ జేసెను. ఉభయసైన్యములు గలసికొనెను. ఘోరసంగ్రామము జరిగెను. సింగులకన్న తురకలు తురకలకన్న సింగులు శ్లాఘాపాత్రముగఁ బోరు సలిపిరి. విజయంబుతనకు తప్పక సేకూరునని గరువతనముఁ బూనియున్నవజీరుఖాను తప్పక పరాజయము నొందెను. తురకలబలము పోయినపోకగాఁ బోయెను. సింగులు రెండుమూఁడుక్రోసులవఱకు వారిని దరిమికొట్టి వారికి గొప్పనష్టము గావించి లబ్ధవిజయులై వెనుకకు మరలిరి. యుద్ధము ముగిసినవెనుక గోవిందుఁడు పొలికిలను జూడబోయెను. పోయి సీకు యొక్క కళేబరము కనబడగానె యచ్చట కొన్నినిముసము లాగి యతనిం గొండొకప్రశంసించెను. అట్లు పోవబోవ ముంజపస్థానప్రభువును దనపక్షమువాఁడు నగుమానసిం గతనికంట బడెను. అతఁడు చావలేదు. వచ్చెడుప్రాణముతో పోయెడు ప్రాణముతో నవసానదశలో నుండెను. గోవిందునికంఠధ్వని చెవిని బడగానే యారాజు కన్నులు తెరచి యాయనను జూచి మ్రొక్కఁదలఁచెను. కాని చేతులు రాకపోయెను. గోవిందుఁడు జాలిపడినీకోరిక యేమనియతనివడిగెను. అతఁడిట్లనియె. "ఆనందపురమందు నాఁడు ద్రోహులై మిమ్ము విడిచిన యాసీకులపేళ్లు గలకాగితముమీరు చింపివేయుదురేని నాప్రాణము సుఖము గాఁబోవును." అట్లె చేసెదనని గురువుమాటయిచ్చి తనవాగ్దానప్రకారము గావించెను. ఆడితప్పనివాఁడగుటచేతనే గురుగోవిందునియందు శిష్యుని కంతభక్తి గలిగెను.

కుమారవీరులు.

గురుగోవిందుని నలుగురు కొడుకులలో మొదటి యిద్దఱు కుమారులు సంగ్రామ నిహతులైరని యిదివఱకే చెప్పబడియె. నాడు సరానదీతీరమున గోవిందుఁడు శత్రువులకోడి పాఱిపోవునప్పుడు యతని తల్లిని నిల్లాండ్రను చిన్నకొడుకుల నిరువురను సేవకు లెట్టెటో బహు కష్టముమీఁద నది దాటించి పగతురబారినుండి తప్పించిరి గదా. ఆయన భార్యలు చనినదారినే తల్లియు నిరువురుకొడుకులుఁ బోవ యత్నించుచుండ వారి యింటఁ జిరకాలమునుండి సేవకుఁడు గనున్న నొక బ్రాహ్మణుఁడు గోవిందమాతను జూచి తన యూరిక్కడకు సమీపమున నున్నదనియు నామె మనుమలను దోడ్కొని తనయింటికి వచ్చిన యెడల వారు సురక్షితముగ నుండవచ్చుననియు నామెకు నచ్చచెప్పి తనగ్రామము వచ్చునట్లామె నొడంబఱచెను. చిరకాలమునుండి తమ్ము సేవించుచు దమబిడ్డవలెనున్న యాబ్రాహ్మణుని యుపదేశము తమకు క్షేమకరమని తలంచి యా యవ్వ కోడండ్రను దక్కిన పరిజనంబును బోయిన దారిని బోవక యాబ్రాహ్మణునితో జనెను. గ్రామము జేరునప్పటికి రాత్రియయ్యెను. ఆయవ్వకు మనుమలకు బ్రాహ్మణుఁడొకగది యిచ్చి యాహార మిడి యోపినకొలఁది సపర్యలు చేసి పండుకొనుట కొక గడ్డిపఱు పిచ్చెను. మార్గాయాసఖిన్నులై మనోవేదనాపీడితులై యున్నకతమున నాబాలకులిరువురు కన్నుమూసి వెంటనే నిద్రించిరి. ఆముసలమ్మదగ్గర కొంతరొక్కము కొన్నినగలు నుండుటచే నామె నిద్రింపక మేలుకొనియుండఁ దలఁచెను. కాని యట్లుండుట కామెతరమా? కొంతసేపటి కప్రియత్నముగ నతనికన్నులు మూతలువడెను. మువ్వురు గుఱ్ఱుపెట్టి నిద్రపోయిరి. అప్పుడా బ్రాహ్మణుఁడు చప్పుడుగాకుండ బొటనవ్రేళ్ళమీఁద నడచి గదిజొచ్చి యొడలు

మరచి నిద్రించుచున్న యాయవ్వతల యొత్తిగించి తలక్రిందనున్న నగలపెట్టె సంగ్రహించి యది దొడ్డిలో నొకచో బాతిపెట్టి తన మీఁద ననుమానము లేకుండునట్లు దొంగలు దొంగలని పెద్దపెట్టున నరచెను. ఆకూయి విని గోవిందమాత యదరిపడిలేచి పెట్టెవెదకికొని కానక విప్రుని దనయెదుట నిలువంబెట్టి తత్క్షణమే తనపెట్టెఁ దెచ్చి యిమ్మని కఠినముగ నడిగెను. అట్లడుగుటకుఁ గారణమేమన దొంగలు పడినజాడ లేమియు నామెకు గనబడలేదు. మీఁదుమిక్కిలి పాఁపనివాలకము మాటలతీరు జూడ నామె కనుమానముదయించెను. అప్పలుకులువిని యక్కపటబ్రాహ్మణుఁడు తొల్లింటివినయమును గౌరవంబును విడిచి "యేమేమీ! నాయింటికివచ్చి నాకెదురుదొంగతనముగట్టెదరా. ఇఁకనవంటిమాట లన్నయెడ జాగ్రత్త" యని బెదిరించెను. ధనముపోయినబోయెఁగాక దుష్టబ్రాహ్మణుఁ డేమి దౌర్జన్యము చేయునో యని భయపడి లోకానుభవముగల యావృద్ధాంగన శాంతభావము వహించి "నీకు దొంగతనము గట్టలేదు. దొంగలు వచ్చినప్పుడు నాపెట్టె జాగ్రత్తపెట్టితివేమో యనుకొని మునుపు నీయెడ నాకుగల చనువుచేత నట్లంటి"నని ప్రత్యుత్తరమిచ్చెను. ఆదురాచారుఁడు దొంగిలించిన సొమ్ము తనకు దక్కునో దక్కదో యని సంశయించి వారి నెట్లయిన గడతేర్చినగాని తనకు సేమములేదని కనిపెట్టి వారిని వదలించుకొనునుపాయము వెదకి తత్క్షణమే యిల్లువిడిచి గోవిందునియెడల నతిద్వేషము బూనిన యిరువురు కరకుతురకల వెంటబెట్టుకొనిపోయి యాగదిలోఁబ్రవేశపెట్టెను. ఆదురాత్ములు బాలకుల నిరువురను బలవంతముగఁ దీసికొనిపోయిరి. ఆఘోరకృత్యముజూచి గోవిందమాతమూర్ఛబోయెను. మూర్ఛబోవుగాక మృతినొందుగాక ఆమెజోలితురకలకు గావలెనా? దుష్టబ్రాహ్మణునకుఁ గావలెను. ఆమహమ్మదీయు లాబాలకులను, దోడ్కొనిపోయి సర్హిందూపరిపాలకుఁడైన వజీరుఖానున

కప్పగించిరి. వజీరుఖాను మున్నుగు మహమ్మదీయులకు గోవిందుని మీఁద నెంత ద్వేషముగలదో యతనిబిడ్డలమీఁదను నతనివాండ్ర మీఁదను నతనియనుచరులమీఁదను వేయేల నతనికుక్కలమీఁదఁ గూడ నంత ద్వేషము కలదు. అందుచేత నతనిచిన్నబిడ్డలు దొరకుట వజీరుఖానునకు నిక్షేపము దొరికిన ట్లుండెను. ఆయిరువురిలో బెద్ద వాఁడు పండ్రెండేండ్లవాఁడు. రెండవయతఁ డెనిమిదేండ్లవాఁడు. పెద్ద వానిపేరు జోరావారసింగు. రెండవవానిపేరు పతేసింగు. ఆకుమార సింహములను దనయెదుటకు రావించి మీరు మహమ్మదీయమతము స్వీకరించినచో మీప్రాణములు నిలుచును. లేనియెడల మిమ్ములను జంపించెదనని కఠినముగ బలికెను. ప్రాయమునబండ్రెండేండ్లయర్భకు డయ్యు శౌర్యమున నతివృద్ధుఁడగు జోరావారసింగు నిర్భయముగాను నిశ్శంకముగానువానికిట్లనియె. "పతితులను నజ్ఞానులను నుద్ధరించుటకై యీదేశమున గురునానకు నెలకొలిపిన పరిశుద్ధాస్తికమతమునందే మాకు విశ్వాసముగలదు. సత్యము జయించుకొఱకును హిందూజాతి వృద్ధిపొందుటకును మనఃపూర్వకముగ దనప్రాణములు బలియిచ్చిన మహానుభావుఁడగు తేజబహదూరు యొక్క సంతతివారము మేము. సత్యమునిమిత్తము భగవంతుని నిమిత్తము తనసర్వస్వము గోలుపోయిన గురుగోవిందునిపుత్రులము. అట్టియుత్తమరాజవంశాంకురములగు మేముతురకలమత మవలంబించుట? ఇది ఈశ్వరేచ్ఛకువిరుద్ధము చేయుట మాపితృపితామహులయొక్కయు మావంశముయొక్కయు పేరు చెడగొట్టుట. మే మిప్పుడు తురకలమైనయెడల బ్రతుకవచ్చు భాగ్యవంతులము కావచ్చు కాని యెప్పుడో యొకప్పుడు చావక చిరంజీవులము కాగలమా?, ఇంతమాత్రమునకు మేము స్వమతద్రోహుల మేలకావలయును? ఆడింభకులు తనవంటివాని కట్టిప్రత్యుత్తర మొసంగుదురని ఖాను తలంపలేదు. ఆయుత్తరము వినగానే యతఁడు కోప

ఘూర్ణిత నయనుఁడై కోపావేశమున గద్గదస్వరుఁడై యీబాలకులను దీసికొనిపోయి తల తెగవేయుఁడని యానతిచ్చెను. ఆ బాలకులు సుకుమారశరీరములు ముద్దుబుమూటగట్టుమొగములు వీరరసగర్భితములైనమాటలు సభాస్థాయుల హృదయములు గరిగించెను. ఆసభలో నున్న మీరుమహమ్మదుఖా ననునట్టి గొప్పతురక మిక్కిలి జాలిపడి యాఘోరకృత్యము జేయవలదని వారించెను. వజీరుఖానుఁ డతనియుపదేశమున దాఁదలపెట్టిన దుష్కార్యము మానదలఁచెను. కాని శచీచంద్రుఁడనెడు నొకహిందువుఁడు గురుగోవిందుని శత్రుఁడు వజీరుఖానున కాప్తుఁడు లేచి యిట్లనియె. "పాముం జంపి పిల్లలను విడుచుట వివేకమా? అవి పెరిగి కాలక్రమమున గొంపతీయవా." అప్పలుకులు విని వజీరుఖాను బాలకులం జూచి మహమ్మదీయమతము స్వీకరింపవలసినదని మరల కోరెను. ఆపలుకులకు వారు మునుపటికన్న కఠినముగ బ్రత్యుత్తరమిచ్చిరి. అప్పలుకులు దుస్సహము లగుటయు వజీరుఖాను కోపము పట్టజాలక యీబాలకులను పునాదిలో వైచి వారిమీఁదఁ గోడకట్టుఁడని యాజ్ఞాపించెను. అతనినోట నమ్మాట వచ్చుటే తడవుగ సేవకు లామాణవకులను గెంటుకొనిపోయి ప్రాతగోడయొకటి పడగొట్టి పునాదిత్రవ్వి బాలకుల నందు బడవైచి గోడకట్టమొదలుపెట్టిరి. గోడ మోకాళ్ళవఱకు వచ్చునప్పటికి వేడుక చూచుటకై వచ్చిన వజీరుఖాను వారిని జూచి యిప్పుడైనను మీరు తురకలైనయెడల మిమ్ము గాచెదనని యాసగొలిపెను. చచ్చెదముగాని మతము విడువమని వారు గంభీరముగ బలికిరి. అట్లయిన జావుఁడని యాతఁడు వెడలిపోయెను. గోడగుండెలవఱకు వచ్చునప్పటి కెనిమిదేడులయీడు గలఫతేసింగు మిక్కిలి యాయాసపడి కొంచెము భయపడెను. అది కనిపెట్టి భయమెట్టిదో యెఱుఁగనిజొరవారసింగు "వత్సా! ఫతేసింగు భయపడకు. వహా గురూజీకే ఫతే యనుమాటలు స్మరించుకొనుము.

నీశరీరములో మహావీరులైన మనపితృపితామహులరక్తము ప్రవహించుచున్నది. వీరమాతవైన మనయమ్మపాలు త్రాగినందుకు పిరికితనము జూపి నీవప్రతిష్ఠ తేకుము" అని, యెల్లవారు నచ్చెరువడపలికెను. అనంతరము గోడస్తికంఠముమీఁదను మొగముమీదను గట్టబడ క్షణముసేపు వాపోయిరి సలుపక బాధపడి భౌతిక దేహములు విడిచియశః కాయముల దాల్చిరి. ప్రపంచమునందు బాలకు లనేకులు పగతురచేఁ జిక్కి దుర్మరణమునొందిరి. కానియింతపరమశాంతముతో నింతమహాధైర్యముతో నింతస్వమతవిశ్వాసముతో మృతినొందినవారు లేరు. ఈడు జూడ నెన్మిదేండ్లవాఁ డొకఁడు. పండ్రెండేండ్లవాఁ డొకఁడు. వారినోట వెడలినమహాద్భుతవచనములు వయసుచెల్లిన శూరశిఖామణులకైన లోకోత్తరమైన గౌరవమును సముపార్జించినవి. అట్టిమహాశూరులను గన్నతల్లి యెతల్లి. తండ్రియెతండ్రి. ఆగుణరత్నములు జన్మించినవంశమేవంశము. ఈమహాపురుషులచరిత్ర మింతటితో విరమించి వీరికీదుర్గతి దెచ్చినయాబ్రాహ్మణుని నొక్కమాఱు దలంచుకొనుఁడు. వాఁడు బ్రాహ్మణుఁడా? వానికన్న కటికివాఁడు వేయిమడుఁగు లుత్తముఁడు. వానికన్న కుక్కనుతినుఛండాలుఁడు పూజ్యుఁడు. వానికన్న గోహంతకులు మంచివారు. ఆపాపాత్మునివంటి కృతఘ్నులు లోకమునలేరు. చిరకాలము గురుగోవిందునియింటనుండి వానిసొమ్మె దినితుదకు వానితల్లిని బిడ్డలను వంచించి తనయింటికే తీసికొనిపోయి ధనము హరించి పసిబిడ్డలను పగవారికప్పగించి మహాపాతకముసల్పి గట్టినయాదురాచారునిగుండె రాయి గాని హృదయముకాదు. వానిఁ దలచుటయు పాతకమే. పితామహి మనుమలదుర్గతి విని తలఁగోడకు గొట్టుకొని ప్రాణము వదలెను. తనచిన్నబిడ్డలయొక్కయు దల్లియొక్కయు దుర్మరణవార్త విని ధైర్యసంపన్నుఁడును జ్ఞాననిధియు నైన గురుగోవిందుఁడు కంటఁ దడిపెట్టక పరమేశ్వరుని యిచ్ఛ జరుగుఁగాక యని భక్తిజ్ఞానప్రదము లైనకొన్నిపద్యములఁ జెప్పియూరకుండెను.

వజీరుఖానుతో జరిగినయుద్ధమున నిహతులైనస్వజనులకు దహనసంస్కారములు చేయించి తన్నుగురించి ప్రాణములు విడిచిన జోదులపేరులు జ్ఞాపకముండున ట్లాస్థలమున నొకయూరుకట్టి దానికి ముక్తిసరమను పేరుపెట్టి యనంతర మతఁడు దేశాటనమున కరిగెను. ఈసంచారమున నతఁడు పెక్కుగ్రామములు చూచెను. కొన్నియూళ్ళజనులతనిని మిక్కిలి గౌరవించిరి. కొన్నియూళ్ళవారు తిరస్కారభావము జూపిరి. ధనము తగినంత లేకపోవుటచే సైనికులకు జీతమిచ్చుట యాలస్యమగుచు వచ్చెను. అందుచేత సైనికులు గోలపెట్టిరి. ధనము దగ్గఱనున్నప్పు డాయన దాచుకొనక యెప్పటికప్పు డతఁడు జీతము లిచ్చుచుండెను. లేనప్పుడు కొంచె మాలస్యమగుచువచ్చెను. దివానుసింగనునతఁడుమాత్రము తనకు జీత మక్కఱలేదనియు గురుపాదసేవయె గొప్పజీతమనియుఁ జెప్పెను. ఈప్రయాణములలో నొక తురకఫకీరతనిని సందర్శించి సీకుమతములోఁ జేరదలఁచుకొనెను. అతఁడు మ్లేచ్ఛుఁడని సందేహింపక గోవిందుఁడు తమతమసిద్ధాంతముప్రకార మతనిని శుద్ధుంజేసి స్వమతమునఁ గలుపుకొని వానికి జమీరుసింగని పేరుపెట్టెను. అనంతరమాయన కొంతకాలమునకు నానకు జన్మభూమియైన తాల్వెండి జేరెను. చిరకాలముక్రిందట నెడబాసినకుటుంబ మాయన నక్కడ కలిసికొనెను. కొడుకులందఱు గతించుటచే గోవిందునిమనస్సు పరిపక్వమై యైహికవాంఛలువిడిచి పారలౌకికవిషయములమీదనే నిలిచెను. తాల్వెండినుండి యతఁడు దండమయమనుగ్రామముఁ జేరెను. దండమయమను పేరు గోవిందుఁడే పెట్టెనని కొంద ఱందురు. ప్రాతపేరేయని కొందఱందురు. ఈగ్రామమునందుండఁగా మొగలాయిచక్రవర్తియగు నౌరంగజేబు తనదర్బారునకు రమ్మని యతనినాహ్వానముచేసెను. మొట్టమొదట మెత్తపడి యతఁడు వెళ్ళదలఁచెను కాని పౌర్వాపర్యములు విమర్శించినతరువాత

హిందూమతద్వేషియైన యాతనిసన్నిధికిఁ బోవుట శ్రేయముగా దని మానుకొనెను. ఔరంగజేబు తనప్రయత్నము మానక తనకొలువునకు రమ్మని మరలసందేశ మంపెను. ఆసందేశమును గూడ నతఁడు నిర్భయముగ నిరాకరించెను. మొగలాయిదర్బారునకుఁ బోవుట తనకిష్టము లేదని యౌరంగజేబున కతఁడు పద్యరూపముగ నొకజాబువ్రాసెను. ఆజాబుకొంత పారసీకభాషలోను కొంతపంజాబుభాషలోను నున్నది. దానిపేరు జాఫరునామా యందురు. జాబనఁగా బడిబంతులవ్రాత గాదు. అది యొకచిన్నగ్రంథము. ఆకండముగా గ్రామములో నున్నకాలమునను గురుగోవిందుఁడు సిక్కులవేదమైన యాదిగ్రంథమును తిరుగ వ్రాయించెను. పూర్వగ్రంథములోఁ దనయొక్కయుఁ దనతండ్రియు దొమ్మిదవగురువుపగు తేజబహదూరుయొక్కయు నుపదేశములు లేవు. అవి చేర్చి యితఁడు గ్రంథము సమాప్తముచేసెను. ఇదిగాక విచిత్రనాటక మని యతఁడు మఱియొకగ్రంధము చేసెను. ఇది వెనుకటి తొమ్మండ్రుగురు గురువులయొక్కయుఁ దనయొక్కయు చరిత్రము. ఈవిధముగ నతఁ డిహలోకసౌఖ్యపరాఙ్ముఖుఁడై స్వమతవ్యాప్తి జేయుచు ధర్మమార్గపరాయణుఁడై యుండెను.

గోవిందునిశత్రువులబలము మహాసముద్రమువలె పారములేనిది. అతనిసైన్యము మిక్కిలి స్వల్పము. సిక్కు లెంతధీరులైన. నెంత శూరులైన సంఖ్యలో నధికులైన మహమ్మదీయులముందర నిలువఁ గలరా. ఇరువురసైన్యములు సమానసంఖ్య గలిగినప్పుడు సిక్కు శౌర్యము పగరకు దుస్సహమైయుండును. సైన్యము కావలెనన్న ధనము కావలెను. అతనియొద్ద ధనములేదు. సైన్యములేదు. కాని హృదయమున దేశాభిమానము స్వమతాభిమానముమేరమీఱియున్నవి. ఎన్ని యభిమానములున్ననేమి ధనమూలమిదంజగత్తనుమాట నిజము. ఈ ధనదారిద్ర్యము సైన్యదారిద్ర్యము దీర్చికొని మొగలాయిసైన్యము

లతోఁ బ్రతిఘటించి నిలచి హిందూస్థానమునఁ దనమతము బాదు కొలుపుటకై యతఁడొక్కయుపాయమాలోచించెను. రాజపుత్రులు మహావీరు లనియు వారిలో ననేకులు దేశమునిమిత్తము మతమునిమిత్తము ప్రాణములువిడిచి రనియు మొగలాయిచక్రవర్తికి నిత్యవిరోధు లనియు నతఁడు వినుచుండుటచే వారియొద్దకుఁబోయి తనయవస్థ వారికెఱిఁగించినపక్షమున వారు తప్పక తమపక్షముఁ బూని తనకు ధనము సైన్యము నిత్తురనియు వారొకవేళ నిరాదరము జూపినపక్షమున స్వదేశోద్ధరణమునిమిత్తమై నెత్తురు ధారవోయుచున్న మహారాష్ట్రులు తనకు మహోపకారముఁ జేయుదురనియు నతఁడు తలంచి మొట్టమొదట రాజపుత్రస్థానమునకుఁజనెను. రాజపుత్రప్రభువులలోని కొందఱు మొగలాయీలకువిధేయులై చక్రవర్తిమాట జవదాటకుండిరి. కొందఱు చక్రవర్తితోఁ బోరాడుచుండిరి. ఈర్ష్యాసూయలచేఁ బ్రేరితులై కొందఱు స్వజనస్వదేశనాశనము జేసికొనుచుండిరి. గురుగోవిందుఁడు సందర్శించినప్పుడు వారాయనయెడఁ దిరస్కారభావము జూపక మిక్కిలి గౌరవించిరి. కాని తమవ్యవహారములె తమకు సరిపోవుచుండుటచే వా రాయనకు ధనసహాయముగాని జనసహాయముగాని చేయఁజాలరైరి. అక్కడస్థితి తనకనుకూలముగ లేకపోవుటచే గోవిందసింగు రాజస్థానము విడిచి దక్షిణాపథమునకుఁ బయనమై మహారాష్ట్రదేశము జొచ్చెనుకాని యప్పటికి వైదికమతోజ్జీవకుఁడైన శివాజీమహారాజు వానికుమారుఁడైన శంభాజీయు మృతినొందుట చేతను శివాజీమనుమఁడైనసాహూ ఢిల్లీచక్రవర్తిచేత వధింపఁబడుట చేతను మహారాష్ట్రసామంతులు భిన్నాభిప్రాయులై పరస్పరవిరోధములు గలిగియుండుటచేతను గోవిందునకు రాజస్థానమున నెంతయాలంబనము గలిగెనో మహారాష్ట్రమునఁగూడ నంతియె యాలంబనము గలిగెను. అతఁడు సాగూ రనుపట్టణమున నుండఁగా హిందూమతని

రంతరద్వేషియు గోవిందునకు మనశ్శూలము నైనయౌరంగజేబు చక్రవర్తి దక్షిణదేశమునందు మృతినొందెనని యాయనకు తెలిసెను. అంతటి మహావిరోధిపోయినాడని విన్నప్పుడాయన సామాన్యమానవునకు వలె మితిమీరిన సంతోషము నొందక పరమశాంతముతో నవ్వార్త నాలకించెను.

బహదూరుషా.

నిజసోదరులరక్తము కంటజూడకుండ స్వకుటుంబనాశనము జేయకుండ నొకరిద్దఱుతప్ప సింహాసన మెక్కిన మొగలాయీచక్రవర్తులు లేరు. షాజహాను గద్దెనెక్కినప్పుడు తనయన్నదమ్ములనందఱను గత్తి కెఱజేసెను. షాజహానుయొక్క నలుగురుకొడుకులు తండ్రిచావకముందె రోగపీడితుండై నంతమాత్రమున జక్రవర్తిపద మాక్రమించుకొనవలెనని యన్యోన్యసంహారణదీక్షితులై ఘాతుకమృగములవలె బోరాడిరి. మూర్ఖుఁడైనమురాదును ధైర్యశాలియైనదారాను వారికొడుకులను వేయిమాటలేల తనకన్నతండ్రిని గూడ గారాగృహమునఁ బెట్టించి చంపించెను. అవశ్యం పితాచార మన్నమాట మొగలాయికుటుంబమునందు నిక్కమైనట్లు మఱియే కుటుంబమునందుఁ గాలేదు. షాజహానుయొక్క యాచార మౌరంగజేబ వలంబించెను. ఔరంగజేబుయొక్క పద్ధతి నతనికొడుకు లవలంబించిరి. ఆచక్రవర్తి కాలధర్మము నొందునప్పటికి వానికి ముగ్వురుకొడుకు లుండిరి. పెద్దవానిపేరు ముజాము, రెండవవానిపే రజాము. మూడవవానిపేరు కామరభక్షు. ఔరంగజేబు తనతమ్ముఁడైనమురాదు నెట్లువంచించెనో యజాము తనతమ్ముఁడైనకామరభక్షునట్లు వంచించి చెఱబెట్టించి తుదముట్టించి యన్నగారైనముజాము సింహా

నన మొక్కకుండఁ జేయవలె నని ప్రయత్నించెను. తండ్రిపోవునప్పుటికి ముజాము గాబూలులో నుండెను. పితృమరణవార్త వినినతోడనె తనతండ్రివలన దనపెదతండ్రి కైన దారాకు నెట్టియవస్థ సంభవించెనో యట్టియవస్థయె తా నాలస్యము చేసినయెడఁ దనకుగూడఁ సంభవించునని భయపడివెంటనే ఢిల్లీకి బయనమయ్యెను. హిందూస్థానము జేరినతోడనే ముజాము ముందుగా నొక తెలివైనపని జేసెను. తనతండ్రికి విరోధి యైన దేశమున మిక్కిలి పలుకుబడి గలిగిన గురుగోవిందుసింగు యొక్కస్నేహము సంపాదించుకొనుట తనకు శ్రేయోదాయకమని యతఁడు తలచి తనకు సహాయముచేయుమని కోరుచు నతనియొద్దకిద్దరు హిందూరాయబారుల నంపెను. గోవిందసింగునకుముజాముగద్దెమెక్కిననునజాముగద్దెమెక్కిననునొక్కటె. అయిననుత్రువైన యౌరంగజేబుకొడుకులలో నొకనికిసాయముచేసిన రెండవవానినిగడ తేర్చుటకొంతశత్రునాశనము చేయుటయెయని తలంచి యతఁడు ముజామునకు సహాయముచేయ నిశ్చయించెను. అజాము ముజాముల కాగ్రానగరమునొద్ద గొప్పయుద్ధము జరిగెను. గోవిందసింగు తన సైన్యముతో ముజాముపక్షము చేరి యతనికి విజయము కల్పించెను. ఇం దతిశయోక్తి లేదు. గురుగోవిందుని వింటినుండి వెడలినయొకబాణము హౌదాలో నున్నయజామునకుఁ దగుల నతఁడు మృతినొందెను. నాయకుఁడు మృతినొందగానె సైన్యమంతయు చెల్లాచెదరయ్యెను. ముజాము బహదూరుషా యనుబిరుదుతో ఢిల్లీచక్రవర్తి యయ్యెను. గురుగోవిందు గావించినమహాసహాయము మనసులో నుంచుకొని బహదూరుషా వానియెడ మిక్కిలి కృతజ్ఞుఁడై యతని కొక్కజాగీరు నిచ్చెననియుఁ దనకు జాగీ రక్కఱ లేదని గోవిందుఁడు నిరాకరించె ననియుఁ జరిత్రకారులు వ్రాసియున్నారు. తనచిన్నబిడ్డలను దుర్మరణము పాలుచేసిన కొండరాజులను వజీరు

ఖానును దనకుఁ బట్టి యప్పగించవలసినదని గోవిందసింగు గోరెనట. ఒకసంవత్సరముగతించినతరువాత నట్లు చేయుటకు చక్రవర్తి యొడం బడెనట. కాని చక్రవర్తి వారి నెన్నఁడుబట్టి యప్పగింపలేదు. గోవిందసింగు బహదూరుషాయొద్దనె కొంతకాల ముండెను. ఆచక్రవర్తి దక్షిణదేశమునకు దండు వెడలినప్పుడు సిక్కుగురువు కూడ నిజ సైన్యముతో వానివెంట జనియెను. ప్రతిపక్షురను దనకుపట్టి యప్పగింపక పోవుటచే గురువునకు బహదూరుషామీఁద కోపము వచ్చెను. ఆపని చేయజాలనందుకు బహదూరుషా మిక్కిలి చింతించి కావలయునంత ధన మిచ్చెదనని సింగుతోఁ జెప్పెను. కాని సింగు ధన మక్కఱలే దని నిరాకరించి మొగలాయిసైన్యమును విడిచి తనబల మును దీసికొని వెడలిపోయెను. బహదూరుషా చక్రవర్తియై సింహాసనముమీఁద స్థిరముగాఁ గూర్చుండెను. కావున గురుగోవిందు వెడలి పోయినను నతనికి భయము లేదు. ఏరు దాటి తెప్ప తగులవేయు స్వల్పమతులు లోకమున నెందరో గలరు. అందులో బహదూరుషా యొకఁడు.

బాందుఁడు.

గోవిందసింగు చక్రవర్తిసైన్యమును విడిచి దక్షిణదేశమున గ్రుమ్మరుచుండఁగా గోదావరితీరమున నాదరనునొక గ్రామముఁ జూచెను. అది గౌతమీతీరమున మిక్కిలిసుందరమైనస్థానమున నుండుటచే నచ్చట కొంతకాలము వసియింపవలెనని నిశ్చయించుకొని కొంతప్రదేశము ధనమిచ్చి విలిచి యచ్చట కొన్నిమందిరములు గట్టి యందుఁ గాపురముండెను. అచ్చట నుండఁగా నొకనాఁడొక బైరాగి యాతని సందర్శించెను. ప్రసంగవశమున గోవిందుఁ డత

నితో హిందూమతమునకు మహమ్మదీయులు చేసినదుర్ణయములను జెప్పి ధైర్యముతో తమపక్షము బూని పనిచేయువారు లేరని విచారించెను. ఆకార్యమునందుఁ దన్ను నియోగించినపక్షమున దాను తురకలతో బ్రతిఘటించి స్వమతరక్షణము చేయఁగల నని చెప్పెను. ఆతనిపేరు బాందుఁడు. అతఁడు దృఢమనస్కుఁడు. గొప్పశరీరదార్ఢ్యము గలవాఁడు. ఆతనిశరీరదార్ఢ్యమును మనోనిశ్చయమును జూచి యమ్మహాకార్యభార మతఁడు వహింపఁ జాలు నని చేయవలసినపని పంజాబుదేశమందుండుటచే గొన్నిజాబులు వ్రాసియిచ్చి యతని నాదేశమున కంపెను. బాందుఁడు పంజాబున కరిగి సిక్కులం గలియఁగట్టుకొని ముందుగా సర్హిందుమీఁదికి బోయెను. గోవిందసింగునియొక్క చిన్నబిడ్డలను, గోడపునాదిలో నైచి దురాత్ముఁడైన వజీరుఖాను వారిమీఁద గోడపెట్టించిన దిచ్చోటనే యని యాయూరుపేరు వినఁగానే యీనాటకమునకే దుర్వారవిషాదము గలుగుచుండఁగా బాందునకు విషాదక్రోధములు గలుగుట యాశ్చర్యము కాదు. సర్హిందులో నడుగుపెట్టినదిమొదలుకొని బాందుఁడు కనబడిన యిల్లెల్లగాల్చి యీమతస్థుఁడామతస్థుఁ డనక దొరికినవారినెల్ల గత్తికెఱజేసి యతిఘోరముగ విహరించెను. రెండుమూఁడుదినములలో పట్టణమంతయు భస్మపటల మయ్యెను. అతని నామశ్రవణము ప్రాంతభూముల వసియించువారికి హృదయనిర్భేదక మయ్యెను. ఆతఁడు సర్హిందు విడిచి వచ్చుచున్నాఁడని వినఁగానే దారిలో నున్నపల్లెయలజనులు గృహారామక్షేత్రములు విడిచి యడవులలో దాఁగొనబోయిరి. సర్హిందూనగరనాశనమైనతరువాత నతఁడు సట్లెజీబియాసునదులు దాటి బాటలనగరవినాశనమున కరిగెను. ఆపురపరిపాలకుఁడైనషేకువులుహాదు నగర మెంత కాపాడినను తుదకది బాందునిచేత బడియెను. పురపరిపాలకుఁడు యుద్ధములో మృతినొందెను. ఆపట్టణము

నబాందుఁడు మొట్టమొదటఁ గాల్చినయిల్లు ఖాజియబ్దుల్లాది. దీనిం బట్టి మహమ్మదీయులయెడ నెంత ద్వేషమున్నదో తెలియవచ్చును. అక్కడనుండి యతఁడు లాహోరునకుఁ బోయి యాపట్టణముగూడ నిప్పులకుప్ప జేసెను. అనంతర మతఁడు రావీనది దాటి జామునగరమునకుఁ బోయెను. అప్పటికి బహదూరుషా చక్రవర్తి మృతినొందెను. ఫెరుక్సియరు ఢిల్లీపాదుషా యయ్యెను. అతఁడు బాందునియొక్క దుండగములను విని పంజాబుపరిపాలకుఁడైనయబ్దులుసమ్మదనువానిని బాందుని బట్టుకొమ్మని పంపెను. అతఁడు గొప్పసేనతో నతనిమీఁదికి బోయెను. కాని బాందునిప్రతాపాగ్ని యతనిముందర చల్లబడియెను. అతఁడు పరాజితుఁడై కోటలో డాఁగొనవలసివచ్చెను. మొగలాయీలు ముట్టడించి యూపిరి పుచ్చుకొనుటకైన నెడమీయనందున బాందుఁడు కోటలోనుండి పాఱిపోవుటకు వీలులేక పోవుటకు సామర్థ్యము లేక శత్రువుంచేతిలోఁ జిక్కెను అతనిని బట్టువడిన తక్కినవారిని పంజాబుపరిపాలకుఁడు ఢిల్లీకిపంపెను. అవ్వల బాందునియొక్క దుర్గతి నేమని చెప్పవచ్చును. ఎన్నిచిత్రవిధముల నరునిజంపవచ్చునో యన్నివిధములాతనియెడ ప్రయోగింపబడెను. అతఁడు తనస్వహస్తములతో దురకలయాజ్ఞాప్రకారము కన్నకొడుకులను చంపవలసివచ్చెను. అట్టిసమయమున నైనమతఁడు కంటదడివెట్టక చేయి వడకనీయక యతిధైర్యముతో నిలిచి యీదారుణకృత్యము నెరవేర్చెను. తరువాత నతనిచర్మ మొలిపింపవలసినదని చక్రవర్తి యాజ్ఞాపించెను. కరకుతురకలు కత్తులతో జర్మము చీరి మేను నారింజపండువలె యొలుచునప్పుడున నైనమతఁడు దుఃఖపడక దయదలఁచి రక్షింపుమని దేవురింపక మూలుగక పర్వతమువలె నిలిచి యీబాధ సహించి దారుణమరణము నొందెను. బాందుఁడు ధైర్యమునను గాంభీర్యమునను బాధాసహనమునను శ్లాఘాపాత్రుఁడే కాని యతఁడు చేసిన దారు

ణకృత్యముల కతని నెవ్వరు క్షమింపజాలరు. పంజాబు దేశమున నతఁడు నెరపినవి రాక్షసకృత్యములు కాని నరకృత్యములు కావు. అతని స్వమతాభిమానమున్నట్లు గనబడ లేదు. విమత ద్వేషమున్నట్లు కనబడ లేదు. ఏలయన నతఁడు హిందువులను మహమ్మదీయులను సమానముగ హింసించెను. ఎంతమతాభిమానమున్నను, నెంతపరమ తద్వేషమున్నను వజీరుఖానుని దౌర్జన్యముల గ్రహించినట్లు యితని దురాచారములనుగూడ నాగరకులందఱు గ్రహింపవలసి యుండును. గురుగోవిందుఁడు పంజాబునకు వానిని బంపునపుడు వానిచేత నాలుగు శపథములు చేయించెను. 1 మంచి నడత నడచి పవిత్రుఁడవై యుండుము. 2 అబద్ధమాడకుము. 3 గురువులవలె గద్దెనెక్కి కూర్చుండకుము. 4 క్రొత్తమతము స్థాపింపకుము. సిక్కులందఱు నీ సోదరులు నీసమానులు నని భావింపుము. ఈశపథము లతఁడు పాటించినట్లు కనబడదు. పురములు పరశురామప్రీతి సేయుమనియు శత్రుమిత్ర విచక్షణలేక యెల్లవారిని హింసింపవలసినదనియు గురు వాతనితోఁ జెప్పియుండలేదు. కావున నతఁడు చేసినదుండగములలో నెంతమాత్రమతనికి భాగములేదు.

అవసానదశ.

గురుగోవిందసింగు గోదావరీతీరమందలి నాందేరుపట్టణమందే మృతినొందెనని చరిత్రకారులనేకులు వ్రాసిరి. గురుగోవిందుఁడు నాదరు పట్టణముననే తనయవసానదశ గడపెను. ఉదయమున,నతఁడుస్నానము చేసి యీశ్వరధ్యానముఁ జేసికొని భజనలుచేయును. మధ్యాహ్నము

భోజనముఁజేసి పేదల కన్నదానము చేయించును. సాయంకాలము శిష్యులకును దన్నుఁ జూడవచ్చువారికిని బ్రహ్మజ్ఞానోపదేశము చేయుచుండును. రాత్రిపగలు భగవధ్ధ్యానముఁజేసి భజనలు చేయుచుండును. ఈవిధముగ నతఁడు గోదావరీతీరమునఁ గొన్నిసంవత్సరములు కాలక్షేపముఁజేసెను. మహావీరుఁడైన యీతనికి శస్త్రమరణమే సంభవించెను. పఠానుజాతివాఁడైన యొకతురక చదరంగ మాడుచుండఁగా నొకనాఁ డాయనను ఖడ్గముతో గడుపులోఁ బొడిచెను. ఈపొడుచుటకు నేఁడు లనేక కారణములు చెప్పుచున్నారు. గురుగోవిందుఁడు తన్నప్పుడలిగి తన్నువిడిచిపోవుటచేత నతఁడు ససైన్యముగ బ్రతికియుండుట తనకు క్షేమముగాదని బహదూరుషా చక్రవర్తి స్వమతస్థునిచేత నీపనిఁ జేయించెనని కొందఱి యభిప్రాయము. ఈపొడిచిన పఠానుజాతివానితండ్రి యేనువేలరూపాయలకు గురుగోవిందునకు గుఱ్ఱమమ్మెను. ధనము దగ్గఱ లేకపోవుటచే గోవిందుఁ డరువుబేరముఁజేసి యప్పుడప్పుడు కొంతసొమ్మిచ్చి పలుమారు వానిని త్రిప్పుచు వచ్చెనఁట. అందుకాతురక కోపించి కత్తిఁబుచ్చుకొని గురుగోవిందుని పైఁబడెను. గోవిందుఁడు వానివ్రేటు తప్పించుకొని తనఖడ్గముతో వానిశిరస్సు నేలఁబడ నఱికెను. అతనికొడుకు గురుగోవిందుని కొలువులో చిరకాలమునుండి పనిచేయుచుండి యతని యనుగ్రహమునకుఁ బాత్రుఁడైయుండెను. అతఁడే పితృమరణమునకుఁ బ్రతీకారముచేయఁ దలఁచియో మఱియేకారణము చేతనో గురుగోవిందుని కోరికంబట్టియే యాతురక పొడిచెనని కొందఱనుచున్నారు. ఏలయన గోవిందుఁడు బిడ్డలులేక శూన్యమైన సంసారముంజూచి విసిగి మరణమునకెదురుచూచుచుఁ దనచే నిహతుఁడైన తురకవాని కొడుకును బిలిచి "నీ తండ్రిని నేను జంపితినిగదా నీవునన్నుఁజంపి పగఁదీర్చికొనరాదా?" యని పలుమారు పలుకుచు వచ్చెనఁట. ఎన్నిమార్లో యాపని జేయుమని

గురువు వానిని బురికొల్పినను వాఁడట్టి దుష్కార్యము జేయఁదలఁచు కొనలేదఁట. కాని యొకనాఁ డాపఠానుకుఱ్ఱవాఁడును గోవిందుఁడును జదరంగ మాడుచుండఁగా గోవిందుఁడు వానికిరోషమెక్కునట్లు తండ్రిం జంపినవానిని జంపలేకపోయితివిగదా యని పరిహాసించెనఁట ఆపరిహాసము భరింపలేక వెంటనే యతఁడు మొలలోనున్న కత్తిందీసి గురువుపొట్టలోఁ బొడిచెనఁట. తురకపిల్లవాఁడు గురువుం బొడిచెనని తెలియఁగానే యాపట్టణమందున్న సీకులందఱు విసవిస యచ్చో టికిఁబోయి పఠానును ముక్కలుముక్కలుగ నరుకయత్నించిరి. కాని గోవిందుఁడు వారిసంభ్రమము వారించి తన పితృమరణంబునకు ప్రతిక్రియ జేసికొనెను. కాని యాబాలుఁడు దోషముఁజేయలేదని చెప్పి వారిని శాంతపరచెను. వెంటనే వ్రణవైద్యులాగాయముకట్టి చికిత్స జేసి యపాయకరమైనది గాదని చెప్పిరి. గాయము మానుపట్టెను. అది సంపూర్ణముగ మానకుండఁగనే గోవిందుఁ డొకనాఁడు తనవిల్లు వంచి యెక్కుపెట్టెను. ఆప్రయత్నములో గాయపుకుట్లు విడిపోయెను. చికిత్స నిష్ప్రయోజనమయ్యెను. అచిరకాలములోనే సీకుమతమునకు దశమగురువును మహావీరుఁడు పరిశుద్ధాస్తికమతప్రచారకుఁడును గాఢదేశాభిమానియు మేటిస్వార్థత్యాగియునైన గురుగోవిందుఁడు పరమపదముఁ జేరెను. ఆయనసమాధి యచ్చటి కనతిదూరమునం దున్న యబ్జుల్ నగరమునం దున్నది. అక్కడి కేఁటేట వేనవేలు సీకులు యాత్రకై పోవుచుందురు. ఈతీర్థవాసుల యన్నపానమునకుఁ గావలసిన ద్రవ్యమంతయు మహమ్మదీయమతస్థులైనను హైదరాబాదు నవాబులే వ్యయము చేయుచుందురని చెప్పుచున్నారు.

గోవిందుని శరీరచ్ఛాయ పచ్చనిది. మేను లావుగానున్నను చేవగలది. అతఁడు వేఁటయందు మిక్కిలి తమకముఁ గలవాఁడు. వేఁటయందు దేహపరిశ్రమలయందు నధికాసక్తిఁగలిగి చాకచక్యము

శరీరబలము పౌరుషము గలవారియం దతనికి మిక్కిలిప్రీతి. అతఁడు మాంసాహారి. సంజాడు లేక యొక్కపూఁటయైన భుజించి యెఱుఁగ డఁట. తఱచుగా నతఁడు వేఁటాడి తెప్పించుకొన్న మృగముల పలల మే భుజించువాఁడుక యఁట. అడవిపందివేఁట యతనికి మిక్కిలియి ష్టము. అతఁడు మిక్కిలి పండితాదరణముఁ గలవాఁడు. పండితులం బలువురఁ జేర్చికొని వారిచే సంస్కృతగ్రంథములను వినుచుండును. సంస్కృతభారతరామాయణముల నితఁడు తరుచుగా చదివించుకొని విని యాపీరుల విక్రమవిహారములు మెచ్చుచుండును. ఆతఁడు హిందీభాషలో గొప్ప కవి. అర్థగాంభీర్యము శబ్దసౌష్టవము గలుగున ట్లతఁడు కవిత్వము చెప్పగలఁడు. వేదశాస్త్రములం జదువుకొనిరమ్మని బ్రాహ్మణుల వారణాసికిఁబంపి వారు మరలరా వారివలన వేదశాస్త్రపురాణములు నుపనిషత్తులు విని సిక్కుసభలలో గూడ సిక్కులజ్ఞానాభివృద్ధి నిమిత్తము వారిచేత నాగ్రంథముల జది వించుచుండును. అతఁడు మిక్కిలి ధర్మాత్ముఁడు. ధనమున్న సమయ మున గొప్పదాత. అతనిదగ్గఱ నొకనాఁడు పుష్కలముగ ధనముం డును. మఱియొకనాఁడుకొ త్తడబ్బైననుండదు. యాచననిమిత్తమాత నికడకు బోవువారు వట్టిచేతులతో నెన్నఁడు జనలేదు. అతనికి ధన కాంక్షలేదు. సైన్యసంరక్షణముకొఱకు, నాత్మసంరక్షణముకొఱకు నతఁడు ధన మార్జించుచుండును. కాని నిలువ జేసికొనిభోగముల ననుభవించుటకొఱకు గాదు. ధనవిషయమున నతఁడెంతనిస్పృహుఁ డో తెలియజేయుటకొక చిన్నకథ గలదు. ఒకనాఁ డొకశిష్యుఁడు రత్నఖచితములై యేబదివేలరూపాయలు విలువగల బంగారుమణి కట్లు తెచ్చి యతనికి సమర్పించెను. అవి తన కక్కరలేదని యాయన యెంతచెప్పినను వినక యాశిష్యుఁడు యవి గురువుచేతిలో బెట్టెను. అవి కొంతసే పుంచుకొని గురువు వానిలో నొకదానిని గోదావరి

నదిలో బడవైచెను. శిష్యుఁడు గురువువారి రిక్తప్రకోష్ఠములు చూచి వగ యేమైనదని యడిగి గంగపాలైనదని విని నీటమునుఁగఁగల బెస్త వాళ్లం బిలిపించి వెదకింపదలఁచినచోటేదియని యడిగెను. గోవిందుఁడు రెండవచేతిమణికట్టుతీసి నదిలో విసిరి పాఱవైచి యదిగో నక్కడ పాఱవైచితి నని చెప్పెను. అది చూచి శిష్యుఁడు మిక్కిలి నక్కజంపడి రెండుమణికట్లమీఁద నాస వదలుకొని వెదకించుటమానెను. అతనికి పండుగలన్న మిక్కిలి యిష్టము. దీపావళి, హోలీ మొదలయిన పండుగ లతనికి మిక్కిలి యానందకరము. ఇతఁడు గొప్పరాజనీతివేత్త. రాజ్యాంగ వ్యవహారజ్ఞానము మిక్కిలిగలదు. ఆర్యుల మతాచారములను నడచునట్టి విదేశీయుల పరిపాలనములో మాత్ర దేశముండఁగూడదని యతని యభిప్రాయము. ఇది మనసులోఁ బెట్టుకొని మొదటినుండి యతఁడు పనిచేసెను. మిక్కిలి భూతదయ చూపఁజాలిన మతస్థాపకుఁడయ్యు నతఁడు కత్తి యేలఁపట్టెనని కొందఱికి సందేహము తోఁచవచ్చును. హిందూమతములో నున్నకొన్ని పద్ధతులను నిరాకరించుటచే గొండరాజులు మొదలగు కొందఱు హిందువులును, మహమ్మదీయమతధర్మములను ఖండించుటచే మహమ్మదీయులును నతనియెడల విరోధము వహించి హింసించుటచే నతఁడు ఖడ్గము దాల్చి తనమతమునంతను వీరరసప్రధానమగుమతముగా జేసెను. కాని లేనిచో నతఁడు నానకువలెమతబోధలలోనే కాలముబుచ్చి యుండును. కత్తిబట్టుట యతనితప్పు గాదు. ఆయన మరణసమయమున శిష్యులు చుట్టుంజేరి తరువాత మతగురు వెవ్వరని యడిగిరి. యిఁకమీఁద గురువెవ్వరు నుండఁగూడదు. భగవంతుఁడే గురువు. భగవదర్పితమైన యాదిగ్రంథమే గురువు. ఇంతకంటె గురువులు లేరు. ఇఁకమీఁద మానవగురువుపాదములకు మీరు నమస్కారము లెన్నడు చేయవద్దని యతఁ డుపదేశించెను.

ఇట్టిమహాపురుషులు ప్రపంచమున నరుదుగ జన్మించుచుందురు. ధర్మసంస్థాపనమే వీరిసంకల్పము. లోకానుగ్రహమే వీరిపరమావధి. ఇతఁ డసాధారణమేధావంతుఁడనియు రాజతంత్రజ్ఞుఁడనియు నాంగ్లేయచరిత్రకారులు వ్రాసియున్నారు. భారతమాతృగర్భమున నిట్టిమహాదేశాభిమానులనేకు లుద్భవింతురుగాక!

సంపూర్ణము.

పరమహంస చరిత్ర

ప్రపంచ భోగములన్నియు నేవగించి బాల్యమునందె విరాగులయి యాత్మార్థజ్ఞులయి జీవమార్గము గడపిన మహాత్ములు పూర్వకాలమునం దేగాక యిప్పటికిని హిందూదేశమున నక్కడక్కడ గనుపడుచున్నారు. స్వామి దయానంద సరస్వతి, మహర్షి దేవేంద్రనాథ ఠాకూరు, బ్రహ్మానంద కేశవచంద్రసేనుడు, రామకృష్ణ పరమహంస మొదలగువా రందుకు దృష్టాంతరములుగ నున్నారు. అందు దయానంద సరస్వతి కొంత ప్రాచీనపద్ధతిని కొంత క్రొత్తపద్ధతి నవలంబించిన మహాత్ముడు. దేవేంద్రనాథుడును కేశవచంద్రసేనుడును బూర్వపద్ధతినుండి విడిపడి కేవలము క్రొత్తపుంతనే త్రొక్కి జనసామాన్యమున కనిష్టము లైనమతము నవలంబించిన విరాగులు. రామకృష్ణ పరమహంస కేవలము ప్రాచీన మార్గము ననుసరించి పరమార్థజ్ఞుడయి దేశస్థుల కందరకు నిష్టుడయిన మహాయోగి. ఈతని చరిత్ర మనేకాద్భుతములతో నిండి యుండును. ఆ యద్భుతములలో నెక్కుడంటి నీ కాలపువారు నమ్మజాలరు. అయినను పరమహంసయొక్క శిష్యులలో నగ్రగణ్యుడగు వివేకానందస్వాములవారు వ్రాసిన చరిత్రమునుబట్టి మేము వానినివితము నిచ్చట సంగ్రహముగా వ్రాసెదము.

రామకృష్ణ పరమహంస 1833 వ సంవత్సరము ఫిబ్రవరి నెల 20 వ తేదీని బంగాళాదేశమున హుగ్లీ జిల్లాలోని కమర్పుకూరను గ్రామమున జన్మించెను. అతని తండ్రి పేరు ఖుదీరామ చటోపాధ్యా

యులు. తల్లి పేరు చంద్రమణీదేవి. ఆతనితలిదండ్రు లిద్దఱు యోగ్యతకు మిక్కిలి ప్రసిద్ధికెక్కి గ్రామస్థులందఱిచేత గౌరవింపఁబడుచు వచ్చిరి. ఖుదీరాము చట్టోపాధ్యాయుల సత్యనిత్యతను దైవభక్తిని దెలుపుటకు రెండుదాహరణము లిచ్చుచున్నాము. ఆతఁడు పూర్వము "దేరి"యను గ్రామమునఁ గాపురముండువాఁడు. ఆయూరిజమీందారుఁడొకవిషయ మునఁ దప్పుసాక్ష్యమిమ్మనియు నీయకుండిన వానిం జిక్కులఁబెట్టెద ననియు బెదరించినందున నతఁ డబద్ధమాడఁ జాలక యా యూరు విడిచి కమర్పుకూరునకు వచ్చి తన జీవితశేష మచ్చటనే గడపెను. ఒకనాఁ డతఁడు తన కూఁతుం జూచుటకుఁ బయనమయి పోవుచుం డఁగా మార్గమధ్యమున నప్పుడే క్రొత్తగా బయలుదేరిన దళములు గల యొకమారేడుచెట్టు గనఁబడెను. మారేడుదళములతో శివపూజ సేయుట యతనికి మిక్కిలిప్రియమగుటచేఁ బ్రయాణ మింకొకయప్పు డు జేయవచ్చును, ఈయదనుతప్పిన బిల్వదళములు మఱియొకప్పుడు దొరకునాయనిపయనమును గట్టిపెట్టి చెట్టెక్కి మారేడుదళములఁగో సిమొకినిండ వేసికొని వెనుకకుం జని యిల్లుచేరి మనసార శివపూ జఁ జేసెను. అతనియొద్ద వాక్సిద్ధిగలదనియు శుభముగాని యశుభము గాని యతడన్నట్లుజరుగుననియు జనులునమ్మిరి. చట్టోపాధ్యాయుఁడు యాత్రానిమిత్తము గయకుఁబోయియుండనందు గదాధరుఁడగు శ్రీమ హావిష్ణువతనికిఁగలలోఁ గనఁబడి వానికడుపునఁ గొడుకయి పుట్టుదు నని చెప్పెనట. అందుచేతనతనికిఁ దండ్రి గదాధరుఁడను పేరుబెట్టెను. కాని యిటీవల నెందుచేతనో యతఁడు రామకృష్ణుఁడను పేరం బరఁగె.

రామకృష్ణుఁ డాఱవయేఁటనే పురాణములు చెప్పెడివారియొద్ద కుఁబోయి భారత భాగవత రామాయణాదికథల నెఱింగెను. ఆతనికం ఠధ్వని మధురమయి గాంభీర్యమైనది. గానమునం దించుక ప్రవేశము గలుగుటచే నతఁడు శ్రావ్యముగఁ బాడగలవాఁడఁట. దేవాలయము

లందలి విగ్రహములు చక్కఁగా జెక్కబడినవో లేవో తెలిసికొను టకతనికి సహజమైన పుణ్యము గలదఁట అతఁడు కను బాలుఁడయినను గ్రామమునందలి పెద్దలు చుట్టుపట్లవాండ్రు దేవతావిగ్రహములమ్ముదువానికిఁజూపి యతఁడు మెచ్చినతరువాతనే ప్రతిష్ఠఁజేయుచునచ్చిరి. రామకృష్ణున కద్భుతమయిన జ్ఞాపకశక్తి గలదు. ఒకమారు భాగవతులాయూరికివచ్చి జలక్రీడ లాడఁగా నాబాలుఁడది చూచికథయంతయు జ్ఞాపకముపెట్టుకొని తరువాతఁ దోడిబాలురచే నాకథ యాడించెను. ఆయన వసియించు గ్రామము జగన్నాథక్షేత్రమునకుఁ బోవుదారిలోనుండుటచేత యోగులు సాధువులు సన్యాసులు వచ్చియాయూరిసత్రములో బసచేయుచుండిరి. అప్పుఁడు రామకృష్ణుఁడు వారియొద్దకుఁబోయి వారివల్ల ననేకాంశములం గ్రహింపుచు వచ్చెను.

తనయూరి జమీందారుఁడు మృతినొందఁగా నుత్తరక్రియలసమయమునఁ జుట్టుప్రక్కలపండితులనేకు లచ్చట చేరిరఁట. ఆసమయమున వారికివేదాంత విషయమయిన సందేహము దోప వారు చర్చలు సేయుచుండ బాలుఁడగు రామకృష్ణుఁ డక్కడకుఁబోయి సందియమవలీలగాఁ దీర్చెనఁట. పండితు లందఱు వానిని మహానుభావుఁడని కొనియాడిరి. రామకృష్ణుని పెద్దయన్న రామకుమారచటోపాధ్యాయులు సంస్కృతమున బండితుఁడై కలకత్తాలో నొకపాఠశాలఁబెట్టెను. తండ్రి రామకృష్ణునకుఁ బదియాఱవయేటనుపనయనముచేసిచదువునిమిత్తము వానిని పెద్దకొడుకున కప్పగించెను. రామకృష్ణుఁడాబడిలోఁ గొన్నినాళ్ళు చదివి యెంతకాలము చదివినను నాలుగుపూకలుసంపాదించుటకు వినియోగించు విద్యలేగాని మోక్షసాధనమయిన చదువు లేదని విసువుజెంది యాబడిలోఁ జదువుకొనుట మానెను.

1853 వ సంవత్సరమున కలకత్తానగరమున కైదుమైళ్ళదూరమున రాణిరాసమణి యను జమీందారురాలొకర్తు నక్షిణేశ్వరస్వా

మి దేవాలయమును గట్టించెను. ఇది హిందూదేశమున శ్రేష్ఠమయిన కోవెలలలో నొకటి. ఆదేవాలయమునకు రామకృష్ణునియన్న యర్చకుడుగా నేర్పడెను. ఆలయప్రతిష్ఠ జరిగినదినమున నిరువదివేలమంది కన్నప్రదానము జరిగెను. గుడికట్టించిన యామె శూద్రస్త్రీయగుటచే నామె కట్టించిన దేవాలయమున భుజించుట యశాస్త్రీయమని రామకృష్ణుఁడంత యన్నప్రదానము జరుగుచున్న దేవాలయమున భుజింపక సాయంకాలమువఱకు నుపవాస ముండి కొంచెమటుకులు కొనితిని రాత్రి కలకత్తాకుఁ బోయెను. తరువాతఁ గొన్నినాళ్ళకు సోదరుఁడువచ్చి తనకు దేవాలయమునని బ్రాహ్మణులటచేఁ దనయన్నము తానుగంగయొడ్డున వేఱే వండుకొందునని చెప్పి యన్న నొప్పించి యతనితోఁ గలసియుండుటకుఁ జేసెను. అట్లు కొంతకాలము జరుగ సోదరుఁడు శరీరమునందనారోగ్యము గలుగుటచే రాణీరాసమణియొక్క యల్లుఁడగు మధురనాథుఁడు రామకృష్ణునే కోవెల కర్చకుఁడుగా నియమించెను.

అతఁడాపనింబూని యనుదినము దక్షిణేశ్వరస్వామిని శ్రీకాళికాదేవినిఁ బూజించుచుండెఁ గాళియందత్యంతభక్తి యాతనికి నెలకొనియెను. పూజానంతరము రామకృష్ణుఁడు దేవీవిగ్రహమునొద్దగూర్చుండి కొడుకు తల్లియొద్ద గారాముచేసి యడిగినట్లు "అమ్మా! పలుకవే నాగతియేమి చెప్పితివే యనిపిలుచుచు నడతెగక ప్రార్థించుచుండును. ఆ దేవి తన మాతయనియు జగన్మాతయనియు నతఁడెంచుచు తాను నివేదన చేసిన యాహారమునామె నిజముగా భక్షించుచున్నదనుకొనెను. ప్రార్థించుటయేగాని యాతఁ డెన్నఁడు రెండవపనిచేయకుండుటచే వానిబంధువు లతఁడు వెఱ్ఱిఘోరణిలోఁ బడినాఁడని నమ్మి పెండ్లిచేసిన నొకకొంతవఱకు దృష్టిమరలు ననుకొని వివాహముఁ దలపెట్టిరి. పెండ్లిచేయుటకుఁ దనవారుఁ దలపెట్ట నతఁడుతనకు రా

మచంద్రముఖోపాధ్యాయుఁ డనునొక బ్రాహ్మణుని కూఁతురు శార దామణిదేవి. యను నుత్తమబాలిక భార్యయగునట్లు విధింపఁబడినదని యు వానియొద్దకుఁబోయి యడుగుమనియుఁ దనవారితోఁజెప్పెను. వా రామాటల కద్భుతపడి వెంటనే ముఖోపాధ్యాయునియొద్దకుఁ బోయి యడుగ నతఁ డంగీకరించి యైదేండ్లవయస్సుగల తనకూఁతును వాని కిచ్చి వివాహము చేసెను. వివాహ మయిన పిదప మరల రామకృ ష్ణుఁడు వచ్చి యాలయంబున నర్చకత్వము చేయఁబూనెను.

వివాహము జరిగినదిగాని చుట్టము లనుకొన్నట్లు వానిమనోవై కల్యముమాత్ర మించుకయుఁ దగ్గక మఱింత హెచ్చెను. ఉపాధ్యాయ మతఁడు ప్రార్థనము సేయుటయే గాక యహోరాత్రము లొక్క మచ్చున నెడ తెరపిలేక "తల్లీ నాకుఁ బ్రత్యక్షము గావేమీ" యని పెద్ద పెట్టున నేడ్వసాగెను. ప్రతిదినము సాయంకాలమయిన తోడనే "అ య్యో! తల్లీ! మరల నొకదినము గడచిపోయినది. ఇఁకఁ బ్రత్యక్షమ గుట యెన్నఁడే" యని విలపించును. చూచినవారిలోఁ గొందఱు పిచ్చియెత్తినదనిరి. మఱికొందఱాయేమఱుపుఁజూచి వానికి దారుణ రోగబాధ కలదనిరి. మధురనాథుఁడు నది రోగమే యనుకొని తగు చికిత్స చేయించుటకు గొప్పవైద్యులకడకుఁ దీసికొనిపోయిచూపెను. వైద్యులెవ్వరు వానిరోగము కనుఁగొనఁజాలరయిరి. తుదకొక మహా వైద్యుఁడు వానికది రోగము కాదనియు నతఁడు మహాయోగియని యుఁ జెప్పెను. అతఁ డొకప్పుడు భక్తిపారవశ్యముచేత దేవికి సమ ర్పింపఁదలఁచిన పూలదండలు తానే మెడలో వైచుకొనును. మధుర నాథుఁడది మొట్టమొదటఁ జూచి వానిపైఁ గోపించెను. కానిపిమ్మట వానిమహిమ నెఱిఁగి యూరకొనెను. రామకృష్ణుఁడు గుడిలో నర్చన సేయుటకు వీలులేనియవస్థలో నుండుటచే నతని నాపనిలోనుండి తప్పించి మధురనాథుఁ డతని మేనయల్లుని నియమించెను.

ఇట్లుండ నెంతకాలమునకుఁ దనకు దేవి ప్రత్యక్షముకాలేదని నిరాశఁజెంది రామకృష్ణుఁడు మృతినొందఁదలఁచుచుండఁగా నొడలు తెలియక పడిపోయెను. ఇది కొందఱు మూర్ఛయనుకొనిరి. కాని యదిమూర్ఛగాక సమాధియయ్యెను. ఈసమాధిలో వానికి కాళికాదేవి ప్రత్యక్షమై వాని ననుగ్రహించెను. అంతట నతఁ డించుకయూరడిల్లి యుండెను. అదిమొద లతఁడు మరణమునొందునఱకుఁ బలుమారులు సమాధిప్రవేశముఁ జేయుచునేయుండెను. అతఁడు సమాధిలోనున్నపు డెంతఘనవైద్యులు వచ్చి చేయిచూచినను నాడి గనఁబడదయ్యె. ఈయద్భుతమున కెవ్వరుఁ గారణముఁ జెప్పఁజాలరయిరి. సమాధిలోఁ దనకు దేవి తఱచుగాఁ బ్రసన్నురాలగుచుండుట నిజమో లేక తన మనోభ్రమయో యని యొక్కొక్కమారతఁడు సందియపడుచుదాని యాథార్థ్యమును గనుంగొనుటకయి యదివఱకెన్నఁడునుజరుగని యొకకార్యము జరిగినచో దేవిప్రత్యక్షముమాట నమ్మెదనని యతఁడు దేవితోఁ జెప్పుచుండును. ఎట్లన రాణిరాసమణియొక్క కొమార్తెలిద్దఱుఁ దమయంతఃపురమువిడిచి యాలయము ముందు మఱ్ఱిచెట్టుక్రిందకువచ్చి తనతో మాటలాడినచో దేవి ప్రత్యక్షమగుట నమ్మెదనని దేవితోఁ బలికెను. రాచమణికూఁతు లిద్ద ఱెన్నఁ డంతఃపురమువిడువని గోషాస్త్రీలు. అదివఱ కెన్నఁడాలయము త్రొక్కిచూచి యెఱుఁగరు. అది యేమిచిత్రమోకాని యాశుద్ధాంతకాంతలిద్దఱు గుడిచూచుటకుఁ దల్లియనుమతి నంది యాలయమునకువచ్చి మఱ్ఱిచెట్టునీడనున్న రామకృష్ణునిఁ బలుకరించి "దేవి నిన్ననుగ్రహించును. భయపడకు"మనిచెప్పిపోయిరి. ఈతెఱంగుననే యతఁడు కోరిన ట్లనేకాద్భుతములు దేవీప్రసాదమువలన జరుగుచు వచ్చెను.

ఇట్లు నిరంతరప్రార్థనములఁ జేయుచు సమాధులం బ్రవేశించుచు రామకృష్ణుఁడు పండ్రెండుసంవత్సరములు తపస్సుచేసెను. ఆకా

లమునం దొకనాఁడు రాత్రియు నతనికి నిద్రలేదు. కన్నులు బలవంతముగా నతఁడు మూయఁదలఁచినను మూయఁబడవయ్యె. అప్పుడప్పు డతఁడు "దేవీ! నేను మృతినొందుదునుగాఁబోలు' నని భయపడుచుండ నతనికి "వత్సా! శరీరమునం దభిమానము విడువవేని నీకు ముక్తి యెట్లుగలుగు" నని యొకశబ్దము వినబడెను. ఒకమారతఁడు తల్లీ! నేనీ కించిజ్జ్ఞులగు మనుష్యులవద్ద చదువు నేర్చికొనను నీవే నేర్పుమనియడుగ "వత్సా! నేను నీకు నేర్పెదనులే" యని యొకమాట వానికి వినఁబడెను. అప్పుడప్పు డతఁడు సర్వసమానుఁడయి "నేను బ్రాహ్మణుఁడను గొప్పవాఁడను. తక్కినజాతులవా రల్పులనుదురభిమానము నామనసునుండి తొలఁగింపు" మని దేవిని బ్రార్థించి వెంటనే తక్కువజాతివాండ్రగు సేవకులయిండ్లఁజొచ్చి వారికి విధేయుఁడయి మెలఁగును. మఱియొకప్పు డతఁడొకచేత రూపాయలను రెండవచేత చిల్లపెంకులను బట్టుకొని గంగయొడ్డునఁగూర్చుండి "ఇది ధనము. దీనిచే బియ్యముపప్పు మొదలగువస్తువు లన్నియు లభించును. దీనినందఱు గౌరవింతురు. ఇవి చిల్లపెంకులు. వీనిని మొగ మెవ్వరుఁ జూడరు. నాకివి రెండు సమానములే" యని రెండును గలిపి గంగలోఁ బాఱవేయును. ఒకనాఁడు రాసమణి యల్లుఁడు మథురనాథుఁడు పదునైదువందల రూపాయిలు విలువగల యొకగొప్ప శాలువ వానికిం గప్పెను. రామకృష్ణుఁడు మొదటదానికి సంతసించినట్లు కనఁబడి నాలుగునిముసములలో నాశాలువుం గీసి నేలపై వైచి కాలరాచి దానిపై నుమిసి "ఇదిగర్వమును హెచ్చించును. దీనికన్న ప్రాఁతగుడ్డపేలికలు మే" లని దానితో నేలయూడ్చి పాఱవైచెను. ఆదినములలో నతనికి నిరంతరము శరీరమంతయు మంటలెత్తుచువచ్చెను. అందుచేత నతఁడు గంగలోఁ గంఠములోతు నీళ్లలో దిగి తఱచుగ నిలుచుచు వచ్చెను.

ఇట్లుండ నామహాత్మునియొద్ద కొకయోగినివచ్చెను. ఆమెయూ

రెయ్యదియో యెవ్వరెఱుంగరు. ఆమె కనేకపురాణంబులు కంఠపాఠముగ వచ్చును. వాదములుచేసి యెంతెంతపండితులనైన నవలీలగ గెల్చెడు ప్రజ్ఞగలది. ఒకయాఁడుదివచ్చి తనకుఁ గొంతవిద్య నేర్పునని దేవి సమాధిలో నతనితో నొక్కమారు చెప్పెను. చెప్పినచొప్పున దీర్ఘకాయము సుందరరూపము గలయాయోగిని వచ్చి రామకృష్ణు నానవాలు పట్టి "నేను నీకొఱకే వెదకుచున్నాను. కనఁబడితివా" యని వానిం బలుకరించి యాతనితోఁ గలిసి కొంతకాల మచ్చటనుండెను. రామకృష్ణునిశరీరమంతయు భగభగమండుచుండుటచే నాతఁడామెను కారణ మడుగ నామె భగవద్భక్తులకందఱకు శరీర మట్లే మంటలెత్తుననియు నిట్లే నాలుగువందలయేండ్లకిందట శ్రీచైతన్యునకును,బూర్వకాలమున రాధాదేవికి భగవంతునిపైఁగల యనురాగముచే దేహతాపము గలిగెననియు జెప్పి తనమాటలు సత్యములని ఋజువుచేయుటకు వైష్ణవపురాణములం దెప్పించి యందుఁ బ్రమాణములంగనబరచి నమ్మించి రామకృష్ణుని మేన మంచిగంధము మూఁడుదినములు పూయించి పూలదండలు మెడనువేయించి యట్లే చైతన్యునియొక్కయు రాధయొక్కయు తాప మడఁగెనని చెప్పెను. ఈశైత్యోపచారముచే నద్భుతముగ రామకృష్ణుని మేను చల్లఁబడెను. ఈమంటలడఁగిన వెనుక నతనికి మితిలేనియాఁకలిబాధకలిగెను. ఎంతయన్న మెన్నిమారులు తిన్న నతనికి యాఁకలియుపశమిల్లదయ్యె. అప్పుడాయోగిని చైతన్యుఁడు రాధమొదలగువారికిఁగూడ నిట్లే వింతయాఁకలికలిగెనని చెప్పి, కొన్నిగ్రంథదృష్టాంతములఁ జూపి పలుపిండివంటలు కూరలు నన్నము కుప్పకుప్పలుగా నతనియెదుటఁ బెట్టించెను. రాసులకొలఁదిపదార్థములఁజూచుటచే నతనియాఁకలి క్రమక్రమంబుగ నుపశమిల్లి ప్రకృతిలోఁ బడెను. ఈయోగిని యతనికి యోగశాస్త్రము సమగ్రముగాఁ దానున్న కాలమున నేర్పెను.

ఇవ్విధంబున యోగశాస్త్రమునఁ బరిపూర్ణుఁడై రామకృష్ణుఁడు వేదాంతము నభ్యసింపవలయునని తలంచుచుండఁగా నతనియొద్దకు మహానుభావుఁడగు దిగంబరయోగి యొకఁడు వచ్చెను. అతఁడు బీరెండ గాయునప్పుడును గొండ చిల్లులపడ వానలు గురియు నప్పుడును జెట్ల క్రిందనే గాని యిండ్ల తలదాఁచుకొనఁడు. ఊరుబైటనే గాని గ్రామమున వసింపఁడు. పండ్లు పాలె గాని యన్నము తినఁడు. రామకృష్ణుఁ డొకనాఁడు గంగయొడ్డునఁ గూర్చుండ నాయోగివచ్చి వానిని గుర్తెఱిఁగి బ్రహ్మజ్ఞానోపదేశము చేయవచ్చితినని చెప్పి యతనితోఁ గలసి పదునొకండు మాసములుండెను. రామకృష్ణుఁడు సాటిలేని బుద్ధివిశుణతగలవాఁడగుటచే నాతఁడుపదేశించిన బ్రహ్మవిద్య నతిస్వల్పకాలమున నవలీలగా గ్రహించె. యోగి యాతని తెలివి కక్కజపడి "వత్సా! నేను నలుబదియేండ్లు కష్టపడి నేర్చినదానిని నీవు నాలుగు దినములలో నేర్చితివి" యని యాదినము మొదలు వానిని శిష్యుఁడుగా నెంచక మిత్రుఁడుగా భావించెను. ఆ యోగితనయొద్ద నిరంతరము నగ్నిహోత్రము నిలుపుకొని యదియె పరమపావనమని తలంచుచుండెను. ఒకనాఁడా యగ్నిహోత్రమున నొకఁడు చుట్టఁ గాల్చుకొనఁ బోగా యోగి తన యగ్ని మైలపడిన దని వానిపైఁ గోపించెను. అప్పుడు రామకృష్ణ పరమహంస యోగి నిట్లని మందలించె. "అయ్యా! యీయగ్నియు దీనిని మైలపఱచినమనుష్యుఁడు పరబ్రహ్మస్వరూపములే కదా. నీకీ భేదబుద్ధి యేలకలుగవలె?" ఆ పలుకులు విని యోగి పరమహంసతో "ఇఁకమీఁద నే నెన్నఁడు నెవరిపైఁ గోపపడ" నని తెలివిం దెచ్చుకొనియె.

రామకృష్ణుఁ డీవిధమున బ్రహ్మజ్ఞానమునేర్చి జ్ఞానమొకదారి నడత యొకదారి గాకుండ నద్వైతసిద్ధి నొంది పిమ్మట యోగాభ్యాసము చేయ నారంభించెను. ప్రాణాయామముఁ బట్టి యూపిరి బంధించి

యాహారంబుఁ దినక యతఁ డొక్కకసారి కొన్ని దినములు గడుపుచు వచ్చెను, ఆ దినములలో నెక్కడినుండియో యొకసాధువు వచ్చి యతనితోఁ గలిసియుండి ప్రాణాయామముఁబట్టినప్పు డాహారము లేమిచే నతఁడు మృతినొందునేమోయను భయమున బలవంతముగ నాహారమును మ్రింగించుటకుఁ బ్రయత్నించుచువచ్చెను. ఒకనాఁడు రామకృష్ణున కెంతకు మెలఁకువ రానందున సాధువు దుడ్డుకఱ్ఱతో వానిం గట్టిగాఁ గొట్టి మెలకువ దెప్పించి రెండు కబళములయన్నము నోట గుక్కి బ్రతికించెను. ఈ తెఱంగున నాలుమాసములు యోగాభ్యాసమగునప్పటికి రామకృష్ణున కాహార నిద్ర సుఖములు లేమి గ్రహణిరోగము సంభవించెను. ఈ రోగము యోగమును మాన్పించి వానికిఁ జాల మేలొనరించెను. స్వదేశవైద్యులు వాని రోగము కొన్ని రోజులలో మాన్పిరి. ఆ యభ్యాసముచేత సామాన్య యోగులకు దుర్లభమైన నిర్వికల్పక సమాధిని దానుప్రవేశింపఁగలిగితిననియు దృఢమైన మనస్సును శరీరమును గలిగి యుండుటచేత తానట్టి సమాధిని బ్రవేశింప మరల బ్రతుకనయ్యెను. కాని సామాన్యులు బ్రతుకుట యరిదియనియు నతఁడిటీవల చెప్పుచు నచ్చెను. ఆరోగ్యము కలిగిన పిదప నతఁడు వైష్ణవులభక్తిమార్గము నవలంబింపవలయునని తలంచెను.

వైష్ణవులు భగవంతు నైదు విధములుగా సేవింతురు. 1. సేవకులు యజమానుని గొలిచినట్లు 2. మిత్రులొండొరులఁ బ్రేమించునట్లు 3. తలిదండ్రులు బిడ్డలఁ బ్రేమించునట్లు 4. బిడ్డలు తలిదండ్రులఁ బ్రేమించునట్లు 5 భార్య భర్తను వలచునట్లు. ఈ యైదింటిలోఁ గడపటివిధమే యుత్కృష్టమైన దనియు నా మార్గముననే పూర్వము గోపికలు రాధాదేవియు ననుసరించి ముక్తులైరనియు నమ్మి రామకృష్ణుఁడు కొన్ని దినములు స్త్రీవేషముఁ దాల్చి తాను భగవంతుని భార్యయగు రాధనని యెంచి తత్సంయోగమునకై పలు

మారు ప్రార్థించెను. ఒకనాఁడు సమాధిలో నతనికి ముద్దుమొగముతో గోపాల కృష్ణదేవుఁడు సాక్షాత్కరించినందున నతఁడు కృతార్థుఁడయ్యె. రాధ పరమభాగవతోత్తమురా లనియు నామె గోపాలదేవునియందు నలఁపునిలుపుట భక్తిచేతనేగాని సంభోగార్థము గాదనియు జ్ఞానవంతుఁడేగాని పామరు లాగ్రహింపఁ జనుఁగూడదనియు రామకృష్ణునియభిప్రాయము. భక్తియోగమునం దిట్లు సిద్ధిని గాంచిన పిదప నతఁడు మహమ్మదీయపద్ధతి ప్రకారము కొన్నిదినములు భగవంతుని ధ్యానించెను. ఆవల క్రైస్తవసిద్ధాంత ప్రకారము కొన్నిదినము లీశ్వరుని సేవించెను. ఆదినములలో నతనికి యేసుక్రీస్తుమారు కనఁబడి వాని ధన్యునిఁ జేసెను. రామకృష్ణుఁ డేమతమవలంబింపఁ దలఁచునప్పు డామతస్థుఁ డొకఁ డతనియొద్దకు వచ్చి తద్రహస్యములన్నియు నతనికిఁ జెప్పునట. అన్నిమతముల నవలంబించుటచే ప్రతిమతము మంచిదేయనియు నేమతమవలంబించినను మనుష్యులకు ముక్తి దొరుకుననియును నొక్కొక్కమత మఖండ సచ్చిదానంద స్వరూపుండగు భగవంతుని గుణములు దెలుపుననియు నతఁడభిప్రాయపడెను.

అతఁడు సంకల్పసిద్ధుఁడని వాడుక. ఒకనాఁ డాయన గంగయొద్దనఁ గూర్చుండి తన యోగాభ్యాసమున కనువుగా నొక కుటీరమును నిర్మించుకొనఁ దలంచుచుండ నప్పు డద్భుతముగాఁ గొన్ని వెదుళ్ళు తాటియాకులు నార మొదలగు గుడిసెకుఁ గావలసిన పరికరములు గొట్టుకొనివచ్చి వానికంటఁ బడెను. ఆ పరికరముల నతఁడు వెంటనే గ్రహించి కొందఱు సేవకుల సాయమునఁ గుటీరము నిర్మించుకొనియె.

ఇవ్విధంబునఁ బరమయోగియై రామకృష్ణుఁ డుండ నతనిభార్య పుట్టినింట నీడేరి పదునెనిమిదేండ్ల ప్రాయముగలదయ్యె. తల్లిదండ్రు

లామెతో నీమగఁడు పిచ్చివాఁడయ్యె నమ్మా యనిరి. కొందఱులోకు లతఁడు పరమయోగియయ్యెనని చెప్ప విని శారదామణిదేవి యట్టి మగని నొక్కసారి కన్నులారఁ జూడవేడుకపడి తల్లిదండ్రుల సెలవు పొంది వానియొద్దకుంబోయి తన్నంగీకరించుకొనుమనియె. రామకృష్ణుఁ డామెనాదరించి యిట్లనియె. "పూర్వపు రామకృష్ణుఁడు మృతినొందినాఁడు. నేను క్రొత్తవాఁడను. లోకములోఁ గలియాఁడువాండ్రందఱు నాకిట్టి తల్లులలో నీవును నాకు తల్లివిగాని భార్యవుగావు." అని యామె పాదములకు మ్రొక్కి యాశీర్వదింపుమని ప్రార్థించి పువ్వులతోఁ బూజించి వెంటనే సమాధిగతుఁడై మొదలెఱుఁగకఁ బడియె. మగనికిం దెలివివచ్చినపిదప నా యిల్లాలు "స్వామీ! నేను మీతపమున కంతరాయము గలిగింపను. మీ పాదసేవ సేయుచు నిచ్చటనే పడియుండెద. నా కందుకు సెలవి"మ్మని వేఁడిన నతఁడామె వేఁడికోలంగీకరించె. ఆమెయు భర్తవలెనే నిస్పృహగలిగి విరాగిణియై యుండె. మధురనాథుఁ డొకనాఁడామెను బిలిచి "తల్లీ! నీకు నేను పదివేలరూపాయ లిచ్చెదను. నీవుబోయి సుఖముగా నుండు" మని చెప్ప శారదామణిదేవి నవ్వి "నాయనా! నాభర్త ధనము నిరాకరించినగొప్ప మహాత్ముఁడయ్యె. నేనును వాని ననుసరించెద. నాకు వలదు" కని నిరాకరించె.

అనంతరము కొన్నినాళ్ళకు మధురనాథుఁడు తీర్థయాత్రలకుఁ బోవుచు రామకృష్ణుని వెంటఁ గొంపోయె. ఆయాత్రలలో రామకృష్ణుడు కాశికిఁబోయి జగత్ప్రసిద్ధసన్యాసియగు త్రైలింగస్వామినిసందర్శించి గోకులబృందావనమున గంగామాతయను మహాత్మురాలిని సేవించి ధన్యుఁడయ్యె. మరల వారింటికి వచ్చుచున్న మధ్యమార్గమున నొక పల్లెయలో జనలు దారిద్ర్యమున బాధపడుచుండుటఁ జూచి పరమహంస హార్దిదైన్యమునకు వగచియాయూరనందఱనాదరించినఁగాని నే

నిచ్చటనుండి కదలనని కూర్చుండె. అప్పుడు మధురనాథుఁడు చాల సొమ్ము వెచ్చపెట్టికొన్నినాళ్ళన్నప్రదానముచేసి కట్టగుడ్డలిచ్చి యాదరించె. ఈతఁడు పరమపావనుఁడు. వానిదర్శనముచేసినవారందఱు వెంటనే పవిత్రులగుదురు. అతని సాన్నిధ్యవిశేషమున కొందఱు సమాధిగతులయి యీశ్వరుని గనువారు కొందఱు తమదురాలోచనలవిడిచి యిండ్లకు నిష్కల్మషచిత్తులయి పోయెదువారు. వేయేల ఆయననొకసారి చూచినపిదప జారులకు కాంతాసక్తియు లోభులకు ధనాసక్తియుఁ బోయెడునవి. ధనముపేరు చెప్పిన నతనికెంతరోఁతయో యీక్రిందిసంగతినిబట్టి తెలిసికొనవచ్చును.

వెండి బంగారునాణెముల నతఁడు స్పృశించినమాత్రమునఁ జేతులు గజగజవణఁకును. చరమకాలమునం దతఁడు వెండి బంగారముల నేగాక యినుమునుసయితము తాకఁజాలఁడయ్యె. అతనియొద్దమహిమలనేకములు కలవు. కాని ప్రజ్ఞంబ్రకటించుటకై యామహిమలనెన్నఁడు నతఁడు ప్రదర్శింపఁడయ్యె. ఆయన యాగతానాగతములను జెప్పఁగలఁడు. తనపరోక్షమున జరుగుకార్యములఁ జెర్కొనఁ గలఁడు. తన యెదుటనున్నవారిమనసులోని యాలోచనల నెఱుఁగఁగలఁడని యనేకులు చెప్పుదురు. కొందఱు మనుష్యులు దేవగుణములతోఁడను గొందఱు మనుష్యులు రాక్షసగుణములతో జన్మింతురనియు నట్టివారిని జులకనగఁ గనిపెట్టవచ్చుననియుఁ బూర్వజన్మమునఁ జక్రవర్తులై సకలసౌఖ్యములఁ దనివితీర ననుభవించినవారీజన్మమున విరాగులయి సన్యాసులగుదురనియు నతఁడు చెప్పుచుండును. అనేకమహిమలుగల యీమహానుభావుఁడు కలకత్తానగరమునకుసమీపమందున్నను తత్పురవాసులు చాలకాలమువఱకతని నెఱుఁగనే యెఱుఁగరు.

బ్రహ్మసమాజ మతాచార్యుఁడగు కేశవచంద్రసేనుఁడు పరమభాగవతుఁడై యొకతోఁటలో విరాగియై ప్రొద్దులుబుచ్చుచున్నవాఁ

డని విని రామకృష్ణుఁ డాతనిఁ జూడఁబోయెను. అది మొదలు వారి కిరువురకు దృఢమయిన స్నేహముఁ గలిగెను. కేశవచంద్రసేనుఁడు రామకృష్ణుని ప్రభావమెఱిఁగి వానినాశ్రయించి సందియము లడిగి తెలిసికొని పరమభక్తిచే నతని పాదములు తనకన్నుల నద్దుకొని పలుమాఱు వానిదర్శించి బ్రహ్మజ్ఞానవంతుఁడై తుదకాయన సిద్ధాం తము లన్నిఁటి నవలంబించెనని చెప్పుదురు. ఈచంద్రసేనుఁడు రామ కృష్ణుని బోధనలఁ గూర్చియుచిత్రచరిత్రనుగూర్చియు గ్రొకగ్రంథము వ్రాసి ప్రకటించెను. ఆపుస్తకము బయలువెడలిన పిదప కలకత్తాపు రజనులు రామకృష్ణు నెఱిఁగిరి. అది మొదలు కలకత్తానుండియు బం గాళాదేశమునుండియు జనులు నందలకొలఁదివచ్చి సందియములడిగి యతనిచేత బోధితులై పోవుచువచ్చిరి. అప్పు డతనికి యీశ్వరావేశ ము నియతము వచ్చువాడుక గలదు. ఆ యావేశము లేనప్పుడు సేవ కులకయిన విధేయుఁడుగ నుండినట్టి యామహాత్ముఁ డది వచ్చినతో డనే తాను భగవంతుఁడననియుఁ దనవంటివారు లేరనియు పూర్వము రాముఁడు కృష్ణుఁడు బుద్ధుఁడు యేసుక్రీస్తు మొదలగువారై పుట్టినది తానేయని చెప్పుచుండును. అతని బోధనలు విని యందఱును సంతో సించి తృప్తినొందుచు వచ్చిరి.

ఈ పరమహంసకు 1886 వ సంవత్సరమున గంతమునఁ గురుపు నైచెను. ప్రజలకు మతబోధ మానుమని వైద్యు లెంత చెప్పినను వినక కంఠములోనుండి మాటవచ్చువఱకు నతఁడు మతబోధ చేయుఁదొ డఁగెను. ఆరోగము క్రమక్రమముగ వృద్ధియగుటచే రామకృష్ణపర మహంస 1886 వ సంవత్సరమున ఆగస్టు 16 వ తేదీని రాత్రి యొంటి గంటకు యఖండసచ్చిదానందపరబ్రహ్మమును గలసిపోయెను.

ఇతఁడు శరీరమునందు దభిమానములేని మహాయోగి. సార్థక నామముగల పరమహంస. నిజమయిన మహర్షి. ధనమును జిల్లపెంకు

ను సమానముగఁ జూచిన నిస్పృహుఁడు. చండాలుని యందును బ్రాహ్మణునియందును కుక్కయందును గోవునందును బ్రపంచము నందలి సర్వ పదార్థములయందును బరమాత్మయున్నదని గ్రహించి తత్ప్రకారము నడచిన ఋజువర్తనుఁడు. మతవిషయమున నితరులతో భిన్నాభిప్రాయములుగల పురుషులు సయితము వాని సత్ప్రవర్తనకుఁ గడుంగడు మెచ్చి కొనియాడిరి. బంగాళీభాషదక్క సంస్కృతముగాని మఱి యే యితరభాషగాని యతనికి రాకపోయినను దానిబోధనలం జదువునప్పు డతఁడు సకలశాస్త్రసంపన్నుఁ డనుకొన వలసివచ్చును. ఈపరమహంస సహజజ్ఞాని యని యనేకుల యభిప్రాయము.

మహావాక్యములు.

1. ఆకాశమున నీకు రాత్రివేళ నక్షత్రము లెన్నో కనఁబడును కాని యవినీకు పగలు కనఁబడవు. అందుచేత ఆకాశమున పట్టపగలు నక్షత్రములు లేనేలేవని నీవు చెప్పఁగలవా? ఆలాగుననే నీవజ్ఞానమువై యున్న కాలమున నీకు భగవంతుఁడు కనఁబడఁడు. అందుచేత దేవుఁడు లేఁడని చెప్పకుము.

2. ఒక్కవస్తువునే పెక్కండ్రు పెక్కుపేళ్ళతో వ్యవహరింతురు. ఎట్లనఁగా జలమును కొందఱు నీళ్ళందురు. కొందఱు పానియందురు. కొందఱు వాటర్ అందురు. ఎవ రెట్లన్నను పదార్థ మొక్కటేకదా! అట్లే నిత్యుఁడై నిర్మలుఁడైన యానందస్వరూపుఁడు భగవంతుఁ డొక్కఁడే. అతనినే కొందఱు బ్రహ్మమందురు. కొందఱు హరియందురు. కొందఱు జహోవాయందురు. కొందఱు శివుఁడందురు. కాని దేవుఁడొక్కఁడే.

3. తొండయొక్క రంగును గురించి ఇద్దఱుమనుష్యులు గట్టిగా వివాదపడిరి. ఆచెట్టుమీఁదనున్న తొండ ఎఱ్ఱగానున్నదని యొకఁడువాదించెను. "కాదు కాదు నీవు పొరపాటు పడినావు. అది ఊదా రంగు కలిగియున్నది." అని రెండవవాఁడు వానిమాట ఖండించెను. వారిద్దరు తమలో తాము వివాదము పరిష్కరించుకొనలేక యాచెట్టు క్రిందచిరకాలమునుండి కూర్చుండియాతొండయొక్కవిధములన్నియు కనిపెట్టిచూచుచున్న యొకమనుష్యుని యొద్దకుపోయిరి. "అయ్యా! తొండ ఎఱ్ఱగానున్నది కాదా?" యని యొకఁ డాయన నడిగెను. "అవును. ఎఱ్ఱగానేయున్నది" అని యతఁ డుత్తరువిచ్చెను. రెండవ వాఁడు "ఇదేమిటండీ! మీరట్లాగనుచున్నారు. అది ఎఱ్ఱగాలేదు. అది ఊదారంగుఁ గలిగియున్నది" అని చెప్పెను. "ఔను! అది వూదారంగు గలదే యని యాచెట్టుక్రింది మనుష్యుఁడు చెప్పెను. తొండయొక్క రంగులు క్షణక్షణము మారిపోవునని యామనుష్యుఁ డెఱుఁగును. కావున వారిద్దఱును సరిగానే చెప్పిరని తెలిసికొని అతఁ డిద్దఱికిని ఔనని బదులు చెప్పెను. అలాగే భగవంతుఁడు బహురూపములుఁ కలవాఁడు. ఆరూపములలో నేదోయొక్కటి మాత్రిమే చూచినవాఁడు భగవంతున కారూప మొక్కటియే యున్నదని వాదించును. కాని యతని రూపములన్నియు చూచినవాఁడు భగవంతుఁడు బహురూపుఁడని యతని నానారూపములను వర్ణించి చెప్పఁగలుగును. భగవంతుఁడు బహురూపములు గలవాఁడు. అయినను రూపములు లేనివాఁడు. కాని యెట్టి పరమభక్తులకైనను గనఁబడని రూపములెన్నో యతని కింకను గలవు.

4. భగవంతున కనేకనామములు కలవు. అతని రూపము తెలిసికొనుట కెన్నోమార్గములు కలవు. ఏనామముతో నతనిని నీవు

పిలువ తలంచుకొందునో ఆనామముతోనే అతఁడు పలుకును. ఏరూప
ముతో చూడఁదలఁతునో ఆరూపముతోనే కనఁబడును.

5. నలుగురు గ్రుడ్డివాండ్రు ఏనుఁగును చూడఁబోయిరి. అందొకఁడు దానికాలుపట్టుకొని చూచి ఏనుఁగు స్తంభమువలెనున్నదని చెప్పెను. రెండవవాఁడు తొండమునుతడవిచూచి యేనుఁగు రోకలివలెనుండునని పలికెను. మూఁడవవాఁడు దానిపొట్టఁబట్టిజూచి యేనుఁగు పెద్దపాణకవలెనుండు ననెను. నాల్గవవాఁడు దానిచెవులు స్పృశించి ఏనుఁగు చేటవలెనుండునని వాదించెను. ఈతెఱఁగున వారు నలుగురు యేనుఁగయొక్క రూపమును గుఱించి తగవులాడిరి. దారినిబోవు బాటసారి యొక్కఁడు వారికయ్యమునిని అదియేమని యడిగి తెలిసికొని ఇట్లనియెను. "ఏనుఁగును మీరెవ్వరును నిజముగాఁజూడలేదు." ఏనుఁగు స్తంభమువలె లేదు. దాని కాలు స్తంభమువలె నున్నది. అది పాణకలాగున లేదు. దానికడుపు పాణకలాగున నున్నది. అది రోకలిలాగున లేదు. దాని తొండము రోకలిలాగున నున్నది. అది చేటవలె లేదు. దానిచెవి చేటలాగున నున్నది. ఆలాగుననే భగవంతుని రూపములొక్కటిమాత్రమే చూచినవారు భగవంతునకారూపమొక్కటి కాని మరియొకరూపము లేదని వాదించి కలహమాడుదురు.

(6) పంచదార తెచ్చి చిలుకలు మొదలైనపక్షులుగాను, గురి బహుచిత్రవస్తువులుగాను వర్తకుడు చేసినట్లే జగన్మాతయైన యాదేవి యనేక రూపములతో అనేక నామములతో యెల్లదేశములయందు నెల్ల కాలములయందు పూజింపఁబడుచున్నది. భిన్నమతములు భగవంతునియొద్దకు మనలను తీసుకొనిపోవు భిన్నమార్గములు.

(7) బంగారమొక్కటే పలువిధముల నగలుగా చేయఁబడుచున్నట్లే భగవంతుఁడొక్కఁడే భిన్నదేశములలో భిన్నకాలములలో బహునామరూపభేదములచేత సేవింపఁబడుచుండును. అతఁడు భిన్నవిధ

ములుగా నారాధింపఁబడుచున్నను కొందరతనిని తండ్రియందురు. కొందరతనిని తల్లియందురు. భిన్నపద్ధతులతోను, భిన్నసంబంధములతోడను సేవింపఁబడుచున్నట్టి భగవంతుఁడొక్కఁడే.

(8) (ప్రశ్న) అన్నిమతములకు దేవుఁడొక్కఁడే యైనపక్షమున యేభిన్నమతములవారు భగవంతుని భిన్నస్వరూపుఁడని యేలచెప్పిరి? (ఉత్తరము) దేవుఁడొక్కఁడే కాని యతని యవస్థలువేరు. గృహయజమానుఁడొక్కఁడే యయ్యు నొకరికిఁ దండ్రియు నొకరికన్నయు నొకరికిఁ దమ్ముఁడు నొకరికి మామయు నొకనికి మగఁడునై యుండి యాయానామములతో నాయాబంధువులచేఁ బిలువఁబడుచున్నట్లే భగవంతుఁడొక్కఁడయ్యు భక్తుఁడే యవస్థలోఁ దన్నుఁ జూచునో యాయవస్థనుబట్టి వేరువేరు భక్తులచే వేరువేరునామములతోఁ బిలువఁబడి వేరువేరు రూపములతో వర్ణింపఁబడును.

(9) కుండల దుకాణములో బాన, చట్టి, పిడత, మూకుఁడు కూడా మొదలైన నానారూప భేదములుగల వస్తువులుండును. కాని యవియన్నియు మట్టితో చేసినవే. అట్లే భగవంతుఁడొక్కఁడే కాని యతడు భిన్నకాలములలో భిన్నదేశములలో భిన్నరూపములతోను భిన్నావస్థలతోను సేవింపఁబడుచున్నాడు.

(10) దేవుఁడొక్కఁడే కాని యతని యవస్థలు బహువిధములు. ఒక్కశాకమే తెచ్చి పాకభేదములచేతనది యనేకరుచులు గల్గియుండునట్లు చేయవచ్చును. అట్లే దేవుడొక్కఁడే యయ్యు, నవస్థాభేదములను బట్టి భక్తులచే వేరువేరు భావనలచే భజియింపఁబడు చున్నాడు.

(11) మనుష్యుఁడు తలగడాసంచివంటివాఁడు. ఒకసంచి యెఱ్ఱగా నుండును మరొకటి నల్లగానుండును. వేరొకటి పచ్చగానుండును. కాని వానియన్నిటిలోనున్న దూదియొక్కటియే. మనుష్యప్రకృతియు నట్టిదే. ఒక డందముగానుండును. ఒకడు కురూపియగును. ఒకడు

పరమపవిత్రుఁడై యుండును. ఇంకొకఁడు దుర్జనుఁడగును. కాని పరమేశ్వరుఁడు వారందరిలో నున్నాఁడు.

(12) ఉదకమంతయు నారాయణస్వరూపము. కాని యెల్లవిధములైన నీళ్ళు త్రాగుటకు పనికిరావు. అట్లే భగవంతుఁడు సమస్త ప్రదేశములందున్నను ప్రతిస్థలము మనుష్యులు వెళ్ళిచూడఁదగదు. కొన్ని నీళ్ళు కాళ్ళు కడుగుకొనుటకే పనికివచ్చును. మఱినీళ్ళు సంధ్యావందనము మొదలైనవి చేసికొనుటకు పనికివచ్చును. కొన్నినీళ్ళు త్రాగుటకే తగవు. కొన్నినీళ్లు త్రాగవచ్చును. అట్లాగే స్థలము లనేకవిధములు. మనము కొన్ని స్థలములసమీపమునకు మాత్రమే పోవచ్చును. కొన్నిచోట్లకు పోనేకూడదు. కొన్నింటిలో లోపలికి నిశ్శంకముగా పోవచ్చును. కొన్నిటికి దూరమునుండియే తొలఁగిపోవలెను.

(13) దేవుఁడు పెద్దపులిలో సహితమున్నాఁడనుమాట నిజము. కాని మనము దాని దగ్గరకు పోఁగూడదు కదా! అట్లే భగవంతుఁడు పరమ దుర్మార్గునిలో గూడ నున్నాఁడనుట నిస్సంశయము. అయినను మనము దుర్మార్గుల సహవాసము మాత్రము చేయరాదు.

(14) ఎవనిని బహుజనులు గౌరవించి వానిమాట శిరసావహించి వాని యాజ్ఞాప్రకారము నడతురో యట్టి వానియందు భగవచ్ఛక్తి యధికముగా నుండును. జనబాహుళ్యముచేత గౌరవింపఁబడనివానియందు అట్టివ్యక్తి తక్కువగా నుండును.

(15) ప్రపంచమునందు గలప్రతిపదార్థము దైవమే యని గురువు శిష్యునకుపదేశించెను. శిష్యుఁడు బాహ్యార్థమే గ్రహించెను. కాని దాని పరమార్థము గ్రహింపఁజాలకపోయెను. ఒకనాఁడు శిష్యుఁడు రాజవీధినిఁ బోవుచుండఁగా నొకయేనుఁగు వాని కెదురుగా వచ్చెను. దానిఁ దోలుచున్న మావటివాఁడు తొలఁగుతొలఁగుమని చప్పట్లుకొట్టి కేకలు వైచెను. కాని యాశిష్యుఁడు కదలక తనమనస్సులో నిట్లువితర్కించు

కొనెను. నేనిప్పు డేలతొలగవలయును. నేను దేవుడను; ఏనుగుకూడ దేవుడే. దేవునకు దేవునివలన భయమేమియుండును? అని తలపోసి కదలక దారికడ్డముగా నిలిచెను. ఏనుగు విసురుగావచ్చి తొండముతో వానిని పట్టుకొనియెత్తి యావల విసరివైచెను. శిష్యుడు గట్టిగా గాయపడి గురువు కడకు పోయి జరిగిన వృత్తాంతమంతయుజెప్పి దేవున కెందుకిపరాధముం జేయవలెనని యడిగెను. అందు కుపాధ్యాయుడిట్లనెను. "సరే నీవు దేవుడవు. ఏనుగుకూడ దేవుడే. మావటివాడుకూడ దేవుడే కదా! మావటివాని రూపమున వచ్చి దేవుడు తొలంగుమని నిన్ను హెచ్చరించి నప్పుడు నీవు మూఢుడవై తొలగక యేలనిల్చితివి."

(16) భగవంతుడును వాని మహిమలు వర్ణించునట్టి భాగవత పురాణములు పరమ భాగవతోత్తముడైనభక్తుడును సమానులేయని గ్రహింపవలయును.

(17) ప్రతిపురుషుడు నారాయణుడు. మనుష్యుడు కాని జంతువు కాని మహర్షి కాని సిద్ధుడు కాని సమస్తవస్తువులు నారాయణ స్వరూపములే.

(18) మంచుమాట చాలమంది వినియుందురుగాని దానిజూచి యుండరు. అట్లు మతబోధకులలో ననేకులు భగవంతుని గుణములు గ్రంథములలోం జదివి తెలిసికొన్న వారేకాని యనుభవముచేత గ్రహించినవారు లేరు. మఱియు మంచు జాలమంది కన్నులతోంజూచిన వారేకాని నాలుకమీఁద వైచుకొని రుచింజూచినవారు పెక్కండ్రు లేరు. అట్లేమతబోధకులలో ననేకులు భగవద్విలాస మణుమాత్రముజూచి యుందురుగాని సంపూర్ణ దివ్యతేజముంజూచియుండరు. మంచురుచి చూచినవాఁడ యది యట్లుండునో చెప్పగలడు. ఒకమారు సేవకుడై మరియొకసారి స్నేహితుడై యింకొకసారి ప్రణయజనుడై వేరొకసారి

తన్మయుఁడై యెవ్వఁడునానావస్థలలో భగవంతుని సహవాసముఁ జేయునో వాఁడే భగవంతుని గుణవిశేషములనొక్కొక్కవకాఁ గాంచఁ గలఁడు.

(19) చమురులేక దీపము వెలుగఁజాలదు. అట్లే భగవంతుడు లేకుండ మనుష్యుడు బ్రతుకజాలఁడు.

(20) మానవ శరీరము పొయ్యిమీఁద కాలుచున్న కుండ. ఇంద్రియములు మనస్సు మొదలైనవి యాకుండలో నుడుకుచున్న బియ్యమో దుంపదినుసులో కాగుచున్న నీళ్ళో యని తలంపవలయును. నీవు కుండను గాని యుడుకుచున్న వస్తువులను గాని తాఁకుదువేని నీచేయి కాలును. అవేఁడి సహజముగ మట్టికుండది కాదు. అందులో నున్న వస్తువులది కాదు. ఆ వేఁడి యగ్నిది. అలాగే మనుష్యునియందున్న ఈశ్వరుడను నగ్ని, ఇంద్రియములు, మనస్సు మొదలైనవాటిచేత వాటికృత్యములు చేయించుచుండును. ఆయగ్ని చల్లబడినపుడే ఇంద్రియములు, సర్వావయవములు తమతమ పనులను మానును.

(21) భగవంతు డిట్లనుచున్నాఁడు. "జంతువులను కరచునట్టి విషసర్పమును నేనే; ఆవిషబాధ తొలగించు మంత్రగాడను నేనే; శిక్ష విధించునట్టి న్యాయాధిపతిని. నేనే. కొరడాతోఁగొట్టి విధింపబడిన శిక్షను జరుపునట్టి వాఁడను నేనే.

(22) దొంగతనము చేయుమని దొంగను బురికొల్పువాఁడు దేవుడే. దొంగవచ్చును. జాగ్రత్తయని గృహవాసులను హెచ్చరించువాఁడు దేవుడే.

(23) సర్వేశ్వరుఁడు శరీరములో నెట్లు నివసించును? పిచికారీలో కఱ్ఱ యున్నట్లే దానిలోనుండియు దానికంటె భిన్నముగానుండును.

(24) భగవంతుఁడు సూది బెజ్జములో గొప్పయేనుగును గుచ్చి సన్నదారమువలె యీవలకు లాగగలఁడు. అతఁడు సర్వశక్తుఁడు. ఏమిచేయ దలఁచిన నది చేయఁగలఁడు.

(25) తామరాకాడల చేతను నాచుచేతను గప్పఁబడిన చెరువు లోనిదుముకులాడు చేపలు పైకిఁగనఁబడవు. అట్లే మానవ శరీరములో నున్న సర్వేశ్వరుఁడు మాయచేతఁ గప్పఁబడి మానవదృష్టికి గోచరుడుగాడు.

(26) ఒకమనుష్యుఁడు కల్పవృక్షము క్రింద గూర్చుండి తాను రాజుకావలయునని కోరెను. అతఁడు వెంటనే రాజయ్యెను. తర్వాత నతఁడు చక్కని యప్సరస తనప్రక్కను కూర్చుండవలయునని కోరెను. వెంటనే దివ్యమంగళ విగ్రహముగలయొక స్త్రీ యతని ప్రక్కను గూర్చుండెను. పిమ్మట నతఁడు పెద్దపులి వచ్చినన్ను మ్రింగిన నెట్లుండునో యనితలంచెను. అనుకొనుటయే తడవుగా నతఁడు పులినోటఁబడెను. భగవంతుఁడా కల్పవృక్షమువంటివాఁడు. "నేను దిక్కుమాలిన వాఁడను. నిర్భాగ్యుఁడను" అని యెవఁడు తలంచునో వాఁడుసరిగా దిక్కుమాలినవాఁడు నిర్భాగ్యుఁడునై యుండును. కానిపరమేశ్వరుఁడు తనకు తోడునీడయై తనకోరికలనెల్ల దీర్చి తన్ను గాపాడునని యెవఁడు తలంచి నమ్మునో వాఁడాయనవలన తనమనోరథసిద్ధిఁబడయఁగలఁడు

(27) భూమి యజమానుఁడు మిక్కిలిభాగ్యవంతుఁడైనను దన నేలమన్ను వ్యవసాయముఁజేసెడు పంటకాపు తెచ్చియిచ్చెడుచిన్న కానుకను గూడ మిక్కిలి ప్రేమతోడను సంతుష్టితోడను గ్రహించి యానందించును. అట్లే భగవంతుఁడు సర్వశక్తుఁడయ్యు భక్తులు జేయునట్టిచిన్నిపూజకు సంతసించును.

(28) గంటవాయించినపుడు కంగుకంగుమను శబ్దములు స్పష్టముగా వినఁబడి లెక్కించుటకు వీలుగా నుండును. కాని గంటకొట్టుటమానగానే కంగుకంగుమను శబ్దములుపోయి రెండునిమిషములవఱకు గుయ్యి అను శబ్దము భేదించుటకు వీలులేక వినఁబడును. రెండువిధ

ములుగా వినబడునట్టి యాఘంటానాదమువలెనే భగవంతుడు నిరూపించుటకు శక్యముగాను నశక్యముగాను గూడనుండును.

(29) వ్రాతనేర్చుకొనుటకు మొదలుపెట్టిన పిల్లవాడు మంచి దస్తూరికుదుర్చుకొనుటకై ముందు పెద్దసున్నలవరవడిచూచి వ్రాసినట్లు మొదట మనస్సు ఆకారముగల వస్తువులమీద నిలిపిచిత్తవృత్తినిరోధముచేసికొన వలయును. ఆపనిలో మనము నేరవేరినిమీదని నిర్గుణబ్రహ్మముమీద మనసు చులకనగా నిలుపవచ్చును.

(30) వేటకాడు పెద్దగురిచూచి కొట్టుటకుముందు అలవాటు చేసికొని యందారితేరిన తర్వాత సూక్ష్మలక్ష్యముల ననాయాసముగా గొట్టగలుగునట్లే మనుష్యుడు తనమనస్సు ముందుగా రూపములుగల విగ్రహములమీద స్థిరముగా నిలుపుట నేర్చుకొన్నపక్షమున కాలక్రమమున రూపములేని విగ్రహములమీదకూడ మనస్సు స్థిరముగా నిలపవచ్చును.

(31) భగవంతుడు సర్వస్వతంత్రుడు నిత్యుడునైన పరబ్రహ్మము జగత్పిత. దేశకాలములచేత పరిచ్ఛేదింపబడని నిర్గుణబ్రహ్మము మితియు మేరయులేని మహాసముద్రము. మనుష్యుడందులో ప్రవేశించెనా గట్టుగానలేక కొట్టుకొని మునిగిచచ్చును. కాని సగుణబ్రహ్మమైన హరియొక్క సాన్నిధ్యమును నేను పొందితినేని సముద్రముపడి మునిగిపోయెడువాడు గట్టు జూచినప్పు డెంతయానందించునో అంతయానందమును శాంతిని బొందుచుండును.

(32) దేవుడు నిరాకారుడు, సాకారుడుకూడనై యున్నాడు. ఆతడు ఆకారమును నిరాకారతనుకూడ వ్యక్తిత్వము (transcends) చేయగలపరవస్తువు. అతడు మరియెట్టివాడో యాతడే చెప్పవలయును.

(33) భక్తిమార్గములో నొకానొక దశయందు భక్తుడు, ఆకారముగల యీశ్వరునిఁజూచి సంతుష్టుడగును. మరియొకదశలో నిరాకారుడైన యీశ్వరునియందు రమించును.

(34) సాకారుఁడైన యీశ్వరుఁడు కంటికగపడును. అంతేకాదు. మనమతనిని ముఖాముఖిగా జూచి ప్రియమిత్రునిఁ గనుగొన్నట్లే హస్తములతో స్పృశింపవలెను.

(35) నేనొకప్పుడు వస్త్రముల ధరించి మరియొకప్పుడు దిగంబరినై యుండునట్లే భగవంతుడొకప్పుడు సగుణుడు, మరియొకప్పుడు నిర్గుణుడు.

(36) నీరు పేరుకొని మంచుగడ్డ యైనట్లే దృశ్యమానమగు నీశ్వరమూర్తి అవాఙ్మనసగోచరమైన పరబ్రహ్మముయొక్క భౌతిక స్వరూపము. ఆమూర్తి ఘనీభవించిన సత్యానందస్వరూపమని చెప్పవచ్చును. జలమయమై జలముయొక్క రూపాంతరమైన మంచుగడ్డనీటిలోఁ బడవైచినప్పుడు కొంతసేపటికి కరగి మరల నీరై పోవునట్లు సగుణబ్రహ్మము నిర్గుణబ్రహ్మముయొక్క రూపాంతరము. నిర్గుణబ్రహ్మమునుండి బయలుదేరి యీసగుణబ్రహ్మము కొంతసేపా రూపముతోనుండి మెట్టకేలకు నిర్గుణబ్రహ్మమునలీనమై యదృశ్యమగును.

(37) భగవంతుఁడు జ్ఞాననిలయుఁడు. అతనిపేరుజ్ఞానము. ఇన్నిమాట లెందుకు. అతఁడు జ్ఞానమయుఁడు జ్ఞానస్వరూపుఁడు.

(38) మనుష్యుల చేష్టలలో రెంటినిఁజూచి భగవంతుఁడునవ్వుచుండును. మొదటిది అన్నదమ్ములు పిత్రార్జితమైన యాస్తి "ఇదినాది యది నీది" యని పంచుకొనునపుడు. రెండవది రోగి చావునకుసిద్ధముగా నున్నపుడువైద్యుడొకడువచ్చి "నేను వీనిని బ్రదికించెద"నని చెప్పినపుడు.

(39) పిచ్చివాండ్రు, త్రాగుబోతులు, చిన్నపిల్లలు భగవంతునిచేత నావేశింపబడినవారివలెనే తమమాటల యర్థము తెలియకయే తమంతటతాము సత్యము పలుకుచుందురు.

(40) సూర్యమండలము భూమికంటె నెన్నోరెట్లు పెద్దది. కాని కడుదూరమునుండబట్టి యదిగుండ్రనిపళ్ళెమువలెఁ గనబడుచున్నది. అట్లె భగవంతుఁడు అప్రమేయమహాస్వరూపుఁడు. కాని మన మాయనకు మిక్కిలి దూరమున నుంటచే మనమాయన యాధిక్యమును లేశమైన భావింపలేకయున్నాము.

(41) తెలిసిగాని తెలియకగాని భగవంతుని నామస్మరణము మనము చేసినపక్షమున దానిఫలము తప్పక గల్గును. తనయిష్టప్రకారము నదికిఁబోయి స్నానముఁజేసినవాఁడు స్నాన ఫలమును బొందును గదా! అట్లె యొకరి బలవంతముమీఁద నదికిఁబోయి స్నానముఁ జేసినవాఁడును స్నానఫలము ననుభవించును. ఒకఁడు నిద్రపోవుచున్నప్పుడు మరియొకఁడు వానిమీఁద నీళ్ళుపోసి స్నానము జేయించినను స్నానఫలమనగా పరిశుభ్రత వానికిఁ గలుగకపోవునా?

(42) హరికీర్తన లేగృహమందు నిత్యము గానము జేయఁబడునో యాగృహమున సైతాను కాలు బెట్టలేఁడు. (సైతానునగా మనుష్యులను దుష్టమార్గములకుఁ బురికొల్పి వానిచేతను పాపముఁ జేయించునట్టిభూతము.)

(43) ఒకరాజు బ్రాహ్మణునిఁ జంపి పశ్చాత్తాపము నొంది నాకీబ్రహ్మహత్యా మహాపాతక మెట్లుపోవునని తెలిసికొనుటకై యొక మహర్షి యాశ్రమమునకుఁ బోయెను. అప్పుడు మహర్షి యింట లేకపోయెను. ఋషికుమారుఁడు రాజువలన వాని దీనవృత్తాంతమువిని "రాజా! నీవు మూఁడుసారులు రామనామముస్మరియింపుము. అంతట నీపాతకము పోవును" అని చెప్పి వానింబంపి తండ్రి

వచ్చినతర్వాత జరిగిన వృత్తాంతమంతయుఁ జెప్పెను. అది విని మహర్షి కోపించి యిట్లనియె. "ఒక్కసారి రామనామ ముచ్చరించినంత మాత్రమునసనే బహుజన్మసంచితములైన మహాపాతకములు నశించునుగదా! రామనామము ముమ్మారునుస్మరింపుమని యీతనితో నేలజెప్పితివి? నీకు రామనామమునందు భక్తి స్థిరముగా కుదరలేదు. నీవుచండాలుఁడవుగమ్ము" అనిశపింపఁగా ఋషికుమారుఁడు రామాయణములో జెప్పబడిన గుహుఁడయ్యెను.

(44) ఎఱిఁగియైనను నెఱుఁగకయైననునరే యమృతకుండొట్టిలోఁ బడినవాఁడు చావులేనివాఁడగును. అట్లే యిష్టపడియైననుసరే యిష్టపడకయైననుసరే భగవన్నామము నుచ్చరించినవాఁడు తప్పక ముక్తుఁడగును.

(45) గొప్ప పొగయోడ సరుకుపడవలను తెప్పలను వెనుకఁగట్టుకొని వాటి లాగుకొని నీటిమీద నిరపాయముగా పోవునట్లు జగద్రక్షకుఁడౌకఁడు భూమిపై నవతరించి మాయాసముద్రములో మునిఁగిపోకుండ వేలకొలఁది మనుష్యులను నిరపాయముగా నావలకు తీసికొనిపోవును.

(46) వరదవచ్చినప్పుడు నదులు వాగులు వెల్లివిరిసి చుట్టుప్రక్కలనున్న నేలయంతయు జలమయమగునట్లు చేయును. కాని వాననీరు మునుపేర్పడినదారులగుండ ప్రవహించిపోవును. మహానుభావుఁడును భూమిపై నవతరించినప్పుడు వాని దయవల్ల నందరు ముక్తులగుదురు. సిద్ధులు మిక్కిలికష్టపడి ఘోరతపముచేసి తాముమాత్రమే మోక్షపదమును బడయుదురు.

(47) పెద్దదూలము ప్రవాహములో కొట్టుకొనివచ్చినప్పుడు తాను నూర్గురు మనుష్యులనైన నది రక్షించును. కాని యది మునుఁగదు. దుబ్బుకొట్టుకొని వచ్చినప్పుడు కాకివ్రాలిన నది మునిదిపోవును.

అట్లే యొకమహానుభావుఁ డవతరించెనేని వానిశరణముఁ జొచ్చి లెక్క లేనంతమంది మనుష్యులు రక్షింపఁబడుదురు. సిద్ధుఁడు మిక్కిలి శ్రమ పడి తన్నుమాత్రమే రక్షించుకొనఁగలుగును.

(48) ఆవిరియంత్రము సరుకులతో నిండిన గొప్పబరువు బండ్ల గుంపును వెనుకదగిలించుకొని యనాయాసముగా లాగుకొనిపోయి తాను గమ్యస్థానమును జేరుటయేకాక వాటినిగూడ చేర్చును. జగద్రక్షణ పరాయణులైన మహానుభావులుగూడ నిట్లే సంసార దుఃఖభారముచే నిండిన మనుష్యులను తండోపతండంబులుగా దీసు కొని పోయి భగవంతుని పాదములయొద్ద పడవేయుదురు.

(49) శ్రీరాముఁడు భూలోకమున నవతరించినప్పుడు అతఁడు నారాయణావతారమని సప్తమహర్షులు మాత్రమే గ్రహింపగలిగిరి. కావున దేవుఁడీలోకమున నవతరించినప్పుడు ఆయన యట్టివాఁడని తెలిసి కొనువారు స్వల్పముగానుందురు.

(50) పరబ్రహ్మమని యెడుపక్షముమీఁద లెక్కలేనంతలు రాములు, కృష్ణులు, క్రీస్తులు వసియించుచుందురు. వారిలో నొకరిద్దరు నడుమనడుమ నీలోకమునకు వచ్చి యత్యద్భుతములైన మార్పులను జేయుచుందురు.

(51) అవతారపురుషుఁడు భగవంతునిదూత. అతఁడు మహాచక్రవర్తియొక్క రాజప్రతినిధివంటివాఁడు. చక్రవర్తి తనరాష్ట్రములో దూరపుమండలములయందు సంక్షోభములు గల్గినపుడు వాటినడచుటకై తనప్రతినిధి నచ్చటికి బంపినట్లే ప్రపంచమునందే భాగము నందైన మతము క్షీణించి ధర్మములు చెడినపుడు ధర్మసంస్థాపనార్థము భగవంతుఁడు తనయవతారము నక్కడకుఁ బంపును.

(52) అవతారపురుషుఁ డొక్కఁడేకాని జీవసముద్రమునందు మునిఁగి యొకానొకచోట తేలి యచ్చట కృష్ణుఁడనిపించుకొనును. మరల

నింకొకచోట మునిఁగి లేచి శ్రీస్తువనిపించుకొనును.

(53) మంచువేసవిలో నీళ్ళు మిక్కిలి లోతునూతులనుండి మిక్కిలి శ్రమతోఁ దోడుకొనవలసివచ్చును. కాని వర్షకాలమున దేశమంతయు వరదలతో నిండినప్పుడు నీరు ప్రతిచోట సులభముగా దొరకును. అట్లే జపతపములచేతను ప్రార్థనలచేతను మనము మిక్కిలి కష్టమున భగవంతుని సాన్నిధ్యముఁ జేరఁగలుగుదుము. కాని యవతారమనియెడు వరదపొడిచినప్పుడు భగవంతుఁ డిక్కడక్కడ యనక ప్రతిస్థలమునందు దొరకును.

(54) ఉపయోగించెడువారు లేక మంటితోఁ గప్పఁబడి పూడిపోయి గడ్డిగాదములతో నిండియుండిన పాత బావి కనిపెట్టి త్రవ్వించి మరలనది జనులకుపయోగపడునట్లు చేయువాఁడు సిద్ధపురుషుఁడు. అదివఱకెప్పుడు బావిలేనిచోట జలమున్నచో నెఱిఁగి బావి త్రవ్వించువాఁడవతారపురుషుఁడు. మంచితనము పవిత్రత మొదలైనయుత్తమలక్షణములు, ఎవరియందడఁగి సహజముగానుండునో వారికే సిద్ధపురుషులు మోక్షమీయఁగలుగుదురు. భక్తిజ్ఞానశూన్యమై యెడారివలె నెండిపోయిన హృదయములుగల పరమశుంఠలనహితమవతారపురుషుఁడు రక్షించి మోక్షమునకుఁ బంపును.

(55) అర్జునుఁడు, రాముఁడు, కృష్ణుఁడు, ద్రౌపది, సీత, రాధ మొదలగువారు నిజముగా లోకమున వసియించిన మానవులుగారనియు కేవలముఁ గల్పితస్త్రీపురుషులనియు మీరుతలంపవద్దు. వారునిజముగా మనవలెనే రక్తమాంసమయములైన శరీరములుగలిగి లోకమునవిహరించినవారేకాని వారు దేవతలగుటచే చారిత్రకపురుషులు గాను ఆత్మజ్ఞాన వేత్తలుగాను చూడ వ్యవహరింపఁబడుచున్నారు.

(56) భగవంతుఁడు మానవ శరీరముఁదాల్చి యవతరించినప్పుడితఁడెంత స్వార్థత్యాగముఁ జేయునో యించుకైన తెలిసికొనుటకష్టము.

(57) సముద్రమునకు మహాతరంగములెట్టివో పరబ్రహ్మమున కు జగద్రక్షకులైన మహానుభావు లట్టివారు.

(58) ఏస్థితిలోనున్న వాఁడు సిద్ధుఁడనంబడును? జ్ఞానపరిపక్వమైన యవస్థయందున్న వాఁడు సిద్ధుఁడు. బంగాళదుంప, వంకాయ మొదలగు నవి పక్వమగునపుడు మెత్తపడును. పరిపక్వమొందిన యవస్థయందున్న సిద్ధుఁడుగూడ మెత్తనివాఁడై దయారసముఁగలిగి వినయసంపదఁ గలిగియుండును.

(59) ఐదువిధములైన సిద్ధులీప్రపంచమునఁగనఁబడుచున్నారు.

(1) స్వప్నసిద్ధులు. అనఁగా స్వప్నములలో జ్ఞానబోధముఁ గలిగి సిద్ధులైనవారు.

(2) మంత్రసిద్ధులు. మహామంత్రోపదేశములవల్ల సిద్ధులైనవారు.

(3) హఠసిద్ధులు. ఆకస్మికముగా సిద్ధులైనవారు. పాతుదొరుకుటవల్ల భాగ్యవంతురాలైన పిల్లను బెండ్లియాడుటవల్లగాని హఠాత్తుగా నిరుపేద భాగ్యవంతుఁడైనట్లే పాపకర్మలు పశ్చాత్తాపము వల్లనో మరేకారణముచేతనో ఆకస్మికముగ సిద్ధులగుచుందురు; అట్టివారే హఠసిద్ధులు.

(4) కృపాసిద్ధులు: రాజానుగ్రహముచేత పరమదరిద్రుఁడు భాగ్యవంతుఁడైనట్లు పరమేశ్వరానుగ్రహముచేత నాత్మావబోధముఁ గలిగినవారు కృపాసిద్ధులనఁబడుదురు.

(5) నిత్యసిద్ధులు: వీరెప్పుడు పరిపూర్ణులే. గుమ్మడితీగ ముందు కాయలుకాచి పిమ్మట పువ్వుపూచినట్లు నిత్యసిద్ధులు సత్కర్మల వల్ల సిద్ధులుగాక ముందుగానే సిద్ధులైపుట్టి తర్వాత సత్కర్మలఁ జేయుదురు. వారు కర్మలు జేయుట తమసిద్ధి కొరకుగాదు. మానవ కోటికి కార్యాచరణమువల్ల దారిఁజూపుటకు మాత్రమే.

(60) హోమపక్షులని యొక జాతిపక్షులుగలవు. అవి యాకా

శమున మిక్కిలి యెత్తైన ప్రదేశములయందుండును. ఆప్రదేశములు వాటికి మిక్కిలి ప్రియములు. ఆతావులువిడిచి అవి క్రిందికి దిగనిచ్చగింపవు. అవి యాకాశమునందే గూడుకట్టును. ఆగుడ్లు భూమియొక్క యాకర్షణశక్తిచేత నేలబడుటకై క్రిందికి దిగజారును. అవి యున్నచోటికి నేలకును దూరము మిక్కిలి యెక్కువగుటచే నవి నేల బడుటకు కొంతకాలముపట్టును. నేలపడకముందే ఆ గుడ్లు పొదిగి తల్లులు పిల్లలను జేయును. ఆపిల్లలకు పైనుండుటే సహజలక్షణమగుటచేత నథో మార్గమునువిడచి పూర్వము తమతల్లులుండిన స్థానమును చేరును. శుకయోగి, నారదుడు, యేసుక్రీస్తు, శంకరాచార్యులు మొదలగు మహానుభావులా పక్షులవలెనే మిక్కిలి చిన్నతనమునందే యీ లోకసంబంధములను విడిచిపెట్టి యూర్ధ్వలోకదృష్టిగలవారై దివ్యజ్ఞాన తేజముగలిగి కృతార్థులైరి. వారే నిత్యసిద్ధులు.

(61) దివ్యమహర్షులు భగవంతునకాప్తబంధుకోటిలోఁ జేరుదురు. వారు దేవునకు, మిత్రులు, బంధువులు మొదలైనవారివంటి వారు. సాధారణమనుష్యులు భగవంతునకు దూరపరిచితులు.

(62) ఒకమేకుతో మనము కొబ్బరికాయను గట్టిగా పొడిచితిమేని మేకు పెంకులోనుండి లోపలిగుంజులోనికి దిగును. కాని కాయ కురిడియైనప్పుడు మేకు పెంకును భేదించుకొని పోవునుగాని కురిడీకి తగులదు. ఎందుచేతననగా కురిడీపెంకు నంటుకొనక విడిగానుండును. ఏసుక్రీస్తు కురిడికాయవంటివాడు. ఆతనియాత్మ కురిడీ, అతని శరీరము పైచిప్ప. అతనియాత్మ శరీరమునంటక వేరుగానుండును. అందుచేతనే నతనిశరీరమునకు గలిగిన బాధ యాత్మను నొప్పింపజాలక పోయెను.

(63) ఒకసాధువు జనసమ్మర్దముగల యొక పట్టణవీధిలో నడచుచు పొరబాటుచేత నొక దుర్మార్గునివ్రేలు త్రొక్కెను. ఆ దుర్జ

నుఁడు కోపావేశము నొంది సాధువును తన చేతిదుడ్డుకఱ్ఱతో గొట్టెను. సాధువు దెబ్బలకోర్వలేక నేలఁబడి మూర్ఛిల్లెను. ఆయన శిష్యులు నానావిధములైన యుపచారములుచేసి కష్టపడి యతనికి తెలివివచ్చునట్లు చేసిరి. కొంత తెలివివచ్చినతర్వాత శిష్యులలో నొకఁడు గురువు నిట్లడిగెను. స్వామీ! మీకుపచారము చేయుచున్నవా రెవరో గుర్తు పట్టగలరా? ఆ సాధు విట్లు బదులుచెప్పెను. "నన్ను గొట్టినవాఁడే నా కుపచారముచేయుచున్నాఁడు" నిజమైన సాధువునకు మిత్రశత్రువులు సమానులు.

(64) పాలు నీరు కలసియున్నప్పుడు హంస నీరక్షీరములను విభాగింపఁగలదు. అనగా పాలు త్రాగి నీరు విడిచిపెట్టగలదు. తక్కినపక్షులాలాగున జేయఁజాలవు. అట్లే దేవుఁడు మాయతోఁ గలసియున్నాఁడు. సామాన్యమనుష్యులు మాయకంటె భిన్నముగానున్న పరమేశ్వరుని జూడఁజాలరు. పరమహంసమాత్రమే మాయను ద్రోచివైచి భగవంతుని గ్రహింపఁగలుగును.

(65) గాలి మంచిగంధపు వాసనను తెచ్చును. అమేధ్యవాసనను తెచ్చును. కాని గాలి యీ రెండింటితోఁ గూడ గలియదు. ఆలాగే సిద్ధుఁడు ప్రపంచమునందు నివసించుచున్నను దానినంటియుండఁడు.

(66) సిద్ధుఁడు నీటిలోనున్న తామరాకువలె బురదలోనున్న చేఁపవలె నుండును. తామరాకునకునీరంటదు. చేఁపకు బురద యంటుకొనదు.

(67) ప్రవాహముగ యేటినీరు పారుదల గలిగియుండుటచే చెరువునీరువలె పాడుగాదు. అట్లే ధనము నిస్సంగులైనవారిచేత బడి వెంటనే మరియొకచోటికి బోవునుగాని నిలువయుండదు.

(68) కాలిపోయినత్రాడు దానియాకారమును విడువక బూడిదయై బూడిదత్రాడువలె నుండును. కాని దానితో మనమేవస్తువును

కట్టజాలము. అట్లేముక్తి జెందినవాఁడు తనయహంకారమునుమాత్రము విడిచి యాత్మస్వరూపమును నిలుపుకొనుచున్నాఁడు.

(69) నీటిపక్షి నీటిలో మునిగినప్పటికి తడిదాని రెండుఱెకలనంటు కొనదు. అలాగే సిద్ధుఁడు ప్రపంచము నంటి ముట్టకుండ జీవించును.

(70) మేఁకయొక్క తల తెగవేసినతర్వాతగూడ దానిశరీరము జీవమున్నట్లే కొంతసేపు కొట్టుకొనును. అలాగే సిద్ధులలోనున్న యహంకారము నిర్మూలనమైనప్పటికి భౌతికశరీరముయొక్క వ్యాపారములకు తగినంత చైతన్య మతనిలో నుండును. కాని సంసారములో నతనిని మరల బంధించుటకు మాత్ర మది చాలదు.

(71) అచ్చమైన బంగారముతో నగలు చేయుటకు వీలులేదు. మరియొక ద్రవ్యమేదో కొంతకలుపవలెను. అట్లే మనుష్యుఁడు కొంత మాయతో కలసి యుండవలెను. మాయలేనివాఁ డిరువదియొక్క రోజు లంటె నెక్కువ బ్రతుకఁడు. శరీరమున్నంతకాలము దేహసంబంధ ములైన వ్యాపారములను జరుపుటకు మిక్కిలి కొంచెమైనను మాయ యుండవలెను.

(72) దాగుడుమూతలాటలో తల్లియని యొకఁడు కూర్చుండి ఆట తానాడక కన్నులు మూయుచుండును. పరుగెత్తుకొనివచ్చి తల్లి నిముట్టుకొన్నవాఁడు దొంగకాఁడు. అలాగే భగవంతునొక్కసారి చూచినవాఁడు సంసారసంబంధమైన సంకెళ్ళచే కట్టబడఁడు. ఆటలో తల్లిని ముట్టుకొన్న పిల్లవానిని తక్కినపిల్లలు తరుముకొనివెళ్ళి దొంగను సేయరు. అందుచేత నతఁడు స్వేచ్ఛగా నిష్టమువచ్చినచోటికి బోవవచ్చును. అట్లే యీప్రపంచమను గొప్పయాటలో భగవంతుని పాదముల నొక్కసారి ముట్టుకొన్నవానికి భయములేదు.

(73) పరశువేదిని స్పృశియించుటవల్ల నినుము బంగారమగు ను. ఆబంగారము పెంటలో పడవైచినను నేలపూడ్చిపెట్టినను నదియు

మేగమిచ్చినగాలియుగాంచే యుతడును. కాని వెనుకటి యినుపముక్క కానే రదు. భగవంతునిపాదములొక్కసారి స్పృశియించినవాని స్థితికూడ నిట్టిదే. అట్టివాఁడు నిర్జనమైన యరణ్యములోనుండనీ జనసమ్మర్దము గల నగరమునందుండనీ యుతని మాలిన్య మెంతమాత్రము నంటదు.

(74) పరుసువేదినిదాకినతోడనే యినుపకత్తి బంగారుకత్తి యగును. అది పూర్వస్వరూపమును విడువకున్నను నఱకునట్టి శక్తి యేమాత్ర మింక కలిగియుండదు. అట్లేభగవంతుని పాదములనుబట్టుకొన్న వాఁ డెప్పటి యాకారములోనున్నను నటమీద దుష్కార్యము చేయజాలఁడు.

(75) సూదియుంటు రాతికొండ సముద్రములో దాగియుండి నీటిమీద నడచుచున్న యోడ నాకర్షించి దానిలోనున్న నినుపమేకులను తన వ్రక్కకు లాగుకొని కఱ్ఱపలకలు విడిపోవునట్లు చేసి ముంచివేయును. అట్లే మనుష్యునియాత్మ సర్వేశ్వరుని ప్రభావమున అయస్కాంతముచేత నాకర్షింపబడినప్పుడు ఆసర్వేశ్వరప్రభావము జీవాత్మ యొక్క స్వార్థపరత్వమను నహంకారమును నాశనముజేసి యీశ్వర దయాసముద్రములో దానిని ముంచివేయును.

(76) పాలు నీలుకలసినప్పుడు మరల వానినెవ్వఁడు వేరుచేయలేనట్లు కలసిపోవును. అలాగే యాత్మాభివృద్ధినికోరు క్రొత్తశిష్యుఁడు వీరువారనక మొల్లవారితో గలిసిమెలసి తనపూర్వవిశ్వాసములను నాశనము చేసికొనును. పాలు కాచి వెన్నచేసినతర్వాత నావెన్న నీటిలో నుంచినప్పుడు దానిలో గలియక తేలుచుండును. ఆవిధముగానే జీవాత్మ పరమాత్మయొక్క సంపర్కము కలిగియుండినపక్షమున నది యేసంఘములోనున్నను దానియొక్క కాలుష్య మంటకుండ నిర్మలమైయుండును.

(77) అత్తవారింటికి క్రొత్తగా కాపురమునకు వెళ్ళినపడుచు

సంతానము కలుగువరకు మిక్కిలి జాగరూకతతో నింటిలోని పనిపాటలు చక్కపెట్టుకొనుచుండును. కాని బిడ్డపుట్టినతోడనే మునుపటి వలెనే యింటిపనులమీఁద దృష్టినిలుపదు. అవిచేయుటతో నామెకు మునుపటివలె సంతోషముండదు. మీఁదుమిక్కిలితనబిడ్డతోనేస్వర్గము మోక్షమున్నదని రెండవపనిపై ధ్యానముంచక దానిముద్దుముచ్చటల తోనే కాలముపుచ్చును! అలాగుననే మనుష్యుఁ డజ్ఞానములోఁబడి యున్నంతకాలము ప్రపంచవ్యాపారములను చేయుచుండును. కాని భగవంతుని దర్శనమైనతోడనే లోకవ్యాపారములమీఁద వానికి రుచి తప్పిపోవును. భగవంతుని సేవసేయుటయే యతనికి సుఖము.

(78) మనుష్యుఁడు సంతకు దూరముగా నున్నప్పుడు వానిచెవులకు హోరుమను ధ్వనిమాత్రమేవినఁబడునుగాని మనుష్యకంఠములు స్పష్టముగా వినబడవు. కాని యతఁడు సంతలో బ్రవేశించినతర్వాత నొకఁడు దుంపలకొరకు, వేరొకఁడు వంకాయలకొరకు, మరియొకడు మరియొక వస్తువుకొరకు బేరమాడుచున్నట్లు మనుష్యకంఠములు స్పష్టముగా వినఁబడును. అట్లే మనుష్యుఁడు భగవంతునకు దూరముగానున్నంతసేపు హేతువాదములలోను గొప్పచర్చలలోను దిగి కళవళపాటు పొందుచుండును. కాని భగవంతునిసన్నిధికిఁబోయినతోడనే చర్చలు, హేతువాదములు నడుగంటును. భగవంతుని మాయలు మిక్కిలిస్వల్పముగా నతఁడు తెలిసికొనఁజాలును.

(79) ఎంతకాలము మనుష్యుఁడు ఓయీశ్వరా! ఓయీశ్వరా! యని పిలుచుచుండునో యంతకాలము వానికీశ్వరుఁడు కనబడలేదన్నమాటే. ఎందుచేతనన సర్వేశ్వరుని జూచినవాఁడు నోరెత్తక నిశ్శబ్దముగా నుండును.

(80)తుమ్మెద తామరరేకులలో జొచ్చి యందలి తేనెత్రాగకమునుపు జుమ్మని రొదచేయుచు, పువ్వుచుట్టుతిరుగుచుండును, పువ్వు

లోపలవొచ్చి మకరందము గ్రోలినపిదప నది నిశ్శబ్దముగా నుండును. మనుష్యుఁడు భగవంతునిగూర్చి చర్చలు వాదములుచేయుచుండెనేని దృఢభక్తియనెడు మకరందమును వాఁడు రుచి చూడలేదని యర్థము. అది యొక్కసారి చవిచూచిన నతఁడు మరి నోరెత్తఁడు.

(81) చిన్నపిల్లలు బొమ్మలుపెట్టుకొని యాడుకొనుచుందురు. తల్లికనబడగానే అమ్మా! అమ్మా! యని వెంటబడుచుందురు. అట్లే మీరుకూడ ధనము, గౌరవము, కీర్తి యను బొమ్మలతో నాడుకొను చు నెట్టిచింతలు లేక యున్నారు. కాని లోకమాతయైన యాదేవి నొక్కసారి మీరు చూచితిరేని ధనముమీఁదను, గౌరవముమీఁదను కీర్తిమీఁదను మీకు దృష్టియుండదు. అవి యావలబారవైచి మీరు తల్లివెంట బడుదురు.

(82) తోతపూరియను దిగంబరస్వామి యిట్లు చెప్పుచుండెడి వాఁడు. "ప్రతిదినము తోమకపోయినపక్షమున నిత్తడిపాత్ర త్రుప్పు పట్టును. అట్లే మనుష్యుఁడు ప్రతిదినము భగవంతుని ధ్యానముచేయక పోయినపక్షమున నతని హృదయము క్రమక్రమముగా మలినమగు ను" అతనికి శ్రీరామకృష్ణపరమహంసయిట్లు బదులుచెప్పెను. "అవు ను. అదినిజమేకాని యాపాత్ర బంగారపుది యయినపక్షమున నిత్య ము తోమనక్కఱలేదు. అట్లే భగవంతుని సాన్నిధ్యము జేరిన మను ష్యుఁడు నిత్యమును జపమును, ప్రార్థనలు చేయనక్కరలేదు."

(83) పటికబెల్లము రుచిచూచినవానికి వట్టిబెల్లము రుచియిం పదు. గొప్పమేడలో నిద్రపోయెడు వానికి మురికిగుడిసెలో నిద్రపట్ట దు. అట్లే బ్రహ్మానందము నొక్కసారి చవిచూచిన మనుష్యుఁడు ప్ర పంచసంబంధమైన తుచ్ఛసౌఖ్యములపై వాంఛ నిలుపఁడు.

(84) రాజుగారి ప్రాపకములోనున్న యంగన బిచ్చగాని వల పునకు జిక్కదు. అట్లే యీశ్వరానుగ్రహమునకు బాత్రుఁడైన మను

ష్యుఁడు ప్రపంచసంబంధమైన స్వల్పవస్తువులను గోరఁడు.

(85) బయలు మీఁదనున్న మనుష్యుఁడు కాలిక్రిందనున్న గడ్డిపరకలను, ప్రక్కనున్న దేవదారువృక్షములను జూచి "ఈవృక్షమెంత పొడుగుగానున్నదో, ఈగడ్డిపరక లెంతచిన్నవిగా నున్నవో" యని యాశ్చర్యమునొందును. కాని యతఁడొక గొప్ప పర్వతమెక్కి దాని శిఖరము మీఁదనుండి క్రిందికి చూచెనేని పొడుగైన దేవదారుచెట్లునేల నంటియున్న గడ్డిపరకయును నతనిదృష్టికి సమానముగాఁగనబడును. నేలయంతయు నొకపచ్చని బయలుగా నతనికంటి కగపడును. అట్లే యీలోకదృష్టిగల మనుష్యులకు గౌరవతారతమ్యములు ధనమువలన గలిగిన భేదములు కనఁబడుచుండును. కాని దివ్యజ్ఞాననేత్రము తెరచి నప్పుడు లోకములో నెక్కువతక్కువలు కనఁబడవు.

(86) వట్టికుండలో నీరు పోసినపక్షమున నొకవిధమైన చప్పుడగును. కాని నిండుకుండలో నట్టి చప్పుడుకాదు. అట్లే భగవంతుని జూడని వానికి వట్టి యార్భాటములు మెండుగానుండును. కాని యతఁడు దేవుని చూచినప్పుడు వట్టియార్భాటములు మాని బ్రహ్మానందమును నిశ్శబ్దముగా ననుభవించును.

(87). స్త్రీ తనకు తనమగనికి జరిగెడు రహస్యసంభాషణము తనకు మిక్కిలి నమ్మకగల చెలికత్తెలకు మాత్రమే చెప్పును గాని యితరస్త్రీలకు చెప్పదు. అట్లే పరమభక్తుఁడు సర్వేశ్వర సాంగత్యము వలన తనకు గలిగిన సాంద్రానందమును భక్తునకే తెలియజేయును. కాని యితరుల కెరుగఁజేయఁడు. అది చెప్పినదాక వాని కొకప్పుడు తోఁచదు.

(88) మిడత వెల్తురుచూచెనా మరలనది చీకటిలోనికి పోదు. పంచదారకుప్పలోఁ బడిన చీమ యక్కడే చచ్చునుగాని యది దాటి

పోజాలడు. అట్లే సద్భక్తుండును వైరాగ్యముతోను తనజీవితమును భగ
వదర్పణ కర్పణము చేయుచున్నాడు.

(౮౯). దైవభక్తుండు తన దైవమును తల్లియని పిలుచుటలో నెక్కువ తృప్తినొందుచున్నాడు! ఏలయన బిడ్డకు తనతల్లి యొద్ద నెక్కువ చనువుండును. అందుచే నాతని యాబిడ్డకు మిక్కిలి ప్రియముగా నుండును.

(౯౦) భంగుత్రాగువాడు పదిమందిని గూడుకొని త్రాగినట్లే సద్భక్తుడు తానొంటిగా నీశ్వరకీర్తనము చేయుజాలడు.

(౯౧) ఆవులమందలో నొకక్రొత్త జంతువు చొరబడినయెడల గోవులన్నియు దానిని బొడిచి పొడిచి తఱుమును. కాని యావులమందలో మఱియొకయావు చొరబడినయెడల నొకదాని శరీరమొకటి నాకుకొని దానితో స్నేహము చేయును. అట్లే యొక భక్తుడు మఱియొకభక్తుని కలసికొనినప్పుడు వారిరువురు మిక్కిలి సౌఖ్యమును బొందుదురు. ఒండొరుల వియోగము నోర్వజాలరు. కాని పరిహాసముం జేయవచ్చిన వారిని సమీపమునం జేరనీయరు.

(౯౨). భక్తున కేది బలము? భక్తుడు దేవుని ప్రియపుత్రుండు. కావున కన్నీళ్ళే వానికి బలము. (బాలానాం రోదనంబలం)

(౯౩) కోతిపిల్ల తల్లిని గట్టిగా గౌగిలించుకొనును. పిల్లిపిల్ల తల్లిని గౌగిలించుకొనలేదు. కాని తల్లిదగ్గఱ నున్నప్పుడు జాలిగా నేడ్చును. కోతిపిల్ల తల్లిని గట్టిగా పట్టుకొనలేక పట్టు సడలించెనా నేలంబడి చచ్చును. పిల్లిపిల్ల తల్లినే నమ్ముకొని యుండునుగావున దాని కట్టి యపాయము నెన్నడును గలుగదు. పిల్లిపిల్లను దల్లి నోటగఱచుకొని తీసికొనిపోవును. తనబలమును నమ్ముకొన్నవారికిని, దైవమునే నమ్ముకొన్నవారికిని గలభేద మిట్టిదిరా. కోతిపిల్ల తనచేతి పట్టునే నమ్ముకొనునుగావున దాని కెన్నడైన నపాయము గలదు. పిల్లిపిల్ల

తల్లినే నమ్ముకొనునుగావున దానికి భయము లేదు.

(94) స్వాతివాన కురియునప్పుడు ముత్తెపుచిప్ప సముద్రము యొక్క అడుగుభాగమునుండి పైకివచ్చి నీటిపైఁ దేలుచుండును. ఆ వానచుక్కలు కొన్ని తనలోఁబడువఱకు నోరు తెఱచుకొని యది యా నీటిమీఁదనే యుండును. ఆవర్షబిందువులు పడినపిదప నాముత్తెపుచిప్ప యడుగునకుఁ బోయి యానీటిచుక్కలను మంచిముత్యాలుగాఁ జేయును. ఆలాగే బ్రహ్మజ్ఞానోపదేశముఁ జేయునట్టి సద్గురువు తమకు లభించువఱకు నొకచోటినుంటి యొకచోటికి విధివిరామములు లేక తిరుగునట్టి జ్ఞానాసక్తులు కొందఱు గలరు. అట్లుసంచరించునప్పుడు వారియదృష్టమున జ్ఞానదిధియైన గురువు దొరకెనేని వానియుపదేశామృతమును వారు తనివిదీఱఁ గ్రోలి సంసారబంధములను భేదించి లోకమున కగపడకుండ నేమూలనో యడఁగి యుందురు.

(95) చెకిముకిరాయి యెంతకాలము నీళ్ళలోఁబడి యుండినను దాని తేజస్సును గోలుపోదు. నీటిలోనుండి తీసినవెంటనే యినుపముక్కమీఁద దానిని గొట్టిచూడుము. అగ్నికణము తక్షణమే బయలుదేఱును. దృఢవిశ్వాసముఁ గలభక్తుఁడుకూడ నట్టివాఁడే. అతఁడు లోకసంబంధమైన మాలిన్యములచేత చుట్టఁబడియుండినను వాని భక్తివిశ్వాసములు మాత్రము పోవు. భగవన్నామము చెవినిఁబడగానే యతఁ డానందముచేఁ బరవశుఁడగును.

(96) రాయి నీటిలో లక్షలకొలఁది సంవత్సరము లున్నను మెత్తబడదు. కాని మట్టినీరు దగలగానే మెత్తఁబడి బురదయగును. ఆలాగే నిజమైన భక్తివిశ్వాసములు గలవాని హృదయము కష్టపరంపరలకు లొంగి మెత్తబడదు. చంచలభక్తిగలవాఁడు స్వల్పకష్టమును గూడ సహింపలేక చెడిపోవును.

(97) చిన్నబిడ్డయొక్క యమాయకత్వమెంతో చిత్రముగా

నుండును. ధనరాశి వానియెదుటఁ బోసినను దానివైపుఁ జూడక చిన్న బొమ్మను పుచ్చుకొని యానందించును. విశ్వాసముగలభక్తుఁడు నట్టివాఁడే. లోకులందఱు ధనము, గౌరవము బిరుదులు గోరుచుండఁగా భక్తుఁడొక్కఁడే యవి కోరక యీశ్వరునిఁగోరును.

(98) భగవంతుఁడు పంచదార కుప్పవంటివాఁడు. చిన్నచీమ యాకుప్పకడకుఁబోయి కొంచెము చక్కెరఁ దీసికొనిపోవును. అంతకంటె పెద్దచీమ మఱికొంచెమెక్కువ పంచదారఁ దీసుకొనును. కాని యాకుప్ప తఱుగక మునుపటిపలెనే యుండును. ఈశ్వరభక్తులా చీమవంటివారె. ఒక్క యీశ్వరగుణమునకే వారు మత్తిలియానందింతురు. భగవంతునిగుణము లన్నియు నెట్టివాఁడును దనలో నిముడ్చుకొనఁ జాలఁడు.

(99) తర్కశాస్త్ర పండితుఁడొకఁడు శ్రీరామకృష్ణపరమహంస యొద్దకుఁబోయి "జ్ఞానము, జ్ఞాని, జ్ఞేయము ననఁగా నేమి" యని యడిగెను. ఆపరమహంస వాని కిట్లనియె. అయ్యా! ఈశాస్త్రచర్చాచమత్కారములను నే నెఱుఁగను. నేను జగజ్జననియైన దేవినొక్కతనే యెఱుఁగుదును. నే నామె పుత్రుఁడను.

(100) శ్రీహరినామము చెవినిఁ బడగానే యెవనిశరీరముపులకరించునో యెవ్వాఁడాయనపేరు వినఁగానే యానందబాష్పముల విడుచునో వానికదే కడపటి జన్మమనియు నటుమీఁద జన్మములు లేవనియు గ్రహింపవలయును.

(101) శరీరముమీఁద బయలుదేఱిన తామర గోకినకొలఁది దురద హెచ్చును. దురదహెచ్చినకొలఁది గోకబుద్ధిపుట్టును. గోకినప్పుడు హాయిగానుండును. ఆలాగే భగవన్నామకీర్తనము చేయఁబూనిన భక్తుఁడు విసుగులేక భజన చేయుచునేయుండును. చేసినకొలఁది యతని భక్తి హెచ్చుచుండును.

(102) స్వల్పధాన్యపు వర్తకునియొద్ద పదార్థముఁ గొనుటకు ఎవఁడైన వచ్చినప్పుడు కొలగాఁడు విరామములేక కొల్చుచునేయుండును. కూలివాండ్రు గాదెలోనుండి ధాన్యము తెచ్చి కొలగానిముందర పోయుచుందురు. అందుచేత కొలగాని ముందరనున్న ధాన్యము తరుగదు. కాని స్వల్పధాన్యపు వర్తకుని గాదెలో విశేష ధాన్యమునిలువయుండదు. కూలివాండ్రు తట్టలతోఁ దెచ్చి పోయవలసిన యవసరముండదు. ఆలాగే మహాభక్తులహృదయములలో భగవంతుఁడెప్పుడెప్పుడు తరుగులేని యుత్సాహమును గలిగించుచుండును. భక్తులు నిరంతరము నవనవకల్పనలతో పరమేశ్వరుని భజియించుటకుఁ గారణమదే. ఇక గ్రంథపఠనమువలననే జ్ఞానము నేర్చుకొన్న భక్తుఁడు స్వల్ప ధాన్యపు వర్తకులవలె నిలవసరుకు వేగముగా వ్యయముచేసి క్రొత్త సరుకు లేక కూర్చుండును.

(105) తండ్రితాతలనాటనుండి వ్యవసాయమే వృత్తిగా గల కాఁపువాఁడు పండ్రెండు సంవత్సరములు వానకురియక పోయినను, నేల దున్నుట మానఁడు. క్రొత్తగా నాఁగలిపుచ్చుకొని దున్ననారంభించిన వాఁడు మొదటిసంవత్సరము వానకురియనిమాత్రమున భయపడి వ్యవసాయమును మాని పారిపోవును. అట్లే యావజ్జీవము పరమేశ్వర సేవయందే గడపిన పరమభక్తుఁడు దైవము తనకు కనబడకపోయినను భక్తి మానఁడు.

(106) ఈశ్వరభక్తియను నమృతమును సంపూర్ణముగా గ్రోలిన సద్భక్తుఁడు త్రాగుబోతువంటివాఁడు. అందుచేతనతఁడు సామాన్యపు మర్యాదల నెఱుఁగక వర్తించుచుండును.

(107) నాచు ప్రవాహముగల నదులలో పెరుగదు. అది ప్రవాహములేని చిన్నచెఱువులు మడుగులు వానిలో పెరుగును. ఆలాగే నిర్మలములై విశాలములై స్వార్థపరత్వము లేనిమనుష్యులు

నడుపుచున్న సంఘములలో భేదములుపుట్టవు కాని యంతఃకరణశుద్ధి లేక స్వార్థపరాయణులై యుండు మనుష్యులు నడుపుచున్న సంఘములలో నది స్వేచ్ఛగాఁ బెరుగును.

(106) యోగులును సన్యాసులును సర్పములవంటివారు. పామెన్నఁడు తనకొఱకెన్నఁడు కన్నము త్రవ్వుకొనదు. చీమలు పెట్టిన పుట్టలలో దూరును. ఒకకన్నము నివాసయోగ్యము కానప్పుడు మరియొక కన్నములో దూరుచుండును. అట్లే యోగులు సన్యాసులు తమనిమిత్తము స్వగృహములు నిర్మించుకొనక నేఁడొకచోట రేపొకచోట పరుల గృహములలో కాలము గడపుచుందురు.

(107) యోగిమహిమ పరమయోగియెఱుఁగును. నూలువర్తకుఁడు నూలుకట్ట చేతఁబట్టుకొని యదియెన్నవనంబరు నూలో చెప్పఁగలఁడు గాని మరియొకఁడు జెప్పజాలఁడు.

(108) ఒకయోగి రాచబాట సమీపమున సమాధియను గొప్పయవస్థలోనుండి స్మారకమెఱుఁగక పండుకొనెను. ఒకదొంగ యాదారిని బోవుచు యోగిని చూచి తనలో నిట్లనుకొనెను. "ఇచ్చట పండుకొన్నవాఁడు దొంగ. ఏదో యింటికి మంచి కన్నమువైచి యలసిపోయి పండుకొన్నాఁడు. రాజభటులువచ్చి వీనిని పట్టుకొనితన్నుదురు. నేను పెందలకడ పారిపోదును." అని పరుగెత్తెను. ఆతరువాత నొకత్రాగుబోతు వచ్చి యతనిని జూచి యిట్లనియె. "ఓరి నాయనా! తప్పత్రాగి గోతిలో పడినావా? నీకంటె నేనేనయమూ. చెడత్రాగి నప్పటికి నేను తూలిపడుట లేదు." చిట్టచివరకు యోగి యొకఁడా దారిని బోవుచు నేలఁబడియున్న యోగిని జూచి యతఁడు సమాధిలోఁ బడియున్నట్లు గ్రహించి భక్తితో యతని పాదములకు నమస్కరించెను.

(109) రాణిరాసమణి కట్టించిన కాళికాలయముదగ్గరకు నొక

నాఁడొక సాధువు వెళ్ళెను. అప్పుడొక కుక్క యచ్చట విడువబడిన మృష్టాన్నము దినుచుండెను. అదిచూచి సాధువు కుక్కను గౌఁగలించుకొని "అన్నా ఈకూటిలో నాకు భాగముపెట్టకుండ నీవొక్కఁడవే తినుచున్నావా" యని దానివిస్తరిలోఁ జొరబడి దానితోకలసియన్నము తిననారంభించెను. అక్కడనున్న జనులు సాధువు పిచ్చివాఁడని తలంచిరి. కానియాసాధువు దేవాలయమునెదుట నిలువఁబడి మహామంత్రములతో దేవినిస్తుతించెను. ఆస్తోత్రముయొక్క యుద్రేకముచేత దేవాలయము గడగడనడకినట్లగపడెను. అప్పుడు చుట్టుపట్లనున్న జనులు మునుపు వెఱ్ఱివాఁడనుకొన్న యతఁడు గొప్పసాధువని తలంచిరి. నిజమైనసాధువులు పిల్లలవలె పిచ్చివాండ్రవలె మురికిగుడ్డలు గట్టుకొనియు మారువేషములు వేసికొనియు దేశాటనము చేయుచుందురు.

(110) ఒంటిగానున్నప్పుడు అనగా తానుచేసెడు దుష్కార్యముచూచి నిందించువారెవరు లేనప్పుడు సయితము నెవఁడు తప్పుగాని పాపముగాని చేయఁడో యతఁడే సాధువు. అతఁడే యోగి.

(111) బంగాళీభాషలోనున్న శ, ష, స, యను మూడక్షరములు సమానమైన యుచ్చారణ కలవి. శాంతింపుము, శాంతింపుము, శాంతింపుమని వానికర్థము. ఈయర్థమునుబట్టి మన మక్షరమును నేర్చుకొనునాఁడు మొదలుకొని శాంతమే యవలంబింపవలెననిమనపెద్దలభిప్రాయమైనట్లు దోచుచున్నది. శాంతగుణము ప్రతివానికి మిక్కిలి ముఖ్యమైనది.

(112) ఇసుక పంచదారతో కలపవచ్చును. అవిరెండు కలసినప్పుడు చీమ యిసుకరేణువును విడిచి పంచదారమాత్రమే తీసికొనిపోవును. అట్లే సజ్జనులు చెడుగువిడిచి మంచినే గ్రహింతురు.

(113) చేటయొక్క లక్షణమేమనఁగా చెడుపదార్థము తోసివైచి మంచిపదార్థము నిలుపుటయే. సజ్జనులస్వభావము నిట్టిదే.

114) బ్రతికియుండియుఁ జచ్చినవాఁడే నిజముగా సజ్జనుఁడు. అనగా మృతినొందినవాని శరీరములో నేవిధముగా నహంకారము, కామము, క్రోధము, లోభము, చచ్చియుండునో అట్లే బ్రతికియుండుశరీరములో గూడ నవి కనబడకుండ నెవఁడు చంపివేయునో యతఁడేసజ్జనుఁడని భావము.

(115) లౌకికులగు మనుష్యులు ప్రపంచసౌఖ్యముల కొఱకై పవిత్రములైన ధర్మకార్యములెన్నో చేయుదురు. కానిశోకము దుఃఖము, పేదతనము వచ్చినపుడు ధర్మకార్యములను మఱచిపోవుదురు. వారు చిలుకలవంటివారు. చిలుక దినమంతయు "రామ రామ" యని పలుకుచు మార్జాలమువచ్చి తన్నుపట్టుకొన్నప్పుడు రామస్మరణము మఱచిపోయి "కిరుకారు" మని చచ్చును.

(116) ఇనుపజవలుగల మంచముమీద మనము కూర్చున్నప్పుడది క్రిందికి వంగిపోవును. కూర్చున్నవాఁడు లేవఁగానేయథాప్రకారముగా నుండును. లౌకికులగు మనుష్యులవిధ మిట్టిదే. మతసంబంధమైన సంభాషణ విన్నంతసేపు వారికిమతాసక్తియుండును. ప్రపంచసంబంధమైన గొడవలలో దిగినతోడనే వారి భక్తిజ్ఞానవైరాగ్యములు రూపుమాయును. ఎప్పటివలె దురాశాపాశబద్ధులైసంచరించుచుందురు.

(117) ఇనుపముక్క కొలిమిలో నున్నంతసేపు ఎఱ్ఱగా నుండును కొలిమిలో నుండితీసిన కొంతసేపటికది చల్లారి యెప్పటివలె నల్లగా నుండును. లౌకికుఁడగుమనుష్యుఁ డిట్లేయుండును. అతఁడు సాధువులమధ్య కూర్చున్నప్పుడు ధర్మప్రశ్నములు చెప్పుచుండును. వారిని విడచి రాగానే యవియక్కడే మరచిపోవును.

(118) ఒకయోగితో నొకమనిషి యిట్లనియె. "నాకొడుకు హరీషుఁడు పెద్దవాఁడైనతర్వాత సంసారభార మతనిమీదవైచి నేను యోగినై యోగాభ్యాసముతోఁ గాలముబుచ్చెదను." అదివిని యో

గియిట్లనియె. "యోగాభ్యాసముఁ జేయుటకు నీకెప్పటికినవకాశముదొరకదు. నీవప్పుడు "హరీషుఁడు నామనుమఁడైన గిరీషుఁడునన్నొకక్షణమైన విడిచిపెట్టి యుండఁజాలరు. గిరీషునకువివాహమైనతర్వాతయోగాభ్యాసమునకైపోయెద" అందువు. అట్లునీకోరికలకంతమే యుండదు

(119) అమ్మకమునిమిత్తము దుకాణముమీద పెట్టినమిఠాయి మొదలగు మధురపదార్థములమీద నొకప్పుడీఁగలువ్రాలును. అప్పుడే పాకీవాఁడెవ్వఁడైన మలినపదార్థమును దీసికొనిపోవుచుండెనేని వెంటనే యాయీఁగలు మిఠాయినివిడిచి యాతట్టమీద వ్రాలును. కాని తేనెటీఁగ మలినవస్తువులమీద నెన్నఁడును వ్రాలదు. అదిపుష్పములుమీద వ్రాలిమకరందమే త్రాగును. లోకులీఁగలవంటివారు. అప్పుడప్పుడు వారిమనస్సులు భగవధ్యానమనెడు మధురపదార్థము మీద వ్రాలినను వెంటనే లోకసంబంధమైన దుర్వ్యాపారమాలిన్యమును స్పృశించును. సజ్జనుఁడెప్పుడు పరమేశ్వర ధ్యానమునందే యాసక్తిఁ గలిగియుండును.

(120) ఒక పేదబ్రాహ్మణుఁడు దారిద్ర్యపీడితుఁడై యొక గృహస్థునికడకుఁబోయి తనకేదైన సహాయముఁ జేయుమని కోరెను. ఆ గృహస్థుఁడు తనకు సంసారసంబంధము లేదనియుఁ దాను గుమ్మరిపురుగువాటముగా నింటిలోఁ దిరుగుచుంటిననియు డంబములు గొట్టుచుండెడివాఁడు. ఆయాచకుఁడు సహాయము చేయుమని యడిగినప్పుడు గృహస్థుఁడిట్లనియె. "అయ్యా! నేను నాచేతితో ధనము స్పృశింపను. నాకు సంసారసంబంధము లేదు. నన్నేల యాచింపవచ్చితివి ?" అతఁడట్లు చెప్పినను యాచకుండు పీడించెనుగాని విడిచిపెట్టలేదు. అతని వేడికోలు త్రోసిపుచ్చలేక యెట్టకేలకు గృహస్థుఁడు వానికొక రూపాయియియ్యఁదలఁచి మఱునాఁడు రమ్మనిచెప్పి లోపలికిఁబోయి భార్యనుబిలిచి ఓసీ! పాపము ఒక పేదబ్రాహ్మణుఁడు మిక్కిలి దీనుఁడై యాచింప

వచ్చిరాఁడు. వానిదశఁజూచి జాలిపడి నేను వానికొక రూపాయియియ్యఁ దలఁచుకొన్నాను. నీయభిప్రాయమేమిటి? అని యడిగెను. ఆమె భర్త కిట్లనిరెను. "సరిసరి! గొప్ప జాలిగుండెగలవారు బయలుదేరినారు. ముందువెనుకలు చూడకుండ పారవేయుటకురూపాయలు రాళ్ళుగావు. చెట్లమీఁది యాకులుగావు" అనవుడు భార్యను బ్రతిమాలుకొనుచు మగఁడిట్లనిరెను "పాపము! బ్రాహ్మణుఁడు మిక్కిలి పేదవాఁడు. రూపాయికి తక్కువియ్యకూడదు." "లేదు లేదు. రూపాయి లేదు, గీపాయి లేదు. ఇదిగో నాదగ్గర రెండణాలకాసున్నది. కావలెనంటే ఇది యివ్వండి లేదా పొమ్మనండి" అని యామె కఠినముగాఁ జెప్పెను. గృహ యజమానుఁడు మెత్తనము మొదటినుండియు భార్యమీఁదవదలిపెట్టెనుగావున నామెమాట కెదురాడలేక రెండణాలకాసు మాత్రమే యాబ్రాహ్మణునకిచ్చెను. ఆవిధముగా సంసారసంబంధములేనిగృహస్థులు భార్యలకు దాసులుగాని వేదాంతులుగారు. సంసారసంబంధములేని గృహస్థులన్నప్పు డట్టివారి నుదాహరణగాఁ దీసికొనఁగూడదు.

(121) ఊఁత పల్లివాఁడు నీటిలోఁ బడవైచినప్పుడు చిన్నచేఁపలు సంతోషముతోఁ బోయి దానిలోఁ జిక్కుకొనును. కాని మరల బయటికి రాజాలవు. అట్లె పైపై మెఱుఁగులుజూచి బుద్ధిహీనులు భ్రమపడి ప్రపంచకవ్యవహారములలోఁ బడుదురు. చేఁపలు వలలోఁబడుట సులభముగాని దానినుండి వెడలివచ్చుట సులభముకానట్లే ప్రపంచకవ్యవహారములోఁ బ్రవేశించుట సుకరముగాని వాటినుండి విమోచనము నొందుట కష్టము.

(122) సంసారసుఖముల ననుభవించుచుండియు వానిసంబంధములేని మహానుభావుఁ డెవ్వఁడనిన జనకమహారాజు పేరొక్కటియే చెప్పుచుందురు. కాని ప్రపంచోత్పత్తియైనదాదిగా నేటివఱకు నిట్టి రాజర్షి యితఁడొక్కఁడేకాని రెండవవాఁడు లేఁడు. కామలోభములను

రెంటిని విడువనివాఁడు ముక్తినొందఁజాలఁడు. ఇదే సామాన్యధర్మము. నేను జనకుఁడనని నీవు దలంపఁగూడదు. అతఁడుపోయి యిప్పటికెన్ని వేల సంవత్సరములో యైనను జనకునివంటి వాఁడు ప్రపంచమున మరల పుట్టలేదు.

(123) ఈ ప్రపంచము రంగస్థలమువంటిది. అక్కడ ననేకులు వేరువేరు వేషములు ధరించి నాటకమాడుదురు. కొంతకాలమాడిన దాఁక వారు తమతమ వేషములు దీసివేయరు. కొంతవఱకాడిన తర్వాత వారంతటవారే వేషములు దీసివేసికొందురు.

(124) భక్తుని హృదయ మెండిననిప్పుపుల్లవంటిది. భగవన్నామము కొంచెము వినఁబడినను వానిహృదయము భక్తియను నగ్నిహోత్రముతో నిండియుండును. లౌకికునిమనస్సు భోగము దుఃఖము నను నీటితో తడసి నిమ్మకున్న నిప్పుపుల్లవంటిది. దైవమునుగూర్చి యతని కెన్నిమారు లుపదేశించినను వానిమనస్సు భక్తిజ్వలనముతో నిండదు.

(125) జనకమహారాజెంత మేధావంతుఁడో యొక లౌకికుఁడు గూడ నంతటిమేధావంతుఁడై యుండవచ్చు. యోగియెంత శ్రమపడునో యతఁడు గూడ నంత శ్రమ పడవచ్చును. సన్యాసి పూనినంత వైరాగ్యముఁ బూనినఁ బూనవచ్చును. కాని యివియన్నియు నతఁడు దైవముకొఱకు జేయక పేరుకొరకు, ప్రతిష్ఠకొఱకు, ద్రవ్యముకొఱకు జేయును.

(126) నీరు రాతిలో జొరఁబడదు. అట్లే మతభక్తి లౌకికుని హృదయములోఁ బ్రవేశింపనేరదు.

(127) మేకు మట్టిలో సులభముగా దిగును గాని రాతిలో సుకరముగా దిగదు. అట్లే పుణ్యాత్ముల హితోపదేశము లౌకికుని

యాత్మలోఁ జొరఁబడదు. భక్తుని హృదయములో నది యవలీలగాఁ బ్రవేశించును.

(128) మెత్తని మట్టిమీద సులభముగా ముద్రవేయవచ్చును కాని రాతిమీద నట్లువేయఁజాలము. అట్లే పరమేశ్వర సంబంధమయిన జ్ఞానము భక్తుని హృదయముమీద సుకరముగా ముద్రింపఁబడును కాని లౌకికునిహృదయము మీఁద నట్లుగాదు.

(129) సంపూర్ణముగా లోకవ్యవహారమునందే ప్రవేశించిన లౌకికుని లక్షణము లిట్లుండును. ఆతఁడు వేదమువినఁడు, మతచర్చల మాట యతని కక్కఱలేదు. ఈశ్వరస్తోత్రము లతని కింపుగానుండవు. అంతేకాదు. ప్రార్థనలుమొదలగునవి చేయకుండ నితరుల నాటంక పెట్టును. సజ్జనులను మతసంఘములను దూషించును. ప్రార్థనలు జేయువారినిఁజూచియెగతాళిచేయును.

(130) మొసలిచర్మము మిక్కిలి దట్టముగా నుండును. అందుచేతనే యాయుధములు దానిఁబొడువఁజాలవు. మీఁదు మిక్కిలి యాయుధములన్నియు మొక్కవోవును. అట్లే లౌకికునకు నీవెంతమతబోధఁజేసినను నది వాని హృదయమును భేదించుకొని పోఁజాలదు.

(131) వంతెనక్రిందికి నీరొకవైపునుండివచ్చిరెండవవైపునుండి ప్రవహించిపోవును. మతబోధయు లౌకికులవిషయమై యిట్లే యుండును. మతబోధ యొక చెవిలోఁ బ్రవేశించి వెంటనే రెండవచెవిలో నుండి యావలికిఁబోవును. అతనిమనస్సుమీఁద నది యెంతమాత్రము ముద్రితముగాదు.

(132) లౌకికునితో మాటలాడినప్పుడు పావురమునోటిలోనున్న తిత్తి వడ్లగింజలతో నిండియున్నట్లు వాని మనస్సు ప్రపంచ సంబంధములైన యాలోచనలతోను కోరికలతోను నిండియున్నట్లుమనము తెలిసికొనవచ్చును.

(133) నిప్పుమీఁదనున్నంతసేపు పాలుకాఁగి పొంగును. నిప్పు తీసితిమేని శాంతముగా నుండును. అట్లే క్రొత్త శిష్యుని యొక్క హృదయము మతసంబంధములయిన వ్యాపారములలో నున్నంతసేపే యుత్సాహముతో నిండియుండి తర్వాత చల్లబడును.

(134) రాజదర్శనముఁ జేయవలెనన్న ద్వారపాలకులను మంత్రులు మొదలగువారిని వశపఱచుకొనవలెను. అట్లే యీశ్వరసాన్నిధ్యము జేరవలెనన్నవాఁడు భక్తులయొక్కయు జ్ఞానులయొక్కయు సహవాసముఁ జేయవలెను.

(135) నీభక్తివిశ్వాసములు నీలోనే యుంచుకొనుము. అవి నీకడఁ గలవని చాటుకొనవద్దు. అట్లు చాటుకొందువేని నీకు మిక్కిలి నష్టము గలుగును.

(136) బొమ్మలు మూఁడువిధములు. ఉప్పుబొమ్మలు, గుడ్డబొమ్మలు, రాతిబొమ్మలు. ఈబొమ్మలను నీటిలో ముంచినయెడల మొదటి బొమ్మ కరగిపోయి రూపనాశన మగును. రెండవది తడిసి ముద్దయయి బరువెక్కును గాని దాని యాకారమును నిలుపుకొనును. మూఁడవది నీటికిదుర్గమమై యుండును. తన యాత్మ పరమాత్మతో నైక్యముఁ జేసికొన్నట్టి ధన్యునివంటిది యుప్పుబొమ్మ. అతఁడే ముక్తపురుషుఁడు. దివ్యజ్ఞానము భక్తి సంపూర్ణముగాఁ గలభక్తునివంటిది రెండవబొమ్మ. సత్యమైనజ్ఞానము లేశమైనను గ్రహింపని లౌకికునివంటిది మూఁడవ బొమ్మ.

(137) చేఁపలు బడినప్పుడు కొన్ని తప్పించుకొని పోవుటకు బ్రయత్నమే చేయవు. కొన్ని వలనుండి తప్పించుకొని పోవుటకు గట్టి యత్నముఁ జేయును. కొన్ని వల జీల్చుకొని యావలకుఁబోయి ప్రాణము దక్కించుకొని సుఖించును. ఇట్లే మనుష్యులు మూఁడు విధములుగా నున్నారు. కొందఱు సంసారబంధములలోఁ దగిలియున్నారు.

వారు బద్ధులు. కొందరు మోక్షమునకై యత్నముఁ జేయుచున్నారు. వారు ముముక్షువులు. కొందఱు బంధములను ద్రెంపుకొన్నవారు. వారు ముక్తులు.

(138) జల్లెడ ముదుకవస్తువును మెత్తనివస్తువును వేరుచేయును. అట్లు చేయుటలో మెత్తనివస్తువు క్రిందికిఁ బడద్రోయును. ముదుక వస్తువును పైనుంచుకొనును. దుర్మార్గుఁడిట్లు చెడ్డను గ్రహించి మంచి విడిచిపెట్టును.

(139) ఇద్దఱు మనుష్యులొక తోఁటలోనికి వెళ్ళిరి. లౌకికుఁడు తోఁట జేరగానే యెన్ని చెట్లున్నవో చెట్టున కెన్ని కాయలున్నవో లెక్క జూచి తోఁటఖరీదు గట్టనారంభించెను. రెండవ వాఁడు యజమానుని పరిచయము జేసికొని యొక మామిడిచెట్టుక్రిందకిఁ బోయి వాని యుత్తరువు బడసి యొక పండుగోసి తిన మొదలు పెట్టెను. ఈయిద్దరిలో నెవ్వఁడు తెలివిగలవాఁడు? ఫలము భక్షించిన యెడల మనయాఁకలిదీరును. ఆకులు కాయలు పండ్లు చెట్లు లెక్కపెట్టుటవల్ల వచ్చినలాభమేమి? మేధావంతుఁడైన డాంభికుఁడు సృష్టికిఁ గారణమేమి యని ప్రశ్నలు జేసికొని కాలముఁ బాడుచేయును. వినయవివేకములుగల సజ్జనుఁడు భగవంతుని పరిచయముఁ జేసికొని యానంద మనుభవించును.

(140) గ్రద్ద మహావాయుపథమున నెంతయో యెత్తున నెగురును. కాని కుళ్ళిపోయిన పీనుఁగేదయిన దొరకునేమోయని క్రిందికే చూచుచుండును. అట్లే గ్రంథజ్ఞానము మాత్రమే గల పండితులు భగవంతుని గూర్చియు వేదాంతమును గూర్చియు గంభీరముగా మాట్లాడుదురు. ఆపంభాషణ మంతయు వట్టిదే. వారిదృష్టి ప్రపంచసంబంధమైన యధికారము, గౌరవము, ధనము మొదలగు వానిమీఁదనే యుండును.

(141) ఒకమహారాజుగారి కొల్వులో శివుఁడు గొప్పవాఁడా

విష్ణువు గొప్పవాఁడా యని విద్వాంసులలో వివాదము బయలుదేరెను. కొందఱు శివుఁడుగొప్పవాఁడనిరి. కొందఱు విష్ణువుగొప్పవాఁడనిరి. వివాదము మిక్కిలి ప్రబలమయినపుడు పండితుఁడొకఁడు లేచి రాజుతో ని ట్లనియెను. రాజా! నేను శివునిజూడలేదు. విష్ణునిజూడలేదు. ఇద్దరిలో గొప్పవాఁడెవ్వఁడో నేనెట్లుచెప్పఁగలను? అని పలికెను. అంతలో వివాదము ముగిసెను. ఏలయన వాదిప్రతివాదులలో శివునిగాని విష్ణునిగాని చూచినవారులేరు. ఒకదేవునితో మరియొక దేవుని పోల్పఁగూడదు. ఒక దేవునిఁ జూచినవాఁడు తక్కిన దేవులు కూడ పరబ్రహ్మము యొక్కమారురూపములే యని తెలిసికొనును.

(142) ఏనుఁగునకు రెండువిధములైన దంతములుండును. పైకి కోరలవలె కనపడుదంతముల జతయొకటి. ఆహారము నమలుట కుప యోగపడు దంతములజత యొకటి. అట్లే శ్రీకృష్ణునివంటి యవతార పురుషులు సామాన్యమనుష్యులవలె లోకవ్యాపారములుచేయుచుందు రుగాని వారు నిజముగా చూచినపక్షమున కర్మరహితులై యుందురు.

(143) గంజాయి పీల్చుచు మందులు పంచిపెట్టునట్టి సాధువు నిజమైన సాధువుకాఁడు. అటివాని సహవాసము చేయగూడదు.

(144) ఒకబ్రాహ్మణుఁడు తోఁటనాటి దానిని మిక్కిలిజాగరూ కతతోఁ గనిపెట్టుచుండెను. ఒకనాఁడొకయావు తోఁటఁజొచ్చి బ్రాహ్మ ణుఁడు మిక్కిలి ప్రేమతో పెంచుకొనుచున్న మామిడిమొక్క తినివై చెను. తనకు మిక్కిలి ప్రియమైన మొక్క తినివైచినందుకు మిగుల కోపించి బ్రాహ్మణుఁడు గోవును దిట్టముగాఁ గొట్టెను. ఆదెబ్బలతోనది చచ్చెను. బ్రాహ్మణుఁ డావును జంపినాఁడని గ్రామమంతట గొప్ప వాడుకపడెను. గ్రామవాసులు గోహత్య యేలచేసితివని బ్రాహ్మణు ని నిలువతీసి యడిగిరి. బ్రాహ్మణుఁడు వేదాంతియగుటచే నిట్లుత్తరము చెప్పెను. "ఆవును నేను చంపలేదు నాహస్తము చంపినది. హస్తము

నకు దేవేంద్రుఁడధిష్ఠానదేవతగనుక గోవును చంపినపాపమింద్రునిదిగాని నాదికాదు" ఆవార్త నింద్రుఁడు విని వృద్ధబ్రాహ్మణవేషము వేసికొని తోఁటయజమానునియొద్దకుఁ బోయి యీతోఁట యెవ్వరిది నాయనా యని యడిగెను.

బ్రాహ్మణుఁడు:—నాదే.

ఇంద్రుడు:—ఈతోఁట మిక్కిలి యందముగా నున్నది. మీతోఁటమాలి మిక్కిలి నేర్పరి. ఎంతచక్కగా చెట్లునాటినాఁడో చూడ ముచ్చటగుచున్నది.

బ్రాహ్మణుఁడు:—అయ్యా! ఆపనికూడ నాదే. నేను స్వయముగా సలహా యిచ్చి వృక్షముల నావిధముగా నాటించినాను.

ఇంద్రుఁడు:—నిజముగా నీవు మిక్కిలి తెలివిగలవాఁడవయ్యా. కాని యీబాట యింత చక్కగా వేసిన వారెవ్వరయ్యా. ఇదియెంతో సుందరముగా నున్నది.

బ్రాహ్మణు;—ఇదియంతయు నేను చేసినదే.

ఇంద్రుఁడు:—అయ్యా, బాగున్నపనులన్నియు నీవుచేయక నీసేవకుల చేత చేయించినను మెప్పంతయు నీదేయనుచున్నావు. పాపము నీచేతితో చంపిన గోవు విషయమైన పాపము మాత్రము దేవేంద్రుని నెత్తిమీద రుద్దినావా? గొప్పవేదాంతివి.

(145) నీవు పాపరహితుఁడవుగా, సజ్జనుఁడవుగా నుండుటకు మన సార గోరుదువేని భగవంతుఁడు నీకు యోగ్యుఁడైన గురువును పంపును. అంతఃకరుణశుద్ధియే దీనికి ముఖ్యముగాఁ గావలసినది.

(146) క్రొత్తచోటికి వెళ్ళదలచినవాఁడు దారి యెరిగినవాని మాటలయందు గురియుంచి వాఁడు నడపించినదారిని నడవవలయును. పదుగురుచెప్పినట్లు నడచినయెడల దారితప్పి చెడిపోవును. అట్లే యీశ్వరసాన్నిధ్యమును జేరఁదలఁచినవాఁడు మంచిగురువునొక్కని నాశ్రయించి యాయనచెప్పినట్లు నడుచుకొనవలయును.

(147) అంతఃకరణశుద్ధియు నధికమైనదయాశక్తియుఁగలవానికి గురువుయొక్క యావసరమేలేదు. అతఁడు భగవంతుని సాన్నిధ్యము స్వయముగానే పొందగలఁడు. కాని యట్టివారు లోకమున తరచుగా లేరు. అందుచేతనే గురువుయొక్క యవసరము గలుగుచుండును. పరమగురు వొక్కఁడే యుండును. కాని యుపగురువులు పెక్కుమంది యుండవచ్చును. ఏవిద్యనేర్పినవాఁడైనను యుపగురువు కావచ్చును. పరమగురువనఁగా బ్రహ్మవిద్య నేర్పినవాఁడు.

(148) కలకత్తాకు బోవుటకు దారులెన్నోగలవు. దూరగ్రామవాసియొకఁడు కలకత్తాకుబోవలెయునని పయనమై "నేను కలకత్తాకేదారిని బోవలెయును" అని మార్గమధ్యమున నొకనినడిగెను. ఈ దారిని వెళ్ళుమని యామనుష్యుఁడొక మార్గము చూపెను. అట్లుకొంత దూరముపోయి వాఁడు మఱియొక బాటసారినిజూచి కలకత్తాకిది దగ్గర దారియేనా? యని యడిగెను. అప్పుడు నతఁడిట్లనియె. "అయ్యో! కాదు నీవు వెనకకువెళ్ళి మొదమపరిక్కనున్న దారినిపో." ఆమాట విని యాతఁడట్లే చేసెను. ఆక్రొత్తదారిని వాఁడు కొంతదూరమరిగి కలకత్తాకు దారి యేదని మరియొక్కని నడిగెను. అతఁడింకొక దారిచూపెను. ఆ విధముగా నతఁడు సరిగా నొకక్రోసైనసమువక యాదారిమార్చి యీ దారికి, నీదారిమార్చి యాదారికిఁ బోవజొచ్చెను. అతఁడు కలకత్తా వెళ్ళకపోయెను. కావున మొదటివాఁడుచూపిన మార్గమునుబట్టియే వెళ్ళవలసినది. అట్లే భగవంతుని జేరనలచినవారు సూటిగా నొక మార్గప్రదర్శకునే యనుసరింపవలెను.

(149) శిష్యుఁడు గురువాక్యము లెన్నడు ఖండింపఁగూడదు. గురువేమి యానతిచ్చునది శిరసావహించి మన్నించవలయును.

(150) గురువు మధ్యవర్తి. అతఁడు మనుష్యునకు భగవంతునకు సంధానము జేయువాఁడు.

(151) ముత్తెము దీసికొని పైచిప్ప యావల పారవేయుము. గురువు చెప్పిన మంత్రముమాత్రము పురశ్చరణచేయుము. నీగురువు నందున్న చెడ్డగుణములను విసర్జింపుము.

(152) నీగురువును దూషించిన వాని వాక్యములను ఖండించు వారిమాటలను వినఁబోకు. అట్టిదూషకుని సమీపమును విడిచిపొమ్ము.

(153) చంద్రుఁ డెల్లవారికి మామయైనట్లే భగవంతుఁడు మానవజాతికెల్ల జనకుఁడు. మార్గదర్శకుఁడు. చందమామ చందమామ యని లోకులనుచుందురు, గావున మామయని చెప్పవలసివచ్చెను.

(154) తనగురువుయొక్క ప్రభావమునందు సంపూర్ణ విశ్వాసముగల శిష్యుఁడొకఁడు గురునామస్మరణము జేయుచు దానిమహిమ చేత నదిమీఁదనడచి వెళ్ళెను. గురు వదిచూచి తనలో నిట్లనుకొనెను. "ఆహా! నా పేరులో గూడ నింతమహిమయున్నది కాఁబోలును. అట్లైన నేను మిక్కిలిగొప్పవాఁడను శక్తిమంతుఁడను కావలసినదే" యని మరు నాఁడు నదియొద్దకుఁబోయి "నేను, నేను," అనుచు నదిమీఁద నడచి పోవ దలఁచెను. కాని నీటిలో నడుగుపెట్టినప్పటి కతఁడు నీటిలోబడి మునిఁగి చచ్చిపోయెను. విశ్వాసము మహాద్భుతములను జేయఁగలదు గాని యహంకారము, గర్వము మనుష్యునకు మరణకారణములు.

(155) గురువులు వందలకొలఁది దొరకుదురు కాని మంచి శిష్యులు మాత్రము దొరకుట యరిది.

(156) స, రి, గ, మ, ప, ధ, ని, స, యను సప్తస్వరములు నోటిలో నుచ్చరించుట సులభము. కాని వీణమీఁద నవి వాయించుటయు నోటితో పాడుటయు కష్టము. అట్లే మతమును గురించి మాటలాడుట సులభము. ఆచరించుట కష్టము.

(157) సామాన్యులు బస్తాలకొలఁది మతము మాటలాడుదురు. కాని యొకగింజమాత్రమైన నాచరింపరు. కాని జ్ఞాని మాటలాడునది మిక్కిలి స్వల్పము. అతని బ్రతుకంతయు మతాచరణమే.

(158) ఇతరులెట్లు నడుచుకోవలయునని నీవు కోరుదువో ముందుగా నీవట్లు నడచుకొనుము.

(159) నిజము చెప్పుచున్నాను వినుఁడు. ఎవఁడు నిశ్చయముగా దేవుఁడు కావలయునని కోరునో వానికి దేవుఁడు తప్పక కనఁబడును.

(160) తామరపువ్వుయొక్క రేకులు క్రమక్రమముగా రాలిపోవును. కాని వాటియానవాళ్ళు పోవు. అట్లే నిజమైన జ్ఞానమువచ్చినప్పుడు తప్పక యహంకారము నశించును. కాన నది యుండిన జాడలు కనఁబడును. అయినను నవి హాని చేయునవి కావు.

(161) మనుష్యునియందు రెండువిధములైన యహంకారములున్నవి. మొదటిది పరిపక్వమైన యహంకారము, రెండవది పరిపక్వముకాని యహంకారము. పరిపక్వమైన యహంకార మిట్లుండును. "నాదియను వస్తువేదియులేదు. నేను చూచుచున్నదియు, భావించుచున్నదియు, స్పృశించుచున్నదియు నాదికాదు. వెయ్యేల! ఈశరీరమే నాదికాదు. నేను నిత్యుఁడను, స్వతంత్రుఁడను." పరిపక్వముకాని యహంకారము దీనికి విరుద్ధముగా నిట్లుండును. "ఇది నాయిల్లు, ఇది నాబిడ్డ, నాభార్య, నా దేహము."

(162) వెల్లుల్లిపాయ రసము పోసిన గిన్నె నూరుసారులు తోమినను దాని దుర్వాసనపోదు. అహంకారముకూడ నట్టిపెంకిఘటమె. అది మనలను సంపూర్ణముగా నెన్నఁడును విడిచిపెట్టదు.

(163) కొబ్బరిమట్టలు చెట్టునుండి క్రిందికి రాలిపోవును. కాని మాని మీద వాటి జాడలు కనబడును. అలాగే శరీరమున్నంతకాల మహంకారముయొక్క జాడ కనబడుచుండును. మనుష్యుఁడెంతటి యాత్మజ్ఞానసంపన్నుఁడైనను వాని కించుక యహంకారముండపోదు. కాని ఈయహంకార సూచనలు వానిని ప్రపంచమునకు బంధింపవు. పునర్జన్మకారణములు కావు.

(164) సూర్యుఁడు ప్రపంచమునకు వేడి వెలుతురు నీయఁగలఁడు గాని మబ్బు క్రమ్మినప్పుడు సూర్యుఁడు ప్రకాశింపజాలఁడు. అలాగే యహంకార మాత్మలో నుండునంతవరకు భగవంతుఁడు హృదయము మీఁద ప్రకాశింపజాలఁడు.

(165) గర్వము చెత్తవంటిది. బూడిదవంటిది. నీరుదానిమీఁద పడగానే యినికి పోవును. గర్వపూరితమైన హృదయముమీఁద ధ్యానములు, ప్రార్థనలు పనిచేయవు.

(166) అన్నిపక్షులలోను కాకి మిక్కిలి తెలివిగలదని లోకు లందురు. తానెక్కువ తెలివిగలదాననని కాకికూడ తలంచును. అది యెన్నఁడు వలలోఁ జిక్కుకొనదు. రాఁగల యపాయమును బుద్ధిసూక్ష్మతతో దప్పించుకొనును. ఎంతనేర్పున వస్తువులు దొంగిలించుకొని పోవును. ఇంతజ్ఞానమున్నను మలినపదార్థ భక్షణముచేతనేగాని దానిపొట్ట గడచుటలేదు. క్షుద్రమైన తెలివితేట లుండుటవల్ల దాని కీయవస్థ పట్టెను.

(167) బ్రహ్మమానసపుత్రుఁడైన నారదుని మనస్సులో గర్వము ప్రవేశించెను. తనయంతవాఁడు లేఁడని యతఁడుమనస్సులో దలంచ నారంభించెను. అది యెఱింగి శ్రీమహావిష్ణువు గర్వభంజనముఁ జేయఁ దలంచి నారదుని పిలిచి "వత్సా! భూలోకములో నొకచోటనాభక్తుఁ డున్నాఁడు. వాని కడకుబోయి వానిపరిచయముఁ జేసికొను" మని చెప్పెను. నారదుఁడు భూలోకమున కరిగి యాభక్తునిఁ జూచెను. అతఁడు సేద్యగాఁడు. ఉదయమునందు లేచియతఁడొక్కసారిహరినామ స్మరణము జేసి పొలమునకుఁబోయి దినమెల్ల నేల దున్ని సాయంకాల మింటికిఁబోయి భోజనముఁజేసి మరల నొక్కసారి హరినామ స్మరణ ముఁజేసి పండుకొనును. నారదుఁడు తనలో నిట్లనుకొనెను. "ఈమోట కాఁపువాఁడు హరిభక్తుఁ డెట్లగును? వాఁడు లోకవ్యవహారములలో

దగుచుండి యున్నాఁడు. భక్తునియం దుండవలసినలక్షణములు లేవియు వానియందగపడవు." అంతట నారదుఁడు వైకుంఠమునకరిగి కాఁపువానినిఁ గానఁజూచుట తనకు వానియందు మంచి యభిప్రాయములు గలుగకపోవుట మొదలగు విషయములు విష్ణువుతోఁ జెప్పెను. అప్పు డతఁడు నారదునిఁజూచి "వత్సా! ఈ నూనెగిన్నె చేతఁబట్టుకొని వైకుంఠపురమంతయుఁ దిరిగిరా. నూనె దానియందు మట్టముగా నున్నది. ఒక్కచుక్కయైన నేలఁబడకుండ జాగ్రత్తగాఁ దిరిగి రావలెను సుమీ!" యని చెప్పెను. నారదుఁ డాగిన్నెపట్టుకొని విష్ణువు చెప్పినట్లు తిరిగి వచ్చెను. అప్పుడా పరమేశ్వరుఁడు "నారదా! గిన్నెపట్టుకొని తిరుగుచున్నప్పుడు నీవు నన్నెన్నిసార్లు స్మరించితివి?" అని యడిగెను. అప్పుడు నారదుఁ డిట్లనియె. "దేవా! ఒక్కసారియైన మీ పేరు స్మరింపలేదు. ఈవల గిన్నెవంకఁ జూడనా ఆవల మీ పేరే స్మరింపనా? నా ధ్యానమంతయు నూనె మీఁదనే యుండెను. అట్టియెడ మిమ్మెట్లు ధ్యానింపగలను." అనవుడు హరి వాని నిట్లు మందలించెను. ఈచిన్నగిన్నె పట్టుకొనుటచేతనే నీవు నన్ను స్మరింపలేకపోతివి. పాపము పెద్దకుటుంబ భారముపై వైచికొన్న యా పేదకాఁపువాఁడు దినమునకు నన్ను రెండుసార్లైనను తలపెట్టుచున్నాఁడు. నీకన్న వాఁడే పరమభక్తుఁడుకదా!

(168) ప్రేమ మూఁడువిధములు కలదు. మొదటిది స్వలాభపరాయణము, రెండవది పరస్పరవ్యాప్తము, మూఁడవది స్వలాభవిముఖము. స్వలాభపరాయణమైన ప్రేమ యధమము. ఎందుచేతనన వది తన మేలేగాని తనవారి సుఖము చూడనీయదు. పరస్పర ప్రేమతో మనుష్యుఁడు తన సుఖమును గోరుకొనుచు తనవారి సుఖముఁగూడ గోరును. స్వలాభము గోరని ప్రేమ యుత్తమోత్తమము. మనుష్యుఁడు తనవారి సేమమునే జూచునుగాని తనసుఖము జూడఁడు.

(169) బృందావనమందలి గోపిక శ్రీకృష్ణుఁడు తనకు ప్రియు

డైన గోపీనాథుఁ డని భావించెనుగాని సర్వేశ్వరుఁడని భావింపలేదు. అట్లే నిజమైన భక్తుఁడు భగవంతుఁడు తనకు ప్రాణబంధువనియు నాప్తమిత్రుఁడనియు భావించును.

(170) "ఈజన్మమునందే నేను ముక్తిని బడయవలయును మూఁడుదినములలో భగవంతుని కనుఁగొనవలయును. ఇంతయేల దురు ఆతని నామమొక్కసారి స్మరించి యీశ్వరుని నాకడకు రప్పించెదను." అని గాఢమైన భక్తియు, దృఢమైన నిశ్చయము నెవరికుండునో యట్టివానికే త్వరగా నీశ్వరు నాకర్షించును. మిడిమిడి భక్తిగలవారు భగవంతుని సన్నిధిచేరుటకు బహుకాలము పట్టును.

(171) ఒకజ్ఞానియు నొకభక్తుఁడు నొకయడవిలో నడచుచుండిరి. దారిలో దూరమున నొకపెద్దపులి వారికగపడెను. అప్పుడుజ్ఞాని యిట్లనియె. "మనము భయపడి పారిపోనక్కరలేదు. పరమేశ్వరుఁడు మనలను రక్షించును." ఆపలుకులు విని భక్తుఁడిట్లనెను. "కాదుకాదు పారిపోవుటయుచితము. మన ప్రయత్నమువలన మనము తప్పించుకొనఁ గల పనికి నిష్కారణముగా భగవంతునేల శ్రమపెట్టవలెను."

(172) బ్రహ్మజ్ఞానము పురుషునివంటిది. దైవభక్తి యాఁడుదానివంటిది. జ్ఞానము పరమేశ్వరుని వీధిగదులలోనికి మాత్రమే పోవఁ గలదు. భక్తి యాఁడదికనుక భగవంతుని యంతఃపురములోనికిఁ బ్రవేశింపవచ్చును.

(173) భక్తియు, జ్ఞానము చిట్టచివరకు నొక్కటే. శుద్ధజ్ఞానమునకు, శుద్ధభక్తికి భేదములేదు.

(174) దూరపుసంతకుఁబోయి చేపలమ్ముకొని పల్లెపడఁతులు కొందఱు తిరిగి యింటికిఁబోవుచుండగా దారిలో వారిని వడగండ్ల వాన ముట్టెను. అప్పుడు వారు దాపునయున్న పువ్వులవర్తకుని యింటఁ జొరబడి యారాత్రి యచ్చట బండుకొనిరి. వారు పండుకొన్న గదిలో

మిక్కిలి కమ్మని తావులు వెదజల్లుచున్న పువ్వులగంప యుండెను. ఆవాసన పల్లెపడుచుల కెంతో యసహ్యముగా నుండుటచేత వారికొక్కకునుకైన పట్టలేను. అప్పుడు వారిలో మిక్కిలి తెలివిగల యొకతె యిట్లనియె. "అక్కలారా ఈపువ్వులకంపు మననిద్దుర జెడగొట్టినది. దీనికొక్క యుపాయము తోచుచున్నది. వినుడు. మనచేపలబుట్టలు మనముక్కుదగ్గర పెట్టుకొని పండుకొందము. అనువాసన ముందర ఈపాడు పువ్వుల కంపు కనబడక మనకు నిద్దుర పట్టును." ఆపలుకులు విని పల్లెపడతులు భళీయని మెచ్చి యట్లుచేసి క్షణములో గుఱ్ఱుపట్టి నిద్రపోయిరి. దురభ్యాసములలో జిక్కుపడినవారిపాటు లిట్టివే. దురాచారములకు వారు గులాములై యుండవలయును.

(175) ఒకయింట నొకపెంపుడుముంగి యుండెను. ఇంటివారొకత్రాడును తెచ్చి యొకకొన దాని మెడకుగట్టి రెండవకొనకు గొప్పబరువురాయి గట్టిరి. ముంగి ముంగిలివాకిటిలోను, దొడ్డిలోను, స్వేచ్ఛగా నాడుకొనవచ్చును. కాని భయము తోచగానే గుబాలున గోడమీదికెక్కి కూర్చుండును. అయిననుగోడమీద నది చాలసేపుండుటకు వీలులేదు. త్రాటికిఁ గట్టిన బరువురాయి క్రిందికి దానిని దిగలాగుచుండును. అందుచేతనది సుఖముగా, నిర్భయముగా గోడమీద కూర్చుండుటకు వీలులేదు. అట్లే మనుష్యుని యిల్లు మహోన్నతమైన భగవత్పాద సన్నిధియున్నది. దుఃఖపూరితుఁడైన మనుష్యుఁడుభగవంతునిసాన్నిధ్యము చేరును. కాని సంసారభారము క్రింది కీడ్చుటచేత పరమేశ్వర సన్నిధానమున చిరకాల ముండలేక నతడు వెంటనే క్రిందికిదిగును.

(176) పటికబెల్లము సాధారణమధురపదార్థములలో చేరదు. అది రోగపీడితులుకూడ పుచ్చుకొనవచ్చును. అందువల్ల రోగముతగ్గునుగాని హెచ్చదు. ఓంకారము తక్కినవాటివలె శబ్దముకాదు. పర

బ్రిహ్మమే. అట్లే భక్తి, జ్ఞానము, పరిశుద్ధి, మొదలగునవి కావలెనని కోరుట కోరికలలోఁ జేరదు.

(177) పండు పెరిగినకొలఁది పువ్వు, రేకులు క్రిమక్రిమముగా రాలిపోవును. అట్లే నీలో దివ్యజ్ఞానము హెచ్చినకొలఁది నీలోనున్న దౌర్బల్యములు క్రిమక్రిమముగా నశించును.

(178) క్రొత్తగాపుట్టిన దూడ యెన్నోసారులు పడుచు లేచుచు క్రిమక్రిమముగా నడక నేర్చుకొని సరిగా నిలువఁబడును. అట్లే భక్తిమార్గములో మనుష్యుఁడెన్నో సారులు జారిపడినఁగాని జయము నొందలేఁడు.

(179) గుర్రిక్కుడు సారాయితోనే కొందరికి కావలసినంత మత్తెక్కును. రెండుమూడు బుడ్ల సారాయి త్రాగినఁగాని గొందరికి నిషాయెక్కదు. కాని వారి కిరువురకు నిషావలనగలుగు నానందము సమానమే. అట్లే కొందరుభగవంతుని సాన్నిధ్యముపొందియూబ్రహ్మానందముచే బరవశులగుదురు. కొందరు భగవంతుని దివ్యతేజము కొంచెమగపడినతోడనే మేరలేని యానందము నొందుదురు. కాని దివ్యానందప్రాప్తిచేత నిద్దరు సమానధన్యులే.

(180) పాముమిక్కిలి విషజంతువు. దానింబట్టుకొనుటకువచ్చినవారి నదికఱచును. కాని సర్పమంత్రము నేర్చుకొన్నవాఁడు పాముల నవలీలగాఁ బట్టుకొని నగలవలె వెంట గొనిపోవును. అట్లే బ్రహ్మజ్ఞానసంపన్నుఁడు కామలోభములచే నపవిత్రుఁడుకాఁడు.

(181) ఈక్రింది స్థితిగతులలో నేదైననొకటి యనుభవమునకు దెచ్చుకొన్నవాఁడు సిద్ధుఁడగును. (1) "ఈవిశ్వమంతయు నేనే, (2) ఈ విశ్వమంతయు నీవే (3) నీవు యజమానుఁడవు నేను సేవకుఁడను.

(182) భగవంతుని కనుగొనుటకు నీవు నీశరీరమును, నీమనస్సును, నీసంపదలను బలిపెట్టనక్కరలేదు.

(183) దేవత్వము కనఁబడకమునుపు మానవత్వము నశింపవలయును. ఆనందస్వరూపిణియైన దేవియొక్క యావిష్కరణముగలుగుటకు ముందు దైవత్వముకూడ నశింపవలయును. చచ్చిన శివదైవత్వముయొక్క వక్షస్థలముమీఁద దేవి తనదివ్యనృత్యమును జేయును.

(184) ఎవని ధ్యాననిష్ఠయు, భక్తియు, నతిశయముగా నుండునో యతఁడే భగవంతుని త్వరగాఁ గనుగొనును.

(185) ఒకచేఁపను నీటిలోనుండి తీసికొనికొంతకాలము బైటనుంచిమరల నీటఁ బడవేయుము. అది బయటనున్న కాలములో నెట్లుండునో యోగి సమాధిలో నట్లుండును.

(186) సముద్రములో గొప్పపర్వతములు, చిన్నకొండలు, చరియలు మొదలగునవి యుండును. కాని, యవి పైకగపడవు. అట్లే సమాధిలో యోగి సత్యానందసముద్రములోఁ దేలుచున్నప్పుడు మానవవ్యక్తి యంతయు సంఛన్నమై యుండును.

(187) కుండలో నీరుపోసి యొకచోటఁబెట్టితివేని క్రమక్రమముగా దానిలో నీరెండిపోవును. కాని యాకుండ నీటిలోఁబెట్టితివేని నది యచ్చటనున్నంతకాలము జలపూర్ణమైయుండును. భగవంతుని యెడల నీభక్తియు నట్టిదే. నీహృదయము భగవద్భక్తితోనింపికొంతకాలముంచి తరువాత నితరవ్యాపారములలోదిగి యతనినిమరచితివేని నీహృదయము క్రమక్రమముగాభక్తిశూన్యమై దేవునకునిలయముకాక పోవును. కాని నీహృదయమా భక్తిరసములో మునిగియుండునట్లు చేసితివేని నీవు భగవంతున కెన్నఁడును దూరముకావు.

(188) ధ్యానయోగములో నెవఁడు బాహ్యజ్ఞానములేక యుండునో వాఁడు ధ్యానయోగములో సిద్ధింబొందినాఁడని చెప్పవచ్చును.

(189) నీటిలోఁ బడవైచిన కూజాయొక్క లోపలను వెలుపలను నీరుండును. అట్లే భగవంతునిలో మగ్నమైనయాత్మ లోపలను, వెలుపలను, సర్వవ్యాపకుఁడైన యీశ్వరునే జూచును.

(190) భగవంతుని దయారసము క్రిందికి ప్రవహించినప్పుడు ప్రతిమనుష్యుఁడు తనదోషములను తానెఱుఁగును. అవి తెలిసినపిదప తానెవ్వరితోడను వివాదమాడఁగూడదు.

(191) చిన్న దీపము తేగానే నూరేండ్లనాటి చీకటియైనను నశించును. అట్లే భగవంతుని కటాక్షవీక్షణములచేత ననేకజన్మాంతరసంచితదోషములు పటాపంచలగును.

(192) మలయవాయువు వీచినతోడనే సారముగలవృక్షములన్నియు మంచిగంధపుచెట్లగును. కాని యరటిచెట్టు, వెదురుపొద, తాళవృక్షము మొదలగు సారములేని చెట్లు మార్పులేకయెప్పటియట్ల యుండును. అట్లే భగవంతునిదయారసముప్రవహించినప్పుడు యోగ్యతాబీజములుగలమనుష్యులు తోడనే సాధువులై భక్తిపూరితమానసులగుదురు. కాని పనికిమాలిన లౌకికులు మార్పుచెందక యుందురు.

(193) ఉషస్సు సూర్యోదయమునకు ముందు కనఁబడునట్లు స్వార్థత్యాగము పరిశుద్ధజీవనము ధర్మము మొదలగునవి భగవదనుగ్రహము కలుగుటకు ముందుకనఁబడును.

(194) తనసేవకుని గృహమునకు రాజు పోదలచుకొన్నపుడు సేవకుఁడు తనకు తగిన సన్మానము చేయుటకై తనపీఠములు,తననగలు భోజనపదార్థములు వానియింటికిఁ బంపును.అట్లే భగవంతుఁడు తానే హృదయమునందు ప్రవేశింపదలచుకొన్నాఁడో యాహృదయములోనికి వినయవివేకములను భక్తివిశ్వాసములను ముందుగాఁ బంపును.

(195) లోతులేనినీరు సూర్యరశ్మి తగులుచుండెనేనిక్రమక్రమముగా దానంతటదే యెండిపోవును. అట్లే పాపాత్ముఁడు భగవంతునే నమ్ముకొనియున్న పక్షమున వాని పాపము దానంతటదే క్షయించును.

(196) పోలీసువాఁడు మాయలాంతరుచేతబట్టుకొని దానివెలుగెటు త్రిప్పునో యటువైపుననున్న మనుష్యుని చూడఁగలడు. కాని

యామనుష్యుఁ డితనిని జూడలేఁడు. ఆవెలుగు పోలీసువాఁడు తనవైపు త్రిప్పుకొన్నప్పుడు తానుకూడ నితరులకు గనబడును. అట్లేభగవంతుఁ డెల్లవారిని జూచును కాని యతని నెవ్వరు జూడలేరు. తాను స్వయముగా గనబడదలచుకొన్నప్పు డతనిని మనము చూడఁగలము.

(197) కొన్ని చేఁపల కొక్కటే యెముకయుండును. కొన్నింటి కెన్నో యెముకలుండును. కాని చేఁప దినువారు యెముకలన్నింటినితీసి పారవైచి భక్షించునట్లు కొందరు బహుపాపములనుచేసి యుందురు. కొందరు కొన్ని పాపములను మాత్రమే కావించియుందురు. కాని కాలక్రమమున దైవానుగ్రహమే వాటిని శుద్ధిచేయును.

(198) దైవానుగ్రహము వాయువు రేయుంబవలువీచుచున్నది. జీవనసముద్రములో వేగముగా నీవు ప్రయాణముచేయఁదలచుకొన్నపక్షమున నీమనస్సనెడు నావయొక్క తెరచాపలు విప్పుము.

(199) చల్లగాలి వీచుచున్నప్పుడు విసనకఱ్ఱలు విడచిపెట్టవలెను. దైవానుగ్రహము గలిగినప్పుడు జపములు, తపములు, ప్రార్థనలు పరిత్యజింపవలెను.

(200) మతములు, తెగలు, వర్ణములు, నిష్ప్రయోజనములు. ప్రతివాఁడు తనమతమునందు చెప్పబడిన ధర్మములను విశ్వాసముతో నాచరింపవలెను. దైవసాన్నిధ్యమును బడయుటకు విశ్వాసమే పరమ సాధనము.

(201) విశ్వాసముకలవానికి సర్వముకలదు. విశ్వాసముకొరవడినవానికి సర్వము కొరతయే.

(202) విశ్వాసమువలనను రోగములు కుదుర్చునట్టి వైద్యులు రోగులను పిలిచి "నాశరీరములో రోగములేదు. నాకెంతమాత్రము జబ్బులేదు" అను మాటలను వారినోట పలికింతురు. అందువలనతమకేరోగములేదని వారికి విశ్వాసము కలుగును. ఆవిశ్వాసముచేత

నందురోగము కుదురును. అలాగే నేను మంచివాఁడను కాను, నీతి లేనివాఁడను" అని నీవుతలంతువేని నీవట్టివాఁడ వేయగుదువు. అట్లు గాక నాదగ్గర నఖండశక్తి కలదని నీవు విశ్వసించితివేని నీకట్టిశక్తి తప్పక గలుగును.

(203) భగవంతుఁడైన శ్రీరామచంద్రుఁడు లంకకుఁ బోవుటకై సముద్రమునకు సేతువుకట్టవలసివచ్చెను. కాని హనుమంతుఁ డొక్క దాటున లంకలో దుమికెను. యజమానునికంటె వానిబంటగు కొంతి మెక్కువ పనిచేసెను. దీనికారణమేమి? శ్రీరామునియందు హనుమంతునికిఁగల యఖండవిశ్వాసమే.

(204) ఒకమనుష్యుఁడు నదిదాటివెళ్ళవలసివచ్చెను. అది సురక్షితముగా దాటుటకు వాని కొకయోగి తాయెత్తునిచ్చి "ఇది చేతికి గట్టికొనుము. నదిమీఁద నీవు నడచివెళ్ళఁగలవు" అని పలికెను. ఆమనుష్యుఁడది తీసికొని నీటిమీఁదనడచి సగముదూరముపోయి తాయెత్తులో నేమియున్నదో కనుగొనవలెనని బుద్ధిపుట్టగా నది విప్పిచూచెను. అందులో నొకచిన్న తాటియాకుముక్కమీఁద "రామ" యను రెండక్షరములు వ్రాసియుండెను. అదిచూచి యామనుష్యుఁడు తనలో "ఇంతేనా యేదో గొప్పమంత్రము ఉన్నదనుకొన్నాను. రామనామమా! ఇది ఎవ్వఁడెరుగఁడు?" అని తిరస్కారభావముచూపెను. అతలంపుపుట్టిన తోడనే వాఁడు నీటిలోమునిగిపోయెను. భగవంతునియెడల విశ్వాసము మహాద్భుతమును జేయును. విశ్వాసము ప్రాణము, సందేహము మరణము.

(205) ప్రశ్న:—నాజీవనోపాధికై నేను ప్రయత్నముచేసుకో వలసియుండగా ప్రతిదినము భగవద్ధ్యానము చేయుటకై నాకవకాశ మేది?

ఉత్తరము:-ఎవనికొరకు నీవుపనిచేయుచున్నావో వాఁడే నీకు గావలసిన వస్తువులు నమర్చియిచ్చును. భగవంతుఁడునిన్నీలోకమునకు బంపకమునుపే నీసంరక్షణకొరకు తగినయేర్పాటులు చేసెను.

(206) ప్రశ్న:—నేనెప్పుడు స్వేచ్ఛగానుందును?

ఉత్తరము:—నీయహంభావము నశింపఁజేసి నీవు పరమేశ్వరునిలో లీనమగుదువో అప్పుడు.

(207) గాలిపడగలు లక్షోపలక్షలుచేసి పిల్లలు గాలిలో నెగరవేయుదురు. కాని యందులో నొకటి రెండుమాత్రమే త్రాడు తెంచుకొని పోవును. అట్లే వందలకొలది సాధకులలో నొకరిద్దరుమాత్రమే సంసారబంధములు తెంచుకొని ముక్తులగుదురు.

(208) పాదరసపుకుండలో సీసపుముక్క పడవైచితిమేని వెంటనే యది దానిలోఁ గలసిపోవును. అట్లే జీవాత్మ పరబ్రహ్మమను సముద్రములోఁ బడినపక్షమున తనవ్యక్తిని పోగొట్టుకొని బ్రహ్మమునందు లీనమగును.

(209) ప్రశ్న:—ఈకాలమున చేయఁబడుచున్న మతబోధను గురించి మీయభిప్రాయమేమి?

ఉత్తరము:—వండిన యన్నము ఒకమనుష్యునకు మాత్రమే సరిపోవునంత యుండఁగా నూరుమందిని విందునకు పిలుచుట యెట్లుండునో యీమతబోధ యట్లున్నది.

(210) ఇతరులకు బోధలుచేయుటకంటె నాకాలమందు భగవంతునారాధించుట మంచిది. యీరాధనమే యుత్తమబోధ. తానుముందుగా ముక్తుఁడగుటకు ప్రయత్నము చేయునో వాఁడే గొప్పబోధకుఁడు. సిద్ధునికడకు నానాదేశములనుండి యనేకులువచ్చి బ్రహ్మవిద్యనేర్చుకొందురు. వారెక్కడనుండి వత్తురో తెలియదు. వారినెవ్వరుపిలువలేదు. పుష్పము వికసించినప్పుడు తుమ్మెదలు నానాభాగములనుండి యెవ్వరు పిలువకుండగనేవచ్చి మకరందము త్రాగును.

(211) ఓమతబోధకుఁడా! బోధించుటకు నీకధికారముకలదా? మెడలో గవాలితాల్చిన తక్కువ రాజభటుఁడుకూడ కనబడఁగానే

జనులు వానిమాట గౌరవముతో విందురు. ఎట్టియల్లరియైన వాఁడడపఁ గలఁడు. అది యెల్ల వాని దివ్యబలమే. కావున నోబోధకుఁడా! నీవు ముందుగా దేవునివలన బోధించుట కధికారమును దగినయావేశమును సంపాదింపవలెను. ఆయావేశము కలుగనంతవఱకు నీవెన్ని బోధలు చేసినను నవి వ్యర్థములే.

(212) దివ్యతేజస్సుతో నెవ్వఁడు వెలుగుచుండునో వాఁడొక్కఁడే నిజమైన మనుష్యుఁడు.

(213) ఆత్మబంధముకలవాఁడు మనుష్యుఁడు. బంధములు లేనివాఁడు పరమేశ్వరుఁడు.

(214) తక్కెడలో బరువున్న సిబ్బె క్రిందికిదిగిపోవును. బరువులేనిది పైకిలేచిపోవును. అట్లే యధిక సంసారభారముగల మనుష్యుఁడు క్రిందిగిపోవును. తక్కువభారముకలవాఁడు పైకనగా పరమేశ్వర సన్నిధికరుగును.

(215) భగవంతుఁడు మనుష్యులందరిలో నున్నాఁడు. కాని ప్రతిమనుష్యుఁడు భగవంతునిలో లేఁడు. మనుష్యులు విశేషదుఃఖ మనుభవించుట కిదే కారణము.

(216) మనుష్యులు రెండువిధములుగా నున్నారు. గురువు శిష్యునితో నిట్లుచెప్పెను. "నేను నీకు బోధించునది వెలలేనిది కావున నేను బోధించినజ్ఞాన మితరులకు జెప్పక నీవేయుంచుకొనుము." అనగా శిష్యుఁడది యెవ్వరికి జెప్పక దాచుకొనెను. ఆగురు వాజ్ఞానమును మరియొక శిష్యున కుపదేశించెను. అతఁడా జ్ఞానము వెలలేనిదనియు సర్వజన తారకమనియు నెరిగి ఎత్తైనచోట నిలువఁబడి యెల్లవారి కారహస్యముపదేశించెను. అవతారపురుషులు రెండవతరగతివారు. సిద్ధులు మొదటితరగతివారు.

(217) ఎల్లకాలము నుపవాసము చేయువాఁడెవ్వఁడును లేఁడు.

కొందఱు జాముప్రొద్దెక్కి భోజనము చేయుదురు. కొందరు రెండుజాములప్పుడు తిందురు. కొందరు మూడుజాములవేళ భుజింతురు. కొందరు రాత్రి భుజింతురు. అట్లే యీజన్మములోను, మరియొక జన్మములోను ననేక జన్మాంతరములైన తరువాతను యెప్పుడో యొకప్పుడు మనుష్యుఁడు పరమేశ్వరుని దర్శనము చేయును.

(218) పండు చెట్టున పక్వమై మాగి తనంతట నేలరాలినప్పుడది మిక్కిలి రుచిగలిగి యుండును. అట్లుగాక పండకముందే చెట్టునుండి కోసి ముగ్గవేసితిమేని యది రుచితగ్గిపోవును. అట్లే మనుష్యుఁడు జ్ఞానపరిపక్వదశ నొందినప్పుడు వర్ణభేదములు మొదలైనవి తమంతట తామే వదలిపోవును. ఆపరిపక్వదశ వచ్చువఱకు మనుష్యుఁడట్టి భేదములను తప్పక పాటింపవలయును.

(219) తుపానుపట్టినప్పు డేది యేచెట్టో మనము చప్పున చెప్పజాలము. ఒకటి మఱ్ఱిచెట్టో రావిచెట్టో తెలిసికొనుట కష్టము. అట్లే సత్యజ్ఞానమనెడు తుపానురేగినపుడు వర్ణభేదములు కనఁబడవు.

(220) పుండు పూర్తిగా మానినవెనుక పొర దానంతటదియె యూడిపోవును, కాని దానిని బలవంతముగా నూడదీసిన యెడల నెత్తురుకారును. అట్లే మనుష్యునకు సంపూర్ణజ్ఞానము కలిగినవెనుక వర్ణభేదములు మొదలగునవి స్వయముగా నశించును. కాని యట్టిభేదములను బలవంతముగా నశింపఁజేయుట తప్పు.

(221) ప్రశ్న:—జందెముంచుకొనవలసిన యవసరమేది?

ఉత్తరము:—ఆత్మజ్ఞానము కుదిరినప్పుడు బంధము లన్నియు తమంతటవే విడిచిపోవును. అప్పుడెక్కువ జాతియనిగాని తక్కువ జాతియనిగాని బ్రాహ్మణుఁడనిగాని శూద్రుఁడనిగాని భేదముండదు. అప్పుడు బ్రాహ్మణ వర్ణసూచకమైన యజ్ఞోపవీతముయొక్క యవ

సరమే యుండదు. కాన భేధబుద్ధి యున్నంతకాలము బలవంతముగా జన్నిదమును విడిచిపెట్టకూడదు.

(222) ప్రశ్న.—"మీరు భార్యతోఁ గలసి సంసారమెందుకు చేయుదురు"? అనియొకరు రామకృష్ణపరమహంస నడిగిరి.

ఉత్తరము:—దేవతల సేనాపతియైనకుమారస్వామియొకనాఁడు తనగోటితో నొకపిల్లిచెంపమీఁద బరికెను. ఇంటికివెళ్ళినతర్వాత తల్లియైన పార్వతీదేవియొక్క చెంపమీఁద బరుకులుకనఁబడెను. అదిచూచి యతఁడు "అమ్మా! నీచెంపమీఁద బరుకులెందుకువచ్చిన" వనియడిగెను. పార్వతియతనికిట్లనియె. "కుమారా! ఇదినీపనియె. నీగోటితో నీవే బరికితివి." అనవుడు కుమారస్వామి మిక్కిలియాశ్చర్యముతో నిట్లనిమెను. "అమ్మా! నేనెన్నఁడు నిన్ను బరికినట్లు జ్ఞాపకములేదే నీవేల యిట్లనుచున్నావు?" అని పలికెను. "కుమారా! నీవు నేఁడొక పిల్లిని బరకలేదా" అని పార్వతియడిగెను. "అవును! బరికితినికాని నీచెంప మీఁద బరుకులెందుకు నుండవలయును." అనవుడు దుర్గయిట్లనియె. "కుమారా! యీప్రపంచమున నేనుతప్ప మరియొకవస్తువులేదు. నేనే సృష్టి. నేనే చరాచర ప్రపంచము. నీవెవరికి హానిచేసినను నాకు హానిచేసినట్లే." ఆపలుకులువిని కార్తికేయుఁడు మిక్కిలి విస్మయమొంది వివాహముచేసికొనుట మానుకొనెను. ఏలయన జగమునఁగల స్త్రీలందఱు తనతల్లియొక్క స్వరూపములే యగుటచే నతని దృష్టికి ప్రతిస్త్రీయు తనతల్లియగు దుర్గవలెనే కనఁబడెను. నేనా కుమారస్వామివంటివాఁడనే. లోకమునంగల ప్రతియాఁడుది నాకంటికి లోకమాతయగు పార్వతివలెనే గనఁబడుచున్నది.

(223) గొప్పకుటుంబములోని పతివ్రతలను నేనుచూచినప్పుడు నాతల్లియైన పార్వతి పతివ్రతారూపముతో వచ్చినట్లే నాకగపడును. మఱియు నీనగరమునందు సిగ్గుబిడియములు విడిచి నీతిమాలిన వేష

ముతో వీధియరుగులమీఁద గూర్చుండునట్టి గుడిసివేటువాండ్రను జూచినప్పుడును నాతల్లియైన దుర్గ మరియొకవేషముతో వినోదించు చున్నదని నేను తలంచెదను.

(224) ఈపట్టణమందంతట వాయుదీపములు గేస్లైట్లున్న వికదా. ఆవాయువుయొక్క తేజము పట్టణమందలి నానాభాగముల లో నొకచోట నెక్కువ తేజముతోను నొకచోట తక్కువ తేజముతోను వెలుగుచుండును. కాని యీతేజమునకు జీవమనిచెప్పఁదగిన వాయువు పట్టణమంతకు నొక్కచోటనుండియే వచ్చును. అప్పుడప్పుడు ప్రపం చమునఁ బుట్టునట్టి మతబోధకులు దీపస్తంభములు వంటివారు. పర మేశ్వరునియొద్దనుండి బ్రహ్మజ్ఞానతేజము వారిమీఁదికి ప్రసరించుచుండు ను. అందువలన వారు లోకమున వెలయుచుందురు.

(225) ఇంటిమీఁదకురిసిన వాననీరు గొట్టములమూలమున బై టికిఁ దీయవచ్చును. ఆగొట్టములతుదను మిక్కిలి చమత్కారముగ గో ముఖములు పెద్దపులిముఖములు చెక్కఁబడినపక్షమున నీరు గొట్ట ములలోనుండి యీముఖముల ద్వారమున బైటకువచ్చును. నీరుమా త్రమా గొట్టములలోనిదికాదు. అది వాననీరు. పరమసాధువులు నా నాచిత్రముఖములుగల గొట్టములు వంటివారు. వారిముఖములనుండి భగవంతుఁడు సత్యజ్ఞానామృతమును ప్రవహింపఁజేయుచుండును. ఆ జ్ఞానము వారిదికాదు. భగవంతునిది.

(226) నక్కకూతలన్నియు నొక్కమచ్చుననే యుండును. ప్ర పంచమందలి జ్ఞానులందరియొక్కబోధ లొక్కవిధముననే యుండును.

(227) ఈప్రపంచమున మనకు సుఖముగలుగఁజేయునట్టి ప్రతి విషయమునందు గొప్పగానో కొంచెముగానో పరమేశ్వరసంబంధ ముండును. బెల్లమునకు పటికిబెల్లమునకు నెట్టిభేదమున్నదో నట్టిసుఖ మునకు నీశ్వరసంబంధముగల సుఖమునకు నట్టిభేదముకలదు.

(228) ఇతరులవ్యాపారమునందు మగ్నుఁడైనవాఁడు తనలోపలివ్యవహారములను వెలుపలివ్యవహారములను మరిచిపోవును. అనగా తనలోకవ్యవహారములనుగాని పారమార్థికవిషయములనుగాని విచారించుకొనఁడు.

(229) మనస్సు దుర్మార్గములయందు ప్రవేశించినప్పుడు బ్రాహ్మణుఁడు మాలపల్లెలోనున్నట్లు గౌరవముగల పెద్దమనుష్యుఁడు చుట్టుగుడిసెలలో నున్నట్లు తలంపవలెను.

(230) ఒకమనుష్యుఁడు ప్లీడరును చూచినతోడనే వానికి వ్యాజ్యములమాట జ్ఞాపకమువచ్చును. అట్లే పరమభాగవతోత్తముని చూడఁగనే మనుష్యునకు భగవంతుఁడు పరమార్థము మొదలైనవి జ్ఞాపకమువచ్చును.

(231) ప్రశ్న:—మతబోధకునకు తనబంధువులవలన గౌరవము జరుగకపోవుటకు కారణమేమి ?

ఉత్తరము:— గారడివాఁడు విద్యలుచేయుచప్పుడు వానిచుట్టు క్రొత్తవారు చేరుదురుగాని వానిచుట్టాలు చేరరు.

(232) కొన్నిచెట్ల విత్తనములు చెట్టుక్రిందఁబడక కాయపగిలి గాలికెగిరి దూరముగాఁబడి యచ్చట మరలమొలచును. అట్లే సిద్ధునియొక్కయాత్మ సమీపమునందుగాక దూరమున వ్యక్తమగును.

(233) దీపపువెలుఁగు కొంతదూరముననున్న స్థలమును ప్రకాశింపఁజేయుచుండును. కాని దానిదగ్గరనే క్రీనీడయుండును. ఆలాగే మతోద్ధారకునియొక్క సామీప్యమున నున్నవాఁడు వానిమహిమ గ్రహింపలేఁడు. కాని దూరమునందున్నవాఁడు వాని జ్ఞానప్రభావములను గ్రహించి బాగుపడును.

(234) మిక్కిలి వడిగా ప్రవహించునదియొక్క నీళ్ళు ఒకచోట గుండ్రని సుడిగుండములుగాతిరుగును. కాని యాగుండములను వెం

టనేదాటి యాజల మెప్పటివలె ప్రవహించును. అట్లే యీశ్వరభక్తుల హృదయములు నడుమనడుమ నిరాశ విచారము మొదలగు సుడుల లోఁబడి గ్రుక్కుచుండును. కాని యట్టియవస్థ క్షణకాలముమాత్రమే యుండునుగాని చిరకాలముండదు.

(235) పండ్లతో నిండినచెట్టు వంగియుండును. కనుక నీవుగొప్ప వాఁడవు కాఁదలఁతువేని వినయముగలిగి వంగియుండుము.

(236) త్రాసులో బరువుగలచిప్ప క్రిందికిఁబోవును. తేలికచిప్ప పైనుండును. అట్లె సద్గుణము సామర్థ్యముగలవాఁడు మిక్కిలియడగి యుండును. కాని మూర్ఖుఁడు గర్వముగలిగి చెడిపోవును.

(237) సజ్జనునికోపము నీటిమీఁదగీచిన గీతవలె క్షణభంగుర మేగాని చాలసేపుండదు.

(238) తెల్లబట్టమీఁద నల్లనిమంటిచుక్క బడెనేని చుట్టుప్రక్కలనున్న తెల్లదనము ముందర నానలుపు మిక్కిలి యసహ్యముగ నుండును. అట్లే పవిత్రుఁడైన సాధువుదగ్గర మిక్కిలి చిన్నతప్పున్నను నదిమిక్కిలి ఘోరముగా కనఁబడును.

(239) సూర్యకాంతి యన్నివస్తువులమీఁదను సమానముగానే పడును. కాని యద్దములు నీళ్ళు మెరుఁగుచేసిన లోహములు మొదలగు తళతళలాడువస్తువులలో నదిప్రతిఫలించును. ఈశ్వర తేజ మిట్టిదే. అదియెల్లవారి హృదయములమీఁద పక్షపాతములేక సమానముగాఁబడును. కాని సాధువులయొక్కయు సిద్ధులయొక్కయు స్వచ్ఛ హృదయములమీఁద నది పరిపూర్ణముగా ప్రతిఫలించును.

(240) పాదరసముపూసిన యద్దములో మనుష్యుఁడు తనప్రతిబింబమును చూడఁగలుగును. అట్లేవైరాగ్యముగల మనుష్యునియొక్క పావనహృదయములో నీశ్వరప్రతిబింబము ప్రతిఫలించుచుండును.

(241) నీవుచిన్నబిడ్డవలె నెప్పు డమాయికుఁడవగుదువో యప్పు డే దివ్యతేజము నీవుబడయఁగలవు. నీవునేర్చికొనిన ప్రపంచజ్ఞానమంతయు మఱచిపోయి చిన్నబిడ్డవలె నజ్ఞానుఁడవుగమ్ము. అప్పుడే సత్యజ్ఞానమును నీవు సంపాదింపఁగలవు.

(242) మన పంచాంగములలో వర్ష యోగములు వ్రాసియుండును. పంచాంగమెంత తెలిసినను వానచుక్క యూడిపడదు. అట్లే పుస్తకములలో నెన్నోధర్మములుండును. కాని యవి చదివినంతమాత్రమున భక్తివిశ్వాసములు పుట్టవు. అందు నేర్పఁబడిన సద్గుణములను నేర్చుకొని మనుష్యుఁ డాప్రకారము నడచుకొనవలెను.

(243) ప్రశ్న—మతములు మొదట మిక్కిలి పవిత్రములుగానుండి క్రమక్రమముగా నేలచెడిపోవును?

ఉత్తరము:—వాననీరు మిక్కిలి పరిశుద్ధమైనది. కాని యది దేనిమీఁదఁబడునో దానిబట్టి శుద్ధిమారుచుండును. ఇంటిమీఁదను, గొట్టములలోను మురికియున్నపక్షమున దానిమీఁద కురిసి గొట్టము గుండ వచ్చునీరు మురికిగానుండును.

(244) సొమ్ము నీ కన్నము, నెయ్యి మొదలగువానిని మాత్రమే సమకూర్చును. కాబట్టి యదే పరమార్థమని దానికొరకు కెల్లపాటులు పడి మోసపోకుము.

(245) గీటురాతిమీఁద గీచినయెడల బంగారముయొక్కయు, ఇత్తడియొక్కయు వన్నె స్పష్టపడును. అట్లే కష్టములు కలిగినప్పుడే నిజమైన సాధువులెవ్వరో, వంచకులెవ్వరో తెలియును.

(246) ఉక్కుతునక కావలెనన్న మంచి యినుము తెచ్చి యదికి మెన్నోసారు లెఱ్ఱఁగా కాల్చి సుత్తితోఁ గొట్టవలెను. అప్పుడది యుక్కుగా మారును. అంతట దానిని మనము యిష్టమువచ్చినట్లు వంచి కత్తులుగాను, కటారులుగాను చేయవచ్చును. అట్లే మనుష్యుఁ

డు మహాకష్టము లనియెడు కొలిమిలోఁ గాల్పఁబడి లోకపీడ యను సుత్తిదెబ్బ పలుమారు తిననఁగాని పరిశుద్ధుఁడు, వినయసంపన్నుఁడు గాఁడు.

(247) నీమతములో నెల్లప్పుడు స్థిరముగా నిలువఁబడుము కాని యసహనమును, మౌఢ్యమును విడిచిపెట్టుము.

(248) నూతిలోని కప్పవలె నుండవద్దు. ఆకప్ప తన నూతి కంటె విశాలమైనదియు, గొప్పదియు మఱియొకటి లే దనితలంచును. మతోన్మాదము గలవారందఱు నట్టివారే వారు తమమతమే సర్వ శ్రేష్ఠమందురుగాని తక్కిన మతములలోని మంచి చూడరు.

(249) ఒక మనుష్యుఁడు పరమశివభక్తుఁడై తక్కిన దేవతల నసహ్యించుకొనుచుండును. ఒకనాఁడు శివుఁడు వానికిప్రత్యక్షమై "ఇతరదేవతలను నీవు దూషించినంతకాలము నేను నీభక్తి మెచ్చుకొనను" అనిపలికెను. కాని యీమనుష్యుఁడు తనపంతము విడువలేదు. మరి కొంతకాలమునకు శివుఁడు మరల వానికి సాక్షాత్కరించెను. ఈసారి కేవల శివరూపముతోఁగాక హరిహరరూపముతోఁ గనఁబడెను. అనఁగా సగము శరీరము శివుఁడు సగముశరీరము విష్ణువు. ఈవిగ్రహము. చూచి యీమూర్ఖుఁడు సగము సంతోషించి సగము విచారించెను. అనఁగా విష్ణుదర్శనమైనందున విచారించెను. అయినను శివరూపమున్నవయిపున నతఁడు పుష్పములతో నర్చించి యాభాగమునకే హారతులిచ్చి సాంబ్రాణి ధూపము వైచెను. కాని యాధూపవాసనలు విష్ణుమూర్తి యాఘ్రాణింపకుండ వానిముక్కు చేతితో నొక్కిపట్టెను. మేరమీరిన యతని మూర్ఖతఁజూచి శివుఁడసంతుష్టుఁడై తక్షణమే యదృశ్యుఁడయ్యెను. కానియీమనుష్యునిమూర్ఖత లేశమైన తగ్గలేదు. ఈవార్త గ్రామమంతట తెలిసెను. ఊరిలోని చిన్నబిడ్డలు వాఁడు కనఁబడినప్పుడెల్ల విష్ణునామముచ్చరించి వానినుడి

కింపఁదొడఁగిరి. అప్పుడు వాఁడాశబ్దము వినలేక చెవులకు గంటలు కట్టుకొనెను. వానికి ఘంటాకర్ణుఁడని పేరు కలిగెను. వాఁడు హరిహరుల కిద్దఱకుగూడ ననిష్టుఁడయ్యెను. మూర్ఖులిట్టి మూర్ఖవిశ్వాసములచేత చెడిపోవుదురు.

(250). క్రొత్త కోడలు మామగారికి నత్తగారికి తక్కినపెద్దలకు వినయముగా నడచుకొనుచు తన మగనిమీఁద భక్తి నెప్పటియట్లే నిల్పుకొనునట్లు నీవును నీయిష్టదైవతముమీఁద నధికభక్తి గలవాఁడవై యుండి తక్కిన దేవతలను నిరాకరింపకుము.

(251) నిజముగా మతముమీఁద భక్తిగలవాఁడు తక్కినమతములుగూడ పరమపదమునకు మార్గములేయని గ్రహించును. అన్యమతములమీఁద మన మెల్లప్పుడు గౌరవము నిలుపవలెను.

(252) బ్రహ్మసమాజమునకును హిందూమతమునకునుఁ గల భేద మేమి? బ్రహ్మసమాజ మొకటే స్వరము. హిందూమతము బహుస్వరములతోఁ గూడినజ్ఞానము. బ్రహ్మసమాజమతస్థులు బ్రహ్మమునొక్క యేకస్వరముతో సంతుష్టులై యున్నారు. హిందూమతము శ్రావ్యమై మధురమైనగానమునకు హేతువైన బహుస్వరములను గలిగియున్నది.

(253) హిందువులు బ్రహ్మసమాజమతస్థులు, తమతమ మతములను మిక్కిలి పట్టుదలతోఁ బోధించుచున్న కాలమున నొక మనుష్యుఁడు రామకృష్ణపరమహంసయొద్దకుఁ బోయి యీ రెండుమతములగుఱించి మీ యభిప్రాయ మేమి యని యడిగెను. అప్పుడతఁడిట్లనియెను. "నాతల్లియైన దేవి తనపని వా రిద్దరిచేతఁగూడ చేయించుచున్నదని నాయభిప్రాయము.

(254). హరియనఁగా మనహృదయములు హరించువాఁడు, హరిబల మనఁగా దైవబలము.

(255) పాపము పాదరసమువంటిది. అది దాగదు. రసముతిన్న వానినోరు పుండై యూరహస్యము దాగనట్లే పాపముగూడ దాగదు.

(256) విచారముగలిగినప్పుడు వచ్చుకన్నీళ్ళు సంతోషము గల్గినప్పుడు వచ్చునానందబాష్పములు నొక్క నేత్రమునుండి పుట్టి చెరియొకకొననుండి కారును. దుఃఖజలము ముక్కునకు సమీపముననుండు కంటికొననుండి కాఱును. ఆనందబాష్పములు రెండవకొననుండి కారును.

(257) మహాద్భుతము లైన కార్యములఁ జేయువారియొద్దకుఁ బోకుము. వారు సత్యమార్గము విడిచి తిరుగువారు. వారిమనస్సులు మాయాశక్తియొక్క వలలోఁ దగులుకొని యున్నవి. అవి బ్రహ్మముకడకుఁ దీసికొనిపోవు మార్గమున నడ్డుగానుండును. కావున వాని నెన్నఁడు కోరవద్దు.

(258) నిర్జనవనములో నొకఁడు పదునాల్గు వత్సరములు యోగియై తపస్సుజేసి యెట్టకేలకు నీటిమీఁద నడుచునట్టి యద్భుతశక్తి సంపాదించెను. ఈమహాశక్తి గలిగినందుకు మిక్కిలి సంతసించి యతఁడు తన గురువుకడకుఁబోయి తనకిట్టిప్రజ్ఞ కలిగినదని చెప్పెను. అదివిని గురువునవ్వుచు శిష్యున కిట్లనియె. "ఎత్సా! పదునాలుగేండ్లు ఘోరతపస్సుజేసి కాయకసరులుదిని బహుశ్రమపడి నీవునేర్చి చేయఁగలపనినే రేవు పడవనడుపువానికి నొక్కడబ్బిచ్చి ప్రతిమనుష్యుఁడు చేయగల్గుచున్నాఁడు సుమా.

(259) పరమహంసయొక్క శిష్యుఁడొక్కఁడు పరులమనస్సులోనున్న యభిప్రాయముల గ్రహింపఁగలశక్తి సంపాదించి తన ప్రజ్ఞా విషయమై గురువుతోఁ జెప్పెను. అతఁడు వానిఁ జీవాట్లుపెట్టి యిట్లనియె, "ఛీ! సిగ్గు సిగ్గు! ఇట్టి నీచవిషయములందు, నీ తెలివితేటలు వినియోగించి చెడిపోకుము.

(230) చాకలివానియొద్ద నెన్నోబట్టలుండును. కాని యవి వాని వికావు. బట్టలుదికినతోడనే యవి వాఁడు యజమానులకుఁ బంచిపెట్టును అప్పుడు వానిల్లు వస్త్రశూన్యమగును. తమ స్వంత యాలోచనలు లేనిమనుష్యులు చాకలివాని వంటివారే.

(231) దురాశ దుఃఖముచేటు. సంతుష్టి సంతోషదాయకము. ఒకనాఁడొక మంగలి పిశాచము లాశ్రయించిన యొక చెట్టుక్రిందనుండి పోవుచుండెను. అప్పుడు పైనుండి "నీకేడుకుండల బంగారము కావలెనా" యనుశబ్దము వినఁబడెను. మంగలి తలయెత్తి చూచెను. ఎవ్వరుకనబడలేదు. వాఁడక్కజమునంది సాగిపోఁదలఁచుకొనఁగా మరల నాశబ్దమే వినఁబడెను. అప్పుడు వాఁడిట్లనియె. "అయ్యా! మీ రెవరో నేనెఱుఁగను కాని దేవరవారు నావంటి పేదమంగలిమీఁద దయగలిగి నిర్హేతుకముగా నిటువంటి గొప్పయుపకారముఁ జేయఁదలచుకొన్నందుకు వద్దనుటకు నాకునోరువచ్చునా?" అనిపలుక "ఇంటికివెళ్ళునప్పటికి, ఏడుకుండల బంగారము నీయింటనుండును వెళ్లు" మని శబ్దమువినఁబడెను. మంగలి మహానందభరితుఁడై పరుగుపరుగున నింటికిఁబోయి చూచునప్పటికి బంగారముతో నిండిన యేడుకుండలు కనఁబడెను. అందొకకుండలో సగముమట్టుకు మాత్రము బంగారముండెను. ఆఱుకుండలనిండబంగారమున్నదని వాఁడుసంతుష్టిఁజెందక యేడవకుండనిండలేదనివిచారించుచు, ఆకుండ బంగారముతో నింపివేయవలెనని భార్యశరీరముమీఁదనున్న నగలనమ్మి, ఇత్తడిసామాను వెండిసామాను విక్రయించి బంగారముఁగొని యాకుండలోఁ బడవైచెను. కాని యది నిండలేదు. అంతట వాఁడు మునుపటివలె సుఖముగా నన్నముఁ దినక చోడంబలియు గంజియుఁ ద్రాగిబ్రతుకుచు ధనముఁబోగుచేసి యాకుండలోవేయుచువచ్చెను. అప్పటికి నది నిండలేదు. వాఁడు రాజుగారి సేవకుఁడొకటచే మునుపటిజీతముతోఁ దన కుటుంబసంరక్షణ మొకటలే

డని చెప్పుకొని జీతము వృద్ధిచేయుమని కోరెను. రాజు వానిమాట నిజమనుకొని యట్లుచేసెను. ఆజీతముతో బంగారముకొని యాకుండలో వేయుచువచ్చెను. ఎంతకు నది నిండలేదు. తర్వాత వాఁడుబిచ్చమెత్తి ధనమార్జింపఁజొచ్చెను. చిక్కి శల్యమయ్యెను. మురికిగుడ్డలు కట్టఁజొచ్చె. వానియవస్థఁజూచి రాజు విస్మయమునొంది వానినిఁ బిలిచి "ఓరీ! జీతము వృద్ధికాకమునుపే నీవెక్కువ బలముగాను శుభ్రముగాను గనఁబడితివి. వృద్ధియైన తర్వాత మిక్కిలి దురవస్థలో బడితివి కారణమేమి? ఏడుకుండలబంగారము పుచ్చుకొంటివా యేమి?" అని యడిగెను. మంగలివాఁడు తెల్లఁబోయి "మహాప్రభూ! ఈరహస్యము దేవరవారి కెవ్వరుజెప్పిరి?" అనియడిగెను. ఓరీ! ఎవ్వరునుజెప్పనక్కఱలేదు. ఈయేడుకుండలబంగారము పుచ్చుకొన్నవారినెందఱినో యెఱుఁగుదునని రాజు బదులుచెప్పి యాకుండలిచ్చివేయుమని యాజ్ఞాపించెను. అప్పుడాతఁడు కుఁడు పిశాచములున్న వృక్షముకడకుఁ బోయి బంగారపుకుండలు నాకక్కరలేదనిచెప్పెను. వాఁడింటికిఁ బోవునప్పటికి కుండ లంతర్ధానము నొందెను. కాని వాఁడు పొట్టకట్టిపెట్టుకొని యేడవకుండలోఁబోసిన సొమ్ముకూడ పోయెను.

(262) తామరగోకినప్పుడు మిక్కిలి సుఖముగానుండునుకాని తర్వాత కలిగెడు బాధ వర్ణింపనలవికాదు. అట్లే ప్రాపంచిక సుఖములననుభవించునప్పుడు మిక్కిలి సంతోషకరముగా నుండునుకాని పిదప వానివల్ల గలుగునష్టము మితిమీరి యుండును.

(263) ప్రపంచమెట్లున్నది? ఉసిరికాయవలెనున్నది. ఉసిరికాయయందు గింజపెద్దది. గుజ్జు తక్కువ. తింటే వగరు. కడుపునొప్పి.

(264) ధనముకొరకై మితిమీరిన శ్రమపడులోభివలెనే నీవు భగవంతునిదర్శనము సంపాదించుటకై సకలప్రయత్నములుచేయుము

(265) హృదయాకాశముమీఁద కోరికలనెడు మహావాయువు

లు మిచిపంతోకాలము భగవంతుని తేజము మనము చూడఁజాలము. నిర్మలమై నిశ్చలధ్యానముతోఁగూడిన హృదయమునందే పరమేశ్వ రావిర్భావము గలుగును.

(266) మకిలిగల యద్దములో సూర్యకిరణములు ప్రతిఫలిం పవు. అట్లే మాయామోహితములై మలినములై యపవిత్రములై న హృదయములు భగవంతుని మహిమను గ్రహింపఁజాలవు. పరిశుద్ధ మైన యద్దమున సూర్యబింబము ప్రతిఫలించునట్లు, పరిశుద్ధహృదయ మున భగవంతుఁడు కనఁబడును. కావున పరిశుద్ధుఁడవై యుండుము.

(267) గాలిచే సంక్షోభముఁ జెందిన నీటిమీఁద చంద్రుఁడు విఱిగిపోయిన బొమ్మవలె ప్రకాశించును. అట్లే మాయామోహితుఁ డైన లౌకికునియొక్క యస్థిరచిత్తము మీఁద పరిపూర్ణుఁడైన భగవం తుఁడు స్వల్పతేజముతో మాత్రము ప్రకాశించును.

(268) ప్రశ్న:—భక్తుఁడు తన యిష్టదైవముకొఱకు సర్వము నేల పరిత్యజించును?

ఉత్తరము:—కంటికి వెలుఁగుకనఁబడఁగానే పురుగు చీఁకటి నుండి దాని వైపు పరుగెత్తును. చీమ చెఱుకుపానకములోనే పడిచ చ్చును. కాని దానినెప్పుడు విడువదు. అలాగే భక్తుఁడు సమస్తము ను విడిచి తనదైవమునే చేరుకొనును.

(269) మనుష్యుఁడు నిచ్చనతోనో, వెదురుగడతోనో, మెట్లవలన నో, త్రాడో, యాధారముచేసికొని యింటిమీఁది కెక్కవచ్చును. అలాగే భగవంతుని సమీపించుటకు సాధనోపాయము లనేకములు గలవు. ఒక్కొక్కమతము ఒక్కొక్కవిధానమును తెలియఁజేయును.

(270) ప్రశ్న:—దేవుఁడు సర్వవ్యాపకుఁడు కదా. ఆయనను మన మేల చూడఁజాలము?

ఉత్తరము:—నాచు, తుక్కు, జమ్ము, మొదలైనవానిచే కప్పఁ

బడిన యొకగుంటగట్టుననిల్చిన మనుష్యునకు గుంటలోనినీరు కనఁబడదు. నీరు చూడవలయునన్న జమ్ము, నాచు మొదలైనవి తీసివేయవలయును. నీకన్నులను మాయకప్పుచున్నది. కావున నీవు భగవంతుని జూడలేవు. ఆయనను నీవుచూడఁదలఁతువేని నీకన్నులనుండి మాయను తొలఁగింపుము.

(271) ప్రశ్న:—మనముజగన్మాతయైన దేవినేలచూడఁజాలము?

ఉత్తరము:—ఆమె గొప్పయింటిస్త్రీవంటిది. తెరవెనుకనుండి యందరినిఁజూచుచు తానెవ్వరికిఁ గనఁబడక తన వ్యవహారమంతయు నామె చక్కఁగా చేసికొనుచుండును. ఆమెకొడుకులు మాత్రమే తెరఁదాటివెళ్ళి యామెను జూడఁగలరు. అట్లే మాయయను తెరమరుగుననున్న దేవిని సద్భక్తులు మాత్రమే చూడఁగలుగుదురు.

(272) వాదములుసేయకుము. నీమతముమీఁద నీకెంతవిశ్వాసమున్నదో యితరులమతములమీఁద నితరులకు నంతవిశ్వాసమేయున్నది. వితండవాదము చేయుటవలన తనతప్పు తానెన్నఁడు తెలిసికొనఁజాలఁడు. ఈశ్వరానుగ్రహము ప్రసరించిన పక్షమున ప్రతిమనుష్యుఁడు తనతప్పు తానుగ్రహించును.

(273) ఒకకాఁపువాఁడు దినమంతయు శ్రమపడి చెఱుకుతోఁటకు నీరుపెట్టెను. కాని యానీటిలోనొకచుక్కయు చెఱుకుతోటలోఁబడక యెలుక కన్నములుగుండ భూమిలోనికిఁబోయెను. తనహృదయమున ధనార్జనము కీర్తిసంపాదనము మొదలైనకోరికలు పెట్టుకొని భగవంతు నారాధించునట్టి భక్తుఁడుకూడ నట్టివాఁడే. అనుదినము వాఁడు ప్రార్థనఁజేయుచున్నప్పటికి వానిప్రార్థనము నిష్ప్రయోజనము ఏలయన వానియారాధనమంతయు వాంఛలనియెడు నెలుకకన్నములగుండ వ్యర్థమైపోవుచున్నవి. వాని జీవితాంతమున సహితము వాఁడు లేశమైన వృద్ధిచెందక మొదటనున్నట్లే యుండును.

(274) భక్తిని భక్తులను వెక్కిరించి యెగతాళిఁ జేయునట్టిమూర్ఖులకు దూరముగానుండి నీవు ప్రార్థనచేసికొమ్ము. ప్రార్థనకాలమందు వారిని దగ్గరకు రానీయకుము.

(275) ప్రశ్న:—వేరు వేరు తెగలు కల్పించుట మంచిదా?

ఉత్తరము:—నాచు ప్రవాహముగల యేటిలో మొలవదు. నిలువనీరున్న కోనేరులలో మొలుచును. అట్లే భగవంతునిమీఁద గాఢప్రేమఁగలవాఁడు మఱియొకపనిఁ జేయుట కవకాశము లేకయుండును. పేరు ప్రతిష్ఠలు గావలసినవాఁడు క్రొత్త తెగలు కల్పించును.

(276) వేదములు శాస్త్రములు పురాణములు మొదలైనసమస్తపవిత్రగ్రంథములు మనుష్యులనోళ్ళనుండి వెలికివచ్చుటచేత తినియుమిసినయన్నమువలె నెంగిలియై మైలపడినవి. కాని పరబ్రహ్మము మనుష్యుల నోటనుండివచ్చు మాటలచే నింతవరకు సంపూర్ణముగా వర్ణింపఁ బడలేదు గావున నింతవరకెంగిలియై మైల పడలేదు.

(277) మాయను మనము కనుగొనగానే యది పారిపోవును. ఒకపురోహితుఁడు తనశిష్యునిఁ జూచుటకై గ్రామాంతరము వెళ్ళుచుండెను. ఆయనవెంట సేవకుఁడు లేఁడు. త్రోవలో నొక మాదిగవాఁడు కనబడగా వానిఁజూచి యతఁడు, "ఓరీ! నీవు నావెంట సేవకుఁడుగా వత్తువా కడుపునిండ నీకన్నముపెట్టించెదను. నీ కేలోటు లేకుండఁ జేసెదను. రాగలవా!" అని యడిగెను. అనవుడు మాదిగవాఁడిట్లనియె. "మహాప్రభూ! నేను కడజాతివాఁడను. నేను దేవరవారికిబంటునై యెట్లు రాఁగలను." అది విని పురోహితుఁడిట్లనియె. "భయములేదు! నీవేజాతివాఁడవో యెవ్వరితోను చెప్పవద్దు. ఎవ్వరితోను మాట్లాడవద్దు. ఎవ్వరిజోలికిపోవద్దు." అందుకు మాదిగవాఁడొప్పుకొనెను. సాయంకాలము పురోహితుఁడు సంధ్యావందనము చేసికొనుచుండఁగా మరియొక బ్రాహ్మణుఁ డటకు వచ్చి సేవకునిఁజూచి 'ఓరీ! నాజోడు తీసికొనిరా!' అని యాజ్ఞాపించెను.

ఎక్కాలితో దాను మాట్లాడవద్దని, గురువు చెప్పుటచేత వాడు జోడు దీసికొని రాక బదులు చెప్పక యూరకుండెను. బ్రాహ్మణుడు జోడు తెమ్మని మరలగట్టిగా పలికెను. వీడు మొద్దువలె గూర్చుండెను. మూడవసారి బ్రాహ్మణుడు మిక్కిలి కోపించి "ఓరీ!, మాదిగ వెధవా! మాటలాడ వేమిరా! జోడు తెమ్మన్న మాటలు వినబడలేదా!" అని దూషించెను. అప్పు డా సేవకుడు తనలో "అయ్యో! నా సంగతి కనిపెట్టినారు. ఇక నేనిక్కడ నుండకూడదు" అని, పరుగెత్తెను.

(278) (ప్రశ్న) పరమాత్మకు, జీవాత్మకు భేద మేమి? (ఉత్తరము) నదీప్రవాహములో నొకదూలము నైచి నిలిపెనని జలము రెండు భాగములైనట్లు మనకగపడును. అట్లే మాయవల్ల గలిగిన యుపాధి భేదములచేత నిర్వికల్పమగు పరబ్రహ్మము భేదమై జీవాత్మయట్లు, పరమాత్మయట్లు కనబడుచున్నది. కాని నిజముగా రెండు నొక్కటే.

(279) సూచికాయంత్రము, ఉత్తరదిక్కును జూపినంత కాలము నోడ సరిగా నడచునుగాని తప్పుదారిం బట్టదు. జీవనమనియెడి నావయొక్క సూచికాయంత్రమని చెప్పదగిన మనస్సు చలనములేక పరబ్రహ్మమువైపు సదా తిరిగియుండిన పక్షమున నేయపాయములేక గమ్యస్థానముం జేరును.

(280) ఒక యవధూత యొకచోటగూర్చుండి జపముచేసికొనుచుండగా నాదారిని, పెండ్లివారు రేగుము మంగళవాద్యములతో మహావైభవమున బోవుచుండిరి. అవధూత జపముమాని యటుచూచెను. అచ్చోటనే యొక వేటగాడు చెట్టుమీదనున్న పక్షిని గొట్టవలెనని సరియైనగురిం జూచుచు పెండ్లివారికేసి చూడలేదు. దృష్టి మరల్పలేదు. ఒక్కయడుగైనం గదల్పలేదు. అవధూత వేటగానిం జూచి ఓయీ! నీవ నాగురువువు!" ఆపక్షిమీద నీమనస్సు లీనమైయున్నట్లు నేను ధ్యానించునట్టి పరబ్రహ్మమునందు నామనస్సు లీనమైయున్న పక్షమున నేను ధన్యుడనగుదును.

కొమ్మమీఁదనెక్కి హాయిగాకూర్చుండెను. ఒకయవధూత దానిఁజూచి నమస్కరించి యిట్లనియె. ఓగ్రద్దా! నీవే నాగురువువు! ఏలయన మనుష్యుఁడు ప్రపంచక వాంఛలనియెడు బరువుడిచిపెట్టనంతసేపు వాఁడు సకలదుఃఖములపాలగుననియు, అట్టిబరువు విడిచినవెంటనే నీవలె నిర్విచారముగా సుఖముగా గూర్చుండుననియు నీతి నేర్పితివి.

(284) మనగురువు మనుష్యుఁడుగావున మంత్రము చెవిలో నుపదేశించెను. దేవుఁడే గురువైనపక్షమున మంత్రము మనయాత్మకుపదేశించును.

(285) సూదిలో దారమెక్కించుకోఁదలచుకొన్నయెడల దారమునునుపుజేసి సన్ననికొనయుండినట్లు జేయవలెను. అప్పుడాదారము చులకనగా సూదిబెజ్జములోనెక్కును. అట్లే నీహృదయము పరమేశ్వరునిమీఁద నిలుపఁదలఁచుకొన్నయెడల వినయముగలిగి, శాంతముగలిగి, కోరికలను జంపుకొనుము.

(286) ఒక పుట్టలో నొకపాముండి దారిఁబోవునందరిఁ గఱచుచుండెను. అందుచేత నాత్రోవనెవ్వరుఁ బోవరైరి. ఒకనాఁడొక యోగి యా మార్గమునఁ జనుచుండ పాము బుసకొట్టుచు వానిఁగరువఁబోయెను. అది యామహాత్ముని సమీపించునప్పటికి వానిమహిమచే దాని పొగరడగి పోయెను. యోగి పామునుజూచి "ఓసీ! నన్ను గరువదలఁచినావా?" అని పలికెను. అతనిపలుకులువిని పాముసిగ్గుపడి యూరకుండెను. అప్పుడు యోగియిట్లనియె. ఇకముందు నీవెవ్వరిఁ గఱువకుము. మంచిమార్గమునఁ గాలక్షేపముఁజేయుము. ఆపలుకులకు సర్పమువినయముతో దలయూచెను. యోగితనదారిఁబోయెను. పాము పుట్టలోఁ బ్రవేశించి వెనుకటిదుర్గుణములువిడిచి యెవ్వరినిహింసచేయక సాధువృత్తిఁ బూనియుండెను. సర్పముయొక్క శక్తి చచ్చినదని చుట్టుప్రక్కలవారందరు దానిధర్మగుణము గ్రహింపలేక దానిదగ్గరకుఁ

బోయి పుల్లలతోఁ బొడిచి, బెడ్డలతోఁ గొట్టి, రాళ్ళు విసిరి, ముండ్లమీఁద నీడ్చి నానాబాధలు పెట్టఁజొచ్చిరి. కాని యది యన్ని బాధలుపడుచు నెవ్వరిజోలికిఁబోవదయ్యెను. దానిశరీరమంతయు నెత్తురు గారఁజొచ్చెను. అదృష్టవశమున యోగియాదారిని వచ్చి సర్పముయొక్క దురవస్థఁ జూచి నీకిట్టి దుస్థితి యేలవచ్చెనని యడిగెను. మీయుపదేశముఁబట్టినేనెవ్వరిజోలికిఁ బోకపోవుటచే నిట్టి దురవస్థ ప్రాప్తించెనని యది యుత్తరమిచ్చెను. అప్పుడు యోగియిట్లనియె. వెఱ్ఱిదానా! యెవ్వరిని గఱచి జంపవద్దని ధర్మోపదేశముఁ జేసితిఁగాని నీవు లోకువవై యిట్లుచెడి పొమ్మనిచెప్పితినా? నీజోలికెవ్వరైన వచ్చినప్పుడు బుస్సుమనిలేచి వారిని బెదరింపుము. పాముగఱచునేమోయను భయము వారికుండవలయును. కాని కఱచి హింసింపవద్దు." అది మొదలుకొని సర్పము తనయెడ నెల్లవారు భయముఁగలిగి యుండునట్లు వర్తించెను. నీవీప్రపంచమున సుఖముగా బ్రదుకఁదలంచుకొన్న పక్షమున నెల్లవారికి నీయెడల భయము, భక్తి, గౌరవము గలుగునట్లు నడుచుకొనవలెను. నీవెవ్వరిని హింసింపఁగూడదు. ఒకరిచేనీవు హింసింపఁబడఁగూడదు.

(287) పక్షి పారిపోయినతర్వాత పంజరమెవ్వరికి నక్కరలేదు. అట్లే ప్రాణమనియెడుపక్షి యెగిరిపోయినపిదప శవమెవ్వరికినక్కరలేదు.

(288) చమురులేక దీపమెట్లు వెలుగదో యట్లే మనుష్యుఁడు దేవుఁడులేక జీవింపఁ జాలఁడు.

(289) విద్వాంసుఁడైన యొకబ్రాహ్మణుఁడొకానొక రాజుకడకుఁబోయి 'రాజా! నేను వేదశాస్త్రపురాణములలో గొప్పపండితుఁడను పుణ్యగ్రంథమైన భాగవతమును నీకుజెప్పెద చదువుకొమ్ము.' అని పలికెను. నిజముగా భాగవతము చదువుకొని దానిపరమార్థము తెలిసికొన్నవాఁడు తనదారియే చూచుకొనునుగాని కొలువుకూటములకుఁబోయి రాజులదర్శించి వారినాశ్రయించి ధనమపేక్షింపఁడని యా

రాజెఱుగును. కావున బ్రాహ్మణునిఁజూచి 'అయ్యా! భాగవతము మీరు చక్కఁగా చదివినట్లగపడదు. మీరది సంపూర్ణముగాఁ జదివి వత్తురేని మిమ్ము గురువుగా జేసికొందు' నని పలికెను. ఆపలుకువిని బ్రాహ్మణుఁడు "ఆహాహా! ఈరాజెంతమూర్ఖుఁడు. ఎన్నో సంవత్సరములనుండి భాగవతము నేనెన్నోసారులు చదివియుండగా నేనది తిన్నగాచదువలేదనుచున్నాఁడు." అని తనలోననుకొని యింటికిఁబోయి యెందుకైనను మంచిదని మరియొకసారి భాగవతము గట్టిగాచదివి రాజుకడకుఁబోయి భాగవతము నేర్చితినని చెప్పెను. రాజు వెనుక చెప్పినట్లే చెప్పి యాయనను వెనుకకుఁబంపివైచెను. బ్రాహ్మణుఁడు మిక్కిలి విసిగి పోయెను గాని రాజట్లు మాటిమాటికిఁ జెప్పి తన్నుబంపివేయుట కేదియో గొప్పకారణముండవలెనని యూహించి యింటికిబోయి గదిలో గూర్చుండి మిక్కిలి శ్రద్ధతో భాగవతము నంతయు మొదటినుండిచివరవరకు జదివెను. ఈసారి యతనికి భాగవతముయొక్క పరమార్థమంతయు దెలిసెను. ఆ యర్థము దెలిసినకొలది యతనికి రాజులమీద రాజసభలమీద ధనముమీద కీర్తిమీద వాంఛలు నశించెను. మంచివైరాగ్యము పుట్టెను. భగవంతునిమీదనే కాని రాజుమీద తనకు దృష్టి లేకపోయెను. కొన్నిసంవత్సరములు గడచినవెనుక రాజునకు బ్రాహ్మణునిమాట జ్ఞప్తికి రాగా, నతఁడా పేదబ్రాహ్మణుని యింటికిబోయి చూచి యతఁడు దివ్యజ్ఞాన తేజములతో వెలయుచున్నవాఁడని తెలిసికొని పాదములపైఁబడి నమస్కరించి యిట్లనియె. "స్వామీ! మీరు భాగవతముయొక్క పరమార్థమంతయు గ్రహించినారు. మీరనుగ్రహింతురేని నేను మీశిష్యుఁడనయ్యెద."

(210) గాలి లేనప్పుడు వేఁడితగ్గించుటకై విసనకఱ్ఱతో మనము విసరుకొందుము కాని గాలివిసరునప్పుడు విసనకఱ్ఱ విడిచిపెట్టుదుము. పైనుండి మనకుసాహాయ్యము లేనంతకాలము గమ్యస్థానముఁ జేరుటకు

మనంతట మనమే ప్రయత్నము జేయవలెను. అట్టిసహాయ మెవ్వ రికైన గలిగినప్పుడు వాఁడు స్వయముగా పాటుపడుట మాన వచ్చును.

(201) ప్రశ్న:—దేవుఁడెక్కడనున్నాఁడు? అతని మనమెట్లు జే రఁగలము?

ఉత్తరము:—సముద్రములో ముత్యము లున్నవి. ఆముత్య ములు దొరకువఱకు నీవుమాటిమాటికి సముద్రమున మునుగుచుండ వలెను. అట్లే ప్రపంచమునందు దేవుఁడున్నాఁడు. కాని యాతనిని జూ చుటకు నీవు గట్టిప్రయత్నముఁ జేయవలయును.

(202) ప్రశ్న—ఆత్మ శరీరములో నేవిధముగా నుండును?

ఉత్తరము:—చిమ్మనక్రోవిలో దాని నంటి యంటక కొట్టునట్టి కట్టియుండునట్లు.

(203) మహాసముద్రములో నొకయోడకొయ్య యొక్క చిట్ట చివర నొకపక్షి నివాస మేర్పరచుకొని కొంతకాల మచ్చట నుండి విసిగి క్రొత్తచోటికిఁ బోవదలచి మునుపటితావు విడచి యెగిరిపోయి నానాదిక్కుల కరిగెను. మహాసముద్ర మాటచే వృక్ష మెక్కడ ను దాని కగపడలేదు. అందుచే నెట్టకేల కది మరల నక్కడికే చేరె ను. ఆలాగే గురువుగారుపదేశించిన నియమములు నిష్ఠలు జరుపలేక విసిగి యతని కంటె మంచిగురువుకడకుఁ బోవలెనని వానిని విడిచి దేశాంతరములు తిరిగి తిరిగి యటువంటి గురువునుగానక చేసిన ప్ర యత్నమంతయు నిష్ఫలముకాగా మొదటిగురువునందు మునుపటి కంటె నెక్కువ గౌరవము గలిగి సామాన్యుఁడైన శిష్యుఁడు చివరకా పూర్వగురువునే యాశ్రయించును.

(204) ఒక మేఁకపిల్ల జ్యేష్ఠమాసమున నొకనాఁడు తల్లిముందర గంతులువేయుచు నిట్లనియె. "అమ్మా! ఈసారి రాసలీలోత్సవకాలము

న నీకు రాసపుష్పములతో విందు జేసెదను." అని సంతోషముతో బలికెను. అనవుడు మేకయిట్లనియె. "అమ్మా! ఆపనినీవనుకొన్నంతసు లభముకాదు. రాసపుష్పము మేత మనకులభించు లోపుగామనమె న్నో యాపదలను గడుపవలెను. ఈలోపుగా నెవ్వరైన యజ్ఞపశువుగా తీసికొని పోవచ్చును. దేవినవరాత్రములలో దుర్గకు బలిపెట్టవచ్చును. భేతాళునకు బలియియ్యవచ్చును. ఇన్నికష్టములు గడచిన తర్వాత గదా మనము రాసపుష్పము మేయుట. మనుజుడుభవిష్యత్కాలము న రాగల సుఖముల తలంచి యుబలాటముపడకూడదు. నడుమనెన్నో యాపదలు రావచ్చును."

(215) ఈగయొకసారి పుండుమీద వ్రాలి మరియొకసారి మ ధురపదార్థములమీద వ్రాలునట్లు లౌకికునిమనస్సు ఒకసారితుచ్ఛమైన ద్రవ్యసంపాదన మందును మరొకసారి భగవద్విషయమునందును నిల్చును.

(216) ఆకాశమునుండి పడిన వానసీరు మన గృహములమీా దబడి గొట్టములగుండా భయంకరమైన పెద్దపులి ముఖమునుండి సిం హాముఖములనుండి నేలబడుచున్నది. కానియది సింహవ్యాఘ్రముఖ ములనుండి వచ్చిననీరు కాదు. ఆకాశమునుండి పడిన వర్షజలమే. ఆలాగే జ్ఞానవాక్యములు కొందరు మహాత్ముల నోటనుండి వచ్చినను నిజముగా దేవునివల్లనుండి వచ్చినవే. కొన్నిచోట్ల వానసీరు వచ్చు గొట్టముచివర చిత్రవిచిత్రములైన జంతువుల ముఖములు చెక్కబడి యుండును. జలము వాటినుండివచ్చును. అందముకొరకు చమత్కార ముకొరకు నట్లు చేయుదురు.

(217) చిల్లిగోనెసంచిలోనుండి కారిపోయి త్రోవనిండ బడిన యావాలు ప్రోగుచేయుటయెంతకష్టమో బహుచింతలమీాదనుబహు వ్యాపారములమీాదను దగుల్కొన్నమనస్సు పరమేశ్వర ధ్యానము మీాద నిల్చుటంతకష్టము.

(298) నిద్రబోవక మేలుకొన్నవారియింట దొంగలు ప్రవేశింపఁజాలరు. అట్లే నీవు జాగ్రత్తగా నున్నపక్షమున దురాచారములు నీలోఁ బ్రవేశింపవు.

(299) దూడపుట్టగానే మిక్కిలి సంతోషముగలిగి యేవిచారములేక గంతులువైచి యాడుకొనును. కాని దానిమెడకు పలుపుత్రగిలించినతోడనే యది వెనుకటిసంతోషమును గోలుపోయి నవకము చెడి మిక్కిలి విచారించుచుండును. అలాగే మనుష్యుఁడు పిల్లవాఁడుగా నున్నంతసేపు విచారమెరుగక విచ్చలవిడిగా నాడుకొనుచును సంతోషస్వరూపుఁడై యుండును. కాని వివాహముఁ జేసుకొని సంసారము నగిలించుకొన్నవెంటనే వెనుకటి విలాసము స్వాతంత్ర్యము గోల్పడి దీనుఁడగును. మంచుబిందువువలె మిక్కిలి పరిశుద్ధుఁడై క్రొత్తపూవువలె విలాసమును గలిగి వాయువువలె చకచక గలిగి మనుష్యులెల్లప్పుడు బాల్యావస్థలోనే యుండిన నెంతబాగుండును!

(300) పడవ నీటిలోనుండవచ్చును. కాని నీరు పడవలోనుండ కూడదు. అట్లే యీశ్వరాన్వేషకులు ప్రపంచమున నుండవచ్చును. కాని ప్రపంచము వానిలో నుండకూడదు.

(301) తన గురువు సామాన్యమనుష్యుఁడే యని తలంచునట్టివాఁడు ఆ గురువువల్ల నేవిధమైన లాభమును పొందఁజాలఁడు.

(302) నీవేమి తలంచుచున్నావో యదే పైకిచెప్పవలయును. నీ తలంపులకును మాటలకును మైత్రి యుండవలయును. అట్లుగాక మాటలతో దేవుఁడే సర్వశక్తుఁడని చెప్పుచు మనస్సులో ప్రపంచపు గొడవపెట్టుకొని యుందువేని నీ కెంతమాత్రమును లాభములేదు.

(303) మేఁకలు మొదలైన జంతువులు చిన్నపిల్లలు పాడుచేయకుండ మొక్కచుట్టు ముండ్లకంచె వేయవలయును. కాని మొక్క గొప్పచెట్టైనతర్వాత మేఁకలమందగాని యావులమందగాని దాని

నీడను నిలిచి దానియాకులు పళ్లు ననుభవింపవచ్చును. అట్లే నీలో భక్తికొంచెమున్న కాలమున నది దుస్సహవాసమువల్లను జెడిపోకుండ జాగ్రత్త పెట్టుకొనవలయును. నీభక్తి క్రమక్రమముగా విశాలమై దృఢముగా నాటుకొన్న వెనుక నీ బోధవల్ల బాగుపడి యనేకులు దురాత్ములు సజ్జనులు గావచ్చును.

(304) ఏనుఁగును నీటితోఁ గడిగి విడిచిపెట్టితివేని మంటిలో దొర్లి యది మలినమగును. అట్లుగాక దానిని శుభ్రమైన గదిలోఁ గట్టితివేని శుచిగా నుండును. అట్లె మహాత్ముల సహవాసము వలన నీవు పరిశుద్ధుఁడవైనను ఆవల దురాత్ములతోఁగూడి చరియించితివేని నీ మనశ్శుద్ధి తప్పక చెడిపోవును. అట్లుగాక నీమనస్సును దైవముమీఁదనే నిల్పి మెలఁగుదువేని నీకు మాలిన్యములేదు.

(305) ప్రశ్న—భక్తుని కేది బలము?

ఉత్తరము—కన్నీళ్లేబలము. ఏడ్చుచున్న బిడ్డను తల్లి యోదార్చి దాని కోర్కె తీర్చుచున్నట్లె దుఃఖించుచున్న భక్తుని దయతో నోదార్చి భగవంతుఁ డాదరించును.

(306) ఎవ్వరికిఁ దెలియకుండ మూలకూర్చుండి గాని, నిర్జనమైన యడవిలోగాని, మనస్సులోగాని భగవంతుని ధ్యానము జేయవలయును.

(307) రెండుచేతులతో తాళమువేయుచు నీవు హరినామస్మరణము చేయుము. అప్పుడు నీకు నీ మనస్సు ధ్యానయోగమునందు నిలుచును. నీవు చెట్టుక్రింద గూర్చుండి చప్పట్లు చఱచితివేని కొమ్మలమీఁదనున్న పక్షులన్నియు నెగిరిపోవును. అట్లే తాళము వేయుచు భగవన్నామస్మరణముఁ జేసినపక్షమున మనస్సు నాశ్రియించిన దురాలోచనలన్నియు దూరముగా నెగిరిపోవును.

(308) ఒక్క శాకమే తెచ్చి కూరగాను పులుసుగాను పచ్చడి గాను జేయవచ్చును. ఒక్కొక్కని కొక్కొక్కటి రుచించును. అట్లే భగవంతుఁ డొక్కఁడయ్యు భక్తుల యభీష్టప్రకారము బహువిధ ముగా దోచుచుండును. అతఁడు కొందరికి ప్రభువువలె నుండును. కొందరికి దండ్రివలె నుండును. ఒకనికిఁ బ్రేమరసము వర్షించునట్టి తల్లివలె నుండును. కొందరికి మనఃప్రియుండగు భర్తవలె నుండును. కొందరికి విధేయుఁడైన పుత్త్రుఁడువలె నుండును.

(309) అనేకు లెవరికి నమస్కరింతురో వానికి నీవుకూడ నమస్కరింపుము. అంతమంది భక్తిశ్రద్ధలు చూపునట్టిచోట భగ వంతుఁ డుండును. ఏలయన నతఁడు దయాస్వరూపుఁడు.

(310) ఆలుబిడ్డలు బంధుమిత్త్రులు లేకపోయినను గొందరు ప్రపంచమునందు లేనిపోని సంబంధములు గల్పించుకొని యీ లోక మునకు బద్ధులై యుందురు. వారు స్వేచ్ఛగా నుండుట వారికిష్టము లేదు. కుటుంబముగాని బంధువర్గముగాని లేనివాఁడు పిల్లినో, కుక్కనో, కోఁతినో, పక్షినో పెంచి యదియే స్వర్గము మోక్షమునని దాని పోషణమునందే కాలముపుచ్చుచు మహానందము నొందుచుండును. ఇదియంతయు మాయయొక్క శక్తి. అది మనుష్యులమీఁద నెంతో యధికారముఁ గలిగి యున్నది.

(311) తీవ్రజ్వరపీడితుఁడైన రోగి విశేషదాహముఁ గలిగి సముద్రములోని నీరంతయుఁ దానే త్రాగగలనని తలంచును. వాని జ్వరము తగ్గిన తర్వాత గుప్పెక్కఁడు నీళ్లుకంటె నెక్కుడు త్రాగఁ జాలఁడు. అట్లే మాయయను జ్వరముచేత నొడలు తెలియకున్న వాఁడు భగవంతుని మూర్తినంతయు తాను దర్శించి కౌగిలించుకొన గల్గినట్లు తలంచును. కాని యామాయ తొలగినప్పుడు భగవంతుని మహాతేజ ములో నొక్క చిన్నకిరణమే వానిని శాశ్వత దివ్యానందములో ముంచివేయుటకుఁ జాలునని తెలిసికొనును.

(312) దారుణమైన జ్వరముతో బాధపడుచు విదాహముగల రోగి మంచమునకు నొకప్రక్క చల్లని మంచినీళ్ళకుండలు రెండవ ప్రక్కను పరబత్తులు మొదలగు పదార్థములు నున్నవనుకొనుము. ఆ రోగి తనరోగ మెక్కువైనను సరేకాని యా చల్లని నీరు త్రాగక మానునా? పరబత్తులు రుచిచూడకమానునా? ఇంద్రియముల యధికారము క్రింద నున్న మనుష్యుఁడు నట్టివాఁడే. కాంతాకనకముల నడుమ మనుష్యుఁడున్నప్పుడు వాటిచేత నాకర్షింపఁబడక మనుష్యుఁడుండఁగలఁడా? అతఁడు న్యాయమార్గమునందుండుట మిక్కిలి కష్టము. అందుచేత నతనిస్థితి చెడిపోక మానదు.

(313) అదివఱకు పెరుగు తోడుపెట్టిన కుండలో వేఁడిపాలు పోయకూడదు. పోసినయెడల నదికూడ పేరుకొని పెరుగగును. మంచి యనుభవముగల గురువు విలువగల గొప్పధర్మముల లౌకికున కొప్పగింపఁడు. ఏలయన వాఁడా ధర్మములకు నపార్థముచెప్పి సద్వినియోగముఁ జేయక వాటిని స్వలాభముకొఱకుపయోగించుకొనును. అదియునుగాక గురువు వానిచేత నుపయోగకరమైన పని యేమియుఁ జేయింపఁడు. ఎందుచేతనన గురువు తన్ను లోకువజేసి యెక్కువ పనులు జేయించుచున్నట్లు వాఁడనుకొనునేమోయని భయముచేత.

(314) మంచిపాలలో రెట్టింపునీళ్లు కలిసినప్పుడు, ఆపాలుకాచి చిక్కన జేయుటకు చాలసేపు పట్టును. లౌకికుని మనస్సు ప్రపంచ సంబంధములైన దురాలోచనలనియెడు నీటితో గలసి యుండును. ఆ మనస్సును పరిశుద్ధముజేసి యది తగినస్థితిలోనుండునట్లు జేయుటకు చాలకాలము పట్టును.

(315) తక్కువవారి గర్వము క్రమక్రమముగా నశింపవచ్చును. గాని తన ప్రభావమును గురించి యోగికి గర్వమున్న యెడల నది త్వరగా నశింపదు.

(316) మంగలములో ధాన్యముబోసి పేలాలు చేయునప్పుడు పైకెగిరిపోయి పేలిపోయినవే శ్రేష్ఠమైనవి. కాలినగుర్తులు వానికుండవు. మంగలములో మిగిలిపోయినవాటికిఁ గొంచెముగానో గొప్పగానో కాలినయానవా లుండును. ఆలాగే భక్తులలో సంసారబంధములను దెంపుకొని యావలికిఁ బోవునట్టివారు పరిపూర్ణులు. సంసారము జేయుచున్న భక్తులు నిజముగా నెంత భక్తులైనను వారికిలోక సంబంధమైన మచ్చలు కొన్ని యుండక మానవు.

(317) భగవంతుఁడు మనలను పోషించుచున్నాఁడు గనుక దయామయుఁడని చెప్పుటకు వీలులేదు. అంతమాత్రము చేతనే యతఁడు దయామయుఁడుగాఁడు. ఏలయనఁ దనబిడ్డలకుఁ దండ్రి యన్నవస్త్రములిచ్చి పోషింపక దప్పదుగదా! కాని మనము తప్పుదారుల బట్టి యింద్రియములకు పశువులమై చెడిపోకుండ నతఁడు మనలను గాపాడినప్పుడే యతఁడు దయామయుఁడని మనము చెప్పవచ్చును.

(318) దొంగను మనము గనుగొన్నప్పుడు వాఁడు పారిపోవును. అట్లే విశ్వమును మోహింపఁజేయునట్టి మాయను మనము గనుగొందుమేని వెంటనే యది యంతర్ధానమగును.

(31) అగ్నిహోత్రమునకుఁ బ్రత్యేకముగా నొకరూపము లేదు. కాని యది కట్టెలను బొగ్గులను నాశ్రయించుకొన్న రూపములను దాల్చి యుండును. అప్పుడురూపహీనమైన యగ్నిరూపములతోఁ గూడి యుండును. ఆలాగే నిరాకారుఁడైన పరమేశ్వరుఁడు కొన్నియెడల కొన్నిరూపములఁ దాల్చును.

(320) ప్రశ్న:—మనము భగవంతుని గట్టిగాఁ బ్రార్థింపవలయునా?

ఉత్తరము—ఆయనను నీయిష్టము వచ్చినట్లు ప్రార్థింపుము. నీవెట్లు చేసిన నాయన నీప్రార్థనముఁ దప్పక వినును. వాఁగియొక్క చప్పుడు సహితము మాయన వినఁగలఁడు.

(321) శాస్త్రజ్ఞానముల వలన భగవంతుఁ డిట్టివాఁడని యెవరి కైన నుపదేశము జేయుట కాశీనగర మిట్టిదని పటముగీచి చెప్పుట వంటిది.

(322) ఒకమనుష్యుఁడు బావి త్రవ్వింపనారంభించి యైదు నిలువులు త్రవ్వించెను. జలపడక పోవుటచే నచ్చట నీరు పడదని యాచోటఁ ద్రవ్వించుట మాని మరియొకచోట నుయ్యి త్రవ్వించ మొదలుపెట్టెను. అక్కడ మునుపటికంటె రెండునిలువు లెక్కువ త్రవ్వించెనుగాని యచ్చట నహితము నీరు పడలేదు. అతఁడు విసిగి యాచోటుమాని మూడవచోట నుయ్యి త్రవ్వింప సాగెను. అక్కడ తొమ్మిదినిలువులు త్రవ్వించెను. కాని జలదర్శనము కాకపోవుటచేఁ దన దొడ్డిలో నీరు వీలులేదని ప్రయత్నము మానుకొనెను. మొత్తము మీఁద నతఁ డిరువదియొక్క నిలువులు త్రవ్వించెను. మూఁడుచోట్ల గోతులు పట్టి ఖర్చులు త్రవ్వించుటకంటె నొకటిబావి త్రవ్వినచోట మరినాలుగైదు నిలువులు త్రవ్వించిన పక్షమున నీరు బడియుండును. ఇంత ధనవ్యయము గాకపోయియుండును. మాటిమాటికిఁ దమ మతములు మార్చుకొనునట్టి మనుష్యులస్థితి యట్టిదియే. తనమతమునందు శక్తియున్నదా లేదా యని సందేహింపక తానునమ్మినదైవమునుగట్టి పూనికతోఁ గొల్చినపక్షమున జయము నిశ్చయముగాఁ గలుగును.

(323) లోపలగింజయే ప్రధానముగాని పైనున్నపొట్టు ప్రధానముగాదు. వడ్లగింజ నేలమీఁద చల్లినపు డదిమొలచుటకు పెరుగుటకు వరిపంట కావలెనన్నపక్షమున పొట్టుతోఁ గూడియున్నగింజలే చల్లవలయునుగాని వట్టిబియ్యము చల్లిన నవి మొలవవు. అలాగేమతముయొక్క యభివృద్ధికి కర్మలు తప్పక యుండితీరవలయును. ఆకర్మలు జ్ఞానబీజమును గప్పునట్టిపొట్టువంటివి. కావున సత్యమైనజ్ఞానమును సంపాదింపకమునుపు ప్రతిమనుష్యుఁడు కర్మలు యథావిధిగాఁ జేయవలయును.

(324) ముత్తెమే ప్రధానముగాని ముత్యపుచిప్ప ప్రధానము గాదు. ముత్యముదొరికినవానికి చిప్పతోఁబనిలేదు. సత్యస్వరూపుఁడైనపరమేశ్వరుని తెలిసికొన్నవానికి కర్మలయవసరములేదు.

(325) ఒకపేదవాఁడు దాపుననున్న యడవికిఁబోయి పుల్లలు కొట్టుకొని యవి తెచ్చి యమ్ముకొని మిక్కిలికష్టజీవనము జేయుచుండెను. ఆయడవిదారినిఁబోవుచున్న సన్యాసి యొకఁడు వానిఁజూచియడవి చివర పుల్లలు కొట్టి యవస్థపడుటకంటె వనమధ్యమునకుఁ బోయిన పక్షమున నెక్కువలాభముండునని వానితోఁజెప్పెను. ఆపుల్లలుకొట్టు వాఁడు సన్యాసి మాటలయందు విశ్వాస ముంచి మునుపటికంటె దూరముగా నడవిలోనికిఁ బోయెను. అచ్చట వానికి మంచిగంధపు చెట్టు కనఁబడగా నదికొట్టి మోయఁగలిగినన్ని మంచిగంధపుమొంగలు మోసికొనిపోయి యమ్ముకొని విశేషలాభము సంపాదించెను.తర్వాత నతఁడా యరణ్యమున మరికొంతదూర మరిగెను. అక్కడతనికి రాగిగని యగపడెను. త్రవ్వఁగలిగినంత రాగి త్రవ్వుకొని మోయఁగలిగినంత మోసికొని తెచ్చి విక్రయించి యధికలాభము పొందెను. పిమ్మట వాఁడు వనములో మునుపటికంటె నెక్కువదూరమరిగి వెండిగనికనిపెట్టి కావలసినంత వెండిత్రవ్వుకొని తెచ్చియమ్ముకొని భాగ్యవంతుఁడయ్యెను. దానితో నతఁడు తనవివనందక యరణ్యగర్భమున కరిగి బంగారుగనులు వజ్రపుగనులు గనిపెట్టి త్రవ్వుకొని తెచ్చి వాటిని విక్రయించి లక్షాధిపతి యయ్యెను. సత్యజ్ఞానము గ్రహింపఁదలఁచుకొను వానిస్థితి యిట్టిదే. నరుఁడు కొంతజ్ఞానము సంపాదించి కొన్నిప్రజ్ఞలు సముపార్జించినవెనుక నాకిదిచాలునని కూర్చుండక జ్ఞానాభివృద్ధికై ప్రయత్నించిన పక్షమున బ్రహ్మజ్ఞానసంపదయందు భాగ్యవంతుఁడు గావచ్చును.

(326) నూనె ముట్టముందట చేతికిరాసుకొని పనసకాయకో

సినయెడల దానిజిగురు చేతికంటుకొనదు. ఆలాగే బ్రహ్మజ్ఞానము మొట్టమొదట సంపాదించుకొనినపిమ్మట కాంతాకనకములనడుమనీవు నివసించినను నీకు దోషముండదు.

(327) ఈఁతనీఁదనేర్చుకొనఁ దలఁచినవాఁడు కొన్నాళ్ళు నీళ్ళలో నిట్టట్టుకొట్టుకొని ప్రయత్నముఁ జేయవలెను. ఒక్కనాఁడీఁత నేర్చుకొని యెవ్వఁడుగాని సముద్రములో నీఁదజాలఁడు. ఆలాగే నీవుపరబ్రహ్మమను మహాసముద్రములో నీఁదదలంచిన పక్షమున నీవుముందుగా ననేకప్రయత్నములు జేయవలయును.

(328) ప్రశ్న:—మనుష్యుఁ డెప్పుడు ముక్తుఁడగును?

ఉత్తరము:—అహంకార మెప్పుడు చచ్చునో యప్పుడు.

(329) ముల్లు గ్రుచ్చుకొన్నప్పుడు మరియొక ముల్లుతో దానిఁ బైకిఁదీసి రెండుముళ్ళుపారవేయుదుము. ఆత్మయొక్క యున్నగప్పునట్టి యజ్ఞానమును జ్ఞానమే నశింపఁజేయవలయును. జ్ఞానాజ్ఞానములు రెండుగూడ నవిద్యలోఁ జేరినవేగనుక మహోత్కృష్టమైన యీశ్వర జ్ఞానము సంపాదించువాఁడు ద్వైతభావమునుండి విముక్తుఁడౌనుగావున జ్ఞానాజ్ఞానములు రెండింటిని వర్జించును.

(330) లోతులేనిగుంటలో పరిభ్రమైన నీరు త్రాగఁదలంచినవాఁడు పైననీరు కలచకుండ పైతేటనీరు తీసికొని త్రాగవలయును. కలసిన పక్షమున నదివర కడుగుననున్న మడ్డినీరు పైకివచ్చి త్రాగుటకు వీలులేకుండఁ జేయును. నీవు పరిశుద్ధుఁడుగానుండదలఁతువేని దృఢభక్తిగలిగి లేనిపోని వితండవాదములలో దిగక సదనుష్ఠానము జేయుచుండుము. అట్టివాదములలో దిగినపక్షమున నీమనస్సు మలినమగును.

(331) ప్రశ్న—ఈశరీరము క్షణభంగురమై పనికిమాలినదైనయెడల పరమపావనులైన మహాత్ములు దానిని మిక్కిలి శ్రద్ధతో నేల గాపాడుచున్నారు?

ఉత్తరము—నట్టిపెట్టెను గురించి యెవఁడును శ్రద్ధ చేయఁడు. విలువగల నగలు, ధనముగల పెట్టెను ప్రతివాఁడు మిక్కిలి జాగరూకతతోను గాపాడును. మహాత్ముల శరీరములలో భగవంతుఁడువసియించును గావున వారు శరీరములను శ్రద్ధతోఁ గాపాడుదురు. మనశరీరము లన్నియు భగవంతుని కొటపట్టిలుగదా!

(332) ఆవిరియంత్రము బరువుబండ్ల నెన్నింటినో యీడ్చుకొని పోవును. భగవంతునియందు దృఢభక్తిగలిగి యతనికి బిడ్డలవలెనున్న మహాత్ములు తాము బహుకష్టపరంపర లనుభవించి తోడి మానవులను తమతోఁ దీసికొని పోవుదురు.

(333) ప్రతి మనుష్యుఁడు తనమతమునే యనుసరింపవలయును. మహామ్మదీయుఁడు మహామ్మదీయ మతమును క్రైస్తవుఁడు క్రైస్తవ మతము ననుసరించుట మంచిది. హిందువులకు మహాఋషులమత మేర్పడి యున్నది కనుక వారు దానినే యవలంబించుట కర్తవ్యము.

(334) లేతవెదురు సులభముగా వంచవచ్చును. ముదురు వెదురు వంచదలఁచితిమేని వెంటనే యది పెళుక్కుమని విఱుగును. లేత హృదయములను మంచి పనులవైపు ద్రిప్పుట సులభము. కాని ముసలిగుండె వంచఁదలఁచుకొన్నప్పుడు పట్టుఁదప్పి పోవును.

(335) సత్యజ్ఞానమనెడు తేజముతో నెవ్వఁడు వెలుఁగుచుండునో వాఁడే నిజమైన మనుష్యుఁడు. తక్కినవారు పేరునకు మాత్రమే మనుష్యులు. నిజముగా మనుష్యులుగారు.

(336) సూచికాయంత్రమునందలి సూది యుత్తరపుదిక్కునే యెల్లప్పుడు సూచించుచుండును. అందుచేతనే సముద్రముమీఁద నడుచునట్టి యోడ యెన్నఁడును దారితప్పిపోదు. ఆలాగే మనుష్యుని హృదయము భగవంతునిదిక్కునకుఁ దిరిగి యున్నంతకాలము

ప్రాపంచిక వ్యవహారములనియెడు మహాసముద్రమున మనుష్యుఁడు మునిఁగిపోఁడు.

(337) పల్లెటూరి యాఁడువాండ్రు కుండమీఁద కుండబెట్టి మూఁడునాలుగు నీటికుండలు తలపై నిడుకొని యొక్కనీటిచుక్కైన తొణకకుండ తమకష్టసుఖములఁ జెప్పుకొనుచును చెఱువుయొద్దనుండి తమ యిండ్లకుఁ బోవునట్లు ధర్మమార్గమున సంచరించునట్టి బాటసారిగూడ నడువవలెను. ఎట్టి స్థితిలోనున్నను మనుష్యుఁడు తన హృదయము మాత్రము ధర్మమార్గమునుండి తొలఁగకుండునట్లు చూచికొనవలెను.

(338) కృష్ణలీలనాటకము లాడునపుడు మద్దెల తాళములు వాయించుచు "కృష్ణారమ్మని కృష్ణారమ్మని" అని గట్టిగా పాడుదురు. కాని కృష్ణవేషధారుఁడు పాటవిని తన్నే పిలుచుచున్నారని రంగస్థలమునకు వెళ్ళక ప్రక్కనొక గదిలో నెవరితోనో మాట్లాడుచు చుట్టఁ గాల్చుచుఁ గూర్చుండును. అంతట నారదుఁడు ప్రవేశించి మధుర గానముఁ జేసి "కృష్ణా ర"మ్మని పిల్చినతోడనే తానింక గనపడకుండుటకు వీలులేదని కృష్ణుఁడు నారదునకు దర్శనమిచ్చి తీరును. భక్తుఁడు వట్టిమాటలతో భగవంతుని పిల్చినంత మాత్రమున నతఁడు రాఁడు. భగవంతుఁడు నిజముగా వచ్చినప్పుడు భక్తుని మనస్సు దివ్యానందముతోఁ గరగును. అంతట భక్తుఁడు రా! రా! యని బిగ్గరగాఁ బిలుచుట మానును. పరమభక్తి పూరితమైన మనస్సుతో భక్తుఁడు పిలిచినప్పుడు భగవంతుఁడాలస్యము జేయక వచ్చును.

(339) ఇదినాదియని యహంభావములేక సర్వము దైవాధీనమేయని విశ్వసించి వైరాగ్యముఁ బూనుటకంటె మనుష్యునకు క్షేమకరమైనమార్గము మఱియొకటి లేదు.

(340) ప్రశ్న:—సంపూర్ణ విశ్వాసమనఁగా నెట్టిది?

ఉత్తరము:—దినమంతయు మిక్కిలి కష్టపడి యాయాసము

దీర్చుకొనుటకై బాలీసునఁ జేరఁబడి చుట్టఁగాల్చుకొనుచు మనుష్యుఁడు సుఖించునట్టి యవస్థయే పరమవిశ్వాసము. అనఁగా నమస్తవిచారములు మనోవ్యథలు నాశనమొందుట.

(341) ఎండిన యాకులు వాటిప్రయత్నము గాని యిష్టము గాని లేకయే గాలిచేత నెగరఁగొట్టఁబడిపోవునుగదా! అట్లే భగవంతుని నమ్ముకొనియుండువారు, ఆయన యిచ్ఛతోఁ గలసి మెలఁగుదురు. వారి యిచ్ఛ యెంతమాత్రముండదు. వారి ప్రయత్న మంతకంటె నుండదు.

(342) ప్రశ్న:—బ్రహ్మజ్ఞానవికాసము లేక గొప్ప వక్తృత్వము మంచిబోధనాశక్తియుఁగల మతబోధకుని గుఱించి మీయభిప్రాయమేమి?

ఉత్తరము:—ఒకఁడు తన దగ్గఱ దాచినసొమ్మును యథేచ్ఛముగా వ్యయముఁ జేయువాఁడెట్టి వాఁడో యతఁడట్టివాఁడు. అతఁడాడునట్టి మాటలు పరులనుండి సంగ్రహించినవి కాని వాని సొంతము గావు కావునను, ఆమాటవలన వానికెంతమాత్రమును నష్టములేదు గావునను నతఁడు పరులకు హితోపదేశము మాత్రముఁ జేయఁగలఁడు.

(343) లౌకికునకు మత సంబంధమైన వాసనయైనిగిట్టదు. అతడు హరినామస్మరణఁ జేయఁడు. హరిభజనము, కీర్తనమువినఁడు. ఇతరులు హరిభజనముఁజేయుచున్నప్పుడాపనిఁ జేయవద్దని వారికి నిరుత్సాహముఁ గలిగించును. ప్రార్థనలను తా నెగతాళి జేయును. మత సంబంధమైన సమాజములు పేరెత్తినప్పుడు నోటికివచ్చినట్లు తిట్టును.

(344) ఒక స్తంభము నొకచేతితోఁ బట్టికొని తలతిరుగునను భయములేకుండ పిల్లవాఁడు దాని చుట్టు గిఱ్ఱున దిరుగునట్లు నీవు భగవంతుని గట్టిగాఁబట్టుకొని నీనిత్య కృత్యములను జేసికొమ్ము. అప్పుడు నీకేమపాయముండదు.

(345) జారకాంత తన గృహకృత్యములను జక్క బెట్టుకొనుచుఁ దన రహస్యప్రియునిమీఁద మనస్సు నిల్పియుండును. అలాగే లోక వ్యవహారములను జేయుచు మునిఁగి పోయిన యో మనుష్యుఁడా! నీ వ్యవహారములను జేసికొనుము. కాని నీహృదయము మాత్రము భగవంతునిమీఁదనే నిల్పుము.

(346) సంపన్నుల కుటుంబములోఁ బుట్టిన బిడ్డలను దాది తన బిడ్డలవలెఁ బెంచును. కాని యాబిడ్డలమీఁదఁ దనకేవిధమైన యధికారములేదని యామె యెఱుఁగును. అలాగే నీ బిడ్డలకు కూడ నీవు దాదివంటివాఁడవు. ఆబిడ్డలతండ్రి భగవంతుఁడే.

(347) వివేకము వైరాగ్యము లేక వేదములు శాస్త్రములు వర్ణించుట నిష్ప్రయోజనము. ఆ రెండు లేనివానికి బ్రహ్మజ్ఞానము కుదరదు.

(348) ముందుగా నిన్ను నీవు తెలుసుకొనుము. అప్పుడు నీవు విశ్వపతియైన భగవంతుని దెలిసికొనఁగలవు.

(349) ప్రశ్న:—నాయహంభావమనఁగా నేది? అదినా హస్తమా పాదమా మాంసమా రక్తమా?

ఉత్తరము—చక్కఁగా విచారించితివా "నేను" అనునట్టి వస్తు వెక్కడను లేదని తెలిసికొనఁగలవు. ఉల్లిపాయయొక్క పొరయొకటొకటిఁదీసినట్లు అహంభావమును విభజనచేసి పరిశీలించితిమేని "అహం" అనునది యెచ్చటను లేదని తెలియును. ఆవిభజనలయొక్క పరమార్థము దైవమును దెలిసికొనుటయే. అహంభావము జారిపోయినపుడు పరబ్రహ్మము వ్యక్తమగును.

(350) ఈ కలియుగమునకుఁ దగిన యుత్తమభక్తిమార్గ మేమనఁగా భక్తప్రియుఁడైన భగవంతుని నామము స్మరించుటయే.

(351) నీవు భగవంతునిఁ జూడఁదలఁతువేని భగవన్నామస్మర

ణముయొక్క శక్తియందు దృఢవిశ్వాసముఁ గలిగియుండినఁ నిత్యానిత్య వస్తుభేదముఁ దెలిసికొనును.

(352) మదపుటేనుఁగును విచ్చలవిడిగాఁ దిరుగనిచ్చితిమేని యది మొక్కలు చెట్లు పెల్లగించును. కాని మావటివాఁ డంకుశముతో దానిఁ బొడిచి యదలించినపక్షమున నూరకుండును. అట్లే మనస్సు నియమములేక యున్నప్పుడు సోమరితలఁపులఁదలఁచుకొనుచు నిష్ప్రయోజనముగాఁ గాలక్షేపముఁ జేయును. యుక్తాయుక్తవిచారణ యను నట్టి యంకుశముపోటు తగులఁగానే యామనస్సు ప్రశాంతమగును.

(353) హరినామము వినఁగానే పరవశత్వముచేత నానంద బాష్పములు రావలెను. అవి వచ్చువఱకు మనుష్యులు భక్తియోగా భ్యాసముఁ జేయవలయును. హరిపేరుఁ జెప్పఁగానే యెవ్వఁడానందబా ష్పములు విడుచునో వానికి భక్తియోగాభ్యాస మక్కఱలేదు.

(354) జ్ఞానులయొక్కయు సాధువులయొక్కయు మైత్రి యా త్మాభివృద్ధికిఁ గావలసిన ముఖ్యసాధనములలో నొకటి.

(355) ఆత్మ యొక దేహమును విడిచి యీలోకమునుండి వెళ్ళి పోవునపుడు, ఆచరమావస్థలో నదే దేహమును గోరించి తలంచుకొను చుండునో యా దేహములో మరలఁ బ్రవేశించి జన్మమెత్తును. అందు చేత భక్తియోగాభ్యాసములు మిక్కిలియవసరము. ఎల్లప్పుడు భక్తి తత్పరులమై యున్నపక్షమున మనస్సులో ప్రపంచసంబంధమైన తల పులు పుట్టవు. అప్పుడు భగవద్విషయ మొక్కటే యాత్మనిండి యుండి మరణకాలమందు సహితము వానినివిడువదు. అప్పు డాత్మ భగవంతునిగూర్చి తలంచును గావున భగవంతునిలోఁ బ్రవేశించును.

(356) ప్రశ్న:- మనుష్యుఁడు భగవంతు నెట్లు ప్రేమింపవలయును?

ఉత్తరము:— పతివ్రతయైన భార్య భర్తను ప్రేమించునట్లు పరమలోభి తానుపోగుచేసిన ధనముఁ బ్రేమించునట్లు భక్తుఁడు మనః

పూర్వకముగాను హృదయపూర్వకముగాను భగవంతుని ప్రేమింప వలయును.

(357) ప్రశ్న:—మనలోనున్న పాపచింతను జయించుటెట్లు?

ఉత్తరము:—పుష్పములోనుండి పండు క్రమక్రమముగా నెదుగుచున్నప్పుడు పూరేకు లొక్కటొక్కటిగా రాలిపోవుచుండును. కావున దైవత్వము మనలో నతిశయించినకొలఁది దుష్టస్వభావములువాటంతటవి నశించును.

(358) ప్రశ్న:—ఇహలోక సంబంధములైన యింద్రియసుఖములమీఁది యాసక్తి యెప్పుడు నశించును?

ఉత్తరము:—పరిచ్ఛేదరహితుఁడునగు భగవంతునియందు సకలసుఖములయొక్కయు సకల సంతోషములయొక్కయు సమీపకరణమున్నది. అట్టి భగవంతునియందు రమించువారు పనికిమాలిన ప్రాపంచకసౌఖ్యమునందు దమకము జూపరు.

(359) ప్రశ్న—ఏస్థితిలో మనస్సున్నప్పుడు పరమేశ్వరదర్శన మగును?

ఉత్తరము:—మనస్సు ప్రశాంతమై, నిర్మలమయినపుడు భగవంతుఁడు గనఁబడును. మనస్సముద్రము వాంఛావాయువులచేత సంక్షుభితమైనపుడు భగవంతుఁడు దానిలోఁ బ్రతిఫలింపఁజాలఁడు. అట్టి దశలో భగవద్దర్శన మసాధ్యము.

(360) ప్రశ్న:—మనము దైవము నెట్లుకనుఁగొనఁగలము?

ఉత్తరము:—పల్లెవాఁడు పెద్దచేఁపను బట్టుకొనవలెనని కోరి గాలమున కెఱ(గు)నిచ్చి చేఁప దానిఁ బట్టుకొనువఱకు నిశ్శబ్దముగా నిరీక్షించుచుండును. భక్తుఁడు భక్తిసాధనములను జేయుచు నోపికతోఁ గనిపెట్టుకొని యున్నపక్షమున దైవము తప్పక కనఁబడును.

(361) పాపాత్ముని హృదయము వంకరవెండ్రుకవంటిది. ఎం

తపాగఁదీసినను నది సరిగానుండక ముడుచుకొనిపోయి వెనుకటిదశ లోనుండును. అట్లే దుష్టునిహృదయముకూడ సులభముగా మార్పు జెందును.

(362) జ్ఞాన మద్వైతమునకు దారిఁదీయును. అజ్ఞానము భిన్నతకుఁ దీసికొనిపోవును.

(363) సత్పురుషుల సహవాసము బియ్యముగడుగు నీళ్ళవంటిది. కడుగునీళ్ళు మత్తుఁబోగొట్టును. అట్లే సాధువులమైత్రి కోరికలని యెడి మద్యముత్రాగిమత్తిలియున్న మూఢమానవులమత్తు దూరముగాఁ బోఁగొట్టును.

(364) ఒకజమీందారుని ప్రతినిధి తనప్రభువును విడిచి సంస్థానగ్రామములోనికి వెళ్ళినపుడు రైతుల నానాబాధలు పెట్టును. కాని జమీందారునిసన్నిధికి వచ్చినప్పుడు పూర్వపద్ధతులను మార్చుకొని నుంచితనముఁ గలిగి రైతుల నాదరించి వారికష్టములను మెల్లగావిని న్యాయము వారికొసఁగుటకై ప్రయత్నించును. జమీందారుని యెడలఁ గల భయమువలన దుర్మార్గప్రతినిధి సజ్జనుఁ డగుచున్నాఁడు. ఇది యెల్ల జమీందారుని సాన్నిధ్యవిశేషమునం గలిగినమార్పు. అలాగే పుణ్యాత్ముల సహవాసము దుర్జనులమనస్సులలో భయభక్తులఁ గలిగించి వారిని సజ్జనులుగాఁ జేయును.

(365) తడికట్టె నిప్పుమీఁద వైచినపక్షమున వెంటనే తడియిగిరిపోవును. అప్పుడాకట్టె కాలనారంభించును, అలాగే పుణ్యాత్ముల సహవాసము లౌకికులగు స్త్రీపురుషుల హృదయములనుండి కామక్రోధలోభములనియెడు తడిభాగముల నెండఁజేయును. అంతట వివేకాగ్ని వాటిని వెలయించును.

(366) ప్రశ్న:—స్త్రీగాని పురుషుఁడుగాని తనజీవితకాల మెట్లు గడుపవలయును?

ఉత్తరము:—కంసాలి కుంపటిమీఁద నిప్పులారిపోకుండ శ్రవణముతో నిప్పులుఁ మాటిమాటికి గుదుపునట్లు మనస్సు సజ్జనసహవాసముచేఁ బలుమారు ప్రదీప్త మగుచుండవలెను.

(367) నీటిలోఁ దడిపిన పిండిముద్ద రొట్టెగాఁ జేసి వేఁడి నేతిలోఁ బడవేయుము. అది గుడగుడమని ధ్వనిఁ జేయును. అది వేగినకొలఁది ధ్వనితగ్గును. అది పూర్తిగా వేగినపిదప గుడగుడశబ్దము కొంచెమైన నుండదు. అట్లే మనుష్యుఁడు మిడిమిడిజ్ఞానముఁ గలిగినప్పు డుపన్యాసము లిచ్చుటకు మతబోధఁ జేయుటకు బయలుదేరును. కాని జ్ఞానము సంపూర్ణముగా లబ్ధమైనతర్వాత నతఁడు వ్యర్థాడంబరములు మానును.

(368) ప్రపంచసంబంధములైన యాకర్షణలనుముఁగాపురము సేయుచు వానిచే భంగపడక యెవ్వఁడు పరిపూర్ణతను బడయునో యతఁడే మహాశూరుఁడు.

(369) కమ్మరివాఁడు తనకొలిమి యారిపోకుండ మండుటకు నడుమనడుమ తిత్తితో గాలిపోసి నిప్పులు రగులుకొల్పినట్లు మనస్సును నడుమనడుమ సజ్జనసహవాసముచేత వెలయించుచుండవలయును.

(370) నిత్యమై జ్ఞానమయమైన యానందమనియెడుమహాసముద్రమున మనము మునుఁగవలెను. ఆకామక్రోధములనియెడు భయంకరజలచరములకు వెఱువకుము. వివేకవైరాగ్యము లనియెడు పసుపుముద్దలు మేనినిండఁబూసికొని యాసముద్రమున మునుఁగుము. ఆజలచరముల కీపసుపువాసన గిట్టదుకావున నవి నీజోలికిరావు.

(371) పాపాకర్షణముండునట్టి తావులకు నీవు పోవలసివచ్చినప్పుడు, అట్టిచోటులు నీవుజొచ్చువేళ జగన్మాతయైన దేవిఁ దలఁచుకొనుము. ఆమె నీహృదయమునందు దాఁగియున్న దుస్తంత్రముల నుండి సహితము నిన్నురక్షించును. తల్లియెదుట సిగ్గులేక నీవు దుష్కార్యములు జేయఁగలుగుదువా?

(372) ప్రశ్న:—ఈప్రాణముమీఁది తీపి యెట్లుపోవును?

ఉత్తరము:—మానవశరీరము నశియించునట్టియు వేగమేకుళ్ళిపోవునట్టియు రక్తము, మాంసము, శల్యము, చర్మము, క్రొవ్వు మొదలగు పదార్థములతోఁ జేయఁబడినది. ఇట్టు శరీరముయొక్క నానాభాగములను మనము పరిశీలించి, తత్వవిచారముఁ జేసితిమేని ప్రాణముమీఁది తీపి నశించును.

(373) ప్రశ్న:—భక్తు లేదుస్తులు ధరింపవలయును?

ఉత్తరము:—తగిన దుస్తులు ధరించుట మంచిది. సన్యాసి ధరియించు కాషాయవస్త్రములు గట్టువాఁడును, భిక్షుకుఁడు ధరియించు తంబురా చిరుతలు దాల్చువాఁడును, బూతుమాట లాడఁజాలఁడు. బూతుపాటలు పాడఁజాలఁడు. తేలికపలుకులు పలుకఁజాలఁడు; కాని వన్నెలవిసనకఱ్ఱవలె డాబుదుస్తుల ధరించువాఁడు నీచాలోచనలు జేయుచు నీచపుమాటలాడుచు, నీచగానముఁ జేయుచుండును. కావున విలువగల దుస్తులు ధరింపరాదు.

(374) ప్రశ్న:—మనస్సులో నొకప్పుడు శాంతి యుండును, కాని యది చిరకాల మెందుకుండదు?

ఉత్తరము:—వెదురుకఱ్ఱనిప్పు మాటిమాటికి మనమూఁదిరవులొకల్పకపోయినయెడల త్వరగా నారిపోవును. ఆత్మజ్ఞానమనియెడు నగ్నిహోత్రి మారిపోకుండ నిత్యము వెలుగుచుండుటకై యెడతెగని భక్తి యవసరము.

(375) ప్రపంచమునందుండి ముక్తిఁ బొందదలంచువారు కోటగోడవెనుకనుండి యుద్ధముఁజేయునట్టి సిపాయీలవంటివారు. భగవంతుని వెదకుచు నీప్రపంచమును విడిచిపెట్టునట్టి యోగులు. బహిరంగమైన యుద్ధభూమిలో యుద్ధముఁజేయునట్టి యోధులుకోటగోడలలో

డాగి యుద్ధముఁజేయుట బహిరంగమైనచోట యుద్ధముఁజేయుటకంటె శ్రేష్ఠకరము.

(376). తల్లియైన దేవి నీవిధముగా వేఁడుకొనుము. "ఓతల్లీ! నిర్మలమైనభక్తిని వజ్రమువలె దుర్భేద్యమైన విశ్వాసమును నాకు ప్రసాదింపుము.

(377) విషసర్పములున్న యింట నివసించుమనుష్యులు మిక్కిలి జాగ్రత్తగానుండి మెలఁగునట్లు ప్రపంచమున వసియించు మనుష్యులు కామలోభములనునట్టి దుర్వ్యసనములఁ బడకుండ మిక్కిలి జాగ్రత్తగా నుండవలయును.

(378) కుండకు సూదిబెజ్జమంత చిల్లి యుండినను నీరంతయు దానిలోనుండి కారిపోవును. అలాగే ధర్మానుష్ఠానమందుఁ బ్రవేశించు వానికి నందు స్వల్పమాత్రమున్నను వాని యనుష్ఠానమంతయు వ్యర్థమగును.

(379) తోడుకొన్నపాలు కవ్వముపెట్టి చిలికి వెన్నఁదీసియావెన్న చిలికిన పెరుగులో నుంచకూడదు. అట్లుంచుటవలన వెన్నయొక్క చిక్కఁదనము రుచియు నించుకతగ్గును. అది మరియొకకుండలో మిక్కిలి తేటనీటఁ బడవైచి యుంచవలయును. ఆలాగే యీప్రపంచమున భక్తిజ్ఞానవైరాగ్యములు కొంతవఱకు సంపాదించినమనుష్యుఁడు ప్రపంచమధ్యమందే యుండి లౌకికులతోఁ గలసిమెలసి యుండినయెడల నతనికి మాలిన్యమంటవచ్చును. ఆప్రపంచమును విడిచియున్న యెడల నతఁడు పరిశుద్ధుఁడై యుండును.

(380) మసియున్నగదిలో నీవున్నయెడల నీవెంత జాగ్రత్తగా నుండినను నీకేమాత్రమైన మసి యంటకమానదు. అలాగే యొక పడుచువాఁడు నెంతయోగ్యుఁడుగానుండినను కాంతతోఁ గలిసి యొకయింటిలోనున్నయెడల వారిద్దరు కోరికల నెంతయణఁచుకొన్నను, నెంతజాగ్ర

త్తగానున్నను, స్వల్పముగానైనను వ్యభిచారవృత్తి వారిమనంబుల జనియింపకపోవదు.

(381) శవసాధనమనియెడు దారుణకర్మచేత నిద్దరుమనుష్యులు కాళికాదేవి నుపాసన చేయుదలంచిరి. శవసాధనమనఁగా నర్ధరాత్రమున శ్మశానమున కరిగి శవముమీఁద కూర్చుండి ఘోరమంత్రములతో దేవినుపాసనముచేయుట. ఆయిద్దరిలో నొకఁడు ఘోరమైన యాకర్మముజూచి మతిభ్రష్టుఁడయ్యెను. రెండవవాఁడు సంకల్పసిద్ధినొందెను. అతనికి దేవి తెల్లవాఱుజామున సాక్షాత్కరించెను. అంతట నతఁడు "ఓ దేవీ! నన్నీవిధముగా నేలయనుగ్రహించితివి. వానినేల పిచ్చివాని జేసితి" వని యడిగెను. అప్పుడతనికి దేవి యిట్లనియె. "బిడ్డా! నీ పూర్వజన్మములలో నీవెన్నోసారు లీపూజలు జేసి పిచ్చివాఁడవై యీజన్మమున మాత్రము నన్నుఁ జూడఁగలిగితివి."

(382) ప్రశ్న:—హిందువులలో ననేక మతములున్నవి. ఏమత మవలంబింపవలయును?

ఉత్తరము:—ఒకనాఁడు పార్వతి మహాదేవు నిట్లడిగెను. "ఓ దేవా! నిత్యమై, నిరుపమానమై, సర్వోత్కృష్టమైన యానందమునకు మూలమేమి?" ఆమెకు మహాదేవుఁడిట్లనియె. "విశ్వాసమేమూలము" మతములయొక్కయు, శాఖలయొక్కయు విశేషలక్షణములు ముఖ్యమైనవికావు. ప్రతిమనుష్యుఁడు తనమతమునందు విధింపఁబడిన ధర్మములను భక్తిశ్రద్ధలతోఁ జేసినఁ జాలును.

(383) యౌవనమురాని యాఁడుపిల్లలు మగపిల్లలు సంభోగసౌఖ్యముయొక్క యానందమెఱుఁగనట్లే లౌకికుఁడు బ్రహ్మానందపారవశ్యముయొక్క చవి యెఱుఁగఁడు.

(384) ప్రశ్న:—శరీరముక్షణభంగురమై యపరిశుభ్రమైనది గదా! దానిగుఱించి యేల యింతశ్రద్ధ?

ఉత్తరము:—పట్టిపెట్టె నెవ్వఁడును జాగ్రత్తపెట్టఁడు. ధనము మొదలైన విలువగల పదార్థములున్న పెట్టెమాత్రమే మనుష్యులు జాగ్రత్తపెట్టుదురు. సత్పురుషులు శరీరవిషయమున జాగ్రత్తపుచ్చుకొనక తప్పదు. భగవంతునికి నిలయమైన యాత్మకీశరీరమాలయము. అందుచేత నది జాగ్రత్తపెట్టవలయును.

(385) ప్రశ్న:—మనుష్యులలో దైవభక్తి యెంతకాలముండును?

ఉత్తరము:—ఇనుపముక్క నిప్పులోనున్నంత సేపెఱ్ఱగానుండును. నిప్పులోనుండి తీయఁగానే నల్లబడిపోవును. ఆలాగే మానవుఁడీశ్వరసంసర్గ మెంతకాలము గల్గియుండునో యంతకాలమే భక్తి గలిగి యుండును.

(386) మెత్తనిమట్టితో బొమ్మలు చేయవచ్చును. కాలి గట్టిపడినమట్టితో నట్టివిచేయఁజాలము. ఆలాగే ప్రపంచసంబంధమైన కోరికలతో నిండినహృదయముల మహోన్నతభావములను గ్రహింపఁజాలము.

(387) నీరు, నీటిబుగ్గయు నొక్కటే. ఆబుగ్గలు నీటియందే పుట్టి నీటిమీఁద తేలియాడి నీటిలోనే లీనమైపోవును.ఆలాగే జీవాత్మయుఁ బరమాత్మయు నొక్కటే. జీవాత్మ చిన్నది. మితిగలది. పరమాత్మ యపరిమేయమైనది. జీవాత్మ యస్వతంత్రమైనది. పరమాత్మ స్వతంత్రమైనది.

(388) కప్పపిల్ల తోఁక యూడిపోయినతర్వాత నేలమీఁద నీటిమీఁద కూడ బ్రతుకఁగలదు. అజ్ఞానమనియెడు తోఁకలు యూడిపోయెనేని మనుష్యుఁడు స్వతంత్రుఁడగును. అప్పుడతఁడు ప్రపంచమునందును, భగవంతునియందును గూడ సమానముగా నుండఁగలఁడు.

సమాప్తము.

నందచరిత్రము

అను

మాలయోగి కథ.

భగవద్భక్తు లన్నిజాతులలో నన్నివర్ణముల లోనున్నారు. సకలధర్మద్రోహులగు రాక్షసులలోను ధర్మరక్షకులగు దివ్యుల లోను వేదవిదులగు బ్రాహ్మణులలోను మృగప్రాయులై మూర్ఖులగు చండాలురలోను బరమభాగవతోత్తములు జన్మించినట్లు మన పురాణాదులయందు గథలు గలవు. ఈశ్వరభక్తి కలుగుటకు సత్వగుణమే ప్రధానముగాని వర్ణము ప్రధానముగాదు. కర్మలచేతను గుణములచేతను గేవలము చండాలురనదగినవారు బ్రాహ్మణులలో ననేకులు గలరు. గుణములచేతను కర్మములచేతను బ్రాహ్మణు లనిపించుకొనదగినవారు చండాలురలో ననేకులుగలరు. ఈచిన్నకథకు నాయకుడైన నందుడు డీకడపటి తెగలోఁ జేరినవాఁడు.

ఆర్కాటుజిల్లాలో ఆధనూరను నొక చిన్నగ్రామముగలదు. ఆపల్లియలో నొక మాలకుటుంబమున రమారమి యాఱువందల యేండ్లక్రిందట నొకబాలుఁడు జన్మించెను. తలిదండ్రు లాతనికి నందుఁడను పేరు పెట్టిరి. ద్రవిడభాషలో నతఁడు తిరునాళైపోవా రను పేరం బరఁగుచుండు. ఆపే రతని కేలగలిగెనో చదువరులు ముందు ముందు గ్రహింపఁగలరు. మనదేశమున మాలవాండ్రస్థితి యెట్లున్నదో చెప్పనక్కఱలేదు. వారి యిప్పటి స్థితియే మిక్కిలి శోచనీయముగ నున్నదిగదా? వారి వెనుకటి స్థితినిగూర్చి వేరే వర్ణింపవలయునా?

అగ్రజాతులగు బ్రాహ్మణక్షత్రియవైశ్యులసమీపమునకు మాలవాండ్రు రాఁగూడదు. కొన్నితావులలో మాలవాని నీడమైన బ్రాహ్మణుని మీఁద పడరాదఁట. దక్షిణదేశమున మాలవాండ్రు పల్లెటూళ్ళ లో వీధులనడుమనుండి నడువఁగూడదు. నడువఁదగిన వీధులనుండి నైన వాఁడు నడచినంతసేపు "నేనుమాల నేనుమాల" నని గట్టిగ నరచుచుపోవలయును. వారి కేవిధమైన విద్యయులేదు. ఇప్పుడిప్పుడు కొంచెమాస్తి వారుసంపాదించుకొనుచున్నారు గాని పూర్వకాలము వారి కాస్తి యనుమాటయే లేదు. ఎవఁడైన ప్రజ్ఞావంతుఁడున్నను శాస్త్రమునుబట్టి చండాలుఁ డాస్తి సంపాదింపఁ గూడదు. కాఁబట్టి వారగ్రవర్ణములవారియొద్ద నెల్లప్పుడు పాలేరుతనములు చేసి యజమానులు ధర్మభిక్షముగ నిచ్చు ధాన్యమును స్వీకరించి పొట్టలు పోసికొనవలసినవారు. పాలేరులను పేరె కాని మాలవాండ్రు పైవర్ణములవారియొద్ద నిశ్చయముగ బానిసలని చెప్పవచ్చును. అన్నివిధములచేత నిట్టి యధమస్థితిలో నున్నమాలల కులమునందె నందుఁడు జన్మించెను. ఆతని వంశము తక్కిన చండాలవంశములకంటె నేవిధముచేతను గొప్పది కాదు. అతని పుట్టినతావు తక్కినమాలల జన్మస్థానమువంటిదె. మాలపల్లెలు సాధారణముగ నూరుబైట నుండునుగదా. అన్నియును మట్టి చుట్టుగుడిసెలె కాని యిల్లని చెప్పఁదగిన దందొక్కటియునుండదు. ఆగుడిసెలైన సరిగాఁ దీర్చి కట్టకపోవుటచే నాగూడెమున నడచుటకు వీలైనవీధులుండవు. మఱియు నచ్చట నేమూలఁ జూచినఁ గడుపులోఁ ద్రేవులు సయితము వెడలిపోవునట్లు వమనములుదెప్పించు దుర్వాసనలుండును. ఏచాయఁగనుఁ గొన్న పెంటపోగులు కుండపెంకులు చింకిచాపలు గుడ్డపేలికలు తోలుముక్కలు గొడ్డెముకలు మిక్కిలి యసహ్యముగఁ గనఁబడుచుండును. ఏవంకఁ జూడ్కులు ప్రసరించిన నూరపందులు కోళ్ళు కుక్కలు దిగంబరులై యెండకుమాడిన పిల్లలు

సగముదిగంబరులగు స్త్రీపురుషులు దృష్టిపథమునఁబడుచుందురు. ఏదెసఁ జెవియొగ్గి విన్నఁ దప్పద్రాగిన స్త్రీపురుషుల కలహములు కుక్కకూతలు పిల్లలయేడ్పులు కాకుల యఱపులు వినఁబడుచుండును. ఇట్టిగూడెములోనే నందుఁడు జన్మించెను.

పుట్టిన తావునుబట్టియు వంశమునుబట్టియుఁ దలిదండ్రులఁబట్టియుఁ జూడ నందుఁడు యోగ్యుఁడగుటకు వీలులేదు. మఱియు నిరంతము పోలేరమ్మ గంటాలమ్మ మొదలగు గ్రామదేవతల గుళ్ళకుఁబోయి యాదేవతలకుఁ గల్లు మాంసము నైవేద్యముపెట్టి మేకలను గొఱ్ఱెలను బలియిచ్చికొలుచుటయేకాని సత్వగుణప్రధానముగ నిశ్చలభక్తితో నీశ్వరుని యర్చించుట నందుఁడుగాని వారి పూర్వులుగానియేనాడునుజూచియైన నెఱుంగరు. అట్లుండ వేదశాస్త్రాధ్యయనముజేసిపరమనిష్ఠాగరిష్ఠులగు బ్రాహ్మణులకైన దుర్లభమైన యంతటి పరమభక్తి యా చండాలబాలున కెట్లలవడినదో పరమేశ్వరుఁడెఱుంగవలయునుగానినరుఁ డెఱుంగుట యసాధ్యము. నందుఁడు చిన్నతనమునందుఁ దక్కిన చండాలబాలకులవలెఁగాక యాటపాటలలో సైతము నీశ్వరభక్తియే ప్రకటించుచుండువాఁడు. తోడిబాలురు చాలమంది గంతులువేయుచు నాడుచుండ నతఁడు వారితోఁగూడక కొందఱిఁదనవెంటఁబెట్టుకొని మట్టితెచ్చి దేవునిబొమ్మలు చేయుచుండును. దేవుఁడు నల్లని శరీరము పెద్దమీసములు జరీతలగుడ్డ చేతిలో నొకగొడ్డలి గలిగియుండునని వానియభిప్రాయమగుటచే నతఁడు చిన్ననాఁటచేసిన విగ్రహములన్నియు నట్లె యుండెనఁట. విగ్రహములుచేసి వానికిఁ బ్రదక్షిణములు గావించి యతఁడు, మఱికొందఱు బాలభక్తులు గలిసి పాటలు పాడి యావిగ్రహముల నారాధించి యుత్సవములు సేయుచువచ్చిరి. ఇవియే యాతని బాల్యవినోదములు.

అథనూరుగ్రామమున బ్రాహ్మణగృహముల సమీపమున

నొక శివాలయము గలదు. దాని గోపురము గుండ్రముగను మిక్కిలి సుందరముగను నుండును. ఆగోపురమన్న నందునకుఁ బరమప్రీతి. అతఁడు మాలఁడు గావున దగ్గరకుబోయి చూచుటకు వీలులేక దూరమున నుండియే యాగోపురముయొక్క యౌన్నత్యము సౌందర్యము శిల్ప చమత్కృతి చూచిచూచి తనివి తీరక మఱిమఱి చూచి తనలోఁదా నుమురియుచుండును. గ్రామమందు స్వస్తివాచనములతోడను తూర్య ధ్వనులతోడను కాగడాలతోడను భజనలతోడను శివున కూరేగింపు టుత్సవములు జరుగుచుండ నందుఁడు మాలబాలురను బోగుచేసికొని పరుగుపరుగున గ్రామముకడకుఁ బోయి కడుదవ్వుననుండియే యాయు త్సవములు చూచి పరమానందము నందుచుండును. వేదముమీదను వేదముచదువు బ్రాహ్మణులయెడలను దేవాలయములయెడలనువానికి సహజముగ మిక్కిలి భక్తిగలదు.

ఆభక్తికిఁ దోడుగ వాని హృదయమున నీశ్వరభక్తియంకురించెను. అందుచేతనతఁడు భగవంతుని మెప్పించుట కేమంచిపని చేయఁగలనాయని వితర్కింపఁదొడఁగెను. జాతి నెంచినఁ గడు నీచుఁడు. స్థితి యెంచినఁ గడుఁబేదయగుటచే నతఁడు భగవంతున కేవిధమైన కైంకర్యము చేయఁజాల నందుకుఁ దద్దయు విచారించుచుండ నొకనాఁడు వాని మనంబున నొక యుపాయము తట్టెను. కులమునఁ జండాలుఁడగుటచే స్వామియొద్ద వాయించుడోళ్ళకు వీరణములకుఁ గావలసిన చర్మములు దానుస్వయముగఁ దెచ్చి బాగుచేసి యుచితముగ వాద్యములు సేయువారి కిచ్చుట యుత్తమమైన భగవత్సేవయని వానికిఁ దోఁచెను. ఈయూహ తట్టినతోడనే యతఁడు దిగ్గునలేచి మహానందభరితుఁడై "నాతో స్వామి మాటలాడినాఁ" డని యందఱితోఁ జెప్పెను. ఎల్లయప్పుడు మనస్సున భగవంతుని ధ్యానించు సత్పురుషులకు దేవుఁడు ప్రత్యక్షమైనట్లు మాటలాడినట్లు పరవశత్వముచేత భ్రమ కలుగు

చుండును. ఆక్లే నందునకును భర్మమగలిగియుండవచ్చును. ఆయూరా తోఁచినతోడనే యతఁడు గూడెమునకుఁ బోయి చర్మములుసంపాదించి తడిపి మెత్తగఁజేసి వాద్యములుసేయు మంగలివాండ్ర కుచితము గ నిచ్చెను. అది మొదలు చర్మముల పేరు చెప్పిన వానియొడ లు ప్పొంగుచుండును. తీరికయైనప్పుడెల్ల చర్మములు బాగుచేయుటయే పనిగ నతఁడన్యవ్యాపారమును మానియుండెను.

ఈనందునకు మిత్రులగు మాలపెల్లలింక ననేకులుండిరి. వారి పేరు లిప్పుడెవ్వరికినిం దెలియవు. నందుఁ డాబాలురకు భగవత్కీర్త నలుచెప్పి తాను వారుఁ గీర్తనలుపాడుచు మేన భస్మము పూసికొని భజనలు చేయుచుందురు. నందుఁడు చిన్ననాఁటనుండియు నొకబ్రాహ్మణుని పొలములోఁ బనిచేయుచుండెను. ఒకనాఁడు పనిముగియకుండగనే యతఁడు తోడిబాలురఁగూడుకొని దాపుననున్న తిరుపంకూరుగ్రామమునకుఁబోయెను. ఆయూరి కిప్పుడు "ప్రితవైతీశ్వరం కోయిల్" అను పేరున్నది. నందుఁడు సహకారులతోఁగలసి యాయూరుపోయి శరీరమున నాపాదమస్తకము బూదిపూసికొని గ్రామమునకు మూఁడుప్రదక్షిణములుచేసి యాలయమున కెదురునిలిచిశివ భజనలుచేసి సాయంకాలమైన తరువాత తాను గానుకగఁ దెచ్చిన యరఁటిపండ్లు కొబ్బరికాయలు దేవునకు నివేదన సేయుమని యర్చకున కంపెను. అర్చకుఁ డవి గ్రహించి యాలయమలంకరించి సాయంకాల పూజ సేయుచుండ నందుఁడు తక్కిన మాలవాండ్రు గుడిబైట ధ్వజస్తంభము వెనుకనుండియే యాగంటనాదము హరహరమహాదేవ యను భక్తులకంఠధ్వని ధగధగ వెలుఁగు దీపములు దీపములలో మెఱయు దేవుని యాభరణములు మహామంత్రనాదములు కర్పూరహారతి మొదలగునవి విని చూచి జన్మమధ్యమం దదివఱకెన్నఁడు నొందని మహాద్భుతము మహానందముమహాభయమునొంది జన్మసార్థకమయ్యె

నని భావించెను. ఆదీపములవెలుఁగున దూరమునుండి తిన్నఁగా నగ
పడనియామహాలింగమును వంగివంగిపలుసారులు తెప్పవాల్పకచూచి
తన యెట్టయెదుట నీశ్వరుఁడు సాక్షాత్కరించెనని నమ్మి సంతోషము
పట్టఁజాలక కన్నులనుండి యానందబాష్పములు స్రవింప నొకసారి
యేడ్చుచు నొకసారి నవ్వుచు శివస్మరణముచేయుచు నెట్టకేలకు ధ్యా
నాతిశయముచేతఁ బరవశత్వమునొంది మూర్ఛిల్లెను.

అప్పుడు దారిఁబోవువారనేకులు వానిచుట్టుఁజేరి వానితన్మయ
త్వమునకు నిశ్చలభక్తికి మిక్కిలియచ్చెరువుపడిరి. భక్తవత్సలుఁడగు
శివుఁడు, మనసు తనలో నైక్యముచేసిన యాపరమభాగవతోత్తముని
భక్తికిమెచ్చి తనవిగ్రహము వానికిస్పష్టముగాఁ గనఁబడవలయునని
యాలయములోఁ దనకెదురుగనున్న పెద్దనందివిగ్రహమును బ్రక్క
కొత్తిగిలుమని యానతిచ్చెనఁట. అందుచేతనే ప్రతిశివాలయమున
శివునికెదురుగానుండు నందివిగ్రహము తిరుపంకూరులో దేవున కెదు
రుగానుండక యిప్పటికి నొకప్రక్క నుండునఁట.

అట్లుమూర్ఛిల్లి కొండొకసేపటికిఁ దెలివిఁదెచ్చుకొని నందుఁడు
తనచుట్టు గుంపుగూడిన బ్రాహ్మణులకు నమస్కరించి మరలనొకసారి
గ్రామప్రదక్షిణము చేయవలయునని చెలికాండ్రతోఁగూడి బయలు
దేఱెను. బయలుదేఱిపోవుచుండ బ్రాహ్మణవీధిఁ జిట్టచివర నున్న
యొకయింటి యరఁగుమీఁదఁ బురాణవేత్తయగు బ్రాహ్మణపండి
తుఁ డొకఁడు వందలకొలఁది జనులంబోగుచేసి చిదంబరపురాణముఁ
జదివి యర్థముచెప్పుచుండుట తటస్థించెను. నందుఁ డాసమీపమునకు
వచ్చునప్పటికి బ్రాహ్మణపండితుఁడు! చిదంబరము సకలక్షేత్రముల
లో గొప్పది. ఒక్కసారి చిదంబరముఁ గన్నులారఁ జూచినవాఁడు
పరమపాతకుఁడైననుసరే చండాలుండైననుసరే నిశ్చయముగ జన్మ
పరంపరయను సముద్రముదాఁటి పరమేశ్వరునిసన్నిధిఁ జేరియుండు

నని యుపన్యసించి చిదంబర దేవాలయమును దానిలోనుండు మహిమను వర్ణించి చెప్పసాగెను. ఆమాటలు నందునిచెవులలో నమృతధారలువలె పడెను.

చిదంబరము దక్షిణహిందూస్థానములోని దివ్యస్థలములలో మిక్కిలి ప్రసిద్ధికెక్కినది. అందు శివుని యాకాశలింగమున్నది. ఈవిధముననె పృథివీలింగము జలలింగము తేజోలింగము వాయులింగము గల శివక్షేత్రములు మఱినాలుగు దక్షిణదేశమునఁ గలవు. శివుఁడు పంచభూతములలో నొక్కొక్కదానిరూపము గ్రహించి యొక్కొక్క క్షేత్రములో నుండెనని పెద్దలు చెప్పుదురు. చిదంబర మనుమాటకు జ్ఞానాకాశమని యర్థము. తీర్థయాత్రపరులు చిదంబరమునకుఁ బోయి యా యాకాశలింగమునుజూచి చిదంబరరహస్యమును జూచినామని చెప్పుదురు. ఆకాశమనఁగా నేదియులేనిచోటని యర్థమగుటచే జిదంబరరహస్యమనఁగా నేదిలేదని యర్థము. పండితులు దీనింగూర్చి వేదాంతార్థము చెప్పుదురు. ఆయాలయమధ్యమున బంగారు పెంకులతో నేసిన యొకమండపముగలదు. దానిని లోకులు చిత్సభయందురు. చిత్సభయనఁగా జ్ఞానసభయని యర్థము. ఆమండపములో మొదట నటరాజస్వామివిగ్రహ ముండును. అవ్వల లోకులకాశ్చర్యముఁ గలుగఁజేయు చిదంబరరహస్యముండును. ఇదియే మనుష్యుఁడు తెలిసికొనవలసిన రహస్యములలోఁ బరమరహస్యమనియు నిర్గుణపరబ్రహ్మస్వరూపమనియుఁ జెప్పుదురు. నటరాజస్వామి విగ్రహము మిక్కిలి దర్శనీయమై జగన్మోహనముగనుండును. అంతటి పరమసుందరమగు విగ్రహము లోకములో మఱియే దేశమున నే దేవాలయమున లేదని బహుదేశద్రష్టలు చెప్పుచున్నారు. అది కేవలము మనుష్యుఁడుచేసిన రాతివిగ్రహమైనను నిశ్చయముగ నంత జీవకళ యుట్టిపడునట్టియుఁ జూచినమాత్రమున నెల్లవారి కానందముఁ గలుగఁ జేయునట్టియుఁ

దోషరహితమైనట్టియు విగ్రహము మఱొకటి లేదని సూచినవారంద రైకకంఠ్యముగ నభిప్రాయపడుదురు. ఆవిగ్రహముయొక్క శిరస్సున నున్న మెత్తని యుంగరములు జుట్టును విశాలమగు నాసికను జీవకళ గ్రుక్కు చక్కని వెడఁదకన్నులను చిదానంద కరుణారసములను వెదజల్లు ముఖారవిందమును తాండవనృత్యము నిమిత్తము సుందరముగ వంచిన హస్తములను మిక్కిలి మనోహరమైన యాకుంచితపాదమును జూచువారు నిశ్చయముగ నొక్కపురుషుఁ డక్కడఁ దాండవమాడుచున్నాఁడని తలంపవలసినదే కాని విగ్రహమనుటకు వీలులేదు.

ఆవిగ్రహమున కనేకహస్తములుకలవు. ఒకకుడిచేతిలో నొక డమరుకమున్నది. శివుఁడు తాండవసమయమున దానిని వాయించుచున్నట్లును నీటిలోనుండి బుడగలు నిప్పులోనుండి నిప్పుకలు పొడమినట్లు బ్రహ్మాండము లాడమరుకమునుండి పుట్టుచున్నట్లును జెక్కఁబడియున్నది. రెండవ కుడిచేతితో సృష్టింపఁబడిన సకలజగముల రక్షించుచున్నట్లు చూపఁబడినది. ఒక యెడమచేతిలో సకలబ్రహ్మాండములు నిర్మూలనముచేయు ప్రళయాగ్నియున్నట్లు గానఁబడును. కుడిపాదముమాత్రము భూమిమీఁదనే స్థిరముగానున్నట్లు జూపఁబడియున్నది.

విగ్రహ మంతదివ్యసుందరముగ నుండుటచేతనే ద్రావిడదేశమున సుప్రసిద్ధులైన యప్పారు మాణిగారు పట్టణాధరు తాయుమనారు మొదలగు పరమశైవులు భక్తిరసముచేతఁ బరవశులై ద్రావిడభాషలో సర్వోత్కృష్టమై వినువారియొడలు సయిత ముప్పొంగఁ జేయు కవనముచే నాదేవుని స్తవముచేసియున్నారు. పరమశైవులు ప్రపంచమునం బ్రతిపదార్థమునందు నటరాజస్వామి నిరంతరము నాట్యముచేయుచుండును. కావున నెల్లవస్తువులకుఁ జైతన్యము కలదని చెప్పుదురు. శివుఁడు నటరాజరూపమునఁ దాను జగన్నాటక సూత్ర

ధారుఁడగుటఁ బ్రకటించుచున్నాఁడని వేదాంతులు చెప్పుదురు. ఈ క్షేత్రమునఁ బూర్వకాలమున పతంజలి యను మహర్షియు వ్యాఘ్రపాదుడను మహాత్ముఁడు నటరాజదేవు నాశ్రయించి యొకఁడు జ్ఞానమార్గమున వేఱొకఁడు భక్తిమార్గమున ముక్తిఁ జెందిరని స్థలపురాణమునఁ గనఁబడును. నటరాజస్వామి కోవెలకు సమీపముననే గోవిందరాజపెరుమాళ్ళ నాలయముగలదు. అందుచేఁ జిదంబరక్షేత్రము శైవులకేగాక వైష్ణవులకుఁగూడ సేవ్యమైనస్థలమే.

నందుఁడు బ్రాహ్మణునినోటినుండి చిదంబరమహాత్మ్యమంతయుఁ జెవులు దోరవెట్టుకొని మిక్కిలి శ్రద్ధతో విని పరమానంద భరితుఁడయ్యెను. చిదంబరము, నటరాజస్వామి యనుమాటలకు విధేయుఁడైపోయి యారాత్రియే బయలుదేఱి యాదివ్యక్షేత్రమును జూడవలయునని సంకల్పించెను. కాని పాలికాండ్రు వాని యుద్యమమున కిష్టపడక "చిదంబరము మనము చేరకమునుపే గుడితలుపులుమూయఁబడును. మఱియు నీవు బ్రాహ్మణునొద్ద పాలేరువు గదా! ఆయన సెలవు లేక మనమెక్కడికైనఁ బోవచ్చునా! ఇదివఱకే మనమాలస్యము చేసితిమిగావున పోవల"దని యాపిరి. మఱియొకఁడైన పక్షమున నప్పుడే వారిమాటలను ద్రోసివేసి తనయభీష్టము నెఱవేర్చుకొనియుండును. నందుఁడట్లుచేయక "బ్రాహ్మణునకు నన్నుఁ బాలేరుగాఁ జేయుటయు భగవదిచ్ఛయే. నామేలు నాకంటె భగవంతుఁడే బాగుగ నెఱుఁగును గదా? దేవుని యిచ్ఛాప్రకారము నడచుట వానిగుడికిఁబోవుటకంటె మంచిది. కావున నేనిప్పుడుపోయి బ్రాహ్మణుని కాళ్ళమీఁదఁబడి వానినెల్ల విధములఁ బ్రార్థించి యనుగ్రహము పుట్టఁజేసెదను. అప్పుడాయనయే నన్నుఁ బోవనిచ్చు" నని పలికి చిదంబర ప్రయాణముమాని యాగ్రామమున జనులయుపయోగార్థము తాను తన పాలికాండ్రతోఁగలసి యొక కోనేరుత్రవ్వ సాగెఁ

మమునకుఁ బోయెను. ఒకమాలఁడు మఱికొందఱు మాలలతోఁ గలసి యప్పకాలమున నొక చెఱువుత్రవ్వుట యాశ్చర్యమేకదా! భక్తిరసమేమిచేయింపదు? నందుఁడు నిజమైన భక్తుఁడు గావున నట్లు చేసియుండవచ్చును. నందుఁడు చెఱువుత్రవ్వఁ బ్రారంభించిన తోడనే గణేశ్వరుఁడు ప్రత్యక్షమైతనతండ్రి భక్తునిప్రీతికొఱకుఁ దానే కోనేరు త్రవ్వియిచ్చెనని పెద్దలు చెప్పుదురు. ఎట్లైన నందుఁడే యది త్రవ్వి యుండవచ్చును. లోకోపకారముచేయుట దేవునిబూజించుట వంటిదేయనియు నార్తులగువారి కన్నోదకముల నీయక గుడికి నరఁటిపండ్లు కొబ్బరికాయలు మొదలగునవి తీసికొనిపోయి వట్టిపూజలు చేయుట నిష్ఫలమనియు నందుఁడు తలంచుటచే నతఁడా సత్కార్యము చేసియుండునని మనము నమ్మవచ్చును.

అట్లతఁడు చెఱువుత్రవ్వి గ్రామమునకుఁ బోయి తీరికచేసికొని యొకసారి చిదంబర క్షేత్రముఁ జూడవలయునని కోరుచుండెను. కోరి కపొడమినది మొద లాతని మనస్సు స్వామియందె సక్తమైయుండు టంజేసి పొలములోఁ బనిచేయునప్పుడు గృహమందుఁ గూర్చున్న ప్పుడు నిదురపోవునప్పుడుఁగూడ నందుఁడు నటరాజస్వామి తన యెట్టయెదుటఁ దాండవనృత్యము సలుపునట్లు భావించి యానందింపఁ జొచ్చెను. చిదంబరక్షేత్ర మొక్కసారి పోవుటకుఁ దనకుఁ సెల విమ్మని ప్రతిదినము యజమాను నడుగవలయునని నందుఁ డూహించియు నోరుదెఱచి యడిగినతోడనే యజమానుఁడు తనకోర్కె నిరా కరించునను భయమున నూరకుండుచు వచ్చెను. ప్రతిదినము సాయం కాలము "తప్పక నేను జిదంబరము వెళ్లుదు"నని యతఁడు చెలికాండ్రతోఁ జెప్పుచు వచ్చెను. కాని పయనము సాగకపోవుటచే రేపు లెన్నిరేలా నేఁడులయ్యెను. చెలికాండ్రు తిరునాళైపోవారని పేరు పెట్టి నందుని వెక్కిరింపఁ జొచ్చిరి. తిరునాళైపోవా రనఁగా రేపు

వెళ్ళువాఁడని యర్థము. లేపు లేపని నందుఁ డెన్నాళ్ళకుఁ బోవక యుండుటచే మిత్రులా పేరుపెట్టి వానిని పరిహసించిరి. ఈనడుమ నా గ్రామములోనుండిన మాలవాండ్రు నిజమైన భక్తి యెట్టిదో యెఱుంగని మూర్ఖులగుటచే నందుని విధమంతయుఁజూచి మొట్టమొదట నాశ్చర్యమొందిరి. కాని నందుఁడు నిరంతరము భగవన్నామ ముచ్చరించుటయు మేనెల్ల బూడిదపూసికొనుటయుఁ గన్నులు మూసికొని ధ్యానము చేయుటయు సహజమైన ధూర్త-భావమును విడిచి వినయ సంపత్తి గలిగియుండుటయు భగవద్విషయిక ప్రసంగమేకాని యన్య ప్రసంగము మానుటయు దగ్గఱనుండి చూచినకొలఁది వారికి మేర మీఱిన భయము పుట్టెను. పై లక్షణములకుఁ దోడుగ నందుఁడు కల్లుద్రాగుట మాంసముతినుటయు మానెను. తోడిమాలబాలు రాడు మోటయాటలలోఁ బ్రవేశించుట మానెను. గొడ్లను గోయుట, వానికంటె కతిఘోరకృత్యముగఁ గనఁబడుటచే నట్టిపని చేయ వలదని పలుమాఱు కులస్థులతోఁ జెప్పుచువచ్చెను. కులస్థులగు చండాలురు తప్పత్రాగి బూతులు తిట్టుకొనుచుఁ గయ్యము లాడునప్పుడు నందుఁడు వారిపొంతఁబోక దూరమున నొకచోఁ గూర్చుండి తన చుట్టునున్న చెట్లు పుట్టలు వాగులు మొదలగువానిం జూచి యవియన్నియు నట రాజస్వామిచేత సృష్టింపఁబడినవే యని యెంతయుఁ దన్మయత్వమున భావించి యలరి "ఓస్వామి! నీవు సృష్టించిన పదార్థములను జూచుట కంటె నీ నిజరూపమును జూచుటకు నా మనస్సు వేడుకపడుచున్నది. నాకు దరిశనమిమ్మ"ని వేడుకపడుచుండును.

ఇట్లు నందుఁ డొకనాఁడు నటరాజధ్యానపరాయణుఁ డయి తన్మయంబగు చిత్తంబుతోఁ బరవశుఁడయియుండ వానికన్నులనుండి యానందబాష్పములు జొటజొటఁ గాఱెను. మేనుఁ దెలివితప్పి యతఁడు నేలంబడియెను. అప్పుడు పొరుఁగు మాలఁడొకఁడు వానిం

జూచి పెద్దరోగమేదో వానికి మూడినదని భయపడి పెద్దపెట్టున నఱచుచు నెల్లవారిం బిలిచెను. వెంటనే చుట్టుప్రక్కలనున్న మాలవాండ్రు పరుగు పరుగున నచ్చోటికిఁబోయి పడియున్న నందుని చుట్టు గుమిగూడి వాని శరీరమంతయుఁ గట్టిగఁ గదిపి బలవంతముగ వానికి మెలకువ దెప్పించి మేలుకొన్న పిదప నట్లు పడిపోవుటకుఁ గారణమడిగిరి. పరమేశ్వరుఁ డొక్కఁడున్నాఁడనియు వాని ధ్యానమేతనయవస్థకుఁ గారణముగాని రోగము కారణము కాదనియు నందుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. నందుని ప్రత్యుత్తరము వారికి సహేతుకముగ నుండనందున మాలపెద్ద లందఱుఁ దోడనే సభచేసి నందుని దురవస్థకుఁ గారణములు చర్చించి తమ కులదేవతలకుఁ దఱుచుగ జాతరలు చేయకపోవుటచే నా దేవతలు కోపించి నందుని బాధించుచున్నవే కాని మఱియొక కారణముకాదని నిశ్చయించి మఱునాఁడే జాతరలుచేయవలెనని కృతనిశ్చయులైరి. జాతరకు గొప్ప ప్రయత్నము జరిగెను. మాలవాండ్రు పెద్దతాటియాకుల పందిరివేసి మామిడాకుల తోరణములఁగట్టి యరఁటి కంబములు పాఁతి దానిని సొగసుగ నలంకరించిరి. బలినిమిత్తము కావలసినన్ని కోళ్ళు, మేఁకలు, గొఱ్ఱెలు సిద్ధముగానుండెను. నైవేద్యము నిమిత్త మెన్నో కడవలకల్లు చేర్పఁబడెను. సోది చెప్పుటలో నిండు ప్రజ్ఞగలమాలగురు వొకఁడు వచ్చి యాతంతు నడుప సమకట్టెను. అద్భుతమగు పేళ్ళుగల యిరులన్, వీరన్, కావేరి, నల్ల కరుపన్ మొదలగు క్షుద్రదేవతల విగ్రహములు రాగిడిమట్టితో భయంకరముగఁ జేయఁబడెను. మఱునాఁడుదయమున బల్లెనున్న మాలలందఱు జాతరఁజూడఁ బందిరిక్రిందికిఁ జేరిరి. మట్టిదేవతలు ప్రాముఖ్యతనుబట్టి వరుసగా నిలుపఁబడిరి. అప్పుడు కొందఱుమాలలు నందుని బట్టుకొని మధ్యప్రదేశమునకుఁ దోడ్కొనిపోయిరి. అంతట మాలగురువు తన డమరుకమును వాయిం

చెను. తోడనే వందలకొలఁది మాలవాండ్రు కొమ్ములూఁదిరి. మఱి కొందఱు తప్పెతాళ్ళగి చెవులు చిల్లులు వోవునట్లు గుండె లదరునట్లు డప్పులు వాయించిరి. ఆవాద్యములు కొంతసేపుమోగిసి యాగెను.

అప్పుడు గురువున కావేశమువచ్చెను. ఆయనకు దేవతలందఱుఁ బూనిరఁట. పూనినతోడనే వాఁడు వెఱ్ఱికేకలు వేయుచు లేచెను. లేచుటయు వాఁడు స్వర్గమున కెగిరిపోవునేమోయను భయమునఁ బిడిరాళ్ళవంటి పదుగురు మాలవాండ్రు వానిం బట్టుకొనిరి. అప్పుడు వాఁడు చిందులు ద్రొక్కుచు డమరుకములు వాయించుచు విపరీతముగ నభినయించుచు నీక్రింది విధముగ సోదిచెప్పెను. "మన నందన్నకు సంతవీధిని బెద్ద చింతచెట్టుమీఁదనున్న పొడుగుజుట్టుదయ్యము పట్టినది. అది యొకమాఱు వానిని నవ్వించును. ఒకమా తేడిపించును. ఒకసారి నిద్రపోఁగొట్టును. ఒకసారి వింతపలుకులు పలికించును. ఒకసారి నాట్యమాడించును ఔనా కాదా? యీవికారములు వాని యొద్దఁ గానఁబడుచున్నవాలేవా?" అనవుడు నచ్చటఁ జేరినమాలలందఱు "నిజమే నిజమే, నందుఁ డచ్చముగ మీరుచెప్పినట్లె చేయును. ఆహాహా! ఎంతనిజముగఁ బలుకుచున్నాఁ డయ్యా! ఈయన సోది యెంతప్రత్యక్ష మయినదయ్యా" యని పెద్దపెట్టున నఱవఁజొచ్చిరి. నందుఁడు గురువుమాటలు చెవిఁబెట్టక తక్కినవారివంకఁ జూడక మనసులో "నటరాజస్వామి! నీనాట్యము నాకుఁ జూపవా" యని ప్రార్థనము చేయుచుండెను. అంతట గురువు మఱల నిట్లుపలికెను. "మనదేవతల కందఱకు నందునిమీఁదఁ గోపమువచ్చినది. నూఱు గొఱ్ఱెలను రెండువందల కోళ్ళను నల్లకురుపనుకు తోడిదేవతలకు బలి యిచ్చి నూఱుకడవలకల్లు నైవేద్యము పెట్టినపక్షమున నందునకు దయ్యము వదలిపోవును." అని పలికి సోదిచాలించి గురువు నేలఁ బడిపోయెను. అంతట దృఢశరీరులగు పదుచు మాలవాండ్రు కొంద

లుం నాట్యముసేయ నారంభించి కిచ్చిపాటలు పాడిరి. ఆపాటల తాత్పర్య మాకిట్టిందఁ బొందుపఱచు చున్నాఁడను. "ఓ పిడారీ! నీవు మహాపాలములుఁ దోఁటలుఁ గాచు దేవతవు. పాప మీనందుని గావుము. ఓ నల్లని వీరన్నా! ఓ పెద్దతల వీరన్నా! మేము మీపా దములు నాశ్రయించుచున్నాము. నందుని రక్షింపుము. ఓ బలము గల యిరులన్! నీవు శూరుఁడవు. పొట్టనిండ మేఁకలను బెట్టెదము. నందుని రక్షింపుము" అని యర్థమువచ్చు పాటలువారు పాడుచుండ నం దుఁడు "నా దైవము నటరాజస్వామి. అతఁడు తప్ప నన్ను రక్షింపఁ గలవారెవ్వరు? బ్రహ్మాండమంతయు నిండువానికి పెద్దతలలు పొట్టలు పెట్టుచున్నారా? అవియన్నియు దయ్యములుగాని దేవతలుకావు. మహాత్ములారా! నమ్మిచెడిపోవకుఁ" డని యర్థమువచ్చు పాటలు పాడుచుండెను. చండాలు రాయుత్సాహములో నందుని మాటలు పాటలు వినిపించుకొనలేదు. ఆనాట్యమైనపిదప దారుణమగు జంతు బలి ప్రారంభమయ్యె. వందలకొలఁది కోళ్ళను, మేఁకలను, గొఱియ లను నిష్కరుణముగాఁజంపి యాతావు నెత్తురుకొలను చేసిరి. అతి ఘోరమైన యా జంతుహింసచూచి భరింపలేక నందుఁడు దుర్వ్యా పారమునుండి తొలఁగుఁడని యనేకవిధముల వారికి నయమున భయ మునఁ జెప్పి యాదుష్కర్మము మాన్పింపఁదలఁచెను. కాని వాని హితోపదేశమంతయు బూడిదలోఁ బోసిన పన్నీరయ్యెను. వాని పలుకుల నాదరింపకపోవుటయేగాక మీఁదుమిక్కిలి వారు "వానిని బట్టిన దయ్యము వదలక యట్లు పేలించుచున్న" దని పలికిరి. ఆహింస వారు మాననందున నందుఁ డచ్చోటువాసి వేఱొకయెడకుఁ బోయి వారినామహార్ఖతోవాపి రక్షింపుమని యీశ్వరునిఁ బ్రార్థించెను.

నందుని హృదయము చిదంబరమునకుఁ బోయి నటరాజ స్వామి దర్శనము చేయవలయునని మునుపటికంటె నెక్కుడుగ నుబ

లాటము పడఁజొచ్చెను. అభిలాష మణఁచుకొనలేక యెట్టకేల కతఁడు చిదంబరము పోవుటకుఁ దనకు సెలవిమ్మని యజమానుఁడగు బ్రాహ్మణునడుగ నిశ్చయించుకొనెను. అంతలో మాలపెద్ద లందఱు మరల సభచేసి యెన్ని మేఁకల బలియిచ్చిన నెన్ని జాతరలు చేసిన నందుని బట్టిన పిశాచము వదలలేదని విచారించి వాని యజమానుఁడగు బ్రాహ్మణునియొద్దకుఁ బోయి నందుఁడు చిదంబరము పోవుటకు సెలవియ్యవద్దని వానిని బ్రార్థించిరి. వారి మొఱలు విని బ్రాహ్మణుఁడు నట్లేయని వారి కభయమిచ్చెను. అనంతరము నందుఁడుపోయి చిదంబరయాత్ర కనుజ్ఞ నిమ్మని యజమానుని వేఁడుకొనెను. అతని మనవి వినినతోడనే యాబ్రాహ్మణున కెక్కడలేని కోపమువచ్చెను. వచ్చుటయు నవ్విప్రుఁడు "ఓరిదొంగ! ఓరిమాలకుంకా! నీవు చిదంబరము వెళ్ళుదువా? నీవు బ్రాహ్మణుఁడవు కాఁ దలంచుచున్నావా యేమి? నీబ్రతుకునకుఁ జిదంబరము వెళ్ళుట కూడనా? చాలుఁజాలు. నోరు మూసికొని పడియుండుము. లేకున్న వీపు వదులఁ గొట్టించెదను జాగ్రత్త" యని మఱియు ననేకవిధంబుల దూషించెను. తన యజమానుఁ డంత క్రూరుఁడై ప్రవర్తించుట చూచి నందుఁడు చేయునదేమియు లేక కన్నుల నీరువెట్టుకొని యచ్చోటువిడిచి యొకచెట్టు క్రిందఁ గూర్చుండి వెక్కివెక్కి యేడ్చి భగవంతు నుద్దేశించి తనలోఁ దానిట్లనుకొనియె. "ఓయీశ్వరా! నీవెంత నిర్దయుఁడవైతివి. నేనా బ్రాహ్మణుని నిందింపవలసిన పనిలేదు. పరమాణువైనను నీయాజ్ఞ లేక కదలదు. కావున బ్రాహ్మణుఁడును నీయాజ్ఞాబలముననే యట్లు పలికెను. వీఁడొక కడజాతివాఁడు. దయ కనర్హుఁడు నని తలఁచి దిక్కుమాలిన యీనిర్భాగ్యుని విడిచితివి. నాకేవిధమైన గొప్పతనము లేదు. ధనములేదు. చక్కఁదనములేదు. పేరు ప్రతిష్ఠలులేవు. విద్య లేదు. ఈలోపములకుఁ దోడుగ నేను మాలవాఁడనై పుట్టి యొక్క

క్రింద బానిసనై యుంటిని. నీయనుగ్రహ మున్నంతకాలము నాకి వన్నియుఁ గొఱఁతలుగాఁ గనఁబడలేదు. నేఁడు నీయనుగ్రహము కొఱఁతయగుటచే నన్నికొఱఁతలుఁ గనఁబడుచున్నవి. ఓ యీశ్వరా! నే నెట్లు బ్రతుకుదు."

ఇట్లు కొంతసేపు విచారించి "ఛీ! యీపాడుశరీరము విడిచి యీశ్వర సన్నిధానమునే చేరుదు"నని యావేశముతో నొకసారి యాత్మహత్యఁ జేసికొనఁదలంచె. కాని యాశాపాశము వెనుకకు లాగుటచే నించుక శాంతించి యాదుష్ప్రయత్నము మాని "నాకేది కావలయునో యది నాకన్న భగవంతుఁడే బాగుగ నెఱుఁగును. కావున నన్నివిషయములలో వానియాజ్ఞకే బద్ధుఁడనై యుండెద. నేను పోఁగరుఁబోతునై యజమానునియాజ్ఞ తిరస్కారము చేయుచున్నాను. నేను వినయవంతుఁడనై స్వామియాజ్ఞ శిరసావహింపనిచో నాపై భగవంతున కనుగ్రహము కలుగునా? బ్రాహ్మణుఁ డిప్పుడు నన్ను నివారించినను చిదంబరము బోవ సర్హుఁడ నైనప్పుడు నన్నుఁ బోవ నిచ్చునని వెండియుఁ దనలో వితర్కించుకొని యూరకుండెను.

అట్లు కొన్నిదినములు గడచినపిదప మరల నందుఁడు యజమానుని దర్శనముచేసి మునుపటికన్న నెక్కుడువినయముతోఁ జిదంబరయాత్ర కనుమతివేఁడెను. యజమానుఁడు తొల్లింటికంటె నెక్కువ తిట్లుతిట్టి వానికోరిక నిరాకరించెను. ఈసారి నందుఁడు వెనుకటియట్లు దుఃఖింపక తాను నటరాజస్వామి దర్శనము చేయుట కనర్హుఁడననియు మునుపటికంటె నెక్కుడు భక్తి వినయము పావనత మొదలగునవి తనయందు నెలకొనఁ జేసికొనుట యావశ్యక మనియుఁ దలంచి యట్లుండుటకుఁ బ్రయత్నింపఁదొడఁగెను. నిదురవోయిన కాలముతప్పఁ దక్కిన కాలమంతయు నతఁ డీశ్వరధ్యానమునందే గడపుచు నడుమనడుమఁ దనమీఁద ననుగ్రహము లేదని విలపించుచు

నొక్కొకయెడ సృష్టి వైచిత్ర్యములఁ జూచి బ్రహ్మానంద భరితుఁడై యీశ్వర మహిమం గొనియాడి నాట్యమాడుచు నొక్కనిముసమైన వృథసేయక యుండెను. నదులు కొండలు పక్షులు వృక్షములు మొదలగు సమస్తపదార్థములు గూడ నీశ్వర స్వరూపములే యని భావించి యతఁడు చెట్లం గౌఁగిలించుకొనును. ఎగిరెడు పక్షులతోఁ బరుగెత్తును. పారెడు నదులం గొనియాడును. ఇంకను బలుతెఱంగుల విలక్షణముగఁ బ్రవర్తించుచుండును.

ఈవికారములంగాంచి వానిచుట్టములు నిశ్చయముగఁ బిచ్చియెత్తెనని నమ్మిరి. నమ్మి యాపరమమూర్ఖులు వాని కనేక చికిత్సలు చేయించి కాలుసేతులు గట్టి తిట్టి కొట్టి పలువిధముల బాధించిరి. అన్ని బాధలు పడినప్పుడైనను నందుఁడు నటరాజస్వామిని మఱవక బాధించువారి దూషింపక బాధ దుస్సహమైనప్పుడు "సర్వేశ్వరా! ఈతప్పు వారిదికాదు. శివునియాజ్ఞలేక చీమయైనఁ గుట్టదుకదా. ఇది నీమహిమయే కావున వీరిపై నలుగక యనుగ్రహింపు" మని నెనరు గలిగి వారివిషయమున నీశ్వరు వేఁడుచుండును. అతనికిఁ గల భూతదయ యిట్టిదని మనము వర్ణింపఁ జాలము.

అతఁడు చీమలకుఁ బంచదార పెట్టును. నేలనుండు పురుగు లెండకు మాఁడి చచ్చునని జాలినొంది వానిని నీడకుఁ గొని పోవును. పక్షు లవ్యక్తమధురముగాఁ గూయునప్పుడు వానితోఁ గలసి కూయును. ఇట్లతఁడుచేయు విపరీతచేష్టలు చూచి వానిచుట్టములు నిరంతరము వానితోనే తిరుగుచుఁ గాలముగడుపుచు వచ్చినందున యజమానుని పనిలోనికిఁ బోవుటకు వారికిఁదీరిక లేకపోయెను. చేలుకోఁతకువచ్చినందున బ్రాహ్మణుఁడు పాలేళ్ళనందఱఁబిలిచి పాలుమాలిన కతమున వారిందొలఁగించి నందుఁ డేమనునో చూడవలయునని వానిఁ బిలిపించెను. నందుఁడు యజమానునియెదుటికిఁ బోయి చేతులుజోడిం

చుకొని మిక్కిలి వినయముగ నిలిచెను. బ్రాహ్మణుఁడు వాని వినయము భక్తిఁజూచి మిక్కిలి సంతసించి నందుఁడు వానిచుట్టము లనుకొనినట్లు పిచ్చివాఁడుగాఁడనియుఁ బరమభాగవతోత్తముఁడనియు వాని విశేషభక్తిని వెఱ్ఱితనముగా వానిచుట్టములు భావించిరనియు బ్రాహ్మణుఁడు గ్రహించె వెనుక నందుఁడు చిదంబరమునకుఁబోవ రెండుసారులు సెలవడుగుటయు, రెండుసారులు దాను నిరాకరించుటయుఁ దలంచి బ్రాహ్మణుఁడు విచారించి దీనముఖముతోఁ దన యెట్టయెదుట నిలిచి యుండిన యాతనిని మీఁద జాలిపొడమ నిట్లనియె. "నందా! నీవు మిక్కిలి మంచివాఁడవేకాని యీవఱకుఁ గొంచెము చెడుత్రోవలం బడుచుంటివి. కొన్నాళ్ళనుండి నీవు సరిగాఁ బనిచేయుట లేదు. చిదంబరము వెళ్ళుటకు నీకు సెలవిచ్చెదనుగాని ముందుగా నీవు నీచుట్టములుగలిసి చేనుఁగోసి కుప్పవేయుఁడు." ఆపలుకు లమృతధారవలె హాయిగాఁ జెవులఁబడుటయు నందుఁడు పరమానందభరితుఁడై లేడిలాగున గంతులు వేయుచుఁ బొలమునొద్దకుఁబోయి కొన్నిగంటలలో మఱల యజమానుని యింటికివచ్చి బ్రాహ్మణునిఁ బిలిచెను. అంతలో నేల రావలసి వచ్చెనని యజమానుఁడు బయటికివచ్చి వానినడుగ నందుఁడు "స్వామీ! నాతో నొక్కసారి పొలమునకు దయచేయవలయు" నని వాని వెంటఁబెట్టుకొని పొలమునకుఁ బోయెను.

బ్రాహ్మణుఁడు పొలమునకుఁబోయి చూచునప్పటికి నందుఁడు చేను కోయుటయుఁ గోసి కుప్పవేయుటయు నయ్యెను. ధాన్యపుకుప్ప బంగారుకుప్పవలెఁ గన్నులపండువుగ నుండెను. ఒక్కజాములో నెవరిసాయములేక యొక్కమనుష్యుఁడు చేనుఁగోయుట యసంభవమని తన యెదుటనున్నది కలయా నిక్కువమా యని సందేహించుచు బ్రాహ్మణుఁడు కొండొకసేపు రిచ్చవడి చూచెను. చూచిచూచి బ్రాహ్మణుఁ డట్టకేలకది నిక్కువమేయని నమ్మి నందుఁడు పరమభాగవతో

త్తముఁ డగుటచేతఁ జేను పరమేశ్వరుఁడే తనభక్తునికిఁ బదులుగాఁ గోసియుండవచ్చునని తలంచి మెల్లఁగా వానితో నిట్లనియె. "నంద! నీ వొక్కఁడవు గాదుగదా నీచుట్టము లందఱుఁ గలసినను నేఁడీ పని చేయుట యసాధ్యము. భగవంతుఁడు నీద్వారా నాపాలములో మహా మహిమఁ జూపెను. ఇది నీభక్తికి భగవంతుఁడు మెచ్చినమెప్పు. నీ మాటలనమ్మక పరమమూర్ఖులమగు మాకు దేవుఁ డీరీతిగా దృష్టాంతముఁజూపెను. నందా! నేను చూచినంతవఱకు నీవంటి పరమభాగవతోత్తముఁడు సజ్జనుఁడు లేఁడు. దైవభక్తుఁడగు నిన్ను బానిసను జేసి నేనెంతపాపము చేసికొంటిని. ఈనిముసము మొదలు నేను నీబానిసను. నాధనమంతయు నీది. భక్తవత్సలుఁడగు పరమేశ్వరునితో పరమపాతకి నగు నన్నుఁగూర్చి యించుక విన్నవింపుము" చేను మిక్కిలి త్వరలోఁ గోయఁబడుటచే భగవంతుఁడేవచ్చి కోసెనని బ్రాహ్మణుఁ డభిప్రాయపడెను. భగవంతుఁడు చేనుకోయుట యసంభవముగదా! అటులయిన నిది యెట్లు జరిగెను? భక్తిపరవశుఁ డయిన మనుష్యుఁడు వెఱ్ఱిశక్తిఁ దెచ్చుకొని దుర్ఘటములగు కార్యములఁ జేయవచ్చును.

చేనువేగముగఁ గోసినపక్షమున బ్రాహ్మణుఁడు తన్నుఁ జిదంబరమునకుఁ బోనిచ్చునని నందుఁడు భక్తిపరవశుఁడయి యెక్కడలేని శక్తిఁ దెచ్చుకొని నమ్మఁటకు వీలులేనంతత్వరలోఁ జేనుఁగోసియుండవచ్చును. ఒకటి రెండుదినములలో నందుఁడు చేనుఁగోసియుండఁగా జాములోఁ గోసినాఁడని గంటలోఁ గోసినాఁడని లోకములో మహిమలు వెల్లడియయి యుండవచ్చును.

నందునకు భగవంతుఁడు ప్రత్యక్షమయ్యెనని దృఢముగానమ్మి నందున బ్రాహ్మణుఁడు దానగ్రవర్ణజుఁడననియు నతఁడు,కడజాతివాఁడనియు సందేహింపక పాలేరుకాళ్ళకు నమస్కరించెను. హిందువు

లలో వర్ణభేదము విశేషముగ నుండినను వారు తక్కువజాతివారిలో జ్ఞానులెవరైనఁ గనఁబడినప్పుడు వారికి నమస్కరించుటయు గౌరవము సేయుటయుఁగలదు. వైష్ణవుల గురువులగు పన్నిద్దఱాళ్వార్లలోఁ దక్కువజాతివారు కొందఱు కలరు. అయినను వారి నిప్పటికి దేవతార్చన పేటికలలోఁ బెట్టి బ్రాహ్మణోత్తము లనేకులు ప్రతిదినముఁ బూజించుచున్నారు. యజమానుఁడు తనకు నమస్కరించినతోడనే నందుఁడు భయసంభ్రమంబులు పెనఁగొన వడివడి వానిని లేవనెత్తి "స్వామీ! యీమాలబానిసకు మ్రొక్కుటకు మీరేమి పాపము చేసినా" రని యడిగెను. అందుకు బ్రాహ్మణుఁడిట్లనియె. "నందా! నీవు మాలవుగావు. బానిసవు గావు. నీవు పరమపవిత్రుఁడవు. పరమభక్తుఁడవు. నీవు చిదంబరము వెళ్ళుము. వెళ్ళకముందు నన్ను దీవింపుము. నేను నీకుఁ జేసిన యవజ్ఞలఁ దలఁపక క్షమింపుము." అని యూరకుండక నందుని రెండుచేతులుఁ బట్టుకొని బ్రాహ్మణుఁడు తన తలమీఁదఁ బెట్టుకొని కడసారి తన్నాశీర్వదించి హితోపదేశముఁ జేసి పొమ్మని వానిని బ్రార్థించెను.

అనవుడు నందుఁ డిట్లనియె. "అయ్యా! "నేను జెప్పవలసిన దేమున్నది? హృదయమున భగవద్భక్తి నిలుపుము. అతనిమీఁద భారమువైచి నీయాలుబిడ్డలను బొలమును సొమ్మును గాఁపాడుకొనుము. నీవంటివారికిఁ జదువురాని మూర్ఖుఁడను నేనింతకంటె నేమి చెప్పఁగలను." ఆయుపదేశమువిని బ్రాహ్మణుఁడు భక్తిరసముఁ గ్రక్కుచున్న వాని ముగము దేఱిపాఱఁజూచి మరల వానికి నమస్కరించి స్తోత్రముచేసి మంచిమాటలుచెప్పి పంపెను. నందుఁడు బ్రాహ్మణునకుఁ మాటిమాటికి నమస్కరించెను. యజమానుఁడు విడువలేక విడువలేక విడిచి సాగిపోయెను. కొన్నియడుగులు సాగిపోయినపిదప బ్రాహ్మణుఁడు పాలేరు నెలుఁగెత్తి పిలిచి నిలునిలుమని పరుగెత్తుకొని పోయి

వగర్చుచు "నందా! మరల నెప్పుడువచ్చెద" వని యడిగెను. అనవుడు యజమానునకు సేవకుఁ డిట్లనియె. "అయ్యా! యింక నేను వచ్చుట యెక్కడిది? ఇదియే కడసారి చూపు. చిదంబరము వెళ్ళినవాఁడు మరలవచ్చునా? ఈదుష్ప్రపంచమును మరల నేజూడఁజాల. ఇంక నేను మీకుఁ గనఁబడను." ఆమాటయర్థము బ్రాహ్మణుఁడు గ్రహింపలేక పోయెను.

యజమానుఁడు విడుచుటయే తడవుగ నందుఁడు వేఁటకాని వలనుండి తప్పించుకొన్న లేడియట్లు కొడుకునుగన్న గొడ్రాలిలాగు చూపువడసిన గ్రుడ్డివానివలె మేరమీరిన సంతోషమంది చిదంబరమునకుఁ బయలుదేఱెను. మీనాక్షీ దేవి యల్లుఁడైన నటరాజస్వామి నెప్పుడుచూతు నెపుడుచూతునని యూటలూరుచు నటరాజనటరాజ నర్తనసుందరా! యని పాటలుపాడుచు నందుఁడు రెండవతలంపులేక పుట్టలుదాఁటి పుంతలుగడచి చేఁగట్లులెక్కి చెట్లనీడలఁజొక్కి తన యెఱనిమిత్తముపోవు బెబ్బులియట్టు చిదంబరమునకుఁ బోవుచుంట వానిమదిలో నున్నభక్తి యనుభవమునఁ దెలియవలయునేకాని వర్ణింపనలవికాదు. అతఁడప్పుడు పాడినపాట సరిగా నిచ్చుటవ్రాయుటకు వీలు లేదుగాని దానితాత్పర్య మీక్రింది పద్యమునఁ బొందుపఱచెద.

సీ. నటరాజ నటరాజ నర్తనసుందర
నటరాజ నటరాజ నాధనంబ
నటరాజ నటరాజ నాపాలిదైవమా
నటరాజ నటరాజ నాదుతండ్రి
నీనామకీర్తన నీపాదములభక్తి
చింతలన్నియుఁ బాపుచేవమందు
భవరోగములనెల్లఁ బాలార్చు పెనుమందు
వెఱపులన్నియుఁదీర్చు వింతమందు

తే. గీ. మా మనోవ్యాధు లడఁగించు మంచిమందు
యెల్ల కాలంబు బ్రతికించు నింపుమందు,
ఐహికంబుల మఱపించు నట్టిమందు
దేవ! నటరాజ! నటరాజ! దీనవరద!

అట్టు నందుఁడు పాటలు పాడుచుఁ బోవుచుండ భూమి కంపించెనఁట. వృక్షములల్లాడెనఁట. ఆకసమునుండి వర్షము గురిసెనఁట. నందుఁడు తన్నుఁదానెఱుఁగక వివశుఁడయి యొకసారి నవ్వుచు నొకసారి యేడ్చుచు నేల నడుగు సరిగ నిడక లేడిలాగునఁ బయనము చేసెను. ఒక్కజాములో నూఱుపుట్ల నేలలో నున్న చేనుఁ గోసిన యానందునకు స్వగ్రామమగు అధనూరునుండి కావేరినది పాయయగు కొల్లడముయొద్దకుఁబోవుట యెంతపని. అతఁడా ప్రయాణమవలీలఁ జేసెను. అప్పుడు కొల్లడమునది నిండువరదలమీఁద నుండెను.

నందుని మనస్సులో నానందతరంగము లుప్పొంగినట్లే యానదిలో మహాతరంగములు పొడమి పెల్లెగసి పడుచుండెను. ఎట్టయెదుటఁ గానఁబడుచుండిన చిదంబరగోపురమునుజూచి నందుఁడు పరవశుఁడయినట్లే యానదికూడఁ బరవశయై యావిధమున విజృంభించుచున్నదాయని జను లనుకొనునట్లు ప్రవాహ పూరితమై యుండెను. నటరాజస్వామి కరుణారసమువంటి యాయేటి వరదంజూచి నందుఁడు తనపాలిదైవ మానదిలో నుండెనని నటరాట నటరాజ యని నాట్యమాడి యొడలు తెలియక గంతులువేయసాగెను. అంతలో నొక చిన్న నావ యచటికి వచ్చెను. దానిమీఁద మేనెల్లఁ దెల్లని బూడిదఁ బూసికొని పడవ నడపు మనుష్యుఁడొకఁడు కూర్చుండెను. వానిశరీరమునుండి చెమటలు సెలయేళ్ళవలెఁ బ్రవహించుచు వచ్చెను. నందుఁడు వానింజూచి కేవుసిచ్చుట కొప్పుకొని యాపడవనెక్కినది మొదలుకొని చిత్రవిచిత్రముగా నటరాజస్వామిని స్తవముచేయుచు నాట్యము

దొరకఁ నారంభించెను. యేటిమీఁద నావ నాట్యమాడఁజొచ్చెను. నావమీఁద నందుఁడు నృత్యముచేయసాగెను. నందునిజూచి నావలో నున్న జనులు నాట్యమాడ నారంభించిరి. వారాడఁజూచి పడవవాఁడు తెడ్డొకమూలఁ బాఱవైచి నర్తన మారంభించెను. ఎవ్వరు నడపక యే పడవ పదినిమిషములలో నొడ్డుసేరెను.

చేరినతోడనే నందుఁడు నావమీఁదనుండి క్రిందికిదుమికిపడవ కేవిచ్చుటకుఁ దన జాలెములోఁ దాను పాటుపడి సంపాదించినడబ్బు లేమైన నున్నవేమోయని వెదకికొనుచుండఁ బడవవాఁ డదిగ్రహించి "స్వామీ! నీవు మాలవాఁడవు కావు. నిన్ను దేవుఁడు తనలో నైక్యము చేసికొనెను. నేను మాలవాఁడను. నీభక్తుఁడను. నేను బడవకేవు నీయొద్దఁబుచ్చుకొనఁజాల"నని మ్రొక్కిపలికెను. పడవలోఁ గూర్చుండిన మనుష్యులందఱు నందునితోఁ బదినిమిషములుమాత్రమే సహవాసముచేసియు నాస్వల్పకాలములోనే యతఁడు మహాత్ముఁడని గ్రహించి వానికి భక్తులైరి. పడవవాఁడు తనపడవవదలి వాని నాశ్రయించెను. వర్తకుఁడు తనసరకుల నావలనైచి వానికడ నిలిచె. కాఁపువాఁడు తననాగలిమీఁద దృష్టిబోనీయక నందునే చూడసాగెను. అందఱు గుంపుఁ గూడి నడుమ నందుని నిలిపి యతనితోఁగూడి నాట్యముచేయ నారంభించిరి. చిదంబరగోపురము సుందరమై గంభీరమై వారికన్నులకుఁ గానఁబడెను. ఆగోపురమును జూచినకొలఁది నందుని యానందము మేరమీఱ నతఁడు మేనుమఱచి క్రొత్తశిష్యులతోఁ గలసి బడలికలేక యొక్కవగుపనే నాట్యముఁ ద్రొక్కెను. అట్లు నాట్యముసేయుచు నెడనెడ గోపురమువంక దృష్టి నిగిడించి భక్తితత్పరుఁడై యిట్లని నటరాజును స్తుతియించుచుండు. "ఓ దేవా! ఎవరి యాజ్ఞవలన నీబ్రహ్మాండములు క్రమము దప్పక తిరుగుచున్నవో, యెవనివలె నీయాకాశము విశ్వమంతయు నిండియున్నదో, ఎవనిమ

హీనము నీపర్వతములు, నదులు, వృక్షములు చాటుచున్నవో యట్టి నిన్నుఁ దెలిసికొనుటకుఁ జిన్నదోమకన్న హీనుఁడనగు నాకుశక్యమా! ఈఁగకన్న నధముఁడనగు నేనునీచేఁ సృష్టింపఁబడిన మహాసముద్రములోని జలబిందువు మాత్రమైనఁ జేయనుగదా! ఆజలబిందువు సయితము నాకంటె మిక్కిలి గొప్పది. గ్రీష్మకాలమందలి ప్రచండసూర్యతాపమును వర్షకాలమందలి చల్లనివానను సమానముగ భరించు నిసుకరేణువు సయితము నాకంటె నెక్కువదై నీకటాక్షమునకుఁ బాత్రమై యున్నది గదా? అనేకచంద్రమండలములు, సూర్యమండలములు, మహాసముద్రములు, పర్వతములు, నదీనదములు, మహారణ్యములు మొదలగువానితో నిండిన యీబ్రహ్మాండగేహమున కధిపతివైన యోపరమయోగీ! నీసృష్టికి నేనెంతవాఁడను. ఓ దేవదేవా! నాకన్నులయెదుట నున్న నీగోపురమునలె నేనును నిశ్చలుఁడనై నిలిచి మహాకాశమునంకఁ జూచుచు ఝంఝామారుతములు వీచినను లెక్కసేయక యుండువాఁడ.

అట్లు క్రీర్తించి నందుఁడు వారలఁ గలిసి మఱికొన్ని యడుగులదూరము ముందు కరిగెను. అప్పుడు గోపురముయొక్క యడుగు భాగము దేవాలయద్వారము వారికన్నులకుఁ గానన య్యెను. అప్పుడు నందుఁ డినుమడించిన యానందముతో నీక్రిందివిధమునఁ బాడెను. "ఇదిగోఁ గైలాసద్వారము. ఇదిమంచివారలకొఱకుఁ దెఱచియుండు ద్వారము, సత్పురుషుఁడు తిరిగిరాని ద్వారము. తొల్లిమణిక్కారను మహాత్ముఁడుకోవెలప్రతిధ్వని నేయునట్లు దివ్యగీతములు పాడుచుఁ బ్రవేశించిన ద్వారము. అప్పారను పరమయోగి వేదఘోషము సేయుచుఁ జొరఁబడిన ద్వారము. ఓమిత్రులార! బంధువులార! ఇక్కడనే యీశ్వరుఁ డున్నాఁడు. ఇక్కడనేలేఁడు. ఇక్కడనే భగవంతుఁడు సాకారుఁడై యున్నాఁడు. ఇక్కడనే నిరాకారుఁడయి యున్నాఁడు.

ఇందే యతఁడు నాట్యముసేయు, నిందేయతఁడు నిశ్చలుఁడై యుండు ను. ఇచ్చటనే మూర్ఖులు జ్ఞానవంతు లగుదురు. జ్ఞానులు మూర్ఖులగు దురు. ఇచ్చటనే యీశ్వరుఁ డాకాశమై జ్యోతియై యున్నవాఁడు. ఈదేవుఁడే సృష్టికర్త ప్రళయకారుఁడు." ఈవిధమున స్తోత్రముచేయు చు వారు పావనమగు చిదంబరక్షేత్రముఁ బ్రవేశించి వికసింపని తామ రపువ్వుచుట్టు జుంజుమ్మని తుమ్మెదలు మ్రోయుచుం దిరుగునట్లు పాటలుపాడుచు గ్రామముచుట్టుం బ్రదక్షిణముచేసిరి. ఆదేవాలయ మున కధిపతులై రెండువేల తొమ్మిదివందల తొంబదితొమ్మిది దీక్షి తారులుండిరి. నటరాజస్వామితోఁగలిసి మూఁడువేలదీక్షితారు లగు దురు. దీక్షితారనఁగా బ్రాహ్మణగురువు. ఆనాఁటి బ్రాహ్మణులు సంస్కృతద్రావిడములు వేదశాస్త్రములు విపులముగఁ జదువుకొని విద్యకుఁ దోడుగ సత్ప్రవర్తన గలిగి యోగ్యతనే గౌరవించుచు వి భూతి పిండికట్లు పిల్లజుట్టుమాత్రమే కలిగి బ్రాహ్మణవేషధారులగు నీకాలపు బ్రాహ్మణులతో నెందును బోలిక లేకయుండిరి. ఆదీక్షితా రులు నందునివెంటవచ్చి వానికంటె నగ్రవర్ణము వారయ్యు వాని కంటె నధములుగాఁ దమ్ముభావించుకొని వానితోపాటు గుడి ప్రవే శింపక యున్న యనుచరులను జూచి యాశ్చర్యము నొందిరి. అందుఁ గొందఱు నందుని మొగమున దేటపడుచున్న బ్రహ్మజ్ఞానమును వాని యందలి యీశ్వర తేజస్సునుం గనిపెట్టిరి. నందుఁడు, వాని శిష్యులు బాడినకీర్తనల శ్రావ్యముగ నాలకించిరి.

ఆప్రదక్షిణములు చేయునపుడు నందుని యుత్సాహము మును పటికంటె వేయి రెట్లధికమయ్యెను. వాని మొగమున వికాసము హె చ్చెను. అదిశరత్కాలము. నందుఁడు ప్రదక్షిణము చేయునప్పటికి సాయంకాలమయ్యెను. ఆదినము కార్తికశుద్ధద్వాదశి యగుటచే నాఁటిరాత్రి యాకాశసరోవరమధ్యమున మొలచిన తెల్లతామరపువ్వు

చందంబునఁ జందమామ యుదయించి మహీమండలమంతయుఁజల్లని కిరణముల వ్యాపింపఁ జేసి చూచువారలను మహానందసముద్రమున నోలలాడించెను. ఆ చంద్రమండలమునుఁ జూచి నందుఁడు లోని యానంద ముప్పొంగఁ "జందమామ! చందమామ! నన్నుఁ దెలిసికొనెడు దారిఁ జూపు చందమామ" యని పాటలు పాడెనఁట. తక్కినశిష్యులందఱు వానితోఁ గలిసి పాడిరి. అతఁడా సమయమునఁ బాడినపాట లనేకములు కలవు. అవి ద్రావిడభాషలో నుండుటచేత నిందుదహరించుటకు వీలులేదు. చిదంబరములో నడుగు పెట్టినది మొదలు నందుఁడు మూర్తీభవించిన భక్తిరసమో యన్నట్లు తనశిష్యులతోఁ గలిసి మూఁడుదినము లహోరాత్రములు విను కువిరామములేక నాట్యమాడి పాటలుపాడి భగవత్కైంకర్యము చేసెను. మూఁడవనాఁటి రాత్రి చిదంబరములోనున్న దీక్షితారులం దఱకు నొక్కసారియే స్వప్నము కలిగెనఁట. ఆస్వప్నములో నట రాజస్వామి సాక్షాత్కరించినందుఁడు మాలవాఁడయ్యు మహాభక్తుఁ డగుటచే వానిని నిరాకరింపక బ్రాహ్మణోత్తమునిగ భావింపవలయు నని యాదేశించెనఁట. మఱునాఁడుదయమున దీక్షితారులందఱుఁ గాలకృత్యములం దీర్చుకొని స్నానములఁజేసి యనుష్ఠానముల నిర్వర్తించుకొని మొగముల విబూదిపిండికట్లు మెఱయ మెడల రుద్రాక్షమాలికలు వ్రేల దేవాలయమునకుఁ బోయి సభచేసిరి. ఆసభలో నప్పయ్యదీక్షితా రను వృద్ధబ్రాహ్మణుఁడు లేచి తనకు నటరాజ స్వామి స్వప్నములోఁ బ్రత్యక్షమై యగ్నిస్నానముచేయించినందుని బ్రాహ్మణులలోఁ గలుపుకొనవచ్చునని పలికినట్లు సభాసదులకు విన్నవించెను. వయసున నతనికిఁ గనిష్ఠుఁడగుచున్న దీక్షితారు తనకుఁ గూడ నప్పయ్య దీక్షితారునకుఁ బోలె కలవచ్చెనని విన్నవించెను. అంతట సుబ్బదీక్షితారు లేచి పెయిరువురు పెద్దలకు నమస్కరించి

తనకుఁగూడ నట్టికలయె వచ్చెనని చెప్పి స్వప్నసామ్యమున కచ్చెరు వడెను. నటరాజదీక్షితారు నట్లే చేసెను. అనంతరము దీక్షితారు లొక్కరొక్కరె లేచి భగవంతుఁడు తమకుఁగూడ నట్లే యాదేశించె నని చెప్పిరి. అంతట దీక్షితారు లందఱు మిట్టమధ్యాహ్నము మిడి మిడి యెండలో నొక పవిత్రమైన యగ్ని నిర్మించిరి. ఈనడుమ నందుఁడు భక్తివిశేషముచే మూర్ఛిల్లి యెప్పుడెప్పుడే మేలుకాంచి "నటరాజస్వామి బంగారుపాదములసన్నిధికి నేఁ బోవుచున్నాఁడ" నని యొకపాటపాడసాగెను. ఆపాట ముగిసినపిదప నందుఁడు మఱియొక పాట పాడఁబోవ నెంతకాలము ప్రార్థించినను నటరాజు దర్శనమీయనందుకుఁ జింతాక్రాంతుఁడు కాఁగా గానముచేయుటకు దుఃఖముచేత గొంతు స్వాధీనము గాకపోయెను. అంతలో దీక్షితారులు వానికడకుఁ బోయి యతఁడు విస్మయమొందునట్లు వానికి నమస్కరించి తమయద్భుత స్వప్నమెఱిఁగించి తమ సిద్ధముచేసిన యగ్నిహోత్రమున్న దక్షిణవీధికిఁ గొంపోయిరి. పరమభాగవతసత్తముఁడగు నందుఁడు తన్నిమిత్త మేర్పడిన యగ్నిహోత్రమును జూచి యదియు నటరాజస్వామి యనియే భావించి "నాతండ్రియగు నీశ్వరుని పాదములు చందమామ కిరణములకన్న మలయమారుతముకన్నఁ దేటయూట నీటికన్నఁ దుమ్మెద ఝంకారములతోనుండు తమ్మిపూలకన్నఁ జల్లఁగా నున్న" వని పలుకుచు నాయగ్నిహోత్రమునం బ్రవేశించెనఁట. ప్రవేశించి మేను కాలకుండ నొకసారియైన నబ్బాయని బాధపడకుండ శరీరమునకు మచ్చయైన లేకుండఁ జెక్కుచెదరక చల్లనికోనేటిలో దిగి మరలివచ్చినట్లు నందుఁ డగ్నినుండి యీవలకు వచ్చెనఁట. వచ్చిన యాచండాల బాలునిం జూచి వేదమూర్తులవంటి బ్రాహ్మణోత్తములు దీక్షితారు లిట్లనిరఁట. నందా! నీవు పరమపవిత్రుఁడవు. నిన్నగ్ని దహింపలేదు. జలము తేదు

పలేదు. వాయు వార్పలేదు, ఖడ్గము నీమేను ప్రవేశింపలేదు. నీవు బ్రాహ్మణుఁడవు. నీలోనుండు చండాలత్వ మంతయుఁ గాలిపోయి నది. నీవిప్పు డసంపూర్ణుఁడవు. సంపూర్ణుఁడవు, నిరాకారుఁడవు। సాకారుఁడవు, నంతర్వర్తివి, బాహ్యావర్తివి. ఆకాశముకంటె విశాల రూపము గలవాఁడవనియు మహాపర్వతములకంటె నన్నతుఁడ వనియువేదములు ఘోషించుచున్నవి. నీవు స్త్రీవి కావు. పురుషుఁ డవు కావు. అచేతనుఁడవు కావు. నిన్నెవ్వ రెఱుంగలేరు. నీవు జ్ఞానాగ్నివలన దగ్ధుఁడ వైతివి. ఆమహాగ్ని భూత భవిష్యద్వర్తమానముల యందగు నీయజ్ఞానములను గాల్చివేసినది.

అట్లు బ్రాహ్మణులకు వంద్యుఁడై నందుఁడు పరమపవిత్రుఁ డయ్యెనఁట. అట్లు మానవుఁ డగ్నిహోత్రములోఁ బడి చెక్కుచెద రక బ్రతికివచ్చుట సాధ్యమగునా యని చదువరులలో ననేకులకు సంశయము కలుగవచ్చు. వారిసందేహనివారణమున కొకయుత్తర ముకలదు. నందుఁ డగ్నిహోత్రములో దుమికెనాయని మనము సందేహింపనక్కఱలేదు. మతావేశము ప్రబలమైనప్పుడు మనుష్యు లున్మత్తులవలెఁ బ్రవర్తింతురు. నోటికి శూలములు వేసికొనువారు ముండ్లపాన్పులమీఁదఁ బండుకొనువారు, మండువేసంగిలోఁ బంచాగ్ని మధ్యమునఁ దపములు సేయువారు, వర్షశీతకాలముల నీటనిలిచి నీమములు జరుపువారు, నిరాహారులై మేనుఁ గృశింపఁ జేయువారు, మెడకు గండకత్తెరలు వేసికొనువారు హిందువులలో నేఁటికి నైనను లేరు? తురకలు పీర్లపండుగలో నగ్నికుండములు చేసి పరుగు పరుగున నానిప్పుల కుప్ప మీఁద నడచి యేచేటును బొందకుండ నీవలకు వచ్చుటలేదు? ఆవిధంబుగనే నందుఁడుగూడ భగవంతుఁడే తనకుం దోడని నమ్మినవాఁ డగుటచేఁ దనయేలినవాఁ డగు నీశ్వరుఁడే తన్ను నిరపాయముగ నీవలకుఁ దోడ్కొని వచ్చునని దృఢ

విశ్వాసము గల్గి యీ నిప్పులమీఁదనుండి నడచిపోయి యుండ వచ్చును. ఈ విధముగా నగ్నిప్రవేశము జరిగియుండ వచ్చును. అంతియెకాని చాలసేపు చిచ్చులోఁ గూర్చున్నవాఁడనియు దేహము వస్త్రములుఁ గాలలేదనియు నమ్ముటకు వీలులేదు.

అట్లు పావనమైన యగ్నిం బ్రవేశించి వెలుపలకు వచ్చిన తోడనే నందునకు మనస్తాపముతీరెను. అపరిపూర్ణత్వముపోయి పరిపూర్ణత్వము వచ్చెను. దుఃఖమంతయు విచ్చు మొగ్గె సౌఖ్యము గలిగెను. తొల్లిటి మాలతనము పోయి నిజమైన బ్రాహ్మణత్వము కలిగెను. అనంతరము దీక్షితారులు స్వస్తి చెప్పుచు నందుని దేవాలయమునకుఁ దీసికొనిపోయి నటరాజస్వామిని జూపిరి. తల్లినెడఁబాసి దుఃఖపడు బాలుఁడైన జనని కనఁబడినప్పు డంతయానంద్రతతోఁ బోఁడు. ఆవు నెడఁబాసిన దూడయైనఁ దల్లిం జూచినప్పు డంతవేగముగాఁ బరుగెత్తదు. మకరందాసక్తిగల గండుతుమ్మెదయైన వికసించిన తామరపువ్వునొద్ద కంత దమకముతోఁ బోదు. నందుఁడు తన చిరమనోరథమగు నటరాజస్వామిని జూచినప్పుడు వానికిఁ గలిగిన యానందము వాని మన స్సెఱుంగును. సర్వభూతాంతర్యామియగు భగవంతుఁ డెఱుంగును. కాని మనుష్యమాత్రు లెఱుఁగరు. అది కవులు వర్ణింపలేరు. వర్ణింపఁదలఁచినను మాటలు దొరకవు. ఏతావునందుఁ దొల్లి యప్పరను మహాభక్తుఁడు నిలిచి నాస్తికులనైన యాస్తికులఁజేయు కృతులుపాడి యీశ్వరుఁబొగడెనో యేనెలవునందు మున్ను మణికాచారను సత్పురుషుఁడు నిలువంబడి యుపనిషత్తులతో మహేశ్వరుం గొనియాడెనో యేచోట భక్తసార్వభౌముఁడగు తాయమనార్ రు.నయనారవిందంబులనుండి బాష్పమకరందబిందువులుదొరగఁ దత్ప్రదేశంబు ప్రతిధ్వనులెసఁగ నీశ్వరమహిమానువర్ణనముఁ జేసెనో యేస్థలమును లోకోపకారపరాయణులగు పరమభాగవతోత్తములు

తమ పాదధూళి ప్రసారములచేతఁ బవిత్రముచేసిరో యాచోటున నిలిచి నందుఁడు కనకసభయనివ్యవహరింపఁ బడు బంగారుమండపమున గంటలు ఖంగుఖంగుమని మ్రోయుచుండ నటరాజస్వామిని గన్నులారఁజూచి చేతులార మ్రొక్కి మనసార ధ్యానించి సంతుష్టాంతరంగుఁడయ్యెను. అప్పు డప్పయ్యదీక్షితారు దీపారాధనచేసి మాలబ్రాహ్మణు నెదుటఁ బెట్టుకొని నటరాజదేవు నారాధించెను. నందుఁడు తనవంటి భక్తులకే యుక్ భక్తైకవేద్య మగు బ్రహ్మానందముతోఁ దన యేలినవానిని గన్నులదీర నొక్కసారి కౌఁగలించుకొనియెను. అప్పుడు చూచు వారందఱు మహాద్భుతము నందఁ గ్రొత్తగా మాలతనముబాసి బ్రాహ్మణుఁడైన యానందుఁడు పరమేశ్వరమహిమను గానముచేయుచు నటరాజస్వామిలో నైక్యమై సాయుజ్యముక్తిని బొందెనఁట. అప్పుడతఁడు పాడినపాట యర్థమిాక్రింది విధమున నున్నది. "నటరాజ నటరాజనాస్వామి నేను వచ్చెదనన్నుఁ గొనిపొమ్ము మనమిద్దఱ మొకటే, నీవే నేను నేనే నీవు."

అట్లు నందుఁడు పరమేశ్వరునిలో నైక్యమగుటయు, నప్పయ్యదీక్షితారు మొదలగు బ్రాహ్మణోత్తములు విస్మితులై కొంతసేపు నిశ్చేష్టులై నోట మాటరాక తెల్లపోయిచూచుచుండిరఁట. పిమ్మటఁ గొంతసేపటికి వారికిఁ దెలివివచ్చుటయు వారు నటరాజస్వామి నీక్రిందివిధమున స్తుతియించిరఁట. "నందుఁడు నీభక్తుఁడై వానిమనస్సు నీకర్పించెను. నీదాసునిభక్తిరసము పరమపావనములగు నీపాదారవిందములు కడుగు జలమయ్యెను. అతని యాత్మ నీకునైవేద్యమయ్యెను. అతని ప్రాణము నీకు హారతియయ్యెను. ఇదియొక్కనాఁడు చేసినది కాదు. బ్రతికియున్నంతకాల మతఁ డట్లు చేసెను. నీవు వేదపుష్పమకరందమవు. నీవు వేదామృతంబవు. నీవుబ్రహ్మానందమవు. నీవు మహానటుఁడవు. పరంజ్యోతివి. పరమదయాళుఁడవు. నాశనరహితుఁడవు.

ఇక్కడికి నందునికథ ముగిసినది. ఈచిన్నకథలో నద్భుతములు మహిమములుఁ గొన్ని కానఁ బడుచున్నవి. అన్నిఁటికన్న ముఖ్యమైన యద్భుతము నందుఁడు పరమేశ్వరునితో నైక్యమగుట. పురాణాదులలోఁ జెప్పఁబడిన చిత్రకథలన్నిటిని విమర్శింపక నమ్మువారికి నందుని సాయుజ్యముక్తి యద్భుతముగాఁ గానఁబడదు. కాని లోకానుభవమును జక్కఁగా గుర్తెఱిఁగి విమర్శనబుద్ధితో నీచరిత్రమును జదివినవారు మాత్రము దానిని నమ్మరు. ఈ సాయుజ్యముక్తికి విషయకమైన యథార్థస్థితి యిట్లుండవచ్చును. నందుఁడు నటరాజస్వామిదర్శనము చేసినపిదప మునుపటికంటె నెక్కుడుగ భక్తిసలుపుచు లోకవ్యవహారవిముఖుఁడై పరమేశ్వరసేవఁ జేయుచుఁ దనజీవితశేషముఁ గడపి లోకులచేత సద్యోముక్తుఁ డనిపించుకొని మరణమొంది యుండవచ్చును. అట్టిసజ్జనులు మరణమొందినప్పుడు మనవారు సర్వసాధారణముగ నతఁడు భగవంతునితో నైక్యమొందెనని చెప్పుచుందురు. అంతేకాని యొకమనుష్యుఁడు లోకులందఱుఁ జూచుచుండ నంతర్ధానము నొంది భగవంతునిలోఁ గలిసిపోవుట యసంభవము. నందునికంటె నెక్కుడు భక్తిగలవారు విశేషజ్ఞానముగలవారు నానకు చైతన్యప్రముఖులు శంకరరామానుజాదులు సయితము తక్కిన మనుష్యులవలె మృతినొందిరి. మఱియు భగవంతుని యవతారములని పురాణములలోఁ జెప్పఁబడిన శ్రీకృష్ణబలరాములు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు సైతము ప్రాకృతమనుజులట్లు కాలధర్మమునొందిరి. అటులుండ సామాన్యమనుష్యుఁడైన నందుఁడు బ్రతికియుండఁగానే సాయుజ్యముక్తిఁ బడసినాఁడనుట లోకవిరుద్ధమై యుండకమానదు. ఈయాక్షేపణము విన్నవారు కొందఱు మనపూర్వులనేకులు జీవన్ముక్తులయిరని పురాణములవల్ల వింటిమి. నందుఁడు కూడ నట్టిజీవన్ముక్తుఁడు కాఁగూడదాయని యడుగవచ్చును. జీవన్ముక్తియన నెట్టిదో

యించుక తక్కుంతము. శంకరాచార్యుడు తన ద్వాదశమంజరికా స్తోత్రముందు ఒక శ్లోకమునిట్లు వర్ణించియున్నాడు.

సత్సంగత్వే నిస్సంగత్వం।నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం।నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః॥

సజ్జన సహావాసమువల్ల నిస్సంగత్వము గలుగును. నిస్సంగత్వమువల్ల నిర్మోహత్వము గలుగును. నిర్మోహత్వమువల్ల నిశ్చలమైన యీశ్వర జ్ఞానము గలుగును. ఆనిశ్చలజ్ఞానము వల్ల బ్రతికి యుండియు ముక్తిపొందినవాడగు నని యీశ్లోకము యొక్క యర్థము. జీవన్ముక్తి యనగా బ్రతికి యుండియు ముక్తిబొందిన వాడు వోలె నేదుఃఖములేక చింతలు లేక నిరంతరము పరమానంద భరితుడై యుండు మనుష్యుడని యర్థము గాని యొక్కసారి యువ్వెత్తుగ నెగిరి స్వర్గముకెగురబడువాడని యర్థము కాదు. సజ్జనసహావాసముచేసి కాలక్షేపము జరుపుచు బ్రతికియున్నంతకాలము బ్రహ్మజ్ఞాని యైయుండుట యే జీవన్ముక్తి.

నందుని చరిత్రము జదువుటవల్ల మనము మఱియొక ముఖ్య విషయము నేర్చుకొనవచ్చును. ఈశ్వరభక్తునకు వర్ణభేదముతో నవసరములేదు. అతడు వేదములు చదువనక్కఱలేదు. శాస్త్రములు చూడనక్కఱలేదు. గంగాదిపుణ్యనదులలో స్నానముచేయనక్కఱలేదు. భక్తియే యీశ్వరుని వశపఱచుకొనును. భక్తియే మనుష్యుని నుద్ధరించును. భక్తియే మోక్షమునకు సోపానశ్రేణి. ఇదియే యీకథ ఫలితార్థము.

సమాప్తము.

రాజా రామమోహనరాయలు.

మహాపురుషుల జీవితములు.

(మొదటిభాగము - బంగాళము).

రాజా రామమోహనరాయలు

రామమోహనరాయలు బంగాళాదేశమునందలి, హుగ్లీమండలములలో ధారానగరమున క్రీస్తుశకము 1774 వ సంవత్సరమున జననమొందెను. అతనితండ్రి రమాకాంతరాయలు, [illegible] యయియుండి, కొంతకాలము మూర్షిదాబాదు నవాబుగారియొద్ద నుద్యోగముచేసి యాప్రభువులు రాజ్యభ్రష్టులైనపిమ్మట బర్ద్వాను మహారాజునొద్ద కొలువుచేసెను. రామమోహనునితల్లి తారిణీదేవి. సత్ప్రవర్తనకును, యోగ్యతకును బ్రసిద్ధికెక్కెను. అతని తల్లిదండ్రులిరువురు దైవభక్తి గలవారును, మతవిషయమున వైష్ణవులుగనుండిరి. ఆదినములలో పారసీభాషయే రాజభాషగానుండుటంజేసి, రామమోహనుడు బంగాళీభాషం గొంతనేర్చినవెనుకం దొమ్మిదివత్సరముల ప్రాయమున నరబ్బి, పారసీభాషలు నేర్చుకొనుటకై పాట్నానగరమునకుం బంపంబడెను. అచ్చట రెండుసంవత్సరములలోం గుశాగ్రబుద్ధియగుటచేం దాభాషలలో సద్గ్రంథము లనేకములు చదివి, సంస్కృతవిద్యాభ్యాసముం జేయుటకయి పండ్రెండవయేటం గాశీనగరమునకుం జని యాభాషలోం గొలందికాలములోనే బండితుండై యుపనిషత్తులం జదివి, తత్సారమును గ్రహించెను. రామమోహనుండుపనిషద్ధర్మముం దఱి

చి గ్రహించి తనపదునాఱవయేటనే బంగాళీభాషలో విగ్రహారాధన ము నిషేధించుచు నొకగ్రంథము వ్రాసెను. ఇదియే బంగాళీభాష లో మొట్టమొదటి వచనకావ్యము. విగ్రహారాధనము హిందువులు ప్రమాణముగ గ్రహించుచున్న వేదశాస్త్రములచేత నిషేధింపఁబడి నదనియు, మనపూర్వు లగుమహర్షుల మతమున కిదివిరుద్ధమనియు, జనులందఱు శిలావిగ్రహార్చనము విడిచి యేకేశ్వరారాధనము సేయ వలసినదనియు, నీగ్రంథమున నతఁడు స్థాపించెను. తనకొడుకు సనా తనధర్మ మగు విగ్రహారాధనము ఖండించుచున్నాఁడని విని రమా కాంతరాయలు కోపపరవశుఁడై యాయకార్యమును జేసినందుకు రా మమోహనుని యింటనుండి వెడలనడిచెను. బాల్యమింకను గడచిపో వకమునుపే స్వతంత్రముగ జీవించుటకుతెక్కలురాకమునుపే, యా గర్భశ్రీమంతుఁడై చిన్ననాఁటనుండియుఁ గడుగారాబమునఁ బెఱిగిన యాబాలుఁడాకస్మికముగఁ దండ్రిచే నింటనుండి వెడలనడువంబడియు స్వభావమున గంభీరుఁడగుటచేత హిందూదేశమునఁ బలుతావులుఁదిరి గి యెట్టకేలకు హిమాలయపర్వతములు దాఁటి టిబెట్టుదేశమునకుఁ బోయి బౌద్ధక్షేత్రమగు లాసానగరముంజొచ్చి యచ్చటిభాషల నల వఱచుకొని,బౌద్ధమతసిద్ధాంతముల గ్రహించెను. ఆస్తికుఁ డగు రా మమోహనుఁడు నాస్తికు లగునచటి బౌద్ధులతో నీశ్వరవిషయములగు చర్చలంజేయ వాదములు ముదిరి భేదములై తుదకు వానికిఁ బ్రాణ భయము నాపాదించెను. మతద్వేషముచేత బౌద్ధగురువులు నిష్కార ణముగా నాబాలునిఁ గడతేర్పఁ బ్రయత్నింపఁగా నచటిస్త్రీలు కొం దఱు వారికడుపుచల్లఁగ వానిని రహస్యముగ దాచి బ్రతికించి యావ లకుఁ బంపిరి. అందుచేత నాఁటనుండి స్త్రీలయెడల గడుఁ గృతజ్ఞుఁడై వారికష్టములఁ దొలఁగింప, నాతఁ డామరణముఁ బ్రయత్నించెను. కొడుకిల్లువెడలుటమొదలు వానికొఱకయి బెంగఁగొని తండ్రిమారల

వానిని బిలిపించి యాదరించెనుగాని, క్రమ్మర నాతఁడు బ్రాహ్మణుల మతాచారములను ఖండించుటచేతఁ దండ్రి వానిని రెండవమారింట నుండి సాగఁదోలెను. తరువాత గొంతకాలముకు రమాకాంతరాయలు లోకాంతరగతుఁడుగాఁ దారుణీదేవి కడుప్రీతిపిచేఁ గొడుకునం బిలిపించి యింటనిలుపుకొనెను. రామమోహనుఁడంతటమనస్థిమితము గలవాఁడయి యిరువదియనగేడు మొదలు యిరువదియాఱవయేడు వఱకు నింగ్లీషుభాషయందుఁ గృషిచేసి, దానింజులకగఁజదువ వ్రాయఁ గలిగెను. ఆభాషకుఁ దోడు ఫ్రెంచి, లాటిను, గ్రీకు, హీబ్రూభాషలయందు సయితమాతఁడు ప్రవీణుఁడయ్యె నని చెప్పుదురు. క్రీస్తుశకము 1800 వ సంవత్సరమున రామమోహనుఁడు రంగపురము కలక్టరగు డిగ్బిదొరగారి కచ్చేరిలో చిన్నగుమాస్తాగాఁ బ్రవేశించెను. కాని దొర యాపిన్నవాని చాకచక్యమును దెలివితేటలును గనిపెట్టి, తనయెదుటి కతఁడు వచ్చినప్పుడు నిలువఁబెట్టి పని పుచ్చుకొననని యు చిన్నగుమాస్తాల కుత్తరువుచేయునట్లు చేయనని యు, వాగ్దానముచేసెను. ఆచిన్నయుద్యోగమునుండి యతఁడు క్రమక్రమముగ జిల్లాసిరస్తదారుఁడయి తనకృత్యములనుజక్కగనెఱవేర్చి యధికారులమెప్పొంది, 1813వ సంవత్సరమున నుద్యోగముమాని శేషమగుజీవితకాలము లోకోపకారార్థము గడపఁదలఁచి 1814వ సంవత్సరమున గలకత్తానగరమునఁ గాపురముండవచ్చెను. అతఁడు కలకత్తానగరము వచ్చునప్పటికి, మనదేశస్థితి యెటులుండెనో యించుక చెప్పవలసియున్నది. బంగాళాదేశమున శాక్తేయమతమును,చైతన్యుని వైష్ణవమతమును వృద్ధిలో నుండుటచే, శాక్తేయులకు వైష్ణవులకుమత ద్వేషములు తఱచుగఁ గలుగుచు వచ్చెను. నరబలులు, శిశుహత్యలు, దేశమందంతటఁ బ్రబలియుండెను. వానికిందోడుగ నతిభయంకరము నమానుషంబు, నసహ్యమునగు సహగమన మనుదురాచారమొకటి భరతఖండమం

దంతటను, ముఖ్యముగ వంగదేశమందును దృఢముగనాటుకొనియుం డెను. ఈసహగమనమును భర్తృ వియోగముచే నీలోకమున బ్రతుక నిచ్ఛలేక గొందఱు పతివ్రతలు, మనఃపూర్వకముగఁ జేయుచువచ్చిరిగాని, కాలక్రమమున వితంతువు నెట్లో కాల్చిచంపి, యాస్తి వేసికొనవలయు నన్యజ్ఞాతులును, లోకనిందకుజంకిన బందుగులును, మగఁడు చనిపోవుటచే సగము చచ్చియున్న యాఁడుదాని యొద్దఁజేరి, మృతభర్తతో సహగమనముఁ జేసినదానికిఁ బుణ్యముగలుగుననియుఁ గుటుంబమునకు సత్కీర్తి సంఘటిల్లుననియు, వేనోళ్ళఁబొగడి మనసు విఱిచి భయముపెట్టి, బలవంతముగ నాస్త్రీచేనొప్పించియు, నొప్పుకొననిచో విఱిచికట్టియు స్మశానమునకుఁదామె దీసికొనిపోయి మండుచున్న నిప్పులపైఁబడవేసి హృదయము గరగించు నామెయేడ్పు లెవ్వరికి వినఁబడకుండ, భేరీలవాయించి, నడునడుమ దుస్సహమగుబాధచే నామెలేవఁబోయినప్పుడు, వెదురుకఱ్ఱలచేఁ ద్రొక్కి యడఁచిపెట్టించి, యెట్లో నిండుప్రాణముఁ దీసి, కృతార్థులగుచు వచ్చిరి. 1815 వ సంవత్సరము మొదలు 1828 వ సంవత్సరమువఱకు నొక్క కలకత్తానగరమునందే దాదాపుగ నైదువేలమంది సుందరులీ ఘోర మరణముపాలైరి. అశాస్త్రీయము నతికౄరము ననార్యము నగు నీ ప్రత్యక్ష రాక్షస కృత్యములఁ జూడలేక రామమోహనరాయలా దురాచారమును మాన్పుటకయి ప్రయత్నింప నిశ్చయించుకొని కలకత్తానగరము వచ్చినది మొదలావిషయమై పాటుపడి, యాయాచారమును దుదముట్టించి భరతఖండస్త్రీలకుపకారము చేయుఁడని దొరతనమువారికి, పలుమాఱు మహజర్లుబంపియుఁ దద్విషయమై తాను కొన్ని చిన్నగ్రంథములను వ్రాసియు, నుపన్యాసములిచ్చియుఁ, బండితులతో వాగ్వాదములు చేసియు, జనులకు దానికార్యమును బోధింపసాగెను. కొద్దిమందిజనులు రామమోహనరాయలు పక్షమువహించిరి

గాని, లక్షోపలక్షలుపూర్వాచారపరాయణులయి సహగమనము లేక పోయినచో హిందూమతము చెడిపోవుననియు, సనాతనమయిన యీ యాచారమును గొట్టివేయక నిలుపవలసినదనియుఁ బ్రిభుత్వమువారికి మరల మహాజర్లఁబంపిరి. ఛాందసులగుపండితులు, రామమోహనరాయలను నిందించుచు గ్రంథములు వ్రాసిపత్రికలమెప్పుగనిరి. అప్పటి గవర్నరుజనరలుగారగు లార్డువిలియంబెంటిక్కుదొరగారు రామమోహనరాయల వాదములు యుక్తియుక్తములుగ నున్నవని గ్రహించి లోకోపకారకమగు నతనియుద్యమమునకుఁ దోడ్పడి యీదురాచారపిశాచము నడుగంటఁ ద్రొక్కఁదలఁచి 1829 వ సంవత్సరముడిశెంబరునాలుగవ తారీఖున సహగమనము నిషేధించుచు నొకచట్టము నిర్మించి పుణ్యము గట్టుకొనెను. చూచుటకు, వినుటకుఁ దలఁచుకొనుటకు నయితము నతిదారుణమగు నీయాచారమును నిర్మూలము చేసిన మహానుభావుఁడు రామమోహనరాయ లగుటచే భరతఖండమునందలి స్త్రీపురుషు లందఱు నాచంద్రతారకముగ నతనికిఁ గృతజ్ఞులయి యుందురు గాక! రామమోహనరాయలు కలకత్తాకువచ్చిన క్రొత్తలో వేదాంతశాస్త్రమును వేదాంతసారమునుబంగాళీభాషలోనికిఁదర్జుమా చేసెను. 1816-17 వ సంవత్సరములలో నతఁడు ముఖ్యములగు నుపనిషత్తులనింగ్లీషుభాషలోనికిబంగాళీభాషలోనికిభాషాంతరీకరించెను. ఇట్లు వేదాంతరహస్యముల బయలుపఱచినందుకు పూర్వాచారపరాయణులు రామమోహనుని నిందింప నారంభించిరి. ఈమహాత్ముఁడు సంస్కృతముఁజదివి వేదశాస్త్రముల శోధించుటయేగాక అరబ్బీభాష నేర్చుకొని తురకలవేదమగు ఖురానుజదివి, హీబ్రూ, గ్రీకుభాషల నేర్చుకొని క్రైస్తవులవేదమగు బైబిలు పఠించి తద్గ్రంథముల సారములు గ్రహించి దోషములు బైలుపెట్టనారంభించెను. 1820వ సంవత్సరమున నితఁడుయేసుక్రీస్తుధర్మములనుగూర్చి, బంగాళీసంస్కృతభాషలలో గ్రంథములువ్రా

నీప్రకటించి యందు క్రీస్తుమతగురువగునుగాని, దేవునికుమారుఁడగుట యబద్ధమని వ్రాసెను. ఇందుచే నచ్చటికైస్తవమతబోధకులకును, రామమోహనునకును గొప్పవివాదములు బైలుదేర కైస్తవులు వ్రాసిన దానికి రామమోహనుఁడును, రామమోహనుఁడు వ్రాసినదానికి కైస్తవులును నుత్తరప్రత్యుత్తరముల నిచ్చుకొనుచు వచ్చిరి. ఇంతవఱకు రామమోహనుఁడు తానువ్రాసినగ్రంథములన్ని కైస్తవమతబోధకుల ముద్రాయంత్రములోనే యచ్చువేయుచు వచ్చెను. ఆమతబోధకులు రామమోహనుని వాక్యములు యుక్తియుక్తములుగ నుండి జనుల యాదరణ బడయుచుండుటచే నీర్ష్యఁజెంది యతఁడు తమవ్రాఁతల ఖండించుచు నిచ్చిన కడపటి ప్రత్యుత్తరము నచ్చువేయమనిరి. రామమోహనుఁడు పంతము వచ్చినప్పుడు తీసిపోవువాఁడుకాఁడు గావున దానే స్వయముగ నచ్చుకూటమును గొని తనగ్రంథము నచ్చొత్తించెను. ఈయిరువురగ్రంథము లింగ్లాండునకుఁ బోయినప్పు డచ్చటివారు, బంగాళా బ్రాహ్మణుని యుక్తులకును, సర్వతోముఖ పాండిత్యమునకును, వాదనైపుణ్యమునకును జాల మెచ్చుకొనిరి.

ఈసత్పురుషునకుఁ బరిశుద్ధమగు నుపనిషన్మతముపై నభిమాన మెక్కుడు గలుగుటచే భగవధ్యానము నిమిత్తము కలకత్తానగరము లో నాత్మసభయను పేర నొకసభ నేర్పఱచెను. పిమ్మట వేదాధ్యయనమునభివృద్ధి చేయఁదలఁచి వేదమందిరమను నొకపాఠశాలను 1817వ సంవత్సరమున స్థాపించెను. ఈమతములోఁ జేరినవారందఱు ప్రార్థనాదికములు చేసికొనుటకు 1830వ సంవత్సరమున నతఁడు బ్రహ్మమందిరమునొకదానిని గట్టించి, దానిపోషణకయి కొంతమూలధనమునుయు తమొసంగెను. హిందువులకు, మహమ్మదీయులకు, కైస్తవులకు నుపయుక్తముగ నుండునటుల నొకమతము నిర్మింపఁదలఁచి, యుపనిషత్తులలోనున్న పరమార్థమును గ్రహియించి, యామతమును గల్పించెను.

ఆయన వేదములనుమాత్రమే ప్రమాణములని యొప్పుకొనక, బైబిలు, ఖొరాను, జండవస్తము మొదలగు మతగ్రంథములలోనున్న సత్యమును ధర్మమును గ్రహింపవలసినదే యనియు, నని యన్నియు వేదములవలెఁ బ్రమాణములే యనియు, నమ్మి ప్రజలకు బోధించుచుండెను. బ్రహ్మసమాజమే, పూర్వఋషులు పరిశుద్ధాస్తికమతమని యాయన గట్టిగ నమ్మెను. తాను మతసిద్ధాంతములను, సంస్కరణవిషయములను, బ్రకటించుటకయి సంబంధకౌముదియను నొకపత్రికను స్వభాషలోఁ బ్రకటించుచు వచ్చెను. అతని ప్రతిపక్షులంతయుఁ జేరి ధర్మసభ యనుపేర నొకసమాజము నేర్పఱచి చంద్రికయను నొకపత్రికను బ్రచురించి రామమోహనుని నిందించుటయే ప్రధానముగఁ జేసికొనిరి. మతసంస్కారమందేగాక, సంఘసంస్కరణమునందును నాతఁడు గట్టిపనిచేసెను. స్త్రీపునర్వివాహములు శాస్త్రీయములనియు, నింద్యములు కావనియునతనియభిప్రాయము. బంగాళాదేశములో కులీనులనునొక తెగబ్రాహ్మణులు గలరు. వారిని పరమపావనులని యచ్చటిజనులు నెక్కుడు గౌరవింతురు. పవిత్రులగు కులీనబ్రాహ్మణులతో సంబంధము చేయుటకడుగౌరవమని యెంచి యాదేశబ్రాహ్మణులు తమకన్యలకుఁ దగు వరులు దొరకనందున వేలకొలఁది రూప్యములు కట్నములనిచ్చి, యొక్కొక్క కులీనునకు ముప్పది, నలువది, ఏఁబది, యొకప్పుడు నూఱుమంది కన్యలను గట్టఁబెట్టెడి యాచారము గలదు. ఇట్లు వివాహము చేసికొన్న భర్త మృతినొందినప్పుడు నూఱుగురుభార్యలు సహగమనము చేయవలసి యుండెను. దగ్గరనున్నవారు భర్తతోఁ గలిసియు, దూరమున నున్నవారు మగనియొక్క గుడ్డపేలికయో, మఱియే వస్తువో తెప్పించి మీఁద వేసికొని తమరున్న యూళ్ళలోఁ జిచ్చుఱికి శరీరత్యాగము చేయుచుందురు.

రామమోహనుఁడే ముగ్గురుభార్యలను వివాహము చేసికొనెను

మొదటిభార్య చిన్నతనమందే మృతినొందుటంజేసి, యాయనమఱియొకకన్యను వివాహము చేసికొనెను. ఈధర్మపత్ని జీవించియున్నపుడే రామమోహనునకుఁ దండ్రిగారుమఱియొకకన్యనుఁబాణిగ్రహణముచేయించిరి. బహుభార్యాస్వీకారమువలనఁ గలుగు నష్టములను స్వయముగఁ జూచుటఁజేసి యాదురాచారమును నిర్మూలించుటకయి యతఁడు ప్రయత్నించెను. కాని వెంటనే కృతకృత్యుఁడు గాఁడయ్యె. ఈసంస్కారములుగాక దేశమున కతఁడింక ననేకోపకారములు చేసెను.

హిందువులకుఁ బాఠశాలలు స్థాపించియాంగ్లేయభాష నేర్పింపుఁడని గవర్నరు జనరలుగారగు, ఆమ్హెర్స్టుప్రభువుగారి కొకయుత్తరము వ్రాయుటయేగాక, నిరువురు దొరలతోఁ గలిసి 1817 వ సంవత్సరమున హిందూకళాశాలలు స్థాపించెను. బంగాళీ భాషలో వచనకావ్యములు వ్రాయుటకు దారిదీయుటయేగాక,యాభాషలో లలితపద గర్భితములగు కృతుల ననేకములు రచించెను. ఆకృతులు వంగదేశపు స్త్రీపురుషులిప్పటికిని బాడుచుందురు.

రామమోహనునకుఁ జిరకాలమునుండి యూరపుఖండమును ముఖ్యముగ నింగ్లాండు దేశమును జూడవలయునని యభిలాష యుండెను. స్వదేశమునఁ దనతోడి ప్రజలకుఁ జేయవలసిన సత్కార్యములనేకములుండుటంజేసి యదివఱకతనికిఁ బోవీలు చిక్కఁదయ్యె. 1830వ సంవత్సరమున నతనియభిలాషకు ననుగుణముగ నొకయదనుఁ గలిగెను. అప్పటిఢిల్లీచక్రవర్తి, పేరునకుమాత్రము సార్వభౌముఁడయి యుండి యేలుటకు రాజ్యము, ననుభవించుటకైశ్వర్యములేక, తనదీనదశ నింగ్లాండులోని పార్లమెంటు మహాసభవారికిఁ దెలియఁజేసికొనఁ గోరి తాస్వయముగఁ బోఁజాలక తనపక్షమున సీమకుఁ బొమ్మని రామమోహనుని బ్రార్థించి యతనికి రాజా,యనుబిరుదము నిచ్చి, తగుధనమిచ్చి పంపెను. తనయభిలాషకు, ఢిల్లీశ్వరుని బనికిందోడుగ రామమోహనునికిఁ గర్తవ్యమిం

కొకటి యుండెను. సహగమనమునిచ్చుటి గవర్నరుజనరలుగారు మా న్పించిరనుకోపమునఁ బూర్వాచారపరాయణులు, ప్రాచీనమగునాయా చారమును నిలుపుఁడని పార్లమెంటువారికి పలుమహాజర్లనంపిరి. రామ మోహనుఁడు గవర్నరుజనరలుగారు చేసినపని మంచిదనియు, నాయా చారము తుదముట్ట నిర్మూలింపవలసినదనియు, ప్రజలవలనఁ గొన్నిమ హాజర్ల వ్రాయించి వానిం జేకొని, స్వయముగ పార్లమెంటువారికి సమ ర్పింపఁ దలఁచి 1830 వ సంవత్సరము నవంబరు 15 వ తారీఖున నతఁ డింగ్లాండునకుఁ బయనమయిపోయెను. మన మెఱిఁగినంతవఱకు సముద్ర యానము చేసినబ్రాహ్మణులలో నితఁడే మొట్టమొదటివాఁడు. అతనికీ ర్తియతనికన్న మున్నే యింగ్లండునకుఁ బోయి నెలకొనియుండుటచేవా నినందఱు గౌరవించిరి. రాజదర్శనము స్వయముగఁ జేయుటయే గాక యాయనపట్టాభిషేక సమయమున, రామమోహనరాయ లన్యదేశపు రాయబారులతో సమానముగ గౌరవింపఁబడెను. ఆకాలమునం దాదే శంబుననున్న కవీశ్వరులు, తత్త్వశాస్త్రజ్ఞులు, చరిత్రకారులు, ప్రకృతి శాస్త్రపండితులు వానిపరిచయము చేసికొనుట గౌరహేతువని యెంచి స్వయముగ వచ్చి చూచియు, జాబులువ్రాసి ప్రత్యుత్తరములఁదెప్పిం చుకొనియుఁ దనివినొందిరి. హిందూదేశపు రాజకీయవ్యవహారములవి షయమై రామమోహనుఁడు పార్లమెంటుకమిటీవారియెదుట కడునిపు ణముగ సాక్ష్యమిచ్చెను. సహగమనము నుద్ధరింపవలయునని ఛాందసు లు పంపినమహాజర్లు పార్లమెంటుసభవారు విచారణసేయునపుడు రామ మోహనుఁడు స్వయముగ నచటనుండి తానుదెచ్చిన మహాజర్లువారికిస మర్పించి, చెప్పవలసినసంగతులఁ జెప్పి యాయాచారమురూపుమాయు నట్లు చేసెను. 1831 వ సంవత్సరముననాతఁడు ఫ్రాన్సుదేశమునకుఁబో యియచట కొంతకాలమునుండి ఫ్రెంచిభాష నేర్చికొనెను. అచటను న్నకాలములో నతఁడు ఫ్రెంచి రాజునుసందర్శించి రెండుమూఁడుమారు

లాయనతో విందు లారగించి గౌరవపాత్రుఁడయి యింగ్లాండునకుమ
రలవచ్చి యాంగ్లేయ భాషలో ననేక గ్రంథములు వ్రాసెను. ఆగ్రంథము
లశైలికిని, నిపుణత్వమునకును, మంచిమంచియింగ్లీషుకవులువాని నగ్గ
డించి మెచ్చుకొనిరి. ఇట్లు యూరపుఖండములో సుప్రసిద్ధుఁడయి కీర్తి
గాంచిన, యామహాపురుషుఁడు మరల స్వదేశమునకు వచ్చి తనయా
త్రావిశేషములఁ దనమిత్రులకుఁ దెలుప నతనికి కాలము లేకయ్యెను.

18౩౩ వ సంవత్సరము సెప్టెంబరునెలలో డాక్టరు కార్పెంటరు
దొరగారు వానిని బ్రిస్టలునగరమునకుఁ బిలుచుకొనిపోయి, గౌరవిం
చెను. అక్కడనుండఁగ నాయనకు, సెప్టెంబరు 10 వ తారీకున జ్వర
ముతగిలెను. ప్రజ్ఞావంతులగు వైద్యులెన్నిచికిత్సలఁ జేసినను, కార్పెం
టరుదొరగారెన్ని శ్రమలఁబడినను, నవియెల్లనిరర్థకములుకాఁగా హిం
దువులభాగ్యదోషమున రామమోహనరాయలు సెప్టెంబరు 27 వ తే
దీని కాలధర్మము నొందెను. అక్కడిమిత్రులామహాత్ముని బ్రిస్టలు నగర
సమీపమున భూస్థాపితము చేసిరి. పిమ్మట పదిసంవత్సరములకు రామ
మోహనుని ప్రియమిత్రుఁడగు ద్వారకనాథ ఠాగూరుగారు సీమకుఁ
బోయి యాపురుషశ్రేష్ఠునకు నొకసమాధి గట్టించి ధన్యుఁడయ్యెను.

పదునాలుగేండ్ల వయసు వచ్చినది మొదలు దేశమునిమిత్తము,
దేశస్థులనిమిత్తము, పలుకష్టములఁబడి, యాసుజనుఁడు తుదకు పరదేశ
మున బంధుమిత్రులు లేనిచోట దేశోపకారార్థము ప్రాణములవిడిచె
ను. ఈలోకోపకారకుని ఋణము భరతఖండవాసు లెన్నటికిని దీర్చు
కొనఁజాలరు. ఈతఁడు కార్యశూరుఁడు. అవసరమయినయపుడు సక
లకష్టములకు లోనై ధైర్యముతో నిలిచి తనకు మంచిదని తోఁచెడు
కార్యమును నిర్వహించెడువాఁడు, తయామయుఁడు ధర్మశాలి. స్వ
గౌరవమును జక్కఁగఁ గాపాడుకొనుచు నీతిమార్గము ననుసరించువాఁ
డు. మతవిషయమునను స్వదేశవిషయమునను బ్రతిమనుష్యునకు స్వా

తంత్ర్యముండఁదగునని మతవివాదము. ఒకనాఁడు డాక్టరు మిడిలుటన్ అను క్రైస్తవమతబోధకుఁడు రామమోహనునిం బిలిచి క్రైస్తవమతమునంగలియుమనిబోధించి దానివలనబలకుబడి, ధనము, నధికారము, గౌరవము, కలుగునని నొక్కిచెప్పెను. ఆమాటలువిని రామమోహనుఁడుకోపోద్దీపితుఁడయితుచ్ఛగౌరవములు సంపాదించుటకయి తానుమతముమార్చుకొనననని వానితోస్పష్టముగఁ జెప్పియానాఁడుమొదలా దొరగారితోస్నేహము మానెను. గ్రంథవిస్తరభయమున మానవలసెఁగాని రామమోహనుని యౌదార్యవినయశాంతగుణములను దెలుపుకథలనేకములున్నవి. అంతటి నీతిశూరుఁడు, లోకోపకారియు, మరలనిప్పటివఱకును మనభరతఖండమున జనియింపకపోవుటయే, యాతఁడుసుగుణసంపదలోనద్వితీయుఁడనిచెప్పుటకుఁదార్కాణము. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అనునుపనిషద్వాక్యమును నమ్మి యాతఁడు విగ్రహారాధనమునిరాకరించి పరిశుద్ధాస్తికమతము నవలంబించెను. గావున దయామయుఁడగునాపరబ్రహ్మమే యాతనియాత్మకు శాశ్వతానందమిచ్చుఁగాత

ఈశ్వరచంద్రవిద్యాసాగరులు.

హిందూదేశమున మృతిబొందిన భర్తతో చిచ్చునంబడి చావవలసిన యాఁడువాండ్రను బ్రతికించి దేశమునకు మహోపకారము జేసినయతఁడు రామమోహనరాయలు. అతనిప్రసాదమున బ్రతికినవితంతువులను యావజ్జీవ మిహలోక నరకమగు వైధవ్యమునుండి తప్పించి వారినిమరల ముత్తయిదువలఁ జేసి పసపుకుంకుమలు నిలిపిన పరమోపకారి యీశ్వరచంద్ర విద్యాసాగరులు.

ఈయన బంగాళాదేశ కులీన బ్రాహ్మణుఁడు. ఈతఁడు 1820 వ సంవత్సరమున హుగ్లీమండలములోని వీరసింహ గ్రామమున నొకనిరుపేదకుటుంబమునఁ బుట్టెను. వాని తాతయగు రామజయబెనర్జీ సన్యాసియై దేశాటనముఁ జేయుచుఁ గాలక్షేపము చేసెను. తండ్రియగు ఠాకురుదాసుబెనర్జీ యొకవర్తకునియొద్ద నెలకు పదిరూపాయల వేతనముగలచిన్న యుద్యోగియయి యుండెను. ఈశ్వరచంద్రుఁడు తన యూరబడిలోనున్నంతవఱకు విద్యనేర్చుకొని తొమ్మిదిసంవత్సరములు ప్రాయమువచ్చినపుడు సంస్కృత కళాశాలలోవిద్యనభ్యసించుటకుఁ గలకత్తానగరమునకుఁ బంపఁబడియచ్చట ధర్మశాస్త్రము, వేదాంతశాస్త్రము, కావ్యాలంకారములు, జ్యోతిశ్శాస్త్రము మొదలగువానిని నేర్చి యనేకబహుమానము లందెను. అతఁడు తనపదియేడవయేట పండితకోటుమునసబుగా నుండఁదగిన పరీక్షయందుఁ దేరెను. ఆకాలమునం దాపరీక్షలో గృతకృత్యుఁడగుట మిక్కిలి కష్టము. అతఁడా పరీక్షను దేరినతోడనే దొరతనమువారు వానికి న్యాయాధిపతి యుద్యోగము నొసంగిరిగాని యాయూరతిదూరమువనుండుటచే వానితండ్రి కొడుకును దూరమునకుఁ బంపుట కిష్టములేక యు

ఈశ్వరచంద్రవిద్యాసాగరులు.

ద్యోగము మానిపించెను. అందుచేత విద్యాసాగరుఁడు మఱికొందుసం వత్సరములు కళాశాలలోఁ జదువుకొని సాంఖ్య నైశేషికాది షడ్దర్శ నములు నేర్చి ప్రవీణుఁడయ్యె. 1838 వ సంవత్సరమున నాతఁడుచ క్కని శైలితోఁ జక్కనిసంస్కృతవచనమునువ్రాసినందుకు నూఱురూ ప్యములును బద్యకవిత్వముజెప్పినందు కేబదిరూప్యములును బారితో షికము బడసెను. మరుచటి సంవత్సరమున నీశ్వరచంద్రుఁడు హింం దూధర్మశాస్త్ర పరీక్షయందుఁ గృతకృత్యుఁడయి విద్యముగించి వి ద్యాసాగరుఁ డను బిరుదమును బడసెను. గీర్వాణభాషనభ్యసించు చుకాలముననే యప్పుడప్పు డించుక యింగ్లీషుభాషనుస యితమాతఁ డునేర్చుకొనెను. ఈశ్వరచంద్రుఁడు మొట్టమొదట సంస్కృత కళాశా లలో వ్యాకరణపండితుఁడుగఁ గొంతకాలము పనిచేసి, పిమ్మట 1840 వ సంవత్సరమున ఫోర్టు విలియం కళాశాలలో నెలకు నేబదిరూ పాయలు జీతముగల ప్రధాన పండితుఁడుగా నియమింపఁబడెను. ఈ కాలమున దేశాభిమానులలో నగ్రగణ్యుఁడగు బాబు సురేంద్రనాథ బెనర్జీగారి తండ్రిగారగు దుర్గాచరణ బెనర్జీగారి సాహాయ్యమున నీశ్వరచంద్రుఁ డప్పు డప్పుడు మిగులశ్రద్ధతో నాంగ్లేయభాష నభ్య సించెను. 1846 వ సంవత్సరమున సంస్కృతకళాశాల కతఁడు సహా యకార్యదర్శిగా నియమింపఁబడి యాయుద్యోగమున నున్నప్పుడే వి క్రమపంచవింశతి యను బంగాళీ వచన కావ్యము నొకదానిని వ్రాసి ప్రచురించెను.

ఈశ్వరచంద్రుని పరిశుద్ధశైలియు, రచనా చమత్కృతియుఁ గనుఁగొని దేశస్థులందఱు బంగాళీభాష నంతసవంతముగ మనోహర ముగ వ్రాయుటకు వీలున్నదని యప్పుడు గ్రహించిరి. ఆయుద్యోగమున నున్నప్పు డాయనపలుమార్పులఁ దెచ్చి కళాశాలను వృద్ధినొందించె నుగానిచిర కాలముండలేదు. 1847 వ సంవత్సరమున నతఁడు ఫోర్టువిలి

యమ్ కళాశాలలో నెల కేనుబది రూపాయలు జీతముగల మొదటిగు మాస్టారుగానే ప్రవేశించియుచట నున్నకాలములోనే స్త్రీవిద్యావిషయము న నాదినములలోఁ గడుబరిశ్రమచేసిన బెత్యూన్ దొరగారి స్నేహము సంపాదించెను. మరుఁచటి సంవత్సరమున మరల నతఁడు సంస్కృత కళాశాలలోఁ దొంబది రూపాయిల జీతముగల పండితుఁడుగాఁ జేరి కొలఁదికాలములోనే యాకళాశాలా ప్రధానోపాధ్యాయుఁ డయ్యెను. మన పండితులు సంస్కృతభాషను విద్యార్థులకు సుబోధకమగు నట్లు తెలుపలేక శిష్యులను బాధపెట్టి తాము బాధపడుటఁ జూచి విద్యాసాగరుఁడు సంస్కృత కళాశాలకుఁ బ్రధానోపాధ్యాయుఁడుగా నున్న కాలమున గీర్వాణభాషను బాలురు చులకనగా నేర్చుకొనుటకుఁ గొన్నిపద్ధతులను గనిపెట్టెను. నాఁటనుండియుఁ సంస్కృత విద్యాభ్యాసము సులభ సాధ్యమయ్యె. 1851వ సంవత్సరమున వాని మిత్రుఁడగు బెత్యూన్ దొర కాలధర్మమునొంద నప్పటి బంగాళా దేశపు గవర్నరు హాలిడే యనునతఁడు బెత్యూన్ పాఠశాలకు విద్యాసాగరు నధికారిగా నేర్పఱచెను. 1885 వ సంవత్సరమున నీ పండిత శిఖామణి హుగ్లీ, నద్యా మొదలగు నాలుగు జిల్లాలకు పాఠశాలా పరీక్షాధికారిగ నియమింపఁబడి నెల కయిదువందల రూపాయిల జీతము నార్జింప నారంభించెను. ఈ యుద్యోగమునందున్నపుడె యాతఁడు హుగ్లీ, బర్ద్వాన్ మండలములలో నలువది బాలికాపాఠశాలలు స్థాపించెను.

ఆ కాలమున బంగాళాదేశమునందలి పాఠశాలలకు "యంగి నను నొక దొరగారు డైరెక్టరుగా నుండిరి. ఆయన యించుక యధికార గర్వము గలవాఁడగుటచే స్వతంత్రబుద్ధిగల విద్యాసాగరునకుఁ దనపై యధికారితో సరిపడక పోరపులు గలుగుచు వచ్చెను. ఇట్లు క్రమ క్రమముగ మనస్పర్థ లధికమగుచుండ నొకనాఁడు దొరగారు

ఈశ్వరచంద్రవిద్యాసాగరులు.

విద్యాసాగరునిం బిలిచి హిందూకళాశాల ప్రధానోపాధ్యాయుని
యొద్దకుఁ బోయి యొకమాట చెప్పిరమ్మని యాజ్ఞాపించెను. విద్యా
సాగరుఁడు తాపని స్వగౌరవ భంగకరముగాఁ దోఁచినందునఁ దనతో
దొరగారుకూడ వచ్చిన యెడలఁ దానచ్చోటికిఁ బోవుదుననియుఁ దా
నొక్కఁడు బోనొల్లననియు నతఁడుత్తరము చెప్పెను. విద్యాశాఖ
కెల్ల సర్వాధికారియగు తన్నుఁ దనచేతిక్రింది యుద్యోగస్థుఁడు తిర
స్కరించుటచే దొరగారు కోపించి నీ విది చేయకతప్పదని విద్యాసాగ
రునితోఁ బలికెను. విద్యాసాగరుఁడు వెంటనే జేబులోనుంచి యొక
కాగితముఁ దీసి తన యుద్యోగమునకు విడుదల వ్రాసియిచ్చి నాకి
ష్టము లేనిపని చేయుట యిప్పుడు తప్పునా! యని యడిగెను. బంగా
ళాదేశపు గవర్నరగు "హాలిడే" యనునాతఁ డీశ్వర చంద్రునకు
నాప్తమిత్రుఁ డగుటచే నుద్యోగమును మానుకొనవలదని యతఁ
డెన్నివిధములనో విద్యాసాగరుని బ్రతిమాలెను. కాని వాని ప్రార్థ
నలు విద్యాసాగరుని నిశ్చలచిత్తమును జలింపఁ జేయఁజాలవయ్యెను.

ఈ విధముగ దొరతనమువారికొలువు కడముట్టసేయక నడు
మనే ముగించి విద్యాసాగరుఁడు నిర్వ్యాపారుండుగాక తన దేశము
నకు మునుపటికంటె నినుమిక్కిలిగా నుపకారముఁ జేయఁగలవాఁ
డయ్యె. బుద్ధి సర్వతోముఖవ్యాప్తముకాగా నాతఁడు బహుగ్రంథ
నిర్మాతయయి విద్యావిశారదుఁడై సంఘ సంస్కారకుఁడై భూత
దయాళువై జన్మము చరితార్థముగఁ జేసికొనెను. బంగాళీభాషలో
వాని వ్రాతలు మృదువులై మధురములై పరిశుద్ధములై శయ్యా
సౌష్ఠవమునకుగణుతి గాంచినవి. పై నుదాహరింపఁబడిన గ్రంథములు
గాక బంగాళా దేశచరిత్రము, సత్పురుషుల జీవచరిత్రము, బోధోద
యము, సీతా వనవాసము మొదలగు గ్రంథములు రచించి ప్రచురిం
చెను. ఇవిగాక సంస్కృతమున కాళిదాస ప్రణీతమగు శాకుంతల

నాటకమును బంగాళీలోనికి భాషాంతరీకరించెను. స్త్రీవిద్యయన్న చో నీతని కభిమాన మెక్కుడగుటచేఁ దద్విషయమయి యావజ్జీవము నధిక పరిశ్రమ జేసెను. "బెత్యూను" పాఠశాల యభివృద్ధినొందుటకుఁ గారణము విద్యాసాగరునకు దానిపైఁగల యభిమానము దానివిషయమయి పడిన పరిశ్రమ కారణములని గ్రహింపవలెను. స్త్రీ విద్య యెడల నీయనకుఁగల యాదరమునుబట్టి బెత్యూన్ కళాశాలలో మూడవతరగతిలోఁ జదువుకొని ప్రవేశపరీక్షకుఁ బోవఁదలఁచు హిందూబాలికకు విద్యాసాగరుని జ్ఞాపకార్థము విద్యార్థివేతన మొకటియిప్పటికి నీయఁబడుచున్నది. సర్వకళాశాలలలో నాంగ్లేయ పండితులుపాధ్యాయులయి యెంతచక్కఁగఁ బనిచేయుదురో స్వదేశీయులు నట్లే యింగ్లీషుభాషలో పండితులై యుపాధ్యాయులై కళాశాలల నిర్వహింప సమర్థులని లోకమునకుం దెలియజేయుటకయి విద్యాసాగరుఁడు మెట్రోపాలిటన్ కాలేజను పేర నొక కళాశాలను స్థాపించెను. ఇది బంగాళా దేశములోని సర్వకళాశాలలలో శ్రేష్ఠమయినదని కీర్తిబడసినది. దొరతనమువారి క్రింది యుద్యోగమును మానుకొనుటచే నాతనికి ధననష్ట మించుకయుఁ గలుగలేదు. పాఠశాలలలో బాలురు చదువుట కుపయుక్తములగు పుస్తకము లదివఱకు బంగాళీ భాషలో లేమింజేసి విద్యాసాగరుఁ డుద్యోగము మానిన పిదప నట్టి గ్రంథములు వ్రాసి ప్రచురించెను. ప్రతిపల్లెయందు ప్రతిపాఠశాలయందు ప్రతిబాలకుఁడు వాని గ్రంథములనే జదువుటచే నాతనికి రమారమి నెల కైదువేల రూపాయలాదాయము కొంతకాలమును మూడువేల రూపాయలు రాబడి కొంతకాలమును వచ్చెను. బంగాళా దేశపు పాఠశాలలలో నిప్పటికిని వానిచేత రచియింపఁబడిన సంస్కృత గ్రంథములు బంగాళీ గ్రంథములు చదువఁబడుచున్నవి. ఆ భాషలో రచనా చమత్కృతిగల పండితు లిటీవల బహు గ్రంథ

ములు రచించిరిగాని యవి విద్యాసాగరుని గ్రంథములకు సరిపోల వయ్యె. అందుచేత బంగాళీభాష కతఁడు గ్రంథరూపమునఁ జేసిన మహోపకారమునకు వానియెడ దేశస్థులు కృతజ్ఞులై యున్నవారు.

సంఘసంస్కార విషయమున విద్యాసాగరుఁడు చేసినపని యసమానము. ఇతఁడే హిందూదేశమున స్త్రీపునర్వివాహముల నుద్ధరించిన ప్రథమాచార్యుఁడు. ఇతఁడీపనికిఁ బూనుటనుగూర్చి యొక చిన్న కథగలదు. వాని దగ్గర చుట్టములలో నొకనికూఁతు రతిబాల్యమున వితంతువయ్యెను. తలిదండ్రులామెం దోడ్కొని మార్గవశమున నీ పండితుని యింటికి రాఁగా విద్యాసాగరునితల్లి యా బాలిక చక్కఁదనమును లేఁబ్రాయమును జూచి దుఃఖపడి కొడుకు దగ్గఱకు బోయి నాయనా! నీవింత పండితుఁడవు. ఈ బాలికను దుర్గతినుండి తొలఁగించి వివాహము చేయుటకు శాస్త్రములయం దెచ్చట నాధారము లేదా? యని యడిగెనఁట. తల్లిమాటలు నాదరముతో విని బాలికయవస్థకుఁ దానును మనసు కరుగఁగ నచ్చి యానాఁడు మొదలతఁడు స్త్రీపునర్వివాహ విషయమున నాధార ములున్నవో లేవో కనుఁగొనుటకై శాస్త్రములు శోధించెను. 1854 వ సం|| న నతఁడు స్త్రీపునర్వివాహము శాస్త్రీయమని సిద్ధాంతీకరించి విధవావివేకమను పేర నొక చిన్నగ్రంథము వ్రాసెను. ఆపుస్తకము బయలువెడలిన తోడనే బంగాళా దేశమంతయు సంక్షోభను జెందెను. పూర్వాచార పక్షమును సంస్కారపక్షమును దేశమునందంతట ననేకసభలు జరిగెను. వాదప్రతివాదములు ప్రచురింపఁబడెను. వంగదేశమునందంతట వ్యాకరణ శాస్త్రమున నసమానుఁడని పేరువడిన యొకమహాపండితుఁడు విధవావివేకమును ఖండించుచు నొక గ్రంథమును సంస్కృతమున వ్రాసెను. ఆగ్రంథము జనులకుఁదెలియని దేశభాషలో నుండుటచేత జనులా గ్రంథమును జదువలేక స్వభాషలో రచింపఁబడినవిద్యా

సాగరుని పుస్తకమును జదివి దాని సత్యమును గ్రహించిరి. ఈశ్వర చంద్రుని ప్రోత్సాహముచేత దొరతనమువారు స్త్రీపునర్వివాహములు చేసికొన్నవారికి పిత్రార్జితమగు నాస్తిలో భాగములు పోవని శాసించుచు 1856వ సం॥న నొకచట్టమును నిర్మించిరి. అదిమొదలు తద్విషయమున పాటుపడి యీ మహాత్ముఁడు 1856న సం॥ డిశెంబరు 7వ తారీఖున కలకత్తాలోఁ దనయింటిలో మొదటి స్త్రీపునర్వివాహమును జేసెను. అది యకార్యమని యనేకులు దేశస్థులు తూలనాడిరి. కులస్థులు బహిష్కరించిరి. ఆప్తబాంధవు లావలకుం దొలఁగిరి. ప్రాణమిత్రులు గర్హించిరి. ఎల్లకాలము సతిని ప్రక్కను నిలిచి పనిచేయుదుమని వాగ్దానములుచేసిన పెద్దమనుష్యులు మొగములు చాటువేసిరి. ఇట్లు దేశస్థులచే విడువఁబడియు విద్యాసాగరుఁడు తనకార్యంబు శాస్త్రసమ్మతమనియు జగద్ధితకరమనియు నీతిప్రవర్తకమనియునమ్మియుండుటచే నేనియుఁ జలింపక ధైర్యసాహసముగలిగి పర్వతమువలె చెక్కుచెదరక నిలిచి వివాహము వెంబడిని వివాహము జేయనారంభించెను. ఈ పెండ్లిండ్లు వైభవముతోఁ జేయుటంజేసి యతఁ డప్పులపాలయ్యె. ఆసమయమున ధనికులగుమిత్రులనేకులువచ్చి ద్రవ్యసహాయముచేసి యాదుకొనుటకు రాఁగా విద్యాసాగరుఁడు వారివలన నించుకేనియు సహాయముఁగొనక యాభారము తానే వహించెను. ఇతరులకు ధర్మోపన్యాసములు చేసి తాము దూరముననుండునట్టి యీనాటి సంఘసంస్కర్తలుకొందఱివలెఁగాక యాపండితుఁడు తనపూనినపనియందు నిజమయినయభిమానముగలవాఁడగుటచేఁ దనకుమారున కొక వితంతుబాలికను వివాహము చేసి చెప్పెడు మాటలకును జేసెడు చేతలకును వైరుధ్యములేదని జగంబునకు వెల్లడిచేసెను. ఈతెఱంగున పునఃపరిణయంబునఁ గృతకృత్యుఁడై యంతతోఁ దనివినొందక విద్యాసాగరుఁడు కులీనపద్ధతియనుదురాచారముపై ధ్వజమెత్తి దానిని నిర్మూలించుటకుఁ బాటుపడెను. ఆదేశ

ముల సగ్రగణ్యులు కులీనబ్రాహ్మణులగుటచే వారిలో నొక్కొక్కఁడు నలువది యేబది యాఁడువాండ్రను బెండ్లియాడి యేభార్యతండ్రి యెక్కువకట్నములు కానుకలు నిచ్చునో యాభార్య నాదరించుచు తక్కినవారల నిరాకరించుచు పడఁతులను బలువెతలపాలు సేయుచుందురు. విద్యాసాగరుఁడు నోరులేని యబలపక్షము బూని యనేకసభలుచేసి కొట్టకొన కాదురాచారము నిర్మూలింప నొకచట్టము నిర్మింపుఁడని ప్రాంతీయమువారికి వేనవేలు జనులచేత వ్రాళ్లుచేయించి మహాజరుఁ బంపించెను. కాని వితంతువివాహవిషయమునందువలె నతఁడీకార్యమందు సఫలమనోరథుఁడు కాఁడయ్యె. హిందువులు వేదశాస్త్రములు తమకుం బ్రమాణములని నమ్ముటచే స్త్రీపునర్వివాహాది కార్యము లకార్యములు కావని యాగ్రంథములయందుఁ బ్రమాణవచనములు జూపినచో నంద ఱొప్పుకొందురని విద్యాసాగరుఁడు కొంత కాలము నమ్మియుండెను. కాని శాస్త్రప్రమాణమును జూపినవెనుక సయితము హిందువులు పునర్వివాహములు నిరాకరించినప్పుడు నిజముగా హిందువులకు వేదశాస్త్రములయందు నమ్మకము లేదని యాతఁడిప్పుడు నిశ్చయించుకొనెను. బాలికలకుఁ గడుచిన్నతనమందె వివాహములు సేయుట దురాచారమని యాతని యభిప్రాయము. నమ్మినట్లు నడచుకొనునట్టి యంతఃకరణశుద్ధుఁ డగుటచే విద్యాసాగరుఁడు తనకూఁతులకు వ్యక్తిగాకమునుపు వివాహములు సేయఁడయ్యె.

విద్యాసాగరుఁడు దయాసాగరుఁడు. ఆతఁడు జనుల కాపద్బాంధవుఁడు. నిరుపేదలకు నిక్షేపము. మెఱమెచ్చులదాత గాక యాతఁడు పేదలకొఱకు ననదలకొఱకు గతిలేనివారికొఱకు వగచి మనఃపూర్వకముగ ననేకదానములు చేసెను. మధుసూదనదత్తను బంగాళీకవీశ్వరుఁ డొకఁడప్పులపాలయి ఋణములు దీర్పలేక చెఱసాలకుఁ బోవుటకు సిద్ధముగ నున్నపుడు విద్యాసాగరుఁడు ఋణప్రదాతల కాధన

యిచ్చి వాని విడిపించెను. స్థితిచెడియున్న మిత్రుల కుటుంబములకు బంధువుల కుటుంబములకు ధనసాహాయ్యముచేసి వారిగౌరవము చెడకుండ నెన్నియో తోడ్పాటులు చేసెను. స్వగ్రామమున నితఁడు విద్యనేర్పఱుపఁదలఁచి యొక పాఠశాలను దనసొమ్మున స్థాపించెను. తనయూరికిఁ బోవునపుడెల్ల నితఁడు కండువలు దుప్పటులు మొదలగు బట్టలుఁగొని వేసికొనిపోయి యచ్చటి బీదసాదలకు నుచితముగఁ బంచిపెట్టుచుండును. స్వగ్రామమున [illegible] యొక వైద్యశాల నొకదానిని స్థాపించి దానికగు వ్యయమంతయుఁ దానే యిచ్చి నిలిపెను. "హిందూ కుటుంబ [illegible]" యను [illegible] సంఘమునకు [illegible] వేయు [illegible]. "హిందూ కుటుంబభరణ నిధి" (Hindu family annuity fund) యను [illegible] సంఘముగలవారి లాభము నిమిత్త మొకసంఘము నితఁడు సహాయమునొసఁగి బయలు దేర్చెను. [illegible] సంఘము [illegible] ముఖ్యమని యెన్నఁబడుచున్నది. 18[illegible]8 వ సంవత్సరమున బంగాళమునందు [illegible] సంభవించి విద్యాసాగరుఁడు [illegible] [illegible] [illegible] భోజనము పెట్టి [illegible] వేలకొలది [illegible] సంరక్షించెను. 18[illegible] వ సంవత్సరమున బర్ద్వాను పట్టణములో మన్యేఘ [illegible] [illegible] వైద్యసహాయము లేక [illegible] కొలఁది మృతినొందిరి. అప్పు డీశ్వరచంద్రుఁడు కావలసిన మందులు కొని యక్కడకుఁ బోయి యచ్చటివారి కుచితముగఁ బంచిపెట్టి సాయము చేసెను.

విద్యాసాగరుఁడు పరులధనము చిల్లిపెంకునలెఁ జూచునంతటి స చ్ఛీలుఁడు. ఒకనాఁడతఁడు తనధనమంతయు లెక్కఁజూచుకొనుచుండ లెక్కలోబట్టి తనసొమ్మునందుఁ దనిన సొమ్మొకంటె నెక్కువ గానఁబడి

ను. అదిమొదలు యీశ్వరచంద్రుఁ డున్నంతవఱకు పాఠశాలాధికారిగా నున్నప్పుడు దొరతనమువారిసొమ్ము కొంతసొంతఖర్చునకుఁ దన సొమ్ములోఁ బడియుండునని యనుమానించి "మిస్టర్ కెల్లోనల్" గారికి వ్రాసి యాధనము నగ్రహించుమని ప్రార్థించెను. ఆయన యాసొమ్ము దొరతనమువారికి రావలసిన పనిలేదని నొక్కి చెప్పెను విని విద్యాసాగరుఁ డామిక్కిలిసొమ్ము దొరతనమువారికిచ్చి తనయంతరాత్మను సందేహమునుండి విముక్తిఁ జేసెను. ఆహాహా! ప్రతిజ్ఞాశక్తి చరిత్రమును ఋజుమార్గప్రవర్తనమును గలవానిని [illegible] చూపుట యెంతకష్టమో మీరే యెఱుంగుదురు.

"మిస్ మేరీ కార్పెంటరు" అను నాంగ్లేయ స్త్రీ యొకతె యింగ్లాండునుండి వచ్చి దేశమునందలి బాలికాపాఠశాలల నొకసారి చూడవలయు ననికోరి వాని జూపుటకు విద్యాసాగరుని దనవెంటఁ దీసుకొనిపోయెను. అతఁడామె కార్యోత్సాహమును జూచి సంతోషపడుచుండఁ బూర్వగతానుశ్రుతముగ దైవవశమున బండి బోల్తపడి విద్యాసాగరుఁడు దెబ్బలచే స్మృతితప్పి నేలంబడియె. తగుచికిత్సలు చేసిన పిదప కొంతకాలమున కతఁడు మరలఁ బూర్వస్థితి నొందెను గాని యాతని యారోగ్యము దేహదార్ఢ్యము వెడలిపోయె. అట్టి దుర్బలశరీరముతో నతఁ డింక నిరువదియైదు సంవత్సరములు గడపెను. సంతాలులను జాతిలో నున్న కర్మతారుగ్రామమును దనకు నివాసస్థలముగఁ జేసికొని వేసవికాల మచ్చటఁ గడప నిశ్చయించుకొని యతఁ డప్పుడప్పుడు బోవుచుండెను. 1890 వ సంవత్సరము డిశంబరు నెలలో తనయారోగ్యస్థితి పూర్తిగ చెడిపోవుటచేఁ గొంతకాలము చంద్రనగరమునకుఁ బోయి యుండి యచ్చట స్వస్థతగానక చిట్టచివరకుఁ గలకత్తానగరముఁ జేరి యంతకంతకు క్షీణించి 1891 వ సంవత్సరము జూలై నెల 29 వ తారీఖున విద్యాసాగరుఁడు జీవయాత్రముగించి లోకాంతరగతుఁడయ్యెను.

1877 వ సంవత్సరము జనవరి నెల ఒకటవ తారీఖున విక్టోరియారాణి హిందూ దేశ చక్రవర్తినీ మహాబిరుదము ధరించినప్పుడు కలకత్తాలో దొరతనమువారు విద్యాసాగరునకు నొక గౌరవపత్రికనుదయచేసిరి. 18్0 వ సంవత్సరము జనవరినెలలో జరిగిన దర్బారులో దొరతనము వారతనికి సి. ఐ. ఇ. బిరుదము నిచ్చిరి. ఈమహాత్ముఁడు మహాధన వంతుఁడు విద్యావంతుఁడు కీర్తిమంతుఁడునయ్యు వేషభాషలలో సామాన్యులవలెనుండి నిగర్వముగా మసలినవాఁడై యుండెను నిజమయిన దేశాభిమానమును బరోపకారబుద్ధియు స్థిరప్రజ్ఞ కార్యశూరత్వమును పిని యెుద్దనుండియే నేర్చుకొనవలయును. విద్యాసాగరుఁడు కృపాసముద్రుఁడౌ గుణరత్నములయుండైనాంధకారస్యసూర్యుడై నిర్వాణ్యుడై భంగిసంగముఁడు గాక మరి మూఢసంక్రమింపక సాగరస్థము సేయుటను సార్థకమగు నట్లు నడచినలోకోత్తరచరిత్రుఁడు. కీర్తిందియు సోహృగస్థలునస్వగౌరవమును జంపుకొని తెమయధికారు లేకూఁతలు కూయుచున్న నవికూయుచు నేవ్రాతలు వ్రాయుచున్న నవి వ్రాయుచు నేచేఁతలు చేయుచున్న నవి చేయుచుఁ బ్రజలను పీడించు సికారులలో నెలకైనువందలరూపాయలు జీతము గలిగి యధికారము గలిగి గౌరవమును దెచ్చు నుద్యోగమును తృణప్రాయముగ నెంచి వదలుకొన్న స్వతంత్రుఁడు విద్యాసాగరుఁడే. పరిజనపోగడ్తలకుఁ బొంగక దూషణలకు దుఃఖపడక బహిష్కారమునకు భయపడక కష్టములనుగణనసేయక తనకుధర్మకార్యమని తోఁచినదానినిపట్టువదలక సాగించి "పరోపకారార్థమిదంశరీర" మనుమాట సార్థకముచేసిన మహాత్ముఁ డీశ్వరచంద్రుఁడే. మెత్తని మనసుగలవాఁడయ్యు స్థిరచిత్తుఁడు. పరమశాంతుఁడయ్యు దుష్టులకు భయంకరుఁడు. నమ్మిన ట్లాచరించుటయందును మనసులోనున్న మాట నిర్భయముగఁ బలుకుటయందును బరులసౌఖ్యమునకై స్వసౌఖ్యమును మానుకొని కష్టపడుటయందును నతని కతండేసాటియనవచ్చును. అత

నియౌదార్యము నతని వినయము నతని సౌజన్యము నతనిశాంతము వానివిద్యకు వన్నె వెట్టినవి. దేశమున కీతఁడొనర్చిన మహోపకారమునకు దేశస్థులలోఁ గొందఱు కృతజ్ఞులై వానిగుణగణంబులఁ గొనియాడుచు నెన్నియోపాటలు పద్యములు రచించిరి. అవి యిప్పటికిని బంగాళా దేశమున మారుమూలల నయితము పాడఁబడుచుండును.

మహర్షి దేవేంద్రనాథ టాగూరు.

టాగూరనుమాట ఠాకూరను పదమునుండి వచ్చెను. ఈశబ్దమునకు జమీందారుఁడని యర్థము. కాఁబట్టి మహర్షి దేవేంద్రనాథటాగూరు మిక్కిలి గౌరవముగల జమీందారు కుటుంబములోనివాఁడని మనము తెలిసికొనవచ్చును. ఈటాగూరుల సంస్థానము బంగాళాదేశములో జస్సూరుమండలమునందున్నది. దేవేంద్రనాథుని పూర్వులలోనొకఁడగు పంచాననటాగూరను నతఁడు స్వస్థానమును విడిచి కలకత్తానగరమునకుఁ గాఁపురము వచ్చెను. వానికొడుకగు జయరామటాగూరను దొరతనమువారి యొద్ద గొప్పయుద్యోగముఁ జేసి పాతుర్యఘట్టమున నొక సౌధముఁగట్టి ప్రసిద్ధుఁడయ్యెను. ఆతని మునిమనుమఁడగు ద్వారకనాథటాగూరు దేవేంద్రనాథునితండ్రి. ఇతఁడు మిక్కిలియైశ్వర్యముగల జమీందారుఁడయ్యుఁ జక్కఁగ నింగ్లీషు చదువుకొని న్యాయవాదియై యూరపులో నపారముగఁ గీర్తియు ధనమును సంపాదించి యంతతో నూరకొనక నిరుపురువారలంగూడి వ్యయముఁ జేసి కొనియాడఁబడియెను. ఈయన రాజా రామమోహనరాయలకు సహకారియయి సహగమనము నడచివేయుటలోను హిందువుల కింగ్లీషుభాష నేర్పుటకయి హిందూకళాశాలను స్థాపించుటలోను వానికిఁ గాలఁ దోడ్పడి కుడిభుజముగ నుండెను. అంతియగాక రామమోహనుఁ డింగ్లాండునకుఁ బోయినపిదప వానిచే నెలకొలుపఁబడిన బ్రహ్మసమాజమున కితఁ డధ్యక్షుఁడయి దానిని నిలిపెను. ఎఱిఁగినవారందఱు నితనిని మహారాజా ద్వారకనాథటాగూరనుచుండెడివారు. వానియౌదార్యము మితిమీఱినదగుటచే వంగదేశమునం దే సత్కార్యమును దలపెట్టినను వీనిసాయము లేక యది నెరవేరదయ్యె. ఈయనకీర్తి యూరపుఖండమునందును హిందూదేశమునందును సమానము

మహర్షి దేవేంద్రనాథ టాగూరు.

గవ్యాపించి యుండెను. ఇతఁడు 1841 వ సంవత్సరమున యూరోపుఖండమునకుఁబోయి యింగ్లాండు ప్రాన్సు మొదలగు దేశములకుఁజని యచ్చటి రాజులచేత సన్మానము మిక్కిలి గౌరవింపఁబడియెను. ఈతఁడింగ్లాండునకుఁ బోయినప్పుడే దేశోపకారార్థమై వచ్చి యచ్చట మృతినొందిన రామమోహనరాయలకు క్రొత్త గోరి కట్టించెను. యూరోపునుండి మఱుసటిసంవత్సర మితఁడువచ్చి మరల 1845 వ సంవత్సరమున నింగ్లాండునకుఁ బోయి 1846 వ సంవత్సరమున తనప్రియమిత్రుఁడగు రామమోహనుని వలె నా దేశముననే లండనునగరమున మృతినొందెను. ద్వారకనాథునకుఁ గలుగుముగ్గురు కొమారులలోను దేవేంద్రనాథటాగూరు జ్యేష్ఠపుత్రుఁడు. ఈతఁడు 1817 వ సంవత్సరము మే నెలలో జన్మించెను. తండ్రితల్లికడఁ జిన్ననాఁటనుండియుఁ జనువెక్కుడగనుండుటచే నామె మనుమని ననేకపుణ్యక్షేత్రములకుఁ దనతోఁగూడఁ దీసికొనిపోయి త్రిప్పెను. ఇతఁడు తనపితృసఖుఁడగు రామమోహనునిచే స్థాపింపఁబడిన హిందూకళాశాలలో విద్యనభ్యసించెను. బుద్ధిసూక్ష్మతకలవాఁడగుటచే బాల్యమునందే యీతఁడు సంస్కృతము, పారసీ, యింగ్లీషు, బంగాళీభాషల నేర్చుకొని వానిలోఁ బ్రవీణుఁడయ్యెను.

చిన్ననాఁటనుండియు నితని కుపనిషత్తులపై నెంతయు నిష్టము. అదియునుఁగాక బ్రహ్మసమాజస్థాపకుఁడగు రామమోహనునియింటికిఁ దఱచుగఁ బోవుచుండుటచే నీశ్వరారాధనవిషయము లగుప్రసంగములు వినుచు వచ్చెను. ఆగర్భశ్రీమంతుఁడగుటచే దేవేంద్రనాథుఁడు మహావైభవము లనుభవించుచుఁ బెరిగెను. తనబాల్యమునుగూర్చి యతఁడే యొకచోట నిట్లు వ్రాసియున్నాఁడు-

“సంపన్నలగు తల్లిదండ్రులకుం బుట్టి రాజఠీవిగలకుటుంబమున మహావైభవముతోఁ బెరుగుటం జేసి చిన్ననాఁట నేనెన్నఁడు భగవంతుని పేరయినఁ దలపెట్టనైతి. ప్రపంచమునం దందఱు నన్ను గౌరవిం

చువారు. అందఱు నాకు సదుపాయములను జేయువారె. పిలుచుటయే తడవుగ లెక్కకు మిక్కిలి సేవకులు నాయెదుటఁ జేతులుకట్టుకొని నిలుచుండువారు. ప్రపంచమున నే నొకనిముసమునైన యెడలేనిసముద్రతరంగములవలె వచ్చి నాచేతులం బడుచుండెడిది. నేనడుగకయే యానందమ్ముగ నా కనేకవస్తువులు లభించుచు వచ్చినవి. సౌఖ్యసంపదలు నన్నాదినములలో భ్రమపెట్ట నేనెన్నఁడు నెఱుఁగక మోహసముద్రమునం బడితిని. తాత్కాలికములగు సౌఖ్యములనే జూచుచుంటినిగాని నేను పరలోకమును భవిష్యత్కాలమును దలంపనైతిని. నేను ప్రపంచసంబంధములగు మాయలయందుఁ దగుల్కొని యింద్రియసుఖములలో నుండఁగా నా యంతరాత్మను లెక్కసేయక భోగపరాయణమైన మనస్సెట్లు త్రిప్పిన నట్లు తిరిగితిని. ఈస్వర్గానుగ్రహము నీయవస్థ చిరకాలముండదయ్యె."

దేవేంద్రనాథుఁడు బదునెనిమిది సంవత్సరముల ప్రాయమువాఁడై యున్నప్పుడు ముసలిదియగు నాతని పితామహి రోగపీడితయై మరణమునకు సిద్ధమయ్యెను. గంగాతీరమునఁ బ్రాణములు విడుచుట చాలపుణ్యమని నమ్మి యాదేశపు లోని జనులు మరణకాలము సమీపించిన మనుష్యుల నేటియొడ్డునకుఁ గొనిపోవుచుందురు. ఆ యాచారమును బట్టి దేవేంద్రనాథుని పితామహిని గంగయొడ్డునకుఁ గొనిపోవ నామె యచ్చట వెంటనే మృతినొందక మూఁడహోరాత్రములు బ్రతికియుండెను. ఆసమయమున నామె బంధువులందఱు చుట్టుం గనిపెట్టుకొనియుండిరి. పురోహితులు హరినామస్మరణం జేయుచుండిరి. మూఁడవనాఁడు పున్నమియగుటచే నారేయి పండువెన్నెలలు గాయఁజొచ్చెను. శ్రమజెందినవారి యాయాసము నపనయించుచు మందమారుతము చల్లఁగ వీచుచుండెను. అప్పుడు దేవేంద్రనాథుని మనస్సునఁ దీవ్రముగ వైరాగ్యము ప్రభవించెను. అదియెట్టు నెలకొనెనో తెలియుట కాతని స్వవచనముల నీక్రిందఁ బొందుపఱచెదను.

"ఈసమయమున నమ స్వప్రధానము లన్నియు సన్నిహితములనియు విసర్జ్యములనియు నాకుఁదోఁచెను. శోకచింతలచే నేను మనుష్యుఁడనగాక మారికొంత ధైర్యవంతుఁడనైతిని. ఘనమునై శోభించెను. నేనప్పుడు కూర్చున్న ప్రాంతమెనుముచాఁపయె నాకుఁ దగినదని తలంచితిని. వెలలేని తివాసులు మెత్తని పాన్పులు గోనగు నాస్పృష్టి చేసె పత్రిస్తు. అన్నాళ్ళకెన్నఁ డెఱుఁగని మహానందము నామనసున నుదయించెను. అనేక సంవత్సరములు నేనింద్రియసుఖములో నుండియుండిన కాలమున మతమున నెన్నో భగవంతుఁడను నెట్టివాఁడని పరిశోధించి యన్వేషించినప్పుడు ముఁ బొందనైతిని. అస్మశానభూమి ప్రశాంతమును నిశ్శబ్దముగ నుండెను. ఆమహానందము నేను పట్టఁజాలక పరవశుఁడనైతిని. ఆయానందమును వర్ణించుట కేభాషయుం దేమాటలుఁ జాలవు."

అనుభవైకవేద్యమై మనఃప్రవచనములకు నగోచరమై లోకసామాన్యమునకు యనన్యదుర్లభమును యమూల్యమైన యాబ్రహ్మానందమును దేవేంద్రనాథుఁడు రాత్రియంతయు ననుభవించి మఱునాఁటినుండియు పిచ్చివాఁడుపోలె నేదియోయాలోచించి చింతించువాఁడుపోలె ధ్యానయోగమగ్నుఁడై పోలె మందమతియై ప్రసన్నమైన చిత్తసుఖము ననుభవింపసాగెను. నాఁటిరాత్రి యానందమును మఱలఁ దెచ్చుకొనవలయునని యతఁడెంత ప్రయత్నించినను సాధ్యము కాదయ్యె. మనశ్శాంతికొఱకు తాయన యుపనిషత్తత్త్వశాస్త్రములఁ జదువుకొనియెఁగాని తాను గోరిన శాంతి రాదయ్యె. భగవంతుని సాన్నిధ్యమును బడయవలయునని యుద్దేశముతో ప్రతిదినము బలుసారులు ప్రార్థనఁ జేయుచుండెను. ఒకప్పుడు సూర్యోదయము మొదలు మధ్యాహ్నమువఱకు నెండలో నతఁడీశ్వరధ్యానము సేయుచుఁ బాహ్యవైవశ్యముజెందియుండ సేవకులు సుకుమారమగు వానిమేనెండచేఁ బడకుండ గొడుగులు బట్టుచువచ్చిరఁట. ఇట్లు మూఁడు సంవత్సరములు గతించెను.

అతఁడిరువదియొక్క సంవత్సరముల ప్రాయముగలవాఁడైన ప్పుడొకనాఁడు తనగదిలోఁ గూర్చుండగా వ్రాతపుస్తకములోని పత్ర మొకటిచినిగి గాలికిఁగొట్టుకొనివచ్చి యతని ముందటం బడియె. అందొక సంస్కృతశ్లోకముండుటచేఁ దనపురోహితుని దానియర్థ మడిగి వానివలనం దెలియఁజాలక బ్రహ్మసమాజ ప్రధానాచార్యుఁడగు నీరామచంద్ర విద్యావాగీశునొద్దకుఁబోయి దానియర్థ మడిగెను. ఆపండిత శిఖామణి యది యీశోపనిషత్తులోని మొకటిశ్లోకమనియు భగవంతుఁడు జగత్తునంతయు నిండియుండును గనుక సర్వమీశ్వరమయమే యని యెంచి మనుష్యుఁడు పరులధనమునకాశఁ జేయక తనకున్న దానితోఁద నివినొందవలయునని, దాని తాత్పర్యమునియును జెప్పెను. అదివిని దేవేంద్రనాథుఁ డక్కజపడి యుపనిషత్తులలో నెంతెంత యర్థమున్నదో తెలిసికొనఁగోరి యానాఁటి మొదలు సంస్కృతము జదువుకొని యుపనిషత్తుల నర్థసమేతముగ నేర్చుకొనెను. ఈవేదాంతభాగముపై నతనికి మరణమువఱకు నింతింతనరానిభక్తి గలదు. దేవేంద్రనాథు నెఱిఁగినవారు కొందఱతఁడు జ్ఞానియని తెలిసికొని వానియొద్ద వేదాంతము నేర్చుకొనుచువచ్చిరి. వేదాంతవిద్యాభివృద్ధికొఱ కాయన 1839 వ సంవత్సరమున తత్త్వబోధినియను నొకసభ స్థాపించి దేవేంద్రనాథుఁడు తనచెలికాండ్రు పదుగుర నందుఁ జేర్చి వారమునకొకసారి యందఱుం గలిసి వేదాంతార్థములఁ జర్చించి జ్ఞానాభివృద్ధి జేసికొనుచు నెలకొకసారి ప్రార్థనలఁ జేయుచువచ్చెను. ఈసభాసంబంధమున నతఁడు తత్త్వబోధిని పత్రిక నొకదానిని బయలుదేఁదీసి దానికిఁదనమిత్రుఁడగు నక్షయ కుమారదత్తును సభాపతిగాఁ జేసెను. ఈసభలో మొదటపలువురు చేరకపోయినను గొలఁదికాలమున నవద్వీపమహారాజగు శ్రీశ్చంద్రరాయలు బర్ద్వాను మహారాజాధిరాజు మొదలగువా రనేకులు చేరిరి. 1842 వ సంవత్సరమునం దతఁడు తత్త్వబోధినీసభయొక్క ప్రథమ సం

వత్సరోత్సవమును మహా వైభవముతో జరిపెను. ఆయుత్సవమునకాయన నగరములోనున్న వారిఁ జిన్నపెద్దలనక నందఱఁ బిలిచెను. ఊరిలోనున్న తగుమనుష్యు లదివఱకు సభపేరయిన నెన్నఁడు వినియుండ నందున నీయుత్సవమున కెవరు రారుగాఁబోలు నని సామాజికులు చింతించిరి. కాని రాత్రియెనిమిది గంటలకు సభా భవనమంతయు జనులతో నిండి క్రిక్కిఱిసి కూర్చున్నవారి కూపిరిసలుపన ట్లయ్యెను. సభ యెనిమిది గంటలు మొదలు రెండుగంటలవఱకు జరిగినను వచ్చినవారు నిద్రాహారములుమాని కొని జరిగినచర్యల నెంతయు శ్రద్ధతో నాలకించిరి.

ఇట్లుండి యతఁడు బ్రహ్మసమాజమున కప్పుడప్పుడుపోయి చూచుచుండెను. రామమోహనరాయ లింగ్లాండునకుఁ బోవకమునుపు ప్రార్థనమునిమిత్తము బ్రహ్మసమాజమున కొకమందిరమును నిర్మించి రామచంద్రవిద్యావాగీశుని ప్రధానాచార్యునిగ నేర్పఱచిపోయెను. రామమోహనుఁడు వెళ్లినదిమొదలు సమాజము క్రమక్రమమున క్షీణించినందున విద్యావాగీశుఁడిఁక సమాజమువృద్ధిపొందదని నిరాశఁజేసికొనియెను. ఉపనిషత్తులు జదువుటచే దేవేంద్రనాథుని మనస్సు పరిపక్వమయి భక్తిజ్ఞానవైరాగ్యములతో నిండినందున నతఁడు పరమేశ్వరుఁ డొక్కఁడేయనియు నతఁడు నిరాకారనిర్వికల్పనిరంజనుం డనియు గ్రహించి విగ్రహారాధనము సేయఁగూడదని నిశ్చయించుకొని తన మిత్రులతో నతఁ, డాసమాజమునఁజేరి తన తత్వబోధినీ సమాజముఁ గూడ నందుఁగలిపి విద్యావాగీశున కానందముఁగలిగించి కొనయూపిరితోనున్న బ్రహ్మసమాజమును బ్రతికించెను. ఇతఁడు చేరుటచేతనే బ్రహ్మసమాజ మొకగొప్పమతమయ్యెను. దానికిఁగావలసిన ధనసహాయమంతయు నతఁడేచేయుచు దానిభారమంతయు నతఁడే వహించుచు సర్వవిధముల దానినివృద్ధిజేసెను. మఱియు వేదాంతశాస్త్రవృద్ధి కొఱకు తత్వబోధినీ పాఠశాల నొకదానిని స్థాపించి దానికిఁగావల

సిన ధనమంతయు నశించియుండెను. నాలుగువేదముల నర్థసమేతము గాఁ జదువుటకు నలుగురు బ్రాహ్మణకుమారులను గాశీపురమునకంపెను. బ్రహ్మసమాజములోఁ జేరిన తనమిత్రులలోఁ గొందఱప్పటికిని విగ్రహారాధనము సేయుచుండుటఁ జూచి యదిమాన్పింపఁ దలఁచి 1843 వ సంవత్సరమునం దాయన సమాజకులందఱు ప్రమాణపత్రిక నొకదానిని పై వ్రాలు చేయవలయునని తీర్మానించెను. ఆపత్రికపై సంతకములఁ జేయువారు తాము సృష్టిస్థితిలయకారణభూతుఁడగు పరాత్పరు నద్వితీయు మానసారాధనము సేయుటయేగాని విగ్రహారాధనము సేయమనియు రోగదుఃఖపీడితు లగునప్పుడుతప్ప ననుదినము భగవంతుని సేవసేయుదుమనియు దుష్కార్యములఁ జేయమనియు సత్కార్యములఁ జేయఁబ్రయత్నింతుమనియుఁ బ్రమాణముఁ జేసి వ్రాలు సేయవలయు. ఇట్లుచేయుటకు దేవేంద్రనాథుఁడు మొదలగు నిరువదిమంది పదుచువాండ్రు సిద్ధమై శ్రద్ధాభక్తులతోఁ బవిత్రహృదయములతో వచ్చి రామచంద్ర విద్యావాగీశునియెదుట నిలిచిరి. అప్పుడా వృద్ధబ్రాహ్మణుఁడు బ్రహ్మసమాజమత మభివృద్ధిపొందు మేలుదినములు వచ్చినవికదా యని సంతసించి యానందపారవశ్యమున కన్నులనుండి బాష్పములు విడిచి గద్గదకంఠుఁడై చెప్పఁదలఁచుకొన్న యుపన్యాసము చెప్పనేరక "హా! ఈసమయమున రామమోహనుఁడే యుండిన నెంత యానందించునోకదా." యని పలికి వారిని స్వమతమునం జేర్చికొనియెను.

ఇట్లు చేరిన కొలఁదికాలములోనే యతనికి క్రైస్తవమతబోధకులతో వివాదము సంభవించెను. అతని తండ్రియొద్దఁ బనిసేయుచుండిన రాజేంద్ర సర్కారను నొక బ్రాహ్మణునిభార్యయు నామె సోదరుఁడును క్రైస్తవమతమునఁ గలియుటకయి యొకబోధకుని యింటికిఁ బోయిరి. తనభార్యను దనకిప్పింపుఁడని మగఁడు కోర్టులో దావా తెచ్చెను. కాని వానిప్రార్థన మరణ్యరోదన మయ్యెను.

అతఁ డంతట దేవేంద్రనాథునితోఁ మొఱఁబెట్టుకొనఁగా నతఁడు క్రై స్తవుల దుర్ణయమునకు బిట్టలుకఁ బూని వారి యధర్మవర్తనము నివారింపఁజేయఁ దలఁచి యొక సభఁ జేసి కలకత్తాలోనున్న పెద్ద మనుష్యుల నందఱ రావించెను. మతవిషయముల నతనితోఁ భిన్నాభి ప్రాయులయ్యు నీయుత్తమ కార్యమున జమీందారులు, మహా రాజులు, నుద్యోగస్థులు నాతనితోఁ నేకీభవించి హిందూబాలుర నిమిత్త మొకపాఠశాలను స్థాపించుటకు నిశ్చయించిరి. ఆసభకు వచ్చినవారియుత్సాహ మేమని చెప్పుదు. ఆక్షణమందే యేఁబది వేల రూపాయిలు పాఠశాలకు మూలధనముగ నొసఁగఁబడెను.

ఇరువది యెనిమిది సంవత్సరముల ప్రాయముననే దేవేంద్రనాథుఁ డింతపనిఁ జేయుటచే నక్కజపడి పౌరు లనేకులు బ్రహ్మసమాజము మంచిదేయని యందుఁ జేరిరి. ఈతెఱంగునఁ బనిసేయుచుండ బ్రహ్మ సమాజ మతస్థులకేది ప్రమాణగ్రంథముగ నుండవలయుననివారిలో వారికి సందేహములు గలిగినవి. అక్షయకుమారదత్తు వేదములు పౌరు షేయములగుటచే నప్రమాణములనియె. కొందఱు వేదములే ప్రమా ణములనిరి. కొంతకాలము వాదానువాదములు జరిగిన పిదప దేవేంద్ర నాథుఁడుతక్కుంగల సామాజికులు వేదశాస్త్రములు ప్రమాణములుగా వనియు, బుద్ధి నుపయోగించి చక్కఁగవిచారించి యాగ్రంథములలో మంచియున్నయెడల గ్రహించితదితరములఁద్రోసివేయవలయుననియు నిశ్చయించిరి. అనంతరము బ్రహ్మసమాజమతస్థులకుధర్మశాస్త్రమేద యిన నుండవలదాయని సందేహము గలుగ దేవేంద్రనాథుఁడాతెగ వారి యుపయోగము నిమిత్తము బ్రహ్మధర్మ మనునొకగ్రంథమును ని ర్మించెను. ఈగ్రంథమును రచించుటకేండ్లును బూండ్లును బట్టకయతని కొకనాఁడు మూఁడుగంటలసేపుపట్టెనఁట. తనమిత్రునొకనివ్రాయుము ని వేదములనుండియు శాస్త్రములనుండియుఁ దనకుఁగంఠపాఠముగవ

చ్చిన కారికల నద్భుతముగఁ జెప్పెనఁట. ఈబ్రహ్మధర్మము మొదటనంస్కృతమున వ్రాయఁబడి పిదపనాంగ్లేయభాషలోనికి బంగాళీ మొదలగు స్వదేశభాషలలోనికిని మార్పఁబడి యిప్పుడు దేశమందంతటనుపయోగింపఁబడుచున్నది.

ఇంతదనుక దేవేంద్రనాథుఁడు మొదలగుబ్రహ్మసమాజమతస్థులుతమతమవర్గములలో నేయుండిరి. 1843 వ సంవత్సరమున దేవేంద్రనాథుని తండ్రియగు ద్వారకనాథటాగూరు లండనునగరములో మృతినొందెను. తండ్రికుత్తరక్రియ లెట్లుచేయవలయునని యతనికి సందేహము జనించెను. బ్రహ్మధర్మప్రకారముచేయుటయుక్తమని దేవేంద్రనాథుడుతలఁచెను. టాగూరువంశస్థులు బ్రాహ్మణులగుటచే వేదశాస్త్రముల ప్రకార ముత్తరక్రియలు జరిగింపవలసినదనియు నట్లు జరిగింపని యెడల కుటుంబగౌరవమునకు భంగమువాటిల్లుననియు వానిబంధువులు మిత్రులుపలుమారు నొక్కిచెప్పిరి. దేవేంద్రనాథుఁడవియెల్లఁ బెడచెవినిబెట్టి బ్రహ్మసమాజ ధర్మప్రకారముగఁ దనపైతృకమును నిర్వర్తించెను. అప్పుడుకులస్థులగు బంధుమిత్రులు వానిబహిష్కరించి పరిత్యజించిరి.

ఈమహాత్ముని మహాధైర్యమును దెలుపుట కీపైయంశములు చాలునుకానియితఁడు సత్యసంధుఁడని మహర్షి శబ్దమునకుఁదగినవాఁడనియుఁ దెలుపుట కింకొకముఖ్యాంశముగలదు. జనకుఁడగు ద్వారకనాథుఁడు బ్రతికినన్నాళ్ళు మహారాజవైభవముతో బ్రతికి యనేకదానధర్మముల సేయుటంజేసి యాయనమృతినొందునప్పటికొకకోటిరూపాయలు ఋణముండెను. అతఁడులోకవ్యవహారవేదియున్యాయవాదియునైనందున ఋణప్రదాతలు తన స్వార్జితమగు సొత్తుమీఁదికింబోకుండఁదగుకట్టుబాటులఁ జేసిచనిపోయెనువాణిజ్యవ్యాపారము మీఁదనున్నయాస్తియంతయు నప్పులవాండ్రకొప్పగింపుమనియువారిదిపంచుకొని వచ్చినంతపుచ్చుకొని పోవలయుననియు నేర్పాటులఁ జేసి బంధువులు

ఋణప్రదాతలనొప్పించిరి. ఈయేర్పాటు ధర్మస్వరూపుఁడగు దేవేంద్రనాథునకు నిష్టములేకపోయె. అప్పు లిచ్చినవారికి చెడిపోఁగూడదని చెప్పి వారిని రావించి జమీందారీములను దక్కినసొత్తును దీర్చానము నిమిత్తము వారికొప్పగించి సంవత్సరమునకుఁ గుటుంబరక్షణమునిమిత్తము ఇరువదివేల రూపాయలుఁ దనకు వచ్చునట్లొడంబరచెను. అంతియకాక విలువగలనగలు వస్త్రములు మంచిమేడలు మొదలగునవి విక్రయించి ఋణముఁ దీర్చెను. వేదములఁ జదువుటకుఁ గాశీనగరమునకుఁ బంపిన నలుగురు బ్రాహ్మణులను చదువుచాలించి రమ్మనియెను. తాను స్థాపించిన తత్త్వబోధినీపాఠశాలను గట్టిపెట్టి యామందిరమును విక్రయించెను. ఆఁడువాండ్రెక్కిపోవుట కొకపల్లకినుంచుకొని తక్కినసామానులన్నియు విక్రయించివేసెను వైభవమంతయుఁ గోలుపోయి సామాన్యుఁడట్లు బ్రతికి యతఁడు ఋణవిముక్తుఁడయ్యె. ఆహాహా! ఎగబెట్టుట కంతే పిలుస్తున్నప్పుడు తానుకష్టపడుచుఁ దండ్రిచేసిన ఋణములు దీర్చుట యీమహానుభావునియందుఁ దక్క మఱియొక్కనియందుఁ గాంచుట యరిదిగదా! ఋణములఁ దీర్చుటయేగాక ధర్మకార్యములనిమిత్తము తండ్రి చందాల నిచ్చెదనని వాగ్దానములఁ జేసినవారలకందఱకు వాగ్దత్తధనమును వడ్డితోఁగూడ నిచ్చి యీమహాత్ముఁడు పితృవాక్యపరిపాలకుఁడయ్యెను. ఇట్టియుదారచిత్తుఁడే దేశమునను౦డు,నా దేశము ధన్యముగదా! ఋణప్రదాతలు కొంతకాలమునిజమీందారీముల స్వాధీనముఁ జేసికొని వ్యవహరించి సరిగానప్పులు దీర్చుకొనలేక సంస్థానము మరల దేవేంద్రనాథునకే యప్పగించి యతనికిఁ దోఁచినట్లప్పులఁ దీర్చుమని వేఁడిరి. అతని సత్యసంధతయందుఁ బ్రజలకెంతనమ్మకముగలదో దీనింబట్టి తెలిసికొనుఁడు. వారివలన సంస్థానముమరలఁ గైకొని దేవేంద్రనాథుఁడు జాగరూకతతో వ్యవహరించి ఋణములుదీర్చి తనయాస్తి నిలుపుకొనెను.

ఇట్లు కొంతకాలమునకు దేవేంద్రనాథునకును వానిసహాకారులకును గొన్ని యభిప్రాయభేదములు గలుగ మనశ్శాంతికై యతఁడు 1856 వ సంవత్సరమునఁ బూర్వకాల మనేకమహర్షులకు నివాసమైనహిమాలయపర్వతములకుం బోయెను. పోయి యచ్చటఁబదునెనిమిదినెలలుండి మన వేదాంతశాస్త్రమును జక్కఁగఁ జదివి కాలముఁబుచ్చుచు నెడతెగని మహోన్నతమైన యాపర్వతరాజముయొక్క గాంభీర్యము నంతయుఁజూచి పరమేశ్వరుని మహిమను గొనియాడుచు మనశ్శాంతినిఁ బడసెను. అతఁడాకొండలమీఁద నున్నకాలమునఁ గలకత్తానగరమునఁ గేశవచంద్రసేనుఁడను పందొమ్మిదియేండ్ల ప్రాయముగల కుశాగ్రబుద్ధియొకఁడు ప్రమాణపత్రికపై సంతకముఁజేసి బ్రహ్మసమాజమునఁ జేరెను. దేవేంద్రనాథుఁడు మంచుకొండమీఁదనుండివచ్చి తనసమాజములోఁ జేరిన యీబాలుని వాకచక్యమునకుఁ బాండిత్యమునకు సద్గుణసంపత్తికిఁ గడుమెచ్చి వానితోఁ జెలిమిఁజేసి వానితోఁ గలిసి మతాభివృద్ధికయి పనిచేయనారంభించెను. చంద్రసేనుఁడు దేవేంద్రనాథునియెడఁ బితృభావము నిలిపెను. దేవేంద్రనాథుఁడు బాలునిపైఁ బుత్రప్రేమయు శిష్యవాత్సల్యమును జూపెను. ఈగురుశిష్యులిద్దఱు బ్రతిదినముఁ గలిసికొని రాత్రులు ప్రొద్దుపోవునంతకు వేదాంతతత్త్వములు సలుపుచు పరస్పరవిజ్ఞానాభివృద్ధిఁ జేసికొనుచుండిరి. ఈయిరువురకూడికచే బ్రహ్మసమాజమతము జనసమ్మతముగాఁ జొచ్చెను. కేశవచంద్రుఁడింగ్లీషునను దేవేంద్రనాథుఁడు బంగాళీలోను మతోపన్యాసములు చేయనారంభించిరి. బుద్ధిసంపన్నుఁడగు శిష్యుఁడు క్రొత్తక్రొత్తపద్ధతుల నెన్నో యూహించి తెలుప ధనసంపన్నుఁడగు గురువు వానినిఁ గొనసాగఁజేసెను. 1859వ సంవత్సరమున దేవేంద్రనాథుఁడు తనకుటుంబముతోఁ బొగయోడనెక్కి సింహళద్వీపమునకుఁ బయనము చేయఁదలఁప బాలుఁడు కేశవచంద్రుఁడు వారితోఁ బయనమ

యి పోయెను. ఈప్రయాణమున గురుశిష్యుల స్నేహబంధము మునుపటికన్న దృఢమయ్యెను. సింహళమునుండివచ్చినపిదప దేవేంద్రనాథుఁడు బ్రహ్మధర్మప్రకారముగఁ దనకూఁతునకుఁ బెండ్లిచేసెను.

1861 వ సంవత్సరమున వారిరువురుఁ గలిసి "ఇండియనుమిర్రర్"అను నాంగ్లేయపత్రిక నొకదానిని ప్రకటింపసాగిరి. అది యిప్పటికి నిదినపత్రికయయి కలకత్తానగరమున వెలువడుచున్నది. దేవేంద్రనాథుఁ డతనప్రియశిష్యుని వానిప్రజ్ఞకుఁ దగినంత గౌరవానిగఁ జేయవలయు నని నిశ్చయించి యొకదినమునఁ బ్రాహ్మసమాజికుల రావించి వానిసమక్షమునఁ గేశవచంద్రుని బ్రహ్మసమాజమతప్రధానాచార్యునిగ నభిషిక్తునిఁ జేసి బ్రహ్మానందుఁడను బిరుదమునిచ్చి బంగరుబంతుల చిత్రములో సమర్చిన యొకపటమును దంతపుమ్రుద్రయుఁ దనరచించిన బ్రహ్మధర్మగ్రంథప్రతియు వానికొసంగి మహావైభవముతో నుత్సవముఁ జేసెను. అదినము మొదలు బ్రహ్మసమాజమతమెంత మహోన్నతదశకు రావలెనో యంత మహోన్నతదశకు వచ్చెను.

ఉపన్యాసములిచ్చుటలో నుపహిందూదేశమునఁ గేశవచంద్రునంతవాఁడు మరల జన్మింపలేడనియనేకు లభిప్రాయపడుచున్నారు. అతని కారణముననే బ్రహ్మసమాజమున కనేకులు చేరిరి. కాని యీగురుశిష్యుల స్నేహముచిరకాలమునిలువదయ్యె. దేవేంద్రనాథుఁడు యజ్ఞోపవీతము దీసి పాశ్చాత్యమతాంతరులతో భోజనాదికములఁ జేయుచుండెనుకాని స్త్రీలను సభలకుఁదోడ్కొనివచ్చుట యితరవర్ణములు వారితో సంబంధ బాంధవ్యములు జేసికొనుట మొదలగు కొన్నికార్యములకిష్టపడఁడయ్యె. కొన్నివిషయములఁ బూర్వపద్ధతుల ననుసరింపఁ గోరుచిన గురువునకు నన్నిట నవీనపద్ధతుల నవలంబింపఁదలఁచు శిష్యునకు నభిప్రాయభేదములు గలుగుటంజేసి వారిరువురు చిట్టచివరకు విడిపోయిరి. దేవేంద్రనాథుఁడు తనమతమున కాదిబ్రహ్మసమాజమని

నామమిడియెను. కేశవచంద్రుఁడు తనమతమునకు హిందూదేశబ్రహ్మసమాజమని పేరుపెట్టెను. అదిమొదలు దేవేంద్రనాథమహర్షి ప్రపంచసంబంధము వదలుకొని యీశ్వరసేవయందె కాలముఁ బుచ్చుచుఁబ్రతిసంవత్సరము హిమాలయమునకుఁ బోవుచుఁ దనపరిశుద్ధజీవనమువలనను బవిత్రచరిత్రమువలనను సత్ప్రవర్తనమువలనను నిర్మలాంతఃకరణమువలనను భూతదయాపరతవలనను బ్రజలచే మహర్షియనుబిరుదమునొందియాబిరుదమునకుఁ దగినవాఁడనిపించుకొనియెను. ఏఁటేటఁబ్రహ్మసమాజసాంవత్సరికోత్సవము జరిగెడుదినముల దక్క మఱియెన్నడుఁ నాతఁడుజనుల కగపడెడువాఁడు కాఁడఁట. మిక్కిలి ముదిమిలోనయితము నాతనికి బాల్యమునఁ నున్నంత జ్ఞాపకశక్తి యుండెనఁట. పుణ్యక్షేత్రములలో దేవదర్శనము చేయుటకుఁ బోయినట్లీయీమహర్షిని హిందువులనేకులు దర్శింప వచ్చెడువారు. ఈయన హిందూదేశమునందలి యనేకభాగములనే గాక బర్మా, సింహళము, చీనా మొదలగు విదేశముల నయితము చూచెను.

ఈయనకు మరణకాలమునాఁటికి నలువురు కుమారులు నిరువురుకుమార్తెలు నుండిరి. అందు జ్యేష్ఠకుమారుఁడగు ద్విజేంద్రనాథ టాగూరు పండితుఁడై కొన్ని వేదాంత గ్రంథములురచించెను. రెండవ కుమారుఁడు సత్యేంద్రనాథ టాగూరు గొప్పయుద్యోగములఁ జేసి కొన్నియేండ్లక్రిందట పించను పుచ్చుకొనెను. మూఁడవకుమారుఁడగు జ్యోతీంద్రనాథ టాగూరును నాలవతనయుఁడగు రవీంద్రనాథటాగూరునుబంగాళీభాషలో మంచి మంచి గ్రంథములు వ్రాసిరి. ఈనాఁటి బంగాళీకవులలో రవీంద్రనాథుఁడే మిక్కిలిగొప్పవాఁడని ప్రసిద్ధిగలదు. కుమార్తెయగు శ్రీమతిస్వర్ణకుమారిదేవియు ననేకచిత్రవచనకావ్యములవ్రాసి ప్రసిద్ధికెక్కె యిప్పుడు బంగాళాదేశమున సివిలు సర్వీసులోగొప్ప యుద్యోగములుచేయు ఘోషాలుగారికి తల్లియయ్యె

ను. ఈమహర్షి 1905 వ సంవత్సరము జనవరినెల 19 వ తేదీ గురువారముమధ్యాహ్నము లోకాంతర గతుఁడయ్యెను. ఈమహాత్ముఁడెంత జబ్బుగనున్నను భగవత్ప్రార్థనము మాని యెఱుఁగఁడు. ఇతఁడు మహారాజుబిరుదమునందుటకు మాఱు తన సత్ప్రవర్తనచే మహర్షి బిరుదమునందెను. ఈరాజయోగి బ్రహ్మసమాజమతస్థుఁడయినను వాని నిమిత్తమన్ని తెగలవారు నన్ని మతములవారు దుఃఖించిరి.

మరణానంతరమున వీనిని గౌరవించుటకు శవమువెంటఁ గాలి నడకను వెళ్ళిన వారిమాట యటుండఁగ గొప్పవారెక్కిపోయిన బండ్లొకమైలుదూరమువఱకు వ్యాపించియుండెను. ఆమహాత్ముని శరీరమును గంగాతీరమున మంచిగంధపుచెక్కలతో దహనముఁ జేసిరి. ఈ రాజయోగిచరిత్రముఁ జదివినప్పుడు సంసారముఁ జేయుచుఁ దారపుత్రాదులతో సుఖించుచు నాత్మసన్యాసముఁ బుచ్చుకొని ముక్తులయిన వసిష్ఠాది మహర్షుల చరిత్రమును జనకాది రాజయోగులచరిత్రము జ్ఞప్తికివచ్చును.

కేశవచంద్రసేనుఁడు

కేశవచంద్రసేనుఁడు 1838వ సంవత్సరము నవంబరు 19వ తారీకునఁ గలకత్తానగరమున జన్మించెను. అతనిపూర్వులు హుగ్లీనదీతీరముననున్న గరీఫాగ్రామమున వసియించెడివారు. ఈకుటుంబమువారు పూర్వము బంగాళమును బాలించిన సేనరాజుల సంతతిలోఁ జేరినవైద్యకులస్థులు. ఈతనితాత రామకమలసేనుఁడు స్వగ్రామమును విడిచి కలకత్తాకు వచ్చి మొదట నొకయచ్చుకూటములో నెనిమిదిరూకలుజీతముగల చిన్నయుద్యోగములోఁ జేరి క్రమక్రమముగ తనబుద్ధికుశలతచేతను స్వయంకృషిచేతను బాగుపడి నెలకు రెండువేలరూకలుజీతముగల బ్యాంకుదివానుపని చేసి సుప్రసిద్ధుఁడై బంగాళదేశమునం దంతటఁ దనకుటుంబమునకు మిగులఖ్యాతిఁ దెచ్చెను. అతఁడు విద్యావిశారదుఁడయి యింగ్లీషు బంగాళినిఘంటువు నొకదాని నొనరించి స్వభాషకు మహోపకారముఁ జేసెను. ఆయనకు నలుగురుకొడుకులుండిరి. వారిలో ప్యారీమోహనుఁడు రెండవయతఁడు.

ఆ ప్యారీమోహనుఁడు కలకత్తాటంకశాలలోఁ గొంతకాలము దివానుగాఁ బనిచేసి తనతండ్రిగతించిన మూఁడేండ్లకు (అనఁగా 1848 వ సంవత్సరమున) కాలధర్మమునొందెను. ఆయన ముప్పదినాలుగేండ్లచిన్నప్రాయముననే మృతినొందినను జనులచే మంచివాఁడనుచు నెన్నఁబడుచువచ్చె. మొత్తముమీఁద తనస్వప్రసిద్ధికన్న రామకమలసేనునికొడుకగుటచేతను కేశవచంద్రసేనునితండ్రి యగుటచేతను నధికప్రసిద్ధివచ్చెను. ఆయనకుమారులుముగ్గురిలో కేశవచంద్రసేనుఁడు మధ్యముఁడయి తండ్రిపోవునప్పటికి పదియేండ్లప్రాయము గలిగి యుండెను. తండ్రిబాల్యమున గతించినను వానియదృష్టవశమునఁ దల్లిమిక్కిలి తెలివిగలదగుటచే నెక్కుడు జాగరూకతతో వానిం బెంచెను.

కేశవచంద్రసేనుఁడు.



కేశవచంద్రసేనుఁడు.

కేశవచంద్రసేనుఁడు చిన్నతనమున నన్నియుమంచివస్తువులెకావలయు ననికోరి మంచిబట్టలు మంచిపెట్టెలుపుచ్చుకొనియవియెవ్వరు ముట్టుకొనకుండ జాగ్రత్తపెట్టుకొనుచుండువాఁడు. అతఁడుస్వభావముచేతనేశాంతుఁడును సాధువునై దుశ్శీలము లేకచుఱుకుగ కోపముఁదెచ్చుకొనక సౌమ్యుఁడయి యుండెను. కొంతకాలమింటియొద్దస్వభాషనేర్చుకొనినపిదప పదునొకండేండ్లప్రాయమున వానినింగ్లీషువిద్యనిమిత్తముహిందూకళాశాలకుఁ బంపిరి. విద్యార్థిగా నున్నపుడతఁడు మిక్కిలి పాటుపడుచు ప్రతిసంవత్సరిపరీక్షాంతమునయొకటి రెండుబహుమానములనందుకొనుచు 1850వ సంవత్సరమునఁబరీక్షలోఁ గృతకృత్యుఁడయిపెద్దగణితశాస్త్రగ్రంథము నొకదానినిబహుమానముగఁ బడసెను. అప్పటినుండియు వానినెఱిఁగినవారుపెద్దపుస్తకమును బుచ్చుకొన్నచిన్నపిల్లవాఁడని చెప్పుకొనుచు వచ్చిరి. చిన్ననాఁట నితనియందు బొడగట్టిన బుద్ధిసూక్ష్మతను బరిశ్రమను సౌజన్యమును జూచియితఁడు గొప్పపరీక్షలందేరు ననియొజ్జలుతలంచిరి. కానివారికోరికలుకొనసాగినవి కావు. ఏలయన 1852వ సంవత్సరమున హిందూకళాశాలాధికారులకును సంరక్షకులకును వివాదములు పొడమినందున వేఱొకకళాశాలయచ్చటస్థాపింపఁబడఁగాఁ గేశవచంద్రుఁ డానూతనపాఠశాలకుఁ బోయి యూవఱకుఁ జదువుకొన్నదానికంటె పైతరగతిలోఁ జేరెను. రెండేండ్లలో నీక్రొత్తకళాశాలయెత్తివేయఁబడగాఁ గేశవుఁడుమరలహిందూకళాశాలకేవచ్చి చేరెను. ఈమార్పులవలన విద్యాభంగము గలుగుటచే నతఁడటుమీఁదఁబెద్దపరీక్షలలోఁ దేఱఁజాలఁడయ్యెను. అయినను దత్కళాశాలలో 1858వ సంవత్సరమువఱకు నతఁడు విద్యాభ్యాసముచేసిచివరరెండేండ్లలోఁ దర్కవేదాంత శాస్త్రములలో గట్టికృషిచేసెను. ఇంగ్లీషుకవులలోవానికి షేక్స్పియరు మిల్టనుకవులపై నెక్కువ యభిమానము.

చిన్నతనమునుండి వానికి దైవప్రార్థనమువలన లాభముగ

లడని గట్టినమ్మకముండెను. మొదటినుండియు నితనికి క్రైస్తవమతబోధకులతోఁ బరిచయ మెక్కుడుగఁ గలదు. వారిసహాయమువలనదక్కిన మిత్రుల ప్రోత్సాహమునను నితఁడు "బ్రిటిషు యిండియాసంఘ"మనుపేర నొకసమాజమును నాంగ్లేయభాషాభివృద్ధికొఱకును ప్రకృతిశాస్త్రజ్ఞాన సంపాదన కొఱకును స్థాపించెను. ఇదిగాక జ్ఞానాభివృద్ధికొఱకు నింక నెన్నియో సమాజములను సంఘములను స్థాపించెను. 1855 వ సంవత్సరమునఁ జంద్రసేనుఁడు సాయంకాలపాఠశాల నేర్పఱచి యక్కడను చిన్నవారికి నీతులంగూర్చియు మతముంగూర్చియు నింగ్లీషుభాషలోని గొప్పగొప్ప సంగతులంగూర్చియు నుపన్యసించుచుండెను. అతనికి షేక్స్పియరు వ్రాసిన నాటకములపైఁ గలయభిమానముచే వానిం బ్రయోగించునిమిత్త మొకనాటకసంఘ మేర్పఱచి దానిలోఁ దానుగూడ నుత్తమపాత్రముఁ గయికొని జనరంజకముగ నభినయించె నని చెప్పుదురు. సాయంకాల పాఠశాల మూఁడు నాలుగేండ్లలో నంతరింపఁగాఁ గేశవుఁడు వేదాంతచర్చలు సలిపి ప్రార్థనాదికములు సలుపుటకు "పరస్పర భ్రాతృభావ సమాజము" (Good Will Fraternity) నేర్పఱచెను. ఆ సమాజమునఁ బలుమారు కేశవుఁడు పరమేశ్వరుఁడు మన కెల్లరకుఁ దండ్రియనియు మనుజులందఱు సోదరులనియు నింగ్లీషున బోధించుచు వచ్చెను. ఆ సంవత్సరమందే కేశవచంద్రసేనుఁడు బ్రహ్మసమాజమతమందుఁ జేరి తత్ప్రతిజ్ఞాపత్రికమీఁద సంతకముఁ జేసెను. అందు తాను జేరిన విషయమునుగూర్చి యతఁడిట్లు వ్రాసియున్నాఁడు.

"దేశమునం దిప్పుడున్న తెగలు, దేవాలయములు మొదలగు వానిపై నమ్మకము లేక మంచిమత మేదని నేను విచారించుచున్న సమయమునఁ గలకత్తాబ్రహ్మసమాజగ్రంథ మొకటి నాచేఁ బడెను. అందు "బ్రహ్మసమాజ మన నేమి" యను ప్రకరణమును జదువఁగా

నది నా మనస్సునం దున్న మతమునకు సరిపడియె. ప్రపంచమునందలి యే గ్రంథముగాని యాత్మావబోధమునకు సరిరాదనియు భగవంతుఁ డంతరాత్మకు స్వయముగ గోచరుఁడగునప్పుడు వెలుపలనుండు నుపదేష్టలతోఁ బనిలేదనియుఁ బ్రతిమనుష్యుఁడు నాత్మైకవేద్యుఁడగు నా పరబ్రహ్మమునకే మ్రొక్కవలయుఁగాని యితరవస్తువులకు మ్రొక్కఁగూడదనియు నాయభిప్రాయము. అట్లు తోఁచినతోడనే నేను హిందూదేశమునఁ బరిశుద్ధాస్తిక మతమును బోధించు బ్రహ్మసమాజమునఁ జేరితిని."

1859 వ సంవత్సరమున బ్రహ్మసమాజ పాఠశాల స్థాపింపఁబడఁగా కేశవచంద్రుఁడు దేవేంద్రనాథునితోఁ గలిసి భగవచ్ఛాస్త్రములను గూర్చి వరుసఁగాఁ గొన్ని యుపన్యాసముల నిచ్చెను. అటుపిమ్మట నతఁడు తనచేత నిదివఱకు స్థాపితమయిన నాటకసంఘముచే విధవావివాహ మను నాటకమును బ్రయోగింపఁ జేసెను. అది ప్రదర్శింపఁబడినప్పుడు పౌరు లనేకులు వచ్చినందున నగరమం దంతటఁ బెద్దసంక్షోభము గలిగెను.

కేశవుని బంధువులు వాని నేదేని తగిన యుద్యోగములోఁ బ్రవేశపెట్టఁదలఁచి యతని కిరువది రూపాయల జీతముగల గుమాస్తాపని బంగాళాబ్యాంకులో నిప్పించిరి. ఒక సంవత్సరములోనే వానిజీతము ద్విగుణమయి యింకను వృద్ధిపొందునట్లు గనిపించెను. ఇట్లుండ బ్యాంకుపై యధికారి యొకదొర తనబ్యాంకు సంబంధమగు నేసంగతులను క్రింది యుద్యోగస్థు లెవ్వరికిఁ జెప్పఁగూడదని యొకపత్రమిచ్చి యానిబంధన కొడంబడినట్లందఱు నొకకాగితముపై వ్రాలు చేయవలయునని యాజ్ఞాపించెను. ఉద్యోగస్థులలోఁ బెద్దలు చిన్నలు నిస్సంశయముగ వ్రాలుచేసినను కేశవచంద్రుఁడు సంతకముఁ జేయఁడయ్యె. ఆదొర యీమాటవిని మండిపడి వానిం దనయొద్దకుఁ బిలిపించె. ఆ

యధికారి చండశాసనుఁడగుటచే కచేరీవారందఱుఁ గేశవచంద్రునిపని యేమగునోయని గడగడ వడంకఁ జొచ్చిరి. దొర వానింబిలిచి యేల వ్రాలు చేయవైతివని యడుగఁ జంద్రసేనుఁడు సింగపుఁబిల్లవలె వాని యెదుట నిలిచి యిట్లనియె. "ఇతరులతో నేసంగతులు చెప్పఁదగినవో, యేవి చెప్పఁదగనివో యేర్పఱుపక మీరు వ్రాలు చేయుమనుట మంచిదికాదు. ఏసంగతులు చెప్పకుండుట యసాధ్యము. వ్రాలు చేసినపిదప ప్రతిజ్ఞఁదప్పుట యనుచిత మని నేను మొదటనే సంతకము చేయనైతిని." ఆమాటలు విని దొర వాని పరిశుద్ధమనస్సునకును సత్యమునందలి గౌరవమునకును సంతసించి శిక్షించుటకు మారు మెచ్చుకొని పంపి యదిమొద లతని యందు మిక్కిలి గౌరవమును దయయును జూపుచువచ్చెను. అయినను 1861 వ సంవత్సరమున నతఁడాయుద్యోగమును మానుకొనెను. పిమ్మట కొన్నిమాసములు తప్ప తక్కిన జీవితకాలమంతయు బ్రహ్మసమాజ మతబోధనమందె గడపెను. బంధువుల ప్రోద్బలముచే నతఁడాయుద్యోగమునఁ జేరెను. కాని మొదటినుండియు వానిమనస్సునసీ సత్కార్యముఁ జేయవలయుననియే తలంపుండెను.

1860 వ సంవత్సరమునం దాయన "బంగాళాదేశపు బాలకులారా! ఇది మీ నిమిత్తమే" యనుశీర్షికగల చిన్నగ్రంథము నొకదానిం బ్రకటించి దానివెనువెంటనే యట్టి గ్రంథముల మఱిపంద్రెండింటినిగూడ బ్రచురించెను. ఆ సంవత్సరముననే యతఁడు మతబోధన నిమిత్తము ప్రప్రథమమునఁ గృష్ణనగరునకుఁ బోయెను. అయన యక్కడ క్రైస్తవమతబోధకులతో వాదముసలిపి వారి నోడించి నందున నచ్చటి పండితులందఱుఁ దమమతమును నిలిపిన మహాత్ముఁడని వానిం గొనియాడిరి. పిదప దేవేంద్రనాథుఁడు సకుటుంబముగా సింహళద్వీపమునకు నావికాయాత్ర జేయఁ గేశవచంద్రుఁడు తనవారికి

దెలియకుండఁగనే వారితోఁ బయనమయి పోయెను. అపయనమునందె వారి కిరువురకును మైత్రి యధికమయ్యెను. అచ్చటినుండివచ్చిన పిదప సంగీతసేవ లనుపేర కలకత్తా నగరమున భజన సమాజము నేర్పఱచి యతఁడచ్చట మతచర్చలు సేయుచువచ్చెను. 1861వ సంవత్సరమున హిందూదేశదర్పణమని యర్థముపచ్చు "ఇండియను మిర్రి" రను పత్రికను గొందఱు మిత్రుల సాయమున బయలుదేర దీసి పక్షమున కొకసారి ప్రకటించుచు వచ్చెను. ఈ పత్రిక క్రమంబున దినపత్రికయై కేశవచంద్రసేనుని పెదతండ్రి కుమారుఁడగు నరేంద్రనాధసేనుగారిచే నిప్పటికిని గలకత్తా నగరమున మిక్కిలి ప్రసిద్ధముగఁ బ్రకటింపఁబడుచున్నది. మరుచటిసంవత్సరమున నతఁడు దేవేంద్రనాధుని సాయమునఁ గలకత్తా కళాశాలను స్థాపించి యందు తాను నీతిని గూర్చియుఁ బరిశుద్ధాస్తిక మతమును గూర్చియు బోధించుచు వచ్చెను.

1862 వ సంవత్సరమందే దేవేంద్రనాధుఁడు కేశవ చంద్రసేనుని బ్రహ్మసమాజ మతమునకుఁ బ్రధానాచార్యునిగ నేర్పఱచి యొక పెద్దసభఁ జేసి యందతని నభిషిక్తుఁ జేసెను. ఆయుత్సవము మహావైభవముతో నిర్వర్తింపఁబడినది. ఆయభిషేక సమయమునఁ గేశవచంద్రుఁడు తనభార్యను సభకురమ్మని పిలువఁ జుట్టములందఱు నట్టిపని వలనుపడదని పెద్దపెట్టున గోలపెట్టిరి. అయిన నతఁడు పట్టిన పట్టు వదలక తన భార్యను సభకుం దీసికొనిపోయెను. వెంటనే తత్ఫలముగ సోదరులును పెదతండ్రియు వానినింటికి రానీయక బహిష్కరించిరి. కాని కేశవచంద్రునకు దేవేంద్రనాథ మహర్షి తనయింట బసయిచ్చి యాదరించి వెల్తి లేకుండఁ జేసె. అది మొదలు బ్రహ్మసమాజ మతస్థులకు భార్యలు సహచారిణులుగ నుండి సభలకు వచ్చి ప్రాముఖ్యతను గాంచుచు వచ్చిరి. కాలక్రమమున సఖ్యత కుదురఁ గేశవచంద్రుఁడు పితృగృహమునఁ బ్రవేశించుటకుఁ బెద్దలుసమ్మతించిరి.

అనంతరము కేశవచంద్రసేనుఁడు స్వమత బోధనమునకై బొంబాయి చెన్నపట్టణము మొదలగు మహానగరములకుఁబోయెను. ఆ స్థలములయం దతని కమిత గౌరవము జరిగెను. ఆ పురములయందు బ్రహ్మసమాజమతము స్థాపింపఁబడియె. అక్కడనుండి యాతఁడు కలకత్తాకు వచ్చినపిదప దేవేంద్రనాథునకును కేశవచంద్రునకును నభిప్రాయభేదములుగలిగి యవి తుదకు వివాదముగఁ బరిణమించెను. ఆభేదకారణ మిది. కేశవచంద్రునకు స్త్రీపునర్వివాహములు సలుపుట, నన్యజాతులతోడి వివాహ సంబంధములు చేయుట,న్యాయమనియుఁ గర్తవ్యమనియుఁ దోఁచ వానికిఁ బ్రోత్సాహముచేసెను. దేవేంద్రనాథున కీరెండును బొత్తుగఁ గిట్టవు. అంతియకాక కేశవచంద్రుఁడు బ్రహ్మమతస్థులు యజ్ఞోపవీతము ధరింపఁగూడదనియు నది తీసివేయవలయుననియుపట్టు బట్టెను. కాని దేవేంద్రనాథుఁ డీమార్పును లేశము నంగీకరించఁడయ్యె ఈవివాదములు క్రమ క్రమముగ వృద్ధినొంద కేశవచంద్రుఁడును వాని మిత్రులు కొందఱును 1866 సంవత్సరమున నాది బ్రహ్మసమాజము నుండివిడిపోయి 11 వ నవంబరు 1866 వ సంవత్సరమున తమ సమాజమునకు హిందూదేశ బ్రహ్మసమాజ మని పేరుపెట్టి యంతటి నుండియుఁ దాముసమ్మిన యామతమును బోధింప నారంభించిరి. ఆయేఁడు మార్చినెలలో నతఁడు యేసుక్రీస్తుజీవితమును గూర్చి యాద్భుతమగు నుపన్యాసమును జేసి యందేసుక్రీస్తుయొక్క సద్గుణములు గొనియాడి యతఁడు సామాన్యమనుష్యునివంటివాఁడు గాక దివ్యపురుషుఁడని యొప్పుకొనెను. ఈయుపన్యాసములు కలకత్తాలో సంక్షోభమును గలిగించెను. కేశవుఁడు కొద్దికాలములోఁ దమ మతమునఁ గలియునని క్రైస్తవులు తలంచి యుప్పొంగిరి. అతఁడు క్రైస్తవుఁడై మతభ్రష్టుఁ డగుచున్నాఁడని హిందువులునిందించిరి. కాని యచిరకాలములోనే యతఁడు చేసిన మఱియొక యుపన్యాసములో నేసుక్రీస్తు తక్కిన మ

తోద్ధారకులతోటి పాటివాఁడేగాని యంతకంటె నెక్కుడువాఁడు గాఁడని చెప్పినప్పుడు క్రైస్తవులు తెల్లబోవుటయు హిందువులు సంతసించుటయు సంభవించెను. పిమ్మట కేశవచంద్రుఁడు మతబోధ సేయుటకై తూర్పు బంగాళా దేశమంతయుఁ దిరుగ పూర్వాచార ప్రియులగు పండితజనుల కతనియందుఁ గలిగిన గౌరవమునుజూచి తమ మతమును గాపాడుకొనఁ జొచ్చిరి. ఆప్రదేశమునుండి వచ్చిన పిదప బ్రహ్మమతస్థు లీశ్వరోపాసనముఁ జేయుటకుఁ దగిన తావు లేకుండుటఁ జూచి 1866 వ సంవత్సరమున 24 వ జనేవరు దినమున బ్రహ్మమందిరము నిర్మించుటకు శంఖుస్థాపన చేయించెను.

ఇది కట్టించిన వెనుక నతనియెడ జనులకు గౌరవమధికమయ్యె. తరువాత రెండుమాసములకుఁ బ్రయాగ బొంబాయిమొదలగు ననేక నగరముల కరిగి సంఘమత సంస్కారములఁ గూర్చి వినువారి మనస్సులు పరవశములగునట్లుపన్యసించిమాన్ఘీరునగరమును జేరెను. ఇక్కడనుండఁగా నితఁడు బ్రహ్మమతములో గొప్పమార్పును దెచ్చిపెట్టెను. ఇంతవఱకు బ్రహ్మమతస్థులు సాధారణముగఁ బ్రార్థనము చేసి తమలోఁదామభగవద్ధ్యానముచేసికొనుటయేకాని యుత్సవము లెఱుఁగరు.

అది మొదలు బ్రహ్మమతస్థులు పాటలు పాడుచు భజనలు సేయుచు నగరమున నుత్సవములు చేసి జన సామాన్యమునకీమతముపై నిష్టమును భక్తియుఁ గలుగునట్లు చేసిరి. ఇందువేఁ గేశవునియెడల జనుల కనురాగ మతిశయమై యాయనురాగము భక్తిగాఁ బరిణమించి తుదకు వానిని భగవంతుఁడని జనులు పూజించునంతవఱకువచ్చెను. కేశచంద్రునియందు జనులకాకస్మికముగఁ గలిగిన యీయమిత గౌరవము భక్తియు వాని యనుచరులకే కొందఱకు వానిపై ద్వేషమునుగలిగించెను. నాఁడు మొదలు వానియనుచరులు రెండుకక్షలుగా నేర్పడి యొక తెగవారాతనిని భక్తిశ్రద్ధలతోఁ బూజించుటయు రెండవతెగ

వారాతని చేష్టల ననుమానించి యట్టి పూజ కనర్హుండని చెప్పుటయు సంభవించెను.

హిందూదేశమున కప్పటి గవర్నరు జనరలుగారగు లారెన్సు ప్రభువుగారితో గేశవచంద్రుని కప్పటి కొక్క సంవత్సరముక్రిందట పరిచయము గలిగెను. అందుచే నితఁడు మాన్ఘీరులో నుండఁగా నా ప్రభువు సిమ్లానగరమునకు రమ్మని వానిని సన్మార్గపూర్వకముగ పిలువ నక్కడ కరిగెను. ఆకాలమున రాజప్రతినిధిగారితో మాటలాడి యితఁడు బ్రహ్మమతస్థుల వివాహములను శాస్త్రీయముగఁ జేయుట కొకశాసనమును నిర్మించుట యావశ్యకమని కనఁబఱిచెను. గవర్నరుజనరలుగారు కేశవచంద్రుని యాలోచన మంచిదని యొప్పుకొని యట్టిశాసనము నొకదానిని నిర్మింపఁ బూనుకొనెను. తరువాత నతఁడు కలకత్తాకువచ్చి బ్రహ్మమందిర నిర్మాణమును వేవేగముగించి 1869 వ సంవత్సరము 7 వ ఆగష్టునతద్గృహప్రవేశోత్సవమును జేసెను.

1870 వ సంవత్సరము ఫిబ్రవరు 15 వ తారీఖున కేశవచంద్రుఁడిగ్లాండు దేశమునకుఁ బ్రయాణమైపోయి 21 వ మార్చిని లండననగరముచేరి యక్కడనున్న లారెన్సుప్రభువుగారివలనను మఱికొందఱి వలనను సగౌరవముగ నాదరింపఁ బడెను. ఆయన యేపట్టణమునకుఁ బోయిన నాపట్టణమున జనులందఱు వానినమిత గౌరవముచేసి మిక్కిలి యుత్సాహముతో వానియుపన్యాసముల వినిరి. అతఁడాదేశమున పదునాలుగు ముఖ్యపట్టణములకుం బోయి యచ్చటి జనులకు వీనుల విందుగా మతము వేదాంతము నీతి హిందూదేశ పరిపాలనము మొదలగు నంశములగూర్చి మహోపన్యాసముల నిచ్చి యందఱిచేతఁ గొనియాడఁ బడియె. అతని కీర్తివిని యాంగ్లేయ తత్వశాస్త్రజ్ఞుఁడగు మిల్లుదొరయు సంస్కృతపండిత శిఖామణియు వేదాంగవేద్యుఁడునగు మాక్సుమల్లరుదొరయు మఱియు ననేకులు వానిదర్శ

నముచేసి సంతుష్టాంతరంగులైరి. ఇంగ్లాండు దేశపు మంత్రులలోనగ్రగణ్యులగు "గ్లాడుస్టను" గారిని "డిస్రైలి" గారిని జూచి కేశవచంద్రుఁడు వారితో మనదేశ వ్యవహారములను గూర్చి ప్రసంగించెను. ఆ దేశమందంతట నతని యశము వ్యాపించుటచే నలువది పట్టణముల సమాజములవారు తమయూళ్లు వచ్చి యుపన్యాసములిమ్మని వానిం బ్రార్థించిరి. కాని తీరిక లేమి యతఁడు వారి యభిలాషఁ దీర్పఁ జాలఁడయ్యె. మొత్తముమీఁద నతఁడక్కడ నున్న కాలములో రమారమి డెబ్బది సభలలో మాటలాడి నలువదివేల జనుల కుపన్యసించెను.

ఈ గౌరవము లన్నిటికంటె వేయిరెట్లెక్కువ గౌరవము వానికి జరిగెను. ధర్మస్వరూపిణియుఁ గాంతాజనమతల్లియు భరతఖండప్రజలకుఁ దల్లియు నగు శ్రీవిక్టోరియా రాణీగారతనికి దర్శనమిచ్చి సంభాషించి వానిప్రతిబింబమును వానిభార్య ప్రతిబింబమును(ఫోటోగ్రాఫు) వారివలనం గ్రహించి తన ప్రతిబింబమును తనభర్తయగు నాల్బర్టు ప్రభువువారి ప్రతిబింబమును వానికిచ్చి గౌరవించెను. కేశవచంద్రసేనుని గౌరవించుటకు "మిస్ కార్పెంటరు" యను నామె బ్రిష్టలునగరమున హిందూదేశ క్షేమకరములైన ప్రసంగములు చేయుటకు "నేషనల్ ఇండియన్ అసోసియేషను" ననుపే రొక సమాజము నేర్పఱచెను. బ్రిష్టలు నగరమున కతఁడు పోయినప్పు డప్పటికి రమారమి నలువదేండ్లక్రిందట స్వదేశమువిడిచి యింగ్లాండునకుం బోయి దేశోపకారార్థమై ప్రాణములువిడిచి కీర్తిశేషుఁడైన రాజా రామమోహనరాయల సమాధినిజూడఁబోయి మృతజీవుఁడైన యామహాత్మునియందలి గౌరవముచే మోకాళ్లపయింబడి నమస్కరించి యాబ్రహ్మసమాజ స్థాపనాచార్యుని యాత్మకు మోక్షమొసంగుమని భగవంతుని బ్రార్థించెను. బాల్యమునుండియు నితనికి కవికులసార్వభౌముఁడగు షేక్స్పియరు మీఁదనత్యంతాభిమాన ముండుటచే నాకవిజన్మస్థానముఁ జూడ నభిలాషగ

లుగ "నావ విధాన" మను నాటకము వ్రాసిన ఫరుకా గ్రామమునకుఁ బోయి యా తేఁడు ఆ పట్టణమందలి నాటకము వ్రాసిపుట్టించు చిన్నగదియు నతఁడు నాటకములకు సాక్షికొన్న బల్లయుఁ జూచి సంతసించి పిమ్మట నాతని గురూపదేశమునకుఁ బోయి యిరువదియెనిమిది నాటకములు రచియించి నాగరికులకు సహజభాషఁ గాని యానాఁటి బహునాటకవిరాజును దేశించి వినయమునఁ బ్రసంగించి తనకుఁ గల గౌరవమును వెల్లడించెను.

అనంతర మతఁ డింగ్లండుదేశమునుండి 1870 వ సంవత్సరము సెప్టెంబరు 17 వ తేదిని బయలుదేరి అక్టోబరు 15 వ తేదిని బొంబాయి నగరమునఁ జేరె. ఆ పట్టణపు వారచ్చటి జను లతని నపూర్వము గను సన్మానముఁ జేసిరి. అచ్చటనుండి యతఁడు కలకత్తా నగరమునకుఁ బోవ నచ్చటివారలు బొంబాయినగరము నందు జరిగినయుత్సవము కంటె గొప్పయుత్సవముఁ జేసి నాతని సన్మానించిరి. ఇంగ్లాండునుండి వచ్చినపిమ్మట కేశవచంద్రుఁడు మన దేశస్థులసంఘవృద్ధికిని నీతివృద్ధికిని హిందూసంస్కరణసమాజము నొకదానిని నేర్పఱచెను. ఆ సంస్థ మిత్రు లైదువిధములుగాఁ జేయుటకుఁ బ్రారంభించెను. 1 జ్ఞానము నేర్పుట సులభముగ నుండునట్లు గ్రంథములవ్రాసి తక్కువ వెలకు నమ్ముట. 2 తగినవారికి దానముచేయుట. 3 స్త్రీల యభివృద్ధికయి పాటుపడుట. 4 దేశమునందంతట విద్యవ్యాపింపఁ జేయుట. 5 మద్యపానాది దురాచారములు దేశమునఁ బ్రబలకుండునట్లుపనిచేయుట. ధనహీనులకుఁ దక్కువవెలకుఁ బత్రిక లందఁజేయవలయునను తలంపుతో సులభసమాచారమను పేర వారమున కొకసారి పైసచందాతోఁ బత్రిక నొకటి ప్రకటింపఁ దొడఁగెను. స్త్రీలకొఱకు బోధనాభ్యాసపాఠశాల (నార్మల్‌స్కూలు) స్థాపించి యతఁడు స్త్రీవిద్యాభివృద్ధిఁ గావించెను. కొంతకాలమునకు నడచిన పిదప "భారతాశ్రమ హితార్థినీసభ" యొకటి స్థాపింపఁబడి దీనితోఁ జేర్పఁబడెను. ఇదిగాక చేతిపనులు మొద

లగునవి నేర్పియనేకులకు మంచివృత్తులు కల్పించుట కొక పాఠశాలను గూడ నీయన స్థాపించెను.

దేశమునందున్న బ్రహ్మమతావలంబు లందఱనొక్కచోటికిని దెచ్చుటకయి ప్రయత్నించి 1874 వ సంవత్సరమున భారతాశ్రమము నుస్థాపించెను. కేశవచంద్రుఁ డిందునిమిత్తము పెద్దవాడియొక యొకగొప్ప యిల్లుకొని యితరపట్టణములనుండి బ్రహ్మమతస్థులు భార్యలు బిడ్డలువచ్చి యచ్చటనే భుజించుచు పరస్పర స్నేహము చేసికొనుటకుఁ దగిన యేర్పాటులఁ జేసెను. ఆసంవత్సరమునందె మార్చినెలలో గవర్నరు జనరలుగారు బ్రహ్మమతస్థుల వివాహములను గూర్చి కేశవచంద్రుని యభిప్రాయ ప్రకారము మొక శాసనము నిర్మించెను. భారతఖండమున నన్యత్రగాఁ దాను చేసిన కృషికి ఫలము నేఁటికిఁ గలిగెనని యాశాసనము నిర్మింపఁబడినప్పు డతఁడు సంతోషించెను.

1875 వ సంవత్సరము మొదలు 1878 వ సంవత్సరమువఱకు నతఁడు బ్రహ్మసమాజ మతమును దెగిన స్థితిలో నుంచుటలో పరిశ్రమఁ జేసెను. అదిమొదలతఁడు తనమతస్థులకు వైరాగ్యమునుబోధించి కలకత్తానగర సమీపమున నొకతోఁటలోనన తాను విరాగియయి యందుండెను. తరువాత కలకత్తానగరమున నొకయిల్లు నొకదానిఁ గొని "పద్మకుటీరి' మని దానికిం బేరుపెట్టెను. ఆయింటిలో నొక పెద్దగది బ్రహ్మమతస్థుల నిమిత్తము ప్రత్యేకముగ వదలివేయఁబడెను. క్రమక్రమముగ తనమిత్రులను శిష్యులను దనయింటి సమీపముననే బసలుకొని కాపురముండునట్లు ప్రోత్సాహపఱచి బ్రహ్మమతస్థుల యగ్రహారమొకటి యేర్పఱచెను. పద్మకుటీరమ నను న్నకాలమున నీతఁడు ధనవంతుఁడు గాకున్నను గొప్పయుద్యోగస్థుఁడు గాకున్నను నెంతెంత వారికి దర్శనమీయని మహారాజులు గవర్నరులు గవర్నరు జనరలు లీనియింటికి స్వయముగావచ్చి దర్శనముచేసి మాటలాడి పోవుచు

వచ్చిరి. ఈతఁడేకార్యముచేసినను నది యీశ్వరాదేశ మని నమ్మి యట్లు చెప్పుచువచ్చెను. వయసుముదిరిన కొలఁది నితనికి లోకమున గౌరవము హెచ్చసాగెను. తానుగావించిన యవివేక కార్యములు గూడ భగవదాదేశమున జరిగినవని యతఁడు చెప్పుచుండుటచే నతని యనుచరులలోఁ గొందఱి కతనిపయి నసూయ పొడమెను.

ఇట్లుండ నతఁడు కుమార్తెకుఁ బెండ్లి సేయఁదలఁచి కచిబిహారు మహారాజును వరునిగా నంగీకరించెను. పెండ్లికుమార్తెకు పదునాలుగేండ్లయిన నిండలేదు. పెండ్లికుమారుఁడు నమారమి పదునేడేండ్లవాఁడు. బ్రహ్మమత నిబంధనలఁబట్టియు కేశవచంద్రుని ప్రోత్సాహముచేతనే దొరతనమువారు నిర్మించిన చట్టముఁబట్టియుఁ బెండ్లికూఁతురు పదునాలేండ్లకుఁ దక్కువగాను పెండ్లికొడుకు కిరువది యేండ్లకుఁ దక్కువగ నుండరాదు. అదియెగాక కచిబిహారురాజు బ్రహ్మమతస్థుఁడుకాఁడు. వివాహము బ్రహ్మధర్మప్రకారము గాక బ్రాహ్మణ ధర్మప్రకారము జరుగవలసివచ్చెను. ఈకారణమునుబట్టి యతని యనుచరులావివాహమునకు సమ్మతింపవలదని కేశవచంద్రునితో నొక్కిచెప్పినను వారిమాటలు వినక యతఁడది యీశ్వరాదేశమని చెప్పి దాటఁజూచినను దన కుమార్తెకు మంచి సంబంధము దొరికె నదిగదా యను కక్కురితిచేత స్వమతధర్మములు సరకుసేయక యనుచరుల హితోపదేశముల లెక్కగొనక లోకనిందకొడిగట్టి నిర్మలమగు తన వర్తనమున కొకమచ్చ దెచ్చుకొనెను.

కేశవచంద్రసేనుఁడు మొదట తన యల్లుఁడు బ్రహ్మమతస్థుఁడు గాకున్నను క్రమక్రమమున నతఁడు తన మతమునఁ గలియవచ్చునని యు ధనవంతుఁడగుటచే నతని కలయికవలన స్వమతము ప్రబలము కావచ్చుననియుఁ దలఁచి యీవివాహమున కంగీకరించెనని కొందఱియభిప్రాయము. అట్లయినచో నతని యుద్దేశ్యముకొంతవఱకు మంచిదని

యే చెప్పవచ్చును. అతని యనుచరుల కిదివఱకే లోలోపల రవులు చున్న యసూయాగ్ని యీవివాహమూలమున పెద్దమంటలై ప్రబలెను. అప్పుడు పండిత శివనాథశాస్త్రి మొదలగు వానియనుచరులు కోపించి కేశవచంద్రసేనుఁడు బ్రహ్మసమాజమునకుఁ బ్రధానాచార్యుఁడుగ నుండఁదగఁడని వానిం దొలఁగింపఁ బ్రయత్నించిరి. కేశవచంద్రుఁడు పోలీసువారిసహాయమునుగైకొని ప్రతిపక్షులఁ బాఱఁదోలి స్వస్థానమును బలపఱచుకొనెను. వెంటనే శివనాథశాస్త్రిప్రముఖులు కేశవచంద్రుని హిందూదేశ బ్రహ్మసమాజమునుండి విడిపోయి సాధారణబ్రహ్మసమాజమును 15 వ మేయి 1878 వ సంవత్సరమున స్థాపించుకొనిరి.

1881వ సంవత్సరము మొదలుకొని కేశవచంద్రుఁడు నవీనసిద్ధాంతమని మతమునందు మునుపున్న దానికంటె క్రొత్తపద్ధతులు కొన్నిటిఁ జేర్చెను. ఈసిద్ధాంతమునుబట్టి మనుష్యుఁ డధికవైరాగ్యమునుబూని లోకసంబంధమును సాధ్యమైనంతవఱకు విడచి పరమేశ్వరభజన ధ్యానాదులయందుఁ గాలము గడపవలయును. ఈనవీనపద్ధతులఁ జక్కఁగ జనులకు బోధించుట కతని కవకాశము లేకపోయెను. ఏలయన 1881వ సంవత్సరము మొదలు కేశవచంద్రుఁడు రోగపీడితుఁడై కొంతకాలము బాధపడి తుదకు 1884వ సంవత్సరమున జనవరి 8వ తారీఖున లోకాంతరగతుఁడయ్యెను. మతవిషయమున నభిప్రాయభేదము లెట్లున్నను నీదేశోపకారియకాలమరణమునకు వగవని వారు లేరు. అతని మరణవార్త యింగ్లండుదేశమునందుఁ దెలసినపుడు శ్రీవిక్టోరియా రాణిగారు వాని మరణమును విని చింతిలి తత్కుటుంబము నోదార్చుచుఁ దమ ప్రతినిధియగు రైపనుప్రభువుద్వారా వర్తమానమంపిరి. గవర్నరుజనరలుగారగు రైపన్‌ప్రభువుగారును కేశవచంద్రుని మరణము హిందూదేశమునందంతట విషాదము గలిగించెనని వాని

కుటుంబమున కుత్తరము వ్రాసిరి. హిందువులొక్కరేగాక యింగ్లీషు వారును వాని సుగుణములఁగూర్చి యొండొరుల మించునట్లు స్తోత్రముఁజేసిరి. ఆసంవత్సరము 30వ జనవరు సాయంకాలము కలకత్తా మందిరమున కేశవచంద్రుని జ్ఞాపకార్థ మొకగొప్పసభ చేయఁబడెను. దానికి దొరతనమువారి యాలోచన సభలో సగ్రేసఁ్యులగు సర్. విలియమ్ హంటరు దొరగారగ్రాసనాధిపతులైరి. అన్నిమతముల వార లన్నితెగలవారు వాని మతమునుగూర్చి శోకించి యుపన్యాసముల నిచ్చిరి. బి. యే. మొదలగు శాస్త్రపరీక్షలయందుఁ గృతార్థులైన విద్యార్థులకుఁ బట్టము లొసఁగు కాలమున వారికి హితోపదేశముఁజేయుచు ఆనరబిల్ రెయినాల్డ్సు దొరగారు సందర్భవశమున కేశవచంద్రుని పేరెత్తి వాని యోగ్యత నగ్గడించి వానిమార్గము నవలంబించి యంతవాండ్రుగమ్మని నొక్కి చెప్పెను.

అంద అన్నివిధములఁ గొనియాడుటకు నాతనియందలి సద్గుణములె కారణములుగాని వేఱొకటిగాదు. అతఁడన్నదమ్ములతోఁ బంచుకొన్న ధనమంతయు బీదలగు బ్రహ్మసమాజమతస్థులకై వ్యయముజేసెను. ఇంతకంటె నౌదార్యవంతులఁ జూడఁగలమా? హిందూదేశమునఁ బూర్వమహర్షులయొక్క పరిశుద్ధాస్తిక మతమును నిర్మలవర్తనమును వైరాగ్యమును నెలకొలుపుటకై జీవితమునంతయు నతఁడు ధారవోసెను. అంతియెగాని కొందఱనుకొనునట్లు తమ స్వమతాభిమానము లేనివాఁడు గాఁడు. మంచి యెచ్చటనున్నను గ్రహించుట మనుష్యధర్మమని నమ్మి యాయన యితరమతములయందలి శ్రేష్ఠధర్మములపైసైతము గౌరవముఁ జూపెడివాఁడు. త్రాగుబోతుతనము తలయెత్తకుండ నడఁచుటకును దిక్కుమాలిన వితంతువుల నొక్కకడఁ జేర్చుటకును నధోగతినున్న స్త్రీల నున్నతదశకుఁ దెచ్చుటకును భగవంతునియెడ నిజమైన భక్తి నెలకొల్పుటకును నాయన మిక్కిలి పా

టుపడియెను. దొరతనమువారిచ్చు బిరుదముల కెన్నఁడతఁ డాసపడఁడయ్యె. బంగాళాగవర్నరుగారొకమా రతని కలకత్తాకు మ్యునిసిపల్ కమీషనరుగా నియమింపఁదలంప నతఁడాగౌరవము నంగీకరింపఁడయ్యె. విక్టోరియారాణిగారు హిందూదేశచక్రవర్తినియైనప్పుడు డిల్లీలో జరిగిన దర్బారులో దొరతనమువారతనికిబంగారుపతకము నీయ రాఁగా దాని స్వీకరింపఁడయ్యె.

ఇండూరుసంస్థాన ప్రభువగు హోల్కారు మహారాజుగారు జయపూరు మహారాజుగారుమొదలగు మూర్ధాభిషిక్తులు తన్ను ప్రాణస్నేహితునిగాఁ జూచుకొని యాదరించునాఁడును కేశవచంద్రుఁడు నిగర్వియై యనేకసేవకులున్నను దనయన్నము దాను వండుకొనుచు సామాన్యులతోఁ గలిసిమెలసి వారిసుఖదుఃఖములు తనవిగా ననుభవించుచుండెను. అతనివిగ్రహ మాఱడుగుల పొడుగుగలది. బాహువులు దీర్ఘములు. వక్షస్థలము విశాలము. అతని ముఖవర్చస్సు జనుల నాకర్షించునదియై రాజకళను గలిగియుండును.

బ్రహ్మసమాజ మొకమతముగా హిందూదేశమున వ్యాపించుట కితఁడే కారణము. ఈతని యుపన్యాసము లసాధారణములు. కుంభవృష్టులు నేలఁ గురిసినట్లతివాక్చక్యముతో నుపన్యసించుటకును వినువారి సమ్మోహనాస్త్రముచేఁగట్టఁబడునట్లు నిశ్చేష్టితులుగఁ జేయుట కతఁడే సమర్థుఁడు. ఇంతటి మహావక్త హిందూదేశమున నదివఱకెన్నఁడు నుద్భవింపలేదు స్వల్పలోపము లొకటిరెండున్నను కేశవచంద్రుఁ డనేకసద్గుణసంపన్నుఁ డగుటచే సర్వసజ్జనస్తవమునకుఁ బాత్రుఁడు.

వివేకానందస్వామి.

ఆసేతుహిమాచలము భరతఖండమునందంతటఁ గీర్తి వ్యాపించియున్న యీమహాత్ముని చరిత్ర మెక్కడ మాకు సమగ్రముగా లభింపలేదు. అందుచే నీతని చరిత్రము సంగ్రహముగా వ్రాయవలసివచ్చినది.

ఈయన బంగాళాదేశస్థుఁడగు శూద్రుఁడని కొందఱు క్షత్రియుఁడని కొందఱుఁ జెప్పుచున్నారు. పూర్వాశ్రమమునందీయన పేరు నరేంద్రనాథదత్తు. సన్యసించిన వెనుక నీయన వివేకానందస్వామియని పేరుపెట్టుకొనియెను. నరేంద్రనాథదత్తుయొక్క తల్లిదండ్రు లెవ్వరో వారెట్టివారో యాతని బాల్య మేవిధముగా గడుపఁబడినదో మనము తెలిసికొనుటకుం దగిన యాధారము లేవియు లభింపలేదు. కాని యాతనితండ్రి కలకత్తానగరవాసుఁడే యనియు నరేంద్రనాథదత్తు తత్పట్టణమునందే పుట్టి పెరిగి యింగ్లీషువిద్య చదువుకొని తుదకు పట్టపరీక్షయందనఁగా బి. యే. పరీక్షయందుఁ గృతార్థుఁడయ్యెనని కొన్నిగ్రంథములం జదివినారము. ఈయన ప్రథమమందు బ్రహ్మసమాజమతాచార్యుఁడగు కేశవచంద్రసేనునితోఁ గలసి యామతాభిమానము గలిగియుండెనఁట. అనంతరము శ్రీరామకృష్ణపరమహంసయొక్క మహిమలు విని యతనిశిష్యుఁడైన నరేంద్రనాథదత్తు వానియనుగ్రహమువలన వేదాంతవిద్యోపదేశమునొంది బ్రహ్మజ్ఞానసంపన్నుఁడై గురువుగారి మరణానంతరమున లౌకికవ్యాపారములపై విరక్తిపొడమ సన్యసించి వివేకానందస్వామి యనుపేరం బ్రసిద్ధుఁడై తన జీవితశేషమంతయు లోకోపకారార్థమై గడపి యుపనిషన్మతము భరతఖండమునందే గాక యమెరికాఖండమునందును యూరపుఖండమునందును బోధించెను. ఈయన సన్యసింపకమునుపును సన్యసించిన వెనుక కొంతకా

వివేకానందస్వామి.

లమును మనదేశమందేయున్నను వానిపేరెవ్వరికిం దెలియరాదయ్యె. అమెరికాఖండమునకుఁ బోయినవెనుకనే యీతనియం దణగియున్న జ్ఞానవిశేషమంతయు బయలుపడుటయు నందుమూలమున లోకమంతయు నతని నెఱుఁగుటయు సంభవించెను.

అమెరికాఖండమున యూనైటెడ్డుస్టేట్సను దేశముగలదు. అందు చికాగోయను గొప్పనగరమున్నది. ఆదేశస్థులందఱు కోట్లకొలఁది ధనము చందాలమూలమునఁ జేర్చి చికాగోనగరమున 1893సం॥రమున గొప్పప్రదర్శనము జరిగించిరి. ఆప్రదేశమునం దేదేశపుమనుష్యులు మున్నెన్నఁడు జూచియుండని చిత్రములు చూచునట్లును విని యెఱుఁగని సంగతులు వినునట్లును తత్కార్యనిర్వాహకులేర్పరచిరి. ఆప్రదేశమునందె సర్వమతములఁగూర్చియు జర్చలుజరుపఁదలంచి మతమహాసభ (Parliament of Religions) నొకదాని నచ్చటివారుకూర్చిరి. ఆమతమహాసభకు వివిధదేశములనుండి వివిధమతములవారు తమతమ మతములయందలి మేలిసంగతుల ప్రపంచమునకుఁ దెలియునట్లచ్చట నుపన్యసింపఁదలంచి యానగరమునకుంబోయిరి. వివేకానందస్వామియుఁ బవిత్రమైన యుపనిషన్మతమును బ్రహ్మవిద్యను నాగరికతతోఁ దులతూఁగుచున్న పశ్చిమఖండవాసులకు నమెరికాఖండవాసులకుఁ దెలుపఁగోరి యామతమహాసభకుఁ బోవసమకట్టెను. కాని ప్రయాణము ధనమూలముగదా. అదివఱకె సన్యసించియున్న యామహాత్మునకు ప్రయాణమునకుఁ గావలసిన ధనము చిక్కకపోవుటచేతను తనదేశస్థు లెవ్వరుఁ దనపూనికకుఁ దోడుపడకపోవుటచేతను వివేకానందుఁడు చెన్నపట్టణమువచ్చి తనయుద్యమ మచ్చటి పెద్దమనుష్యుల కెఱిఁగించెను. నివురుగప్పిన నిప్పువలెనున్న యతనిజాడ నెఱిఁగి చెన్నపురివారు కొంతధనమిచ్చి యాయన నమెరికాఖండమునకుఁ బంపిరి.

స్వమతములంగూర్చి యుపన్యసించుటకు చికాగోనగరమునకు మనదేశమునుండి వెళ్ళినపురుషుఁడొకఁడే గాఁడు. బ్రహ్మసమాజమత

పక్షమునఁ బ్రతాపచంద్రముజుందారును బౌద్ధమతపక్షమున ధర్మపాలుఁడును మన దేశమునుండియే వెళ్ళిరి. కాని వీరిద్దఱికంటెను మతసంబంధములగు చర్చలు సేయుటకు వెళ్ళిన తక్కిన పురుషులకంటెను వివేకానందస్వామికొక్కనికే యధికఖ్యాతి గలిగెను. చూపరులమనస్సుల నాకర్షించు మూర్తియు మంచి ముఖవర్చస్సును గంభీరమైన కంఠనాదమును గలిగి కాషాయాంబరములు ధరించిన యీ హిందువును జూచినదిమొదలు నమెరికా ఖండవాసులకు వానియం దొక విధమైన యనురాగము జనియించుటచే నాతఁడు చేయు నుపన్యాసముల వారు శ్రద్ధతో నాలకింపఁ జొచ్చిరి. వివేకానందస్వామి యమెరికాకు పోకమును పచ్చటిజనులకుమతమునుగూర్చియు మననాగరికతనుగూర్చియు నంతగాఁ దెలియదు. మనలను బాగుచేయు నెపమున మన దేశమునకు వచ్చు క్రైస్తవమత బోధకులు మరల స్వదేశమునకుఁ బోయినప్పుడు హిందువులమతము దుర్మత మనియు. వారు మనుష్యజాతిలో నెంచఁబడఁ దగినవారు కారనియు నప్పుడప్పుడు చెప్పుచుందురు. కావున నచ్చటిజను లామాటలనువిని మన విషయమున నెంతయు నధమాభిప్రాయమును గలిగియుండిరి.

వివేకానందస్వామి బోధనలు వినినవారి కందఱకు నట్టి యభిప్రాయములు పోయినవి. ఈయన యీ దేశమున బోధించినది వేదాంత మతము. అనఁగా నుపనిషత్తులలోని మతము. ఆయనకు శంకరాచార్యునియందును రామానుజాచార్యునియందును మిక్కిలి గౌరవము గలదు. వేదాంతమతము సర్వోత్కృష్ట మయినదనియు నిది తక్కిన మతములవంటిది గాదనియు మహమ్మదీయమతము క్రైస్తవమతము మొదలగునవి యొక్కొక్క పురుషునిమీఁద నిలిచియున్నవనియు నాపురుషుఁడు లేఁడనిగాని యీ పురుషునియందట్టి మహిమలు లేవనిగాని నిర్ధారణ చేయఁబడినప్పుడు తప్పక యామత

ములు నశింపవలసి యున్నదనియు వేదాంత మతమెవరో యొకపురు షునిమీఁద నిలిచియుండలేదు గావున నది సర్వకాలములయందు సర్వదేశములయందు సకలజాతులవారికి నవలంబనీయ మనియు నతఁడు బోధించెను.

పీఠములమీఁదనెక్కి మనకు గురుస్వాములమని చెప్పుకొనుచు సన్యాసులయ్యు జమీందారులకంటె నెక్కువభోగముల ననుభవించు మతగురువులు నశించినప్పుడుగాని మనదేశ మభివృద్ధిపొందదని యా యన పలుచోట్ల నొక్కిచెప్పెను. వేదాంతవిద్య జాతిభేదములేక సకల జనులకు నుపదేశింపఁ దగినదనియును, చండాలాది నీచజాతులకుఁ గూడ విద్యాబుద్ధులుచెప్పి బాగుచేయవలసిన భారము మనమీఁద నున్నదనియు నీచజాతులు హీనస్థితిలో నుండుటచేతను మనదేశము చెడిపోయినదనియుఁ గావున వారిస్థితిని జక్కఁజేయుటకు మనమంద ఱము పాటుపడవలసినదనియు వివేకానందస్వామి యనేకోపన్యాస ములలోఁ బ్రసంగించుచు వచ్చెను. అంతియగాక తాను చనిపోవు లోపుగ పదిమంది మాలవాండ్రనయిన నుత్తమబ్రాహ్మణులుగఁ జేసి మృతినొందుదునని చెప్పెను. కాని యీ కార్యము నెరవేరక ముందె యాయన మృతిపొందెను. తక్కువజాతులవారి నున్నతస్థితికి దెచ్చుట కీయన కిష్టమే. ఆ విషయమున నొక యుపన్యాసమం దాయన యిట్లు చెప్పియున్నారు. "బ్రాహ్మణులు మొదలగు నగ్ర వర్ణములవారు తమయాచార వ్యవహారములు వదలుకొని తక్కువ జాతులలోఁ గలియఁగూడదు. కాని మాలవాండ్రు మొదలగుతక్కువ జాతులవారికి వేదశాస్త్రములు మొదలగు విద్యలుచెప్పి వారి నగ్ర వర్ణజాలతో సమానులుగఁ జేయవలయును. ఇదియే నీచజాతుల నున్నత స్థితికిఁ దెచ్చుట"

అమెరికాఖండమునందు మతమహాసభ ముగిసిన వెనుక వివే

కానందుని యుపన్యాసముల నెంతవినినం దనివితీరక యచ్చటివా రనేకులు కొంతకాలము తద్దేశముననుండి యుపన్యాసముల నింక నిమ్మని ప్రార్థించిరి. అందుచేత నాయన మఱిరెండు సంవత్సరము లచ్చట నుండవలసి వచ్చెను. ఆ కాలమునందాయన ప్రతిదిన ముదయము మధ్యాహ్నము సాయంకాలము వేఱు వేఱు స్థలములయందు ప్రజలడిగిన మతవిషయములఁగూర్చి యుపన్యసించుచు స్థలాంతరముల నుండి వచ్చిన పెక్కుజాబుల కుత్తరములు వ్రాయుచు నిమిషమయిన వ్యవధిలేకయుండెను. అమెరికాఖండమునందున్న యనేక సంఘములు సమాజములు సభలు నొకదాని నొకటి మించునట్లు గౌరవపురస్కరముగా వానిని రావించి యాతఁడు చేసిన యుపన్యాసముల విని సంతసించెను. ఆ దేశమునందు నాస్తికులుండుటచేత వారందఱు స్వామిని తమతమ సమాజములకుఁ బిలిపించి యీశ్వరుఁడున్నాఁడని ఋజువు చేయుమని యాయన నడిగి యనేక విషమప్రశ్నలువేసి పెక్కుచిక్కులం బెట్టిరి. కాని యతఁడు వారి కాధారములయిన ప్రకృతిశాస్త్రములచేతనే వారి నోళ్ళడచి యీశ్వరాస్తిక్యమును స్థాపించి యాసమాజములలో నెగ్గి వచ్చెనఁట. అమెరికా ఖండమునం దతఁడున్నకాలములో కొందఱు నాస్తికులాస్తికులయిరి. కొందఱు క్రైస్తవులు స్వమతముల విడిచి వివేకానందస్వామికి శిష్యులై తమ పూర్వనామములఁ గూడ మార్చుకొనిరి. ఒకదొరగారు యోగానందస్వామి యని పేరుపెట్టుకొనిరి. ఒక దొరసాని తనతొల్లిఁటి పేరువిడిచి నివేదితయను పేరంబరగుచున్నయది. ఆమెయే హిందూదేశమునకువచ్చి కలకత్తా కాశీ మొదలగు నగరములలో మన మతవిషయములగు నుపన్యాసములనిచ్చి కొన్ని గ్రంథములను గూడ రచియించినది.

వివేకానందుఁ డింక కొంతకాలమువఱకు జీవించియున్న పక్షమున నమెరికాలో కాలిఫోర్నియా యను మండలమున నొక దేవా

లయమును గట్టింపవలయునని సంకల్పించుకొనియె. ఇట్లమెరికాఖండ
ములో నతఁడు వేదాంతమతమునుగూర్చి రెండు సంవత్సరములు
కొంతపనిచేసి స్వదేశమును జూడవలయునని బయలుదేరి ముందుగా
సింహళద్వీపమునకు రాజధానియైన కొలంబో నగరమున దిగెను.
ఆనగరమున నతఁడు దిగినాఁడనువార్త వినినదిమొదలు మనదేశ
స్థులు జగత్ప్రసిద్ధిని గాంచిన యీ మహాత్ముని దమతమ పట్టణములు
కెప్పుడు రావించి వాని వాక్యామృతము నెప్పుడు గ్రోలుదుమాయని
యువ్విళ్ళూరుచు, వానిని గౌరవపూర్వకముగాఁ బిలిచిరి. వివేకానంద
స్వామి కొలంబోనుంచి బయలుదేఱ పూర్వము తనకు సహాయము
చేసి తన్నమెరికాఖండమునకుఁ బంపిన చెన్నపురివాసులయెడలఁ గృత
జ్ఞుండయి వారిని జూడవచ్చెను. ఆసమయమునఁ జెన్నపురివాసు లాయ
నకుఁ గావించిన మహాగౌరవముఁ జూచి తీరవలయును; కాని వర్ణింప
నలవికాదు. అతఁ డచ్చటఁ గొన్ని యుపన్యాసములనిచ్చి యనంత
రము కలకత్తా నగరమునకుఁ బోయెను. తమ దేశములో నున్నంత
కాల మాయన ప్రజ్ఞల నించుకయు నెఱుంగని బంగాళా దేశస్థులు
విదేశములలో మిక్కిలి పేరువడసిన యీ సన్న్యాసిని మిక్కిలి గౌర
వించి వాని యుపన్యాసములవలన లాభము పొందిరి. పిమ్మట వివే
కానందుఁడు బొంబాయి, యలహాబాదు మొదలగు ప్రదేశములకుఁ
బోయి దాదాపుగ హిందూదేశమంతయుఁదిరిగి వేదాంతమత మంద
ఱకుపదేశించి యనంతర మింగ్లాండు దేశమునకుఁ బోయెను.

అక్కడ చతుర్వేదముల పారమును జూచినవాఁడును శాస్త్ర
ముల రహస్య మెఱిఁగినవాఁడును స్మృతుల ధర్మమును తెలిసినవాఁ
డును సంస్కృత భాష కూలంకషముగ నేర్చినవాఁడును విద్యాసము
ద్రుఁడునగు మోక్షమూలరు పండితుఁడు నివసించియుండుటచే వివే
కానందుఁ డామహాపురుషుని దర్శించుటకుఁ బోయెను. వేదాంత

విద్యాభిమానులగు నా పండితు లిరువురు నొండొరులఁ గౌఁగలించు కొని హిందూదేశమును గూర్చి చాలసేపు ముచ్చటించి యొకదినము సంతోషమున గడపిరి. వివేకానందుఁడు మోక్షమూలరు పండితు నితోఁ గలసి యాతనియింటనున్నపుడు మహర్షితోఁ గలసి యొక యాశ్రమమున నున్నట్టి యున్నదని చెప్పెను. వివేకానందస్వామి యింగ్లాండులో నున్నపుడు తద్దేశస్థులు వాని యుపన్యాసములను మిక్కిలి శ్రద్ధతోను గౌరవముతోను వినిరి. వివేకానందస్వామికి సంఘసంస్కారమునం దిష్టములేదనియు హిందువులందఱు పూర్వాచారపరిగ్రహము తప్పక నడచుకొనవలసినదని యాతని యభిప్రాయమనియుఁ గొందఱు చెప్పుచున్నారు. కాని వారి మాటలు సరికావు.

వివేకానందస్వామి తాను స్వల్పసంస్కారములఁ జేయువాఁడనుగాననియు సంస్కర్తలకంటె నెక్కువసంస్కర్తననియుఁగొన్నికొన్ని యుపన్యాసములలోఁ జెప్పెను. ఆయనచరిత్రమును చక్కఁగా పరీక్షించిన వారికి మొదటినుండియునాయనసంస్కర్తయే యనితోఁచకమానదు. కలియుగమందుసన్యాసము బ్రాహ్మణులకే నిషిద్ధమని యున్నది. అట్లుండఁగాఁ దాను బ్రాహ్మణేతరుఁడయ్యు వివేకానందస్వామి సన్యసించుటయే యొకసంస్కారము. అట్లుసన్యసించి సన్యాసిధర్మములనే అపుడు కర్మభూమి యగుభరతఖండమునందుండక మహాసముద్రము దాఁటి నౌకాయాత్రలుచేసి కర్మబాహ్యము లగు మ్లేచ్ఛదేశములకుఁ బోయి జాతి, మత భేదములులేని క్రైస్తవులతోఁ గలసి మెలసి చిరకాలమునుండి వారియిండ్ల భోజనములుచేసి మనవారియభిప్రాయ ప్రకారముగ బ్రాహ్మణులకొక్కరికే యుపదేశింపఁబడఁదగిన వైదిక ధర్మములను బ్రహ్మవిద్యను ననార్యులగుమ్లేచ్ఛుల కుపదేశించి మన మతమునకు విరుద్ధముగా జరిగిన వివేకానందస్వామి సంస్కారము

జేసినది. అందుచేతనే హిందువులలో నైదవవంతు జనులు తురక లైరి. ఇదియంతయు బలవంతముగా ఖడ్గముతోనే వారుచేసిరని మన మనరాదు. అట్లనుట కేవలము పిచ్చి. మనమేమియుచేయక యూరకున్న పక్షమున నీ చెన్నపురి రాజధానియందలి జనులలో సగము క్రైస్తవు లగుదురు. నేను మలబారు జిల్లాలో నొక చిత్రమయిన యాచారమును జూచితిని. మాలవాఁడు బ్రాహ్మణులు నడచునట్టి దారిని నడువరాదు. ఆ మాలవాఁడే క్రైస్తవుఁడో మహమ్మదీయుఁడో యై వచ్చినప్పుడు మనము వానిని స్పృశియించుటకైన సందేహింపము. దీనినిబట్టి మన మేమి తెలిసికొనవలయును? ఆ మలబారులోనుండు వారందఱు పిచ్చివాండ్రనియు వారియిండ్లు పిచ్చివాండ్ర వైద్యశాలలనియు గ్రహింపవలయును. ఇట్టి దురాచారములుగల జాతులవా రుండుట తలవంపులుగావా? శూద్రుఁడు వేదము విన్నపక్షమున వానిచెవిలో సీసము కరిగించి పోయవలయునఁట! వాఁడు వేద ముచ్చరించిన నాలుకకోయవలయునఁట! ఇట్టి భయంకరవాక్యములుగల గ్రంథము లనేకములు మనపూర్వులువ్రాసినవి యున్నవి. అట్లు వ్రాసినపాపాత్ములనేకులు ప్రతిస్థలమునందు ప్రతికాలమునందు నుండుచు వచ్చిరి.*

ఈకాలమునందు వర్ణభేదములనుగూర్చి యెన్నోవివాదములు పొడముచున్నవని నేను విచారించుచున్నాను. ఇట్టివాదము లుండఁగూడదు. ఇవి యుభయులకు నందుముఖ్యముగ బ్రాహ్మణులకు మంచిదిగాదు. ఏలయన నగ్రవర్ణములకుఁ గల ప్రత్యేకగౌరవము లడుగంటినవి. కావున బ్రాహ్మణుఁడు తక్కినవర్ణములవృద్ధికొఱకు పాటుపడవలయును. అట్లుచేసినవాఁడు దాని నెంతకాలము చేయునో యంతవఱకు బ్రాహ్మణుఁడు. అట్లుచేయక ధనార్జనము చేసికొన్న వాఁడు బ్రాహ్మణుఁడుకాఁడు.

శూద్రులకు నేనొక్కమాట చెప్పుచున్నాను. మీరు తొందరపడక వేచియుండుఁడు. వంకదొరికినప్పుడెల్ల బ్రాహ్మణులతో వివాదములాడవద్దు. ఏలయన నింతకాల మణఁగియుంట మీలోపమే. బ్రహ్మవిద్యయు సంస్కృతమును మిమ్మెవ్వరు నేర్చుకొనవద్దనిరి? ఇంతకాలము మీరేమిచేయుచుంటిరి? ఇన్నాళ్ళుసోమరులై యుండియెవ్వరో మీకంటె నెక్కువ తెలివితేటలు నెక్కువచాకచక్యము నెక్కువయదృష్టము గలిగియున్నారని యిప్పుడు మొగముముడుచుకొనిన నేమి లాభము? మీరు సంస్కృతము మొదలగునవి చదువుకొని బ్రాహ్మణులుగండు. మనమందఱ మొక్కయాలోచనమీఁద నడచినప్పుడు బలవంతుల మగుదుము. మనోనిశ్చయమే బలము. దీనికొక్క తార్కాణముచెప్పెద వినుఁడు. నాలుగుకోట్లమంది యిగ్లీషువారు ముప్పదికోట్లమంది హిందువుల నెట్లుపరిపాలించుచున్నారు? ఆనాలుగుకోట్లజనులు నొక్కయాలోచనప్రకారము నడచుచున్నారు. అందుచే నపరిమితమైనబలము వారికిఁ గలిగినది. మీముప్పదికోట్ల జనులు నొకరికొకరి సంబంధములేకుండ ముప్పదికోట్లవిధముల నడుచుచున్నారు. అందుకే మీగతి యిట్లున్నది.

వివేకానందుని గ్రంథములలో నిట్టిసంగతులనేకము లున్నవి. చోటుచాలమి నిచ్చటవ్రాయుటకు వీలులేదు. వివేకానందస్వామియత్యంతమైన దేశాభిమానముగల సత్పురుషుఁడు. మనయార్యులగొప్పతనమును మనమతముయొక్క ప్రాశస్త్యమును లోకమునకు వెల్లడిచేయవలయు నని బాల్యమునందె సన్యసించి ఖండాంతరంబులకుఁబోయి చక్కఁగాఁ బనిచేసెను. ఈయన సంకల్పములన్నియు నెఱవేఱకమున్నె మన దురదృష్టమున బాల్యమునందె పరలోకగతుఁ డయ్యెను. ఈయన శిష్యులగు నభేదానందస్వామి శారదానందస్వామి మొదలగువారు వానిమార్గము ననుసరించియే పనిచేయుచున్నారు.



ద్వారకనాథమితర్.

ద్వారకనాథమితర్.

ఇతఁడు బంగాళాదేశములో హుగ్లీమండలమునందలి అంగునిళీ యను గ్రామమున 1833 వ సంవత్సరమున జన్మించెను. వానితండ్రి హుగ్లీకోర్టులో నొకన్యాయాధిగా నుండెను. ద్వారకనాథుఁడు తక్కిన పిల్లలతోడిపాటు గ్రామమునందలి బడిలోఁ జదువనారంభించెను. ఆతఁడే డేండ్లవయసువాఁడయినప్పుడు ఇంగ్లీషుచదువుటకు హుగ్లీపాఠశాలలోఁ బ్రవేశించెను. 1846 వ సంవత్సరము కాలేజీస్కూలులో రెండవ తరగతిలోఁ జేరెను. అక్కడ చదువునప్పు డతఁడు బుద్ధికుశలతకుమిక్కిలి ప్రసిద్ధికెక్కి నెలకెనిమిది రూపాయలు జీతముగల విద్యార్థివేతనము సంపాదించెను. తరువాత 1849 సం॥రమున రాణీకాత్యాయనీ యను నామెయిచ్చిన నెలకు పదునెనిమిదిరూపాయలు జీతముగలవిద్యార్థివేతనముసంపాదించి ద్వారకనాథుఁడు 1850 వ సంవత్సరమున విద్యార్థివేతనములకై ప్రయత్నము చేయువారందఱిలో నగ్రగణ్యుఁడై నిలిచె. 1851 వ సం॥రమున సంవత్సరాంత పరీక్షయందుఁ గృతార్థుఁడై నెలకు నలువదిరూపాయలుచొప్పున విద్యార్థివేతనముంబడసెను. 1853 వ సం॥రమున ఆంగ్లేయభాషలో మిక్కిలి ప్రశస్తమైనయుపన్యాసమువ్రాసినందు కతఁడు బంగారుపతకమును మరుసటిసంవత్సరమున మఱిరెండుబంగారుపతకములను బహుమానములుగాఁబడసెను. విద్యార్థిగానున్నపు డతనికి దేశచరిత్రములఁ జదువుటయందు మిక్కిలి యభిరుచియుండెను. ఆతనికి గణితశాస్త్రమునం దమితప్రజ్ఞయుండుటచే మిక్కిలి చిక్కుగల లెక్కల నవలీలఁగా నతఁడు చేయుటజూచి యుపాధ్యాయుఁడొకనాడతనితో నిట్లనియె. "హిందువులలో స్వతస్సిద్ధమగు బుద్ధికుశలత గలవాఁడవు నేనెఱిఁగినంతవఱకు నీవొక్కఁడవే" యని పలికెను.

ద్వారకనాథుఁడు చదువుముగించి పాఠశాలవిడిచినతోడనే దైవయోగమునఁ దండ్రి పరలోకగతుఁడగుటచే నేదేని యుద్యోగమునుసంపాదించి కుటుంబపోషణముఁ జేయవలసివచ్చెను. దొరతనమువారిచే క్రింద నేదేనియుద్యోగముఁ జేయుటకతనికెంతమాత్రమిష్టము లేనందున నెట్లైన శాస్త్రపరీక్షయందుఁ గృతార్థుఁడై న్యాయవాదిగానుండవలయునని యతఁడుసంకల్పించుకొనెను. కాని దారిద్ర్యముచేతఁదనమనోనిశ్చయమునుమార్చుకొని కలకత్తాలో పోలీసు మేజస్ట్రీటుకచేరిలో నెలకు నూటయిరువది రూపాయిలు జీతముగల యుద్యోగమొకటి కాళీవచ్చినందున యతఁడు దానింగూర్చి ప్రయత్నించి యందుఁ జేరె. చేరి యందు చిరకాల ముండక ద్వారకనాథుఁడు శాస్త్రపరీక్షకుఁ జదివి యందుఁగృతార్థుఁడై న్యాయవాదియయ్యెను. న్యాయవాదియై తనపనిలో మంచిపేరు సంపాదించుటకై చాల పరిశ్రమచేసెను. న్యాయవాదుల కెంతబుద్ధికుశలతయున్న నెంతప్రజ్ఞయున్నఁ దమసామర్థ్యముం జూపుటకుఁ దగినసమయము రావలయునుగదా!

ద్వారకనాథుఁడు మొదటినుండియునదృష్టవంతుఁ డగుటచేపని యారంభించిన యాఱుమాసములకే యొకపెద్దవ్యాజ్యమునఁనొకగొప్ప న్యాయవాదికి సహాయుఁడుగా నేర్పరుపఁబడెను. అతనిభాగ్యవశమున నావ్యాజ్యము విచారణకు వచ్చినప్పు డాపెద్దన్యాయవాది యూరలేక పోవుటచేద్వారకనాథుని తెలివితేటలుగనఁబఱచుటకుమంచియదనుదొరకెను. తనవృత్తియందు మిక్కిలియారితేరినవాఁడు గాకపోయినను ద్వారకనాథుఁడు న్యాయాధిపతుల (జడ్జీ) మనస్సులకు నచ్చునట్లు వ్యాజ్యమునందలి సంగతులెల్ల నరఁటిపండొలిచిచేతికిచ్చినట్లుచెప్పి బోధించివాదించెను. దీనితో నతనికి మంచిపేరుగలుగఁ గీర్తిదేశమందు వ్యాపించెను. ఆతని సమకాలికుఁడైన న్యాయవాదిగానున్నయొకదొర ద్వారకనాథుని యప్పటి తెలివితేటలఁగూర్చియిట్లువ్రాసెను. "ద్వారకనాథుఁడు

వాదనకు దిగినప్పుడు నాతోఁగలసి పనిచేసినను నాకెదుటిపక్షమునం బనిచేసినను నాకును వినువారి కందఱకును మిక్కిలి యద్భుతమును గొలుపుచుండువాఁడు."

1862 వ సం॥రమున బంగాళాదేశమందగ్రన్యాయసభ అనఁగా హైకోర్టు స్థాపింపఁబడెను. అది యేర్పడినది మొదలు ద్వారకనాథుని ఖ్యాతి యంతకంత కెక్కువయ్యెను. ఖ్యాతితోఁగూడ ధనార్జనము నతిశయించెను. ఏలయన నతఁడాన్యాయసభలోఁ బనినారంభించునప్పటికి వానికంటె నెక్కువయభ్యాసము నెక్కువపేరుగల న్యాయవాదు లిరువు రుండిరి. వారిరువురిలో నొకఁడు మృతినొందుటయు రెండవ యతఁడు న్యాయాధిపతి యగుటయుఁ దటస్థించెను. అందుచే నతఁ డచ్చటి న్యాయవాదుల కెల్ల నాయకుఁడయ్యెను. ఆకారణమున దేశస్థులందఱుఁ బనివచ్చినపు డతని సహాయమునే కోరుచువచ్చిరి. న్యాయవాదిగానున్నపు డతఁడు నిర్భయుఁడై స్వతంత్రుఁడై యుండి పేదల కేవియేని చిక్కులు సంభవించినపుడు ధనము గ్రహింపకయే వారిపక్షముబూని వాదించుటకు సిద్ధముగ నుండును.

మన దేశమునకింగ్లీషువర్తకులుకొందఱువచ్చి బంగాళాపరగణాలో నీలిమందు, కాఫీవిత్తులు, తేయాకు మొదలగు సరకులు పండించి లాభ మపారముగ గ్రహించుచున్నారు. 1865వసంవత్సరమందాదొరలు కొందఱును బంగాళా దేశపుజమీందారులు కొందఱునుగలసిశిస్తులని మిత్తము రహితులను బాధించి వారిపై హైకోర్టులో గొప్పవ్యాజ్యము తెచ్చిరి. అప్పుడు ద్వారకనాథుఁడు దీనదశలోనున్న రహితులపక్షముఁ బూని వాదించెను. ఆవ్యాజ్యములు కలకత్తా హైకోర్టులో పదునైదుగురు జడ్జీలు విచారణచేసిరి. ఆవ్యాజ్యము విచారణ మనేకదినములుపట్టి నందునద్వారకనాథుఁడుప్రతిదినముపదకొండుగంటలకు లేచిసాయంకాల మైదుగంటలవఱకు నిలువంబడియే వాదనసేయుచు దేహముసలసినను

తనవాదనమాత్రము బలహీనము గాకుండునట్లుచెప్పి చూచువారికందఱకు మహాద్భుతమునుగొలిపెను. ఆవ్యాజ్యమున న్యాయసభలో నిముఖ్యన్యాయాధిపతి ద్వారకనాథునిపై యించుకకక్షుబూని మాటిమాటికి యక్షుప్రశ్నలవంటి ప్రశ్నలు వేసియాతనిం దడఁబడఁ జేయుటకుఁబ్రయత్నముచేయుచువచ్చెను. కాని యాదిట్టరి యొక్కప్రశ్నకైనను దడఁబడక న్యాయాధిపతులందఱు నివ్వెరపడునట్లు ప్రత్యుత్తర మిచ్చెను. ఈవ్యాజ్యమున నితఁడు చూపిన యసాధారణ ప్రజ్ఞచేత ననంతరము కొన్నిదినములలో దొరతనమువారి న్యాయవాది (గవర్నమెంటు ప్లీడరు) గా నేర్పఱుపఁబడెను. దీనిలోనుండియె యతఁడు కొలఁదికాలమున హైకోర్టు జడ్జిగా నియమింపఁబడెను.

అదివఱకుశంభునాథపండితుఁడనునతఁడా హైకోర్టులో న్యాయాధిపతిగా నుండెను. అతఁడె బంగాళాహైకోర్టులో మొట్టమొదటి న్యాయాధిపతి. ఆతఁడు 1867వ సం॥రమునజూనునెలయాఱవతేదినిలో కాంతరగతుఁడయ్యె. అప్పటికి ద్వారకనాథుఁడు ముప్పదిమూఁడేండ్లవయసువాఁడు. ఇదివఱకు హిందూదేశమున హైకోర్టుజడ్జీలుగా నియమింపఁబడినస్వదేశస్థులలో నింతచిన్నవయసువా రెవ్వరునులేరు. ఇంతటిపిన్నప్రాయమువాని నంతటి మహాపదవికి దొరతనమువారు నిశ్శంకముగా నియమించుటచేత నేయాతఁడెంతటిబుద్ధిశాలియో యెంతటిప్రజ్ఞావంతుఁడో మన మూహింపవచ్చును. ద్వారకనాథుఁ డాఱుసంవత్సరము లాహైకోర్టునందు న్యాయాధిపతిగానుండెను. అప్పటిముఖ్యన్యాయాధిపతియగు సర్ బార్నిసుపికాకుదొరగారుతనతోడిజడ్జీయగుద్వారకనాథునియభిప్రాయములతో దఱచుగ నేకీభవించుచు నెప్పుడైన నభిప్రాయభేదముగలిగినప్పుడు మిక్కిలిజంకుతో భేదించుచుండునఁట. అతఁడుగడుసుపోకడలఁబోయి మోసముపన్ని కువాదములుచేయువారినిఁజూచిన మిక్కిలియసహ్యపడి యట్టివారిగర్వభంజనము చేయుచువచ్చెను. అం

డుచే నతనిమీఁదఁగొండఱకాగ్రహము ననిష్టముగలుగ వార్తాపత్రికలలో వారతని నిందింప నారంభించిరి. ద్వారకనాథుఁడావార్తల నించుకేనియు సరకుసేయఁడయ్యెను. అయినను ముఖ్యన్యాయాధిపతియగు పీకాకుదొరగారు ద్వారకనాథునిపై గల యభిమానముచే జననిందాస్పదుఁడగుటకునిష్టపడక వానినాయపవాదమునుండితప్పింపవలయునని యొకమారు కచ్చేరిలో నున్నపుడే యిట్లనియె. "నే నీద్వారకనాథుని న్యాయవాదిగా నున్నకాలమునుండియు నెఱుఁగుదును. కొంతకాలము నుండి యితనిసాటి న్యాయాధిపతినై యుంటిని. కాబట్టియతని స్వభావమునుగూర్చియు నతని నడతనుగూర్చియుఁ దక్కినవారికంటె నాకెక్కువ దెలియుట కవకాశమున్నది. నేనిప్పు డాయనయెదుట మాటలాడుచున్నను ద్వారకనాథుఁడుమిక్కిలివిద్యావంతుఁడనియుసమర్థుఁడనియు నిగర్వచూడామణియనియు మంచిస్వభావముగలవాఁడనియు దయాళువనియు స్నేహపాత్రుఁడనియు స్వతంత్రుఁడనియుఁ జెప్పవలయును. అతఁడు తనకు సరియనితోఁచిన యభిప్రాయ మెవరు భిన్నముగా జెప్పినను విడువక దాని ననుసరించియే యుండును. అది తప్పనితోఁచి నప్పు డెవరుచెప్పకయే దానిని విడుచును

ద్వారకనాథుఁడు తీరికయున్నప్పుడు ఫ్రెంచి లాటినుభాషలయందుఁ బరిశ్రమఁజేయుచువచ్చెను. ఫ్రెంచిభాషలో నతఁడు చదివిన గ్రంథములలో కోమ్టి (Comte) యను తత్వశాస్త్రజ్ఞుఁడు రచించిన గ్రంథములపై నతనికి మిక్కిలి యభిమానము. అతని గ్రంథభాండారమున రమారమి వేయి మంచి ఫ్రెంచిగ్రంథము లుండెను.

అతనికి 1868 వ సంవత్సరమున విషూచిజాడ్యము తగిలెను. కాని యది యదృష్టవశమునఁ గుదిరెను. 1872వ సం॥రమున నతఁడు కీళ్ళనొప్పులు జ్వరమువలన కొన్నిదినములు బాధపడెను. తరువాత జ్వరమువదలినను దాని దోషములు విడువవయ్యెను. 1873 వ సంవ

త్సరము నవంబరు నెలలో నాయనకు కంఠములో కురుపువేసెను. అట్లుండియు నతఁడు కొంతకాలము పని చూడఁగలిగెను. కాని క్రమ క్రమంబున రోగము ప్రబలమగుటచే నతఁడు పనిమానుకొని ప్రాణ మునం దాశవదలుకొని కలకత్తానగరమును విడిచి తన కడపటిదినము లు పుచ్చుటకు స్వగ్రామముఁ జేరెను. అట్లు కొంతకాలము రోగపీడి తుఁడై 1874 వ సంవత్సరం ఫిబ్రవరు 25 వ తేదీని నలువదియవ యేట కాలధర్మము నొందెను.

న్యాయాధిపతిగాఁ గూర్చున్నప్పు డతఁడు ప్రజలకు సరిగా న్యాయమునొసఁగి హిందువులుకూడ న్యాయాధిపత్యముచేయుటకుఁ దగుసామర్థ్యము జ్ఞానముగలవారని దొరతనమువారికిఁ దోఁచునట్లు ప్ర వర్తించెను. అతని మరణమునుగూర్చి విచారించుచు తోడిన్యాయాధి పతి యొకఁడీవిధముగాఁజెప్పెను. "అతని యధికవైదుష్యము యుక్తా యుక్త వివేచనజ్ఞానము న్యాయదృష్టి బుద్ధికుశలత యద్భుతమైన జ్ఞా పకశక్తి మంచితనము మొదలగుగుణములం బట్టి యతఁడు తోడి న్యాయాధిపతులకు సాటిలేనిసహకారిగానుండును. ఆతనితోఁగూర్చుం డి పనిచేయుట మిక్కిలి సంతోషకరముగా నుండెను. ఇంగ్లీషుభాష యందలి యతని పాండిత్యమునుజూడ నాభాష యతనికి విధేయురాలై యున్నట్లు గనఁబడును. ఇంగ్లీషుభాషను మాతృభాషగాఁ గలిగినదొ రలు సయితము ద్వారకనాథున కాభాషయందుఁగల యభిరుచి ప్రవే శమునుబట్టి మిక్కిలి యక్కజపడుచువచ్చిరి."

గొప్పయధికారమును వహించినవారు తమయధికార ప్రాబ ల్యమునుజూపి తక్కువవారిని బాధపెట్టినప్పుడు ద్వారకనాథుఁ డది చూచి సహింపక యట్టియధికారులను గట్టిగ మందలించుచుండును. ఇంటియొద్ద నతఁడు మిక్కిలి వినయవృత్తి గలిగి సర్వజన సులభుఁడై యౌదార్యమునఁ బ్రసిద్ధికెక్కియుండెను. 1871 వ సం॥రమున నతని

పెద్దభార్య మృతినొందెను. ఆమెకిరువురు బిడ్డలు. ప్రథమకళత్రము పోయిన మరుసటి సంవత్సరమున నతఁడొక కన్యను వివాహమాడెను. కాని యామెను వివాహమాడిన యచిరకాలములోనే లోకాంతరగతుఁడయ్యెను. ఆయనకు నిరంతరము చదువుకొనుటయందె మిక్కిలి యాసక్తి. చదివినది జ్ఞాపకముంచుకొనుటలో నంతవాఁడు సాధారణముగా నుండఁడు. ఒకమారాయన కొన్నిసంపుటములుగల యూరపుదేశ చరిత్రమును పదునైదు దినములలో సమగ్రముగాఁ జదివి చదివినది తనకు జ్ఞాపకమున్నదో లేదో తెలిసికొనుట కాగ్రంథమునందు తన్నుఁ బరీక్షింపుమని యొకమిత్రునిఁ గోరెను. ఆమిత్రుఁడు పలుభాగములయందు పలుప్రశ్నలు వేయ నాప్రశ్నల కన్నిఁటికిఁ దేలిపోక యుత్తరములు చెప్పుటయేగాక ద్వారకనాథుఁడు మూలగ్రంథమునందలి వాక్యములను సయితము కంఠపాఠముగ నప్పగించి మిత్రున కాశ్చర్యము గలిగించెను. యూరపుఖండమంతయు జయించిన శూరశిఖామణియగు నెపోలియన్ బోనపార్టియం దతనికి మిక్కిలి యభిమానముండుటచే నాతని ప్రతిరూపమును వానిగదిలో నుంచుకొనెను. హరిశ్చంద్ర ముఖర్జీ యనునతఁడు వాని బాల్యస్నేహితులలో నొకఁడు. ఆముఖర్జీ 1868 వ సం॥రమున మృతినొందఁగా వాని యకాలమరణమునుగూర్చి ద్వారకనాథుఁడు మిక్కిలి దుఃఖించెను.

ద్వారకనాథున కొకచిత్రమైన యభ్యాసముగలదు. అతఁడు న్యాయవాదిగా నున్నకాలమున కోర్టువారియెదుట వాదముసేయునపు డొకపేనాకలముల రెండుచేతులతోఁ బట్టుకొని యది ముక్కలగువఱకు విఱిచివేయుచుండును. అతఁడాకలము నెంతవడిగా విఱిచివేయుచుండునో యతనినోటనుండి మాట యంతవడిహెచ్చి వాదము ప్రబలుచుండును. కలము క్రమక్రమముగా నలిగి విఱిగి చేతిలోనుండి పూర్తిగా జాఱిపడినప్పు డాయన యేమియుందోఁచక వాదముసే

యలేక నిలువఁబడునఁట. అందుచే గుమాస్తాయొకఁడు పేనాకలముల కట్టయొకటి చేతితోఁ బట్టుకొని సిద్ధముగనుండి యజమానుని చేతికల ము విఱిగిపడిన తక్షణమే మఱియొక కలము నవ్యవధానముగాఁ జేతి లోఁ బెట్టుచుండును.

ద్వారకనాథుఁడు గొప్పయుద్యోగములోనున్నను న్యాయము చెప్పవలసివచ్చినప్పుడు తనపై యధికారులకు సయితము జంకక స్వతంత్రుఁడై వ్యవహరించుచుండును. అంతటివిద్యయు, విద్యకుందగిన సత్ప్రవర్తనము దానికిం దగిన మహోన్నతపదవియుఁ గలిగిన యీ మహాపురుషుఁ డంతటి చిన్నతనమందు బోవుటచే నతని యకాలమర ణమునుగూర్చి దేశస్థులందఱు విచారించిరి.



కృష్ణదాస్ పాలు.

కృష్ణదాస్ పాలు

హిందూదేశమున వార్తాపత్రిక కధిపతియైయుండి మహాప్రఖ్యాతిగాంచిన పురుషులలో నితఁ డగ్రగణ్యుఁడు. ఇతఁడు 1838 వ సంవత్సరమున జన్మమొందెను. అతనితండ్రియగు నీశ్వరచంద్రపాలుఁడు మిక్కిలి బీదవాఁడు. కృష్ణదాసు మొట్టమొదట నొకపాఠశాలలోఁ బ్రవేశించి యచ్చట బంగాళాభాషను జదివి యాభాషలో నతనికిఁగల ప్రవీణతకు నొకవెండిపతకమును బహుమానముగఁ బడసెను. అతఁడు పదేండ్ల ప్రాయముగలవాఁ డయినప్పు డింగ్లీషుఁ జదువ నారంభించి 1853 వ సంవత్సరమున నాయింగ్లీషు పాఠశాలను విడిచెను. బడిమానిన వెనుక కృష్ణదాసుపాలుఁడు కొన్నినాళ్ళు క్రైస్తవమత బోధకుఁడై కలకత్తాలోనున్న రివరెండు మిన్నిదొరగారివద్ద విద్యనభ్యసించెను. అనంతర మతఁడు కలకత్తాలో విద్యావిషయములగు చర్చలను స్వేచ్ఛగా జరుపుటకు స్థాపింపఁబడిన యొకసమాజములోఁజేరి యచ్చట రివరెండు మార్గన్ దొరగారు మొదలగు గొప్పవారు చేయు నుపన్యాసములను విని యందువలనఁ గలిగిన లాభములను బొందుచువచ్చెను.

1854 వ సంవత్సరమున నతఁడు మరలఁ జదువఁ దలఁచి రాజేంద్ర దత్తుగారిచే స్థాపింపఁబడిన హిందూ మెట్రాపాలిటన్ కాలేజీ యనుకళాశాలలోఁ జేరి యచ్చట మూఁడుసంవత్సరములవఱకుఁ జదివెను. విద్యార్థిగా నున్ననాఁడు మొదలుకొని యతనికి రాజకీయవ్యవహారములయందు మిక్కిలియభిమానము. అతఁడువ్రాసిన వ్రాతలు నతఁడిచ్చిన యుపన్యాసములు చూడ నంతచిన్నవయసువాని కింతశక్తియెట్లుగలిగెనాయని తోఁచును. పెద్దలెవరితోనైనఁ దనకభిప్రాయభేదములు

కలిగినప్పుడు మొగమోటముచేత నూరకొనక తనయభిప్రాయమునిర్భయముగఁజెప్పుధైర్య మతనియొద్దనుండెను. అంతధైర్యముండుటచేతనే యొకసారి నతఁడు బంగాళాదేశమం దంతట ప్రసిద్ధికెక్కిన మహాపండితుఁడు డాక్టరు డఫ్ దొరగారి మాటలనే ఖండించి పూర్వపక్షము చేసెను. ఆకాలమున బంగాళాదేశమందు జార్జి తాంసన్ అను దొరగలఁడు. ఆయన రాజకీయ వ్యవహారములను గూర్చి దిట్టమయినయుపన్యాసములనియ్యఁగలఁడఁగను. అతఁడు వాగ్మిత్వమునకుఁ బ్రసిద్ధికెక్కెను. ఆదొరగారిని కృష్ణదాసు పాలుఁడొకనాఁడు తనసమాజములో జరుగు నొకసభకు నధ్యక్షునిగా నుండుమని పిలిచెను. ఆదొరగారు విద్యావిషయములగు చర్చలను జేయునట్టి చిన్న సమాజములలోఁ దనవంటివాఁడుపన్యసింపఁదగదనియు విశేషించి తన రాజకీయ వ్యవహారములఁ గూర్చియే కాని యితరవిషయములనుగూర్చియుపన్యసింపననియుఁ జెప్పి హిందూపేట్రియేటును నాతాంజపత్రికను దీసి చూపి యాపత్రికాధిపతియొక్కఁడే హిందువులలో రాజకీయ విషయములగూర్చి గ్రహింపఁగల సమర్థుఁడనియుఁ దక్కినవారికిఁ జెప్పినను దెలియదనియు గర్వోక్తిగాఁబలికెను. ఆమాటలు విని కృష్ణదాసాదినము మొదలుకొని తానుగూడహరిశ్చంద్ర ముకర్జియంతవాఁడు కావలయునని నిశ్చయించుకొనెను. అది మొదలతఁడు పేట్రియేటుపత్రికను తప్పక చదువుచు వచ్చెను. అతఁడు కనుబీదవాఁడగుటచే పత్రిక తెప్పించుకొనుటకు ధనములేక సమాజకార్యదర్శినడిగి తెచ్చుకొని చదువవలసివచ్చె. ఈపత్రికగాకయింగ్లీషు భాషలోఁ బ్రకటింపఁబడు నితరపత్రికలగూడఁ జదువుచు వాని కప్పుడప్పుడు తనకుఁ దోఁచిన సంగతులనువ్రాసి పంపుచు నితరగోష్ఠిని విడిచి యతఁడు విద్యాగోష్ఠియందే కాలము పుచ్చుచుండెను.

అతఁడు హిందూ పేట్రియేటుపత్రికకుఁగూడకొన్ని సంగతులు వ్రాసి పంపెను. తాను వ్రాసినవ్రాత యాపత్రికలోఁ బ్రకటింపఁ బడిన

ప్పాను వానికిఁ గలిగిన యానంద మింతింతయని చెప్ప నలవికాదు. కళాశాలలో విద్యాభ్యాసము ముగించిన వెనుక కృష్ణదాసు క, మేజస్ట్రీటుగారి కచ్చేరిలో ట్రాన్సులేటరు(అనఁగా ఇంగ్లీషునుండి స్వభాషకును స్వభాషనుండి యింగ్లీషునకును తర్జుమాచేయు నుద్యోగస్థుఁడు) గా నియమింపఁ బడెను. కొన్ని దినము లతఁడు పనిచేసిన వెనుక కృష్ణదాసుఁడా యుద్యోగమునకుఁ దగఁడని మేజస్ట్రీటు వానిని తీసివేసెను. తను వాని సహాపి లియంగ్రెవారగారు వానికి మంచియుద్యోగము నొకటి యిప్పించిగాని యతఁ డందుఁ బ్రవేశింపఁడయ్యె. అతఁడు గ్రంథములు వార్తాపత్రికలు మితిమీఱునట్లు మిక్కిలి యాసక్తితోఁ జదివి యెక్కువ ప్రజ్ఞ గలవాఁడయ్యెను వాని దారిద్ర్యము తెలివితేటలను పైకి రానీక యణఁచిపెట్టెను. తానుచేరియున్న సమాజమునకు నెల నెల కియ్యవలసిన చందా నెవ్వ నతఁ డియ్యలేకపోవుటచే సమాజమువారు వానిం గరుణించి నెలచందా నియ్యనక్కఱ లేకుండఁ జేసిరి. ఆ కాలమునం దతని యవస్థ నెఱింగిన యతనిమిత్రుఁ డొకఁడు వానిఁగూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు. "కృష్ణదాసుఁడు కలకత్తాలో మారుమూలసందులో కూలిపోవుచున్న యొక పాతకొంప యరుఁగుమీఁద చింకిచాఁపమీఁదఁ గూరుచుండి పైచిల్లులలోనుండి సూర్యకిరణములు శరీరమునఁ దగులుచున్నను లెక్కసేయక పుస్తకములఁ జదువుకొనుచు పత్రికలకు వృత్తాంతములు వ్రాయుచుఁ బెక్కుసారులు గనఁబడియెను. అతఁడు పేదయయ్యును స్వతస్స్థితికి వచ్చుటకు మిక్కిలి పాటుపడియె".

1857వ సంవత్సరమున నతఁడు కొందఱు స్నేహితుల సహాయమునఁ గలకత్తాలో నొక మాసపత్రికను ప్రకటింపఁ జొచ్చెను, కాని వాని దారిద్ర్యదోషమున నది యాఱుమాసములకే యంతరించెను. కాన్పూరునగరమున సెంట్రల్ స్టార్ (మధ్యనక్షత్రము అనిఅర్థము) అను నింగ్లీషుపత్రిక యొకటి బయలుదేర కృష్ణదాసుఁడు దాని కుపవిలేఖకుండుగా

నుండి కలకత్తానుండియే వ్రాయుచునుండెను. అప్పుడప్పుడు హిందూపేట్రియాట్ పత్రికకుఁగూడ నతఁడు సంగతులనువ్రాసిపంపుటఁగలదు. కనుక 1857 వ సంవత్సరమున హిందూదేశమున బయలుదేరినసిపాయి పితూరీనిగురించి యెన్నోసంగతుల నతఁడు వ్రాసి పంప నాపత్రికాధిపతియగు హరిశ్చంద్రముకర్జీ వానివ్రాతనేర్పును జూచి దైవానుగ్రహమున నతఁడు చిరకాలము బ్రతికియుండెనా దేశమునకు మహోపకారము గలుగఁ గలదని తెలిసికొనెను.

పత్రికలకు వృత్తాంతము వ్రాయుటయేగాక బంగాళాదేశ పాలకుల యోగ్యతాస్థాపనయును నంశమును గూర్చియు నీలిమందువ్యవసాయమునుగూర్చి యుమఱికొన్ని యంశములఁగూర్చియు నతఁడుచిన్న చిన్న గ్రంథముల వ్రాసెను. ఇందు మొదటియుపన్యాసము కలకత్తా స్మాల్ కాజుకోర్టులో జడ్జీగారు హరిశ్చంద్రఘోషుగారి కంకితముచేయఁబడినందున నతఁడే కావలసినధనమిచ్చి దానిని ముద్రింపించెను. ఆయుపన్యాసము బంగాళాదేశస్థుల మనస్సుల నాకర్షించుటచే నది మిక్కిలి బాగున్నదని కొన్నిపత్రికలును బాగులేదని కొన్ని పత్రికలు విమర్శింప నారంభించెను. తరువాత నాయుపన్యాసము వ్రాసినయతఁడు 19 సంవత్సరముల వయస్సుగల విద్యార్థియని వార్తాపత్రికలమూలమున దేటపడినప్పుడు జనులంద ఱాశ్చర్యము నొందిరి. 1859 వ సంవత్సరమున హిందూపేట్రియేటు పత్రికాధిపతియగు హరిశ్చంద్రముఖర్జీ మృతినొందెను. అతని వెనుక నాపత్రిక యనేకుల చేతులలోఁబడి తిన్నగ జరుపఁబడక యెట్టకేలకు కృష్ణదాసపాలుని యధీనమయ్యెను. హిందూపేట్రియాట్ అనఁగా హిందూదేశాభిమాని యని యర్థము. ఆ పత్రిక కృష్ణదాసపాలుని యాధిపత్యమునందు హిందువులచేఁబ్రకటింపఁబడు నన్నిపత్రికలకంటె నెక్కువపేరు నెక్కువచందాదారుల సంఖ్య గలదై వర్థిల్లెను. హరిశ్చంద్రముఖర్జీ చనిపోయినతోడనే కృష్ణదాసు

బ్రిటిషుయిండియన్ సంఘమునకు సహాయకార్యదర్శియై పిమ్మటఁ గొంతకాలమునకు ముఖ్యకార్యదర్శియయ్యెను. హిందువులచే ప్రకటింపఁబడు పత్రికలలో ప్రధానమగుదాని కధిపతియగుటచేతను గొప్పసంఘమునకు కార్యదర్శియగుటచేతను కృష్ణదాసుపాలుఁడు కొలఁదికాలములో నేయున్నతస్థితికి లేచెను.

1863 వ సంవత్సరమున నతఁడు మునిసిపల్ కమీషనరుగా నేర్పఱుపఁబడెను. 1872 వ సంవత్సరమున నతఁడు బంగాళాదేశప్రశాసన నిర్మాణసభకు సభ్యుఁడుగా దొరతనమువారివలన నియమింపబడెను. 1877 వ సంవత్సరమున శ్రీవిక్టోరియారాణీగారు చక్రవర్తినీ బిరుదము వహించినప్పుడు ఢిల్లీనగరమున జరిగిన గొప్పదర్బారులో కృష్ణదాసు పాలునకు దొరతనమువారు రావుబహద్దరు బిరుదము నిచ్చిరి. మరుచటిసంవత్సరమున నతనికి సి.ఐ.యి. యనుబిరుదము వచ్చెను. 1883 వ సంవత్సరమునం దాయన బ్రిటిషుయిండియన్ సంఘమువారిచేత గవర్నరుజనరల్‌గారి శాసననిర్మాణసభకు సభ్యుఁడుగా బంపఁబడెను. ఈ యుద్యోగములన్నిటిలోనుకృష్ణదాసపాలుడు మిక్కిలి పాటుపడిమంచిపేరు సంపాదించెను. కొంతకాలము దీర్ఘవ్యాధిచేఁ బీడింపబడి 1884 వ సంవత్సరమున జూలై 24వ తేదీని మృతినొందెను. పత్రికాధిపతిగా నున్నకాలమున విమర్శనము లేవియైన చేయవలసివచ్చినప్పు డతఁడు పక్షపాతములేక మర్యాద నతిక్రమింపక చేయుచువచ్చెను. అట్లున్నను వానికొకసారి యధికారులతో వివాదము రాకతప్పినదిగాదు.

1866 వ సంత్సరమున బంగాళాదేశమునకు గవర్నరుగానున్న సర్ సిసిల్ బీడెన్ దొరగారు కృష్ణదాసపాలుఁ డప్పటి కఱవునుగురించి తనపత్రికలో వ్రాసినకొన్నిసంగతులకు బహిరంగమైన సభలో ప్రత్యుత్తరములు చెప్పిరి. 1874 వ సంవత్సరమున నప్పటివగర్నరు సర్ జార్జికెంబెల్ దొరగారు హిందూపేట్రియేటుదొరతనమువారిమెడల న

నిష్టముగల పత్రికయని స్పష్టముగా వ్రాసిరి. అందుకు కృష్ణదాసుఁడూ రకొనక తగిన ప్రత్యుత్తరము వ్రాసిపంపెను. ఇట్లొకరిద్ద రధికారులు పత్రికపైనలుక బూనినను క్రమక్రమంబుగ దొరతనమువారాపత్రికపై నభిమానము వహించి హిందువుల యభిప్రాయము తెలుసుకొనుటకు తత్పత్రికయే ముఖ్యాధారమని యెఱిఁగిరి. కృష్ణదాసుఁడుగట్టిసామర్థ్య ముతో పత్రిక నిరువదిమూఁడు సంవత్సరములు నడిపెను. గవర్నరుజన రలుగారి యాలోచనసభలోసభ్యుఁడుగా నుండిన యిల్బర్టు దొరగారు కృష్ణదాసుపాలునిపత్రికాధిపత్యమునుగూర్చి యొకసారి యిట్లుచెప్పిరి. "తనతోటివారు పాఠశాలల విద్యార్థులుగానుండునట్టి యీఁడుననే దే శమందు పురాతనమైనపత్రిక కధిపతియై కృష్ణదాసుపాలుఁడు సర్వతో ముఖమగు పాండిత్యముచేతను మిక్కిలి శాంతముచేతను నిష్పక్షపాత బుద్ధిచేతను 23 సంవత్సరములు పాటుపడి దక్షత లేక యణఁగిపోవుటకుసి ద్ధముగానున్న పత్రికను మంచియున్నతస్థితిలోనికిఁ దెచ్చెను." ఆనాఁటి హిందువులలో నెవరికినింగ్లీషుభాషయొక్క మర్మముకృష్ణదాసపాలున కు దెలిసినంతగాఁ దెలియదని జనుల యభిప్రాయము. కలకత్తారివ్యూ యను పత్రికయొక్క యధిపతి కృష్ణదాసునుగురించి యిట్లు వ్రాసెను. "స్వచ్ఛమై మృదువై మనోహరమై యింగ్లీషు వ్రాయనుమాటలాడ నునేర్చిన ప్రాచీనహిందువుల తెగ కృష్ణదాసుపాలునితో నంతరించినది. ఉపన్యాసము లిచ్చుటలోను వెనుకదీయక వాదించుటలోను నితనికి మి క్కిలి సామర్థ్యముకలదు. హిందువు లనేకు లింగ్లీషుభాషనుచక్కఁగ మాటలాడఁ గలరు, కానిసందర్భసిద్ధియందును భాషాసౌష్టవమునందు ను హేతుకల్పనమునందునుకృష్ణదాసుపాలునివంటివారుమిక్కిలితక్కు వగా నున్నారు. ఇంగ్లాండులోనే పుట్టిపెరిగి యింగ్లీషునే స్వభాషగా నభ్యసించిన పెక్కుదొరలకంటెకృష్ణదాసుపాలునకేయింగ్లీషుభాషయె క్కుడువశమైనట్లుకనఁబడుననియింగ్లీషువార్తాపత్రికలేకొన్ని వ్రాసినవి."

కృష్ణదాసుపాలుని మరణమునుగూర్చి దేశస్థులందఱు విచారించిరి. అప్పటి గవర్నరు జనరల్ గారగు రైఫన్ ప్రభువుగారుశాసనని ర్మాణసభలో కృష్ణదాసుని మరణమునుగూర్చియిట్లనిరి."అతనిబుద్ధికుశలత యసాధారణమైనది. ఈసభలో నతఁడు మాటలాడుచున్నప్పుడువినినవారందఱు వానిపాండిత్యవిశేషమునంగీకరించియేయున్నారు. కృష్ణదాసు పాలునియొద్ద మూఁడు మంచిగుణము లుండినవఁట. 1.సమమైన యాలోచన శక్తియు, 2. తాను నమ్మినపనిచేయుటలో ధైర్యము 3. కోపము లేకపోవుట. ఈమూఁడు నుండుటచే నతఁడు దేశస్థులయొక్కయు నధికారులయొక్కయు మెప్పువడసెను."సర్ రిచార్డుటెంపిల్‌గారు నా కాలపు మనుష్యులు కార్యములు- అను గ్రంథము రచియించి యితనింగూర్చి యిట్లువ్రాసిరి. "గవర్నరుజనరలుగారి సభలోనున్న హిందువులలో కృష్ణదాస్ పాలను నతఁడె సమర్థుఁడు. రాజా మాధవరావుగారితరువాతహిందువులలోనిన్ని సంగతులు తెలిసినయతడితఁడొక్కఁడే. శాసననిర్మాణసభలో దొరతనమువారికతఁడుమిక్కిలి సహాయుఁడుగా నుండెను.

కృష్ణదాసపాలునకు కుటుంబ సౌఖ్యముసరిగా నుండలేదు. అతనికి మొట్టమొదట 1856 వ సంవత్సరమున వివాహమయ్యెను. ఆభార్యవలన నతని కిరువురు కొడుకులు గలిగి బాల్యమునందె మృతినొందిరి. పిదప 1872 వ సంవత్సరమునం దాభార్య మృతినొందఁగానతఁడు 1874 వ సంవత్సరమునపరల వివాహము చేసికొనెను. ఈ రెండవ భార్యవలన నతనికి కుమారుఁడు కలిగెనుగానివాఁడును శైశవమునందెమృతినొందెను. అతఁడు నిగర్వియై డంబము లేకసామాన్యునివలెనేజీవితకాలము గడపెను. అతఁడు స్వమతాభిమానముగల హిందువుఁడైనను సంఘసంస్కారమునకు విరోధికాఁడు. సంస్కారముమెలకువగానునెమ్మదిగాను జరుపవలయునని యతని యభిప్రాయము. అతఁడు న్యాయదృష్టిగల

స్వతంత్రుఁడు. బిరుదుల నిమిత్తము దొరతనమువారి నెన్నఁడునాశ్రయింపలేదు. అయాచితముగా బిరుదులువచ్చినప్పుడువానినిగ్రహింపక పోలేదు. అతఁడు తనకురావుబహద్దరు బిరుదము వచ్చినప్పుడు పత్రికలో నిట్లువ్రాసెను.

"మాపేరు రావుబహద్దరులలో నగపడుటచే మేము మిక్కిలి యాశ్చర్యము నొందినారము. మే మేనేరము చేసినామని మా కీశిక్ష విధింపఁబడినదో తెలియఁజాలము. మాకు బిరుదులు పొందవలయునని యాసలేదు. మేము చేసిన సేవకు సంతసించిదయామయులై యధికారులు మాకీగౌరవమును దయచేసినందుకు కృతజ్ఞులమై యున్నారము. మాకీసంగతి ముందు తెలిసినమామాటసాగెడుపక్షమున మేము మాజోలికెవరు రావలదనియు బిరుదులుగిరుదులుమాకవసరము లేవనియు వానిందప్పక వేఁడుకొనియుందుము."

ఈపై వాక్యములఁబట్టియు నింకఁ దక్కిన సంగతులఁబట్టియు కృష్ణదాస్ పాలుఁడు 19వ శతాబ్దమునఁ బుట్టిన దేశాభిమానులలోనొకడనియు వానిమార్గము ననుసరించుటకు మన మందఱముఁ బ్రయత్నము చేయుచుండవలయు ననియుఁ జదువరు లీతని చరిత్రమువలన గ్రహింతురుగాక!

హారిశ్చంద్రముకర్జీ

ఇతని ప్రతిమ మాకుదొరికినదికాదు. ఈయన బంగాళాదేశపు కులీన బ్రాహ్మణుఁడు. తండ్రియగు రామధనముకర్జీ మిక్కిలిబీదవాఁడు. వీరిద్దరన్నదమ్ములు. ఈయన యన్నగారిపేరుహారెన్‌చంద్రముకర్జీ

హారిశ్చంద్రముకర్జీ 1824 వ సంవత్సరమున కలకత్తాకు సమీపముననున్న భవానీపురమునబుట్టెను. ఆతఁడయిదేండ్లవయసుగలవాఁడయినప్పుడు తన యూరిబడిలో స్వభాషకొంతవఱకుఁ జదువుకొనియేడవయేట నింగ్లీషు నారంభించి బీదవాఁడగుటచే జీతములేకుండనొకపాఠశాలలోఁ జేరి పదునాలుగు వత్సరములువచ్చువఱకు నచ్చటవిద్యనభ్యసించెను. అతని కుటుంబము మిక్కిలి దారిద్ర్యముచేబాధపడుచుండుటచే నితఁడు చదువుమాని యేమైన సంపాదించి సంసారమువహింపవలసినవాఁడయ్యెను. అందుచే హారిశ్చంద్రముకర్జీ జనుల కర్జీలునుత్తరములు బాకీజాపితాలువ్రాసి కుటుంబమును బోషింపఁజొచ్చెను. అట్టి పనులవలన సొమ్ముసరిగా రాకపోవుటచే నతని బీదతనముతగ్గలేదు సరికదా యొకసారిఆపూటకుఁగూడబియ్యపుగింజలు లేకయింటిలోనున్న రాగిబిందె తాకట్టువేసికొనఁదలఁచుకొన్నంత దురవస్థపట్టెను. అంతలో నొక జమీందారుని యేజంటువచ్చి వానిచే నొకయర్జీ వ్రాయించుకొని రెండురూపాయలిచ్చి బింది తాకట్టు అవసరము లేకుండఁ జేసివాని గౌరవమును గాఁపాడెను. కుటుంబ మేవిధముచేతను గడచెడువిధము కనఁబడకపోవుటచే హారిశ్చంద్రముకర్జీ యొకరివద్ద పదిరూపాయలుజీతముగల గుమాస్తాగా కుదిరెను. అతఁడాయుద్యోగమునైన పదికాలములపాటుంచుకొనక యజమానితో వివాదపడి కొద్దికాలములోనే యాపని మానుకొనెను. అది మానుకొనిన కొన్నినాళ్ళకు మిలిటరీఆడి

టరుగారి కచేరీలో ననగా సేనల కర్చులు వ్రాయునట్టి కచేరీలో నెల కిరువదియైదు రూపాయలు జీతముగల యుద్యోగమతనికి దొరకెను. ఆయుద్యోగమునం దాయన నిరుపమానమైన బుద్ధికుశలతను శ్రద్ధనుపై యధికారులయెడ వినయమును జూపుటచే నతని తెలివితేటలు గ్రహించి వానికి గ్రమక్రమముగా నధికారులు నాలుగువందల రూపాయలవఱకు జీతము వృద్ధిచేసిరి.

ఉద్యోగములోఁ బ్రవేశించినను ముకర్జీ సాయంకాలమునందు నుమఱియు తీరికయైనప్పుడెల్లను భాషాభివృద్ధికొఱకై యింగ్లీషుగ్రంథములను వార్తాపత్రికలను విసుగులేక చదువుచువచ్చెను. గొప్పవారియుపన్యాసములు వినుటయందు మిక్కిలి యాసక్తిగలవాఁడగుటచేనతఁడు భవానీపురమునుండి నాలుగుమైళ్లునడచి కలకత్తాకువచ్చి డాక్టరుడఫ్ దొరగారి యుపన్యాసములు వినిపోవుచుండువాఁడు. కలకత్తాలోనున్న పుస్తకభాండారసమాజమందు తానొక సభ్యుఁడుగాఁజేరి యందున్న పుస్తకములన్నియుఁ జదివెను. ఆయుద్యోగములో ప్రవేశింపకమును పే యతఁడు కొన్ని వార్తాపత్రికలకుఁ గొన్ని వృత్తాంతములను వ్రాసిపంపుచువచ్చెను. 1853 వ సంవత్సరమున కలకత్తానగరవాసులు ఈస్టిండియా కంపెనీవారికి మహాజరొకటి పంపఁదలఁచి దానినింగ్లీషుభాషలో మృదుశైలితో వ్రాయఁగలవాఁడు హరిశ్చంద్రముకర్జీ యొక్కఁడేయని యతని నాపనియందు నియోగించిరి. దీనింబట్టివానికింగ్లీషుభాషయం దెంతపాండిత్యముగలదో మనము తెలిసికొనవచ్చును.

1854 వ సంవత్సరమున కలకత్తానివాసులగు శ్రీనాథగోషు గిరీశచంద్రగోషు శిట్నచంద్రగోషు నను ముగ్గురన్నదమ్ములు, హిందూపేట్రియేటను పత్రికను బ్రకటింపఁబూనిరి. హరిశ్చంద్రముకర్జీ యాపత్రికకు వృత్తాంతములు వ్రాయుచు దానిపైమిక్కిలి యభిమానము గలవాఁడయ్యెను. కొంతకాలము గడచునప్పటికి పత్రికాస్థాపకులగు

నన్నదమ్ములకుఁ బత్రికపైనభిమానము తగ్గుటయు ముకర్జీకి హెచ్చు టయుసంభవింపగా నెట్టకేలకు ముకర్జీయొక్కఁడే దానింబ్రకటించు భారమును బూనెను. అదివఱకాపత్రిక ముద్రింపఁబడు ముద్రాయం త్రముమఱియొకరికి విక్రయింపఁబడుటచే నతఁడు పత్రికనిమిత్తముమ ఱియొకయచ్చుకూటమును గొని తనయన్నగారినే పత్రికకు ముద్రా శాలకుగార్యనిర్వాహకుఁడుగా నేర్పఱచి యసాధారణప్రజ్ఞతో దానిని నడపఁ జొచ్చెను.

1856 వ సంవత్సర ప్రాంతమున స్త్రీపునర్వివాహవిషయముల తో బంగాళాదేశమంతయు నట్టుడికినట్లుడుకఁజొచ్చెను. హరిశ్చంద్ర ముకర్జీఈశ్వరచంద్రవిద్యాసాగరుని పక్షముబూని సంఘసంస్కారము మంచిదేయని పత్రికాముఖమున వాదించి సంస్కర్తలకుఁ దగినసా యముచేసెను. అప్పటి గవర్నరుజనరలుగారగు డల్‌హౌసీ ప్రభువుగా రుహిందూదేశమునందలి పెక్కుభాగములను గలుపుకొని కంపెనీవా రియేలుబడిక్రిందకుఁ దీసికొనివచ్చెను.

తరతరములనుండి యేలుచున్న రాజులను రాజ్యభ్రష్టులుగాఁజే యుట యన్యాయమని హరిశ్చంద్రముకర్జీపలుమారు నిర్భయముగ వాదించెను. డల్‌హౌసీప్రభువుగారి తరువాత గవర్నరుజనరలుగావ చ్చినకానింగుప్రభువుగారి కాలమున సిపాయిపితూరీ రాఁగాముకర్జీచాల పాటుపడి సిపాయీలకు దొరతనమువారికి మనస్పర్థలు దొలఁగించిసం ధిచేసెను. ఆంగ్లేయపత్రికాధిపతులగు దొరలు కొందఱుసిపాయిపితూ రీసంబంధముగల స్వదేశస్థుల భూములు మొఖాసాలు నగ్రహారములు దీసికొని గవర్నమెంటువారు దొరలకిచ్చుట బాగుండునని వ్రాసిరి.ఆ ట్లుచేయుట ధర్మవిరుద్ధమనియుఁ బ్రజలకోపము నణఁచుటకుమారుమ రింత హెచ్చించుననియుఁ దనపత్రికలో వ్రాసిముకర్జీదొరతనమువారు మానునట్లుచేసెను. బంగాళాదేశమునకుఁ గొందఱు దొరలువచ్చి నీలి

మందుతోఁటలు వేయించి దానివలన చాలలాభముతీయుచు రహితులకేమియు లాభము మిగులనీయక వారిని మిక్కిలి బాధపెట్టఁజొచ్చిరి. అప్పుడు రహితులందఱు భూస్వాములమీఁద కట్టుగట్టి నేలదున్నక నీలిమందు పండింపక తిరుగుబాటుచేసిరి. అప్పుడుభూస్వాములారహితులను కోర్టులలో దింపి మరింత పీడింపసాగిరి. ఆసమయమున హరిశ్చంద్రముకర్జీ యానిరుపేద రహితులపక్షము బూని వ్యాజ్యములకై వారువచ్చినప్పుడు వారికన్నము పెట్టి బట్టలిచ్చి యర్జీలు వ్రాసిపెట్టి స్త్రీదర్గనఁగుదిర్చి యెన్నివిధములనో వారినాదరించెను. నీలితోఁటలయజమానులు వ్యాజ్యములలో నోడిపోయినందున ముకర్జీపయి కడుపులోనక్కసునిలిపి వానిపైఁ గొన్నినేరములను మోపి వ్యాజ్యములనుఁదెచ్చిరి. అవితీర్పుగాకమునుపే 18౬౧ వ సంవత్సరమున హరిశ్చంద్రముకర్జీయకాలమరణము నొందెను. అతనిమీఁది వ్యాజ్యములతని మరణాంతరము నవానికి వ్యతిరేకముగా తీర్పు చేయఁబడుటచే నీలితోఁటల యజమానులు వానియిల్లువాకిలి నమ్మించి సొమ్ముగ్రహించిరి. హరిశ్చంద్రముకర్జీపత్రికాధిపతులగు హిందువులలో మొట్టమొదటివాఁడని చెప్పవచ్చును. బ్రతికినది స్వల్పకాలమైనను జీవితమంతయు నతఁడు పరోపకారార్థమై గడపిన పుణ్యపురుషుఁడు.

రాజేంద్రలాలుమైత్రా.

రాజేంద్రలాలు మైత్రా

రాజేంద్రలాలు మైత్రాయను నతఁడు బంగాళాదేశములో గౌరవముగల శూద్రకుటుంబములో పుట్టినవాఁడు. ఆయన 1824వసంత్సరమున సూరాయను గ్రామమున జన్మించెను. వానితండ్రిపేరుజనమేజయుఁడు. ఆయనకుఁ గలిగిన యాఱుగురుకుమారులలో రాజేంద్రలాలుమైత్రా రెండవవాఁడు. ఈమైత్రాను జిన్నతనమునుండియుఁగలకత్తానగరమున నన్న వానిమేనత్త పెంచెను. ఆమేనత్తయీబాలకునిపెంచుకొని తనకున్న సొత్తునంతయు నీయవలయునని తలంచెను. కానియట్టిపెంపు శాస్త్రసమ్మతము గాకుండుటచే నూరకొననలసి వచ్చెను. ఆబాలకుఁడు స్వభాషయగు బంగాళిని తనకులగురువునొద్ద నేర్చుకొని యనంతరము కలకత్తాలో సుప్రసిద్ధికెక్కిన రెండుపాఠశాలలలో నింగ్లీషు నభ్యసించెను.

ఆకాలముననే యీబాలకునిమేనత్తమృతినొందఁ గుమారునకు విద్యచెప్పించవలసినభారముజనమేజయునిపైఁబడెను. కుమారుఁడుకుశాగ్రబుద్ధియని యెఱుంగుటచే తండ్రి వానిచదువును మానిపింపఁ జాలఁడయ్యె. కాఁబట్టి జనమేజయుఁడుచక్కఁగ విచారించి తన పిల్లవానికి విద్యార్థివేతనము నిచ్చునట్టి పాఠశాలలో నెందైనఁ బ్రవేశపెట్టుట కర్తవ్యమని నిశ్చయించుకొనియట్టిబడి యెక్కడనున్నదని వెతకనారంభించెను. ఆకాలమునఁ గలకత్తానగరమున వైద్యకళాశాల (మెడికల్ కాలేజీ) లో దొరతనమువారొక్క విద్యార్థికినెలకెనిమిది రూపాయలవంతున జీతమిచ్చి వారియొద్దనుండియేమియు మరల గ్రహింపకయే వైద్యశాస్త్రము చెప్పుటకేర్పాటుచేసిరి. ఆపాఠశాలాధికారులు రాజేంద్రలాలు మైత్రానుగూడ నట్టివిద్యార్థిగఁ దీసికొనిరి. కానియప్పుడే యతనికి

దురదృష్టవశమున దారుణజ్వరము సంభవించుటచే నతఁడందు వెంటనే చేరలేకపోయెను. రాజేంద్రుఁడు పదునైదేండ్ల ప్రాయముగలవాఁడయినప్పుడనఁగా 1839వ సంవత్సరమున వైద్యకళాశాలలో పైనపేర్కొనబడిన పద్ధతిని విద్యార్థి యయ్యెను. కళాశాలలో నతఁడుచేసిన విద్యాభివృద్ధి మిక్కిలి ప్రశంసనీయమై యుండెను.

ఆతని బుద్ధికుశలతవిని మహర్షి దేవేంద్రనాథ టాగూరుగారి తండ్రియగు ద్వారకనాథ టాగూరుగారు మిత్రానింగ్లాండు దేశమునకుఁ దీసికొనిపోయి యక్కడ విద్య పరిపూర్తిచేయింతునని చెప్పెను. కాని తండ్రి మిత్రాను విదేశమునకుఁబంపఁడయ్యె. ఆవైద్యకళాశాలలోనున్న కాలముననే రాజేంద్రుఁడు కేవలము తనయశ్రద్ధచేత దొరతనమువారి కైదువందల రూపాయిలు నష్టము గలిగించెను. ఒకనాఁడతఁడు కొన్ని లోహములను గరగించుచుండెను. అట్లుకరగించుటకుప్లాటినం అను మిక్కిలి విలువగల లోహముతో చేయఁబడిన మూసయొకటి తెచ్చి దానిని నిప్పులమీఁదఁబెట్టి యాలోహమందు వేసి కరగింపనారంభించెను. కొంతసేపటికి రాజేంద్రుఁడుతనప్రయత్న మెంతవఱకు నెరవేరినదో తెలిసికొందమనిచూచునప్పటికి మూసయేకరగిపోయెను. అది చూచి బాలుఁడగు రాజేంద్రుఁడు భయమున గడగడవడఁకుచు తనయొజ్జయగు ప్రకృతిశాస్త్రపండితున కాసంగతి విన్నవింప నతఁడు వానిని చీవాట్లుపెట్టికళాశాలకు నధికారియగుడేవిడు హైరుదొరగారి కాసంగతిదెలియఁజేసెను. ఆదొరగారును రాజేంద్రునిపిలిపించి వానిం దిట్టకకొట్టక కళాశాలలోనుండి తీసివేయక యట్టిపనులయెడలముందు జాగరూకతతో మెలంగవలయునని చెప్పి మందలించి పంపెను.

రాజేంద్రుఁడు వైద్యకళాశాలలోఁజిరకాలముండలేదు. అచటి విద్యార్థులు కొందఱుదుష్ప్రవర్తకులై సంచరించినందున నధికారులు వారి నడతఁగూర్చి విచారణసలిపిరి. ఆరాజేంద్రుఁ డాచెడునడతగల

బాలకులలో నొకఁడు కాఁడు గాని యాదుర్మార్గులను బట్టియిమ్మని యధికారులు వాని నడిగినప్పుడు తనమిత్రులను బట్టియిచ్చుట కిష్టములేక యతఁ డూరకొనియెను. అదికారణముగ నధికారులు వానిని కళాశాలలోనుండి కొంతకాలము వెడలఁగొట్టిరి. రాజేంద్రుఁడు మరల నావైద్యశాలకు నధికారులు రానిచ్చినను రాఁదలఁపడయ్యె. ఆవైద్యపాఠశాలలో నుండఁగానే యతఁ డాంగ్లేయభాషలో మంచిసాహిత్యముగల కామరాన్ అనుదొరవద్ద నింగ్లీషుచదివి యందుగట్టి కృషిచేసెను. ఈ కామరాన్ దొరయొద్దనే రాజేంద్రుఁడు హూణభాషాపదములను బ్రయోగించుటలో నిరుపమానమయిన ప్రజ్ఞను సంపాదించెను.

అనంతర మతఁడు ధర్మశాస్త్రముఁ జదువనిశ్చయించి న్యాయవాదిపరీక్షకుఁ బోయెను. కానియాసంవత్సరము ప్రశ్నాపత్రములుముందుగా వెల్లడియగుటచేఁ బరీక్షకులు జరగిన పరీక్ష నిరర్థకము చేసిరి. అందుచే పరీక్షలోఁ గృతకృత్యుఁడయి తీరవలసిన రాజేంద్రునకు నష్టము సంభవించెను. రాజేంద్రలాలుమిత్రు వైద్యుఁ డగుటకుఁ గాని న్యాయవాది యగుటకుఁగాని యోగము లేకపోయెను.

పిమ్మట చేయవలసిన దేమియు లేక యతం డనేకభాషలఁ జదువుటకుఁ బ్రారంభించెను. అదివఱకే వానికి పారసీభాష చక్కఁగ వచ్చును. అప్పటికి సంస్కృతమందు వాని పాండిత్యము కొంచెమైయుండుటచే ముఖ్యమయిన యాభాషలో నధికకృషిచేయుట కతఁడు నిశ్చయించుకొనెను. అదిమొదలు రాజేంద్రుఁ డాభాషలో నధికపాండిత్యము సంపాదించి గొప్పగొప్పవిద్వాంసుల మెప్పువడసెను. గ్రీకు లాటినుభాషలను మునుముందునేర్చి యనంతరము ఫ్రెంచి జర్మను భాషలను జదివి పిమ్మట హిందీ ఉరుదు భాషలనభ్యసించి మొత్తముమీఁద పదిభాషలను జదువ వ్రాయ మాటలాడఁగల పండితుఁడయ్యెను. ఎన్నిభాషలు తనకువచ్చినను తనభాషలు తనకన్నము పెట్టఁజాలవని యెఱిఁగి రా

జేంద్రుఁడీదైనయుద్యోగములోఁ బ్రవేశింపవలయునని నిశ్చయించుకొని 1846వ సంవత్సరమున బెంగాలు ఏషియాటిక్కు సొసైటియను సంఘమునకు సహాయకార్యదర్శియు గ్రంధభాండారసంరక్షకుఁడునయ్యెను. అప్పటికతని వయస్సిరువదిమూఁడు సంవత్సరములు. ఈయుద్యోగమువలన నుపయోగములగు ననేకగ్రంథములు వాని స్వాధీనములో నుండుటచే సతఁడు వానినన్నిటిని జదివి సారముగ్రహించి జ్ఞానాభివృద్ధి చేసికొనఁజొచ్చెను. ఆసంఘముయొక్క కార్యదర్శుల సహాయమున నతఁ డింగ్లీషుభాషలో మంచిశైలిని వ్రాయుటకలవఱచుకొని కొలఁదికాలములో నెవ్వరిసహాయము లేక స్వయముగ మంచి వ్రాఁతలువ్రాయ నేర్చెను. ఆసంఘమువారి గ్రంధము లన్నియు సరిగా జాబితావ్రాసి యమర్చి తనకు తీరికయున్నప్పుడు సంఘమువారి మాసపత్రికకేవైన వృత్తాంతములు వ్రాయుచువచ్చెను. అట్లు కొన్నినాళ్లువ్రాసి 1850వ సంవత్సరమున రాజేంద్రుఁడు భాషాగ్రంథములను ప్రకృతిశాస్త్రములను వ్రాసి ప్రకటించుటకై వివిదార్థ సంగ్రహమను పేరుగల యొక మాసపత్రికను బంగాళాభాషలో స్వయముగ బొమ్మలతోఁ బ్రకటింప నారంభించెను. అట్లతఁడు పత్రిక నేడు సంవత్సరములు ప్రకటించి మరుచటి సంవత్సరమున మైనరు జమీందార్లకు విద్యచెప్పు పాఠశాలకు నధ్యక్షుఁడుగ నియమింపఁబడెను. ఇందుమూలమున నతఁడు పాఠశాలలోఁ జేరిన జమీందార్ల బిడ్డలకు సంరక్షకుఁడయ్యెను. ఈజమీందారీ పాఠశాల యేకారణముచేతనో దొరతనమువా రనుకొనినంత వృద్ధిని పొందకపోవుటచే 1880 వ సంవత్సరమున నది యెత్తివేయఁ బడుటయు రాజేంద్రలాలున కుపకారవేతన (పించను) మిచ్చుటయు సంభవించెను.

రాజేంద్రలాలు దొరతనమువారు తనకప్పగించిన యీపనిని మిక్కిలి శ్రద్ధగాను ప్రభువులకుఁ దృప్తికరముగాను నిర్వర్తించెనని

చెప్పకొనక తప్పదు. అప్పటి బంగాళా గవర్నరుగారు జమీందార్ల పాఠశాల విషయమున రాజేంద్రుఁడు చేసిన పనిని మెచ్చుకొనుచు నిట్లువ్రాసెను. "ఇట్లు పాఠశాలను పరిపాలించుట మిక్కిలి కష్టసాధ్య మయిన పనియయినను బాఠశాలఁ గాంచిన వృద్ధి దాని పరిపాలకు నకు మిక్కిలి ప్రతిష్ఠఁ దెచ్చుచున్నది. ఈకాలమున బంగాళా దేశ ములో జక్కఁగ వ్యవహరించుచున్న జమీందార్లనేకులు గలరు. వారందఱు రాజేంద్రలాలుమైత్రాయొక్క శిష్యులే యగుటచేఁ దమ కట్టి సామర్థ్య మీరాజేంద్రుని శుశ్రూషవల్లనే గలిగినదని యొప్పు కొని తమకృతజ్ఞత ననేకపర్యాయములు చూపియున్నారు.

రాజేంద్రలాలుమైత్రా కేవలము ప్రాచీన విద్యలయందె తన కాలముఁ బుచ్చెను. అతఁడు చేసిన పరిశ్రమ యంతయు నేషియాటి క్కు సంఘమువారి మాసపత్రికలోను తదితర పత్రికలలోను స్పష్ట ముగఁ గనఁబడును. అతఁడు రచియించిన గ్రంథములలో ముఖ్యమైనవి ఉత్కల దేశ ప్రాచీనచరిత్ర, బుద్ధగయ ప్రాచీనచరిత్ర యనునవి రెండు. అప్పుడప్పు డతఁడు వ్రాసిన వ్యాసములు "ఇండోఆర్యులు" అనుపేర రెండు సంపుటములుగ ముద్రింపఁబడి యున్నవి. ఆయన మునిసిపల్ కమీషనరుగా కూడ నుండెను. ఆయుద్యోగమున నతఁడు కావలసినంత స్వాతంత్ర్యములఁ జూపి న్యాయముకొఱకుఁ బోరాడుచు వచ్చెను. అప్పుడప్పుడాయన హిందూపేట్రియేటు పత్రికకుఁ గూడ కొన్నిసంగతులు వ్రాయుచుండువాఁడు. కృష్ణదాసుపాలుని మరణానం తరమున పేట్రియేటు పత్రిక నితఁడె నడపెనని చెప్పవచ్చును. కాని యాపత్రిక నడపుటకుఁ గావలసినంత యోపిక యతనికి లేకుండుటచే నాపని యతనికి కష్టమని తోఁచెను. ఇట్లు తేజోవంతమైన జీవయాత్ర నఱువదియేడు సంవత్సరములవఱకుఁ జేసి రాజేంద్రలాలుమైత్రా 891 వ సంవత్సరమున పక్షవాతరోగముచేతఁ గాలధర్మమొందెను.

మేధావంతుఁడై మిక్కిలిపూనికతో పాటుపడుమనుష్యుఁ డెంతయభివృద్ధినొందునో రాజేంద్రలాలుని చరిత్రమువల్ల తెలిసికొనవచ్చును. ఆంగ్లేయభాషలో వ్రాయుటకుమాటలాడుటకు నతనికద్భుతశక్తిగలదు సర్ రిచర్డు టెంపిలు దొరగారు "ఆకాలము మనుష్యులు కార్యములు" అను నర్థముగల యాంగ్లేయ గ్రంథమును వ్రాయుచు రాజేంద్రునిఁగూర్చి యిట్లువ్రాసిరి. "ఆంగ్లేయభాషను ప్రాగ్దేశభాషలను నేర్చిన పండితులలో నితఁ డగ్రగణ్యుఁడని చెప్పవచ్చును. పూర్వ హిందువుల యద్భుత ప్రజ్ఞలం దలంచి యతఁడు మిక్కిలి యక్కజమును గరువమును బొందును. నేనాఁటి హిందువులదురవస్థను గూర్చి మిక్కిలి వగచుచుండువాఁడు." మోక్షమూలరుపండితుఁడు తనగ్రంథములలో నొకదానియందు నీనినిఁగూర్చి యిట్లువ్రాసెను. "రాజేంద్రలాలు మైత్రుఁడు వృత్తిచేత పండితుఁడేగాక గట్టి విమర్శకుఁడు. ఏషియాటిక్ సంఘమువారియొక్క మాసపత్రికకనేకములగు విషయములనువ్రాసి యతఁడు హిందూదేశ ప్రాచీనవిద్యలనుగూర్చి యీవలకు తప్పులగు నభిప్రాయములుగల తన దేశస్థులందఱికంటె నెక్కువవాఁడని తేటపఱచెను.

అతఁడు వ్రాసినగ్రంథములన్నియు నేఁబది. అవి నూటయిరువదియెనిమిది సంపుటములుగ విభజింపఁబడియున్నవి. ఆగ్రంథముల యందలి పుటలు ముప్పదిమూఁడు వేలకంటె నెక్కువ గలవు. ఈసంపుటములు హిందూదేశప్రాచీన విషయములు, సంస్కృతమునుండి చేసిన భాషాంతరీకరణములు, స్వతంత్రముగ బంగాళీభాషలో రచించిగ్రంథములు, సభలోనిచ్చిన యుపన్యాసములు, పత్రికలకువ్రాసినసంగతులు గలవై యాతనిసర్వతోముఖ పాండిత్యమును వెల్లడిచేయుచున్నవి.

1885 వ సంవత్సరమున ఏషియాటిక్కుసంఘమున కతఁడధ్య

త్కుఁడయ్యెను. అదివఱకు హిందువుల కెవరికి నంతటి గౌరవము పట్టి యుండలేదు. కావున రాజేంద్రలాలుమైత్రున కింతటిగౌరవము కలిగి నందులకు దేశస్థులందఱు మహానందభరితులైరి. 1886 వ సంవత్సర మున కలకత్తాలో దేశీయమహాజనసభజరిగెను. అదిరెండవసభ. హిందూదేశము నంతనుండియు దేశీయమహాసభకుఁ బ్రతినిధులుగావచ్చు పెద్దమనుష్యులను సన్మానము చేయుట్కైకెయొకసభ యేర్పడెను. ఆసభ కు నగ్రాసనాధిపతిగా నుండుటకు రాజేంద్రలాలు మైత్రునికంటె న ర్హుఁడు లేఁడని కలత్తానగరవాసులు వాని నైకకంఠ్యముగ నధ్యక్షు నిఁజేసిరి. ఇంతియగాక యతఁడు బ్రిటిషుయిండియా సంఘమునకుఁ గూడ నగ్రాసనాధిపతియై యుండెను. ఈసంఘములో బంగాళాదేశ మునందుగల గొప్పజమీందారులు విద్యావంతులుసభికులుగానుండిరి. అట్టిసంఘమున కతఁడు సభాధ్యక్షుఁడుగా నుండుటచేతనే జనులకతని యం దెంతగౌరవమున్నదో తెలిసికొనవచ్చును.

ఈసంఘము దేశమున కెంతయు నుపకారము జేసినది. ఇట్లు చేయుటకు సభాధ్యక్షుఁ డగు రాజేంద్రుఁడే ముఖ్యకారణమని ప్రజల నుకొనిరి. అతని పాండిత్యమును పరిశ్రమను గనిబెట్టి హిందువులేగాక యితరదేశస్థు లనేకులు వానిని తమతమదేశములందున్న విద్యావిష యిక సభలలో సభ్యునిఁ జేసికొనిరి. కలకత్తాయూనివరుసిటీవారు వానికి డాక్టరనుబిరుదము నిచ్చిరి! డాక్టరుశబ్దమున కిక్కడ వైద్యుఁడ నే యర్థముగాదు. డాక్టరనఁగా పండితుఁడు, ప్రకృతిశాస్త్రము ధర్మ శాస్త్రము మొదలగువానియం దసాధారణ ప్రజ్ఞగల పండితులకుఁ దఱుచుగా నిట్టి బిరుదములు విద్యాశాఖవారిచ్చుచుందురు. దొరత నమువారు వానియందు తమకుఁగల గౌరవమునుబట్టి సి. ఐ. ఇ. రావు బహదూరు రాజా యనుబిరుదముల నిచ్చిరి. 1887 వ సంవత్సర మునందు జరిగిన దర్బారులో సర్ ఆష్లీఇడెం దొరగారు రాజేంద్రు

లాలునితో నిట్లనిరి. "కోర్టుఅఫ్‌వార్డ్సువారి యధీనమునం దుండిన మైనరుజమీందారుల విద్య మీచేతులలో నుంచబడినది. అందుచేత బంగాళమునందున్న జమీందారులలో ననేకులు మీఋణమును దీర్చుకొనఁజాలరు. మీరు సంస్కృతభాషలో నధికపాండిత్యముసంపాదించి జగద్వ్యాప్తమైన కీర్తిని సంపాదించినారు. మీ ప్రజ్ఞలన్నియు నెఱిఁగి దొరతనమువారు మీకు రావుబహదూరు బిరుదము నిచ్చినారు."

తనదేశస్థుల కెప్పుడైన కూడనియపకారము జరిగినపుడు దానిని బయలుపెట్టి మిక్కిలికఠినోక్తులతో దానింగూర్చి ప్రశంసించుచు వచ్చెను. దీనికొక్క యుదాహరణము చెప్పవలసియున్నది. నీలిమందుతోఁటల యజమానులు బంగాళాదేశమునందలి రహితుల కొత్తుడు కలుగఁజేసి బాధించినపుడు రాజేంద్రలాలు దిక్కుమాలిన రహితుల పక్షముఁబూని తోఁటలయజమానుల ప్రవర్తనము సరిగానుండలేదని కలకత్తాలో నొకమహాసభలోఁ బలికెను.ఇట్లతఁడు బహిరంగమైన సభలో తమ్ము నిరసించినాఁడని కోపించి నీలిమందుతోఁటలయజమానులగు నాంగ్లేయులుకొందఱు కడుపుమంటతీరక ఫొటోగ్రాఫిక్ సంఘమునఁజేరి రాజేంద్రలాలుమైత్రని సంభాషణము సరిగానుండలే దని ఖండించి యతని నాసంఘములోనుండి దొలఁగింపఁ బ్రయత్నించిరి. రాజేంద్రుఁ డాసంఘములో చిరకాలమునుండిసభ్యుఁడుగా నున్నందున వానిం దీసివేయుటకు వీలులేక యాదొరలు తుదకిట్లు తీర్మానముచేసికొనిరి. "నగరమందిరమున రాజేంద్రలాలుమైత్రఁడు చేసినయుపన్యాసమునందలి మాటల నీసంఘమువారు వినియందు మొదటినుండి చివరవఱకు నబద్ధములేయుండుటచేత నట్టియుపన్యాసమిచ్చినయతఁడీ సంఘములో సభ్యుఁడుగానుండుటకు తగడని నిశ్చయించి యట్టివానిందీసివేయుట కిప్పటి నిబంధనలలో నేవియు

నాధారములు గనబడకపోవుటచే రాజేంద్రలాలు తనంతటతానే యీ సంఘమునుండి మానుకొనవలయునని యిందుమూలముగా తెలియఁ జేయుచున్నారు.*

మేజర్ థల్లియర్ దొరగారు రాజేంద్రునిపక్షముబూని యతనివలన లోపము లేదనియు ననేకపర్యాయములు నాంగ్లేయులు పిక్కంద్రు హిందువుల నింతకంటె నెక్కుడు కఠినోక్తులతో నిందించిరనియు రాజేంద్రలా లాంగ్లేయుల నందఱిని తిరస్కరింపలే దనియు తప్పుచేసిన నీలిమందుతోఁటల యజమానులనే నిరసించెననియు సంఘమువారట్లు తీర్మానము చేయఁగూడదనియు వాదించెను. హ్యూముదొరగారు మొదలగు కొందఱాంగ్లేయులు థల్లియరుదొరగారితో నేకీభవించిరి. కాని యీసంఘమువారిలో నెక్కువమంది రాజేంద్రునకుఁబ్రతిపక్షులుగా నున్నందున వారిమాటలు సాగవయ్యె. అది కారణముగ రాజేంద్రలాలుతోపాటు థల్లియరుదొరగారుకూడ నాసంఘమును విడిచిరి.

అతని మరణానంతరమున వానింగూర్చి వ్రాసిన స్వదేశపత్రికలు రాజేంద్రలాలుమైత్రుఁడు రామమోహనరాయలుకంటెను, కేశవచంద్రసేనునికంటెను, మేధావంతుఁడనియు మేధావంతుఁడెగాక విద్యావంతుఁడనియు వానిమరణము దేశమునకంతకు నష్టముఁగలిగించెననియు విచారించెను. పదిభాషలలో నిరర్గళపాండిత్యము గలిగి సంస్కృతమునం దింతింత యనరాని ప్రజ్ఞగలిగి యింగ్లీషులో నాంగ్లేయులకు నయితము నీర్ష్యఁ బొడమింపఁగల సామర్థ్యము గలిగి ప్రపంచమునందుండిన సమస్త విద్యాసంఘములలోను సభ్యుఁడుగా నున్న హిందువుఁడు పందొమ్మిదవశతాబ్దమున రాజేంద్రలాలుఁడొక్కఁడే యని తెలిసికొనవలయును.

కృష్ణమోహన బెనర్జి

ఈయన ప్రతిమయు మాకు దొరకలేదు. ఈయన బంగాళా దేశ బ్రాహ్మణుఁడు. ఈయనతండ్రి పేరు జీవన్‌కృష్ణ బెనర్జి. ఈకృష్ణమోహనుఁబెనర్జీ 1813 వ సంవత్సరమున మేనెలలోఁ గలకత్తానగరములో నుదయించెను. అయిదేండ్లవయసువాఁడై నప్పు డతఁడు విద్యారంభముచేసి బంగాళీభాషలోఁ జదువుటయు వ్రాయుటయు లెక్కలుసేయుటయు నేర్చికొనెను. తరువాతఁ గొంత కాలమున కాయన హిందూకళాశాలకుఁబోయి యచ్చట నాంగ్లేయభాషను సంస్కృతమును నేర్చికొనియెను. 1828 వ సంవత్సరమున కృష్ణమోహనుని తండ్రి విశూచి జాడ్యమువలన లోకాంతరగతుఁడయ్యెను. పితృవియోగము చేత విద్యాభ్యాసము చక్కఁగా సాగనందున నతఁడు నెలకు పదియాఱు రూపాయలు విలువఁగల విద్యార్థి వేతనమును సంపాదించి చదువనారంభించెను. మఱుచటి సంవత్సరము వానికి ఢిల్లీకళాశాలలో నొకయుపాధ్యాయకోద్యోగమయ్యెను. కాని కొన్ని గృహసంబంధములగు నిబ్బందులచేత పోఁజాలక యతఁ డాసంవత్సరము నవంబరులోనే హేరుదొరగారి పాఠశాలలో నుద్యోగము సంపాదించెను. ఆకాలమున బంగాళా దేశమున దృఢచిత్తులగు పడుచువాండ్రు కొందఱొక సంఘముగాఁజేరి హిందూమతమును నిర్మూలింపవలయునని నిశ్చయించుకొని తద్విషయమయి పాలుమాలికలేక పాటుపడఁజొచ్చిరి. కృష్ణమోహనుఁడు గూడ నాసంఘమునఁజేరి తద్విషయమున గట్టి పనిఁ జేయుటకు నొక యింగ్లీషు వార్తాపత్రికను బ్రకటింపఁ జొచ్చెను.

కృష్ణమోహనుని పద్ధతులు బంగాళీల కందఱకు మహాగ్రహమును దెప్పించెను. ఆగోలఁజూచి యతని స్వజనముగూడ వాని నింట

నుండి యవ్వలకుఁ బంపివేసెను. మొదటినుండియు నతనికి క్రైస్తవ మతబోధకులు మిత్రులుగా నుండుటచే వానికిఁ గ్రైస్తవమతముపై నత్యంతాభిమానము బొడమెను. ఆయభిమానము కతమున నతఁడు పలుమారు బైబిలు మొదలగు గ్రంథములు చదివి యెట్టకేలకు 1832 సంవత్సరమునఁ గ్రైస్తవమతము నవలంబించెను. డాక్టరు ఢఫ్ ద్వారగా నాసమయమున ప్రధానాచార్యుఁడై పరిశుద్ధస్నానము చేయించి వాని నామతమునఁ గలిపిరి. కలిపినవెంటనే కృష్ణమోహనుఁడు కొంతకాలమునకుఁ బ్రయాగమండలమునఁ బ్రయాణముచేసి 1835 వ సంవత్సరమున తనభార్యను తనస్వాధీనము చేసుకొనెను. తరువాత చర్చిమిషనుస్కూలులో నుపాధ్యాయుఁడై కొంతకాలముండి యవ్వలనొక చర్చికధికారియై యచ్చటి పనులను మిక్కిలి సామర్థ్యముతోఁ నెఱవేర్చుచుండెను. తాను గలియుటయేగాక కృష్ణమోహనుఁడు తనతోడి హిందూబాలకుల ననేకులఁ గ్రైస్తవమతమునఁ గలిపెను. 1852 సంవత్సరమున బిషప్సుకళాశాలలో నతఁడుపాధ్యాయుఁడుగాఁ బ్రవేశించి 1858 వ సంవత్సరమువఱకు నచ్చట పనిచేసెను. ఈయన తాను ప్రవేశించిన క్రొత్తమతమునందు మిక్కిలి యభిమానము గలవాఁడై యామతమును తన దేశస్థులకు బోధించుటకుఁ దద్విషయమున ననేక గ్రంథములు బంగాళీలోను నింగ్లీషులోను వ్రాసి ప్రచురించెను. ఈయన పదిభాషలలో పండితుఁడు. ఓఢ్రభాషయందు సంస్కృతభాషయందు బి. ఏ. మొదలగు పరీక్షలకుఁ జాలకాల మతఁడు పరీక్షకుఁడుగా నియమింపఁబడెను. ఈయన వ్రాసిన గ్రంథములలో రెండు ముఖ్యమయినవి గలవు. అందొకటి హిందువుల వేదాంతశాస్త్రవిషయమయిన సంభాషణ పూర్వకముగా నున్నది. ఈపుస్తకము మన దేశమున కింగ్లాండునుండి వచ్చుదొరల కత్యంతోపయుక్తముగానున్నది. రెండవగ్రంథము క్రైస్తవమతమునందలి సత్యము నఁగూర్చి

వేదములలోఁ బ్రమాణము లున్నవని చెప్పుచున్నది. వేదమందున్న ప్రజాపతిశబ్ద మేసుక్రీస్తునకే యర్థమిచ్చుచున్నదని యతఁడు గ్రంథమునందు సాధించెను.

కృష్ణమోహనబెనర్జి క్రైస్తవమతములోఁ గలసిన కొంతకాలమువఱకు మిక్కిలి మతావేశముగలవాఁడై తక్కిన మతస్థులను గఠినముగాఁ దూలనాడుచువచ్చెను. కాని వయస్సు ముదిరినకొలఁది యన్యమతసహనముఁ గలవాఁడై సమస్తజనముల యెడల ప్రేమగలవాఁడై యందఱి గౌరవమునకుఁ బాత్రుఁడయ్యెను. క్రైస్తవమతబోధకులు దేశస్థులగు బీదలయెడల పరమదయాళులై వారి కనేకోపకారముల చేసినపక్షమునఁ గ్రైస్తవమతమునందుఁ బ్రజల కాదర మెక్కుడుగలుగునని యాయన యభిప్రాయపడి తక్కువజాతులవారికిఁ బలుమారు లుపకారములు సేయుచువచ్చెను. అందుచేత తనమతాభివృద్ధి యెటులున్నను, ప్రజానురాగము మాత్ర మతనియందు హెచ్చుగా నుండెను. క్రైస్తవసంఘమువా రీయనకు "రివరెండు' అను బిరుదము నిచ్చిరి. విద్యాశాఖవారనఁగా యూనివరుసిటీ వారతనికి మహాపండితుల కీయఁదగిన యల్. యల్. డి. యను బిరుదమునిచ్చి గౌరవించిరి. ఈయన 1885 వ సంవత్సరము మేయి నెలలో కాలధర్మము నొందెను. ఆకాలమందు బంగాళా దేశములో విద్యావిషయకములు దేశాభిమాన విషయకములు రాజకీయవిషయకములు నగు ప్రసంగములు కృష్ణమోహనబెనర్జి లేనివిలేవు. ఇతఁడు మతాంతరుఁడైనను దేశాభిమానులలో నొకఁడు.



మధుసూదనదత్తు.

మధుసూదనదత్తు.

మధుసూదనదత్తు బంగాళాదేశములోని జస్సూరు జిల్లాలో సగందరి యనుగ్రామమున 1824 వ సంవత్సరమున జన్మించెను. వాని తండ్రియగు రాజనారాయణుఁడు 'సాదరుదివానీఅదాలత్' కోర్టులో న్యాయవాదిగా నుండెను. ఆయనకు నలుగురుభార్యలు. ఈమధుసూదనుఁడు జ్యేష్ఠభార్య కుమారుఁడు. ప్రారంభమున నతఁడందఱు బాలకులవలెనే మాతృభాషయగు బంగాళీని కొంతకాలము నేర్చికొని యనంతరమున 1837 వ సంవత్సరమున హిందూకళాశాలలోఁ జేరెను. ఆకళాశాల యాకాలమున డిరోజియోయను దొరగారిపరిపాలనముక్రింద నుండెను. ఆయన బంగాళాబాలకుల ప్రవర్తనమును జక్కజేసి విద్యాబుద్ధులు చెప్పి పనిచేయుటలోఁ జాలపని చేసెను. ఆయనకు శిష్యులై విద్యనేర్చికొనిన బంగాళాబాలకు లనేకులు సంఘసంస్కారిప్రియులై హిందూమతములోనుండు దురాచారములను దొలఁగించుటకై పాటుపడిరి. మధుసూదనదత్తును వారిలో నొకఁడయ్యెను.

ఆపడుచువాండ్రందఱు సంఘదురాచారములను దొలఁగించి దేశమున కుపకారము జేయఁదలంచుటయే గాక రాజ్యాంగవిషయములయందుఁ గూడఁ బనిచేసి భరతఖండము నున్నతస్థితికిఁ దెచ్చుటకును స్వభాష నభివృద్ధిచేయుటకును సంకల్పించిరి. అంతియగాక తామభ్యసించిన శాస్త్రవిద్రలచేత తామాంగ్లేయభాషలోఁ గూడ కవనముచెప్పి చిత్రవచనకావ్యముల రచించి ప్రసిద్ధిఁ గాంచఁగలవారమని నమ్మియుండిరి. మధుసూదనదత్తును దనమనంబున నిట్టినమ్మకముగలవాఁడె. అతఁడు 1837వ సంవత్సరము మొదలు 47 వ సంవత్సరమువఱకు హిందూకళాశాలలోవిద్యార్థియైయుండియాకాలముననేయింగ్లీషుభాష

లోననేకపద్యములరచించెను. అప్పుడుహిందూకళాశాలలోఁజదువుకొ నువిద్యార్థులందఱిలో మధుసూదనదత్తుబుద్ధికి బృహస్పతియనిపేరుప డెను. అతఁడు తఱచుగా మోహము దేశాభిమానము మొదలగువిషయ ములఁగూర్చియింగ్లీషులో పద్యములు వ్రాయఁజొచ్చెను. వానికి బా ల్యమునుండియు నింగ్లాండు దేశముఁజూడవలయుననుగుతూహలముగల దు. ఆ దేశము తానెన్నఁడు జూడగలుగుదునో యని యౌత్సుక్యము నొందుచు నింగ్లీషులోనొక చిన్నపద్యమును వ్రాసెను. ఆపద్యమెంత యు మనోహరముగా నుండును.

హిందువులలో సామాన్య బాలకులకే చిన్నతనమందనేకులుపి ల్లనిచ్చి పెండ్లిచేయుచుందురు. అట్టియెడ కుశాగ్రబుద్ధియై విద్యనభ్య సించుచున్న మధుసూదనదత్తువంటివానికి సంబంధములువచ్చుటయా శ్చర్యముగాదు. అందుచేత నతనితండ్రి కుమారునకు వివాహము చే యనిశ్చయించి యొకచిన్నపిల్లను గుదిర్చి తద్విషయ ప్రయత్నములు చేయ నారంభించెను. నలుగురు భార్యలం గట్టుకొని నానాయవస్థలం బడుచున్న తండ్రి తనకుఁ గూడ చిన్నతనమందే వివాహముచేయఁద లంచినప్పుడు మధుసూదనదత్తునకు వివాహ మిష్టములేకపోయెను. అతఁడు తన యనిష్టము సూచించియు తనమాటసాగదనితలంచినివా హసమయమున నిల్లువిడిచిపోయెను. పోయి క్రైస్తవమతబోధకులగు నాంగ్లేయుల శరణుజొచ్చియదివఱకెక్రైస్తవమతములోఁగలిసియున్న కృష్ణమోహనబెనర్జీసహాయమునఁనాలుగుదినములెవ్వరికింగనఁబడకుం డ దాగియుండెను.

ఎట్టకేలకు 1843 వ సంవత్సరమున ఫిబ్రవరు నెలలో నతఁడు క్రైస్తవమతములోఁగలసి యానాఁడు మొదలుమైకేలుమధుసూదన దత్తనుపేరఁ బరగుచుండెను. మైకేలనునది యతఁడు క్రైస్తవమత ములోఁ గలసినప్పుడు కలిగిన నామము. అతనితండ్రి వానియిష్టములే

కుండ బలవంతముగ వివాహము చేయఁదలంపకపోయినపక్షమునమధుసూదనదత్తు క్రైస్తవమతములోఁగలియకతనసహాధ్యాయులవలెనేపేరునకైన హిందువుఁడై స్వమతమునందే యుండును. కానియతనికిఁగలిగిన నిర్బంధమువలన నతఁడు స్వమత పరిత్యాగముచేసి కృష్ణమోహనబెనర్జీవలెనే మతాంతరుఁడు కావలసివచ్చెను. పుత్రవాత్సల్యమతిశయముగాఁగల రాజనారాయణుఁడు మతభ్రష్టుఁడైనయాకొమరునకెప్పటియట్లధనమిచ్చి బిషపుకాలేజీలోనాలుగుసంవత్సరములుచదువుచెప్పించెను. కాని కొన్నికారణములవలన కొడుకునకుం దండ్రికి మనస్పర్ధలు పొడమ రాజనారాయణుఁడు కుమారునివిడిచినందునమధుసూదనుఁ డసహాయుఁడై యుండవలసివచ్చె.

ఆకాలమున చెన్నపట్టణమునుండి కొందఱు బాలకులువచ్చి బిషపుకాలేజీలో విద్యార్థులై కలకత్తాలోఁజదువుచుండిరి. ఆవిద్యార్థుల ప్రోత్సాహముచేత చెన్నపట్టణమునకుఁ బోయి కొంచెము బాగుపడవచ్చునని కలకత్తావిడిచి యాపట్టణమునకుఁబోయెను. చెన్నపట్టణమునకు వచ్చినపిదప వానిస్థితి మునుపటికన్న హీనముఁకాగా నతఁడుదారిద్ర్యబాధమిక్కుటముగాననుభవించి పొట్టపోసికొనుటకేయుపాయమును గానకయింగ్లీషువార్తాపత్రికలకు వృత్తాంతములనువ్రాసి దానిచేఁగొంతధనమును సంపాదించి జీవయాత్ర గడపుచుండెను. ఆనిరుపేదతనమందును మధుసూదనుఁ డింగ్లీషుకవనము మానక యందుఁగృషిచేయుచు 1849 వ సంవత్సరమున "చెఱలోనున్నస్త్రీ"యనుశీర్షికతోనొకమనోహరమైన పద్యకావ్యమును రచించెను. ఆకావ్యమును జెన్నపురమందలి స్వదేశీయులు నాంగ్లేయులుఁగూడగడుమెచ్చిరి. ఇంగ్లీషుకవులలోఁ గడు ఖ్యాతివహించిన స్కాటుబేరను మొదలగువారికవనములకు దత్తుకవనము దీసిపోదని యొకయింగ్లీషువార్తాపత్రిక తనయభిప్రాయము నిచ్చె. ఈపద్యకావ్యమును మధుసూదనుఁడు కలకత్తాలోను

న్న బెత్యూను దొరగారికిఁ బంపినప్పు డాయన దానిం జదివి మహానంద
భరితుఁడై మధుసూదనదత్తునకు నొకజాబు వ్రాసి దానిలో "నీవాంగ్లే
యభాషలోఁ జేసినపరిశ్రమను స్వభాషలోనే చేసి దానికై యుప
యోగించినకాలము నీస్వభాషకై యుపయోగించి గ్రంథములు రచించి
సపక్షమున నీవు దేశోపకారము స్వభాషాభివృద్ధియుఁ జేయుటయేగాక
నింతకంటె నెక్కుడు ప్రసిద్ధినిగాంచఁగలవు సుమీ" యనిహితోపదేశ
ము చేసెను. ఆయుపదేశమును మన్నించి దత్తు వెంటనే కలకత్తానగర
మునకు 1856 వ సంవత్సరమున వచ్చెను.

చెన్నపురమందెనిమిదిసంవత్సరములువసియించినను వానిభాగ్య
ము కనుబొమ్మమీఁది వెండ్రుకలవలెనెదుగుబొదుగులేక, కలకత్తానుండి
బయలుదేరినప్పు డెట్లుండెనో మరల కలకత్తాకువచ్చినప్పుడట్లేయుండె
ను. జీవనాధార మేదియు లేకపోవుటచే నతఁడు రాఁగానే కలకత్తా పో
లీసుకచ్చేరిలో నొకగుమాస్తాపనిసంపాదించి తెలివితేటలుగలవాఁడగుట
చే కొలఁదికాలములోనే తర్జుమాచేయు నుద్యోగస్థుఁడయ్యెను. ఇట్లు
బ్రదుకు తెరవేర్పఱచుకొని మనస్స్థిమితము నొందినపిదప దత్తు బెత్యూ
ను చెప్పిన హితోపదేశముచొప్పున నడువఁదలంచి బంగాళీబాషలోను
న్న గ్రంథములను సమగ్రముగఁ జదివి 1858 వ సంవత్సరమున శర్మిష్ఠ
యను నొక నాటకమును రచించి ప్రకటించి మరుసటి సంవత్సరము
న పద్మావతియను మఱియొక నాటకమును వ్రాసెను. ఈనాటకము ర
చించిన వెంటనే యతఁడు రెండు ప్రహసనములు వ్రాసెను. అందొకటి
బంగాళాబాలకుల దురాచారములను గూర్చియుఁ రెండవది బంగాళా దే
శ వృద్ధులు భోగపరాయణత్వము కపటమును గూర్చియు వ్రాయఁబడె
ను. ఈగ్రంథములవలన నతనికి గొంత పేరు గలిగెను గాని వానికిమిక్కి
లిఖ్యాతి యతఁడు తరువాత రచియించినపద్యకావ్యములవలనఁ గలిగె
ను. మొదటినుండియు నతనికిఁ బద్యములలో యతిప్రాసము లుండుట

ముఖ్యము లేదు. అందుచేత యతిప్రాసములు లేనిపద్యములు వ్రాయుట మంచిదనియట్లు చేయనిశ్చయించెను. యతిప్రాసలు లేనినట్టిపద్యములు రసవంతములుగా నుండవని యానాఁటిపండితులు నైకకంఠ్యముగ నమ్మిరి. ఇతరులమాట యేల? మధుసూదనదత్తునకు నధికసహాయకారియైనవాని కిం బ్రోత్సాహముకలుగఁ జేసిన మహారాజా జ్యోతీంద్రమోహనటాగూరుగారే యట్టికవిత్వమును గూర్చి సందేహించిరి. అయినను దత్తు యతిప్రాసశూన్యమైన కావ్యమును రచియించుటకుఁ గృతనిశ్చయుఁడగుటచే ఠాకూరుగారు దాని నచ్చువేయించుటకు వాగ్దానముచేసిరి. ఆసహాయమును జూచుకొని మధుసూదనుఁడుతిలోత్తమయను నిర్యతిప్రాసకమయిన పద్యకావ్యమును రచియించి 1860 వ సంవత్సరమునఁ బ్రకటించెను. అపూర్వరచనగల యీపద్యకావ్యము ప్రకటింపఁబడిన తోడనే బంగాళాదేశమున గలిగినఁ కళవళము రమేశచంద్రదత్తుగారీక్రింది విధముగా వర్ణించియున్నారు.

"నిర్యతిప్రాసకమయిన యీగ్రంథము కనఁబడినతోడనే పండితమండలమంతయు నాశ్చర్యమునొందెను. కల్పనాగౌరవము వర్ణనాచమత్కృతి శయ్యామృదుత్వము మొదలగునవి యందు లేవని యెవ్వరుననఁజాలరు గాని యతిప్రాసలు దీసివేయుటకు సాహసించినందులకిష్టపడక పండితులందఱు వానిపుస్తకము చెడిపోయినదనిపలికిరి. ఈసాహసమునకుఁగొందఱు వానిని బరిహసించిరి. కొందఱునిందించిరి. ఈశ్వరచంద్రగుప్తుఁడు మొదలగు ప్రాచీనపద్ధతికవులును విద్యాసాగరుఁడుఅక్ష్యకుమారబెనర్జీ మొదలగు నవీనపద్ధతికవులును దత్తుయొక్క గ్రంథము యతిప్రాసలు తీసివేసినందున దుష్కావ్యమైనదనియభిప్రాయమిచ్చిరి. మంచి మెచ్చుటనున్నను దానిని మెచ్చుకొనునట్టిగుణగ్రహణపారీణుఁడు విద్యాసాగరుఁడు తిలోత్తమ భ్రష్టకావ్యమనిపలికెను. విద్యాసాగరుఁడే యట్లన తక్కువప్రజ్ఞఁగల తక్కిన కవులందఱు దత్తును గేలికొట్టి దూషించిరని వేఱచెప్పనేల"

ఇట్లనేకులు గ్రంథమును గ్రంథకర్తను నిరసించినను మెచ్చుకొను వారు కొందఱు లేకపోలేదు. జ్యోతీంద్రమోహనటాగూరు డాక్టరు రాజేంద్రలాలుమిత్రా మొదలగు రసికులు కొందఱు తిలోత్తమయందలి రసమును గ్రహించి కవినిం బొగడంజొచ్చిరి. జ్యోతీంద్రమోహనటాగూరు కావలసిన ధనమిచ్చి గ్రంథము నచ్చొత్తించెను. రాజేంద్రలాలుమిత్రుండు బంగాళీభాషలో యతిప్రాసశూన్యమైన కవిత్వమును గ్రొత్తగాం దెచ్చిపెట్టినందుకు సంతసించి దత్తును బొగడెను. రాజనారాయణ భాసుండను పండితుండు తద్గ్రంథవిషయమున నిట్లు వ్రాసెను. "దేవేంద్రుండు బంగాళీభాషను మాటలాడందలంచుకొనునేని నిశ్చయముగా నతండీ గ్రంథములోనున్న శైలినే మాటలాడును. ఆగ్రంథకర్తయొక్క మహోన్నతములగు కల్పనలను స్వభావవర్ణనమునం గల ప్రజ్ఞయు రసపుష్టి జేయుటలోంగల సామర్థ్యము పదలాలిత్యము విశేషించి పద్యములు నడచుగుణము మమ్ము మహానంద భరితులం జేయుచున్నవి.

ఇట్టి తిలోత్తమ యను గ్రంథము చక్కఁగా నుండలేదని విరుద్ధాభిప్రాయము లిచ్చిన పండితులు మఱికొన్ని దినములకు మధుసూదనదత్తు రచియించిన మేఘనాథవధ యను మఱియొక కావ్యమును జూచి చిన్న బుచ్చుకొనిరి. ఆపండితు లందఱుం జిట్టచివరకు మేఘనాథవధ మిక్కిలి సుందరముగా నున్నదని యొప్పుకొనక తప్పదయ్యె. అట్లొప్పుకొన్నవారిలో నగ్రగణ్యుఁడు గుణగ్రహణ పారీణుఁడు నగు విద్యాసాగరుఁడే. మహాభారతము బంగాళీభాషలో వ్రాసిన కాళీప్రసన్న సింహుఁడను మధుసూదన దత్తుయొక్క బుద్ధి కుశలతకు మెచ్చి యాకవి పేరుపెట్టి యొక విద్యాసంఘము నేర్పఱచెను. ఆ సంఘమునందే దత్తు కృష్ణకుమారి యను నాటకమును, నప్పటికి సమాప్తముకాని వీరాంగన యను పద్యకావ్యము రచించెను

1862 వ సంవత్సరమున మధుసూదనుఁడు యూరోపుఖండమునకుఁ బయనమయి తన చిరమనోరథమును నెఱవేర్చుకొనెను.

అప్పు డతఁ డింగ్లాండునకుఁ బోయి యా దేశమున నైదు సంవత్సరములుండి బారిష్టరు పరీక్షకుఁ జదివి 1867 వ సంవత్సరమున మరల మన దేశమునకువచ్చి కలకత్తా హైకోర్టులో బారిష్టరుగాఁ బనిచేయఁ జొచ్చెను. ప్రారంభము సరిగానే యుండెను. కాని వాని వృత్తిలో వానికి రావలసినంత పేరుమాత్ర మెందుచేతనో రాలేదు. బారిష్టరయిన పిదప నతఁ డాఱు సంవత్సరములు మాత్రమే జీవించి యుండెను. ఆ కాలమయినను సుఖముగా గడువక కష్టములతోను దారిద్ర్యముతోను మనస్తాపములతోను నెట్టెను. ఆయన 1873 వ సంవత్సరమున అల్లిపురము నందలి యాసుపత్రిలో కాలధర్మమునొందెను. మరణమునకు సిద్ధముగానున్న కాలమునందును మధుసూదనదత్తు బంగాళీభాషలో మాయకనా రనుపద్యకావ్యమును వ్రాసి తన జీవిత మెట్లు దుఃఖకరముగా ముగిసెనో దానిలో కథయు నంతదుఃఖ కరముగా ముగించెను.

వెనుక నతఁడు చెన్నపురిలో నున్నప్పుడు నీలిమందుపంట పండించునొక యింగ్లీషువారి కొమార్తె నొకతెను పెండ్లి యాడెను. కాని యీవివాహము వానికి సుఖప్రదము గాకపోవుటచే నతఁడు భార్య వలన విడుదల పత్రిక పుచ్చుకొని మఱియొక దొరసానిని పెండ్లి యాడెను. ఈ రెండవ భార్య వానికి మిక్కిలి యనుకూలమై ప్రవర్తించుటయేగాక వాని సుఖదుఃఖములను సమానముగ ననుభవించి యతనికన్న మూఁడుదినములు ముందుగా మృతినొందెను. ఈ రెండవ భార్యవలన వాని కిరువురు కొమారులు గలిగిరి.

మధుసూదనదత్తు బంగాళాదేశములో పందొమ్మిదవ శతాబ్దమందలి మహావిద్యావంతులలో నొకఁడు. ఆతఁడు మహాకవియేగాక

గొప్పసాహిత్య చక్రవర్తి. హిందూ కళాశాలలోఁ జనపుకాలమున నతఁడింగ్లీషును పారసీభాషను జదువుకొనెను. బిషప్సు కాలేజీలో గ్రీకు లాటిను సంస్కృతమును నేర్చెను. చెన్నపురమందున్నపుడు తెనుఁగును ద్రావిడమును నభ్యసించెను. యూరపు ఖండమునకు వెళ్ళి నప్పుడు ఫ్రెంచి జర్మనీ ఇటాలియను, హీబ్రూ భాషలయందు బ్రవేశము సంపాదించెను. బంగాళీభాష వచ్చునని మనము వేఱుగఁ జెప్పనక్కఱ లేదుగదా!

మధుసూదన దత్తున కుపకారము చేసిన మిత్రులలో నిద్దఱు ముఖ్యులు గలరు. ఒకఁడు మనోమోహన ఘోషు. రెండవ యతఁడీశ్వర చంద్ర విద్యాసాగరుఁడు. ఒకమారు మధుసూదన దత్తు ఋణబాధచేతఁ జెరసాలకుఁ బోవలసినవాఁడై యుండగా నా సొమ్ము ఋణప్రదాతలకిచ్చి విద్యాసాగరుఁడు వానికి కారాగృహ బాధ తప్పించెను. మధుసూదనుఁడు తన మరణకాలమున దిక్కుమాలిన తన యిరువుర కుమారులను మనోమోహనఘోషునకు నప్పగించెను. ఆయన చందాలు వేయించి సొమ్ముప్రోగుచేసి తలిదండ్రులు లేని యాబిడ్డలను పెంచి పెద్దవారిగఁ జేసెను.

మైకేలు మధుసూదనదత్తుయొక్క జీవితచరిత్రము నెఱిఁగిన వారందఱు నేర్చుకొనవలసిన మంచినీతు లొకటి రెండు గలవు. అతి బాల్యవివాహంబులే మన దేశంబునకు సమస్తవిధములగు నష్టములను దెచ్చుచున్నవనియు నట్టివివాహములు చేయుట మానినప్పుడు గాని దేశమభివృద్ధిఁ బొందదనియు బాలికలకు భర్తలను బాలురకు భార్యలను దెచ్చునపుడు వారి కిష్టము లేనివాండ్రం దేగూడదనియు నిందువలన మనము గ్రహింపవలసియున్నది. మధుసూదనదత్తుయొక్క తండ్రి యీరహస్యము గ్రహింపలేకపోవుటచేతనే గదా కుశాగ్రబుద్ధియై విద్యాసంపన్నుండై వివేకియై బంధుమిత్రులకు మహానందము

నోడగూర్పఁజాలువాని కుమారుఁడు మతాంతరుఁడై తలిదండ్రులకు శాశ్వతమయిన దుఃఖమును గలిగించెను. అది యటుండ మనమునేర్చుకొనవలసిన యంశ మింకొకటి యున్నది. కవిత్వము చెప్పుటలోఁగాని మఱియేయితర విషయములోఁగాని పదుగురు నడచుదారిం బోక తనకు మంచిదని తోఁచిన క్రొత్తపుంతనుఁద్రొక్కినవారిని జనులు మొట్టమొదట నిందింతురనియు దానిమంచి కాలక్రమంబున వెల్లడియైన కొలఁది ప్రజలు వానిని గౌరవింతురనియుఁ గూడ మనమిందువలన నెఱుంగవలసియున్నది.

బంకించంద్రచటర్జి

ఇతఁడు 1838 వ సంవత్సరమునజన్మించెను. వానితండ్రియగు యాదవచంద్ర చటర్జీ యింగ్లీషు ప్రభుత్వమువారిక్రింద నొకడిప్యూటీ కలక్టరుగా నుండెను. బంకించంద్రుఁడు మొదట నింగ్లీషుహుగ్లీ కాలేజీలోఁ జదువుకొని పిమ్మట విద్యాసమాప్తికై ప్రెసిడెన్సీ కాలేజీకిఁ బోయిచదివెను. బంగాళాదేశమునందు మొట్టమొదట బి. యే. పరీక్షయందుఁ గృతార్థుఁడైన విద్యాకుశలుఁడితఁడే. అతఁడు తొలుదొల్త పత్రికాధిపతిగనుండి జీవితకాలము గడుపఁ దలఁచెను. ఈతలం పుండుటచేతనే యతఁడు బి. యే. పరీక్షయందుఁ గృతార్థుఁడు గాక మునుపే "ప్రభాకర" యను స్వభాషాపత్రికను నడపుచున్న యీశ్వరచంద్రగుప్తుఁడనువానియొద్దకుఁ బోయి పత్రికనడుపుపని కొంతకాలము నేర్చుకొనియెను. కాని యతఁడు తాననుకొన్నట్లు పత్రికాధిపతి గాఁడయ్యె. ఏలయన పట్టపరీక్షయందుఁ దేరినతోడనే గవర్నమెంటువారు వానికి డిప్యూటికలక్టరుపని నిచ్చెదమన జీతమున కాసపడి యతఁడాయుద్యోగమునఁ జేరెను.

పత్రికాధిపతి గాఁదలఁచుకొన్నందువలన వానికొకలాభము కలిగెను. ప్రభాకరపత్రికాకార్యస్థానమున నున్నకాలమున నతఁడనేక స్వభాషాగ్రంథములు చదువవలసివచ్చినందునఁ గొంతపాండిత్యమతని కందులోఁ గుదిరెను. దానింబట్టి యతఁడు వచనగ్రంథములను జేయ సమర్థుఁడై గొప్పయుద్యోగములో నున్ననుదీరికచేసికొని గ్రంథరచనా వ్యాసంగమును మానక చేయుచుండెను. మహాకవియగుమధుసూదన దత్తు బంగాళీభాషలో మృదుమధురకవిత్వము చెప్పి యానాఁటిగొప్పకవులకు నయితము నాశ్చర్యమును గలిగించుచుండెను. బంకించంద్రుఁడు



బంకించంద్రచటర్జీ.

మధుసూదనదత్తు ననుసరించి నిర్యతిప్రాసమగు కవిత్వముచెప్పఁబూను కొనెను. ఎంతకృషిచేసినను బంకించంద్రునకుఁ గవిత్వములో మధుసూద నున కలవడిన లలితశయ్య యలవడకపోవుటచే నది తనకుఁదగదనిమా నుకొని వచనకావ్యములలోఁ గృషిచేయ మొదలుపెట్టెను.

చటర్జీ యింగ్లీషుభాషలో విచిత్రవచన కావ్యములను(ovels) విసువును తనివియులేక యహోరాత్రములు చదువుచుండెను. అందు లో 'సర్ వాల్టరుస్కాటు' అను మహాకవి రచియించిన వీరరసప్రధాన ము లగు చిత్రవచనకావ్యములయం దతనికి మిక్కిలిత మకము. అవిచ దివినపిదప స్కాటువ్రాసిన గ్రంథములను మరల బంగాళీభాషలో వ్రా యుట యసాధ్యమయినను స్కాటుమార్గమునను సరించి స్వభాషలో స్వకపోలకల్పితముగఁ గొన్ని చిత్రవచనకావ్యములు వ్రాయవచ్చుననిన మ్మి యతఁ డాపనికిఁ బూనుకొనెను. 1864 వ నంవత్సరమునం దతఁడు దుర్గేశనందిని యను దేశచరిత్ర గర్భితమయిన మొట్టమొదటిచిత్రవ చన కావ్యమును రచించెను. అదియే యిప్పటికిని బంకాళీవచనకావ్య ములలో నగ్రగణ్యమని కొనియాడఁబడుచున్నది. ఇందలికల్పనమతిచి త్రము. స్థలపదార్థాదివర్ణనము శ్లాఘ్యము. కథ మిక్కిలి మనోహరము. బంగాళీభాషలో మరల నటువంటికల్పితవచనకావ్యమిప్పటికింబుట్టలే దు. మధుసూదనదత్తును బరిహాసించినట్లె బంకించంద్రునిఁగూడ జనులు క్రొత్తమార్గమున వచనకావ్యములునిర్మించినందుకుబరిహాసించిరి. ప ట్టుమని పదిబంతులు సరిగ వ్రాయుటకు సమర్థులుండరుగాని సరసముగ నొకరు వ్రాసినదానిని విమర్శకులమని పేరుపెట్టుకొనినిందించియుపహా స్యము చేయుట కనేకులుందురుగదా! బంకించంద్రునిగ్రంథమునశై లిమనోహరముగా లేదనియు సందర్భసిద్ధిపొందుపడ లేదనియువర్ణనము లుండవలసినట్లుండ లేదనియుఁ గొందఱుపండిత మనుష్యులువాని వ్రా తలను ఖండించిరి. కాని యతఁడు వారి విమర్శనములనుజూచినగవక

తనపూనినపని మాసక బంగాళీభాషకుఁ జిత్రవచనకావ్యము లనియెడు క్రొత్త యలంకారములను దెచ్చిపెట్టెను.

తర్వాత నతఁడు మఱికొన్ని వచనకావ్యములనుగూడ రచించెను. అందు ముఖ్యమైనవి కపాలకుండలయనునదియు మృణాళినియనునదియు. కపాలకుండలయనుకథ కేవల కల్పితమయి శాక్తేయమతమునందుగల ఘోరకృత్యములను వెల్లడిచేయును. మృణాళినిబంగాళీల యాచార వ్యవహారములఁ దెలుపునట్టికథ. 1872 వ సంవత్సరమున బంకించంద్రుఁడు వంగదర్శినియను నొకమాసపత్రికను ప్రకటింపనారంభించెను. ఇది కేవలము విద్యావ్యాసంగములుగలదై జనరంజకమైస్వల్పకాలముననే యనేకులచేతఁ జదువఁబడుచుఁ బ్రసిద్ధికెక్కెను. అదివఱకతఁడు వ్రాసిన వచనకావ్యములన్నియుఁ బూర్వవృత్తాంతములనే దెలుపుచు వచ్చినందున నన్నియు నొక్కవిధముగానే యుండఁగూడదని బంగాళీదేశమున నాకాలమునసంఘస్థితియెట్లున్నదో దానినివర్ణించు నొకటి రెండుగ్రంథములనువ్రాసెను. అవి వంగదర్శినిలోఁ బ్రకటింపఁబడి మిక్కిలి రసవంతములై యున్నయవి. సంఘస్థితినివర్ణించినవచనకావ్యములలో విషవృక్షమనునది మిక్కిలి చిత్రమైనది. అదియు వంగదర్శినియందు నెల నెలకుఁ బ్రకటింపఁ బడుచు వచ్చెను. దాని రమణీయకమునుబట్టి యది యింగ్లీషు భాషలోనికిఁ గూడ తర్జుమా చేయఁబడినది. ఆకారణమున బంకించంద్రునిపేరు ఫ్రెంచివారికి నింగ్లీషువారికిఁ దెలియవచ్చెను.

ఇతఁ డింక ననేక వచనకావ్యములు రచించె. అందుముఖ్యమయినవి దేవీఛందూరాణీ,ఆనందమఠము మొదలగునవి.ఇతఁడు మొదటనుండియుఁ బూర్వాచార పరాయణుఁడు. సంఘసంస్కారముబ్రహ్మసమాజమతము మొదలైన వతని కంతగాకిట్టవు. ఇతఁడు వయసుముదిరిన కొలఁది మతమునం దత్యంతాసక్తిఁగలవాఁడై కృష్ణునిమహిమలు

గొనియాడుచు నొక గ్రంథమువ్రాసెను. అందు శ్రీకృష్ణుఁడుసద్గుణ సంపన్నుఁడనియు నతనింగూర్చి భాగవతాదిగ్రంథములలో వ్రాయఁబడి నదంతయుఁ గేవలము కవికల్పితమగు నబద్ధమనియునతఁడువ్రాసెను. ఈయన వేదములం జక్కఁగఁ జదివినవాఁడు. ఈయనకు గవర్నమెంటు వారు రాయబహద్దురనియు సి. ఐ. ఇ అనియు బిరుదుల నిచ్చిరి. ఈయన 1894 వ సంవత్సరమున మృతినొందెను.

ప్రసన్న కుమార టాగూరు.

ఈయన 1803 వ సంవత్సరమున జన్మించెను. ఈతనివలన టాగూరు కుటుంబమునకు మిగుల వన్నెయు వాసియుఁ గలిగినవి. ఇంటియొద్ద నతఁడు హిందువుల కట్టుబాటులలోనే పెరుగుచునా కాలమునకుఁదగినరీతిగాఁ గొంచెమింగ్లీషుగూడ జదివెను. మొట్టమొదట నతఁడు ఛాందసుఁడై యున్నను తరువాతఁ గొంతకాలమునకు రాజా రామమోహనరాయలవారిమైత్రి గలుగుటఁ జేసి యతఁడు హిందువుల యాచారములలో నేవిమంచివి యేవిచెడ్డవని శోధింపనారంభించెను. ఇట్లుశోధించిశోధించి యతఁడు దేశస్థుల కొకవిజ్ఞాపనముల్వ్రాసి ప్రకటించెను అందులో విగ్రహారాధనముచేయుట యనుచితమనియుసర్వలోకసృష్టికర్తయు సర్వనియామకుఁడునగుపరమేశ్వరుని మానసికపూజచేయవలయుననియు నతఁడు నొక్కివ్రాసెను. అతఁడు బుద్ధిస్వాతంత్ర్యమును గనఁబఱుచుట యొక్కమతవిషయమునఁనేగాదు. ఇంక ననేక విషయములంజూపెను. తాను స్వయముగజమీందారుఁడయ్యుజమీందారు లుద్యోగములు చేయఁబోడదను గర్వములేక సామాన్యులవలెనే తాయును శాస్త్రములఁ జదివి పరీక్షలయందుఁ దేరి న్యాయవాదియయ్యెను.

ఈపనిలోఁ బ్రవేశించునప్పుడు ప్రసన్నకుమారుని మిత్రుఁడొకఁడు వచ్చి యట్టి గొప్పకుటుంబమునఁబుట్టినసంపన్నుఁడగు న్యాయవాదిగ నుండుట యవమానకరమనియు నిరర్థకమనియుఁ జెప్పి, మందలించెను. ప్రసన్నకుమారుఁడప్పు డతనితో నిట్లనియె. "మనస్సు గృహమందు జరుగవలసిన యన్నిపనులను జక్కబెట్టుకొను భార్యవంటిది. నాకునీలిమందుతోఁటలు, ఆముదపు యంత్రములు చాలగలవు. అందులో నాకన్యాయముగ నష్టములు కలుగుచున్నవి. నాకు నష్టములు తెచ్చినవార

మీఁద వ్యాజ్యములు తెచ్చితిని. కాని న్యాయవాదుల తెలివితక్కువ వాదములచేత నావ్యాజ్యములుపోయినవి. అందుచేత నే నేశాస్త్రములు చదువుకొని న్యాయవాదినై నావ్యాజ్యముల నేనే వాదించెదను." అనిచెప్పి న్యాయవాదియై యాపనిలో మిక్కిలిబుద్ధికుశలతఁజూపి చాలప్రసిద్ధికెక్కెను. ఇట్లు కొంతకాలము జరిగినపిదప కలకత్తాకోర్టులో నదివఱకు గవర్నమెంటు ప్లీడరుగానున్న యొకదొర పనిమానుకొని స్వదేశమునకుఁబోగా దొరతనమువా రాయుద్యోగమును ప్రసన్నకుమారునకిచ్చిరి. ప్లీడరుపనివల్ల నతఁడు సం॥రమునకు లక్షయే బదివేల రూపాయల నార్జించెను. ఆధనముతోడను సంస్థానమువల్ల వచ్చినధనముతోడను ప్రసన్నకుమారుఁ డనేకభూములను కొని జమీ చాల వృద్ధిపఱచెను. శ్రీమంతులగు గొప్ప వంశస్థులలో నుద్యోగమునకు వచ్చినవారిలో నితఁడే మొట్టమొదటివాఁడు. హిందూకళాశాలలో నతఁడొక సభికుఁడై దానియభివృద్ధిని గూర్చి చాల పాటు పడియె.

తనకుమార్తెయు మనుమరాలును విద్యావతులు గావలయునని సంకల్పించి యింటియొద్దవారికి విద్యనేర్పించెను. కొంతకాలము గడచినపిదప ప్రసన్నకుమారుఁడు అనువాదకమను పేర బంగాళీభాషలో నొకపత్రికను, సంఘసంస్కారియను పేర నొక యింగ్లీషుపత్రికను బ్రకటింపనారంభించి సంఘసంస్కరణము రాజకీయ వ్యవహారము మతము విద్యమొదలగు విషయములంగూర్చి జనుల బుద్ధులు వికసించునట్లు మంచివ్రాతలను వ్రాయుచువచ్చె. రాజారామమోహనరాయలు సహగమనమును మానుపింపవలయునని చేసినప్రయత్నమునకు విరుద్ధముగాస్వదేశస్థులుకొందఱు సహగమన ముండితీరవలయుననియు దానిని మానుపింపఁగూడదనియు నింగ్లాండు రాజుగారికిని పార్లమెంటుసభవారికిని మహజర్లు వ్రాసిపంపిరి. కాని యామహజర్లను లెక్క

సేయక యింగ్లండు రాజుగారు సహగమనము చేయఁగూడదనియే శాసించిరి. అట్లు శాసించినందుకు శ్రీరాజుగారికిని బార్లమెంటుసభవారికిని జనులుకృతజ్ఞతఁ దెలుపుటకై ప్రసన్నకుమారుఁ డొక పెద్దసభ చేయించెను. ప్రసన్నకుమారుఁడు మహాదాత. పూర్వము గొప్పదశలోనుండి కాలవశమున పేదలై యభిమానమున కింటనుండి యిడుమలఁబడువారి కనేకులకు నెలనెలకు జీతములిచ్చి సహాయములుచేయుచువచ్చెను. తన సేవకులలో నెవరికి రోగమువచ్చినను వారికౌషధములను గొనితెచ్చి వైద్యులచేత మందులిప్పించి వారిని బిడ్డలవలెఁ గనిపెట్టుచుండును.

ఆయన పుస్తకభాండారము మిక్కిలి పెద్దది.అందు బహుగ్రంథములుండుటచే హైకోర్టుజడ్జిలు తక్కిన పెద్దమనుష్యులు విద్యార్థులు కావలసినప్పుడు స్వేచ్ఛగవచ్చి జదువుకొనుచువచ్చిరి. ఎల్లకాలముఁ గలకత్తాలోనే వసియింపక ప్రసన్నకుమారుఁడు తఱచుగ తనసంస్థానమునకుఁబోయి చూచుకొనుచు వ్యవహారమంతయు దివానులమీఁదనే వదిలివేయక రహితులతోఁ గలిసిమాటలాడి వారిసుఖదుఃఖముల నెఱుఁగుచు వారిసౌఖ్యమునిమిత్తము వైద్యశాలలు గట్టించి రహితులకు భారమైనప్పుడు వారియొద్దనుంచి పన్నుపుచ్చుకొనక వారిని వేవిధములఁ గనిపెట్టెను. దొరతనమువారు హిందూదేశ శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్డు) వ్రాయించినప్పుడు ప్రసన్నకుమారుఁడు వారికి మిగులఁదోడ్పడియెను. గవర్నరుజనరలుగారి యాలోచనసభలో మొట్టమొదటసభ్యుఁడైన హిందువుఁ డితఁడే. కలకత్తా యూనివరుసిటీకి నతఁడు మూఁడులక్షలరూపాయలు దానముచేసి దానివడ్డి నింగ్లీషుధర్మశాస్త్రము (లా)ను నేర్పించుటకు వినియోగింపుమని యానతిచ్చెను. అతని కుమారుఁడు జ్ఞానమోహనటాగూరు క్రైస్తవుఁడై యింగ్లాండునకుఁబోయి బారిష్టరై వచ్చెను. హిందువులలో నతఁడే మొ

డటి బారిష్టరు. అతనికి గవర్న మెంటువారు సి. ఐ. ఇ. అను బిరుద మునుగూడ నిచ్చిరి. అతఁడు 1862 వ సంవత్సరమున మృతినొందెను. ఆతని యోగ్యతనుబట్టి కలకత్తానగరవాసు లాయన జ్ఞాపకార్థము స్ఫటికశిలతో వాని ప్రతిరూపమును జేయించి నిలిపిరి. అది యిప్పటికి నున్నది.

మానమోహనఘోషు

ఈతఁడు హిందూదేశమందు సుప్రసిద్ధిఁగాంచి 1903 వ సంవత్స రమున చెన్నపట్టణమందుజరిగిన దేశీయమహాసభ కధ్యక్షుఁడగు లాల్ మోనహఘోషుగారి సోదరుఁడు. ఆయనది డక్కా జిల్లాలోని విక్ర మపురము కాపురము. కులమున నితఁడు కాయస్థుఁడు. అతని తండ్రి యగు రామలోచనఘోషు సబుజడ్జి యుద్యోగముచేసి రాజారామ మోహనరాయలువారు తలపెట్టిన సంఘసంస్కరణ మహాకార్యమునం దభిమానముకలిగి వానికి కుడిభుజమై పనిచేసెను. మానమోహనుఁ డు 1844 వ సంవత్సరము 13 వ మార్చినాఁడు జన్మించెను. బాల్య మందితఁడు కిష్ణఘరుపాఠశాలలోఁ జదువుకొనెను. 1859 వ సంవత్సర మున మార్చినెలలో మానమోహనుఁడు ప్రవేశపరీక్షయందుఁ గృతా ర్థుఁడై 1861 వ సంవత్సరమున కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలోచేరె ను. అచ్చట నతఁడొక్కవత్సరము మాత్రమే చదివి మరుచటి సంవ త్సరము సివిల్‌సర్వీసుపరీక్షకు చదువుకొనుట కింగ్లాండునకుఁబోయెను. 1860 వ సంవత్సరమునందు(అనఁగా మోహనుఁడు కిృష్ణఘరునందున్న కాలముననే) బంగాళాదేశమున నీలిమందు కలవుపుట్టెను. ఆకలవువలన ననేకులుచెడిపోయిరి. ఆక్షామమువలనఁ గలిగిన దారుణకష్టములంగూ ర్చి మానమోహనుఁడు 'హిందూ పేట్రియాటు' అనుపత్రికకుఁ దఱు చుగా లేఖలనువ్రాసి పంపుచుండువాఁడు. ఆపత్రికాధిపతియైన హరి శ్చంద్రముఖర్జీ మృతినొందుటయు నదికారణముగాఁ దత్పత్రికక్రొ త్తచేతులలోనికిఁ బోవుటయుఁ జూచి మంచిపత్రిక మఱియొకటిస్థాపిం పవలెనని నిశ్చయించి మానమోహనుఁడు మఱికొందఱి సాయమునఁ 'హిందూదేశదర్పణము' అనియర్థమిచ్చు 'ఇండియన్ మిర్రరు' పత్రి కను ప్రకటింపఁబొచ్చెను. అది ప్రారంభమున పక్షపత్రికగ ప్రకటిం

మాన మోహన ఘోషు.

పఁబడుచు వచ్చెను. ఆపత్రికయే యిప్పుడు దినపత్రికయైకలకత్తాలో మిక్కిలి పేరుపడి యున్నయది.

మానమోహనుఁడు సహజముగ మిక్కిలి తెలివితేటలు గలవాఁడయ్యు 1864 వ సంవత్సరమునందును 1865 న సంవత్సరమునందును గూడ సివిలుసర్వీసు పరీక్షలోఁ గృతార్థుఁడు కాలేకపోయెను. అతఁడు పరీక్షయందుఁ దప్పిపోవుటకు వాని తెలివితక్కువ కారణముకాదు. అదివఱకున్న నిబంధనలుకొన్ని మారుటచేతను సంస్కృతము మొదలగు కొన్ని ప్రాగ్దేశపు భాషలకు మునుపటి విలువ తగ్గిపోవుటచేతను మానమోహనుని కృషి వ్యర్థమయ్యెను. ఇంగ్లాండు దేశములో హిందూదేశస్థులకు జరుగు సివిల్ సర్వీసుపరీక్షనుగూర్చి యతఁడొకచిన్న పుస్తకమునువ్రాసి యందులో నింగ్లీషువారికిఁగల లాభములను మనకుఁగల ప్రతిరోధములను జక్కగ విమర్శించి విపరించెను. అతఁడు సివిలుసర్వీసు పరీక్షకుఁ జదువుచున్న కాలముననే 'బారిష్టరు' పరీక్షకు గూడ జదువనారంభించి మొదటిదానిలోఁ నెఱవేఱు యోగము లేకపోయినను రెండవదానిలోఁ గృతార్థుఁడై 1866 వ సంవత్సరమున బారిష్టరై వచ్చెను. చదువంతయు ముగియకమునుపే తండ్రి పరలోకగతుఁడగుటచే మానమోహనుఁడు పరీక్షకాగానే స్వదేశమునకు వచ్చి 1867 వ సంవత్సరము జనేవరు 10 వ తారీఖున కలకత్తా హైకోర్టులో న్యాయవాదిగాఁ జేరెను.

కలకత్తా హైకోర్టులో నితఁడే మొట్టమొదటి బారిష్టరు. ఆ కోర్టులోపనిచేయుచున్న నితనితోడిబారిష్టరులగు తెల్లవారు నల్లవాఁడని మానమోహనుని దమతోసమానముగ గౌరవింపక యలుసుఁగ జూచుచు మీఁదుమిక్కిలి యతఁడు నిర్ణీతకాలము బారిష్టరుతరగతిలో జదువలేదనునెపమునఁ బనికనర్హుఁడని దీసివేయించుటకుఁబ్రయత్నించిరి. ఓర్వలేమిచే వారలుచేసిన యాక్షేపణములన్నియు మహాధైర్యసం

పన్నఁడు దృఢచిత్తుఁడునగు మానమోహానుని యెడ వ్యర్థములయ్యెను కాలక్రమమున మానమోహానుని తెలివితేటలు బయలుపడుటచే దొరతనము వారతనికి కలకత్తా ప్రెసిడెన్సీ మేజస్ట్రేటుపని నియ్యఁదలఁచిరి. కాని యతఁ డంగీకరింపఁడయ్యె.

ఇంగ్లాండునుండి వచ్చినది మొదలు మానమోహానుఁడు సివిలు సర్వీసు పరీక్షలో హిందువులకు జరుగు నక్రమములనుగూర్చి వరుసగ కొన్ని యుపన్యాసముల నిచ్చెను. 1869 వ సంవత్సరము ఏప్రిల్ 20 వ తారీఖున నింగ్లీషువిద్యాభ్యాసము బంగాళీలకుఁ జేయుచున్న చెఱుపును గూర్చి యతఁడొక యుపన్యాసము చేసెను. అది దేశమందు చాలసంక్షోభము గలిగించెను. హిందువులలో ననేకులకు మానమోహానునిపై మహాగ్రహము కలిగెను. బారిష్టరులలో మానమోహానునకు హిందువులలోను నింగ్లీషువారిలోను నెవరికిఁ గలుగునంత పేరుంబ్రతిష్ఠయు లభించెను. అతఁడు పనిలో ప్రవేశించిన స్వల్పకాలముననే యొక గొప్పవానిమీఁద పెద్దయభియోగము వచ్చెను. ఆనేరస్థుఁడు తన పక్షము వాదించుటకుఁ జిరకాలానుభవముగల గొప్పన్యాయవాది నొకని నేర్పఱచుకొని వానికి సహాయుఁడుగనుండుటకు మానమోహానునిఁ గూడ నియమించుకొనెను. దైవవశమున నభియోగము విచారణకు వచ్చునప్పటికి మొదటియతఁడు చనిపోవుటంజేసి యాకార్యభారమంతయు మానమోహానునిమీఁదఁ బడెను. ఆవ్యవహారమున మానమోహానుఁడు గెలువఁజాలఁడయ్యెను. కాని వాదము సలుపుటలో నతఁడుచూపినసామర్థ్యమునకు బుద్ధికుశలతకు మెచ్చి ప్రధానన్యాయాధిపతివానిని శ్లాఘించెను. కాలక్రమమున నతఁడు జనుల సన్మానమునకు నాదరమునకుఁ బాత్రుఁడై తఱుచుగ క్రిమినలువ్యవహారములలోఁ బనిచేయుచుఁ గొన్నియెడల ముద్దాయీలకడనుండిధనముగ్రహింపక యేధర్మార్థము పనిచేయుచు నిరపరాధులఁ బెక్కండ్రనురినుండి దప్పించి పుణ్య

ముగట్టుకొనెను. బంగాళమునందున్న పోలీసువారియొక్కయు మేజస్ట్రీటులయొక్కయు నక్రమములను బలుమారతఁడు వెల్లడిచేయుటఁ జేసి వారి కితనిపై రీశ్వరవైరైయుండెను. 1882 సంవత్సరమున నవద్వీపమునందు వసియించు మాలక చందచౌకిదారను నిరుపేదరహితుమీఁద కొమ్మిదియేండ్లవయసుగలతనబిడ్డను చంపినట్లునేరము మోపఁబడిశిక్ష వేయంబడెను. ఆవ్యవహారములో మానమోహనుఁడు ధర్మార్థము పనిచేసి చాలశ్రమపడి శిక్ష కొట్టివేయించి వానిం బ్రతికించెను. ఇది యొక్కటియేగాదు. వ్రాయఁదలంచుకొన్న నతఁడుచేసిన ధర్మకార్యము లనేకములు గలవు.

మానమోహనుఁడు చేసినమేలు మరువక యాకాఁపువాఁడాఋణము సంవత్సరమునకు రెండుసారులు మానమోహనుని దర్శనముచేసి యోపినకొలఁది వానికి బహుమానము లిచ్చుచువచ్చెను. సాక్షుల నడ్డుప్రశ్నలు వేయుటలో మానమోహనున కధికప్రజ్ఞకలదని చెప్పుదురు. ఒకమారొక డిప్యూటీకలెక్టరుగారొకవ్యవహారమున సాక్షిగ వచ్చి మానమోహనుని ప్రశ్నలధాటి కాఁగఁజాలక యొకమాట కొకమాట సంబంధములేనట్లవకతవకల నెన్నొని పలికి చిట్టచివఱకు సంభ్రాంతుఁడై మూర్ఛపోయెను.

ఈయనకుఁజిన్నతనమునుండియు స్త్రీవిద్యయం దత్యంతాభిమానము గలదు. ఆకారణమున 1873 వ సంవత్సరము మార్చినెలయందతఁడు బెతూన్యునుకాలేజీవ్యవహారములఁ జూచుటకుఁ దత్పరిపాలనాసభలో నొకసభ్యుఁడయ్యెను. పిమ్మటఁగొన్నినాళ్ళకతఁ డాసభకుఁ గార్యదర్శియై దత్కార్యముల నతిశ్రద్ధతో నిర్వహించెను. 1885 వ సంవత్సరమున నింగ్లాండు ప్రజలకు మనదేశస్థితులను జక్కఁగా విన్నవించుటకు మనవారొక్కొక్క రాజధానినుండియొక్కకని బంపఁదలంచి బంగాళమునుండి మానమోహనుని బంపిరి. హిందూదేశీయమహాసభ పుట్టిన

దిమొదలు మానమోహనునకు దానియం దభిమానమే యుండెను. అందుచే 1890 వ సంవత్సరమున కలకత్తానగరమునందు జరిగిన యాఱవదేశీయమహాసభ నిర్వహించుట కేర్పడిన సమ్మానసంఘమున కితఁ డధ్యక్షుఁడయ్యెను. అంతేగాక 1896 వ సంవత్సరమున క్రిష్ణఘరునగరములో జరిగినబంగాళా రాజధానిసభ కధ్యక్షుఁడుగనియమింపఁబడెను. హిందూదేశమునం దిప్పటికిని కలక్టరుకు సిస్తు వసూలుచేయు నధికారమేగాక నేరముల విచారించి దోషుల శిక్షించు నధికారము గూడకలదు. ఆరెండధికారము లొకపురుషునియందే యుండుటచేఁ బ్రజలకు చిక్కులు మిక్కిలి సంభవించుచున్నవని నమ్మి మానమోహనుఁడాయధికారము వేఱువేఱుపురుషుల కియ్యవలసినదని పట్టుపట్టి వాదించెను.

దేశీయమహాసభలో చర్చింపఁబడు నంశములో నిదిప్రధానమైనది. ఆవిషయమున మానమోహనఘోషుయొక్క వాక్యములు ప్రమాణములు. ఆతఁడు 1895 వ సంవత్సరమున నింగ్లాండునకుఁబోయి యీయంశ మాదేశస్థులకు నచ్చఁజెప్పెను. ఆసంవత్సరమునపునహానగరమున జరుగు దేశీయమహాసభకు వచ్చుటకు వీలుండదేమోయనుభయమునత్వరపడి స్వదేశమునకు వచ్చి యాసభలోకూడయీయంశము ను విపులముగఁ జర్చించెను. అనంతర మతఁడు కలకత్తాకువచ్చి రివిన్యూ మేజస్ట్రీటు యధికారములు రెండును జేతిలోనున్న యుద్యోగస్థులుచేసినతీర్పులను వానిలో జరిగిన యన్యాయములను రెండుసంపుటములుగఁ బ్రకటించి యీమార్పుచేయుట యావశ్యకమని యందఱకుఁ దోఁచునట్లు చేసెను.మానమోహనునివ్రాతలకును బలుకులకును 'సర్ చార్లసు ఇల్లియటు' అను బంగాళాదేశపు గవర్నరొక వార్తాపత్రికలోఁబ్రత్యుత్తరమిచ్చెను.ఆదొరగారియుక్తులకుఁదగినప్రత్యుత్తరములుమానమోహనుఁడీయఁదలంచుచుండఁగనెవానినంతలోమృత్యుదేవ

తతనపాట్టం బెట్టుకొనియె. 1896 సంవత్సరము అక్టోబరునెలలో మాన మోహనఘోషు స్వస్థానమగు క్రిష్ణఘురు నగరమున మృతినొందెను.

మానమోహనుఁడు కలసిమెలసియుండుస్వభావముగలవాఁడు. ఎదుటివారిమనస్సు నొచ్చునేమో యనుభయమున నతఁ డెల్లపుడు మృదుభాషియై దయాళుఁడై యుండెను. సర్వవిధములచేత నతఁడు సజ్జనుఁడని చెప్పవచ్చును. హిందువులయెడ నతని కెంతయాదరముగలదో విదేశీయులగు నాంగ్లేయుల యెడలను నంతేయాదరముగలదు. అతనియెడ వారికిని గూడ నంతేయాదరముగలదు. అతఁడు మృతినొందినపుడు 'నేషనల్ ఇండియన్ అసోసియేషన్'అనుసంఘమువారు హిందువులకు నాంగ్లేయులకు నైకమత్యము నొడగూర్చుటలోను స్త్రీపురుషులవిద్యాభివృద్ధిచేయుటలోన మానమోహనఘోషు చాలశ్రమపడినాఁడని వానియెడల దేశస్థులు కృతజ్ఞులై యుండవలెనని యొకతీర్మానము వ్రాసిరి అతఁడుచేసిన దానము లనేకములుగలవు. నిరుపేదలగు దోషులకును విద్యార్థిసంఘములకును సత్కార్యములకును ధనలోపముచేఁబడిపోవుటకుసిద్ధముగనుండు వార్తాపత్రికలకు మానమోహనుఁడు కల్పవృక్షమై యడుగుటయె తడవుగ ధనసాహాయ్యముచేయుచుండెను. మందభాగ్యుఁడగు బంగాళీకవి మధుసూదనదత్తునకు మానమోహనుఁడుచేసినసాయమింతింతయనరానిది. మధుసూదనదత్తుమరణకాలమున తల్లిలేనితనయిరువురు కుమారులను సంరక్షింపుమని మానమోహనున కప్పగించెను. పరమదయాళువగు మానమోహనుఁడు తనమిత్రుఁడు చరమావస్థలో చేసిన ప్రార్థనమును మనసున నుంచుకొని యాబాలకుల సంరక్షణకై యొకచిన్నసంఘము నేర్పఱచి విద్యాబుద్ధులు చెప్పించెను. మానమోహనుని దయచేతనే యాబాలకులు విద్యావంతులై దొరతనమువారి యొద్ద నుద్యోగము సంపాదించి సుఖించిరి.



స్వామి దయానందసరస్వతి.

మహాపురుషుల జీవితములు

(రెండవ భాగము-బొంబాయి.)

స్వామి దయానందసరస్వతి.

ఈయన హిందూదేశమునందు, ఆర్యసమాజ మను క్రొత్త మతమును స్థాపించిన మహాత్ముఁడు. ఈతఁడు ఘూర్జర దేశములో నున్న "కతేవాడు" సంస్థానమునందు మోర్వీ యనుగ్రామమున 1825 వ సంవత్సరమున జన్మించెను. తల్లిదండ్రులసే వ్వరెఱుఁగను. ఆయన తండ్రి యాగ్రామమునకు జమీందారుగా నుండుటయేగాక స్వల్ప ధనవంతుఁడై వడ్డీవ్యాపారముచేయుచు సుఖముగఁ గాలక్షేపముచేయువాఁడు. మతమున నతఁడు పరమశైవుఁడు. అతనిభార్యయుఁ బాతివ్రత్యంబునకు సౌజన్యతకుఁ జాలపేరువడసినది. దయానందున కైదవయేట నక్షరాభ్యాసమయ్యెను. అదిమొదలెనిమిదవయేఁడు లోపుననే దేశభాషను సంస్కృతమును దనయీడు పిల్లలకంటె నెక్కువ తెలివితో నతఁడు నేర్చుకొనెను. ఎనిమిదవయేట నుపనయనము జరుగుటచే నప్పటినుండియుఁ దండ్రి వానికి శైవమతరహస్యముల నుపదేశించి పార్థివలింగపూజనము ప్రతిదినము చేయించి రుద్రాధ్యాయములోఁ జెప్పఁబడిన విధుల నన్నిటినిఁ గ్రమముగఁ జేయుమని కుమారుని బలవంతపెట్టఁజొచ్చెను. దయానందుఁడు సహాయముగ బలహీనుఁడగుటచే నతఁడంత చిన్నతనమునఁ బెద్దలు చేయవలసిననీమము లన్ని

యుఁ జేసినచో శరీరస్థితి చెడునని యప్పుడప్పుడు తల్లి మొఱవెట్టుకొ
నుచు వచ్చినను వినక తండ్రి వానిచే నట్టినియమములఁ జేయించు
చుండెను. ఎనిమిదవయేఁడు మొదలు పదునాలుగవయేఁడువఱకు ద
యానందుఁడు శ్రద్ధతో విద్యనేర్చి కొన్నికావ్యములను జాలవఱకు
వ్యాకరణమును యజుర్వేదసంహితను ముగించెను. అప్పుడు తండ్రి
వానిని బరమ శైవుఁడుగఁ జేయఁదలఁచి 1839 వ సం॥ రమున మ
హాశివరాత్రినాఁడు దానికి ముహూర్తమేర్పఱచెను. అప్పటికి దయా
నందునకు శరీరమునందు స్వస్థత లేనందున దినమంతయు నతఁ డుప
వాసముండలేఁడనియు రాత్రి జాగరము చేయలేఁడనియు లింగధార
ణము మఱియొకప్పుడు చేయవచ్చుననియుఁజెప్పి యప్పుడాపని మాను
మని తల్లి యనేకవిధములఁ దండ్రిసిఁ బ్రతిమాలుకొనియెను. కాని య
తఁ డామాటఁ బెడచెవినిఁబెట్టి యది యప్పుడే జరిగితీరవలె నని పట్టు
బట్టెను. అందుచే దయానందుఁడు శివరాత్రినాఁ డుదయమున స్నా
నముచేసి మడిగట్టుకొని తండ్రిఁగూడి శివాలయమునకుఁ బోయి దిన
మెల్ల నుపవసించియుండెను.

ఆలయమంతటను జనులు ఓంహర, ఓంహర, మహాదేవ, య
ని కేకలువేయుటచే గుడిప్రతిధ్వనులిచ్చెను. రాత్రిభక్తులందఱు జా
గరము చేయఁదలంచి కష్టపడి రెండుజాములవఱకు మేలుకొని నిద్ర
నాపుకొనలేక యెక్కడివారక్కడనే కటికినేలం బండుకొని నిద్రించిరి.
జాగరముచేయకపోయినచో ఫలము చెడునేమోయని భయపడి బాలుఁ
డు దయానందుఁడు మాత్రము కన్నుమూయక శివవిగ్రహమువంకఁ
జూచుచుఁ గూర్చుండెను. అట్లుండ నావిగ్రహముమీఁద నొక చిట్టె
లుక ప్రాకి దేవునకు నైవేద్యము నిమిత్తము పెట్టినవస్తువులఁ గొన్నిఁ
టిని నెత్తుకొనిపోయెను. అది చూచినతోడనే దయానందునిమనస్సు
పరిపరివిధములఁబోవఁ దనలోఁ దా నిట్లని వితర్కించుకొనియె.

"ఈ రాతిబొమ్మనందిపై నెక్కి త్రిశూలము చేతఁబట్టుకొని సృష్టిస్థితిలయములు చేయఁగలమహాదేవుఁడేనా! అట్లయినం దనమీఁద నెలుకచ్రికి తననిమిత్తముంచినపండ్ల నెత్తుకొనిపోవుచుండ దాని నదలింపఁ జాలఁడేమి? ఈనల్లఱాయి దేవుఁడుగాఁడు." అని కొండొకసేపుఁ దలపోసి నిదురించుచున్న తండ్రిని లేపి సంశయమునివారింపుమని యడిగెను. తండ్రి శ్రమపడి చాలసేపు శివమహాత్మ్యమును బోధించెను. కాని కుమారున కది తృప్తికలిగింపదయ్యె. అందుచే మఱలఁ దండ్రి నిద్రవోయినపిదప తెల్లవారుకడ దయానందుఁడు రాళ్లు దేవుళ్లుగావని గట్టినమ్మికతో గుడి విడిచి యింటికిఁజని జరిగినచిత్రకథ తల్లికిఁ జెప్పి యుదయమునసే కడుపునిండ భుజియించి వ్రతఫలముఁ జెడఁగొట్టెను. తండ్రి యింటికివచ్చి వాని మూర్ఖతకుఁ గనలియూరకుండెను. ఒకప్పుడు స్వల్పకార్యముల వలననే గొప్పసంగతులు జరుగుచుండును. గుడిలో దేవునిమీఁద నెలుక పాఱఁబట్టియేకదా దయానందుఁడు ఱాళ్ళు దేవుళ్ళుగావని నమ్మవలసివచ్చెను.

అదిమొదలు దయానందుఁడు జన్మాంతరము వఱకుఁ దాను విగ్రహారాధనముఁ జేయకపోవుటయేగాక రాతిబొమ్మలకు మ్రొక్కి పూజింపఁగూడ దని లోకమునకుఁ బోధించెను. ఇట్టి నమ్మికకలిగిన స్వల్పకాలములోనే వానిమనస్సు వైరాగ్యనిష్టితమగునట్లు గృహమున రెండుకష్టములు సంభవించెను. అందు మొట్టమొదట నింట సందఱకు ముద్దులమూటయై మిక్కిలిగారాబమునఁ బెఱుగుచుండిన యాతని చెల్లెలు సాయంకాలమువఱకేజబ్బులేక యాడుకొని రాత్రియాకస్మికముగ నేదో జబ్బువలనఁ గొంచెముసేపు బాధపడి మృతినొందెను. తలిదండ్రులు బంధువులు నెత్తినోరుగొట్టుకొని దారుణముగ దుఃఖించుచుండఁగ దయానందుఁడు నిశ్చేష్టుఁడై మొద్దువలెఁగూర్చుండి "ఈశ్వర సంకల్పము చిత్రమైనది. క్షణములోవచ్చునది మనకుఁ

దెలియదుకదా ? మానవజీవితము నీటిబుగ్గవంటిది. అందఱకుం జావె ప్పుడో యున్నదే. సంసారము కేవలము దుఃఖకరము. నేనుగూడ నె ప్పుడో నిట్లే మృతినొందవలసినవాఁడనే" యని తనలోఁ దాను విచా రించుకొనియెను. ఇదిట్లైన కొలఁదికాలమునకే దయానందునియెడ మిక్కిలి ప్రేమగల పినతండ్రి కాలధర్మము నొందెను. ఈరెండు మరణములచేత దయానందుఁడు మిక్కిలి విరాగియై చెలికాండ్రతోను జుట్టములతోను సంసారము దుఃఖభాజనమని చెప్పుచు నెల్లప్పుడునేదో గొప్పయుపద్రవము సంభవించినట్లు వికాసములేక మొగముముడుచు కొనియేయుండఁజొచ్చెను. కుమారుఁడు విరాగియగునేమోయనుభయ మునఁదలిదండ్రులు వానికిసత్వరము పెండ్లిచేయఁదలంచిరి. వివాహమ తనికిష్టములేనందున నదియెట్లైన దప్పించుకొనఁగోరి చదువునిమిత్తము తన్నుకాశీపంపుమని తల్లిదండ్రులఁ బ్రార్థించెను. ఒక్కఁడేకొడుకగుట చేవానిని దూరదేశమునకంప నిష్టములేక తమయూరికినాలుగుక్రోసుల దూరమున నొకపల్లెలోనున్న తమపురోహితునియొద్దకుఁ బంపిరి. ఆపు రోహితుఁడువానివిలక్షణములఁజూచివాని స్థితియశుభసూచకముగనుం డెననితలంచి తనయొద్దనుంచుకొనక కొన్నినాళ్ళలోనేవాని నింటికిఁబంపి వేసెను. వైరాగ్యమంతకంతకు ముదిరిపోవుచున్నదని తలిదండ్రులు భయపడి విరాగికి భార్యయేకాలిబంధముగ నుండుననినమ్మి కొడుకున కుఁబెండ్లిచేయఁదలచి పనులు వడివడిఁ జేసిరి. ఎంతప్రయత్నించిననుదన కావివాహోపద్రవము తప్పినదికాదని విచారించి దయానందుఁడుతాన క్కడనున్నచో నొకపిల్లనుదెచ్చి కట్టిపెట్టకమానరని యాబాధతప్పించు కొనుటకై యొకనాఁ డిల్లువిడిచి పాఱిపోయెను. తరువాత నతఁడుజన్మ మధ్యమం దెన్నఁడు స్వగృహంబునకు వచ్చియుండలేదు.

ఇట్లు బయలుదేరి దయానందుఁడు రాత్రిప్రొద్దుపోవునప్పటికొ కగ్రామముఁజేరి యచటనిదురించి మరలజాము రాత్రియుండఁగలేచి తె

ల్లవారునప్పటికి పదిక్రోసులదూరముపోయెను. రాత్రికొడుకింటికి రాకపోవుటచేఁ దలిదండ్రులు బెంగపెట్టుకొని సేవకులనునాలుఁగుదిక్కులకు బిడ్డనువెతకి తెమ్మనిపంపెను. వారుచుట్టుప్రక్కలయూళ్ళు తిరిగితిరిగి యెందునుం బాలునిఁగానక విసికివేసారి యింటికివచ్చిరి. తలిదండ్రులు బిడ్డనియెడ నాసవిడిచి దుంఖితులై యూరకొనిరి. దయానందుఁడువివాహబాధతప్పినందుకు సంతసించుచుఁ బయనమైపోయి త్రోవలోఁ దన శరీరముమీఁదనున్న మురుగులు మొదలగునగలనుదీసిబ్రాహ్మణులకు దానమిచ్చి యొకబ్రాహ్మణు నాశ్రయించి కావిగుడ్డలు సంపాదించిబ్రహ్మచర్యాశ్రమమునం బ్రవేశించెను. జ్ఞానవంతులగు సన్యాసులుసాధువులు బైరాగులు, ఎక్కడనున్నారని తెలిసిన నది యెంతదూరమైనసరే యచటకుఁబోయివారిని సేవించి యతఁడుజ్ఞానముసంపాదించుచుండును. సిద్ధిపురమను నొకపుణ్యక్షేత్రమున జరుగఁబోవు తిరునాళ్ళకుఁబోవఁదలఁచి కొందఱు సన్యాసులంగలసి యతఁడుండవానినివానితండ్రినెఱిఁగిన యొకమనుష్యుఁడు వాని నానవాలుపట్టి పోవుచోటు తెలిసికొని రహస్యముగఁ దండ్రికి జాబువ్రాసెను.

ఆవార్తవిని తండ్రి మహానందభరితుఁడై మెఱియలవంటిబంట్లనుపదుగురఁదోడ్కొని సిద్ధపురమునకువచ్చి రెన్నాళ్ళు రేయింబవళ్ళు వెదకి యెట్టకేలకుపదిమందిసన్యాసులనడుమఁగూర్చుండఁగఁగుమారు నానవాలుపట్టియక్కడనేవాని కాషాయవస్త్రములంజింపివేసి యనుచితమగు నాపనిచేసినందుకు దూషించి జాగ్రత్తగాఁగాపాడుమనివానినిసేవకులకప్పగించెను. ముష్కరులగు నాబంటులు వానినిట్టట్టుఁ గదలనీయక గడుజాగరూకతతో నాదినమంతయుఁగాచిరి. నిద్రయెట్టిపనినైనను మరపించునుగదా. ఆబంట్లురాత్రియంతయుమేలుకొని తెల్లవారగట్లకనుమూసి నిద్రించిరి. తాను మరల దండ్రిచేతఁ బడినందుకువిచారించుచు దయానందుఁడు కన్నుమూయునందునబంట్లునిదురింపఁగానేయు దేశ

మయమని లేచి మెల్లమెల్లగ నావలకుఁబోయి గబగబపరుగెత్తి కొంత దూరముపోయి తానెటుపోయిన బంట్లుపట్టుకొనక మానరని యొకయాలయములో మఱ్ఱిచెట్టెక్కి చిట్టచివరకొమ్మమీఁదనేరికింగనఁబడకుండ నాకులమధ్య గూర్చుండెను. తండ్రి బాలునింగానకబంట్లం దిట్టికొట్టి మరలవానివెదకి తేరఁబంచెను. ఆబంటులు సిద్ధపురమునఁ బ్రతిగృహము ప్రతిచోటు వెదకివెదకి వానినిగానకవిసికిరి. కొందఱుబంట్లుదయానందుఁడుగూర్చున్నచెట్టుక్రిందను గుడిలోను వెదకిరి గాని దయానందుఁడునిశ్శబ్దముగఁగూర్చుండుటచే వానింగనుఁగొనలేకపోయిరి. తండ్రివిఫలప్రయత్నుఁడై మగల యెప్పటియట్లు తనయూరికిఁబోయెను.

దయానందుఁ డాపగలంతయుఁ జెట్టుమీఁదఁగూర్చుండి రాత్రిదిగివచ్చిపయనమైపోయెను. దొరికినప్పుడన్నము దినుచు దొరకనప్పుడు పవసించుచు నిదురవచ్చినచోటనేపండుకొనుచు నాబాలుఁడు దేశముల వెంబడిబయలుదేఱెను. ఆపయనములో నొకసారిమెలుఁగుగొడ్డొకటి వానిపై బడవచ్చెను. దయానందుఁడుమనశ్చాంచల్యములేక ధైర్యముదెచ్చుకొని మెలుఁగున కెదురుగనిలిచి దానిముక్కుమీఁదనొకగుద్దుగుద్దెను. ఆదెబ్బతోడ నదినెత్తురు గ్రక్కుకొనుచు నఱచుచుఁ బాఱిపోయెను. మఱియొకనాఁడతఁడొకయూరికిఁబోవ నచటిదేవాలయధర్మకర్తయగు మహాంతు వానినాదరించి తనయొద్దనుండిగుడిపెత్తనముసేయుమనియుఁ గావలసినధనమిత్తుననియుఁబలికెను. "ధనముగావలసినచో మాయింటియొద్ద తండ్రికడనేయుండును. నాకక్కఱలే" దనిచెప్పియచ్చోటువాసిపోయెను. మఱియొకసారి యతఁడొకయడవిలోనుండిపోవుచుదారితప్పి ముండ్లకంచెలలోఁబడెను. వెనుకకువెళ్ళినచోఁబోదలఁచినగ్రామముసత్వరముగఁ జేరవీలు లేదనియాముండ్లత్రోవనేపట్టికాళ్ళనిండ ముండ్లుగ్రుచ్చుకొన్నను శరీరముగీచుకొనిపోయినను లెక్కసేయకగమ్యస్థానమును జేరెను. వేఱొకసారినర్మదాసాగరసంగముకడనెవరో మహాత్ముఁడున్నా

డనివిని యచటికిఁబయనమైపోయెను. దారిలో బ్రహ్మదండిముండ్లువిఱిగి కాళ్ళనెత్తురువరదలై మాంసముపై కిఁగనఁబడునట్లుత్రొక్కులూడినను స రకుసేయక దయానందుఁడాపయనముచేసిచేసి యొకనాఁడుసాయంకాల మునఁదువలేక యొకయూరుబైటచెట్టుక్రిందయొడలెఱుంగక నిద్రించెను.

ఆరాత్రి యాగ్రామస్థులు పెద్దయుత్సవమేదో చేసికొనుచు దివిటీలతో నూరుబైటకువచ్చిరి. ఊరుపెత్తనదారు, మఱికొందఱు చెట్టు క్రింద నిద్రించుచుండిన వానినిచుట్టుముట్టి లేపి యూరిలో నికిరమ్మని రి. అతఁడునడిచి రాఁజాలనని చెప్ప వానియందు పరమభక్తుఁడై పెత్త నదారు నడినడి నింటికిఁబోయి పాలుపండ్లుపంపి యారాత్రివాని కపా యము రాకుండఁ దనమనుష్యులను వానికిఁగావలియుంచెను. మఱునాఁ డక్కడనుండి బయలుదేఱి దయానందుఁడుమహాత్మునిఁజూచిసన్యాసా శ్రమమును స్వీకరించితనజ్ఞానమునింకను వృద్ధిచేసుకొనఁగోరి మథురా పురమున నొకగొప్పపండితుఁడున్నవాఁడనివిని యచటికరిగెను. ఆపండి తుని పేరు విరజానందుఁడు. విద్యగలప్పుటలో నతఁడుప్రాచీనపద్ధతిలోని వాఁడు. శిష్యులకు శాస్త్రములు నేర్పునపుడు ఋషికృతములగు ప్రా చీనశాస్త్రములనేగాని నవీనులుచేసినసిద్ధాంతకౌముది మొదలగుగ్రం థములను నేర్పుట కిష్టము లేనివాఁడు.

దయానందుఁ డాయనవద్దకుఁబోయితనరాకకుఁగారణమెఱిఁగిం పసన్యాసికేఁదాను చదువు చెప్పనని విరజానందుఁడుపలికెను. ఎట్లయిన తన్ననుగ్రహింపుమని దయానందుఁడువానిపాదములమీఁదపడియెంత యుఁ బ్రార్థింప విరజానందుఁ డెట్టకేలకుఁగృపాళువై శిష్యుఁడుగ వాని నిఁ బరిగ్రహించి యదివఱకతఁడుచదువుకొన్నగ్రంథములన్నియు య మునలోఁ బాఱవేయించి వెనుకటిచదువు మఱచిపోయినట్లెంచుకొ మ్మని మఱల నక్షరాభ్యాసముచేసి వానికిఁజదువుచెప్ప నారంభించెను. దయానందుఁ డదివఱకే చాలచదువుకొన్నవాఁడు. విశేషించికుశాగ్ర

బుద్ధియు నగుటచే విద్యానిధియగు విరజానందుఁడు చెప్పినదంతయు నతఁడు సూక్ష్మముగ గ్రహించెను.

మధురాపురములో మాధుకరము చేసికొని చదువుకొనుచు దయానందుఁడు గురువునకు సంతుష్టిగలిగించినందున విరజానందుఁడు శిష్యునిపై జాలిఁగొని దానే వానిభోజనమునకుఁగావలసిన సొమ్మిచ్చుచుండెను. అట్లుండి యతఁడునాలుగువేదములుషడంగములుషట్శాస్త్రములు స్మృతులుచదువుకొనెను. విద్యాపరిపూర్తియైనతోడనే దయానందుఁడు గురువునకు నమస్కరించి "స్వామీ! నేనునిజముపేదను. గురుదక్షిణనియ్యఁజాల. నేనేమిచేయవలయునో సెలవీయవలయు"నని వినయమునమ నవినయమునర్ప గురువు పరమానందభరితుఁడై తనకుధనమియ్యనక్కఱలేదనియుఁ జిరకాలమునుండి సత్యమయిన మతమును లోకమునకుబోధింపవలయునని తాను దలఁచితిననియుఁ దనకుఁగన్నులులేకపోవుటచేఁదానట్టిపని జేయవీలులేకపోయెననియుఁ దనకుమనోభీష్టమగునాకార్యమును జేయుటయే తనకు గురుదక్షిణ యిచ్చుటయనియుఁ జెప్పియాపనిఁ జేయుమని సెలవిచ్చి వానినంపెను.

గురునియాజ్ఞ శిరసావహించి దయానందుఁడు మధురాపురము విడిచి కొన్నికొన్ని గ్రామములలో వేదమతముబోధించెను. అంతలో హరిద్వారతీర్థము సమీపించెను. హరిద్వారము హిందువులపుణ్యతీర్థములలోనగ్రగణ్యమయినది గంగానదియాపట్టణమునొద్ద నేహిమవత్పర్వతముమీఁదనుండి భూమిమీఁదికి దిగును. సంవత్సరమునందు బ్రతిమాసమును దేశమంతటనుండి తీర్థవాసులీపట్టణముఁ జేరుచునేయుందురు. ప్రత్యేకముగ నచ్చుటతీర్థము వచ్చినప్పుడు చేరుజనులసంఖ్యమితిమీఱియుండును. అట్లు వేనవేలు జనులుచేరిన సమయమునఁ దనమతముబోధింపవలయునని దయానందుఁడు సంకల్పించితీర్థము జరుగుట కొకనెలముందు హరిద్వారముఁ జేరెను. చేరి రాత్రియనక పగలనక యానెలదినములును

దరువాత తీర్థదినములలోను దయానందుఁ డెత్తగు నొకకొండపై నిలిచి వాక్ప్రవాహమును దొర్లునట్లుపన్యసించి విగ్రహారాధనముఁ జేయుఁగూడదనియు నదీజలములలో మునిఁగినంతమాత్రమున మోక్షము లేదనియు బోధించెను. ఆజానుబాహుఁడగు నతనిమూర్తియు గంభీరమగు వానికంఠధ్వనియుఁ జూచివినినవారికి వానియందు సామభక్తి కుదిరెను. విగ్రహారాధనముఖండించుటచేనతనిసాహసమున కంఠశోసువుపడిరి. అతని మాటలనొకసారివినినవారు తఱచుగ వానిపక్షమే చేరుచువచ్చిరి. అతనిబోధలవలన విగ్రహారాధనము మంచిదని బోధించు బ్రాహ్మణులకుఁ గొంతనష్టము గలిగినందున వారతనినిందించిరి. ఆనిందనములకు లెక్కసేయక జనులతో వాదనలు సేయునప్పుడు తన కెక్కుడు చిత్తశాంతియు నెక్కుడు నోపికయు నుండవలయునని యాగుణముల నలవఱచుకొనుటకు రెండేండ్లడవికేగితపస్సుచేసెను. ఆతపస్సుముగిసినపిమ్మట దయానందుఁడు మరల తనపని నారంభించి గంగాతీరమున నున్న కాన్పూరునగరమునకు వచ్చెను. ఆనగరమున హలధరోజుఁ డను మహాపండితుఁ డొకఁడుండెను.

విగ్రహారాధనము దుష్కార్యమని దయానందుఁడు బోధింపఁగానే యాయూరిపండితు లదిసహింపలేక హలధరునితో వాదింపుమని వాని నడిగిరి. అతఁ డందుకు సమ్మతించి సభ గావింపుమనియెను. అప్పుడు జరిగిన సభకు వేనవేలు జనులు వచ్చిరి. కానుపూరు నగరమం దశిష్టాంటుకలెక్టరును సంస్కృతభాషాపరిచితుఁడు నగు "తేరా" యను దొరగా రుభయుల వాదములు విని తీర్పుచెప్పుటకు మధ్యవర్తిగా నేర్పడియెను. అప్పు డతివిచిత్రముగ హలధర దయానందులకు వాదోపవాదములు జరిగెను. విగ్రహారాధనము మంచిదని హలధరుఁ డెన్ని ప్రమాణములు చూపినను దయానందుఁడు వాని నన్నిఁటి నవలీలగ ఖండించెను. దయానందుని ప్రమాణములు

ప్రబలముగ నుండుటయు, హాలధరుని ప్రమాణములు దుర్బలముగ నుండుటయు గ్రహించి "తేరా" దొరగారు తానక్కడ నటమీఁద నుండనక్కఱలే దని దయానందునియొద్ద సెలవుపుచ్చుకొని వెళ్ళెను. అతఁడు పోయినతోడనే హాలధరుని పక్షమున వచ్చిన పండితులు తాము గెలిచితి మని కేకలువేయుచు లేచి హాలధరు నొక బండిమీఁదఁ గూర్చుండఁబెట్టి యూరేగించుచుఁ దీసుకొనిపోయిరి. ఆ సాహసమున కచ్చెరువడి యెవరుగెలిచిరో సత్యమును దెలుపు మని దయానందునిపక్షమువారు దొరగారికి వ్రాసిరి. ఆదొరగారును జరిగినపనికి విస్మితుఁడై దయానందుఁడే గెలిచెననియు హాలధరుఁ డోడిపోయె ననియుఁ దా నాసంగతి వ్రాతమూలముగా దయానందునకుఁ దెలియఁజేయఁ దలంచుచుండె ననియు వ్రాసి ప్రత్యుత్తర మంపెను. అనంతరము (అనగా 1869 వ సంవత్సరమున) దయానందుఁను హిందువులకు భూలోక కైలాసము, విద్యలకు నిధానము, పుణ్యభూములలో నగ్రగణ్యము నగు కాశీనగరమునకుఁబోయెను.

వందలకొలఁది దేవాలయములు వందలకొలఁది విగ్రహములు నున్న యన్నగరమున నీస్వామి విగ్రహారాధనము వేదవిరుద్ధ మని బోధింపనారంభించినతోడనే బ్రాహ్మణులు రోషావేశపరవశులై రాజుతోఁ జెప్పిరి. అప్పుడు కాశీరా జగుశివప్రసాదుగారు వారణాసి పండితులతో వాదించి వాదము నిలబెట్టుకొమ్మని దయానందునకు వర్తమాన మంపిరి. వాదసల కెప్పుడును దయానందుఁడు వెనుకదీయువాఁడుఁ గాఁడు గావున తానందుకు సిద్ధముగా నుంటిననిప్రత్యుత్తరమంపెను. ఆసంవత్సరము 16వ నవంబరున నొకమహాసభ జరిగెను. దాని కిరువదివేలమందికంటె నెక్కువజనులు వచ్చిరి. జగత్ప్రసిద్ధులగు విశుద్ధానందుఁడు, బాలశాస్త్రి మొదలగు దిగ్గజములవంటి పండితు లనేకు లాసభకు వచ్చిరి. దయానందసరస్వతి యాయందఱుపం

డితులకు నోళ్ళాడకుండునటులు నాలుగువేదములలోనుండియుఁ దన వాదమున కుపపన్నముగ ననేకప్రమాణములఁజూపి సభవారినిదిగ్భ్రాంతులఁ జేసెను. శివప్రసాదు తెల్లఁబోయెను. పండితులు మొగమొగంబులఁ జూచుకొనిరి. ఆవాదమున దయానందస్వామి సంపూర్ణముగాఁ గాశీవిద్వాంసుల నోడించెను. ఆవిజయమునుగూర్చి హిందూ పేట్రియాటు పత్రిక వ్రాయుచు దయానందుని ప్రజ్ఞాదికములను జాల వర్ణించెను.

అనంతరము 1870 వ సంవత్సరము జనవరి నెలలోఁ గొందఱు పెద్దమనుష్యులప్రార్థనమున దయానందస్వామి కలకత్తాకుఁ బోయెను. మతవిషయములను దనతో వాదింప నిచ్ఛగలవారువచ్చి వాదింపుఁడని పిలుచుచు నితఁడు జాబు లచ్చువేయించి పండితులకుఁ బంపెను. ఆపత్రికలఁ జూచుకొని యచ్చటిపండితులు వానితో మతవిషయములో ననేకవాదములుచేసి యోడిపోయిరి. పండితులనోడించి దయానందుఁడు కలకత్తాలోఁ బెద్ద సభచేసి సాయంకాలము మూఁడుగంటలు మొదలు నాలుగంటలవఱకు సంస్కృతభాషలో నుపన్యసించి జనులను మహానందసముద్రములో ముంచెను. సంస్కృతము వినిన వాని నోటినుండియే విననలయు నని యచ్చటిపండితులంద ఱైకకంఠ్యముగఁ బలికిరఁట. ఆయన హిందీ, మరాతీ, గుజరాతీ, సంస్కృత మను నాలుగుభాషలలో ననర్గళధారగ మాటలాడఁగల సామర్థ్యముగలవాఁడు. ఏవిషయమును బ్రసంగించునప్పుడైనఁ బ్రమాణములు వందలకొలఁది యతఁడు చూపశక్తిగలవాఁడు. వేయేల! నాలుగువేదములు వానికి వశములయియుండె నని లోకులు చెప్పుకొనిరి. అతఁడు కలకత్తాలో నున్నకాలమున కేశవచంద్రసేనుఁడు వానిని సందర్శించి మైత్రిచేసి వేదాంతవిషయము లనేకములు వానితోఁ జర్చించి క్రొత్త సంగతులు నేర్చుకొనియెను. ఈగెలుపు లన్నిఁటిసిఁగూర్చి యానాఁటి

వార్తాపత్రికలే స్వామిని వేయినోళ్ళం బొగడుచువ్రాసినవి. స్వామి కలకత్తానగరమువిడిచి ప్రయాగ, కాన్పూరు మొదలగు పట్టణముల కుంబోయి తనసిద్ధాంతము బోధించికొంతకాలమాప్రాంతమునం గడపి బొంబాయినగరవాసులు తన్ను రమ్మని ప్రార్థింప 1874 వ సంవత్సరమున నచ్చటికరిగెను.

బొంబాయినగరవాసులు స్వామిని దద్దయు నాదరించి వాని యుపన్యాసములం గడుశ్రద్ధతో వినిరి. దయానందుం డాపట్టణమున దేవాలయధర్మకర్తలగు ఘోక్లీగోసాయినులతో విగ్రహార్చనమును గుఱించి వాదించియోడించి యచ్చట నార్యసమాజముస్థాపించి మరల నుత్తరహిందూస్థానమునకుం జనియెను. త్రోవలో నతనియొద్దకు చంద్రపురగ్రామవాసి యగు మునిషీప్యారులా లనునతఁడు వచ్చి హిందూ క్రైస్తవ మహమ్మదీయ మతములలో దేనియందు సత్యము గలదో తెలిసికొనుట కాయామతస్థులచేత నుపన్యాసము లిప్పింపవలయునని తానుకోరుచుంటి ననియు మహమ్మదీయక్రైస్తవమతస్థులుపన్యసింప నంగీకరించిరనియు హిందూమతపక్షమున విజయంచేసి యుపన్యసింపవలసినదనియు స్వామినిగోరెను. స్వామి దానికంగీకరించి యాగ్రామమునకుంబోయి మూఁడు దినములు వారితోవాదించి హిందూమతపక్షమున నుపన్యాసములిచ్చి క్రైస్తవులకు మహమ్మదీయులకుం బరాజయము కలిగించెను. ప్రతివాదమందు దయానందుఁడు గెలుచుచుండినను గెలుపొందితి ననుగర్వము లేక యోడిపోయినవారి యెడలం బరమదయాళువై మునుపటికంటె నెక్కుడు వినయసంపత్తి చూపుచుండును. అందుచేత నచ్చటికిం గ్రైస్తవమతపక్షమునవచ్చిన రివరెండుస్కాటుదొరగారికి, మనస్వామికి నభిప్రాయభేదములున్నను మైత్రికలిగెను. పిమ్మటం గొంతకాల మక్కడక్కడ తనమతమును బోధించి స్వామి 1877 వ సంవత్సరమున ఢిల్లీపట్టణమున జరిగినదర్బా

రును జూడఁబోయి యచ్చోటికి వచ్చిన మహారాజులకు జమీందా రులకు తన సిద్ధాంతము నుపదేశించెను. ఆమాటల మాధుర్యముఁ జవి చూచి యంతతోఁ దనివి నొందక పంజాబు దేశస్థులు తమ దేశమునకు రమ్మని వానిం బ్రార్థించిరి.

వారిప్రార్థన మంగీకరించి దయానందుఁడు పంజాబు దేశమునకుఁ జని యచట ననేకస్థలములలో నార్యసమాజములను స్థాపించెను. ఎందుచేతనోగాని యాయార్యమతము పంజాబు దేశమునందు మిక్కిలి యెక్కువవృద్ధిఁ బొందెను. సాధారణముగా నా దేశమునం దార్యసమాజము లేనిగ్రామమే లేదు. పంజాబు దేశమునుండి దయానందస్వామి రాజపుత్రస్థానమునకు వచ్చి యుదయపురమహారాణావారిచేత ప్రార్థితుఁడయి యానగరమున నెనిమిదిమాసములు వసించెను. రాణావారాకాలములో మనుస్మృతిచదివి రాజ్యతంత్రము నిర్వహించు విధమును నేర్చుకొనిరి. రాజుగారింజూచి యదివఱకెన్నఁడు పుస్తకముఁ బట్టియెఱుఁగని యుద్యోగస్థులుభక్తిశ్రద్ధలతో స్వామియొద్ద జదువనారంభించిరి. సంస్థానమంతయుఁ గ్రమక్రమముగఁ జక్కఁబడెను. అక్కడ నున్నకాలములో రాణాయొకనాఁడు దయానందునిఁ జూచి "స్వామీ! మాయూరిలో గొప్పకోవెలయున్నది. దానికెన్నియో మాన్యములున్నవి. మీరు విగ్రహారాధన మంచిదిగాదని చెప్పుట మానినపక్షమున మిమ్మాగుడికి మహంతునిఁజేసి యాసొత్తు మీయధీనముచేసెద" నని పల్కెనఁట. అప్పలుకులు విని దయానందుఁడు మహాకోపోద్దీపితుఁడై యట్టిదుర్భాషలనెన్నఁడు నాడవద్దనియు నెన్నికోట్లధనమిచ్చినఁ దాఁ జెప్పఁదలఁచుకొన్నది చెప్పకమాననయు పలికి రాజుంగట్టిగ చీవాట్లుపెట్టెను. రాజు భయపడి వానిపాదములపైఁ బడి క్షమింపుమనివేడుకొనెను. అనంతరము దయానందుఁడు షాపూరు మహారాజుగారి పట్టణమునకుఁబోయి యచ్చట గొన్నాళ్ళుం

డి వానికి రాజధర్మములు నేర్పెను. అచటనుండఁగనే జాదుపూరుమహారాజుగారు తమయూరువచ్చి తమ్ముపవిత్రులఁజేయుమని వానింబ్రార్థించెను. అవేఁడుకోలువిని మనస్వామి జాదుపురమును ప్రవేశించెను. అప్పటికి జాదుపుర మెట్లుండవలయునో యట్లుండెను. మహారాజు నాంజహాను అనువేశ్యాంగన వలలోఁ దగులుకొని రాజ్యతంత్రములకు విముఖుఁడైయుండెను. మంత్రులు తక్కిన యుద్యోగస్థులు తగనిపన్నులు గట్టి ప్రజల వేధింపఁజొచ్చిరి. రాజబంధువులు రాజుకంటె నెక్కుడు దుర్ణీతిపరులైరి. వేయేల సంస్థానమంతయు వర్ణింపరానిదురవస్థలోనుండెను. దయానందుఁ డచ్చటికిఁబోయి సంస్థానస్థితిఁగనిపెట్టి రాజును మంత్రులను మంచిత్రోవకు త్రిప్ప ప్రయత్నించెను. రాజు బాగుపడినచో తమయాటలు సాగిరావనిదమపాలిటికి యతియెక్కడదాపురించెనని విచారించి యుద్యోగస్థులు కొందఱుస్వామియెడ ద్వేషముఁబూనిరి. అదియటుండ వెలయాలుపొత్తులు మరగినందు కతఁడు రాజునుపలుమాఱు చీవాట్లుపెట్టెను. ఒకనాఁడు దయానందసరస్వతి మహారాజును సందర్శించుట కంతఃపురమునకువచ్చెను. ఆయనవచ్చునప్పటికి మహారాజుగారు నాంజహానుతోఁగలసి ముచ్చట లాడుచుండిరి. స్వామి నల్లంతదవ్వులఁ జూచినంతనె మహారాజు దద్దిరలాడి మిండకత్తెనావలకుఁబొమ్మనియానతిచ్చెను. అంతలో స్వామి యచ్చటకువచ్చినందున నదియావలకుఁ బోవునప్పు డాయనకంటఁబడెను. పడుటయుకలియుగశుకయోగీంద్రుఁడగు నామహాత్ముఁడుదుర్ణీతిపరుఁడగుమహారాజుదుర్వినయము సహింపక కోపముపట్టఁజాలక తూలనాడి తలవాయునటులచీవాట్లు పెట్టెను. ఆమాటలు చాటుననుండి వేశ్యాంగనవిని తనవలపుకానికిం దనకునెడఁబాటుచేయఁ దలంచిన యాపురుషునిఁ గడతేర్ప నిశ్చయించెను. ఆసాయంకాలము దయానందునకు మహారాజుగారు పాలుపంపునప్పుడా దురాత్మురాలు పాలలో కొంచెము విషముగలిపి పంపించెను. అదియెఱుఁ

గక స్వామి యాపాలు పుచ్చుకొన్న వెంటనే చంపునదికాదు గావున వానినొక్కమాసము బాధపెట్టెను. మహారాజున కీసంగతి తెలిసినతో డనే సంస్థానమునందలి వైద్యులనందఱ రప్పించి చేయవలసినచికిత్సల నన్నింటిని చేయించెను. ఎన్ని చేసినను రోగముమాత్రముతిరుగకయుం తకంత కెక్కువయ్యెను. ఆశలేదని తెలిసినప్పుడు స్వామిజోద్పూరు విడిచి యజమీరునకుఁబోయెను. ఎంతబాధవకుచున్న నబ్బా యన్న మాటమైన నోటరానీయఁ డయ్యె. 1883 వ సంవత్సరము సెప్టెంబరు 30 వ తారీఖున విషప్రయోగము జరిగెను. అదిమొదలుకొని నెలతీసికొని యామహాత్ముఁడు భరతఖండముయొక్క దురదృష్టవశమున 31 వ అక్టోబరు తారీఖున శరీరమువిడిచి శాశ్వతపదవినొందెను. చనిపోవునాఁడు ముండనముచేయించుకొని స్నానముచేసియందఱనావలకుబొమ్మని యొంటిగ నీశ్వరుప్రార్థించి తెలివితో ప్రాణములు వదలెను. ఈశ్వరుని యందు దృఢవిశ్వాసముతోడను, సర్వోచాశముగను, నిర్భయముగను బ్రాణములువిడుచుచున్న యామహాయోగియొక్క చరమావస్థజూచి యద్భుతపడియదినఱకు దేవుఁడు లేఁడని వాదించునాస్తికుఁడొకఁడుతత్క్షణమ యాస్తికుఁ డయ్యెనట. ఆర్యసమాజమతము స్థాపించి భరతఖండము నుద్ధరింపఁదలఁచిన యామహానుభావుఁడు తుదకీవిధముగా వేగనచేత మృతినొంద వలసివచ్చె.

దయానందునిజీవితము సంగ్రహముగఁ దెలిపితిని. నాతని మతసిద్ధాంతము గుణగణములుఁ జెప్పవలసియున్న తమునకు వేదమే ముఖ్యాధారము. వేదమేనిత్యమనియునందుచేతనే రదత్తమనియుఁ దత్కారణమునఁబరమప్రమాణమనియునతఁడుజెప్పుచువచ్చెను. ఆయనమతప్రకారము పురాణములు కల్పింపఁబడినకట్టుకథలు. అబద్ధములు దుర్బోధకములునగు నీపురాణముల మూలము ననే మనదేశ మింతదుస్థితికి వచ్చెనదని యాయన పలుమారుచెప్పుచు

పఱచెను. వేదమును తప్ప మఱియొక గ్రంథమెన్నఁడాయన ప్రమాణముగ గ్రహింపలేదు. వేదములు బ్రాహ్మణులొక్కరే చదువుట కేర్పడిన పుస్తకములు కావనియాయన నమ్మెను. నదులలోని జలము సూర్యుని తేజస్సు సకలజంతువులవారి కెట్లుపయోగములుగ నున్నవో యట్లే వేదములుఁగూడ బ్రాహ్మణులకేగాక శూద్రులకు స్త్రీలకు మాలలకు సయితము ముఁ జదువఁదగినవని యాయన చెప్పెను. వర్ణభేదము పుట్టుకనుబట్టి యుండఁగూడదని యతని సిద్ధాంతము. గుణములనుబట్టియు వృత్తినిబట్టియు విద్యను బట్టియుఁ జండాలుఁడైన బ్రాహ్మణుఁడు గావచ్చును. విద్యాగుణహీనుఁడగు బ్రాహ్మణుని కడుపునఁబుట్టినవాఁడు చండాలుఁడే యగును. స్త్రీవిద్య తప్పక ప్రోత్సాహము చేయతగ్గదనియు నాఁడువాండ్రు చదువుకొననిచో నీదేశము మూర్ఖభూయిష్ఠమగుననియు నతఁడు బోధించుచువచ్చెను. బాలికలకు యుక్తవయస్సు రాకమునుపు చిన్నతనమందె వివాహముచేయుట యశాస్త్రీయమనియు నతిబాల్య వివాహములవలన దేశజనులందఱు బలహీనులై యున్నవారనియు నందుచేత మగవాని కిరువదియైదు సంవత్సరములువచ్చినతరువాత నాఁడుదానికిఁ బదునాఱేండ్లుదాటినపిమ్మట వివాహములుజరుపవలసినదనియునతఁడు వ్రాసెను. వితంతువులు మరల వివాహముఁ జేసికొనఁగూడదని వేదమెచ్చటఁ జెప్పఁబడలేదు. కాఁబట్టి యావివాహములు మంచివే యనినమ్మకము. ఆయనసిద్ధాంతప్రకారముహిందువులందఱు ...ఁ బోయి నౌకాయాత్రలుచేసి రావచ్చును. అట్లుచేసినం ...లన వారి జాతిమతములు చెడవు. వివాహాదులు వేదమంత్రముల ...సే జరుగవలయును.

ఆర్యసమాజమతములోఁ జేరినవారికిఁగొన్ని వైదికకర్మలుగూడ విధింపబడియున్నవి. వేదములే ప్రమాణములని చెప్పుట, వైదికకర్మలు కొన్ని విధించుటతప్ప తక్కినవిషయములలో దయానందుఁడు బ్రహ్మ

సమాజమతస్థులవలెనే దేశాభివృద్ధికరములగు మార్పులం జేసెను. ఈ మహాత్ముఁడీ మార్పులు చేసి ప్రాచీన వైదికమతమును నిలుపఁ దలఁప పూర్వాచారపరాయణు లదియొక క్రొత్తమతముగ భావించి వానిని దూషించి యనేకవిధముల బాధించి యొకానొకప్పుడు చంపుటకుఁ గూడఁ బ్రయత్నించిరి. ఒకమాఱొక జమీందారుఁడు వానితోఁ గొన్ని యంశములు ముచ్చటించి తనవాదము పూర్వపక్షమగుటచే నప్పుడె దయానందునిఁ గొట్టఁబోయి వీలులేక యూరకొని రాత్రి దయానందునిం జంపుమని నలుగురు మనుష్యులనంపెను. అప్పుడు దయానందుఁ డూరు బైట నొక చిన్నపాకలో నివసించుచుండెను. ఆనరహంతకులు నడిరేయి వచ్చి స్వామిని బిలువ నతఁడు పాక వెడలి యావలకు వచ్చెను. పరమశాంతమును పవిత్రతను వెదజల్లు నాతని విగ్రహమును జూచినతోడనే హంతకులు తమ చేయఁదలఁచిన ఘోరకృత్యమును మాని పాఱిపోయిరి. మఱియొకసారి వైదికబ్రాహ్మణుఁడొకఁడు భక్తిగలవానివలె వెళ్ళి విసముగలిపిన తాంబూలపుబీడా స్వామికిచ్చెను. కపటమెఱుఁగని యా స్వామి యదితిని విషబాధితుఁడై వమనమునకు మందుపుచ్చుకొని యెట్టెటో బ్రదుకగలిగెను. ఆయనకున్న ధైర్యమసాధారణము. ఎవరికిం జంకువాఁడు కాఁడు. ఒకమాఱు హిందుమతమును గూర్చి యొక గ్రామములో ముచ్చటించుచు నడుమ క్రైస్తవమతమును ఖండించెను. అక్కడికి వచ్చి యుపన్యాసము వినుచుండిన జిల్లాకలెక్టరు దొరగా రుపన్యాసమును మాని వేయవలసినదనియు నట్లు చేయనిచో దండింపవలసివచ్చుననియు, వర్తమానమంపెను. అదివిని స్వామి నవ్వి నన్నెవ్వరు నేమిచేయలేరని పలికి మఱింత దృఢముగ నుపన్యసింపఁ దొడఁగెను. మఱియొకమారు స్వామి తనచిరమిత్రుఁడగు రివరెండు స్కాటుదొరగారిని జూచుటకు వారి చర్చికిఁ బోయెను. స్కాటుదొరకు స్వామియందు మిక్కిలి గౌరవముండుటచే వానిని లోపలకుఁ దీసికొనిపోయి వేదాంతవిషయమేదియైన నుపన్యసింపుమని కోరెను.

అక్లోయని స్వామియుపన్యసింప నారంభించి క్రైస్తవమతముఖండించి స్వమతమును బోధించెను. అంతమంది దొరలయెదుట క్రైస్తవులగు డిలో క్రైస్తవమతమును ఖండించిన యాతని ధైర్యమెట్టిదో గనుఁడు.

మఱియొకసారి హిందువులనేకులు స్వామిని గౌరవించియొకదేవాలయములోనుపన్యాసమిమ్మని ప్రార్థించిరి. దేవాలయములోనుండుటచే విగ్రహారాధనము మంచిదికాదని యతఁడు చెప్పఁడని వారుతలంచిరి. స్వామి దేవవిగ్రహమున కెదురుగ నొకరాతిమంటపముమీఁదనిలిచి యుపన్యసించుచు నడుమవిగ్రహములమాటరాఁగా తనకాలిక్రిందనున్న మంటపపురాళ్ళెట్టివో గుడిలోనున్న యీ దేవవిగ్రహము నట్టిదేయని పలికెను. అతని ధైర్యమునకు సభికులందఱాశ్చర్యపడిరి. తాను నమ్మినసంగతి నతఁడు మొగమోటములేక చెప్పఁగలిగెను. మంచిదని నమ్మినపని స్వయముగ నాచరించెను. ఆయనకు సత్యమునందు గల యాదర మింతింతయనరాదు. ఒకసారి బ్రాహ్మణులనేకులు వానియొద్దకువెళ్ళి "స్వామీ! మీరెవరో యవతారపురుషులు. మీమతమంతయు బాగున్నదిగాని విగ్రహములను దూషించుట బాగులేదు. విగ్రహదూషణమానుదురేని మిమ్ము మేము గురువుగ నంగీకరింతుము" మనిపలికిరి. ఆపలుకులు విని స్వామి కోపించి నన్ను మీరు గురువుగా నొప్పుకొనకున్ననుసరే నేను సత్యమును విడువను. నేను నమ్మినదానిని జనులకు బోధించెదను. అని కఠినముగఁ జెప్పెను.

దివ్యజ్ఞానమను పేరుగల (తియసాఫికలుసొసైటీ) వారు దయానందస్వామిని దనసంఘమున కధ్యక్షుఁడుగ నేర్పఱచిరి. కాని యాసమాజస్థాపకురాలగు బ్లావట్స్కీ దొరసానిగారొకగ్రామములో దేవుఁడు లేఁడని యుపన్యసించెనని విని యీస్వామి యాసమాజముతో సంబంధము వదలుకొనెను.

ఆయనశరీరమింగ్లీషువారిశరీరమువలె తెల్లఁగనుండును. మనుష్యుఁ

డాజానుబాహుఁడు. ఆయనవిగ్రహముఁ జూచినవా రందఱికి తక్షణ మే వానియందు భక్తి కుదురును. దయానందుఁడు పరమశాంతుఁడు, భూతదయాళువు, సుగుణరత్నాకరుఁడు, జితేంద్రియుఁడు, మహాపండితుఁడు.నాలుగువేదములకుస్వయముగవ్యాఖ్యానమువ్రాసెను.శంకరాచార్యవిద్యారణ్యస్వాములతరువాతనింతటిపండితుఁడునింతటిమతబోధకుఁడుభరతఖండమునసుద్భవింప లేదనియనేకులుపలికిరి.ఆయన మతములో నిప్పుడు లక్షలకొలఁది చేరియున్నారు. అందు కొందఱు మహారాజులుగూడ గలరు. ఆయనమతములో మనముచేరినఁ జేరకున్న దేశమునకు మహోపకారముఁ జేయఁదలఁచిన మహాత్ముఁడగుటచే దయానందసరస్వతీస్వామి హిందువుల యందఱి గౌరవమునకుఁ బాత్రుఁడు.

ఈయన స్థాపించిన మతము దేశాభివృద్ధికి మిక్కిలిసహాయకరముగ నున్నది. వేదమునే పరమప్రమాణముగా నితఁడు గ్రహించుటచేత నితనిమత ముత్తరహిందూస్థానములో మిక్కిలి వ్యాపించుచున్నది. ఈమతస్థులు వివాహములు వేదమంత్రప్రకారముగాఁ జేసికొందురు.మనమతములోనుండి మహమ్మదీయమతములోగాని క్రైస్తవమతములోఁగాని కలిసి చెడిపోయినవారిని మరల నీమతస్థులు తమ మతములోఁ గలుపుకొందురు. అంతియెగాక యితరమతస్థుఁ డెవఁడైన మనమతములోఁ జేరఁదలఁచుకొన్నపక్షమున వానినిఁగూడ నిరాటంకముగాఁ జేర్చుకొందురు. ఈమతస్థులలో గొందఱు సన్యాసులై జనులంద ఱాసత్యమతము నవలంబించవలసినదని బోధించుచున్నారు. ఈమతవ్యాప్తినిమిత్తము లోకోపకారు లనేకులు పత్రికలు స్థాపించియున్నారు. శ్రీమంతులగు కొందఱు పాఠశాలలను, సర్వకళాశాలలను స్థాపించి తక్కినపాఠములతోపాటు ఈమతసిద్ధాంతములను గూడ బాలురకుఁజెప్పించుచున్నారు. అల్పకాలమున నీమత మింతయభి

కముగ దేశమున వ్యాపించుటకుఁ గారణము దయానందసరస్వతీస్వామియొక్క గొప్పతనమే యని తెలియవలయును. ఈయనయొద్ద పాండిత్య మెంతయున్నదో సత్ప్రవర్తన మంతియుయున్నది. చిన్నతనమునందే వివాహమక్కఱలే దని వైరాగ్యమునుబూని సన్యసించిన మహాత్ముఁడు శంకరాచార్యునితరువాత నీతఁడొక్కఁడే యని తోచుచున్నది. ఆయనపాండిత్యమును, శాంతముసు, యోగ్యతనుఁజూచి రాజాధిరాజులు సయితము గడగడవడంకి ఆయన చెప్పినచొప్పునఁ జేయుచు వచ్చిరి. దక్షిణదేశమం దార్యసమాజమత మిప్పటికి వ్యాపింపకపోవుటచే దయానందునిపేరు తఱచుగ నీప్రాంతములవారికిఁ దెలియదుగాని యుత్తరహిందూస్థానమున వానిపే రెఱుఁగనివారు లేరు. ఈయనచరిత్రమును జదివినవా రందఱును ఆయనవలెనేసత్యాదరము దైవభక్తి మొదలగు సద్గుణంబులు కలిగి వర్తిలునట్లు దైవ మనుగ్రహించుఁగాక.



సర్ జేమ్సేట్జీ జీజీభాయి.

సర్ జేమ్స్ట్జి జిజీభాయి

ఘూర్జర దేశమున బరోడాయను స్వదేశసంస్థానమొకటి గలదు. అందలి నవసారి యనుగ్రామమున జీజీభాయి 1783 వ సంవత్సరము జూలై 15 వ తారీఖున జన్మించెను. వానితలిదండ్రులు పేదలయ్యు గౌరవాస్పదులయి యుండిరి. ఇతఁడు పారసీజాతివాఁడు. ఈ పారసీలు ఘూర్జర దేశమందును మహారాష్ట్ర దేశమందంతటను వసించుచున్నారు. వీరు విద్యయందు రూపమునందు ధనమునందు నసమానులు.

జిజీభాయి చిన్నతనమందే మాతాపితృవియోగము నొందుటచే మామగారియొద్ద బొంబాయినగరమున నుండవలసివచ్చెను. కొంతకాలము ముందు పనినేర్చుకొని పిమ్మట నతఁడు మామగారితోఁ గలసి వర్తకవ్యాపారము జేయనారంభించెను. మనస్వదేశములో నేగూర్చుండి యెంతవర్తకముఁ జేసినను విశేషలాభములు గలుగవనియును విదేశములతో వర్తకము చేయుటచేతనే చాలలాభములు గలుగుననియును జిజీభాయి గ్రహించి తన బంధువుఁడగు మఱియొక పారశీకవర్తకునితోఁ గూడి పదునాఱవయేఁటనే చీనాదేశమునకుఁ బోవ ప్రయాణమయ్యెను.

స్వదేశము విడచివెళ్లునప్పుడతఁడు తన యాస్తినంతయు వెంటఁదీసికొనిపోయెను. ఆయాస్తియెంత యందురేని నూటయిరువది రూపాయిలు. చీనాదేశమున కరిగి కొంతకాలమే యచ్చటనుండి స్వదేశమునకు వచ్చి స్వయముగ దానే వ్యవహరింపఁదలఁచి పెట్టుబడి నిమిత్తము ముప్పదియైదువేలరూపాయిలు ఋణముదీసికొని యతఁడు మరల చీనాకుఁబోయెను. ఇదిగాక యతఁడు చీనాకు నాలుగుసారులు పోయెను. అందు 1806 వ సంవత్సరమునఁ జేయఁబడినకడపటిప్రయా

ణము కొన్ని యపాయములతో నిండియున్నది. ఆప్రయాణమున బ్రిన్సువిక్టరు పేరుగల యోడమీఁద దా ననుభవించిన కష్టము లన్నియు క్రిస్టాఫరు నైజరాంధ్రభాషలో దనమిత్రునికొక యుత్తరమువ్రాసెను. ఆయుత్తరములోని సంగతులఁ గొన్నిటి నిందు బొందుపఱచుచున్నాము.

"మేమెక్కిన యోడను ఫ్రెంచివారు పట్టుకొనిరి. మాదురదృష్టమునకుఁ గోపు మాయోడకొంతనడచి మెరకయెక్కెను. ఒడ్డునకు మమ్ముఁ జేర్చిమ్మని యోడవారిని మే మెంతయుఁ బ్రతిమాలితిమిగాని తనపై యధికారి యుత్తరువులేదని యతఁడు మాకోరిక నిరాకరించి కొంతదూరము సాగిపోయినవెనుక మమ్ముదిగనిచ్చి మా సరకులు మాకిచ్చెదమని వాగ్దానము చేసెను. ఆమఱునాఁడు అడ్మిరల్ (అనఁగా నావికసర్వాధికారి) మాకుదర్శనమియ్య మాసిలుగుల మేమువారికి విన్నవించుకొని మమ్మొకదరిఁ జేర్పుఁడని ప్రార్థించితిమి. ఆయనమాయందనుగ్రహించి మామూటలుముల్లెలు పుచ్చుకొమ్మనియెనుగాని మావర్తకపుసరకులుమాత్రము మాకియ్యనొల్లఁడయ్యె. ఆయన పిమ్మట మాసామాను శోధించి నాయొద్దనున్నబియ్యపుమూట రెండుమల్లుతానులు మొదలగు కొన్నివస్తువులం దీసికొని నాబట్టలపెట్టెనాకిచ్చెను. బియ్యపుబస్తాయొకటియిమ్మని నేను వేఁడుకొంటినిగాని యామహాత్ముఁడు నామొఱ వినఁడయ్యె. అప్పుడునాసరకులన్నియు నొకపెట్టెలో వేసికొని తక్కినవారితోఁ గలిసి యోడ దిగిపోతిని. ఓడదిగి యొడ్డుచేరినపిదప మేము "కెప్టెన్ గ్రాంటు" అను నొకయింగ్లీషునావికునిఁ జూచితిమి. ఆయన మాయలమట విని జాలిపడి యెంతయు నాదరించె. ఎట్లయినను ఫ్రెంచివారిచేతినుండి తప్పించుకొంటిమని సంతసించితిమి. మాలో "టర్నర్" అనుపేరు గల యొక యింగ్లీషుదొరసానిగారుండిరి. ఆయనయొద్దమూఁడువేలడాలరులసొమ్ముండె

ను. ఆసామ్యులతో మేము కొంతకాలము గడపితిమి. ఒకడోలరు రెండు రూపాయలన్నరకు సమానము. ఆదినములలో బెస్తబియ్యపు కాటకము సంభవించుటచే ముప్పదియైదుడోలరులిచ్చినను మాకొక బియ్యపుబస్తా దొరకుట యరుదయ్యెను. అందుచేత నొక్కొక్క మనుష్యుఁడు దినమున కరపౌను బియ్యముకంటె నెక్కువ తినఁగూడదని నియమము మేర్పరచుకొంటిమి. గొడ్డుమాంసమొకటి మాకు కావలసినంత లభించుచు వచ్చెను. ఈవిధముగాఁ గష్టములఁ బడుచు గ్రాంటుదొరగారి దయవలన మేమెట్లులో మఱియొక యోడ నెక్కఁగలిగితిమి. మందభాగ్యులెక్కడికిఁబోయినను విపత్తులు విడువవుగదా! ఆయోడకలాసులకు మాపైని నిర్హేతుకాగ్రహము గలిగెను. అందుచేవారు మమ్మవమానింపఁ దొడఁగిరి. అంతియగాక నేను నాతోనున్న నలుగురింగ్లీషువారు మఱియొక మహమ్మదీయుఁడు మేమాఱుగురము గలసి తన్నుఁ జంపుటకొక కుట్రపన్నుచున్నారమని మాపయి ననుమానపడి యాయోడయధికారి మాకు సంకెళ్ళు వేయించి యంతతోఁ బోక మాకింకను దారుణదండన విధింతుమని బెదరించెను. కీడులో మేలన్నట్లు నాతో నున్న నలువురి దొరలలో నొకనికి ఫ్రెంచిభాష వచ్చి యుండెను. ఆభాషతో నతఁడు నావయధికారితో మాస్థితిగతులు విస్పష్టముగఁ జెప్పి మాసామానుల పరీక్షింపుమని వేడగా నతఁడు సరేయని శోధించి మాయొద్ద ప్రాణములు తీయునాయుధము లేవియు లేవని గ్రహించి మమ్ము విడిచిపుచ్చెను. ఇట్లు మాకష్టము లనంతములయి యుండెను. అటులుండ నాసమయమున డెన్మార్కు దేశము వారియోడ కలకత్తాకుఁ బోవుచుండెను. గ్రాంటుదొరగారు మమ్మా యోడమీఁద నెక్కించి బంగాళాదేశమునకుఁ బంపుదుమని వాగ్దానము చేసి యాయోడయధికారితోఁ జెప్ప తన నావమీఁద స్థలము లేదని యతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. మేమేదో యొకమూలనిరికి కూర్చుండి కాలక్షేపము సేయఁగలమని మరల వానికి వర్తమానమంప నతడంగీకరిం

చి నన్నును నాంకోనన్న తురకవానినినావయెక్కించుకొనుటకు నెనిమి
దివందలశిలింగులు(అనఁగా రెండువేలరూపాయలు)కావలయునని య
డిగెను. ఈయోడ కిరాయిమిక్కిలియెక్కువగానున్నదనియభిప్రాయ
పడి గ్రాంటుదొరగారు కొంతతగ్గింపుమని మాపక్షమునుబూనికొంతవ
ఱకు వాదించిరి. కాని యాయోడయధికారి పట్టినపట్టువిడువనందున
గ్రాంటుగారు స్థితిగతులు సూచియాయోడదాఁటిపోయినచో మరల
నేయోడయును దొరకదనియు దొరకినను కిరాయి యింతకంటెతక్కువ
యుండదనియునీనడుమగొట్టెమాంసముదక్క భోజనపదార్థము లేవియు
దొరకవుగావున మిక్కిలియవస్థపడవలసియుండు ననియుఁజెప్పియా బేర
మునొప్పుకొమ్మని నాకుపదేశించిరి. ఆయుపదేశమును శిరసావహించి
తురకయు నేనును చెరియెనిమిదివందలు శిక్కారూపాయలుకలకత్తాలో
నోడయధికారులకిచ్చునట్లొప్పుకొని పత్రములవ్రాసియిచ్చి యోడయె
క్కితిమి. మొదట మేమెక్కిన యోడలోనుండియొకబియ్యపుబస్తానెట్టి
యిన మాకిప్పింపుమని గ్రాంటుదొరగారిని వేఁడుకొంటిమి. అతఁడట్లే
యని యాయోడయధికారికొకచీటివ్రాసి పంపనతఁడుమాకోరికనిరా
కరించె. అప్పుడు ముప్పదిశిలింగులకు మేముమణుగున్నరబియ్యముకొం
టిమి. అదిగాక నేను వెనుకదొంగతనముగాదాఁచుకొన్న బియ్యమొక
యరబస్తాయుండెను. ఈసరకులతో బయలుదేరునప్పుడుగ్రాంటుదొర
గారు మేమెక్కిన యోడయధికారితో మమ్ముదయతోనాదరింపుమని
చెప్పెను. ఎవరెంత చెప్పినను మాదురదృష్టము మమ్ముவిడువదయ్యె.
పదునాఱువందలరూపాయిలుపుచ్చుకొనియాయోడయధికారితురకను
నన్ను సామాన్యపుడింగీపడవలలోఁగూర్చున్నప్పుడున్నంత సౌఖ్యమై
నను లేనిచోటుల గూలనేయుటయేగాక యెంత యనాదరణము సేయ
వలయునో యంత యనాదరణము చేసెను. మాకును మఱియేడుగురు
మనుష్యులకును వంటచేసికొనుటకుఁ బ్రాగుటకు దినమునకొకకుండెడు

నీరతఁడు పంపుచువచ్చెను. ఆయోడయెక్కినదిమొదలుపదునైదుదిన ములవఱకు మామందభాగ్యముచేత మేము పడినయిడుమలిట్టిట్టివని నేనువ్రాయఁజాలను. తరువాత నాలుగైదు దినములకు (అనగా డిశంబరు 5 వ తారీఖున నర్ధరాత్రమున) మేము కలకత్తానగరము సురక్షితముగాఁ జేరితిమి.

ఇట్లుచచ్చిచెడి యెట్లో కలకత్తాచేరిజీజీభాయికొన్నినాళ్ళచ్చట నుండి బొంబాయినగరమునకుఁబోయెను. ఆపురమున కొంతకాలముండిమరల చీనాదేశమున కింకొకసారి నావికాయాత్రచేసి 1807 వ సంవత్సరము తిరిగివచ్చి బొంబాయిపురమున స్థిరముగఁ గాపురముండెను. అదిమొదలు వర్తకవిషయమున నతఁడు తిరిగిప్రయాణముచేయలేదు. ఆనగరమునందే యతఁడు ముగ్గురుభాగస్వాములతోఁగలసియొకవర్తక సంఘముస్థాపించిమిక్కిలిపాటుపడిజాగరూకతతో వ్యవహరించి 1827వ సంవత్సరమునకురమారమిరెండుకోట్లరూపాయిలుసంపాదించెను.ఆహాహా!నూటయిరువదిరూపాయిలతోజీవయాత్రనారంభించినయీపేదయిరువదియైదుసంవత్సరములలోనెంతధనికుఁడయ్యెనో చూడుఁడు. దీనికిఁ గారణమేమి! మనకు దైవమింతియేయిచ్చెనని నింద్యమయినసంతుష్టి నొంది"కూపస్థమండూకమువలె" స్వదేశముననేయుండి యిడుమలఁ బడక పిన్ననాఁటనుండియు విదేశములలో విరివిగా వాణిజ్యమును సేయుటయే దీనికిఁ గారణము.

అతఁడు ధనమార్జించు నుపాయ మెంతబాగుగ నెఱిఁగియుండెనో పాత్రాపాత్రమెఱిఁగి బీదలనిమిత్తము దానినివినియోగించు నుపాయము నంతబాగుగనేయెఱిఁగియుండెను. పునహా బొంబాయి సూరతు మొదలగుపట్టణములు ఘూర్జర దేశమునందలి నవసారీమొదలగుగ్రామములు చూచినవారికి జీజీబాయియొక్క యౌదార్యముభూతదయాళుత్వము తప్పక తెలియును. కృపాసముద్రుఁడగు నీపారసీకులస్థుఁడుమహా

రాజు లిచ్చినట్లుమితిమీరినధనరాసులుదానములిచ్చి ధర్మవైద్యశాలలు, పాఠశాలలు, చెరువులు, సత్రములు, బాటలు, నూతులు, మొదలగువానిని నిర్మింపజేసి లోకోపకారపారీణుఁడయ్యెను. ఈదానములు సేయుటలో జాతివర్ణమతభేదములనతఁడెన్నఁడు పాటింపలేదు. ఈదానకర్ణునికీర్తిసకలదేశవ్యాప్తమగుటచే శ్రీవిక్టోరియామహారాజ్ఞగారు వానియౌదార్యమునుమెచ్చి 1842 సంవత్సరమున నైటనుబిరుదమునిచ్చెను.

అత్యంతగౌరసూచకమగునీబిరుదు పొందినవారిలో హిందూదేశమున జీజీభాయియే మొట్టమొదటివాఁడు. ఆబిరుదువచ్చినప్పుడు వానిస్వకులము వారగు పారసీలు చాలసంతసించి వానినిగౌరవించిరి. ఆబిరుదమును వానికిచ్చినప్పుడు బొంబాయిగవర్నరుగారు సర్ జార్జి ఆండ్రిసన్ దొరగారిట్లు పలికిరి. "నీవు రాజులిచ్చినట్లు దానములిచ్చి మానవకోటి దుర్దశను దొలఁగించియీయపూర్వగౌరవమునకుఁ బాత్రుడవయితివి."* 1843వ సంవత్సరమునందతఁడు బ్రిటిషుగవర్నమెంటువారివలన నొకబంగారుపతకమును బహుమానముగఁబడసెను. అమితమగు దేశాభిమానము, సౌదార్యముగలుగు వాఁడగుటచేవానికాపతకమీయఁబడినట్లు దానిమీఁదనే వ్రాయబడియున్నది. అప్పటిబొంబాయి గవర్నరుగారగు సర్ జార్జిఆర్థరుదొరగా రాపతకమును ఆయనకిచ్చునప్పుడిట్లనిరి. "నీవు దేశోపకారార్థము కేవలసత్కార్యములనిమిత్తమే తొమ్మిదిలక్షలరూపాయిలు దానముచేసియుంటివని యనేకులవలనవిని యుంటిని. ఇట్టియౌదార్యము దేశాభిమానము సూచించు ధర్మకార్యములను శ్రీరాణిగారు తగునట్లు గుర్తెఱుంగుదురుగాక

ఆతనిధర్మకార్యములుప్రత్యేకముగనొకజాతికి నొకదేశమునకు నేర్పడియుండలేదు. ఆంగ్లేయసైనికులు స్వదేశపుసిపాయిలుగూడమంచునెలవులగు కాబూలుకొండలనడుమ యుద్ధముభూములకు బలియగుచున్నప్పుడు ఐర్లండునందునుస్కాట్లండునందునుగాటంబులగుకాటకం

బులచే జనములు మలమలమాడి హాహాకారములతో నలమటబడినప్పు డు, క్రిమియాయుద్ధమునందుదిక్కులేక శూరశిఖామణుల నేకులు నిహతులై నప్పుడునవారి భార్యలు బిడ్డలుదురవస్థననుభవించుచుండ వెనుదీయక యీదానకర్ణుఁడే గొప్పసాహాయ్యములఁ జేయుచు వచ్చెను. ఫ్రాన్సు దేశమున 1856వ సంవత్సరమున నొకనదిపొంగి దేశమునకు మిక్కిలి చెఱుపుచేసెను. ఆవరదలవలన విపత్తులఁబడినవారికిఁ బంచిపెట్టుమని యిక్కడనుండి యైదువేలరూపాయిలంపెను. ఆమహోపకారమునకు ఫ్రెంచివారు మిక్కిలి సంతసించి వానికిఁ గృతజ్ఞులయి వందనములఁ జేసిరి.

1856 వ సంవత్సరమునజీజీభాయియొక్కవిగ్రహమొకటినిర్మించిబొంబాయినగరమునఁ బెట్టవలయునని జనులు సభచేసిరి.ఆసభకప్పటిగవర్నరు గారగు నెల్ఫినిస్టన్‌ప్రభువుగా రగ్రాసనాధిపతిగా నుండిరి. ఆవిగ్రహమునకురమారమియేఁబదివేలరూపాయిలయినవి. ఆతఁడిప్పుడులేకపోయినను వానికీర్తి దేహమోయన్నట్లావిగ్రహమిప్పటికి బొంబాయిపురమందిర మలంకరించుచున్నది.ఈతనిభార్యదాతృత్వమున నీతనిమించినది.బొంబాయినగరమునకుసాలసత్తీయనుచిన్నద్వీపమునకు నడుమనున్న వంతెన యీతనిభార్యచేసినదానమువలననేకట్టఁబడినది. ఆవంతెన ముగింపబడినప్పుడు గవర్నరుగారగు సర్ జార్జి ఆర్థరుదొరగారు జీజీభాయిగారిభార్యను గొనియాడుచునీక్రిందివిధముగాఁ బలికిరి.

"1841వ సంవత్సరమున వర్షకాలమందొకనాఁడు రమారమి యిరువదిపడవలు బొంబాయినుండి సాలసత్తికి గొందఱుమనుష్యులందీసికొనిపోవుచు మునిఁగిపోయెను. ఈయుపద్రవముచే జనులనేకులు మృతినొందిరి. జీజీభాయిగారిభార్య యతిదారుణమగు నీవర్తమానమునువిని ఖేదపడి యక్కడ నొకవంతెన దొరతనమువారేలకట్టింపగూడదని కొందఱినడిగి ప్రాణాపాయమును నివారించునట్టి సత్కారములను జే

యుటకు దొరతనమువారు సొమ్ము వెచ్చించుటకుఁ బూనుకొనరని త
నస్వంతసొమ్మిచ్చి యామహాకార్యమును తానే నిర్వహింప నిశ్చయిం
చుకొని యాపని కెంతసొమ్మగునో తెలియఁజేయుమని యింజనీరుల నడిగె
ను. అప్పుడు కొందఱింజనీర్లు చక్కఁగా విచారించి యాకార్యమున క
ఱువదియేడు వేలరూపాయిలు సరిపోవునని యంచనా వేసిరి. సాధారణము
గా గొప్పపనులకుఁ గావలసిన సొమ్మునకు, ఇంజనీరులు వేయు నంచనాల
కు సంబంధముండదని మీరంద ఱెఱుంగుదురు. ఈవంతెనకు వారు వే
సిన యంచనా సొమ్ము నిజముగాఁ గావలసినసొమ్ములో మూడవవంతై
యుండెను. దయాస్వరూపిణి యగు జిజిభాయి దొరసాని యింజనీరువారు
కోరినసొమ్మంతయు (అనఁగా నఱువదియేడు వేలరూపాయిలు) నిచ్చి తన
సంకల్పించిన ధర్మకార్యము నెరవేరునని యువ్విళులూరుచుండ నింజనీరు
లు సొమ్మంతయు బనిలో మూడవవంతున కే సరిపెట్టి కాళ్ళుచాపుకొని
కూర్చుండిరి. పనియాగిపోయినదని విని యాయిల్లాలు మరల నిరువది
మూడు వేలరూపాయిలు నిచ్చి (అనఁగా లక్షపూర్తిచేసి) పని కొనసా
గింపు మనియెను. ఆధనముతోఁగూడ కార్యము తుదముట్టకపోవుటచే
నామె వెండియుఁ బదివేలరూప్యము లిచ్చెను ఆసొమ్మును సరిపోకపోవు
టచే బొంబాయిదొరతనమువారు హిందూదేశపాలనము సేయుచున్న
ఈస్టిండియాకంపెనీ డైరక్టర్లకు ధనసహాయము సేయుమని వ్రాసిరి. ఆడై
రక్టర్లవద్దనుండి యెంతకాలమునకుఁ బ్రత్యుత్తరము రాకపోవుటచే జీజీభా
యిదొరసానిగారు మిక్కిలి చింతించి యెట్లయిన ప్రారంభింపఁబడిన కార్య
ము కొనముట్టింపవలయునని యదివఱకిచ్చిన మొత్తముగాక మరలనొక
సారి నాలుగువేలు వేరొకసారి యాఱువేలు మఱియొకసారి పదివేలు మొ
త్తము మీఁద నిరువదివేలరూపాయిల నిచ్చెను. ఈధనముతో నిదివఱకా
మె యిచ్చినధనమంతయు లక్షముప్పదివేలయ్యెను. చాలకాల మాల
స్యము చేసిచేసి యింగ్లాండులోని డైరక్టర్లు ఎట్టకేల కటమీఁద గావలసి

సహాయమంతయుఁ దామే పెట్టుకొని యీకార్యము సమగ్రముగఁ జేయుం తుమని యొసంగిచ్చి యీప్రకారము పని చేయించిరి. కాని కొంత సొమ్ము వ్యయము చేసిన తరువాత డైరెక్టర్లు సొమ్ము లేదను నెపమున పని నిలుపు చేయుచున్నట్లు మొన్ననే నాకుఁ దెలిసినది. ఈమాట వినినతోడనే నా సము చేయుటకు విసువు లేని యీజీజీభాయి దొరసాని గారు మును పిచ్చిన సొమ్ముగాక సంపూర్తి చేయుటకు ఇరువది రెండు వేల రూపాయిలును గట్లు వేయుటకై మూడు వేల రూపాయిలును దయచేసియున్నది. దయాతరంగిణి యగు నీసాధ్వి యిప్పటికొక లక్షయేబది వేల రూపాయిల నీయొక్క కార్యమునకే యిచ్చియున్నది. దేశస్థులలో నిరుపేదలు తమకుఁ గావలసిన వస్తువులను దాము తెచ్చుకొనజాలరు గావున వారికిం గలుగు లోటుపాటులను సవరించు భారము భాగ్యవంతులదని యీసాధ్వి యభిప్రాయము".

అని యాగవర్నరు గారు కొంతసేపామెను మఱికొండొకసేపామె భర్తను వారు చేసిన పాత్రదానముల నిమిత్తము కొనియాడి మొత్తముమీఁద జీజీభాయి కుటుంబము వారు ధర్మకార్యముల నిమిత్తము లక్ష పౌనులనఁగా నిప్పటి ప్రకారము పదునెనిమిది లక్షల రూపాయిలు దానమిచ్చెనని సభ్యులకుఁ దెల్పెను.

1858వ సంవత్సరము విక్టోరియా దేవిగారు మన దేశమును కంపెనీయధీనమునుండి తనయేలుబడిక్రిందికిఁ దీసికొని యప్పుడు జీజీభాయిగారికి 'బేరొనెట్' అను బిరుదము నిచ్చిరి. ఈగౌరవ మంతకుముందే గాక యిటీవలను యితము మన దేశస్థులలో నెవరికిం గలుగలేదు. దయాసాగరుఁ డగు నీమహాత్మ 1859 వ సంవత్సరమున ననఁగా డెబ్బదియారేండ్ల ప్రాయమునఁ గాలధర్మము నొందెను.

ఆయన చనిపోయినాఁడను మాటయే కాని చేసిన సత్కార్యముల వలన నిప్పటికి జీవించియున్నాఁడని మనము గ్రహింపవలయును. ఈజీజీభాయి చరిత్రమువలన మనము నేర్చుకొనవలసిన నీతులు కొన్ని యు

న్నవి. అందు మొదటిది స్వతంత్రవృత్తిసంపాదించుకొనుట. మన దేశములోఁ జదువుకొన్నవారందఱు దొరతనమువారి నాశ్రయించియేదో యుద్యోగము సంపాదించి జీవితమంతయు నందులో నేగడుపుచు ననేక బాధలు పడుచున్నారు. అట్లుచేయుటతప్పు. స్వతంత్రవృత్తినిసంపాదించుకొనవలయునే కాని యెల్లకాలము దొరతనమువారి నేనమ్ముకొనియుండఁగూడదు. జ్ఞానమునిమిత్తము చదువుకొనవలయునుగాని యుద్యోగము నిమిత్తము చదువుకొనఁగూడదు. తగినజ్ఞానము సంపాదించుకొని స్వతంత్రవృత్తి నవలంబించుట పురుషలక్షణము. జీజభాయియీసిద్ధాంతము నమ్మినవాఁడగుటచే స్వతంత్రవృత్తి నవలంబించి యెన్నియిడుమలకైన నోర్చి యంతటిగొప్పవాఁడయ్యెను.

రెండవది విదేశప్రయాణము. విదేశములకుఁబోవుటతప్పని తలఁచినంతకాలము మన దేశస్థులు దారిద్ర్యము ననుభవింపుచునేయుందురు. నిరుపయోగములగు నిబంధనములఁబెట్టుకొని సంకెళ్లుతగిలించుకొన్నవానివలె విదేశములకుఁబోజాలక మన దేశముననే తిరుగుచుండుటచే మనయవస్థ యింతవఱకు వచ్చినది. విదేశములతో యథేచ్ఛముగ వర్తకముఁ జేయుటచేతనే జీజభాయి మిక్కిలి గొప్పవాఁడయ్యెను.

మూఁడవది దాతృత్వము. మన దేశములో దాతలసంఖ్య యధికముగానేయున్నది. కాని యీదాతలందఱు పాత్రాపాత్రము నుచితానుచితము నెఱుఁగక దానములు సేయుచున్నారు. కేవలము బ్రాహ్మణులనిమిత్తమే యుపయోగించు సత్రములకు నెవ్వరికినుపయోగములేని దేవాలయములకు నిమ్మన్నచో మన దేశస్థులు ముందంజవేయుదురు. దిక్కులేనివారికి సత్రములు వేయించుట మొదలగు సత్కార్యములుమనవారిదివఱకెఱుఁగనే యెఱుఁగరు. బ్రాహ్మణులు గానివారికి దానము సేయుట పాపహేతువని మనవారికి దురభిప్రాయముగలదు. జీజీభాయిగారి చరిత్రమువలన నట్టిదురభిప్రాయములు పోవుగాక.

సర్ మంగళదాస్ నాథూభాయి.

సర్ మంగళదాస్ నాథూభాయి

మంగళదాస్ నాథూభాయి 1832వ సంవత్సరము అక్టోబరు నెలలో బొంబాయినగరమున జన్మించెను. ఆతఁడు గుజరాతీలలో కపూల్‌బనియా తెగలోఁ జేరినవాఁడు. అనఁగా నొకతెగ కోమటియని యర్థము. అతని పూర్వులు కతేవారు ద్వీపకల్పమునందలి గోగ్లాయనుపట్టణమునుండి వచ్చి బొంబాయిలో నివసించుచుండిరి. మంగళదాసుయొక్క తాతయగు రామదాసు మనోహరదాసుకాలమున నీకుటుంబము ధనవంతమై ప్రఖ్యాతిఁగాంచెను. ఇతని తండ్రియగు నాథూభాయి రామదాస్ శెట్టికుమారుఁడు మంగళదాసు పదునొకండు సంవత్సరముల ప్రాయము గలవాఁడై నప్పుడే మృతినొందెను. మంగళదాసు కొంతకాలమాంగ్లేయభాష ప్రారంభించి పాఠశాలలోఁ జదివి తరువాత నొకయుపాధ్యాయునిఁ బెట్టుకొని యింటియొద్ద నింగ్లీషు నేర్చికొనెను. అతనికి బదునాలవయేఁట రుక్మిణీభాయి యను నామెనిచ్చి బంధువులు వివాహము చేసిరి. తరువాత రెండుసంవత్సరములకు సరిగా యుక్తవయస్సు వచ్చిన తరువాత వాని యాస్తి వాని కప్పగించిరి.

చిన్నతనము నుండియు మంగళదాసునకుఁ దన సంఘమునందు ప్రబలియుండిన దురాచారములఁ దొలగించి కొన్ని మార్పులు చేయవలెనని తలంపుండెను. కపూల్ కోమటులు చేయు హోళీపండుగలో నాగరికులు చేయఁగూడని మద్యపానాది దుర్వ్యాపారములు పెక్కులుండెను. మంగళదాసా కార్యముల నివారించి పండుగ సలక్షణముగా జరుగునట్లు కొన్ని యేర్పాటులు చేసెను. ఆయేర్పాటులు మంచివగుటచే జనసమ్మతములుగ నుండెను. గుజరాతీదేశమున పీఠస్థులగు మతగురువులకు మహారాజులని పేరు. గోముఖవ్యాఘ్రములగు నామహారాజులు గురువులని పేరు పెట్టుకొని నిజముగా మహారాజులకన్న నెక్కువభోగము లనుభవించు

చు మతము పేరుపెట్టి శిష్యులకు దుర్నీతులను బోధించుటయేగాక యెంత మోటవాండ్రయిన సిగ్గుపడవలసిన నీతిబాహ్యకర్మములన్నియముగం జేయుచుందురు. ఈగురువులందఱుం వల్లభాచార్యమతస్థులు. ఈయాచార్యులుచేయు దౌర్జన్యములు చూచి సహింపలేక మంగళదాసు వారి దుర్మార్గములబయలుపెట్టందలంచెను. అతనితలంపున కనుకూలముగం నాకాలమున కెరసస్ దాస్ మూల్జియను యథార్థవాదియొకండుబయలు దేరి సత్యప్రకాశికయను నొకపత్రిక స్థాపించియందులో నీమహారాజులు చేయునీతిమాలినపనులను వెల్లడింపుచురాంగా మంగళదాసు వానికిందోడ్పడి కుడిభుజమయి పనిచేసెను. ఆమహారాజులలో నొకండుమూల్జిగారిమీందం బ్రతిష్టానష్టమునకు వ్యాజ్యము తేగానప్పుడు నాథూభాయి వానికభయమిచ్చి వేయివిధముల కనిపెట్టుటయేగాక తానువానిపక్షమున సాక్ష్యముంగూడ నిచ్చెను. మంగళదాసుసాక్ష్యము నేరమునువిచారించినజడ్జిలకు మంచియభిప్రాయమును గల్గించెను. అందుచేత తీర్పువ్రాయునప్పుడు జడ్జిలలో నొకరిట్లనిరి. "తనమతములోం జాలదురాచారము లున్నవని దృఢమయిననమ్మకముతనమనస్సులో లేనిపక్షమున మంచిస్థితియుగౌరవమునుగల మంగళదాసువంటి పెద్దమనుష్యుండుకోర్టుకువచ్చి, కులస్థులయొక్కయు బంధువులయొక్కయు దూషణకైననోర్చి యేల సాక్ష్యమిచ్చును." అదివఱ కతనివర్ణమునకు వంశపరంపరగా వచ్చునట్టికులపెద్ద యొకండుండెను. వర్ణపుంగట్టుబాటులలో నతండెంతచెప్పిన నంత జరుగుచువచ్చె. వర్ణవ్యవహారములెల్ల నొక్కమనుష్యునిపెత్తనముమీంద నుంచుట మంచిదికాదనియాతండుకులస్థులనందఱం జేర్చి, కులపెద్దవంశపరంపరగా వచ్చుటయనుచితమని చెప్పి, యెప్పటికప్పు డొకపెద్దనేర్పఱచుకొమ్మనియుపదేశించి తనమాట వారందఱువినునట్లుచేసెను. అంతతోం బోనీయక వెనుకపెత్తనముం జేసినసెట్టిమీందవ్యాజ్యము తెప్పించి యతనియొద్ద ధర్మవ్యయమునిమిత్త

మున్న సొమ్ముతీసికొనికులస్థులుధర్మమునిమిత్త మిచ్చినసొమ్ము యెక్కు వమంది యభిప్రాయము ననుసరించి వ్యయముచేయవలసిన దేకానియొ క్కకులపెద్దమాటచొప్పుననే జరుగఁగూడదని యేర్పాటుచేసెను. మం గళదాసు నాథూభాయికి మొదటినుండియువిద్యాభివృద్ధిఁ జేయవలెనని యభిలాష గాటముగానుండెను. 1852వసంవత్సరమున బొంబాయిపు రవాసులగు కొందఱు పెద్దమనుష్యులు మగపిల్లల కొకపాఠశాల స్థాపిం పఁదలఁప దాని కాతఁడు సహాయముచేసెను. హిందూదేశములోఁ బె ద్దపరీక్షలయందుఁగృతార్థులయిపిదపవిదేశములయందుఁజదువ నుద్దేశిం చువారినిమిత్తమతఁడిరువదివేలరూపాయిల బొంబాయియూనివర్సిటీ వారికిచ్చెను. 1854 వ సంవత్సరమునమంగళదాసుభార్యమృతినొందెను. ఆమెజ్ఞాపకార్థ మతండుకళ్యాణనగరమున నేఁబదివేలరూపాయిలవ్యయ ముచేసి యొకధర్మవైద్యశాలఁగట్టించిదానిఖర్చులనిమిత్తము మఱియి రువదివేలరూపాయిలుదొరతనమువారిచేతికిచ్చెను. పునహానగరములో డేవిడ్ సాసూ ననువారుకట్టించిన ధర్మవైద్యశాలలోగతిలేనిహిందూ స్త్రీలనిమిత్త మొకభాగము మూడువేలు కర్చుపెట్టి మంగళదాసు కట్టించెను.

1860 వ సంవత్సరమునగవర్నమెంటువారు క్రొత్తగావచ్చుబడి పన్ను (అనఁగా ఇన్‌కంటాక్సు), ప్రజలమీఁద వేసినప్పుడా విషయమయి నసంగతులువిచారణచేయుట కీతని కమీషనరుగా నియమించిరి. కా ని యాపన్నెట్లు వేయవలయునను నభిప్రాయములోనితనికిఁదక్కిన క మీషనర్లకునుసరిపడనందున నతఁడాపనిని స్వల్పకాలములోనేమాని వేసెను. మంగళదాసునకు రాజకీయవ్యవహారములయందుఁగూడఁజాల నభిలాషకలదు. అట్లుండుట చేతనే యతఁడు 1867 వ సంవత్సరమున 'బొంబె ఎసోసియేషను' అనునొకసంఘమునుస్థాపించెను. ఈసంఘము యొక్క ముఖ్యోద్దేశము హిందూదేశస్థులకు రాజకీయవ్యవహారముల

యందభిరుచి పుట్టించుటయే. ఈకార్యములుచేయుటచేతనతఁడుప్రజలవి శ్వాసమునకుఁబాత్రుఁడయిబొంబాయిగవర్నరుగారి యాలోచనసభ లోసభ్యుఁడుగాఁబ్రజలవలననేర్పరుపఁబడియెనిమిదిసంవత్సరములాపని చేసెను. ఆకాలములో జరుగు ప్రతివిషయమునుగూర్చియతఁడు గాఢ ముగాఁ జర్చించుటయేగాక ప్రజాక్షేమముగూర్చి యధికారులతో ని ర్భయముగఁ బోరాడుచువచ్చెను. 1874 వ సంవత్సరమున మంగళదా సు దేహారోగ్యము సరిగాలేక నాపని మానుకొనినప్పుడుబొంబాయిగవ ర్నమెంటువా రీక్రిందియుత్తరమును వ్రాసిరి.

"మీరు గవర్నరుగారి యాలోచనసభలోఁజిరకాలముకష్టపడి పనిజేసి యిప్పుడుమానుకొనుచున్నందున లోకోపకారార్థముగ మీరు చేసినపనినిగూర్చి మేముప్రశంసజేయకపోవుట పాడిగాదు." 1872 వ సంవత్సరము 1 వ మేతారీఖునబొంబాయిగవర్నరుగారగుసర్ సేమో రీఫిర్జరాల్డుదొరగారు మంగళదాసునకు సి. ఎస్. ఐ. అను బిరుదము నిచ్చుచు నీక్రిందివిధముగాఁ జెప్పిరి.

"మంగళదాసుగారూ! ఈబిరుదమునకుఁదగినయుత్తమపురుషు లపేళ్ళు కొన్ని తెలియఁజేయుమనిపై యధికారులునన్నుఁగోరఁగా నేను శ్రీవిక్టోరియామహారాజ్ఞిగారికి సంతోషపూర్వకముగా మీపేరు వ్రాసి పంపితిని. దయాస్వరూపిణియగు శ్రీవిక్టోరియామహాదేవిగారునాచేసిన విన్నపమునాదరించినారు. మీస్వతంత్రప్రవర్తనముమీలోకోపకార పరాయణతమీరీబిరుదునకుఁదగుదురని ఋజువుచేసినవి. అందుచేత నెం తోసంతోషముతో నే నీబిరుదములను మీకిప్పుడుసమర్పించుచున్నా ను. ఈబిరుదులు చిరకాలమువహించుటకు భగవంతుఁడుమీకాయు రారోగ్యము లొసంగుగాక!" 1875 వ సంవత్సరమున విక్టోరియారాణి గారు వానికి సర్ అనబిరుదము నిచ్చిరి. ఈబిరుదుపొందినహిందువుల లోనితఁడే మొట్టమొదటివాఁడు. ఆసంవత్సరమం దేవిక్టోరియారాణిగా

రిజ్యేష్ఠపుత్రులునుమనప్రస్తుతచక్రవర్తిగారు నగు ఎడ్వర్డుగారప్పుడు యువరాజుగానుండి మనదేశమునుజూడవచ్చి బొంబాయినగరమునకు బోయి మంగళదాసుయొక్క యిద్దఱుకుమారుల వివాహమహోత్సవ కాలమునను స్వయముగవచ్చి వానిని గౌరవించెను. యువరాజుగారు స్వయముగ నింటికివచ్చిన గౌరవము హిందువులలో మంగళదాసునకుఁ దప్ప మఱి యెవ్వరికిని లభింపలేదు. మంగళదాసు నింటికి వివాహము నిమిత్తమువచ్చిన చుట్టములందఱు మహానందభరితులయిరి. తనకుం గలిగిన యీయపూర్వగౌరవముచేత మహానందభరితుండయి మంగళ దాసు తనకృతజ్ఞతను యువరాజునకుఁ దెలుపుకొనెను. యువరాజునుజూ చుట కాసమయమున వర్తకులనేకులు వచ్చిరి. ఆవచ్చినవారిలో లక్షా ధిపతులు కోటీశ్వరులు నగువారిం గొందఱిని యువరాజునకుఁ జూపి పి మ్మట వానికత్తరు పన్నీరు తాంబూలము లిచ్చి వారిని పంపెను. ఆస మయమున మంగళదాసునియింట పువ్వులు కుప్పలుతిప్పలయి పడెను. తనయింట జరిగిన వివాహము యువరాజదర్శనమునను నీరెంటుసంగతు లజ్ఞాపకార్థము మంగళదాసు బొంబాయినగరములో నిరువదియైదువేల రూపాయిలు మూలధనముతో నొకసత్రము వేసెను. ఆమూలధనము పేరు సర్ మంగళదాసునాథూభాయికఫూలునిరాశ్రియల్‌నిధి. అది గాక మఱి యిఱువదియైదువేలరూపాయిలు మూలధనమిచ్చిగుజరాతీ కోమటుల యందఱి యుపయోగమునిమిత్తము వాకేశ్వర యను గ్రామమున నొక యన్నసత్రము వేయించెను.

1877 వ సంవత్సరమున శ్రీయువరాజుగారు హిందూదేశమును జూచినందుకు కొందఱిని గౌరవింపఁదలఁచి దొరతనమువారు కొన్ని వెండిపతకములు చేయించి యందొకదానిని మంగళదాసున కిచ్చిరి. ఆపతకమును మంగళదాసున కప్పటి బొంబాయి గవర్నరుగారగు సర్ రిచార్డుటెంపిల్ దొరగారు స్వయముగా సమర్పించుచునాసమయమున

నిట్లని చెప్పెను. "శ్రీరాణిగారిచే నీయఁబడిన యీపతకమును మంగళ దాసునకు సమర్పించుట కింతకన్న మంచిసమయము దొరకదుగనుక నిప్పుడేయీమిత్రులయెదుట దీని నిచ్చుచున్నాను. అతని నిదివఱకే నెఱిఁగియుండిన యీతెల్లదొరలయొక్కయు స్వదేశస్థులయొక్కయు సముఖమున మంగళదాసు దేశమునకు,బొంబాయినగరమునకుఁ, దనసంఘమునకుఁ జేసినయుపకారములను వానియౌదార్యమును వారిమనశ్శుద్ధినిపేరేనేను వేయినోళ్ళఁబొగడ నక్కరలేదు. ఇంగ్లీషువారియధీనములోనున్న హిందూస్థానములోనెల్ల శ్రేష్ఠమైనది గుజరాతీదేశము. ఆదేశస్థులలో మిక్కిలి గొప్పదియగు కోమటితెగలోఁ జేరినవాఁడు మంగళదాసు. అతనిసంఘమునకునతను తగినప్రతినిధియని మీరందఱొప్పుకొనఁదగినయంశమే.గడచిననూరుసంవత్సరములనుండివానిపూర్వులుదొరతనమువారిచేతఁబ్రజలచేతఁ జాల గౌరవింపఁబడుచున్నారు. ఏటేటవారియైశ్వర్యము వృద్ధియగుచున్నది. ఇతఁడు బొంబాయిసంఘమునకుఁబ్రధానపోషకుఁడు.ఈయనబొంబాయిరాజధానికివెనుకటి గవర్నరుగారగుసర్ బార్టిల్‌ప్రియర్ గారి యాలోచనసభలో నెనిమిదేండ్లు సభ్యుఁడుగానుండెను.అతఁడుదానములుసేయునప్పుడుకుడిచేయియిచ్చినదానినెడమచేయినెఱుగదన్నట్లుదానముసేయువాఁడు. కళ్యాణనగరమునకట్టించిన ధర్మవైద్యశాలయు,బొంబాయినగరమునస్థాపించినబాలికాపాఠశాలయు వానియౌదార్యమును ఘోషించుచున్నవి."

ఈమంగళదాసునాథూభాయి ఆ 1890వ సంవత్సరమునలోకాంతరగతుఁడయ్యెను. అతను మృతినొందునప్పు డొక్కమరణశాసనము వ్రాసి యందురమారమి యెనిమిదిలక్షలరూపాయిలు ధర్మకార్యములనిమిత్తము వ్యయముచేయుమని నియమించెను. అందు ముఖ్యదానములివ్వి. వాకేశ్వరగ్రామమునొద్దధర్మవైద్యశాలఁగట్టించుటకుడెబ్బదివేలరూపాయలు. వానిపేరస్థాపింపఁబడిన బాలికాపాఠశాలకు రెండు

వేలరూపాయలు. తన తెగకోమటులలో బీదలకు సాయము చేయుటకు వేయిరూపాయలు. వాకేశ్వరధర్మశాల మరమ్మతుచేయుట కయిదు వేలరూపాయలు. ఇంగ్లాండునకుబోయి చదువుకొను హిందూవిద్యార్థులనిమిత్త మదివఱకిచ్చిన ఇరువదివేలుగాక మఱియుఁ గొంతధనమిచ్చినట్లు మరణశాసనములో వ్రాసెను.

గోకులదాస్ తేజపాలు

గుజరాతిదేశములో ప్రసిద్ధమగు కచ్ఛ యనుసంస్థానముగలదు. అందు కొఠారాయను చిన్నగ్రామము గలదు. ఆగ్రామమునం దొక బీదకుటుంబమున నిద్దఱుబాలురుపుట్టిరి. అందొకఁడు 1793వ సంవత్సరమున జన్మించెను. రెండవవాఁడు 1798వ సంవత్సరమునఁ బుట్టెను. అందు జ్యేష్ఠుఁడగు నాంజి పదియేండ్లప్రాయముననే తనపొట్టపోసికొనుటకు బొంబాయికిఁ బోవలసివచ్చెను. పాప మతఁడు పగలు వీథులవెంబడితిరిగి గుడ్డలమ్ముకొని రాత్రియొకయింటికిఁ గావలిపండుకొనిజీవయాత్ర గడపనారంభించెను. ఎన్నియవస్థలఁ బడినను రోజుకూలియైనసరిగా గిట్టకపోవుటచే నతఁడు చాలశ్రమపడుచు వచ్చెను. అతని తమ్ముఁడగు తేజపాలు రెండేండ్లతరువాత బొంబాయికిఁబోయి యన్ననుకలిసికొనియె. అతఁడుకూడఁ జాలపరిశ్రమజేసి తన యిరువదియవయేట వర్తకుఁడయిస్వతంత్ర వ్యాపారముచేసి ముప్పదివేల రూపాయిలు గడించి రమారమి ముప్పదియైదేండ్లప్రాయమున ననఁగా క్రీ. శ. 1833వ సంవత్సరమున కాలధర్మమునొందెను. మృతినొందునప్పటికినతనికిరమారమి పదునొకండుసంవత్సరములు వయసుగల కుమారుఁ డొకఁ డుండెను. అతఁడే గోకులదాసు తేజపాలు. ఆబాలుని దురదృష్టముచేతఁ దండ్రి పోయినకొలదికాలములోనే పెదతండ్రియగు నాంజికూడ లోకాంతరగతుఁడయ్యెను. మరణమొందునప్పటికి నాంజియొద్ద మూఁడులక్షలరూపాయి లుండెను. నాంజికిఁగూడ బిడ్డలులేకపోవుటచే వానిధనమంతయుగోకులదాసునకే చెందెను. ఈగొప్పయాస్తిని సరిగాఁ జక్కఁబెట్టుటకు వానితండ్రియుఁ బెదతండ్రియుసంరక్షకునెవ్వనినేర్పరచిపోవలేదు. స్వయముగా జక్కఁబెట్టుకొనుటకు వానికిఁ దగినవయసుగాని విద్యగాని లేదు. ఐనను వానితల్లిమిక్కిలిబుద్ధిశాలిని యగుటచే బాలుఁడుచెడిపో

గోకులదాసు తేజపాలు.

వకుండ ధనము క్షయముగాకుండ నెంతయు జాగరూకతతో మెలంగి ప్రాయము వచ్చినతరువాత ద్రవ్యమంతయుఁ బుత్రునకప్ప గించెను. అదిమొద లతఁడు వ్యాపారములయందు మిక్కిలి శ్రద్ధాళువై ధనవృద్ధి జేయుటయేగాక సంఘమున కెంతో యుపకారి యయ్యెను. అతఁడు యావజ్జీవము విదేశములకు సరకు లెగుమతిసేయుటయు నచ్చటినుండి వచ్చినసరకులు స్వదేశమునకు దిగుమతీ సేయుటయు ముఖ్యవ్యాపారముగఁ బెట్టుకొనెను. ఇతఁడు గుజరాతీలలో భట్టియాకులస్థుఁడు. ఆ తెగలో భాగ్యవంతులగువారు తప్పక వస్త్రములయంత్రములనో మఱియే యితరస్త్రీయంత్రములనో తెప్పించి వ్యాపారము సేయుచుందురు. ఇతఁడో వారిమార్గమునను సరింపక క్రొత్తపుంతద్రొక్కెను. అతఁడుచేసినప్రతివ్యాపారమున వానికిలాభమువిశేషముగవచ్చెను. ఎంతధనమునుసంపాదించినను గోకులదాసుధనగర్వమునందక సర్వజనసులభుఁడయియెల్లవారికిష్టుడై యుండెను. అతఁడుసంఘసంస్కరణమునందభిలాషకలవాఁడనిచెప్పదురు గాని యావిషయమునఁ జెప్పఁదగినపని యెద్దియు జేసినట్లు కనఁబడదు. ఇతఁడుముఖ్యముగ దానమునకు బ్రసిద్ధికెక్కెను. 1854వ సంవత్సరమున నతఁడు మొట్టమొదట జన్మభూమికిఁబోయి యచ్చటనున్న తన తెగవారి యుపయోగమునిమిత్తము లక్షరూపాయలనొక్కమారే దానముచేసెను. ఆమరుచటిసంవత్సరమే గోకులదాసు తీర్థయాత్రలు సేయఁబోయి యాపుణ్యక్షేత్రములలో గొన్నిచోట్ల చెఱువులు త్రవ్వించి కొన్ని తావులసత్రములు గట్టించి కొన్నియెడల నన్నప్రదానములు సేయించి మొత్తముమీఁద ధర్మకార్యముల నిమిత్తము రెండులక్షలరూపాయిలువ్యయపరచెను. అక్కడనుండివచ్చి గోకులదాసు బొంబాయిలోనున్నగుజరాతివారి విద్యాభివృద్ధినిమిత్తము రెండుపాఠశాలలుస్థాపించెను. అవిగాక బొంబాయిలో నతఁడొక ధర్మవైద్యశాలపెట్టించి దానిపోషణము నిమిత్తములక్షయేబదివేలరూపాయల నిచ్చెను. ఆవైద్యశాలకు నింక

నుగావలసిన కర్చులుబొంబాయి మునిసిపాలిటీవారు దొరతనమువారు వహించి గోకులదాసు పేర దానినిప్పుడు జరపుచున్నారు.

బొంబాయిలో నున్న గొప్పవైద్యశాలలు మూఁడు. అందులో గోకులదాసు తెజపాలుగారి దొకటి. ఈదానములుగాక గోకులదాసు తనమరణశాసనములో మఱికొన్ని సత్కార్యముల నిమిత్తము ధనదానము చేయవలసిన దసి మిక్కిలి విస్పష్టముగా వ్రాసెను. ఈ మరణశాసనము మిక్కిలిబాగుండుటచే నేఁటికిని బొంబాయిలో మరణశాసనములు వ్రాయఁదలంచువా రనేకులు దీనినే మాదిరిగా పుచ్చుకొని వ్రాయుచుందురఁట. దాని కింత ప్రసిద్ధివచ్చుటకుఁ గారణమేమన దానిలో రెండు గొప్పవిశేషము లున్నవి. అందుమొదటిది ఆమరణశాసనమునుఁ బట్టి తదనంతరము ధర్మకార్యములు జరుపువా రేధర్మమెట్లు జరువవలయునో దేని కేయేసాధనసామగ్రులు కావలయునో యాయానిబంధన లన్నియు నందు విస్పష్టముగాఁ జెప్పఁబడియున్నవి. అందుచే దాతయొక్కముఖ్యోద్దేశమెప్పుడు జరుగక తప్పదు. రెండవది ఆశాసనములో గోకులదాసు తన బంధువులకు తనయొద్ద పనిచేసిన సేవకులకు తన్ను నమ్ముకొనియున్న యనుజీవులకు మరచిపోక వేరువేరుగ నొక్కొక్కనికి గొంతసొ మ్మియ్యవలయు నని వ్రాసెను. ఆ శాసనములందు మొట్టమొదట చిరకాలము తన్ను సేవించినపరిచారకునకు దనయనంతరమున శ్రాద్ధకర్మచేయించు బ్రాహ్మణునకుఁ దనకుఁ జాలకాలము వండిపెట్టిన వంటవానికిఁ బూర్వము తనయొద్ద సేవకుఁడయియుండి మృతినొందిన యొకవృద్ధునికుమారుల కిద్దఱకు మొత్తముమీఁద నలువదియాఱువేలరూపాయ లిమ్మని వ్రాసెను. అవి మొదటవ్రాసి తరువాత రెండు సంస్కృతకళాశాలల స్థాపించుటకు నందలివిద్యార్థుల కన్నముపెట్టుటకు నొకచెరువు త్రవ్వించుటకు నొక ధర్మశాల కట్టించుటకు నొకలక్ష పదునైదువేలరూపాయ లిమ్మని

యెను. పిమ్మట ననేకధర్మకార్యములనిమిత్తము గోకులదాసు రమారమి నెనిమిదిలక్షలరూపాయ లిమ్మనివ్రాసి ప్రతిధర్మకార్యము నిర్విఘ్నముగా సాగునట్లు లేర్పాటులు చేసెను. ఈమొత్తములో డెబ్బదియైదువేలరూపాయలు వేరుగానుంచి దానిమీఁద వచ్చినవడ్డీతో నిద్దరు గుమాస్తాలను, ఒక కార్యదర్శి (సెక్రటరి) ని వేయవలసినదనియు తాను జేసిన ధర్మకార్యము లన్నియు సరిగా జరుగుచున్నవో లేవో చూచుటయుఁ దాను ధర్మార్థమిచ్చినసొమ్ము లెఖ్ఖలుసరిగావ్రాయుటయు వారిపనిగా నుండవలసినదనియు, నతఁడు శాసనములో వ్రాసెను. ఆకార్యదర్శి సంవత్సరాంతమున లెఖ్ఖలన్నియు దొరతనమువారి గణికులచేత సరిజూపించి యింగ్లీషుభాషలోను గుజరాతీభాషలోను తెప్పున యాలెక్కలను ప్రకటింపవలసిన దనికూడ నతఁడు నియమించె. దగ్గఱచుట్టములను దూరపుచుట్టములను సరిగ జ్ఞాపకముంచుకొని యెవ్వరెవ్వరి కెంతధన మియ్యవలయునో యంతధనము నిచ్చి వారిలో సంతానములేని స్త్రీలకు యావజ్జీవమనుభవించునట్లు స్వాతంత్ర్యమిచ్చి తక్కినవారికి సంపూర్ణ స్వాతంత్ర్యమిచ్చి గోకులదా సందఱిమెప్పుల వడసెను. ఇవన్నియువ్రాసి కడపట నతఁడు తన యుత్తరక్రియలకు భార్యశ్రాద్ధములకు నొకవేళ తానే ముందుగాఁ బోయిన యెడల తనతల్లిపరలోకక్రియలకుఁ దగినయేర్పాటులు చేసెను.

ఈమరణశాసనము వ్రాయునప్పటికి గోకులదాసునకు నలువదియైదవ సంవత్సరము. ఏవిధమైనవ్యాధియు లేక యతఁడు మంచి యారోగ్యము కలిగియుండెను. ఆశాసనము వ్రాయవలసినయవసర మేమియు లేకపోయినను గోకులదాసు "దేహము లస్థిరము లెటుపోయి యెటువచ్చునో ముందేవ్రాసియున్న మంచి" దని సుఖముగా నున్నపుడె దానిని లిఖించెను. కాని దైవవశమున నదివ్రాసిన సంవత్సరమునకే గోకులదాసున కొకవ్యాధి ప్రవేశించి యేచికిత్సలకు లొంగక

తుడగా యుదారచరిత్రుఁ డెత్తుకొనిపోయెను. గోకులదాసు మహాదాన ములనిమిత్తము వ్యయము చేసిన ధనముగాక మృతినొందునప్పటి కతనిసొమ్ము ముప్పదిమూఁడులక్షల రూపాయలుండెను. కాని పాప మత నికిఁ బురుషసంతానము లేకపోవుటచే భార్యకు బెంచుకొమ్మని యధి కారమిచ్చెను.

ఎంత కట్టుదిట్టముగ వ్రాసినమరణశాసనములైనను వివాదము లు లేకయుండవు కదా. అట్లే గోకులదాసు మరణశాసనవిషయమునఁ గూడ ప్రారంభమున గొన్నివివాదములు సంభవించెను. కావున నీ వివాదములువచ్చుటచేత సొమ్ము ధర్మకర్తలచేతికి వచ్చునప్పటికిఁ గొంతయాలస్య మయ్యెను. కాని యీయాలస్యముకూడ కొంతమేలే యైనది. ఆయన తగవులన్నియుఁ దీరునప్పటికి కర్చులతోను వడ్డీతో ను సొమ్ము [illegible]దులక్షలయ్యెను. గోకులదాసు చేసిన ధర్మకార్య ములన్నిటిలో మిక్కిలి యెన్నఁదగిన దొక్కటియున్నది. అదియిది. చదువుకొనఁదలఁచు బీదవిద్యార్థులకు భోజనశాలయొకటి యతఁ డేర్పఱచెను. అందులో నిరువదియైదుమంది విద్యార్థుల కన్నము పెట్టి వస్త్రములు పుస్తకములు కట్టుబట్టలుమొదలగున విచ్చి పట్టప రీక్షయందుఁ గృతార్థులగువఱకు వారికిఁ జదువు చెప్పించున ట్లేర్పాటు లు చేయఁబడినవి. అతఁడు స్థాపించిన పాఠశాలలు ముఖ్యముగా నై దున్నవి. ఒక సంస్కృతకళాశాల యొక బాలికాపాఠశాల మగపిల్లల నిమిత్తము మూడింగ్లీషుపాఠశాలలు. ఈ యయిదు పాఠశాలలలోఁ జదువుకొను పిల్లలసంఖ్య 1,200లు. వీరిలో నూటికిరువది యయిదుగు రికి ధర్మార్థము చదువు చెప్పఁబడును. ఇదిగాక తన జన్మదేశమగు కచ్ఛిలోఁ జిన్నవి పెద్దవికలిసి మఱియారు పాఠశాలలుకలవు. అందొ కదానిలో బాలురకు సంస్కృతము మాత్రమే నేర్పఁబడును. ఇవి య న్నియుఁగాక బారిష్టరు పరీక్షకు ప్లీడరు పరీక్షకు వైద్యశాస్త్రపరీక్ష

లకుఁ జరుపుకొనఁగోరు విద్యార్థులకు సాయముచేయు నిమిత్తము కొంత మూలధన మతఁ డిచ్చెను. కులీనులకుఁ జరుపుకొనఁజాలంచి వచ్చినవారిలోఁ దన తెగ వారగు భట్టియాలకే యెక్కువ పాలు ఖ్యత నీయవలసిన దని యతఁడు వ్రాసెను. ఇట్లు విద్యాభ్యాసము నిమిత్తము సదుపాయములు పెక్కులుచేసి యనాథశాలక దేవస్థానములు మొదలగువానికిఁగూడ నతఁడు కొంతధన మిచ్చెను. అందు ముఖ్యముగా నొక దేవాలయమునకు కొంతధనమిచ్చి యేటేట నచ్చట నుత్సవములు మహావైభవముతో జరుగునట్లు నియమించెను. భట్టియాశాఖలోఁ జేరిన దిక్కులేని వితంతువులను దరిద్రులులేని దీన బాలురను బోషించునిమిత్తము దిక్కులేని యువతులకు వివాహములు సేయునిమిత్తమును గతిలేనివారికి మరణానంతరము బ్రాహ్మణకర్మలు జరుపు నిమిత్తమును గోకులదాసు ప్రత్యేకముగా లక్షయేఁబదివేల రూపాయలిచ్చి దానివడ్డిలోఁ బయిన చెప్పిన కార్యములు సేయుమనియెను.

బొంబాయినగరమున ధన మెంతయున్నదో ధర్మము నంతే యున్నది. ఎందరెందరో ధనవంతులు విశేషదానములు చేసిరిగాని దీనులకు నెల్లవారలకు సర్వోపయోగ్యముగా నిట్టిధర్మములు గోకులదాసు చేసిన ట్లెవరును జేయలేదు. ఈగోకులదాసు తేజపాలుయొక్క పేరు గుజరాతీ దేశమున నెఱుఁగనివారు లేరు. అతని పేరు చెప్పుకొనని యిల్లులేదు. ఆతని నామస్మరణముచేత నొక దానము చేసి యెఱుఁగని మహాకృపణులుసైతము ఔదార్యము గలవారై తెగించి తమ యర్థమున కొంతభాగము దానముచేయకమానరు. భరతఖండము గర్భమున బుట్టిన బిడ్డలలోఁ దన సత్కార్యములచేత నిజముగ జరితార్థుఁడయిన పురుషుఁడితఁడే యని చెప్పవచ్చును.

కృష్ణదాస్ మూల్జీ

ఇతఁడు 1832వ సంవత్సరము జూలై 25వ తారీఖున జన్మించెను. ఈతని పసితనమునందే తల్లి కాలధర్మము నొందుటచేఁ దండ్రి రెండవపెండ్లి చేసికొని మాతృహీనుఁడగు నీబాలకుని బెంచుమని తనతోఁబుట్టువు కప్పగించెను. ఈకృష్ణదాసు మేనత్త సంరక్షణలోనుండి బొంబాయిలోని యెల్ఫిన్‌స్టన్ కళాశాలలో విద్య నేర్చుకొనుచుండెను. ఆకాలమున నతఁడు రమారమి యిరువదియొక్క సంవత్సరము వయస్సు గలవాఁడై నప్పుడు వానివిద్య కంతరాయము సంభవించెను.

గుజరాతి దయాన్ ప్రసారిక మండలి యను నొకసభ గుజరాతులో నేర్పడి స్త్రీపునర్వివాహవిషయమున మంచి యుపన్యాసము వ్రాసిన వానికి నూటయేబదిరూపాయలు బహుమాన మిచ్చునట్లు ప్రకటించిరి. కృష్ణదాసు తద్బహుమానమును సంపాదింపవలయునని యుపన్యాసము వ్రాయ మొదలుపెట్టెను. కొన్నిపుటలువ్రాసిన తరువాత వాని వ్రాసినకాగితము లెవరో వానికిఁ దెలియకుండ దీసికొని మేనత్తకుఁ జదివి వినిపించిరఁట. పూర్వాచారములపై సత్యంతభక్తి గలయాయవ్వ యావ్రాతలు వినినతోడనే పిడుగడచినట్లు నిశ్చేష్టయయి స్త్రీలకు పునర్వివాహము చేయుట మంచిదని వ్రాసినపరమ దుర్మార్గుని దా నన్నవస్త్రములిచ్చి పెంచుటయు మహాపాతకమేయని తక్షణమే వాని నింటనుండి యావలకు వెడలనడచెను. కృష్ణదాసున కిది పెద్దదెబ్బ. దీనిచేనతఁడు నిరాధారుఁడయి యన్నవస్త్రము లిచ్చువారే లేకపోవుటచేఁ జదువుసయితము మానుకోవలసి వచ్చెను. అతఁడు కొంచెము పశ్చాత్తాపమునొంది యుపన్యాసము వ్రాయుట మాని తనయభిప్రాయములు మాఱినవని మేనత్తతోఁ జెప్పినరిపుచ్చు

కృష్ణదాస్ మూల్జీ.

కృష్ణదాసు వార్తాపత్రికను నడుపుటకుఁ దగిన సామర్థ్యమును నస్వాతంత్ర్యము లోకానుభవము గలవాఁడగుటచేఁ బత్రిక మంచిద శకు వచ్చెను. హిందువుల సంఘములోఁ జిరకాలమునుండి కాపుర ముండి బయలుపడకుండ సంఘమును నాశనముచేయుచుండిన దురా చారముల నతఁడు పత్రికాముఖమున బయలుపుచ్చి యపహాస్యముల పాలుచేయుచుండుటచే హిందువు లందరిలోను ముఖ్యముగా భట్టి యాలలోను వైశ్యులలోను మిక్కిలి కళవళముపుట్టెను. బొంబాయి లోనుండు వైశ్యులు భట్టియాలు వాణిజ్యాదులు చేయుటలోబుద్ధిమం తులే యయినను సంఘమతవిషయములలో మూర్ఖులయి గురువులకు బానిసలయి వారుగీచినగీటు దాఁట వెఱచి నీచముగ బ్రదుకుచున్నా రు. ఈగురువులు మన దేశమునం దున్న గురువులవలె స్వాములవారలు సన్యాసు లని పిలువంబడక మహారాజు లనిపిలువఁబడుదురు. పేరున కు వారు సన్యాసు లయినను నిజముగా మహారాజులకంటె నెక్కువ భోగములను వైభవములను ననుభవించుచుందురు. ఈగురువులు శ్రీ కృష్ణుని యవతారములని శిష్యజనులు నమ్మి భ్రష్టు లగుచున్నారు. ఈమతమువల్లభాచార్యమత మని చెప్పఁబడును. ఇదియొకవిధమయిన వైష్ణవమతము. దానిస్థాపకుఁడు వల్లభాచార్యుఁడు. ఈతఁడిప్పటికి ర మారమి నాలుగువందల యేండ్లక్రిందట నుండినవాఁడు. ఈయన కొంతకాలము దక్షిణదేశము తిరిగి పిదపఁ బశ్చిమమునకుఁబోయిగుజ రాతుదేశమున నొక వైష్ణవమతము స్థాపించెను. ఆమతగురువులేయీ మహారాజులు. ఈమతసిద్ధాంతమునుబట్టి శిష్యులు గురువునకు తమ తనువు మనస్సు ధనము సమస్తము నర్పించి కైంకర్యము చేయవల యును. ఈధర్మము మొట్టమొదటశిష్యులు గురువులయెడల మిక్కి లిభక్తి కలిగియుండవలయు ననుమంచియుద్దేశముతో నేర్పడియుండవ చ్చును. కాని యిటీవలమహారాజు లనుపేళ్ళతో బయలుదేరిన గురు

వులు దురాశాపాతకులును శిష్యులను వంచించి మూర్ఖజనులను జేసివారిధనము సంహరించుటయేగాక వారిచేత నీచమైన సేవలు చేయించుకొనుటయేగాక యీశిష్యుల యింట నుండు పడుచుపడంతులను యితరము భర్తలతోఁ గాపురము చేయఁ బంపకముందు వ్యభిచారమునిమిత్తము గురువులయొద్దకు పంపవలయునని శిష్యులకు నుపదేశించుచున్నారు.

ఈగురూపదేశము విని యజ్ఞానులగు శిష్యులు సన్యాసులనియెడి మహామత్తులు తమభార్యలను పుత్రికలను గోడండ్రను గురువులకుం దార్చి తాముకృతార్థులమైతిమని సంతసించుదురు. ఈ మూఢుల భక్తి యింతతో నిలిచిపోవలేదు. ఈగురుమహారాజులు నమిలిన సామియాఁ ది ముక్కలు వారిపాదపద్మసన్నిధానముపైఁ బడినవానిని శిష్యులెత్తి భక్షింతురు. వారిపాదుకలు వారుకూర్చుండుపీటలు పూజించుచుం దురు. వారియుమ్ములను బంగారుపగలతో నెత్తుదురు. గురువులు నమిలి యుమిసిన తమలపాకులనెల్ల స్త్రీపురుషులు వెలయిచ్చి కొని కన్నులనద్దుకొని తిని ధన్యులగుదురు. గురువు కాళ్ళుకడుగుకొన్న నీరు త్రావుదురు. ఆతనియుచ్ఛిష్టాన్నము నారగింతురు. వేయేల? ఆతనిబట్టలు పిడిచిననీరునయితేము పరమభక్తితోఁ గ్రహించి పానముచేయుదురు. జనులయందున్న యీమూర్ఖతపూర్తిగురువులు పైనుండి హరింపబడు నులుచేయనిచ్చినందుకు శిష్యులయొద్దనుండి చాలధనము గ్రహింతురు. ఈవిషయమున మున్నొకసారి రావుబహదూరు కందుకూరి వీరేశలింగంపంతులుగారు వ్రాసినవాక్యమొకటిం దుదాహరించుచున్నాము.

“ఈమహారాజులు శిష్యులపాలను, దర్శనమిచ్చినందు కయిదు రూపాయిలును, శరీరములు ముట్టనిచ్చినందుకు ముప్పదియైదు రూపాయలును, ఉయ్యాలలోఁ బెట్టి యూఁచనిచ్చినందుకు నలువదిరూపాయలును, గంధముపూయనిచ్చినందున కఱువదిరూపాయలును, ఏకశయ్యాగతులుకానిచ్చినందుల కేఁబదిమొదలువేలుకొని యేనూరు రూ

పాయలవఱకును, కలసి రాసక్రీడ చేయనిచ్చినందునకు నూరు మొగలుకొని యున్నూరురూపాయలవఱకును, ఉమిసిన తాంబూలమును తిననిచ్చినందునకు పదునేడురూపాయలును, తాము స్నానముచేసి సట్టిగాని తాముకట్టుకొన్నబట్ట యుతికినట్టిగాని నీరు త్రాగనిచ్చినందునకు పందొమ్మిదిరూపాయలును, గ్రహింతురట. మనుష్యజన్మమెత్తినవా రింతకంటె నెక్కువగాఁ జెడుట సాధ్యమగునా?*

నాగరికులగుయువజనులు తలంచుకొనుట కైనను హేయములగు నీదురాచారములనునిర్మూలింపఁ దలఁచికృష్ణదాసుమూల్జీ యీగురుపిశాచముల వికృతచేష్టలను దనపత్రికాముఖమున బయలుపుచ్చియల్లరి చేయసాగెను. తమగుట్టు బయలుపడుటచే గురువులు భయపడి లంచములచేతను బెదిరింపులచేతను వానిని మిన్నకుండ చేయవలయు నని యత్నించిరిగాని కృష్ణదాసు తనసంకల్పము విడువడయ్యె. కృష్ణదాసు వ్రాయువ్రాతలు గురుమహారాజులకు భరింపశక్యముగాక యుండుటచే నామహారాజు లనేకులుగూడి తమశిష్యజను లందఱిచేత మూల్జీని వెలివేయించి యిబ్బందిపెట్టుటకు ప్రయత్నించి 1859 వ సంవత్సరము జనవరినెలలో నొకయొడంబడికను వ్రాసికొనిరి. అందున్న ముఖ్య నిబంధనములివి.--1. వల్లభాచార్యమతములోఁ జేరినవైష్ణవుఁడెవ్వఁడును గురుమహారాజులను న్యాయస్థానమునకు రప్పించుటకు సమనులు చేయింపకూడదు. అట్టిసమనులను దీసికొని రాఁ గూడదు. 2. గురుమహారాజుల నేకోర్టులకు సమనుచేసి పిలుపింపఁగూడదని దొరతనమువారిచేత నొకచట్టము నిర్మింపఁ జేయుటకు వలసినంతసొమ్ము పోగుచేయవలయును. 3. ఈచట్టము నిర్మింపఁబోవులోపున నీమహారాజులశిష్యుఁడు కానివాఁడెవఁడయిన వారికి సమనులు చేయించిన పక్షమున నట్టివ్యవహారమునకుఁ గావలసినధనమంతయు శిష్యవైష్ణవులు పెట్టుకొనవలయును. 4. గురుమహారాజుల శిష్యుఁ డగు

వైష్ణవులు దేవుండయిన వారిమీఁద చెడ్డవ్రాతలు వ్రాసినపక్షమున వెంటనే కులస్థులందఱు వానిని వెలివేయవలయును.

ఇట్లువ్రాసి యామొడంబడికపత్రమును గురువులు శిష్యులందఱకు యథేచ్ఛముగఁ బంచిపెట్టిరి. ఆకాగితమునుజూచి మూల్జీదానికి బానిసపత్ర మని పేరుపెట్టెను. ఒడంబడిక లెన్నివ్రాసికొన్నను శిష్యజనులు చాలమంది దానిలో వ్రాలు చేయనందున మహారాజులుతమ యిచ్ఛాప్రకారము కృష్ణదాసును బహిష్కరింపఁజాలరయిరి. ఇటులుండ 1860 వ సంవత్సరమధ్యమున సూరతు నగరమునుండి యొకమహారాజు బొంబాయి నగరమునకు విజయంచేసెను. వచ్చినకొన్నినాళ్ళకె యాగురువునకు సత్యప్రకాశికపత్రికాధిపతి యగుమూల్జీకిని మతాచారములలోఁ గొన్నిసంగిగ్ధవిషయములనుగూర్చి చర్చజరిగెను. కృష్ణదాసడిగినప్రశ్నములకుఁ దగినయుత్తరములు జెప్పఁజాలక గురుమహారాజుగారు "శేషంకోపేన పూరయే" త్తను లోకోక్తి నిజముగ మహాకుపితులై మూల్జి నాస్తికవాదములు చేయుచున్నాఁడనియు మతమునకుఁ జెరుపుగావించుచున్నాఁడనియు నిందారోపణము చేసెను. గురువులు తన కారోపించిన యీనీలాపనిందలకు మూల్జి 1860వ సంవత్సరము అక్టోబరు 21వ తారీఖున ప్రకటింపఁబడినసత్యప్రకాశికలో సహేతుకమయిన మంచియుత్తరమిచ్చి యందు వేదములలోనుండి శాస్త్రములలోనుండి పురాణములలోనుండి యెన్నో శ్లోకముల నెత్తి వ్రాసి గురువులు చేసినవాదము లప్రమాణికములని ఋజువుచేసి ప్రపంచములో నీగురుమహారాజులకంటె దురాత్ములువంచకులు లజ్జాహీనులు వ్యభిచారులు లేరని కఠినముగ వ్రాసెను. ఆవ్రాత గురువునకు నపాళమంటితల వెఱ్ఱియెత్తించినను నెందుచేతనో వారు కొంత కాలమూరకుండి దుస్సహమయిన యీపరాభవమునకుఁ బ్రతిక్రియ జేయుటకుఁ గాబోలు 1861వ సంవత్సరము మే నెల 14వ తారీఖున

నతఁడు కృష్ణదాసు మూల్జీమీఁద ప్రతిష్ఠనష్టమునకు బొంబాయి హైకోర్టులో నొక యభియోగము (దావా) తెచ్చెను. కృష్ణదాసు మూల్జీ యాక్షేపణకుఁ దాను నేరస్థుఁడు కాఁడనియు, వ్రాసినవారిత వారికప్రతిష్ఠాకరము కాదనియుఁ దాను వ్రాసినదానిలోఁ బ్రత్యక్షరము నిజమేయనియు వాదించెను.

అంతియెగాక వల్లభమతగ్రంధములలో వ్యభిచారము భక్తిగ చెప్పఁబడినదనియు నీమతగురువులందఱు వ్యభిచరించుచునే యుందురనియు సూరత్తుగురుమహారాజుగారుకూడ నట్టితెగలోనివాఁడే కాని వారికంటె భిన్నుఁడు కాఁడనియు మూల్జీ కోర్టువారికి విన్నవించెను. అనంతరము కృష్ణదాసు చేయుచున్న మహోపకారముఁ దెలిసికొనలేక మూర్ఖులయి భట్టియాజాతివారగు సభయొకటిచేసి గురుమహారాజునకు విరుద్ధముగ నెవ్వరుకృష్ణదాసుపక్షమున సాక్ష్యమియ్యఁగూడదని నిర్ధారణచేసికొనిరి. ఈనిర్ధారణము గురువులకు శిష్యులకు నష్టమే గాని లాభముగలిగింపలేదు. ఏలయనఁ దనకులస్థులందఱు జేరి తనపైఁగుట్రలుపన్నుచున్నవారని కృష్ణదాసువారిపై నొకయభియోగముఁ దెచ్చెను. గురువుఁదెచ్చిన దావాయుండ మూల్జీకులస్థులపై దెచ్చిన యభియోగములో న్యాయాధిపతులు భట్టియాలలో ముఖ్యులగునిద్దఱికిఁ జెఱియొక వేయిరూపాయలనుమతియెనమండుగురిలో నొక్కొక్కనికైదువందలరూపాయిల చొప్పునను ధనదండన విధించిరి. ఆనాఁడు మూల్జీ కోర్టునుండి యావలకుఁబోఁగానే యోడిపోవుటచేత కడుపు మండియున్న భట్టియాలు వానిని దిట్టముగఁ గొట్టిరి. అందుచేత రాజభటులసహాయము గయికొని యింటికిఁబోవలసివచ్చెను.

గురువుదాఖలుచేసిన ప్రతిష్ఠానష్టపుదావా హైకోర్టులో నలువది దినములు విచారింపఁబడెను. న్యాయాధిపతియగు జోసఫ్ ఆర్నాల్డుదొరగారు మూల్జీ నేరస్థుఁడు కాఁడని తీర్పుచేయుటయేగాక య

తేఁడు లోకోపకారి యనియు నీతిస్థాపనమునిమిత్తము చాలధైర్యము చూపె ననియు తమతీర్పులో వ్రాసిరి. ఆకాలమున నమెరికాఖండము లో గొప్పయుద్ధములు జరుగుచుండుటచే జనులు కృషివాణిజ్యాదుల యందు శ్రద్ధవిడిచినందున దూదిపంట యల్పమయ్యె. అమెరికాఖండపుదూదియే యదివఱకు నింగ్లాండునకు యెగుమతియగుచుండెను. ఆ ఖండమునందు దూదిపంట యల్పమాయినందున నింగ్లాండువర్తకులు హిందూదేశపుదూది మిక్కుటముగాఁ గొనఁగోరి బేరము లిచ్చిరి. అప్పుడు మనదేశములో దూది వెలయెక్కువయయ్యెను. అందుచేతమూల్జీ తనపూర్వపు వృత్తిని మాని దూదివర్తకముచేసినచో మిక్కిలిలాభమువచ్చునని కృష్ణదాసుమాధవదాసను పేర నొక వర్తకపుసంఘముపెట్టి వ్యాపారము చేయనారంభించెను. విదేశముతో వాణిజ్యముచేయునప్పుడు వర్తకుఁడా దేశమునకుఁ బోవనిచో వ్యాపారము సరిగజరుగదని కృష్ణదాసు పయనమై యింగ్లాండునకుఁబోయెను. కాని యెంతశ్రద్ధతో నతఁడువ్యాపారముచేసినను దైవవశమున దూది బేరములో ధరలు మిక్కిలి మందమగుటచే మూల్జీస్థాపించినవర్తక సంఘము నష్టమునొంది యంతరించెను. కాబట్టిమూల్జీయింగ్లాండులో నుండవలసిన యవసరములేక 1874 వ సంవత్సరమున మనదేశమునకు మరలివచ్చెను. ధనలాభము లేక సరిగదా యింగ్లాండుపోయినందుకు మూల్జీకి మఱియొక యుపద్రవము సంభవించెను. చిరకాలమునుండి యతనిమీఁద మిక్కిలి యక్కసుబూనియున్న గురుమహారాజు లదే సమయముగదాయని విదేశము వెళ్ళినందుకు వానికివెలివేసి బహువిధముల బాధపెట్టిరి. ఎన్నిబాధలుపెట్టినను మూల్జీ మేరువువంటి ధైర్యముగలవాఁడై జడియక నిలిచెను. ఇటులుండ నప్పటి బొంబాయిగవర్నరుగారు మూల్జీయొక్క సామర్థ్యమును, నీతిని, ధైర్యమును నెఱిఁగినవా రగుటచే నొక స్వదేశసంస్థానమునకు వానిని

దివానుగా నేర్పఱచెను. ఉద్యోగస్థుఁ డయియున్న కాలమున నతఁడాపదవిలోఁ దన్ను నియోగించిన దొరతనమువారికిని తనచేఁ బాలింపఁబడు ప్రజలకును సంతుష్టిగలుగునట్లు దేశము నేలెను. కాని యీయుద్యోగమున నతఁడు చిరకాలముండలేదు. అచిరకాలములోనె యొకవ్యాధిసంభవించి యెట్టకేలకువానిందనపొట్టబెట్టుకొనెను. ఈ సత్పురుషుని మరణమునకు బొంబాయి గవర్నమెంటువారు సయితము విచారించి తమ గెజటులోఁ నా విచారమును తెలియపరచిరి. కృష్ణదాసు మూల్ జీ సత్యమునిమిత్తము నీతినిమిత్తముకష్టములననుభవించినశూరశిఖామణి. సంఘసంస్కరణమునం దితఁడు తనకుఁగల యభిమానము మాటలచేతగాక క్రియలచేత జూపి మొదటినుండియు తన వర్తనమున నసందర్భములు లేకుండ నేకరీతిని నడిపినవాఁడు. ఆ కాలపు బొంబాయి గవర్నరుగారేగాక యింక ననేకులు శ్లాఘాపాత్రమగువాని చరిత్రమును మెచ్చుకొనియుండిరి. సర్ రిచ్చర్డు టెంపిల్ గారు తనకాలపుమనుష్యుల చరిత్రములను వ్రాయుచు నీతనిఁ గూర్చి శ్లాఘ్యమగు మాటలతో వ్రాసిరి.

రాజా సర్ దినకర రావు.

రాజా సర్ దినకరరావు

ఈయన మహారాష్ట్రబ్రాహ్మణుఁడు. బొంబాయి రాజధాని యందలి రత్నగిరి జిల్లాలోనున్న దేవరూఖ గ్రామము వీరి జన్మస్థానము. ఇతఁడు 1819 వ సంవత్సరము డిసెంబరు 20 వ తారీఖున జన్మించెను. ఈయనతండ్రి రఘునాథరావు. ఈయన రఘునాథరావు ప్రథమకళత్రమువలనఁ బుట్టినపుత్త్రుఁడు. దినకరరావుయొక్క పూర్వులు మూఁడు నాలుగుతరములనుండి సింధ్యామహారాజుగారి గ్వాలియరు సంస్థానములో నేదో యొకపనిగాని సుబేదారులుగ నుండుచు వచ్చిరి. ఇతనియొక్క బాల్యమునుగూర్చి మన కంతగా తెలియదు. అయిదవయేటనే యక్షరాభ్యాసముచేసి మాతృభాష యగు మహారాష్ట్రమును వానికిఁ దండ్రిగారు చెప్పించుచు వచ్చుచుండిరని మాత్రము తెలియుచున్నది. స్వభాషతోఁ గూడ దినకరరావు సంస్కృత పారసీభాషలఁగూడ నేర్చెను. యుక్తవయస్కుఁ డయినపిదప నితఁడు పూర్వాచారపరాయణుండయి చేయవలసినకర్మలు కాలాతిక్రమణము కాకుండ యథావిధిగఁ జేయుచుంటఁబట్టి బాల్యమునందితనికి మతసంబంధమగు బోధనము గట్టిగా జరిగియుండునని తోఁచెడును. ఈయనకు హిందువుల గానమునందు మిక్కిలి యభిరుచిగలదు. హిందూ వైద్యశాస్త్రమునందుఁ జాలమట్టుకభినివేశము గలదు. బుద్ధిసూక్ష్మతగలవాఁడగుటచే నేవిద్య నభ్యసించిన నది యల్పకాలముననే రాఁదొడఁగెను. అతఁడును సమయము చిక్కినప్పుడు వదలక తనజ్ఞానాభివృద్ధి చేసికొనుటకు మిక్కిలి పాటుపడెను. ఈయనకు నలుబదిసంవత్సరములు వచ్చువఱకు నింగ్లీషుభాష రాదు. చదువ నారంభించిన వెనుక నతఁడచిరకాలములోనే దానిని చక చక

మాటలాడ నేర్చెను. దినకరరావుగారికి జ్ఞాపకశక్తి మెండు.

గ్వాలియరుసంస్థానములో నితఁడు పదునైదవయేటనే యుద్యోగమునఁ బ్రవేశించెను. మొట్టమొదట నొకగొప్పయుద్యోగస్థుని చేతిక్రింద కొంతకాల మతఁడు లెక్కలువ్రాయుచు వచ్చెను. ఈ చిన్నయుద్యోగములో నతఁడు చూపిన చాకచక్యము ప్రానిక గ్రహించి మెచ్చి తండ్రి యనంతరమున నదివఱ కాయన చేయుచుండిన సుబేదారుపని దినకరరావుకిచ్చిరి. అతఁడు పరిపాలింపవలసిన పరగణా మిక్కిలి కష్టతరమయినదగుటచే దినకరరావు తనలో నడగియుండిన యద్భుతశక్తి నంతయు వెలికిదెచ్చి కడు నేర్పుతో నధికారము జేసెను. ఆపనిలోఁ బ్రవేశించినపిదప నతఁడు తనపరగణాలోనున్న పోలీసుడిపార్టుమెంటు చక్కఁజేసెను. అవసరమయినచోటుల పోలీసు స్టేషనులఁ గట్టించెను. సర్కారుసిస్తు సరిగ వసూలుచేయుటకు తగిన పద్ధతు లేర్పరచెను. క్రిందియుద్యోగస్థులు నడువవలసిన నడతయిట్టిది యని తెలియఁ జేయుట కొకనిబంధన గ్రంథము వ్రాసెను. ఈకార్యములను నతఁడుచేసిన తక్కువమార్పులనుజూచి గ్వాలియరుమహారాజుగారును వారియొద్దనుండు నింగ్లీషువారి రెసిడెంటును చాలసంతోషించిరి. ఈకార్యములే దినకరరావుయొక్క భవిష్యద్వృద్ధికి యశస్సునకు విత్తనము లయ్యెను.

దినకరరా వొక్కఁడు సంస్థానములో నొకచిన్న భాగమును సరిగాఁ బాలించిన మాత్రమున సంస్థానమున కంతకు నేమి లాభము గలుగును? తక్కినవా రందఱు వానిలాగున పాటుపడినచో మిగుల లాభముండును. అట్లు గాకపోవుటచే 1843 వ సంవత్సరము మొదలు కొని సంస్థానము మిక్కిలి క్షీణదశకు వచ్చెను. పూర్వపుమహారాజు పోవుటచే నప్పటిమహారాజు బాలుఁడు. రాజకుటుంబము బహు కలహాభూయిష్టమయి యుండెను. వ్యవహారము సరిగ జరుగదయ్యె. అర్థ

ప్రాణములకు క్షేమము తక్కువయ్యెను. ఎచ్చటఁ జూచిన నేరములు తరుచయ్యెను. అధికారులు లంచగొండులయి ప్రజలను బాధింపఁ జొచ్చిరి. సర్కారునకుఁ జెల్లుబడి గావలసిన సిస్తు సయితము కొన్నగా వసూలుచేయు దిక్కులేకపోయె. అందుచేత ధనకోశములు వట్టివయ్యెను. ఈదురవస్థకుఁ దోడు గోగచుట్టునుపై రోకటిపోటుచందమున సంస్థానమున మన్నెములలో నున్న కొండలను వనచరులు పితూరీలు చేసి, యున్న కొంచెము నెమ్మదికి భంగము గలిగించిరి. కాఁబట్టి సంస్థానమునకుఁ జక్కని త్రోవఁబట్టుటకు సమర్థుఁడొకఁడు కావలసి వచ్చెను. తగినవాఁ డెవఁడని యందఱు విచారించుచుండ నంతలోఁ బ్రధానమంత్రిపదవి ఖాళీ యయ్యెను. వెంటనే సంస్థానము మేలుకోరినవారందఱు దినకరరావే దానికిం దగినవాఁడని వాని నాపదవి యందు 1852 వ సంవత్సరమున బ్రతిష్ఠించిరి.

ఆమహాపదవి నతఁడు బూని సంస్థానము సరిగా సిస్తు చెల్లకపోవుటచే ధనహీనతచేతఁ జిక్కుపడు చున్నదని గ్రహించి తద్విషయమున ముందుగాఁ బనిచేయుటకుఁ బ్రయత్నించెను. దరి యంచులేక సంస్థానమందలి ధనమంతయు కర్చగుచుండుటచే నట్టివ్యయము నివారించుటకు నతఁడుచేసినపని మిక్కిలియాశ్చర్యకరమయి శ్లాఘనీయమై యున్నది. నిజమయిన స్వామిభక్తిగల దినకరరావు ప్రప్రథమమున తనజీతమునైదు వేలనూపాయిలనుండి రెండు వేలగునట్లుతగ్గించెను. ఆత్మలాభపరాయణుఁడుగాక, కేవలస్వార్థపరిత్యాగియయినయీసత్పురుషుని పద్ధతి నవలంబించి యనేకులు తమజీతములుగూడ తగ్గించుకొనిరి. అందుచేత ప్రతిసంవత్సరము చాలసొమ్ము కూడివచ్చెను. ఈపని యయిన వెనుక నతఁడు సర్కారుసిస్తు వసూలుచేయుటయనుగూర్చి యెక్కుడు శ్రద్ధచేసెను. ఈపని చక్కఁగా నిర్వహించుటకు దినకరరావు రివిన్యూడిపార్టుమెంటును బలపరిచి లెక్కల డిపార్టుమెంటును

కూడ సృష్టించి దానిని సమర్థుఁడయిన యొక యుద్యోగస్థునిచేతి క్రింద నిలిపెను. ఇట్లు మూఁడు సంవత్సరములు పాటుపడి యామంత్రి సంస్థానపుఋణ మంతయు దీర్చివేయుటయేగాక ధనకోశములోఁ గొంతసొమ్ము నిలువఁగూడఁ జేసెను. సంస్థానమునందలి యుద్యోగస్థు లందఱు నడచుకొనవలసిన వ్యవహారధర్మములను గొన్నిఁటిని వ్రాసి యొకపుస్తకముగాఁ జేసి యానిబంధనలనుబట్టి వారందఱు నడచుకొనున ట్లాజ్ఞాపించెను. ఈపుస్తక మెంత యుపయోగకరముగా నుండెనో యీక్రింది సంగతినిబట్టి మీరే గ్రహింపవచ్చును. ఆకాలమున హైదరాబాదు సంస్థానములో రెసిడెంటుగానుండిన బుష్బీదొరగారు గ్వాలియరుసంస్థానములో రెసిడెంటుగానుండి మాక్ఫెరసను దొరగారికి జాబు వ్రాయుచు దినకరరావుగారు వ్రాసిన పుస్తకము మిక్కిలి యుపయోగకరముగా నుండుటచేతనైజాంసంస్థానమునందుఁ గూడ దాని నుపయోగింపవలెనని దన కభిప్రాయమున్నట్లు వ్రాసెను. ఈపనులకుఁ దోడు దినకరరావు 60 పాఠశాలలు సంస్థానములో స్థాపించి యొకచిన్న చదువుల డిపార్టుమెంటు కల్పించెను. పోలీసును న్యాయస్థానములును (కోర్టులు) చక్కపఱచెను. కాలువలు త్రవ్వించి చక్కని బాటలు వేయించి జనులకు ప్రయాణసౌఖ్యమును గలిగించెను. వాణిజ్యమునకు భంగకరములయిన సుంకములను గొట్టివేసి ప్రజలయొక్క స్థితిని బాగుచేయుట కెన్నివిధముల పాటుపడవలయునో యన్నివిధముల పాటుపడెను.

1857 వ సంవత్సరమునం దుత్తరహిందూస్థానమున గొప్ప సిపాయిపితూరి జరిగెను. ఆకాలమున నింగ్లీషుదొరతనమువారికి దినకరరావుచేసిన యుపకార మింతింతయని చెప్పరాదు. హిందూదేశమం దున్న సంస్థానాధిపతులందఱిలో సింధ్యావిషయముననే గవర్నమెంటువారి కాదినములలో నెక్కువ యలజడి కలిగెను. సింధ్యా

మహారాజుయొక్క సైనికులుగూడ పితూరీదార్లలోఁగలసి సర్కారు వారితోఁ బోరాడ నభిలషించుచుండిరి. సింధ్యాగూడ నొకచేయి చూచి విడుచుట మంచిదని యాలోచింపఁ దొడఁగెను. అట్టిసమయమున దినకరరావుయొక్క బుద్ధినిపుణతచేత సింధ్యామహారాజు తన ప్రయత్నము మానుకొనియెను. సైనికు లింగ్లీషువారిమీఁదికిఁ దమ్ము పంపుమని పలుమారు వేఁడుటచే దినకరరావు మేరమీరిన వారి యుత్సాహమును మాన్పలేకపోయినను వారు పితూరిదారులతోఁగలసి దొరతనమువారిమీఁదఁ బడకుండ నెప్పటికప్పు డేవో వంకలు చెప్పి యాపఁజాలెను. అధికమయిన బుద్ధినిపుణత యుండుటచే తనే పితూరిదారులు గ్వాలియరుసంస్థానమునప్రవేశించినపుడయిన తమ సైనికులు వారితోఁ జేరకుండ నాపగలిగెను. అప్పటి రెసిడెంటుగారు దినకరరావువలననే సింధ్యామహారాజురక్షింపఁబడెనని స్పష్టముగాఁబలికెను. ఆయన చేసినపనినిగూర్చి యొకదొరగారీక్రిందివిధముగ వ్రాసిరి. "ఆకళవళములో దినకరరావు తనయజమానికి జేసిన యుపకార మిట్టిదియని చెప్ప నలవిగాదు. అతఁడు తన స్వామియెడల మూర్తీభవించిన రాజభక్తియయి యడ్డము వచ్చినదాని నెల్ల దుడిచిపెట్టుచు మహావేగముతో వచ్చిన యాసంక్షోభమునకు మూర్తీభవించిన ధైర్యమయి మెలఁగెను. అత్తటి నాంగ్లేయ ప్రభుత్వమునం దాతఁడు చూపిన యాదరము నాంగ్లేయుల కతఁడు చేసిన సహాయము నప్పుడది చూచినవారు స్వయముగ ననుభవించినవారు జన్మమధ్యమున మరచిపోఁదగినది కాదు." 1859 వ సంవత్సరమున గవర్నరు జనరలుగారగు కానింగు ప్రభువుగారు ఢిల్లీలో నొకదర్బారుచేసి యచ్చటికి దినకరరావును రావించి యతఁడు చేసిన యుపకారమునకుఁ గృతజ్ఞుఁడయి వందనములు సేయుటయేగాక కాన్పీజిల్లాలో నొకజాగీరును బహుమాన మిచ్చెను.

1859 వ సంవత్సరముననే దినకరరావు గ్వాలియరులో మంత్రి యుద్యోగమును మానుకొనెను. అనంతరము కొంతకాలమువఱకు నతఁడు ఢోల్పూరు సంస్థానమునకు మంత్రి యయ్యెను. 1861 వ సంవత్సరమున గవర్నరుజనరలుగారి శాసననిర్మాణసభలో హిందువుల నేర్పఱచవలసి వచ్చినప్పుడు దినకరరావుగా రొక సభికుఁడుగా నియమింపఁ బడెను. అతఁ డాసభలో మూఁడుసంవత్సరములు మాత్రమే పనిచేసినను నాస్వల్పకాలమున దేశోపకారములగు పనులే చేసెను. 1866వ సంవత్సరమున నతనికి సర్ యను బిరుదము వచ్చెను. 1877 వ సంవత్సరమున జరిగిన ఢిల్లీదర్బారులో దొరతనమువారు వానికి రాజాబిరుదమునిచ్చిరి. 1884 వ సంవత్సరమున డఫిన్ ప్రభువుగారు రాజాబిరుదము వారి వంశస్థు లందఱికుండునట్లు చేసెను. దికరరావు మిగిలిన దినములను నిర్వ్యాపకముగానే గడపి 1896వ సంవత్సరమున జనవరి 9 వ తారీఖున కాలధర్మము నొందెను.

దినకరరావు పలుచని మొగముగలిగి పచ్చనిచాయ గలిగి యౌవనమువ స్ఫురద్రూపియయి యుండెను. అతని యాకృతి పొట్టి గనుండును. అతనిమాటలు మిక్కిలి మృదువులయి యెదుటివారిం దనపక్షము ద్రిప్పుకొనున ట్లుండును. అతఁడు నిశ్చలమయిన చిత్తస్థైర్యము గలవాఁడు. ఇంగ్లీషు విస్తారము రాకపోవుటచే నతఁడు దొరలపద్ధతి నెప్పు డవలంబింపలేదు. స్త్రీవిద్య మొదలగు సంస్కారము లతని కిష్టములులేవు. కాని సంస్థాన పరిపాలనమునందు మంచి బుద్ధిశాలియయి సహాయుండయి పని చేసెను.



కాశినాథత్రియంబకతెలాంగు.

కాశీనాథ త్రియంబక తిలాంగు

ఈతఁడు గౌడసారస్వత బ్రాహ్మణుఁడు. ఈతని పూర్వులు రమారమి నూఱు సంవత్సరముల క్రిందట గోవానగరమునుండి వచ్చి బొంబాయిలో కాపురముండిరి. ఈయన 1850 వ సం॥రం ముప్పది యవ యాగష్టున జన్మించెను. ఇతఁడు బాబురామచంద్రతిలాంగుగారి రెండవ కుమారుఁడు. ఆయన పెదతండ్రి త్రియంబక రామచంద్ర తిలాంగుగారు సంతానహీనుఁడగుటచే నీపిల్లవానిని పెంచుకొనెను తండ్రియుఁ బెదతండ్రియు నవిభక్తులై కలిసియుండినందున జ్యేష్ఠుఁడే యింటిపెత్తనము చేయుచుండెను. పెంచుకొన్న పెదతండ్రి పూర్వాచారపరాయణుఁడై మిక్కిలి నీతిమంతుఁడైనందున కాశీనాథత్రియంబక తిలాంగు నొద్దనుండిన సకలసద్గుణములువానియొద్దనుండి నేర్చుకొనినవేయని చెప్పవచ్చును. కొంతకాల మతఁడు స్వభాష చిన్నబడులలో నేర్చుకొని యింగ్లీషు చదువుటకు 1859 వ సం॥రమున యెల్ఫిన్స్టన్ పాఠశాలకుఁ బోయెను. ఈపాఠశాలలో నుపాధ్యాయులు కేవలము జీతములకొఱకేగాక బాలురవిద్యాభివృద్ధికై పాటుపడుచు వచ్చిరి. అప్పుడు విద్యనేర్పిన గురువులలో నారాయణమహాదేవ పరమానందుఁ డొకఁడు. కాశీనాథుఁడు పాఠశాలవిడిచిన తరువాత నయితము కార్యాలోచన మేదియైనఁ జేయవలసి వచ్చినప్పుడు తన గురువగు పరమానందుని సహాయముగోరుచు వచ్చెను.

1864 వ సంవత్సరమునఁ గాశీనాథుఁడు ప్రవేశపరీక్షయందు కృతార్థుఁడై కళాశాలలోఁ బ్రవేశించెను. ఆకళాశాలాధ్యక్షుఁడును నందలి యుపాధ్యాయులును బాలురప్పగింప వలసిన పాఠములు చదివించుటయేగాక బుద్ధిసూక్ష్మత హెచ్చుటకై యితరగ్రంథములు

గూడ చదివించుచు వచ్చిరి. అట్టి గురువులయొద్ద విద్యనభ్యసించుటచే నతఁడు రెండేండ్లకే యనగా 1866 వ సం॥రమునందు పట్టపరీక్ష యందును మఱి రెండేండ్లకే యనగా పదునెనిమి దేండ్ల ప్రాయమునసే యమ్. ఏ. పరీక్షయందుఁ గృతార్థుఁ డయ్యెను. పిమ్మట మఱి రెం డేండ్లకు యల్. యల్. బి. అనగా బియల్ పరీక్షలో దేరెను. పట్టపరీక్ష యందుఁ దేఁన మరుసటి సంవత్సరమే యనగా పదునేడేండ్ల ప్రాయ మునసే యతఁడు తాను చదువుకొన్న కళాశాలలో నొక యుపాధ్యా యుఁడుగా నియమింపఁబడి బాలుర కింగ్లీషు సంస్కృతము నై దేండ్లు నేర్పెను.

1772 వ సంవత్సరమున కాశీనాథుఁడు న్యాయవాదికిఁ గావల సిన మఱికొన్ని పరీక్షలయందును గృతార్థుఁడై బొంబాయి హైకో ర్టులో న్యాయవాదియయ్యెను. కుశాగ్రబుద్ధియగు నీతఁడు పరీక్షల యందుఁ గృతార్థుఁ డగుటయేగాక బహుగ్రంథములు శోధించి చదివి పలు తెలుఁగుల తన జ్ఞానము నభివృద్ధిచేసికొనుచు వచ్చెను. ఆయన యమ్. ఏ. పరీక్షయందుఁ దేరినవాఁడయ్యు దా నది వఱకు నేర్చుకొనిన విద్య మిక్కిలి స్వల్పమనియు “ అనంతశాస్త్రం బహువేదితవ్యం అల్పశ్చకాలో బహవశ్చ విఘ్నాః” అను నార్యోక్తి నిబట్టి నేర్చుకొనవలసినదే విస్తారముగ నున్నదనియుదెలిసికొని న్యాయ వాది పరీక్షకుఁ జదువునప్పుడే యింగ్లీషులోనున్న భాషాగ్రంథములు తత్త్వశాస్త్రములు మొదలగు వానిని జాగరూకతతో జదివెను. ఇట్లు జదువుటయేగాక యతఁడు బొంబాయిలో నాకాలమున వెడలుచుం డిన హిందూప్రకాశము మొదలగుకొన్ని పత్రికలకు వ్యాసములు వృత్తాంతములు వ్రాసిపంపుచు నెడ నెడ జ్ఞానాభివృద్ధి కరములగు సభలకుఁ బోయి పెద్దలిచ్చు నుపన్యాసములను విని స్వయముగఁ దా నుపన్యాసములువ్రాసి చదివి యెల్లవిధముల బుద్ధిని వికసింపఁజేసెను.

ఈ విధముగా నభ్యాసముచేసికొన్నంగాని లౌకిక వ్యవహారములలో దాను ప్రవేశించుటకు తగనని యట్లుచేయుచు వచ్చెను.

అదియునుంగాక బొంబాయిలోనున్న ప్రార్థనసమాజమందిరమున కతఁడు ప్రతివారముబోయి యచ్చట జేయఁబడిన మతబోధలను శ్రద్ధతోవిని గృహమునకు జనినపిదప దాను విన్నదంతయుం గాగితముమీద వ్రాసి "మీరుచెప్పినదంతయు నేనుసరిగా గ్రహించివ్రాసితినోలేనో చూడుఁ"డని యుపన్యాసమిచ్చిన వారియొక్కకే పంపుచుండెను. ఇతరులు చెప్పినవిషయములను సరిగా గ్రహించినవెగావిశదము జేయుట నెఱుంగనివాఁడుప్రపంచమునందెప్పటికినిగొప్పవాఁడు కాలేఁడని భావించి యతఁడీవిధము జేయుచువచ్చెను. అవ్విధంబున నొరులయుపన్యాసములువిని జ్ఞాపకముంచుకొని మరల వ్రాయుచుండుటచేతనే యతఁడు మిక్కిలి సరసమైనశైలితో నింగ్లీషు వ్రాయుటయు మాటలాడుటయు నతనికలవడెను. ఆంగ్లేయభాషలో మిల్లు, కార్లైల్, స్పెన్సరు, మొదలగు మహాత్ముల గ్రంథములయం దతనికత్యంతమభిరుచి. సంస్కృతముమీఁద వానికున్నయభిమానమునకు మేరలేదు. బాపుశాస్త్రియనునొకపండితుఁడు విద్యార్థులకుఁబాణినివ్యాకరణము చెప్పుచుండ నతఁడక్కడకుఁ బ్రతిదినముబోయి యాశాస్త్రమునేర్చుకొనెను. ఆనందగిరివ్రాసిన శంకరవిజయము మరొకరువ్రాసినశంకరవిజయముఁజదివి కాశీనాథుఁడుశంకరాచార్యుని చరిత్రము సంగ్రహముగా నింగ్లీషుప్రవ్రాసివిద్యార్థులసమాజమునొద్దఁజదివెను. ఈకాలముననేయీవిద్వాంసుఁడు భగవద్గీతల నింగ్లీషులోనికిభాషాంతరీకరణముచేసెను. ఈభాషాంతరీకరణమునసంస్కృతవిద్యాపారంగతుఁడగు మోక్షమూలరు పండితుఁడు తానుప్రకటించిన ప్రాచీనపవిత్రగ్రంథములలోఁజేర్చి లోకమునకు వెల్లడించెను.

ఆదినములలోఁ జేసినమనఃపరిశ్రమమునుబట్టియే కాశీనాథుఁడు యవాదియైనపిదప నతిబుద్ధిసూక్ష్మతతో వ్యాజములనడపి ప్రతిష్ఠ

సంపాదింపఁగలిగెను. ఆతనివాగ్ధోరణియాతనియుక్తులు న్యాయాధిపతుల మనస్సులనాకర్షించుచు నతనినేర్పుస్వల్పకాలములోనే వానికి గొప్పపేరు దెచ్చెను. న్యాయాధిపతులు సయితముపలుమారువాని ప్రజ్ఞలకుఁ బొగడుచువచ్చిరి. సంస్కృతమునందతఁడు మిక్కిలి ప్రజ్ఞావంతుఁడగుటచే హిందూశాస్త్రముల మీఁద వచ్చినవ్యాజములలో నతనియాలోచనపరిమాణమైయుండెను. జడ్జీలుసయితము సందిగ్ధ విషయములలో నీతనిసహాయమపేక్షించుచువచ్చిరి. యూరపుఖండమున గ్రీసుదేశమున హోమరనుకవి ఈలియడ్డను నొకగ్రంధమువ్రాసెను. దాని యందలి కథ యచ్చముగ రామాయణమువలెనుండును. అందుచేసంస్కృతపండితుఁడగు వీబరను దొరగారు రామాయణమురచించినవాల్మీకిమహర్షి హోమరుకవి వ్రాతలను దొంగిలించెనని వ్రాసిరి. కాశీనాథతిలాంగు హోమరుకవిత్వమువాల్మీకికవిత్వము, జాగ్రత్తతోబరిశోధించినచదివివీబరనుగారివ్రాతలు వట్టితప్పులని ప్రమాణములతో జూపుచు నొకవ్యాసము వ్రాసెను. ఆవ్యాసమును హిందూదేశస్థులేగాక యింగ్లాండువారు సయితము చాలమెచ్చిరి.

అతఁడు 1873 వ సం॥రమున మొట్టమొదటబహిరంగమైనసభలోనికివచ్చి యొక్కయుపన్యాసమిచ్చెను. ఆసభయప్పుడుక్రొత్తగాబుట్టిన యుప్పుచట్టమునుగురించి చర్చించుటకు జరిగెను. అతఁడునాడిచ్చినయుపన్యాసము నింగ్లీషుపత్రికలు స్వదేశపత్రికలుసమానముగఁ గొనియాడెను. అతనినోటినుండి యాంగ్లేయభాష వెలువడునప్పు డాంగ్లేయులుసయితము తమభాషకిట్టిసౌకుమార్యముగలదాయని తెల్లబోయి చూచెడువారు. న్యాయవాదియై విశేషప్రసిద్ధిగాంచుచు రాజకీయవ్యవహారములలో మిగులఁబనిచేయుచుఁదీరికలేకయున్నను గాశీనాథతిలాంగు సంస్కృతభాష పరిశ్రమము మరువలేదు. భర్తృహరినీతిశతకవడ, ముద్రారాక్షసనాటకము నింగ్లీషుటిప్పణము వ్రాసిప్రకటించెను. అను

దృష్టినొందక యతఁడుపురాతనతామ్రశిలాశాసనములశోధించి వాని లోగలవిషయములనులోకమునకు తెలియజేయుచువచ్చెను. 1876వసం॥ రమున నతఁడు బొంబాయి యూనివరిసిటీలోసభికుఁడయ్యెను. 1877వ సం॥రమున నీదేశమందున్న తెల్లవారినిమాత్రముఁ'వాలంటరీకోరు'అను పేరుగల యొకవిధమయినసేనలోఁ జేర్చుకొనవలసినదనియునల్లవారిని మాత్రమందుఁజేర్చికొనగూడదనియుదొరతనమువారిని వేడుకొనుటకు బొంబాయిలో నొకసభజరిగెను. ఈతిలాంగుగారును ఫిరోజిషామెహ తాగారును మఱియొక సభచేసి నల్లవారినందుజేర్చికొనకపోవుటవారి నవమానించుటయని నొక్కిచెప్పి యుపన్యాసమిచ్చిరి.

1878 వ సం॥రమున గవర్నరుజనరల్‌గారగు లిట్టను ప్రభువుగా రు స్వభాషలలోఁ బ్రకటింపఁబడుచున్నవృత్తాంతపత్రికలనడచివేయుట కొ కచట్టము నిర్మించిరి. ఆకాలమున నీతిలాంగుగారట్టిచట్టముధర్మవిరుద్ధ మని హిందూప్రకాశపత్రికలో పలుమారు వ్రాసిరి. 1879 వసం॥ర మున లిట్టను ప్రభువుగారు దూదిసరకులమీఁదకట్టినసుంకములనుగూ ర్చి తిలాంగుగారావన్నులు దేశానర్థకములని యుపన్యాసములిచ్చియూ ప్రభువుపరిపాలనము దేశాభివృద్ధి పరాఙ్ముఖమని తెలియజేసిరి. 1880వ సంవత్సరమున నప్పటిగవర్నరుగారుతిలాంగుగారికిజాయింటుజడ్జీపని ని చ్చెదమని చెప్పఁగా నతఁడక్కరలేదనియెను. పిమ్మటదొరతనము వా రాయనకులాకాలేజిలోనుపాధ్యాయత్వమిచ్చిరి. ఈపనియదివఱకుదొ రలకేగాని స్వదేశస్థులకిచ్చుటలేదు. 1882 వ సం॥రమునగవర్నరుజన రలుగారగు రైఫన్‌ప్రభువుగారు వానిని"ఎడ్యుకేషనల్‌కమీషను లో సభికుఁడుగానేర్పరచిరి. హిందూదేశములోవిద్యాభివృద్ధియెట్లుగఁచున్న దో కనుగొనుట కీసభ యేర్పడినది. ఈసభలోఁగూర్చుండి యతఁడుప ...పరిశ్రమకురైఫన్ ప్రభువుగారు మిక్కిలి సంతసించి వానికి సి. ఐ. ఇ అనుబిరుదమునిచ్చిరి. ఆసభలో నతనిసహకారులైపనిజేసిన కొం

దఱుపాఠశాలలో నీతిపుస్తకములు కొన్నిటిని బాలురచేతఁజదివించి నీతిప్రత్యేకముగా నేర్పవలయునని వాదింపనీతిబాలురుచదువుచున్నట్టి ప్రతిగ్రంథములో నున్నదనియుఁ బ్రత్యేకముగానేర్పనక్కఱలేదనియుఁ దిలాంగుగారు వారివాదములఁ బూర్వపక్షముచేసి వ్రాసిరి.

1883 వ సంవత్సరమున ఇల్బర్టుబిల్లుఅనునదిహిందూదేశమునందంతటఁ జర్చింపఁబడెను. దొరలేవైన నేరములు చేసినప్పుడునల్ల న్యాయాధిపతులు వారినివిచారింపవచ్చుననియీచట్టముయొక్కముఖ్యాభిప్రాయము. ఇది దొరల కనిష్టమై వివాదకారణమయ్యెను. ఆదినములలో నీతిలాంగుగారు బొంబాయిలో నొకసభచేయించి యీబిల్లుచాల శ్రేయోదాయకమని న్యాయమనియుపన్యసించెను. ఈయుపన్యాసమునువానిప్రతిపక్షులుసయితముఁ గొనియాడిరి. 1884 వ సంవత్సరమున నితఁడుబొంబాయి గవర్నరుగారి శాసన నిర్మాణసభలో సభికుఁడుగా నియమింపఁబడిహైకోర్టుజడ్జియగువఱకు నాసభలోఁబనిచేసెను. ఆసభలోనుండిమహారాష్ట్రదేశమునకుముఖ్యముగాబొంబాయినగరమునకుఁ జాల నుపకారముచేసెను. 1885 వ సంవత్సరమున నితఁడుహ్యూందొరగారితోఁగలసి దేశీయమహాసభాస్థాపనకుఁబాటుపడిప్రథమసభ బొంబాయిలోఁజరిగించెను. 1888వ సం॥రమున నలహాబాదులోఁ జరిగిన దేశీయమహాసభకితఁడుపోయి శాసననిర్మాణసభలలో స్వదేశీయసభికులనుమునుపటికంటెనెక్కువగాఁజేర్పవలసినదని దొరతనమువారికి విన్నవించుచు నుపన్యసించెను. ఇదియాతనియుపన్యాసములలో శ్రేష్ఠమయినది. 1889 వ సం॥రమున దొరతనమువారీయనను బొంబాయిహైకోర్టులో జడ్జిగా నేర్పరచిరి. ఈయుద్యోగమునకీయనసర్వవిధములచేతఁదగినవాఁడని యాకాలమునఁ దెల్లవారునల్లవారునను భేదములేక యెల్లవారుఁగొనియాడిరి. అతఁడెంత మంచిన్యాయాధిపతియో వానితీరులెంతశాస్త్రబద్ధములుగనెంతయుక్తియుక్తములుగనున్నవో వానిని

వినవారందఱు నెఱుంగుదురు. హిందూదేశములో రాయల్ ఏషియాటిక్కు సొసయిటీలను పేరకొన్నిసమాజములుగలవు. సంస్కృతము మొదలగుప్రాగ్దేశవిద్యలనుగూర్చి పరిశ్రమ జేయుటయు తామ్రశిలాశాసనాదుల త్రవ్వించిచక్కఁ జేయుటయునీసభయొక్క ముఖ్యోద్దేశము. ఈసమాజమొకటి కలకత్తాలోను మఱి యొకటిబొంబాయిలో గలదు బొంబాలోనున్నసభకు శ్రీతిలాంగుగారినిదక్కినసభికు లగ్రాసనాధిపతిగ జేసిరి. ఈగౌరవము నల్లవారికెవ్వరి కిదివఱక గలిగియుండలేదు. అతఁడు హైకోర్టుజడ్జియైదొరతనమువారి కొలువులోఁ బ్రవేశించినను దేశీయమహాసభమీఁదనాతనికిగల యభిమానమురవంతయేనియుఁగొఱతపడదయ్యె. 1892 న సం॥ రాంతమందు వాని దేహస్థితి చెడిపోయెను. అదిమొదలొక సంవత్సరము రోగపీడితుఁడై 1893న సం॥ శెప్టెంబరు 1న తారీఖున నీమహాపురుషుఁడు లోకాంతరగతుఁడయ్యెను.

అతని మరణమునుగూర్చి తెల్లవారు నల్లవారునను భేదములేక హిందూదేశస్థులగు జనులందఱు మిక్కిలి దుఃఖించిరి. ఈసచ్చరిత్రుని జ్ఞాపకార్థము బొంబాయినగరములో నొకపెద్దసభ చేయబడెను. ఆసభకప్పటి గవర్నరుగారగు హారిసుప్రభువుగారగ్రాసనాధిపత్యము వహించిరి. ఆకాలమున బొంబాయిహైకోర్టులో మొదటిజడ్జిగారు తిలాంగునుగూర్చి చెప్పినమాటలలోఁ గొన్నిఁటి నిం దుదాహరించుచున్నాము. "తిలాంగు విషయమున నేనుచెప్పవలసిన ముఖ్యాంశ మొకటియున్నది. హిందువులలో నిప్పుడనేకు లింగ్లాండు మొదలగు దేశములకుఁ బోయిరి. అచ్చట నాగరికతను జనుల యాచారములను వ్యవహారధర్మములను స్వయముగఁజూచి నేర్చికొనుచున్నారు. తిలాంగు స్వదేశమునెన్నఁడు విడిచిపెట్టకపోయిన కేవలము పాశ్చాత్యుల గ్రంథముల సహాయముననే వారి యాచారవ్యవహారాదులను నాగరికతనుజూచిన వారికంటె నెక్కుడుగ గ్రహించెను. ఈయన స్వదేశమగు బొంబా

యి రాజధానిని దఱచుగ విడిచియుండలేదు. నేనెఱిఁగినంతవఱకీయ న స్వదేశము నొక్కసారిమాత్రము విడిచెను. ఈవిధముగ నతఁడు పశ్చిమదేశ గ్రంథములంజదివి ప్రాగ్దేశాచారముల నవలంబించి ప్రవ ర్తించుటచే జనుల కందఱకతఁడు సర్వదాయిష్టుఁడై మెలంగెను. ఈతని మరణముచేత హిందూదేశమంతయుమహానష్టమునుబొందినది.

కాశీనాథతిలాంగు న్యాయవాదియై యుండుట రాజకీయవ్యవ హారములలోఁ బ్రవేశించి ప్రతిష్ఠగాంచుట మొదలగు పనులతోనే కా లముబుచ్చక సంఘసంస్కారముపై చాలనిష్టముగలిగియుండెను. హిం దూ వితంతువుల వైధవ్యమునుగూర్చి యాయన పలుమారు దుఃఖిం చెను. అతిబాల్య వివాహములు వాని కిష్టములేదు. ప్రస్తుతము హిం దూదేశమునందున్న వర్ణభేదము దేశమున కరిష్టదాయకమని యతఁ డు తలంచెను. అతఁడు చనిపోవుటకుముందు పదియేండ్ల క్రిందటివఱ కు దొరతనమువారు మన సంఘవిషయములలో జోక్యము కలుగఁజే సికొనఁగూడదని యభిప్రాయపడుచు వచ్చెను. కాని యిటీవల 18J0 వ సంవత్సరమందు 12 సంవత్సరముల లోపుబాలికలకు గర్భాదాన ము చేయఁగూడదని దొరతనమువారు చట్టము నేర్పఱచినప్పుడు హిం దువులంద ఱదికూడదని వాదించుచుండ నప్పుడు తిలాంగుగారు తన తొంటి యభిప్రాయమును మార్చుకొనియెను. దేశాధిపతులు ప్రజ లను సర్వవిధముల గాపాడవలసిన భారము వారిపై నున్నది గనుక దురాచారముచేత బాధపడు ప్రజలనుగూడ రక్షింపవలసినదే యని యాయన యభిప్రాయము. అందుచే దురాచారముల నడచుచట్టము ల నేర్పఱచుటలో దొరతనమువారు మంచిపనియే చేసెనని యాయ న సంతోషించెను. బొంబాయి నగరమందు స్థాపింపఁబడిన స్త్రీపున ర్వివాహసంఘమునకు సభాధ్యక్షుఁడుగా నుండెను. సంఘసంస్కార ముమీఁద నభిమాన మెంతయున్నను తిలాంగు తన సంస్కారపద్ధ

తుల నాచరణములోనికిఁ దెచ్చినవాఁడు కాఁడు. అతిబాల్యవివాహము లిష్టములేకున్నను 1893 వ సంవత్సరమున నితఁ డెనిమిదేండ్ల వయస్సుగల తనకూఁతునకు వివాహముచేసెను. హిందూదేశస్థులనేకులిదివిని ఐకకంఠ్యముగ వాని నధిక్షేపింప నప్పుడాయన తానుచేసినది తప్పేయనియుఁ దనశరీరస్థితి చెడిపోవుటచే తాను బ్రతికియుండగానే కూఁతురు వివాహము చేయవలయునని యట్లుచేసితిననియు జాలవిచారించెను. “ప్రమాదో ధీమతామపి” యన్నట్లు ఎంతవారికైన లోపము లుండకపోవుగదా! ఇది తప్ప యతనియం దేవిధమయిన లోపములు లేవు. ఈయన మరణమువల్ల హిందూదేశమున కంతకు గొప్పనష్టము గలిగెనని జనులు భావించిరి.

విశ్వనాథనారాయణమండలికుఁడు

మహారాష్ట్రమండలి కొంకణగిరి జిల్లాలో మురుదా యనునొక గ్రామముగలదు. విశ్వనాథనారాయణమండలికుఁడు 1833మార్చి 8వ తారీఖున జన్మించెను. ఈమండలీకకుటుంబము పూర్వకాలమునందు శ్రీమంతులగు పీష్వాలతో సంబంధబాంధవ్యంబులు కలిగియుండుటచే మిగుల గౌరవాస్పదమైనది. ఇతనిముత్తాత పీష్వాలయొద్దనొకమండలమునకు సుబేదారుగానుండెను. ఈమండలికుఁడు మొట్టమొదట నక్షరాభ్యాసము తనతాతయగు దుండిపంతునొద్దచేసి యనంతరము గ్రామపాఠశాలలోఁ జేరెను. అక్కడ కొన్నినాళ్ళు గడచుటయుఁ దలిదండ్రులు వాని కింగ్లీషు చెప్పించుటకై రత్నగిరికిఁ బంపిరి. అతని యదృష్టవశమున నచ్చటిపాఠశాలలో నుపాధ్యాయశిరోమణియగు రావుబహదూరు రామచంద్రబాలకృష్ణుఁ డనునతఁడు ప్రధానోపాధ్యాయుఁడై యుండుటచే నక్కడ యున్నంతవఱకు విద్యఁ జక్కఁగనేర్చి పిమ్మట బొంబాయికిఁబోయి యెల్ఫిన్‌స్టనుపాఠశాలలో నతఁడుచేరెను. పూవుపుట్టగానే పరిమళించునన్నట్లు మండలికుఁడు విద్యార్థియై యున్నానాఁడె తెలివికిఁ బ్రసిద్ధికెక్కి పీజుస్కాలరుషిప్పను పేరుగల విద్యార్థివేతనమును సంపాదించెను. అక్కడ నుపాధ్యాయులుగనున్న దొరలనేకులు తెలివితేటలంబట్టి యాబాలునిమీఁద నెంతయు నభిమానముఁ బూనిరి. ఆపాఠశాలలోని యొజ్జల కతనిమీఁద నెంతయభిమానము నెంతగౌరవముఁ గలవో యీక్రిందిపనివలనం దెలియవచ్చును.

ఆబడిలోనున్న గణితశాస్త్రపండితుఁ డొకమాసము సెలవుపుచ్చుకొనెను. మండలీకుఁ డప్పటికింకను విద్యార్థియై యుండినను పాఠశా

విశ్వనాధనారాయణ మండలికుఁడు.

లాధికారు లామాసముదినములు పనిచేయుటకు జాలుఁడని యెంచక వానినే నియమించిరి. పాఠశాలాధికారులు వానిప్రజ్ఞకు మిక్కిలి సంతసించి 1851-52 సంవత్సరములకు వ్రాసిన సంవత్సరచర్యలో వానినిగూర్చి యిట్లువ్రాసిరి. "విశ్వనాథనారాయణ మండలికుఁడు మిక్కిలి చురుకుగల విద్యార్థియని మేము నిరుడే వ్రాసితిమి. ఈసంవత్సరపు విద్యార్థులలోఁగూడ నతఁడే ప్రసిద్ధుఁడు. ఈసంవత్సరము పేటన్ పండితుఁడు సెలవుదీసికొనిన నెలలో నితఁడాపనిచేసెను. చేసినపని మిక్కిలి తృప్తికరముగా నున్నది."

ఆకాలమున బి. ఏ. మొదలగు పరీక్షలులేవు. అప్పుడున్న పరీక్షలలోఁ గొప్పదానియందు మొదటివాఁడుగ మండలికుఁడు కృతార్థుఁడయ్యెను. విద్యాసమాప్తమగునప్పటి కతనికిఁ బందొమ్మిదవయేడు. అందుచే నతని గురువులలో నొకఁడు సీమకుఁబోయి శివిలుసర్విసుపరీక్షకుఁ జదువుకొమ్మని వాని నెంతయుఁ బురికొల్పె. కాని వాని కుటుంబ మట్టియుద్యమమునకు బూనియ్యకపోవుటచే నతఁడు చిన్నతనమందే యుద్యోగము సంపాదింపవలసి వచ్చెను. సింధుదేశమున దొరతనమువారి యేజంటుగానుండి ‘సర్ లిగ్రాండు జేకబుదొర’గారు కార్యనిర్వాహకమందుఁ దనకు సహాయుకుఁ డొకఁడు కావలయునని కోరఁగాఁ గొందఱుదొరలు మండలికు నప్పగించిరి. ఆజేకబుదొరగారు తనక్రిందపనిచేయుచున్న మండలికునిమీఁదజాలనభిమానముగలిగి యాకాలపు గొప్పదొరల పరిచయము వానికిఁ గలుగఁజేసెను. మండలికుఁడు తనయొద్ద కనఁబడు సుగుణముల కన్నిఁటికిఁ గారణమాదొరలతోఁ దానుచేసిన స్నేహమేయని పలుమారు చెప్పుచువచ్చెను. అతఁడు వారియొద్దనుంచి నేర్చికొనిన గుణములివి—పట్టుదలతోఁ బని చేయుట. కార్యదీక్ష. సంపూర్ణ స్వతంత్రబుద్ధి. మఱియు నీగుణంబులగు మెఱుగుబెట్టిన దొకటిగలదు. అదియేమన తనయుర్హాకృత్యము

నం దేమరిపాటులేక పనిచేయుట.

ఈతఁడు కొంతకాలము పాఠశాలలుపరీక్షించు సహాయపరీక్షకుఁడుగా, బిదపసబుజడ్జీగాఁ బిమ్మట దొరతనమువా రచ్చువేయించిన పుస్తకముల విక్రయించు నుద్యోగస్థుఁడుగ ననంతరము వచ్చుబడిపన్నునుగూర్చి యేర్పడిన కమీషనరుగారికి సహాయుఁడుగానుండి యుద్యోగములుచేసెను. కాని దొరతనమువారి యుద్యోగములో నున్నంత కాలముతన తెలివితేటలు బయలుపడవనియు దొరతనమువారుమిక్కిలి దయకలిగి యిచ్చినపక్షమున నింకనొకటిరెండుగొప్పయుద్యోగములే యిచ్చెదరనియు నల్లవారికి తెల్లవారితోసమానముగ నుద్యోగము లీయరనియు నతఁడునిశ్చయముగ నమ్మి హైకోర్టులో న్యాయవాదిగ నుండుట మంచిదనితలంచి సర్కారుపనిమాని న్యాయవాదిపరిక్షయందుగృతార్థుఁడై 1863 వ సంవత్సరమున హైకోర్టులోవకీలుగఁ జేరెను. అప్పుడుహైకోర్టులో బుద్ధిసూక్ష్మత గల న్యాయవాదులు లేనందున మండలీకునివంటి నేర్పరికి వ్యాపకమున కవకాశముండెను. అప్పటిన్యాయవాదులలో నింగ్లీషునేర్చినవారు మిక్కిలితక్కువ. జడ్జీలలోసహిత ముహిందూధర్మశాస్త్రము నిశ్శంకముగా నేర్చినవారులేరు. అందుచేత నతఁడు స్వల్పకాలములోనే చాలధనము సంపాదింప గలుగుట యేగాక జడ్జీల గౌరవమునుగూడ సంపాదించెను. ప్రజలు తనకిచ్చిన వ్యాజ్యములలోనున్న సంగతులు శ్రద్ధతోఁ జదివి వచ్చినవారి కేదో యుపకారము చేయవలయునని తలంచువాఁడు. వేళమీరి యెన్నడు కోర్టునకుఁబోవలేదు. ఒకసారి పునహాకోర్టునకుఁ బోవలసియుండ బొంబాయిహైకోర్టులోనున్న పనితొందరవల్ల జాగుచేసి యతఁడుపొగ బండి నందుకొనలేకపోయెను. బండిమించినది నే నేమిచేయనని వంకబెట్టక సొమ్ముచూచుకొనక బొంబాయినుండి పునహాకు తనకు ప్రత్యేకముకపొగబండి నేర్పరచుకొని యుచితసమయమున కక్కడకుబోయి

వానిపక్షమువాదించెను. మఱియొకసారి కొంకణదేశమున రత్నగిరికిఁ బోవలసియుండి యక్కడ బాగయోడ దొరకక యుండుటచే ప్రత్యేకమొకపొగయోడ తననిమిత్తము దెప్పించుకొని చాలసొమ్మువ్యయముచేసికొని యాయూరు చేరెను.

అతఁడు న్యాయవాది శబ్దమును సార్థకము చేసిన న్యాయవాది వ్యాజ్యములు తనయొద్దకుఁదెచ్చినవారికి రుసుమెన్నఁడునీయలేదు. తనకెంతెంత ధనమిచ్చెదనన్నను సరేయోడినవారిపక్షముననెన్నఁడునతఁడు పనిచేయువాఁడుకాఁడు. ఆకాలమందు హైకోర్టులో నసలువ్యాజ్యములవిచారణకు నప్పీళ్లవిచారణకుఁ గొంతభేదముండెను. అప్పీళ్ళవిచారణలోనున్నంతసులువు అసలువ్యాజ్యములలో లేదు. అందుచేత రెండింటికి సమానమైన సౌకర్యములు సేయుమని మండలీకుఁడు జడ్జీలను వేడెను. వారట్టివిధముగా నంఱకుఁ జేయుట కిష్టపడక కావలసినయెడల మండలీకునకు మఱియొకరిద్దరికి నుపకారముచేయుదు మనిరి. మండలీకుఁడు స్వప్రయోజనపరుఁడు గాకపోవుటచే నందఱకు లేని సౌకర్యము తనకొక్కనికి నక్కరలేదని నిరాకరించె. 1884 వ సంవత్సరమున గవర్న మెంటువకీలుగానుండిన నానాభాయి హరిదాసు హైకోర్టు జడ్జీగా నియమింపబడెను. అందుచే దొరతనమువారు మండలీకుని తమ వకీలుగా నియమించుకొనిరి.

మండలీకునిగొప్పతనము చాలధనము సంపాదించిన న్యాయవాదియనియేగాదు. అతఁడుబొంబాయిలో మునిసిపల్ కమీషనరుగా నుండెను. అదియునుగాక గొప్పసంస్కృతపండితుఁడు. మఱియు దేశభాషనుజక్కనేర్చియందనేకగ్రంథములువ్రాసెను. కొంతకాలమువార్తాపత్రికలనుగూడ నడపెను. దొరతనమువారి శాసననిర్మాణ సభలోఁ జాలకాలము సభికుఁడై యుండెను. వేయేల! అతఁడు జనులవిశ్వాసమునకుఁ బాత్రుఁడై యెల్లవిషయముల వారి కాలమందు నాయకుఁడై

యుండెను. 1865వ సం॥ దొరతనమువారతనికి "జస్టిసుఆఫ్ దిపీస్" అను గౌరవోద్యోగమునిచ్చిరి. ఇది బెంచిమేజస్ట్రేటు మునిసిపల్ కమీషనరు మొదలగు నుద్యోగములవలె జీతములేనిదై గౌరవమున నధికారము గలదై యుండెను. ఆకాలమందు బొంబాయిలో మునిసిపాలిటీ యేర్పడనందున నగరముయొక్క పారిశుధ్యమును విచారించు నధికార మీజస్టిసునందేయుండెను. ఈజస్టిసులందఱికి నొకప్రధాన పురుషుని దొరతనమువారేర్పరచి కార్యనిర్వాహకమంతయు వానికప్పగించిరి. అతఁడు మిక్కిలి బుద్ధిశాలియు లోకానుభవము గలవాఁడునయినను ధనమనావశ్యకముగా వ్యయము చేయుటయు నప్పుడప్పు డపహరించుటయు మొదలగుదురభ్యాసముల కలవడెను. విశ్వనాథ నారాయణ మండలికుఁడు వాని చెడుచేఁతలకిష్టపడక యెదిరించి వానిగుట్టు బయలుపెట్టఁజూచెను. స్థితిగతులు బొత్తుగ చెడిపోయినవని దొరతనమువారుగ్రహించి 1872 వ సంవత్సరమున మునిసిపాలిటియేర్పరచి బొంబాయినగరమును జస్టిసుచేతిలోనుండి తప్పించి యామునిసిపాలిటికి నప్పగించిరి. మండలీకుఁ డీసభలో ప్రధానసభికుఁడై యుండెను.

1879 వ సంవత్సరమందును మరల నెనుబదియవ సంవత్సరమందును మండలీకుఁడు బొంబాయి మునిసిపల్ చేర్మన్‌గా నియమింపఁబడెను. బొంబాయివంటి మహానగరమందు నంతటియధికారముచేయుటమిక్కిలికష్టమైనను మండలీకుఁడు నిష్పక్షపాతముగను న్యాయముగను జనసమ్మతముగను వ్యవహరించెను. 1862 వ సంవత్సరమం దతఁడుబొంబాయి యూనివర్సిటీలో సభికుఁడయ్యెను. అందుండిపలుమారు లాయన మహారాష్ట్రభాషలోను సింధుభాషలోను గుజరాతుభాషలోను పదునాలుగు సంవత్సరములు బి యల్ పరిక్షలోను బరీక్షకుఁడుగానుండెను.

1874 వ సంవత్సరమునం దాయన బొంబాయి దొరతనము

వారి శాసననిర్మాణసభలో సభికుఁడయ్యెను. ఈసభలో నిదివఱ కనేకులు సభికులై యుండిరి కాని ప్రజలపక్షమువాఁడెవఁడే. అదివఱకు దొరతనమువారు సాధారణముగా మహారాజులను జమీందారులను నేర్పరచుటచేవారందరు గంగిరెద్దులవలె దొరలేమాటలాడిన నామాటలకే తలలూఁచుచుండెడివారు. మండలీకుఁడు గవర్నమెంటువారిచే నేర్పరుపబడినను ప్రజలకు నష్టమునచ్చు శాసనము లేర్పరచునప్పుడు ప్రజాపక్షముఁబూని పోరాడుచు ధైర్యశాలి యెంతపనిచేయగలఁడో యదిచూపెను. శాసన నిర్మాణసభకుఁ మండలీకునట్లు మరియొకరు తగియుండరు. ఏలయన నతఁడు పరిపూర్ణపండితుఁడు బుద్ధిశాలియగు న్యాయవాది. గొప్పయనుభనశాలి. దేశస్థితిగతులు చక్కఁగానెఱిఁగిన వాఁడు. మఱియుస్వతంత్రుఁడు. అధికారులు కన్నెఱ్ఱజేసిన మాత్రమున వెఱచి తన యభిప్రాయములను దాఁచుకొనువాఁడు కాఁడు. ఒకసారి వానినొక గవర్నరు బెదరించెనఁట. మండలీకుఁడు వానియాటలు తనయొద్ద సాగిరావని మెల్లగఁ జెప్పి మందలించెనఁట. అతఁడు బొంబాయి శాసననిర్మాణసభలో వరుసగా మూఁడుసారులు సభికుఁడుగా నేర్పరుపఁ బడెను.

1884 వ సంవత్సరమునం దతఁడు గవర్నరుజనరల్‌గారగు రిపన్ ప్రభువుగారిచేత వారి శాసననిర్మాణసభలో సభికుఁడుగా నియమింపఁ బడెను. బొంబాయిదేశస్థుఁడు గవర్నరుజనరలుగారి యాలోచనసభలో సభికుడగుట కదియే మొదలు. ఆసభలోఁ గూర్చుండుటకతఁడు బొంబాయినుండి పోవునప్పుడు పౌరులు వాని నుత్సవముజేసి మన్నించిరి. కలకత్తా చేరినతోడనే యానగరవాసులుగూడ వానిని సన్మానించిరి. రైపన్‌ప్రభువుగారి తరువాత వచ్చిన డఫ్రిన్‌ప్రభువుగారును వానికి శాసననిర్మాణసభలో సభికత్వమిచ్చి గౌరవించిరి. అతఁడు సభికుఁడుగా నున్నకాలమున వచ్చుబడిపన్ను కట్టుట మొద

లగు కార్యము లనేకములు జరిగెను. అట్టిపన్నులు కట్టఁగూడదని యతఁడు శక్తివంచన లేక దొరతనమువారితోఁ బోరాడెను. దేహారోగ్యము సరిగా నుండక పోవుటచే నతఁడు 1887 వ సంవత్సరమున దనసభికత్వము మానుకొనెను. కలకత్తానుండి యతఁడు వచ్చినతోడనే దేశమున కతఁడు చేసినయుపకారంబులంబట్టి వాని పేరు స్థిరముగా జ్ఞాపకముండునట్లు చేయవలెనని జేసిన తీర్మానము నామోదించుటకు బొంబాయిలో నొకసభ జరిగెను. ఏటేట నొకబంగారు పతకమతని పేరఁ జేయుంచి సంస్కృతభాషావిషయమున మంచి యుపన్యాసము వ్రాసిన విద్యార్థికి బహుమానమిచ్చుటకును వాని ప్రతిమ నొకటి చెక్కించి జనులందఱు చూచుచుఁ బోవుస్థలమున నుంచుటకును నాయకజనులు నిశ్చయించిరి. పూనాపట్టణమందుఁగూడ నట్టిసభ యొకటి జరిగెను. అక్కడిజనులును వేదశాస్త్రపండితులకు నతనిపేర నేటేట బహుమానమీయ నిశ్చయించిరి.

మండలీకుఁడు విద్యాభిమాని, గ్రంథకర్తయని యీవఱకే చెప్పియుంటిమి. మొదట నతఁడు దేశభాషలోఁ గొన్ని గ్రంథములురచించెను. అతఁడు విద్యార్థియైయుండినప్పుడే యింగ్లీషులో లాటరీయను పేరనున్న చిన్నకథను మరాటీభాషలోనికిమార్చి బహుమానమందెను. తరువాత రాజకీయవ్యవహారములం దుపయుక్తశాస్త్రమును భాషాంతరీకరించెను. సింధుదేశమున నున్నకాలమున సింధుభాషను నేర్చుకొని దానిలోఁ జిన్నవ్యాకరణమును వ్రాసెను. గుజరాతీభాషలోఁ జాలపరిశ్రమ జేసి యాయన ఎల్ఫిన్‌స్టన్ దొరగారుచేసిన హిందూదేశచరిత్ర నాభాషలోనికి మార్చెను. ఆగ్రంథము పాఠశాలలలో విద్యార్థులకు బఠనీయగ్రంథముగా నేర్పఱుపఁబడెను. 18[illegible]7 వ సంవత్సరమున నతఁడు హిందూలాసంగ్రహమను నొక గ్రంథము నింగ్లీషున వ్రాసిదానికిఁ గుజరాతిలో నర్థము వ్రాసెను. అదియిప్పటి కనేకులు చదువుచుందురు. మఱియు

నతఁడు కింకరసులేనప్పుడు రచించిన సాంఖ్యశాస్త్రమును స్వభాష లోనికి మార్చెను. సవిలయశాసనము క్రిమినలు ధీశాసనము కలెక్టర్ల చేతులలో నుండి తప్పింపవలసినదని యాయన యభిప్రాయము. ఈవిషయమునయా యన కొంతవ్రాసెను. ప్రాచీన శాసనాదులను గూర్చి బొంబాయిలోను న్న యాసియాఖండ సంఘమునందనేకములగు నతఁడుపన్యాసములు చ దివెను. నిబంధన వ్యాఖ్యానములలో నతఁడు యాజ్ఞవల్క్యస్మృతిని నిర్దో షముగా నతఁడచ్చువేయించి దానికింగ్లీషున భాషాంతరీకరణము గా వించి ప్రకటించెను. హిందూధర్మశాస్త్రము గవర్నమెంటువారికి సరి గ దెలియునని యాతఁడు నమ్మలేదు. ఆగ్రంథముగను మండలీకుఁడు చక్కఁగా నింగ్లీషున వ్రాసి దానిలో హిందూధర్మశాస్త్రముయొ క్క చరిత్రము దానిస్వభావము నిర్ణయించి స్మృతులను పరిశోధించి స్మృ తిప్రమాణములకు సమానములగు నాచారములనేకములనుదాహరించి భి న్నములగు నాచారవ్యవహారములను గూర్చి యుక్తియుక్తములగు గ్రంథ పుస్తకమునొకటి యుపయుక్తముగు నట్లు చేసెను. ఆతఁడు పరిశోధకప్రజ్ఞుఁడని కూడ నీవలనఁ జెప్పవచ్చును. అతఁడు "స్వదేశీయమిత్రము" అను పేర నొక యింగ్లీషుపత్రికను 1864 వ సంవత్సరమున స్థాపించి 1871 వ సంవత్సరమువఱకుఁ బ్రకటించెను.

అతఁడుచేసిన దేశోపకారమునెఱిఁగి దొరతనమువారుగూడ వానిని చాలగౌరవించిరి. అతఁడుపూర్వపు యిన్స్పెక్టరుపని మానుకొ నినప్పుడు దొరతనమువారతనికి నుద్యోగవశమున నిచ్చిన రావుసాహేబుబిరుదము నుంచుకొనవచ్చుననియుత్తరువిచ్చిరి. గవర్నరుగారి యాలోచనసభలో సభికుఁడుగనున్నకాలమున బొంబాయినగరమునకు షరీఫ్గనుండుమని యతనిని గోరిరి. కాని యతఁడు రెండుపనులుఁ జేయుటకుఁ వీలులేదని యాయుద్యోగము వద్దని చెప్పెను. 1876 వ సంవత్సరమున గవర్నరుజనరలుగారగు లిట్టనుప్రభువుగారు బా

లురపాఠశాలలలోఁజదువవలసినపుస్తకముల నిర్ణయించుటకొక్కసభ కూర్పఁదలచి యందు మండలీకు నొకసభికునిగ నియమించెను. కాని యతఁడు శరీరదౌర్బల్యముచేత నందుండుటకు వీలులేదనిమానుకొనెను 1877వ సంవత్సరమున విక్టోరియారాణిగారుచక్రవర్తినిబిరుదమువహిం చినప్పుడు "హిందూదేశమిత్రజ్యోతి" యనునర్థమువచ్చు సి. యస్. ఐ. యను బిరుదును దానితో నొకవెండిపతకమును దొరతనమువా రతని కిచ్చిరి.

మండలీకుఁడు 1889 వ సంవత్సరము మేనెల తొమ్మిదవతేదీని కాలధర్మమునొందెను. ఆదినమునందే బొంబాయి మునిసిపాలిటీవారు సభగూడి విశ్వనాథనారాయణమండలికుఁడుమునిసిపల్కమీషనరుగా నుండియు జస్టిసుగానుండియు బొంబాయినగరమునకు జేసినమహోప కారమునకు గృతజ్ఞులై యతనిమరణమునకు విచారించిరి. అతనిమరణ మునుగూర్చి శోకించుచు జనులు మహారాష్ట్రదేశమునందంతటసభలు జరిపిరి. ఆతనికిసంఘసంస్కరణమిష్టము లేదుకానివితంతువులకుఁదలగొరి గించుటయతఁడొప్పుకొనలేదు. పూర్వాచారములన్నియు నతనికిష్ట ములయినను విదేశీయములుమరల గొన్నికట్టుబాటులమీఁదసంఘమున జేర్చుకొనవచ్చునని యతఁడు చెప్పుచువచ్చెను. ఆతనిభార్య యెల్లప్పుడు రోగిష్ఠయైయుండెను. అయినను మండలీకుఁడు సత్ప్రవర్తకుఁడైదయా ళువై యామెకుపచారములుచేయించుచు నేకపత్నీవ్రతస్థుఁడై కాల ముబుచ్చెను. ఆతఁడు బంధువులకు చాలధనసహాయము జేసెను. భా ర్యకోరికమీఁద నామెయుం దానువెండితోఁ దులాభారముదూఁగియా సొమ్ముదానముచేసెను. ఆకాలమందెల్లవిధముల నంతవాఁడు లేఁడని యెల్లవారు నంగీకరించిరి.



మహాదేవగోవింద రెనడీ.

మహాదేవగోంద రెనడీ

మహాదేవగోవింద రెనడీ 1842 వ సంవత్సరం జనవరి 20 వ తేదీని జన్మించెను. ఈయన మహారాష్ట్రబ్రాహ్మణుఁడు. తండ్రి కొల్హాపురసంస్థానములో నుద్యోగస్థుఁడు. రెనడీ ఎల్ఫినిష్టనుకాలేజీలో చేరక్రమముగా విద్యాభ్యాసముచేసి 1862 వ సంవత్సరము బి. ఎ. పరీక్షయందును 63వ సంవత్సరమందు యమ్, ఎ. పరీక్షయందును కృతార్థుఁడై బంగారుపతకమును బహుమానము బడసి 1866 వ సంవత్సరమున యల్.యల్.బి. పరీక్షయందుఁ దేరెను. విద్యముగించినపిదప నతఁడు గవర్నమెంటువారికిమహారాష్ట్రభాష నింగ్లీషులోనికి భాషాంతరీకరించునుద్యోగమునం బ్రవేశించెను. తరువాతనతనికిఁగొల్హాపురసంస్థానములో జడ్జీపనియైనది. 1868వ సంవత్సరమందు మున్ను దాను చదువుకొన్న కళాశాలలోనేఇంగ్లీషుభాషాపండితుఁడుగ నతఁడు నియమింపబడుటచే జడ్జీపని స్వల్పకాలములోనే మానుకొనెను. హిందూదేశస్థు నొకనిని దొరతనమువా రింగ్లీషుభాషా పండితుఁడుగ జేయుటమనకుపూర్వగౌరవము చూపుటగదా! బొంబాయిరాజధానిలో విద్యాశాఖకధిపతిగాఁ (పనఁగా డైరెక్టరుగ) నుండినసర్ అలగ్జాండరుగ్రాంటుదొరగారు సీమకుబోవునపుడు రెనడీగారిని గూర్చి మాటలాడుచు నతఁడాకళాశాలకు భూషణమనియు నతనిబుద్ధిసూక్ష్మత నిరుపమానమనియుమిక్కిలికొనియాడెను. ఒకసారి రెనడి విద్యార్థిగానున్నప్పుడు గ్రాంటుదొరగారు వానిని దేశచరిత్రలలో బరీక్షించితనప్రశ్నలకతఁడిచ్చినయుత్తరములనుమున్ను దానుచదువుకొన్న యాక్స్ఫర్డుకాలేజీకి పంపెను. హిందూవిద్యార్థుల తెలివితేటలు సీమలోనున్నదొరలకుఁదెలుపుటకైయతఁడీపని జేసెను. చెన్నపట్టణములోనుండిన పూండిరంగనాథము మొదలియారు

గారికి నిట్టిగౌరవమే జరిగెను. ఆయనను గణితశాస్త్రములో బరీక్షించి డైరక్టరుగారు ఉత్తరపుకాగితములను సీమ కంపిరఁట. రెనడీగారి కద్భుతమైన జ్ఞాపకశక్తి గలదు. ఏపుస్తకమయిన నొకసారి జదివి యందలి ముఖ్యసారాంశమును మరల వ్రాయగలిగినవాఁడఁట. కళాశాలలో నతఁ డుపాధ్యాయుఁడుగనుండి బాలురకిచ్చు నుపన్యాసములు మిగుల మనోహరములుగను బహుశాస్త్రార్థ సమేతములుగ నుండుటచే తోడియుపాధ్యాయులు డైరక్టరుదొరగారుఁగూడ వాని కడకుఁబోయి విద్యార్థులతోపాటు గూర్చుండి యాయుపన్యాసములను వినుచుండెడివారఁట. ఏశాస్త్రమునుగూర్చియైన స్వయముగా నాలోచింపఁదగిన శక్తిగలవాఁడు హిందూదేశములో రెనడీయొక్కఁడే యని మఱియొక దొరగారు పలికిరఁట. 1871 వ సంవత్సరమున రెనడీగా రుపాధ్యాయపదవి మాని పునహానగరములో సబుజడ్జిగా నియమింపఁబడెను.

ఆ సంవత్సరమందే రెనడీ యడ్వొకేటు పరిక్షయందుఁ గృతార్థుఁడయ్యెను. దీనిచేత నతనికి నింగ్లీషుబారిష్టరుతో సమానమైన గౌరవముగలిగెను. అదిమొదలుకొని యతఁడు మృతినొందు వఱకు న్యాయాధిపతి పదవియందేయుండెను. 1871 వ సంవత్సరము మొదలుకొని పదిసంవత్సరములవఱకు నక్కడక్కడ సబుజడ్జిగానుండి 1881 వ సంవత్సరమందు పునహాసతారా చిన్నచిన్న కోర్టులను బరీక్షచేయుటకు జడ్జిగా నేర్పరుపబడెను. 1884 వ సంవత్సరమున నతఁడు స్మాలుకాజుకోర్టు జడ్జిగా నియమింపఁబడెను. అక్కడనున్నప్పుడె డక్కను కాలేజీలో రెనడీ ధర్మశాస్త్రవిషయమై కొన్ని యుపన్యాసముల నిచ్చెను. 1886 వ సంవత్సరమం దతఁడు గవర్నమెంటు వారిచేత హిందూదేశముయొక్క యాదాయ వ్యయములనుగూర్చి యేర్పరుపఁబడిన సంఘములో సభికుఁడుగా నియమింపఁబడి యప్పుడుగావించిన

యుత్కృష్ట సహాయమునకు దొరతనము వారిచేత సి. ఐ. ఇ. అను బిరుదము నందెను. అదియునుగాక దొరతనమువారు వానినెన్నియో పర్యాయములు గవర్నరుగారి శాసననిర్మాణ సభలో సభికుడుగ నేర్పఱచిరి. 1893 వ సంవత్సరము నవంబరు నెలలో కాశీనాథత్రియంబక తెలాంగుగారు లోకాంతరగతుడగుటచే దొరతనమువారా నెల 23 వ తేదీని రెనడీగారిని హైకోర్టు జడ్జిగా నియమించిరి. నాడు మొదలుకొని రెనడీ తన మరణపర్యంతము నాయుద్యోగము మిక్కిలి సామర్థ్యముతో నిర్వహించెను.

ఆయన 1901 వ సంవత్సరము జనవరి 17 న తారీఖున మృతి నొందెను. అతని మరణమునుగూర్చి హిందూదేశస్థులు తెల్లవారు సమానముగ శోకించిరి. దానింబట్టియే జనులకతనియం దెంత యనురాగము గలదో తెలియగలదు. ఇటీవలవారిలో నెవరిమరణము జనులకు రెనడీ మరణమంత విషాదమును గలిగింపలేదు. ఏలయన రెనడీ తన దేశస్థులయొక్క హృదయానురాగమునే సంపాదించుకొనెను. హిందూదేశమునందున్న ప్రతిపట్టణమందు వానిమరణముగూర్చి శోకించుటకును వానికుటుంబమును పరామర్శచేయుటకును సభలు జరుపబడెను. ఆ సభలలో హిందువులేగాక సర్వమతములవారు సర్వాభిప్రాయములవారును వానియున్నత గుణములను మెచ్చి తమ విషాదము దెలిపిరి. బొంబాయి హైకోర్టు జడ్జీలు వానిమరణము తమహైకోర్టునకేగాక యావద్దేశమునకు నష్టకరమని వక్కాణించిరి. ఇండియాగవర్నమెంటువారు సయితము వానిమరణమునకు వగచుచు వాని సామర్థ్యాదులంగూర్చి యీ క్రిందివిధముగ వ్రాసిరి. అత్యధిక సామర్థ్యము పాండిత్యము స్వతంత్రస్వభావము గలిగిన రెనడీగారి మరణముచేత దేశమంతయు గొప్పనష్టముపాలైనది. అతడు హైకోర్టుజడ్జీ యగుటచేత నతనికంతకీర్తి రాలేదు. ఆతని యుత్తరగుణసమూ

ముందర నున్నతఁడని యెంతమాత్రమును బలుకరాదు. ఆతఁడుపరి పూర్ణసంశీలుఁడు. స్వాతంత్ర్యప్రియుఁడు. గాఢదేశాభిమాని. రాజనీతి విశారదుఁడు. గొప్పసంఘసంస్కర్త. మతసంస్కారకుఁడు. ఇంకపరివర్తనమును గురించి విచారించితిమా కేవల మృషియని చెప్పవలయును. అతఁడు ప్రార్థన సమాజములో సభికుఁడు. మనస్సునందతఁడు బ్రహ్మసమాజ మతస్థుఁడు. అతని మరణానంతరము ప్రస్తుతము బొంబాయి హైకోర్టులో జడ్జిగానున్న చందావర్కరుగారు చిన్నమత విషయమునకోపన్యాసముచేసి రనడీగారి జీవితము గొప్పదగుటకుఁ గారణము నీ క్రిందివాక్యములతోఁ జెప్పెను.

"రనడీగారు భక్తిపరుఁడనియు నతని జీవితమునందు బ్రధాన కీలక మేదనియు నన్ని మీరడుగుదురు. ఒక్కమాటలోఁ జెప్పెదను. అతని మహత్త్వము భక్తియే గొప్పతనమునకుఁ గారణము. అతని యభిప్రాయప్రకారము మతమనఁగా నైకాంత్యమునకుఁ బోక ముక్కుమూసికొని మూలఁగూర్చుండుటగాదు. రాజకీయ విషయములలోను సాంఘిక విషయములలోను మతవిషయములలోను విద్యావిషయములలోను మనుష్యుఁడు ప్రవేశించి శక్తివంచనలేక దగ్గఱిలో నున్న జనుల కుపకారముచేయుటయే మతమని యాయన యభిప్రాయము. పనిలో నతఁడు ప్రవేశించినను దానిని మనఃపూర్వకముగా చేయువాఁడు. రనడీ యొక్కొక్కప్పుడే దేవాలయమునందో పురాణార్థముల జనులకు బోధించుటయు మఱియొక్కప్పు డార్యసమాజము వారిపక్షమున నుపన్యాసమిచ్చుటయు యావజ్జీవము బ్రహ్మసమాజ సిద్ధాంతముల ప్రకారము నడచుకొనుటయుఁ బ్రార్థన సమాజములో సభికుఁడై యుండుటయు మన మెఱుంగుదుము. అదిచూచి కొందఱు రనడీయొక్క మతమేదో తెలియక యతని చరిత్రము పరస్పర విరుద్ధమని తలఁచి యతని మొగముమీఁదనే మాటలనుచు వచ్చిరి.

కాని దానియర్థము వారు గ్రహింపఁలేరు. అతని చరిత్రము విస్పష్టముగాదు. మంచిమతములన్నిఁటియందు సహేతుక సమానాదర ముంచుటచే నతఁడే మతములోను జేరినవాఁడు కాఁడు. కొందఱాతని మతమిది విశాలహృదయమనియు నతఁడు సర్వసమానుఁడనియు సుమము భావింపవలసియున్నది. అతఁడు బ్రహ్మసమాజము మేమునగా ప్రపంచ ముత్తరోత్తర వృద్ధిగలదగుటచే క్రొత్త మతము లనేకములు పొడమినప్పుడు వైరుధ్యములులేక సామ్యముగల విషయములలో నన్ని మతములవారిఁ గూడి పని చేసి దేశముద్ధరింపవలయునని."

అతఁడు తక్కిన రాజకీయ విషయములలో జేసినపని యటుండనిండు. ఆయన సంఘసంస్కార విషయమున జేసినపని కే దేశస్థు లందఱు మిగుల కృతజ్ఞులై యుండవలయు. అన్ని సంస్కారములకంటె సంఘసంస్కారమందే యతఁ డత్యాదరము గలిగి యుండువాఁడు. ఈవిషయమున నతఁడు తన యావచ్ఛక్తిని ధారవోసెను. ప్రతిసంవత్సరము దేశీయమహాసభ జరిగెడి పట్టణములోనే సంఘసంస్కరణసభగూడ గావింపుచు నప్పటికి విధిగా వానుబోవుచు నచ్చట సాంఘిక విషయమైన యుపన్యాస మొకటి తానుచేయుచు నా సభలో జరిగిన చర్చలను సంగ్రహము వెచ్చపెట్టి ముద్రింపించుచు మరణకాలమువఱకుఁ (ననగా బదునైదుసంవత్సరములు) ఆ మహాత్ముఁడు పాటుపడెను. ఆయన నిజముగా మూఢాచారపరాయణులతో యుద్ధముచేయుచునే ప్రాణములు విడిచెనని చెప్పనచ్చును. ఏలయన నతనిమరణమునకు నిరువదిదినములకు్రిందట దేశీయసభతోటిపాటు లాహోరునగరములో సంఘసంస్కరణ సభజరిగెను. రనడే రోగపీడితుఁడై కదలలేక మంచమెక్కి యుండుటచే నక్కడకెప్పటియట్ల పోలేక వ్రాఁతమూలముగ దానియ్యవలసిన యుపన్యాసమును వ్రాసి యొకరిచే జదువ బంపెను. ఆరోగ్యము మరల తిరుగ లేదు. ఇతఁడు సంఘ

సంస్కారపక్షమువాఁడగుటచే వాని యభిప్రాయములు మతాంతరు లగు తెల్లవారియభిప్రాయము లేయని భావించి, దేశస్థులలోఁ గొందఱు తమకతఁడుచేయు నుపకారమెఱుంగక వానిని నవ నాగరికుఁడని పూర్వాచార ద్వేషియని దేశమునకు శత్రువని యీ ప్రాంతముల సంస్కర్తల నిచ్చటివారు నిందించినట్లె నిందింపఁజొచ్చిరి.

సంఘసంస్కారము యుక్తమైనదని తగిన హేతువులు చెప్పి మన స్వదేశస్థులను మెప్పించుటకే యతఁడెంతో కష్టపడుచుండ కొంద ఱాంగ్లేయులుగూడ నవనాగరికుల నధిక్షేపించుచు వచ్చిరి. రెనడీ వారికిఁగూడ దగిన యుత్తరములు చెప్పవలసివచ్చెను. కాశీనాథ త్రియంబక తెలాంగుగారు కొన్నియెడల పూర్వాచారపరాయణుఁడై కొన్ని విషయముల నవనాగరికుఁడై రెనడీవలెనే యుండి సంఘ సంస్కారమునకై పాటుపడెను. అతనిని బూర్వాచార పరాయణులుఁ గొందఱు తెల్లవారుగూడ విరుద్ధవర్తనుఁడని యధిక్షేపించిరి. ఆ యధిక్షేపణలకు రెనడీ ప్రత్యుత్తరముల జెప్పుచు తెలాంగుగారి వర్తనమందు విరుద్ధమేమియు లేదని యీ క్రిందివిధముగ మాటలాడెను. ఈసంగతులతఁడు ముఖ్యముగఁ దెల్లవారినుద్దేశించియే పలికెను. "పరిపూర్ణమైన నాగరికతగలిగిన మీరు ప్రస్తుతప్రాచీననాగరకతల మధ్యమునబడి పరస్పరవిరుద్ధములగు రెండుమతములసందుననిరికియగచాట్లపడుచున్న మమ్ముంజూచి మావర్తనమునర్థముచేసికొనలేక యున్నారు. అట్టిద్విభావమక్కర లేదనితలంచువారుమాలో కొందఱు న్నారు. వారియభిప్రాయమే మన దేశకాలపాత్రములబట్టి మన కేమార్పులు రాలేదనియుమనపూర్వులున్నట్లెయితరప్రపంచ సంబంధము లేక మనముగూడ నుండవచ్చుననియు, వారిమాట యటుండనిచ్చి రెండవ పక్షము జాతము ప్రాచీనమైనదంతయు జచ్చినదనియు దానితో మన కేసంబంధము లేదనియుప్రస్తుతనాగరికతనుభవిష్యత్కాలమందువచ్చు

నాగరికతనుసమగ్రముగ నవలంబించిబ్రతుకుటయే మనకు గార్యమని యు దలంచువారును మనలో ననేకులుగలరు. ఈయిద్దరకు నడుమ మరియొక జిన్న తెగగలదు. ప్రాచీననాగరికతలో మంచినంతను మన మవలంబించుచు నీశ్వరేచ్ఛచేత మనదేశమున వ్యాపించుచున్న నవనా గరికతనుగూడవదలక దానిలోనున్న మంచినిగూడ గ్రహించియీరెం టికి సమన్వయముచేసి మనములాభమునొందవలయుననియునీతెగవా రు దలంచుచున్నారు. ఇట్లు మే ముభయ పక్షములు నవలంబించుటచే మామిత్రులు శత్రువులుగూడ మాయభిప్రాయమునర్థముచేసికొన లేక యున్నారు. గతించిన మనమిత్రుఁడు వేదాంతమార్గప్రదర్శకుఁడుధీరుఁ డు నగు తిలాంగునిశ్చయముగనీ తెగలో జేరిననాఁడే. ఆనచ్చరిత్రుఁడు క్రొత్త నాగరికతను పడలి పూర్వాచారపరాయణుఁడై యుండినను లేక పూర్వాచారమును విడలిన నవనాగరికుఁడై ప్రాచీనమంతయువదలుకొని యుండినను పాపమింత స్వల్పకాలములో మృతినొందక దీర్ఘకాలముజీ వించియుండుననినేను తలంచుచున్నాను. అట్లయినచో నతనికి విచార ము లుండకపోవుట. దేహస్థితిస్వస్థిగా చెడకయుండును. తిలాంగువా నిమిత్రులు పడియెడుమనఃపరితాపమునుమనయింగ్లీషుమిత్రులెఱుఁగక ద్విభావము గలవారను వారి నధిక్షేపించుచుందురు.

రాజకీయ వ్యవహారములయందునువానికిమిక్కిలిప్రవేశముగల దు. అతఁడుగవర్న మెంటువారి యుద్యోగస్థుఁడై ననుదేశీయమహాసభ నుస్థాపించినవా రనేకాంశములలో నితనియాలోచనమును గ్రహించు చువచ్చిరి. బొంబాయిరాజధానిలో నతనిచేతసవరింపఁబడనిగొప్పమ హాజరులు వానియాలోచనము పుచ్చుకొననిఘనకార్యములువానిచేత నుపదేశముపొందని ఘనపురుషులు లేరఁట. ఆతనికి దేశచరిత్రములయం దుమిక్కిలి యభిరుచి. కడసారియతఁడుచదివినపుస్తకముగూడనొక దే శచరిత్రయే. స్వదేశపువ్యాపారమును వృద్ధిపొందుటయుశిల్పవిద్యాదు

లుమనవారు నేర్చుకొనుటయునున్నప్పుడే మన దేశము బాగుపడునని యాయనతలంచెను. మహారాష్ట్రబలోదయమను పేర రెనడీ యింగ్లీషులో నొకచరిత్రమువ్రాసెను. అందుఁ బ్రథమభాగముమాత్రమే ముగిసినది. రెండవభాగము ముగియకమునుపే మృత్యుదేవతయొక్క క్రూరహస్తము వానినెత్తుకొనిపోయెను. ఆగ్రంథముముగిసినపక్షమున హిందువులకెంతయోలాభముకలిగియుండును. హిందువులు మిక్కిలి దురదృష్టవంతులగుటచేత నేయాయుదారశీలుఁడంతత్వరలోఁ జనిపోవుటయు నట్టియుద్గ్రంథము ముగియకపోవుటయుసంభవించెను. అతనియుద్యోగముకన్న పాండిత్యముకన్న వానిసద్గుణములేజనులకతనియందనురాగమును బెంచినవి. మహాధికారియయ్యు నతఁడందఱికినొదిగియుండును. మహాపండితుఁడయ్యు శిష్యుఁడట్లువినయమున నేర్చుకొనఁజూచును. పరులమనస్సులునొవ్వకుండ తనయభిప్రాయమును జెప్పుచుండును. ఈతఁడు, రామమోహనరాయలు, విద్యాసాగరుఁడు, దేవేంద్రనాథటాగూరు కేశవచంద్రసేనుడు, ఆనందమోహనబోసు మొదలగుమహనీయులవలె మతాదిసంస్కారములలోఁగార్యశూరుఁడుగా నుండలేకపోయినను మనసులో సంస్కారమన్న మిక్కిలియిష్టముగలవాఁడు. ఈయనచరిత్రము హిందూదేశస్థులు చిరకాలము జ్ఞాపకముంచుకోఁ దగినది.

నవాబు సర్ సలార్ జంగు.

నవాబు సర్ సలార్‌జంగు

సలారుజంగు 1829 వ సంవత్సరమున హైదరాబాదునగరమున జన్మించెను. ఈయన సంపూర్ణమైనపేరు మీర్తురాలీఖాను. ఈయన గొప్పకుటుంబములోనివాఁడు. ఈయనపూర్వులు మహమ్మదుగారికి ప్రియపట్టణమగు మదీనానగరము నుండి హిందూస్థానమునకువచ్చి హైదరబాదులో కాపురముండిరి. ఇంగ్లీషువారికిని మైసూరుప్రభువగుటిప్పు సుల్తానునకు 1799 వ సంవత్సరమున యుద్ధముజరిగినకాలమున సలారుజంగుయొక్క ముత్తాతమీరాలమ్మను నతఁడు హైదరాబాదునిజాముగారియొద్ద దివానుగానుండెను. హైదరబాదుసంస్థానమునకు చందూలాలు దివానుగానున్నప్పుడు సలారుజంగుయొక్క తాతమనీరుల్ముల్కు వానితోగలసి రాజ్యతంత్రమునడిపెను. అనంతరము చందూలాలు మంత్రిపదమును మానుకొన్నపుడు సలారుజంగుపినతండ్రిసురాజుల్ముల్కు నిజాముచే దివానుగా నియమింపఁబడెను. కాబట్టి హైదరాబాదుదివానుపదవికి సలారుజంగునకు న్యాయమైన హక్కుగలదు. హక్కున్నను దనకది యంతటి పిన్నవయస్సులో వచ్చునని యాయన యెన్నడు తలంపలేదు.

సలారుజంగుపాఠశాలకుఁబోయి యెన్నఁడువిద్యనేర్వలేదు. వచ్చిన చదువేమోయింటియొద్దనేచదువుకొనెను. చిన్నతనమందేయతఁడరబ్బీ పారసీ భాషలయందు బ్రవీణుఁడై యింగ్లీషొకవిధముగానేర్చుకొనెను. కుమారదశయందే తండ్రియుఁ దాతయుమృతినొందుటచేవానివిద్యాభ్యాసమునకు విఘ్నములుగలిగియుండవచ్చును. అతనికి బాల్యమున నుపాధ్యాయు నేర్పరచియింటివద్దనేడుసంవత్సరములువిద్యనేర్పించెను. ఆకాలమునం దతఁడు బుద్ధికుశలతనుగాని యేకార్యమైనచేయుటకుతమకమునుగానిజూపినట్లుగనపడదు. అతఁడుజదువుకొన్నగ్రంథములనుబట్టివి

చారించితిమాయతఁడు మంత్రిపదములోనుండి గనఁబరచిన రాజనీతి చాతుర్యము మొదలయినవి వానికెక్కడినుండి వచ్చెనో తెలియదు. ఆతనితండ్రి తల్లి లెక్కలలో వానిని నేర్పరిగఁ జేయుటకు వారిగ్రామముల మీఁద నేఁటేటవచ్చు శిస్తుల మొత్తము మొదలయిన సంగతులు తెలియఁజేయుచుండినను సలారుజంగు వాఁడంత శ్రద్ధ చేసి వినినట్లు కనఁబడదు హైదరాబాదులో నుండు గొప్పవారి కొడుకులు విశేషవిద్యావంతులు కాకపోయినను గొప్ప యుద్యోగములలోఁ జిన్నతనమందే నియమింపఁబడుదురు. అందుచేతనే యిరువదియేండ్ల ప్రాయమున సలారుజంగు తాలూకాదారుగ నేర్పరుపఁబడెను. తాలూకాదారనగా జిల్లాకలక్టరని యర్థము. ఈయుద్యో మునందతఁడెనిమిదిమాసములు మాత్రమే యుండినను నాస్వల్పకాలములోనే హైదరాబాదు రాజ్యములోనే నేలపన్నుల విషయమై జ్ఞానమంతయు సంపాదించెను. 1853 వ సంవత్సరమందు వాని పినతండ్రి మృతినొంద నిజాముమంత్రిపదము వహించి రాజతంత్రము నడుపుటకు సలారు జంగును బిలిచెను. బాలుఁడగు సలారుజంగు శుభమైన యావార్త విన్నప్పుడు మనసులో నెట్లు తలంచెనో తనమిత్రునకు వ్రాసిన యీయుత్తరమువలన దేటపడును. “రాజ్యతంత్ర నిర్వాహణమువలన ముఖ్యముగా నిటువంటి సమయమున సంభవించు మనోవ్యధలకు లోనుగాకుండ నాపినతండ్రి జాగీరుగ్రామములఁ జక్కఁబెట్టుకొనుచు నేను హాయిగానుండిన బాగుండును. ఈయుద్యోగము నేను మనసారనంగీకరించుటలేదు. ఇది యంగీకరించనిపక్షమున నేను నాకుటుంబము పూర్తిగఁ జెడిపోవుదుము. ఇదిగాక తెల్లవారు నల్లవారు సమానముగ నీయుద్యోగమునంగీకరింపవలసినదని నన్ను బ్రేరణము చేయుచున్నారు గావున సంస్థానమును జిక్కులలోనుండి పయికి లేవనెత్తుటకును గ్రమతలేనిస్థలముల గ్రమత నిలుపుటకు నాయావచ్ఛక్తి వినియోగించి పనిచేసెదను.”

అతఁడన్నట్లే చేసెను. ఆకాలమున హైదరుబాదు సంస్థానమెంత

యథమస్థితిలో నుండవలెనో యంతయథమస్థితిలో నుండెను. ఖజానాలో ధనమూలేదు. నేలపన్ను వసూలుచేయుపద్ధతి మిక్కిలి పాడుగనుండెను. బేరారు రాచూరు మూలదుర్గము మొదలగుజిల్లా లప్పటికి గొన్ని దినములక్రిందటనే పాతఁబాకీక్రింద నింగ్లీషువారి కియ్యఁబడెను. ఈజిల్లాలలో నున్న జాగీరుదారులు జమీందారులు వారివారి జాగీరుల నింగ్లీషువారికి లోఁబరచవలసినదని యాజ్ఞాపింపఁబడియు దానికొప్పు కొనక తమకుఁగలిగిన నష్టములకు నిజాముగారిమీఁద వ్యాజ్యముల వేయఁ దలంచిరి. నిజాముగారి బంధువులజీతముల నిచ్చుటకుఁ గావలసిన సొమ్ము నచ్చుట కాధార మేదియు గానఁబడదయ్యె. నిజాముగారి సొంతనగలు సీమలో తాకట్టుపెట్టఁబడెను. మొత్తముమీఁద హైదరాబాదు రాజ్యముమీఁద నప్పటికున్న ఋణము మూఁడుకోట్లు. మహాంధకారపుంజము వలెనున్న యీసంస్థానమును బ్రకాశమానముగఁజేయ సలారుజంగు పూనుకొని మొగమోటము భయము నన్నవి విడిచి వినినవారందరు మహాద్భుతము నొందునట్లు వ్యవహారము నడిపెను. ఇరువదియవయేఁట మంత్రియై యంతపని నెవ్వఁడు నిదివఱకుఁ జేసియుండలేదు. అతఁడు చేసిన మొట్టమొదటి మార్పే మన సంస్థానములో మిగుల బలవంతులై యెవరి లక్ష్యములేని యరబ్బులను లోఁగతీయుట. వారిజీతముల క్రింద నేఁటేఁట విశేషధనమగుచుండును. వారు చేయుపని రవంతయు లేదు. అందుచే నతఁడు వారికొలు వక్కఱలేదని తీసివేసెను. అంతతోఁబోక సలారుజంగు తాలూకాలలోను జాగీరులలోను గొలువుండిన యరబ్బులను రోహిలాలను పఠానులను దీసివేయవలసినదని తాలూకాదారులకు జాగీరుదారులకు నుత్తరువులు వ్రాసెను. అట్లుద్యోగములు భూములు పోయిన యరబ్బులహక్కులు విచారించి న్యాయమిచ్చుట కతఁడొకకోర్టు గట్టించెను. మఱియు నరబ్బులకున్న జాగీరులు

ముఖాసాలు జమీందారీలు లాగుకొనుటకు నిశ్చయించుకొనెను. ఈవిధమునఁ గృతనిశ్చయుఁడై సలారుజంగు తాను మంత్రిపదమును బూనిన సంవత్సరములోనే రెండువేల యరబ్బులను, రెండువేల పఠానులను మఱియందరి యితరసేవకులను గొలువునుండి తొలఁగించి యేడాదికి నలువదిలక్షల రూపాయలు శిస్తువచ్చు జాగీరులను సంస్థానమునకు గలిపెను. పూర్వ మాసంస్థానములో గుత్తదారీపద్ధతి ప్రకారము శిస్తువసూలుచేయఁబడుచు వచ్చెను. అనఁగా తాలూకాదారు ప్రతిగ్రామము నొక్కొక్కనికి శిస్తునిమిత్త మిజారాకిచ్చుట. ఈపద్ధతివలన గుత్తదారులు పన్ను లెక్కువ కట్టుటయు రహితు లవియిచ్చుకొనలేక బాధపడుటయు సంభవించెను. సలారుజంగు దాని నివారింపఁదలఁచి నమ్మఁదగిన మనుష్యులను శిస్తువసూలుచేయ నియమించి గుత్తదారీపద్ధతి తగ్గించెను. తాలూకాదారు లదివఱకు రయితులవద్ద వసూలుచేసిన శిస్తులో నాలుగవ వంతు మూడవవంతు నొకప్పుడు సగము హరించుచు వచ్చిరి. క్రొత్తమంత్రి యట్టిద్రోహులను నిజోద్యోగములనుండి తప్పించెను. అదివరకు సంస్థానములోఁ బ్రబలియుండిన దొంగతనము బందెపోటు మొదలగు దార్జన్యములను మహాకఠినుఁడై యడంచెను. సమర్థమైన యీపరిపాలనముచేత 1856 వ సంవత్సరమునాఁటికి సంస్థానమునకు భూమివలన వచ్చుశిస్తు హెచ్చెను. గొప్పఖజానా యొకటి స్థాపింపఁబడెను. హైదరాబాదు సర్కారువారియందు బ్రజలకుఁ గౌరవ మతిశయించెను. సంస్థానమంతటను మంచి మార్పులు పొడసూపెను.

1857 వ సంవత్సరమున నింగ్లీషుదొరతనమువారిమీఁద సిపాయిలు పితూరీ చేసిరి. ఇదియే నానాసాహేబు పితూరి యనికూడ చెప్పుకొందురు. ఆకాలమున నింగ్లీషువారికి సలారుజంగు చేసిన సహాయ మింతింత యనరానిది. ఉత్తరహిందూస్థానమంతయు

బెద్దకాయిచ్చువలె నుండెను. మధ్య హిందూ దేశములోను, దక్షిణ హిందేశములో నున్న స్వదేశరాజులు హైదరాబాదు వారు కొంచెమాత్ర మిచ్చినయెడల దొరతనము వారి మీఁద తిరుగఁబడుటకుఁ సిద్ధముగ నుండిరి. హైదరాబాదు ప్రజలు వీధులలో గుంపులుగూడి యింగ్లీషువారిమీఁద యుద్ధమునకుఁ బోవుదుమని కేకలువేయుచు వచ్చిరి. ఇంగ్లీషువారి ప్రభుత్వమెంత యపాయస్థితిలో నుండెనో బొంబాయి గవర్నరుగారు హైదరాబాదు రెసిడెంటుగారికిచ్చిన యీ క్రింది టెలిగ్రాపువలనఁ దెలియవచ్చును. "నిజాము శత్రుపక్షమునఁ జేరెనా హిందూదేశము మనకుపోయినదే గావున జాగ్రత్త పెట్టుము" ప్రజ లింగ్లీషువారిమీఁద నెంత ద్వేషము చూపినను నిజాము మనస్సు మఱియొకలాగుండినను సలారుజంగు మాత్రము యెవరిమాటలువినక నిశ్చలుఁడై యింగ్లీషువారి రాజ్యమును రక్షించెను. అప్పటి మంత్రి సలారుజంగు కనుక నింగ్లీషువారి కంతటిమేలు చేసెను. మఱియొకఁడైనచో నావిధముగాఁ జేయకపోవును. ఏదియెటులయినను సలారుజంగుమాత్ర మింగ్లీషువారి పక్షముండుటకే నిశ్చయించుకొనెను. ఆపితూరి సమయమున సలారుజంగు చేసిన యుపకారమునకుఁ గృతజ్ఞులై గవర్నమెంటువారు వానికి ముప్పదివేలరూపాయిలు వెలగల ఖిల్లతు నొకదానిని బహుమానమిచ్చిరి. గవర్నరుజనరలుగారు వానిసహాయమునకుఁ సంతసించి యతఁడు హైదరాబాదుసంస్థానమును నిజామును నిష్కారణముగా నాశనముచేయక నిశ్చలబుద్ధి వహించినందుకు నింగ్లీషువారి పక్షమున నుండినందుకు ననేకవందనములఁ జేసి గవర్నమెంటువారి కాప్తమిత్రుండుగ నెంచుకొనిరి.

వెనుక సరబ్బులు మొదలగు బండవాండ్రను వెడల నడచుట చేతను శిపాయి పితూరీలో నతఁ డింగ్లీషువారి పక్షము వహించుట

చేతను దేశమందు విరోధులనేకు లతనికి బయలుదేరిరి. ఆవిరోధ మతని కొకసారి ప్రాణాంతమగుటకు సిద్ధమయ్యెను. 1859 వ సంవత్సరమున మార్చినెల 15 వ తేదీని సలారుజంగు రెసిడెంటుతోఁగలసి నవాబు దర్బారునుండి యింటికిపోవుచుండ జహంగీరుఖానని యెడు నొకతురక వానిమీఁద తుపాకి పేల్చెను. దైవవశమున నాదెబ్బ వానికిఁ దగులక తప్పిపోయెను. ఆనరహంతకుఁడు తన గురి తప్పిపోయెనని వగచి రోషావేశపరవశుఁడై ఖడ్గముదూసి సలారుజంగుమీఁదికిఁ బరుగెత్తెను. కాని వాఁడు తలఁచుకొన్న దౌర్జన్యము చేయకమునుపే రాజభటులు వానిని దుత్తునియలుగ నరికిరి. 1860 వ సంవత్సరమునం దింగ్లీషుదొరతనమువారు తొల్లి తాము ఋణవిమోచనము నిమిత్తముపుచ్చుకొన్న షోలాపురము, రాయచూరు ధారాశీను మొదలగు తాలూకాలను మరల నిజామున కిచ్చిరి. 1861 వ సంవత్సరమునఁ గొందఱు విరోధులు సలారుజంగును మంత్రి పదవినుండి తొలగింపఁ గుట్రలుపన్ని రెసిడెంటుదొరగారు సలారుజంగును మంత్రిపదవినుండి తప్పింప దలఁచుకొన్నారని నిజాముగారితోఁ జెప్పిరి. మాయమర్మము నెఱుఁగని యానిజాము వారికల్పనలు నమ్మి రెసిడెంటుగారి యభిప్రాయ మదియే యనుకొని తనయొద్దకు రెసిడెంటు వచ్చినప్పుడు "మీ యిష్టప్రకారము నేను సలారుజంగును దీసివేయుట కిష్టముగ నున్నా" నని చెప్పెను. రెసిడెంటు మితిలేనియాశ్చర్యమునొంది తెల్లబోయెను. తరువాత వా రొండొరుల యభిప్రాయములను గ్రహించి సలారుజంగునే మంత్రిపదములో నిలుప నిశ్చయించిరి. అతఁడు మునుపటియట్లె పలుమార్పులం జేయుచు సంస్థానమును మంచిదశకుఁ దెచ్చెను. అందు ముఖ్యముగ వ్యవహార సౌలభ్యముకొఱకు సంస్థానము నైదుభాగములుగను బదునేడు జిల్లాలుగను విభజించెను. అదివఱకు రయితులు దివాణము పన్ను రొక్కముగ నీయలేక ధాన్యరూపకముగ

నిచ్చుచుండిరి. అతఁడాపద్ధతి గొట్టివేసెను. భూములు గొలిపించి సరియైన వైశాల్యము దెలిసికొనెను. మఱియు రయితులకు భూములు శాశ్వతముగా నుండునట్లు శిస్తు హెచ్చింపకుండునట్లు చాల మార్పులఁ జేసెను. సలారుజంగు సంస్థానమునందుఁ జేసిన యభివృద్ధిని రెసిడెంటుగానుండిన సాండర్సుదొరగారు వ్రాసిన యీక్రింది వాక్యముల వలన మనము తెలిసికొన వచ్చును. "ఇప్పటి హైదరాబాదు సంస్థానమునకు వెనుకటి నలువదియేండ్ల క్రిందటనున్న సంస్థానమునకు భేదముచూడ నిప్పటి యింగ్లండునకు రెండువందలయేండ్ల క్రిందటి యింగ్లండునకునుగల భేదము కలదు. ఈయభివృద్ధి కంతకు సర్ సలారుజంగు పడిన పాటు నాపూర్వపు రెసిడెంట్లు వానికిఁ జేసిన సహాయము ముఖ్యకారణములు. ఖజానా ధనముతో నిండియుండును. ప్రతిసంవత్సరము వ్యయముపోగా సంస్థానమున కెనిమిదిలక్షల రూపాయల యాదాయ మిప్పుడున్నది. శిస్తువసూలుచేయుటకు మునుపటి యిజారాపద్ధతి నీదివాను గొట్టివేయుటచే గ్రామములలో నిప్పుడు మునుపటివలె నల్లరులు లేవు." హైదరాబాదుసంస్థానములోని జనులు నాగరికతలేని మోటవాండ్రగుటచే సలారుజంగు తమకుఁజేసిన మహోపకారములనుగు ర్తెఱింగికృతజ్ఞులై యుండలేకపోయిరి. అందుచేతనతఁడు క్రమక్రమముగా జనులచేత ద్వేషింపఁబడెను. వ్యవహారములోఁ గఠినముగా నున్నవారందఱకు నట్టియవస్థయే ప్రాప్తించునుగదా! అనేకులకు విరోధియగుటచే నతనిప్రాణము తీయుటకు మఱియొక ప్రయత్నము జరిగెను. 1868వ సంవత్సరమందు సలారుజంగొకనాఁడు దర్బారునకుఁబోవుచుండ నొక దురాచారుఁడు వానిమీఁద తుపాకి రెండుసారులు గాల్చెను. అదృష్టవశమున నా రెండుగుండులుఁగూడ మంత్రికిఁ దగులక తప్పిపోయెను. వెంటనే సేవకు లా దురాత్ముని బట్టుకొనిరి. నిజాము వారికి మరణదండనవిధించెను. దుష్టుఁ డైనను

వానికి మరణదండన విధింపవల దనియు గారాగృహబంధనము విధిం పుఁడనియు సలారుజంగు నిజామును వేఁడుకొనెనుగాని నిజాము పట్టు విడువక తన మొదటియాజ్ఞ చెల్లించెను.

1869వ సంవత్సరమున నప్పటి నిజాముగారు మృతినొందిరి. ఆయన కొకచిన్నకుమారుఁ డుండుటచేత నింగ్లీషుదొరతనమువారుపా ర్వాపర్యములు చక్కఁగ బరిశీలించి సలారుజంగుగారిని షమ్సుల్ దౌలా అమీర్ కాబీరీగారిని బాలునిపక్షమునఁ బ్రజాపరిపాలనముఁ జే యుమని నియోగించిరి. 1872వ సంవత్సరమున నాయిరువురుమంత్రు లు మునుపు తమనిజామునొద్దనుండి పుచ్చుకొన్న బేరారుపరగణా మరల నీయవలసిన దనియు దానికై సొమ్మేరొక్కఁముగ ధరావతు నిలుపుదు మనియు జెప్పి యడిగిరి. కాని గవర్నమెంటువారు పుచ్చు కొనుటలోనేకాని యిచ్చుటలోఁ జుఱుకుతనము లేనివారగుటచే దా ని కంగీకరింప రయిరి. 1875వ సంవత్సరమున మన ప్రస్తుతచక్రవర్తి యగు ఎడ్వర్డు రాజుగారప్పుడు యువరాజుగానుండి మనదేశముఁ జూ డవచ్చిరి. అప్పుడు సలారుజంగు బొంబాయికిఁబోయి వారిని స్వయ ముగ సన్మానము చేసెను. ఆయువరాజుగారు సలారుజంగును సీమ కురమ్మని యాహ్వానముచేసిరి. 1876వ సంవత్సరమున సలారుజంగు వారు కోరినరీతిగా నింగ్లాండునకుఁబోయి యచ్చటి జనులచే నమిత మైనసన్మానము నందెను. ఇంగ్లాండునకుఁ బోవుటలో నతని ముఖ్యో ద్దేశము బేరారుపరగణా నెటులయిన మరలసంపాదించి తనప్రభువున కీయవలయు నని యతఁడు మృతినొందు వఱకు దీనివిషయమునఁ బ్రయత్నించుచునే వచ్చెను. అతఁ డీప్రయత్నమున నింగ్లాండులోఁ గృతకృత్యుఁడుకాకపోయినను స్వదేశరాజులలోనైన నెవరికిం జరుగ ని యఖండగౌరవము తనకక్కడ జరిగినదని సంతుష్టినందెను.

అనంతర మతఁడు స్వదేశమునకువచ్చి 1883వ సంవత్సరము

వఱకు హైదరాబాదు సంస్థానమును న్యాయముగ బరిపాలించెను. 1883 వ సంవత్సరమున విశూచిజాడ్యముచేత నతఁడు మృతినొందెను. మరణకాలమున కతనికి యేబదేండ్లవయసు. వాని మరణమునకు వగవనివారు లేరు. హిందూదేశస్థులు దుఃఖించిరని చెప్పుట యొకగొప్ప కాదు. ఇంగ్లాండు దేశస్థులుఁగూడ బిట్టువగచిరి. విక్టోరియారాణిగారు తత్కుమారుఁడు యువరాజుగారు మొదలగు ననేకులు వాని మరణమునకు శోకింపుచు తత్కుటుంబమునకు జాబులువ్రాసిరి. ఇండియాగవర్న మెంటువారు ప్రత్యేకముగా నొకగజెటీలో నీక్రింది విషయమును వ్రాసిరి. "ఈనెల 8వ తేదీని హైదరాబాదు సంస్థానమునకు మంత్రియగు సర్ సలారుజంగుబహదూరు విశూచిజాడ్యము వలన మృతినొందె ననిదెలియఁజేయుటకు మాకు మిక్కిలి దుఃఖకరముగా నున్నది. ఆతని మరణముచేత నిండియాగవర్నమెంటువారికి విశ్వాసపాత్రుఁ డగుమిత్రుఁడు పోయెను. నిజాముగారికి యోగ్యుఁడగు మంత్రిపోయెను."

సలారుజంగు పొట్టియుపొడుగుకాని విగ్రహము కలవాఁడు. సుకుమారదేహుఁడు. కాని గంభీరాకారము గలవాఁడు. వేషభాషలలో నతఁడు సామాన్యుఁడువలె నుండును. గొప్పదర్బారులు తీర్చినప్పుడుతప్ప తదితరసమయముల నతఁడు నగలు దాల్చువాఁడు కాఁడు. అతని పద్ధతులన్నియు మంచివి. అతఁడు జనులకు సులభుఁడు. తోఁటలు వేయించుటయం దతనికి యెక్కువయిష్టము. అతనికి యూరోపియనుల సహవాసమే యెక్కువయిష్టము. వానియునికియు దొరల పద్ధతి ననుసరించియే. అతఁడు గావించిన సత్పరిపాలనము నొక్కటా నిబట్టియే వానిసామర్థ్యమును మన మెంచఁగూడదు. అతనికున్న విరోధులంబట్టియు వారినిగ్రహమం దతఁడు చూపిన నేర్పుంబట్టియుఁ గూడ జూడవలెను. అతనివిరోధులమాటయటుండనిండు, అతఁడు ఛే

సిన ప్రతిసత్కార్యమందు వానిప్రభువగు నిజాము సయితము చెప్పుడు మాటలు విని యెన్నో విఘ్నములు కలిగించుచు వచ్చెను. పాపము సలారుజంగు తనకావించిన పనిని తన యేలిక యెన్నఁడైన మెచ్చుకొనునేమోయనియూటలూరుచువచ్చె. ఎప్పుడోగానినవాబుమెచ్చుకొనుటలేదు. అతఁడు సంపూర్ణుఁడైన యోగ్యుఁడు. అంతటియోగ్యుఁడైనను సంస్థాన మంతబాగుచేసినను వెనుకటినిజాము వాని నెప్పుడు సరిగానమ్మక యేదోయనుమానముతోనేజూచుచువచ్చెను. కోటఁదాఁటి యావలకుఁ బోవలసివచ్చినప్పుడు నూరుబయటనున్న వసంతగృహాము నందు దొరలకు విందుజేయఁదలఁచుకొన్నప్పుడు సైతము సలారుజంగు నిజామువారి సెలవును బొందవలయునఁట. అట్టిసమయములందు నిజాముసెలవిచ్చవచ్చినపుడిచ్చి యిష్టలేనప్పుడియ్యకపోయెను. రెసిడెంటుతోఁబలుమాఱు కలుసుకొన్నను నిజామున కనుమానమే. రెసిడెంటుమిక్కిలి యవసరములయిన కాగితములు పెట్టెలోవేసి పంపినను నిజామునకు సందేహమే. వేయేల తనరెసిడెంటు తనమంత్రి కలుసుకొనుట నిజామున కిష్టములేదు. తన యేలిక యిన్ని జేసినను సలారుజంగు స్వామిభక్తి మెండుగ గలవాఁడగుటచే తనకష్టముల నొకరితోఁ జెప్పుకొనఁడు సరికదా యెన్నఁడు సణుగుకొననైన లేదు. వెనుకటినిజాము వానిం దఱుచుగా సముఖమునకుఁ బిలుచుటయే లేదు. ఎప్పుడైన బిలిచెనా సలారుజంగు వానికడ నున్నంతనే పేమిమూఁడునోయని వెలవెలఁబోవుచునేయుండును. అయినను తన రాజు విషయమున నతఁడు శక్తివంచనలేక పాటుపడుచు వచ్చెను. 1867 వ సంవత్సరమువఱకు నతఁడు హైదరాబాదు తప్ప మఱి యేపట్టణమును జూచియెఱుఁగఁడు. సంస్థానమందయిన నాయాతాలూకాలకు జిల్లాలకుఁబోయి యెఱుఁగఁడు. అందుచేత తాలూకాదారులు తక్కిన యుద్యోగస్థులు స్వకార్యముల నెట్లునిర్వహించుచున్నారో ప్రజలనె

ట్లు పరిపాలించుచున్నారో పరీక్షించి చూచుట కతనికి వీలు లేకపో యెను. అటుపోయిచూడవలయునన్న నిజాము వానిని వెళ్ళనియ్యఁడు ఎట్టకేల కింగ్లీషువారు బలవంతముపెట్ట నిజాము వాని నొకటిరెండుసా రులు రాజధాని విడిచిపోవనిచ్చెను. అతఁడు సత్కులసంభవుఁ డగు టచేత శరీరమునందు సహజముగ దుర్బలుఁడయ్యు నవసరమైనప్పు డు కావలసినంత శాంతమును దెచ్చుకొని యెంతో యోపిక గలిగి న్యాయదృష్టితో పరిపాలించెను. అతని సమకాలికు లగు రాజా నరా ధవరావు, రాజా దినకరరావులను నిద్దఱుదివానులతో బోల్చినప్పుడు సలారుజంగు వారికి దీసిపోడని యనేకు లనుచున్నారు. పరిపాలనా శక్తిలో నితఁడు వారికొకవేళ దీసిపోయినను శిస్తులు వసూలుచేయు ట వ్యవహారము చురుకుగ జేయుట మొదలగుకొన్నినేర్పులలో ని తఁడే వారిని మించునని చెప్పకతప్పదు. ఆతని బుద్ధినిపుణత యెట్టి దోకాని యింగ్లీషువారు తమ రాజ్యములో చేసిన మంచిమార్పు లన్ని యు వెంటనేగ్రహించి సలారుజంగు తమసంస్థానములోఁ బెట్టుకొను వాఁడు. మార్గస్థులనిమిత్తము సత్రములుకట్టించుట తోటలువేయించు ట మురికినీరు పోవుటకు తగినయాధారములు నిర్మించుట మొదలగు నవి గూడ నతఁడే జెప్పివేయించుచు వచ్చెను. అతఁడు సహస్రాక్షుఁ డువలె సర్వకార్యములయందు దానేప్రవేశించి చూచువాఁడు. ఈయ నయందు హిందువులకు మహమ్మదీయులకు గూడఁ సమానగౌరవ ముండదగును. హైదరాబాదు సంస్థానమున కితఁడు మంత్రికాకపో యిన పక్షమున నదిమిక్కిలి దురవస్థలో నుండియుండును.

సర్ సయ్యదు అహమ్మదుఖాను

సయ్యదమహమ్మదుఖాను 1817వ సంవత్సరము అక్టోబరు 17వ తారీఖున ఢిల్లీలో జన్మమొందెను. అతనిపూర్వులు మొగలాయిచక్రవర్తులయొద్ద గొప్పయుద్యోగములు చేయుచువచ్చిరి. ఆతనితండ్రిసయ్యదు మహమ్మదుటక్కీ. ఢిల్లీచక్రవర్తియగు రెండవయక్బరునకుఁ బ్రాణమిత్రుఁడైయుండెను. ఈటక్కీమహమ్మదుగారే యాచక్రవర్తియొద్ద మంత్రియైయుండెను. ఆమంత్రిమృతినొందినప్పుడుచక్రవర్తియైన రెండవ షాలం గతించిన మంత్రియొక్కబిరుదులు మొదలగునవి మహమ్మదు టక్కీకి నియ్యదలంచెను. కాని టక్కీ యవి తనకక్కరలేదని చెప్పెను. మహమ్మదుటక్కీ 1836 న సంవత్సరమున మృతినొందెను. అప్పటికి సయ్యదుమహమ్మదుఖాను పందొమ్మిదేండ్లప్రాయముగలవాఁడైనను గడపటిఢిల్లీచక్రవర్తియగు బహదూరుషా మాతామహునిబిరుదులన్నియు వానికిచ్చి యనుగ్రహము చూపెను.

అహమ్మదుఖానుపసిబిడ్డయైనప్పుడుతల్లినోటనుండియేచదువునేర్చుకొనెను. ఆతఁడు పగలు నేర్చుకొన్న చదువంతయు వాని తల్లి రాత్రి వానియొద్ద నప్పగించుకొనుచువచ్చునఁట. అతఁడు యింగ్లీషు నేర్చుకొనలేదు. నేర్చుకొన్న స్వభాషావిద్యయు పితృమరణమువలనఁ గాబోలు 1837 సంవత్సరమున సమాప్తియయ్యెను. అందుచేత నతఁడా సంవత్సరమున నుద్యోగమునకై బ్రయత్నించి ఢిల్లీలోనున్న సర్కారువారి సాదరమీనుకోర్టులో సిరస్తదారుగబ్రవేశించెను. ఆతఁడుద్యోగమున ప్రవేశించిన స్వల్పకాలములోనే యభివృద్ధిపొందెను. ఆపనిలోఁ బ్రవేశించిన రెండేండ్లకే యాగ్రాకమీషనరుగారియొద్దవానికి నాయబుము నిషీపని యయ్యెను. 1841వ సంవత్సరమం దతనిని దొరతనమువారు



సర్ సయ్యదు అహమ్మదుఖాను.

సిక్రిపట్టణమున మునసబుగా నియమించిరి. 1843 సంవత్సరమునమున సబుగానే డిల్లీకిబోయి పనిచేసెను. 1850 వ సంవత్సరమందు వానికి రహతకుపట్టణమున సబుజడ్జీపనియయ్యెను. సిపాయిపితూరీ జరుగుటకు రెండేండ్లముందు దొరతనమువారు వానిని బిజనూరునకుమార్చిరి.అతఁడక్కడనుండఁగానే యాపితూరీ బయలుదేరెను. ఆసమయమున నతఁడు గవర్నమెంటువారికి జేసినయమితోపకారమునుబట్టి వానికీర్తియంతయు హిందూస్థానమందంతట వ్యాపించెను. పితూరీబయలుదేరిన వార్త తెలియునప్పటికి బిజనూరులో నింగ్లీషువారు స్త్రీలుపురుషులు బాలురు గలసి యిరువదిమందియుండిరి. షేక్స్పియరను నొకదొర యాగ్రామము వారిలో గొప్పయుద్యోగస్థుఁడు.పితూరీదారులుకనఁబడిన తెల్లవారినెల్ల నఱకుచుండుటచే యా తెల్లవారు భయభ్రాంతులై యుండమహమ్మదుఖానునూరుమందిపఠానుగుఱ్ఱపు రౌతులనుసిద్ధముచేసి పితూరీనిగూర్చి నిజమైనవార్త నెప్పటికప్పుడే తెలియుటకు నమ్మికగల వేగులవాండ్రను బెట్టెను. కాని యాపఠానులుసయితము పితూరీదార్లలో గలసి కుట్రచేయుటచే నొకనాఁడాయిరువదిమంది తెల్లవారినిపితూరీదార్లెనిమిదివందలమందివచ్చి చుట్టుముట్టిరి. అహమదుఖాను దొరలనివాసమురహస్యముగఁబ్రవేశించి వారితోసత్వరముగ నాలోచనజేసి తాను స్వయముగాఁ పితూరీదార్లసేనాపతియొద్దకుఁబోయి తెల్లవారినినిరపాయముగ బారిపోవనిమ్మని వేడుకొనెను.ఆసేనాపతియు నాప్రాంతభూమిడిల్లీ చక్రవర్తిస్వాధీనముచేసినట్లు తెల్లవారిలో ముఖ్యులు పత్రము వ్రాసి యిచ్చినయెడల బోవనిత్తునని చెప్పి యట్లువ్రాయించుకొని వారినిబోవనిచ్చెను. ఆపత్రమువ్రాయించునప్పు డహమ్మదుఖాను మరల నింగ్లీషువారిభూమి పుచ్చుకొనుటకు వచ్చువఱకుననుమాట లాకాగితమందు మెలకువతోఁ జేర్పించెను. పిమ్మటనింగ్లీషువారు నిరపాయముగ బోవ నాఝూరుపితూరీదారు లాక్రమించిరి. పితూరిదారులలో ననేకులు తుర

కలగుటచేఁదెల్లవారితోఁ జేరియామహమ్మదుఖానుతమప్రయత్నమువిఫలముచేయుచున్నాఁడని స్వమతస్థులు వానిపై ద్వేషముబూనియుండిరి. అదికారణముగఁ బ్రాణభీతిఁజెంది యహమదుఖాను మొదటహాలుదారు గ్రామమునకుఁ బిదప మీరతుపట్టణమునకుఁ బారిపోయి యచ్చటగూడ సురక్షితుఁడు గామి ఢిల్లీయింగ్లీషువారి స్వాధీనమైనపిదప యక్కడికిని బారిపోయెను. ఈసిపాయి పితూరీలో నితఁడు చేసినయుపకారమునకు కృతజ్ఞులై దొరతనమువారు రెండుతరములవఱకు నెలకు రెండువందల రూపాయలచొప్పున వానికుటుంబమునకు భరణమేర్పఱచి వానికిఁజాల బిరుదులనిచ్చిరి. ఈవిధమునైన సత్కారములు వానికిఁ జేయవలసినదని షేక్స్పియరు దొరగారు దొరతనమువారికి గట్టిగా సిఫారసుచేసిరి.

ఆపితూరీ ముగిసినవెనుక నహమదుఖాను పితూరీవచ్చుటకుముఖ్యకారణముల నొకపుస్తకముగ హిందూస్థానీభాషలో వ్రాసెను. ఆ గ్రంథమున నతఁడుపేర్కొన్న ముఖ్యకారణము లివి. 1 ప్రజలుదొరతనమువారి యభిప్రాయములను దెలిసికొనక యపోహపడుట. 2 ప్రజల పూర్వాచార వ్యవహారములకు విరుద్ధముగ, [illegible]నుండునట్టిచట్టములను దొరతనమువారు నిర్మించుట. 3 ప్రజలు యాలోచనలను వారి యాచార పద్ధతులను గవర్నమెంటువారు తెలిసికొనకపోవుట. 4 మంచిపాలనమునకు ననుకూలములగు విషయములను దొరతనమువారు శ్రద్ధచేసికనుఁగొనకపోవుట. 5 సైన్యమునందు దొరతనమువారిమీఁద నసహ్యము కలుగుట. అయోధ్యారాజ్యమునునవాబుల స్వాధీనమునుండితప్పించి యింగ్లీషువారుకలుపుకొనుట పితూరీకిముఖ్యకారణమని హిందూదేశములోఁ గొప్పవారభిప్రాయపడినను ఖానుగారదియొకకారణముగఁదలంపరైరి. ఈవిధముగ సిపాయిపితూరిలో దొరలకుఁ జేసినసాయమునుబట్టి యతఁడుమహాప్రఖ్యాతుఁడైనను గేవలమదియేయతనిప్రఖ్యాతికిఁగారణమనిదలఁపఁగూడదు. బాల్యమునుండియు నతనికివిద్యావ్యాసంగము

మీఁదియభిరుచిచేతను తనతోఁడి తురకల యవస్థను విద్యాభ్యాసాదుల యందు వృద్ధిచేయుటకుఁ బడినపాటుచేతను వానికి మహాప్రసిద్ధికలిగెను. పురాతన శిలాతామ్రశాసనములను వెదకి పూర్వచరిత్రముల నరయుటలో నతనికి బాల్యమునుండియు నభిరుచిగలదు. ఆవిషయమున జాలప్రయత్నముచేసి యతఁడు 1847 వ సంవత్సరమున డిల్లీ ప్రాచీన చరిత్రమును వ్రాసిప్రకటించెను. ఈగ్రంథమును ఫ్రెంచివాఁడొకఁడు తనభాషలోనికి మార్చుకొనెను. అందువలననతనికి యూరపుఖండమునందుసయితము మేలుకలుగ లండనుపట్టణములోని రాయలేషియాటిక్కుసంఘమువారు వానిని దక్షసభలోఁ జేర్చుకొనిరి. అహమ్మదుఖాను స్వమతాభిమాని. అందుచేతస్వదేశాభిమానియనిగూడ చెప్పవచ్చును. అట్టియభిమానముండుటచేతనే 1860 వ సంవత్సరమందతఁడుహిందూదేశపు మహమ్మదీయుల రాజభక్తియనుపేరు పెట్టి యొకచిన్నపుస్తకమును వ్రాసెను. మహమ్మదీయులు చాల విశ్వాసముగలవారనియు వారిలోఁ గొందఱు సిపాయిపితూరిలో దొరతనమువారికిజాలసాయము జేసిరనియుఁ దెలుపుటయే యాగ్రంథరచనలో వాని ముఖ్యోద్దేశము. తనతోడితురకలు మిక్కిలి దీనదశలో నుండుటకుఁగారణము నతఁడు చిరకాలము విచారించి విద్యావిహీనతయే వారిభ్రంశమునకు హేతువని సిద్ధాంతీకరించెను. చదువేతురకలకుసర్వార్థసాధకమనియతనినిశ్చితాభిప్రాయము. హిందూదేశములో సాంఘిక రాజకీయవిషయములలోఁ బ్రజలకుగలలోపములకంతకు విద్యాహీనతయే మూలమని యతఁడు నమ్మెను. వేళ్లుబాగుచేయుడు వృక్షము దానంతటదియేవృద్ధిపొందునని యతఁడు పలుమారు చెప్పుచువచ్చె. అట్టినమ్మకము నిశ్చయముగనుండుటచేతనే యతఁడు 1858 వ సంవత్సరమునమహమ్మదీయులు దేశచరిత్రములను జదువుకొనుటకు మురదాబాదులో నొకపాఠశాల పెట్టించెను. దేశచరిత్రాబోధకములగు గ్రంథములు హిందూస్థానీభాషలోనే

సందున నాగ్రంథదారిద్ర్యమును నివారించుటకతఁడు భాషాంతరీకరణ సంఘము నొకదానిని నేర్పరచెను. ఇంగ్లీషులోని చరిత్రలను హిందూస్థానీలోనికి మార్చుటయే వాని ముఖ్యోద్దేశము. 1863వ సంవత్సరము న నతఁడు షాజపురమందు సబుజడ్జిగానుండి యాకాలమందే క్రైస్తవవేదమగు బైబిలునకు వ్యాఖ్యానమువ్రాసెను. అతనికింగ్లీషురాదు గావున బైబిలుమీఁదనున్న గ్రంథములన్నియుముందుహిందూస్థానిలోనికి మార్పింపఁజేసి పిదప నీవ్యాఖ్యానమును ప్రారంభించెను. పైనచెప్పినభాషాంతరీకరణసంఘము నతఁడు షాజీపురముననుండగానే 1864 వ సంవత్సరము జనవరి 9వ తారీఖున స్థాపించెను. ఈసంఘమే పిదపకాలాంతరకాలమునకుఁ బ్రకృతిశాస్త్రసంఘమనుపేర నల్లీఘురుపట్టణమున బయలుదేరెను. ఈసంఘము మంచియుపకారముచేసెను. ఏలయన నింగ్లీషుభాషలోనున్న సద్గ్రంథములెన్నో హిందూస్థానీభాషలోనికి మార్చఁబడెను. ఆసంవత్సరమే దొరతనమువా రహమ్మదుఖానును ఆలీఘురుపట్టణమునకు సబుజడ్జిగా బదిలీచేసిరి. ఈపట్టణముననే యతఁడు కావించిన సత్కార్యసంతతికి జన్మభూమి. ఈపట్టణము పేరు దలంచినప్పుడు ప్రతిమనుష్యుఁడు సయ్యదుఅహమ్మదుఖాను పేరు తప్పక దలంపవలసియుండును. 1866వ సంవత్సరమందు గవర్నరుజనరలుగారగు లారెన్సుప్రభువుగా రీతఁడుచేసిన విద్యాభివృద్ధికి సంతసించి యొక బంగారుపతకమును మెకాలే కవిరచితమైన గ్రంథమును వానికి బహుమాన మిచ్చిరి. ఆపతకముమీఁద నిట్లువ్రాయఁబడియున్నది. "తన స్వదేశస్థులలో ప్రకృతిశాస్త్రాదివిద్యలు వ్యాపింపఁజేయుటకుఁ బడిన పరిశ్రమమునకు సంతసించి సర్ సయ్యదు అహమ్మదుఖానునకు గవర్నరుజనరలు బహుమానముచేసిన పతకము."

ఇట్లు దొరతనమువారు తగినప్రోత్సాహము నిచ్చుటచే నతఁడు మునుపటికంటె కార్యలోలుఁడై విదేశములయందలి పద్ధతులఁ

జూడఁదలఁచి 1869 వ సంవత్సరమున నింగ్లాండునకుఁబోయెను. అత నికి లండనుపట్టణమునం దున్నప్పుడె సి. యస్. ఐ. యను బిరుదము వచ్చెను. మరియు నింగ్లాండుదొరతనమువారు వానియందుఁ బ్రీతి గలిగిసంవత్సరమునకు మూఁడువేలరూపాయలచొప్పున రెండేండ్లుబహు మానమిచ్చిరి. అక్కడనుండఁగనే యతఁడు స్వమతగురువగు మహ మ్మదువారి చరిత్రమును మఱికొన్ని యితరగ్రంథములను వ్రాసిప్రక టించెను. ఆదేశమును స్వయముగ జూచుటచేత నతనికింగ్లీషువారి మీఁదను వారివిద్యాశాలలు మొదలయినవానియందును మిక్కిలి మంచియభిప్రాయముగలిగెను. లండనుపట్టణమునుండి యతఁడు హిం దూదేశములోనున్న యొకమిత్రునిపేర వ్రాసిన యీక్రిందిజాబును బట్టి వాని కింగ్లీషువారియెడగల గౌరవము తేటపడును. "హిందూదే శములోనున్న మనము జ్ఞానములేని పశువులమని యింగ్లీషువారనుకొ నుటకుఁ గారణములున్నవి. ఈవిధముగా నేనువ్రాయుటవలన మనయొద్ద నున్న విశేషలోపము లేవి, వారియొద్దనున్న యనంతసద్గుణములేవియని సందేహించి నామీఁద మీరు కోపమువహింపవచ్చును. వచ్చిననేమి? నేను చెప్పునది నిజము. ఇక్కడ నున్నదంతయు మనవారు తలంచు టకైన నూహించుటకైన సమర్థులుగారు. నేను ప్రతిదినము చూచు నది నిశ్చయముగ నూహించుటకైన హిందూదేశస్థుల తరముగాదు. నేనుచెప్పునది మనదేశస్థులు నమ్మనియెడల పరమమూర్ఖులని మీర నుకొనవలసినదే. పుట్టుగుడ్డి సూర్యతేజస్సును గాని మనోహరమైన చంద్రప్రకాశమును గాని మన మెన్నివిధముల చెప్పినను భావింపఁ గలఁడా?"

అహమ్మదుఖాను తనకుమారుఁడైన సయ్యదు మహమ్మదును విద్యాభ్యాసమునిమిత్తము కేంబ్రిడ్జిపట్టణములో దిగవిడిచి 1870 వ సంవత్సరమున హిందూదేశమునకు వెడలివచ్చెను. ఆబాలుఁడగు స

య్యదుమహమ్మదు తరువాత నలహాబాదు హైకోర్టులో జడ్జియయ్యె ను. అహమ్మదుఖాను సీమనుండివచ్చినపిదప కాశీపట్టణములో జడ్జి యయ్యెను. ఇంగ్లండునకుఁబోయి వారియాచారముల జూచుటచేత నతఁడు సంఘసంస్కర్తయై మహమ్మదీయులలోనున్న మూఢవిశ్వా సములు దురాచారములు తొలంగించుటకు మహమ్మదీయ సంఘ సంస్కర్తయను పేర నొకపత్రికను బ్రకటింపఁజొచ్చెను. నిష్పక్ష పాతముగ నిర్దాక్షిణ్యముగ దురాచారములను ఖండించుటచేఁ బూ ర్వాచారపరాయణులగు మహమ్మదీయులు వారిని ద్వేషించిరి. ద్వే షించినను బత్రిక బ్రకటింపఁబడిన తొమ్మిదిసంవత్సరములలో సంఘ స్థుల యభిప్రాయములు చాలమారెను. తురకలు రాజద్రోహులని యెవ్వరైన నన్నప్పు డహమ్మదుఖాను వారి వాదమును కఠినముగ ఖండించుచుండువాఁడు 1872 వ సంవత్సరము సర్ విలియము హంట రుదొరగారు హిందూదేశపు మహమ్మదీయు లనుపేర నొక చిన్న గ్రంథమింగ్లీషులో వ్రాసి మహమ్మదీయులకు రాజభక్తిగలదా యని యందు సందేహముగనబరచిరి. అహమ్మదుఖానా గ్రంథముఁజదివి మహమ్మదీయులయం దట్టిలోపము లేదని తెలుపుచు దానికుత్తరము గ మఱియొకపుస్తకము వ్రాసెను.

ఇంగ్లాండునుండి వచ్చినదిమొదలు సయ్యదహమ్మదుఖాను మ హమ్మదీయుల యుపయోగమునిమిత్తము కేంబ్రిడ్జిలోనున్న కాలేజి వంటి కాలేజిగొకటి స్థాపింప నుద్యుక్తుఁడై యుండెను. ఆకోరిక కొనసాగించుట కతఁడు ముందుగా నొకచిన్నసభ నేర్పఱచి దానిము ఖ్యోద్దేశము తురకలకు విద్యావ్యాప్తి నెక్కువజేయుటగ నేర్పఱచెను 1872 వ సంవత్సరము మేప్రియల్ 15 వ తారీఖున నాసభకు మహ మ్మడన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజి కమిటీయని పేరుపెట్టించెను. అదిమొదలుకొని పనిచేసి 1875 వ సంవత్సరమున నాసభ

వారు చిన్న పాఠశాలను స్థాపించిరి. ఆరంభము స్వల్పమైనను సయ్యదు మహమ్మదు గొప్పయూహలు మనసులో పెట్టుకొని దానికి మూలధనము సంపాదింపఁదలఁచి గవర్నమెంటుక్రింది యుద్యోగము మానుకొన్నపక్షమున తనసంకల్పము సులభముగ నెరవేరునని 1876 వ సంవత్సరమున నుద్యోగము మాని పించను పుచ్చుకొనెను. అనంతరమతఁడు కొంతమూలధనము సంపాదించి కళాశాల ప్రారంభింప నప్పటిగవర్నరుజనరలుగారగు లిట్టనుప్రభువుగారు 1877 సంవత్సరము జనవరి 7 వ తారీఖున దానిస్థాపనోత్సవము జరిపిరి. 1878 వ సంవత్సరమున యాయనను వారసనిని గవర్నరుజనరలుగారి శాసననిర్మాణసభలో సభికుఁడుగ నేర్పరిచిరి. అతఁడట్లు సభికుఁడుగ రెండుసారులు నియమింపఁబడెను. ఆసభ విశేషమంతయు నలీఘరుపట్టణమున మహమ్మదీయులు నిర్మించిన యాకళాశాలకు మూలధనమును బోగుచేసి వృద్ధిచేయుటకే వినియోగింపఁబడెను. 1882 వ సంవత్సరమున హైదరాబాదు దివానగు సర్ సలారుజంగు కాలేజిని సందర్శించెను. అహమ్మదుఖాను వానినిమరల చూచుటకుఁబోయి వానియొద్దనుండి కాలేజికి కొంతధనమును స్వీకరించెను. 1884 వ సంవత్సరమున నతఁడు మూలధనము సంపాదించుటకు పంజాబుదేశమంతయు సంచారముచేసెను. ఎక్కడకుఁ బోయినను మహమ్మదీయులు వానిని విశేషముగ గౌరవించుచు వచ్చిరి. అతఁడును వట్టిగౌరవములతో సంతసింపక కళాశాలయం దభిమానముగలవారు తమయభిమానమును ధనరూపముగాఁ జూపవలసినదని చెప్పి విశేషధనము సంపాదించెను. ఆసంవత్సరమే గవర్నరుజనరలుగా రగు రైఫన్ప్రభువుగారు కళాశాలనుజూచి సయ్యదహమ్మదుఖాను చేసిన యద్భుతకార్యములను జాల శ్లాఘించిరి. 1888 వ సంవత్సరమున నతనికి కె. సి. యస్. ఐ. యను బిరుదమునిచ్చిరి. తనపూనిన సత్కార్య

మును మిగులఁ బరిశ్రమచేయుచు నతఁడు మఱి పదిసంవత్సరములు జీవించి 1898 వ సంవత్సరము మార్చి 27వ తారీఖున మృతినొందెను.

ఈమహమ్మదుఖాను చరిత్రము చిత్రమైనది. ఆతని కింగ్లీషు రాకపోయినను దానిని గట్టిగ చదివినవాఁడువలె వర్తమానవ్యవహారములనన్నియుఁ జక్కఁగ నెఱిఁగి యతఁడు కాలోచితముగఁ బనిచేసెను. హిందూదేశస్థులు స్థాపించిన దేశీయమహాసభ కితఁడు విరోధియని మనవారు నమ్ముదురు. ఆసభ దొరతనమువారికి విరుద్ధమైన దని నమ్మి మహమ్మదీయు లాసభకుఁ బోఁగూడదని యతఁడుశాసించెను. ఆతనిమాట శిరసావహించి మహమ్మదీయు లానాఁటికి దేశీయ మహాసభలోఁ దఱుచుగఁ జేరుచుండుటలేదు. ఈతఁడు స్వమతస్థుల యభివృద్ధికొఱకు మిక్కిలి పాటుపడియెను. హిందూదేశస్థులలోని సత్పురుషులలో నితఁడొకఁడని చెప్పవచ్చును. ఇంగ్లీషువారు దయామయులనియు వారినినమ్మి దయకుఁ బాత్రులమైతిమేని, వారుమనకు సర్వసౌఖ్యములు నీయఁగలరనియు నీతని నమ్మకము. ఈతని పేరు విన్న మహమ్మదీయుల కిప్పటికిఁ జాల గౌరవము.



గాజుల లక్ష్మీనరుసు సెట్టి.

శ్రీ

మహాపురుషుల జీవితములు

(మూఁడవభాగము- చెన్నపట్టణము)

గాజుల లక్ష్మీనర్సు సెట్టి

గాజుల లక్ష్మీనర్సు శెట్టి చెన్నపట్టణమందలి పెరియమెట్టయను పేటలో 1806 వ సంవత్సరమందు జన్మించెను. అతని తండ్రిపేరుసిద్ధుల శెట్టి. ఆయన నీలిమందు వర్తకముచేసి సంపన్నుఁడయ్యెను. కావున వానికుమారుని విద్యాభ్యాసమునకు ధనదారిద్ర్యములేదు. కానియా దినములలో మనదేశస్థు లింగ్లీషు చదువుకొనుటకుఁ దగిన పాఠశాల లేవియుఁ జెన్నపట్టణమున లేవు. స్వదేశస్థులు పాఠశాలలుస్థాపించి విద్య వ్యాపింపఁజేయుటకు స్వల్పముగఁ బ్రియత్నించిరిగాని యాప్రియత్న మొక లెక్కలోనిదిగాదు. అయినను లక్ష్మీనరుసు మొట్టమొదట స్వదేశస్థులు స్థాపించిన యొక చిన్న పాఠశాల కేఁబోయి చదువుకొనెను. ఆ పాఠశాలలో లక్ష్మీనరు సిప్పటివలె శాస్త్రవిద్యలు నేర్చుకొనలేదు. తననీలిమందువ్యాపారము సరిగా చేసుకొనుటకు లాభము వచ్చునట్లు బేరమునిచ్చి సరుకులమ్ముటకు సరిగ లెక్కలువ్రాయుటకుఁ దగినంత చదువువచ్చినఁ జాలునని సిద్ధులశెట్టి యప్పుడున్న చదువైనఁ గుమారునకు జెప్పింపలేదు. అందుచేత లక్ష్మీనర్సు చదువుట వ్రాయుట లెక్కలువేయుట మాత్రమే నేర్చుకొనెను. లక్ష్మీనర్సు పెద్దవాఁడై గొ

ష్పన్నుఁడైనతనియందు వానినాఁటనుండి కనఁబడుచువచ్చిన ధైర్యసాహసములు స్వాతంత్ర్యమును సదయతయు మొదలగు సుగుణములు చిన్ననాఁడె కనఁబ డెనని కొందఱు వ్రాసియున్నారు. అతఁడు బాలుఁడైనప్పుడు విద్యా గురువులతోఁ గలసి యానాఁటి రాజకీయ వ్యవహారములఁగూర్చి చర్చించు చుండువాఁడు. చదువు ముగిసినపిదప లక్ష్మీనరసు తండ్రిదుకాణమునఁ గొంతకాలము పనినేర్చుకొని వర్తకములోని మర్మములన్నియు నేర్చుకొనెను. పిదప "సిద్దులుసెట్టి కంపెనీ" యను పేరుపెట్టి తండ్రియుఁ దానును గలసి వాణిజ్య మారంభించిరి. ఆకంపెనీవారు సీమనుండి సముద్రతీరమున చెన్నపట్టణము గుమాస్తాలచేత నమ్మి వాణిజ్యము సంపాదించిరి.

ఆనంతరము కొంతకాలమునకు సిద్దులుసెట్టి మృతిబొంద లక్ష్మీ నరసు స్వతంత్రుఁడై విరివిగా వ్యాపారము జేసెను. ఆకాలమున న మెరికాఖండములోని దేశములుకొన్ని యంతఃకలహములు గలిగి యుండుటచే నచట ముఖ్యముగా పైరగుచుండిన దూదిపంట చెడిపో యెను. ఆకారణమున హిందూదేశమునందు నీజిప్టుదేశమునందు ననే కులు దూది వర్తకముమీఁద బడిరి. లక్ష్మీనరసుసెట్టియు దానియదను నెఱిఁగి విశేషముగా వ్యాపారము చేసెను. అతని యదృష్టము ఫలించుటచేఁ జేసినబేరములు లాభకరమయ్యెను. అందుచేత నతఁడు స్వల్పకాలములోనే లక్షలకొలఁది ధనముసంపాదించెను. కావలసినం త ధనమున్నది గదా యని సంతుష్టుఁడై యతఁడు మునుపటివలె వ్యా పారముమీఁద దృష్టినిలుపక తనదేశస్థులకు రాజకీయ వ్యవహార ములలో నెక్కుడు స్వాతంత్ర్యము గలుగఁ జేయవలెనని దృష్టి యంతయు దానియందే నిలిపెను. ఆనాఁటి హిందువులు బొత్తుగా నింగ్లీషువారిపాలనమునకు లోఁబడుటఁ దమపరిభూత్వ మెట్టిదియో బొత్తిగ నెఱుం గని మూఢులై యుండిరి. చెన్నపట్టణములోనున్న యధికారులే సర్వస్వ

తంత్రాధికారులని భావించి సీమలో నున్న యధికారులున్నారని యు నన్యాయములు చేసినప్పుడు వారిని ప్రభుత్వ మెంచుకొనుచున్నారని యు నెఱుంగక యిక్కడి యధికారులచేత ననేక బాధలు పడుచుండిరి. లక్ష్మీనరసుసెట్టి మాత్రమే యీ యధికారుల యన్యాయము తెలిసినవాఁ డగుటచే "చెన్నపట్టణ స్వదేశసంఘ" మను పేర నొక సంఘము స్థాపిం చెను. దాని ముఖ్యోద్దేశము జనులకుఁ జేకూరు నష్టములను స్వతంత్రముగఁ దెలి పి ప్రజలకష్టసుఖములు దొరతనమువారికి విజ్ఞాపనపూర్వకముగాఁ దెలు పుకొనుటయే. ధనవంతులగు వర్తకులు దొరతనమువారికి నుద్యో గములుచేయని పెద్దమనుష్యులు పలువురు నాసంఘములోఁ జేరినచేసి ఆసంఘమువారు పలుమారు సభలుచేసి తీర్మానములు చేసి విషయములఁ జర్చించి తన్నివారణార్థము సీమలోనున్న యధికారులకు మహాజ రులనంపిరి.

ఈ సెట్టిగారి మొదటి పోరాటము క్రైస్తవమతబోధకులతో సంభవించెను. అప్పటికిఁ గ్రైస్తవమత బోధకులు క్రొత్తగా మనదేశము నకు వచ్చి పాఠశాలలు పెట్టి యింగ్లీషులోని శాస్త్రవిద్యలు మనవారి కి నేర్పి యుపకారము చేయుచువచ్చినను పాఠశాలలోని బాలకులను దమ మతములోఁ గలుపుకొనుచు వచ్చిరి. ఆకాలమున మనవారిలో ననేకుల కింగ్లీషు రాకపోవుటచేతను రాజభాషయగు నింగ్లీషువచ్చినఁ గాని యుద్యోగములు దొరకకపోవుటచేతను మనవా రుద్యోగములు మీఁదియాశచేయు తమబిడ్డలను గ్రైస్తవపాఠశాలలకే బంపవలసి నవారైరి. ఆమతబోధకులు తమయొద్దకు వచ్చినవిద్యార్థులలో మిగు లతెలివియు గలవారిని నయముతోను స్వమతమునం గలుపుకొనిరి. గొప్పయుద్యోగములలో నున్న తెల్లదొరలందఱు క్రైస్తవ మతబోధ కుల కార్యమునందుఁ దగిన సహాయము జేసిరి. ఆ సామాన్యులగు వారిఁ గొందఱ నిందు బేర్కొనుచున్నారము. తిరుమల స్వామి గ్లాకలు

టరగు థామసుదొరగారు క్రైస్తవ మతబోధకులు తమతమ వ్యా
ప్తికిఁజేయు పనులకు బహిరంగముగఁ జాలసహాయము చేసిరి. అందు
చెన్నపట్టణము సాదరు కోర్టులో జడ్జియగు సర్ విలియంబర్టనుదొ
రగారు మతబోధకులమీఁద తనకుఁగల యభిమానమును స్పష్టముగఁ
దెలుపుటయేగాక కోర్టులో ధర్మపీఠమునఁగూర్చున్నప్పుడు సయితము
తానే హిందువుల కప్పుడు క్రైస్తవ మతము బోధింపఁజొచ్చెను. అ
ప్పుడు గవర్నమెంటు సెక్రెటరీగారగు మరియొక థామసుదొరగారు
హిందువుల కుద్యోగములీయక క్రైస్తవమతములోఁ గలసినవారికే వి
శేషముగా నుద్యోగము లీయఁజొచ్చెను. చెంగల్పట్టు జిల్లాజడ్జిగారొక
నాఁడు వ్యాజ్యములో విచారణ చేయుటమాని తమ కచేరీ యొక మత
బోధకుని యుపన్యాసము నిమిత్త మెరువిచ్చెను. క్రింది యధికారు
లిట్లధర్మముగా ప్రవర్తించుచుండ దొరతనమువారేమయిన వారి
నదపులోనుంచిరో యన నదియు లేదు. మీఁదుమిక్కిలి వారుమతబో
ధకులకు వ్యతిరేకముగాఁ బనిచేసిన నెల్లవారి కపకారములుచేయసాగి
రి. చెన్నపట్టణపు సాదరుకోర్టులో నొకజడ్జి దొరతనమువారు చెప్పిన
ట్లువినక న్యాయదృష్టి గలిగి మతబోధకులకు వ్యతిరేకముగా బనిచేసి
నందున వారు వాని యుద్యోగమును దీసివేసిరి. ఆజడ్జిగారిని హిందు
వులు గౌరవించి వాఁడికి దమకృతజ్ఞతను దెలిపినప్పు డాదొరగారీక్రింది
విధముగ దెలిపిరి.

"సాదరుకోర్టు జడ్జీల కిష్టములేని కార్యములు దొరతనము
వారు చేయుమని వారినడిగినప్పుడు జడ్జీలు నోరు మూసుకొని యూర
కొన్నపక్షమున దొరతనమువారికముందు స్పష్టముగా హిందువు
లందరు క్రైస్తవులలో గలియువలయునని యాజ్ఞాపింతురు. చెన్నపట్ట
ణపు గవర్నరుగారు తమకట్టి యభిప్రాయము లేదని తెలిపినను గవ
ర్నమెంటు సంబంధముగల కొందఱు పెద్దమనుష్యుల కట్టి సంబంధము

లుగలవనియు వారు తలంచుకొన్నంత పని చేయగలరనియు ననుభవములవలన దెలియవచ్చుచున్నది. గవర్నమెంటువారి ప్రవర్తనముబట్టి సాదరుకోర్టు జడ్జీలు వారియుత్తరువులం గొన్నింటిని మన్నించుటకు వీలు లేకపోయినది. అట్టి యుత్తరువులను న్యాయదృష్టిగల యేజడ్జీయు మన్నింపఁడు. న్యాయస్థానముయొక్క గౌరవమునుధర్మమును నిలువబెట్టుటకుఁ గృతనిశ్చయుఁడైనందున కెదొరతనమువారునన్ను తీసివేసిరి. క్రైస్తవమతబోధకులు నీతినియమములు లేక బాలురను గలుపుకొనుటయు వారికిరహస్యముగ దొరతనమువారు దోడ్పడుటయునెఱిఁగిహిందువు లందఱువిశేషముగ మనస్తాపమునొందుటచేతఁ లక్ష్మీనరుసుసెట్టి,స్వదేశస్థుల మతవిషయములలో నింగ్లీషువారు సంబంధముకలుగజేసుకొనమనిమొదటప్రతిజ్ఞచేసి పిదప జేయరానిపనులు చేయుచుండినందున వానినివారించుటకుఁ దనసర్వశక్తిని వినియోగించి పనిచేయవలయుననికృతనిశ్చయుం డయ్యెను. ఆకాలమునఁ జెన్నపురియందు నేటివుసక్స్ప్యేటరను నొకపత్రిక యింగ్లీషులోప్రకటింపఁబడుచుండెను. దానికినారాయణస్వామినాయుఁడను నతఁడు పత్రికాధిపతి.లక్ష్మీనరుసు వానియొద్దనాపత్రికనుముద్రాయంత్రమును వెలకుగొని "క్రెసెం" టను కొత్తపత్రికను ప్రచురింపఁదలఁచి దానికి హార్లీయను నొక దొరగారి సధిపతిగానేర్పరచెను. క్రెసెంటు శబ్దమునకుఁ జందమామయని యర్థము. హార్లే దొరయంతకుమున్ను సైన్యములో బనిచేసినవాఁడు గావున నతఁడు పత్రికనునడపునప్పుడు సయితము కొనుకటి వీరరౌద్రములు చూపుచు సందరకు భయంకరుఁడై యుండెను. ఆపత్రికయొక్క మొదటి సంచిక 1814 వ సంవత్సరము 2వ అక్టోబరు తారీఖున బయలు వెడలెను. అప్పటికి మనసెట్టికి ముప్పదియెనిమిదేండ్లవయస్సు. హిందూదేశస్థులను సమున్నతస్థితికిఁదెచ్చుటయే యాపత్రికయొక్కముఖ్యోద్దేశము

ని యందు వ్రాయబడెను. ఆదినములలో రికార్డు అను నొక పత్రికను బ్రకటింపుచు వచ్చిరి. క్రిసెంటుపత్రిక రికార్డుపత్రికలోని తప్పులను జూపుచు క్రైస్తవ మతబోధకుల దురాచారములను ఖండించుచు వారి యవకతవకలను వెలిపుచ్చుచు వచ్చెను. మొట్టమొదట క్రిసెంటు పత్రికమీద ననేకులకుం గోపమువచ్చెనుగాని యెవరికిగోపమువచ్చినను లెక్కసేయక యది తన పనిచేయుచు కాలూది నిలచెను. దొరతనము వారి గొప్పయుద్యోగస్థులు వారియాజ్ఞావర్తులగు జడ్జీలు క్రిసెంటు పత్రికలోనిసూదిపోటులవంటిమాటల కుడికి బహిరంగముగ దాని నేమియుం జేయజాలక లోలోపలమతబోధకులకుం దొంటికంటె నెక్కుడు సహాయముం బ్రోత్సాహము చేయసాగిరి. ఆకాలమునునున్న యితరపత్రికలకుంజూపిన యాదరము దొరతనమువారు క్రిసెంటుపత్రికకుజూపరైరి. దీనికొక్క తార్కాణముగలదు. క్రిసెంటను పేరుతో నొక పత్రికయున్నదని లోకులకు దెలియంజేయుటకు గెజిటులో వేయుమనిపత్రికాధిపతి గవర్నమెంటువారికి విజ్ఞాపనముచేయ దక్కినపత్రికలన్నిటికి నట్టి యాదరముచూపిన గవర్నమెంటువారు దీనిపేరుతమగజిటులో వేయుటకు వీలులేదని తెలియజేసిరి.

ఈనడుమ దొరతనమువారు క్రైస్తవులలోగలసిన హిందువులకు కష్టములు లేకుండుటకు నొకచట్టము నిర్మింపందలంచిరి. ఆచట్టమును బట్టి క్రైస్తవమతములోగలసిన హిందువులకు స్వమతములోనున్నప్పుడువచ్చునట్టి పిత్రార్జితమగు నాస్తిలోం దమవంతు భాగము నిరాటంకముగ వచ్చును. ఈచట్టము ధర్మవిరుద్ధమనియుం బ్రజలకుహానికరమనియుందలంచి లక్ష్మీనరసుసెట్టి 1845 సంవత్సరము 9వ యేప్రియల్ తారీఖునం జెన్నపురములో మహాజనుల నందఱిని బిలిచి సభచేసిసీమలోనియధికారులకు మహజరు బంపుట కందఱనొప్పించెను. ఆసభకు సమస్తజనులు వచ్చి దొరతనమువారు చేయందలంచుకొన్న చట్టము

హిందువుల యాచారవ్యవహారములకుఁ విరుద్ధమనియు దానినినిర్మింప నీయవద్దనియుఁ బ్రార్థించుచు గొప్పమహాజరువ్రాసి యింగ్లాండునకు బంపిరి. చెన్నపురిదొరతనమువారికి సీమలోనియధికారులకుఁగొంతకాలము త్తరప్రత్యుత్తరము జరిగిన పిదప నట్టిచట్టము నిర్మించుట లేదని యింగ్లాండులోని యధికారు లభయమిచ్చిరి. ఈకార్యమున విఫలప్రయత్నులై క్రైస్తవమతబోధకులు తమమత వ్యాప్తికిమరియొకదారి వెదకికొనఁదలఁచి దృష్టిపాఠశాలలవంకఁ ద్రిప్పిరి. అదివఱకు దొరతనమువారి పాఠశాలలలో శాస్త్రవిద్యలేగాని మతము చెప్పుటలేదు. మతబోధకులు వారిప్రోత్సాహకులగు దొరలు బాలురనుపరీక్షించునప్పుడు వారు నేర్చిన శాస్త్రవిద్యలలోఁ బ్రశ్నలు వేయుటకు మారుగ మున్నెన్నఁడు వారు చదివియెఱుఁగని క్రైస్తవమత గ్రంథములలోను తత్త్వశాస్త్రములలోనుగల విషయములంగూర్చిప్రశ్నలువేసి యవిచెప్పలేనివారు గవర్నమెంటువారియుద్యోగమున కనర్హులనితోసివేయుచు వచ్చిరి. అట్లుచేయుట న్యాయమాయనిహిందువులుపాఠశాలాధికారుల నడుగ బైబిలుగ్రంథము బాలురచే పాఠశాలలో జదివించిన పక్షమున నిట్టిచిక్కులు రావనియు నట్లుచేయుటకు సమ్మతింపవలసినదనియు వారు చెప్పిరి.

లక్ష్మీనరుసుశెట్టియీదుర్న్యయమునడంపఁదలఁచి 1846వ సంవత్సర మక్టోబరు నెల 7 వ తారీఖున గొప్పసభచేసి యింగ్లాండులోనున్నడైరెక్టరులకు గొప్పమహాజరు వ్రాసి తమకుగలిగినయాయుపద్రవము నివారింపుమని ప్రార్థించుచుచాలమందిచేవ్రాళ్ళుచేయించియామహాజరును బంపెను. ఆమహాజరునందున్న ముఖ్యాంశములివి 1. మొదట హిందువుల మతవిషయముల జోలికిరామని గవర్నమెంటువారు వాగ్దానము జేసినను వెనుకటిగవర్నరుగారు తద్విషయమునవిరుద్ధముగ బ్రవర్తించిరి. 2 మతబోధకులు హిందువులబిడ్డలను స్వేచ్ఛగా స్వమ

తములోఁ గలుపుకొనుచున్నారు. దొరతనమువారి యుద్యోగస్థులువా రిం బురికొల్పుచున్నారు. 3 మతబోధకులు హిందూబాలకులపరీక్షల లోఁగృతార్థులై యుద్యోగమును సంపాదించుకొనకుండఁ బ్రయత్నిం చుచున్నారు. 4 చెన్నపురి రాజధానిలోని జిల్లాలలో పాఠశాలలు పె ట్టించి గవర్నరుగారు జనులు కింగ్లీషు చెప్పింపకున్నారు. 5 గవర్నమెంటు వారు తమకచేరీలలో హిందువులకు విశేషముగా బనులిచ్చుటలేదు. 6 న్యాయస్థానములగు కోర్టులఁ దరుచుగ నన్యాయమే జరుగుచున్న ది. 7 ఇదిగాక యీనాటివారనుభవించెడు ననేకకష్టములనుగూర్చియు వ్రాయఁబడియున్నది. ఆసభకు లక్ష్మీనరసు సెట్టి యగ్రాసనాధిపతి యయ్యెను. సభ మొదటినుండియు చివరవరకు నిశ్శబ్దముగ క్రమముగ రాజభక్తికి లోపములేనట్టుగా జరిగినను గొందఱు దొరలు సభలో నల్లరి జరిగెననియు నగ్రాసనాధిపతి రాజద్రోహగర్భితములగుమాటలనుపన్య సించెననియు వానిమూలమున జనులు పితూరిచేయుదురనియు జాటజొ చ్చిరి.. ఆసభలో, సెట్టి "మనకష్టములను పైయధికారులకు వినయపూ ర్వకముగా విన్నవించుకొందుమేని వారు మనయాపదలనునివారింపక పోరని చెప్పెనేకాని చెప్పగూడదనినేమియునుపన్యసింపలేదు. ఆమహా జరులో వ్రాలుచేయవలదని దొరతనమువారిపక్షమువారు కొందఱుజ నులను భయపెట్టిరి. గాని యెందఱు బెదరించినను దానిలో బండ్రెండు వేలజనులు వ్రాలుచేసిరి. అతఁడా మహాజరు చెనపురి గవర్నరుగారి ద్వారా సీమకుబంపెను. గవర్నరుగారా మహాజరు తనయొద్దకువచ్చిన ప్పుడు దానిమీఁద "జనులు గవర్నమెంటువారు చేయు కార్యములు నెఱుఁగక మిడిమిడిజ్ఞానముగలవారి ప్రేరణమున నిట్టిపనులు చేయు చున్నా"రని వ్రాసి యింగ్లాండునకు బంపిరి. గవర్నరుగారు వ్రాసిన వ్రాతలనుబట్టి యీమహాజరు సీమలో బుట్టదాఖలయ్యెను. జనులు మహాజర్లంపుచున్నారని సందేహించి దొరతనమువారు పాఠశాలలో

బైబిలు చదివించుట కొంతకాలము మాని 1853 వ సంవత్సరమున వెండియుఁ దద్విషయమునఁ బ్రయత్నించిరి. కాని నార్టనుదొరగారు, లక్ష్మీనరుసుసెట్టిగారు కలసి పాటుపడి యాపని సాగనియ్యరైరి.

ఆకాలమందే యింగ్లాండుపార్లమెంటుమహాసభలోనొకసభికుఁడగు డాంబిసేమరుదొరగారు హిందూదేశమ్మును జూడవచ్చిరి. సెట్టిపంపినమహజర్లవల్ల నతనిపే రింగ్లాండులో నిదివఱకే పార్లమెంటుసభికులకు బరిచితమైనందున సేమరుదొరగారు నావదిగినతోడనే లక్ష్మీనరుసుసెట్టి బాగున్నాఁడాయనియడిగెను. సెట్టియు వానిదర్శనముచేయవారిరువురకునొండొరులపై గౌరవము ననురాగము జనియించెను. సెట్టి దొరగారిని దనయింటగొంతకాలము విడియించి సమయముదొరికినప్పుడెల్లగవర్నమెంటువారు మతవిషయములలోను రాజకీయవిషయములలోనుజనులకుచేయుచుండిన యపకారములను మనస్సునకునాటునట్లు చెప్పుచువచ్చెను. సేమరుదొరగారు సెట్టిని వెంటబెట్టుకొని కడలూరుకుంభకోణము కోయంబత్తూరు మొదలగు దక్షిణహిందూస్థానములోని ముఖ్యపట్టణములకుఁబోయి సర్కారుకట్టిన దుర్భరములగుపన్నులిచ్చుకొనలేక రయితులుపడియెడు బాధలను స్వయముగాజూచెను. అతఁడు కొన్ని పట్టణములలో పన్నులిచ్చుకొనలేని రయితు లీక్రింద చెప్పఁబడిన విధమున దారుణ బాధల పడుచుండ జూచెను. కొందరు రయితులు మిట్ట మధ్యాహ్నపుయెండలో నడుములువంచుకొని నిలిచియుండిరి. వారి వీపులమీఁద సర్కారునౌకర్లు పెద్దరాళ్ళెత్తిరి. కొందఱికాళ్ళకు బొండవేసిరి. కొందఱిని మెడకుం గాలికి నంటకట్టి చెట్లకో స్థంభములకో వ్రేలదీసిరి. ఆ బాధలు పడలేక యా రయితులు గోలుగోలుమని యేడ్చుచుండిరి. ఇదియంతయుఁ తాలూకా కచ్చేరియెదుటనే జరుగుచున్నను మేజస్ట్రీటుగారు తహస్సీలుదారుగారు వారివంక కన్నెత్తియైన జూడక వారిమొరలు వినిపించుకొనక

సుఖముగా సంతోషముగా బని జూచుచుండిరి. నేమరుదొరగారు బ్రిటీషు గవర్నమెంటువారు పన్ను వసూలుచేయుటకు రహితులను బెట్టుచున్న యీ దారుణబాధలను కన్నులారచూచి జ్ఞాపకార్థమొక పుస్తకములో వ్రాసికొని యీదారుణకృత్యములలో నుపయోగింపఁ బడు పనిముట్లు కొన్ని పుచ్చుకొని కట్టగట్టి తనవారికి జూపుటకు సీమకు తీసుకొని పోయె

1854 వ సంవత్సరము జూలై నెలలో నేమరుదొరగారు పార్లమెంటులో హిందూదేశ ప్రసంగమునచ్చినప్పుడు హిందువులు హాని కరములగు దుష్కార్యములు చేసినందుకేగాక పన్నులిచ్చుకొనలే నందుకుగూడ గవర్నమెంటువారిచేత క్రూరముగ బాధింపబడు చున్నారని చెప్పెను. దేశము చూచివచ్చిన నేమరుదొర యట్టి బాధ లున్నవని చెప్పుచుండ మనదేశ మెన్నడెఱుఁగని పార్లమెంటుసభికులు చాలమంది యట్టిపీడలు హిందూదేశమున లేవని వాదించి యంతతో తనివినొందక వ్యర్థదోషారోపణములఁ జేయుటకు దేశమందలి మారు మూలలు తిరిగితివి గాఁబోలునని నేమరుదొరను నిందించి యధిక్షే పించిరి. ఇండియాబోర్డున కప్పుడు ప్రెసిడెంటుగానుండిన వుడ్డుదొరగారు మాత్రమది యబద్ధమై యుండదని దానింగూర్చి విచారణచేయఁ దలఁచి తద్విషయమున సాక్ష్యములు పుచ్చుకొమ్మని ప్రత్యేక మొక చిన్న సభ నేర్పఱచెను. ఆ సభవారు కొన్ని ప్రదేశములు తిరిగి యీ విషయమున సాక్ష్యములు తీసుకొని పార్లమెంటు మహాసభకు పంపిరి. దొరతనమువారి విచారణ జరుగు చుండ యీ విషయమున బ్రజల యభిప్రాయమునుగూడ యధికారు లకుఁ దెలియజేయవలయునని లక్ష్మీనరసు సెట్టి చాలమందిచేత వ్రాళ్ళుచేయించి యొక మహజరు పంపెను. ఇవియన్నియుఁ జేరిన

తోడనే పార్లమెంటువారు పన్ను లిచ్చుకొనలేని జనులను బాధించుట కార్జన్యమని యట్టి దురాచారము నడంచిరి.

1852 వ సంవత్సరమున లక్ష్మీనరసుసెట్టి ప్రేరణమున చెన్నపురి స్వదేశసంఘమువారు తమకష్టములన్నియుం బేర్కొని వానిని నివారింపుమని వేఁడుచు పార్లమెంటువారికి మఱియొక మహజరంపిరి. ఆ మహజరులో నున్న ముఖ్యాంశములివి. హిందూదేశమున వచ్చు బాధలన్నియు మితిమీరిన పన్నులవలనను వానిని వసూలుచేయు క్రూరపద్ధతుల వలనను గవర్నమెంటువారి కోర్టులలో జరుగు నాలస్యము దుర్వ్యయము మొదలగు వానివలనను సంభవించుచున్నవి. మాకు ముఖ్యముగా గావలసినవి మంచిరోడ్లు వంతెనలు చేల కదును దప్పకుండ నీరిచ్చు కాలువలు పల్లెటూళ్ళ బాలురకు విద్యనేర్పు పాఠశాలలు మొదలగునవి. గవర్నమెంటు పరిపాలనా విషయమునఁ జేయు వ్యయము తగ్గింపవలయును. దేశమభివృద్ధి పొందునట్లు ప్రజలు సుఖపడునట్లు గవర్నమెంటువారు ప్రభుత్వము చేయవలయును. పై సంగతులన్నిఁటిని వ్రాసి వారా మహజరులలో చిట్టచివర నీక్రింది వాక్యములఁ బొందుపరచిరి. “హిందూదేశ పరిపాలన మిప్పుడున్నట్లు కంపెనీవారి చేతిలోనున్నను సరే, లేక మరియొకరిచేతిలో నున్నను సరే, పాలించు పద్ధతిలో మార్పులు కాలాను సారముగ నభివృద్ధులు తప్పకనుండవలయును. ఆమార్పులు మూఁడేండ్లకొకసారిగాని లేనిచో నైదేండ్లకొకసారిగాని దేశముయొక్క స్థితినిబట్టి యవసరములనుబట్టి చేయుచుండవలయును. విశాలమైన యీ దేశమునందుండు ప్రజలు తమపడు సంకటములు తెలిసికొను పైవారికిఁ దెలుపుకొనుటకును, దెలుపుకొనినపిదప తగిన విచారణ జరుగుటకు పార్లమెంటు మహాసభలో నప్పుడప్పుడు హిందూదేశ విషయమున జర్చలు జరుగుచుండవలయును. ఇక్కడ దొరతనముచేయువారు జాగ్రత్తతో ప్రజాపాల

నము చేయుచున్నవారో లేదో కనుగొనుటకు సీమలోనున్న పైయధి కారులు వీరుచేయు పనులను శ్రద్ధతో విమర్శించు చుండవలయును"

ఈ పై మహజరు 1853 వ సంవత్సరము ఫిబ్రవరునెల 25 వ తారీఖున పార్లమెంటు ప్రభుసభలో నెల్లింబారొప్రభువుగారు దాఖలు చేసిరి. ఆ సభలో మఱియొక ప్రభువు హిందూదేశ విషయమునం బ్రసంగించుచు సభికులతో నిట్లని చెప్పెను. "ఈ మహజరులోనున్న సంగతులు సత్యములని తెలుపుటకు హిందూదేశస్థులవలన వ్రాయ బడిన యుత్తరములు రెండు నాయొద్దనున్నవి. ఆయుత్తరములు వ్రాసిన వారు పెద్దమనుష్యులు యోగ్యులు. మనవలెనే వారు నింగ్లీషు చక్కగా వ్రాయగలరు మాటలాడఁగలరు. ఆయిద్దరిలో నొకరు లక్ష్మీ నరుసు సెట్టిగారు. ఆయన 1853 వ సంవత్సరం జనవరి 24 తారీఖున నా పేర నీక్రింది విధముగా నుత్తరము వ్రాసినారు. "మేము పడు చున్న బాధలను విచారణ సేయుట కొక ప్రత్యేక సభ యేర్పడు నేని మేముచెప్పిన విషయములన్నియుఁ కన్నులకు గట్టినట్లు ఋజువు కాగలవు. అవి వివరించుటలో మే మతిశయోక్తిని విడిచినాము. వాని సత్యము ప్రత్యేకసభవారు సాక్ష్యములు తీసికొనుటవలననేగాని మఱి యొక లాగున యూరపుఖండమువారికిఁ దెలియదు."

అని యాప్రభువు లక్ష్మీనరుసుసెట్టి మాటలయందు మిక్కిలి గౌరవము నమ్మకము గలిగి మాటలాడెను. ఆసంవత్సరమే పార్లమెంటు సభలోఁ బ్రధానసభికుఁడు లోకానుభవము గలవాఁడు నగు బ్రైటు దొరగారు లక్ష్మీనరుసుశెటి వ్రాసిన యుత్తరములు తాను జూచినట్లు వాని మాటలు తనకు సత్యములని తోఁచినట్లుచెప్పి హిందూదేశస్థులు పడు బాధలను విచారణసేయుటకుఁ ప్రత్యేకసభ నొకదాని నేర్పరుప వలసినదని పట్టుపట్టెను. లక్ష్మీనరుసు సెట్టి వెనుకపంపించిన మహజర్లతో దృష్టినొందక హిందూదేశప్రభుత్వము కంపెనీవారియొద్దనుండి

తీసుకుని యింగ్లాండు రాజుగారుస్వయముగా బరిపాలించిన బాగుండు నని ప్రార్థించుచు పదునాలుగువేల జనులచేత వ్రాళ్ళుచేయించి పార్లమెంటుకు మఱియొక మహజరు పంపించెను. చెన్నపట్టణమందు లక్ష్మీనరుసుసెట్టియు, బొంబాయియందు కొందరు, బంగాళమునందు మఱికొందరుఁ బడిన పరిశ్రమచేత పార్లమెంటువారు మనదేశప్రభుత్వము కంపెనీవారియొద్దనుండి తీసికొనక పోయినను కొన్ని ఘూర్పులఁజేసిరి. అందు ముఖ్యమైనవి: "హిందూదేశములో గొప్ప యుద్యోగములు పరీక్షలయందుఁ గృతార్థులైనవారికే గాని యధికారులకుఁ దోఁచిన వారి కియ్యఁగూడదు. అదివఱకున్న సాదరుకోర్టులుపోయి హైకోర్టులు వాని స్థానమందు వచ్చెను." అంతలో హిందూదేశమున గొప్ప సిపాయిపితూరీ 1847 వ సంవత్సరమున బుట్టుటచే 1858 న సంవత్సరమున హిందూదేశప్రభుత్వమును స్వయముగా నింగ్లాండు దేశపు రాణీగారగు విక్టోరియారాణిగారే వహించిరి.

పచ్చయ్యప్ప మొదలియారను సత్పురుషుఁ డొకఁడు సత్కార్యముల నిమిత్తము లక్షలకొలఁది రూపాయలిచ్చి చనిపోయెను. ఆ ధనమునకుఁ గొందఱు ధర్మకర్తలేర్పడి పాఠశాలలు మొదలైనవి పెట్టించిరి. లక్ష్మీనరుసుసెట్టిగారు పరోపకారపారీణుఁడగుటచే ధర్మకర్తగా నుండఁదగినవాఁడని తక్కినవారు వానింగూడ నందు చేర్చుకొనిరి.

ఇట్లు ప్రజాపక్షము వహించి పనిచేయుటచే లక్ష్మీనరుసుసెట్టి రాజద్రోహియనియు విశ్వాసపాత్రుఁడు గాఁడనియుఁ దొరతనము వారు భావించి యతఁడిచ్చిన యుపన్యాసములను మిక్కిలి శ్రద్ధతో శోధించుచు నతఁ డెక్కడికిఁబోయిన నక్కడకు వెంటవెంట పోలీసు వారిని బంపుచుండిరి. 1857 వ సంవత్సరమున జరిగిన సిపాయి పితూరీకిఁ గారణము దొరతనమువారు మతసంబంధము కలుగజేసికొను

టరేమో. అటుపిమ్మట నట్టిమత సంబంధము కలుగఁజేసికొనవచ్చునని సెట్టి గవర్నమెంటువారి కొక మహజరు పంపించెను. ఆమహజరు మిక్కిలి బాగుండెనని శ్లాఘించి యింగ్లాండులోని యధికారులు వారి యాలోచనము సంగీకరించిరి. ఇట్లు కొంతకాలము గడచు నప్పటికి మునుపు సెటిగారిమీఁద ద్వేషము పూనిన దొరలు క్రమక్రమముగ నుద్యోగములు ముగించుకొని స్వదేశములకుఁ బోవుటచేతను సెట్టిగారిమీఁద లోకుల కంతకంత కనురాగము హెచ్చుచుండుటచేతను దొరలలోఁ గొందఱు సయితము వానిధైర్యము నకు వానిపరోపకారచింతకు నద్భుతము నొంది శ్లాఘించుటచేతను,అప్పటి చెన్నపురిదొరతనమువారు వానిని నిందింపఁమానిరి. మానుటయేగాక యాదొరతనమువారు వానిచేసిన దేశోపకారముల మెచ్చుకొనుచు వానికి C. S. I. అను బిరుదము నిచ్చి గవర్నరుగారి శాసననిర్మాణసభలో నొక సభికుఁడుగ 1863 వ సంవత్సరమున నేర్పఱచిరి. ఆపదవియందు వాని నుంచుట సమస్తమతములవారికిసమస్తజాతులవారికిఁ దృప్తికరముగ నుండెను.

అటుమీఁద లక్ష్మీనరుసుసెట్టి తనదృష్టి మైసూరురాజ్య వ్యవహారములవంక నిలిపెను. ఇంగ్లీషువారు మైసూరును జయింపఁబోయి నప్పుడు హైదరాబాదు నిజాముగారి సహాయముఁ బడసి మైసూరు సంస్థానము స్వదేశరాజుల కీయకపోయినపక్షమున నిజామును దామును గలిసి పంచుకొనునట్లొడంబడిక చేసుకొనిరి. లక్ష్మీనరుసుసెట్టి మైసూరుసంస్థాన మింగ్లీషువారు దానిరాజున కప్పగింప నిష్టములేకున్న వారని తెలిసికొని స్వయముగ మైసూరువెళ్ళి వృద్ధరాజును దర్శించి వంశపరంపరగ నుండునట్లుపుత్రుం బెంచుకొమ్మనియుఁ బెంపుస్థిరపరచ దొరతనమువారిని నొక్కి యడుగవలసినదనియు వానికి హితోపదేశముచేసెను. ఒకవేళ యింగ్లీషువారు మైసూరురాజుయొక్క పుత్రి

స్వీకారము నంగీకరింపకబోవుదురేమో యనుభయమున లక్ష్మీనరుసు హైదరాబాదు నిజాముగారి మంత్రియు సుప్రసిద్ధుఁడు నగు సలారు జంగును గలిసికొని మైసూరు సంస్థానము రాజునకు దొరతనము వారియ్యనియెడల వెనుకటి యొడంబడికను బట్టి నిజామునకు సమముగా బంచిపెట్టవలసినదని యడుగుమని యాయనంబురికొల్పెను. అప్పుడింగ్లీషువారు మైసూరురాజుయొక్క పుత్రస్వీకారము నంగీకరించుటయో లేక నిజామున కందులో భాగము పంచిపెట్టుటయో రెంటిలో నేదోయొకటి చేయవలసివచ్చినందున రాజునకు సంస్థానమిచ్చుట యెక్కుడు గౌరవమని దత్తపుత్రుఁడు యుక్తవయస్కుఁడైన పిదప రాజ్యమిచ్చునట్లొప్పుకొనిరి. సెట్టి జాన్‌బ్రైట్ నార్టనుదొరగారితోఁగలిసి రాజ్యభ్రష్టుఁడైన తంజావూరి మహారాజుభార్యల దురవస్థను గొంతవఱకు చక్కపఱిచి మృతినొందిన కర్నాటకనవాబు గొక్క కుటుంబ మనుభవించు కష్టములను జాలవఱకు తగ్గించెను. ఈపనులు 1864 వ సంవత్సరమున జరిగెను.

అప్పటికి సెట్టిభాగ్యము క్షీణించెను. క్రెసెంటుపత్రిక నడపుటకే వాని ధనమంతయు వ్యయమయ్యెను. అతఁడు తన వ్యాపారము కుమారున కప్పగించుటచేత వాని తెలివితక్కువవలన నదబొత్తిగచెడిపోయెను. కావలసినధనములేమి క్రెసెంటుపత్రిక ప్రకటింపఁబడుట మానెను. అది మొదలుకొని లక్ష్మీనరుసుసెట్టి జీవితకాలశేషము పేదయై గడపెను. ఆయన 1868 వ సంవత్సరమున మృతినొందెను. ఆయనదేహము నశించినను కీర్తిదేహ మిప్పటివఱకు దక్షిణహిందూస్థానముననున్నది. ఆయన మృతినొందిన కొన్నినాళ్ళకు చెన్నపురిమహాజనులు పచ్చయ్యప్పగారి పాఠశాలలో సభగూడి వానిమరణమునకు మిక్కిలి విచారించి వానిపేరు చిరకాలము జ్ఞాపకముండుటకు వానిబొమ్మయొకటి నిర్మింపఁజేసి యదియాపాఠశాలలో బెట్టుటకు

ను ప్రెసిడెన్సీకాలేజీలో సంస్కృతము జదువుకొనుబాలురలో సూక్ష్మబుద్ధిగలవానికి నెలకుకొంతసొమ్ము విద్యార్థివేతనముగ నిచ్చుటకును గృతనిశ్చయులైరి. ఆరెండుకార్యములకుఁ గావలసినధనమునాకాలపు గొప్పవారందఱిచ్చిరి. తిరువాన్కూరుమహారాజుగారు,వారి మంత్రి సర్. టి. మాధవరావుగారు సెట్టిగారిమరణమునఁ దమకుఁగలిగిన సంతాపము నెఱిఁగించుచు గొంత చందాసొమ్ము బంపిరి. ఈయన దేశాభిమానులలో బ్రథమగణ్యుఁడని చెప్పవచ్చును. సాధారణముగ దేశోపకారము జేయఁబూనువారు ప్రజలమెప్పుకొఱకు దొరతనము వారిచ్చు బిరుదుతోఁకలకొఱకు నెదురుచూతురు. ఈసెట్టిగారు సంపాదించిన ధనమంతయు లోకహితముకొఱకు వ్యయముచేసి దొరలకోపమునకు పాత్రుఁడై ప్రజాపక్షముబూని పాటుపడి కడకు నిరుపేదయై చచ్చెను. దొరతనమువారి లోపములను మొగమోటములేక ఖండించి చెప్పుట కీదినములలో నయితముగొప్ప విద్యావంతులు ధనవంతులు భయపడుచుండ నేబది యఱువది యేండ్లక్రిందట నింగ్లీషువిస్తారము రానివాఁడు గొప్పపరీక్షల గృతార్థుఁడుకానివాఁడు దొరతనమువారితో బ్రతికక్షుబూని నిర్వహించుట యెంతకష్టమో యోచింపుడు. మొదట వాని మంచితనమెఱుగక దొరలు వానినే వంచించుకొన్నను నిజము నిలుకడమీఁద తెలిసికొని త్రాఁచుబాము మనుకొన్నది పూలదండయయ్యెనని తలంచి దూషించినవారె భూషించిరి. ఆతఁడు నిజమైన లోకోపకారబుద్ధిగలవాఁడగుటచే స్తోత్రములకుబ్బక నిందలకు వెఱువక తాను మంచిదని నమ్మినపనిచేసెను. ఈతఁడు రాజకీయవ్యవహారములయందేగాక సంఘసంస్కరణమునందు నిష్టముగలవాఁడె. వితంతువివాహములు మంచివని యీయన యభిప్రాయము. స్త్రీవిద్యాభివృద్ధికి స్వధనముతోఁ గొన్ని పాఠశాలలు పెట్టించెను. అరవపండితులకుఁ దెనుఁగు పండితులకుఁ జాలసహాయము చేసెను. వేయేల! లక్ష్మీనరుసుసెట్టియేలోకోపకారి. అతఁడేధన్యుఁడు.



సి. వి. రంగనాథశాస్త్రి.

సి. పి. రంగనాథశాస్త్రి.

కలమూరు వీరవల్లి రంగనాథశాస్త్రి చెన్నపురిరాజధానిలోని చిత్తూరుపట్టణమునకు సమీపమున నున్నయొక గ్రామములో 1819 సంవత్సరమున జన్మించెను. అతనితండ్రి మిక్కిలి దరిద్రుఁడు. సంస్కృతమునందు గొప్ప పండితుఁడు. నిరుపేదతనమునకు నిలయమైన యింటఁ బుట్టి పెరుగుటచే దల్లిదండ్రులా బాలునకు సంస్కృతవిద్యతప్ప మఱియొకవిద్యనేర్పింపలేకపోయిరి. బాల్యమందతఁడు కుశాగ్రబుద్ధియని చెప్పుదురు. ఎనిమిదేండ్లయీడుననే సంస్కృతము చక్కఁగ మాటలాడుటకు శ్లోక మన్వయించుటకు నతఁడు సమర్థుఁడయ్యెను. ఆటలయందు వానికి మిక్కిలి యభిరుచి కలుగుటచే నతఁడు వీధిబాలురతోఁ గలిసి గంతులువేయుచుండును. పదియేండ్లకాలమున నతఁడు గ్రామములోని పొడవైనచెట్లన్ని యెక్కి యెత్తయిన గోడలన్ని దాఁటి యాటలాడుచువచ్చెను. అతఁడు పన్నెండుసంవత్సరముల వయస్సువాఁడైనప్పుడు ముందుముందు వానిగొప్పతనమునకుఁ గారణమైన యొక సంగతి జరిగెను. అతనితండ్రి దొరతనమువారియొద్ద గొన్నిగ్రామముల నిజారాకుబుచ్చుకొని పంటలు చెడిపోవుటచే దాను చెల్లించవలసినసొమ్ము చెల్లింపలేకపోయెను. ఆకాలపు పద్ధతినిబట్టి దొరతనమువారు శిస్తు చెల్లించనందున వానిని చెరసాలలోఁ బెట్టిరి. తండ్రి కారాగృహమునందుండఁగా రంగనాథుని తండ్రిగారి యాబ్దికదినము సమీపించెను. రంగనాథుని తల్లి యేమిచేయుటకుఁదోఁచక యేడువసాగెను. రంగనాథుఁడు తల్లికడకుఁబోయి యామెదుఃఖకారణము, దెలిసికొని మిక్కిలిజాలినొంది చెఱనుండి తండ్రిని విడిపించి తెచ్చుటకై చిత్తూరుపట్టణమునకుబోయెను. పోయి జిల్లాజడ్జిగారిదర్శనముచేసి తనవచ్చినపనిమనవిచేసి తండ్రిని విడిపింపుమని ప్రార్థించెను. ఆమనుష్యుని మరలదీసికొనివచ్చి

యప్పగించుటకుఁ దగినవారు జామీనుగానున్న పక్షమున చెఱనుండి విడువఁబడుననియు లేని దేవలనుపడదనియు జడ్జి బాలకునితోఁ జెప్పెను. అప్పుడు రంగనాథుఁడు జడ్జితో "నేనుతప్ప జామీనిచ్చువారెవరు లేరు. మాతండ్రి యాబ్రీకముబెట్టి మరలవచ్చువఱకు వానిబదులు నేనాచెఱ సాలలోఁగూర్చుండెద" నని ప్రత్యుత్తరముగఁ బలికెను. పండ్రెండేం డ్లబాలుని నోటనుండి వచ్చిన యాసాహసపు బలుకులు జడ్జి మనస్సు వెంటనే కరగించెను. తక్షణమే యాజడ్జి వానితండ్రిని జెఱనుండివిడువ వలసినదని యుత్తరువుఁజేసి రంగనాథునిఁగూడ తండ్రితో నప్పటికిఁ బొమ్మని చెప్పి మఱునాఁడొకసారి తనకుఁ గనఁబడుమని యానతిచ్చె ను. తండ్రిని విడువవలసినదని జడ్జివ్రాసిన యుత్తరువు రంగనాథుఁడే స్వయముగ కారాగృహాధికారులయొద్దకుఁ దీసికొనిపోయి తండ్రిని విడిపించుకొని రాత్రిప్రొద్దుపోవునప్పటి కిల్లు జేరెను. తలవనితలంపుగ భర్త బందెనుండి విముక్తుండై వచ్చుటఁజూచి యాయిల్లాలు మిక్కి లి యక్కజపడి వానివిడుదలకుఁ దనచిన్నబిడ్డఁడే ముఖ్యకారకుఁడని విని పట్టరాని యానందమునొంది బాలుని పలుమారు ముద్దుపెట్టుకొ ని మెచ్చుకొనెను. ఆనాటిరాత్రి తలిదండ్రులు తనకుఁజేసిన గారా మును తనయెడఁజూపిన యాదరమును రంగనాథశాస్త్రి పెద్దయైనపిద పఁగూడఁ దలంచి మిత్రులతోఁజెప్పి సంతసించుచువచ్చెను. మఱు నాఁ డుదయమున రంగనాథుఁడు దొరగారియాజ్ఞ మరువక చిత్తూరు నకుఁబోయి వేళమీఱకుండ జడ్జిదర్శనము చేసెను. ఆదొర వానినెం తయు గౌరవముతో నాదరించి సంసారస్థితినడిగి "కర్చులన్నియు నేనే పెట్టుకొని యింగ్లీషు చెప్పించినచో నీవు చదువుకొందువా?" యని యడిగెను. తల్లిదండ్రులతో నాలోచింపక నేయుత్తరము నిచ్చుటకు వీలులేదని పితృవిధేయుఁడగు నాబాలుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. అది విని వెంటనే వానితండ్రిని బిలిపించి కుమారుఁ డింగ్లీషు చదువుకొను

టకు సెలవొసంగుమని బ్రతిమాలి యెట్టకేల కతని నొడంబఱచి జడ్జి స్వయముగా రంగనాథున కింగ్లీషక్షరములు ప్రారంభించి చెప్పెను. రంగనాథునిబుద్ధి పాదరసమువలె ప్రవహించెను. ఆరంభించిన యాఱుమాసములకే యతఁడింగ్లీషు చక్కఁగఁ జదువనేర్చెను. జడ్జి కార్య భారముచేత తీరుబడిలేక బాలుని గ్రహణశక్తికిఁ దగినంతవిద్యనేర్పుటకు దనకు వీలులేనందున జిత్తూరు పట్టణములో నివసించుచుండిన క్రైస్తవమతబోధకుఁడగు గ్రోవసుదొరగారికి బాలు నప్పగించి విద్యనేర్పి బాగుచేయుమని చెప్పెను. గ్రోవసుదొరగారు ప్రాతఃకాలమంతయు రంగనాథునకు విద్యనేర్పుటలోనే గడపుచు వాని ననేకవిధముల నా దరించుచువచ్చెను. దొరసానియు వానినిబిడ్డవలెజూచెను. రంగనాథునిబసకు గ్రోవసుదొరగారిబసకు నయిదుమైళ్ళుండెను. ఒకనాఁడుదయమున రంగనాథుఁడు కాళ్ళీడ్చుకొనుచు నైదుమైళ్ళు నడచిరా దొరసాని వానింజూచి చల్దియన్నముఁ దినివచ్చితివాయని వాని నడిగెను. లేదని బాలుఁడు త్తరముచెప్ప నాదయామయి తన సేవకునిం బిలిచి "యీబాలుఁ డూరినుండి రాఁగానే ప్రతిదినము వానికి మూఁడుసోలల పాలియ్యవలసిన"దని యానతిచ్చెను. రంగనాథుఁడుపెద్దయైగొప్పవాఁడై నపిదపఁగూడగ్రోవసుదొరయుదొరసానియుఁదనకప్పుడప్పుడుగావించుచువచ్చిన మితిమీరినమహోపకారముల నెన్నుచు వారియెడఁగృతజ్ఞుఁడై యుండెను. గ్రోవసుదొరకు గణితశాస్త్ర మభిమానశాస్త్రము. రంగనాథునకు దానియందభిరుచి మెండుగఁ గలిగెను. గణితశాస్త్ర ప్రవేశముచేత రంగనాథునకు జ్యోతిశ్శాస్త్రమునందుఁ జాలయభిమానము పుట్టెను. ఈయభిమానము వాని జీవితకాలాంతమువఱకు నుండెను. కాలక్రమమున రంగనాథుని జ్ఞానము మిక్కిలి యభివృద్ధిఁబొందెను. వాని మేలుకోరిన జడ్జిగారు గ్రోసుదొరయొద్దనతఁడుచదివిన చదువుతోఁ దనివినొందక యింకనెక్కుడు విద్య నేర్పింపవలయునని వా

నిం జెన్నపట్టణమున కంపఁదలంచెను. తలిదండ్రులు మొదట దాని కిష్టపడరైరి. కాని జడ్జిగారి ప్రేరణవలన తుదకువారొడంబడజడ్జి చెన్న పట్టణములో గ్రామర్‌స్కూలులో ముఖ్యోపాధ్యాయుఁడుగా నున్న కెర్‌దొరగారివద్దకు రంగనాధశాస్త్రిని కొన్నియుత్తరములు వ్రాసి యిచ్చి పంపెను. కెర్‌దొర బాలుని విద్యాసక్తిజూచి యాశ్చర్యపడెను. కెర్‌దొరగారు మొదటకొంతకాలము చెన్నపట్టణములోను పిదప కొంతకాలము కలకత్తానగరములోను నుపాధ్యాయుఁడై యుండి హిందువుల కనేకుల కుపకారములుచేసి స్వదేశమునకుఁబోయి యచ్చట హిందువులగృహ్యాజీవితములనుపేర నొకగ్రంథమువ్రాసి ప్రచురించెను. ఆగ్రంథములో సందర్భవశమున నతఁడు రంగనాధశాస్త్రి నిఁగూర్చి యిటులవ్రాసెను. "రంగనాధుఁడు నేను కలుసుకొనుట మాపరస్పరాభివృద్ధికే యని చెప్పవచ్చును. పగలు నిర్వహింపవలసిన కార్యములు నిర్వహించి మేమిరువురము సాయంకాలము యేదోవిషయముంగూర్చి చర్చలో దిగుచుండువారము. తెలివిగల దొరబుద్ధికిని రంగనాధుని బుద్ధికిని నాకేమియు భేదము కనఁబడలేదు. బుద్ధియటుండ వాని సౌజన్యము సత్యగౌరవము మిక్కిలిశ్లాఘనీయములు."

రంగనాధశాస్త్రి చెన్నపట్టణములో చదువుచుండినకాలమున జడ్జిగారు వానినిగూర్చి మునుపటికంటె నెక్కువశ్రద్ధవహించిరి. ఆయన కెర్‌దొరపేర వ్రాసిన యొకయుత్తరములోని యీక్రింది సంగతులు చూచిన వానియభిమానము తెలియును. "నీదగ్గఱ రంగనాధుఁడు చదువుకోవలసినంతకాలము జ్ఞానాభివృద్ధికై జదువుకొనవలసినదని నాయభిప్రాయము. నీదగ్గఱనుండుటచేత వాని యదృష్టము బాగున్నదని నే దలంచెదను. ఆసంగతి యెఱిఁగి యతఁడుఁగూడ నీ బోధనవలనఁ గలుగులాభము పొందుగాక! అతఁడు నిఘంటువులు గొప్ప పుస్తకములుఁ జదువుకొనఁగల సమర్థుఁడైన పక్షమున నెట్టి

యాటంకములేక వానికిఁ గావలసిన పుస్తకము లన్నియు నీయవల యును కాని యాపుస్తకము లతనికిఁ బూర్తిగా నిచ్చినట్లు చెప్ప వద్దు. ఎవరు పుస్తకము లిచ్చినారో వారిపే రంతకుమున్నే చెప్ప వద్దు. పుస్తకములన్నియు మొదట నెరువిచ్చినట్లిచ్చి చదువుమాని వెళ్ళునప్పుడు వానికి సొంతముగ నీయవలయును."

1839 వ సంవత్సరమున చిత్తూరులోనున్న యాజడ్జికిఁ జెన్న పట్టణమందు సుప్రీముకోర్టులో జడ్జిపని యయ్యెను. కెర్ దొరగారు కలకత్తాకు వెళ్ళిరి. జడ్జిగారు రంగనాథుని వెనుకటిపాఠశాలలో నుం చుట కిష్టపడక దొరతనమువారి హైస్కూలునకు పంపఁదలఁచి ప్రి ధానోపాధ్యాయుఁడగు పవెల్‌దొరగారి కుత్తరమిచ్చి బాలకు నంపె ను. రంగనాథుని జేర్చుకొన్న స్వల్పకాలములోనే వానిబుద్ధియెట్టిదో పవెల్‌దొరకు తెలిసెను. ఆబాలునకు గణితశాస్త్రములోనున్న ప్రజ్ఞను బట్టి పవెల్‌దొరగారు వానిచేతఁ గ్రిందితరగతుల కాశాస్త్రములోఁ బాఠములు చెప్పించుచు వచ్చిరి. రాజా సర్. టి. మాధవరావుగా రప్పుడు చిన్నతరగతిలోనుండి రంగనాథశాస్త్రియొద్ద చదువుకొనిరి. 1842వ సంవత్సరమున రంగనాథశాస్త్రి హైస్కూలు పరీక్షకుఁబోయి శ్లాఘనీయముగఁ గృతార్థుఁ డయ్యెను. ఆపరీక్షకుఁ బోయినవారిలోఁ నతఁడె మొదటివాఁడు. కృతార్థులైనవారిలోను మొదటివాఁడె. అ తనిపే రిప్పటికిని జెన్నపురి ప్రెసిడెన్సీ కాలేజిలోఁ గృతార్థులైన బాలకుల పట్టికలో మొదటనున్నది. పరీక్షయందుఁ గృతార్థుఁ డైన పిదప నతఁడు తనకు మహోపకారియైన జడ్జినిఁ జూడఁబోయెను. ఆ దొరగారు వానినిఁజూచి లేచి చేతులు చాచి కౌఁగిలించుకొని "రంగ నాథా! నాకు మాట దక్కించితివి. నేను ధన్యుఁడనైతిని. నిన్ను దేవుఁడు రక్షించుగాక!" యని బహూకరించెను.

ఏపనిలోఁ బ్రవేశించుట బాగుండునని పిమ్మట వారిద్దఱుయో

చించిరి. రంగనాథున కుపాధ్యాయుఁడుగ నుండవలయునని కోరికకల దు. అందుచేత జడ్జిగారు పవెల్ దొరగారు చెన్నపురిలో లాయరుగా నుండిన నాఁటనుదొరగారు రంగనాథున కాయుద్యోగమిాయవలసిన దని దొరతనమువారికి సిఫారసు చేసిరి. ఎవరెంత ప్రయత్నముచేసి నను వానికాయుద్యోగము దొరకలేదు. అందులోఁ దండ్రికిఁ బ్రాణా ముమిాఁదికి వచ్చినదని వర్తమానము తెలియ రంగనాథుఁడు చిత్తూరు పోవలసివచ్చెను. పోవునప్పుడతఁడు జడ్జినిజూచి వార్ధకమునందు తం డ్రిఁంగనిపెట్టుకొని యుండుటకు వీలగునట్లు చిత్తూరులో నేదయిన యు ద్యోగమిప్పింపుమని యడిగెను. ఆదొరగారు రంగనాథుఁడేమడిగిన నది చేయుటకు సిద్ధముగ నున్నందున వెంటనే చిత్తూరు కలక్టరు కొకజాబు వ్రాసి యిచ్చెను. ఆజాబు కలక్టరు చూచుకొన్న కొన్నినాళ్ళలోనే రంగనాథునకుఁ జిత్తూరు సబుకోర్టులో నెలకు డెబ్బది రూపాయలు జీతముగల హెడ్డుగుమస్తాపని యయ్యెను. ఆపనిలోనుండగ నతనికి నెంతో తీరిక కలిగినందున గాలము వృధసేయక యతఁడు జ్ఞాననిధిని వృద్ధిపరచుకొనఁ దలఁచి తెలుఁగు కన్నడము హిందూస్తానీ పారసీ భాషలఁ జదువ నారంభించెను. ఆభాషలలోనున్న కోర్టుకాగితము లన్నియు నతఁడే స్వయముగ నింగ్లీషులోనికి మార్చుచు వచ్చెను. ఆయఖండశక్తిఁ జూచి పైయధికారు లందరు విస్మితులగుచు వచ్చిరి.

అతనికి చెన్నపట్టణమందు హైకోర్టులో నుద్యోగము చేయ వలయునని మహాభిలాష యుండెను. దానికిఁదోడుగ వానితండ్రియు మృతినొందుటచే నతఁడు చిత్తూరు విడువఁదలఁచి యదనువెదకుచుండ నంతలో హైకోర్టులో భాషాంతరీకరణము చేయువాని యుద్యోగము కాళీ యయ్యెను. హైకోర్టువారు పరీక్షచేసి తగినవారి కాయుద్యోగ మిాయదలఁచిరి. రంగనాథుని ప్రాపకుఁడగు జడ్జీ హైకోర్టులోనే యున్నందున వెంటనే యతఁడాసంగతి రంగనాథున కుత్తరమువ్రాసి

తెలిపి శీఘ్రముగ దరఖాస్తు పంపుమనియెను. రంగనాథశాస్త్రి తన దరఖాస్తులోఁ దాను ద్రావిడము తెనుఁగు మరాటి కన్నడము హిందూస్తానీ పారసీ ఇంగ్లీషను నేడుభాషలలో లేశమైన దడుముకొనక తర్జుమాచేయఁగలిగినట్లు వ్రాసెను. దరఖాస్తుదారులలో నంతటివాఁడెవ్వఁడు లేనందున నుద్యోగము వానికే సీయఁబడెను. హైకోర్టు తర్జుమాదారగుటచే రంగనాథుని ప్రజ్ఞలు వెల్లడియగు నవసరములనేకములు వచ్చెను. హైకోర్టు జడ్జీలు ప్రత్యక్షముగ వాని భాషాంతరీకరణముఁ జూచుచుండుటచే వానిసామర్థ్యము త్వరలోనే తెలిసెను. అందుచేత వారు తరుచుగ కోర్టులోనే వానిసామర్థ్యమును మెచ్చి పొగడుచువచ్చిరి. దక్షిణహిందూస్థానములోని భాషలన్నియు నేర్చి రంగనాథశాస్త్రి, విద్యాశక్తి యధికముకాగా యూరపుఖండములోని భాషలను చదువనారంభించెను. ఆరంభించిన స్వల్పకాలములోనె ఫ్రెంచిలాటినుభాషలలో దృఢప్రవేశము కలిగెను. ఒకనాడు ఫ్రెంచిభాష మాటలాడగల మనుష్యునికొఱకు హైకోర్టువారు వెదకుచుండిరి. అప్పుడు రంగనాథశాస్త్రి సిద్ధమయ్యెను. ఫ్రెంచి యతనికి వచ్చునని యెవ్వరెఱుంగకపోవుటచే వాని సాహసమునకు జడ్జీ తెల్లబోయి కానిమ్మని యవలీలగను స్వచ్ఛముగను రంగనాథుఁడుచేయు తర్జుమా చూచి యద్భుతమునొందెను. అది మొదలు జడ్జీలు వాని నొక తాబేదారుగఁ దలఁపక సమానుఁడగు మిత్రుఁడుగా భావింపసాగిరి. తరుచుగ వారు వానిని దమ గృహములకు సగౌరవముగరావించి సెలవుదినములలో ననేకవిషయములనుగూర్చి వానితో జర్చింపుచు వచ్చిరి.

ఆదినములలో హైకోర్టులోఁ దర్జుమాదారుగ నున్నవారి కిప్పటివలె జీతమిచ్చుటగాక తర్జుమాచేసిన కాగితములకు రుసుము ముట్టుచువచ్చినందునను రంగనాథునకుఁ జాలభాషలలోఁ బ్రవేశముండుట

చేత నెలకు రమారమి రు 2,500 లు వానికి వచ్చుచుండెను. అప్పటికతనికి సంస్కృతమునందుఁ బాండిత్యము పరిపూర్ణమగుటచే హైకోర్టులో హిందూధర్మశాస్త్ర విషయములుగల వ్యాజ్యములుగల వ్యాజ్యములన్నిఁటిలోను జడ్జీలు వాని యాలోచనము ముఖ్యముగ గ్రహించుచు వచ్చిరి. 1857 వ సంవత్సరమున చెన్నపట్టణపు యూనివర్సిటీ స్థాపింపఁబడినప్పుడు రంగనాథుఁ డొక ఫెల్లోయయ్యెను. 1859 వ సంవత్సరమున సర్ చార్లెసు ట్రివిలియన్ దొరగారు చెన్నపట్టణపు గవర్నరుగా వచ్చినప్పుడు కొందఱు దొరలు రంగనాథశాస్త్రిని దీసికొని స్వదేశస్థులలో గౌరవనీయుఁడని గవర్నరుగారికిఁ బరిచితునిఁ జేసిరి. ఆదినము మొదలు గవర్నరుగారు రంగనాథశాస్త్రిసామర్థ్యము మెచ్చుకొని వానిం దరుచుగఁ దనమందిరమునకుఁబిలిచి హిందువుల సంఘస్థితినిగూర్చి పలుమారు వానితో జర్చించుచు వచ్చెను.

1859 వ సంవత్సరముననె చెన్నపట్టణము స్మాలుకాజుకోర్టులో నొకజడ్జీపని కాళీ వచ్చెను. అది రంగనాథశాస్త్రి కిచ్చిన బాగుండునని కొందఱనిరి. స్వదేశస్థుఁడగుటచే నతనికీయఁగూడదని దొరలందఱుఁ గంఠోక్తిగ వాదించిరి. కాని గవర్నరుగారు తెల్లవారి యాలోచనలు వినక యాయుద్యోగము రంగనాథునకే యిచ్చెను. ఆపనిలో నతఁడు చూపిన చాకచక్యమునుబట్టియు సామర్థ్యమునుబట్టియు మొదట నతఁడనర్హుఁడని వాదించువారు సిగ్గుపడవలసి వచ్చెను. పట్టణమందెచ్చట విన్నను రంగనాథుని యద్భుతశక్తి వర్ణనములే వినంబడుచువచ్చెను. ఈపని ఖాయమైనప్పుడు రంగనాథశాస్త్రి హైకోర్టులోఁ దనకున్న తర్జుమాదారు పనిని మానుకొనగా హైకోర్టులో మొదట జడ్జీయగు సర్ స్కాట్లండు దొరగారును మరియొకజడ్జీగారును గలసి వానికి గొప్పయుద్యోగమైనందుకుసంతసించుచుంటిమనియుఁదమయొద్దనుండి యతఁడు వెళ్ళవలసివచ్చినందుకు విచారించితిమనియు నొకజాబు

వ్రాసిపంపిరి. రంగనాథశాస్త్రి సమర్థుఁడు చాకచక్యముగలవాఁడు నగుటచేఁ దనచేయవలసినపని నతిశీఘ్రముగ జేసికొనితక్కినకాలము గ్రంథావలోకనమునందు గడపసాగెను. అందఱియెడ గౌరవముగలిగి యందఱకు సులభుఁడై యుండినందున జనులిప్పటికి రంగనాథశాస్త్రి వంటి జడ్జీలు స్మాలుకాజు కోర్టులకు రాలేదని చెప్పుకొనుచుందురు. ఈయుద్యోగమైన తరువాత నతఁ డరబ్బీభాష కృషిచేసి యల్పకాలములోనే మంచిపాండిత్యముఁ సంపాదించెను. పారసీభాషలో మంచి కవీశ్వరులగు సాదీ మొదలగువారి పుస్తకములనుండియనేకపద్యములతఁడు కంఠపాఠముగ వల్లించెను. అతఁ డేభాషలోఁ గృషిచేసినను దేనినిఁ బూనినను రక్కసిపట్టుపట్టి దానిని తుద ముట్టించును. జనులతనిని పురుషసింహమని వేనోళ్ళం బొగడుచు వచ్చిరి. అతని సర్వతోముఖపాండిత్య మాకాలమున నెల్లవారికిఁ బ్రశంసనీయమయ్యెను. గవర్నరు లందఱు వాని ననూన గౌరవముతో నాదరించుచు వచ్చిరి. చెన్నపురి గవర్నరులలో సంస్తవనీయుఁడు, ధాత సంవత్సర కాటకములో నన్నములేక చచ్చిపోవు బీదలకుఁ బని గల్పింపఁదలఁచి బెజవాడనుండి చెన్నపట్టణము వఱకు నొకగొప్ప కాలువ త్రవ్వించిన దయాళువునగు బక్కింగుహాం ప్రభువుగారు రంగనాథశాస్త్రి వైదుష్యమును మెచ్చి జర్మనీభాషగూడ జదువుమని ప్రేరణ చేసిరి.

1867 వ సంవత్సరమున రంగనాథుఁడు పచ్చయప్ప మొదలియారుగారి ధర్మకార్య నిర్వాహక సభలో నొకసభ్యుఁడుగ నియమింపఁబడి యందు మిక్కిలి శ్రద్ధతో బనిచేసెను. 1877 వ సంవత్సరమున ఢిల్లీదర్బారు జరిగినప్పుడు గవర్నరు జనరలుగారు రంగనాథశాస్త్రి నక్కడకు సగౌరవముగ రావించి యొకపతకమును యోగ్యతాపత్రికను స్వయముగా వానికిచ్చి పంపిరి. ఇట్లు సర్వజన శ్లాఘనీయముగ దొరతనమువారియొద్ద కొలువుచేసి రంగనాథశాస్త్రి 1880 వ సం

సంవత్సరం పిబ్రవరు 16 వ తారీఖున పింఛను పుచ్చుకొని యుద్యోగము మానుకొనెను. అతఁడు చేసిన ప్రశస్తసేవను గుర్తెఱింగి దొరతనము వారు వానిని చెన్నపట్టణపు గవర్నరుగారి యాలోచన సభలో సభ్యుఁడుగ నేర్పఱచిరి. ఆసంవత్సరమే జూలై నెలలో హైదరాబాదు దివానుగారగు సర్ సలారుజంగుగారు రంగనాధశాస్త్రిని నెలకు 2,500 రూపాయలజీతముమీఁద తనకు ప్రియివేటు శక్రెటరిగా నుండు మని కోరిరి. కాని శాస్త్రిగారు ధనమే పావనమని యెంచక తన జీవితకాలములో సాయంసమయములు విద్యావ్యాసంగములతోను ఉదయమునుములు విద్యాబోధనములతోను గడుపఁదలఁచి యాయుద్యోగ మక్కఱలేదని వ్రాసెను. కాని యతఁడు చేయఁదలఁచిన రెండుకార్య ములు నిర్వహించు నదృష్ట మతనికి లేకపోయెను. మృత్యుదేవత మనుష్యులను గొప్పతనమునుబట్టి గౌరవింపదుగదా! పాప మాయన 1881 వ సంవత్సరం జూలై నెల 5 వ తారీఖున గాలధర్మము నొందెను.

రంగనాధశాస్త్రి సాధారణ మనుష్యులకంటె పొడగరి. అతని దేహదార్ఢ్యముజూచి తెల్లవారు సయితము మిక్కిలి విస్మితులగుచు వచ్చిరి. అతని దేహచ్ఛాయ యించుమించుగ తెల్లవారి దేహచ్ఛాయ వలెనే యుండును. వానిఁజూచినవారందఱుతప్పక యతఁడుగొప్పవాఁడ నుకొని తీరవలయును. అతని ఫాలము మిక్కిలి విశాలమై యుండెను. అతఁ డెన్నివేలమందిలో గూర్చున్నను వానిముఖవర్చస్సందఱకుదర్శ నీయమై గంభీరమై కానంబడుచు వచ్చెను. అతనికంఠధ్వనిగంభీరమై యెల్లవారిని విధేయులజేయునట్లుండును. ఏవిషయమందైననభిప్రాయ భేదము వచ్చినప్పు డతఁడు ప్రతిపక్షుల హేతువులువిని తనయభిప్రాయ మును మార్చుకొనును. మంచిసబబులుచెప్పి యతఁడు తరుచుగనితరు లఁ దనతో నేకాభిప్రాయులఁజేయుచుండును. అతనిప్రవర్తనమం

తయు గడియారమువలెనె జరుగుచుండును. అనగా ప్రతిదినముఁ బ్రతి కార్యమునకు నతఁడు కొంతకాలము నేర్పరచియా పనియా కాలమందే సరిగ జేయుచుండును. అతని నెఱిఁగినవారు గడియారములో నెన్ని గంటలైనదో తెలిసికొననక్కరలేదు. రంగనాథశాస్త్రి యాసమయమున నేపని చేయుచుండునో యాపనిజ్ఞప్తికిఁ దెచ్చుకొనిన యెడల కాలము తెలియును. అతఁడు దేహపరిశ్రమయందు మిక్కిలి నిష్ఠకలవాఁడై ప్రతిదినము ప్రాతఃకాలము నాలుగు మొదలైదు గంటలవఱకు హిందూదేశపు కసరతు తప్పక చేయుచుండువాఁడు. వ్యాయామము ముగిసిన వెనుక నైదు మొదలేడు గంటలవఱకు గుఱ్ఱపుసవారు చేయుచుండును. గుఱ్ఱముమీఁద నతఁడు నిశ్చలుఁడై కూర్చుండిన యొప్పిదముఁ జూచితీరవలయునని యెల్లవారభిప్రాయపడుచువచ్చిరి. ప్రతిదినము సాయంకాల మాయన చాలదూరము కాలినడకను షికారు పోవుచుండును. ఇట్లుదయము సాయంకాలము తప్పక దేహపరిశ్రమ చేయుటచే రంగనాథశాస్త్రి మంచి దేహారోగ్యముఁ గలిగియుండి యొకనాఁడైన జబ్బుపడి మంచముమీఁద బండుకొని యెఱుఁగఁడఁట. దినమున కాఱుగంటలు రంగనాథశాస్త్రి చదువునకై వినియోగించుచువచ్చెను. ముసలితనమందుఁ గూడ చదువుకొనుచుపుస్తకము చేతఁబట్టుకొని ప్రాణములు విడిచిన హిందువుఁడితఁడొక్కడేయని చెప్పవచ్చును. అతఁడేదిచేసినను సగముసగముచేయక సంపూర్ణముగఁ జేయును. ఆతఁడు మనోవాక్కాయ కర్మములందు సత్యమే యాచరించుచు వచ్చినందున యబద్ధమును బరమశత్రువునట్లు ద్వేషించును. 1853వ సంవత్సరమున నార్టను దొరగారింగ్లాండులో పార్లమెంటుసభవారియెద్ద హిందూదేశస్థితిగతులఁగూర్చి సాక్ష్యమిచ్చినసందర్భమున రంగనాథశాస్త్రి ప్రశంస రాఁగా "నతఁడు బుద్ధికుశలత యందెల్లవారితో సమానుఁడనియు నింగ్లాండు సర్వకళాశాలలలో జదివినపక్షమున నతఁడు మిక్కిలి గొప్పవాఁడై యుండు" ననియుఁ జెప్పెను.

ఇంగ్లీషులో నతఁడు సులభశైలినిమనోహరముగ వ్రాయఁగలఁడు. ఏభాష నతఁడు చదివినను మంచికవుల గ్రంథములనుండి యెన్నో పద్యములు కంఠపాఠముగ వల్లించును. ఆతని గ్రంథభాండారములో మూడువేలపుస్తక సంపుటములుండెను. ప్రతిపుస్తకమునందు జదివిన ట్లానవాలుగా చేతిమరకలుఁగూడనుండును. అతఁడేదైన నొకసారి చదివినవథ౯మగును. రెండవసారి చదివెనా కంఠపాఠముగ వచ్చును. మూడవసారి చూచెనా మనసులో నొకమూలస్థిరమైయుండిపోవును. అతఁ డరబ్బీపారసీభాషలను మహమ్మదీయపండితుఁడట్లవలీలగ మాటలాడగలఁడు. ఇంగ్లీషులో మంచికవులు లేరనియుఁ గవులనుబిరుదునకుఁదగినవారు మనయాసియాఖండములోనే గాని యూరపులో లేరనివాని యభిప్రాయము. విద్యను ధనముకొఱకుగాక కేవలముజ్ఞానముకొఱకే యతఁడు నేర్చుకొనెను. అందుచేతనే యతఁడు చనిపోవు నప్పటికి పదునాలుగు భాషలలోఁ బండితుఁడై పదునేనవభాషయగు హీబ్రూనేర్చుకొనుచుండెను. సంస్కృతమతనికిఁబ్రాణపదమైనభాష. ఆభాషలో నతఁడు చదువనిపుస్తకములేదు. ఒక్కొక్కదానికెంతో సొమ్మిచ్చి యతఁడు తాటియాకుల పుస్తకముల నెన్నియో తెప్పించెను. అతఁడు పండితపక్షపాతి. ఒకపండితున కతఁడప్పుడప్పు డిచ్చిన బహుమానములమొత్తమైదువందలరూపాయలు. ఫ్రెంచిలాటినుభాషలనునేర్చుకొనుటకై పుదుచ్చేరినుండియతఁడుప్రత్యేక మొకదొరను నెలకు నూరురూపాయలజీతముమీఁద బిలిపించి చదువుకొనెను. ఒకరియొద్ద తానుచదువుకొనుటయో తానొకరికిఁ జెప్పుటయో యతనికి మిక్కిలి యిష్టము వానిచుట్టు నెల్లపుడు పలుభాషలునేర్చినపండితులుపరివేష్ఠించి యుండ వారినడుమ నతఁడు పరమసంతోషముతో కాలము బుచ్చుచుండును. పేదబాలురకు నింట నన్నముపెట్టి యతఁడువిద్యచెప్పించుచువచ్చెను. ఒకప్పు డతనియింట నట్లు జదువుకొను బాలు రాఱుగురుండిరి. సంఘ

సంస్కరణమం దతనికి ప్రీతిగలదు. అతఁడు మనలోనున్న దురాచారముల జనులకుఁ దెలియపరచి వాని నవలంబించుట చేతనే మనమింత యధమస్థితిలో నున్నారమని చెప్పుచు వచ్చెను. అతఁడు దురాచారముల నడఁచుటకుఁ బ్రయత్నించెను కాని యసహాయుఁడగుటచే నెరవేర్చలేకపోయెను. చెన్నపురిలో మొట్టమొదట షరాయి బూట్సు తొడిగిన బ్రాహ్మణుఁ డతఁడే. ప్రథమమున బంధుమిత్రులు వాని నెగతాళిచేసి చిట్టచివరకు వానిమార్గమునే యనుసరించిరి. స్త్రీవిద్య వాని కిష్టము. ఆవిషయమును గూర్చి యతఁడు చదువుకొనుచున్నపుడెయొకయుపన్యాసమువ్రాసి యందుఁ దుట్టతుద నిట్లువ్రాసెను. "ఇతర దేశములలో ముందు పురుషవిద్య ప్రబలినవెనుక స్త్రీవిద్య ప్రబలెను. పురులు విద్వాంసులైనం గాని స్త్రీలు విద్యావంతులు కారు. కావున మన దేశములోగూడ మగవారి విద్య మిక్కిలివ్యాపించునట్లు చేయవలయును."

అతఁడు చెప్పినట్లాచరించువాఁడు. అందుచేతనే తనకుమార్తె కరవము సంస్కృతము తెనుఁగు స్వయముగజెప్పెను. అతఁడు వేదములుబైబిలు ఖురాను చక్కగ నేర్చినవాఁడై యాయామతస్థులతో వాదములుచేయుచు హిందూమతమే యుత్కృష్టమైనదనిసిద్ధాంతము జేయుచువచ్చెను. హిందూమతము మనవృత్తికి నడ్డుగ నుండఁగూడదని దానిని బ్రస్తుత నాగరికతకు సరిపుచ్చవలయునని వాని యభిప్రాయము. అతనికి హిందూమతముమీఁద నత్యంతమైన యభిమానముగలదు. ఒకప్పుడు క్రైస్తవమతములో గలిసినబ్రాహ్మణబాలకు నతఁడు మరల హిందూమతములోగలిపించెను. వర్ణభేదమం దతనికివిశేషగౌరవములేదు. ధర్మమార్గమున మనమునడచుకొంటిమా దేవుఁడే మనలరక్షించునని యతని మతము. సత్యమే వాని దేవత. అతఁడు జన్మమధ్యమందెప్పుడు నొక యబద్ధమైన నాడి యెఱుంగఁడనివానిశ

తుప్రిపులుసయితము చెప్పుదురు. ఆసద్గుణమాతనికిఁ జిన్ననాటినుండి యుఁగలదు. ఆయనమితభాషి. అతనికి మిత్రులు కొందఱు మాత్రమే యుండిరి. పరిచితుల నందరను మిత్రులుగ భావించువాఁడు కాఁడు. వ్యర్థప్రసంగములు డంబములు వానికిఁ గిట్టవు. మితభాషి యగుటచే మొదట నతనిఁ జూచినవారు గర్వి యనుకొందురుకాని పరిచయమైన వెనుక నట్లనుకొనరు. అతనికి మరియాదలలో మిక్కిలి పట్టుదల గల దు. అవమానమన్న మాట యతఁడు సహింపలేఁడు. అమర్యాదమ నుష్యుల నతఁడు మిక్కిలి యేవగించును. అతఁడు తెల్లవారు నల్లవా రనను భేదములేక యెల్లర సమగౌరవముతోఁ జూచువాఁడె కాని వారి నొకరీతి వీరి నొకరీతి గౌరవించువాఁడు కాఁడు. అంత గొప్పవాఁడ య్యు నిగర్వచూడామణి. అతఁడు మిక్కిలి స్వతంత్రస్వభావముగల వాఁడెకాని చేతులు నలుపుకొనుచు నక్కవినయములను జూపి యుప కారములను యాచించువాఁడు కాఁడు. తెల్లవారతనిని సమానుఁడుగ భావించిరి. చెన్నపట్టణపు హైస్కూలులోఁ జదివి పరీక్షలోఁ గృతా ర్థుఁడైన హిందువులలో నతఁడే ప్రథముఁడు. మదరాసు యూనివరుసి టీలో సభ్యుఁడైన హిందువులలోఁ బ్రథముఁడు. స్మాలుకాజు కోర్టు లలో జడ్జీలుగా గూర్చుండిన హిందువులలోఁ బ్రథముఁడు. అనేకభాష లు నేర్చిన స్వదేశపండితులలోఁ బ్రథముఁడు.

ఉదరపోషణమునిమిత్త మొక్క భాషకష్టముగానేర్చుకొనుట యే చాల శ్లాఘనీయము. రెండుమూడు నేర్చుకొనుట మిక్కిలి యు త్కృష్టము. అట్టియెడ పగలెల్ల కార్యభారముచేత దీరికయించుకయు లేనివాఁడు పదునెనిమిది భాషలలోఁ బ్రజ్ఞావంతుఁడగుటమహాశ్చర్యక రము కాదా? ఉద్యోగమైనతరువాత మనలో విద్యావ్యాసంగము చే యువారులక్షకొకరైన నుందురో యుండరో సంశయింపవలసి యు న్నది. రంగనాధశాస్త్రిహిందువుఁడయ్యుఁదక్కినహిందువులవలె కేవ

లముదరపోషణార్థమే విద్యనేర్చుకొనక జ్ఞానాభివృద్ధినిమిత్తమై బహుభాషాపరిశ్రమముచేసి దక్షిణహిందూస్థానమునకు వన్నె తెచ్చెను. ఈనాటియుద్యోగస్థులు విద్యార్థులు రంగనాథశాస్త్రి జూపిన మార్గము నవలంబించి క్రొత్తభాషలు నేర్చుకొందురు గాక! నేర్చుకొని యాభాషలయందలి మంచిగ్రంథములను స్వభాషలోనికి భాషాంతరీకరించి లోకోపకార మొనర్తురు గాక! రంగనాథుడువలెనే యీనాటి యుద్యోగస్థులు తమ యధికారులగు తెల్లవారియెదుట స్వతంత్రభావమునుజూపి వర్తింతురు గాక! నక్కవినయములు సేయకపోవుదురు గాక!

మహారాజా సర్ రామవర్మ

ఈరామవర్మ వెనుకటి తిరువాన్కూరు మహారాజు. ఈయన 1837 వ సం॥రం మేనెల 19 తారీఖున జన్మించెను. ఆయనతండ్రి గొప్ప సంస్కృత పండితుఁడు. ఇంగ్లీషుగూడ సాధారణముగ నతఁడు వ్రాయుఁ జదువ నేర్చుకొనెను. ఆయన తల్లి రుక్మిణీభాయి సంస్కృతమునందు మంచి సామర్థ్యముగలదై మృదుమధుర శైలిని కవిత్వముఁ గూడ చెప్పుచు వచ్చెను. ఆదంపతుల కేనుగురు బిడ్డలు కలిగిరి. అందు మువ్వురు చిన్నతనమందె మృతినొందిరి. ఇద్దరు పిచ్చివారైరి రామవర్మ కడసారపు బిడ్డఁడు. ఆమృతినొందిన పిల్లలు మువ్వురొక్కమారే రామవర్మ జననమునకు కొలఁదిదినములు ముందుగ గతించిరి. అందుచేత రామవర్మతల్లి యాబిడ్డనిం గనునప్పటికి మహా దుఃఖసముద్రములో మునిఁగి యుండెను. తల్లి యవస్థ యట్లుండుటచే నపు డుద్భవించిన రామవర్మ దుర్బలశరీరముతోఁ బుట్టెను. ఇతఁడు పుట్టిన రెండునెలలకే తల్లిమరణమొందెను. దీనిచేత నతఁడు మఱింత దుర్బలశరీరుఁడయ్యెను. అందుచేత నాబాలుని సంరక్షణము పెద్ద మేనత్తయగు రాణీ పార్వతీభాయిపాలఁ బడియెను.

రామవర్మ యైదేండ్ల బాలుఁడై నప్పు డక్షరాభ్యాసము చేసి తండ్రి సంస్కృతము మళయాళము వానికిఁ జెప్పింప నారంభించెను. అతఁడు తొమ్మిదవయేట వెనుకటిదివానగు సుబ్బారావనువానియొద్ద నింగ్లీషు చదువఁ బ్రారంభించెను. ఈసుబ్బారావు కొంతకాల మీ సంస్థానములోన దివానుపనిచేసి యుద్యోగము మానిన పిదప రామవర్మ మేనమామల కింగ్లీషు చెప్పెను. అతని నిప్పటికి నాప్రాంతపు జను లింగ్లీషు సుబ్బారావని చెప్పుకొనుచుందురు. బాల్యమునందు

మహారాజా సర్ రామవర్మ.

రామవర్మ రోగపీడితుఁడై యందున చదువు సరిగా జరుగలేదు. కాని చదివినప్పుడెల్ల నతఁడు మిక్కిలి పూనికతోఁ బని చేయుచువచ్చెను. ఏపనియయిన సగము సగము చేయుట వానికిఁ జిన్ననాటనుండియుఁ గిట్టదు. తండ్రి శిక్షలో నుండుటచే నీగుణము వానికి మఱింత వృద్ధి నొందెను. అట్లు కఠినమైన పితృశిక్షలో నుండుటచేత వానియందు స్వతంత్రబుద్ధి వర్ధిల్లెను. ఈస్వాతంత్ర్యప్రియము సత్కార్యములు గావించు వారియెడల వినయమై యకార్యములు గావించు వారియెడల యవినయమై నానాట వృద్ధి నొందెను.

1849 సం॥ర మందు వానియందు క్షయరోగ చిహ్నము లంకురించెను. ఆరోగబలముచే నతని శరీరము క్షీణించినను మనోదార్ఢ్య మంతకంత కతిశయించెను. ఆరోగము కొంచె ముపశమించిన పిదప రామవర్మకుఁ దగిన యుపాధ్యాయు నేర్పరుపఁదలఁచి తిరువాన్కూరు మహారాజు మంచియొజ్జను బంపుమని చెన్నపట్టణపు దొరతనము వారికి వ్రాసెను. ఆదొరతనమువారు శ్రీమాధవరావుగారిని బంపిరి. ఈయనయే రాజా మాధవరావనుబిరుదమునొంది బరోడాసంస్థానమునకు మంత్రియైన ఘనుఁడు. ఈమాధవరావుగారి తండ్రియుఁ బినతండ్రియుఁగూడ తిరువాన్కూరులో బూర్వము మంత్రులయి యుండుటచేతను మాధవరావు కాలపు విద్యావంతులలోఁ బ్రథమ గణ్యుఁడగుటచేతను తిరువాన్కూరు యువరాజున కుపాధ్యాయుఁడగుట కతఁడే తగినవాఁడని దొరతనమువా రంపిరి. 1849 వ సంవత్సరమున మాధవరావు రామవర్మకొజ్జగా నియమింపఁబడి శిష్యునకు నాలుగేండ్లు విద్యఁ గఱపెను. మాధవరావు శిష్యున కింగ్లీషులోని సాహిత్య గ్రంథములు మనోవికాసముఁ గలించు ప్రకృతిశాస్త్ర సంగ్రహములు నేర్పెను. రామవర్మ విషయమున గురువుచేసిన శ్రద్ధకుఁ దోడుగఁ దండ్రియుఁ జాల శ్రద్ధచేసి విద్యాబీజములు బాలుని మనస్సు

మీఁద నాటునట్లు చేసెను. 1853 వ సంవత్సరమున మాధవరావు సంస్థానములో నొక యుద్యోగస్థుఁడుగ నియమింపఁబడినందున రామవర్మ విద్యాభ్యాస మంతటితో ముగిసినదని చెప్పవచ్చును. గురువు నొద్దశిష్యుగా విద్య జెప్పుకొనుట మానినను రామవర్మ విద్యావ్యాసంగము మానక జ్ఞానాభివృద్ధి నిమిత్తము బహు శాస్త్ర గ్రంథములు తెప్పించి మునుపటికంటె నెక్కుడు తమకముతోఁ జదువ నారంభించెను. ఆయన విద్యాసక్తిని వానిచేత సంపాదింపఁబడిన గ్రంథ భాండారమే వేయినోళ్ళఁ జాటును. ఆగ్రంథావళిలో నాయనఁ జదువని పుస్తకము లేదు.

ఇంగ్లీషులో వచన రచనమునం దాయనకు మిక్కిలి యాసక్తి యుండెను. అది వృద్ధిఁ జేసికొనుటకై రామవర్మ "యుద్ధక్రౌర్యములు-పరిశాంతిలాభములు" నను శీర్షికతో నొక యుపన్యాసము వ్రాసెను. అవి యాకాలమున జరుగుచున్న క్రిమియాయుద్ధమునుగూర్చి యుద్దేశింపఁబడినవి. తిరువాన్కూరులో నప్పుడు రెసిడెంటుగా నున్న కల్లెన్ దొరగారు వాని యుపన్యాసమునుఁజూచి చాలమెచ్చి యంతటి చిన్నవయసువాఁ డిట్టి మంచి యుపన్యాసము వ్రాయుట కష్టమని యభిప్రాయపడిరి. వ్రాసిన ప్రథమోపన్యాసము శ్లాఘనీయముగ నున్నందున రాజకుమారుఁడు సంతసించి వెండియు వ్రాయవలెనని యుత్సాహముగలిగి వార్తాపత్రికలకు వ్యాసములు వ్రాసి పంపుచు వచ్చెను. ఆకాలమున నిప్పుడున్న పత్రికలు లేవు. ఈకాలపుపత్రికలలో జాన్ బ్రూస్ నార్టనుగారిచేఁ బ్రకటింపఁబడుచు వచ్చిన యథీనేయమనునది ముఖ్యమయినది. దానికి రామవర్మ బహు విషయములం గూర్చి వ్రాసి పంపుచు వచ్చెను. అతఁడు వ్రాసినవన్నియుఁ బత్రికాధిపతి వందనములతో నందుకొని ప్రకటింపుచు వచ్చెను. రామవర్మ యీవ్యాసములతోనే కాలము గడుపక ప్రకృతిశాస్త్రపఠనమం దభి

రుచికలవాఁడయి జ్యోతిశ్శాస్త్రము ప్రకృతిశాస్త్రము రసవాదశాస్త్రము వృక్షశాస్త్రము మొదలగు ననేకశాస్త్రములలోఁ గృషి చేసెను.

ఈనడుమ రామవర్మ కనేక కష్టములు సంభవించెను. 1853వ సంవత్సరమున తల్లిలేని పసికూనయగు తన్నుఁ డల్లికంటె నెక్కుడుగ బెంచిన రాణీ పార్వతీభాయి పరమ పదము నొందెను. 1857 వ సం॥ వాని కున్న యొక్కతోఁబుట్టువు యొకకుమారునింగని మృతినొందెను.ఆకుమారుఁడే యిప్పటి తిరువాన్కూరు మహారాజు. 1858 వసం॥రమున రామవర్మకుఁ దల్లిలేని వెలితిలేకుండ సకలవిధములఁ గనిపెట్టి పెంచిన తండ్రి లోకాంతర గతుఁడయ్యెను. ఈయశుభములన్నియు నెసపిడప 1859 వ సంవత్సరములో రామవర్మకు వివాహమయ్యెను. తనకు సహధర్మచారిణిగ యావజ్జీవము నుండవలసినకాంతను దననిమిత్తముం పరులు వెతకితెచ్చుట మంచిదికాదని రామవర్మ పూర్వబాంధవ్యము గల యొక సత్కుటుంబమునుండి కన్యను స్వయముగా నేరుకొని వరించెను. ఈసమయములోనే సంస్థానముంగా గొప్పమార్పు జరిగెను. 1857 సంవత్సరము డిసంబరునెలలో నంతవఱకు దివానుగానుండిన కృష్ణారావుగారు మృతినొంద మాధవరావుగారా మంత్రిపదమున నియోగింపఁబడెను. వెనుకటి రెసిడెంటగు కుల్లెను దొరగారికి బదిలీకాఁగా నతనిస్థానమందు మాల్టుబీ దొరగారు నియుక్తులైరి. ఆమంత్రియు నారెసిడెంటును గలిసి సంస్థానమునకుఁ గావలసిన మంచిమార్పులన్నిఁటినిఁ దెచ్చిరి. వారు చేయఁదలఁచిన మార్పులన్నిఁటిలో యువరాజగు రామవర్మ వారికుపదేష్టయయి సహకారియై యుండువాఁడు. చెన్నపట్టణమందు ప్రచురింపఁబడు వార్తాపత్రికలలో రామవర్మ మారుపేరుఁబెట్టుకొని తిరువాన్కూరు సంస్థానవిషయముల నెన్నిఁటినో గూర్చి యితరులు వ్రాసినట్లు వ్రాసి మాల్టుబీదొరగారికి దోఁచని సంగతులు చాలవరకు తెలిపెను. ఆపత్రికను చదువుకొని మాల్టుబీ

దొరగారు తానుచేయు మార్పులెంతవఱకుపయుక్తములో యెంత వఱకు కావో తెలిసికొని మెలఁకువతో మెలఁగుచు వచ్చెను.

ఆసంస్థానములో దక్షిణభాగమున గొందఱు క్రైస్తవమతబోధకులుండి వారి పాఠశాలలో మతము బోధించుట యావశ్యకమని చట్టము నేర్పర్చమని తిరువాన్కూరు ప్రభుత్వమువారిని బీడింపఁజొచ్చిరి. పాఠశాలలో మతబోధవిషయమున దొరతనమువారు జోక్యము కలుగఁజేసికొనకపోవుటయే శ్రేయస్కరమని రామవర్మ యొకచిన్నపుస్తకమును వ్రాసెను. అది యిప్పటికిని మనవాఱందఱు జదువుకొనవలసిన గ్రంథమే. అది వ్రాసిన పిదప క్రైస్తవ మతబోధకులు తమవాదము గొంతవఱకు విడిచిరి. సంస్కృతవిద్యయొక్క యావశ్యకతను గూర్చి రామవర్మ చెన్నపట్టణములోనున్న నార్టనుగారికిమంచియుపన్యాసము వ్రాసి పంపెను. అది చదివి యతఁడు మిక్కిలి సంతసించెను.

1861 వ సంవత్సరమున రామవర్మ చెన్నపట్టణమునుజూడఁబోయి యచట గవర్నరుగారి దర్శనము చేసెను. తిరువాన్కూరురాజకుమారులు చెన్నపురికిఁబోవుటకుగవర్నరునుజూచుటకునదియె మొదలు. ఆయనను జూచి గవర్నరు మిక్కిలి సంతసించి యటువంటి హిందువును దానెన్నఁడు జూచియుండలేదని మాల్టుబీ దొరగారికి వ్రాసెను. రామవర్మ చెన్నపురిలో నుండినపుడు గవర్నరుతోడను మఱికొందఱు తెల్లవారితోడనుకొందఱుస్వదేశస్థులతోడనుస్నేహముచేసి స్వదేశమునకుఁ బోయినపిదపఁగూడ నుత్తరప్రత్యుత్తరములమూలమున నామైత్రి నిలుపుకొనెను. గవర్నరు రాజకుమారుని వైదుష్యమునకు మెచ్చి చెన్నపట్టణపుయూనివర్సిటిలో వానినొక సభ్యునిగఁజేర్చెను. ఈగౌరవ మిప్పుడు చవుకయయినను వెనుక మిక్కిలి యరుదయి యుండెను. చెన్నపుర సందర్శనమువలన దేశాటనమునందుఁ గుతూహలము కలుగ రాజకుమారుఁడు స్వదేశముఁజూడవలయుననిసంకల్పించెను. సంకల్పిం

చి బయలుదేరి యతఁడు పూనేకలో నన్నికొండలను నన్నినదులను నన్ని జలపాతములను జూచెను. చిత్రమునన్యు[illegible] [illegible] వాణ్యాకరులలో నెక్కుడైకెనడలోయి యొక పాడు దేశము నందును ప్రాతకోటను నొకపురాతన శాసనమును మఱియుపూర్వకాల చిహ్నములను జూచి తాము దానినిక్రొత్తగా గనిపెట్టినామని చెప్పుకొన్నవారు నత్యంత దేశములనున్నవారు వారిపాలుకులు విని నవ్వి "ఇది యూరోపియ నూవైశాఖం [illegible] దే. [illegible]" [illegible] తెలియఁజేయు చుండెను. వైశాఖం [illegible] సరి రామవర్మయొక్క [illegible]. నదేశయాత్రలో నతఁడు చిత్రచిత్రములగు [illegible] రాళ్లను లోహములను వస్త్రములను శిలాప్రతిమలను చిన్నచిన్నకత్తుల జాతులను బోగుచేసికొని బండ్లమీఁద వేయించి స్వగృహమునకుఁ బంపించుచుండెను. మఱియు నతఁడంతట [illegible] స్వదేశమునకు [illegible] గొనపోవుచులయొక్కయుఁ బుష్పములయొక్కయు లతలయొక్కయుఁ జిత్రవస్తువులయొక్కయు [illegible]రూపు గల కొలువులో నున్న చిత్రపటములచేతవ్రాయించి దగ్గఱనుంచుకొనును. ఇట్లుపోగుచేసిన వస్తుసముదాయములనుండి కొన్ని వస్తువులుతీసి యతఁడు విదేశస్థులకిచ్చి వారి[illegible]ను విచిత్రవస్తువులను తనవానికి బదులుగ గ్రహించుచుండెను.

ఆతఁడు ప్రకృతిశాస్త్రములను జదుపుటయేగాక వానియం దనుభవము కలుగునట్లు పరిశ్రమ చేసెను. ఆయనకు వృక్షశాస్త్రమునందు మిక్కిలి యభిమానము కలదు. దానికిందోడుగ వ్యవసాయమునందును మిక్కిలి యభిరుచియుండెను. ఈ యభిరుచిచేతనే రామవర్మ వటకున్కొత్తము పేర నొకమందిరమును నిర్మించి దానిచుట్టు మంచి పండ్లతోటలు పూఁదోటలు పంటచేలు వేయించి రాజయోగ్య గృహముగ[illegible] యుండెను. వటకున్కొత్తము నఖుని మందిరమని యర్థము. ఆ భవనమందు రామవర్మ జీవితమునఁ జాలకాలము గడపెను. అన్యదేశ

ములలోఁ బాకు ధాన్యములు, దుంపలు, పొగాకు మొదలగునవి తె ప్పించి స్వదేశమున నాటించి యతఁడు కృషివృద్ధిచేసెను. చిత్తరువులు వ్రాయుటలో నభిరుచి గలవారికావిద్యల నేర్పించి ముఖ్యముగా నీటి తో రంగులువేయుట చమురుతో రంగులువేయుట నను రెండు కళల విషయమునఁ జాలపని చేసెను.

ఈనడుమ మాధవరావుగారు కొన్ని కారణములచేతసంస్థానము లో దివానుపనిని మానుకొనిరి. రామవర్మ కాయన గురువగుటచేతగు రుభక్తినిఁ జూపుచు నతఁడు మాధవరావుగారి బుద్ధివిశేషమును గొని యాడుచు కలకత్తా రివ్యూయను పత్రికకు మనోహరమగు నుప న్యాస మొకటివ్రాసి పంపెను. ఆవ్రాత యానాటి విద్యావంతుల మ నస్సుల నాకర్షించెను. అప్పటి గవర్నరుజనరలుగారగు నార్తుబ్రూకు ప్రభువుగా రది చదివి మాధవరావు రాజనీతి విశారదుఁడనిగ్రహించి యిందూరు సంస్థానప్రభువగు హోల్కారునకు మంత్రి కావలసి యుండఁగా మాధవరావు నంపిరి. ఆగవర్నరుజనరల్ గారే రామవర్మ బుద్ధికుశలతగూడగ్రహించి తనయాలోచనసభలో సభ్యుఁడుగా నుం డుమని యాయుననుగోరిరి. కాని యనారోగ్యముచేత రామవర్మ దాని నంగీకరింపలేదు. 1874వ సంవత్సరమున రామవర్మకు జబ్బుచేసి ప్రాణ ము మీఁదికివచ్చెను. అతఁడు జీవింపఁడని కొన్ని దినములుబంధువులు నిరాశచేసుకొనిరి. ఎట్టకేలకో దైవానుగ్రహమున జాడ్యవిముక్తుఁడై బ్రతి కెను. బలము చేరినది మొదలు రామవర్మయెప్పటియట్లేచదువునందు వ్రాతయందు తనకాలము గడుపుచు వచ్చెను. మాధవరావు దివాను గానుండిన కాలమున తిరువాన్కూరులోనుపయుక్తములగుమళయాళ గ్రంథములు వ్రాయించుటకు చిన్నసభ యేర్పడెను. ఆసభకు రామవ ర్మ మిక్కిలి తోడుపడి సత్యము, విద్య, యారోగ్యము మొదలగువిష యములఁగూర్చి తాను స్వయముగ చిన్నగ్రంథములు వ్రాసి యాసభ

వారికిచ్చుచువచ్చెను. మహారాజు కుమారుఁడయినను పాటుపడవలసి నదనియుఁ బాటుపడినందువలన గౌరవలోపములేదనియుఁ దానప్పటికి యువరాజయ్యు కాఫీతోఁట వేయించి స్వయముగ పనిచేయించెను. ఆతఁడు పండించినకాఫీ తక్కినకాఫీలకంటె శ్రేష్ఠతమమైనది చెన్నపురిమందు జరిగిన వస్తుప్రదర్శన సభవారు వారికొక బంగారు పతకమును బహుమానమిచ్చిరి. బుద్ధికుశలతగల వారితోడను విద్యావంతులతోడను రామవర్మ తరచుగ సహవాసముచేయు నభిలాష గలవాఁడు. ఈయభిలాష బంధముచేతనే యతఁడు సర్వకలాశాలలోఁ జదువుకొనుచుండిన కుశాగ్రబుద్ధులగు విద్యార్థుల దన మందిరమునకు రావించి వారితో విద్యాగోష్ఠిం దేలుచుండెను. ఇప్పుడు సంస్థానముల గొప్పయుద్యోగములోనున్న పురుషులనేకులు మొదట రామవర్మచే గనిపెట్టఁబడినవారే. మైసూరు సంస్థానమున మంత్రి పదవినొందిన రంగాచార్యులవారు కూడ మొదట రామవర్మచేత బెంపఁబడినవారే.

1880 వ సం॥న సంస్థానమును బాలించు మహారాజు స్వర్గస్థుఁడగుటచే ద రామవర్మ తిరువాన్కూరు మహారాజయ్యెను. అతనిపట్టాభిషేకము 1880 వ సంవత్సరము జూను 17 వ తేదిని జరిగెను. ఈయనవలెనర్వ జనులకు నిష్టముగ గద్దెనెక్కిన మహారాజుమఱియొకఁడుండఁడు. సకలకలావిశారదుఁడయి సచ్చరిత్రుఁడగు రామవర్మసింహాసనమెక్కినతోడనే సంస్థానమందలి ప్రజలందఱు తామదృష్టవంతులమనుకొనిరి. దక్షిణహిందూస్థానమందలి విద్యావంతులందరు వానిమంచియేలుబడిచేత వానిసంస్థానమేగాక యామార్గమనుసరించితక్కినసంస్థానములు గూడ బాగుపడునని తలంచిరి. రామవర్మ గద్దెనెక్కినతోడనే వెంబాకము రామయ్యంగారిని మంత్రిగా జేసికొనెను. రామయ్యంగారిస్వభావము రామవర్మ స్వభావమువంటిదేయగుటచే వారిరువురకొండొరులమీఁద నంతకుముందే యిష్టముండెను. ఆయన మంత్రియయినతోడనే రాజు మం

త్రీయుఁ గలిసి సంస్థానములోఁ బలుమార్పులుచేసిరి. కోర్టులలోను రివిన్యూవ్యవహారములలోను పోలీసులలోను నప్పాడిపార్టుమెంటులలోను పాతపద్ధతులఁ జాలవఱకు తొలఁగించి యాయన క్రొత్తపద్ధతులఁ బెట్టెను. ఇది యది యని చెప్పనేల? ఆమహారాజు గుఱ్ఱములు నేనుఁగులు మొదలగు జంతువుల సంరక్షణమును గూర్చిసయితము న్యాయముగ మార్పులఁ జేసెను. చేయదలఁచిన మంచియేర్పాటులన్నియు సత్వరమే చేయవలెనని యతఁడు పోరుచువచ్చెను. ఏలయన రామవర్మ మార్పులఁ జేయుటచే నెప్పుడు తనకు మరణము సంభవించునోయని భయపడుచువచ్చెను. ఆసందేహము మనస్సులోనుంచుకొని యతఁడొకసారిమంత్రి కిట్లువ్రాసెను. "నాకిప్పుడు నలుబదియారేండ్లున్నవి. ఒక్కరు తప్ప నాపూర్వులెవ్వరు నేబదియేండ్లదాఁటి బ్రతుకలేదు. కాఁబట్టినేఁడుచేయఁదలఁచిన పనిని రేపటికిఁ బోవద్దు" అట్లు త్వరపడి సంస్థానవ్యవహారమంతయుఁ జాలఁ గట్టుదిట్టముచేసెను. ఆమార్పులుచేసిన పిదప మహారాజు దక్షిణ నేలకొలత (సర్వే) పన్నునిర్ణయము (సెటిల్మెంటు) అను రెండుక్రొత్తపద్ధతుల మీఁదికిఁ బోయెను. తిరువాన్కూరుసంస్థానములో భూముల లెక్కలు చిరకాలమునుండి యుండవలసినవిధముగా లేవు. అవి చక్కఁజేయుట చాలశ్రమకరమని వెనుకటి మహారాజులు దానిజోలికిం బోరైరి. రామవర్మ తనయావచ్ఛక్తి విని యోగించి పంటనేలలన్నియుఁ గొలిపించి వానికిం దగినట్లు పన్నులుగట్టించెను. అదియైన పిదప రామవర్మ చిరకాలమునుండి కొచ్చినసంస్థానప్రభువులకుఁదనకుఁగలసరిహద్దులవివాదమును బరిష్కరించుకొనఁదలఁచి మధ్యవర్తులనేర్పఱచుకొని వారు చెప్పినట్లువినుట కొడంబడి యావివాదమునంత మొందించెను. మహారాజున కీమార్పులుచేయుట యొకయెత్తు, సంస్థాన మందలి యుద్యోగస్థుల నదుపులోనుంచుట యొకయెత్తుగనుండెను. రామవర్మ గద్దెయెక్కినప్పుడులంచగొండులందఱునదుగంటెదరని నాగరికులగుపౌ

రు లేగాక కొండవాండ్రుసయితము సంతోషించిరి. వారికోరికలుసఫలములయ్యెను. సర్కారుజీతములు తినుచు దురాశాపాతకులయి లంచములకై ప్రజలం బీడించు దుర్వినీతుల నతఁడు నిష్కారణముగ దండించి రహితులబాధ తొలఁగించెను. దుర్జనుల దౌర్జన్యము నడఁచుటలో వాని కెంతజాగ్రతయుండెనో సన్మార్గుల యోగ్యతనుమెచ్చి బహుమానముచేయుటలో నంత జాగ్రతవానికుండెను. రాచరికము చేయుచున్నాఁడని పేరేగాని రామవర్మచేసినంతపనియాసంస్థానములో నేయుద్యోగస్థుఁడు చేసియెఱుఁగఁడు. దివానుపంపించెడి కట్టలకొలఁది కాగితముల నవలీలగజూచి విషయములు గ్రహించి వానిమీఁద వేయవలసిన యుత్తరువులు వేసి రామవర్మయించు కేని యాలస్యముచేయక మరలఁ బంపుచుండును. అన్ని కాగితములను జూచుకొనుటయేగాక ప్రపంచములో ననేకదేశములందున్న తన మిత్రులకుఁ బ్రతిదినము పలుజాబులు వ్రాయుచుండును. వేయేల! సామాన్యుఁడగుగుమాస్తా యెట్లుపనిచేసెనో యతఁడు నట్లె పనిచేసెను. ఈమహారాజు ప్రాతఃకాలమున సూర్యుని కంటె ముందే మేల్కొని బండిమీఁద షికారుపోయి తిరిగివచ్చునప్పుడుమధ్యమార్గమున నుదయభానునిం గలిసికొనును. షికారు ముగించియతఁడు గృహమునకుఁబోయి స్నానము సంధ్యావందనము జపము మొదలగు పారలౌకికకృత్యములు నెఱవేర్చుకొనిభోజనముచేసిపదిదినముపదునొకండు గంటలకు రాచకార్యములనిమిత్తము దర్బారునకుఁ బోవును.

అదిమొదలు రెండుగంటలువఱకు తనమందిరవ్యవహారములు దేవస్థానవ్యవహారములు కనుఁగొని చక్కఁజేసి తక్కినవ్యవహారములలో లేశలేశములుగూడ పరిశీలించుచుండును. అనంతరము కాఫీత్రాగుటకుఁబోవును. రెండుగంటలు మొదలుకొని యుద్యోగస్థులువ్రాసి పంపు రిపోర్టులు చదువుకొనును. కోరినవారికి దర్శనమిచ్చును. సాయంకాలమైనతోడనే మరల నతఁడు సంధ్యావందనము, మొదలగు

కాలకృత్యములను దీర్చుకొనును. దేహారోగ్యము సరిగానుండనప్పుడు సయితమతఁడు సంధ్యావందనాదికమును భక్తిశ్రద్ధలతోఁ జేయుచుండును.

గవర్నరులు తన దేశమువచ్చినపుడు దేవతోత్సవములైనప్పుడు విందులు జరిగినప్పుడు సయితము రామవర్మ రాజ్యకార్యములనిమిత్తము తానేర్పఱచుకొన్న కాలము వానిక్రింద వృథసేయక తనవిశ్రాంతి నిమిత్తమేర్పడిన కాలమునందే తత్కార్యములు నెరవేర్చుచుండును.

రామవర్మ యిరువదియైదేండ్ల ప్రాయము మొదలు మరణపర్యంతము దినచర్య వ్రాయుచువచ్చెను. ఎంత ప్రొద్దుపోయినను పండుకొనుటకుఁ బోవక మున్నతఁడు దినచర్య వ్రాసితీరును. ఇన్ని పనుల నడుమ రామవర్మ యింగ్లీషుగ్రంథము లనేకములు చదువుటకును నింగ్లీషుతో నెన్నో యుపన్యాసములు వ్రాయుటకును దీరికగలవాఁడయ్యెను. తనసంస్థానమందున్న పాఠశాలలలోఁ జదువుబాలకుల యుపయోగము నిమిత్తము రామవర్మయింగ్లీషులో నుండిసత్పురుషులయొక్కయు మంచి స్త్రీలయొక్కయు చరిత్రములనేరి మళయాళభాషలో వ్రాసెను. మఱియు స్వభాషాభివృద్ధిఁ జేయుటకతఁడు "విద్యావిలాసిని" యను పేర నొకమాసపత్రికను స్థాపింపఁ జేసి జ్యోతిశ్శాస్త్రాది విషయములనుసులభశైలితో మళయాళభాషతో వ్రాసి యందుఁ బ్రకటించుచు వచ్చెను. చిన్నతనమునుండియువానికి దేశయాత్రాభిలాష మెండుగనుండుటచే రాజ్యభారముపై బడినకతమున వెనుకటియట్లు స్వేచ్ఛగా దిరుగవలనుపడకున్నను రామవర్మ యుత్తరహిందూస్థానమును జూచివచ్చెను. తీరికచాల లేకపోయినందున నతఁడు 1882 వ సంవత్సరమున జనవరినెలలో బయలుదేరి ముఖ్యస్థలములఁ గొన్నిఁటినిమాత్రమె చూచి మార్చినెల ముగియకమున్నె రాజధాని జేరెను. అతఁడుచూచిన ప్రతిపట్టణమునందు జనులు వానిదర్శనము జేయవచ్చి వానియుదార గుణములఁ గొని

యాడుచు స్వాగతపత్రికల సమర్పించిరి. 1888 వ సంవత్సరముననతఁడు చెన్నపురమునకుఁబోయి వెనుకచేసిన కాశీయాత్ర సఫలముచేయుటకు రామేశ్వరయాత్ర చేసెను. రామేశ్వరమునుండి సేతువునకుఁబోయినపుడు రామవర్మ మహానందభరితుఁడై దినచర్యలో నిట్లువ్రాసెను. "నేను నేఁటియుదయమున సముద్రపుబాయ దాఁటితిని. పూజ్యమైన రామసేతువుఁ జూచితిని. ప్రకృతియో దైవమహిమయో నేనెఱుఁగనుగాని యిది మిక్కిలిదర్శనీయమైనది. సమానమైనవెడల్పుఁగలిగి యదిగీటుగీచినట్లు తిన్నగ నున్నది. ఈభాగమే మా దేశమును సింహళద్వీపమునఁ గలుపుచున్నది." రామవర్మ తనరాజ్యములోఁగూడ బూర్వులకంటెనెక్కుడుసారులు పయనములుచేసి పలుతావులుచూచెను. ఆయన తనరాజ్యమునందుఁగల ప్రతిగ్రామమునకుఁబోయి చేతిపనులకుగాని ప్రకృతి వినోదములకుగాని పేరువడసిన గ్రామముల పేర్లు జ్ఞాపకార్థముతనపుస్తకములో వ్రాసికొని యాయాగ్రామములందు కళావిశారదులగుబుద్ధిమంతులు గానఁబడినప్పుడు వారికేవో పనులుగల్పించి ధనసహాయము జేయుచుండును. చేతిపనులకుఁ దగినప్రోత్సాహముఁ గలుగఁజేయుట కాయన యాపనులునేర్పు పాఠశాల నొకటి స్థాపించెను. అతని ప్రోత్సాహముచేతనే క్విలనుపట్టణమందువస్త్రములునేయు యంత్రములుస్థాపింపఁబడెను. అతని ప్రోత్సాహముచేతనే పూనలూరుగ్రామమున కాగితములుచేయు యంత్రములుస్థాపించుటకు ప్రయత్నముగలిగెను. ప్రకృతిశాస్త్రమునం దతనికిఁగల యభిరుచి నానాటికి హెచ్చుతనరాజధానిలోనున్నకలాశాలలో రసవాదశాస్త్రము (కెమిస్త్రి) ప్రకృతిశాస్త్రము నేర్పింపఁదలఁచియుపాధ్యాయులనేర్పఱచెను. అతనిశాస్త్రపరిశ్రమలను బట్టి యూరపుఖండములో నింగ్లాండు మొదలగు దేశములలోనున్న ప్రకృతిశాస్త్రీయసంఘము లనేకములు వానినిసభ్యునిగఁ జేర్చుకొనిమెను. సంస్కృతపాండిత్యమునఁబట్టి రాయల్ఏష్యాటిక్కుసంఘమువారు

వానినిఁ దమసంఘములోఁ జేర్చుకొనిరి. భూగోళశాస్త్రపరిజ్ఞానమును బట్టి భూగోళశాస్త్రీయసంఘమువారు జేర్చుకొనిరి. ఇట్లతనికీర్తి స్వదేశమందే గాక దేశాంతరములయందు ద్వీపాంతరములయందు ఖండాంతరములయందుఁగూడ వ్యాపించెను. ఈసంఘములవారందఱు వానినట్లు గౌరవింపకమునుపే శ్రీవిక్టోరియాచక్రవర్తినిగారు వారికి "సర్. కె. సి. యస్. ఐ." అను బిరుదము నిచ్చిరి. ఈవిదేశపు బిరుదులకుఁ దోడుగ నతఁడుస్వదేశపుబిరుదులఁగూడఁగొన్నిఁటి నందెను. అతనిపూర్వులందఱు తులాభారముఁదూఁగి కులశేఖరపెరుమాళ్ళను బిరుదమునువహించుచువచ్చిరి. ఆవిధముగానె రామవర్మయు నాబిరుద మందెను. అనంతరము కీర్తిపతి యను బిరుదము బడయవలెననిప్రయత్నముచేయుచుండ నంతలో మృత్యువు వానిం దనవాతఁ బెట్టుకొనియె. ఆయన 1884 వ సంవత్సర మైదవ యాగష్టున కాలధర్మము నొందెను. ఆయన యనుకొన్నట్లె పూర్వుల విధమున నేఁబదియేండ్లునిండగానెమృతినొందెను. కర్మలయం దాయనకు సంపూర్ణమయినవిశ్వాసముకలదు. కర్మలు చేయఁదలఁచినప్పుడు సగము సగముచేయక సంపూర్ణముగఁ జేయవలెనని యాయన యభిప్రాయము. ఏదేశమునకుగాని రామవర్మవంటి మనుష్యులు ప్రభువులగుట జనుల యదృష్టమనిచెప్పవలయును. అంతటి మహారాజును దీర్ఘాయురారోగ్యములిచ్చిరక్షింపక భగవంతుఁడు నట్టనడుమ ద్రుంచివేయుట జనుల భాగ్యదోషముననేకదా.

తిరువాన్కూరు మళయాళదేశములోఁజేరినది. అక్కడతండ్రి యాస్తి కొడుకునకురాక మేనయల్లునకుఁ జెందుచుండును. రామవర్మయు వెనుకటి రాజునకు మేనల్లుఁడగుటచేతనే రాజ్యప్రాప్తి గలిగెను. ఇప్పటి మహారాజు రామవర్మకు మేనల్లుఁడు గావుననే గద్దెయెక్కెను అక్కడ ధర్మశాస్త్రము మనధర్మశాస్త్రమువంటిది కాదు.

రాజా సర్ మాధవరావు.

రాజా సర్ మాధవరావు

మాధవరావు 1828వ సంవత్సరమునఁ గావేరీ తీరమందలి కుంభకోణ పట్టణమందు జన్మించెను. ఈయన కుటుంబము మిక్కిలి గౌరవనీయమయినది. ఆయన తండ్రి రంగారావు కొంతకాలము తిరువాన్కూరు దివానుగా నుండెను. ఆయన పినతండ్రి రాయరాయరాయ వెంకట్రావుగూడ తిరువాన్కూరు సంస్థానమున మంత్రియైయుండెను. తండ్రి మాధవరావును జిన్నతనమందే చదువునిమిత్తము చెన్నపట్టణమున కంపెను. మాధవరా వప్పటి చెన్నపట్టణపు హైస్కూలులోఁ జేరి పవెలుదొరయొద్ద విద్యారసముం గ్రోలెను. ఈయన సహాధ్యాయులందరు మిక్కిలి సుప్రసిద్ధులైరి. మాధవరావు మిగుల జాగరూకతయు శ్రద్ధయు గలిగి విద్యాభ్యాసము చేసెను. ఆయన గణితశాస్త్రము ప్రకృతి శాస్త్రము నేర్చుటయేగాక యుపాధ్యాయుఁడగు పవెలు దొరగారి మేడమీఁద జ్యోతిశ్శాస్త్రము నభ్యసించెను. దాని నభ్యసించు నప్పుడు మాధవరావు వెదురుగొట్టముల కద్దపుబిళ్ళ లడికి గ్రహసంచారమును జూచుటకై సూక్ష్మదర్శకయంత్రములు దూరదర్శకయంత్రములుఁ జేసి గురువునకుఁ బరమానందముఁ గలిగించుచువచ్చెను. మాధవరావు 1846వ సంవత్సరమందుఁ బట్టపరీక్షలోఁ గృతార్థుఁడై విద్యాభ్యాసము ముగించెను.

పవెలుదొర శిష్యునియం దధికాభిమానముఁ గలవాఁడగుటచే వానిని విడువనిష్టము లేక తనపాఠశాలలో వానికుపాధ్యాయత్వమిప్పించి వానిచేత గణితశాస్త్రముఁ బ్రకృతిశాస్త్రముఁ జెప్పించెను. ఆయుద్యోగమునం దతఁడు చిరకాల ముండలేదు. ఏలయన నల్పకాలమునందే తిరువాన్కూరు రాజకుమారున కింగ్లీషు నేర్పుటకుపాధ్యాయుఁడు కావలసివచ్చినందున మాధవరావాయుద్యోగమును బడసెను. స్వ

దేశ సంస్థానములలో నితఁ డుద్యోగస్థుఁడై పేరువడయుటకిదియే ప్రారంభము. మహారాజా రామవర్మయు మఱికొందఱు రాజకుమారులు వానిశిష్యులై విద్యనేర్చిరి. తిరువాన్కూరు సింహాసన మెక్కిన రాజులలో రామవర్మవంటివారు తరుచుగ లేరు. రామవర్మ నంతవానిం జేసిన ది మాధవరావే యని నిశ్చయముగఁ జెప్పవచ్చును. అట్లు రాజకుమారులకు గురువై మాధవరావు నాలుగు సంవత్సరము లుండియాపనిమానిదివానుక్రింద మఱియొక యుద్యోగము వహించెను. అందుగొంత కాలమున్న పిదప నతనికి దివాను పేష్కారుద్యోగమిచ్చి సంస్థానములో దక్షిణభాగమును బరిపాలింపఁ బంపిరి. ఆకాలమందా దక్షిణభాగములో జనుల పరస్పర కలహములు పోరాటములు ప్రబలియుండెను. మాధవరావు తనయందలి శాంతరసముచేతను బుద్ధిసూక్ష్మతచేతను దేశమందలి కలహాగ్ని త్వరలోనే చల్లార్చెను. తన కుద్యోగమయినసంవత్సరములోనే నెమ్మదిలేనిచోట నెమ్మదికలిగించెను. ఆర్తులగువారికినిష్పక్షపాతముగ న్యాయమొసగి నేరస్థులను నిర్భయముగ దండించెను. బందిపోటు దొంగల యుపద్రవమాపెను. ప్రజలకు బాధలేకుండ శిస్తులు హెచ్చించెను. ఆయన వ్రాసిన కాగితములు దినచర్యలు జూచితిమా యతఁ డెంత ధైర్యముతో నట్టికష్టదినములలోఁ బనిచేసెనో తెలియును. రాజ్యము నాశనము కాకుండ రక్షించెను. రాజుకృతజ్ఞతకుఁ బాత్రుఁడయ్యెను. ఆయనయే మంత్రియగునేని సంస్థానము మహాభివృద్ధి నొందునని యానాఁటివారందఱు నభిప్రాయపడిరి. విద్యనేర్చిన స్వదేశస్థులు దేశపరిపాలనమందు దమకు సమానులగుదురని వివేకులగు తెల్లవారు గ్రహించిరి.

ఆకాలమునందు తిరువాన్కూరుసంస్థానముస్థితి చక్కగానరసి పనిచేయలేని మంత్రిపాలనమునందుండెను. అప్పటి మహారాజు దుర్బలుఁడు. ఆయన దేవాలయమునకుఁ బోవుట నిత్యకర్మలు సేయుట మొదలగుపనులకే యలవడెను గాని రాజ్యవ్యాపారములమీఁద దృష్టిని

లుపుటకలవడలేదు. సంస్థానమందలి యుద్యోగస్థులు జీతముస్వల్పమ
గుటచేతను స్వల్పజీతములైన సరిగా నియ్యక యాఱు నెలలకొకసారి
యేఁడాదికొకసారి యిచ్చుటచేతను వారు లంచగొండులై ప్రజలనుబీ
డింపఁజొచ్చిరి. ఖజానాకొట్లు వట్టివయ్యెను. ఇంగ్లీషువారికి రాజుకప్ప
ముచెల్లింప లేకపోయెను. మార్గములు సరిగ లేకపోవుటచే వాణిజ్య
మడుగంటెను. దేశస్థులవృద్ధి దిగనారెను. ఆకాలమునందు హిందూ
దేశమునకు డల్‌హౌసీప్రభువుగవర్నరుజనరలుగా నుండెను. స్వదేశరా
జులను సింహాసనభ్రష్టులఁ జేసి వారిరాజ్యముల గ్రహించుకొనుటలో నీప్ర
భువునకుంగల ప్రజ్ఞ యింతింతయనరాదు. ఈ దేశములో స్వదేశసం
స్థానమన్న పేరులేకుండ జేయవలయునని యాయన తలంపు. ఏసంస్థాన
మందైనఁ గొంచెము గడబిడయల్లరిజరుగునేని యావంక బెట్టిసంస్థానము
క్రమముగఁ బరిపాలింపఁబడుచున్నదని ప్రజలు బాధలుపడుచున్నారని
వారి యిడుమలార్చువాఁడుతీర్చువాఁడుబోలె నాయన యాసంస్థానము
గలుపుకొనుచువచ్చెను. వారసులు లేనివారికి దొరతనమువారే వార
సులని బిడ్డలులేక మృతినొందిన మహారాజు సంస్థానములన్నియునీతఁ
డింగ్లీషువారికే చేర్చెను. ఆయనదృష్టి యాకాలమున తిరువాన్కూరు
సంస్థానముపైఁబడెను. క్రమపరిపాలనము లేదను నెపమున దానినతఁ
డు కలుపుకొనఁదలఁచి చెన్నపట్టణపుదొరతనమువారితో నాలోచించు
టకు నీలగిరికిఁబోయెను. అప్పుడు మహారాజు మేలుకొని మాధవరా
వును మంత్రిగాఁ దీసికొనెను. మాధవరావు తన కేఁడుసంవత్సరములు
గడువిచ్చినపక్షమునసంస్థానమునుమంచిస్థితిలోనికి వచ్చునని దొరతన
మువారికి వ్రాసెను. ఎట్టటో వారు దానికంగీకరించిరి. 1857వసంవ
త్సరమున మాధవరావుతిరువాన్కూరుమంత్రియయ్యెను. మాధవరా
వు ముప్పదియేండ్లయిన నిండకమునుపే బుద్ధిబలము నీతిబలమువిద్యా
బలముఁ గలవాఁడగుటచే గొప్ప సంస్థానమునకు మంత్రిత్వమువహిం
పఁ గలిగెను.

మాధవరావు మొట్టమొదట కొన్ని ప్రజాపీడకరములుగా నున్న పన్నులఁ దగ్గించి మార్పుచేయుటలోఁ గడ పెను. క్రమము మితి మేరలేక వెనుకటిమంత్రులు పన్నులుగట్టుచువచ్చినందున దేశస్థులు మిక్కిలి దరిద్రులైరి. సంస్థానమునందుఁ బ్రతివస్తువుఁగూడ నిజారా చేయఁబడుచువచ్చెను. పన్నులు ప్రజలను విసికించెను. అన్నిఁటిలో మిరియాల యిజారా జనులకు మిక్కిలిబాధకరముగ నుండెను. ఆయిజారా మాధవరావు ముందుగాఁ గొట్టివేసి యందువలన సంస్థానమునకుఁ గలుగు ధననష్టముఁ గూడదీయుటకై నూటికిబదునైదు వంతుస దానిమీఁగ నెగుమతిపన్ను విధించెను. అదియుఁ బ్రజలకు భారముగా నున్నందున కొంతకాలము గడచిన పిదప నతఁడు నూటికి తొమ్మిదివంతున పన్ను విధించెను. మఱికొన్నాళ్ళ కదియే నూటి కైదుమూపాయలవంతగునట్లు చేసెను. ఆసంస్థానమునందదివఱకు పొగాకువర్తకము జనులు చేయుటకు వీలులేదు. సంస్థానప్రభుత్వమువారే విదేశవర్తకులయొద్దనుండి పొగాకుకొని నిలువఁజేసి చిల్లరగ నమ్మి లాభముదీయుచువచ్చిరి. మాధవరావు పొగాకుయిజారా కొట్టివేసి యావర్తకము జనులే చేసికొనవచ్చు నని యుత్తరువుచేసి దానిమీఁద కొంతపన్ను విధించెను. ఆపన్ను మొదట కొంచెము హెచ్చుగానున్నందున నతఁడే కాలక్రమమున దానిని తగ్గించెను. ఇట్లు చేయుటచే దేశమున వర్తకము హెచ్చుటయుఁ బ్రజలుబాగుపడుటయు సంభవించెను. అట్లుమాధవరా విజారాలను మాపుమాపి తక్కినపన్నులు తగ్గింప సంకల్పించి చిల్లరపన్నులు నూఱు తీసివేసెను. ఈనూఱుపన్నులు సంస్థానమునకుఁ గలుగఁజేయు లాభము తక్కువ, ప్రజలకుఁ గలిగించు పీడ యెక్కువ. నేలపన్ను హెచ్చుగానున్న స్థలములఁ దగ్గించి యతఁడు 1863-64 వ సంవత్సరములలో నెగుమతి దిగుమతి సరకులమీఁద విధింపఁబడిన పన్నులుగూడ స్వల్పముచేసెను.

మరుసటి సంవత్సరము కొచ్చినురాజుతోడను ఇంగ్లీషుదొరతనము వారితోడను నతఁడు వాణిజ్యవిషయమున నొక యొడంబడిక చేసు కొనెను. ఆయొడంబడికనుబట్టి యింగ్లీషు రాజ్యమునుండి కొచ్చిను సం స్థానమునుండి తిరువాన్కూరునకుఁ బోవు సరకులను తిరువాన్కూ రునుండి యాదేశమునకుఁబోవు సరకులకును బన్నులు లేవు.

అట్లుమాధవరావు తిరువాన్కూరుసంస్థానమునకుఁ జేసినయ మితోపకారమునకు నింగ్లీషుదొరతనమువారు సంతసించి కె.సి.యస్. ఐ. యనుబిరుదము వాని కిచ్చిరి. అప్పుడు చెన్నపట్టణపు గవర్నరు గానుండిన నేపియర్ ప్రభువు మాధవరావును చెన్నపట్టణము రావించి యాబిరుదమును స్వయముగానిచ్చి యిచ్చునప్పుడు విక్టోరియారాణీ గారు వానిచేసినపనులకు మిక్కిలి సంతసించిరని చెప్పి పలుదెఱఁగుల వాని గుణములఁ బొగడెను. ఆసంవత్సరమే మాధవరావు చెన్నపట్ట ణపు యూనివరుసిటీలో సభ్యుఁడయ్యెను. అట్లు చిరకాలము మంత్రి పదముపహించి దేశము క్రమస్థితిలోనికిఁదెచ్చి మాధవరావు హాయి గా నుండఁదలఁప వాని తలఁపునకు వ్యాఘాతము సంభవించెను. మా ధవరావుమీఁదఁ గిట్టనివారు మహారాజుతో నెన్నో కొండెములు చెప్పి యాయనమనస్సు విఱిచిరి. ఆకొండెములు విని మహారాజు మునుప టియట్ల నమ్మఁడయ్యె. అందుచేత మాధవరావు 1872 వ సంవత్సర మున మంత్రియుద్యోగమును మానుకొనెను.

ఆమహామంత్రి చరిత్రమునందు ప్రథమాధ్యాయ మింతతో ము గిసె నని చెప్పవచ్చును. మాధవరావు తిరువాన్కూరులో నంధకా రమయములగు ప్రదేశములందు వెలుతురు ప్రకాశింపఁజేసెను. అ రాజకము ప్రబలినతావుల రాజరికమునెలకొల్పెను. బందిపోటుదొం గలబారినుండి తప్పించి ప్రజల ధనప్రాణముల రక్షించెను. మట్టిగుడి సెలతో నిండినపట్టణమున సుందరమందిరములు గట్టించి రాజధాని

యమునకుం దగినట్లు చేసెను. కాలువలు త్రవ్వించెను. వంతెన లు కట్టించెను. బాటలు వేయించెను. దుర్గమప్రదేశములకు బయనము సులభము చేసెను. కాఫీతోటలు మొదలగు నానావ్యవసాయము లొప్పి జనుల కభిరుచి కలిగించెను. వేయేల! దేశమంతయు పాడిపంట లు సిరిసంపదలు గలిగి కనులపండువై యుండెను. మాధవరావు మంత్రిపదమున బూనుకాలమున నింగ్లీషువారు సంస్థానము గలుపుకొందురని క్షణక్షణము భయముకలుగజొచ్చెను. అట్టి సంస్థానము మాధవరావు విషమసమయమున స్వదేశసంస్థానములలో నగ్రగణ్యమని చెప్పదగి యున్నది. మహారాజు మాధవరావునకు నెలకు నేయి రూపాయలు పింఛనీ వేతనము చేయించెను. ఆ భరణము గ్రహించుచు మాధవరావు చెన్నపట్టణమునందు గాపురముండి విశ్రాంతి కాలము గడుపదలంచెను. అట్లు చెన్నపట్టణమున నున్నకాలమున గవర్నరు జనరలుగా ను తనశాసనసభలో మాధవరావు నొకసభ్యుఁడుగ నుండుమని కోరిరి. కాని మాధవరావుగారు సభ్యత్వ మక్కఱలే దనిరి. మాధవరావు తిరువాన్కూరులో నుద్యోగము మానిన వార్త యింగ్లాండులోఁ దెలిసినప్పుడు హెన్రీఫాసెట్టనునతఁడు తిరువాన్కూరుసంస్థానమునంత ప్రజ్ఞతోఁ బరిపాలించినమంత్రి యుద్యోగము లేక యుండవలసివచ్చెనా. ఇంగ్లీషువారు తమరాజ్యములో నాయన కేదయిన నుద్యోగ మీయఁగూడదా యని యిండియా సెక్రెటరీ నడిగెను.

ఆ దినములలోనే కలకత్తారివ్యూ యనుపత్రికలో మాధవరావును గూర్చి యాతనిప్రియశిష్యుఁ డగు రామవర్మ యొకవ్యాసమువ్రాసి ప్రకటించెను. అందుమాధవరావు సహజముగా గట్టిదార్ఢ్యము గలవాడనియు నిప్పటికి నలువదియైదేండ్లవయసున నుండుటచే మరిపదియేండ్లు పనిచేయఁ గలఁడనియు సంస్థానవ్యవహారములయం దతనికిఁగలనేర్పుసమాన మనియు స్పష్టముగా దెలుపఁబడెను. ఆసమయముననే

యుండిరి. యీ సెక్రెటరి, మాధవరావునకుఁ దను నుద్యోగమ్ము నీయవల్ల
సినఁదని గవర్నరు జనరల్లునకు వ్రాసెను. దాని కనుగుణముగా నింగ్లా
దు స్వస్థాన పరిభువగు తుకాజీరావు హోల్కారు తన స్వస్థానమునకు
మంచి మంత్రిని బంపవలయు నని గవర్నరు జనరలుగారిని ప్రార్థను
ద్యోగ మంగీకరింపు మని గవర్నరు జనరలు మాధవరావునకు వ్రాయ
నతఁడందుకు సమ్మతించి 1873 వ సంవత్సరమున సిద్ధరాం స్థానాం
త్రిపరిపాలకుఁడయ్యెను. ఇందూరు సంస్థానములో మాధవరావు సంవత్సరములు
యున్నపుడు నచ్చినట్లు కాని వనిఁ బూనెను. ఆకాలమున నతఁడు చేసిన గొప్ప
కార్యములంతగా లేవు. ఇందూరు సంస్థానమునకు ప్రసిద్ధి
తీ లేదు. అద్ది మాధవరావు చేయ నారంభించెను.
వారు బహద్దరు రఘునాథరావు తరువాత నిందూరు మంత్రిగ నుండెను. మా
ధవరావు పుస్తకము పూర్తి చేసెను. రెండు సంవత్సరములు గవర్నరుగారు మా
ధవరావు మంత్రిత్వమును మానిపోవలదని
కర్మ ముండవలయునని ప్రార్థించెను.
దత్తపుత్రుఁడగు 1875 వ సంవత్సరమున బరోడా సంస్థానాధిపతి
రావు గైక్వాడు రెసిడెంటునకు విషము పెట్టఁ జూచెనని
దానిమీఁద గవర్నరు జనరలు వానిని సింహాసనభ్రష్టునిఁ జేసి
నయస్కుఁడు కావున యాతని మాధవరావును
మునకు మాధవరావును మంత్రిగా యువరాజునకు
ర్పఱచెను.

ఆకాలమున బరోడా సంస్థానస్థితి మిక్కిలి శోచనీయమై భ
యంకరమై యుండెను. దొంగతనములు దోపిడులు నరహత్యలు రాజ్యమందె
ల్లెడలను నిరంతరాయముగ జరుగుచుండెను. ఉద్యోగస్థులు
పరస్పర మత్సరముచేత నొండొరులనాశనము చేయఁదలఁచి
పక్షములుగాఁ జేరి సంస్థానమునకుఁ జాలనష్టము గలుగఁజేయుచుండిరి.

వారి నడఁచుటకు, సంస్థానము, జక్కఁజేయుటకు మంచి యనుపమన స్సు, యనుపచేయు గలమనుష్యుఁడు గావలయు. అట్టివాఁడు మాధవరావుగాక యన్యుఁడు లేఁడు. అక్కడ నింగ్లీషు రెసిడెంటు మాధవరావునకు సమస్తవిషయముల సహాయముచేసి వానిపూనిక గడ ముట్టించెను. మాధవరావు దాఁటవలసిన మొదటి కష్టసముద్రము బరోడాసంస్థానపు శిస్తువ్యవహారము. బరోడా ప్రాచీనమువారు శిస్తువసూలు నిమిత్తము గ్రామములను సరదారులనఁబడు కొందఱు జమీందారుల కమరకముచేయుచువచ్చిరి. ఆసరదారులు స్వయముగ వ్యవహరింపక కొందఱుషాహుకార్లకు గ్రామములను దిరిగి యమరకములఁ జేయుచువచ్చిరి. ఆషాహుకారులు దయాదాక్షిణ్యములు లేక పంటలు పండిన యేఁడనక పండని యేఁడనక ధనము స్వీకరించుటయే ప్రధానవృత్తి చేసికొని కత్తులు కటారులుఁ బుచ్చుకొని ప్రజలపైఁబడి శిస్తు లీయని వారినిఁ దిట్టి కొట్టి చంపి సొమ్ము దోఁచుకొనుచు వచ్చిరి పన్నులు పోఁగుచేయు నెపమున షాహుకారులు దేశమున నరహత్యలు, ద్రోహములు యథేచ్ఛముగఁ గావించుచు వచ్చిరి. సరదారులు సొమ్ముకావలసినవారగుటచే నీదుష్కార్యములఁ జూచియుఁ జూడనట్లుండిరి. మహారాజు మంత్రులు సరదారుల జోలికిఁ బోయినచో శిస్తు కొంచెమైనఁ జేఁ జిక్కదని భయపడి యూరకుండ వలసిన వారైరి. ఆస్థితిఁజూచి మాధవరావు సహింపలేక యేమైనను సరే యాదార్జన్య మణపఁదలఁచు కొనెను. కాని సరదారులు వానికిఁ లోఁబడుటకు సామాన్యులు కారు. వారు మహారాష్ట్రులు. భుజబలము, టక్కరితనము గల ప్రభువులు. వారిని లోఁబరచు కొనుటకు మాధవరావు కొన్ని క్రొత్తచట్టములఁ జేసెను. కాని వారు లొంగక యుండియూ సెక్రెటరి కష్టీలుచేసియుఁ గుట్రలుఁ పన్నియుఁ జాల తొందర కలిగించిరి, అప్పుడు మాధవరావు ధైర్యముఁ

బూని కొందఱుసరదారులను దేశమునుండి యావలకుఁ బంపి కొందఱిని బెదిరించి కొందఱిని బ్రతిమాలి దేశము మంచిస్థితిలోఁ బెట్టి జనుల దురవస్థఁ దొలఁగించెను.

ఈసంస్థానమం దుండిన సరదారులు మహారాజునెడ నెట్లు నడచుకొనవలయునో సంస్థానమునం దెంతయధికారము గలిగియుండవలయునో యొకటినుండియు సరిగా నేర్పాటు చేయఁబడలేదు. సరదారులు మహారాజు కోరినప్పుడు యథాశక్తిగా సైన్యమునుగాని ధనమునుగాని సమర్పింప వలయునని యొకవిధముగా నేర్పాటు కలదు. విశేషించి వారలేఁటేఁటఁ గొంత శిస్తుఁగూడ నీయవలయును. సంస్థాన ప్రభుత్వము బలహీనముగా నుండుటఁజేసి యాసరదారులు తా మీయవలసిన సొత్తు నీయక జమీనులను స్వేచ్ఛగా ననుభవించుచు నిరంకుశాధికారులై యెవరిమాట వినక సంస్థానమునకుఁ గంటకులై యుండిరి. వారి నడఁపకపోయిన పక్షమున సంస్థానమునకు క్షేమములేదని మాధవరావు తెలిసికొని యాపనిఁ బూనెను. కాని యది సులభసాధ్యము గాదు. వారి భూముల నూడదీసికొనుట యధర్మము. ఊడఁదీసికొనక పోయినచో వారు లోఁబడరు. అందుచేత మాధవరావు ప్రాఁత లెక్కల వెతికించి ప్రతిసరదారు సంస్థానమున కీయవలసిన ప్రాఁతబాకీ నిమ్మని బలవంతముపెట్టెను. అది యిచ్చుకొనలేక కొందఱు తమ భూముల వదలుకొనిరి. కొందఱు తమ జమీనులు సంస్థానమునకే యిచ్చిరి. ఎందుకు నొడఁబడక ప్రతిఘటించిన సరదారులను మాధవరావు బలిమిని బట్టించి కాశీమొదలగు పట్టణములకు బంపించి, దేశము నిష్కంటకము చేసెను. అంతతో సరదారుల బాధ కొంతవఱకుఁ దొలఁగెను. ఇదిగాక మాధవరా వెక్కవలసిన కష్టపుగట్టు మఱొకటి యుండెను. అది సైన్యసంబంధమైనది. సంస్థానములో నిరర్థకముగ గొంతసేన యుండెను. ఈసేనకగు కర్చు లెక్క

వ, సైన్యవిభాగపు పని తక్కువ. ఉన్నంతవరకుండగా సైనికులో యుద్ధపాటవ మైన నెమ్మదిగ నేర్చుకొని పోవుచు నక్కడ జనులను బహు బాధపెట్టుచుం డిరి. మాధవరావు వ్యర్థమగు సైన్యవ్యయమును తగ్గించి దండించి కొందఱను తీసివేసి పిడుగువంటి సేనాపతులకును దక్షిణ సైనికులకు సం స్థానములో నిత్యోద్యోగము లిచ్చెను. ఇవియే గాక మాధవరావు మఱి యనేక కార్యములు చేసెను. ప్రజలకు భారముగ నుండు పన్ను లను తీసివేసెను. పాఠశాలలు స్థాపించెను. కోర్టులు బెట్టించెను. ము నుపు సందులలో నున్న యిండ్లు పడగొట్టించి వీధులు వెడల్పు చేయించి నూతన గృహములు కట్టించెను. పట్టణమున కలంకారముగనుండు గొప్ప మేడలు భవనములు కట్టించెను. సంస్థానములో గొప్ప యుద్యోగములకు దగిన సమర్థులు లేనందున మాధవరావు సమర్థులను బొంబాయి నుండి చెన్న పట్టణము నుండి పిలిపించెను. ప్రజలకు భారము లేకుండగనే శిస్తులు మునుపటికంటె హెచ్చెను. సమర్థులు దొరకుటకును దొరకినవారికి లంచములు మీఁదికి బుద్ధి పోకుండుటకును మాధవరావు ఉద్యోగస్థుల జీతములు హెచ్చించి ప్రతిమాసమునందు సరిగా నిప్పించుచువచ్చెను. ఈయన మంత్రిగా నున్నపుడె ప్రస్తుతము హిందూదేశ చక్రవర్తి గా నున్న ఏడ్వర్డు రాజుగారు యువరాజుగా నుండి హిందూస్థానము సందర్శింపవచ్చి బరోడాకుఁ బోయి మాధవరావుచేత సత్కృతుఁడై చాల సంతసించెను.

అతఁ డెన్ని కార్యములు జేసినను మునుపటివాని సాధారముగా సంచుకొనియే చేసెను; కాని వెనుకటి వన్నియు నిర్మూలించి క్రొత్త పద్ధతి పెట్టలేదు. వెనుక మైసూరు సంస్థానములో దివానుపనిచేసిన పూర్ణయ్యయను మహామంత్రివంటి బుద్ధికుశలత మాధవరావునొద్ద లే కపోయినను నితఁడు పూర్ణయ్యకంటె స్థిరమనస్కుఁడు సత్త్వవతేజ కుఁడు నని చాలమంది తెల్లవా రభిప్రాయపడిరి. హిందూదేశ ధనా

దాయ విషయమున నింగ్లాండులో నొకసభవారి యెదుట సాక్ష్య మిచ్చుటకు మాధవరావుగారి నాదేశము వెళ్లుమని యప్పటిగవర్నరు జనరలుగా రాయన వ్రాసెను. కాని మాధవరావు విదేశయాత్ర తన మత మొప్పదని మానుకొనెను.

1877 వ సంవత్సరమున ఢిల్లీలో జరిగిన దర్బారునకు సగౌరవముగ బిలువఁబడి మాధవరావు తన చిన్నరాజును వెంటబెట్టుకొని పోయెను. అక్కడ మాధవరావునకు విశేష గౌరవము జరిగెను. అప్పుడే గవర్నరుజనరల్ లిట్టను ప్రభువు వానికి రాజా బిరుద మిచ్చెను. మాధవరావు తన కాలోచన చెప్పుటకు రెసిడెంటు నుకొందఱు గొప్ప యుద్యోగస్థులు గల యొక సభ నిర్మించి దాని యాలోచనముం బట్టి నడుచు చుండెను. చిన్నరాజునకు విద్య నేర్పుటకు బొంబాయినుండి యీలియెట్టను నొక తెల్లవానిని పిలిపించి శ్రద్ధతో విద్య చెప్పించుట యెగాక విద్యాభివృద్ధినిగూర్చి స్వయముగాఁ గనుగొనుచువచ్చెను. 1882 వ సంవత్సరమున నాచిన్నరాజునకు యుక్తవయస్సు వచ్చినందున నింగ్లీషువారు వాని నాసంవత్సరమే సింహాసన మెక్కించిరి. గద్దె యెక్కినతోడనే మహారాజునకు మంత్రికి మనస్పర్థలుపుట్టెను. అందుచేత మాధవరావు 1882 వ సంవత్సరమున శెప్టెంబరునెలలో నుద్యోగము మానుకొనెను. బరోడా మహారాజు మంత్రి తనయొద్ద నుద్యోగము మాని పోవునపుడు మూడులక్షలరూపాయలు బహుమాన మిచ్చెను. ఇట్లు మాధవరావు యొక్క చరిత్రలో రెండవ యధ్యాయము ముగిసెను.

అనంతరము మాధవరావు రాజ్యవ్యాపార విహీనుఁడై చులుకనగు హృదయముతోఁ దనజీవిత శేషమును జెన్నపట్టణమునఁ గడపెను. ఆయన కార్గ్లేయులలోను స్వదేశస్థులలోను మిత్రు లనేకులుండినందున నిర్వ్యాపారజీవనము భారమనిపింపలేదు. అప్పటికి గొ

యన్యవహారములలో వాని కభిరుచి విశేషముగ నుండెను. ఇంగ్లాండు పత్రికలు, స్వదేశపత్రికలు చాల దెప్పించి యితఁడు చదువుచుండెను. ఆదినములలో నతనికి సంఘసంస్కరణమునం దభిమానము కలిగెను. అతిబాల్య వివాహమువలన కలుఁగు నష్టములఁ దొలగింపవలెనని యతని ముఖ్య సంకల్పము. తక్కిన సంస్కరణములలోఁగూడ మనము శాస్త్రములనేబట్టి పోఁగూడదనియు శాస్త్రములే కొన్ని స్థలముల లోమార్పు చేయఁబడఁదగియున్నవనియు నతఁ డభిప్రాయపడెను. అట్లభిప్రాయపడియు మాధవరావు సంస్కరణము వేగిరపడక జాగ్రత్తతో జేయవలెనను తలంపుగలవాఁడు. పూర్వాచారములు నాశనముచేయఁ గూడదనియు వానిని చక్కఁగామార్చుకొని యవలంబింపవలయుననియు నతఁడు జెప్పుచువచ్చెను.

1885 వ సంవత్సరమందు చెన్నపట్టణపు గవర్నరగు గ్రాండు డఫ్ప్రభువు కోరికమీఁద మాధవరావు మలబారు నేలపన్ను విషయమున్నకేర్పడిన సభ కగ్రాసనస్థుఁడై దొరతనమువారికి సాయము జేసెను. 1887 వ సంవత్సరమున గవర్నరగు కానిమరా ప్రభువు శాస్త్రబ్రహ్మచారులకు శాస్త్ర పండితులకు హితోపదేశము చేయుటకు మాధవరావును నియోగించెను. అప్పుడాయన యిచ్చిన యుపన్యాసమువలన దక్షిణహిందూస్థాన మంతను వెలిగించిన యాతని జ్ఞానజ్యోతియొక్క తేజస్సు నెల్లవారు జూడఁగలిగిరి. 1887 వ సంవత్సరమున నేషనల్ కాంగ్రెస్సనఁబడు దేశీయ మహాసభ చెన్నపట్టణమునం గూడెను. మాధవరావు దాని సన్మాన సంఘమున కగ్రాసనాధిపతియై కార్యనిర్వాహము జేయుటయే గాక దేశీయసభలో గవర్నరుల యొక్కయు, గవర్నరుజనరల్‌యొక్కయు నాలోచనసభలు పెద్దవి చేయవలయునని చక్కగా ముచ్చటించెను. మాధవరావు తన జీవిత కాలములో గడపటి నాలుగైదేండ్లు హేర్పట్ట

స్పెన్సరను మహాతత్వవేత్తయొక్క గ్రంథమునుజదివిసాంఘిక రాజకీయ విషయములలో వానిమతమే మంచిదనియనుసరించుచువచ్చెను. ఇట్లు చదువుటతో తనివినొందక యతఁడు చెన్నపురమండలివార్తాపత్రికలకు తఱచుగా వ్యాసములు వ్రాసి పంపుచునచ్చెను. ఆకాలమందాయన వ్రాతలకు మిక్కిలి గౌరవముండుటచే బత్రికాధిపతులు వానిలేఖలను గన్నుల నద్దుకొని గ్రహించుచువచ్చిరి. ఇప్పుడే కాదు. మాధవరావుద్యోగములో నున్నప్పుడుసయితము మెట్లొతీరికచేసికొని పత్రికల కుపయుక్తమయిన సంగతులువ్రాసి పంపుచువచ్చెను. 1875వ సంవత్సరమందీయన శుక్రగ్రహ సంచారమునుగురించియుపన్యాసమువ్రాయ దాని జదివి పశ్చిమఖండ జ్యోతిశ్శాస్త్రజ్ఞులు స్వదేశదైవజ్ఞులు వాని ఖగోళశాస్త్రపాండిత్యమున కిచ్చెరు వడిరి.

1888 వ సంవత్సరమున గవర్నరు జనరలగు డఫిన్ప్రభువుతన యాలోచనసభలో మాధవరావు నొకసభ్యుఁడుగనుండుమనికోరెను. మాధవరావు వయస్సుముదిరినకారణమున దానికొప్పుకొనలేదు. 188)వ సంవత్సరమున మాధవరావు స్వదేశబాలురకువిద్యనేర్పువిధమను పేరుపెట్టి యొకచిన్నపుస్తకమునువ్రాసెను. అది మన బాలురకు మిక్కిలి యుపయుక్తమయినది. ఆచిన్నపుస్తకమిప్పటికిద్రవిడమహారాష్ట్రమళయాళభాషలలోనికిఁదర్జుమా జేయఁబడినది. ఆసంవత్సరమందే యితఁడు జర్మనీవారి యాఫ్రికాఖండాక్రమణమునుగూర్చి యొక చిన్నవ్యాసమువ్రాసిజర్మనీరాష్ట్రమంత్రియగు బిస్మార్కుప్రభువునకుఁ బంపెను. బిస్మార్కువ్యాసములోనున్నవిశేషాంశమునుగ్రహించిసంతసించి స్వహస్తముతో మాధవరావునకుస్తోత్రపూర్వకముగా నొకజాబువ్రాసి యావ్యాసమును జర్మనీభాషలోనికి తర్జుమాచేయించి ప్రతిసిపాయికిఁ బంచిపెట్టించెను.

మాధవరావు స్వభాషయగు మహారాష్ట్రమందుజాలగృషిచేసి

కవిత్వము చెప్పనేర్చెను. ఆభాషలోనున్న కవిత్వము కఠినపదములు లేక స్త్రీలకు బాలురకు ననయుక్తముగ నుండును.

నిండు యవ్వనమున మాధవరావు తిరువాన్కూరుబరోడాసంస్థానములనుగూర్చి మిక్కిలి కష్టపడుటచేత వాని దేహస్థితిత్వరలో చెడిపోయెను. అతనికి 1890 వ సంవత్సరం డిశెంబరు 22 వ తారీఖున పక్షవాతము ప్రవేశించెను. ఆరోగమునే నతఁడు నమాసమిమూడుమాసములు తీసికొని 1891 వ సంవత్సర మేప్రియలునాలుగవ తారీఖునగాల ధర్మము నొందెను. ఇంగ్లాండులో హిందూదేశములో నఖండఖ్యాతిని సంపాదించినయామహాత్మునిగూర్చి వేరువ్రాయవలసిన దేమియు లేదు హిందూదేశస్థులు దేశపరిపాలనమునకుఁబనికిరారని తెల్లవారుపలికెడు పలుకులు వట్టిబూటకములనియాయనచరిత్రమువలన దెలిసికొనవచ్చును. హిందూదేశమునకు గవర్నరుజనరలుగా మాధవరావుని యోగింపఁబడిన పక్షమున నీ తెల్లగవర్నరుజనరలులలోననేకులకంటెమిక్కిలి చక్కఁగాఁ బరిపాలనముఁ జేసియుండును. అతఁడుసంపాదించినధనములో నొకగవ్వయయిన నన్యాయార్జితము లేదు. చిన్ననాట నుండియు నతఁడు మహోన్నతపదవులలో నుండుటంబట్టి యతఁడు కొంచెము బెట్టుసరిగ నుండునట్లగపడుచువచ్చెను. కాని చూడవచ్చినవానిని గౌరవించుట కలసి మెలసి మాటాడుట మొదలగుగుణముల కేలోటు లేదు. చిత్తరువులను వ్రాయించుట వ్రాసిన వానిని దెప్పించి తనమందిరమున నుంచుకొనుట వానికి మిక్కిలి యిష్టము. మతసంబంధములగువ్యాసంగములలోఁ గాలమువిస్తారము గడపుట వానికిష్టము లేదు. మనుష్యులు సత్ప్రవర్తన గలిగియుండి సుందరమయిన యీప్రపంచమందుభగవంతుడిచ్చినపదార్థముల జూచి యానందించిన చాలుననివానియభిప్రాయము. జ్యోతిశ్శాస్త్రమందు మాధవరావుచాలకృషిచేసిసిద్ధాంతభాగ మొకటే నమ్మదగినదికాని, జాతక ముహూర్తభాగములునమ్మదగినవి కావని యభిప్రాయపడి తన యభిప్రాయమును లోకమునకు వెల్లడించెను. రాజా సర్ మాధవరావు భరతఖండమాతకన్నపుత్రరత్నములలో నమూల్యమణి యని చెప్పవచ్చును.

సర్ తిరువళూరు ముత్తుస్వామి అయ్యరు.

సర్ తిరువళ్ళూరు ముత్తుస్వామి అయ్యరు

తిరువళ్ళూరు ముత్తుస్వామి అయ్యరుగారు తంజావూరుజిల్లా లోని ఉచువడిగ్రామములో 1832 వ సం॥రం జనవరి 28 వ తారీఖున నొక పేదబ్రాహ్మణకుటుంబమున జన్మించెను. ఆతని దురదృష్టముచేత దండ్రియగు వెంకటనారాయణశాస్త్రి స్వల్పకాలములోనే మృతినొందుటచే బాలకుని పెంచుభారమంతయు నిరాధారయగు తల్లి మీఁదబడెను. అప్పటికి ముత్తుస్వామి కొకతమ్ముఁడుకూడ నుండెను. తల్లి బాలకులని గున్రిఁ గొన్కొని తిరువళ్ళూరుగ్రామమునకుఁ బోయి విద్యాభ్యాసము చేయింపసాగెను. అక్కడిబడిలో బాలకులిద్దఱు స్వల్పముగ నఱవము నేర్చికొనిరి. ఆచదువైనఁ జాలకాలము చెప్పించుటకుఁ దల్లికి శక్తి లేనందున ముత్తుస్వామి కుటుంబపోషణార్థము మిక్కిలి చిన్నవయసుననే యుద్యోగము సంపాదించుకొనవలసివచ్చెను. అందుచేత నతఁడు గ్రామకరణమువద్ద నెల కొక రూపాయ జీతముమీఁద లెక్కలువ్రాయుటకు కుదిరెను. కొడుకు సంపాదించునట్టి యాస్వల్పజీతమునైనఁ దిని బ్రతుకుటకుఁ దల్లికి ప్రాప్తము లేకపోయెను. ఈచిన్నయుద్యోగమైన స్వల్పకాలములోనే యామె మృతినొందెను. ఆమె బ్రతికియున్నకాలమున కుమారునకు విద్యమీఁద నధికాసక్తి గలిగించెనఁట. ఆమెచేసిన ప్రోత్సాహము చేతనే తానంతటివాఁడయ్యెనని ముత్తుస్వామియయ్యరు పలుమా రిటీవల చెప్పుచువచ్చెను. ఆయుద్యోగమున నతఁడు పదునాలుగు వత్సరముల వయసు వచ్చువఱకుండెను. దైవము గొప్పవారు కావలసినవారిని చిరకాలము హీనస్థితిలో నుంచఁడుగదా.

1846 వ సం॥ ముత్తుస్వామి తనతాలూకాతహసీలుదారగు ముత్తుస్వామినాయకన్ ననువాని ప్రాపకము గాంచెను. ఈతనికి బట్లరు

తహసీల్దారును నేఁగుగూడ గలదు. తంజావూరు కల్లెక్టరుగారగు మాంటగోమరీ దొరగారికి ముత్తుస్వామినాయకన్ కొంతకాలము బట్లరుగా నుండి తరువాత తహసిల్దారు నగుటను బట్లరు తహసిల్దారని పేరు గలిగెను. చిన్నముత్తుస్వామి తహసిల్దారు ముత్తుస్వామిగారియొక్క వ్రాపకము సంపాదించుకొనుటకు నీక్రింది కారణము చెప్పుచున్నారు.

ఒకనాఁడా తహసిల్దారునకు సమీపమందున్న నదిగట్టు వానచే తెగి గండిపడినదని వర్తమానము తెలిసెను. తోడనే యతఁడు కచేరీకి బోయి దానివిషయమున గొన్ని సంగతులు కనుగొనుటకు గుమాస్తాను రమ్మని వర్తమానము పంపెను. గుమాస్తా లెవరు నప్పుడు కచేరిలో లేనందున బాలుఁడగు ముత్తుస్వామి తహసీల్దారుకడకుఁ బోయి యేమి సెలవని యడిగెను. తహసిల్దారు తనకు వచ్చిన కాగితము ముత్తుస్వామి చేతిలోఁ బెట్టి యాగండి విషయమున కొన్ని సంగతులు గావలయునని చెప్పెను. ముత్తుస్వామి తానదికనుఁగొని వత్తునని చెప్పి తత్క్షణమే యా నదియొడ్డునకుఁ బోయి గండి కొలుచుకొని దానిని పూడ్చుటకుఁ గావలసిన మట్టి మొదలగునవి యెంతకావలయునో తెలిసికొని మరల తహసిల్దారునొద్దకు వచ్చెను. తహసిల్దారు మొట్టమొదట ముత్తుస్వామి కట్టిన లెక్క నమ్ముట కిష్టము లేనివాఁడయ్యు నవసరమున నతఁడు వ్రాసిన కాగితముమీఁద వ్రాలుచేసి పంపెను. పంపి యాతహసిల్దారు ముత్తుస్వామి వ్రాసిన లెక్క సరియగునో కాదో తెలిసికొనుటకు తన హెడ్గుమాస్తాను గండియొద్దకు పంపెను. అతఁడది చూచివచ్చి ముత్తుస్వామి వ్రాసిన లెక్క సరిగానున్నదని చెప్పెను. మఱియొకనాఁడు మిరాశీదారుఁడొకఁడు తహసిల్దారు కడకుఁబోయి తాను సర్కారుకియ్యవలసినపన్నెంత యని యడిగెను. ఆతని కిరువదియూళ్లలో భూములుండుటచేత తహసిల్దారు వెంటనే వానిప్రశ్నకుత్తరము చెప్పుటకువీలులేక లెక్కలు చూడవలయునని చెప్పి దాపున నిలువబడియున్న ముత్తుస్వామినిజూచి

దూవిషయమును నీవే మొదట నెఱుఁగుదువా యని యడిగెను. ముత్తుస్వామి నేనెక్కడను చూడలేదు మిరాశీదారుఁ జేయవలసిన ప్రశ్నమును త్వరగా చెప్పెను. తహసీల్దారుఁ డది సరియగునో కాదో యని బుద్ధిని సారించి సరిగానే యని గ్రహించెను.

పై నుదాహరింపఁబడిన సంగతులం బట్టి ముత్తుస్వామి యద్భుతమగు బుద్ధిసామర్థ్యము గలవాఁడని తహసీల్దారు గ్రహించెను. ఈకాలమున ముత్తుస్వామి తహసీల్దారు కచ్చేరిలో నుమేజువాణిగా నుండెనని తోఁచుచున్నది. ముత్తుస్వామి తన తెలివికిఁ దగిన యీయుద్యోగముతోఁ దనివినొందక సూర్యోదయమున కొక్కలింగమును సతతము పెట్టెసుబడికి మధ్యాహ్నము పదునొకండు గంటలు మొదలు రెండుగంటలవఱకుఁ దనకు పనిలేనప్పుడు నా సమయమున నొక్కెడకుఁ బోవుచు, ఎవరి యనాగరకునకు యింగ్లీషుపాఠములు నేర్పుకొనెను. పాపమతనికి రాజభాషయగు నింగ్లీషు చదువుకొనవలెనని కుతూహలముండెను గాని దీనికొఱకు ధనము లేక పోవుటచే నట్లు చేయుటకు వీలు లేకపోయెను. తహసీల్దారునకు మేనల్లుఁ డొకఁ డుండెను. అతని నెల్లరు బాగుచేయవలెనని మేనమామ వానికి స్వయముగాఁ జదువుచెప్ప నారంభించి ముత్తుస్వామినిగూడ వానితోఁ జేర్చ యిరువురకు నింగ్లీషు మొదటిపాఠపుస్తకము చెప్పెను. పుస్తకము ముగిసిన పిదప తహసీల్దారు వారి నిరువురఁ బరీక్షింపఁదలఁచి యొక వారము గడువిచ్చి గడువులోపల పుస్తకమంతయుఁ జదువుఁడని వారి కానతిచ్చెను. వారము గడచినపిదప తహసీల్దారు పరీక్షించు నప్పుడికి బ్రాహ్మణబాలుఁడు గ్రంథము సమగ్రముగ నప్పగించెను. తహసీల్దారుమేనల్లుఁడు కొన్ని పుటలు మాత్రమే చదువఁగలిగెను. బ్రాహ్మణబాలుని బుద్ధికుశలత కచ్చెరువడి తహసీల్దారు వానిని ఉదవించి వృద్ధికిఁ దేవలయునని నిశ్చయించుకొని నాగపట్టణము మి

షను స్కూలులోఁ జదువుకొనుట కిష్టపడుదువా యని ముత్తుస్వామి నడిగెను. అందుకు ముత్తుస్వామి సమ్మతించినందున తహసిల్‌దారు వానిని నాగపట్టణము పంపించి బడిలోఁ బ్రవేశపెట్టించి వానికిసంరక్షకుఁడుగ నాగపట్టణములోనున్న తన తమ్మునే నియమించెను. ముత్తుస్వామి నాగపట్టణములోఁ బదునెనిమిది మాసములు చదివి యాకాలములోఁ దన్నుగుఱించి యందఱకు మంచియభిప్రాయము కలిగించెను. అందుచేత దయాళువగు తహసిల్‌దారు ముత్తుస్వామిని విద్యాభ్యాసమునిమిత్తము చెన్నపట్టణము హైస్కూలున కంపెను. అప్పటికి రాజామాధవరావుగారు విద్యాభ్యాసము ముగించి యాపాఠశాలలోనే యుపాధ్యాయుఁడుగ నుండెను. వెనుక తంజావూరు కలెక్టరుగానుండిన మాంటుగొమరీ దొరగారుఁ గూడ గొప్ప యుద్యోగము మీఁద జెన్నపట్టణములో నుండిరి. బట్లరు తహసిల్‌దారు మాధవరావుగారి కిమ్మని యొక యుత్తరమిచ్చి ముత్తుస్వామిని జెన్నపట్టణమంపినందున మాధవరావుగా రాయుత్తరము జూచుకొని బాలుఁడగు ముత్తుస్వామియం దభిమానముగలిగి శ్రద్ధతో విద్యాభ్యాసము చేయింపఁదొడఁగెను. మాంటుగొమరీదొరగారు తంజావూరుజిల్లా జనులమీఁద మహాభిమానము గలవాఁడగుటచే నాజిల్లానుండివచ్చి చెన్నపట్టణమునఁ జదువుకొను బాలురక్షేమము స్వయముగాఁగనుగొనుచు వచ్చెను. ముత్తుస్వామియుఁ దంజావూరువాఁడగుటచే దొరగారి యనుగ్రహమునకుఁ బాత్రుఁడయ్యెను. ఆయిరువుర దక్షతలోనుండి ముత్తుస్వామి యద్భుతముగ విద్యాభ్యాసము చేసెను.

అప్పుడు చెన్నపట్టణము హైస్కూలునకు పవెలుగారు ప్రథమోపాధ్యాయులై యుండిరి. దక్షిణ హిందూస్థానమునకు విద్యావిషయమున నితఁడు చాల యుపకారముచేసెను. ఆయన శిష్యుఁడైన ముత్తుస్వామి దినదినాభివృద్ధినొంది యేఁటేఁట బహుమానములను

విద్యార్థి వేతనములను బడయుచు వచ్చెను. వానిబుద్ధి గణితశాస్త్రమునందు మిక్కిలి ప్రవేశించెను. అందులో జ్యోతిశ్శాస్త్రమునందు వానికి మహాభిమానము. విద్యార్థులకు నుపాధ్యాయులకు నీదినములలో నుండెడి పరస్పర సంబంధములకంటె నాదినములలో సంబంధమెక్కుడుగ నుండెను. ఈకాలమున విద్యార్థులు పాఠశాలలో నున్నంతసేపేకాని యవ్వల నుపాధ్యాయులను దఱచుగ కలిసికొనరు. ఆకాలమున నట్లుగాదు. పవెలుగారు పాఠశాలలో నొడలు దాచుకొనక యెంతో శ్రమపడి బాలురకు విద్యజెప్పుటయె గాక శిష్యుల నింటికి దీసికొనిపోయి వారికిఁ గావలసిన శాస్త్రములు చెప్పుచు వచ్చెను. ముత్తుస్వామి మిక్కిలి చదువు తమకముగలవాఁడగుటచే బహుమారు పవెలుగారి యింటికిఁబోయి రాత్రి తొమ్మిదిగంటలవఱకు జ్యోతిశ్శాస్త్రము మొదలగునవి నేర్చికొనుచు వచ్చెను. చీఁకటి రాత్రిలలో శిష్యుఁడొక్కఁడు గృహమునకుఁ బోలేఁడని పవెలుగారు ముత్తుస్వామిని దనబండిమీఁద నెక్కించుకొని వాని యింటికితీసుకొనిపోయిదిగవిడుచుచుండును. తనశిష్యుఁడు ప్రతినెలకు వ్యయముచేయు సొమ్ము సరిగా వ్యయముచేయుచున్నాఁడో లేదోయని వానిలెక్కలు సయితమాదొర నెలనెలకుఁ జూచుచు వచ్చెనఁట. ముత్తుస్వామి బుద్ధిసూక్ష్మతకుఁ దోడుగ మిక్కిలి పాటుపడుచు వచ్చినందున నెన్నో బహుమానములఁ బడసెను.

1856 వ సంవత్సరమున విద్యాధికారు లింగ్లీషులో మంచి వ్యాసము వ్రాసిన వానికి నైదువందల రూపాయలు బహుమానమిచ్చుటకుఁ బ్రతిజ్ఞచేసిరి. చెన్నపురిరాజధానిలోనున్న విద్యార్థులందఱు దానికిఁ బ్రయత్నింపవచ్చునని వారుసెలవిచ్చిరి. అప్పుడనేకులు వ్యాసములు వ్రాసిరి. అప్పుడు బహుమానము ముత్తుస్వామికే వచ్చెను. ఆవ్యాసములో వ్రాసినవిషయము “మనజాతిలోఁగల దుర్గుణ

ములు, వానినినవరించుకొనవలసిన విధములు." అతఁడు వ్రాసిన వ్యాసమును బరీక్షించినవారిలో నప్పుడు హైకోర్టు జడ్జిగానుండిన హాలోవేగారొకరు. ఆయన ముత్తుస్వామి వ్రాసిన యావ్యాసమును మిక్కిలి మెచ్చెను. బహుమాన ధనమగు నైదువందల రూపాయల ధనమొత్తము ముత్తుస్వామి కిచ్చునప్పుడు పవెలుగారీక్రిందివిధమునఁ బలికిరి. "ఈరూపాయలు నీవు ముందుముందు నదృష్టవంతుఁడవై సంపాదించు ధనరాసులకు విత్తనములై యుండుఁగాక" ముత్తుస్వామి యారూపాయలను మిక్కిలిజాగ్రత్తగా దాఁచి స్మృతిహొందునవఱకు నెన్నఁడు నందులో నొకరూపాయయైనఁ దీసి వాడుకొనలేదు. అప్పుడు దొరతనమువారు ముత్తుస్వామిపేరు గెజటీలో బ్రకటించి యతఁడేయుద్యోగమునకైనఁ దగినవాఁడని వ్రాసిరి. శిష్యునివైదుష్యముఁ జక్కఁగ నెఱింగి పవెలుగారు వాని నింగ్లాండు పోయి సివిలు సర్వీసు పరీక్షకుఁ జదువుకొమ్మని పురికొల్పిరి. అందఱు విద్యార్థులవలెనే ముత్తుస్వామియు నప్పటికి వివాహమాడి కాలిసంకెళ్ళు తగిలించుకొన్నందున సముద్రయానమువలన వర్ణభ్రష్టత గలుగునను భయమునను దేశమువిడిచి బోవడయ్యె. అందుచే విద్య ముగిసినతోడనే ముత్తుస్వామి యఱువది రూపాయల జీతముమీఁద నుపాధ్యాయుఁడయ్యెను. అందులోనుండఁగా మాంటుగొమనీగారు తంజావూరు కలక్టరు కచేరీలో వానికి రికార్డుకీపరుపని యిచ్చిరి. అందులోనుండగా నప్పటివిద్యాధికారి (డైరక్టరు) యగు నర్బతునాటుగారు వానిని డిప్యూటీఇన్స్పెక్టరు (పాఠశాలపరీక్షకుఁడు) గా నియమించిరి. ఈయుద్యోగమున నెలకు నూటయేబదిరూపాయలు జీతము. కాని ముత్తుస్వామి యయ్యూరు చిరకాల మందుండ లేదు. ఏల యన నాకాలమున గవర్నమెంటువారు ప్లీడరుపరీక్షం గ్రొత్తగఁ బెట్టిరి. అందుఁ గృతార్థులైన వారు చెన్నపట్టణపు సాదరుకోర్టులో తక్కిన యన్ని జిల్లాకోర్టు

లలోను బలిచే యునహాల్కలని ప్రకటించినందున ముత్తుస్వామి యాపరీక్షకుఁజదివెను. ఆసంవత్సరముపరీక్ష కుంభకోణములో జరిగెను. అనేకులు పరీక్షకువచ్చిరి. అందులో ముత్తుస్వామి యయ్యరు మొదటివాఁడుగఁ గృతార్థుఁడయ్యెను. రెండవయతఁడుగ దివాను బహద్దరు రఘునాథ రావు కృతార్థుఁ డయ్యెను.

అప్పటి ప్లీడరుపరీక్ష యిప్పటివలెఁగాదు. ఆకాలమునఁ బరీక్షితులు (పరీక్షకు వచ్చినవారు) కోర్టులోనుండి తెచ్చిన పాతరికార్డు నెవ నోయొకరుచదువఁగా విని తామువిన్న యాసంగతులంబట్టి యావ్యాజ్యములోనొకతీర్పు నక్కడనే వ్రాయవలయును. కుంభకోణములోజరిగి నయాపరీక్షకును తంజావూరుజిల్లా జడ్జీ స్వయముగా వచ్చి నడపి పరీక్షితులు తీర్పు వ్రాయవలసిన విషయమునకు నొక పాతవ్యాజ్యము రికార్డు దెప్పించి యది చదువుమని సిరస్తదారున కాజ్ఞాపించెను. సిరస్తదారుమిక్కిలివడిగడిగాఁజదివినందునముత్తుస్వామివిస్పష్టముగాఁజదువుమని వానితో ఘర్షణముపడెను. జడ్జీ యదివిని సిరస్తాదారును మెల్లగాఁ జదువుమని మందలించి తాను గూడ పరీక్షింపఁబడవచ్చినవారిలో నొకఁడుగా భావించుకొని బల్లదగ్గఱ గూర్చుండి సిరస్తాదారు చదివిన యంశములకు తానుగూడ నొకతీర్పు వ్రాయ సమకట్టెను. ఆయంశములమీఁద ముత్తుస్వామియయ్యరు, వ్రాసినతీర్పు జడ్జివ్రాసినతీర్పు సరిగానుండెను.

ఆతని శాస్త్రజ్ఞానమునకుమెచ్చియాజడ్జిస్వల్పకాలములో నేముత్తుస్వామి యయ్యరును టాంక్విబారుపట్టణములో డిస్ట్రిక్టుమునసబుగా నియమించెను. ఆయుద్యోగములో ముత్తుస్వామి యయ్యరు చూపిన బుద్ధికుశలత నెల్లవారు మెచ్చి పొగడిరి. ఆజడ్జీ యొకసారి యామునసబుగారికచ్చేరి యాకస్మికముగా బరిక్షింపవలెననితన రాకవానికిఁ దెలియఁబఱచకుండ క్రూంక్విబారునకు బోయెను. ఆతనిరాకవినిమునసబు

వాని దరిశనముచేసి తనకోర్టుశోధింని పరిక్షింపవలయుననియుఁ దాను వ్యాజ్యమును విచారణ చేయుచుండఁగా దగ్గరకూర్చుండివినవలయునని యు నధికారిని గోరెను. అతనికోరికప్రకారము జడ్జీ కోర్టు పరీక్షించి వాని ప్రక్కనుగూర్చుండి వ్యాజ్యములవిచారణవిని చాలసంతోషించి తంజావూరువెళ్ళి ముత్తుస్వామియయ్యరు తనతో సమానముగాజడ్జీపని చేయదగినవాఁడనియు వాని తెలివి యసాధారణమైనదనియువ్రాసెను.

ముత్తుస్వామియయ్యరు చిరకాలమాయుద్యోగమునం దుండలేదు. ఆకాలమున దొరతనమువారు మనరాజధానిలోనున్న యీనాములను స్థిరపఱచి యీనాముదారులకు సర్వాధికారము నీయవలయునని యీపనిచేయుట కీనాముకమీషనరు నేర్పఱచివానికి సహాయముగాకొందఱు డిప్యూటికలెక్టరుల నేర్పఱచిరి. అందులో ముత్తుస్వామయ్యరొక్కరా యీనాము కమీషనులో దేశస్థులకు దన యధికారులకు సంతుష్టి కలుగునట్లు బనిచేసెను. తరువాత దొరతనమువారతనికి డిప్యూటికలెక్టరుపని స్థిరపరచి మేజస్ట్రేటునధికారమిచ్చిరి. ఈయుద్యోగమందుండగా నొకసారి యొకగొప్ప షాహుకారు మోసముచేసినాఁడని నేరస్థుఁడుగఁ జేయబడెను. అది ముత్తుస్వామియయ్యరు విచారణచేయవలసివచ్చెను. షాహుకారుపక్షమున న్యాయవాదులలో నగ్రగణ్యుఁడగు నార్టనుగారు వచ్చి పనిచేసిరి. ముత్తుస్వామియయ్యరు పదునైదుదినములు విచారణచేసి యానేరమును జిల్లాజడ్జీగారు విచారణచేయవలసినదని యాకోర్టునకుబంపెను. నార్టనుగారుచెన్నపట్టణమునకుఁబోయి తనమిత్రుఁడు హైకోర్టుజడ్జీయునగు హాలోవేగారిని గలుసుకొని ముత్తుస్వామియయ్యరువంటి మేధావంతుని రివిన్యూవ్యవహారములలో నిలుపుటచే వాని తెలివి వ్యర్థమగుచున్నదని చెప్పెను.

ఆకాలమున దక్షిణకన్నడపు జిల్లాలో ధర్మశాస్త్రములో జక్కనిప్రవేశముగల సబుజడ్జీయొకఁడు కావలసివచ్చెను. ఆయుద్యోగము

నకు ముత్తుస్వామియయ్యరుకంటె దగినవాఁడు లేఁడని దొరతనమువా రతనినే నియమించిరి. ఈయుద్యోగము మూఁడేండ్లుచేసినపిదప 1868వ సంవత్సరమునదొరతనమువారుముత్తుస్వామినిఁజెన్నపట్టణమున పోలిసుమేజస్ట్రీటుగా(ప్రెసిడెన్సిమేజస్ట్రీటుగా)నియమించిరి.ముత్తుస్వామియయ్యరువద్దనున్నముఖ్యగుణమేమనగానతఁడుభయముగానిపక్షపాతముగానిలేకశ్రద్ధాళువై తనవిధికృత్యములఁదీర్చుచువచ్చెను. దీనికుదాహరణముగా నొకకథగలదు. ఒకహిందువుఁడు హైకోర్టుజడ్జీలలో నొకని గృహావరణములోఁ బ్రవేశించినాఁడని యాజడ్జివానిందిట్టముగఁగొట్టెను. ఆహిందువుఁడు,మనయయ్యరుగారియొద్ద నాజడ్జిమీఁద నభియోగము తెచ్చెను. గొప్పవారిమీఁద నిటువంటియభియోగములు వచ్చినప్పుడధికారులు ముందుగా వారికి సమనులుచేయక "మీకుసమను లేల చేయఁగూడదో తెలియఁజేయుఁ"డని ముందుగా వ్రాయుదురు. అయ్యరట్టిపని చేయక యాజడ్జీగారికి ముందుగా సమనుచేసెను. హైకోర్టు జడ్జీయంతవానినంత స్వల్పనేరముమీఁదఁ దనకోర్టుకురప్పించుటభావ్యముగాదని తన పైయధికారి హితోపదేశము చేసినను వినక యయ్యరువానినిఁ దనయెదుటకు రప్పించుటయేగాక నేరస్థునిజేసిమూఁడురూపాయలు ధనదండన విధించెను. ఈయుద్యోగమునందున్నప్పుడేముత్తుస్వామియయ్యరు బి యల్ పరీక్షకుఁజదివి యందుమొదటితరగతిలోఁ గృతార్థుఁడయ్యెను.

అనంతరముదొరతనమువారు ముత్తుస్వామియయ్యరునుస్మాలుకాజుకోర్టు జడ్జిగా నియమించిరి. ఈపదవిలోనుండి యాయన దొరతనమువారికిఁగలుగజేసిన సంతుష్టి యింతింత యనరాదు.అప్పుడుగవర్నరుగానుండిన సర్ అలగ్జాండరు అర్బతునాటుముత్తుస్వామియయ్యరునకు తంజావూరుజిల్లా జడ్జీపని నీయఁదలంచెను. కానికలకత్తాలోఁజెన్నపట్టణములోనుండిన తెల్లవారు వలనుపడదనిచెప్పినందునమానవలసివ

క్రీ. 1878 వ సంవత్సరమున జనవరినెలలో జరిగిన ఢిల్లీదర్బారునకు దొరతనమువారు ముత్తుస్వామియయ్యరును నాహ్వానముచేసి జ్ఞాపకార్థముగా వాని కొకపతకమును బహుమానమిచ్చిరి. ఆసంవత్సరమే వానికి సి. ఐ. యి. అనుబిరుదమునిచ్చిరి. అప్పటికి చెన్నపట్టణపు గవర్నరుగారగు బకింగుహాంప్రభువుగారు వాని కాబిరుదుచిహ్నములనుస్వయముగానిచ్చి శ్లాఘించిరి. 1878 వ సంవత్సరమందే దొరతనమువారు ముత్తుస్వామియయ్యరును హైకోర్టుజడ్జిని చేసిరి. చెన్నపురి రాజధానిలో స్వదేశస్థులు హైకోర్టు పీఠమెక్కుట కదియే ప్రథమము. ఆగవర్నరుగారు ముత్తుస్వామియయ్యరును గూర్చి యొక యుపన్యాసములో నీక్రిందివిధముగఁ జెప్పిరి. "ఆనరబుల్ శేషయ్యగారిని గవర్నరుజనరల్ గారియాలోచనసభలో సభికునిచేయుటయు, హానరెబుల్ ముత్తుస్వామియయ్యరుగారిని హైకోర్టుపీఠ మెక్కించుటయు వారిని దగినపదవిని నిల్పుటగాదు. తగనిగౌరవము చేయుటగాదు. అట్టివారనేకులు కావలయుగావున వారి నవలంబించుటకు మీరు ప్రయత్నము జేయుఁడు"

ముత్తుస్వామియయ్యరు హైకోర్టుపీఠ మెక్కినక్రొత్తలో దన సామర్థ్యము దానెఱుఁగక కార్యనిర్వహణముఁ గూర్చి కొంతకాలము భయపడజొచ్చెను. ఆతనిభయమునకుఁ దోడుగ మొదటనె తెల్లవారి వ్యాజ్యమొకటి విచారణకు వచ్చెను. ఒక తెల్లవాఁడు వాగ్దానమును దప్పినాఁడని వారిమీఁద నభియోగము తేఁబడెను. ఇంగ్లీషువారి యాచారవ్యవహారము తెలియఁగనివాఁడగుటచేఁ బ్రమాదవశమున నెట్టి గొప్పతప్పుచేసి యపనిందపాలు కావలసివచ్చునోయని భయపడి జాగ్రత్తతో విచారణచేసి తీర్పు రెండుమూడుసారులువ్రాసి చింపివేసి మరలవ్రాసి కోర్టులోఁ జదివెను. చదివినతోడనే తెల్లవారు తీరుపుమిక్కిలియుక్తియుక్తముగానుండెనదని శ్లాఘించిరి. అదిమొదలుకొని యతని ప్రతిష్ఠ క్రమక్రమముగ హెచ్చెను. హైకోర్టుజడ్జిపదవికెక్కిన స్వదేశ

స్థులలో నింతవాఁడు లేఁడని యిప్పటికిని జనులుచెప్పుచున్నారు. ఆయనశాంతము నిష్పక్షపాతము మేమఁదాఁచని పరిశ్రమ సత్యముఁ గ్రహించు సూక్ష్మబుద్ధి విశేషించి ధర్మశాస్త్రజ్ఞానము వానికి శాశ్వతమైన సత్కీర్తిఁ దెచ్చినవి. విస్తారము బుద్ధిపరిశ్రమ గావలసినచిక్కువ్యాజ్యములన్నియు సాధారణముగా నాతనియొక్కకే విచారణకువచ్చుచుండెడివి. న్యాయాధిపతియొక్క కృత్యము మిక్కిలి పవిత్రమైనదనియతఁడు నమ్ముచు వచ్చెను. ఆనమ్మికనే యొకసారి శాస్త్రాకేషనుమహాసభలో నతఁడీక్రిందిమాటలతో వక్కాణించెను. "న్యాయస్థానము (హైకోర్టు) పవిత్రమైన దేవాలయము. అక్కడకూర్చుండున్యాయాధిపతులు (జడ్జీలు) మనుష్యులైనను సత్యదేవతయొక్క సేవకులు. ఆపవిత్రదేవాలయమునకు మీరాలోచనలతోను మీవాక్యములతోను, ప్రవేశించువారు సత్యకైంకర్యమున్న దేవతాప్రియులు. మీలో నెవ్వరైన నట్టిస్థిరముక్కి మీరాజుపక్షమున న్యాయముఁజేయవలసి వచ్చినప్పుడు దేవతముఖమునుజూచి చేయుఁడు."

ఆయనతో సమానముగఁ బీఠమునందుఁ గూర్చుండినయూరోపియను జడ్జీలు వానిని మిక్కిలిగౌరవముతోఁజూచుచు ధర్మశాస్త్రములయందు వానిని మహాధికారిగా భావించిరి. వానితీర్పులు మిక్కిలిపఁడవిగానుండినను శాస్త్రాంశములు సమగ్రముగా చెరిగివేయుచుండును. కోర్టులలోజరుగు వ్యవహారధర్మశాస్త్రముల సంబంధమగు గ్రంథములకు వానితీర్పులు మంచియలంకారములని చెప్పవచ్చును. ఈప్రకారముస్వదేశస్థులయు దొరలయు మెప్పులుబడయుచు ముత్తుస్వామియయ్యరు పదునాలుగు సంవత్సరములు హైకోర్టు జడ్జిగనుండి యీనడుమ1893 వ సంవత్సరమం దొకసారి ప్రధానన్యాయాధిపతిత్వమునందుమూఁడుమాసములు ప్రతిష్ఠింపఁబడి యాదొరతనమువారి యేలుబడిలోస్వదేశీయుఁ డధిష్ఠింపఁదగిన మహోన్నతపదవిని బ్రాపించెను. దొర

తసమువారు వానిరాజభక్తికి మెచ్చి కె. సి. ఐ. యి. అను బిరుద మునుగూడ నిచ్చిరి. అంతటి కీర్తి తేజముతోఁ బ్రకాశించుచుండిన యాతని జీవితకాలము 1895 వ సంవత్సరము జనవరినెలలో ముగిసెను.

ఆయన జడ్జిగా నుండుటచేత నితరలౌకిక వ్యవహారములలోఁ బ్రవేశించుటకుఁ దగిన వీలులేకపోయెను. గాని యూనివరుసిటీ యని పిలువఁబడు విద్యాపరిషత్తునందు సభికుఁడై విద్యాభివృద్ధివిషయమునఁ జాల పాటుపడుచు వచ్చెను. విద్యార్థులు బి. యే. బి. యల్. ఎం. యే. యస్. ఎల్. మొదలగు పరీక్షలలోఁ గృతార్థులైనపిదప వానికి విద్యాపట్టము లిచ్చుటకుఁ బ్రతిసంవత్సర మొకసభ జరుపఁబడును. ఆసభపేరు "కాన్వొకేష" నందురు. అప్పుడు విద్యాభ్యాసము ముగించిన యాశాస్త్ర బ్రహ్మచారులకు శాస్త్రాధిపతులకు రాజధానిలోనున్న గొప్పవాఁడొకఁడు హితోపదేశముచేయుట యాచారముగ నున్నది. అట్టియుపదేశ మదివఱకు తెల్లవారే చేయుచువచ్చిరి. స్వదేశస్థులనుగూడ కొంతటి నిటీవల తత్కార్యమునకు నియమింపఁబడుచు వచ్చిరి. అందు మొదటివాఁడు ముత్తుస్వామియయ్యరు. ఆతని యుపదేశము సర్వవిధములఁ శ్లాఘనీయముగనుండెనని యదివిన్న వారంద ఱభిప్రాయపడిరి. తనకు విద్యాగురువగు పవెలుగారియెడల నతఁడెంతో కృతజ్ఞుఁడై యుండెను. పవెలుగారివంటి మిత్రుఁడు హిందువులకు మఱియొకఁడు లేఁడని యతఁడు పలుమాఱు చెప్పుచు వచ్చెను. కుంభకోణముకాలేజీ ప్రధానోపాధ్యాయుఁడగు తంజాళం గోపాలరావుగారి విషయమున నతఁడిట్లు చెప్పుచువచ్చెను. "నాజీవిత కాలములో నేను సంపూర్ణముగా మెచ్చుకొన్న మనుష్యుఁ డితఁడొక్కఁడే." గోపాలరావుగారి మీఁదనున్న గౌరవముతో సమానముగ రంగనాథం మొదలియారుగారిమీఁద నతనికి గౌరవముండెను.

ముత్తుస్వామియయ్యరు సంఘసంస్కారమున కేవిధమయిన

నుపకారముఁ జేయలేదని పలుమారాతని నెన్నుచుండును. సంఘసంస్కరణము గావలయునని యతఁ డభిప్రాయపడెనఁట గాని మెల్లగను జాగరూకతతోను జేయవలెనని యాయనమతము. మన విద్యార్థికులనేకులు వీరి విధముననే సంస్కరణము కావలె నని మాటలఁ జెప్పుచు నాచరణమున వెనుక దీయుచుందురు. మనదేశ స్త్రీలస్థితి యుండవలసిన విధముగా లేదనియు నెంతో మార్పు జెందవలయునని యు నతఁ డభిప్రాయపడి పురుషులు తమతమ సంరక్షణమందున్న స్త్రీలకు విద్య నేర్పుచుండవలసినదని యుపదేశముచేసెను. ఆయన విదేశప్రయాణమునకు విరోధి కాఁడు. ఆవిషయమున నతఁ డొకసారి యిట్లు చెప్పెను. "మీలో యూరపుఖండమునకు వెళ్ళగల సామర్థ్యముగలవారు తప్పక యక్కడకుఁబోయి యచటి సంఘస్థితులు నాగరికతలు దెలిసికొని జ్ఞానాభివృద్ధిఁ జేసుకొనుఁడు."

బాల్యవివాహము కూడదని యతఁడీ క్రిందివిధమునఁ జెప్పెను. "రజస్వలానంతరవివాహము కన్య కశాస్త్రీయముకాదు. అయినను సంఘమట్టిపని మహాపాతకమని యూహించి తండ్రి యొకవేళ యట్టి వివాహము చేసినయెడల కూఁతును బాధించును." స్త్రీపునర్వివాహ విషయమున నాయన యభిప్రాయమిది. 'స్త్రీ' యొక్క వివాహమునకే యనర్హురాలయ్యున్నను పురుషుఁడు బహుభార్యలు జీవించియున్నప్పుడు సయితము తన యిచ్చవచ్చినట్లు వివాహ మాడవచ్చునఁట. స్త్రీ పురుషుల స్వాతంత్ర్యములలోఁ గనఁబడుచున్న యీ యసమత్వము మన కుటుంబపద్ధతులవల్ల మఱింత బాధాకరముగా నున్నది. స్థితిగతు లిట్లుండుటచేత నభివృద్ధి పక్షమువారు మన సంఘపద్ధతి వానికాధారమయిన ధర్మశాస్త్రము క్రూరములుగ నున్నవనుట యొక యాశ్చర్యముగాదు. నీతిసంబంధము నాలోచించితిమా బాలవితంతు వివాహములు మనదేశమం దెంత యవసరములో కొలఁదికాలము

కాపురముచేసిన వితంతువులకు సంతతియ యనవసరమని నాయభిప్రా యము.

అట్లభిప్రాయపడియుముత్తుస్వామియయ్యరు హైకోర్టుజడ్జిగానుం డి సంఘసంస్కరణమును ముఖ్యముగా వితంతువివాహమును వృద్ధిజే యుటకు మారు దానికి వ్యతిరేకముగఁ దీర్పులుచెప్పెను. అట్లుచెప్పు ట తగదని కొందఱు తన్ను నిందింప నతఁడు క్రిందివిధముగా వారి కుత్తరముఁ జెప్పెను.

కోర్టులు నడపవలసివచ్చిన హిందూధర్మశాస్త్రము జనులయం గీకారమును బట్టికాని వేదకాలములోను స్మృతులకాలములోను నుం డిన యాచారములనుబట్టి కాదు. అట్లు చేసితిమా తీర్పులు ధర్మస మ్మతములుగావు. యుక్తియుక్తములుగావు. ఇట్టిమతము గలిగినవాఁడ య్యు నతఁడు సంఘపురోవృద్ధికి విఘ్నకారిగాఁడని కొంద ఱభిప్రా యపడుచున్నారు. ముత్తుస్వామియయ్యరుగారి యభిప్రాయప్రకార ము ప్రతిమనుష్యునకు మతముండవలయును. ఆయన పూర్వాచార పరాయణుఁడు. బ్రాహ్మణుఁడు. చేయవలసిన నిత్యానుష్ఠానములను తప్పక నెరవేర్చువాఁడు. వేదాధ్యయనము జేసినవారియెడ నాయన కు మిక్కిలి గౌరవముండెను. వేదశాస్త్రముల యభివృద్ధికై యతఁ డొకపాఠశాలఁగూడఁ బెట్టించెను. ఆతని జ్ఞాపకశక్తి యద్భుతమైనది. అతఁడు దేనినైన ముమ్మారుచదివిన యావజ్జీవముజ్ఞాపక ముండునఁట. ఒకవ్యాజ్యమువిని తరువాత నాలుమాసములకైన జ్ఞాపకముంచుకొని తీర్పు వ్రాయఁగలఁడఁట. ఆకాలమందలి విద్యార్థులు కొన్నిపుస్తక ములను కంఠపాఠముగఁ జదివి దానిని మరల చూడకుండ వ్రాయఁ గల సామర్థ్యము గలవారు. ముత్తుస్వామియయ్యరు నట్టివాఁడే. చిన్ననాటనుండియు నితఁడు చాల కష్టములకోర్చి విద్యనేర్చినవాఁడు. శాంతసముద్రుఁడు. నీతిమంతుఁడు. ఉపాధ్యాయులందఱు వానినెక్కు

డు గానముచేయుటంబట్టి విద్యార్థియైననాఁ డతఁడు కొంచెము గర్వియైయుండెను. గాని యుద్యోగమునందు జేరినపిదప కార్యభారము కలిగినకొలఁది "విద్యయొసగును వినయ" మన్నమాట కుదాహరణమై యుండెను. ఈయనకు సంగీతవిద్యయం దత్యంతమైన యభిమానము. ఈనాటి గొప్పయుద్యోగస్థులలో ముఖ్యముగ మనయాంధ్రులలో నిది యరుదుగదా! ఈయన మహాధనసంపన్నుఁడయ్యు దానధర్మములు విస్తారము చేసినట్లు కనఁబడదు. స్త్రీపునర్వివాహాది సంఘసంస్కారములు తనకిష్టములని పలుమారు వచించియు నాంధ్రదేశశంకరాచార్యస్వామికిని శ్రీ యాత్మూరి లక్ష్మీనరసింహముగారికిని జరిగిన వివాదములో నితఁడు స్వాములవారికి రెండువందలరూపాయలు ధనదండన విధించి యాయనయధికారమును మాత్రము బలపఱచెను. ఇందుచేతనే యతఁడు సంఘసంస్కారమునకు మంచిపాత్రు కాఁడని తలంచిరి. సంస్కారాభిలాష యెట్లున్నను దక్షిణహిందూస్థానములోఁ బుట్టిన గొప్పహిందువులలో నితఁడొకఁడు. ఈయన తన పరిశ్రమవలననే నెలకొకరూపాయ జీతగాఁడై యెట్టకేలకు నెలకైదువేలరూపాయలజీతము పుచ్చుకొనువాఁడయ్యెను. ఈయన సత్ప్రవర్తనము నిష్పక్షపాతబుద్ధి పరిశ్రమాసక్తి శ్లాఘనీయములు.

తంజావూరు గోపాలరావు

తంజావూరు గోపాలరావు గారు కావేరీనదీతీరమున కుంభకోణ ముసకు సమీపమునందున్న గణపతియగ్రహారమున 1832 వ సంవత్సరమున జన్మించెను. ఈయన మహారాష్ట్ర బ్రాహ్మణుడు. పదునేడవ శతాబ్దమందు మహారాష్ట్రులు స్వదేశమువిడిచి తంజావూరునకు వచ్చినప్పుడు వీరి కుటుంబము కూడ దక్షిణదేశమునకువచ్చి యచ్చట స్థిరముగ నుండెను. ఈయన తాతపేరు తంజావూరు జీవన్న. ఆయనకు రామచంద్రపండితుడని నామాంతరముగలదు. ఆయన కొంతకాలము తంజావూరు మహారాజునొద్ద పనిచేసి పిదప నింగ్లీషుదొరతనమువారియొక్క తహసీల్దారయ్యెను. ఆయనకుమారుడు గోపాలరావు తండ్రియు శేషనపంతులను నామాంతరముగల బావాపండితుడు. సుప్రసిద్ధుడైన శరభోజి మహారాజునొద్ద కొన్నినాళ్ళు పని చేసెను. ఆయన కైదుగురు కుమారులు. గోపాలరావందు రెండవవాడు. బావాపండితుడు గణపతియగ్రహారమున మూడుసంవత్సరము లుద్యోగవశముననుండి పిమ్మట తిరువడియను గ్రామమున కొంతకాలముండి యాకాలమున తిరువాన్కూరు సంస్థానమున మంత్రియు, రాజా మాధవరావుగారి తండ్రియు నగు దివాను రంగారావుగారి యాదరణమున దిరువాన్కూరునకుబోయెను. బావాపండితుని కుమారులకిద్దఱకు వెంటనేయాసంస్థానమున నుద్యోగములయ్యెను. తిరువాన్కూరులో నున్నపుడె బావాపండితుడు కాలధర్మమునొందెను. కాలధర్మమునొందుటచే వానికుటుంబము తంజావూరునకు దిరిగి వచ్చెను.

గోపాలరావు తక్కినసోదరులవలెనే తండ్రియొద్ద బాల్యమున

తండాళం గోపాలరావు.

సంస్కృత మహారాష్ట్రభాషల నేర్చికొనెను. ఆకాలమున నింగ్లీషులో గొంతప్రవేశముగల దేవాజీరావనునతఁడు గోపాలరావునకింగ్లీషులోఁ బ్రవేశముఁ గలిగించెను. కాలక్రమమున నాంగ్లేయభాష నితఁడు తన వశము చేసుకొనుట స్వయంకృషివల్ల నేగాని పరసహాయముచేతగాదు. ఆతఁడు మరణమొందుటకు నాలుగేండ్లక్రిందట నొకరితో నిట్లుచెప్పెను. "నాచదువొక పాఠశాలలోఁగాని కళాశాలలోఁగాని నేర్చుకొన్నదికాదు. నేను పదునైదేండ్లవాఁడనై నప్పుడు నాపాట్లు నే బడి నేర్చికొనవలసినవాఁడనైతిని. ఆభాషాప్రవేశము మొట్టమొదట నాకొక పల్లెటూరిలోనైనది. ముప్పదియైదేండ్లక్రిందట పల్లెటూళ్లలో నెంతపాటి యింగ్లీషువిద్య యుండునో మీరే యూహించుకొనుఁడు. పశ్చిమఖండ భాషలు ప్రకృతిశాస్త్రములు నేను నేర్చికొనుట పరసహాయమెంతమాత్రము లేని నాస్వయంకృషివల్లనే. స్వయంకృషియనినచో నిందతిశయోక్తి యేమియులేదు. నాపుస్తకములు మాత్రమే నా గురువులు."

పదునేడేండ్ల ప్రాయమువాఁడైనప్పుడు గోపాలరావు తంజావూరు కలక్టరుకచ్చేరిలో నుద్యోగము సంపాదించుకొని రెండుసంవత్సరములు ముగియకమునుపె యొక యింజనేరు కచ్చేరిలో మేనేజరయ్యెను. ఈయుద్యోగమున నతఁడు మూఁడుసంవత్సరములుండెను. ఆకాలములో నట్టియుద్యోగస్థులకెంతెంతలాభ ముండెడివో విస్తరించి వ్రాయనక్కఱలేదు. గోపాలరావు తానున్న మూఁడేండ్లలో శక్యమైనంతవఱకు లంచగొండితనము నణచుటకుఁ బ్రయత్నముచేసెను. చెన్నపట్టణపు హైకోర్టులో జడ్జియై చాలప్రసిద్ధికెక్కిన హాలోవేదారయాకాలమునఁ దంజావూరుజిల్లాలో నసిస్టంటు కలక్టరుగానుండి గోపాలరావుయొక్క ధర్మతత్పరత, సామర్థ్యముఁ గనిపెట్టి చాలమెచ్చి తాను చెన్నపట్టణమునకు వచ్చినపిదప గోపాలరావునకుఁ జాలసహా

మును చేసెను. 1854 వ సంవత్సరమున గోపాలరావు విద్యాశాఖ లోఁ బ్రవేశించి కుంభకోణమునందలి ప్రాంతీయ పాఠశాలలో సహోపాధ్యాయుఁడయ్యెను. 1857 వ సంవత్సరమున చెన్నపట్ట ణపు సర్వకళాశాల స్థాపింపఁబడెను. ఆ సంవత్సరమే గోపాలరావు ప్రవేశపరీక్ష (మెట్రిక్యులేషన్) కుఁ బోయి యందుఁ ద్వితీయస్థుఁడయ్యె. తరువాత రెండేండ్లకే యనఁగా 1859 వ సంవత్సరమున బి. ఏ. పట్ట పరీక్ష (B. A.) కుఁ జదివి యందుఁ బ్రథమశ్రేణిని గెలిచిన యిద్దఱిలో నొకఁ డుగఁ గృతార్థుఁడయ్యెను. అప్పుడు గోపాలరావు పరీక్షయందు బ్రిటను గవర్నరు వారిచ్చునట్టి బంగారుపతకము కష్టసాధ్యము. అతఁడు సహోపాధ్యా యుఁడగుటచే బ్రిటిషు పాఠశాలలో నాలుగుగంటలు పని చేసి మిగి లిన యుండుకాలములో గృహమునఁ బుస్తకములు చదివికొనుచుండెను. ఇతఁడు స్వయముగా గ్రంథములఁ జదువుకొనుచు పరీక్షలకుఁ బోయెను గాని యేపాఠశాలలోఁ జేరలేదు. ఒకగురువునొద్దను పుస్తకముఁబట్టి చదువ లేదు. ఆహాహా! స్వయంకృషి మహాపాండిత్యము నకు శక్తివంతులు గోపాలరావువంటిదే సాక్షికము కదా! అప్పుడు గవర్నరుజనర లుగారి సభలో చెన్నపట్టణ సభలో ప్రసంగించుచు ... సర్వకళాశాలాధికారులకు మునందుండగా నీతఁడు పట్టపరీక్షయందు గెలిచినట్లు వినినతో గోపాలరావునకుఁ బదియిచ్చెను ...

“నీవు నాకన్న వ్యాపారమున గొప్పవాఁడవు. ... పరీక్షలో ... మొదటివాఁడవుగ గెలిచి ... ... సం దేహములేదు. నేను ... నీవు ... ... దేవిచ్చం దుకు నిన్ను నేను బహుమానించుచున్నాను ... మతు నీబుద్ధికి తగియున్న ... ... లను నిన్ను ... ... గాక.” ... ...

కొందరి లేఖవ్రాసెను. "నేను [illegible] బాల్య [illegible]. అప్పుడు నీ సంతోషము [illegible] నీ [illegible]."

అది మొదలు గోపాలరావుయొక్క [illegible] విద్యా శాఖలోనే [illegible] శాఖ లలోనే [illegible] దేశ [illegible] గోపాలరావు [illegible] విద్యా గలకు బోధించుభారము [illegible] గోపాలరావుమీఁద బడెను. దక్షిణహిందూస్థానమునందు నాఁడు [illegible] విద్యాప్రభావమునకు బ్రిటిష ప్రభుత్వమువారు [illegible] గోపాలరావును మించినవారు సాధారణ ముగా నుండరని పలువురు చెప్పెను. 1870, 71, 72 సంవత్సరములలో [illegible] గోపాలరావును [illegible] (ఇనస్పెక్ టరు) గా నియమించిరి. ఈయుద్యోగము [illegible] తెల్లవారికే గాని నల్లవారి కిచ్చెడువాడుక పూర్వము లేదు. అట్టి గొప్పయుద్యోగము స్వదేశస్థు లలో మొట్టమొదట గోపాలరావునకే యిచ్చిరి. ఆయుద్యోగములో నుండి గోపాలరావు పాఠశాలలలో నేర్పఁబడు విద్య మిక్కిలి యుప యుక్తముగా నుండునట్లు చేయుటకై ప్రయత్నపడెను.

చెన్నపురి [illegible] స్వదేశస్థుడు పాఠశాలా పరీక్షాధికారిగా నుండఁదగునో లేదో యని మొదట సంశయించి యా యుద్యోగ మాయనకిచ్చిరి. ఆయన మూఁడేండ్లధికారము జేయు నప్పటికి [illegible] గోపాలరావు పని మి క్కిలి నేర్పుతో [illegible] స్వదేశస్థులు [illegible] యుద్యోగములకు దగు దురని [illegible] [illegible]

1872 మొదలు 74 వఱకు గోపాలరావు కుంభకోణము కాలేజికి బ్రధానోపాధ్యాయుఁడై (ప్రిన్సిపలు) యుండెను. ఆసంవత్సరములలో కుంభకోణ కళాశాలయొక్క పరీక్షాఫలితములు వెనుక పోర్టరుదొరగారి కాలములోకంటె నెక్కువతృప్తికరములుగా నుండెను. ఆనాటిదొరతనము గవర్నమెంటువారికి వ్రాయుసంవత్సరచర్యలో గోపాలరావునుగూర్చి యీక్రిందివిధమున వ్రాసెను. "మనరాజధానిలో రెండవకళాశాలకుఁ బ్రధానోపాధ్యాయుఁడై గోపాలరావు తత్పదవికిఁ దనయోగ్యతను సంపూర్ణముగ స్థాపించియున్నాఁడు. కావున కాలీవచ్చినప్పుడాయనకీయకతప్పదు. ఆయనసామర్థ్యమెట్టిదె సనుపరీక్షాఫలితములెంతతృప్తికరములుగానున్నను మెచ్చవలసిన యధికారులెంతగామెచ్చినను దొరతనమువారుమాత్రము వానికాకళాశాలలోఁ బ్రధానోపాధ్యాయత్వము ఖాయముగ నీయఁజాలరైరి. 1878 వ సంవత్సరమునదొరతనమువారాయనను కుంభకోణమునుండి చెన్నపట్టణకళాశాలకుమార్చియర్థశాస్త్రమందు దేశచరిత్రమందుఁబండితునిగఁ జేసి తెల్లవారితో సమానమైనజీతముగలగౌరవస్థితికిఁదెచ్చిరి. అంతటివిద్యావంతునకునంతటిసమర్థునకు గవర్నమెంటువారాయుపకారముఁ జేసినందుకుజనులుసంతసింపక యదివఱకే జేయనందుకు కుంభకోణముకళాశాలలోఁబ్రథమపండితోద్యోగమియ్యనందుకుఁ జాలవగచిరి. తెల్లవారితో సమానమైన యుద్యోగమియకపోయినను జీతము వారితో సమముగనిచ్చి మఱియుఁ గన్నీళ్ళుదుడుచుటకు దొరతనమువారు వానికి రాయబహదూరను బిరుదమునిచ్చిరి.

గోపాలరావుయొక్క కడపటిదినములుచెన్నపట్టణము రాజకీయకళాశాలలోనె గడుపఁబడెను. 1883 వ సంవత్సరమున నతఁడు శక్తికి మించినపని చాలకాలమునుండిచేసినందునదారుణజ్వరపీడితుఁడై బాధపడెను. అతని శరీరస్థితి తృప్తికరముగా నుండనందున 1885వ సంవత్స

రమున నతఁడాఱుమాసములు సెలవుపుచ్చుకొని కుంభకోణమునకుఁ బోయెను. ఈసెలవునుండి యాతఁడు తిరిగి యెన్నఁడు బనిలోఁ జేరలేదు. కుంభకోణమునఁ గొన్నినాళ్ళుండునప్పటికి రోగము క్రమక్రమముగ తగ్గుటకుమారు ప్రబలము కాఁగా తగినచికిత్సకొఱకు బంధువులు వానినిఁ జెన్నపురికిఁ దోడ్కొనివచ్చిరి. గోపాలరావు చెన్నపట్టణమునందె 1886 వ సంవత్సరం మేనెల 11 వ తారీఖునఁ గాలధర్మము నొందెను.

ఆయనమరణ మెల్లవారినిదుఃఖింపఁ జేసెను. చెన్నపురి రాజకీయ కళాశాలాధ్యక్షులు వానిశక్తికి వానిచేసినపనికి ముఖ్యముగ మరణమును గూర్చి మిక్కిలి విచారించిరి. అప్పటిగవర్నరగు గ్రాంట్‌డఫ్ దొరగారు వానిమరణమునుగూర్చి దొరతనమువారికి వ్రాయుచు నీక్రిందివిధమున వానింగూర్చి ప్రశంసించెను. "గోపాలరావు విద్యాశాఖలో 1854 వ సంవత్సరమునఁ బ్రవేశించి యిప్పటికి ముప్పదిరెండేండ్లు సేవచేసెను. ఈదీర్ఘకాల మతఁడు దొరతనమువారికి లోకమునకుఁ జాల మేలుచేసెను. అతఁడు గొప్పశాస్త్రజ్ఞుఁడు యున్నాంగ్లేయభాషాపాండిత్యమునకు మిక్కిలి ప్రశంస చేయఁబడుచుండెను. ఇంగ్లీషుభాషాగ్రంథావళి బోధించుటలో గొప్పయూరపియనులతో బోల్చినప్పుడు కూడ నతఁడుప్రథమగణ్యుఁడై యుండువాఁడు. కొన్నిసంవత్సరములనుండి ప్రెసిడెన్సీకాలేజీలోను యూనివరుసిటీలోను వానితోఁ గలిసియుండుభాగ్యము నాకు లభించినందున వానిమరణమువలన గలిగిన విశేషనష్టమును నేను తెలిసికొనఁ గలిగితిని." ఆసంవత్సరమే మేనెల 20వ తారీఖున డాక్టరు డంకను గోపాలరావు జ్యేష్ఠపుత్రునకీక్రిందిజాబు వ్రాసెను. "నేను ఆయనను చాలసంవత్సరములనుండి యెఱుఁగుదును. వాని సద్గుణములకు నీతికిఁ జాల సంతసించువాఁడను. ఇటీవల ప్రెసిడెన్సీకాలేజీలో నాయదృష్టమువల్ల వానికిఁ బరిచితుఁడనైతిని. ఒక్కసారియైన మాస్నేహమైత్రికి భంగము గలిగినట్లు నేఁదలఁపను. ఏదాని కతఁ డలంకారమైయుండునో యట్టి

విద్యాశాఖలో నున్న యుద్యోగస్థులందఱు మీతో సమానదుఃఖితులై మీదుఃఖము వారిదుఃఖముగ నెంచుకొనుచున్నారు.

ఈవిధముగానే గోపాలరావుకుమారునకు విద్యావంతులనేకులు పరామర్శ జేయుచు జాబులు వ్రాసిరి. "మీతండ్రి యకాలమరణమునకు గలిగినంతదుఃఖము మఱియొకరికిఁ గలుగ" దని రంగనాధము మొదలియారుగారు వ్రాసెను. ప్రెసిడెన్సీ జడ్జియైన ముత్తుస్వామియయ్యరు గూడ నీక్రిందివిధమునఁ జెప్పెను. "నేను మొట్టమొదట వానిని 1854వ సంవత్సరమునఁ గలిసికొంటిని. అది మొదలు చిరకాలము నొక్కవిధముననే వానియందు గౌరవముభక్తియు గలిగియుంటిని. ఆయనబుద్ధి మిక్కిలి గొప్పది. దానిని మున్ముందియోగ్యముగఁజేసి వృద్ధిబొందించెను. ఆయన విద్యాసామర్థ్యము పాఠశాలలోఁ జదువుకొనుటవలన గాక స్వపాండిత్యమువలనను బరిశ్రమవలనను గలిగెను. ఆబుద్ధికి నాపాండిత్యమునకు నిష్కళంకమైన సత్ప్రవర్తనముం దోడుచేసి తనవిధికృత్యముని శ్రద్ధతో నెరవేర్చెను. ఆయన మహావిద్యావంతు లెట్లుండవలయునో యట్లుండెను." చెన్నపురి క్రిస్టియన్ కాలేజిప్రధానోపాధ్యాయుఁడగు రివరెండు డాక్టరు మిల్లరు తనకాలేజిపక్షమునఁ బ్రకటింపఁబడు క్రిస్టియన్ కాలేజీ పత్రికలో గోపాలరావునుగూర్చి ప్రశంసించెను. దక్షిణహిందూస్థానవాసుల యభిప్రాయమున మిక్కిలిగొప్పవాఁడగు గోపాలరావుమరణమునుగూర్చినవిచారములో నే నితరులలోఁ గలియుచున్నాను. కీర్తిశేషుఁడైన యాతఁడు తనదేశస్థుల ప్రవర్తనమును సరిగాఁ బోతబోయుటలోఁ జాలకృషిచేసెను. పాఠశాలాపరీక్షకుఁడుగాను మంచియుపాధ్యాయుఁడుగాను గోపాలరావు తానుచేయఁదలఁచిన పని సంపూర్ణముగఁ జేయుటయెగాక యితరులచేతఁ జేయింపవలసివచ్చినప్పుడుకూడ మిక్కిలి పట్టుదలతోఁ జేయించెను. పూనికతోఁ బనిచేయుటయె యాతనివంతుగాని ఫలితములను బహుమానములను ముందు లెక్కజూచుకొనుట

వాని పనిగాదు. తనవిధికృత్యములం జాసుచేయుటయె వానికిం బ్రధమ కార్యము. ఏపనినైన నెరవేర్చుటలో నతని కతండె యాలోచించు కొనునుగాని రెండవవానితో నాలోచింపఁడు. తనచేయఁదలఁచినపని న్యాయమనితోఁచెనా యాయన యది జనసమ్మతమైనను గాకపోయి నను దానిని నెరవేర్చితీరును.

అతనిమార్గమునుదక్షిణహిందూస్థానమందలివిద్యావంతులంద ఱు నవలంబింపఁవలయును. ఆయనజీవితకాలమంతయు నుపాధ్యాయత్వ మునందె గడపుటచేత వానివెఱిఁగినవారందఱు వానిబోధనాశక్తి,సా మర్థ్యమునుగూర్చియే పలుకుదురు. ఆయననుగూర్చి యాయనశిష్యుఁ డొకఁడు కుంభకోణము నగరమందిరమున నీక్రిందివిధమునఁ బలికెను. "అతండు సంపూర్ణుఁడైనయుపాధ్యాయుఁడు. పాఠపుస్తకములనువిద్యా ర్థులకు బోధించునప్పుడు పుస్తకములలోనున్న సంగతులనేగాక వాటికి సంబంధించిన విషయములనేకములుదెచ్చి లోకానుభవము గలిగించు చుండును. ఆవిషయములెవ్వియనఁగా నుత్సాహముగలిగించు ప్రాచీన కవిత్వములు చరిత్రకథలుమహాత్ములయొక్కయు యోగ్యులయొక్కయు చరిత్రములు. అప్పుడప్పుడతఁడు చెన్నపురిరాజధానిలో మహావిద్వాం సులైన సుబ్రహ్మణ్యం అయ్యరు రంగనాథం మొదలియారు మొదలగు వారింగూర్చి వారిమార్గము ననుసరించి ప్రవర్తింపుఁడని విద్యార్థులం బురికొలుపుచుండును. పక్షి తనకుఁ బుట్టినపిల్లలుగ్రమక్రమముగ నా కాశముమీఁది కెగురునట్లుచేయుట కెంతశ్రమపడునో యాపక్షివలెనే తనవిద్యార్థులను లోకయాత్రలో నిరపాయముగ నడుచువారిగఁ జేయు టకతఁడు పాటుపడుచుండును." ఆయనకుమహారాష్ట్రభాషలో మంచి ప్రవేశము గలుగుటచేఁ జిన్నతనమునుండియు నతఁడందుఁగవిత్వము చె ప్పెను. బాల్యమునందాయన వ్రాసిన పద్యములుదొరకలేదు. మరణ మునకుఁ గొన్నిమాసములక్రిందట నాంగ్లేయభాషలో గోల్డుస్మిత్తు మ

హాకవి వ్రాసిన వానప్రస్థుఁడని యర్థమిచ్చు "హెర్మి" ట్టను పద్యకావ్యమును మహారాష్ట్రమునకుఁ దర్జుమాచేసెను. అది యిప్పటికిని మహారాష్ట్రజనులచేత సంతోషపూర్వకముగాఁ జదువఁబడుచున్నది. ఆయనకు సంస్కృతమునుండియు మహారాష్ట్రమునుండియుఁ బ్రాచీనమహాకవులు రచియించిన శ్లోకములెన్నియో కంఠపాఠముగఁ జదువఁగలశక్తి యుండెను. స్వకుటుంబములోనున్నవారి నిగోపాలరావప్పుడప్పుడు చిత్రవిచిత్రశ్లోకములు చదివి సంతోషపెట్టుచుండును. గోపాలరావునకు సంగీతశాస్త్రమునందును గొంతప్రజ్ఞగలదు. మంచిపాటనువిని యాయన మిక్కిలి మెచ్చువాఁడు. గోపాలరావు పాఠశాలలో బాలురకు విద్య చెప్పి వారిమనస్సుల నంతవికసింపఁజేసి జ్ఞానవంతములుగఁ జేసెనో యావిధముగా బడిలేనప్పుడు గృహమందుఁగూర్చుండి తనతో మాటలాడ వచ్చిన పరిచితులను మిత్రులను ప్రశ్నగర్భితములగు తనసంభాషణములచేత వచ్చినప్పటికంటె నెక్కువవివేకులుగఁ జేసి పంపుచుండును. ఆయనతో మాటలాడుట యెంతో లాభకరముగా నుండును. ఆయన యేది మాటలాడినను ముందుగ యోచించి యుక్తయుక్తముగ సర్వజనగ్రాహ్యముగ నుండునట్లు మాటలాడును. జ్ఞానమితరులకు నుపదేశించుట వానికెంత యిష్టమో నేర్చుకొనవలసిన యంశములుండిన నితరులయొద్దనుండి యవి నేర్చుకొనుటయు వానికంత యిష్టము. నిరంతరము గ్రంథపఠనమందాసక్తి యుండుటచేతను నూతనజ్ఞానము నార్జింప నభిలాష గలుగుటచేతను గోపాలరావు యావజ్జీవము విద్యార్థియే యని చెప్పవచ్చును.

గోపాలరావుబుద్ధి యెంత సూక్ష్మమైనదో నడత యంత పవిత్రమైనది. జనులాయనప్రజ్ఞ కెంతసంతోషించిరో యోగ్యతకు నంతయె సంతోషించిరి. పాండిత్యమునకుఁ బావనచరిత్రముతోడగుట బంగారునకు దావి యబ్బుటగదా! సత్యమునందు ధర్మమునందు నాయనకుఁ గల యధికప్రీతిచేత నతఁ డొకప్పుడు కఠినముగ మాటలాడు

చుండును. అందువలన దోషములు చేయువారు వానియెదుటకు వచ్చుటకు భయపడి గడగడ వడంకుచుందురు. ఇట్లునుటచేత నతఁడు సర్వజనసులభుఁడు కాఁడనియుఁ గఠినస్వభావుఁడనియుఁ దలపఁగూడదు. ఆయన యందఱకు సులభుఁడు దయావంతుఁడు తత్వజ్ఞుఁడు.

గోపాలరావు గొప్పసంఘసంస్కర్తలలోఁ జేరినవాఁడు కాఁడు. కాని వాని యభిప్రాయము లన్నియు సంఘసంస్కారమున కనుకూలముగానే యున్నవి. ఆయన మతమున స స్కాంము గావలసిన ముఖ్యవిషయములు నాలుగున్నవి. స్త్రీవిద్య దేశమందు విశేషముగా వ్యాపింపవలయుననియు బాల్యవివాహము లడఁగిపోవలయుననియు నిర్బంధవైధవ్యము లుండఁగూడదనియు ప్రతివర్ణములోనున్న యంతశ్శాఖ లణగిపోవలయుననియు నాయన తలంచును. అన్నిఁటిలో బాల్యవివాహమే మిక్కిలి నష్టకరమని యాతఁడు తలంచెను. అదియే హిందూసంఘవృక్షమును నాశనముచేయు వేరు పురుగు. అది యేవర్ణములో మిక్కిలి వ్యాపించియున్నదో యావర్ణము నసఁగా బ్రాహ్మణులను నానాఁటికి క్షీణదశకుఁ దెచ్చుచున్నది. ఆ యకృవ్వమున నీకాలమున జనించను బాలికాబాలకులు తమ పూర్వులట్లు దేహదార్ఢ్యము గలిగియుండక పొట్టివాండ్రై దుర్బలులై స్వల్పరోగముల కైన నాగలేక యకాలమృత్యువుల పాలగుచుండుటచే నిట్టి దురాచారము ప్రిఎ)థమమున నవాంఛఁబడవలసిన దనియు నదియే సంస్కారములలోకల్ల సంస్కారమనియు గోపాలరావు కంఠోక్తిగఁ జెప్పుచువచ్చెను. ఈనాటిబ్రాహ్మణులలో పదుచువాండ్రు మనఃపరిశ్రమముగాని దేహపరిశ్రమముగాని చేయలేక చేసినమాత్రమున సొక్కి సోలిపోవుచుండుటయు పదునాఱు పదునేడేండ్లు వయసునఱకు గట్టిగా కృషిచేసి విద్యాభ్యాసముచేసిన బాలురు రోగులగుటయు నాతఁడు కన్నులారఁజూచి యిట్లు దలంచెను. "వ్యవసాయము చేయు

వాఁడు తనవిత్తులు మిక్కిలిమంచివై మందమశాగత్తులతో నేల సారెముగలదై యున్నప్పుడె నాటును. బుద్ధిసూక్ష్మతగల హిందువుఁడు తనశరీరమున కీపోలిక సరిపోవునని గ్రహింపలేకపోవుట మిక్కిలి యాశ్చర్యముగానున్న"దని యాయన చెప్పును. నిర్బంధ వైధవ్యముపాప హేతు వనియు దుస్సహమనియు గోపాలరావు మతము. బాలిక ల కాలమున వితంతులగుట కతిబాల్య వివాహమే ముఖ్యకారణమనియు నట్టి వివాహములు బాలికాబాలకుల యిష్టములు బడయకుండఁ దలిదండ్రులే చేయుచుండుటచేత వధూవరు లుత్తరవాదులు కారనియు నాయన వాదించుచునచ్చెను. సంఘసంస్కారమందు గోపాలరావు నేఁటి విద్యార్థికులలో ననేకులకంటె స్థిరాభిప్రాయములు కలిగి యుండెను. దక్షిణహిందూస్థానమను నాకాశమండలమున సూర్యచంద్ర మండలములవలె గోపాలరావు రంగనాథమొదలయార రనువారిద్దరు నుదయించి చాలకాల మజ్ఞానాంధకారమును బారఁదోలి దేశస్థులభాగ్యదోషమున నకాలమున నస్తమించిరి.



పూండి రంగనాథము మొదలియారి.

పూండి రంగనాథము మొదలియారి

పూండి రంగనాథము మొదలియారి చెన్నపట్టణమున 1847వ సంవత్సరమున జన్మించెను. ఆతని తండ్రి సుబ్బరాయ మొదలియారి. ఆంగ్లేయభాషలోఁ బ్రవేశముగలవాఁడై పొలములకు నీరు పంపు కాలువలమీఁద నధికారముగల యొకకంపెనీయొద్ద నుద్యోగస్థుఁడుగా నుండెను. సుబ్బరాయ మొదలియారి రాజభాషయగు నింగ్లీషు చెప్పించుటవలనఁ గలిగెడు లాభముల నెఱిఁగినవాఁడు కావున బాల్యమునందె మిక్కిలి చాకచక్యము బుద్ధికుశలతఁ గనఁబఱచుచున్న తన కుమారునకు నావిద్యఁ జెప్పింపఁ నారంభించెను. రంగనాథము బాలుఁడై యుండఁగాఁ దండ్రికిఁ జెన్నపట్టణమునుండి యవనాషి యను గ్రామమునకు బదిలి యయ్యెను. కాని యాగ్రామమున నతఁడు చిరకాలముండలేదు. అక్కడ నుండఁగా నొకనాటి రాత్రి వానియింట బందిపోటు దొంగలు పడిరి. ఆ మొదలియారి ప్రియపుత్రుఁడగు రంనాథమునకు దొంగలవలన మహాపాయము సంభవించునని భయపడి వాని పఱుపుమీఁద దాఁచి కూఁతునుం దీసికొని దొంగలయెదుటికిఁ బోయి యింటనున్న సర్వస్వము వానికి సమర్పించెను. కాని దొంగలు తనివిదీఱక "యింకను నీవు సొత్తు దాఁచితివి. అది చూపవేని నీప్రాణములు నీకుఁ దక్కవు సుమీ" యని వానిని బెదిరించిరి. అప్పుడు తండ్రి గడగడవడంకుచు పఱుపుమీఁద బిడ్డను దాఁచుట తప్ప వేఱు సొత్తు దాఁచలేదని చెప్పెను. చోరులు బాలకునిఁ బఱుపునుండి క్రిందికి దింపిరి. అప్పుడు రంగనాథము తన ప్రాణము నిమిత్తము మిక్కిలి దయనీయములగు మాటలతో దొంగలను బ్రతిమాలుకొనెను. దొంగ లెవ్వరికి హానిచేయకుండ నెట్టటో యిలు వెడలిపోయిరి. సుబ్బరాయ

మొదలియారి యుద్యోగము వెంటనే మాని మరునాఁడే యవనాఫీ విడిచి చెన్నపురికిఁబోయి యక్కడ కాఁపురముండెను.

రంగనాథునకిఁ దండ్రి యింటియొద్ద శ్రద్ధతోఁజదువుచెప్పుచుండెను. రంగనాథము మొదలి దగాగునకు ద్రవిడభాషలో నిరుపమానమైన ప్రవేశముకలదు. అట్లగుటకుఁ దండ్రి యింటియొద్ద స్వభాషలోఁ జేయించిన పరిశ్రమయె కారణమని మన మూహింపవచ్చును. 1850 వ సంవత్సరమున రంగనాథము పదుమూడేండ్ల ప్రాయమువాఁడై నప్పుడు తండ్రి పచ్చయ్యప్పగారిబడికిఁ జదువనంపెను. అప్పుఁడతఁడు మూడవతరగతిలోఁ జేరెను. అది యిప్పటికి నాలుగవఫారమునకు సమానము. ఆనాటి హిందువులకు పచ్చయ్యప్ప పాఠశాలమీఁద మిక్కిలి యభిమాన ముండినందున బాలురందఱు నక్కడి కే బంపఁబడుచు వచ్చిరి. రంగనాథుని బుద్ధికుశలత సంపంగి పూపరిమళమువలె వ్యాపించుటచే నాపాఠశాలకుఁ బ్రధానోపాధ్యాయుఁడు (ప్రిన్సిపల్) వానింగూర్చి విని మిక్కిలి శ్రద్ధబూనెను. ఆసంవత్సర మతఁడఱువది రూపాయల విద్యార్థివేతనము సంపాదించెను. సంవత్సరాంతమందైన పరీక్షలో రంగనాథము జూపిన తెలివికి సంతసించి యధికారులు నడుమతరగతిలోఁజదువకుండఁగనే వానిని ప్రవేశపరీక్షతరగతిలోఁ (మెట్రిక్యులేషన్) జేర్చిరి.

ఉత్తరగతిలోనుండి యతఁడనేక బహుమానములం బడసెను. రాజా మాధవరావుగారు గణితశాస్త్రమునందు నింగ్లీషుభాషా పాండిత్యమునందు మొదటివాఁడగు వానికి నొకబహుమాన మియ్యఁదలఁచి యాతరగతి బాలుర నందఱఁ బరీక్షింపఁ జేసెను. ఆ పరీక్షలో రంగనాథుఁడే మొదటివాఁడుగఁ గృతార్థుఁడై బహుమానము గ్రహించెను. ఆకాలమున రంగనాథ మొక చిన్న సాహసము చేసెను. దానింబట్టి యాతనికి దనసామర్థ్యమం దెంత విశ్వాసముకలదో

యెంతనిర్భయత్వము స్వతంత్రబుద్ధి వానికడ నున్నవో మనము తెలిసికొనఁగలము. ఒకసారి స్త్రీ విద్యనుగూర్చి యొక యుపన్యాసము వ్రాయుమని యుపాధ్యాయుఁడు తరగతిలో బాలురకందఱకాజ్ఞాపించెను. అది సర్వోత్కృష్టముగ వ్రాసిన వారికి గొప్పబహుమాన మిచ్చునట్లు నిర్ణయము. అనేక బాలకులా విషయములంగూర్చి యుపన్యాసములవ్రాసిరి. పరీక్షకులచే వ్రాయఁబడిన యుపన్యాసముల నన్నిఁటిని జదివి రంగనాథము యొక్కయు కుప్పురామశాస్త్రి యను మఱియొక బాలకునియొక్కయు వ్రాతలు ప్రశస్తములని యీరెంటిలో నేది ప్రశస్తతమమో నిర్ణయింపలేక చెన్నపురిలో గొప్పన్యాయవాదులైన నార్టను, మొదలయినవారలకుఁ జూపిరి. మొదట దొరరంగనాథుని దే ప్రశస్తతరమనెను. నార్టనుకుప్పురామశాస్త్రి వ్రాసిన దానిని మెచ్చెను. పరీక్షకులు సరిగా నప్పటికి నిర్ణయింపలేక హైకోర్టు జడ్జియగు హోలోవే గారి కుభయుల వ్రాఁతలం జూపిరి. ఆయన రంగనాథమునకే బహుమాన మీయఁదగునని చెప్పెను. కాని యేకారణము చేతనో తుదకు బహుమానము రంగనాథమునకు రాలేదు. అందుకు రంగనాథుఁడు కుపితుఁడై తనకెందుచేత బహుమానము రాలేదో యా కారణమానుపూర్వకముగఁ గనుఁగొననిశ్చయించుకొనెను. అంతలో నతని పాఠశాలయొక్క సంవత్సరోత్సవము వచ్చెను. ఆయ్యవసరమున జరిగిన సభకు చెన్నపురి గవర్నరుగారగు హారిసుప్రభువుగారగ్రాసనాధిపతులయిరి. ఆయన వచ్చికూర్చుండిన పిదప రంగనాథుఁడు లేచి తన యుపన్యాసముఁ జేతఁబట్టుకొని దానిని గవర్నరుగారికిఁ జూపి న్యాయముచేతనే తగవు పరిష్కరింపఁ జేసికొన వలయునని బయలుదేర నుపాధ్యాయుఁడు బాలుని యుత్సాహముగని పట్టి తగవు న్యాయముగాఁ బరిష్కరింపఁబడునట్లొడంబడి బలవంతముగ వాని ప్రయత్నము నివారించెను.

1862 వ సంవత్సరమున రంగనాథము మొదలియారి ప్రవేశప

క్షయందు మొదటివాఁడుగ కృతార్థుఁడయ్యె. ప్రసిడెన్సికాలేజిలో బై పరీక్షకు జదువుటకుఁ జేరెను. పచ్చయ్యప్పపాఠశాలాధికారులును చదువు కొనుటకు వానికి నెలకు కొంతసొమ్ము నీయ వాగ్దానముచేసిరి. ప్రసిడె న్సికాలేజ్ యాదినములలో మిక్కిలి యున్నతస్థితిలో నుండెను. సాహి త్యమునందు సముద్రుఁడని చెప్పఁదగిన థామ్సనుదొరగారు దానికిప్రధా నోపాధ్యాయులై యుండిరి. అనేక కాకళాశాలలో బుద్ధిలో బృహస్ప తులవంటి విద్యార్థు లనేకులు చదివి కీర్తిమంతులైరి. కానిరంగనాథ ము వారినందఱ నతిక్రమించెను. లోకమం దెవరికైన నొకశాస్త్ర మందు విశేషాభిరూచముండును. రంగనాథుని కన్న నొక తర్కశాస్త్ర మందు గణితశాస్త్రమును నాంగ్లేయ సాహిత్యమును విశేషించి స్వభాషయగు ద్రావిడమునందు మహాభిరుచి కలదు. ఆనాఁటిలో నతని కితండె సాటియని చెప్పఁదగి యుండెను.

థామ్సను దొరయుఁ దక్కిన యుపాధ్యాయులు రంగనాథుని యభివృద్ధినెంతో శ్రద్ధతోఁజూచి వారను టయొక యాశ్చర్యము కాదు. అప్పటి డైరెక్టరైన పవెలుదొరగారు హాలో వేదొరగారును ఋతము రంగనాథుని బుద్ధికుశలతవిని వాని యభివృద్ధిని విని నుత్సాహపడుచు వచ్చిరి. విద్యార్థిగానున్న కాలముననే మహాపురుషులయాశ్చర్యము నకు బాత్రుఁడైనవాఁడు మనలో నితఁడొక్కఁడేయని చెప్పవచ్చును. అతనికి గణితశాస్త్రమందు నపారమైన ప్రజ్ఞయున్నను నాంగ్లేయ సా హిత్యమందుఁగూడ నాంగ్లేయులనేకులే వానికిఁదీసిపోదురు. అతనితో సమానముగ నింగ్లీషువ్రాసి మాటలాడ గల తెల్లవారిసంఖ్యతక్కువ యని యనేకుల యభిప్రాయము. తిరువాన్కూరు రాజవంశస్థుఁడగు రామవర్మ తామ మహారాజు కాకమునుపే చెన్నపురి రాజధానిలో పట్టపరీక్షయందు మొదటితరగతిలో నెవఁడుకృతార్థుఁడగునో యావి ద్యార్థికి మూఁడువందలరూపాయలువిలువగలబంగారుపతకముబహు

వాసముఁ జేయవలసినదని యీమొత్తమును వడ్డివల్ల కూర్చునట్టి మూలధనమును జెన్నపురియూనివర్సిటీవారికి 1862 వ సం॥రమునం దిచ్చెను. పట్టపరీక్షయందు మొదటితరగతిలో నెవరుకృతార్థులు కానందున 1863-64 సంవత్సరములలో నెవరికి నీయఁబడలేదు. 1865 వ సం॥ రంగనాథము మొదలియారిపట్టపరీక్షయందు మొదటితరగతిలోఁ గృతార్థుఁడైనందున పతకము వాని కీయఁబడెను.

ఈపతక మొక్కటియే కాదు. రంగనాథుఁడు బహుపతకములను బహుపుస్తకములను బహుమానముగాఁ బడసెను. రంగనాథునియపారమేధాశక్తికి గురువగు థామ్సను మిక్కిలి సంతోసించి వానినివిడువలేక విద్యాభ్యాసము ముగియఁగానే గణితశాస్త్రమునందు సహోపాధ్యాయుఁడుగఁ దన కళాశాలలోనే నియమించెను. రంగనాథము యొక్క మిత్రులు సుహృత్తులు విశేషముగ నాంగ్లేయులే యగుటచేత వారిమార్గమునను సరించి యతఁడు తన కనేకపర్యాయము లితరోద్యోగములు సంపాదించుకొనుటకు వీలు కలిగినను యవి నిరాకరించి విద్యాశాలయందె యావజ్జీవముఁ గడపెను. చెన్నపురి దొరతనమువారు సమయమువచ్చినప్పుడెల్ల రంగనాథుని ప్రజ్ఞాదులం గొనియాడుచు వచ్చినను ప్రజ్ఞకుం దగునట్టి ప్రోత్సాహముమాత్రము సరిగా నీయలేదు. ఏలయన ప్రెసిడెన్సీకాలేజీలో రంగనాథుఁడు గణితశాస్త్రోపాధ్యాయుఁడుగా స్థిరపడునప్పటికి రమారమి పదియారు సంవత్సరములు పట్టెను.

1872 వ సంవత్సరమున రంగనాథుఁడు చెన్నపురి యూనివర్సిటీలో నొక ఫెల్లో జేయఁబడెను. అదిమొదలుకొని యతఁడు చనిపోవునంతకు నేఁటేట నీగౌరవముపొందుచునేయుండెను. విద్యావిషయమున రంగనాథమొదలియారిగారి యభిప్రాయమునకుఁ జూపఁబడు గౌరవము మఱియేహిందువుని యభిప్రాయమునకుఁ జూపబడుటలేదు. ఏయభిప్రా

యమయినఁ జెప్పవలసివచ్చినప్పుడు రంగనాథము మొదలియారి యొక్క మనుష్యునకుగాని యొక్క తెగకుగాని బాధముకలుగునట్టిపక్షపాతము బలుకుల బలుకక సర్వజనులవారి యభివృద్ధికి ననుకూలములగు వచనములఁ జెప్పుచువచ్చెను. విద్యాశాఖలో నేసభగూడినను నేచిన్న కమిటీ నేర్పడినను రంగనాథము మొదలియారి యందుండవలసినదే. ఏచిన్నతీరుమానమైనను వానిచేతి దిద్దుబాటు బడయనిపక్షమునదివ్యాస ప్రోక్తముగా నప్పటి కమిటీలలోని మెంబర్లు తలఁచుచువచ్చిరి. 1880 వ సంవత్సరమందు దొరతనమువారు ద్రవిడభాషాంతరీకరణముఁ జేయుటకు వానినేర్పఱచుకొనిరి. 1882వ సంవత్సరమునఁ జెన్నపట్టణమునకతఁడు షరీఫుగా నియమింపఁ బడెను.

ఒక్కవిద్యావిషయమందేగాక ప్రజాక్షేమకరములగుసమస్త వ్యవహారములందు దొరతనమువారు ప్రజలు రంగనాథుని యాలోచన ముగైకొనుచువచ్చిరి. చెన్నపురి మునిసిపాలిటీయం దతఁడొక సభికుఁడై యనేకోపన్యాసములనిచ్చెను. అవి యెంతో మనోహరములుగనుండెను. చెన్నపురమందు స్వదేశీయులచేత స్థాపింపఁబడిన కాస్మాపాలిటన్ క్లబ్బునకు రంగనాథము మొదలియారి ప్రాణమని చెప్పవచ్చును. అతని మృదుమధురసంభాషణములచేత ప్రతిసాయంకాలము సభయంతయు గలకల లాడుచుండెనని వాని నెఱిఁగినవా రిప్పటికిఁ జెప్పుదురు. 1890 వ సంవత్సరమందుఁ బట్టపరీక్ష మొదలగు శాస్త్రపరీక్షలయందుఁ గృతార్థులైన విద్యార్థులకు శిష్టాచారమున జరుగుచున్న హితోపదేశమును జేయునట్లు గవర్నరుగారు రంగనాథమునేర్పఱచిరి. అప్పుడతని నోటనుండివచ్చిన యింగ్లీషుభాష పూర్వప మేమని చెప్పను! అప్పు డొకవార్తాపత్రికలో వానియుపన్యాసమునుగూర్చి నీక్రిందివిధముగ వ్రాయఁబడెను. "ఎదుటనుండి రంగనాథము మొదలియారి చేయు నుపన్యాసము వినినవారుతప్పక యాతఁడు స్వదేశస్థుఁ డనుకొందురు.

కాని చాటుననుండి వినినపక్షమున శైలింబట్టి పదప్రయోగమునబట్టి యుచ్చారణముంబట్టి మాటలాడుచుండిన వాఁడాంగ్లేయుఁ డనుకొనవలసినదేకాని నల్లవాఁడనుటకుఁ వీలులేదు." ఆయుపన్యాసమును మన వారు తెల్లవారునుగూడ బహువిధముల శ్లాఘించిరి.

రంగనాధము నిజముగాహిందూసంఘమున కొకయలంకారముగ ప్రకాశించుచుండెను. ఈయలంకారము 1893 వ సం॥ డిశంబరునెల 10 వ తేదీని దేశము శోకమగ్నమగునట్లునేలపాలయ్యెను. ఆయన కొన్నిదినములు జ్వరముచేత బాధపడి లోకాంతరగతుఁడయ్యెను. ఆజ్వరము వానిం సంహరించునని యెవ్వరుఁగ దలంపలేదు. మరణమునకుముందునాలుగు దినములక్రిందటివఱకు నతఁడు పాఠశాలకుఁబోవుచునే యుండెను. అతఁ డతిపరిశ్రమవలననకాలమృత్యువువాతఁబడెనని లోకులుతలంచిరి. వాని మరణమునకు వగవని హిందువులు కాని మహమ్మదీయులు కాని యూరోపియనులు కాని లేరు. ప్రెసిడెన్సీకాలేజీ కౌన్సిలువారు కాలేజీకి రంగనాధముమొదలియారిచేసిన మహోపకారము నగ్గడించి గణితశాస్త్రమునందెగాక తత్త్వశాస్త్రమందుఁజరిత్రాంశాస్త్రమందువానికసమానప్రజ్ఞకలదని, వానిమరణమువలన నీకాలేజీకి కలిగిననష్టమునకు మిక్కిలివిచారించిరి. అప్పుడు డైరెక్టరుగానుండినడాక్టరుడంకనుదొరగారు రంగనాధముతో కలిసి చిరకాలము పనిచేసిన సహకారియగుటచే వానిమరణమునకు మిక్కిలివగచి వానిపెద్దకుమారునిపేర నొక జాబు వ్రాసెను. అందులో నీక్రిందిసంగతులున్నవి. "కొట్టకొనవఱకునీతండ్రి నాయభిప్రాయమున మిక్కిలియున్నతపదమునాక్రమించెను. చెన్నపట్టణములో నుండిన యేయూరపియనుఁడునీతండ్రికినావంటిచిరమిత్రుఁడు కాఁడు. నావలె నతనిహృదయమనోగతములైన గుణములనుప్రజ్ఞలను నెఱిఁగినవారులేరు. అతఁడుమహాపండితుఁడు. రాజభక్తుఁడు. ఆలోచన చెప్పునప్పుడు దూరదర్శి. జ్ఞాని. మరియాదలకునిధి. ఇట్లుండుటచేత నతఁ

డు సర్వసమ్మతుఁడై యుండెను. ఆయన పేరు శాశ్వతముగా జ్ఞాపకముం డునటులఁ జేయుటకు బ్రయత్నములు జరుగుచున్నవని వినుచున్నాము. అతఁడు మనకుఁ జూపిన మార్గమ్ము ననుసరించుటయే యనికి గౌరవము చేయుట. జ్ఞాపకార్థ మేదేని నిర్మించుటయని నాయభిప్రాయము."

1894 వ సం॥రం ఫిబ్రేవరునెలలో రంగనాథము మొదలియారి పేరు శాశ్వతముగానుండు టకుఁ జెన్నపురమందొక్క మహాసభ జరిగెను. ఆసభకు గవర్నరుగారగ్రసనాధిపతులైరి. ఆసమయమున చెన్నపురము హైకోర్టులోఁ జిరకాలము జడ్జీగనిచేసిన సర్. టి. ముత్తుస్వామియ య్యరుగారు క్రిష్టియన్ కాలేజీలోఁ బ్రధానోపాధ్యాయుఁడుగనుండిన డాక్టరు మిల్లరుదొరగారు మొదలగుననేకులు రంగనాథమును గూర్చి ప్రసం గించిరి. అప్పుడు ముత్తుస్వామియయ్యరుగారుచేసిన యుపన్యాసములోని కొన్ని వాక్యములిందుదాహరింపఁ బడుచున్నవి. వానితో గాఢమైన పరిచయము స్నేహము జేయుటవలన నతనిప్రజ్ఞలు నిరుపమానములని నేను తెలిసికొంటిని. అతఁడుపాధ్యాయుఁడుగా విద్వాంసుఁడుగా దేశాభి వృద్ధికారకుఁడుగ నుండిచేసిన యుపకారము విలువలేనిది. అతనిపరిశ్ర మము పూనిక మిక్కిలి యద్భుతములైనవి. తన యహర్కృత్యము నె రవేర్చుచు నిరంతరము గ్రంథపఠనమందె యతఁడు కాలముపుచ్చుచుం డును. ఒకసారి నేను చాలసేపు షికారు దిరుగగా నన్నతఁడుచీవాట్లు పెట్టెను. అది నాకిప్పటికి జ్ఞాపకమున్నది. ఈకాలముమీరు పాడుచే యక మంచిపనిక్రింద నుపయోగించుచున్న బాగుండునని నాకాయన యుపదేశము చేసెను. రంగనాథునకుఁ గలిగిన మహాఖ్యాతి వానిబుద్ధి విశేషముచేతనేగాని నిరంతరము పాటుబడుటవలనఁ గాదు. దీనింబట్టి యాతఁడు పాటుపడువాఁడు గాఁడని మాయభిప్రాయము గాదు. కొం దఱు మేధావంతులు కాకపోయినను విశేషపరిశ్రమముజేసి గొప్పవా రగుదురు. రంగనాథము మొదలియారి నిరుపమానమైన బుద్ధిసూక్ష్మ

తగలిగి దానికింగోటుగఁ బరిశ్రమఁజేసి ఖ్యాతిగాంచినవాఁడు. రంగనా
థముమొదలియారి సంభాషించుచుండఁగా విన్నవారు మహానందభ
రితులగుచుందురు. అతనిభాషాశైలి మనోహరమై చాకచక్యము
గలిగి మనస్సు నానందవార్ధి నోలలాడించుచుండును. ప్రసంగములో
నడుమనడుమ నతఁడు మహాకవుల యుద్గ్రంథములలో నుండి సంతో
షజనకములైన పద్యములను వాక్యములను దీసి కంఠపాఠముగఁజదివి
వినువారి వీనులకెంతయు విందుచేయుచుండును. ఆంగ్లేయభాషలో
నతనికి షేక్స్పియరు మహాకవియొక్క కవిత్వము మిక్కిలిప్రియమైనది.

సాధారణముగ నింగ్లీషుభాషలోఁ బ్రవీణతగల విద్వాంసులకు
స్వభాషాపరిచయముండుటయరిది. రంగనాథము మొదలియారి విషయ
మట్లుగాదు. ద్రావిడభాషయందుమహాపండితులతో సమానమైనపాండి
త్యము వానికిఁగలదు. ప్రసంగమువచ్చినప్పుడు సందర్భశుద్ధియెఱిఁగి
యతఁడు ద్రావిడభాషలో నున్న కంబరామాయణమునుండికొన్ని పద్య
ములనుదీసి చదివి దానిలోనుండుభావములను మిత్రులకుబోధించుచుం
డును. ఈకాలమున నింగ్లీషుభాషలోఁ గృషిచేయు విద్యార్థులు స్వ
భాషను బొత్తుగ నెఱుఁగక చెడిపోవుచున్నారని యాయన పలుమారు
మిత్రులతోఁజెప్పి విచారించుచుండును. ఆయనసర్వవిధములచేతమిక్కి
లి పెద్దమనుష్యుఁడు. తఱచుగా గొప్పవారితో సహవాసము చేయుట
చేత నాతనిపద్ధతులు మిక్కిల మంచివైయుండెను. ఆతనిహృదయము
మిక్కిలి మెత్తనిది. ఆయనజీవితములోఁ జాలభాగము పేదలగువిద్యా
ర్థుల విద్యనిమిత్తము ప్రతిమాసము వ్యయముచేయుచుండెను. అట్టి
దానములు గుప్తములైయుండెను. ఇతరులయందున్న బుద్ధిసూక్ష్మత

ల నతఁడు మెచ్చి సంతసించుచుండెను. ఆయనకు ముత్తుస్వామి యయ్యఁగారిని గూర్చి యీక్రింది యభిప్రాయముగలదు. "బుద్ధిసంపదను జూడఁగా నీకాలమున హిందూదేశమునఁ బుట్టినవారిలో ముత్తుస్వామియయ్యరే శ్రేష్ఠుఁడు." రంగనాథము మొదలియారుచేసిన గ్రంథమొకటికలదు. అది కంచికాలందకమను ద్రవిడభాషా పద్య కావ్యము.

సెట్టిపాణియం వీరవల్లి రంగాచార్యులు.

సెట్టిపాణీయం వీరవల్లి రంగాచార్యులు

ఈరంగాచార్యులు 1831 వ సంవత్సరమున చెంగల్పట్టుజిల్లాలో నొకగ్రామమున జన్మించెను. ఈయనతండ్రి రాఘవాచార్యులు చెంగల్పట్టుకలెక్టరు కచ్చేరిలో నొకగుమస్తాగా నుండెను. రంగాచార్యులు పసిబిడ్డయైనపుడు గొప్పగండ మొకటితప్పెను. తల్లితోఁగలసి పయనముచేయుచుండ దారిలో బండిబోల్తపడెను. బండి పడిపోవుటకు సిద్ధముగా నున్నపుడు రంగాచార్యునియన్న వేగముగఁ దల్లియొడి నున్న తమ్ముని నీవలకులాగియాతని ప్రాణములు కాఁపాడెను. కానిచో రంగాచార్యులేమయియుండునో! ఆతనితండ్రికి స్వల్పాదాయముతప్ప మరి యేయాస్తియులేదు. కుమారునకింగ్లీషువిద్య జెప్పింపవలయునని రాఘవాచార్యులు తలంచెనుగాని సంసారస్థితి చక్కఁగా నుండకపోవుటచేఁ జదువు మాన్పింపఁజూచెను. అంతలో రాఘవాచార్యుని సోదరులలో నొకఁడు రమారమి యెనిమిదివందల రూపాయలు బాలుని చదువు నిమిత్తమిచ్చి మృతినొందెను. ఏయాధారములేని రాఘవాచార్యున కిదికొంతసహకారిగా నుండెను. కాని కుమారునిఁ జెన్నపురికిఁ బంపి విద్యాభ్యాసము సంపూర్ణముగఁ జేయించుటకిది చాలదయ్యెను. ఏమిచేయనగునని రాఘవాచార్యు లాలోచించుచుండ వారిబంధువుఁడు చెన్నపట్టణమున మేజస్ట్రీటుగానియమింపఁబడిన మొదటిహిందువుఁడునగు, వి. రాఘవాచార్యులనునతఁడు బాలుని విద్యాభ్యాసమునఁ గొంతసాహాయ్యముఁ జేయునట్లు వాగ్దానముచేసెను. అంతట రంగాచార్యులు చెన్నపట్టణమునఁ జదువనారంభించెను.

విద్యార్థిగానున్న కాలమున రంగాచార్యులువయసునకుఁదగని తెలివిగలవాఁడని పేరుబడెను. పెద్దవాండ్రు చదరంగమాడుచుండ

నీ బాలుఁడు నిశ్శబ్దముగ వారి సమీపమునఁ గూర్చుండి మెలకు వతో నయ్యాటలోని చమత్కృతులన్నియు గ్రహించి యల్పకాల ములోనే దానియందు మిక్కిలి ప్రౌఢుఁడయ్యెను. అతని ప్రౌఢిమ మెఱిఁగి చదరంగమాడు పెద్దలు మంచియెత్తులు తమకుఁ దోఁచ నప్పుడు, తమయాట చిక్కులలోఁ బడినప్పుడు పలుమాఱు బాలుఁ డగు రంగాచార్యుని సాయము నపేక్షించుచు వచ్చిరి. అనుకటయే తడవుగ నీ కుశాగ్రబుద్ధి యసమానములగు నెత్తులుచెప్పి వారియాట చిక్కుల విప్పుచు వచ్చెను. రంగాచార్యునకు విద్య మీఁదకంటె నాటపాటలయం దెక్కువ తమక ముండెను. అట్లున్నను స్వల్ప పరిశ్ర మము మాత్రముచేసి చదువులో తోడిబాలుర మించుచు వచ్చెను. అతఁడు మొట్టమొదట పచ్చయ్యప్ప పాఠశాలలోఁ బ్రియజ్ఞాన మొదలియారి యను నాతనియొద్ద చదివెను. పెద్దవాఁడైన తరువాత సైత మీయాచార్యులు తన చిన్ననాఁటి యుపాధ్యాయునియెడ గౌరవము, ప్రేమయుఁ గలిగి, చిన్న బిడ్డలకు మొదటి తరగతులలో నుపాధ్యాయులుగా నుండఁగోరువా రాయనవలె నుండవలెనని చెప్పు చువచ్చెను. ప్రియజ్ఞాన మొదలియారి వయోవృద్ధుఁడయి యుద్యో గము మానుకొని యింట నిబ్బందులు పడవలసివచ్చినప్పుడు ప్రాఁత శిష్యుఁడైన రంగాచార్యులు గురుభక్తి గలిగి ద్రవ్యసహాయము చేయుచువచ్చెను. పచ్చయ్యప్ప పాఠశాలలోఁ జదువు ముగిసిన పిదప రంగాచార్యులు చెన్నపట్టణపు హైస్కూలులోఁ బ్రవేశించెను. దాని ప్రధానోపాధ్యాయుఁడగు పవెలుదొర బాలుని మేధాశక్తికి సంత సించి నెలకుఁ బదునాలుగు రూపాయలు విద్యార్థివేతనముగ వాని కీయఁ దొడఁగెను. పవెలు దొరయొద్ద బుద్ధి సంపూర్ణముగ వికసింప నతఁడు ప్రజ్ఞలోఁ దక్కిన విద్యార్థుల నందఱ మించుటఁజేసి వారు ... సమానముగ నుండఁగోరక వాని తరువాతవారుగా నైన

నుండినం జాలునని కోరవలసినవారయిరి. ఆ హైస్కూలులో నతఁడు 1849 వ సంవత్సర ప్రారంభమువఱకు విద్యాభ్యాసముచేసి యప్పుడు ప్రొఫిషెంటు పరీక్షలో మొదటి తరగతిలోఁ గృతార్థుఁడయి గౌరవాస్పదుఁడయ్యెను. తరువాత రంగాచార్యులు దొరతనమువారి కొలువులోఁ బ్రవేశించుటకు మఱియొక పరీక్షకుఁ జదువుచుండుట విని పవెల్ దొర వానియెడ మంచియభిప్రాయముఁ గలవాఁడు కావున వాని క్రింది విధమున వ్రాసెను. "నీవు పరీక్షారంగమునఁ బ్రవేశించుచున్నాఁడవనియు మా పాఠశాల పరువు నిలువఁ బెట్టఁ బ్రయత్నింతువనియు విని చాల సంతసించితిని. నీ యందు సామర్థ్యము, దానికింగోఁడు వాక్చక్యము, వివేకముఁగలవు. కావున నీవు తప్పక జయము నొందెదవు."

విద్యార్థిదశలో నతనికిఁ గలిగిన యద్వితీయ విజయము వలన వానికీర్తి చుట్టుప్రక్కల వ్యాపించుటచే నతఁడు విద్యముగింపఁగానే చెన్నపురమం దప్పుడు కలెక్టరుగానున్న యెల్లిసుదొర వానికిఁ దనకచ్చేరిలోఁ నొకనికి బదులుగా కొన్నాళ్లు గుమాస్తాపని యిచ్చెను. అనంతర మతండు చెంగల్పట్టుజిల్లా కలెక్టరు కచ్చేరిలో ఖాయపు గుమస్తాగా నియమింపఁ బడెను. అక్కడ కొన్నాళ్లుండిన తరువాత నతఁడు సేలంజిల్లా కలెక్టరు గారికచ్చేరిలో హెడ్క్లర్కుగా హెచ్చుజీతముమీఁదఁ బంపఁ బడెను. ఈ కాలమున నతఁడు రెండు చిన్నపుస్తకములను వ్రాసెను. అందొకటి రివిన్యూ డిపార్టుమెంటులోని యుద్యోగస్థులు లంచములను పుచ్చుకొనుటఁగూర్చి. రెండవది యాకాలములో నందఱుఁ దీవ్రముగాఁ జెప్పుకొనుచున్న సేలము తంజావూరు జిల్లాలలోని మిరాసీహక్కులనుగుఱించి. పిమ్మట నతఁడు సైదాపేట తహసీలుదారుగా వెళ్ళి యాపనిలో రెండేండ్లుండెను. అక్కడనుండి నెల్లూరుజిల్లా సిరస్తాదారుగాఁబోయెను. 1859 న

సంవత్సరమున గవర్నమెంటువారు చెన్నపురిరాజధానిలో నేర్పరచిన యీనాము కమీషనుయొక్క ప్రెసిడెంటగు టెయిలరుదొరవారియొద్ద స్పెషల్ అశిస్టాంటుగా నియమింపఁబడెను. రంగాచార్యులు తన వివేక సామర్థ్యములవల్ల టెయిలరు దొరకు విశ్వాసపాత్రుఁడై యేఁడు సంవత్సరము లాశిపాటుమెంటులోఁ బనిచేసెను. ఈనాముల పరిష్కారము ముగిసిన పిదప దొరతనమువారు మన దేశములోనున్న యినుపదారుల (Railways) పద్ధతి యెట్లుజరుగుచున్నదో తెలియఁ జేయవలయునని టెయిలరు దొరవారిని నియోగించిరి. ఈ పనికి బాగుగ లెక్కలు తెలిసినవారు కావలసివచ్చినందున టెయిలరుదొర రంగాచార్యునిఁ దనకు సహకారిగాఁ దీసికొనెను. రంగాచార్యులు ప్రధాన మిత్రులతోను, ముఖ్య బంధువులతోను గలసి యాలోచింప కుండ నీ యుద్యోగములోఁ బ్రవేశించుట కొడంబడెను. గృహము నకుఁ బోయి యావార్త చుట్టముల కెఱిఁగింప వారు టెయిలరు దొరతో నతఁడు చేసిన వాగ్దానమునుండి వానిని మరల్పఁ బ్రయత్నించిరి. ఏలయన నతఁడు కలకత్తాకు సముద్రముమీఁద నోడప్రయాణము జేయవలసి వచ్చెను. ఆనాఁడు పూర్వాచార ప్రియులగు బ్రాహ్మణులు రంగాచార్యులవంటి యగ్రకులజుఁడు సముద్రముమీఁద నావికా యాత్ర చేసినపక్షమున బ్రాహ్మణ్యము చెడిపోవుననియు నటుమీఁద నందఱు నదే మొదలుపెట్టి వర్ణాశ్రమ ధర్మములు పాడుచేయుదురనియు గోలుపెట్టిరి. కాని రంగాచార్యులు నాగరికతా విషయమునఁ దనసాటివారి తలదాఁటిన వాఁడగుటచే వారు పెట్టిన గోలు సరకుసేయక, వెలికి జంకక టెయిలరుదొరతోఁ గలసి యోడ మీఁద కలకత్తాకును, బనియున్న యితరస్థలములకునుఁ బోయెను. పోయి చాలదూపికతో నీతితోఁ దనపని నిర్వర్తించుకొని తనపై యధికారి నమ్మికకు మునుపటికంటెను మిక్కిలిగా పాత్రుఁడయ్యెను.

తనకు నధికారులకు సంతుష్టికలుగునట్లు కార్యనిర్వాహముచేసి రంగాచార్యులు స్వదేశమునకు మరలె. టెయిలరుదొరకు రంగాచార్యుని మీఁద నెంత గౌరవమున్నదో వాని స్వహస్త లిఖితమైన యీజాబు వలనఁ దెలియును." ఆతఁడు (రంగాచార్యులు) పాఠశాలను విడిచి, 1849 వ సంవత్సరములో ప్రొరతనమువారి కొలువులోఁ బ్రవేశించి నది మొదలుకొని మేమిరువురు మొడతెగని సంబంధము గలిగి యుంటిమి. మాకొండొరులయెడఁగల గౌరవము రవ్వంతయు డిందు పడలేదు. ప్రిపరిధమునుుం నేనతనికిఁ బనిచేయ్టలలోను, బిమ్మట గొప్ప యుద్యోగములిప్పించి వృద్ధికిఁ దెచ్చుటలోను గొంతసహాయము చేసి నను రంగాచార్యుఁడు నాయెడలఁ జూపిన భక్తివిశ్వాసములచేత నా ఋణమంతయుఁ దీర్చెను. మా యిరువురకు నుద్యోగ సంబంధ మున్నంతకాలమంతయు రంగాచార్యులు స్వదేశస్థుల ప్రవర్తనల గూర్చి యతనికిఁగల జ్ఞానము, నానియుక్తాయుక్తవివేకము, యద్భుత మైన యతనికార్య నిర్వాహక సామర్థ్యము విసుగుకొనక యతనిప్పు డముగా నా నిమిత్తమె వినియోగించెను. వేయేల! మా కిరువురకు సంబంధముగల సమస్త వ్యవహారములలోను నేను కృతకృత్యుఁడ నగుట యెల్ల రంగాచార్యుని సహాయ సంపత్తి చేతనే యని దృఢ ముగాఁ జెప్పఁగలను." అనంతరము కొంతకాలమునకు టెయిలరు దొర చెన్నపురి రాజధాని పక్షమున గవర్నరు జెనరలుగారి శాసన నిర్మాణ సభలో సభికుఁడై, చట్టములు నిర్మించినపుడు రంగాచార్యుని యాలోచన మడుగుచు నీతఁడిచ్చిన సలహాలను విస్పష్టముగ గవర్నరు జెనరలుగారి సభలోఁ జెప్పుచువచ్చెను. కలకత్తానుండి చెన్నపట్టణము తిరిగివచ్చినతరువాత రంగాచార్యులు మదరాసు రెయిల్వేకంపెనీకి కమీషనరయ్యెను. దొరతనమువారు కాకితపు నాణె ములు (అనగా కరెన్సీనోట్లు) క్రొత్తగా వ్యవహారములలోనికిఁ

దెచ్చి, 1864 వ సంవత్సరమున రంగాచార్యుని పశ్చిమదేశముననున్న కల్లికోట జిల్లాలో ట్రేజరీ డిప్యూటీ కలెక్టరుగా వేసిరి. ఆకాలమున నచ్చటి జిల్లాకలెక్టరగు బాలర్డు దొరకు రంగాచార్యునియెడఁ జాల నమ్మకము కలిగెను. అప్పుడే యన్నల గొంతకాలమునకు తిరువాన్కూరు, కొచ్చి సంస్థానములలో దొరతనమువారి పక్షమున రెసిడెంటయ్యెను.

ఈ నడుమ మైసూరు సంస్థానస్థితి చాల శోచనీయముగా నుండెను. దొరతనమువారు వెనుకటి మహారాజగు కృష్ణరాజ యొడయరగును గద్దెమీఁది నుండి దింపి వాని దత్తపుత్రుఁడు యుక్తవయస్కుఁడగుని పిదప రాజ్యము స్వీకరింపవచ్చునని శాసించిరి. స్వదేశ సంస్థానములతో నేకాడికైన సంధినే జేసికొని, వాటిజోలికిఁబోక నెమ్మదిగా దేశమునుఁ బాలింపవలయునను తలంపు గల లార్డు విలియం బెంటిక్కు వంటి మంచి గవర్నరు జెనరలుకూడ తన నియమమునకు విరుద్ధముగా జోక్యము కలిగించుకోవలసినంత దుర్దశకు మైసూరు సంస్థానము మరల నెన్నఁడు రాకుండ జేయఁదలఁచి, యేఁబదిలక్షల జనులకు రాజు కాఁదలఁచి యున్న చిన్నమహారాజునకు నిరంతరము ప్రజానురంజనముగా, ప్రజాక్షేమంకరముగ పరిపాలనను జేయించునట్టివిద్యను జెప్పింప నింగ్లాండులో నిదొరతనమువారునిశ్చయించుకొనిరి. హిందూదేశపుకార్యదర్శిగా నింగ్లాండునుండి పంపినయీ యుత్తరువు అమలులోనికిఁ దెచ్చుటకు మైసూరులోఁ గొన్నిమార్పులు జరుగవలసివచ్చెను. అపుడు మైసూరులో నింగ్లీషుదొరతనమువారిపక్షమున నధికారముచేయుచున్న బౌరింగుదొర మహారాజుగారియంతఃపురపులెక్కలు పరీక్షించుటకు నమ్మకముంచఁదగిన చెన్నపట్టణపుమనుష్యు నొకనిని సిఫారసుచేయుమని యెల్లిసుదొరకు వ్రాసెను. ఎల్లిసు రంగాచార్యునిఁ బంపెను. 1868 వ సంవత్సరమున రంగాచార్యులు మైసూరుకొలువులో చేరెను.

ఈపనిలో చేరిన యచిరకాలముననే వానికి మఱియొకపనికూడ యధి కారు లప్పగించిరి. ఆ రెండవపని యిది. మైసూరుమహారాజుగారియం తఃపురముననున్న చరాస్తికంతకు జాబితా తయారుచేసి, ప్రతివస్తువు యొక్క విలువ దాని కెదురుగా వ్రాసి, యట్టిజాబితా సంపూర్తిమైనపిదప మహారాజుగారిరత్న సువర్ణాభరణములు మొదలగు గొప్ప సరకులు నిరపాయముగ నుండున ట్లేర్పాటు చేయుట. ఈ రెండు కార్యము లతఁడు మెలకువతో నిర్వహించెను.

అనంతర మాచార్యుఁడు మహారాజుగారి కోటలో జరుగుచున్న దురభ్యాసముల నివారింపఁదొడంగెను. కోటనాశ్రయించి పనిపాటలులేక మహారాజుగారిడబ్బుతిని క్రొప్వి స్తోత్రపాఠములుచేసి లక్షేపము చేయుసోమరిపోతుల ననేకుల రంగాచార్యుఁడు తీసివేసెను. ఆకాలమునఁ జిన్నమహారాజునకు మాలిసన్‌దొర చదువు చెప్పుచుండెను. అతఁడు రంగాచార్యుని యార్జవము, మన స్థైర్యముఁజూచి సంతసించి వానియం దిష్టముకలవాఁ డయ్యెను.

1874 వ సంవత్సరమున రంగాచార్యుఁడు "మైసూరులో నాంగ్లేయపరిపాలన" మను శీర్షికతో నొకచిన్నపుస్తకమునువ్రాసి దానిని లండనుపట్టణములో నచ్చువేయించి యచిరకాలములోనే యట్టి గ్రంథము మఱొకటివ్రాసి సంస్థానములోఁ జేయవలసిన మార్పుల నం దుదాహరించునట్లు వ్యాఖ్యానము చేసెను. కాని రెండవగ్రంథ మెన్నఁడు వెలువడ లేదు. ఏలయన యాగ్రంథము వ్రాయకిమునుపె యాచార్యుఁడు మైసూరుసంస్థానము గొప్పపదవినొంది యేమార్పు లావశ్యకములని తాను రెండవగ్రంథమునందు వ్రాయఁదలఁచెనో యామార్పులు తాను స్వయముగాఁ జేయుటకు నితరులచేతఁ జేయించుటకుఁ దగిన యధికారమును వహించెను. మొదటి గ్రంథము వెలువడినతోడనే రంగాచార్యుఁడసాధారణ బుద్ధిశాలి, శక్తిమంతుఁడు

సని యెల్లవారలకుఁ దెల్లమయ్యెను. అందుచేత నప్పుడు మైసూరులో మొదటి కమీషనరుగా నుండినగార్డనుదొర రంగాచార్యునిఁ దనకు రివెన్యూ సెక్రటరీగా దీసికొనెను. అదిమొదలు వా రిరువురుఁ గలిసి సంస్థానమునందుఁ జాలమార్పులంజేసి యనేక నూతనపద్ధతులం జొనిపి సంస్థానవ్యయములు తగ్గించిరి. అదివఱకు కమీషనర్లుగానున్న ముగ్గురు తెల్లవారిని తొలఁగించి వారిబదులిద్దఱు స్వదేశస్థులనియమించిరి. అంతకుమున్ను వేయిరూపాయలు మొదలుపదునాఱువందలవఱకుఁగల డిప్యూటీకమీషనరుపదవి నిప్పుడేడువందలు మొదలు వేయిరూపాయలువఱకుఁగల యుద్యోగముగఁ జేసిరి. ఇరువదియేడసిస్టాంటుకమీషనుపనులలో నెనిమిదనావశ్యకమనితగ్గించి మిగిలినపంధొమ్మిదిపదవులును మునుపటివలెఁ దెల్లవారికియక సమర్థులయిన స్వదేశస్థులకుఁ దక్కువజీతములమీఁద నిచ్చిరి. పాతజీతములమీఁద నలుగురు డిప్యూటీకమీషనరుల మాత్రము నిలిపి తక్కినయందరినిఁ దక్కువజీతములమీఁద నల్లవారినే వేసిరి. అడవి, చదువులు,రివెన్యూ మొదలగు నెల్లడిపార్టుమెంటులలోను దెలివితేటలలో, సామర్థ్యములోఁ దెల్లవారికి ఏమాత్రముఁ దీసిపోని స్వదేశస్థులు తక్కువజీతములమీఁద దొరకుచుండఁగా హెచ్చుజీతములమీఁద దెల్లవారి నేల నియోగింపవలయు నను నియమముమీఁద తక్కువజీతములమీఁద నెక్కువసామర్థ్యముగల దేశస్థులనే నియోగించుచు వచ్చెను. ఈమార్పులచేత నీ మితవ్యయముచేత నా సంవత్సరము రెండులక్షల యేఁబదివేల రూపాయలు మొత్తము ఖర్చులు తగ్గెను.

ఈమహాకార్యములకు గాసిని మెచ్చి 1880 వ సంవత్సరము దొరతనమువారు వానికి సి. ఐ. ఇ బిరుదము నొసంగిరి. మైసూరునకు విదేశీయుఁడై యుండియు నాసంస్థానమున మహోన్నతపదవులనందుచే నా దేశస్థులకు రంగాచార్యునిమీఁద నసూయ పొడమెను.

అందుచేత వారు వానిమీఁదఁగొన్ని చెడువాడుకలు బుట్టించిరి. అందుఁ బ్రధానమైన దిచ్చట నుదాహరించుచున్నాను. వెనుక రంగాచార్యుఁడు రాచనగరునందలియాభరణముల లెక్కవ్రాయ నియమింపఁబడెను గదా! ఆపనిముగిసిన యెనిమిదేండ్లతరువాత నమూల్యాభరణములు కొన్ని రాచనగరులో కనుపించుటలేదనియు, నందుకు వెనుక పనిచేసిన రంగాచార్యుఁడే జవాబు చెప్పవలయుననియు వార్తాపత్రిక లాక్షేపింపఁజొచ్చెను. వానివిరోధు లావార్త నాధారముచేసికొని వానిని నిందింపసాగిరి. ఈవిషయమున మైసూరుదేశమంతయు నట్లుడికిన ట్లుడికెను. ఇది వాని విరోధులుచేసిన కల్పనమేకాని సత్యము కాదు. ఆతఁ డప్పుడు మేజస్టియిలియట్ అనుదొర చేతిక్రిందఁ బనిచేసెనే కాని స్వతంత్రముగాఁ బనిఁజేయలేదు. ఆదొరయు,గార్డను దలగు తక్కినదొరలు వానియార్జవమును వేనోళ్ళఁగొనియాడిట్లు గలు కానఁబడకపోవుట యబద్ధమనియు, గుమాస్తాలవ్రాతక్షన నలన జాబితాలోఁ గనఁబడలేదుగాని నిజముగానగలుండెననియు, ట్టిపొరబాటుననాగుమాస్తాలేకానిరంగాచార్యుడుత్తరవా నప్పుడుం నతనిపవిత్రత సము నిర్దుష్టమనియు మైసూరుసంస్థా డిన విల్సన్ మొదలగు గొప్పదొరలు నొక్కివ్రాసి గాచార్యుఁడుమై

1881వ సంవత్సరముమార్చి 25వ తేదీ గాచార్యుఁడు చేసిన సూరునకు మంత్రియయ్యెను. అమాత్యుఁ గానవలయునన్న నతఁ కార్యముల గొప్పతనమును మనము స్థానస్థితియెట్లుండెనోయిండా యుద్యోగమునంబ్రవేశించు నప్పటి నున్న యింగ్లీషురాజ్యమున చుక తెలియవలయును. సరిహద్దు యుద్యోగస్థులజీతములు మితి నున్నట్టే యన్నిడిపార్టుమెంటులలో సంవత్సరమందు (అనఁగా ధాతసం మీఱి యుండుటచేతను, 1877 తను దేశము సంస్థానమునందలి ధనా వత్సరమందు) గొప్పకాటక

గారముగూడవట్టిపోయెను. ఆదేశమునందున్న యేబదిలక్షలజనములో పదిలక్షలను క్షామదేవత తనపొట్టఁబెట్టుకొనియెను. ఆచచ్చినవారిందఱు చేతిపనులు మొదలగు కాయకష్టములవలన జీవించువారగుటచే నట్టిపనులుఁగూడ నశింప దేశము మరింత పేద యయ్యెను. అతిభయంకరమయిన యాక్షామమునఁ బనులకుఁ బంటలకుఁ గలిగిన నష్టము రమారమి పదునయిదుకోట్లరూపాయ లని యంచనా వేయఁబడెను. అంతకుముందు చేసిన మార్పులవలన మిగిలిన స్వల్పధనము కుమారమహారాజుగారి పట్టాభిషేకమహోత్సవమునకు, నంతఃపురవ్యయములకు విధిగా చేసికొనవలసివచ్చిన కొన్ని మార్పులకు వెచ్చింపఁబడెను. కాటకమునకు ముందు మైసూరుగవర్నమెంటున కేఁటేఁట వచ్చు శిస్తు కోటి పదిలక్షలరూపాయలు. అదివృద్ధిచేయుటకుఁ గాలస్థితి యనుకూలముగ లేకపోయెను. క్షామమువలన వర్తకము, చేతిపనులు మొదలగునవి క్షీణించెను. ఆంగ్లేయగవర్నమెంటువారికి మైసూరు దొరతనమువారి య్యవలసిన యేఁబదిలక్షలరూపాయలకు నేఁటేఁట నాలుగులక్షలరూపాయలు వడ్డిరూపకముగాఁ బోవుచుండెను. సంస్థాన మివ్విధమున దుస్థితిలో నున్నపుడు రంగాచార్యుఁడు మంత్రిగావలసివచ్చెను. ఆస్థితిని బాఱచూచిన నెంతధైర్యవంతుని మనస్సైన చెదరిపోవునుగదా! కడులో మే లగునట్లు రంగాచార్యుని కీయవస్థలో నొక్కసంతోషముమాత్రము గలుగుచు వచ్చెను. క్రొత్తగా గద్దె యెక్కిన కుమారమహారాజునకు స్వయముగా నాలోచనముఁ జెప్పి రాజతంత్రము నడుపుటకు శక్తి లేకపోయినను మంత్రిచెప్పిన యాలోచనము గ్రహించి యతఁడు చేసిన మంచిని మెచ్చుటకైన సామర్థ్యము గలవాఁడగుటచే రంగాచార్యుని ప్రయత్నములన్నియు నిర్విఘ్నములుగ సాగెను.

రంగాచార్యుఁడు మంత్రియైన తోడనే వెనుక గార్డనుదొరము

దలు పెట్టిన మార్పులను గొనసాగింపఁ బూనుకొనెను. హస్సాను, చిత్ర దుర్గ మండలములు సివిలుక్రిమినలు వ్యవహారములనిమిత్తము వేఱు వేఱు జిల్లాలుగఁ బరిగణింపఁబడెను. 9 తాలూకాలు డిప్యుటీహసీలుదారుల యధికారముక్రింద నుంచబడెను. మూఁడుమునసబుకోర్టులు 4సబుకోర్టులు తీసివేయఁబడెను. 8 జిల్లాల చెఱసాలలలో నైదు తీసివేయఁ బడెను. బాటసారులు బసలుదిగు బంగాళాలమీఁద నదివఱకేర్పడిన జీతగాండ్రు చాలనుంది తగ్గింపఁ బడిరి. ఈతగ్గింపులవలన సంస్థానము నకు సంవత్సరమునకు రమారమి రెండు లక్షల రూపాయలు మిగిలెను. ఆమార్పులు ముగిసినపిదప రంగాచార్యులు సంస్థానములోని యడవి డిపార్టుమెంటువైపు తనదృష్టిని మరల్చెను. ఆసంస్థానములో నడవులు చాలభూమి నాక్రమించియుండెను. కలపవిశేషముగ జనులకుఁ గావలసియుండెను. అందునియోగింపఁబడిన యుద్యోగస్థులదుర్నీతివల్ల, సరకువచ్చుటకు సులభమైనమార్గములు దేశమునలేకపోవుటవల్లను మహారాజున కాడిపార్టుమెంటులో రావలసినంత సుంకమువచ్చుటలేదు. ఆ రాజ్యములో దొరకెడు మంచిగంధపుఁగఱ్ఱల జనులెవ్వరమ్మఁగూడదు. కొనఁగూడదు. దొరకినమంచిగంధపుదారువులన్నియు రాచనగరులలోనే యేదోవిధముగనుపయోగింపఁబడుచువచ్చెను. రంగాచార్యుఁ డాపద్ధతిమాన్పి చందనమండలకు సులభసాధ్యముచేసెను. ఈపనులవలన నడవులనుండి సంస్థానమునకు హెచ్చుసుంకము రాఁజొచ్చెను. ఈవిధము నఁగొంతద్రవ్యముమిగిల్చి యామంత్రిపదునొకండు లక్షలరూపాయలు పెట్టుబడిపెట్టి మైసూరుప్రభుత్వమువారు చిరకాలముక్రిందట తలపెట్టి నెఱవేర్పలేకపోయిన యినుపదారిని గొనసాగించెను. పొగబండ్లునడచు నినుపదారినలనఁ దేశమంతట నలముకొనునట్లు వేయించవలయుననియు తని సంకల్పము. ఏలయన నవిజనులకుఁ బ్రయాణసౌకర్యముగలిగించుననియు వాణిజ్యమునభివృద్ధిజేయుననియు నింగ్లీషువారిరాజ్యముతో

మైసూరు రాజ్యముకలసి విశేషలాభప్రదమగునని యునాతఁడునమ్మెను మైసూరురాజ్యమునందు నీటిసాగుబడికిఁ జాలవీలున్నను భూమివిశేష భాగము సాగుబడికి రాక, వచ్చినఁ జక్కగా సాగుబడి చేయఁబడక యుండెను. దానికిఁ గారణము వ్యవసాయము చేయువారికిఁ దగిన సహాయము లేకపోవుటయేయని రంగాచార్యులు నిశ్చయించి యిరుప దారులు దేశమునఁబ్రబలిన నీలోపము నివారింపఁ బఱునని తలఁచి తత్ప్రయత్నములఁ జేసెను. సంస్థానము లేమిలోనున్నను రంగాచార్యులు దానికి భారములేకుండ నిరుపదారి విశేషముగ దేశమున వేయించెను.

మైసూరుప్రభువు లింగ్లీషుదొరతనమువారి కీయవలసినయెనుబది లక్షలరూపాయల ఋణమును దీర్చుటనుగూర్చి యతఁడు పిమ్మట ప్రయత్నించెను. సంస్థానముయొక్క ధనస్థితినిఁబట్టి చూడఁగానీయప్పు తరతరములవఱకు దీఱునట్లు కనఁబడలేదు. ఆఋణముమీఁదనేఁటేట పెరుఁగువడ్డియే పెద్దమొత్తమై యసలుమాట యటుండఁగానీవడ్డియైన దీఱినంజాలునని పించుచున్నట్లుండెను. అప్పటిస్థితులంబట్టి చూడఁగా నిండియాగవర్నమెంటువారు వారిందోఁచినప్పుడుఋణముదెమ్మనిమహారాజును నిలువదీసి యడుగవచ్చును. అట్టి చిక్కు సంభవించెనా, ఋణవిమోచనమునకై సంస్థానమునకు భంగములైన పనులఁజేయవలసివచ్చునని దూరదృష్టిగల రంగాచార్యుఁడుగ్రహించి, యీయప్పును గురించి యేవోస్థిరమైనయేర్పాటులు చేయఁదలచి, యిండియాగవర్నమెంటుతో లేఖాప్రసంగ మారంభించెను. ఈజాబులలో నతఁడు మైసూరు దరిద్రదశలోనున్నదని వ్రాయుటయేగాక వెనుకటిమహారాజుల దౌర్బల్యము కతమున సంస్థానమాంగ్లేయుల యేలుబడిలోనున్నపుడు జరిగినదుష్పరిపాలనమువలనఁ జెడిపోయి యీదశకువచ్చెననినిర్భయముగా వ్రాసెను. అందలివిషయము లప్పటిగవర్నరుజనరలగు లిట్ట

నుప్రభువుకూడ నొప్పుకొనియె. ఈయుత్తర ప్రత్యుత్తరముల వలన నింగ్లీషు గవర్నమెంటువారు మైసూరువారి ఋణముమీఁదకొంతవడ్డీ తగ్గించిరి. అనఁగా మునుపు సంవత్సరమునకు నూటికైదురూపాయలున్నవడ్డీ నాలుగురూపాయలుఁజేసిఋణమునలువదియొక్క సంవత్సరములలో దీర్చుకొనుట కంగీకరించిరి.రంగాచార్యుఁడు తెచ్చినక్రొత్తపద్ధతులన్నిఁటిలో నుత్కృష్టమైనదిజనప్రతినిధిసభ. స్వదేశసంస్థానములలో నిట్టిసభ యపూర్వము. ఈసభాస్థాపనకీర్తి మనదేశమున రంగాచార్యునకేదక్కును. అతఁడీసభకు రాజ్యపరిపాలనాధికారమిచ్చుటకుఁ గాక సర్కారువారి యుద్దేశములఁ బ్రజలకెఱిఁగించుటకును సర్కారుచేయఁబోవుచట్టముల వారికి ముందుగాఁ దెలుపుటకును రాజునకుఁ బ్రజకు నెడతెగని సంబంధముగలించుటకు రాజక్షేమమే ప్రజాక్షేమము ప్రజాక్షేమమే రాజక్షేమము నను మాటలు వారి మనంబున నాటించుటకు నీసభ సృష్టించెను. ఈసభక్రొత్తగాఁ బెట్టినప్పుడు దాని ననేకులుగర్హించి రంగాచార్యులదివఱకు దేశస్థులనేకులకువిరోధియైనందున నెట్లైన వారి యనురాగము పడయుటకీపని జేసెనేకానియది నిలుచునదికాదని జనులు గోలుపెట్టిరి. కాని యిప్పటికి నీసభసాగుచునేయున్నది. అతఁడింకను చాలమార్పులుదెచ్చి, దేశమునకు మేలు చేయఁదలఁచెను. కాని 1882 వ సంవత్సరాంతమున జబ్బుపడి చెన్నపురికిఁబోయి యచ్చట మృతినొందెను. అతని నెఱిఁగిన తెల్లవారు నల్లవారు వాని మరణము మహాపదకే గాక దేశమునకంతకు నష్టకారియని వగచిరి. బ్రతికియుండఁగానతని మీఁద నెన్నోయపనిందలు మోపి వేధించిన మైసూరుజనులు తరువాత వాని సుగుణసంపద తెలిసినవారై బిట్టు వగచిరి.

సేలము రామస్వామి మొదలియారు

రామస్వామి మొదలియారి 1852 వ సం॥రము 6 వ శెప్టెంబరు తారీఖున సేలములో జన్మించెను. అతఁడు సేలములో మిక్కిలిగౌరవముగల కుటుంబములోఁ జేరినవాఁడు. ఈతని ముత్తాతయగు వెంకటాచలము మొదలియారి మన దేశమును పూర్వము పాలించిన యీస్టిండియాకంపెనీయొద్ద దుబాసిగానుండెను. ఈయనతండ్రి గోపాలస్వామి మొదలియారి, గొప్పయినాందారై యుండుటయేగాక చాలకాలము తహసిలుదారుగనుండి 1867 వ సంవత్సరమందు పించను పుచ్చుకొనెను.

రామస్వామి మొదలియారి ఆఱవయేఁటనే విద్యాభ్యాసము నిమిత్తము చెన్నపట్టణమునకంపఁబడెను. ఈతఁడు మొట్టమొదట చెన్నపట్టణపు హైస్కూలులోఁ జేరి చదువనారంభింప నాపాఠశాలలోఁ గ్రిందితరగతులు తీసివేసినందున పచ్చయ్యప్పపాఠశాలలోఁ జేరిచదివెను. అక్కడ కొంతకాలముచదివి రామస్వామి ప్రసిడెన్సీకాలేజిలోఁ జేరి విద్యముగియువఱకు నక్కడనేచదివెను. ఆకాలమున నతఁడు మిక్కిలి చుఱుకుతనముగలవాఁడై యుపాధ్యాయుల దయకుం బాత్రుఁడై బుద్ధికుశలతవల్ల ననేకబహుమానములనందెను. ప్రవేశపరీక్షలోఁ గృతార్థులైన మొదటిపదునైదుగురిలో నొకఁడై యుండుటంజేసియతనికిదొరతనమువారు విద్యార్థివేతనము నిచ్చిరి. ప్రథమశాస్త్రపరీక్షయందతఁడాసంవత్సరము మొదటివాఁడుగఁగృతార్థుఁడయ్యెను. అనంతరము పట్టపరీక్షయందుఁగూడ నతఁడు మొదటితరగతిలో మొదటివాఁడుగ దేఱెను. రామస్వామియొక్క పూనికకును బుద్ధికుశలతకును సత్ప్రవర్తనమునకుఁ బ్రధానోపాధ్యాయుఁడగు థామ్సనుదొర మిక్కిలిసంతసించి పట్టపరీక్షయందుఁ గృతార్థుఁడైన వెంటనే యాతనికిఁ దనకళాశాలలో నిం



సేలము రామస్వామి మొదలియారి.

ష్టు పండితోద్యోగ మిచ్చెను. కాని తనకంటె తక్కువగా (అనఁగా కొండనవాఁడుగఁ) బట్టపరీక్షయందుఁ గృతార్థుఁడైన యొక మిత్రుఁడు చాల పేదతన మనుభవించుచు నుద్యోగమునకుఁ బ్రయత్నించుచుట యెఱింగి రామస్వామి దయాళువగుటచేఁ దన కాయుద్యోగ మక్కఱలేదని చెప్పి యామిత్త్రున కిప్పించెను.

ఇట్లు 1871 వ సం॥మున నతఁడు పట్టపరీక్షయందుఁ గృతార్థుఁడై విద్యాసక్త యుప్పటికినిఁ బోనందున నాకళాశాలలోనే యుండి యం. యె. (అనఁగా సర్వకళాధికారి) పరీక్షకుఁ జదివి యందు 1873వ సంవత్సరమునఁ గృతార్థుఁ డయ్యెను. అనంతరము బి. యల్. పరీక్షకుం జదివి 1875 వ సంవత్సరమున దానియందును మొదటివాఁడుగఁ దేఱెను. 1875 వ సం॥ము హైకోర్టున వకీలుగాఁ జేయఁబడి రామస్వామి మొదలియారు స్వగ్రామ మగు సేలములోనే న్యాయవాదిగ నుండఁదలఁచి యక్కడ పనిచేయ నారంభించెను. నిగర్వియై పనిజేయుటలో మిక్కిలి ప్రానిక గలిగియుండినందున రామస్వామి జిల్లాజడ్జికిష్టుఁడగుటయే కాక సేలములోనున్న స్వదేశస్థుల కందఱకు మిక్కిలి యిష్టుఁ డయ్యెను. అతఁ డక్కడ కొన్ని మాసములు మాత్రమే పనిఁ జేసి దొరతనము వారి కొలువులోఁ జేర నిచ్ఛగలవాఁడై డిస్ట్రిక్టు మునసబుపనికి బ్రయత్నముఁ జేయ నిశ్చయించుకొని జిల్లాజడ్జిద్వారా దరఖాస్తు పంపఁగా నా దరఖాస్తుమీఁద జడ్జి యాతని నిరుపమానబుద్ధికుశలతనేగాక సత్ప్రవర్తనముంగూడ శ్లాఘించి యన్నివిధములచేత నతఁ డాయుద్యోగమునకుఁ దగినవాఁడని వ్రాసెను. అనంతర మతఁడు 1876 వ సం॥ ననే తిరుచునాపల్లిలో డిస్ట్రిక్టుమునసబుగాఁ జేయఁబడెను. ఈయన నిష్పక్షపాత బుద్ధికి సత్యసంధతకుఁ బేరువడెను. వ్యవహారములలో స్వతంత్రముగాను మనసునకుఁ దోఁచిన విధముగాను పక్షపాతరహితముగాను వర్తింపవలయుననియే యాతని సం

కల్పము కాని యితరులు సిఫారసులుచేసి తనవ్యవహారములలో సాక్ష్యముఁ గలుగఁజేసికొనుట యాతని కెంతమాత్రము నిష్టము లేదు. ఈయన నిష్పక్షపాతబుద్ధిం దెలుపుట కొక చిన్న కథ గలదు. ఒకనాఁ డీయన కోర్టులో నొక వ్యవహారమునం దగులుకొని యున్న యొకమనుష్యుఁడు రామస్వామి మొదలియారి కెవనియెడ మిక్కిలి గౌరవముగలదో యట్టి గొప్పగృహస్థునియొద్దనుండి యొక సిఫారసు జాబుఁదెచ్చి వ్యాజ్యము తన పక్షముఁ జేయుమనికోరెను. మొదలియారి యామనుష్యుని సగౌరవముగ నాదరించి తనయింటనే బసయిచ్చి తనబండిమీఁదనే కూర్చుండఁబెట్టుకొని కోర్టునకుఁ దీసికొనిపోయెను. ఆ గౌరవము నా యాదరణముం జూచి జాబుఁ దెచ్చిన మనుష్యుఁడు వ్యవహారము తనపక్షముగానే తీర్పుచేయఁబడునని యదియెప్పుడు విందునాయని యూఁటలూరుచుండెను. అంతలో మునసబు బెంచియెక్కి యామనుష్యున కాశాభంగముఁ గలుగునట్లు వ్యతిరేకముగాఁ దీర్పుఁ జెప్పెను. అదివిని యామనుష్యుఁడు సిగ్గుపడి రామస్వామి మొదలియారి మొగమైనం జూడక పాఱిపోయెను. ఇట్లు చేయుటయేగాక మొదలియారి యొకటి రెండుసారులు బెంచి మీఁదనుండి వ్యవహారములం జిక్కువడినవారు పెద్దమనుష్యులయొద్దనుండి సిఫారసులందెచ్చి న్యాయాధిపతుల మనస్సుల ధర్మమార్గమునుండి త్రిప్పఁ బ్రయత్నించుట ఘోరమనియు దూష్యమనియు నొక్కపలికెను. ఈవిధముగా నతఁడు మంచిగంధములో నొకయడుగు, నగ్నిహోత్రములో నొకయడుగు బెట్టినను సామెత నిజముగా నెడమప్రక్క కొరుగక కుడిప్రక్క కొరుగక న్యాయమార్గమున ముక్కుకుసూటిగఁ బోయెను.

ఒకసారి తనకచేరిలో సర్కారుసొమ్ముకొంతపోఁగా గుమాస్తాలలో నెవరికే యిబ్బందిరాకుండఁ దనచేతి సొమ్మిచ్చి యాసొమ్ముఁ

ఖూర్తి చేసెను. అటుపిమ్మట సంవత్సరములు మునసబుగానుండి దొరతనమువారి కొలువులోఁ దన తెలివి తేటలు విశేషముగాఁ బ్రకాశించుట కవకాశము లేదని గ్రహించి యాకొలువు మానుకొనెను. అతని కాశాభంగము కలిగినను దొరతనమువారి కొలువుచేయుటవలన నతని సామర్థ్యము న్యాయదృష్టి మొదలగునవి పైయధికారులకు లోకులకుఁ దెలియుటవలన కీర్తిలాభము కలిగెను. అతఁడుద్యోగము రెండుసారులు మానుకొనఁదలఁచినను దమకట్టి యుద్యోగస్థుఁడు దొరకఁడని పైయధికారు లాతని విడువరైరి. ఎట్టకేలకతఁడు దృఢనిశ్చయుఁడై మూఁడవసారి యుద్యోగమును విడిచి 1882 వ సంవత్సరమునఁ జెన్నపట్టణమున హైకోర్టులో వకీలుగాఁ బనిచేయుటకుఁ బోయెను. ఆయన హైకోర్టులో సాధారణముగ నప్పీళ్ళు పుచ్చుకొని వాదము చేయుచుండెను. ఆయనకుఁ దెలిసినట్లు ధర్మశాస్త్రము (లా) మఱియొకరికిఁ దెలియదని యాకాలమున ననేకు లభిప్రాయపడిరి. ఆయన తన పొట్టపోసికొనుటకు మాత్రమే ధర్మశాస్త్రముల నభ్యసింపక యాశాస్త్రమర్మములను సమూలముగాను సమగ్రముగాను దెలిసికొన నభిలాషగలవాఁడై చదివి లాపత్రిక నొకదానిని స్థాపించి దానికితానే ప్రధాన పత్రికర్తుఁడుగా నుండి 1891 వ సంవత్సరము వఱకు నడపెను. చెన్నపట్టణము యూనివరసిటీవారు రామస్వామి మొదలియారియొక్క ధర్మశాస్త్ర పాండిత్యమును ద్రావిడభాషా పాండిత్యమును దెలిసికొని యాయనను బి. యల్. పరీక్షకు, యం. యల్ పరీక్షకు ద్రావిడభాషలో బి. యే. పరీక్షకుఁ బరీక్షకుఁడుగా నియమించిరి.

1887 వ సంవత్సరమున యూనివరిసిటీలో నతఁడు ఫెల్లోగా నియమింపఁబడెను. న్యాయవాదిగ నుండి ధనమార్జించుటతోఁ దనివినొందక మొదలియారి దక్షిణహిందూస్థాన రాజకీయ వ్యవహారము

లలోఁ బ్రవేశించి దేశాభివృద్ధికిఁ జాల కృషిఁ జేసెను. ఈవ్యవహారములలోఁ నతఁడెంత ధైర్యశాలియో యీక్రింది పనివల్లఁ దెలిసికొనవచ్చును. 1883 వ సంవత్సరమునఁ జెన్నపురి గవర్నరుగారి హాలులోచన సభలోని సభికుఁడొకఁడు పించనుపుచ్చుకొని యింగ్లాండునకుఁ బోవ నుద్యుక్తుఁడై యుండఁ జెన్నపురవాసు లాయనను గౌరవించి యుత్సవముగాఁ జేయఁ దలంచిరి. అట్టియుత్సవముఁ జేయుట కూడదని రామస్వామి మొదలియారి నిరాఘాటముగాఁ బలికెను.

చెన్నపట్టణములో స్థాపింపఁబడిన మహాజనసభ, తెల్లవారు నల్లవారిని మునుపటియట్లనాదరముసేయక గౌరవముతోఁ జూచునట్లు చేయుటకు దక్షిణ హిందూస్థానమున స్వదేశస్థులు మొదలు ధైర్యముతో దొరతనమువారికి విన్నవించుటకు ముఖ్యాధారమయ్యెను. ఆమహాజనసభలో రామస్వామి మొదలియారి ప్రధానపురుషుఁడన్న మాట యెల్లవారికి విదితమే.

హిందూదేశ పరిపాలనమునుగూర్చి నిజమయిన స్థితిగతుల నెఱుఁగక యింగ్లాండులోనుండు నాంగ్లేయులకు, యథార్థస్థితిఁ దెలియఁ జేయుటకు మన దేశస్థులలోఁ గొందఱింగ్లాండునకుఁ బోవుట యుచితమని మన దేశాభిమాను లనేకులు తలంచి చెన్నపట్టణమునుండి రామస్వామి మొదలియారిగారిని మనరాజధానికిఁ బ్రతినిధిగాఁ బంప నిశ్చయించుకొనిరి. ఈపనినిమిత్తమే బంగాళమునుండి బాబు సురేంద్రనాథ బెనర్జిగారును బొంబాయినుండి మఱియొకరును బంపఁబడిరి. రామస్వామియు సహ ప్రతినిధులుఁ గలిసి యింగ్లాండులోఁ జాల సభలుచేసి హిందూదేశ వ్యవహారములను వారికి సుబోధకములుగఁ జెప్పిరి. ఇతఁ డక్కడనున్న దినములలో నా దేశస్థులలోఁ గొందఱితని సహాయమున హిందూదేశరాజకార్యములను గూర్చి చర్చలు సలుపుట కొకసభ స్థాపించిరి. ఈతఁడును దక్కినప్రతినిధులుఁ జేసిన యు

పన్యాసములనుబట్టి యాకాలమున హిందూదేశ పాలనమునుగూర్చి యెక్కువపని జేయవలయునని యాంగ్లేయులకుఁ దోఁచెను. తక్కినవారి యుపన్యాసము లట్లుండగా రామస్వామి మొదలియారి యుపన్యాసములు విశేషప్రీతి నింగ్లాండుజనులకొసంగెను. ఏలయన నాయన మొగము కాటుక కన్నులు గలిగి మంచి తేజస్సుగలిగి యెంతో సుందరమై చూచినంత మాత్రముననే యెల్లవారలకు నాతనిమీఁద నాదరము గలుగఁ జేయునట్లుండెను. అతని సంభాషణ మాకారమునకు దగినట్లు గంభీరమై యుండెను. ఇంగ్లాండులోఁ గొంతకాలముండుటచేత రామస్వామి మొదలియారి యాంగ్లేయ భాషాప్రవీణతయు వాగ్ధోరణియు మిక్కిలి యధికము లయ్యెను. హిందువులయెడల నమ్మికయుంచి యాదరముతో రాజ్యపరిపాలనము జేయుఁడని యాంగ్లేయులకుఁ కృపారసముట్టిపడునట్లు జేసినయుపన్యాసములు వారిహృదయములమీఁద ముద్రితములైనట్లుండెను.

రామస్వామి మొదలియారి సముద్రయానముఁ జేసి విదేశములఁ గొంతకాలము గడిపినను హిందూధర్మములకు విరుద్ధములుగ నెన్నఁడు నాచరింపక మద్దేశపు సేవకునొకని వెంటఁబెట్టుకొనిపోయి వాని చేతియన్నమే తిని కాలక్షేపముఁ జేసెను. ఇంగ్లాండు దేశస్థు లనేకులతనిని విందులకుఁ బిలువగా బోవక పోకతప్పనప్పుడు పోయి వారిచేతి మాంసాదులు భక్షింపక కాయకూరలు పండ్లు మొదలగువానిని భక్షించుచువచ్చెను. ఆతనికులస్థులుగూడ నాతని నియమము లిట్టివని యెఱింగి సణుగుకొనక గొణుగుకొనక యనుచితములై యర్థములేని ప్రాయశ్చిత్తముల విధింపక రాఁగానే యతనిం గులములోఁ జేర్చుకొనిరి. రామస్వామి మొదలియారి తిరిగి స్వదేశమునకు వచ్చినప్పుడు చెన్నపురవాసు లాయనయెడఁ జూపిన సన్మానమిట్టిది యని వర్ణింపరాదు. సేలములోఁ జరిగిన సన్మానము చెన్నపురిలో జరిగినదానికంటె వి

శేషముగా నుండెను. ఇంగ్లాండునుండి స్వదేశమునకు వచ్చినతోడనే యాతనిపై మఱియొకకార్యభారము పడెను.

188౬ వ సంవత్సరమున గవర్నమెంటువారు పబ్లికు సర్వీసు కమీషన్ అనుపేర నొకసభ నేర్పఱచిరి. ఆసభలోఁ గొందఱు తెల్లవారు మేటికెక్కిన స్వదేశస్థులుకొందఱు సభ్యులుగా నియమింపఁబడిరి. సర్ రొమిశ్చంద్రమిత్రు బంగాళమునుండియు, సర్కారనునతఁడు బొంబాయినుండియుఁ జెన్నపురమునుండి రామస్వామి మొదలియారియు మఱియొకచోటనుండి భీంగారాజు సభికులుగా నియుక్తులయిరి. ఈసభ చేయవలసినపని యేమనఁగా దొరతనమువారి కొలువులో నదివఱకు స్వదేశీయు లెందఱున్నారో విశేషముగా వారినిఁగొలువులోఁ జేర్చుకొనవలయునా, లేదా యెట్లు చేర్చుకొనవలయు ననువిషయములంగూర్చి విచారణచేసి దొరతనమువారికి రిపోర్టుపంపుట. రామస్వామి మొదలియారి యప్పటికి ముప్పదియాఱేండ్ల వయసు గలవాఁడయినను మిక్కిలిలోకానుభవము గలపెద్దలతో సమానముగఁ గార్యనిర్వహణముఁ జేసెను. ఎంతోగొప్పబుద్ధిశాలియైనం గాని దొరతనమువా రంత చిన్నవానినంత గొప్పకమీషనులోఁ గూర్చుండఁబెట్టరు. పెట్టినందు కతఁడు తీసిపోక తగినట్లు పనిచేసెను.

ఈయన దేశీయమహాసభమీఁదఁగూడ చాలనభిమానముకలిగి పనిచేసెను. ఒకసంవత్సర మీయనను దేశీయమహాసభ కధ్యక్షుఁడుగా నుండవలయు నని తత్సభానిర్వాహకులు కోరఁగా నితఁడాగౌరవంబునకుఁదగినవారు తనకంటె పెద్దలున్నా రని నిరాకరించెను. అంత దేశాభిమానము నంతవిద్య నంతయోగ్యత యంతధైర్యముఁగలయీ సత్పురుషుని నలువదియేండ్లు నిండినతోడనే మృత్యుదేవత 1892 వ సంవత్సరము దనపాల్పెట్టుకొనియె. ఇందుచేత దక్షిణహిందూదేశము దురదృష్టవంతమని చెప్పనొప్పు.

సర్. కె. శేషాద్రి అయ్యరు

ఈయనబొమ్మ దొరకలేదు. శేషాద్రియ్యరు చెన్నపురిరాజధానిలో మలబారుజిల్లాలోనున్న పాలఘాటునకు సమీపమందున్న కుమారాపురముగ్రామమున 1845 వ సంవత్సరము జూనునెల యొకటవ తేదీని జన్మించెను. ఆయన కల్లికోటలోనున్న దొరతనమువారి పాఠశాలలో మొట్టమొదట విద్యాభ్యాసము చేసెను. ఆపాఠశాల గోడలమీఁద నిప్పటికిని నీయనపేరు బంగారువర్ణములతో వ్రాయఁబడి మెఱయుచున్నది. అక్కడ చదువు ముగిసినపిదప నతఁడు చెన్నపురికిఁబోయి ప్రిసిడెన్సికాలేజిలోఁ జేరి 1866 వ సంవత్సరమునఁ బట్టపరీక్షయందు కృతకృత్యుఁడయ్యెను. తరువాత కొన్నియేండ్లకాయన బి. యల్. పరీక్షలోఁగూడ కృతార్థుఁడయ్యెను. విద్యముగిసినపిదప శేషాద్రియయ్యరు మలబారుజిల్లాకలెక్టరగు బెలర్డుదొరచెంత నతనికచేరీలో భాషాంతరీకరణముఁ (తర్జుమా) జేయునుద్యోగస్థుఁడుగా నియమింపఁబడెను. కాని శేషాద్రి చిరకాల మాయుద్యోగములో నుండలేదు.

శేషాద్రి చదువుకొన్నకాలమునందే రంగాచార్యులతో స్నేహము చేసెను. అందుచేత రంగాచార్యులు మైసూరు సంస్థానమున నుద్యోగము సంపాదించినప్పుడు శేషాద్రినిఁ బిలిపించియష్టగ్రామమండల మండలాధికారియొద్ద శిరస్తాదారుగ నేర్పరచెను. శేషాద్రి మైసూరు సంస్థానమున గొప్పపేరు సంపాదించుటకు మిక్కిలియవకాశ ముండెను. సహజముగబుద్ధిసూక్ష్మతయుమంచిపూనికయుఁగలవాఁడగుటచే నయ్యరు తనపాలఁబడిన కృత్యములెల్ల నతిశ్రద్ధతో నెఱవేర్చుచు వచ్చెను. ఆయన ప్రవేశించు నప్పటికి మైసూరుప్రభువు బాలుఁడై సం

దున నాంగ్లేయదొరతనమువారి పాలనలో నుండెను. ఈయనచేరినపదమూఁడేండ్లకు యుక్తవయసు ప్రాపించినందున సంస్థానము మహారాజున కప్పగింపఁబడెను. ఈ పదమూఁడేండ్లలో శేషాద్రియ్యరు చాల డిపార్టుమెంటులలోఁబనిచేసి పరిపాలనవిధాన మంతయు నేర్చుకొనెను. 1873 వ సం॥రమునందు మైసూరులో జ్యూడిషల్ కమీషనరుగానుండిన సర్ జేమ్సుగార్డన్ దొర శేషాద్రిని తనకోర్టులోఁ బెదశిరస్తాదారుగ నియమించెను. అనంతర మతఁడా సంస్థానమున నశిస్టాంటు కమీషనరుగా నేర్పాటుపఁబడెను. ఆయుద్యోగమున మూఁడేండ్లున్నపిదప నాయనమహారాజుగారి మందిరమునకు కంట్రోలరుగ నేర్పాటుపబడెను. ఆయుద్యోగములోనుండి యతఁడు తుముకూరుజిల్లా డిప్యూటీ కమీషనరుగాను జిల్లామేజస్ట్రీటుగాను మార్పఁబడెను. ఈయుద్యోగమునందు శేషాద్రియ్యరు దేశపరిపాలనమునందు తనకుఁగల సామర్థ్యమునుఁజూపుటకు విశేషముగా నవకాశము కలిగెను. ఆ సామర్థ్యమును జూచి పైయధికారులు శేషాద్రిజిల్లాకలెక్టరు పదవియందేగాక దానికంటె నెక్కువపదవులయందు నిలుపఁబడఁదగినవాఁడని గ్రహించిరి.

సంస్థానము మహారాజుగారి కప్పగింపఁబడిన తరువాత రంగాచార్యులు మంత్రియయ్యెను. మంత్రియైనతోడనే యాయనచట్టములు శిక్షాస్మృతులు నిబంధనలు మొదలగునవి వ్రాయుటకు బుద్ధిశాలియగు శేషాద్రయ్యరు నేర్పఱచెను. రంగాచార్యులు సుఖించుటకు మంత్రి కాలేదు. ఆతఁడు చేయవలసిన కార్యములు విశేషముగానుండెను. రంగాచార్యులు మిక్కిలి సమర్థుఁడు. విశేషించి సత్పరిపాలనము చేసి సత్కీర్తి సంపాదింపవలయుననుకోరిక కలవాఁడు. కావున నెంతోఁ జేయవలయునని కొండంతయాశతోఁ బరిపాలన మారంభించెను. దేశముయొక్కధనస్థితిబాగుచేయుట కాయన మెన్నొక్రొత్తయేర్పా

టాలు జేసెను. మంత్రిగానున్న రెండేండ్లలోనే తానుబ్రతికియున్న పక్షమునజనులకుఁగలుగుసౌఖ్యముఁ లెట్లుండునో కొంతవఱకును చూపెను. కానిమైసూరుసంస్థానవ్యవహారములనునడపుటకు మిక్కిలిగడితేరిన దిట్టకావలసినసమయమందే దేశస్థులదురదృష్టమున రంగాచార్యుఁడు కాలధర్మమునొందెను. రంగాచార్యుఁడు బ్రతికియున్నప్పుడే శేషాద్రియ్యరు ముందుమిక్కిలి కాఁగలవాఁడని యాతనిమీఁద నెంతో యాసపెట్టుకొనియుండెను. రంగాచార్యుఁడు పోయినపిదప శేషాద్రి యాస్థానమునఁ గూర్చుండుట కర్హుఁడగునా కాఁడా యని గొప్ప సందేహము కలిగెను. కాని కాలమే యెల్ల సందేహములనుబాపి శేషాద్రియ్యరు మొదట జనులనుకొన్నదానికంటె నెక్కువసమర్థుఁడని నిరూపించెను. 1883 వ సంవత్సరము ఫిబ్రవరు 12 వ తారీఖున శేషాద్రయ్యరు మైసూరు సంస్థానమునకు మంత్రిగా నియమింపఁబడెను.

మంత్రియగు నప్పటి కతఁడు పడుచువాఁడగుటచేతను వెనుకటి మంత్రిచేయవలసిన మార్పులకెల్ల దారిఁజూపించుటచేత నీతనికిఁబరిపాలనము సులభమయ్యెను. అప్పటికాయనముప్పదియెనిమిదియేండ్లవాఁడు. కావున తానుచేసిన మార్పుల ఫలములు కన్నులారఁ జూచుటకు ననుభవించుటకుఁ జిరకాలముజీవించెను. ఆకస్మికముగాగొప్పరాజ్యమను నావయొక్క చుక్కానిను ద్రిప్పవలసిన వాఁడగుటచే నతఁడు క్రొత్తదారులంబోవక రంగాచార్యుఁడుచూపిన మార్గములనేనడచి యతఁడు వేసినపద్ధతులనే యవలంబించిపరిపాలింపఁదొడఁగెను. సంస్థానము మహారాజున కప్పగింపఁబడకపూర్వము 1877 వ సంవత్సరమున దేశమున గొప్ప కాటకముసంభవించెను. ఆకటిబాధల నివారించుటకు సంస్థానమునకు ముప్పదిలక్షలరూపాయ లప్పయ్యెను. ఈయప్పు నింగ్లీషు దొరతనమువారే యిచ్చిరి. అందుచేత నేఁటేఁట దానివడ్డి నిచ్చుకొను భారమేకాక మఱియొకసారికాటకముసంభవించునప్పుడు జనక్షయము

కాకుండుట కేర్పాటులు చేసికొనవలసిన భారముగూడ సంస్థానముపైఁ బడెను. కాటకములను వారించుటకు రంగాచార్యులు దేశమున నినుపదారి ప్రబలముగా వేయింప నారంభించెను. శేషాద్రియ్యరుగూడ నాతని మార్గమే యవలంబించి యినుపదారులను వేయింపసాగెను. ఆయన మంత్రియైన రెండుసంవత్సరములలో పున దేశమున రమారమి నూట నలుబదిమైళ్ళపొడవుగల యినుపదారి వేయఁబడెను. దానినిమిత్తమైన కర్చులలో నిరువదిలక్షలుమాత్రమే ఋణమయ్యెను. తక్కినధనము సంస్థానపుటాదాయమునుండియే వ్యయముచేయఁబడెను. ఈయినుప దారివలనఁ బోగుపడినధనము నతఁడు మఱికొన్ని మండలములలో నినుపదారులు వేయించుటకుగా వినియోగించెను. నాలుగేండ్లతరువాత బెంగుళూరు హిందుపురినినుపదారి సమాప్తమయ్యెను. అదివఱకు క్షామములకు మిక్కిలి జడిసిన మండలములన్నియు నినుపదారులచేతఁజుట్టు వడి యెన్నికఱవులువచ్చినను భయములేని స్థితిలో నుండెను. ఆయన యధికారమును బూనునప్పటికి దేశమున రమారమియేఁబదియెనిమిది మైళ్ళయినుపదారియుండెను. 1901 వ సంవత్సరమం దాయనయుద్యోగము మాను నప్పటికి నాలుగువందల మైళ్ళ యినుపదారి వేయఁబడి యుండెను.

ఈయన చేసినపని యొక్కయినుపదారియేకాదు. పొలములకు జక్కని నీటిపాఱుదలఁ గలిగించుట కీయన విశేషశ్రమపడెను. ఆయన పరిపాలన మారంభించిన మొదటి పన్నెండుసంవత్సరములలో నురమారమి కోటిరూపాయలను ఖర్చుపెట్టించి మూఁడువందలయేఁబదియైదు చదరపుమైళ్ళభూమిని దంపసాగుబడిక్రిందికిఁదెచ్చెను. ఇట్లు తెచ్చుటవల్ల సంస్థానమునకు సంవత్సరమున కెనిమిదిలక్షలరూపాయల శిస్తు లధికముగాఁ జెల్లుచువచ్చెను. ఖర్చులుతగ్గించుట, క్రొత్తమార్పులు చేయుటయేక కాలముననే జరుగుచువచ్చెను. అందుచేత సంస్థానముధ

సవిషయమున దినదినము మహాద్భుతముగా వృద్ధిపొందెను. ఆయనయ ధికారమును బూనునప్పటికి సంస్థానమునకున్న ముప్పదిలక్షలఋణము 1888 వ సంవత్సరమున ననఁగా నైదేండ్లనాఁటికి సంపూర్ణముగఁ దీర్చివేయఁబడెను. తరువాత నేఁడేండ్లకనఁగా 1895 వ సంవత్సరమున శేషాద్రియయ్యరు జనప్రతినిధిసభను బిలిపించి యాసభికులతో సంస్థానముయొక్క స్థితిగతులఁ జెప్పినసందర్భమున నప్పటికి సంస్థానపుఖజానాలో నొకకోటి డెబ్బదియాఱులక్షల రూపాయలు నిలువయున్నవని చెప్పెను. 1883 వ సంవత్సరమున ననఁగా నీతఁడు క్రొత్తగా మంత్రియైనసంవత్సరము సంస్థానమునకువచ్చిన శిస్తుకోటిముప్పదిలక్షలు. శేషాద్రియయ్యరు మంత్రిపదవినిమానుకొనినప్పుడు సంస్థానముయొక్క శిస్తుకోటియెనుబదిలక్షలు. ఇట్లతిశయమైన శిస్తుపన్ను లెక్కువకట్టుటవలననఁగాని ప్రజలంబీడించుటవలననంగాని రాలేదు. శేషాద్రియయ్యరు నిరంతర మభివృద్ధిమీఁదనే దృష్టినిలిపి, పన్నులయొత్తుడు ప్రజలకుఁగలుగనీయక సంస్థానమునకు ధనలాభముకలుగు నుపాయములు వెదకుచు నట్టిపనులందుఁ జాగ్రత్తతోఁ బ్రవేశించుచువచ్చెను. ఇంజనీరింగు డిపార్టుమెంటువారినిఁ జాలప్రోత్సాహముఁ జేసి క్రొత్తజలాధారములు దేశమునకుఁ గల్పించెను. ఎక్కువజాగ్రత్తయుఁ దక్కువ ధైర్యముగల మంత్రులుసాధారణముగాఁ బ్రవేశింపనొల్లని దుర్లభకార్యములలో నీతఁడవలీలగాఁ బ్రవేశించెడువాఁడు. ఈయనచొరవఁజేసి ప్రవేశించుటచేతనే బెంగుళూరు జనులు హాయిగాఁద్రాగుటకు నీమంచినీరు లభించెను. ఈయన చొరవచేయనిచో హగారినదిమీఁద నానకట్టుకట్టఁబడకయుండును. ఈ యానకట్టువలన ముప్పదిమైదుమైళ్ల చతురముగలచెఱువేర్పడెను. ఈ చెఱువువలన నెన్నోయకరములనేల సాగుబడియగుచున్నది. ఇవిగాక యీయన యుద్యోగముచాలించుకొనక మునుపు మఱియొకపెద్దయెత్తునెత్తెను. కావేరీనది కొండలనుండి క్రిందికిదిగు చోటనుండియంత్రాది

సాధనములవలన వగీజలమును మైసూరు సంస్థానమునకుఁ జక్కఁగాఁ బ్రిసహింప జేయవలయునని యాయన సంకల్పించెను. దీనివలన మైసూరు సంస్థాన మిప్పటికంటె రెట్టింపు భాగ్యవంతమగును. ఈయన మంత్రిగానుండిన పదునెనిమిది సంవత్సరములలోను నీటిపాఱుదలం గూర్చి యాయన ఖర్చుచేసినసొమ్ము రమారమి నాలుగుకోట్లరూపాయలు. కాలమున కనుగుణముగా నుండునట్లు శేషాద్రియ్యరుఁగూడ నెన్నియో క్రొత్తడిపార్టుమెంటులఁ గల్పించి వాటిలోఁ బనిచేయుటకుఁ దన దేశమున సమర్థులు లేనప్పుడు విదేశములనుండి ప్రకృతిశాస్త్రజ్ఞానము లోకానుభవముంగల సత్పురుషులం బిలిపించుచు వచ్చెను. మునుపున్న డిపార్టుమెంటులంగూడ పైనుండి క్రిందికిఁ బరు సంపూర్ణముగా మార్చివేసెను. మైసూరు సంస్థానమున కోలారుజిల్లాలో బంగారపు గనులు కలవు. ఈగనులను యూరోపియనులు కౌలుకుఁ బుచ్చుకొని పూర్వము సంవత్సరమున కేబఁదివేల రూపాయలచొప్పున మహారాజావారి కిచ్చుచుండువారు. శేషాద్రియ్య రాగనులను దిప్పుటలో మఱింత ప్రోత్సాహము గలిగించి యిప్పుడు సంవత్సరమునకుఁ బదునైదులక్షల రూపాయలు రాఁబడివచ్చునట్లు చేసెను. ఎంతబుద్ధిశాలియైన నెంతబలవంతుఁడైన మనుష్యుఁడు మతజ్ఞుడేగాని సర్వజ్ఞుఁడు కాఁడుగదా! అందుచే శేషాద్రియ్యరు రాజ్యపరిపాలనములోఁ బెక్కులోపములు చేసియుండవచ్చు. రైతులకుపయోగకరముగా నుండుటకీయన కృషినిధులను స్థాపించెను. కృషినిధులనఁగా రైతులకుమిక్కిలి తక్కువ వడ్డిని యప్పులిచ్చెడు బ్యాంకులు. పంటకాఁపులు సాధారణముగా నూటికి రూపాయి యెనిమిదణాలు రెండురూపాయిలు వడ్డికి సొమ్ము దెచ్చుకొని యాఋణము దీర్చలేక నానాఁటికి దుస్థితిలోనికి వచ్చుటఁ జూచి వారి స్థితి బాగుచేయుటకీయన యీనిధులఁ గల్పించెను. కాని యవి యనుకొన్నంత

కార్యకారులు కాలేదు. ఇంక నతఁడు చేసిన ప్రయత్నములలో నెఱవేఱనివి కొన్ని యున్నవి. కాని నెఱవేఱిన కార్యము లనంతములుగా నుండుటచేఁ జెడిపోయినవానిని మన మెత్తుకొన నక్కఱలేదు. మైసూరు నిప్పుడున్న స్థితికిఁ దెచ్చిన మహనీయుఁ డీయనయే యని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. శేషాద్రియ్యరుయొక్క సత్పరిపాలనము మైసూరు ప్రభువుయొద్దనుంచి ప్రజలయొద్దనుంచి మెప్పులుదెచ్చుటయే గాక యింగ్లేయప్రభుత్వము వారియొద్దనుంచికూడ నాయనకు మెప్పులు తెచ్చెను.

1887 వ సంవత్సరము ఫిబ్రేవరు నెలలో గవర్నరు జనరలుగారగు ఢఫెరిను ప్రభువుగారు మైసూరుసంస్థానమునకుఁ బోయి మంత్రికి సి. యస్. ఐ. యను బిరుదమిచ్చిరి. అనంతరము 1893 వ సంవత్సరమున గవర్నరు జనరలుగారగు సెలిడను ప్రభువుగా రాయనకు కె.సి. యస్. ఐ. యను బిరుద మిచ్చిరి. వెనుకటి మైసూరుమహారాజుగారు శేషాద్రియ్యరుకు రాజ్యధురంధరుడను బిరుదమిచ్చిరి. ఆమహారాజుగారు 1894 వ సంవత్సరమున మృతినొందఁగాఁ గుమారుఁడు బాలుఁడయినందున నిండి మూగవర్ని మొటులువారు దేశపరిపాలనముజరుపుటకు కవున్సిలు ఆఫ్ రీజన్సీయను నొకసభ నేర్పరచి యాసభకు శేషాద్రియ్యరు నధ్యక్షునిగ నేర్పఱచిరి. చెన్నపురి యూనివరుసిటీవారు 1887 సంవత్సరమున నాయన నొక ఫెల్లోగాఁ జేసిరి. నిరంతరమగు కార్యభారముచేత నాయన శరీరారోగ్యము క్రమక్రమంబుగ చెడుటం జేసి యాయన 1900 సంవత్సర ప్రారంభమున నుద్యోగము మానుకొనెను. మొత్తముమీఁద నీతఁడు మైసూరుసంస్థానములో ముప్పదిరెండేండ్లు పనిజేసెను. అందుబదునేడేండ్లు మంత్రిపదవియందేయుండెను. చిరకాలమునుండి యాయనశరీరమునకుగావలసిన విశ్రాంతి యిప్పుడు లభించుటచేత శేషాద్రియ్యరు చాలకాలము జీవించుననియు నాయన జీవితములో భుక్తశేషముఁగూడ లోకోపకారార్థమే వినియోగపడుననియు

నెల్లవారలుఁ దలంచిరి. కాని దైవమది యోర్వఁడయ్యె. సరిగా రెండుసంవత్సరము లైనను విశ్రాంతి సౌఖ్యము లనుభవింపక ముందే 1901 సెప్టెంబరు పదమూడవ తారీఖున మిత్రమండలము నకును బంధుకోటికి నపారదుఃఖము కలుగునట్లు శేషాద్రియ్యరు స్వర్గస్థుఁడయ్యెను.

శేషాద్రియ్యరు మిక్కిలి ప్రసిద్ధుఁడు. ఆయనచరిత్ర మంతకన్న ప్రసిద్ధము. దక్షిణదేశము మంత్రులకుం బుట్టిన యిల్లని భరతఖండమున వాడుక కలదు. ఏలయన నీదక్షిణ దేశముననేగదా దివాను రంగారావు రాజా మాధవరావు, వెంబాకం రామయ్యంగారు దివాను రంగాచార్యులు మహామంత్రి శేషాద్రయ్యరు మొదలగువారు పుట్టి పెరిగి మహాధికారము జేసినది. పైనుదాహరింపఁబడినవారందఱు మంత్రులుగానుండినను వారియందఱకంటె శేషాద్రియ్యరునకు రెండులాభము లెక్కువ కలిగెను. అందు మొదటిదేదన శేషాద్రియ్యరు మైసూరుసంస్థానమునఁ జిరకాలము పనిజేయుట కవకాశము కలిగెను. తక్కినవారి కీయవకాశము గలుగ లేదు. రంగాచార్యులు రెండు సంవత్సరములుమాత్రమే మంత్రిపనిఁజేసెను. మాధవరావు తిరువాన్కూరునందుఁ గొంతకాలము బరోడాలోఁ గొంతకాలము మంత్రియైయుండెను. కాని నిరంతరాయముగ నొక్కచో నింతకాముపనిచేయలేదు. శేషాద్రయ్యరు పదునేడుసంవత్సరములు మంత్రిగాను తత్పూర్వము పదునైదువత్సరములు వేరువేరు పదవులలో నుద్యోగిగాను మైసూరునందేయుండుటచేత సంస్థానముయొక్క గుట్టుమట్టులు దేశస్థుల యాచారవ్యవహారములు దెలిసికొనుటకు, తెలిసికొని వలయునెడల దేశకాలపాత్రముల ననుసరించి మార్పులఁ జేయుటకు నవకాశము కలిగెను. రెండవలాభమిది. హిందూదేశమునందు మంమంత్రులైన మహనీయులు విద్యావిషయమున ముత్తైగలుగ నున్నా

అది యెట్లన్న నాంగ్లేయవిద్య జక్కగా నేర్వక మంత్రులై

యనంతర మాభాసనేర్చికొని మొత్తముమీఁద స్వభాషలోనే వ్యవహారము నడిపినవారు కొందఱు. ఇందులో గ్వాలియరు మంత్రియైన దినకరరావు, హైదరాబాదునకు మంత్రియైన సలారుజంగును జేరుదురు. బి. యే. బి. యల్. మొదలగు పరీక్షలయందుఁ గృతార్థులు కాకపోయినఁ దమకాలమునాఁటికున్న యాంగ్లేయవిద్యనభ్యసించివ్యవహార మింగ్లీషులోనే కట్టుదిట్టముగ నడిపినవారు కొందఱు. మాధవరావు రంగాచార్యులు రామయ్యంగారుమున్నగువారీ తెగలోనివారు బి.యే; బి.యల్ మొదలగుపరీక్షలయందు కృతకృత్యులైమంత్రులై నవీనపద్ధతుల ననుసరించి వ్యవహారములు నడపినవారు కొందఱు. శేషాద్రియ్యరీ తెగలోఁ జేరును.ప్రకృతిశాస్త్రములు నేర్చికొన్న ఫలము శేషాద్రయ్యరు తనపరిపాలనమునం గనఁబఱచెను.

ఎవరిమంత్రిత్వమేవిధముగనున్న దోపోల్చి చెప్పుటచాలకష్టముకాని శేషాద్రయ్యరునకు దక్కినమంత్రులకునెంతభేదమున్నపక్షమున నదిముఖ్యముగి నొకదానియందగపడుచున్నది. దినకరరావుమాధవరావుమొదలగుప్రాచీనమంత్రులుతమయధికారముక్రిందికివచ్చిన దేశములలోఁ గ్రమస్థితి లేనిచోటఁగ్రమస్థితినెలకొలుపుచుజెడియున్న తావులను జక్కజేయుచువచ్చిరి. శేషాద్రియ్యరన్ననో యతఁడువచ్చునప్పటికి దేశము క్రమస్థితిలోనే యున్నందునఁ జేతిపనులు వాణిజ్యము మొదలగునవి వృద్ధిజేసి సంస్థానముయొక్క ధనస్థితి బాగుపఱచి రాజ్యమును ధనవంతముగఁ జేసెను.

శేషాద్రియ్యరు స్థిరమనస్సుగలవాఁడు ఎవరేగాని నెదిరించిన కొలఁది నాతనిపట్టుదల యధికమయ్యెడిదఁట. పరేంగితజ్ఞాన మాయనకున్నట్లు మఱెవ్వరికి లేదనిచెప్పుదురు. అందుచేతనే లక్షణములంగనిపెట్టి తగినవారినే తనక్రిందియధికారులుగ నేర్పఱచుకొనెను. ఒకరిమీఁదక్రోధము మఱియొకరిమీఁద దయ యనుపక్షపాతము లాయనకడ లేవు.

అన్నియుఁ దెలిసినవాఁడయ్యు నీతఁడొకచిన్నపొరపాటుఁ జేసెను. గొప్పయుద్యోగములలో మైసూరులోఁబుట్టిన జనులను బ్రవేశపెట్టకయాతఁడు తఱచుగాఁ జెన్నపురిరాజధానిలోని వారినే తెచ్చి ప్రవేశపెట్టెను. ఆదేశస్థులనే బ్రవేశపెట్టినచో వారిజాతిమత పక్షపాతముగలిగి వర్తింతురనియు విద్యలో విశేషముగనారి తేరినవారుగాకపోవుటచేనసమర్థులనియుఁ దలంచి యాయన విదేశస్థులఁ దెచ్చినచో వారుపక్షపాతములేక ప్రజ్ఞాఢ్యులైయుందురని తలంచి యట్లుచేసెననియు నది పొరబాటుకాదనియు నాయనపక్షమువారు తలంతురు. కారణమేమయినను శేషాద్రయ్యరు మైసూరుజనుల కిష్టుఁడు గాకపోయెను. ఇతఁడు సంస్థానముయొక్క క్షేమమునే గోరెను. స్వలాభముజూచుకొని పని చేయలేదని శత్రువులైన నొప్పుకొందురు.

ఆయనయెల్లప్పుడు నీతిపరుఁడై వ్యవహరించెను. రాజకార్యములతో స్వకార్యముల నెన్నఁడు నాయనకలిపి యెఱుఁగఁడు. తనసొంత సొమ్మునుఁ జెన్నపురములో నున్న బ్యాంకులో వేసికొననేకాని మైసూరుసంస్థానపు బ్యాంకులో నెన్నఁడు వేసికొనలేదు. చిరకాలము వేలకొలఁది రూపాయలు గల యుద్యోగములు చేసినను శేషాద్రియ్యరు పనిమానుకొనునప్పటికి దనపదవి వహించిన వారియందఱికింటె పేదవాఁడుగ నుండెను. అందుచేత మైసూరుమహారాజుగారాయనకు నాలుగు లక్షలరూపాయలు రొక్కమును నెలకు రెండువేల రూపాయలుపకారవేతనమును దయచేసిరి. మాధవరావు మొదలగు వారు తాము మంత్రులై యున్న దేశములలో జీవితకాలశేషమును గడపక స్వదేశములకుఁ బోవుచు వచ్చిరి. శేషాద్రియ్యరట్లుచేయక యే దేశపుసొమ్ము తాను తినెనో యాదేశమునందే తన ధనమంతయు ఖర్చుపడవలయునని యుద్యోగమును మానిన వెనుకఁగూడ స్వదేశమునకుఁబోవక మైసూరులోనే గాఁపురముండెను. ఈయన గొప్పపరీ

కులయంకుఁ దేశీనను మతవిషయమునఁ బ్రాచీనులలోఁ జేరిన వాఁడు. ఇంటియొద్ద పరమనిష్ఠుఁడై వ్యాఘ్రచర్మముఁగప్పుకొని విభూతిపిండికట్లు బెట్టుకొని మహేశ్వరధ్యానము సేయుచుండును. మృతినొందునప్పుడు నయితమీాయన తనశరీరము బులితోలుతోఁ గప్పి దహనము జేయుమని బంధువులను బ్రార్థించెనఁట. మతవిషయమునందంత పట్టుదల కలదని యీాతఁడు వ్యవహారవిషయములలో నెన్నఁడు జాతిమత భేదములను బాటించినవాఁడు కాఁడు. వ్యవహారములలోఁదురక, క్రైస్తవుఁడు, మాలవాఁడు, బ్రాహ్మణుఁడు కూడనాయన దృష్టికి సమానులే.

పెంబాకం రామయ్యంగారు

ఈయన 1826 వ సంవత్సరమందుఁ జెన్నపట్టణమున జన్మించెను. సర్ తామస్ మన్రోగారు గవర్నరుగానున్న కడపటి దినములలో నీయనతండ్రి రివిన్యూబోర్డులో రికార్డు కీపరుగా నుండెను. ముగ్గురన్నదమ్ములలో రామయ్యంగారు కనిష్ఠుఁడు. తక్కిన సోదరులిద్దఱు మేనమామయైన వెంబాకం కృష్ణయ్యంగారియొద్దఁ బెరుఁగుచు వచ్చిరి. ఈకృష్ణయ్యంగారు మనదేశము కంపెనీవారు పరిపాలించెడు దినములలోఁ దూర్పుసముద్రపు రేవులలో ధాన్యాదులవర్తకముఁ జేయుచుండెను. చిన్నప్పుడు రామయ్యంగారు మంచియారోగ్యము లేక తఱుచుగ జబ్బుపడుచు వచ్చినందునఁ దలిదండ్రు లాయనను గొన్నిసారులు పాలారునదీ తీరమందు నీవరము గ్రామమందున్న మేనమామయొద్దకును గొన్నిసారులు చెంగల్పట్టుయొద్దనున్న స్వగ్రామమగు వెంబాకమునకును నీటిమార్పు గాలిమార్పుల నిమిత్తము పంపుచువచ్చిరి. చిన్నజీతములు పెద్దకుటుంబములుఁ గల గృహస్థుల కే దినములలో నైనను బిడ్డలకు గొప్పవిద్యఁ జెప్పించుట కష్టముగదా. కాని ముందు వెనుకలు చక్కఁగాఁ దెలిసినదియు మితవ్యయము యొక్క యుపయోగ మెఱిఁగినదియుఁ బరమశాంతయు యోగ్యురాలునగు రామయ్యంగారితల్లి సొమ్ము క్లుప్తముగా వ్యయముఁజేసి కుటుంబముఁ గడపి కుమారునకు నాదినములలో నున్న మంచివిద్యఁ జెప్పించెను. 1841 వ సం॥ న ఎల్ఫినిస్టన్ ప్రభువు గవర్నరుగా నున్నప్పుడు చెన్నపట్టణమందు గవర్నమెంటువా రొకహైస్కూలు స్థాపించిరి. అది బయలు దేఱఁగా నందులో నాలుగురు విద్యార్థులు చేరిరి. అందులో రామయ్యంగా రొక్కరు. ఆయన సహాధ్యాయులైన

తక్కినవారైదుగు రెవరనఁగా 1. మహామంత్రియైన రాజా సర్ టి. మాధవరావుగారు, 2. చెన్నపట్టణపు హైకోర్టులో మొదటిప్లీడరు, గవర్నరుగారి శాసన నిర్మాణ సభలో మొదటి స్వదేశసభికుఁడు నగు శ్రీనరసింహాచార్యులు, 3. దక్షిణహిందూస్థానమున విద్యాధికుఁడని పేరు వహించిన తారీద్దౌలగారు, 4. తిరువాన్కూరు సంస్థానమందలి హైకోర్టులో జడ్జిగాఁ జిరకాల ముండిన సదాశివపిళ్ళెగారు, 5. గొప్పవిద్వాంసుఁడని పేరుపొంది బ్రతికినన్నాళ్ళు రోగములతోఁ దీసికొనుచు స్వల్పకాలమే జీవించిన దీనదయాళు నాయుఁడు.

ఈ యేఁడుగురు విద్యార్థులుఁ బరీక్షలో ఘనముగాఁ గృతార్థులైరి. ఆహైస్కూలు ప్రధానోపాధ్యాయుఁడగు పవెలుదొర తన విద్యార్థులు బుద్ధివిశేషముఁ గనిపెట్టి వారికిఁ బాఠశాలలోఁ జెప్పెడు చదువుగాక యింటియొద్దగూడ ప్రకృతిశాస్త్రము మొదలగునవి చాలవఱకుఁ జెప్పెను. ఆదినములలోనె రామయ్యంగారు ప్రకృతిశాస్త్రమును జ్యోతిషశాస్త్రమును నేర్చి వాటియందు మిక్కిలి యభిరుచి గలవాఁ డయ్యెను. రామయ్యంగారు పెద్ద పుస్తకములకట్ట చేతఁబట్టుకొని ముత్యాలు పేటనుండి ప్రతిదినము మిక్కిలి దూరమునను న్న తన పాఠశాలకుఁ బోవుచు వచ్చెను. ఈకాలమం దీయనకుఁ బరమమిత్రుఁ డీయన జ్ఞాతి యగు శేషగోపాచార్యుఁడు. ఈ కాలములో రామయ్యంగారి కొక కష్టము సంభవించెను. ఈయనయన్నయు సర్వజనులకు నిష్టుఁడు గొంత కుటుంబభారము వహించినవాఁడు నగు పార్థసారథి యయ్యంగారు కాలధర్మము నొందిరి. ఆయన మరణము చేత దుఃఖులైన తల్లిదండ్రులకు తన విద్యాభ్యాస వ్యయము భారముగా నుండకుండ రామయ్యంగారు తన స్కూలుజీతము తానే తెచ్చుకొనవలసి వచ్చెను. ఆకాలములో శ్రీ పచ్చయ్యప్ప మొదలియారిగారి పాఠశాల పరిపాలనముఁజేయు సభవారు, ఆంగ్లేయ శాస్త్ర

విద్యలను జదువుకొను విద్యార్థులలో మొదటివానికిఁ గొంత నెల జీతనమీయఁ దలఁచిరి. రామయ్యంగారు కష్టపడి చదివి తన ప్రజ్ఞచే తనే యీవిద్యార్థి వేతనము సంపాదించెను. తలిదండ్రులకు నిర్బాధకముగా దాను జదువుకొనుట కాధారమై యావిద్యార్థివేతనము దనకు మహోపకారము చేసెనని యాయన యిటీవల పలుమాఱులు చెప్పుచు వచ్చెను. అట్లు తానుపుచ్చుకొన్న విద్యార్థి వేతనపు సొమ్మును రామయ్యంగారు ఋణముగా నెంచుకొని దానిని దీర్పఁ దలఁచి కొంత మూలధనమును తన్నిమిత్తమిచ్చి దానివడ్డివల్ల పట్టపరీక్షకుఁ బ్రకృతిశాస్త్రముఁ జదువదలఁచు విద్యార్థికి సహాయముఁ జేయవలసినదని యేర్పాటు జేసి విద్య ముగిసినతోడనే యాకాలమున రివిన్యూబోర్డువారికి సెక్రెటరిగా నుండిన పైక్రాఫ్టుదొర రామయ్యంగారిని తనకచేరిలో మహారాష్ట్రభాషకుఁ దర్జుమాదారుగ నేర్పఱచెను. రివిన్యూబోర్డులో నిట్లు కొంతకాలము పనిఁ జేయుట చేత రివిన్యూపద్ధతులఁ దెలిసికొనుట కాయన కెన్నో యవకాశములు కలిగెను. క్రమక్రమముగా రామయ్యంగారు పూనికతోఁ బనిఁజేయుటవలనఁ జాలమంది కలక్టర్ల కనుగ్రహపాత్రుఁడయ్యెను. 1850 వ సంవత్సరమందు నెల్లూరుకలక్టరు తనకచేరిలోనున్న హెడ్డుమున్షీ పని రామయ్యంగారి కిచ్చెను. ఈయుద్యోగములో నీతఁడు నాలుగు సంవత్సరములుండెను. 1854 వ సంవత్సరమందు గవర్నమెంటువారు ఇంజనీరింగు డిపార్టుమెంటుకొత్తగానిర్మించి యాశక్రెటరిగారియొద్ద రామయ్యంగారినిఁ బనిచేయఁ బంపిరి. అందులోఁ గొంతకాల మున్న పిదప 1855 వసంవత్సరమున నాయనయధికారులు రెండుద్యోగములకనఁ బఱచి యాయన యిష్టమువచ్చినదానిలోనికి వెళ్ళుమనిరి. మొదటిది నెల్లూరుజిల్లాలోనాయబుసిరస్తదారుపని. రెండవదికృష్ణాజిల్లాలోనప్పుడే కొత్తగా నేర్పడిన సబుకలెక్టరునొద్ద సిరస్తాదారు పని. రామయ్యం

గారు తానదివఱకు కొంతకాలముపనిఁజేసిన నెల్లూరుజిల్లాకే వెళ్ళియు క్కడి కలక్టరు నమ్మకమునకుఁ బాత్రుఁడై శ్రద్ధగాఁ పనిఁజేసెను. ఈ యుద్యోగమున రెండేండ్లున్న పిదప నతఁడు తంజావూరుజిల్లా కలక్టరు కచేరీలో హెడ్డుశిరస్తాదారుగ నియమింపఁబడెను. నెల్లూరు విడిచిపోవునప్పు డాజిల్లాకలక్టరు రామయ్యంగారి సామర్థ్యాదులం గొనియాడుచు నొకజాబు వ్రాసెను. ఆజాబులో నితరవిషయములు విడిచి నాలుగుమాటలు మాత్ర మిందుదాహరించుచున్నాను. "నీవంటి మనుష్యులే దేశమునకు నిజమైనమిత్రులు. వారే యీదేశమును దక్కిన యెల్ల దేశములలోఁ బేరుకలదానినిగాను యెల్లసజనుల స్తోత్రమునకుఁ బాత్రమైనదానిఁగాను జేయఁగలవారు." ఈయుద్యోగమునం దొకసంవత్సరమున్న పిదప నాయన యాజిల్లాలోనే డిప్యూటికలెక్టరయి హెడ్డుకలక్టరునకు నమ్మఁదగిన సహకారియై యుండెను. 1859 వ సంవత్సరమందు తంజావూరుజిల్లాలోనున్న యీనాము భూములు పరిష్కరింపఁదలఁచి గవర్నమెంటువారు యీనాము కమీషనరగుయున కొలరువారతోఁ గలిసి మాటాడుటకై రామయ్యంగారినిఁ జెన్నపురముఁ బిలిపించి కొలరు నొద్ద నుద్యోగ మిచ్చిరి. ఆయన చెన్నపట్టణమందుండఁగానే సర్ ఛార్లెసు ట్రెవిలియన్ దొరగారాయనం బిలిచి కావేరీనదిపారెడి భూములలోఁ గొంత భూముల పరిష్కారము గావలసియుండెను. కనుక యచ్చోటికి వెళ్ళవలసియుండునని యాయనతోఁ జెప్పెను. తంజావూరుజిల్లాలో కావేరీనదిపారెడి భూములలో రహితులయొద్దశిస్తువసూలుచేయుట కొలుంగుపద్ధతియని యొకపద్ధతి యుండెను. ఈపద్ధతింబట్టి దేశమున పండిన పంట హెచ్చుతగ్గులననుసరించి రహితులయొద్ద శిస్తు హెచ్చుగాను తగ్గుగాను వసూలు చేయఁబడుచు వచ్చెను. స్థిరమైన పద్ధతిలేక యేనాఁటి కాయేఁడు మారుచువచ్చిన యీపద్ధతిని మాన్పి శాశ్వతమైన శిస్తు కట్టవలసిన

దని రామయ్యంగారిని నియమించిరి. అయ్యంగారు వెంటనే యీపని లోఁ బ్రవేశించి కలెక్టరుగారి యుత్తరువులంబట్టి యెనిమిది మాసములలో నీపనిఁబూర్తిఁజేసెను. ఈపని కొంత జరుగుచుండఁగానే ట్రెవిలియన్ దొరగారు దక్షిణపు జిల్లాలను జూడ బయలుదేఱి తంజావూరు జిల్లాలో రామయ్యంగారు చేయుచున్న పనిఁ బరీక్షింపఁగోరి చాల పట్టుదలతో శోధించి యాతఁడు చేసినపని మిక్కిలి బాగున్నదని మెచ్చుకొనిపోయెను.

1860 వ సంవత్సరమున ప్రెసిడెన్సీకాలేజీ సంవత్సరోత్సవ సమయమున ప్రసంగించుచు ట్రెవిలియన్ దొరగారు రామయ్యంగారి నీ క్రిందివిధమునఁ బ్రశంసించిరి. "పైఁ జెప్పిన తరగతిలోఁ జేరిన మఱి యొక స్వదేశీయుఁడగునుద్యోగస్థుఁడుతంజావూరుజిల్లాలో మిక్కిలికష్టమైనపనినినేర్పుతో నెఱవేర్చెను. ఈకార్యసాధనమందితఁడుజూపినసామర్థ్యము, నీతియు నతనికేగాక హిందూజాతికెల్ల గౌరవముఁదెచ్చుచున్నది." 1870 వ సం॥రమందు స్వదేశస్థులకుఁ గొప్పయుద్యోగములియ్యవచ్చునని పార్లమెంటుసభలో నొకచట్టముపుట్టినపుడుయీదొరగారే రామయ్యంగారి కీక్రింది విధమున వ్రాసిరి. "హిందువులకిప్పుడు గొప్పయుద్యోగము లీయవచ్చునను మంచిస్థితికివచ్చితిమి. ఇపుడుపార్లమెంటులోనున్నబిల్లు హిందువులుగూడ నింగ్లీషువారితో సమానముగ జూడవలయునను న్యాయపద్ధతిమీఁద నిలిచియున్నది. ఇదివఱకు గవర్నమెంటు కొలువులోనుండుటచేతఁ గాని లేక గౌరవమైనస్వతంత్ర వృత్తులలో నుండుటచేతఁగాని గొప్పయుద్యోగములకుఁదగియున్నస్వదేశస్థులందఱ నట్టియుద్యోగములలో గవర్నమెంటువారుప్రవేశపెట్టుదురు. ఈసమయమున గవర్నమెంటువారు నిన్నట్టి గొప్పయుద్యోగములోఁ బ్రవేశపెట్టకపోయినపక్షమున నాకు విషాదముగ నుండును. నీవునూఱుసంవత్సరములు పూర్వతనమునాగిక్కొలువుచేసినను తంజావూరు

లోని కొలుంగు వ్యవహారములవంటి కష్టమయినవ్యవహారము మరల చేయవలసియుండెడు. నీవు చెన్నపురి రాజధానిలోనున్న స్వదేశస్థులకంటె తెల్లవాకంటె నాపనికిఁదగిన వాఁడవని నీవిషయమైసిఫారసుచేసిరి. తంజావూరుమండలములో సగముభాగములోనున్న జనుల యదృష్టములు చేతిలోనున్నను నీపూర్వప్రవర్తనముమీఁద నెక్కుడనోకమచ్చుకుండ ననుమానపునీడయైన నీమీఁద సోఁకకుండ నీవావ్యవహారమున్యాయైకదృష్టితో నెల్లరకుఁదృప్తికరముగఁ బరిష్కరించితివి." తంజావూరులో వ్యవహారము ముగియఁగానే యీనామకమీషనులోఁ జేరవలసినదని యదివఱకు రామయ్యంగారికుత్తరువులువచ్చెనుగాని తంజావూరుకలక్టరు రాయసనువిడువనితనకుసహాయుఁడుగ నేర్పఱచుకొనెను. ఇక్కడనుండఁగానే గవర్నమెంటువా రాయనను మఱియొక వ్యవహారముఁ బరిష్కరింపుమని పంపిరి.

1858, 59 వ సంవత్సరములలో కావేరీనదివలన దేశమునకు గొప్పనష్టముకలిగెను. అప్పుడు చెడిపోయిన ప్రదేశములకు మరమ్మతులు చేయుటకై గవర్నమెంటువారుమిరాశిదారులకుగుత్తదారులకు వేలకొలది రూపాయలిచ్చిరి. ఆమరమ్మతులుసరిగా జరిగినవో లేదో తెలిసికొని గవర్నమెంటువారికి గుత్తదారులకుఁగల వ్యవహారముఁ బరిష్కరించుటకు రామయ్యంగా రేర్పడెను. ఈకృత్యము నతఁడు శ్రద్ధతో నెరవేర్చి గుత్తదారులవల్ల దొరతనమువారికి రావలసినసొమ్మునిశేషముగా రాఁబట్టెను, తరువాత నతఁడుతంజావూరుజిల్లాలోనేయున్న నల్లకాడిగ్రామ వ్యవహారముఁ బరిష్కరించుటకై నియమింపఁబడెను. ఈగ్రామము చెన్నపట్టణపునివాసులైన యొకకుటుంబమువారికి మొఖాసాగానుండెను. గవర్నమెంటుకు గ్రామముమీఁదఁ జెల్లవలసినశిస్తు మితిమీరియుండుటచే మొఖాసాదారులు దానిమొగముఁజూడక పాడుపెట్టిరి. రామయ్యంగారు శిస్తుతగ్గించి క్రొత్తపద్ధతిగా శిస్తునేర్పఱచి

కలెక్టరు యొక్కయు దొరతనమువారి యొక్కయు నంగీకారము నంది గ్రామము బాగుచేసెను.

1851 వ సంవత్సరమున సేలముజిల్లాకు సేలముపట్టణమే ముఖ్యపట్టణముగా నేర్పడెను. అదివఱకోసూరులో నున్న సబుకలెక్టరు కచ్చేరి సేలమునకు వచ్చెను. జిల్లాలోని నామక్కలుపట్టణమందు సబుకలెక్టరొకరుండునట్లేర్పాటుచేయఁబడెను. గవర్నమెంటువారు రామయ్యంగారిని మొదటితరగతి డిప్యూటీకలెక్టరుద్యోగమిచ్చి యాయనను నామక్కలులో సబుకలెక్టరుగా నుండవలసినదని పంపిరి. అక్కడ సబుకలెక్టరుగా నాయన 1854 వ సంవత్సరమువఱకు నుండెను.

ఆసమయమున నిండియాగవర్నమెంటువారు కాగితముద్రాశాసనమును క్రొత్తగా నిర్మింపఁదలంచిరి. కాగితములనఁగా నోటులనఁగా బ్యాంకునోట్లు. ఇవియు రూపాయలు కాసులవలెనే యిప్పటికి దేశమున నాణెములుగఁ జెల్లుచున్నవి. రామయ్యంగారు నమ్మఁదగిన మనుష్యుఁడగుటచే నిండియాగవర్నమెంటువా రాయనను నీ డిపార్టుమెంటులోఁ బెట్టఁదలంచి తిరుచునాపల్లిలో నెలకాఱువందలు మొదటుజీతముఁ గలిగి క్రమాభివృద్ధిగా నెనిమిదివందలవఱకుజీతముగల యసిస్టెంటుకమీషనరుగా నియమించిరి. ఈయుద్యోగములో నతఁడు 1855 వ సంవత్సరప్రారంభమందుఁ బ్రవేశించెను. ఒకసంవత్సరములోఁ బనిచేయునప్పటికి తనకుఁ దగినంతపని లేదని తెలిసికొని జీతముపుచ్చుకొనుచు సుఖముగాఁ గూర్చుండుట కిష్టములేక యాసంగతి నతఁడు గవర్నమెంటువారికిఁ దెలియఁజేసెను. గవర్నమెంటువారు వెంటనే యాయనను బ్రధానపుసెక్రటరిగారి యాఫీసునకు మార్చి యతఁడదివఱకు చేయుచున్న యుద్యోగమవసరమే లేదని తీసివేసిరి. 1856 వ సంవత్సరమంతయు నితఁడా యుద్యోగమునం గడపెను. 1867 వ సంవత్సరమందు స్టాంపుల సూపరెంటెండెంటగు టెంపిలుదొర కాలధర్మమునొందఁగా దొరతనమువారు

నెలకు వేయిరూపాల జీతముమీఁద రామయ్యంగారి నాయుద్యోగము సంబ్రివేశపెట్టిరి.

మఱుసటిసంవత్సరము గవర్నరుగారి శాసననిర్మాణసభలో నొకసభికుఁడుగ నతఁడు నియమింపఁబడెను. ఈసభలో నతఁడు పండ్రెండు సంవత్సరములు సభికుఁడుగనుండి క్రొత్త చట్టములు నిర్మించునప్పుడు గవర్నమెంటువారికెంతో సహాయముఁ జేయుచువచ్చెను. అతఁడు ముఖ్యముగ శ్రమపడి పనిజేసినవి రెండువిషయములుగలవు. అది యేమన గా మునిసిపలులోకలుఫండు సంబంధమయిన పన్నులుకట్టుటకు గవర్నమెంటువారు నిర్మించిన చట్టములో నితఁడుమిక్కిలిసహాయముఁచేసెను. ఆచట్టమునిర్మించిన అలెగ్జాండరు ఆర్బత్తునాటుదొరగారు వ్రాసిన యీక్రిందిజాబుఁ జదివినయెడల రామయ్యంగారెంతసాయముచేసెనో తెలియును. "ఇవి యిప్పుడు చట్టములైనవి గనుక నిదివఱకు నేనన్న నోటిమాటలే యిప్పుడు కాగితముమీఁదఁ బెట్టుచున్నాను. ఈశాసన నిర్మాణములో నీవుచేసిన యపార సహాయమునకుఁ జెప్పినయాలోచనకు నేను మిక్కిలి కృతజ్ఞుఁడనై యున్నాను. జాగ్రత్తతో నమలుజరుపఁబడిన పక్షమున నీ రెండుచట్టములు జనులకు మిక్కిలి లాభకరములుగనుండునట్లు నిర్మింపఁబడినవని నాయభిప్రాయము. మన మనుకొన్నట్లే నిజముగా జరిగినపక్షమున మొదటశాసనము నిర్మాణము జేయునపుడు రెండవసారి దానిం దిరగవేయునపుడు నీవుచేసినసహాయమే దానికిఁగారణము." రామయ్యంగారు చదువుకొన్న పాఠశాలయొక్క సంవత్సరోత్సవము రాఁగా నర్బతునాటుదొరగా రాసమయమున మాటలాడుచు రామయ్యంగారినిఁగూర్చి యిట్లుప్రశంసించిరి. ఆకాలమున నీపాఠశాలలో నొకస్వదేశస్థుఁడనఁగా నిప్పుడు గవర్నరుగారి శాసననిర్మాణసభలో సభికుఁడుగానున్న యొకపెద్దమనుష్యుఁడు విద్యఁ గఱచుచుండెను. ఆబడి యిట్టివానిఁ బ్రభవింపఁజేయఁగలదనియెన్నఁడనుకోలేదు. ఆయ

స సత్ప్రవర్తనమును బట్టియు బుద్ధికుశలతంబట్టియు నీతినింబట్టియుం గార్యాచరణమునందుం జూపెడు స్వతంత్రభావముంబట్టియుం జూడంగా మన హిందూరాష్ట్రమందున్న శాసననిర్మాణసభలలో నెక్కడ నింత వాఁడు లేఁడని ధైర్యముతోఁ జెప్పఁగలను. రామయ్యంగారు చెన్నపట్టణము మ్యునిసిపల్ సభలో నెనిమిదిసంవత్సరములు సభికుఁడుగ నుండెను. ఆకాలములో నతఁడుపట్టణాభివృద్ధికిమిక్కిలి పాటుపడెను. ఒకసారియప్పటి గవర్నరు రామయ్యంగారికి మునిసిపల్ ప్రసిడెంటుపనినియ్యఁదలంచెనుగాని రామయ్యంగారే దానినంగీకరింపఁడయ్యె. 1871వసంవత్సరమందు విక్టోరియారాణిగా రాయనకు సి. యస్. ఐ. యనుబిరుదమిచ్చిరి. ఆసమయమునందు గవర్నరుగారగు నేపియర్ ప్రభువు రామయ్యంగారికి క్రిందియర్థము వచ్చునట్లింగ్లీషుతో నొకజాబు వ్రాసిరి. "నీకు సి. యస్. ఐ. బిరుదువచ్చినది. అదికొద్దిదినములలో నే యథా గౌరవముగా గవర్నమెంటు సెక్రటెరిచేతనీకీయఁబడును. సత్ప్రవర్తనచేతను యోగ్యతచేతనుగవర్నమెంటువారి చిరకాలసేవచేతనుమిక్కిలి తగినవాఁడవగు నీకువిక్టోరియారాణిగారు దీనిని దయచేసినందుకునేను నిన్ను బహూకరించుచున్నాను. 1873వ సంవత్సరమందుహిందూదేశపు ధనస్థితినిఁగూర్చి పాలర్మెంటుసభవారేర్పఱచిన కమిటీయెదుట సాక్ష్యమిచ్చుటకై యింగ్లాండు వెళ్ళవలసినదని దొరతనమువారు రామయ్యంగారి నడిగిరి. కాని రాజా మాధవరావుగారివలెనే రామయ్యంగారుకూడ వర్ణధర్మము చెడిపోవునను భయమున సీమకు వెళ్ళనని. 1875వ సంవత్సరమందు రిజస్ట్రారుజనరలుపని కాళీరాఁగా దొరతనమువారు రామయ్యంగారి కాపనినిచ్చిరి. 1877వ సం॥రము జనవరి యొకటవ తేదీని ఢిల్లీనగరమున జరిగినగొప్పదర్బారునకుఁ జెన్నపురిగవర్నరుగారు రామయ్యంగారి నాహ్వానమునఁ జేసిరి. ఆదర్బారున కుఁబోయి యాయన గవర్నరుజనరలుగారివలన బంగారుపతకమును

బహుమానము వడసిరి. రామయ్యంగారు కాలానుసారముగ నెన్నో కమిటీలలో సభికుఁడై మిక్కిలి యుపయోగము లగుపనులఁ జేసెను. ఆకమిటీలలోఁ గొన్ని యిక్కడ పేర్కొనఁబడును. 1. ఇంజనీరింగు డిపార్టుమెంటు స్థాపించుటకై యేర్పడిన కమిటి. 2. చెన్నపట్టణము మునిసిపలు చట్టము మార్పుచేయుట కేర్పడిన కమిటీ. 3. చెన్నపట్టణము మునిసిపాలిటీలో టికాల స్థితిగతులఁగూర్చి రిపోర్టుచేయుట కేర్పడిన కమిటీ. 4. చెన్నపురిరాజధానిలోనున్న పాఠశాలలలో బాలురచేత నుపయోగింపఁబడు పుస్తకములను నిర్ణయించుట కేర్పడిన కమిటీ. 5. హిందూమత స్థానములు, అనఁగా దేవాలయములు మఠములు మొదలగువాటిపరిపాలనము సరిగా నుండునట్లు చేయుట కేర్పడిన కమిటీ. 6. గ్రామమునసబుల నిబంధనలను వ్రాయుటకయి యేర్పడిన కమిటి.

రామయ్యంగారు స్వాంపుల యధికారియైనతరువాత నతఁడు చెన్నపట్టణములో స్థిరముగ నుండునని తెలిసిన పిదప నార్టనుదొరగారాయనను పచ్చయ్యప్పమొదలియారుగారియాస్తికి ధర్మకర్తగాఁ జేసెను. అట్లుధర్మకర్తగానుండి యాయన యింతింతనరాని పనిఁజేసెను. పచ్చయ్యప్పగారి పాఠశాలను ధర్మములను మొదలంట నాశనము చేయునట్టి యొకవ్యాజ్యము తేబడెను. ఆవ్యాజ్యములో రామయ్యంగారుపడిన పాటువలననే పచ్చయ్యప్పగారి పాఠశాల నిలచెను. విద్యాశాలలయందు రామయ్యంగారికి మిక్కిలియభిమాన ముండుట చే పచ్చయ్యప్పపాఠశాల నాయన స్వదేశస్థులయొక్కయునాంగ్లేయులయొక్కయు నుపాధ్యాయులయొక్కయువిశ్వాసమునకు,గౌరవమునకుఁ బాత్రమైనదానిగాఁ జేసెను. రామయ్యంగారు ధర్మకర్తగానున్న కాలమందె పచ్చయ్యప్పపాఠశాలసమర్థుఁడగుప్రధానోపాధ్యాయుఁడుగలిగి మంచి హైస్కూలులలో నొకటై క్రమక్రమముగ రెండవతరగతికా

జీ యయ్యెను. ఈయన సభికుఁడుగానున్న కాలమందె చెంగలరాయ నాయకుఁడను నతఁడు ధర్మకార్యముల నిమిత్తము వినియోగింపవలసిన దని మరణశాసనము వ్రాసియిచ్చినయా స్తి ధర్మకర్త యధీనమయ్యెను. ఈమరణశాసన మనేకసంశయములతోఁ గూడియుండెను. తక్కిన ధర్మకర్తలు రామయ్యంగారియాలోచనము మన్నించి విని యోస్యత్కార్యములనిమిత్తము మాయాస్తి యుద్దేశింపఁబడినదో యాసత్కార్యముల నిమిత్తము వినియోగించిరి. 1880వ సంవత్సరమందు రామయ్యంగారు దొరతనమువారికొలువు విడిచిపెట్టి తిరువాన్కూరు మహారాజుగారి యాహ్వానముమీఁద యాదేశమునకుమంత్రియయ్యెను. ఈయన మంత్రికాకమునుపే యామహారా జుత్తరప్రత్యుత్తరముల మూలమున రామయ్యంగారి విద్యాసంపత్తి వివేకము గౌరవము పరిపాలనాసామర్థ్యమునఁ దెలుసుకొనుచు వచ్చెను. మహారాజు రామయ్యంగారినిఁ గూర్చి పడినయభిప్రాయమంతయు నాయన మంత్రియైనపిదప సరియె యని స్పష్టమయ్యెను. ఆయనతిరువాన్కూరులో నేడు సంవత్సరములు మంత్రియైయుండి యాకాలమందు సంస్థానమందలి ప్రతిడిపార్టుమెంటులోను చాలమార్పులు చేసెను. ఆయన వెళ్ళునప్పటికి సంస్థానమందలి క్రిమినల్ కోర్టు లేచట్ట మాధారము లేక యేపద్ధతి ననుసరింపక నియమితమయినమార్గము లేక వ్యవహారములు జరుపుచుండెను. అదిగ్రహించియాయనయింగ్లీషుప్రభుత్వములోనున్న శిక్షాస్మృతి(పీనలుకోడు)చర్యస్మృతి(క్రిమినలుప్రొసిజ్యూరుకోడు) తెప్పించి సంస్థానమందలి కోర్టులలో వాడుక చేయించెను. అదివఱకు సంస్థానమందలిపోలీసుబలగముతక్కువజీతములుగలిగితగినశిక్షలేక నేరస్థులను సరిగాఁ బట్టుకొనలేక మిక్కిలిదుస్థితిలో నుండెను. రామయ్యంగా రీలోపముల నివారించుటకుఁ జెన్నపట్టణపు పోలీసుచట్టముఁ దెచ్చి సంస్థానమందు వాడుకచేయించెను. అనంతరము రామయ్యం

గారు న్యాయస్థానములను చక్కఁజేయఁబూనెను. ఆ దేశములో స్టాంపు డ్యూటి యెక్కువ పెట్టవలసివచ్చినను జనులపై శేషముగా వ్యాజ్యములు వేయుచు వచ్చిరే కాని తగ్గలేదు. అందుచేత పని తెమలక కోర్టులు వ్యాజ్యములతో నిండియుండెను. అందుచేత మునసబులకు స్మాలుకాజుల యధికారమిచ్చి వారిజీతములు వృద్ధిచేసి జిల్లాజడ్జీలసంఖ్య తగ్గించి మొత్తముమీఁద న్యాయాధికారుల కంటెను జీతములు వృద్ధిచేసి మేజస్ట్రీటులకు పోలీసధికారము తీసివేసి యనవసరముగ నధికసంఖ్యగనున్న మేజస్ట్రీటులను తగ్గించి వారికి యెక్కువయధికారము లిచ్చి తిరువాన్కూరులోనున్న హైకోర్టును దగినస్థితిలోఁ బెట్టెను. అనంతర మతఁడు రివెన్యూవ్యవహారములఁ జక్కఁజేయ నారంభించెను. ఈడిపార్టుమెంటులో న్యాయస్థానములోనున్న పద్ధతులకంటె పురాతనపద్ధతులు చెడుపద్ధతులు ప్రబలియుండెను. ఈరివెన్యూశాఖలోనున్న కొలువుగాండ్రకు జీతములు తక్కువ, పనిచేయుటకు సామర్థ్యము లేకపోవుట యను రెండు దోషములు పట్టియుండుటచే రామయ్యంగారుద్యోగస్థుల సంఖ్య తగ్గించి జీతములు వృద్ధి జేసియాడిపార్టుమెంటు నంతను స్థిరమైన పునాదిమీఁదఁ బెట్టెను. ఉప్పుకొఠారులమీఁద తగినంత యదుపు గలుగునట్లు డిపార్టుమెంటు నంతను మంచి స్థితిలోనికిఁ దెచ్చెను. వీని యన్నిఁటికంటె శ్లాఘనీయమైన కార్యమేమనఁగా రామయ్యంగారు తిరువాన్కూరు సంస్థానమంతయుఁ గొలిపించి భూములయొక్క శిస్తు స్థిరపఱచెను. అనఁగా సర్వేసెటిలుమెంటును జేయించెను. ఈసర్వే లేకపోవుట సంస్థానమునకు మిక్కిలి నష్టకరముగానుండె ననియు నదిచేయించుటచేఁ జాలలాభము గలుగుననియు నయ్యంగారికి తర్వాత వచ్చిన మంత్రులుగూడ నొప్పుకొనిరి. వెనుకటినేలకొలతలు రివెన్యూలెక్కలు సరిగా నుండక వ్యవహారము చక్కఁగ జరుపుట యసాధ్యమయ్యెను. అ

మయ్యంగా రాకొఱలను నివారించుటకు సమగ్రముగా నేలసర్వే చేయించుటయే యుక్తమసాధనమని తగువిధమున నట్లుచేయించెను. ఈసర్వేసెటిలుమెంటులు నేలయొక్క పరిమితిని సారమును నిరూపించెను. శిస్తువృద్ధిచేసెను. ఖజానా ధనముతో నింపెను. భూమివిషయమై వివాదములు వచ్చినప్పుడు వెనుక నెట్లున్నదో చూచుకొనవలయునన్న తగినయాధారములుగ నేర్పడెను. తిరువాన్కూరు చెఱసాలలో నున్న ఖైదీలచేత నదివఱకు పురవీధులలోఁగూడ పనిచేయించుచు వచ్చిరి. రామయ్యంగా రట్టివాడుక మాన్పించి ఖైదీలు చెఱసాలలోనే పనిచేయునట్లు విధించెను. సంస్థానమందలి ప్రజలదివఱకు చిల్లర పన్నులనేకము లిచ్చుకొనుచువచ్చిరి. ఇవిప్రజలను వేధించునవి, సర్కారునకు లాభములేనివి యగుటచే వానిని రూపుమాపెను. ఇవిగాక యాసంస్థానములో మఱియొక చిత్రమయినవాడుక యుండెను. పన్నులిచ్చుకొనలేని పేదజనులు కొన్నివస్తువులను సర్కారున కుచితముగాఁ గాని లేక మిక్కిలి స్వల్పధరకుగాని తెచ్చియిచ్చుచుండవలెను. అట్టివాడుక యుండఁగూడ దని దాని నితఁడు నిర్మూలించెను. ఆదేశమునందలి చేతిపనులను విశేషముగ వృద్ధిచేసినూతనవస్తునిర్మాణయంత్రములను బెట్టించెను. ఇందుముఖ్యమైనవి పంచదారచేయుయంత్రము, కాగితములుచేయుయంత్రము, దూదియంత్రము, వెండియు నతఁడు స్టాంపుచట్టము నొకటి నిర్మించి కాఫీగింజలుపండెడు నేలలకు పన్నులు గొట్టివేసి చిల్లరసరకులమీఁద నెగుమతిపన్నులు తీసివేసి భూమిలో పండిన వస్తువులనేటేఁట ప్రదర్శనములు పెట్టించి జనులకుఁ జూపి
షి నభివృద్ధిఁ జేసి జనులు పెట్టుకొన్న చిన్నపాఠశాలలకు నేఁటేఁటఁ
ధనసహాయమిచ్చి విద్యాభివృద్ధిఁ జేయుచు నార్మలుపాఠశాలలు
నల్లనుండు మీఁద దిగుమతిపన్ను గొట్టివేసి తిరువాన్కూ
లాధారములను వృద్ధిపఱచి శాశ్వతమైనయుపకారముఁ